చరిత్ర

ఆంధ్రుల చరిత్ర (క్రీ.శ. 1565 వరకు)

ఖండాలు : I - IV

OU

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్

2004

రచయితల బృందం

సంపాదకుడు

ఆచార్య సి. సోమసుందర రావ్

సహ సంపాదకులు

ఆచార్య వి. రామకృష్ణారెడ్డి
కుమారి ఇ. సుధారాణి

రచయితలు

ఆచార్య ఎ. కమలవాసిని
డా. వి. సుందరరామశాస్త్రి
డా. కె. యస్. కామేశ్వర రావ్
డా. జె. దుర్గాప్రసాద్
డా. ఎ. మురళీమోహన్
డా. కె. సూర్యనారాయణ

ముఖ చిత్రం

యమ్. రమేష్

Dr. B.R.A.O.U. LIBRARY
Acc. No. 115059
Date 27.4.2005
Call No 954 CHE

115059
27-4-05

954
CHE

BRAOU

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్.

ప్రథమ ముద్రణ : 1997, *1999*, 2002 2004

C 1997 డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకం లోని ఏ భాగాన్నైనా ఉపయోగించదల్చుకుంటే, విశ్వవిద్యాలయ అనుమతిని పొందాలి. ఈ పుస్తకం సార్వత్రిక విశ్వవిద్యాలయ ప్రోస్ట్గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ఒక భాగం. పాఠ్యప్రణాళిక మొత్తం వివరాలు ఈ పుస్తకం చివరలో ఉన్నాయి.

ఇతర వివరాలకు : ఎకడమిక్ డైరెక్టర్, డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, రోడ్ నెం. 46, జ్యూబిలీ హిల్స్, హైదరాబాద్ - 500033. ఆం.ప్ర.

Printed by : Siddeshwar Printers, Market Street, Secunderabad - 500 003.
Lr. No.966/Dr.BRAOU/DMP/PTG/F.No.38/J.O.277/Dt: 07-09-2004 - 200 Copies.

పరిచయం

కొన్ని ప్రాంతాల సంలీనంతో దేశ మేర్పడుతుంది. ప్రతి ప్రాంతానికి భిన్నమైన, విలక్షణమైన భౌగోళిక లక్షణాలు, ఆర్థిక పద్ధతులు, సాంఘిక కట్టుబాట్లు, ఆచారాలు, వ్యవహారాలు, భాషా మతాలు, వాస్తుకళా రీతులుంటాయి. ఇట్టి ప్రాంతీయ సంస్కృతుల కలయికతో, సాగనైన, విశిష్టమైన, సుసంపన్నమైన దేశ సంస్కృతి రూపు తీసుకొంటుంది. దీనిని ప్రతిఫలింపజేసే ఒకానొక ప్రాంతీయ చరిత్రే, ఆంధ్రుల చరిత్ర. శాతవాహనులు, ఇక్ష్వాకులు, శాలంకాయనులు, ఆనందగోత్రులు, పల్లవులు, విష్ణుకుండినులు, వేంగీ చాళుక్యులు, కాకతీయులు, వెలమ నాయకులు, రెడ్డి రాజులు, విజయనగర చక్రవర్తులు, బహమనీ, కుతుబ్‌షాహీ సుల్తాన్‌లు, ఆసఫ్‌జాహీ నవాబులు, చివరగా ఆంగ్లేయులు, ఈ సువిశాల, సుందర ప్రాంతంపై తమ పాలనా ప్రభావాలను నెరపారు. వీరే కాకుండా, నాటి ఆంధ్ర దేశ రాజకీయాల్లో కర్ణాటక, తమిళ రాజ వంశాలైన పూర్వ చాళుక్యులు, రాష్ట్రకూటులు, పశ్చిమ చాళుక్యులు, చోళులు, చురుకైన, ప్రభావయుక్తమైన పాత్రను నిర్వహించారు. క్రీ.పూ. 30 నుండి ఈ ప్రాంతంలో నిరాటంకమైన, శక్తివంతమైన పరిపాలన, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ప్రగతి, కొనసాగుతూ వచ్చింది.

చరిత్రలో ద్వితీయ సంవత్సర స్నాతకోత్తర పాఠ్యాంశాలను అధ్యయనం చేసే, డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ విద్యార్థులకు, 'ఆంధ్రుల చరిత్ర (క్రీ.శ. 1565 వరకు)' కోర్స్‌గా రూపొందించబడింది. ఆంధ్రులు, ఆంధ్ర దేశ రాజకీయ, పాలనా చరిత్రలతోబాటు, ఇక్కడి నాగరికతా సంస్కృతులు, సామాజిక, ఆర్థిక వ్యవస్థలు, శతాబ్దాలు, యుగాల పర్యంతం, ఎలా పరిణామం చెందుతూ వచ్చాయో, వివరంగా అధ్యయనం చేయబడినాయి. ఇట్టి అధ్యయన, పరిశీలనలు, ప్రాంతీయ చరిత్ర సమగ్ర అవగాహనకు, తద్వారా దేశ చరిత్ర సంపన్న సంగ్రహణకు దోహదమైతాయని ఆశిస్తున్నాం.

ఈ కోర్స్‌లో మొత్తం ఆరు ఖండాలు, ఇరవైనాల్గు భాగాలున్నాయి. పఠనా సౌలభ్యం కోసం, దీనిని రెండు పుస్తకాలుగా ముద్రించడమౌతూంది. మొదటి పుస్తకంలో, తొలి నాల్గు ఖండాలకు సంబంధించిన పదకొండు భాగాలను చేర్చడం జరిగింది. వీటిలో, పరిచయాంశాలు, శాతవాహన యుగం, శాతవాహనానంతర యుగం (క్రీ.శ. 624 వరకు), చాళుక్య యుగం (క్రీ.శ. 624-1200) నాటి రాజకీయ పరిణామాలు, పాలనా విధానాలు వివరంగా చర్చించబడినాయి. వీటితోబాటు, నాటి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు, ప్రగతి పరిణామాలు విపులంగా విశ్లేషించబడినాయి. రెండో పుస్తకంలో, చివరి రెండు ఖండాలకు చెందిన పదమూడు భాగాలను పొందుపర్చడం జరిగింది. వీటి ద్వారా ఆంధ్రుల చరిత్రలో అత్యంత ప్రసిద్ధి గాంచిన కాకతీయ, విజయనగర యుగాలు, వీటితోబాటుగా వెలమ, రెడ్డి రాజ్యాలు, బహమనీ, కుతుబ్‌షాహీల పాలనా విశేషాలు కూలంకషంగా చర్చించబడినాయి. వీటి అధ్యయనం ద్వారా, నాటి సామాజిక, ఆర్థిక వ్యవస్థల్లో సంభవించిన మార్పులను, పురోగతిని, సాంస్కృతిక పరిణామాలు, ప్రగతిని, విద్యార్థులు స్పష్టంగా అవగాహన చేసికోగలరని ఆశించడమౌతూంది.

అత్యంత ప్రాధాన్యత, అభిమానంతో కూడుకొన్న "ఆంధ్రుల చరిత్ర (క్రీ.శ. 1565 వరకు)" ను క్షుణ్ణంగా తెలుసుకునేందుకు, ఈ పాఠ్య భాగాలు తోడ్పడగలవని విశ్వవిద్యాలయం ఆశిస్తూంది.

BRAOU

BRAOU

భాగం-1 : ఆంధ్రులు : పరిచయాంశాలు

విషయక్రమం

1.0 : లక్ష్యాలు

1.1 : పరిచయం

1.2 : పదోత్పత్తి

1.3 : ఆంధ్రప్రదేశ్ భౌగోళిక పరిస్థితులు

1.3.1 : ఆంధ్ర దేశం లోని నదులు, పర్వతాలు

1.3.1.1 : చిన్న నదులు

1.3.1.2 : పెద్ద నదులు

1.3.1.3 : సరస్సులు

1.3.1.4 : పర్వతాలు

1.3.2 : ఆంధ్రుల చరిత్రపై భౌగోళిక పరిస్థితుల ప్రభావం

1.4 : చరిత్ర రచనకు ఆధారాలు

1.4.1 : పురావస్తు ఆధారాలు

1.4.1.1 : తవ్వకాలు - కట్టడాలు

1.4.1.2 : శాసనాలు

1.4.1.3 : నాణేలు

1.4.2 : వాఙ్మయ ఆధారాలు

1.4.2.1 : దేశీయ వాఙ్మయం

1.4.2.2 : విదేశీయ వాఙ్మయం

1.4.2.2.1 : గ్రీక్ రచనలు

1.4.2.2.2 : చైనీయ, పాశ్చాత్యేయ రచనలు

1.4.2.2.3 : ముస్లిం రచనలు

1.5 : సంగ్రహంగా

1.6 : పరీక్ష నమూనా ప్రశ్నలు

1.7 : ఉపయుక్త గ్రంథాలు

BRAOU

1.0 : లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం ద్వారా ఆంధ్రుల ఉనికి, ఆంధ్ర దేశ భౌగోళిక లక్షణాలు, ఆంధ్రుల చరిత్ర పై వీటి ప్రభావం, 'ఆంధ్ర' పదోత్పత్తి జరిగిన తీరు, ఆంధ్రుల చరిత్ర రచనకు ఉపయోగపడే పురావస్తు, సారస్వత సంబంధమైన ఆధారాల గురించి తెలుసుకోగలగాలి. మరో విధంగా చెప్పాలంటే, ఆంధ్రుల చరిత్రను చదవడాని కవసరమయ్యే పరిచయాంశాలను స్పష్టంగా గ్రహించగల్గాలి.

1.1 : పరిచయం

'ఆంధ్ర' పదం, ఆంధ్ర జాతికి ఆంధ్ర దేశానికి, ఆంధ్ర భాషక్కూడా వర్తిస్తుంది. అయితే, ఆంధ్ర శబ్దం ఆదిలో జాతి వాచకం. ఋగ్వేదానికి చెందిన ఐతరేయ బ్రాహ్మణంలో, మొట్టమొదటి సారిగా 'అంధ్ర' (ఆంధ్ర) పదం కనిపిస్తుంది.

విశ్వామిత్రుడు తన ఆజ్ఞ మీరినందుకుగాను, తన పుత్రుల్ని 'పులిందులు, శబరులు, పుండ్రులు, ఆంధ్రులు' అగులరని శపించాడట. రామాయణ, మహాభారతాల్లో, పాండ్య, చోళ, కేరళులతోపాటు, ఆంధ్రుల్ని కూడా పేర్కొన్నారు.

అశోకుని ధర్మలిపి శాసనంలో (శిలా శాసనం), ఆంధ్ర శబ్దం జాతి పరంగా వాడబడింది. "ఇహ రాజ విషయే అన్ధ్ర పులిదేసు" అని వాడబడింది.

ఆంధ్ర శబ్దం బౌద్ధుల రాతల్లో 'అంధక' అని ఉంది.

మనుస్మృతి "కారావర స్త్రీయందు వైదేహునకు పుట్టి, వేట వలన జీవించే వారు ఆంధ్రులు" అని పేర్కొంది. దీనిని బట్టి, ఆంధ్ర శబ్దం జాతి పరమని స్పష్టమౌతూంది.

ప్లినీ అనే రోమన్ చరిత్రకారుడు 'అందర' జాతివారు పరాక్రమవంతులని, వారికి లక్ష పదాతులు, రెండు వేల అశ్విక సేన, వేయి ఏనుగులు, ముప్పై దుర్గాలున్నాయని తెలిపాడు.

ఆంధ్ర రాజులైన శాతవాహనులను, ఆంధ్ర భృత్యులని, ఆంధ్రులని, పురాణాలు వ్యవహరించాయి.

చంద్రగుప్త మౌర్యుని కాలం లోని గ్రీక్ రాయబారి మెగస్తనీస్, ఆంధ్ర రాజ్యం మౌర్య రాజ్యానికి వెలుపల ఉన్నట్లుగా పేర్కొన్నాడు.

ఇక, ఆంధ్రం దేశ పరంగా, పల్లవ రాజు శివస్కందవర్మ మైదవోలు శాసనంలో వాడబడింది.

క్రీ.శ. 6వ శతాబ్దిలో వరాహమిహిరుడు 'బృహత్సంహిత'లో, ఆంధ్ర దేశాన్ని పేర్కొన్నాడు. క్రీ.శ. 7 వ శతాబ్ది నాటి చైనా యాత్రికుడు హ్యూయాన్-త్సాంగ్, నేటి కృష్ణ, గోదావరి జిల్లాలతో సమంగా గుర్తింపదగిన దేశాన్ని, ఆంధ్ర దేశమన్నాడు.

ఆంధ్ర శబ్దాన్ని భాషా పరంగా ఆది కవి నన్నయ భారతంలో ప్రయోగించలేదు కాని, నందంపూడి శాసనంలో నారాయణభట్టు, బహు భాషావేత్తని చెప్పిన సందర్భంలో, ఆంధ్ర భాషను కూడా చేర్చాడు.

BRAOU

'తెలుగు' అన్న పదం, ఇప్పుడు ఆంధ్ర పదానికి పర్యాయ పదం. క్రీస్తు శకం పది వందలకు పూర్వం గల శాసనాలలో కాని, వాఙ్మయంలో గాని, 'తెలుంగు' అనే పదం కనబడదు. క్రీస్తు శకం పదకొండవ శతాబ్ది ఆరంభం లోని శాసనాల్లో, తెలుంగు భూపాలురు, తెలింగ కులకాల మొదలైన పదాలు వాడబడ్డాయి. ఈ శాసనాల్లో కూడా, తెలుగు, తెలింగ పదాలు, జన వాచకం, లేదా జాతి వాచకం గానే కనిపిస్తాయి. పదమూడవ శతాబ్దిలోని మహమ్మదీయ చరిత్రకారులు, ఈ దేశాన్ని తిలింగ్ (తెలింగ) అని వ్యవహరించారు.

శివ కవి పాల్కురికి సోమనాథుడు. తన **'పండితారాధ్య చరిత్ర'**లో, ఆంధ్ర దేశాన్ని 'నవ లక్ష తెలుంగు' అని ప్రస్తావించాడు. అంటే, నవ లక్ష గ్రామాలున్న తెలుగు దేశమని. ఈ విషయాన్నే అప్పటి మహమ్మదీయ చరిత్రకారుడు ఈసామీ 'నౌలక్ తిలింగ్' అని పేర్కొన్నాడు.

పద్నాలుగో శతాబ్దం నాటి శాసనాల్లో, తిలంగ దేశమని, త్రైలింగ ధరణీ తలమని వ్యవహరింపబడిన ఈ దేశం, కాలక్రమంలో తెలుగు దేశమై, ఆంధ్ర దేశానికి పర్యాయ పదమైంది.

1.2 : పదోత్పత్తి

ఆంధ్ర శబ్దం సంస్కృతం. దానికి తెనుగు, తెలుగు, అనేవి పర్యాయ పదాలు. తెలుగు వారిని బర్మా ప్రాంతాల్లో త్రైలింగులని వ్యవహరించేవారు.

కాకతీయ ప్రతాపరుద్రుని ఆస్థానంలో విరచితమైన **"ప్రతాపరుద్రీయ యశోభూషణం"**, త్రిలింగ మధ్య దేశంగా తెలుగు దేశాన్ని వ్యవహరించింది. త్రిలింగ స్థలాలు శ్రీకాళహస్తి, శ్రీశైలం, ద్రాక్షారామం. ఈ మూడు శైవ క్షేత్రాల మధ్యగల దేశం త్రిలింగ దేశమని పేర్కొనబడింది. దీనిని బట్టి, కాకతీయ సామ్రాజ్యానికి త్రిలింగ సామ్రాజ్యమనే పేరొచ్చింది. ఈ త్రిలింగ శబ్దం నుండే 'తెలుగు' అనే రూపం ఏర్పడి ఉంటుందని, చరిత్రకారుల అభిప్రాయం.

క్రీ.శ. 1407 నాటి విన్నకోట పెద్దన **'కావ్యాలంకార చూడామణి'**లో, "శ్రీ పర్వతనాథేశ్వర ద్రాక్షారామ సంజ్ఞ వఱల . . . . త్రిలింగ దేశ మనదగు కృతులన్" అని రాశాడు.

ఈ విషయాన్నే మరింత వివరంగా, అప్పకవి తన అప్పకవీయంలో చెప్పాడు.

క. శ్రీక్షితి ధర కాళేశ
ద్రాక్షారామములనగ దనరారెడునీ
త్రిక్షేత్రంబుల లింగము
శిక్షింప త్రిలింగ సంజ్ఞ నెన్నొక లెక్కున్.

తే. తత్త్రింగ నివాసంబు తనరు కతన
నాంధ్రదేశంబు దా త్రిలింగాఖ్యమయ్యె
దెలుగనుచు దద్భవము దాని వలన బొడమె
వెనుక గొందఱు దానినే తెనుగు నండ్రు.

మూలం : 100వ పద్యం. అప్పకవీయం, క్రీ.శ. 1650.

తెలుగు శబ్దానికి తెనుగు అనే పర్యాయ పదం కూడా ఉంది.

BRAOU

ప్రథమాంధ్ర మహాకవి నన్నయ, తెనుగు శబ్దాన్ని ప్రాస ఘటితంగా వాడాడు.

'తెనుంగున, రచియింపు మధిక ధీశక్తి మెయిన్' నన్నయ్య విడిచిపెట్టిన మహాభారతాన్ని తెలుగు చేసిన తిక్కన, ఆంధ్ర, తెలుగు, తెనుగు శబ్దాలను ఏకార్థంలో ప్రయోగించాడు.

తన నిర్వచనోత్తర రామాయణంలో ప్రాస ఘటితంగా 'తెలుగు' శబ్దాన్ని వాడాడు.

"తెలుగు కవిత్వము చెప్పం

దలచిన కవి యర్థమునకు దగియుండెడు". మహాభారత అవతారికలో తెనుగు బాస' అని వాడాడు.

'తెనుగు బాస వినిర్మింప దివురు టరయ' ఇక ఆంధ్ర శబ్దాన్ని,

"ఆంధ్ర కవిత్వ విశారదుండు విద్యాదయితుండొనర్చె మహితాత్ముడు నన్నయభట్టు దక్షతన్" అనీ, "ఆంధ్రావళి మోదం బొరయ" అనీ ప్రయోగించాడు. ఆంధ్ర శబ్దాన్ని భాషా పరంగా, దేశ పరంగా, జాతి పరంగా వాడడమేకాక, తెనుగు, తెలుగు పదాలను కూడా తిక్కన ప్రయోగించాడు.

ఈ ఉపపత్తులను బట్టి, తెనుగు, తెలుగు, ఆంధ్ర శబ్దాలు, ఏకార్థ బోధకాలైన పర్యాయ పదాలని నిర్ధారించొచ్చు.

నేడు తెలుగువారన్నా, ఆంధ్రులన్నా ఒకటే. అదే విధంగా, ఆంధ్ర భాష, తెనుగు భాష, తెలుగు భాషా ఒకటే. ఆంధ్ర దేశమే తెలుగు దేశం. ఆంధ్ర దేశంలో నివసించే ప్రజలు తెలుగువారు.

ఈ ఆంధ్ర దేశాన్నే ఆంధ్రప్రదేశ్ అని కూడా వ్యవహరిస్తారు. ఈ ఆంధ్రప్రదేశ్ ఎప్పుడు ఏర్పడిందో, దాని ఎల్లలు ఏమిటో, దాని భౌగోళిక పరిస్థితులు ఎటువంటివో ఇప్పుడు తెలుసుకుందాం.

BRAOU

1.3 : ఆంధ్రప్రదేశ్ భౌగోళిక పరిస్థితులు

ఆంధ్రప్రదేశ్ 1956 నవంబర్ ఒకటో తేదీన అవతరించింది. దీని వైశాల్యం 2,75,909 చ.కి.మీ. 1991 జనాభా లెక్కల ప్రకారం, దీని జనాభా, 6,65,08,006. ఇది ఉత్తర అక్షాంశం సుమారు 12°-4.1' మొదలు, 20° వరకు, తూర్పు రేఖాంశం 77° మొదలు, 84°-50' వరకు వ్యాపించి ఉంది. ఇది భారతదేశం లోని పెద్ద రాష్ట్రాలలో ఐదవది. ఆంధ్ర రాష్ట్రానికి తూర్పున బంగాళాఖాతం, ఉత్తరాన ఒరిస్సా, మధ్యప్రదేశ్‌లు, దక్షిణాన తమిళనాడు, పడమర కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలు సరిహద్దులుగా ఉన్నాయి.

ఈ ఆంధ్రప్రదేశ్ ఇరవైమూడు జిల్లాలుగా విభజింపబడింది. అవి వరుసగా : 1. శ్రీకాకుళం, 2. విజయనగరం, 3. విశాఖపట్టణం, 4. తూర్పు గోదావరి, 5. పశ్చిమ గోదావరి, 6. కృష్ణ, 7. గుంటూర్, 8. ప్రకాశం, 9. నెల్లూర్, 10. చిత్తూర్, 11. అనంతపురం, 12. కడప, 13. కర్నూల్, 14. మహబూబ్‌నగర్, 15. మెదక్, 16. నిజామాబాద్, 17. కరీంనగర్, 18. అదిలాబాద్, 19. వరంగల్, 20. నల్గొండ, 21. ఖమ్మం, 22. హైదరాబాద్, 23. రంగారెడ్డి అనేవి. (పటం-1 ని చూడండి.)

ఈ ఆంధ్రప్రదేశ్‌కు సుమారు ఆరు వందల మైళ్ళ నిడివి గల్గిన సముద్ర తీర రేఖ ఉంది. తీర సౌకర్యమున్నందుకు, ఆంధ్రులు సముద్ర యానాలు సాగించి, ఆగ్నేయాసియా లోని పలు దేశాలైన

బర్మా, థాయ్‌లాండ్, వియత్నాం, కంబోడియాలతో వర్తక వాణిజ్యాలను సాగించి, అక్కడ బౌద్ధ, హైందవ సంప్రదాయాల్ని నెలకొల్పారు. ఆంధ్ర దేశం లోని కళింగ భాగమైన కళింగపట్నం రేవు నుండి వెళ్ళిన వారిని 'క్లింగులు' అని నేటికీ వ్యవహరిస్తున్నారు. ఆధునిక కాలంలో విశాఖపట్టణం మంచి ఓడరేవు. ఇక్కడి 'ధాల్విన్స్ నోవ్' అనే కొండ, సముద్రంలోకి చొచ్చుకొని ఉండడం చేత, ప్రకృతిసిద్ధమైన నౌకాశ్రయమేర్పడి, ఆధునిక కాలంలో విదేశ వాణిజ్య కేంద్రంగా అభివృద్ధిచెందింది.

1.3.1 : ఆంధ్ర దేశం లోని నదులు, పర్వతాలు

ఆంధ్ర దేశంలోని నదులు రెండు రకాలు. అవి : (1) చిన్నవి; (2) పెద్దవి.

1.3.1.1 : చిన్న నదులు

చిన్న నదులు ఆంధ్రప్రదేశ్‌లో చాలా ఉన్నాయి. జిల్లాల వారీగా వాటి వివరాలు: శ్రీకాకుళం జిల్లాలో మహేంద్రతనయ, వంశధార, నాగావళి; విజయనగరం జిల్లాలో గోస్తని; విశాఖపట్టణం జిల్లాలో శారద, వరాహ; తూర్పు గోదావరి జిల్లాలో పంప, ఏలేరు, తుల్యభాగ; పశ్చిమ గోదావరి జిల్లాలో తమ్మిలేరు, రామిలేరు, ఎర్రకాలువ; కృష్ణా జిల్లాలో మునేరు, బుడమేరు; గుంటూర్ జిల్లాలో నాగులేరు, చంద్రవంక; ప్రకాశం జిల్లాలో మున్నేరు, సువర్ణముఖి, పెన్న; అనంతపురం జిల్లాలో పెన్నా, చిత్రావతి; కర్నూల్ జిల్లాలో కృష్ణా నదికి ఉప నదులైన, హంద్రి, తుంగభద్ర; కడప జిల్లాలో పాపాగ్నిలేరు, పాపఘ్ని; చిత్తూర్ జిల్లాలో స్వర్ణముఖి, బాహుదా; మహబూబ్‌నగర్ జిల్లాలో కృష్ణా, డిండీ, తుంగభద్ర, పెద్దవాగు; హైదరాబాద్ జిల్లా లోని మూసీ నది; మెదక్ జిల్లా లోని మంజీర, శబరి, కుదలియారు, హల్దీ; నల్గొండ జిల్లాలో మూసీ, కృష్ణ, ఆలేరు, పాలేరు. వరంగల్ జిల్లాలోని గోదావరి, పాలేరు, మున్నేరు, ఆలేరు; కరీంనగర్ జిల్లా లోని గోదావరి, మంజీర; ఖమ్మం జిల్లా లోని కిన్నెరసాని, పాలేరు, వైరా, గోదావరి; అదిలాబాద్ జిల్లా లోని వార్ధా, ప్రణహిత మున్నగునవి ముఖ్యమైనవి.

BRAOU

1.3.1.2 : పెద్ద నదులు

తెలుగువారి పెద్ద నదులలో గోదావరి, కృష్ణ ముఖ్యమైనవి.

గోదావరి

ఇది మహారాష్ట్ర లోని నాసికాత్రయంబకం వద్ద పుట్టింది. ఇది సుమారు 900 మైళ్ల పొడవుతో, వీడు పాయలుగా చీలి, సముద్రంలో సంగమిస్తుంది. 1852 వ సంపత్సరంలో ఈ నదికి ధవళేశ్వరం వద్ద సర్ ఆర్థర్ కాటన్ ఆనకట్టను నిర్మించాడు. దీని ఉపనదులలో మంజీర, ప్రణహిత, శబరి ముఖ్యమైనవి.

కృష్ణా

గోదావరి తర్వాత చెప్పతగ్గ పెద్ద నది కృష్ణ. ఇది మహారాష్ట్ర లోని మహాబలేశ్వరం దగ్గర పుట్టింది. ఆది లోనే ఇది కృష్ణ, వేణ్ణ అనే రెండు నదుల కలయిక. దీని పొడవు సుమారు 700 మైళ్లు. 1854 లో దీనికి బెజవాడ వద్ద ఆనకట్ట కట్టారు. తుంగభద్ర, భీమ, ఘటప్రభ, మలప్రభ, మూసి మొదలైనవి, దీని ఉప నదులు.

1.3.1.3 : సరస్సులు

నదులే కాక, సరస్సులున్నా ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువే. వాటిలో కొల్లేరు సరస్సు, పులికాట్ సరస్సు ప్రసిద్ధమైనవి. ఈ పైన పేర్కొన్న నదులు ఆంధ్ర దేశంలో ప్రవహిస్తూ, తమ డెల్టాల లోను, లోయల లోను, సారవంతమైన ఒండ్రు మట్టిని, జల సమృద్ధిని కలగచేశాయి. వరి, చెరకు వంటి ప్రధానమైన పంటలకు, వివిధ ఫల జాతులకు ఆలవాలమై, ఆంధ్రప్రదేశ్‌ను సస్యశ్యామలం చేశాయి, ఆయా నదీమ తల్లులు.

ఆంధ్ర దేశ సిరిసంపదలు నదుల మీద ఆధారపడి ఉన్నాయనడంలో ఏమాత్రం సందేహం లేదు.

1.3.1.4 : పర్వతాలు

ఆంధ్ర దేశం లోని ప్రధాన పర్వత పంక్తి, తూర్పు కనుమలు. ఇవి పడమటి కనుమలంత, ఎత్తైనవి కావు. అందమైనవి కూడా కావు. ఈ కనుమలు ఒరిస్సా రాష్ట్రపు సరిహద్దు మొదలుకొని, తీరానికి సమాంతరంగా, షుమారు 50 మైళ్ళు వ్యాపించి ఉన్నాయి. వీటికి వేరు వేరు పేర్లున్నాయి. మందసాకు సమీపంలో మహేంద్రగిరి, విశాఖపట్నం జిల్లాలో పాలకొండ, అనంతగిరి మొదలైనవి. అరకు లోయ సమీపంలో గల ఈ కొండల ప్రకృతి దృశ్యాలు చాలా మనోహరంగా ఉంటాయి. రాజమహేంద్రవరం దగ్గర ఇవి పాపి కొండలు. కృష్ణకు దగ్గరగా నల్లమల కొండలున్నాయి. ఇవి 2000 అడుగులు మొదలు, 3000 అడుగుల వరకు ఎత్తులో ఉంటాయి. ఈ కొండల పైన కొన్ని పుణ్యక్షేత్రాలు కూడా వెలిశాయి. వాటిలో, సింహాచలం, శ్రీశైలం, అహోబిలం, తిరుపతి ముఖ్యమైనవి. గుంటూరు జిల్లా లోని నాగార్జునకొండ, బెల్లంకొండ, కొండవీడు ముఖ్యమైనవి. నల్లమలలకు పశ్చిమంగా ఎర్రమలలు ఉన్నాయి. అనంతపురం జిల్లా లోని గుత్తి ఒక ముఖ్యమైన చారిత్రక ప్రదేశం.

ఈ పర్వత (కొండ) ప్రాంతాల్లో కొన్ని చోట్ల, కాకులు దూరని కారడవులున్నాయి. ఈ అడవులలో టేకు, ఏగిస, మద్ది, కంబ మున్నగు పెద్ద వృక్షాలు విశాలంగా విస్తరించి, గృహ నిర్మాణానికి, చెక్క సామగ్రికి కావలసిన కలప నందిస్తున్నాయి. కాగితానికి పనికివచ్చే వెదురు, నిత్యం ఉపయోగించే చింత, కుంకుడు, షీకాయ వంటి పదార్థాలు కూడా, ఈ అడవుల నుండే మనకు లభ్యమౌతున్నాయి.

వాతావరణ సంరక్షణ లోను, వానలు బాగా కురవడానికిక్కూడా, ఈ అడవులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.


1.3.2 : ఆంధ్రుల చరిత్రపై భౌగోళిక పరిస్థితుల ప్రభావం

ఆంధ్రప్రదేశ్ పడమట నుండి తూర్పుకు ఏటవాలుగా ఉండడం చల్ల, పడమటి కొండల్లో పుట్టిన నదులు తూర్పు దిశగా ప్రవహించి, సముద్రంలో సంగమిస్తున్నాయి.

ఈ నదుల వెంబడి రాకపోకలకు అనుకూలమైన మార్గాలేర్పడి, వర్తకపు సరుకుల రవాణాకు తగిన సౌకర్యం కలిగింది. ముఖ్యంగా, కృష్ణా, గోదావరి నది ముఖద్వార ప్రాంతాల్లో ప్రాచీన కాలం నుండి వాణిజ్య సంఘాలు ఏర్పడి, నౌకా వర్తక వ్యాపారాలు చేసేవారనే నిదర్శనాలున్నాయి. అందువల్లనే, ఈ తీర ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల కంటే నాగరికత అభివృద్ధి చెందింది.

సముద్ర తీర రేఖ పొడవునా, రేవు పట్టణాలు ఏర్పడ్డాయి. ఆంధ్ర దేశం లోని రేవు పట్టణాల్లో అతి ప్రాచీనమైనవి, కృష్ణా మండలం లోని గూడూరు, ఘంటసాల. శాతవాహన యుగం లోను,

BRAOU



ఆంధ్రప్రదేశ్ నైసర్గిక స్వరూపం


అటుతర్వాత కూడా, ఇవి నేటికి వర్తకాలకు ముఖ్య కేంద్రంగా ఉండేవి. కాలక్రమాన మరెన్నో రేవు పట్టణాలు తీరం పొడుగునా ఏర్పడ్డాయి. అందులో కళింగపట్నం, ఘంటసాల, మోటుపల్లి ముఖ్యమైనవి. ఈ రేవు పట్టణాల ద్వారా వర్తక వ్యాపారాలను సాగించి, మన దేశ సంస్కృతి సంప్రదాయాలను విదేశాల్లో కూడా వ్యాపింపజేసిన ఖ్యాతి, మన ఆంధ్రులదే.

ఈ భౌగోళిక ప్రభావం ఆర్థిక సంస్కృతి పైనే కాక, రాజకీయ చరిత్ర మీద కూడా ప్రతిబింబిస్తోంది. ఆంధ్ర దేశం ఉత్తరం నుండి మౌర్య, గుప్త వంశ చక్రవర్తులను, పడమటి నుండి శాతవాహన, చాళుక్య, రాష్ట్రకూట చక్రవర్తుల్ని, దక్షిణం నుండి పల్లవ, చోళ చక్రవర్తుల్ని ఆకర్షించింది. వారు క్రమంగా ఈ రాజ్యాన్ని జయించి, వారి స్థావరాల్ని ఏర్పాటుచేసుకొనేవారు. ఇందుకు, పల్లవులలో గల గుంటూరు, నెల్లూరు శాఖలు, చాళుక్యులలో గల వేంగీ శాఖ, ఉదాహరణలు.

మత పరంగా కూడా, ఆంధ్ర దేశంలో వైదిక, బౌద్ధ, జైన మతాలు, ఉత్తర భారతదేశం నుండి వచ్చాయని చరిత్రకారుల అభిప్రాయం. ఈ విధంగా, చరిత్రపై భౌగోళిక ప్రభావం విపులమౌతూంది.

1.4 : చరిత్ర రచనకు ఆధారాలు

చరిత్ర రచన చేయడానికి అతి ముఖ్యమైనవి, ఆధారాలు. ఈ ఆధారాలను శ్రద్ధగా అధ్యయనం చేసి, శాస్త్రీయంగా విశ్లేషణ జరిపి, మనం చరిత్రను పునర్నిర్మించుకోవాలి. ఈ ఆధారాలు స్థూలంగా రెండు రకాలు. అవి : (1) పురావస్తు సంబంధమైనవి, (2) వాఙ్మయ సంబంధమైనవి. పురావస్తు సంబంధమైనవి త్రవ్వకాలు, శాసనాలు, నాణేలని మూడు రకాలు. అదే విధంగా, వాఙ్మయ సంబంధ ఆధారాలను దేశీయాలనీ, విదేశీయాలనీ, రెండు రకాలుగా విభజించొచ్చు.



1.4.1 : పురావస్తు ఆధారాలు

పురావస్తు సంబంధమైన ఆధారాల్లో అతి ముఖ్యమైనవి త్రవ్వకాలు. శిధిలావస్థలో ఉన్న కోటల్ని, మట్టి దిబ్బల్ని త్రవ్వడం ద్వారా, ఎన్నో కొత్త విషయాలు మనకు తెలుస్తున్నాయి. తరవాత చెప్పుకోదగ్గవి శాసనాలు. ఇవి చరిత్ర రచనకు ప్రధానమైన ఆధారాలు. రాజులు కానీ, సమాజంలోని సామాన్యులు కాని, తాము సాధించిన విజయాలనో, చేసిన దానాలనో, తెలియచేయడానికి రాయించిన వాటిని శాసనాలంటారు. ఇవి రాతి మీద కాని, రాగి రేకుల మీద కాని, చెక్కబడి ఉంటాయి. ఈ శాసనాల వలన భౌగోళిక పరిస్థితి, రాజుల పేర్లు, వారి పరిపాలనా కాలం, దండయాత్రలు, సమకాలీన ఆర్థిక, మత, సాంస్కృతిక పరిస్థితులు, మొదలైన ఎన్నో విషయాలు మనకు తెలుస్తాయి. శాసనాల తర్వాత ప్రాచీన చరిత్రకు ఉపయోగపడే ఆధారాలు, నాణేలు. ఈ నాణేలు కూడా, రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్ని తెలియజేస్తాయి.

BRAOU

1.4.1.1 : త్రవ్వకాలు - కట్టడాలు

చరిత్ర రచనకు పురాతత్వ శాస్త్రం, ముఖ్యంగా త్రవ్వకాలు, ఎనలేని సేవ చేస్తున్నాయి. ఇది ఇటీవలి పరిణామమే అయినా, ఈ తక్కువ కాలం లోనే అద్భుతమైన ప్రగతిని చూపించింది. పురావస్తు స్థలాలను జాగ్రత్తగా త్రవ్వి, అక్కడ దొరికిన వస్తువుల ఆధారంగా, కార్బన్ పద్ధతిన కాల నిర్ణయం చేయడం, చరిత్ర రచనకు ఎంతో ఉపయోగపడుతోంది. అమరావతి, భట్టిప్రోలు, గుడివాడ, జగ్గయ్యపేట, గుంటుపల్లి, రామతీర్థం, శాలిహుండం, నాగార్జునకొండ, కొండాపూర్, వరంగల్లు, హంపి, విజయనగరం మున్నగుచోట్ల, త్రవ్వకాల ద్వారా అనేక నూతన చారిత్రకాంశాలు వెలుగులోకి వస్తున్నాయి.

ముఖ్యంగా అమరావతి, నాగార్జునకొండ వద్ద జరిపిన తవ్వకాల వలన, బౌద్ధుల వాస్తు పద్ధతి గురించి ఎక్కువ విశేషాలు తెలుస్తున్నాయి. బౌద్ధుల పవిత్ర కట్టడాల్లో ప్రముఖమైనవి, స్తూపాలు, చైత్యాలు, సంఘారామాలు. ఈ మూడు రకాలైనవి, అమరావతి, నాగార్జునకొండల వద్ద ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అతి ముఖ్యమైన బౌద్ధ క్షేత్రమైన అమరావతిని, మొదటిసారి క్రీ.శ. 1797 లో కల్నల్ కాలిన్ మెకంజీ గుర్తించి, దాని విలువలను పత్రికలకు రాశాడు. ఈ అమరావతికి సమీపాన్నే ధరణికోట, లేక ధాన్యకటకం ఉంది.

ఈ అమరావతి స్తూపం గుండ్రంగా ఉండి, 138 అడుగుల వ్యాసం, 100 అడుగుల ఎత్తు కలిగి, పాలరాతితో కట్టబడింది. ఇది, వృత్తాకారం గల వేదికను, దానిపైన అర్ధగోళాకృతిలో అండాన్ని, దానిమీద హార్మికను, దానిపై ఛత్రాన్ని కలిగి ఉంటుంది. వేదిక మీద అండానికి నాలుగు పైపుల ఆయన వేదికలు (Ayaka platforms), ఒక్కొక్క వేదిక మీద ఐదు ఆయక స్తంభాలు (Ayaka pillars) ఉంటాయి. ఈ ఆయక స్తంభాలు ఆంధ్ర దేశంలో మాత్రమే ప్రధానంగా ఉండడం వల్ల, ఆంధ్ర దేశం లోని బౌద్ధ కట్టడాలకు దీన్ని ఒక ప్రత్యేకతగా చెప్పొచ్చు. వేదిక చుట్టూ ప్రదక్షిణ పథం, దాని నావరించి ప్రాకారం, ఉంటాయి.

ఆంధ్ర దేశ బౌద్ధ శిల్పాల్లో మొదటి వేర్కొన దగింది, శాతవాహన శిల్పం. దీనినే అమరావతి శిల్ప మని కూడా అంటారు. ఈ శిల్పాన్ని సూక్ష్మ దృష్టితో పరిశీలిస్తే, ఆనాటి జనుల వేషధారణ, శిరోజాలంకరణ, అలంకార విశేషాలు మనకు తెలుస్తాయి. రాజ ప్రాసాదాలు, వారు ఉపయోగించినటు వంటి వివిధ రకాలైన వస్తు సామగ్రి మనకు విశదమౌతాయి. ఇలాంటి బౌద్ధ కట్టడాలు అమరావతి, నాగార్జునకొండల లోనే కాక, భట్టిప్రోలు, మంటసాల, గుడివాడ, జగ్గయ్యపేట, గుంటుపల్లి, రామతీర్థం, శాలిహుండం, సంకారం, అల్లూరు, గుమ్మడిదుర్రు, కొండాపురం మొదలైన చోట్ల కూడా, త్రవ్వకాల్లో బయటపడ్డాయి. ఇటీవలి త్రవ్వకాల్లో విశాఖపట్నానికి సమీపంలో, బావికొండ, తొట్లకొండ, పావురాల కొండ, గోపాల పట్నం దగ్గర కూడా బౌద్ధ స్తూపాలు, ఆరామాలను వెలికితీసారు. వీటి పరిశీలన వల్ల, ఆంధ్ర దేశంలో బౌద్ధ మతానికి ఎక్కువ ప్రోత్సాహముండేదనీ, బౌద్ధ కట్టడాలను వారు ఎక్కువగా నిర్మించేవారనీ తెలుస్తోంది.

దేవాలయాలు

ఆంధ్ర దేశం లోని హిందూ దేవాలయాల్లో, చేజర్ల కపోతేశ్వరాలయం అతి ప్రాచీనమైంది. భారతదేశం లోని దేవాలయ నిర్మాణ పద్ధతిని, ముఖ్యంగా మూడు రకాలుగా విభజించారు. అవి నగర, వేసర, ద్రావిడ అనేవి. ఆంధ్ర దేశం లోని దేవాలయాలు ఎక్కువగా నగర, ద్రావిడ సంప్రదాయాలకు చెందినవి. చాళుక్యుల దేవాలయాల్లో పంచారామాలు, చిక్కవోలు దేవాలయాలు ప్రసిద్ధి కెక్కాయి.

BRAOU

ఇవి శైవ క్షేత్రాలు. ఇవే కాక, సింహాచల, శ్రీకూర్మ దేవాలయాలు వైష్ణవాలయాలు. ఈ దేవాలయ నిర్మాణ పద్ధతిలో, ఎక్కువగా ద్రావిడ సంప్రదాయం గోచరిస్తుంది. ఈ దేవాలయం లోని శిల్పాల్ని, లౌకిక శిల్పాలని (Secular Sculptures), మతపరమైన శిల్పాలని, విభజించొచ్చు. లౌకికపరమైన శిల్పాల్లో పశుపక్ష్యాదులు, వాద్యకారులు, నృత్యకారులు, రాజులు, సామాన్య ప్రజలు గోచరిస్తారు. వీటిని సూక్ష్మ దృష్టితో పరిశీలిస్తే, ఆనాటి వస్త్రధారణ, శిరోజాలంకరణ, ఆభరణాలు, వాయిద్యాల గురించి మనకు తెలుస్తుంది. ఈ చాళుక్య దేవాలయాలు ఎక్కువగా, రాష్ట్రకూట దేవాలయాల, బాదామి చాళుక్య దేవాలయాల రీతిని పోలి ఉన్నాయి.

చాళుక్యుల తర్వాత ఆంధ్ర దేశాన్ని ఏలిన వారిలో, కాకతీయులు ముఖ్యులు. వీరి దేవాలయాలు ఎక్కువగా తెలంగాణా ప్రాంతంలో ఉన్నాయి. పాలంపేట, ఓరుగల్లు, హనుమకొండ, త్రిపురాంతకం, మాచెర్ల లోని దేవాలయాలు, వీరి సుందర కట్టడాలకు ప్రతీకలు. కాకతీయ శిల్పానికి అత్యద్భుత నిదర్శనం, హనుమకొండ లోని సహస్ర స్తంభ దేవాలయం. ఇది కాకతి రుద్రుని నిర్మాణం. రేచర్ల రుద్రసేనానిచే నిర్మింపబడిన పాలంపేట లోని రామప్ప గుడి, కాకతీయ శిల్పానికి తలమానికమని చెప్పొచ్చు.

ఇవి గాక, ఓరుగల్లు కోట లోని స్వయంభూ దేవాలయం, పానగల్లు సూర్యనారాయణ దేవాలయం, పేర్కొన దగినవి.

కాకతీయుల తర్వాత విజయనగర రాజులు ఆంధ్రదేశ చరిత్రలో ప్రసిద్ధి చెందారు. వీరు కట్టించి నటువంటి హజారా రామాలయం, విఠల స్వామి ఆలయం ముఖ్యమైనవి. విజయనగర రాజులు దేవాలయాల్నే కాక, సుందర ప్రాసాదాలను కూడా నిర్మించారు. కళింగ విజయానంతరం కృష్ణదేవ రాయలు భువన విజయ మనే పేరిట, ఒక గొప్ప సభా భవనాన్ని నిర్మించాడు. పెనుగొండ లోను, చంద్రగిరి లోను కూడా రాజభవనాలున్నాయి. పెనుగొండ ప్రాసాదానికి గగన మహల్ అని పేరు. విజయనగర కాలం నాటి దేవాలయాలు, హంపి, తాడిపత్రి వద్ద కూడా ఉన్నాయి.

ఈ దేవాలయాలపైగల శిల్పాలు అత్యంత రమణీయాలు. ఈ శిల్ప సంపద ఆధారంగా ఆనాటి సాంఘిక, మత జీవన విధానాలను పునర్నిర్మించొచ్చు. విజయనగర శిల్పం అత్యంత రమణీయమని, ఆనాటి శిల్పుల కళా ప్రాశస్త్యం అపూర్వమని, భారతీయులే కాదు, విదేశీయులు కూడా వేనోళ్ళ కొనియాడారు. లౌకికపరమైన శిల్పాలే కాక, మత పరమైన శిల్పాలు కూడా ఈ దేవాలయాల మీద కానవస్తున్నవి. వైష్ణవ దేవాలయాల్లో నారసింహ విగ్రహాలు, దశావతారాలు, చతుర్వింశతి విష్ణుమూర్తులు ముఖ్యమైనవి. శైవ పరమైన దేవాలయాల్లో నటరాజు, అనుగ్రహ మూర్తులు, సంహార మూర్తులు, దక్షిణామూర్తి, ఏకపాదమూర్తి, అర్ధనారీశ్వర, హరిహర మూర్తులు ముఖ్యమైనవి.

చిత్రలేఖనం

విజయనగర యుగంలో చిత్రలేఖనం కూడా ఎక్కువగా ఆదరించబడింది. భారత, రామాయణాలలో ప్రసిద్ధికెక్కిన గాధలను దేవాలయంలోని, గృహ కుడ్యాలపై చిత్రించేవారు. ఇట్టి చిత్రాలు హంపి, సోమపాలెం, లేపాక్షిల వద్ద ఉన్నాయి. లేపాక్షి నేటి అనంతపురం జిల్లా హిందూపురానికి తొమ్మిది మైళ్ళ దూరంలో ఉంది. ఇచ్చట విజయనగర కాలం నాటి వీరభద్రేశ్వరాలయముంది. దీనినే నేడు లేపాక్షి దేవాలయమని పిలుస్తున్నారు. ఈ దేవాలయం లోని చిత్రలేఖనానికి, ఆనాటి వారు ఎక్కువగా చక్కని ఎరుపు, నీలం పసుపు పచ్చ, ఆకుపచ్చ, నలుపు, తెలుపు రంగుల్ని ఉపయోగించినట్లు, పరిశోధనల ద్వారా తెలుస్తోంది.

BRAOU

ఈ చిత్రలేఖనంలో రామాయణ, భారత గాథలతోపాటు, పార్వతీ పరమేశ్వరులు చదరంగ మాడడం, కృష్ణుని వేణు గానానికి గోపికలు సమ్మోహితులవడం, శివుని భిక్షాటనం, వృషభారూఢుడైన శివుడు, నటేశుని ఆనంద తాండవం, శివానుగ్రహం, దక్షిణామూర్తి ఎంతో మనోహరంగా చెక్కబడ్డాయి.

లేపాక్షి లోని చిత్రకళ ఆంధ్ర దేశం లోనే కాక, భారతదేశ మంతటా ప్రసిద్ధి గాంచింది.

1.4.1.2 : శాసనాలు

ఆంధ్రుల చరిత్రను పునర్నిర్మించడానికి శాసనాలు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. ఆంధ్ర దేశంలో లభ్యమైన అతి ప్రాచీన శిలా శాసనాలు అశోకునివి. ఎఱ్ఱగుడి, రాజుల మందగిరి, అమరావతి వద్ద దొరికినాయి. ఆ తర్వాతది భట్టిప్రోలు స్తూపం వద్ద గల శాసనం. దీనినే ధాతు కరండ శాసన మంటారు. తర్వాత చెప్పదగినవి శాతవాహన కాలపు శాసనాలు. అవి ఆ వంశపు రాజులు, వారి కాలంలో అనేక వృత్తి వాణిజ్య సంఘాలిచ్చినవి. వీరివి మహారాష్ట్ర, కర్ణాటకంలో కూడా దొరికాయి. నాసిక్, కార్లే, కన్హేరి, నానాఘాట్ శాసనాలు మహారాష్ట్ర లోనివి. మ్యాకదోని, బనవాసి వద్దవి కర్ణాటకలో దొరికాయి. వీరి శాసనాలు ఆంధ్ర దేశంలో అమరావతి, నాగార్జునకొండ, కొడవలి వద్ద లభించాయి.

శాతవాహనుల కాలం నాటి శాసనాలలో అతి ముఖ్యమైనవి, నాగానిక వేసిన నానాఘాట్ శాసనం; గౌతమీ బాలశ్రీ వేసిన నాసిక్ శాసనం. నాగానిక వేయించిన శాసనంలో తన భర్త శాతకర్ణి ఘనత, అతడు చేయించిన అశ్వమేధ, వాజపేయ యాగాలను, దానాలను తెలుపుతుంది. ఇంతకన్నా ముఖ్యమైంది, బాలశ్రీ నాసిక్ శాసనం. బాలశ్రీ తన కుమారుడు గౌతమీ పుత్ర శాతకర్ణి సాధించిన విజయాలను ప్రస్తుతించే శాసన మిది. శాతకర్ణి క్షహరాటు వంశాన్ని నిర్మూలించినట్లు, శక, యవన, పహ్లవులను కూడా ఓడించినట్లు చెబుతూ, అతడు అసిక, అస్మక, ములక, అపరాంత, అనూప, ఆకర, అవంతి, కుకుర, సురర ప్రాంతాలను అధిపతనీ, అతని పాలన ప్రజారంజకంగా ఉన్నట్లు వివరిస్తుంది. ఈ రెండు శాసనాలు మహారాష్ట్ర ప్రాంతానివైనా, శాతవాహన చరిత్రలో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి. శాతవాహనుల రాజ్యంలో మహారాష్ట్ర, ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలన్నీ, ఉండడం వలన, ఈ చరిత్రకు సంబంధించిన విషయం ఏప్రాంతానిదైనా గ్రాహ్యమే.

శాతవాహనుల తర్వాత ఇక్ష్వాకు వంశస్థుల శాసనాలు, నాగార్జునకొండ, విజయపురంలలో లభించాయి. నాగార్జునకొండలో కడపటి తవ్వకాల్లో లభించిన అభీర వసుషేణుని శాసనం, అతి ముఖ్యమైంది.

శాతవాహన, ఇక్ష్వాకు శాసనాల వలన, మనకు వారి మత విధానం తెలుస్తుంది. ఈ రెండు వంశాల శాసనాలు ప్రధానంగా బౌద్ధ మతాదరణనే తెలియజేస్తాయి. తర్వాతి కాలంలో బౌద్ధ మతాదరణ తగ్గి, వైదిక మత, లేక, పౌరాణిక మతాదరణ ఎక్కువైంది. వీరి చరిత్ర రచనలో రాజుల పట్టికలు, కాల నిర్ణయాలు పలు విధాలైన అభిప్రాయాలకు తావునిచ్చాయి.

ఇక్ష్వాకుల తర్వాత బృహత్ఫలాయనులు, అనందగోత్రులు, శాలంకాయనులు, ప్రాచీన పల్లవులు, విష్ణుకుండినులు, ఎక్కువగా తమ శాసనాలను రాగిరేకుల మీద చెక్కారు. ఈ శాసనాల ద్వారా ఆ రాజులు వైదిక మతానుయాయులని స్పష్టమౌతూంది.

ఈ చిన్న రాజ వంశాల తర్వాత ప్రసిద్ధి కెక్కిన వారు, వేంగీ చాళుక్యులు. వీరి చరిత్ర రచనకు కూడా తామ్ర శాసనాలను ఉపయోగించారు. వీరి తామ్ర శాసనాలలో కడపటి కాలంలో ప్రవేశపెట్టబడిన రాజుల వంశానుక్రమణిక, వారి రాజ్యకాల వివరణ వలన, రాజకీయ చరిత్రను సులువుగా

BRAOU

తెలుసుకోవచ్చు. ఈ కాలంలో తెలుగు భాష అభివృద్ధిలోకి వచ్చింది. ఆనాటి చోళుల కాలంలో తెలుగు వచన శాసనాలు మొదటిసారిగ మనకు కనిపిస్తాయి. వీరు కూడ తమ శిలా శాసనాలలో తెలుగు వచనాన్ని వాడి, 9వ శతాబ్ది మధ్య కాలానికి (అంటే గుణగ విజయాదిత్యుని కాలానికి) పద్య శాసనాలను రూపొందించారు. గుణగ విజయాదిత్యుని సేనాని పండరంగుని అద్దంకి శాసనం, తెలుగు భాష లోని మొట్టమొదటి పద్య శాసనం. దీనిలోని చందస్సు తరువోజ. అలాగే, యుద్ధమల్లుని బెజవాడ శాసనం మధ్యాక్కర లోను, చాళుక్య భీముని ధర్మవరం శాసనం సీస పద్యం లోనూ, వ్రాయబడినాయి. 11వ శతాబ్దిలో చాళుక్య రాజరాజ నరేంద్రుడు ఆది కవి నన్నయను పోషించడానికి ముందుగానే, ఆంధ్ర దేశంలో తెలుగు భాష వాడబడుతోందనడానికి, ఇవి ఉదాహరణలు.

వేంగీ చాళుక్యుల తదుపరి, చాళుక్య - చోళుల పరిపాలనానంతరం, కాకతీయులు ఆంధ్ర తీరాన్ని ఆక్రమించి, రాయలసీమ, తెలంగాణ, ఆంధ్ర తీర ప్రాంతాన్ని కలిపి, ఏలారు. వీరి రాజకీయ చరిత్రకు ప్రధాన ఆధారాలు రెండు. బయ్యారం శాసనం, అనుమకొండ శాసనం, వారి వంశ చరిత్రను రాష్ట్రకూటుల నాటి నుండి వివరిస్తోంది. మొదట రాష్ట్రకూటుల వద్ద సేనాధిపతులుగా ఉన్నట్లు, తదుపరి కళ్యాణి చాళుక్యులకు సామంతులైనట్లు, అటుపిమ్మట స్వతంత్ర రాజ్యాన్ని వారు ఏర్పాటు చేసినట్లు విదితమౌతోంది. అనుమకొండ శాసనం రుద్రదేవుని కాలం నాటిది. రుద్రదేవుని విజయాలు, అతని పూర్వీకుల లోని కొంత మంది ఘనతను, ఈ శాసనం విపులీకరిస్తుంది. కాకతీయుల కాలం నాటి మత విషయాలు, ముఖ్యంగా శైవ మతానికి, గోళకీ మఠానికీ ఆంధ్ర దేశంలో ఉన్న ప్రాముఖ్యం, వివరంగా తెలుస్తోంది. ఆనాటి వర్తకవాణిజ్యాలకు మోటుపల్లి ప్రసిద్ధి చెందింది. గణపతిదేవుని శాసనం విదేశీ వర్తకవ్యాపారాలను మెరుగు చేయడానికి ఆరాజు యిచ్చిన ప్రోత్సాహాన్ని, అక్కడ వసూలు చేయవలసిన సుంకాలను క్రమబద్ధీకరించడాన్ని వివరిస్తూంది. వీటినే, తర్వాత మోటుపల్లిని ఆక్రమించిన అనపోతారెడ్డి, సంగమ వంశీకుడైన మొదటి దేవరాయలు కొన్ని మార్పులతో జారీ చేశారు.

విజయనగర రాజులు ఆంధ్ర, కర్ణాటకాలనే కాక, తమిళనాడు ప్రాంతాలను కూడా తమ ఏలుబడి క్రిందకు తెచ్చుకున్నారు. వీరి శాసనాలు చాలా ఎక్కువ. దక్షిణాది లోని ప్రధాన పుణ్యక్షేత్రాల న్నిటిలోను, వీరివి దొరుకుతాయి. కొన్ని ప్రాంతాలను వారే స్వయంగా పరిపాలించేవారు; కొన్ని సామంతులైన నాయంకరుల చేతిలో ఉండేవి. వీరి శాసనాల ద్వారా, వీరికి, వారి సామంతులతో గల సంబంధాలను మనం తెలుసుకోవచ్చు. రాజుల రాజకీయ విజయాలు వారు జారీ చేసిన శాసనాల వలన తెలుస్తాయి. ఉదాహరణకు, కృష్ణదేవరాయల కళింగ విజయం మనకు ఆనాటి వాఙ్మయం వలన, విదేశీ వాఙ్మయం వలన తెలుస్తోంది. కాని, ఆయన శాసనాలు దొరికిన చోట్లు, ఆశాసన తేదీల వలన ఆ విజయాలను స్పష్టంగా నిర్ధారించొచ్చు.

విజయనగరం కాలం నాటి సాంఘిక, ఆర్థిక పరిస్థితుల పునర్నిర్మాణానికి, శాసనాలు ఉపకరిస్తాయి. వళంగై, ఇడంగై, కైక్కోళ, ఇత్యాది సాంఘిక సమూహాలున్నట్లు, వారు సాంఘిక గౌరవాల కోసం ప్రయత్నిస్తున్నట్లు, వారి శాసనాలు తెలుపుతాయి. రాజులు నీటిపారుదల కోసం తటాకాలను తవ్వించినట్లు బుక్కరాయల కాలం నాటి పోరుమామిళ్ళ శాసనం తెలుపుతోంది. రాజులు, ప్రజలు, శైవ, వైష్ణవాలను ఆదరించేవారు. మతపరంగా ప్రాముఖ్యమున్న శాసనం, బుక్కరాయల శ్రావణ బెల్గోళా శాసనం. దీనిలో జైన మతానికి, వైష్ణవానికి విభేదాలు వచ్చి; కొన్ని జైన వసతులు పాడైనట్లు, బుక్కరాయల కృషి వలన అవి రాజీ అయినట్లు, ఈ శాసనం పేర్కొంటోంది.

BRAOU

1.4.1.3 : నాణేలు

ఆంధ్ర దేశ చరిత్రకు శాసనాలంత ఎక్కువ ఉపకరించకపోయినా, నాణేలు మిగతా ఆధారాల ద్వారా లభించిన విషయాన్ని నిర్దుష్టం చేయగలుగుతాయి. వెండి, రాగి లోహాలలో ప్రాచీన నాణేలు జారీ అయ్యాయి. విద్దంక నాణేలు ఈ తరగతివి. శాతవాహనుల కాలంలో ఎక్కువగా పోటీన్ (సీసం, రాగి, తుత్తు నాగం)తో నాణేలను తయారుచేశారు. శాతవాహనుల, ఇక్ష్వాకుల శాసనాల వలన, ఆకాలంలో పురాణాలు, కార్షాపణాలనే వెండి నాణేలు వాడుకలో ఉన్నట్లు తెలియజేస్తున్నాయి. శాతవాహనుల నాణేల మీద, గుర్రం, ఏనుగు, సింహం మొదలైన జంతువుల బొమ్మలు, బౌద్ధ మతానికి సంబందించినవిగా పరిగణిస్తున్న చైత్యం, బోధి వృక్షం బొమ్మలు కనబడతాయి. తెరచాప కలిగిన ఓడ బొమ్మలు కూడ ఉన్నాయి. దీనిని బట్టి, శాతవాహనులకు సముద్ర యానం అభిమానమని తెలుస్తోంది. వీరు ఎక్కువగా రోమన్ సామ్రాజ్యం తోనూ, ఆగ్నేయాసియా తోను, వర్తకవ్యాపారాలు సాగించేవారు. అందుచేతనే, మనకు రోమన్ చక్రవర్తుల నాణేలు ఎక్కువగా లభ్యమౌతున్నాయి.

శాతవాహన నాణేలలో ముఖ్యమైనది, జొగల్తంబి నిధి. దీనిలో క్షహరాత వంశానికి చెందిన నహపానుని నాణేలు, వాటిలో ఎక్కువ సంఖ్య, గౌతమీ పుత్రశాతకర్ణి తిరిగి ముద్రించి జారీ చేసినవి ఉన్నాయి. వీటిని బట్టి, నహపానుని గౌతమీ పుత్రశాతకర్ణి ఓడించినట్లు నిర్ణయించొచ్చు. అటు తర్వాత, చాళుక్యుల నాణేలపై వరాహ ముద్ర ఉండడంచే, వీటిని వరాహం లేక వరాహ అని పిలిచేవారు. ఇవే కాక, పూర్వ చాళుక్యుల రాగి నాణేలు కూడా దొరికినాయి. కొంత మంది చాళుక్య రాజుల నాణేలు బర్మా, సయాంలో దొరకడం విశేషం.

విజయనగర రాజుల నాణేల మీది శాసనాలు నాగరి లిపిలోనూ, కన్నడ లిపిలోనూ ఉన్నాయి. వీటిలో 'గజబేంటకార' బిరుదులో జారీ చేయబడిన రెండో దేవరాయుల నాణేలు ముఖ్యమైనవి. విజయనగర రాజుల నాణేలపై ఉమామహేశ్వర, లక్ష్మీనారాయణ, గరుడ, హనుమాన్, వేంకటేశ బొమ్మలు చిత్రీకరింపబడ్డాయి. కృష్ణదేవరాయల బంగారు నాణేలు పరిమాణంలో చిన్నవి. కృష్ణదేవరాయల కాలంలో విజయనగర సామ్రాజ్యంలో వేరు వేరు విలువలు గల నాణేలు వాడుకలో ఉండినట్లు, విదేశీయుల రాతల వల్ల, వ్యాపారుల వృత్తాంతాల వల్ల తెలుస్తున్నాయి.

పై విధంగా నాణేలు రాజ వంశాల చరిత్రను, రాజులు అవలంబించిన మత సంప్రదాయాలను తెలియజేస్తున్నాయి. అంతేకాక, నాణేలపై చెక్కిన ప్రతిమలు, లాంఛనాలు, ఇతర చిహ్నాలు, నాణేల స్వరూపం ఆయా కాలాల ప్రజల కళాభి నిరతికి నిదర్శనాలు. ప్రతిమా లక్షణ శాస్త్ర అధ్యయనానికి ఉపకరణాలు.

1.4.2 : వాఙ్మయ ఆధారాలు

ఆంధ్ర దేశ చరిత్రకు వాఙ్మయాధారాలు తక్కువ. ఈ వాఙ్మయాధారాలను దేశీయ వాఙ్మయం, విదేశీ వాఙ్మయమని, రెండు రకాలుగా విభజించొచ్చు. దేశీయ వాఙ్మయంలో కావ్యాలు, కైఫీయత్తులు చరిత్ర రచనకు ఉపయోగమౌతాయి. విదేశీ వాఙ్మయంలో గ్రీక్ రచనలు, చైనీయుల రచనలు, ముస్లిం రచనలు ముఖ్యమైనవి.

BRAOU

Dr. BRAOU LIBRARY Acc. No. 115059 Class No.

1.4.2.1 : దేశీయ వాఙ్మయం

దేశీయ వాఙ్మయంలో మొదట చెప్పదగినది ఐతరేయ బ్రాహ్మణం. అటు తర్వాత పురాణాలు, పురాణాలలో భవిష్య, మత్స్య, వాయు, భాగవత పురాణాలు ప్రాచీనాలు. పురాణానికి ఐదు లక్షణాలు ఉన్నాయి. ఈ ఐదు లక్షణాలు సృష్టి, ప్రతి సృష్టి, వంశం, మన్వంతరం, వంశాను చరితమునేవి. ఈ ఐదు లక్షణాలలో కడపటిదైన వంశాను చరితం (Dynastic History of old kings) చరిత్ర రచనకు ఎక్కువగా ఉపకరిస్తుంది. శాతవాహనుల కాలక్రమణికకు, వీటి ఉపయోగం చాలా ఉంది. శాతవాహన రాజు హాలుడు సంకలనం చేసిన ప్రాకృత గ్రంధం **'గాథాసప్తశతి'** ఆకాలం నాటి సాంఘిక, ఆర్థిక జీవనానికి ఆధారం; వాత్స్యాయనుని **'కామసూత్రం'** నాగరికుల జీవనాన్ని ప్రతిబింబిస్తుంది. తర్వాత నన్నయ **'మహాభారత'** రచన వరకు, గ్రంథాలు లభించవు. కవి త్రయం వారు ఆనాటి సాంఘిక, మత జీవితాన్ని తమ గ్రంథంలో పేర్కొన్నారు. తిక్కన **'నిర్వచనోత్తర రామాయణాన్ని'** నెల్లూరు తెలుగు చోళ రాజైన రెండవ మనుమసిద్ధికి అంకితం చేశాడు.

ఆంధ్ర చరిత్రలో కాకతీయ యుగం నాటికి ప్రత్యేక చారిత్రక గ్రంథాలు ఉద్భవించాయి. వాటిలో ప్రతాపరుద్రుని ఆస్థానంలో కవైన విద్యానాథుడి **'ప్రతాపరుద్ర యశోభూషణం'** ప్రముఖమైంది. **'సిద్ధేశ్వర చరిత్రం',' ప్రతాప చరిత్ర', 'సోమదేవ రాజీయం',** కాకతీయుల చరిత్ర చెప్పే తెలుగు గ్రంథాలు. కానీ, ఇవి అర్వాచీనమైనవి. వీటిలో చరిత్ర కంటే ఐతిహ్యాలు ఎక్కువ కనిపిస్తాయి. **'క్రీడాభిరామం'** అనే గ్రంథం, ఆనాటి వరంగల్లు పట్టణం లోని ప్రజా జీవితాన్ని గురించి విపులంగా వివరిస్తుంది.

శ్రీనాథుడు తన **'కాశీఖండం'**లో, **'భీమఖండం'**లో రెడ్డి రాజుల ఘన కార్యాలను పేర్కొన్నాడు. అతని చాటువులు ఆనాటి పలనాడు, గోదావరి ప్రాంతాల సంస్కృతిని తెలియజేస్తాయి.

విజయనగర రాజుల కాలం నాటికి ఈ చారిత్రక గ్రంథ రచన ఎక్కువగా సాగింది. **'కంపరాయ చరిత్ర', 'కృష్ణరాయ విజయం'**. ఇందుకు ఉదాహరణలు. బండారం లక్ష్మీనారాయణుడు రాసిన **'సంగీత సూర్యోదయం'** అనే గ్రంథంలో కృష్ణదేవరాయ కళింగ జైత్రయాత్ర విపులంగా వర్ణించబడింది. **'ఆముక్త మాల్యద'**, అష్టదిగ్గజ కవుల రచనలు కూడా ఎక్కువగా ఉపకరిస్తున్నాయి. అభ్యుదయ కావ్యాలైన గంగాదేవి రచించిన **'మధురా విజయం'** లేక **'వీరకంపరాయ చరిత్రం'**, డిండిముని **'సాళువాభ్యుదయం', 'అచ్యుతరాయాభ్యుదయం',** మున్నగు గ్రంథాలు, ఎన్నో చారిత్రకాంశాలను వివరిస్తున్నాయి.

ఈ సందర్భంలో ముఖ్యంగా పేర్కొన దగినవి స్థానిక చరిత్రలు, లేక కైఫీయత్తులు. కైఫీయత్తులంటే గ్రామ చరిత్రలు. ఈస్టిండియా కంపెనీ ఉద్యోగైన మెకంజీ దొర పదిహేడో శతాబ్ది ఉత్తరార్ధంలో వీటిని రాయించడం ప్రారంభించాడు. వీటిలో ఆనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ విషయాలెన్నో పొందుపర్చబడినాయి. ఇవి ఎక్కువగా విజయనగర చరిత్ర తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి.

1.4.2.2 : విదేశీయ వాఙ్మయం

అనాది నుండి కూడా విదేశీ యాత్రికులు, పర్యటకులు మన దేశ సిరిసంపదలకు ఆకర్షితులై, మన దేశాన్ని సందర్శించి, ఆనాటి ఆర్థిక, మత, సాంఘిక పరిస్థితులను గ్రంథస్థం చేశారు. ఇట్టి విదేశీ వాఙ్మయం కూడా మన కెంతో ఉపకరిస్తున్నది. దీనిలో గ్రీక్‌ల, రోమన్‌ల, చైనీయుల, ముస్లింల రచనలు ముఖ్యమైనవి.

BRAOU

1.4.2.2.1 : గ్రీక్‌ల రచనలు

గ్రీకో-రోమన్‌ల రచనలలో మెగస్తనీస్ రాసిన **'ఇండికా'**, ప్లీనీ రాసిన **'నేచురల్ హిస్టరీ'**, టోలమీ రాసిన **'జాగ్రఫీ'**, రచయిత తెలియని "The Periplus of the Erythraean Sea" ముఖ్యమైనవి. మెగస్తనీస్, ప్లినీ, ఆంధ్రుల గురించి ప్రస్తావించారు. **'పెరిప్లస్' 'జాగ్రఫీ'** గ్రంధాల వలన, రోమ్, ఆగ్నేయ ఆసియాలతో గల సంబంధాలు తెలుస్తాయి.

1.4.2.2.2 : చైనీయ, పాశ్చాత్యేయ రచనలు

చైనీయుల రచనలలో యువాన్ రచన ముఖ్యమైంది. 7వ శతాబ్దిలో ఆంధ్ర దేశంలో ఉన్న బౌద్ధ సంఘారామాల గురించి విపులీకరణ ఈతని గ్రంధంలో ఉంది. యువాన్ చ్వాంగ్ తర్వాత ఆంధ్ర దేశానికి వచ్చిన యాత్రీకుడు, మార్కోపోలో అను ఇటలీ దేశస్థుడు. ఇతడు కాకతీయుల రేవు పట్టణమైన మోటుపల్లి గురించి, ఆప్రాంతపు రాణి గురించి విశేషాలను చెప్పాడు.

విజయనగర సామ్రాజ్యాన్ని గురించి ఎందరో పాశ్చాత్య దేశీయులు రాశారు. వీరిలో ఇబ్నుబతూతా ఆద్యుడు. ఇతడు మహమ్మద్ బిన్ తుగ్లక్ కాలం నాటి విశేషాలను, హరిహర, బుక్కరాయల రాజ్య స్థాపన గురించి రాశాడు.

ఇటలీ దేశస్థుడైన నికోలోకాంటి విజయనగర ప్రాంతాలను పర్యటించి, విజయనగర ఆస్థానం గురించి, వేడుకల గురించి ప్రస్తుతించాడు.

అతని తర్వాత పారశీక రాయబారి అబ్దుల్ రజాక్, రెండవ దేవరాయల కాలంలో విజయనగరాన్ని సందర్శించాడు. అంతటి గొప్ప నగరం మరొకటి ఉన్నట్లు ఎప్పుడూ వినలేదు, ఎప్పుడూ చూడలేదని అబ్బుర పడ్డాడు.

వీరే కాక, పోర్చుగీస్ యాత్రీకులు పేస్, న్యూనిజ్‌లు కూడా ఎన్నతగినవారే. పేస్ రచన కృష్ణదేవరాయల వ్యక్తిత్వానికి, నాటి సామ్రాజ్య వైభవానికి, ప్రజా జీవనానికి అద్దం పడుతోంది. ముఖ్యంగా, న్యూనిజ్, విజయనగర రాజ్య స్థాపన నుండి అచ్యుత దేవరాయల కాలం వరకు, ఆరాజ్య చరిత్రను విన్న దానినిబట్టి, చూచిన దానిని బట్టి రాయడంతో, అతని రచనే విజయనగర చరిత్రలో మొదటిదైంది.

క్రీ.శ. 1565 లో జరిగిన యుద్ధాన్ని (బన్నిహట్టి), అనంతర శిధిలావస్థలో ఉన్న విజయ నగర వైభవాన్ని, సీజర్ ఫ్రెడరిక్ వర్ణించాడు.

ఆ తర్వాత క్రీ.శ. 1616 లో కొచ్చిన్ నుండి బరడాస్ రాసిన లేఖలో, 1614 నుండి విజయనగర రాజ వంశంలో సింహాసన వారసత్వానికై జరుగుతున్న అంతర్యుద్ధాన్ని చక్కగా విశ్లేషించి, విపులంగా వివరించాడు.

1.4.2.2.3 : ముస్లిం రచనలు

విజయనగర చరిత్రకు ఉపయోగపడే ముస్లిం రచనలలో ముఖ్యంగా పేర్కొనదగినవి, జియా ఉద్దీన్ బరనీ, షామ్స్-ఇ-సిరాజ్ అఫీఫ్‌లు వేర్వేరుగా రాసిన, **'తారీఖ్-ఇ-ఫిరోజ్‌షాహీలు'**, నిజామ్ ఉద్దీన్ అహమ్మద్ బక్షిరాసిన **'తబకాత్ - ఇ- అక్బరీ'**, ఫెరిష్టా రాసిన **'తారీఖ్-ఇ- ఫెరిష్టా'**, సయ్యద్ అలీ

BRAOU

రాసిన 'బుర్హాన్-ఇ-మాసిర్' ముఖ్యమైనవి. వీటిలో ఎన్నో విషయాలు గోరంతవి కొండంతలుగా చెప్పినా, సుల్తాన్‌ల విజయాలను తెలుపుతున్నాయి గనుక, మిగతా ఆధారాలతో పోల్చి, సరైన వాటిని గ్రహించొచ్చు.

1.5 : సంగ్రహంగా

ఈ విధంగా ఆంధ్ర దేశ చరిత్రను పునర్నిర్మించడానికి పురావస్తు శాస్త్రజ్ఞుల కృషి ఫలితంగా వెలుగులోకి వచ్చిన కట్టడాలు, శాసనాలు, నాణేలు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. ఇవే కాక, వాఙ్మయాధారాలైనటువంటి దేశీయ, విదేశీయ రచనలు కూడా ఎంతగానో దోహదపడుతున్నాయి. వాఙ్మయాధారాలను, పురావస్తు ఆధారాలతో సమన్వయపర్చి, నిశిత దృష్టితో పరిశీలించడం ద్వారా, చరిత్రను పునర్నిర్మించడం జరుగుతుంది.

ఈ చరిత్రను చరిత్ర పూర్వ యుగం (Pre-History), పురా చారిత్రక యుగం (Proto- History), చారిత్రక యుగాలు (Historical Period)గా విభజించటం జరిగింది.. మొదటి భాగంలో చరిత్ర రచనకు ఆధారాల గురించి చర్చించటం జరిగింది. రెండో భాగంలో చరిత్ర పూర్వ యుగపు, పురా చారిత్రక యుగపు విశేషాలను గురించి తెలుసుకుందాం.

1.6 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయుండి.

1. ఆంధ్రప్రదేశ్ భౌగోళిక పరిస్థితులు, ఆంధ్రుల చరిత్రపై వాటి ప్రభావాన్ని వేర్కొనండి.
2. ఆంధ్ర దేశ చరిత్ర రచనకు పురావస్తు ఆధారాలు ఎంతవరకు ఉపయోగమో తెలపండి.
3. ఆంధ్ర దేశ చరిత్ర రచనలో వాఙ్మయాధారాల పాత్ర ఎట్టిది?

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయుండి.

1. ఆంధ్ర, తెలుగు పదాల ఉత్పత్తిని సమీక్షించండి.
2. పురావస్తు త్రవ్వకాలు ఆంధ్రుల చరిత్ర రచన కెలా ఉపకరిస్తున్నాయి?
3. శాతవాహనుల కాలం నాటి శాసనాల చారిత్రక ప్రాధాన్యతను తెల్పండి.
4. కాకతీయ, విజయనగర శాసనాల లోని చారిత్రక విషయాలను పరిశీలించండి.
5. శాతవాహన నాణే లందిస్తున్న చారిత్రక విషయాలెవ్వి?
6. వైదేశీయ, పాశ్చాత్యేయ యాత్రీకుల రచనల చారిత్రక ప్రాధాన్యతను వివరించండి.

BRAOU

1.7 : ఉపయుక్త గ్రంథాలు

Nilakanta Sastri, K.A.	:	**Historical Method in relation to Indian History**
Do	:	**A History of South India**
Do	:	**Sources of Indian History**
Nilakanta Sastri, K.A., Venkataramanayya, N.	:	**Further Sources of Vijayanagar History, Vols. II & III**
Ranga Swami Saraswati, A (ed. by. S.k. Aiyangar)	:	**Sources of Vijayanagar History.**

రచయిత్రి : ఆచార్య అన్నాప్రగడ కమలవాసిని

BRAOU

భాగం-2 : చరిత్ర పూర్వ, పురా చారిత్రక యుగాలు

విషయక్రమం

2.0 : లక్ష్యాలు

2.1 : పరిచయం

2.2 : చరిత్ర పూర్వ యుగం : నిర్వచనం

2.2.1 : చరిత్ర పూర్వ యుగం : భాగాలు

2.2.2 : ప్రాచీన శిలా యుగం

2.2.2.1 : పూర్వ ప్రాచీన శిలా యుగం

2.2.2.2 : మధ్య ప్రాచీన శిలా యుగం

2.2.2.3 : ఉత్తర ప్రాచీన శిలా యుగం

2.2.3 : మధ్య శిలా యుగం

2.2.4 : నవీన శిలా యుగం

2.3 : పురా చారిత్రక యుగం : నిర్వచనం

2.3.1 : పురా చారిత్రక యుగం : భాగాలు

2.3.2 : తామ్ర శిలా యుగం

2.3.3 : అయో యుగ సంస్కృతి

2.3.4 : బృహచ్ఛిలా యుగం

2.4 : సంగ్రహంగా

2.5 : పరీక్ష నమూనా ప్రశ్నలు

2.6 : ఉపయుక్త గ్రంధాలు

2.0 : లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం వలన చరిత్ర పూర్వ యుగం (Pre-Historical Period) పురా చారిత్రక యుగ (Proto-Historical Period) మంటే ఏమిటో, వాటిలో గల వివిధ దశల్ని, ఆ కాలం ప్రజలు వాడిన పనిముట్లను, వాటిని తయారుచేసే పద్ధతుల్ని, వాటి ఆధారంగా ఆనాటి జీవన విధానాన్ని, అది లభ్యమైన తావుల్ని గురించి తెలుసుకోగలగాలి.

BRAOU

2.1 : పరిచయం

మానవుడు లిపిని కనుక్కోవటానికి ముందు గల కాలాన్ని చరిత్ర పూర్వ యుగమని, పురా చారిత్రక యుగమని పిలుస్తారు. క్రిష్టియన్ జర్గెన్‌సెన్ థామ్సెన్ (Christian Jurgensen Thomsen) అనే డెన్మార్క్ దేశపు మ్యూజియమ్ క్యురేటర్, 1836లో మానవ చరిత్రను మూడు దశలుగా విభజించాడు. అవి: (1) శిలా యుగం (Stone Age); (2) తామ్ర యుగం (Bronze Age); (3) ఇనుప యుగం (Iron Age). ఇతనిని ఐరోపా ఖండ ప్రాక్ చరిత్ర పితామహునిగా భావించొచ్చు. ఈ కాలంలో ప్రపంచ చరిత్రను పురాతన, మధ్య కాల, నవీన కాలపు చరిత్రలుగా విభజించారు. తర్వాత 19వ శతాబ్ది మధ్య కాలంలో, ప్రాక్ చరిత్ర, లేక చరిత్ర పూర్వ యుగ మనే పదాన్ని మొదటి సారిగా డేనియల్ విల్సన్ (Daniel Wilson) అనే శాస్త్రజ్ఞుడు 1851 లో వాడాడు.

2.2 : చరిత్ర పూర్వ యుగం : నిర్వచనం

చరిత్ర పూర్వ యుగ మంటే, మానవుడు పుట్టినప్పటి నుండి లిపిని కనుక్కొనే వరకు జరిగిన సాంకేతిక, సాంస్కృతిక, సామాజిక పరిణామాల పరిశీలన. చరిత్ర కందని ఈ మానవుడు పశు ప్రాయుడు. జంతువులను వేటాడి, పచ్చి మాంసాన్ని, పళ్ళు, కూరలను భుజించేవాడు. ఇతను పూర్తిగా సంచార జీవి. నదుల వెంబడి, కోనల వెంబడి తిరుగుతూ, తనకు లభ్యమైన ఆహారంతో తృప్తి పడేవాడు. ఇతనిని ఆదిమ మానవుడు (Early Man), లేక ప్రాక్ చరిత్ర కాలం నాటి మానవు (Pre-Historic Man) డని పిల్చేహారు. ఆదిమ మానవుని సామాజిక విధానాన్ని నిర్ణయించడానికి, అతడు నిత్యం వాడిన పనిముట్లే ఆధారం. ఈ పనిముట్లాధారంగా, చరిత్ర పూర్వ యుగాన్ని పురాతత్వ శాస్త్రజ్ఞులు ముఖ్యంగా, మూడు భాగాలుగా విభజించారు.

BRAOU

2.2.1 : చరిత్ర పూర్వ యుగం : భాగాలు

చరిత్ర పూర్వ యుగాన్ని, అనాటి మానవుడు ఉపయోగించిన రాతి పరికరాల స్వరూపాన్ని బట్టి (Typology), వాటిని తయారు చేసే పద్ధతిని (Technology) బట్టి, మూడు దశలుగా విభజించారు.

చరిత్ర పూర్వ యుగం

1. ప్రాచీన శిలా యుగం	మధ్య శిలా యుగం	నవీన శిలా యుగం
(Palaeolithic Age)	(Mesolithic Age)	(Neolithic Age)

ప్రాచీన శిలా యుగం

ప్రాచీన శిలా యుగమన్న మాట, గ్రీక్ భాష నుండి వచ్చింది. గ్రీక్ భాషలో 'పాలియో' అంటే ప్రాచీనమైన, 'లిథిక్' అంటే శిల అనీ అర్థం. అందుచేతనే, మానవ నాగరికత లోని మొదటి దశకు ప్రాచీన శిలా యుగ మని పేరు. ఈ యుగంలో మానవుడు పశు ప్రాయుడు. ఇతనికి ఆహారాన్ని పండించుకొనే తెలివి లేదు. ప్రకృతి మీద పూర్తిగా ఆధారపడేవాడు. ఎక్కువగా రాతి పరికరాలను వాడేవాడు. ఈ పరికరాలలో వచ్చిన క్రమ పరిణామాన్ని బట్టి, అతి దీర్ఘమైన ప్రాచీన

శిలా యుగాన్ని మూడు ఉప యుగాలుగా విభజించారు. అవి : (i) పూర్వ ప్రాచీన శిలా యుగం (Lower Palaeolithic Period); (ii) మధ్య ప్రాచీన శిలా యుగం (Middle Palaeolithic Period); (iii) ఉత్తర ప్రాచీన శిలా యుగం (Upper Paleolithic Period).


మధ్య శిలా యుగం

ప్రాచీన శిలా యుగానికి, నవీన శిలా యుగానికి మధ్య కాలాన్ని, మధ్య శిలా యుగ మని పిలుస్తారు. ఈ యుగంలో శిలా పరికరాలు పరిణామంలో చిన్నవి కావటంచేత, దీనిని సూక్ష్మ శిలా యుగ (Microlithic Period) మని కూడా అంటారు. ఈ యుగంలో వాడబడే కొన్ని పరికరాలను (త్రిభుజాలు - Triangles, అర్ధ చంద్రాకారాలు - Lunates, ట్రపీజమ్‌లు Trapezes) బట్టి, ఈ యుగాన్ని తిరిగి, నియతాకృతి లేని సూక్ష్మ శిలా యుగం (Non-Geometric Period); నియతాకృతి కలిగిన సూక్ష్మ శిలా యుగ (Geometric Microlithic Period) మని, రెండు రకాలుగా పునర్వర్గీకరించారు. అంతేకాక, మృణ్మయ పాత్రల ఆధారంతో కూడా, దీనిని రెండు రకాలుగా విభజించారు. అవి: కుమ్మరి పని తెలియని సూక్ష్మ శిలా యుగం (Pre-Pottery Microlithic Period); కుమ్మరి పని తెలిసిన సూక్ష్మ శిలా యుగం (Pottery Microlithic Period). మధ్య శిలా యుగ మానవుడు ఎక్కువగా వేట మీద, చేపలు పట్టడం మీద, ఆధారపడి జీవించటం వలన, అతనిని వేటగాడు - మత్స్యకారుడు (Hunter-fisher) అని పిలిచేవారు.

నవీన శిలా యుగం

మధ్య శిలా యుగం తర్వాతి దశ, నవీన శిలా యుగం. నవీన శిలా యుగ మనేది 'Neolithic' అనే గ్రీక్ పదం నుండి ఉద్భవించింది. గ్రీక్ భాషలో 'Neo' అనగా క్రొత్త, లేక నవీన మని అర్థం. అందుచేతనే, దీనిని నవీన శిలా యుగ మని అంటారు. ఈ దశలో మొట్టమొదటి సారిగా మానవుడు ఆహారాన్ని పండించటం మొదలుపెట్టాడు. అందుచేతనే, గార్డెన్ చైల్డ్ (Gorden Childe) ఈ మార్పును ఒక గొప్ప విప్లవమని చెప్పాడు. ప్రకృతి మీద ఆధారపడటమనేదానికి పూర్తిగా స్వస్తి చెప్పి, ఆహారాన్ని తనకు తానే స్వయంగా పండించుకోవడం ప్రారంభించడం, ఈ యుగ విశేషం. ఈ నవీన శిలా యుగంలో ఆహారోత్పత్తికి వ్యవసాయాన్ని సాగించేవారు కాబట్టి, దీనిని వ్యావసాయిక విప్లవ (Agricultural Revolution) మని, వ్యవసాయానికి ముఖ్యమైన చెట్లు సాధారణంగా ఆకుపచ్చగా ఉంటాయి కాబట్టి, దీనిని హరిత విప్లవ (Green Revolution) మని కూడా పిలిచేవారు. ఈ యుగంలో ఆహారోత్పత్తితోపాటుగా కుండలు చెయ్యడం, జంతువులను మచ్చిక చెయ్యటాన్ని కూడా చేసేవారు. ఈ నవీన శిలా యుగాన్ని ముఖ్యంగా రెండు దశలుగా విభజించొచ్చు. అవి : (i) కుమ్మరి పని తెలియని నవీన శిలా యుగం (Pre-pottery Neolithic Age); (ii) కుమ్మరి పని తెలిసిన నవీన శిలా యుగం (Pottery Neolithic Age). ఈ కుమ్మరి పని తెలిసిన నవీన శిలా యుగాన్ని, తిరిగి మూడు ఉప దశలుగా విభజించారు. అవి : ప్రారంభ దశ, పరిపక్వ దశ, క్షీణ దశ. వీటినే Lower or Basal Neolithic ప్రారంభ దశ; Middle or Mature Neolithic (పరిపక్వ దశ); Upper or Late Neolithic (క్షీణ దశ) అని కూడా అంటారు. ఈ విధంగా చరిత్ర పూర్వ యుగాన్ని పురాతత్వ శాస్త్రజ్ఞులు ఆనాటి మానవుడు వాడిన పనిముట్లాధారంతో, వాటి క్రమ పరిణామాన్ని గుర్తించి, మూడు ముఖ్య యుగాలుగా విభజించారు. వాటిని అధ్యయన సౌలభ్యం కోసం, ఉప యుగాలుగా కూడా విభజించటం జరిగింది. ఈ క్రింది పట్టిక (Chart) ను చదవడం ద్వారా, చరిత్ర పూర్వ యుగంలో గల వివిధ దశలు, ఉప దశలను మనం తెలుసుకోగలం.

BRAOU



BRAOU

2.2.2 : ప్రాచీన శిలా యుగం

ప్రాక్ చరిత్రను ప్రాచీన శిలా యుగం, మధ్య శిలా యుగం, నవీన శిలా యుగమని విభజించినట్లు, ప్రాచీన శిలా యుగాన్ని కూడా పూర్వ ప్రాచీన, మధ్య ప్రాచీన, ఉత్తర ప్రాచీన శిలా యుగాలుగా, తిరిగి పునర్వర్గీకరించినట్లు తెలుసుకున్నాం. ఈ మూడు దశలకు చెందిన శిలా యుగపు పనిముట్లు ఇంచుమించు ఆంధ్రప్రదేశ్ లోని జిల్లా లన్నిటి లోనూ దొరికాయి. కర్నూల్ జిల్లా లోని నదులు, వాగుల పెంబడి, పాత శిలా యుగపు పనిముట్లు ఎన్నో దొరికాయి. ఈ వివిధ దశలకు చెందిన పనిముట్లు గురించి, అవి లభ్యమైన తావుల గురించి, నాటి జీవన విధానాన్ని గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

2.2.2.1 : పూర్వ ప్రాచీన శిలా యుగం

ఆంధ్రప్రదేశ్‌లో కడప బేసిన్ అత్యంత ప్రాచీనమైంది. కర్నూల్, కడప, చిత్తూర్, అనంతపురం జిల్లాలను, నెల్లూర్, ప్రకాశం, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల లోని కొన్ని ప్రాంతాలను కలిపి, కడప బేసిన్ అంటారు. ఈ ప్రాంతంలో పూర్వ ప్రాచీన శిలా యుగ పరికరాలు విరివిగా లభ్యమయ్యాయి. వీటిని కనుగొనిన వారిలో, రాబర్ట్ బ్రూస్ ఫుట్ ముఖ్యుడు. ఇతడు కర్నూల్, కడప, అనంతపురం జిల్లాలలో, ఈ పరికరాలను కనుగొన్నాడు. కమియాడే, బర్కిట్టు, మాన్లి, వేటర్‌సన్, జాయినర్,

కృష్ణస్వామి, సౌందర రాజన్, బెండపూడి సుబ్బారావ్ మొదలైన వారు, రెండు దశాబ్దాల క్రితం వరకు, పరిశోధనలను జరిపారు. ఇటీవలి కాలంలో సంకాలియా, ఐజాక్, యన్. నాగభూషణరావ్, యమ్, యల్. కె. మూర్తి, కె. తిమ్మారెడ్డి మొదలైన వారు, విశేషమైన పరిశోధనలను జరిపి, పూర్వ ప్రాచీన శిలా యుగ స్థావరాలను కనుగొన్నారు.

భారతదేశంలో ఈ సంస్కృతిని, ఉత్తర భారతదేశానికి చెందిన గులక రాతి సంస్కృతి (North Indian Pebble Tool culture) అని, దక్షిణ భారతదేశానికి చెందిన చేతి గొడ్డళ్ళ పరిశ్రమ (South Indian Hand-axe Industry) అనీ, పిలుస్తారు. కాగా, ఆంధ్రప్రదేశ్ లోని ఈ సంస్కృతి, ఈ రెండు సంస్కృతుల మిశ్రమంగా కనిపిస్తోంది. ఈ యుగానికి చెందిన రాతి పనిముట్లు ఎక్కువగా Quartz, Quartzite లతో తయారుచెయ్యబడ్డాయి. ఇవి కర్నూల్ జిల్లాలోని కర్నూల్, ద్రోణాచలం, బేతంచెర్ల, రాళ్ళవాగు ఒడ్డున, ఎఱ్ఱగొండపాలెం లోనూ, సగిలేరు నదీ లోయ లోని గిద్దలూరు, కృష్ణా లోయ లోని నాగార్జునకొండ, ఏలేశ్వరం, కారెంపూడి మొదలైన ప్రదేశాలలో లభ్యమయ్యాయి.

పూర్వ ప్రాచీన శిలా యుగానికి చెందిన మానవులు గులక రాతి పనిముట్లు (pebble tools); చేతి గొడ్డళ్ళు (hand axes); గుండ్రగొడ్డళ్ళు (Cleavers); చక్రాలు (discoids) మొదలైన పరికరాలను ఎక్కువగా వాడేవారు.

పూర్వ ప్రాచీన శిలా యుగానికి చెందిన మానవుడు తన పనిముట్లను తయారుచెయ్యటానికి, ముఖ్యంగా మూడు రకాల పద్ధతులను వాడాడు. అవి : రాతి సుత్తి పద్ధతి (Stone- hammer technique); దాగలి పద్ధతి (anvil technique); స్థూపాకార సుత్తి పద్ధతి (Cylinder-hammer technique) అనేవి. పూర్వ ప్రాచీన శిలా యుగంలో లభ్యమైన చేతి గొడ్డళ్ళను బట్టి, వీటిని మూడు సముదాయాలుగా విభజించొచ్చు. మొదటి సముదాయానికి చెందిన పరికరాలు దాగలి వాడే పద్ధతి తోనూ, రెండో సముదాయ పరికరాలు రాతి సుత్తి పద్ధతి తోనూ, మూడో సముదాయానికి చెందినవి స్థూపాకార సుత్తి పద్ధతి తోనూ తయారుచెయ్యబడ్డాయి. ఈ యుగంలో మానవునకు కుండలు చెయ్యటం, నిప్ప చెయ్యటం వంటివి తెలియవు. తన ఆహారానికై ప్రకృతి మీద పూర్తిగా ఆధారపడి, దేశ దిమ్మరివలె ఎక్కడ ఆహారం దొరికితే అక్కడికి చలస వెళ్తూ జీవించేవాడు.

BRAOU

2.2.2.2 : మధ్య ప్రాచీన శిలా యుగం

పూర్వ ప్రాచీన శిలాయుగం తర్వాతి దశ, మధ్య ప్రాచీన శిలా యుగం. కొన్ని సంవత్సరాల క్రితం వరకు, భారతదేశంలో ఈ సంస్కృతి విలసిల్లలేదనే భావన ఉండేది. కాని, 1954-55 లో మహారాష్ట్ర లోని నవాసా అనే గ్రామంలో, హెచ్.డి. సంకాలియా అనే పురాతత్వ శాస్త్రజ్ఞుడు, ఈ యుగానికి చెందిన పరికరాలను కనుగొన్నాడు. ఈ సంస్కృతిని నెవాసియన్ (Nevasian) సంస్కృతని కూడా అంటారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, కడప, చిత్తూర్, గిద్దలూర్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలలో, మధ్య ప్రాచీన శిలాయుగపు పనిముట్లు లభ్యమయ్యాయి.

మధ్య ప్రాచీన శిలా యుగ పరికరాలను తయారుచెయ్యటానికి క్వార్ట్, క్వార్ట్‌జైట్‌తోపాటుగా, అగేట్, జాస్పర్‌ను కూడా వాడడం జరిగింది. మూలం నుండి పెచ్చులను (flakes) విడదీసి, వాటితో పరికరాలను తయారుచేసేవారు. ఈ యుగానికి చెందిన ముఖ్యమైన పనిముట్లు, గోకుడురాళ్ళు, సూచికలు, చిద్రకాలూ, చిన్ని చేతి గొడ్డళ్ళూను. ఈ యుగానికి చెందిన పరికరాల పరిమాణం, పూర్వ ప్రాచీన శిలా యుగపు పనిముట్ల కంటే చాలా తక్కువ. ఈ పరికరాలను తయారు

చెయ్యటానికి, పూర్వ ప్రాచీన శిలా యుగంలో వాడిన పద్ధతులనే, ఎక్కువగా వాడేవారు. మధ్య ప్రాచీన శిలా యుగం నాటికి, మానవుడు పరికరాల తయారీలో కొన్ని అభివృద్ధికరమైన మార్పులను సాధించినట్లు కనిపిస్తుంది. గోకుడు రాళ్ళు చెట్ల బెరళ్ళను, జంతువుల తోళ్ళను శుభ్రపర్చటానికి, నునుపు చేయటానికి పనికివచ్చేవి. మొనలను కొయ్యకు కాని, ఎముకకు కాని బిగించి, జంతువుల వేటలో వినియోగించేవారని ఊహించొచ్చు. పై పరిశీలన వలన, మధ్య ప్రాచీన శిలా యుగ మానవుని జీవన విధానంలో కూడా కొంత మార్పు కలిగినట్లు, ఊహించొచ్చు. పరికరాల తయారీలో కూడా, కొంత సాంకేతికమైన అభివృద్ధిని అతడు సాధించినట్లు నిర్ణయించొచ్చు.

2.2.2.3 : ఉత్తర ప్రాచీన శిలా యుగం

ప్రాచీన శిలా యుగంలో చివరి దశను, ఉత్తర ప్రాచీన శిలా యుగ మంటారు. ఆంధ్రప్రదేశ్‌లో యమ్. యల్. కె. మూర్తి, కె. తిమ్మారెడ్డిగార్లు, బిల్లా సర్గం, బేతంచెర్ల గుహల లోను, రేణిగుంట, ఎట్టగొండపాలెం, నాగార్జునకొండ, చింతమానుగయి మొదలైన చోట్ల, ఉత్తర ప్రాచీన శిలా యుగ పరికరాలను కనుగొన్నారు. శిలలతోపాటుగా, ఎముకలను కూడా వాళ్ళు పనిముట్లు తయారు చెయ్యటానికి వాడారని మనకు నిదర్శనాలున్నాయి. ఈ పరిశ్రమను బ్లేడ్ బ్యూరిన్ పరిశ్రమని కూడా అంటారు. మూర్తి, తిమ్మారెడ్డి గార్లు బేతంచెర్ల పరిసర ప్రాంతాల లోనూ, బిల్లాసర్గం ప్రాంతాల లోను, తవ్వకాలను జరిపారు. ఈ తవ్వకాలలో రాతి పరిశ్రమకు చెందిన బ్లేడ్‌లు, పెచ్చులు, మొనలు, మూలాలు మొదలైనవి, గుహలలో దొరికాయి. ఈ పరికరాలను తయారు చెయ్యటానికి, అతడు బ్లేడ్ ఫ్లేక్ పద్ధతిని ఎక్కువగా వాడేవాడు.

రాతి పరికరాలతోపాటు, ఎముకలతో చేసిన పరికరాలను కూడా వాడినట్లుగా తెలుస్తోంది. ఈ రాతి, ఎముకల పరికరాలను బట్టి, నాటి మానవుని జీవన విధానాన్ని ఊహించొచ్చు. బాణపు మొనలను, ఈటెలను, జంతువులను వేటాడటానికి, గోకుడు రాళ్ళను, బ్లేడ్‌లను మాంసాన్ని ముక్కలుగా కొయ్యటానికి, చర్మాన్నుండి వేరు చెయ్యటానికి, వాడి ఉండొచ్చు. సూది మొన గల పరికరాలతో, చెట్ల ఆకులను కుట్టి, దుస్తులుగా ఉపయోగించేవారని తెలుస్తోంది. విల్లంబులను మొదటిసారిగా వాడినది వీరే. తవ్వకాలలో బయల్పడిన శిలాజాలలో, దుప్పి, అడవి పంది, ఎనుపోతు, గుర్రం ముఖ్యమైనవి. పై శిలాజాలను భారత ప్రభుత్వ భూగర్భ శాఖకు చెందిన జంతు శిలాజాల నిపుణుడు, కె. ఎస్. ప్రసాద్ పరీక్షించి, ఈ యుగం ప్లైస్టోసీన్ చివరి దశని చెప్పాడు. అంటే, ఈ సంస్కృతి సుమారు క్రీ.పూ. 20,000 నుండి క్రీ.పూ. 10,000 మధ్య కాలం వరకు, విలసిల్లిందని చెప్పొచ్చు.

పై పరిశీలన వలన, ప్రాచీన శిలా యుగంలో మూడు దశలున్నాయని, వాటి విభజన ముఖ్యంగా వాళ్ళుపయోగించిన పరికరాల స్వభావాన్ని బట్టి జరిగిందని తెలుస్తోంది. పూర్వ ప్రాచీన శిలా యుగ మానవుడు దేశదిమ్మరి. నిప్పు చేయటం కాని, బట్ట కట్టడం కాని, అతనికి తెలియదు. మధ్య ప్రాచీన శిలా యుగ మానవుడు సాంకేతికంగా కొంత అభివృద్ధి చెందాడు. ఉత్తర ప్రాచీన శిలా యుగంలో వేటాడటం అతని ముఖ్య జీవనోపాధి. అందువలననే, అతడు రాతి పరికరాలతోపాటుగా, ఎముకలతో కూడా పనిముట్లను తయారుచేసుకొన్నాడు.

2.2.3 : మధ్య శిలా యుగం

మధ్య శిలా యుగం, ఉత్తర ప్రాచీన శిలా యుగం తర్వాతి కాలం. ఇది ఆహార అన్వేషైన ప్రాచీన కాలానికి, ఆహారోత్పత్తి దశకు చెందిన నవీన కాలానికి, మధ్య నుండటం వలన, దీనిని

BRAOU

మధ్య శిలా యుగమని పిలుస్తారు. ఈ యుగం లోని పనిముట్లు, చాలా అల్ప ప్రమాణాలు. అందుచేతనే, దీనిని సూక్ష్మ శిలా యుగ మని కూడా అంటారు. ఈ యుగంలో సాంకేతిక అభివృద్ధి బాగా జరిగింది. మారిన కాలపు పరిస్థితులకు అనుగుణంగా, ఈ మానవుని జీవన విధానంలో కూడా మార్పులొచ్చాయి. ఈ సంస్కృతిని ముఖ్యంగా, ఐదు రకాలుగా విభజించారు. అవి : (1) ఉత్తర భారతదేశపు మధ్య శిలా యుగం. ఇది సరై నిహారరై వద్ద కనుగొనబడింది. ఇక్కడ ప్రజలు గోతులలో నివసించేవారు ; (2) దక్షిణ భారతదేశానికి చెందిన టెరై సంస్కృతి; ఇది ముఖ్యంగా తిరునల్వేలి జిల్లాలో లభ్యమైంది; (3) మధ్య భారత దేశానికి చెందిన సంస్కృతి; ఇది చరిత్ర పూర్వ యుగపు చిత్తరువులకు కాణాచి; భీమ్‌బేట్కా, ఆదంగడ్ గుహలలో, ఈ చిత్తరువులు లభ్యమైనాయి; (4) పశ్చిమ భారతదేశానికి చెందిన మధ్య శిలా యుగ సంస్కృతి; ఇది ముఖ్యంగా లాంఘ్‌నాజ్ వద్ద లభ్యమైంది; (5) తూర్పు భారతదేశానికి చెందిన బిర్భాన్‌పూర్; ఇక్కడ కనుగొనబడిన కుండ రంధ్రాలు (pot holes) ఆ రోజులలో గుండ్రటి పాకలను (Circular huts) వేసి ఉండొచ్చునని తెలియ చేస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ పరిశ్రమ గుంటూర్, కర్నూల్, కడప, చిత్తూర్, అనంతపురం, నెల్లూర్ జిల్లాల లోని నదీ తీరాల లోనూ, ఇసుక తిన్నెల వద్ద, లభ్యమైనాయి.

ఈ యుగంలో ఎక్కువగా త్రిభుజాకారాలు, చతుర్భుజాలు, బాణపు మొనలు, అర్ధచంద్రాకారాలు, మొనలు, గోకుడు రాళ్ళను ఉపయోగించేవారు. వీటిని తయారుచెయ్యటానికి బ్లేడ్-ఫ్లేక్ పద్ధతిని, సెకండరీ ఫ్లేకింగ్ పద్ధతిని (తిరిగి పెచ్చులు తీసే విధానాన్ని) ఎక్కువగా వాడేవారు. ఈ పరికరాలను చెర్ట్, అగేట్, జాస్పర్, చాల్సిడోనీ మొదలగు ముడి పదార్థాలతో తయారుచేసేవారు. ఈ పరికరాలను సూక్ష్మ దృష్టితో పరిశీలించటం ద్వారా, ఈ మానవునికి వేటాడటం, చేపలు పట్టడం, ముఖ్య వృత్తని తేలుతోంది.

తవ్వకాలలో బయల్పడిన శిలాజాలలో, పెంపుడు కుక్కలు, మూపుర మున్న భారతదేశపు ఎద్దులు (Indian humped bull), నీటి దున్నపోతు, మేక, పెంపుడు గొర్రె ముఖ్యమైనవి.

ఈ మధ్య శిలా యుగంలో మధ్య భారతదేశం లోని కొన్ని గుహలలో, చరిత్ర పూర్వ యుగపు చిత్తరువులు కొన్ని లభ్యమైనాయి. ఈ చిత్రాలు మహాదేవ్ కొండ గుహల లోనూ, పాచ్‌మార్హి కొండ గుహల లోను కనుగొనబడ్డాయి. ఇక్కడ పరిశోధనలను చేసిన వారిలో, వకాంకర్ ముఖ్యుడు. ఈ గుహలలో గోడల మీద ఎరుపు, నారింజ పండు రంగు, ధూమ్ర వర్ణాలలో, అనేక చిత్రాలు చాలా ఆకర్షణీయంగా కనబడతాయి. నాటి వేట విధానం, వేటాడే జంతువులు, విల్లంబులను ధరించటాన్ని ఎక్కువగా చిత్రించేవారు. ఈ చిత్రాలలో అడవి గాడిద, అడవి ఎనుము, గుర్రం, ఖడ్గమృగం, కుక్క, లేడి మొదలైన జంతువులు ముఖ్యమైనవి. ఈ చరిత్ర పూర్వ యుగపు చిత్తరువులు, ఆంధ్రప్రదేశ్ గుహలలో కూడా అరుదుగా కనబడ్డాయి.

2.2.4 : నవీన శిలా యుగం

అల్ప ప్రమాణ పరికరాలలో ఆహార సంగ్రాహక జీవన విధానాన్ని (Food-gathering way of life) గడిపిన మధ్య శిలా యుగపు మానవ సమాజాలు, క్రీ.పూ. 9000 సంవత్సరాలకంతా నవ ధాన్య సేకరణ, పశు పోషణను మొదలుపెట్టాయి. నవీన శిలా యుగాన్ని మానవ జీవిత వ్యవసాయిక జీవన చరిత్రలో తొలి అధ్యాయమనొచ్చు. మానవుని వ్యావసాయిక, పశు పోషణ ఆర్థిక వ్యవస్థ (Agrarian and cattle- rearing economy) నవీన శిలాయుగ కాలం తోనే ప్రారంభమౌతుంది.

BRAOU

నవీన శిలా యుగపు ముఖ్య లక్షణాలు : (1) పల్లెలలో, లేదా గ్రామాలలో స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకోవడం; (2) జంతువులను మచ్చిక చెయ్యటం; (3) ధాన్యపు మొక్కలను పెంచడం; (4) నునుపు చేసిన రాతి పరికరాలను తయారు చెయ్యడం; (5) కుండలను చేయడం మొదలైనవి.

ఈ నవీన శిలా యుగం మొదటిసారిగా పశ్చిమ ఆసియాలో ప్రారంభించబడింది. భారతదేశంలో దీనిని మూడు రకాలుగా విభజించారు. అవి: ఉత్తర భారతదేశపు నవీన శిలా యుగం, దక్షిణ భారతదేశపు నవీన శిలాయుగం, తూర్పు భారతదేశపు నవీన శిలా యుగమనేవి. వీటిలో, దక్షిణ భారతదేశపు నవీన శిలా యుగం అతి ముఖ్యమైంది. దక్షిణ భారతదేశపు నవీన శిలా యుగ స్థావరాలలో, బ్రహ్మగిరి, సంగనకల్లు, పిక్లీహాల్, మాస్కి, తెక్కలికోట, హల్లూర్, ఉట్నూర్, కుపగల్, పాలవాయి, టి. నర్సపూర్, నాగార్జునకొండ, పాయంపల్లి ముఖ్యమైనవి.

ఈ నవీన శిలా యుగపు పరికరాలను, వ్యవసాయపు పనిముట్లు, గృహోపకరణమైన పనిముట్లని, రెండు రకాలుగా విభజించొచ్చు. వ్యవసాయపు పనిముట్లలో, రాతితో చేసిన కత్తులు, కొడవళ్ళు, గొడ్డళ్ళు ముఖ్యమైనవి. గుండ్రటి రాళ్ళు (ring stones) కూడా ఎక్కువగా వాడబడ్డాయి. గృహోపకరణాలైన పనిముట్లలో, కల్వాలు, నూరుడు రాళ్ళు, సన్నికళ్ళు, ధాన్యపు పొరలను తొలగించటానికి ఉపయోగించే రోకళ్ళు, రోళ్ళు ముఖ్యమైనవి.

నవీన శిలా యుగపు సంస్కృతిని పురాతత్వ శాస్త్రజ్ఞులు మూడు దశలుగా విభజించారు. అవి: ప్రారంభ దశ, పరిపక్వ దశ, క్షీణ దశలు. ప్రారంభ దశలో వీరు నునుపు తేలిన రాతి గొడ్డళ్ళను, బ్లేడ్‌లను ఎక్కువగా వాడేవారు. చేతితో చేసిన బూడిద రంగు, లేదా ముదురు గోధుమ రంగు పాత్రలు (hand-made grey or buff brown pottery) ఎక్కువగా వాడకంలో ఉండేవి. పశువులను, గొత్తెలను, మేకలను మచ్చిక చేసేవారు. వీరి స్థావరాలు గ్రానైట్ కొండల మీద, కొండల ప్రక్క ప్రాంతాలలో ఉన్నాయి. ఈ దశ క్రీ.పూ. 2,300 నుండి క్రీ.పూ. 1800 మధ్య కాలానికి చెందినదని నిర్ణయించొచ్చు.

ఈ శిలా యుగపు రెండవ దశలో, బంక మట్టితో కట్టిన గుండ్రని ఇళ్ళు తెలిశాయి. కుండలను చేతితో కాక, సారె మీద తయారుచేసేవారు. రంధ్రయుక్త పాత్రలు (perforated vessels), కొమ్ము చెంబు వంటి మట్టి పాత్రలను ప్రవేశపెట్టారు. మృణ్మయ పాత్రలు సంఖ్య లోను, నిపుణతలో కూడా, అభివృద్ధిని పొందాయి. కుండల పైన రకరకాల రంగులతో చిత్తరువులను చిత్రించారు. అన్నిట అభివృద్ధి గణనీయంగా ఉండటంతో, ఈ దశను పరిపక్వ దశగా పిలుస్తున్నారు. ఈ దశ కార్బన్ 14 పద్ధతి ప్రకారం, క్రీ.పూ. 1800 నుండి క్రీ.పూ. 1500 మధ్య కాలంలో కానసాగి ఉండొచ్చు.

మూడో దశలో రాగి, కంచును ఎక్కువగా ఉపయోగించేవారు. ఈ దశకు చెందిన సాంస్కృతిక ఆధారాలు, తెక్కలి కోట, హల్లూర్, ఉట్నూర్‌లోనూ, నాగార్జునకొండ లోనూ లభ్యమయ్యాయి. దీని కాలం, క్రీ.పూ. 1500 నుండి. క్రీ.పూ. 1050 వరకు.

ఆంధ్రప్రదేశ్‌లోని నవీన శిలా యుగపు సమాజాల ఆర్థిక జీవన విధానం, పశు పోషణ, ఆహారోత్పత్తి మీద ఆధారపడి ఉంది. వీరు గొర్రె, మేక మొదలైన జంతువులతోపాటు, 'బాస్ ఇండికస్' అనే మూపురమున్న పశువులను, అంటే ఆవు, ఎద్దు మొదలగు వానిని మచ్చిక చేసేవారు. చనిపోయిన వారిని చెల్లకిలాగా పడుకోపెట్టి, సమాధి చేసేవారు. పిల్లలను కుండలలో పెట్టి సమాధి చేసేవారు.

B.RAO.U

ఇటీవలి తవ్వకాల వలన, బళ్ళారి జిల్లాలోని పెక్కలి కోట వద్ద, అనంతపురం జిల్లాలోని పాలరాయి వద్ద గల ప్రజలు, ఉలవలు, రాగులను పండించేవారని తెలుస్తోంది. అదే విధంగా, బళ్ళారి లోని సంగనకల్లు, కుపగల్ వద్ద, మహబూబ్ నగర్ జిల్లాలోని ఉట్నూర్ వద్ద, పెద్ద పెద్ద బూడిద రాసులు (ash-mounds) కనిపించాయి. ఈ రాసులు 500 అడుగుల చుట్టుకొలత కలిగి, 50 అడుగుల ఎత్తున ఉన్నాయి. ఇటువంటి రాసులను 40 వరకు, ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాలలో, రాబర్ట్ బ్రూస్‌ఫుట్ కనుగొన్నాడు. ఈ రాసులు మొదట పేడ పోగులనీ, వేనవిలో అంటుకొని అలాగే రాజుతూ, మండుతూ, బూడిద పోగయిందని, రాబర్ట్ బ్రూస్‌ఫుట్ అభిప్రాయం.

బ్రూస్‌ఫుట్ అనంతపురం జిల్లాలో 25 జనావాసాల్ని బయటకు తీశాడు. లత్తవరం కొండ మీద, పిండి విసరటానికి ఉపయోగించే అనేక బండలు కనబడ్డాయి. పులివెందల తాలూకా లోని వేములలో, కడప సమీపం లోని వెల్లటూరులో, కదిరి తాలూకా లోని ముండ్లవారి పల్లె, బొరిగల్లులలో, అనేక రకాలైన నూతన శిలా యుగపు పనిముట్లు దొరికాయి. కర్నూల్ జిల్లా లోని పత్తిపాడులో, అనేక రకాలైన నవీన శిలా యుగపు మృణ్మయ పాత్రలు లభించాయి.

పై పరిశీలన వలన, నవీన శిలా యుగం ఆంధ్ర దేశంలో అన్ని జిల్లాల లోనూ విస్తరించి ఉందని, అనాటి ప్రజలు ముఖ్యంగా వ్యవసాయం మీద, జంతువులను మచ్చిక చేసుకోవడం మీద, ఆధారపడి జీవించేవారని తెలుస్తోంది.

2.3 : పురా చారిత్రక యుగం : నిర్వచనం

పురాతత్వ శాస్త్రజ్ఞులు పురా చారిత్రక యుగాన్ని, చరిత్ర పూర్వ యుగానికి, చారిత్రక యుగానికి మధ్య నుండే కాలంగా పరిగణిస్తారు. ఆ కాలంలో లిపి ఉంటుంది కాని, దానిని చదివి అర్థం చేసుకోవడం కష్టతరం. దీనికి సింధు నాగరికత, ఆ నాటి లిపి, ముఖ్య ఉదాహరణలు. ఈ కాలంలో కూడా, మానవుడు ఎక్కువగా వ్యవసాయం, పశు పోషణల మీద ఆధారపడి జీవించేవాడు. ఇతనికి స్థిరమైన నివాసం ఉండేది. పల్లెల లోనూ, గ్రామాల లోనూ, క్రమంగా పట్టణాల లోనూ కూడా, నివసించేవాడు. చనిపోయిన వారికి వివిధ రకాలైన సంస్కారాలను చేయటాన్ని బట్టి, ఈ నాటి ప్రజలకు మూఢ విశ్వాసాలు ఎక్కువని, వారు పునర్జన్మ ఉందని నమ్ముతున్నారని తెలుస్తోంది. ఉత్తర భారతాన ఈ సంస్కృతిని ఎక్కువగా హరప్పా పూర్వ సంస్కృతి (Pre-Harappan Culture); హరప్పా సంస్కృతి (Harappan Culture); హరప్పా తర్వాతి సంస్కృతి (Post-Harappan Culture) అని విభజించారు. దక్షిణ భారతదేశంలో ఈ సంస్కృతిని తామ్ర శిలా యుగ సంస్కృతి (Chalcolithic) అని పిలుస్తారు. తామ్ర శిలా యుగ సంస్కృతి తదుపరిది, అయో యుగ లేక, ఇనుప యుగ సంస్కృతి (Iron age culture). ఈ యుగమునందే సమాధులను పెద్ద పెద్ద రాళ్ళతో తయారుచెయ్యటం వలన, దీనిని బృహత్శిలా యుగం (Megalithic age), లేక రాక్షస గుళ్ళ సంస్కృతి అని కూడా అంటారు. ఈ పురా చారిత్రక యుగంలో లిపి, ముఖ్యంగా బొమ్మలతో చేయబడింది (pictographic script). దీనిని చదివి అవగాహన చేసుకోవడం కష్టం. అందుచేతనే, ఈ యుగాన్ని పురా చారిత్రక యుగమని పిలుస్తున్నారు.

2.3.1 : పురా చారిత్రక యుగం : భాగాలు

ఈ పురా చారిత్రక యుగాన్ని దక్షిణ భారతదేశంలో రెండు రకాలుగా విభజించారు. అవి : (1) తామ్ర శిలా యుగం; (2) అయో యుగం, లేక ఇనుప యుగం.

BRAOU

ఈ తామ్ర శిలా యుగంలో రాగితోనూ, రాళ్ళతోనూ చేసిన పనిముట్లను ఎక్కువగా ఉపయోగించేవారు. అందుచేతనే, దీనిని తామ్ర (chalco) - శిలా (lithic) యుగమని వ్యవహరిస్తున్నారు.

అయో యుగం నాటి మానవుడు ముఖ్యంగా ఇనుముతో తయారుచేసిన వస్తువులను ఉపయోగించేవాడు. అందుచేతనే, ఈ యుగానికి అయో యుగం, లేక ఇనుప యుగ మనే పేరు వచ్చింది. అయో యుగానికి చెందినటువంటి ప్రజలు, పెద్ద పెద్ద రాళ్ళను (Megaliths) పేర్చి, సమాధులను (Burials) ఏర్పరచేవాళ్ళు. అందుచేతనే, ఈ సంస్కృతికి బృహచ్ఛిలా యుగ సంస్కృతి (Megalithic Culture), లేక రాక్షసి గుళ్ళ సంస్కృతనే పేరు వచ్చింది. అయో యుగం అంతమయ్యే సరికి, చారిత్రక యుగం ప్రారంభమై ఉండొచ్చునని, పురాతత్వ శాస్త్రజ్ఞుల, చరిత్రకారుల, మానవ శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

2.3.2 : తామ్ర శిలా యుగం

దక్షిణ భారతదేశంలో తామ్ర శిలా యుగపు లక్షణాలు, బ్రహ్మగిరి, సంగనకల్లు, పాలవాయి, మాస్కి, నాగార్జునకొండ మొదలైన స్థలాలలో జరిగిన తవ్వకాల వల్ల, బయటపడినాయి. ఈ నాటి ప్రజలు రాతితోపాటుగా, రాగితో చేసిన పనిముట్లను కూడా వాడేవారు. వీరు మొదటి దశలో చేతితో చేసిన పాత్రలను, రెండవ దశలో సారె మీద చేసిన మట్టి పాత్రలనూ, ఉపయోగించేవారు. రాగితోపాటుగా, కంచు కూడా వాడుకలో ఉంది. వీరు గుండ్రటి ఇళ్ళను నిర్మించేవారు. ఇంటి గోడలను బంక మట్టితో చేసిన ఇటుకలతో కట్టేవారు. ప్రతి ఇంటికీ నాలుగు గదులు ఉండేవి. అందులో ఒకటి వంటిల్లు, ఒకటి నిలువచేసుకొనే గది, ఒకటి హాలు, మరొకటి పడుకునే గది. ఈ తామ్ర శిలా యుగపు ప్రజలు చనిపోయిన వారికి ప్రత్యేకమైన ఖనన పద్ధతులను అనుసరించేవారు. పెద్ద వారిని ఊరికి దూరంగా తూర్పున శ్మశాన వాటికల లోనూ, చిన్న పిల్లలను తమ ఇళ్ళల్లోనే కుండల లోనూ పెట్టి, పాతిపెట్టేవారు. ఇందులో మూడు రకాలు ఉన్నాయి : (1) ఏక కుండతో చేసినవి. (single-urn-burial); (2) రెండు కుండలతో చేసినవి (double-urn burial); వీటినే బోర్లించే పద్ధతి కలవి (inverted-urn burial) అని కూడా అంటారు; (3) మూడు కుండలతో చేసినవి (triple-urn burial). ఇట్టివి నెవాసా లోనూ, బ్రహ్మగిరి, సంగనకల్లు, నాగార్జునకొండ మొదలైన ప్రాంతాలలో విరివిగా లభించాయి.

2.3.3 : అయో యుగ సంస్కృతి

నిత్య జీవితంలో ఇనుముతో చేసిన పరికరాల వాడకం, మానవ సంస్కృతిని ఉచ్ఛ స్థాయికి చేర్చిందనడంలో, సందేహం లేదు. ఈ యుగంలో ఇనుముతో చేసిన పరికరాలను, ఆయుధాలను ఎక్కువగా వాడేవారు. కాబట్టి, దీనికి ఇనుప యుగం అనే పేరు వచ్చింది.

ఇనుప ఖనిజాన్ని కనుగొని, దాన్ని లోహంగా మార్చే ప్రక్రియ, దానితో ఆయుధాలు, పరికరాలను తయారుచేయడం, క్రీ.పూ. 1800 సంవత్సరాల క్రిందట, మధ్యధరా సముద్రపు తూర్పు తీర భూములల్లో, అంటే ఆసియా మైనర్, కాకసస్ పర్వత ప్రాంతాల్లో ప్రారంభమైనట్లు, పురావస్తు శాస్త్రజ్ఞులు ప్రపంచ వ్యాప్తంగా అంగీకరించారు.

ఈ యుగంలో అతి ముఖ్యమైంది, బృహచ్ఛిలా సంస్కృతి, లేక రాక్షసి గుళ్ళ సంస్కృతి. ఈ బృహచ్ఛిలా సంస్కృతి, లేక రాక్షసి గుళ్ళ సంస్కృతంటే ఏమిటో తెలుసుకుందాం.

BRAOU

2.3.4 : బృహచ్ఛిలా యుగం

ఆంధ్ర దేశంలో ఇనుప పనిముట్లు, ఆయుధాలు, మిక్కిలి వింతైన సమాధులలో దొరుకుతున్నాయి. ఈ సమాధులను రాక్షసి గుళ్ళు, లేక బృహచ్ఛిల అంటారు. వీనినే, శాస్త్రజ్ఞులు మెగాలిత్స్ (Mega = large, lithic = stone) అని పిలుస్తున్నారు. ఈ సమాధులు ఇనుప యుగానికి చెందినవి. ఈ సమాధులలో నలుపు, ఎఱుపు వర్ణాలు గల కుండ పెంకులు (Black and red ware) ఎక్కువగా దొరికాయి. వీటిని గురించి రాబర్ట్ బ్రూస్‌ఫుట్, శ్రీనివాస అయ్యంగార్, హెచ్.డి.సంకాలియా మొదలైన వారు, ఎక్కువగా పరిశోధనలను జరిపారు.

ఈ సమాధులు ఎక్కువగా బ్రహ్మగిరి, సంగనకల్లు, మాస్కి, గుడివాడ, నాగార్జునకొండ, ఎల్ల గుంట్ల, ముదిగల్లు, కొండాపురం, పత్తిపాడు, ఉట్నూర్, సర్కెట్‌పల్లి, మధిర, డోర్నకల్, పెద్ద బంకూర్ వద్ద బయల్పడినాయి.

ఈ రాక్షసి గుళ్ళ సంస్కృతిలో చాలా రకాలున్నాయి. అందులో అతి ముఖ్యమైన వాటిని గురించి తెలుసుకుందాం. ఆంధ్ర దేశంలో సుమారు పన్నెండు రకాలు లభ్యమయ్యాయి. వీనిలో మొదటి రకం వట్టి శిలా స్తంభం. పృష్టిలో దొరికే పొడుగాటి రాయిని, మృతిచెందిన వారి స్మృతి నిమిత్తం నిలబెట్టడం, ఆచారం. పెద్ద రాతి పలకలను తీసి, పెట్టె వలెనే నాలుగు వైపులా నాలుగు పాతి, పైన ఒక పలకను మూత వేస్తారు. ఇది ఒక పద్ధతి. వీనినే డొల్మన్ (Dolmens) అంటారు. ఇవి గోదావరి, కృష్ణ, చిత్తూర్ జిల్లాల్లో ఎక్కువగా కానవస్తున్నాయి. ఇటువంటి పెట్టె ఆకారాలను భూమి లోపలనే కట్టే, వాటిని సిస్ట్ (Cist) లని అంటారు. అటువంటి సమాధికి తూర్పున కన్నం ఉంటే, దానిని కన్నం గల సిస్ట్ (Port hole cist) అని అంటారు. ఇవి బ్రహ్మగిరి, సంగన కల్లులలో ఎక్కువగా లభ్యమైనాయి. గొడుగు ఆకారంలో గల వాటిని, గొడుగు రాళ్ళని (umbrella stones) అంటారు. ఇవి కాక, మట్టితో పెద్ద పీనుగు పెట్టె (Terracotta - legged sarcophagus) ను చేసి, దానిలో మానవుని అస్థికలనూ, అతను వాడినటువంటి వస్తు సామగ్రినీ పెట్టి, భూమిలో పాతిపెట్టడం, కొన్ని జిల్లాలలో ఉంది. ఇవి ఎక్కువగా చిత్తూర్, అనంతపురం, కర్నూల్ జిల్లాలలో ఉన్నాయి. ఇవి చూడ్డానికి ఇంచుమించు మట్టితో చేసిన పెద్ద తొట్టె వలె ఉంటాయి. వీటికి అడుగున ఆరు కాని, ఎనిమిది కాని కాళ్ళుంటాయి. భారతదేశ మంతటిలోను అద్వితీయం, అసమానమైన ఈ శవ పేటిక, కడప జిల్లాలోని శకవరం గ్రామంలో దొరికింది. ఇది గొర్రె ఆకారం కలిగిన ఆరు కాళ్ళ పెట్టె. దీని గర్భంలో అస్థికలున్నాయి.

ఈ రాక్షసి గుళ్ళ సమాధులు మహారాష్ట్రలోని నెవాసా, చందోలి, తమిళనాడు లోని అరికమేడు, కున్నత్తూరు, అలగర్తై, తిరుచునాపల్లి మొదలైన చోట్ల కూడా లభించాయి. శాస్త్రజ్ఞుల అంచనా ప్రకారం, ఈ సంస్కృతి క్రీ.పూ. 1250 నుండి క్రీ.పూ. 950 మధ్య కాలానికి చెందినదిగా చెప్పొచ్చు. ఇది అయో యుగ సంస్కృతిలో ఒక ముఖ్య భాగం.

బృహచ్ఛిలా యుగ సమాధులతోపాటుగా, అయో యుగంలో మరి కొన్ని క్రొత్త మార్పులు కూడా వచ్చాయి. ఈ యుగం మానవ వికాసంలో రెండో విప్లవాన్ని తెచ్చింది. మొదటి విప్లవం నవీన శిలా యుగానికి చెందిన హరిత విప్లవం. రెండో విప్లవం అయో యుగానికి చెందిన, పట్టణాలుగా తీర్చి దిద్దేటటువంటి విప్లవం. ఇది మానవ జీవితాన్ని అధికంగా మార్చేసింది. రాయి కన్న ఇనుము శ్రేష్టమని, మానవుడు తెలుసుకున్నాడు. దానితో పనిముట్లను తయారుచేయడం నేర్చుకున్నాడు. వాటిని

BRAOU

తయారుచెయ్యటానికై, ప్రత్యేక తరహా బట్టీలను, కొలిమి తిత్తుల్ని తయారుచేసుకున్నాడు. అడవులను నరకడానికి ఇనుప గొడ్డలిని, వ్యవసాయానికి ఇనుప నాగళ్ళను, కత్తులను తయారుచేసుకోవటం మొదలుపెట్టాడు.

భారత దేశంలోని అయో యుగం లేక ఇనుప యుగాన్ని గురించి క్షుణ్ణంగా పరిశోధనలు జరిపిన వారు, ఎన్. ఆర్. బెనర్జీ. ఆయన కృషి ఫలితంగా, భారతదేశంలో ఈ అయోయుగ సంస్కృతికి చెందిన ఆయుధాలు, పనిముట్లు, హస్తినాపురం, అలంగీర్ పురం, కౌశాంబి, ఉజ్జయిని, అత్రంజిఖర మొదలైన చోట్ల ఎక్కువగా లభ్యమయ్యాయి. ఈ ఇనుప యుగ పనిముట్లతోపాటుగా, రెండు రకాల మట్టి పాత్రలు కూడా లభ్యమైనాయి. అవి : చిత్రాలు కలిగిన బూడిద రంగు పాత్రలు (painted grey ware); నలుపు - ఎఱుపు పాత్రలు (black & red ware).

ఈ ఇనుప యుగ పరికరాలలో ముఖ్యమైనవి, బొరిగెలు, బాణపు మొనలు, ఈటెలు (spears) మొదలైనవి.

ఈ యుగపు సంస్కృతులు ఆంధ్ర దేశంలో గుంటూర్ జిల్లా లోని నాగార్జునకొండ వద్ద, నల్గొండ జిల్లాలో ఏలేశ్వరం వద్ద, అదిలాబాద్ జిల్లా లోని పోచంపాడు వద్ద, మహబూబ్‌నగర్ జిల్లా లోని ఉట్నూర్ వద్ద ఉన్నాయి. దీనిని బట్టి, ఆంధ్ర దేశంలో అయో యుగంతో, పట్టణ జీవితం అతి వేగంగా విస్తరించిందని చెప్పొచ్చు. పట్టణ జీవితంతోపాటుగా లిపిని కనుక్కోవటం, దానితో చరిత్ర తొలి దశ ప్రారంభం కావటం, మనకు తెలుస్తోంది. ఆంధ్రుల చారిత్రక తొలి దశ శాతవాహనులతో ప్రారంభమౌతుంది. తర్వాతి ఖండంలో శాతవాహనుల గురించి తెలుసుకుంటారు.

2.4 : సంగ్రహంగా

పై పరిశీలన వలన, మన పూర్వీకుల సుదీర్ఘ చరిత్రలో, ప్రాచీన శిలా యుగం, మధ్య శిలా యుగం, నవీన శిలా యుగం, తామ్ర శిలా యుగం, ఇనుప యుగం, ఇనుప యుగం నాటి బృహచ్ఛిలా యుగం, ముఖ్యమైన విభజనలని తెలుసుకున్నాం. వీరు మొదట్లో ధాతువులను ఎరుగరు. వారి ఆయుధాలన్నీ రాతి తోనూ, కొయ్య తోనూ, ఎముకల తోనూ చేసుకొన్నవే. ఆదిలో మానవుడు పూర్తిగా ప్రకృతి మీద ఆధారపడి జీవించేవాడు. క్రమంగా వేటాడడం, చేపలు పట్టడం వంటివి నేర్చుకున్నాడు. సహజంగా ఏర్పడిన కొండ గుహల లోనూ, చెట్ల తొర్రల లోనూ నివసించేవాడు.

ఈ పరిస్థితులన్నీ నవీన శిలా యుగం నాటికి చాలా మారిపోయాయి. ప్రాచీన శిలా యుగంలో కంటే నవీన శిలా యుగంలో గొప్ప మార్పులు కలగటానికి కారణాలు: (1) మొక్కలను పెంచి, వ్యవసాయాన్ని చెయ్యటం; (2) జంతువులను మచ్చిక చేసుకోవటం ; (3) మట్టితో కుండలు చేయడం; (4) అరగదీసి నునుపు చేసిన పరికరాలను అందంగాను, వాడిగాను చెయ్యటం, మొదలైనవి.

ఆహారోత్పత్తితోపాటుగా, వర్తక వ్యాపారాలు మొదలైనాయి. ఎక్కువగా ఉన్న ఆహార ధాన్యాలను ఎగుమతి చేసి, తమకు కావలసిన వస్తువులను వస్తు మార్పిడి (barter system) విధానం ద్వారా పొందేవారు.

నవీన శిలా యుగం లోనే మానవుడు ఖనన సంస్కార పద్ధతులను కూడా ప్రారంభించాడు. నిప్పు చెయ్యటం, బట్ట కట్టడం నేర్చుకున్నాడు. తనకు కావలసిన పరికరాలను తనే స్వయంగా

BRAOU

తయారుచేసుకొన్నాడు. ఈ విధంగా చరిత్ర పూర్వ యుగంలో మానవుడు, ప్రాచీన శిలా యుగంలో ఆహారాన్వేషి (food - gatherer); మధ్య శిలా యుగంలో వేటగాడు - చేపలు పట్టేవాడు (hunter-fisher); నవీన శిలా యుగంలో ఆహారోత్పత్తిదారుడు (food producer) అయినాడని, మనకు తెలుస్తోంది.

తామ్ర శిలా యుగం నాటి మానవుడు, రాళ్ళతోపాటుగా, రాగిని కూడా పరికరాలను చేయడానికి వాడాడు. ఇనుమును కనుగొనటంతో, అయో యుగం ప్రారంభమైంది. ఈ అయో యుగం లోనే బృహచ్ఛిలా సంస్కృతి కనుగొనబడింది. రాగి, ఇనుము లోహాలను కనిపెట్టినప్పటినుండి మానవ జీవితంలో గొప్ప పరిణామం వచ్చి, పల్లెల నుండి పట్టణాభివృద్ధి ఆరంభమైంది. ఈ పట్టణ నాగరికతతో చారిత్రకపు తొలి దశ ప్రారంభమైందని చెప్పొచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లో ఆంధ్రుల చరిత్ర శాతవాహనులతో ప్రారంభమౌతుంది. తర్వాతి ఖండంలో శాతవాహనుల గురించి తెలుసుకుంటారు.

2.5 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. చరిత్ర పూర్వ యుగాన్ని నిర్వచించి, దాని భాగాల గురించి వివరించండి.
2. ప్రాచీన శిలా యుగంలో మానవుని జీవిత విధానాన్ని తెలపండి.
3. మానవ చరిత్రలో నవీన శిలా యుగానికి గల ప్రాముఖ్యత ఎట్టిది?
4. పురా చారిత్రక యుగ మనగానేమి? దాని భాగాల లక్షణాలను పరిశీలించండి.
5. ఆంధ్రప్రదేశ్‌లో గల బృహచ్ఛిలా యుగ సంస్కృతి విశేషాలను వేర్కొనండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. మధ్య శిలా యుగ సంస్కృతి లక్షణాలను సమీక్షించండి.
2. దక్షిణ భారతదేశంలో తామ్ర శిలా యుగ సంస్కృతి రీతులను తెల్పండి.
3. అయో యుగ జీవన విధానాన్ని విశ్లేషించండి.

2.6 : ఉపయుక్త గ్రంథాలు

Allchin, B&R. : **The Birth of Indian Civilisation**, London, 1968.

Ansari, Z.D. & Nagaraja Rao, M.S. : **Excavations at Sanganakalli**, Poona, 1969

Coles J.M. and Higgs, E.S : **The Archaeology of Early Man**, London, 1968.

BRAOU

Dani, A.H. : **Pre-History and Proto - History of Eastern India,** Calcutta, 1964.

Fairservis, Watter A. Jr. : **The Roots of Ancient India,** New York, 1971.

Foote R.B. : **Collection of Indian Prehistoric and Protohistoric Antiquities,** Madras, 1916.

Gordon, D.H. : **The Prehistoric Background of Indian Culture,** Bombay, 1958.

Issac, N. : **Stone Age Cultures of Kurnool Dt.** (Ph.D Thesis, Deccan College, Poona.

Jain, K.C. : **Pre-History and Proto-History of India,** New Delhi, 1978

Jayaswal, V. : **Palaeo History of India,** Delhi, 1978.

Lal, B.B. : **Indian Archaeology Since Independence,** Delhi, 1964.

Misra, V.N and Mate, M.S. (Eds) : **Indian Pre-History,** Poona, 1965

Murty, M.L.K. : "Blade and Burin Industry from Renigunta on the South-East Coast of India" - **Proceedings of the Prehistoric Society, 1968,**

Do : **Stone Age Cultures of Chittor District,** (Ph.D Thesis, Deccan College, Poona).

Sankalia, H.D. : **Pre-History and Protohistory of India and Pakistan,** Poona, 1974.

Soundara Rajan, K.V. : "Studies in the Stone Age of Nagarjunakonda and its neighbourhood", **Ancient India,** No. 14.

Subba Rao, B. : **The Personality of India (2nd Edition),**Baroda, 1958.

Subrahmanyam, R. et.al (Eds) : "Nagarjunakonda" **Memoirs of the Archaeological Survey of India, No. 15,** Delhi, 1975.

Thimma Reddy : **Pre-History of Cuddapah,** (Ph.D) Thesis, Deccan College, Poona.)

Wheeler, R.E.M. : **Early India and Pakistan,** Londoan, 1959.

: తెలుగు విజ్ఞాన సర్వస్వం: దేశ చరిత్ర (మొదటి సంపుటం), (పునస్సంశోధితం)

BRAOU

డా. కె. తిమ్మారెడ్డి & డా. యమ్. యల్. కె.మూర్తి : ప్రాక్ చరిత్ర, తెలుగు అకాడమి ప్రచురణ.

డా. వి. కామేశ్వర రావ్ (సం) : పురావస్తు శాస్త్రం - ప్రాథమిక సూత్రాలు, తెలుగు అకాడమి ప్రచురణ

రచయిత్రి : ఆచార్య అన్నాప్రగడ కనుమవాసిని

BRAOU

ఖండం-II : శాతవాహన యుగం

ఈ ఖండంలో 3, 4, 5 భాగాలున్నాయి. మూడో భాగం శాతవాహన వంశీయుల జన్మ భూమి, పుట్టుపూర్వోత్తరాలు, కాల నిర్ణయం, వారి సామ్రాజ్య విస్తరణ, ఇత్యాది అంశాలను వివరిస్తుంది. నాలుగో భాగం శాతవాహనుల రాజనీతిని, సామ్రాజ్య స్వభావాన్ని, పరిపాలనా పద్ధతిని, ఆ తర్వాత ఆ యుగం లోని ఆర్థిక స్థితిగతులను తెలియజేస్తుంది. అయిదో భాగం ఆ యుగంలో సంభవించిన సామాజిక, మత, ధార్మిక పరిణామాలను, వాస్తుకళా వికాసాలను పరిశీలిస్తుంది. అంటే, ఈ మూడు భాగాల్లో, ఆంధ్రుల చరిత్రలో తొలి పాలకులైన శాతవాహనుల కాలంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక, మత కళా రంగాల్లో సంభవించిన పరిణామాలను చర్చించడం జరిగింది. దీని సుదీర్ఘ పాలన ఈ భిన్న రంగాల్లో మార్గదర్శకత్వాన్ని, ఒరవడి నేర్పర్చింది.

BRAOU

BRAOU

భాగం-3 : శాతవాహన యుగం : రాజకీయ చరిత్ర

విషయక్రమం

3.0 : లక్ష్యాలు

3.1 : పరిచయం

3.2 : ఆంధ్రులు : శాతవాహనులు : గుర్తింపు, జన్మ భూమి

3.2.1 : శాతవాహనులు - ఆంధ్రులు

3.2.2 : శాతవాహనులు - కర్నాటకులు

3.2.3 : శాతవాహనులు - మహారాష్ట్రులు

3.2.4 : శాతవాహనులు - విదర్భ

3.2.5 : సమీక్ష - సమాధానం

3.3 : శాతవాహన వంశ నామం - కులం

3.3.1 : బ్రాహ్మణ - నాగ సంబంధం

3.3.2 : బ్రాహ్మణ - యక్ష సంబంధం

3.3.3 : శాతవాహనులు - శాలివాహనులు

3.2.4 : సమీక్ష - సమాధానం

3.4 : శాతవాహన వంశ కాలానుక్రమణిక (Satavahana Chronology)

3.4.1 : ప్రధానమైన వాద వివాదాలు

3.4.2 : సంక్షిప్త కాలానుక్రమణిక

3.4.3 : దీర్ఘ కాలానుక్రమణికలు - విమర్శ

3.4.4 : శాసనాధారాలు - సమకాలీనతలు

3.4.4.1 : శాతకర్ణి-ఖారవేలుని సమకాలీనత

3.4.4.2 : శక-శాతవాహన సంబంధాలు

3.4.4.3 : సమన్వయం - సమాధానం

3.5 : శాతవాహనులు - రాజకీయ చరిత్ర

3.5.1 : శ్రీముఖుడు

3.5.2 : మొదటి శాతకర్ణి

3.5.3 : మొదటి శాతకర్ణి తదనంత శాతవాహనులు

BRAOU

3.5.4 : గౌతమీపుత్ర శాతకర్ణి

3.5.4.1 : చారిత్రక ఆధారాలు

3.5.4.2 : యుద్ధ విజయాలు - సామ్రాజ్య విస్తరణ

3.5.4.3 : గౌతమీపుత్ర శాతకర్ణి : శక-క్షహరాట సంబంధాలు

3.5.4.4 : గౌతమీపుత్ర శాతకర్ణి - వ్యక్తిత్వం

3.5.4.5 : గౌతమీపుత్ర శాతకర్ణి - రాజనీతి

3.5.4.6 : గౌతమీపుత్ర శాతకర్ణి అనంతర శాతవాహనులు

3.5.4.7 : వాసిష్ఠీపుత్ర పులుమావి

3.5.5 : వాసిష్ఠీపుత్ర పులుమావి - కార్దమక శకులు

3.5.5.1 : వాసిస్ఠీ పుత్ర పులుమావి - తూర్పు తీర విధానం

3.5.6 : కడపటి శాతవాహనులు

3.5.6.1 : గౌతమీ పుత్ర శ్రీయజ్ఞ శాతకర్ణి

3.5.6.2 : శాతవాహన సామ్రాజ్య అస్తమయం

3.6 : సంగ్రహంగా

3.7 : పరీక్ష నమూనా ప్రశ్నలు

3.8 : ఉపయుక్త గ్రంథాలు

BRAOU

3.0 : లక్ష్యాలు

మౌర్య సామ్రాజ్య పతనానంతరం భారతదేశ రాజకీయ, సాంస్కృతిక సమైక్యతలను సంరక్షించి, పెంపొందించడానికి ప్రయత్నించిన రాజ వంశాల్లో, శాతవాహనులు అగ్రగణ్యులు. మౌర్యుల సార్వభౌమత్వానికి వారసులైన శుంగ, కాణ్వ రాజ వంశాలను తుదముట్టించి, ఆంధ్రులు రాజ్య పాలన చేశారని పురాణ వాఙ్మయం పేర్కొంటూంది. ఆ వాఙ్మయం పేర్కొన్న ఆంధ్రులు, శాతవాహనులు, పురాణ వాఙ్మయం మాత్రమే కాక, క్రీ.శ. 1వ శతాబ్దానికి చెందిన ప్లీనీ, గ్రీక్ రచయితైన మెగస్తనీస్ రాసిన **'ఇండికా'** నుండి సమాచారాన్ని సేకరించి, తన గ్రంథంలో, ఆంధ్రులకు మౌర్యుల తర్వాత అత్యంత ప్రబలమైన సైన్యం, దుర్గప్రాసాదాలతో కూడిన 30 నగరాలున్నట్లు వర్ణించాడు. శాతవాహనులు మౌర్య సామ్రాజ్య అస్తమయం తర్వాత సువిశాలమైన సామ్రాజ్యాన్ని నెలకొల్పి, సుమారు రెండున్నర శతాబ్దాలు పరిపాలించారు. ఈ సామ్రాజ్య చరిత్రను అధ్యయనం చేయడం ద్వారా, సామ్రాజ్య వ్యవస్థ విచ్ఛిన్నం కావడంతో ఏర్పడిన కల్లోల పరిస్థితుల్లో, తిరిగి మరొక సామ్రాజ్య వ్యవస్థ నిర్మాణం కావడానికి దోహదం చేసిన ఆర్థిక, సాంస్కృతిక శక్తులను గుర్తించి, అవగాహన చేసుకొనడం సాధ్యం కాగలదు. సాంస్కృతిక ప్రభావాలను అధ్యయనం చేయడానికి ముందుగా, రాజకీయ పరిస్థితులను, పరిణామాలను స్పష్టంగా గుర్తించడ మవసరం.

3.1 : పరిచయం

ఆంధ్ర దేశ చరిత్రను అవిచ్ఛిన్నంగా అధ్యయనం చేయడం, శాతవాహన యుగం నుండే సాధ్యమౌతుంది. దక్కన్ పీఠభూమిపై ఉన్న ఆంధ్ర దేశాన్ని, వారు వింధ్య పర్వతాలకు ఆవల ఉన్న మాళ్వా, సుర్ాష్ట్ర మొదలైన భూభాగాలలో, గంగాయమునా మైదానంతో అనుసంధించి, విశాల సామ్రాజ్యాన్ని నిర్మించారు. వారి పరిపాలనా యుగం భారతదేశ ఆర్థిక చరిత్రలో ఒక ఉజ్జ్వల ఘట్టం. భారతదేశ మందలి అంతర్భాగంగా ఆంధ్ర దేశం, పశ్చిమాన రోమన్ సామ్రాజ్యంతో వర్తక వాణిజ్యాలను నిర్వహిస్తూ, అపారంగా లాభాలను ఆర్జించింది. తూర్పున, ఆగ్నేయాసియా దేశాలలో వలసలను నెలకొల్పి, భారతీయ సంస్కృతిని ఆ భూభాగాల్లో వ్యాప్తి చేసింది. బౌద్ధ మత విస్తరణలో ఆంధ్ర దేశం, ఆంధ్రులు నెలకొల్పిన వలస దేశాల్లో, ఆ మత వాఙ్మయం, వాస్తు శిల్ప కళలు అత్యున్నతమైన అభివృద్ధిని, ప్రమాణాలను సాధించాయి. భక్తితత్వం వ్యాపిస్తూ, ప్రభావితం చేయడంతో, శాతవాహన యుగంలో బౌద్ధం మహాయాన బౌద్ధంగాను, వైదిక మతం నవీన హిందూ మతం (Neo-Hinduism), లేదా పౌరాణిక హిందూ మతంగా పరిణామం చెందాయి. ఆచార్య నాగార్జునుడు శాతవాహన రాజుల ఆశ్రయంలో భారతీయ తత్వశాస్త్రానికి తలమానికమైన గ్రంథాలను రచించి, మాధ్యమిక వాదాన్ని అభివృద్ధి చేశాడు. ఈ పరిణామాల్లో బౌద్ధ, హిందూ మతాలు పరస్పరం చేరువ కావడం, భారతీయ సంస్కృతికి దోహదకారులు కావడం ప్రారంభమైంది. ఈ మత సంస్కృతులు సామాన్య ప్రజానీకాన్ని ప్రభావితం చేయడం, వారి ఆరాధనా విధానాలను, విశ్వాసాలను, దేవతా గణాన్ని సంస్కరించి, సమీకరించడం, భారతీయ సాంస్కృతిక వికాసానికి మౌలికమైనది. అటువంటి పరిణామాలు దక్కన్ పీఠభూమిపై శాతవాహన యుగంలో జరిగాయి.

BRAOU

3.2 : ఆంధ్రులు - శాతవాహనులు : గుర్తింపు, జన్మ భూమి

శాతవాహనుల చరిత్ర లోని మొట్టమొదటి వివాదాస్పదమైన అంశం, శాతవాహనులు ఎవరు? వీరి జన్మ భూమి ఏది? అనేవి. ఈ రెండు అంశాలు ఒక దానితో ఒకటి అవినాభావ సంబంధాన్ని కలవి. అందుచేత, రెండింటిని సమీకరించి, పరిశీలించడ మవసరం.

శాతవాహన వంశ చరిత్రకు పురాణ వాఙ్మయం ఒక ప్రధానమైన సాక్ష్యాధారం. పురాణాలు, ఆంధ్రులు, లేదా ఆంధ్ర జాతీయులని, కొందరు రాజులను పేర్కొంటున్నాయి. ఆ రాజులలో కొందరు, కొన్ని శాసనాలు, నాణేల ద్వారా కూడా తెలియువస్తారు. అయితే, పురాణాలు ఆ రాజులను శాతవాహన వంశీయులని, శాసనాలు ఆంధ్రులు, లేదా ఆంధ్ర జాతీయులని పేర్కొనడం లేదు. అందుచేత, పురాణాలు పేర్కొంటున్న ఆంధ్ర జాతీయులు, లేదా ఆంధ్రుల శాసనాధారాల ద్వారా తెలియవస్తున్న శాతవాహనులు, ఒకరేనా? లేక, వారిరువురు వేర్వేరా? అనే అంశం, చరిత్రకారుల్లో వివాదాలకు కారణమైంది.

3.2.1 : శాతవాహనులు - ఆంధ్రులు

ఈ. జె. రాప్సన్, విన్సెంట్ స్మిత్ వంటి పూర్వ చరిత్రకారులు ఆంధ్రులు, శాతవాహనులు ఒకరేనని ; ఆంధ్రులు మొదటి నుండి కృష్ణా, గోదావరి ముఖ ద్వారాల చుట్టు ఉన్న సారవంతమైన మైదానాలను తమ నివాస భూమిగా కలిగి ఉండేవారని భావించారు. కనుక, శాతవాహనుల జన్మ

స్థలం ఆంధ్ర దేశమని, వారి తొలి రాజధాని ధాన్యకటకమని (నేటి గుంటూరు జిల్లా లోని అమరావతికి సమీపంలో ఉన్న ధరణికోట), వారు అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చరిత్రకారులుపై వాదాలతో ఏకీభవించారు. ఆచార్య గుత్తి వెంకటరావ్, మూరేమండ రామారావ్, నేలటూరు వెంకటరమణయ్య మొదలైన చరిత్రకారులు, ఆంధ్రశాతవాహనుల ఏకైకత్వాన్ని, చరిత్రకు తెలిసిన నాటి నుండి ఆంధ్రులు కృష్ణా, గోదావరీ నదీ మైదానాల ప్రాంతాలలో నివసించేవారని, దృఢంగా విశ్వసించి, వాదించారు. విన్సెంట్ స్మిత్ కొన్ని సాంప్రదాయక గాథల ననుసరించి, ఆంధ్రుల తొలి రాజధాని శ్రీకాకుళ (నేటి కృష్ణా జిల్లాలోని దివి తాలూకాలో ఒక గ్రామం) మని భావించాడు. బి.ఆర్. భండార్కర్ ఈ వాదాలతో ఏకీభవించి, ఆంధ్రశాతవాహనుల ఏకైకత్వాన్ని అంగీకరించాడు. కాని, వారి తొలి రాజధాని బౌద్ధ వాఙ్మయంలోని **"సెరివణిజ జాతకం"** తెల్పుతున్నట్లు, తెలివాహ నదిపై ఉన్న ఆంధ్ర నగరమని అభిప్రాయపడ్డాడు. తెలివాహ నది నేటి మహానదికి ఉప నదుల్లో ఒకటైన **"తెల్"** అని, మహానది ప్రవహించే మైదాన ప్రాంతాలలో ఉన్న కళింగ దేశానికి దక్షిణంగా ఉన్న ఆంధ్ర దేశంలో ఆంధ్ర నగరున్నట్లు ఆయన భావించాడు. అయితే, హెచ్.సి. రాయ్‌చౌదరి తెలివాహ నదిని కృష్ణా నదిగా గుర్తించి, ఆంధ్ర నగరి నేటి విజయవాడ కావచ్చునని అభిప్రాయపడ్డాడు.

3.2.2 : శాతవాహనులు - కర్ణాటకులు

కాని, ఆంధ్ర-శాతవాహనుల ఏకైకత్వాన్ని నిరాకరించి, శాతవాహనులు ఆంధ్రులు కాక, ఆంధ్ర భృత్యులని, వారి జన్మ భూమి కర్ణాటకమని, వి.యస్. సుక్తాంకర్ వాదించాడు. బళ్ళారి జిల్లా (నేటి కర్నూల్ జిల్లా)లోని మ్యాకదోని అనే గ్రామం వద్ద లభించిన పులుమావి అనే శాతవాహన రాజు వేసిన శాసనాన్ని ప్రకటిస్తూ, వి.యస్. సుక్తాంకర్ శాతవాహనులు ఆంధ్ర భృత్యులని, వారి జన్మ భూమి కర్ణాటకమని ప్రతిపాదించాడు. ఆ శాసనం **"శాతవాహనిహార"** అనే ఒక ప్రదేశాన్ని పేర్కొంటుంది. పల్లవ రాజైన శివస్కందవర్మ వేసిన హీరహడగల్లి శాసనం కూడ, "శాతాహనిరట్ఠ" అనే పేరుతో, ఆ ప్రదేశాన్ని వ్యవహరించింది. ఆ పదాలకు శాతవాహన రాష్ట్రమని అర్థం. అది శాతవాహనుల జన్మ స్థలం కావడం చేత, ఆ పేరుతో ప్రసిద్ధి కెక్కిందని, సుక్తాంకర్ అభిప్రాయపడ్డాడు. ఆంధ్రులు కృష్ణా, గోదావరి మైదానాల్లో నివసించేవారని, వారి భృత్యులైన శాతవాహనులు కర్ణాటకంలోని శాతవాహన రాష్ట్రానికి చెందినవారని, వారిరువురు వేరువేరని ఆయన సిద్ధాంతం.

3.2.3 : శాతవాహనులు - మహారాష్ట్రులు

పి.టి. శ్రీనివాస అయ్యంగార్ కూడ, ఆంధ్ర-శాతవాహనుల ఏకైకత్వాన్ని నిరాకరించాడు. అయితే, ఆయన వాదం భాషాపరమైంది. శాతవాహనుల మాతృ భాష ప్రాకృతం. వారు తమ శాసనాలను ప్రాకృత భాషలో వేసి, ప్రాకృత భాషను పోషించారు. ఆంధ్రులు ద్రావిడ కుటుంబానికి చెందిన తెలుగు భాషను మాట్లాడేవారు; కృష్ణా, గోదావరీ ముఖ ద్వారాల వద్ద ఉన్న తీర ప్రాంతంలో నివసించేవారు. వారి భృత్యులైన శాతవాహనుల శాసనాలు పశ్చిమ కనుములోని నాసిక్, నానాఘాట్, కన్హేరీ మొదలైన ప్రదేశాల్లో ఉన్నందున, ఆ ప్రదేశం వారి ఏలుబడిలో ఉన్నట్లు, వారి జన్మ భూమి అయినట్లు భావించదగింది కనుక, శాతవాహనులు మహారాష్ట్ర ప్రాంతానికి చెందినవారని, ఆంధ్రులు, ఆంధ్ర ప్రాంతీయులు కారని, ఆయన సిద్ధాంతం.

హెచ్. సి. రాయ్‌చౌదరి పై వాదాలతో ఏకీభవించి, శాతవాహనుల జన్మ భూమి మహారాష్ట్ర ప్రాంతమేనని, పురాణ వాఙ్మయం క్రోడీకరించబడిన కాలంలో వారి అధికారం కేవలం ఆంధ్ర దేశానికి

BRAOU

పరిమితం కావడం, వారు చిరకాలంగా ఆ దేశంలో నివసిస్తూండడం వలన, ఆ వాఙ్మయం వారిని ఆంధ్రులుగా పేర్కొన్నదని అభిప్రాయపడ్డాడు.

3.2.4 : శాతవాహనులు - విదర్భ

ఆంధ్రులను, శాతవాహనులను ప్రత్యేకీకరిస్తూ, ఆచార్య వి.వి. మిరాశీ శాతవాహనుల జన్మ స్థలం విదర్భ దేశమని, మరొక సిద్ధాంతాన్ని ప్రకటించాడు. శాతవానుల మాతృ భాష ప్రాకృతమే కాని, తెలుగు కాదని, వారు ఆంధ్ర భృత్యులేకాని, ఆంధ్రులు కారనే వాదాన్ని, మిరాశి సమర్థించాడు. కళింగ రాజైన ఖారవేలుడు తన హథిగుంఫ శాసనంలో, శాతకర్ణి రాజ్యంపై పశ్చిమ దిశగా ప్రబల సైన్యాన్ని పంపినట్లు, ఆ సేనలు కణ్ణ బేణ్ణానది వరకు నడిచి, ముసిక నగరాన్ని భయభ్రాంతం చేసినట్లు చెప్పకున్నాడు. ఒక నాసిక్ శాసనంలో గౌతమీపుత్ర శాతకర్ణి తనను తాను బెణాకటసామని వర్ణించుకున్నాడు. అనగా, బేణా నదిపై ఉన్న పట్టణం, శాతకర్ణి రాజధానని, బేణా నది హథిగుంఫ శాసనం పేర్కొంటున్న కణ్ణబేణ్ణా అని , గుర్తించారు. ఆ నది, నేడు వార్ధా జిల్లాలో వైన్‌గంగనదికి ఉప నదైన కన్హాన్ అనే నదిగా, ఆయన అభిప్రాయపడ్డాడు. కళింగకు ఆంధ్ర దేశం దక్షిణంగా ఉంది కాని, పశ్చిమంగా కాదని, కాని, ఖారవేలుని కళింగ రాజ్యానికి శాతకర్ణి పరిపాలించే భూభాగాలు పశ్చిమంగా ఉన్నట్లు, హథిగుంఫ శాసనం స్పష్టపరుస్తున్నది. కనుక, శాతవాహనుల మాతృ భూమి విదర్భని, ఆయన తన వాదాన్ని సమర్థించుకున్నాడు.

3.2.5 : సమీక్ష - సమాధానం

వాస్తవానికి ఈ సిద్ధాంతాలేవీ ఆంధ్రులను, శాతవాహనులను, ప్రత్యేకీకరించడానికి, శాతవాహనులు ఆంధ్ర దేశీయులు కారని నిర్ధారించడానికి, తగినంత నిశ్చితమైన సాక్ష్యాధారాలు కలవి కావు.

1. పురాణాలు శాతవాహన రాజులుగా గుర్తించదగిన పలుపురు రాజుల పేర్లను, స్పష్టంగా ఆంధ్రులని, ఆంధ్ర జాతీయులని ఏక వాక్యంగా పేర్కొంటూ ఉండగా, వారు ఆంధ్రులు కారని, ఆంధ్ర భృత్యులని వాదించడం, పూర్తిగా అసమంజసం. ఆంధ్ర జాతీయుల తర్వాత శ్రీ పార్వతీయులు, ఆంధ్రులు, ఆభీరులు, గర్దభిలులు మొదలైన ఆంధ్ర భృత్య వంశాలు పరిపాలిస్తాయని, పురాణాలు స్పష్టంగా వివరిస్తున్నాయి. కనుక, పురాణ వాఙ్మయం స్పష్టంగా ఆంధ్రులను, ఆంధ్ర భృత్యులను ప్రత్యేకంగా పేర్కొంటున్నట్లు, కనుక శాతవాహనులు ఆంధ్రులేకాని, ఆంధ్ర భృత్యులు కారని, డి.సి. సర్కార్ నిరూపించాడు.

శాతవాహనులు ఆంధ్రులని వాదిస్తూనే, మారేమండ రామారావ్, మరి కొందరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చరిత్రకారులు, వారు మౌర్య సార్వభౌమత్వాన్ని అంగీకరించినందున, పురాణాలు ఆంధ్ర భృత్య లని వ్యవహరించి ఉండొచ్చునని, అభిప్రాయపడ్డారు. సుక్తాంకర్, రాయ్‌చౌదరీ వంటి విద్వాంసులు "ఆంధ్ర భృత్య" పదాన్ని షష్ఠీ తత్పురుషగా భావించి "ఆంధ్రుల భృత్యులనే అర్థాన్ని సాధించారని, అది పొరబాటని, ఆ పదం "భృత్యులైన ఆంధ్రులు" అనే విశేషణోత్తరపద కర్మధారయ సమాసమని, వీరి వాదం. ఈ వాఙ్మయం ఆంధ్రులను, ఆంధ్ర భృత్యులను స్పష్టంగా వివరిస్తున్నందున, అదంతా అనావశ్యకమైన వ్యాయామం.

2. పురాణాలు "ఆంధ్ర" పదాన్ని జాతి వాచకంగా ప్రయోగించాయి. కాగా, "శాతవాహన" అనేది, వంశ నామం. రాజ వంశాలు తమ శాసనాల్లో వంశ నామాలను పేర్కొంటాయి కాని,

BRAOU

జాతి నామాలను కాదు. ఆంధ్ర దేశాన్ని పరిపాలించిన ఇక్ష్వాకు, శాలంకాయన, విష్ణుకుండి మొదలైన రాజ వంశాలు సైతం, తాము ఆంధ్రులమని ప్రత్యేకంగా ప్రకటించుకోలేదు. అయినా, వారు ఆంధ్ర దేశాన్ని పరిపాలించారు. ఆంధ్ర దేశానికి చెందిన వారని చరిత్రకారులు గుర్తిస్తున్నారు. అలాగే, శాతవాహనులు తమ శాసనాల్లో వంశ నామాన్ని మాత్రమే పేర్కొన్నంత మాత్రాన, వారు ఆంధ్రులు కాకపోరు.

3. శాతవాహనులు తమ శాసనాల్లో ప్రాకృత భాషను ఉపయోగించినందున, అది వారి మాతృ భాష అని భావించరాదు. తర్వాతి కాలంలో సంస్కృతం శాసన భాషైంది. కాని, ఆ భాష ఆ రాజ వంశాల మాతృ భాషని ఎవరూ అనలేరు. శాతవాహనుల కాలం నాటికి, మౌర్య సామ్రాజ్య విస్తరణ వలన, బౌద్ధ మత వ్యాప్తి వలన, ఆంధ్ర దేశంలో ప్రాకృతం ప్రాచుర్యాన్ని పొందింది. శిష్టులు ఉపయోగించే భాషైంది. కనుక, శాతవాహనులు తమ శాసనాల్లో ఆ భాషను ఉపయోగించారే కాని, అది వారి మాతృభాష అయినందువలన కాదు. అయ్యంగార్, రాయ్‌చౌదరి వంటి పూర్వ చరిత్రకారులు శాతవాహనులను గూర్చి రాసిన కాలం నాటికి, ఆ వంశీయులు ముద్రించిన ద్వైభాషిక (bilingual) నాణేలు లభ్యం కాలేదు. విదర్భ, అనుప, అపరాంత జనపదాలుగా ఏర్పడిన నేటి మహారాష్ట్ర దేశపు ఉత్తర, పశ్చిమ భూభాగాలలో, గౌతమీపుత్ర శాతకర్ణి కాలం నుండి చలామణి అయిన కొన్ని వెండి నాణేలు లభించాయి. ఆ నాణేలపై ఒక వైపు ప్రాకృత భాష లోను, రెండవ వైపు ఒక దక్షిణ భారతదేశపు భాష లోను, రాజుల పేర్లను ముద్రించడం జరిగింది. అది ప్రాచీన తమిళ భాషని, ఆర్. నాగస్వామి భావించాడు. కాని, అది తెలుగు భాషని డి.సి. సర్కార్ స్పష్టంగా నిర్ణయించాడు. ప్రాచీన కాలంలో కృష్ణా నదీ మైదానాలలో స్థిరపడి, నివసించిన కొన్ని తెగలు, "కొదుందమిళ్" అనే విరూపమైన తమిళ భాషను మాట్లాడేవారని, సంగం వాఙ్మయం వివరిస్తుంది. తెలుగు భాషా వికాసానికి ప్రాతిపదికైన ద్రావిడ మూలం ఇదే. ఈ భాష, పరిసరాల్లోని ఆస్ట్రిక్ జాతులు మాట్లాడే ముండారీ భాషలతో, సమ్మేళనం చెందుతున్నది. శాతవాహన యుగంలో ఈ విధంగా ఏర్పడుతున్న భాష, ప్రజల భాష, శాతవాహన రాజ వంశానికూడా ఇది మాతృ భాషని భావించొచ్చు. తెలుగు నాణేలను ముద్రించి ప్రవేశపెట్టడం వలన, వారు తమ జాతీయతను, మాతృ దేశం పట్ల, మాతృ భాష పట్ల ఉన్న అభిమానాన్ని ప్రదర్శించారని స్పష్టపడుతున్నది.

4. ఇటీవల కరీంనగర్ జిల్లాలో కోటిలింగాల, భూశికట్ట వద్ద జరిగిన త్రవ్వకాలలో, తొలి శాతవాహన రాజులైన చిముక (శ్రీముఖ), శాతకర్ణి, శాతవాహన అనే పేర్లను ముద్రించిన నాణేలు లభించాయి. ఈ నాణేలు తొలి దశ నుండి శాతవాహనులకు, నేటి పశ్చిమ ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడిన భూభాగాలతో సంబంధమున్నట్లు, నిరూపిస్తున్నాయి. పురాణ వాఙ్మయాన్ని క్రోడీకరిస్తున్న కాలంలో ఆంధ్ర దేశాన్ని పరిపాలిస్తున్న కారణంగా, ఆ వాఙ్మయం శాతవాహనులను ఆంధ్రులని పేర్కొని ఉండొచ్చన్న రాయచౌదరీ పండితుని అభిప్రాయాన్ని, ఈ నాణేలు ఖండిస్తున్నాయి. శాతవాహనుల పరిపాలన ఆది నుండి తుది వరకు విదర్భలో కొనసాగినా, పురాణ వాఙ్మయం వారిని విదర్భ దేశీయులుగా వర్ణించవు. ఈ అంశాలు శాతవాహనులు ఆంధ్రులని, వారి మాతృ దేశం ఆంధ్ర దేశమని స్పష్టంగా నిరూపిస్తున్నట్లు, ఆచార్య అజయ్‌మిత్ర శాస్త్రి నిశ్చయించారు.

5. ఆంధ్రులు నివసించిన భూభాగం ఆంధ్ర దేశంగా ప్రసిద్ధి చెందింది. కాని, క్రీస్తు పూర్వపు శతాబ్దాల్లో ఆంధ్రులు నివసించిన భూభాగం ఏది? ఆంధ్ర దేశంగా ప్రసిద్ధమైన భూభాగం ఏది?

BRAOU

క్రీ.శ. ఒకటో శతాబ్దం నాటికి కృష్ణా, గోదావరీ నదుల దిగువ మైదానాలు ఆంధ్రప్రదేశ్ కోస్తా జిల్లాలు, ఆంధ్ర దేశంగా గుర్తింపు పొందలేదు. ఆంధ్ర జాతీయులైన శాతవాహన రాజుల నాణేలు, శాసనాలు, దక్కన్ పీఠభూమి మధ్య భూభాగం, పడమటి కనుమల్లోని గుహాలయాల్లోను లభిస్తున్నాయి. ఆ వంశం లోని గౌతమీపుత్ర శాతకర్ణికి పూర్వపు రాజులు తీరాంధ్ర దేశంతో ఎటువంటి సంబంధాన్ని కలిగిఉన్నట్లు కనిపించదు. బౌద్ధ వాఙ్మయం లోని **సుత్త పిటకం**, బావరి అనే బ్రాహ్మణుడు కోసల దేశం నుండి దక్షిణాపథానికి వచ్చి, అశ్మక జనపదంలో స్థిరపడిన ఉదంతాన్ని తెలియజేస్తుంది. అశ్మక, ముళక అనే రెండు జనపదాలు ఆంధ్ర జనపదాలని, ఇక్ష్వాకు వంశీయులైన రాకుమారులు వాటిని నెలకొల్పారని, బౌద్ధ వాఙ్మయం, పురాణ వాఙ్మయం తెలుపుతున్నాయి. ఈ జనపదాలతో కూడిన ప్రదేశాన్ని, బౌద్ధ వాఙ్మయం మజ్ఝిమ దేశ (మధ్యమ దేశ) మని, ఆ దేశంలో శాతకణ్ణిక అనే నగరమున్నట్లు తెలుపుతూంది.

అశ్మక జనపదం నేటి ఆంధ్రప్రదేశ్‌లో చేరిన నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలకు, ముళక జనపదం ప్రక్కనే మరాట్వాడాలోని నాందేడ్, ఔరంగాబాద్ జిల్లాలకు సరి అయినవి. కనుక, ఆనాటి ఆంధ్ర దేశం నేటి వలె, తూర్పు తీరంపై కాక, దక్కన్ పీఠభూమి మధ్య భాగంలో ఉండేదని గ్రహించొచ్చు. అశోకుని శాసనాలు ఆంధ్రులను రఠిక, భోజక, పిటినిక మొదలైన తెగలతో కలిపి పేర్కొంటున్నాయి. రఠికులు (లేక మారఠి), భోజకులు నేటి మహారాష్ట్ర దక్షిణ భాగంలో, ఉత్తర కర్ణాటకంలో చేరిన భూభాగాలలో నివసించేవారు. వీరి నాణేలు ఈ ప్రాంతాల్లో లభించడమే, ఇందుకు ఆధారం. వీరితో కూడి, ఆంధ్రులు కూడ దక్కన్ పీఠభూమిపై, ఎగువ గోదావరీ మైదానంలో నివసిస్తున్నట్లు, అక్కడే ఆంధ్ర దేశ మున్నట్లు స్పష్టమౌతుంది. ఆ ప్రాంతంలో తమ అధికారాన్ని మొట్టమొదట స్థాపించిన శాతవాహనులు, నిస్సందేహంగా ఆంధ్రులని నిర్ధారణ జరుగుతున్నది.

ప్రాచీన వాఙ్మయం కృష్ణానదిని కణ్ణ బేణ్ణా (కృష్ణబేణ్ణా, కృష్ణవేణీ), అనే పేర వ్యవహరించింది. ఈ వాఙ్మయాధారాలను కాదని, అనామకమైన కన్హానీ అనే నదిని కణ్ణ బేణ్ణాగా గుర్తించడం సహేతుకం కాదు. ఖారవేలుని ప్రత్యర్థిగా శాతకర్ణి, శాతవాహన వంశం లోని మూడవ రాజుగా, నాగానిక భర్తగా మొదటి శాతకర్ణిగా, పూర్వ చరిత్రకారులు గుర్తించారు. అందుచేత, కళింగకు పశ్చిమ దిశగా అతని రాజ్యం ఉన్నట్లు, మిరాశి భావించాడు. కాని ఇటీవలి పరిశోధనలు, హాథిగుంఫ శాసనం పేర్కొనే శాతకర్ణి, గౌతమీపుత్ర శాతకర్ణి కుమారుల్లో ఒకడైన వాసిష్ఠీ పుత్ర శాతకర్ణి అని, వారిరువురు తూర్పు తీర మైదానాలపై ఆధిపత్యం కొరకే పోరాడారని సూచిస్తున్నాయి. కనుక, హాథిగుంఫ శాసనంలో లభిస్తున్న భౌగోళిక వివరాలు, శాతవాహనుల జన్మ భూమి విదర్భ ప్రాంతమని భావించడం సరికాదని తెలియజేస్తున్నాయి.

పై పరిశీలన వలన, శాతవాహనులు ఆంధ్రులని, వారి జన్మ భూమి అంధ్ర దేశమని స్పష్ట పడుతున్నది. అయితే, వారు తీరాంధ్ర దేశంలో పరిపాలన స్థాపించారని, వారి తొలి రాజధాని ధాన్యకటకమని భావించడం సరికాదు. వారు దక్కన్ పీఠభూమి మధ్య భాగం లోని అశ్మక, ముళక అనే ఆంధ్ర జనపదాలపై ఆధిపత్యాన్ని కలిగి, పశ్చిమ తీరం వైపు తమ సామ్రాజ్య విస్తరణను జరిపారు. అప్పుడు పడమటి తీరంపై ఉన్న రేవు పట్టణాల నుండి జరిగే నౌకా వ్యాపారంపై, పరిసర జనపదాల లోని పారిశ్రామిక వస్తుక కేంద్రాలపై ఆధిపత్యాన్ని పొందడానికి, వారు అపరాంత, కొంకణ, అనూప, మాళ్వ, సురాష్ట్ర మొదలైన ప్రాంతాలను ఆక్రమించారు. ఆ ప్రాంతాలను వారు తమ అధీనంలో నిలుపుకోవడం దుష్కరం కావడంతో, తర్వాతి కాలంలో తూర్పు తీరం వైపు దృష్టిని మరలించారు. అది గౌతమీపుత్ర శాతకర్ణితో ప్రారంభమైంది. తూర్పు తీరంపై ఆధిపత్యాన్ని

BRAOU

సాధించ తలపెట్టిన అయిర - మహామేఘవాహన వంశీయులతో, వారికి సంఘర్షణలు ప్రాప్తించాయి. ఆ పోరాటాలలో ప్రధాన పాత్రధారులు, భారవేలుడు, వాసిష్ఠీపుత్ర శాతకర్ణి.

కనుక, శాతవాహనులు మధ్య దక్కన్ (నేటి ఉత్తర తెలంగాణా), మరాట్వాడాలోని పరిసర భూభాగాలపై రాజ్యాన్ని నెలకొల్పి, తమ రాజ్య విస్తరణను తొలి దశలో పడమటి కనుమల వైపు, మలి దశలో తూర్పు కనుమల వైపు జరిపారు. వారు ఆంధ్ర జాతీయులు, ఆంధ్ర దేశీయులు అనే అంశాలు నిస్సంశయమైనవి.

3.3 : శాతవాహన వంశ నామం - కులం

'శాతవాహన' అనే పదానికి అర్థం, దానిపై ఆధారపడిన వారి కులం, సాంఘిక స్థితి (Social status)ని గూర్చి, చరిత్రకారులు బహు కాలంగా ఆలోచనలు చేస్తూ, అనేక సిద్ధాంతాలను ప్రతిపాదించారు.

3.3.1 : బ్రాహ్మణ-నాగ సంబంధం

జినప్రభాసూరి అనే జైన పండితుడు రచించిన **"ప్రతిష్ఠాన పురకల్ప"** మనే గ్రంథంలో, శాతవాహనుల వంశోత్పత్తిని గూర్చి, అంటే శాతవాహన వంశ ప్రతిష్ఠాపకుడైన శాతవాహనుని జన్మను గూర్చి, ఒక కథను వివరించాడు. ఆ కథ సంక్షిప్తంగా, ఒక బ్రాహ్మణ కన్య ఒక నాగ రాజును వరించి, గర్భవతై కులం నుండి వెళ్లింది. ఆమె తన సోదరులతో కలసి, ప్రతిష్ఠానపురం చేరి, ఒక కుమ్మరి ఇంట ఆశ్రయం పొంది, జీవిస్తూ ఒక నాగ బిడ్డను ప్రసవించింది. ఆ బాలుడు బాల్యంలో ఏనుగులు, గుర్రాలు, సైనికుల బొమ్మలను మట్టితో చేసి, ఆడుకొనేవాడు. విక్రమాదిత్యుడు ప్రతిష్ఠాన నగరంపై దండెత్తి వచ్చినప్పుడు, అతని తల్లి నాగ రాజును తలచుకొని ప్రార్థించగా, అతడు ప్రత్యక్షమై తన కుమారుడు చేసిన మట్టి బొమ్మలకు ప్రాణం పోశాడు. అంతట ఆ సేనలను వెంటబెట్టుకొని వెళ్ళి, ఆ బాలుడు విక్రమాదిత్యుని ఓడించాడు. నాగరాజు చేత శతాధికంగా వాహనాలను పొందినవాడు కనుక, ఆ బాలుడు శాతవాహనుడని ప్రసిద్ధుడైనాడు. అతడే ఈ వంశానికి మూల పురుషుడు.

క్రీ.శ. ఏడో శతాబ్దికి చెందిన **"ద్వాత్రింశత్పుత్తాలిక"** అనే ఒక సంస్కృత కథా కావ్యం, ఇదే కథను కొద్ది మార్పులతో వివరిస్తూ, ఆ బాలుని పేరు శాలివాహనుడని, విక్రమాదిత్యుని బదులు విక్రమార్కుడని, కథా సన్నివేశం ఉజ్జయినీ నగరమని చెప్తుంది.

3.3.2 : బ్రాహ్మణ - యక్ష సంబంధం

'కథాసరిత్సాగరం' దీపకర్ణి అనే ఒక రాజు గాథను వివరిస్తుంది. ఆ రాజు వేటకు వెళ్ళి, సింహం మూపున కూర్చున్న ఒక బాలుణ్ణి చూసి, సింహాన్ని సంహరించాడు. అంతట ఆ సింహం ఒక యక్షుని ఆకారాన్ని ధరించి, అతని ముందు నిల్చి వరించగా, ఆ ముని శాపం వలన సింహం రూపాన్ని ధరించినట్లు చెప్పి, ఆ బాలుణ్ణి దీపకర్ణికి బహూకరించాడు. ఆ బాలుడే శాతవాహనుడు; శాతవాహన వంశానికి మూల పురుషుడు.

BRAOU

3.3.3 : శాతవాహనులు - శాలివాహనులు

అయితే శాతవాహన-శాలివాహన పదాలను సమానార్థకాలుగా, పర్యాయ పదాలుగా భావించి, కొందరు చరిత్రకారులు కొన్ని ఆసక్తికరమైన అర్థాలను ప్రతిపాదించారు. సంస్కృతంలో "శాలి" అనే పదానికి వరి ధాన్యమని, 'వహన' అనగా మోయుటం, లేదా 'వాహన' అనగా మోసే బండ్లని అర్థాలు. కనుక, శాలివాహన అనగా వరి ధాన్యాన్ని పండించే రైతులు, బండ్లపై చేరవేసి వర్తకం చేసేవారని, అంతే కాని, వీరు బ్రాహ్మణులు కారని ఈ వివరణ. అయితే, ప్రాకృత వ్యాకరణ కర్తైన హేమచంద్రుడు, 'శాలివాహన' పదం కేవలం శాతవాహన పదానికి వికృతి, లేదా సంస్కృతీకరణగా నిర్ణయించాడు. అందుచేత, శాతవాహన పదానికి ఏ అర్థమో, శాలివాహన పదానికీ అదే అర్థం. అంతే కాని, అందుకు విపర్యయంగా అర్థ వివరణ కూడదు. శాతవాహన శబ్దానికి వ్యవసాయదారులనే అర్థ వివరణకు అవకాశం కన్పించదు. 10, 11 శతాబ్దాల నాటి వాఙ్మయంలో కానవచ్చే 'శాలివాహన' శబ్దం కంటే, సమకాలీన శాసనాల్లో కన్పించే శాతవాహన పదమే సరైనది, అంగీకరించదగిందిగా తోస్తుంది.

జినప్రభాసూరి 'శాతవాహన' అనగా నూరు వాహనాలు (నూరు అనగా అసంఖ్యాకం అని వాస్తవార్థం) కలవాడని, శాతకర్ణి అనగా నూను ఏనుగులు కలవాడనే అర్థాన్ని వివరించడంలో, కె. గోపాలాచారి ఒక సూచన చేశాడు. మౌర్యుల కొలువులో ఉన్నప్పుడు శాతవాహనులు తమ ప్రభువు నుండి రథాలు, ఏనుగులను పొంది ఉంటారని, ఆ కారణం చేత వారికి ఆ సార్థక నామం ఏర్పడి ఉంటుందని, దాని సారాంశం. కాని, శుంగులు, బహుశ కణ్వులు కూడా, మౌర్యుల కొలువులో ఉన్నవారే. వారు అటువంటి వాహనాలను పొందిఉండలేదని భావించడం అసంగతం. వారికి లేని శాతవాహన సార్థక నామం, ఆంధ్ర జాతీయులకు మాత్రమే ఏర్పడిందని భావించడానికి బలమైన కారణాలేవి కానరావు.

BRAOU

3.3.4 : సమీక్ష - సమాధానం

1. కథాసరిత్సాగరం, ప్రతిష్ఠానపురకల్పం మొదలైన గ్రంథాలు వివరిస్తున్న సాతుడనే యక్షుడు, లేదా నాగరాజు ఒక బ్రాహ్మణ కన్యను వరించినట్లు వర్ణించటం, కొన్ని సామాజిక పరిణామాలను సూచిస్తున్నాయని గ్రహించగలిగితే, ఈ సమస్యలకు సమాధానం లభిస్తుంది. ఆ కాలంలో వైదిక బ్రాహ్మణ సంస్కృతి స్థానిక తెగలతో సమ్మేళన చెందుతున్నట్లు, ధర్మశాస్త్రాలు నిరోధించిన, కాత్యంతర వివాహాలు సాధ్యమైనాయని ఈ గాథల లోని వాస్తవాంశం. యక్షులు ఆంధ్ర దేశం లోని ప్రాచీన తెగలలో ఒకరు. అలాగే, నాగులు యూపద్భారత దేశంలో విస్తరించిన ఆదిమ జనులు. నాగులు అనగా నాగారాధన చేస్తూ, నాగాభరణాలను ధరించే ఒక ప్రత్యేక జాతని అర్థం చేసుకోవడం తప్పు. 'నాగ' శబ్దానికి నగం నుండి పుట్టినవారు, అనగా కొండ నుండి పుట్టినవారని, పర్వత ప్రాంతాలు, వాటి అరణ్యాలలో పుట్టి పెరిగే ఆదిమ ప్రజలని అర్థం. ఏనుగుకు కూడా సంస్కృతంలో నాగం అనే అర్థం. ఏనుగును పూజించే ప్రాచీన జాతులు కొన్ని భారతదేశంలో ఉండేవి. బహుశ, యక్షులు, ఆ జాతికి చెందినవారే కావచ్చు. అలాగే, సింహం, వరాహం, మొదలైన వన్య మృగాలను, వృక్షాలను పూజించే తెగలు, మాతృ దేవతారాధన చేసే కొన్ని తెగలు, వీరందరినీ నాగులనే భావించటం యుక్తం. 'నాగ' శబ్దం ప్రత్యేకార్థమైంది కాదు; సామాన్యార్థకం.

2. శాతవాహనుడు అనే రాజును పురాణాలు ప్రస్తావించకున్న, అతడొక చారిత్రక వ్యక్తని, అతని సంతతివారు అతని పేరునే వంశ నామంగా గ్రహించి ఉంటారని భావించటం, సహేతుకం. 'సదవహన', 'శాతవాహన' పేర్లతో, కొన్ని శాతవాహన నాణేలు కానవస్తున్నాయి. నానాఘాట్ ప్రతిమా శాసనాల్లో ఒక రాకుమారుడు "కుమార శాతవాహన" అని పేర్కొనబడినాడు. కనుక, శాతవాహన అనేది ఒక వ్యక్తి నామమని స్పష్టమౌతుంది. ఇక్ష్వాకు మహారాజు సంతతి ఇక్ష్వాకులు, భరతుని సంతతి భరత వంశం, ఈ విధంగా ప్రసిద్ధ వ్యక్తుల పేర్లు, వంశ నామాలుగా, వారి సంతతివారు స్వీకరించడం, సాధారణ విషయమే. అతడు బహుశ, శ్రీముఖుని కంటె పూర్వుడని భావించడం, సహేతుకం.

3. జాన్ ప్రిజ్‌లుస్కీ (John Pryzlusky) ముండారీ భాషలో 'సదమ్' అనే పదానికి 'గుర్రం' అని, 'హొన్' లేక 'వహన్' అనే పదానికి కుమారుడని అర్థాలున్నట్లు, 'సదవహన' అనగా గుర్రం కుమారుడని వివరించాడు. ముండారీ భాషలు మాట్లాడే ఆస్ట్రిక్ జాతులు, వింధ్య, మేకల పర్వతాల చుట్టూ ఉన్న ఛోటానాగపూర్, బస్తర్ అరణ్యాలలో, నేటి మధ్యప్రదేశ్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన భూభాగాల్లో నివసిస్తున్నారు. వారు అనేక జంతు, వృక్ష ఆరాధనలను చేసేవారు. వాటి సంతతిగా చెప్పుకొనేవారు. ఈ ఆస్ట్రిక్ జాతులు ఆదిమ కాలం నుండి భారతీయ సంస్కృతికి మౌలికమైన లక్షణాలను ప్రోదిచేస్తూ ఉన్నవారని భాషా శాస్త్రవేత్తలు (Philologists), మానవ శాస్త్రవేత్తలు (Anthropologists) అంగీరించిన సత్యాలు. అటువంటి జాతుల్లో, గుర్రాన్ని ఆరాధ్య జంతువుగా కలిగిన ఒక జాతికి చెందినవారు శాతవాహనులు. గుర్రం సంతతిగా చెప్పుకుంటూ, తమ భాషలో ఏర్పర్చుకున్న జాతి నామం యథాతథంగా సంస్కృత, ప్రాకృత భాషల్లోకి ప్రవేశించిందని చెప్పొచ్చు. **"కథాసరిత్సాగరం"** లోని గాథలు కూడ, వాటిలోని అవాస్తవిక కల్పనలను తొలగిస్తే, సింహం సంతతిగా, నాగ సంతతిగా భావించుకునే కొన్ని ప్రజానీకాలు, ఆనాటి సమాజంలో చేరిపోయినట్లు సూచిస్తాయి. ప్రాచీన భారతదేశంలో అనేక రాజ వంశాలు, శాతవాహనులతో సహా తమ నాణేలపై సింహం, ఏనుగు, గుర్రం మొదలైన జంతు చిహ్నాలను ముద్రించటం, ఈ విధమైన సాంస్కృతిక పరిణామాలనే సూచిస్తుంది. క్రీస్తు పూర్వపు శతాబ్దాల నాడే, ఆంధ్రులు వింధ్య పర్వత ప్రాంతాల్లో పులింద, మూతబ, శబర మొదలైన జాతులతో కలిసి నివసిస్తున్న విషయాలు, ఈ జన, సాంస్కృతిక సమ్మేళనాలను విశదీకరిస్తాయి.

4. శాతవాహనులు బ్రాహ్మణ సంబంధంతో ఉత్పన్నమైనట్లు సూచించే పై గాథలాధారంగా కొందరు చరిత్రకారులు, ఈ రాజులు బ్రాహ్మణ కులానికి చెందినవారని భావిస్తారు. మౌర్య సామ్రాజ్య కాలంలో, ముఖ్యంగా అశోకుని బౌద్ధ మతాదరణ వలన, బ్రాహ్మణులు తమ ఆధిక్యతను కోల్పోయి, ఆ సామ్రాజ్య పతనంలో విజృంభించి, తిరుగుబాటు చేశారని, వారి అభిప్రాయం. ఆ సామ్రాజ్యాన్ని తుదముట్టించిన పుష్యమిత్రశుంగుడు అశ్వమేధ యాజి. ఆ సామ్రాజ్య శిధిలాలపై ప్రాభవాన్ని నెలకొల్పిన శాతవాహనులలో మొదటి శాతకర్ణి, అశ్వమేధ, రాజసూయాది క్రతువులను నిర్వహించినవాడు. ఇంకా అనేక క్రతువులను జరిపి, బ్రాహ్మణులకు అపారంగా దానాలను చేసినవాడని నానాఘాట్ శాసనం వివరిస్తుంది. పుష్యమిత్రశుంగుడు బ్రాహ్మణుడు. శాతవాహనులు కూడ బ్రాహ్మణులేనని, ఆ చరిత్రకారుల వాదం.

వీటిని మించిన ప్రబల సాక్ష్యాధారం, గౌతమీ బాలశ్రీ చెక్కించిన నాసిక్ శాసనం. ఈ శాసనం గౌతమీపుత్ర శాతకర్ణిని వినివతిత చాతూవంణ సంకరస, (వినివర్తిత చాతుర్వర్ణ సాంకరస్య, అగ

BRAOU

మాన నిలయ (ఆగమనాం నిలయః), ఏకబంహణ (ఏకో బ్రాహ్మణః) అని వర్ణిస్తుంది. చతుర్వర్ణాల సాంకర్యాన్ని నివారించినవాడని, ఆగమాలకు, అనగా వేద విజ్ఞానానికి నిలయుడని; అతనొక్కడే బ్రాహ్మణుడని, ఈ బిరుద వాచకాలకు అర్థం. తమ ఆధిక్యతను నిలుపుకొనేందుకు వర్ణ వ్యవస్థను నిర్మించినవారు, వర్ణ సాంకర్యాన్ని నిరోధించేవారు బ్రాహ్మణులేనని, బహుళంగా జనుల విశ్వాసం. పైగా వేద విజ్ఞానాన్ని తన లోనే నిలుపుకొని, ఏకైక బ్రాహ్మణునిగా, గౌతమీపుత్ర శాతకర్ణి ప్రసిద్ధుడు కావడం, శాతవాహనులు బ్రాహ్మణ కులానికి చెంది, బ్రాహణ మతాన్ని ఖచ్చితంగా అమలుపర్చినట్లు స్పష్టపరుస్తాయని, చరిత్రకారుల అభిప్రాయం.

ఈ వాదంలోని అన్ని అంశాలను విపులంగా చర్చించడానికి ప్రస్తుత సందర్భం అనువైనది కాదు. కాని, శాతవాహనులు బ్రాహ్మణ కులానికి చెందినవారని భావించడం సరికాదని, నిస్సంశయంగా చెప్పొచ్చు. శాతవాహనులకు సమకాలీనంగా వెలువడిన ధర్మశాస్త్ర వాఙ్మయం, కులం తల్లి నుండి సంక్రమించదని స్పష్టంగా నిర్దేశిస్తుంది. గౌతమీపుత్ర శాతకర్ణి బ్రాహ్మణుడైతే, అతనొక్కడే బ్రాహ్మణుడని చెప్పడం జరగదు. అతనికి పూర్వులైన శాతవాహన రాజులెవ్వరూ తాము బ్రాహ్మణులమని , లేదా ఏక బ్రాహ్మణులమని చెప్పుకోలేదు. అనేక వైదిక క్రతువులను నిర్వహించినట్లు మొదటి శాతకర్ణిని వర్ణిస్తున్న నానాఘాట్ శాసనం, ఆరాజు బ్రాహ్మణుడని చెప్పడం లేదు. వారు బ్రాహ్మణులైనట్లైతే, తమ గోత్రాన్ని ప్రకటించి ఉండేవారు. పల్లవులు తాము భారద్వాజస గోత్రులమని, కదంబులు హారీత గోత్రులమని, తమ శాసనాల్లో చెప్పుకోవడం, ఈ సందర్భంగా గుర్తించాల్సిన అంశం. శాతవాహనులు ఆ విధంగా వర్ణించుకొనక పోవడం, వారికి గోత్రం లేదని, అనగా బ్రాహ్మణులు కాదని స్పష్టపరుస్తున్నది. తమ బ్రాహ్మణ గోత్రాలను ప్రకటించుకొన్న పల్లవ, కదంబ, మొదలైన రాజ వంశాలను బ్రాహ్మణులుగా భావించటం, అసమంజసం. అటువంటి ప్రస్తావన లేని శాతవాహనులను బ్రాహ్మణులుగా భావించటం అసాధ్యం. "ఏక బ్రాహ్మణ" అనే శ్రేష్ఠమైన బ్రాహ్మణుడు; బ్రాహ్మణ కులంలో జన్మించిన వాడి కంటే, సంస్కారం చేత శ్రేష్ఠమైన బ్రాహ్మణుడని అర్థం చేసుకోవడం యుక్తియుక్తం.

కనుక, శాతవాహనులు జన్మ చేత బ్రాహ్మణులు కాకున్నా, తమ సంస్కారం చేత, వైదిక, ధర్మం పట్ల అపారమైన ఆసక్తి కలిగి, తమను తాము బ్రాహ్మణులుగా భావించుకొన్నట్లు గ్రహించొచ్చు. అలాగే, చాతుర్వర్ణ సాంకర్యాన్ని నిరోధించటం, గౌతమీపుత్ర శాతకర్ణి బ్రాహ్మణుడని నిరోధించటం, గౌతమీ పుత్ర శాతకర్ణి బ్రాహ్మణుడని సూచించదు. ఆనాటి ఆర్థిక అవసరాలకు అనుగుణంగా వృత్తులు, పరిశ్రమలను నిర్వహించి, వృద్ధి చేయడానికే రాజ వంశాలు వర్ణ ధర్మాన్ని సమర్థించి పరిపాలించారు. అంతే కాని, ధర్మశాస్త్రాలను నిర్వచించి విధించినందువలన, లేదా బ్రాహ్మణులు ప్రచారం చేసినందువలన, వర్ణ వ్యవస్థ బలపడలేదు. గౌతమీపుత్ర శాతకర్ణి కూడ సమాజంలోని వివిధ వృత్తి సంఘాలు, వర్తక సంఘాలు నిరాఘాటంగా అభివృద్ధి చెందాలనే దృష్టితోనే, వర్ణ సాంకర్యాన్ని నిరోధించడానికి పూనుకొన్నట్లు భావించడం, సహేతుకం.

పురాణాలు ఆంధ్ర జాతీయుడైన శిశుకుడు, లేదా సిముకుడు (శ్రీముఖుడు), "వృషలు" డని ముక్త కంఠంతో పేర్కొంటున్నాయి. వృషలుడు అనగా వర్ణ ధర్మాన్ని విస్మరించడం చేత, కులాన్ని పోగొట్టుకొన్న వాడు, లేదా కులం లేని వాడని అర్థం. శాతవాహనులు వర్ణ ధర్మంతో కూడిన వైదిక సమాజ వ్యవస్థ లోని వారు కారని, క్రమంగా ఆ మత సంస్కృతుల చేత ప్రభావితులై, వైదిక క్రతువులను నిర్వహించారని, ఈ అంశం స్పష్టం చేస్తుంది. తుదకు, తమను తాము బ్రాహ్మణులుగా భావించుకోడానికి, వారు ఆసక్తిని చూపారు. ఈ విధమైన మత, సాంస్కృతిక పరిణామాలు క్రీస్తు పూర్వపు శతాబ్దాల్లో ప్రారంభమై, క్రీస్తు శకం లోని తొలి శతాబ్దాల్లో సంభవించాయి.

BRAOU

పై పరిశీలన వలన, వైదిక సంస్కృతి దేశం లోని పలు జాతులను, తెగలను ప్రభావితం చేసిందని, ఆ ప్రభావం చేత, అంతకు పూర్వం వర్ణ ధర్మాన్ని అనుసరించని అనేక తెగలు, వర్ణ వ్యవస్థలో ప్రవేశించాయని, ఆ వ్యవస్థను నిర్వహించడానికి పూనుకొన్నారని, స్పష్టపడుతున్నది. శాతవాహనులు అటువంటి కోవకు చెందినవారు. వారి తర్వాత ఆంధ్ర దేశాన్ని పరిపాలించిన రాజ వంశాలు సైతం, అదే విధంగా ఉన్నతమైన సామాజిక స్థితిగతులను పొందడానికి, వైదిక ధర్మాన్ని, కర్మకాండను సాధనంగా గ్రహించారని భావించడం, సహేతుకం. వారిలో పల్లవులు ప్రముఖులు.

3.4 : శాతవాహన వంశ కాలానుక్రమణిక (Satavahana chronology)

శాతవాహన యుగం ఎప్పుడు ఆరంభమైంది? అంటే, శాతవాహన రాజ్య పరిపాలన ఎప్పుడు ప్రారంభమైందనేది, ఒక చిక్కు సమస్య. వారి పరిపాలన ఎప్పుడు ప్రారంభమైందో, వారు మొత్తం ఎంత కాలం పరిపాలించారో నిర్ణయించటం, అవసరం.

3.4.1 : ప్రధానమైన వాద వివాదాలు

శాతవాహన వంశ చరిత్రను గూర్చి పురాణ వాఙ్మయం ఆ వంశం లోని రాజుల సంఖ్యను, వారి పరిపాలనా కాలాలను, ఆ వంశం పరిపాలించిన మొత్తం కాలాన్ని, వివిధంగా వివరిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో పురాణాల వివరణలు స్వవచన విఘాతంగా (Self-contradictory) ఉన్నాయి. అయితే, అన్ని పురాణాలు శాతవాహన రాజ్యారంభాన్ని గూర్చి ఆంధ్రుడు, (లేదా ఆంధ్ర జాతీయుడైన) సిముకుడు, లేక శ్రీముఖుడు (కొన్ని పురాణాల్లో శిశుకుడు, సిందుకుడు, బలిపుచ్ఛకుడు) కాణ్వాయనుడైన సుశర్మ సేవకుడు (అనగా అతని కొలువులో ఉద్యోగి), అతడు తన ప్రభువును వధించి, అప్పటికి మిగిలి ఉన్న శుంగ వంశీయులను తుదముట్టించి, రాజ్యాధికారాన్ని పొందుతాడని ఏకగ్రీవంగా పేర్కొంటున్నాయి.

BRAOU

శాతవాహన వంశ చరిత్రను అధ్యయనం చేయడానికి పురాణాలన్నింటిలో **మత్స్య పురాణం** చాలా ప్రామాణికమైందని చరిత్రకారుల విశ్వాసం. ఆ పురాణం 29 మంది రాజులను పేర్కొని, ఈ 19 మంది 450 సంవత్సరాలు పరిపాలిస్తారని ప్రకటిస్తుంది. పురాణ వాక్యాల్లోని అసంబద్ధత, ఇందులో స్పష్టపడుతూంది. అలాగే, **వాయు పురాణం** 17 మంది రాజులను, వారి పరిపాలనా కాలాలను పేర్కొంటూ, ఈ 30 మంది రాజులు 456 సంవత్సరాలు పరిపాలిస్తారని పేర్కొంటూంది. **బ్రహ్మాండ పురాణం** 16 మంది రాజులను, వారి పరిపాలనా కాలాలను పేర్కొని, 30 మంది రాజులు 450 సంవత్సరాలు పరిపాలిస్తారని ప్రకటిస్తుంది. **భాగవత పురాణం** 21 మంది రాజులను మాత్రమే పేర్కొంటుంది. **భవిష్యోత్తర పురాణం** 34 మంది రాజులను, వారి పరిపాలనా కాలాలను పేర్కొని, 32 మంది రాజులు 500 సంవత్సరాలు పరిపాలిస్తారని ముగిస్తుంది. ఈ విధంగా, పురాణ వచనాల్లో ఏక వాక్యత లేకపోవడం వలన, శాతవాహన వంశీయుల కాలానుక్రమణికను నిర్మించడంలో, తీవ్ర వాదోపవాదాలు ఏర్పడినాయి. కొందరు చరిత్రకారులు **వాయు పురాణం** పేర్కొంటున్న 16 మంది, లేదా 19 మంది శాతవాహన రాజులు సుమారు 250 సంవత్సరాలు పరిపాలించారని విశ్వసిస్తున్నారు.

పురాణ వాఙ్మయం, బౌద్ధ, జైన వాఙ్మయాలు, ఇతర సాక్ష్యాధారాలన్నింటిని సమీకరించగా, మౌర్య వంశం క్రీ.పూ. 187లో అంతరించిందని నిర్ధారణగా తెలుస్తున్నది. క్రీ.పూ. 30 లో ఆంధ్ర జాతీయుడైన శ్రీముఖుడు స్వతంత్రించి, రాజ్యాన్ని స్థాపించాడని, పురాణాల ఏక వాక్యత వలన

స్పష్టపడుతూంది. శాతవాహన వంశంలో 30 మంది రాజులు 456 సంవత్సరాలు పరిపాలిస్తారనే వాక్యాన్ని ప్రామాణికంగా భావించి, కొందరు చరిత్రకారులు ఈ వంశం సుమారుగా క్రీ.పూ. 225 నుండి క్రీ.శ. 225 వరకు పరిపాలించినట్లు భావిస్తారు. లేకుంటే, క్రీ.పూ. 30 నుండి 456 సంవత్సరాలను లెక్కిస్తే, శాతవాహనులు క్రీ.శ. 426 వరకు పరిపాలించారని భావించాల్సొస్తుంది. ఈ వంశీయుల అనంతరం శ్రీపార్వతీయులు, ఆంధ్రులు, మొదలైన ఆంధ్ర భృత్య వంశాలు పరిపాలిస్తాయని పురాణాలే వివరిస్తున్నాయి. వారిలో ఆంధ్ర దేశంలో ఇక్ష్వాకులు, బనవాసిలో చుటు వంశీయులు (పురాణాలు పేర్కొంటున్న ఆంధ్ర భృత్యులైన ఆంధ్రులు) మొదలైనవారు, అపరాంత, కొంకణ, మాళ్వ భూభాగాల్లో శకులు, అభీరులు, ఇంచుమించు క్రీ.శ. 225 నాటికి స్వతంత్ర రాజ్యాలను నెలకొల్పారు. కనుక, శాతవాహనుల పరిపాలనా కాలం క్రీ.శ. 225 వరకేనని నిర్ణయించక తప్పదు. అప్పుడు ఆ వంశంలో 30 మంది రాజులు 456 సంవత్సరాలు పరిపాలించినట్లు భావించే సిద్ధాంతాన్ని, దీర్ఘకాలానుక్రమణిక (longer chronology) వాదమని వ్యవహరించొచ్చు.

3.4.2 : సంక్షిప్త కాలానుక్రమణిక

శాతవాహనుల కాలానుక్రమణికను నిర్మించిన వారిలో బహుశః ఆద్యుడైన ఆర్. జి. భండార్కర్, శ్రీముఖుడు కాణ్వులను, శుంగులను నిర్మూలించినట్లు పురాణాలు ప్రస్తావించడం వలన, ఆ రెండు వంశాలు ఏక కాలంలో పరిపాలించి ఉండొచ్చునని, ఆ వంశాల్లోని చివరి రాజులు ఆంధ్ర జాతీయుడైన సిముకునికి సమకాలికులు కావచ్చునని భావించాడు. అందుచేత, శ్రీముఖుడు క్రీ. పూ. 73లో స్వతంత్ర రాజ్యాన్ని నెలకొల్పుండొచ్చునని, ఆయన అభిప్రాయపడ్డాడు. కాని, హెచ్. సి. రాయ్‌చౌదురీ, డి. సి. సర్కార్ పండితులు, శుంగ వంశీయుల అనంతరం కాణ్వులు, వారి తర్వాత ఆంధ్రులు పరిపాలించినట్లు పురాణాలు స్పష్టంగా చెప్పున్నందున, శ్రీముఖుడు క్రీ.పూ. 30లో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడని వాదించారు. అంతేకాక, రాజుల పేర్లను, పరిపాలనా కాలాలను, వైవిధ్యంతో పేర్కొంటున్న అంశాలకు అధిక ప్రాధాన్యత నియ్యరాదని, సిముకుని రాజ్య స్థాపన గూర్చి ఏకగ్రీవంగా పేర్కొంటున్న అంశానికే, పురాణ ప్రామాణ్యాన్ని అంగీకరించటం యుక్తమని వారి నిర్ణయం. **వాయు పురాణం** పేర్కొనే సంక్షిప్తమైన రాజుల పట్టికను గ్రహించి, శాతవాహన సామ్రాజ్యం క్రీ.పూ. 30 నుండి క్రీ.పూ. 225 వరకు రెండున్నర శతాబ్దులు నిల్చినట్లు, వారు నిర్ణయించారు. వీరి సిద్ధాంతాన్ని క్లుప్త కాలానుక్రమణిక (shorter chronology) వాదమని వ్యవహరించొచ్చు.

3.4.3 : దీర్ఘ కాలానుక్రమణికలు - విమర్శ

ఎఫ్.ఇ. పార్జిటర్ వివిధ పురాణాల్లో రాజ వంశాల పట్టికలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, వాటిని ఒక దానితో ఒకటి సరిపోల్చి, తయారుచేసిన పట్టికల్లో శాతవాహన (లేదా ఆంధ్ర) రాజుల పట్టిక ఉంది. అది ఇంచుమించు **మత్స్య పురాణం** పేర్కొనే పట్టికకు సరిపోతుంది. అందుచేతనే, చరిత్ర కారులు శాతవాహన చరిత్రకు **మత్స్య పురాణం** అన్నింటికంటె విశ్వసనీయమైందిగా అభిప్రాయపడ తారు. పార్జిటర్ తయారుచేసిన పట్టికను ఆధారంగా గ్రహించి, ఆచార్య. మిరాశీ, కె. గోపాలాచారి, గుర్తి వెంకటరావ్, ఓరుగంటి రామచంద్రయ్య, మారేమండ రామారావు గార్లు, శాతవాహన వంశం సుమారు క్రీ.పూ. 220 నుండి 456 సంవత్సరాలు పరిపాలించిందని నిర్ణయించారు. **వాయు పురాణ** కొన్ని రాత ప్రతులు ప్రధానమైన రాజులను మాత్రమే పేర్కొంటున్నట్లు ('ప్రాధాన్యతః ప్రవక్ష్యామి') ఎత్తి చూపి, క్లుప్తమైన రాజుల పట్టికను గ్రహించి, కాలానుక్రమణికను నిర్ణయించడాన్ని, వారు వ్యతిరేకించారు.

BRAOU

దీర్ఘ కాలానుక్రమణికను సమర్థించే పండితులు, నానాఘాట్ గుహల్లోని నాగానిక అనే శాతవాహన రాణి చెక్కించిన శాసనం లోని అక్షరాలు, అశోకుని శాసనాల లోని అక్షరాలతో సరిపోలుతాయని, బూలర్ పండితుని వచనాన్ని పేర్కొంటారు. అంటే, అశోకుని శాసనాలతో పోల్చదగినది కనుక, నానాఘాట్ శాసనం క్రీ.పూ. 200 నాటికి చెందినట్లు, ఆ శాసనం వర్ణిస్తున్న శాతకర్ణి క్రీ.పూ. 200 నాటివాడని వాదిస్తారు. కాగా, శాతకర్ణి తండ్రి, శాతవాహన వంశ స్థాపకుడైన సిముకుడు, క్రీ.పూ. 225లో ఆ వంశ పాలనను నెలకొల్పినట్లు ఈ వర్గం చరిత్రకారుల సిద్ధాంతం.

ఆచార్య గుర్తి వెంకటరావుగారు ఈ వాదాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళారు. ప్రాచీన రచయిత ప్లినీ, మెగస్తనీస్ **'ఇండికా'** గ్రంథ ఆధారంగా, ఆంధ్రులు మౌర్య చంద్రగుప్తుని కాలం నాటికే, మౌర్యుల వలె అత్యంత ప్రబలమైన సైన్యాన్ని కలిగిఉన్నట్లు పేర్కొన్నాడు. కాగా, ఆంధ్రులు మౌర్య చంద్రగుప్తునికి లోబడినా, బిందుసారుని మరణానంతరం పాటలీపుత్రంలో సింహాసనం కొరకు జరిగిన అంతఃకలహాల్లో, సిముకుడు స్వతంత్రించటానికి అవకాశం ఏర్పడి ఉంటుందని, గుర్తి వెంకటరావుగారు ఊహించారు. క్రీ.పూ. 271లో బిందుసారుడు మరణించగా, క్రీ.పూ. 267లో నాలుగేండ్ల తరువాత అశోకుడు పట్టాభిషేకం చేసుకొన్నాడు. అటువంటి సంక్షోభ సమయంలో, సిముకుడు స్వతంత్రించాడని ఆయన సిద్ధాంతం. ఈ సిద్ధాంతాన్ని ఆచార్య ఓరుగంటి రామచంద్రయ్యగారు కూడ అంగీకరించి, అనుసరించారు.

విన్సెంట్ స్మిత్ **వాయు పురాణం** నుండి తెలియవస్తున్న క్లుప్తమైన రాజుల పట్టికను, ఇతర పురాణాల వలన తెలియవస్తున్న సుదీర్ఘమైన రాజుల పట్టికతో సమన్వయపర్చి, ఒక అంగీకారయోగ్యమైన శాతవాహన రాజుల పట్టికను రూపొందించడానికి ప్రయత్నించాడు. **వాయు పురాణం** శుంగ, కాణ్వ రాజుల పరిపాలనా కాలాన్ని మాత్రమే పరిగణించి ఉంటుందని, తక్కిన పురాణాలు ఆ రెండు వంశాల పరిపాలనా కాలాన్ని మాత్రమే పరిగణించి ఉంటాయని, ఆయన సూచించాడు. మరో విధంగా చెప్పాలంటే, క్రీ.పూ. 225 లో, లేదా 271లో, శ్రీముఖుడు స్వతంత్రమైన ఆంధ్ర రాజ్యాన్ని నెలకొల్పినట్లు అభిప్రాయపడిన చరిత్రకారులందరు, శాతవాహనులు శుంగ, కాణ్వ వంశీయులతో సమకాలీనంగా పరిపాలించినట్లు భావించినవారే. కనుక, వారు కాణ్వ సుశర్మను శాతవాహన రాజు శ్రీముఖుడు కాక, ఆ తర్వాతి వారెవ్వరో వధించినట్లు ఊహిస్తారు. అలాగే, విన్సెంట్ స్మిత్ పుష్యమిత్ర శుంగుడు, శ్రీముఖుడు, ఖారవేలుడు సమకాలీనులని, శ్రీముఖుని కుమారుడైన మొదటి శాతకర్ణి, ఖారవేలునిపై విజయం సాధించాడని భావించాడు. కాగా, కాణ్వ సుశర్మను వధించి, పాటలీపుత్రాన్ని ఆంధ్ర శాతవాహన రాజైన మొదటి పులోమావి ఆక్రమించాడని, పులోమావి వలన ప్రఖ్యాతి చెందిన కారణాన, పురాణాలు ఆంధ్రులను "పులోము"లనే పర్యాయ పదంతో పిలుస్తాయని అభిప్రాయపడ్డాడు.

పురాణాలు ఏకంగా కాణ్వ సుశర్మను వధించిన ఆంధ్ర రాజు శ్రీముఖుడని పేర్కొంటూ ఉండగా, అటువంటి ఏకాభిప్రాయాన్ని విస్మరించి, ఆంధ్రులు శుంగ, కాణ్వ వంశాలకు సమకాలీనంగా పరిపాలించినట్లు భావించడంలో ఔచిత్యం కాన రాదు. అది కేవలం 30 మంది ఆంధ్ర రాజులు 450 సంవత్సరాలు పరిపాలించారని పురాణ వాఙ్మయం అనూచానంగా చెప్పిన వాక్యాన్ని యథాతథంగా బుజువు చేయాలనే ఉద్దేశంతో ఏర్పర్చిన సిద్ధాంతం. కొందరు చరిత్రకారులు ఈ సిద్ధాంతాన్ని పురావస్తు ఆధారాల ననుసరించి సమర్థించడానికి కూడ ప్రయత్నించారు. నెవాసా (మహారాష్ట్రలోని ఒక గ్రామం) వద్ద జరిగిన త్రవ్వకాలలో లభించిన శాతవాహన, శాతకర్ణి రాజుల నాణేలు, వాటితో బాటుగా లభ్యమైన ఇనుప పనిముట్లు, మృణ్మయ పాత్రల శకలా లాధారంగా, ఆ నాణేలు క్రీ.పూ.

BRAOU

2వ శతాబ్దానికి చెందేవిగా, శాతవాహనులు క్రీ.పూ. 225లో అధికారాన్ని స్థాపించినట్లు అవి ఋజువు చేసేవిగా, వారు వాదిస్తారు. అయితే, మొదట్లో అవి క్రీ.పూ. మొదటి శతాబ్దికి చెందిన భూమి పొరల్లో (strata) లభించినట్లు భావించి, తర్వాతి శాతవాహన నాణేల వలన, క్రీ.పూ. రెండవ శతాబ్దికి చెందేవిగా సవరించినట్లు, ఆ తర్వాత క్రీ.పూ. రెండవ శతాబ్దికి చెందిన భూమి పొరల్లో శాతవాహన నాణేలు లభించినట్లు నిర్ణయించడం జరిగిందని, అది చాలా అసమంజసమైన నిర్ణయమని, ఆచార్య అజయ్‌మిత్రశాస్త్రి ఖండించారు.

3.4.4 : శాసనాధారాలు - సమకాలీనతలు

శాతవాహన వంశ చరిత్రను అధ్యయనం చేయడానికి పురాణ వాఙ్మయం కంటే శాసనాలు, నాణేలను ప్రధానమైన సాక్ష్యాధారంగా గ్రహించడం, యుక్తం. వాటి వలన తెలియవస్తున్న రాజులనే, వాస్తవమైన చారిత్రక వ్యక్తులుగా భావించి, పురాణ పట్టికల నుండి ఆ రాజులను మాత్రమే గ్రహించి, కాలానుక్రమణికను తయారుచేయాల్సుంటుంది. పురాణ వాఙ్మయంలో రాజుల పేర్లు, వారి పరిపాలనా కాలాలను అనేక విధాలుగా పేర్కొంటున్నందున, రాజుల సంఖ్య, వారి మొత్తం పరిపాలనా కాలాన్ని గూర్చి ఏకాభిప్రాయం లేనందున, ఈ సందర్భంలో వాఙ్మయాన్ని స్పర్శించకపోవడం యుక్తం.

శాతవాహనుల కాలానుక్రమణికను నిర్మించడానికి సరైన ప్రణాళిక, వారికి, వారి సమకాలీన రాజ వంశాలకు మధ్య సంబంధాలను గూర్చి లోతుగా విచారించడం. అందులో ప్రధానమైంది, శాతకర్ణి-ఖారవేలుని సమకాలీనత; రెండవది, శక-శాతవాహన సంబంధాలు.

BRAOU

3.4.4.1 : శాతకర్ణి - ఖారవేలుని సమకాలీనత

కళింగాన్ని పరిపాలించిన అయిర - మహామేఘవాహన వంశీయుడైన ఖారవేలుని హథిగుంఫ శాసనం, ఆ రాజు తన రెండవ రాజ్య సంవత్సరంలో శాతకర్ణిని లెక్కచేయక పంపిన సేనలు, పశ్చిమ దిశగా నడిచింది శాతవాహన రాజ్యంపైనేనని గ్రహించొచ్చు. శాతకర్ణి నామధేయులైన రాజులు ప్రాచీన కాలంలో శాతవాహన వంశీయులే. ఆ శాతకర్ణి శాతవాహన వంశంలో మూడవ వాడైన మొదటి శాతకర్ణి అని, చరిత్రకారుల అభిప్రాయం. కాని, ఇటీవలి పరిశోధనల వలన, ఈ అభిప్రాయాన్ని విడనాడవలసి వస్తున్నది. ఖారవేలునికి శాతకర్ణితో సంఘర్షణ కలిగిన కారణాన్ని గుర్తించగలిగితే, ఆ శాతకర్ణిని గుర్తించడం, సులువు కాగలదు. ఈ పరిశోధనలు వారు ఉభయులు తూర్పు తీరమైదానాలను ఆక్రమించి, తమ ఆధిపత్యం క్రిందకు తెచ్చుకోడానికి పూనుకోవడంతో ఈ సంఘర్షణలు ప్రాప్తించినట్లు, స్పష్టపరుస్తున్నాయి. ఈ సంఘటనలను గూర్చి విశదంగా తెలియడానికి ముందు, గౌతమీపుత్ర శాతకర్ణి కంటే ముందు, శాతవాహన వంశీయులకు తీరాంధ్రంపై ఆధిపత్యం లేదని గుర్తించాలి. ఆ సంఘటనలు సుమారు క్రీ.శ. 140 ప్రాంతానికి చెందినవిగా, స్పష్టమౌతున్నది. దీని వలన, శాతవాహనుల కాలానుక్రమణికను నిర్మించడానికి కొంత ఆధారం లభించినట్లౌతుంది.

3.4.4.2 : శక - శాతవాహన సంబంధాలు

వాసిష్ఠీపుత్ర పులుమావి 19వ రాజ్య సంవత్సరంలో, ఆరాజు పితామహుడైన గౌతమీ బాలశ్రీ ఒక నాసిక్ గుహాలయంలో చెక్కించిన ప్రశస్తి శాసనం, ఆమె కుమారుడైన గౌతమీపుత్ర శాతకర్ణి విజయాలను, సామ్రాజ్య విస్తరణను చక్కని వచన కావ్యం వలె వర్ణిస్తుంది. ఆ శాసనం గౌతమీపుత్ర

శాతకర్ణిని **సక యవన పల్లవ నిసూదన ఖఖరాతవస నిరవసేసకర, క్షహరాట వంశ నిరవశేషకర** అనే బిరుదాలతో వర్ణించి, ఆ రాజు శకుల పైన, క్షహరాతుల పైన సాధించిన విజయాలను వివరిస్తుంది. శక-క్షహరాతులతో శాతవాహనుల సంఘర్షణలను గూర్చి మొట్టమొదట ప్రస్తావించేది ఈ శాసనమే. శకులలో క్షహరాతులు ఒక శాఖ; వారు నహపానుని ఆధిపత్యంలో మాళ్వ, సురాష్ట్ర, అపరాంత మొదలైన భూభాగాలతో కూడిన విశాల సామ్రాజ్యాన్ని స్థాపించారు. ఆ ప్రాంతాలు లోగడ శాతవాహనుల ఆధిపత్యం లోనివి.

సుమారు క్రీ.శ. 80లో ఒక అజ్ఞాత గ్రీక్ నావికుడు రచించిన **"పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ"** అనే గ్రంథం, ఉజ్జయినీలో మాంబనస్ అనే రాజు పరిపాలిస్తున్నట్లు, లోగడ పెద్ద (elder) సారగనస్ పరిపాలనా కాలంలో కళ్యాణ రేవు పట్టణం నుండి చట్టబద్ధంగా గ్రీక్‌లు వర్తకం చేసుకోగలిగేవారు; కాని సాండరస్ ఆ నగరాన్ని ఆక్రమించిన నాటి నుండి గ్రీక్‌ల వర్తకానికి అవరోధాలు ఏర్పడ్డాయి; అక్కడికి చేరే గ్రీక్ నౌకలు సైనిక బలగాల అదుపులో భరుకచ్ఛానికి మళ్ళించే ప్రమాదం ఏర్పడింది" అని పేర్కొంది. **పెరిప్లస్** ప్రస్తావించిన మాంబనస్ నహపానుడని, కొందరు చరిత్రకారులు అభిప్రాయపడతారు.

నహపానుడు, అతని అల్లుడైన ఉసవదత్తుడు (ఋషభదత్తుడు) వేసిన శాసనాలు, మాళ్వ, సురాష్ట్ర, అపరాంత, కొంకణ జనపదాల్లో కానవస్తున్నాయి. ఈ శాసనాలు, శాతవాహన సామ్రాజ్యం లోని పశ్చిమ తీర ప్రాంతాలను. వాటితోపాటు మరి కొన్ని భూభాగాలు నహపానుని ఆధిపత్యంలో ఉన్నట్లు నిరూపిస్తాయి. సాండరస్ క్షహరాతుల ప్రతినిధిగా కొంకణ ప్రాంతాన్ని ఆక్రమించి, పరిపాలిస్తున్న ప్రాదేశిక పరిపాలకుడని తోస్తుంది. అతడు కళ్యాణ రేవు పట్టణాన్ని శాతవాహన సామ్రాజ్యానికి ఉపయోగించకుండ అరికట్టాడని, స్పష్టమౌతుంది.

జున్నార్ గుహాలయాల్లో నహపానుడు చెక్కించిన, 46వ సంవత్సరం నాటి శాసనముంది. అతని అల్లుడైన ఉసవదత్తుని (ఋషభదత్తుడు) నాసిక్ గుహాలయాల్లో 45 వ సంవత్సరం నాటి శాసనముంది. ఈ సంవత్సరాలను శక సంవత్సరాలుగా డి.సి.సర్కార్, వి.వి.మిరాశీ పండితులు నిర్ధారణ చేశారు. కనుక, నహపానుని జున్నార్ శాసనం క్రీ.శ. 124 సంవత్సరం నాటిదిగా (78+46), స్పష్టపడుతూంది.

జోగల్‌తంబి అనే గ్రామం (మహారాష్ట్ర లోని నాసిక్ జిల్లా లోనిది) వద్ద లభించిన నాణేల నిధి, వేల సంఖ్యల్లో లోగడ నహపానుడు ముద్రించి, చెలామణి లోనికి తీసికొనిరాగా, గౌతమీపుత్ర శాతకర్ణి పునర్ముద్రించి, విడుదల చేసినట్టివి వెలుగులోకి వచ్చాయి. క్షహరాతుడైన నహపానుని ఓడించి, తన విజయ సూచకంగా గౌతమీపుత్ర శాతకర్ణి ఈ నాణేలను పునర్ముద్రించి, విడుదల చేసినట్లు చరిత్రకారులు భావిస్తారు. నాసిక్ గుహల్లో, గౌతమీపుత్ర శాతకర్ణి తన 18వ రాజ్య సంవత్సరంలో లోగడ ఉసవదత్తుని అధీనంలో ఉన్న 'అజకాలకీయ' అనే పేరు గల క్షేత్రాన్ని (పంట పొలాన్ని) తాను తిరిగి ప్రదానం చేస్తున్నట్లు ప్రకటిస్తూ, ఒక శాసనాన్ని చెక్కించాడు. ఈ శాసనం వలన గౌతమీపుత్ర శాతకర్ణి తన 18వ రాజ్య సంవత్సరం నాటికే క్షహరాతులను ఓడించి, వారి అధికారాన్ని నిర్మూలించినట్లు స్పష్టపడుతున్నది. క్షహరాతుల కాలక్రమణికను అనుసరించి, ఈ సంఘటన క్రీ.శ. 124లో జరిగినట్లు, పైన వివరించడం జరిగింది. అయితే, గౌతమీపుత్ర శాతకర్ణి తన 18వ రాజ్య సంవత్సరం నాటి శాసనాన్ని వైజయంతి వద్ద వేశాడు. వైజయంతి కుంతల దేశ రాజధాని. ఈ శాసనం ఆ రాజు క్షహరాతులపై విజయం సాధించిన తర్వాత, కొంత కాలానికి వైజయంతిపై దండెత్తినట్లు సూచిస్తూంది. గౌతమీపుత్ర శాతకర్ణి అంతకు రెండు, మూడు సంవత్సరాల క్రిందట,

BRAOU

క్షహరాత నిర్మూలన చేసినట్లు భావించటం సబబు. అంటే, క్రీ.శ.124వ సంవత్సరాన్ని గౌతమీపుత్ర శాతకర్ణి 15 వ రాజ్య సంవత్సరంగా భావిస్తే, అతడు క్రీ.శ. 109-10లో సింహాసన మధిష్ఠించినట్లు నిర్ణయించొచ్చు.

3.4.4.3 : సమన్వయం - సమాధానం

శాతవాహన రాజులు, లేదా ఆంధ్రులని పురాణాలు పేర్కొంటున్న పేర్లలో, శాసనాలు, నాణేలు సమర్థించిన రాజులు కాక, తక్కిన వారిని ఉప శాఖలకు చెందినవారని, లేదా పురాణ కర్తలు పొరబాటుగా పేర్కొన్నవారని భావించి, వదిలివేయడం, యుక్తం. పైన చర్చించిన విధంగా, గౌతమీపుత్ర శాతకర్ణి పరిపాలనా కాలాన్ని ఆధారంగా గ్రహించి, శాసనాలు, నాణేల వలన తెలియవస్తున్న రాజులను మాత్రమే గ్రహించి, ఈ క్రింద చూపిన విధంగా శాతవాహనుల కాలానుక్రమణికను ఏర్పర్చవచ్చు.

1. శ్రీ ముఖ శాతవాహనుడు నానాఘాట్ ప్రతిమా శాసనాలు, కోటిలింగాల నాణేల వలన తెలియవస్తున్నాడు. అతడు 23 సంవత్సరాలు పరిపాలించినట్లు పురాణాలు తెల్పుతున్నాయి. అతడు తన పరిపాలన చివరి సంవత్సరాల్లో సుశర్మ కాణ్వాయనునిపై తిరుగుబాటు చేసి ఉంటాడనే డి.సి. సర్కార్ సూచన అంగీకరించదగింది. అతని పరిపాలనా కాలాన్ని క్రీ.పూ. 50 నుండి, క్రీ.పూ. 27 వరకు నడిచినట్లు నిర్ణయించొచ్చు.

2. **కన్హ (లేక కృష్ణ) శాతవాహనుడు:-** ఒక్క నాసిక్ శాసనం ఇతన్ని ప్రస్తావిస్తుంది. పురాణాలు ఇతడు 18 సంవత్సరాలు పరిపాలించినట్లు చెప్తున్నాయి. కనుక, ఇతడు క్రీ.పూ. 27 నుండి 9 వరకు పరిపాలించినట్లు నిర్ణయించొచ్చు.

3. **మొదటి శాతకర్ణి:-** నాగానిక నానాఘాట్ గుహలో చెక్కించిన ప్రతిమా శాసనాలు ఆమె భర్తైన శాతకర్ణిని పేర్కొంటున్నాయి. ఇతడు శాతవాహన వంశంలో మూడవ రాజైనట్లు, 10 సంవత్సరాలు పరిపాలించినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. ఆ గుహ లోని సుదీర్ఘ శాసనం ప్రారంభంలో "దక్షిణాపథ పతి" అని, తర్వాత రెండు అశ్వమేధాలు, ఒక రాజసూయాన్ని చేసినట్లు గాను వర్ణిస్తున్నది, ఈ రాజునే కావచ్చు. **రఞోసదకణిస, రఞోసాతకణిస** అనే పేర్లతో దక్షిణాపథం అంతట, వింధ్య పర్వతాలకు ఆవల మాళ్వ, సురాష్ట్ర ప్రాంతాల్లోను విస్తృతంగా లభిస్తున్న నాణేలు, సాంచి స్తూప దక్షిణ ద్వార తోరణంపై ఉన్న శాసనం, ఈ రాజుకు చెందినవి కావచ్చు. ఈ నాణేలు, శాసనాధారాల వలన, ఇతడు గొప్ప విజేత, సామ్రాజ్య నిర్మాతైనట్లు కానవస్తాడు. ఇతని తర్వాత రాజైన పూర్ణోత్సంగుని అనంతరం, ఒక శాతకర్ణి 56 సంవత్సరాలు పరిపాలించినట్లు పురాణ వాఙ్మయం పేర్కొంటున్నది. శాతకర్ణి నామధేయులైన ఈ ఇద్దరు రాజులు వాస్తవంగా ఒకరేనని, అతడు గొప్ప విజేత, సామ్రాజ్య విస్తారకుడని, తన దిగ్విజయాలను ప్రకటిస్తూ రెండు అశ్వమేధాలు, ఒక రాజసూయాన్ని నిర్వహించాడని భావించడం, సమంజసం. అతడు నాగానిక భర్త. క్రీ.పూ. 9 నుండి క్రీ.శ. 47 వరకు పరిపాలించాడని భావించొచ్చు.

4. శాతకర్ణి తర్వాత పురాణాలు పూర్ణోత్సంగుడనే రాజును పేర్కొన్నాయి. కాని, అతడు శాసనాధారాల వలన, నాణేల వలన నిర్ధారితుడు కాడు. అందుచేత, అతన్ని వాస్తవంగా చారిత్రక వ్యక్తని విశ్వసించడానికి అవకాశం లేదు. కాని, నానాఘాట్ ప్రతిమా శాసనాల వలన, నాగానిక-శాతకర్ణి రాజ దంపతుల కుమారులు, కుమారహకుసిరి, కుమార శాతవాహన అనే ఇద్దరు

BRAOU

రాజకుమారులు స్పష్టంగా తెలియవస్తున్నారు. వీరికంటే జ్యేష్ఠుడైన మరొక రాకుమారుడు కూడ ఉన్నట్లు తెలుస్తున్నది. కాని, అతని పేరు శిథిలమైంది. నానాఘాట్ సుదీర్ఘ శాసనం "వేదిసిరి" అనే రాకుమారుడు ఉన్నట్లు, అతడు శాతకర్ణి అనంతరం సింహాసన మధిష్ఠించి పరిపాలించినట్లు సూచిస్తూందని, కొందరు చరిత్రకారులు అభిప్రాయపడతారు. కాని, దక్కన్ పీఠభూమిపై అనేక చోట్ల సదవహన, లేక శాతవాహన, సతిసిరి అనే ఇద్దరు రాజుల నాణాలు, చాలా చోట్ల శాతకర్ణి నాణేలతో కలసి, లభిస్తున్నాయి. వీరిలో సతిసిరి, లేక శక్తిసిరి, నానాఘాట్ ప్రతిమా శాసనాల లోని కుమార శాతవాహనుడే కావచ్చు. ఈ రాజుల నాణాలు లభిస్తున్నా, పురాణ వాఙ్మయం వీరిని పేర్కొనడం లేదు. కనుక, పురాణ వాఙ్మయాన్ని విస్మరించి, వీరికి శాతవాహన వంశ కాలానుక్రమణికల్లో స్థానాన్నేర్పచ్చాల్సుంటుంది. ఈ రాజులు క్రీ.శ. 47 నుండి 81 వరకు పరిపాలించినట్లు నిర్ణయించొచ్చు.

5. పురాణ వాఙ్మయం 56 సంవత్సరాలు పరిపాలించినట్లు పేర్కొనే శాతకర్ణి, శాతవాహన వంశంలో ఐదవ వాడు. ఆ వాఙ్మయం అతని తర్వాత 21 వ వాడైన శివస్వాతి వరకు పేర్కొంటున్న 15 మంది రాజులలో, ఒక్క అపీలకుడు మాత్రమే, ఒక నాణెం వలన నిర్ధారణగా తెలియవస్తున్నాడు. అతడు ఛత్తీస్‌గడ్ ప్రాంతం లోని ఒక శాతవాహన వంశ శాఖకు చెందినవాడని, ప్రధాన వంశానికి చెందినవాడు కాడని నిర్ణయించొచ్చు. తక్కిన వారిలో 12వ వాడైన కుంతల శాతకర్ణి, 17వ వాడైన హాలుడు, కొన్ని వాఙ్మయాధారాల వలన తెలియవస్తారు. కాని, అవి యథార్థమైన పేర్లో, ప్రసిద్ధ నామాలో (nick names) చెప్పడం కష్టం. శాసనాధారాలు, నాణేల వలన నిర్ధారితులు కారు. కనుక, ఈ రాజులు వాస్తవ వ్యక్తులు కారని నిర్ణయించడమే, యుక్తం.

21 వ వాడైన శివస్వాతి 28 సంవత్సరాలు పరిపాలించినట్లు, అన్ని పురాణాలు ఏక వాక్యంగా తెలుపుతున్నాయి. పురాణ పట్టికల ఏక వాక్యత అంగీకరించదగిన సాక్ష్యాధారం. కనుక, ఇతడు నిస్సందేహంగా చారిత్రక వ్యక్తి. అంతే కాక, ఇతని తర్వాత సింహాసనన మధిష్ఠించిన గౌతమీపుత్ర శాతకర్ణి, ఈ వంశంలో అత్యంత ప్రసిద్ధుడు. శాసనాధారాలు, నాణేల వలన నిర్ధారణ అయినవాడు. ఆ రాజు తర్వాత పరిపాలించిన శాతవాహన రాజు లందరు శాసనాధారాలు, నాణేలు నిరూపిస్తున్నవారే. కనుక, శివస్వాతి నుండి చివరి రాజైన చండశ్రీ, లేదా పులోమావి వరకు, శాతవాహన రాజు అందరు వాస్తవమైన చారిత్రక వ్యక్తులని, నిస్సందేహంగా చెప్పొచ్చు. లభిస్తున్న వాఙ్మయ, శాసనాధారాలు, నాణేల వలన, ఈ రాజుల వంశ క్రమాన్ని, పరిపాలనా కాలాలను ఈ క్రింది విధంగా ఏర్పర్చొచ్చు.

శివస్వాతి	-	క్రీ.శ. 81-109
గౌతమీపుత్ర శాతకర్ణి	-	క్రీ.శ. 109-133
వాసిష్ఠీపుత్ర పులుమావి	-	క్రీ.శ. 133-161
వాసిష్ఠీపుత్ర శాతకర్ణి	-	క్రీ.శ. 161-179
శివశ్రీ పులుమావి	-	క్రీ.శ. 179-186
గౌతమీపుత్ర శ్రీయజ్ఞశాతకర్ణి	-	క్రీ.శ. 186-215

6. గౌతమీపుత్ర శ్రీయజ్ఞ శాతకర్ణి తర్వాత, విజయ శాతకర్ణి 6 సంవత్సరాలు, అతని తర్వాత చంద్రశ్రీ 7 సంవత్సరాలు పరిపాలించినట్లు, పురాణ వాఙ్మయం పేర్కొంటూంది. విజయ శాతకర్ణి 6వ రాజ్య సంవత్సరం నాటి శాసన మొకటి, నాగార్జునకొండ త్రవ్వకాలలో లభించింది.

BRAOU

కనుక, అతని పరిపాలన క్రీ.శ. 215 నుండి క్రీ.శ. 221 వరకు జరిగినట్లు నిర్ణయించొచ్చు. చంద్రశ్రీ 6వ రాజ్య సంవత్సరం నాటి శాసనం, తూర్పు గోదావరి జిల్లా కొదవలి గ్రామం వద్ద లభిస్తున్నది. అతని నాణేలు విస్తారంగా కోస్తా జిల్లాలలో లభించాయి. కనుక, అతడు క్రీ.శ. 221 నుండి 228 వరకు, 7 సంవత్సరాలు పరిపాలించినట్లు భావించొచ్చు. కాని, చివరి రాజైన పులుమావి శాతవాహన మూల వంశం లోనివాడు కానట్లు తోస్తుంది. కొన్ని పురాణాలు చంద్రశ్రీ తర్వాత పులోమావి, ఇంకా అనేక ఇతరులు పరిపాలిస్తారని పేర్కొంటున్నాయి. అతని శాసన మొకటి బళ్ళారి జిల్లా (కర్ణాటక)లోని మ్యాకదోని వద్ద లభించింది. అతని నాణేలు తరహల నిధిలో లభించాయి. నిధిలో లభించే నాణేలు ఆ రాజులు ఎక్కడ పరిపాలించారో స్పష్టపర్చలేవు. కనుక, చంద్రశ్రీ తర్వాత, తీరాంధ్ర దేశంలో ఇక్ష్వాకు వంశీయుడైన వాసిష్ఠీ పుత్ర సిరిచాంతమూలుడు స్వతంత్రించినట్లు, శాతవాహన వంశ పరిపాలన ముగిసినట్లు, భావించొచ్చు. అప్పటి రాజకీయ కల్లోలంలో పులుమావి కర్ణాటక ప్రాంతానికి పారిపోయి, అక్కడ కొంత కాలం పరిపాలించి ఉండొచ్చు. లేదా, అతడు శాతవాహన మూల శాఖకు కాక, కర్ణాటకంలో పరిపాలించిన ఏదో ఒక ఉప శాఖకు చెందినవాడు కావచ్చు.

పురాణ పట్టికలు పేర్కొనని, శాసనాధారాల వలన నిర్ధారణ కాని, కొందరు రాజులు 'శాతకర్ణి' అనే నామాంతం కలిగినవారు, నాణేల వలన తెలియవస్తున్నారు. కౌశికీపుత్ర శాతకర్ణి, రుద్ర శాతకర్ణి, కుంభ శాతకర్ణి, కర్ణ శాతకర్ణి, వారిలో ప్రముఖులు. వీరందరు శాతవాహన వంశీయులని భావిస్తే, చంద్రశ్రీ తర్వాత పలు ప్రాంతాల్లో స్థానిక ప్రభుత్వాలను నెలకొల్పిన ఉప శాఖలకు చెందినవారని గుర్తించొచ్చు.

BRAOU

3.5 : శాతవాహనులు : రాజకీయ చరిత్ర

ఆంధ్ర జాతీయుడైన సిముకుడు (శ్రీముకుడు), కాణ్వాయనుడైన సుశర్మను వధించి, శేషించిన శుంగుల అధికారాన్ని తుదముట్టించి, రాజ్యాన్ని స్థాపిస్తాడని పురాణాలు వివరిస్తున్న సంఘటనతో, శాతవాహన వంశీయుల రాజకీయ చరిత్ర ప్రారంభమౌతున్నది.

3.5.1 : శ్రీముఖుడు

శాతవాహన రాజ్య స్థాపకుడైన సిముకుని పేరును, ఒక్కొక్క పురాణం ఒక్కొక్క విధంగా పేర్కొంటున్నది. **మత్స్య పురాణం** శిశుకుడని, **వాయు, బ్రహ్మాండ పురాణాలు** సిందుకుడని, **విష్ణు పురాణం** బలిపుచ్ఛకుడని, **భాగవత పురాణం** బలి అని, ఇతన్ని పేర్కొంటున్నాయి. కాని, అన్ని పురాణాలు ఇతడు 23 సంవత్సరాలు పరిపాలించాడని ఏక వాక్యంగా చెప్తున్నాయి. ఇతడు తన పరిపాలన చివరి కాలంలో కాణ్వ సుశర్మను వధించి ఉంటాడని, డి.సి. సర్కార్ అభిప్రాయపడ్డాడు. ఆయన అభిప్రాయం సహేతుకమేనని భావించొచ్చు.

నానాఘాట్ గుహాలయంలోని ప్రతిమా శాసనాల్లో ఒకటి, **రాయసిముక శాతవాహన సిరిమతో** అని ఇతన్ని పేర్కొంటున్నది. కోటిలింగాల వద్ద లభించిన నాణేల్లో కొన్ని, **"రఞో ఛముక"** అని, రాజు పేరు ముద్రించినవి కానవస్తున్నాయి. ప్రాచీన ఆంధ్ర దేశంలో వాడుకలో ఉన్న ప్రాకృత భాషలో 'చకారం', 'స' కారం ఒక దానికి ఒకటి ఉపయుక్తం కావడం, సాధారణ విషయం. కనుక, కోటిలింగాల వద్ద లభించిన నాణేలు సిముకునివే అని, నాణేల వలన, శాసనాధారాల వలన ఇతని పేరు 'సిముకుడు' లేక 'సిముక శాతవాహను'డని నిర్ణయించొచ్చు.

పురాణాలు ఆంధ్ర జాతీయుడైన సిముకుడు (శ్రీముఖుడు) తన జాతి వారితో కలిసి, రాజ్యాన్ని స్థాపిస్తాడని పేర్కొనడం వలన, అతడు ఆంధ్ర జాతికే కాక, ఆంధ్ర జాతిలో విలీనమైన ఇతర జాతులు, తెగలకు కూడ, తిరుగులేని నాయకుడైనాడని తోస్తూంది. నాయకత్వం ప్రబలమైనప్పుడు గణతంత్ర వ్యవస్థ రాచరిక వ్యవస్థగా పరిణమించడం సహజం. అందుచేత, అతడు 'రాయ' లేక 'రఞ్ఞో' అనే బిరుదును ధరించగలిగినట్లు, స్వతంత్ర రాజ్యాన్ని నెలకొల్పినట్లు గ్రహించొచ్చు. వైదిక వాఙ్మయం వలన తెలియవస్తున్న శబర, పులింద, మూతబ మొదలైన జాతులు, అశోకుని శాసనాల వలన తెలియవస్తున్న రఠిక, భోజక, పిటినిక మొదలైన ప్రజానీకాలు, కాలక్రమాన సాంస్కృతిక పరిణామాలలో ఆంధ్రులకు సన్నిహితులై, వారిలో విలీనమై ఉంటారు. ఈ పరిణామాలలో అగ్రగాములైన ఆంధ్రులు, రాజకీయంగాను, ఆర్థికంగాను ప్రాబల్యం చెంది, రాజ్య స్థాపకులు కాగలిగారు.

శ్రీముఖుడు ధరించిన 'సిరిమతో' అనే బిరుదం, 'శ్రీమంతుడు', లక్ష్మిని కలిగినవాడని అర్థం కలది. శ్రీ.ఐ. కార్తికేయశర్మ ఈ బిరుదం వలన సిముకుడు భాగవత (వైష్ణవ) మతాన్ని అవలంబించి, పోషించినట్లు సూచిస్తూందని అభిప్రాయపడ్డాడు. కాని, అది సరికాదు. 'సిరిమత' బిరుదం తర్వాత కాలంలో ప్రాచీన పల్లవులు, చాళుక్యులు ధరించిన 'శ్రీవల్లభ' అనే బిరుదంతో పోల్చదగింది. గౌతమీపుత్ర శాతకర్ణిని గూర్చి నాసిక్ ప్రశస్తి కూడ ఇదే విధంగా వర్ణించింది. ఈ బిరుదాలు రాజుకు గల అపార సంపదలను, ధనధాన్య సమృద్ధిని సూచిస్తాయి. రాజు విష్ణువు అంశతో జన్మిస్తాడని, అందువలన, అతనికి జన్మతోనే పరిపాలనాధికారం సిద్ధిస్తుందని, ధర్మశాస్త్రాలు వివరిస్తాయి. అందుచేత, లక్ష్మీదేవి, భూదేవి తమకు వశమై ఉన్నట్లు సూచిస్తూ, ప్రాచీన రాజ వంశాల్లోని రాజులు విష్ణువు అంశను కలిగినట్లు భావించడం శాతవాహన యుగం నుండే ప్రారంభమైనట్లు, ఈ బిరుదాల వలన గుర్తించొచ్చు.

నానాఘాట్ గుహల్లో నాగానిక చెక్కించిన దీర్ఘ శాసన ప్రారంభ పంక్తుల్లో 'అపతిహతచక్' (అప్రతిహతచక్ర), 'దఖినవధ పతి' (దక్షిణాపథ పతి) అనే బిరుదాలను పేర్కొంటుంది. ఈ శాసనం మధ్య మధ్య శిథిలమైంది. కొంత కొంత భాగాలు మాత్రమే చదువ సాధ్యమౌతుంది. అందుచేత, ఆ శాసనాన్ని ఆమూలాగ్రంగా స్పష్టమైన రీతిలో అర్థం చేసుకోవడం సాధ్యం కావడం లేదు.

నానాఘాట్ గుహలోని శాసనాలను శాతకర్ణి భార్యైన నాగానిక చెక్కించిందని ఊహించడానికి అవకాశాలున్నందున, ఈ శాసన ప్రారంభంలో వర్ణించబడిన రాజు శాతకర్ణి అని, వైన పేర్కొన్న బిరుదాలు అతనికే చెందుతాయని, చరిత్రకారులు బహుళంగా భావిస్తారు. కాని, ఇటీవలి కాలంలో కొందరు చరిత్రకారులు శాతకర్ణిని ప్రశంసించే సందర్భంలో, అతని తండ్రైన శ్రీముఖుని గూర్చి వర్ణించడం జరిగిందని, ఆ రాజు పేరు, శాతకర్ణి యుద్ధ విజయాలను గూర్చిన వివరాలు, నష్టమైన శాసన భాగంలో ఉండి ఉంటాయని భావిస్తున్నారు. కాగా, ఈ బిరుదాలు శ్రీముఖునికి వర్తించేవని వారి అభిప్రాయం.

జైన వాఙ్మయం శ్రీముఖుడు మొదట్లో భక్తి శ్రద్ధలతో జైన ధర్మాన్ని అనుష్ఠిస్తూ, అనేక స్తూపాలు, విహారాలను కట్టించాడని, తర్వాత దుర్మార్గుడు, ప్రజాకంటకుడు కావడం చేత, ప్రజలు తిరుగుబాటు చేసి, అతన్ని పదవీచ్యుతుని చేశారని వివరిస్తుంది. ఈ వివరణను కొందరు చరిత్రకారులు ఆ రాజు క్రమంగా వైదిక ధర్మం పట్ల ఆసక్తిని ప్రదర్శించి ఉంటాడని, ఆ కారణాన జైన వాఙ్మయం అతణ్ణి ఈ విధంగా నిందించి ఉంటుందని అభిప్రాయపడతారు.

BRAOU

3.5.2 : మొదటి శాతకర్ణి

పైన పేర్కొన్నట్లు, కృష్ణుని తర్వాత శాతవాహన రాజ్యాన్ని శ్రీముఖుని కుమారుడైన శాతకర్ణి పరిపాలించాడు. **మత్స్య పురాణం** ఇతన్ని మల్లకర్ణి అనే పేరుతో వ్యవహరించింది. పురాణ పట్టికల వలన ఇతడు 18 సంవత్సరాలు పరిపాలించినట్లు, సుదీర్ఘ కాలం పరిపాలించాడని సూచిస్తాయి. అతని రాణైన నాగానిక, నానాఘాట్ గుహాలయాన్ని తొలిపించి, అందులో తమ రాజ దంపతుల శిలా ప్రతిమలను; తమ తండ్రుల, కుమారుల శిలా ప్రతిమలను నిలుపడం లోనే, శాతకర్ణి కాలంలో శాతవాహన రాజ్యం సుస్థిరంగా, ప్రశాంతంగా సుదీర్ఘ కాలం జరిగిందని సూచిస్తాయి. అంతే కాక, ఆ గుహాలయంలో నాగానిక చెక్కించిన సుదీర్ఘ శాసనం వలన, ఈ రాజు వేల సంఖ్యలో గోవులను, కార్షాపణాలను (అప్పటి ద్రవ్య మానంలో ప్రధాన నాణెం) దానం చేసి, వివిధమైన క్రతువులను నిర్వహించినట్లు వివరిస్తుంది. ఈ క్రతువులలో రెండు అశ్వమేధాలు, ఒక రాజసూయం పేర్కొనబడినాయి. అశ్వమేధ యాగాలు రాజుల దిగ్విజయాలను సూచిస్తూ జరుపబడేవి. రెండు అశ్వమేధాలను నిర్వహించినందున, శాతకర్ణి రెండు సార్లు దిగ్విజయ యాత్రలు చేసి ఉంటాడని గ్రహించొచ్చు.

శాతకర్ణి పైతృకంగా (తండ్రి నుండి సంక్రమించింది) దక్షిణాపథాన్ని రాజ్యంగా పొంది, ఇరు వైపుల ఉన్న అపరాంత, కొంకణ జనపదాలను ఆక్రమించాడు. పశ్చిమ దిశగా విస్తరించడంతో, అరేబియా సముద్ర తీరంపై రేవు పట్టణాల నుండి జరిగే నౌకా వ్యాపారంపైన శాతవాహనులు ఆధిపత్యాన్ని సంపాదించారు. నానాఘాట్ గుహాలయాలను తొలిపించడం సాధ్యమైంది.

'రఞోసాతకణిస' , 'రఞోసిరిసాతకణిస' అనే పేర్లతో కనిపిస్తున్న నాణేలు, ఇతనివేనని భావించొచ్చు. కొందరు చరిత్రకారులు అవి పురాణ పట్టికల్లోని 6వ రాజైన రెండవ శాతకర్ణికి చెందినవిగా భావిస్తారు. కాని, పురాణ పట్టికలకు ప్రాధాన్యత నిచ్చి, రెండవ శాతకర్ణిని ప్రత్యేకించవలసిన, ఆవశ్యకత కనిపించదు. ఈతని నాణేలు ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణా జిల్లాల్లో, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల లోని అనేక ప్రదేశాల్లో విస్తారంగా లభించాయి. దక్షిణంగా, ఈ నాణేలు కర్నూల్ జిల్లా లోని సాతానికోట వద్ద ఇటీవల జరిగిన త్రవ్వకాలలో వెలుగులోనికి వచ్చాయి. ఈ నాణేల వ్యాప్తి వలన, శాతకర్ణి నాటి శాతవాహన సామ్రాజ్య విస్తీర్ణత నిరూపణ పొతుంది. నాణేల విస్తారంతో పాటుగా, శాసనాధారాలు కూడ శాతకర్ణి సామ్రాజ్య విస్తీర్ణతను సూచిస్తున్నాయి. సాంచీ స్తూప దక్షిణ ద్వార తోరణంపై కానవస్తున్న ఒక శాసనం, శాతకర్ణి అనే రాజును ప్రస్తావిస్తున్నది.

శాతవాహనుల రాజ్య స్థాపన లోను, విస్తరణ లోను, మహారథికులు చాలా కీలక పాత్ర నిర్వహించినట్లు కానవస్తున్నది. నానాఘాట్ గుహలోని ప్రతిమా శాసనాలలో 'మహారథిత్రనకయిరో' అనే నామ శాసనం (label inscription) తో, ఒక గూడు ఉంది. అదే గుహాలయంలో నాగానిక చెక్కించిన సుదీర్ఘ శాసనం, ఆమెను 'అంగియ కుల బాలిక' అని వర్ణిస్తుంది. ఈ రెండు శాసనాధారాలను సమన్వయం చేయడం, యుక్తం. ప్రతిమా శాసనాలు నాగానిక-శాతకర్ణిల కుటుంబ సభ్యులను ప్రదర్శించేవి. వాటిలో ఆ రాజ దంపతుల ప్రతిమలు కాక, మిగిలినవి, శాతకర్ణి తండ్రైన సిముకుడు, ఆ దంపతుల కుమారులైన కుమారహకుసిరి, కుమార శాతవాహనుడు, శాసనం శిధిలం కావడం వలన, స్పష్టంగా పేరు తెలియరాని మరొక రాకుమారుడివిగా ఉన్నాయి. వారితో కూడి, మహారథిత్రనకయిరో స్థానాన్ని సంపాదించడం వలన, అతడు ఆ రాజదంపతులకు అత్యంత సన్నిహితుడని స్పష్టపడుతూంది. శాతకర్ణి తండ్రి ప్రతిమను నిలిపినట్లే, రాణి నాగానిక తన తండ్రి ప్రతిమను కూడ ఆ వరుసలో నిలిపినట్లు, త్రనకయిరో నాగానిక తండ్రిని గుర్తించొచ్చు. అతడు ఒక మహారథి. అంటే, ఒక రాష్ట్రాన్ని పరిపాలించేవాడు; అంగియ కులానికి, అనగా వంశం, లేదా జాతికి చెందినవాడని, ప్రతిమా శాసనంలోని వర్ణన వలన తెలుస్తున్నది.

BRAOU

శాతకర్ణి పరిపాలనా కాలం లోను, ఆ తర్వాత, నాగానిక ఆనాటి రాజకీయాల్లో ప్రముఖ పాత్ర నిర్వహించినట్లు తోస్తూంది. ఆమె భర్తతో కలిసి, అనేక క్రతువులను నిర్వహించినట్లు చెప్పుకోవడం, కేవలం సామాజిక, ధార్మిక కార్యక్రమంలో కాక, రాజకీయంగా కూడ ఆమె ప్రముఖ పాత్ర వహించిందని, 'దేవి' అనే బిరుదంతో, తన నామ శాసనంతో సహా, ప్రతిమను నిలుపుకోవడం వలన, గ్రహించొచ్చు. ఆమె వేసిన సుదీర్ఘ శాసనం శాతకర్ణి మరణానంతరం, ఆమె తన కుమారులకు సంరక్షకురాలిగా, రాజ్య నిర్వాహకురాలిగా (Regent) ఉండగా వేసిందని, భావించొచ్చు.

రాజ్య పాలనలో నాగానిక ప్రముఖ పాత్ర వహించడానికి, నానాఘాట్ గుహాలోని గూళ్ళలో ఆమె తండ్రి ప్రతిమను నిలపడానికి, తొలి శాతవాహన రాజుల కాలంలో, వారి రాజ్య స్థాపన, పరిపాలన, విస్తరణ కార్యక్రమాల్లో, మహారథులు నిర్వహించిన కీలక పాత్ర కారణమవడంలో, సందేహం లేదు. మహారథికులు అంటే, గొప్ప రథికు; రథికులు, భోజకులు మౌర్య పరిపాలనా కాలంలో రాష్ట్ర పరిపాలకులు. మౌర్య సామ్రాజ్య వ్యవస్థ శిథిల మయ్యే సమయాన, వారు స్వతంత్రించారు; వారిలో కొందరు మరింత ప్రబలులై, పరిసర పాలకులను లోబర్చుకొనడంతో, మహారథికులు, మహాభోజకులు ఏర్పడ్డారు. అటువంటి స్థానిక ప్రభువులను యుద్ధ విజయాలతో, లేదా వైవాహిక సంబంధాలతో కూడగట్టు కొనడంలో, శాతవాహనులు రాజ్యాన్ని స్థాపించగలిగారు; రాజ్య విస్తరణ గావించి, సామ్రాజ్య నిర్మాతలు కాగలిగారు.

3.5.3 : మొదటి శాతకర్ణి తదనంతర శాతవాహనులు

మత్స్య పురాణం శాతవాహన రాజుల్లో మూడవ వాడైన మొదటి శాతకర్ణి తర్వాత, 23వ రాజైన గౌతమీపుత్ర శాతకర్ణి వరకు, 18 మంది రాజుల పేర్లను తెలుపుతూంది. వారిలో కొందరు రాజులను, కొన్ని ఇతర పురాణాలు కూడ పేర్కొంటున్నాయి. కాని, ఈ రాజులెవ్వరు శాసనాధారాల వలన తెలియరారు. అయితే, గౌతమీపుత్ర శాతకర్ణికి ముందు 'శివస్వాతి' అనే రాజు 28 సంవత్సరాలు పరిపాలించినట్లు, అన్ని పురాణాలు ఏక వాక్యంగా చెపుతున్నాయి. కనుక, ఈతని విషయంలో పురాణ వాక్యాన్ని విశ్వసించి, చారిత్రక వ్యక్తిగా అంగీకరించొచ్చు. ఇతణ్ణి గౌతమీపుత్ర శాతకర్ణి తండ్రిగా గుర్తించొచ్చు. అయితే, పురాణ పట్టికలు పేర్కొనని ఇద్దరు రాజులు, రఞ్ఞోశాతవాహన (లేక సదవహన), రఞ్ఞోసతిసిరి అనేవారు, తమ నాణేల వలన తెలియవస్తున్నారు. నానాఘాట్ ప్రతిమా శాసనాలు శాతకర్ణి-నాగానిక దంపతుల కుమారులైన కుమారహకుసిరి, కుమార శాతవాహన అనే రాకుమారులను పేర్కొంటున్నాయి. కుమారహకుసిరి నాణేల వలన తెలియవస్తున్న సతిసిరి (లేక శక్తిసిరి) అని, కుమార శాతవాహనుడు నాణేల వలన తెలియవస్తున్న సాత (లేక సద) వాహన అని, చరిత్రకారుల అభిప్రాయం.

జైన వాఙ్మయంలోని **"కాలకాచార్య కథానిక"** అనే ఇతివృత్తం, శాతవాహన రాజు ప్రసిద్ధ జైనాచార్యుడైన కాలకాచార్యుని సోదరిని బలాత్కరించి నిర్బంధించినట్లు, ఆ ఆచార్యుడు శక ద్వీపం నుండి శకులను ఆహ్వానించి, శాతవాహన రాజుపై దండయాత్రలకు పురికొల్పినట్లు వివరిస్తూంది. ఆచార్య అజయ్ మిత్రశాస్త్రి ఈ శాతవాహన రాజు "సతిసిరి" అని, అభిప్రాయపడతాడు. ఈ ఇతివృత్తం లోని సత్యాసత్యాలు ఎలా ఉన్నా, శాతకర్ణి పరిపాలనా కాలం తర్వాత, గుజరాత్, మాళ్వ భూభాగాల్లో, క్రమంగా శకుల ప్రవేశం, ప్రాబల్యం జరిగినట్లు నిశ్చయంగా చెప్పొచ్చు.

BRAOU

'రఞోసతిసిరిన', లేక 'రఞోసిరిసతన' అనే పేర్లతో, శాతవాహన నాణేలు వింధ్య పర్వతాలకు ఆవల ఉన్న ఉజ్జయిని, త్రిపురి (నేటి మధ్యప్రదేశ్ లోని నగరాలు) ప్రాంతాల లోను, ఆ పర్వతాలకు దక్షిణంగా విదర్భ లోను, కానవస్తున్నాయి. ఈ నాణేలను సతిసిరి (లేదా హకుసిరి) వేసినవిగా, పైన పేర్కొనడం జరిగింది. తర్వాత శాతవాహనుడు (కుమార శాతవాహనుడు) సింహాసన మధిష్ఠించి పరిపాలించే సమయాన, ఈ ప్రాంతంలో శాతవాహన నాణేలు అరుదైనాయి.

నాసిక్ గుహాలయాలలో మహాహకుసిరి మనుమరాలైన భటుపాలిక అనే స్త్రీ, ఒక గుహాలయాన్ని తొలిపించి, వేసిన శాసనం కానవస్తున్నది. ఆ గుహాలయ వాస్తు లక్షణాలను పరిశీలించి, సర్ జాన్ మార్షల్ అది క్రీ.శ. ఒకటో శతాబ్దికి చెందిందని, ఆ గుహాలోని శాసనం ప్రస్తావించే మహాహకుసిరి, శాతకర్ణి కుమారుల్లో ఒకడైన కుమారహకుసిరి (లేదా, సతిసిరి) కావచ్చునని, అభిప్రాయపడ్డాడు. అయితే, ఎ.ఎస్. అల్టేకర్ ఈ వాదాన్ని తిరస్కరించాడు. నాసిక్ శాసనం హకుసిరిని రఞో (లేదా, రాజన్) బిరుదంతో పేర్కొనదు. కనుక, అతడు రాజు కాడని, శాతకర్ణి కుమారుల్లోని హకుసిరి తండ్రి తర్వాత రాజ్యాన్ని పాలించి, నాణేలను విడుదల చేశాడని, ఈ ఇద్దరి మధ్య వ్యత్యాసాన్ని ఆయన సూచించాడు. అయితే, ఆచార్య మిరాశీ, నాసిక్ శాసనం హకుసిరిని 'మహా' అనే విశేషణంతో వర్ణిస్తున్నది; కనుక, హకుసిరి లోగడ గొప్పవానిగా ప్రసిద్ధుడై ఉంటాడని, అనగా రాజ్యాన్ని పాలించిన వాడని గ్రహించొచ్చునని వాదిస్తాడు. 'రఞో' అనే బిరుదం, సమకాలీనంగా పరిపాలిస్తున్న రాజులకే చేర్చబడేదని, అతని మనుమరాలు శాసనాన్ని వేసిన కాలం నాటికి, హకుసిరి రాజ్య పాలన చేస్తూ ఉండడం అసంభవం; కనుక, రఞో బిరుదాన్ని అతని పేరుకు ముందు చేర్చలేదని భావించొచ్చు.

సతిసిరి అనంతరం, అతని సోదరుడు, శాతవాహనుడు, రాజ్య పాలన చేసినట్లు తోస్తుంది. రఞోసదవహన లేక, రఞోసాతవాహన అనే పేర్లతో వేసిన శాతవాహన నాణేలు, ఆంధ్రప్రదేశ్ లోని తెలంగాణా జిల్లాల లోను, మహారాష్ట్ర లోను, వింధ్య పర్వతాల పర్యంతంగా కానవస్తున్నాయి. సతిసిరి నాణేలు వింధ్య పర్వతాలకు దక్షిణాన మాత్రమే కానవస్తుండడం, గమనించదగిన విషయం. కొందరు చరిత్రకారులు శాతకర్ణి అనంతరం అతని కుమారులిద్దరు వింధ్య పర్వతాలకు ఇరు వైపులుగా రాజ్యాన్ని విభజించుకొని, పరిపాలించారని భావిస్తారు. కాని, సతిసిరి కాలంలో ప్రారంభమైన శక దండయాత్రలు, శాతవాహన సామ్రాజ్యాన్ని సంక్షోభానికి గురిచేసినాయని, అందుచేత సతిసిరి తరచుగా మాళ్వ, గుజరాత్ ప్రాంతాల వారితో పోరాటాలు చేయవలసి వచ్చినట్లు తోస్తుంది. ఈ దండయాత్రల వలన అతని నాణేలు ఆ ప్రదేశాల్లో విస్తారంగా లభిస్తాయి. శాతవాహనుని కాలం నాటికి శకులు వింధ్య పర్వతాల ఆవలి భూభాగాలపై స్థిరపడ్డారని, ఆ రాజ్య భాగాలను పూర్తిగా శాతవాహనులు వదులుకొన్నారని భావించొచ్చు. అందువలన, శాతవాహనుని నాణేలు మాళ్వ, గుజరాత్‌లలో కానరావు.

ఆచార్య మిరాశి, మోరేమండ రామారావుగార్లు, ఇటీవలి కాలంలో శ్రీ. పి.వి. పరబ్రహ్మశాస్త్రి గారు "సదవహన", "శాతవాహన" పేర్లతో కానవస్తున్న నాణేలు, శాతకర్ణి కుమారుడైన శాతవాహనుడు చేసినవి కావని, వంశ కర్తైన శాతవాహనుడు వేసినవేనని భావిస్తారు. కుమార శాతవాహనుడు సింహాసన మధిష్ఠించి, పరిపాలించినట్లు ఈయన అంగీకరించాడు. శాతవాహనుని నాణేలపై ఉన్న అక్షరాల కంటే, సిముకుని నాణేలపై ఉన్న అక్షరాలు మరింత పరిణామం చెందినవి, తర్వాత కాలానికి చెందినవి. కనుక, శాతనాహనుడు సిముకుని కంటె పూర్వుడు; కాని, అద్యాచినుడు కాడని, ఈయన వాదం.

BRAOU

3.5.4 : గౌతమీపుత్ర శాతకర్ణి

శాతవాహన వంశంలో 23వ వాడైన గౌతమీపుత్ర శాతకర్ణి పరిపాలనా కాలం నుండి, ఆ వంశ చరిత్ర చాలా వరకు స్పష్టంగాను, విశ్వసనీయంగాను తెలియవస్తూంది. ఈయనకు ముందు పురాణ పట్టికల్లో కానవస్తున్న శివస్వాతి నుండి, ఆంధ్ర - శాతవాహన వంశీయులను గూర్చి ఆ పట్టికల్లో ఏక వాక్యత కనిపిస్తున్నది; కనుక, అవి ఈ వంశానుక్రమాన్ని నిర్ణయించడానికి ఉపయుక్తమౌతున్నాయి. గౌతమీపుత్ర శాతకర్ణి నుండి, ఈ వంశంలో చివరివాడైన పులుమావి వరకు పరిపాలించిన రాజులు, వారు వేసిన శాసనాలు, లేదా నాణేల వలన, యదార్థమైన చారిత్రక వ్యక్తులుగా గుర్తించబడినారు. ఈ పురావస్తు ఆధారాలు పురాణ పట్టికలతో చాలావరకు సరిపోలుతూ, కొన్ని సందర్భాల్లో వాటిని సక్రమంగా అర్థం చేసుకొని, అన్వయించడానికి సాయపడతాయి.

3.5.4.1 : చారిత్రక ఆధారాలు

గౌతమీపుత్ర శాతకర్ణి శాతవాహన వంశం లోనే కాక, ప్రాచీన భారతదేశ చరిత్ర లోనే, గొప్ప విజేతలు, సామ్రాజ్య నిర్మాతల్లో గణుతింపదగినవాడు. ఈతని పరిపాలనా కాలానికి సంబంధించి శాసనాధారాలు, నాణేలు సమృద్ధిగా లభిస్తున్నాయి. శాసనాల్లో ఈతని తల్లైన గౌతమీ బాలశ్రీ నాసిక్ గుహాలయంలో చెక్కించిన శాసనం, చాలా ప్రాధాన్యత కలది. అది ఇతని యుద్ధ విజయాలు, సామ్రాజ్య విస్తీర్ణత, పరిపాలనా విధానం, వ్యక్తిత్వాన్ని వివరించే ప్రశస్తి శాసనం. ఆ శాసనం ఆ రాజు తర్వాత సింహాసన మధిష్ఠించిన అతని కుమారుడైన వాసిష్ఠీపుత్ర పులుమావి 19వ రాజ్య సంవత్సరంలో వేయబడింది. అది కాక, గౌతమీపుత్ర శాతకర్ణి, స్వయంగా తన 18వ రాజ్య సంవత్సరంలో వేసిన శాసనాలు రెండు, 24వ రాజ్య సంవత్సరంలో వేసినది ఒకటి, నాసిక్ గుహాలయాల్లో కానవస్తున్నాయి. దక్కన్ పీఠభూమిపై అనేక చోట్ల, వింధ్య పర్వతాలకు ఆవల మాళ్వ, కథియవాడ్ ప్రాంతాల లోను, ఈతని నాణేలు విరివిగా లభించాయి. వాటిలో ప్రధానంగా చెప్పదగినవి, జోగల్ తంబి, వాటిగామ్ నిధులు. గౌతమీపుత్ర శాతకర్ణి క్షహరాత పాలకుడైన నహపానుని ఓడించి, అతని నాణేలను పునర్ముద్రించి, విడుదల చేసినవి, జోగల్ తంబి నిధిలో వేలాదిగా లభించాయి.

గౌతమీపుత్ర శాతకర్ణిని గూర్చిన ప్రశస్తి శాసనం, అతని కుమారుని పరిపాలనా కాలంలో చెక్కినది కావడం వలన, పలువురు పూర్వ చరిత్రకారులు ఈ రాజు తన కుమారునితో సంయుక్తంగా పరిపాలించి ఉండొచ్చునని భావించారు. సమకాలీనంగా శక, క్షహరాత పరిపాలకులు ఆ విధంగా సంయుక్త పరిపాలన జరపడం స్పష్టంగా తెలుస్తున్నది. వారి ప్రభావం కొంత శాతవాహన వంశంపై పడడానికి అవకాశం లేకపోలేదు. కాని, ప్రస్తుత సందర్భంలో అటువంటి అభిప్రాయానికి అవకాశం లేదు. ఆ శాసనం చెక్కించే కాలం నాటికి, గౌతమీపుత్ర శాతకర్ణి జీవించి లేడని, అతని జీవిత కాలంలో గుహాలయాన్ని తొలవడం ప్రారంభమై, పూర్తయ్యే నాటికి సజీవుడిగా లేక పోవడంతో, వృద్ధురాలైన గౌతమీ బాలశ్రీ, అత్యంత ఘన కీర్తిని పొందిన కుమారుని తలచుకొన్న పుత్ర శోకంతో, అతని వ్యక్తిత్వాన్ని, విజయాలను, అతిశయోక్తులతో వర్ణిస్తూ, ఈ ప్రశస్తి శాసనాన్ని చెక్కించిందని, స్పష్టంగా శాసన భావమే సూచిస్తూంది.

3.5.4.2 : యుద్ధ విజయాలు : సామ్రాజ్య విస్తరణ

నాసిక్ ప్రశస్తి గౌతమీపుత్ర శాతకర్ణి సామ్రాజ్యంలో చేరిన దేశాలు (లేదా జనపదాలు), పర్వతాలను పేర్కొంటూ ప్రారంభమౌతుంది. ఈ భౌగోళిక వివరణ వలన అతని కాలంలో శాతవాహన

BRAOU

సామ్రాజ్యం ఉత్తరాన ఇంచుమించుగా గంగా నదీ మైదానం నుండి, దక్షిణాన కృష్ణా నదీ మైదానం వరకు విస్తరించినట్లు, స్పష్టపడుతున్నది. ఈ సామ్రాజ్య విస్తరణను సూచిస్తూ, నాసిక్ ప్రశస్తి గౌతమీపుత్ర శాతకర్ణిని రాజరజో అనగా 'రాజులకు రాజు' అని వర్ణిస్తుంది. ఇటువంటి బిరుదాన్ని శాతవాహన రాజుల లోనే కాక, దక్షిణ భారతదేశ చరిత్రలోనే ప్రప్రథమంగా, గౌతమీపుత్ర శాతకర్ణికే వర్తింపజేసినట్లు చెప్పొచ్చు. ఈ బిరుదానికి సార్థకంగా ఆ శాసనం, నవ రాజ లోక మడల వతి గహీత శాసన (సర్వ రాజ లోక మండల ప్రతి గ్రహీత శాసన) అనగా, సమస్త రాజ లోకం తలదాల్చిన శాసనాలు కలవాడు; నవ వండలాభి వాదిత చరణ అనగా, సర్వమండలాభి వాదిత (లేదా వందిత) చరణ (అనగా, సర్వ మండలాల ప్రజలు, ప్రభువులు కీర్తించిన (లేదా నమస్కరించిన) చరణాలు కలవాడని కూడా గౌతమీపుత్ర శాతకర్ణిని వర్ణిస్తుంది; ఈ సార్వభౌమత్వాన్ని సాధించడానికి గౌతమీపుత్ర శాతకర్ణి అనేక పోరాటాలను చేసినట్లు, అనేక సమరవజిత సతుసఘస (అనేక సమరావజిత శత్రు సంఘ), అంటే అనేక సంగ్రామాల్లో ఓడించిన శత్రు సమూహాలు కలవాడు; అవరాజిత విజయ పతాక, అని కూడ నాసిక్ ప్రశస్తి పేర్కొంటున్నది. గౌతమీపుత్ర శాతకర్ణి ఓడించిన శత్రు రాజులను శక యవన పల్హవ నిసూదన (శక యవన పహ్లవ నిషూదన) అనగా, శకులను, యవనులను, పహ్లవులను వధించినవాడు; ఖఖరాత వస నిరవసేసకర (క్షహరాత వంశ నిరవశేషకర) అనగా, క్షహరాత వంశాన్ని నిశ్శేషం చేసినవాడనే బిరుదాలతో పేర్కొంటున్నది. ఈ విజయాలతో ఆ రాజు శాతవాహన వంశ ప్రతిష్ఠను, వైభవాన్ని నిలిపినట్లు, శాతవాహన కులయశవతిథావన కరస (శాతవాహన కుల యశో ప్రతిష్ఠాపనకర), కుల విపుల సిరికర (కుల విపుల శ్రీకర) అని, కీర్తిస్తున్నది.

గౌతమీపుత్ర శాతకర్ణి సామ్రాజ్యంలో చేరిన జనపదాలను నాసిక్ ప్రశస్తి "అసిక అసక ముళక సురర కుకురాపరాంత అనువ విదభ ఆకరావంతి" అని పేర్కొంటూ, ఆరాజు ఉత్తరాన గంగా-యమునా మైదాన భూముల నుండి, దక్షిణాన కృష్ణా మైదాన పర్యంతంగా విస్తరించిన దక్షిణ భారతదేశ ద్వీపకల్ప మంతటిని పరిపాలించినట్లు, ఈ జనపదాల పట్టిక సూచిస్తూంది.

BRAOU


నాసిక్ ప్రశస్తి పేర్కొనే అసిక (ఋషిక), ఇతిహాస వాఙ్మయం లోని అనూప, విదర్భ, అశ్మక జనపదాల సమీపం లోనిదిగా పేర్కొనబడింది. ఈ జనపదాలు కూడా నాసిక్ ప్రశస్తి పేర్కొంటున్నవే. అసక (అశ్మక) గోదావరి నదికి దక్షిణంగా ఉండేది; నేటి ఆంధ్రప్రదేశ్ లోని నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలకు సరిపోయింది. పోదన లేక పొదన్య, అశ్మక జనపదానికి ముఖ్య పట్టణం. ఇది నేటి నిజామాబాద్ జిల్లాలోని బోధన్. విదభ (విదర్భ) జనపదం దక్కన్ పీఠభూమికి ఉత్తర భాగాన నర్మద, తవతి నదులు ప్రవహించే భూభాగం; అశ్మక జనపదానికి ఈశాన్యంగా ఉండేది. కుండిన నగరం విదర్భ ముఖ్య పట్టణం. అనూప జనపదం వింధ్యపర్వతాలకు సమీపంగా, దక్కన్ పీఠభూమికి పశ్చిమోత్తర (వాయవ్య) భాగాన, నర్మదా తీరంపై ఉండేది. ఇది నేటి మధ్య ప్రదేశ్ లోని నేమాడ్, ఇండోర్ జిల్లాలు, పరిసరి ప్రదేశాలతో సమానమైంది. అనూప జనపదానికి దక్షిణంగా, అశ్మక జనపదానికి వాయవ్యంగా, విదర్భకు పడమటగా ఉండేదని గుర్తించొచ్చు. ఇది నేటి ఖాందేశ్ తో సమానమైనట్లు, ఆచార్య మిరాశీ గుర్తించాడు. ముళక (మూలక) జనపదం, అశ్మక జనపదానికి ఉత్తరంగా, లేదా పశ్చిమోత్తరంగా ఉండేది. ఇది నేటి మహారాష్ట్ర లోని ఔరంగాబాద్ జిల్లాతో సమానమైంది. ప్రతిష్ఠానపురం దీని ముఖ్య పట్టణం. ప్రతిష్ఠానపురమే శాతవాహనుల రాజధాని; నేటి ఔరంగాబాద్ సమీపం లోని పైఠాన్. కుకుర జనపద ఉనికి (location) సరిగా తెలియరాదు. ప్రాచీన వాఙ్మయం ఈ జనపదం కూడ నర్మదా నదికి ఉత్తరంగా ఉన్నట్లు తెలుపుతున్నది. అపరాంత దక్కన్ పీఠభూమి పశ్చిమ భాగాన, పడమటి కనుమలను ఆనుకొని ఉన్న కొంకణ ప్రాంతం.

ఆకరావంతి, ఆకర, అవంతి అనే రెండు విభాగాలుగా ఏర్పడిన మాళ్వ భూభాగం. ఆకర తూర్పు మాళ్వ; దీనికి రాజధాని విదిశ. కాగా, అవంతి పశ్చిమ మాళ్వ; దీనికి రాజధాని ఉజ్జయిని.

నాసిక్ ప్రశస్తి పేర్కొంటున్న పర్వతాలు కూడ, పైన వివరించిన భూభాగం లోనివే. ఈ శాసనం వింధ్యచవత పరిచాత సహ్యాకణ్హగిరి మచపిరిటన మలయ మహిద నేటగిరి చకోరపవతపతి అని, గౌతమీపుత్ర శాతకర్ణిని ప్రశంసించింది. వింధ్య పర్వతం భారతదేశం నడిమి భాగాన తూర్పు, పడమరలుగా విస్తరించిన వింధ్య పర్వతం. ఆకర, అవంతి, అనూప, కుకుర జనపదాలు, ఈ పర్వత శ్రేణుల సమీపం లోనివి. అభివత నేటి సాత్పూరా పర్వతాలకు, ప్రాచీన కాలంలో వ్యవహారంలో ఉన్న పేరు. పరిచాత లేక పారియాత్ర, ఆరావళీ పర్వతాల దక్షిణ భాగం. అవంతి, కుకుర జనపదాలకు సమీపంగా, వింధ్య పర్వతాలకు చేరువగా విస్తరించింది. కణ్హగిరి లేక కన్హేరి, మాచగిరి, సిరిటన పర్వతాలు, పశ్చిమ కనుమల శాఖలుగా పూర్వ చరిత్రకారులు గుర్తించారు. వీటిలో కన్హేరీ గురించి సంశయం లేదు. కాని, మాచగిరి, సిరిటన పర్వతాలు నేటి ఆంధ్రప్రదేశ్‌లో దక్కన్ పీఠభూమి తూర్పు తీరాన ఉన్నట్లు తోస్తుంది. ప్రాచీన కాలపు సింహళ, మలయా ద్వీప కల్పాలలోని బౌద్ధ వాఙ్మయం, కృష్ణా, గోదావరీ నదుల ముఖ ద్వారాల చెంత ఉన్న దేశాన్ని, "మజేరిక" అని వ్యవహరించాయి. ఆ పేరు మత్స్యగిరిక, అనగా మత్స్యగిరి పరిసరాలలోని దేశమని అర్థం. కనుక, మత్స్యగిరి తూర్పు తీరంలో, తూర్పు కనుమల లోని ఒక శాఖగా భావించడానికి అవకాశం ఉంది. సిరిటన శ్రీశైలం కావచ్చునని, లోగడ మారేమండ రామారావ్‌గారు అభిప్రాయపడ్డారు. కాని, ఆపదం శ్రీస్థాన, లేక శ్రీధాన అనే సంస్కృత రూపాలకు సమానార్థకమైన ప్రాకృత భాషా రూపం. శ్రీధాన, శ్రీధాన్యకటక (నేటి గుంటూర్ జిల్లా లోని అమరావతి) సమీపంలోని ఒక కొండ కావచ్చునని భావించడం యుక్తం. నెతగిరిని ఇక్ష్వాకు శాసనాల వలన, శ్రీపర్వత నాగార్జునకొండ పరిసరాల్లోని ఒక చిన్న గుట్టతో గుర్తించటం జరిగింది. నాగార్జునకొండ త్రవ్వకాలలో గౌతమీపుత్ర శాతకర్ణి నాణేలను ముద్రించడానికి ఉపయోగించే అచ్చు ముక్క లభించింది. దీని వలన, శ్రీపర్వత నాగార్జునకొండ పరిసరాలతో ఆ రాజుకు సంబంధం ఉన్నట్లు స్పష్టపడుతున్నది. మలయ పర్వతం పశ్చిమ కనుమల దక్షిణ భాగంగా, పలువురు ప్రాచీన చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. కాని, ఆప్రాంతంతో శాతవాహనులకు సంబంధం ఉన్నట్లు తెలియరాదు. కాగా, తూర్పు కనుమలు కూడ మలయ పర్వత మనే పేరును కలిగి ఉన్నట్లు, మధ్య యుగం నాటి శాసనాధారాల ద్వారా తెలుస్తోంది. నాసిక్ ప్రశస్తి మలయ పర్వతంతో చేర్చి పేర్కొంటున్న మహిద, లేక మహేంద్ర పర్వతం, నేటికి అదే పేరున, నేటి విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లా లోనికి వ్యాపించిన తూర్పు కనుమలే. కనుక, మలయ పర్వతం తూర్పు కనుమల్లోని ఒక శాఖగా భావించొచ్చు. చకోర పర్వతాన్ని మాత్రం, గుర్తించడం సాధ్యం కావడం లేదు.

నాసిక్ ప్రశస్తి పేర్కొంటున్న పర్వతాల, జనపదాల వివరాల వలన, గౌతమీపుత్ర శాతకర్ణి సామ్రాజ్యం నేటి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల లోని కొంత భూభాగాలతో, కృష్ణా నది దక్షిణ సరిహద్దుగా, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు, కొంత భాగం మధ్యప్రదేశ్‌ను కలుపుకొని, ఉత్తరాన ఇంచుమించు గంగా నదీ తీరం వరకు విస్తరించిందని తెలుస్తోంది. ఈ దిగ్విజయ యాత్రలో అతని వాహనాలు మూడు సముద్ర తీరాలలో నీరు త్రాగినట్లు, త్రిసముద్రతోయ పీతవాహన అని, నాసిక్ ప్రశస్తి ఆ రాజును వర్ణిస్తోంది. ఈ యుద్ధ విజయాలతో అతడు శాతవాహన వంశ కీర్తిని ప్రతిష్ఠించాడని, ఆ వంశ వైభవాన్ని విస్తరింపజేశాడని, ఈ శాసనం వర్ణిస్తున్న విషయాన్ని పైన వివరించడం జరిగింది. ఈ వర్ణనలు ఆ రాజుకు పూర్వం శాతవాహన వంశ ప్రతిష్ఠ దిగజారిందని సూచిస్తాయి. అయితే, మొదటి శాతకర్ణి కాలంలో శాతవాహన సామ్రాజ్యం మాళ్వ, సురాష్ట్ర ప్రాంతాలను కలుపుకొని, ఉత్తరాన గంగా నదీ మైదానం వరకు విస్తరించింది. గౌతమీపుత్ర శాతకర్ణి యుద్ధ విజయాలతో, సామ్రాజ్యం తిరిగి అదే విస్తీర్ణతను పొందింది.

BRAOU



శాతవాహన సామ్రాజ్యం

3.5.4.3 : గౌతమీపుత్ర శాతకర్ణి : శక - క్షహరాట సంబంధాలు

నాసిక్ ప్రశస్తి గౌతమీపుత్ర శాతకర్ణిని శక యవన పహ్లవ నిసూదన, ఖఖరాత వస నిరవసేస కర (క్షహరాత వంశ నిరవశేషకర) అని, వర్ణిస్తుంది. క్రీస్తు శకారంభం నుండి వింధ్య పర్వతాలకు ఆవలి భూభాగంలో, క్షహరాత శాఖకు చెందిన శకుల ప్రాబల్యం అధికమైంది. వారి నాయకుడైన నహపానుడు ముద్రించి విడుదల చేసిన నాణేలు, మాళ్వ, సురాష్ట్ర, కొంకణ, అపరాంత ప్రాంతాలలో లభిస్తున్నాయి. ఈ నాణేల వలన, క్షహరాతుల రాజ్య విస్తరణ, రాజకీయ ప్రాబల్యం స్పష్టమౌతున్నాయి. ఈ క్షహరాత విజృంభణ వలన, శాతవాహనులు తమ సామ్రాజ్య భాగాలను, వంశ ప్రతిష్ఠను కోల్పోయారు. క్షహరాత - శకులు పశ్చిమ తీర రేవు పట్టణాల ద్వారా, శాతవాహన సామ్రాజ్యం రోమన్ సామ్రాజ్యంతో జరుపుతున్న నౌకా వ్యాపారానికి అవరోధాలను కల్పిస్తున్నట్లు, **పెరిప్లస్** అనే గ్రీక్ గ్రంధం వివరిస్తూంది.

నహపానుడు, అతని అల్లుడైన ఉసవదత్త, లేక ఋషభదత్తుడు వేసిన శాసనాలు, 46 వ సంవత్సరం నాటివి, నాసిక్ గుహల్లో కానవస్తున్నాయి. అవి శక సంవత్సరాలుగా, ఆచార్య డి.సి. సర్కార్, ఆచార్య వి.వి. మిరాశీ గార్లు నిర్ణయించారు. కనుక, అవి క్రీ.శ. 124 కు చెందినవిగా గ్రహించొచ్చు. నహపానుని వెండి నాణేలు, గౌతమీపుత్ర శాతకర్ణి శాతవాహన చిహ్నాలతో పునర్ముద్రించినవి, జోగల్ తంబి నిధిలో అసంఖ్యాకంగా లభించాయి. ఈ నాణేలు క్షహరాతులపై గౌతమీపుత్ర శాతకర్ణి సాధించిన విజయాలకు సాక్ష్యాధారాలు. నాసిక్ ప్రశస్తి లోని వాక్యాలను నిరూపించేవి. గౌతమీపుత్ర శాతకర్ణి నహపానుని, లేదా అతని అల్లుడైన ఉసవదత్తుని (ఋషభదత్తుని) ఓడించి, క్షహరాతుల అధికారాన్ని నిర్మూలించాడు. క్షహరాతుల వశమైన భూభాగాలు తిరిగి, శాతవాహన సామ్రాజ్యం లోని అంతర్భాగాలైనట్లు నాసిక్ శాసనం వివరిస్తుంది. కార్లా, నాసిక్ గుహాలయాలలో, గౌతమీపుత్ర శాతకర్ణి చెక్కించిన శాసనాలు, లోగడ ఉసవదత్తుడు చేసిన గ్రామ క్షేత్ర ప్రదానాలను, తిరిగి శాతవాహన రాజు చేసినట్లు వివరిస్తున్నాయి. అనగా, ఆ ప్రదానాలకు శాతవాహనుల ఆమోదంతో, నూతన జీవితం లభించినట్లైంది.

క్షహరాతులతోబాటుగా, వారి ఆధిపత్యాన్ని ఆమోదించిన శక, యవన (గ్రీక్), పహ్లవ, స్థానిక పరిపాలకులు కూడా, శాతవాహనులకు లొంగిపోయారు. కనుక, నాసిక్ ప్రశస్తి వీరిని కూడ గౌతమీపుత్ర శాతకర్ణి ఓడించి ధ్వంసం చేసినట్లు ప్రస్తావిస్తూంది.

3.5.4.4 : గౌతమీపుత్ర శాతకర్ణి : వ్యక్తిత్వం

గౌతమీపుత్ర శాతకర్ణి వ్యక్తిత్వాన్ని గూర్చి నాసిక్ ప్రశస్తి అత్యున్నత ప్రమాణాలతో వర్ణించింది. అతని ధైర్య సాహసాలు, పరాక్రమం, తేజస్సును వర్ణిస్తూ, భారతీయ సంస్కృతికి చిహ్నాలుగా, లేక ప్రతినిధులుగా పేర్కొనదగిన, పౌరాణిక వ్యక్తుల తోను, పర్వతాల తోను పోల్చింది. అతడు హిమవత మేరు మందర పర్వత (పర్వత) సమసారం కలవాడు; రామకేశవార్జున భీమసేన తులవరాక్రముడు; నా భాగనహుషజనమేజయ సగరయయాతి రామాంబరీష సమతేజం కలవాడని వర్ణించింది. అనేక సమాసాలతో గౌతమీపుత్ర శాతకర్ణి చక్కదనాన్ని కూడా, నాసిక్ ప్రశస్తి వర్ణించింది. ఆ రాజు దివసకరకరావ బోధిత కమల విమల సదిస (సదృశ) వదనుడు, అనగా సూర్య కిరణాలలో వికసించిన కమలం వలె, విమలమైన (స్వచ్ఛమైన) ముఖం కలవాడు; పటిపుణ చదమడల ససిరీక పియ దసనస, అనగా పరిపూర్ణమైన చంద్రబింబం వలె, చక్కని రూపం కలవాడు; వరవారణ చారు విక్రమస

BRAOU

(వరవారణ చారు విక్రమ), శ్రేష్ఠమైన ఏనుగు నడకవలె, అందమైన నడక కలిగినవాడు; భుజగపతి భోగపీనవట విపుల దీర్ఘ సుందరభుజ (భుజగపతి భోగపీన విపుల దీర్ఘ సుందర భుజ), అనగా నాగేంద్రుని శరీరం వలె, బలమైన, విశాలమైన, పొడవైన అందమైన చేతులు కలవాడు.

గౌతమీపుత్ర శాతకర్ణి విద్యావినయ సంపత్తిని, దాన, క్షమ, ఔదార్యాలతో కూడిన సత్ప్రవర్తనను, నాసిక్ ప్రశస్తి విపులంగా వర్ణించింది. ఆ రాజు అభయోదక దాన కిపిన నిభయకర (అభయోదక దానక్లిన్న నిర్భయకర), అనగా ఉదకపూర్వకంగా చేసిన అభయ ప్రదానాల చేత, నిరంతరం తడిగా ఉండే నిర్భయమైన చేతులు కలవాడు; అవిపన్నమాతు సుసూసాకర (అవిపన్న మాతృ శుశ్రూషాకర), నిరంతరం తల్లిని సేవించేవాడు; సువిభత తివగదేసకాలస (సువిభక్త త్రివర్గ దేశ కాలస్య), అనగా దేశ, కాల పరిస్థితులను (త్రివర్గాలు, ధర్మార్థ కామాలు) సాధించడం కొరకు, చక్కగా ప్రత్యేకించినవాడు; కితాపరాదెపి నతుజనే అపాణహిసారుచి (కృతాపరాధైరపి శత్రుజనే అప్రాణ హింసారుచిః); అపరాధాలు చేసిన శత్రువుల యందు కూడా, ప్రాణ హింస రుచించనివాడు; ఉవచారాన వభవ, అనగా సత్ప్రవర్తన కలవాడు; ఆగమాన నిలయ, అనగా ఆగమాలకు నిలయమైన వాడు; ఏకధనుధర (ఏక ధనుర్ధర), ఏకైక, అద్వితీయమైన విలుకాడు; ఏక సూరస; (ఏకైక శూరుడు); ఏక బంహణ, అనగా ఏకైక బ్రాహ్మణుడు; చణపను నవనమాజకారక, ఉత్సవాల సమాజాల యందు ఎల్లప్పుడు దాతృత్వం కలవాడు.

3.5.4.5 : గౌతమీపుత్ర శాతకర్ణి : రాజనీతి

పరిపాలనా విధానం లోను, రాజనీతి లోను, గౌతమీపుత్ర శాతకర్ణి శక్తియుక్తులను కూడ, నాసిక్ ప్రశస్తి వివరిస్తుంది. ఆ రాజు పోరజన నివిసేస సమసుఖదుఖ (పౌరజన నిర్విశేష సమ సుఖదుఃఖ), అనగా పౌర జనులతో సమస్త సుఖదుఃఖాలను సమంగా అనుభవించేవాడు; ధమోవజిత కర వినియోగకర (ధర్మోపార్జిత కర వినియోగకర), ధర్మానుగుణంగా పన్నులను వసూలుచేసి, (ధర్మానుగుణంగానే) వినియోగించేవాడు; దిజావరకుటుంబ వివధనస (ద్విజావర కుటుంబ వివర్ధన), వినివతిత చాతవణసకరస (వినివర్తిత చతుర్వర్ణసంకరస్య) నాలుగు వర్ణాల నడుమ సంకరాన్ని నివారించినవాడు, సపురిసానాం అసయ (సత్పురుషానాం ఆశ్రయ), సత్పురుషులకు ఆశ్రయమైన వాడు; సిరీయ అదిథానస (శ్రేయః అధిష్ఠానస్య), శ్రీ (లక్ష్మికి) అధిష్ఠానం (నిలయమైనవాడు); ఏకాకుస (ఏకాకి యశస్య అకుశం), అనగా అధికారాన్ని ధరించిన ఏకైక వ్యక్తి, నిరంకుశుడని నాసిక్ ప్రశస్తి వలన తెలియవస్తున్నాడు.

పైన వివరించినట్లు, గౌతమీపుత్ర శాతకర్ణి వ్యక్తిత్వాన్ని, విజయాలను, అత్యున్నతంగా ప్రశంసిస్తూ, శాసనాన్ని చెక్కించడం, ఆ నాటికి ఆ రాజు సజీవుడు కాడని, స్పష్టంగా సూచిస్తూంది. ఏ తల్లి సజీవుడైన కుమారుని గూర్చి, అటువంటి ప్రశంసాయుతమైన వర్ణనలను చేయదు.

3.5.4.6 : గౌతమీపుత్ర శాతకర్ణి అనంతరం శాతవాహనులు

గౌతమీపుత్ర శాతకర్ణి తర్వాత, అతని కుమారులు వాసిష్ఠీ పుత్ర పులుమావి, వాసిష్ఠీ పుత్ర శాతకర్ణి, వాసిష్ఠీ పుత్ర శివశ్రీ పులుమావి, వరుసగా సింహాసనాన్నధిష్ఠించి పరిపాలించినట్లు, పురాణాలు తెలియజేస్తున్నాయి. అతని 24వ రాజ్య సంవత్సర నాటి శాసనం, కార్లా గుహాలయాల్లో కానవస్తున్నది. కనుక, పురాణాలు పేర్కొంటున్నట్లు, అతడు 28 సంవత్సరాలు పరిపాలించి ఉండొచ్చు. వాసిష్ఠీపుత్ర శాతకర్ణి 13 సంవత్సరాలు, వాసిష్ఠీపుత్ర శివశ్రీ 7 సంవత్సరాలు పరిపాలించినట్లు, పురాణ వాఙ్మయం వలన తెలుస్తున్నది.

BRAOU

3.5.4.7 : వాసిష్ఠీపుత్ర పులుమావి

గౌతమీపుత్ర శాతకర్ణి తర్వాత, అతని కుమారుడైన వాసిష్ఠీపుత్ర పులుమావి రాజ్యాన్ని పరిపాలించాడు. ఇతని పరిపాలనా కాలం అన్ని వైపుల తీవ్ర పోరాటాలతో, కల్లోలంగా ఉన్నట్లు తోస్తుంది. గౌతమీపుత్ర శాతకర్ణి సాధించిన ఘన విజయాలు, రాజ్య విస్తరణ, చిర కాలం నిలవ లేదు. ఆ రాజు క్షహరాతులను నిరవశేషం చేసి, వింధ్య పర్వతాలకు ఆవల ఉన్న జనపదాలను ఆక్రమిస్తే, క్రీ.శ. 150 నాటి రుద్రదాముని జునాగఢ్ శాసనం వలన, అవి అతని సామ్రాజ్యం లోని అంతర్భాగాలైనట్లు తెలియచస్తూంది. అంటే, క్షహరాతుల స్థానాన్ని ఆక్రమించిన కార్దమక శకులు, వింధ్య పర్వతాలకు ఆవల ఉన్న శాతవాహన సామ్రాజ్య భాగాలను జయించి, తమ సామ్రాజ్యంతో కలుపుకొన్నారు.

3.5.5 వాసిష్ఠీపుత్ర పులుమావి : కార్దమక శకులు

గౌతమీపుత్ర శాతకర్ణి క్షహరాతుల ఆధిపత్యాన్ని నిర్మూలించినా, శకుల ప్రాబల్యం అంతరించ లేదు. చష్టనుడనే వాని నాయకత్వంలో కార్దమకులనే వేరొక శాఖకు చెందిన శకులు, అచిర కాలంలో మాళ్వ, సురాష్ట్ర, కచ్ ప్రాంతాలను శాతవాహనుల నుండి జయించి, స్వాధీనపర్చుకున్నారు. చష్టనుడు వాసిష్ఠీపుత్ర పులుమావికి సమకాలికుడైనట్లు, టోలమీ అనే గ్రీక్ భూగోళ శాస్త్ర రచయిత తన గ్రంథంలో పేర్కొన్నాడు. వాస్తవంగా, పులుమావి పరిపాలనా కాలం నాటికే చష్టనుడు వృద్ధుడు కాగా, అతని మనుమడైన రుద్రదాముడు తాతతో కలిసి, పరిపాలన నిర్వహిస్తూ, కార్దమక శక సామ్రాజ్యాన్ని విస్తరింపజేశాడు. రుద్రదాముని జునాగఢ్ శాసనం ఆకరావంతి, అరార్త, కచ్ఛ, అనూప, కుకుర, అపరాంత, సురాష్ట్ర మొదలైన రాజ్య భాగాలను అతని సామ్రాజ్యంలో చేర్చింది. గౌతమీపుత్ర శాతకర్ణి యుద్ధ విజయాలు, సామ్రాజ్య విస్తరణ, అచిర కాలంలోనే నిష్ఫలమైనట్లు, వింధ్య పర్వతాలకు ఆవల సామ్రాజ్య భాగాలను, శాతవాహనులు మరొకసారి కోల్పోయినట్లు, జునాగఢ్ శాసనం వలన స్పష్టమౌతూంది.

జునాగఢ్ శాసనం, రుద్రదాముడు దక్షిణాపథ పతైన శాతకర్ణిని రెండు సార్లు ఓడించి, అతనితో గల సన్నిహిత బాంధవ్యం వలన వధించకుండా వదిలిచేసినట్లు, చర్చిస్తూంది. ఈ శాతకర్ణి వాసిష్ఠీపుత్ర పులుమావి సోదరుడు. ఇతని కాలం నాటి ఒక కన్హేరి శాసనం వలన, రుద్రదాముని కుమార్తె ఇతని రాణి అని తెలియవస్తున్నది. ఈ సంబంధం వలననే, రుద్రదాముడు ఇతన్ని రెండు సార్లు ఓడించి, వదిలిచేశాడు. కాగా, కార్దమకుల నుండి స్రామ్రాజ్య భాగాలను తిరిగి స్వాధీనపర్చుకొనేందుకు, పులుమావి తన సోదరుణ్ణి నియోగించినట్లు, అతను రెండు సార్లు తీవ్ర పోరాటాలు చేసినా ప్రయోజనం చేకూరనట్లు, స్పష్టపడుచున్నది. అయితే, వాసిష్ఠీపుత్ర పులుమావి 22వ రాజ్య సంవత్సరం నాటి నాసిక్ శాసనం, 24వ రాజ్య సంవత్సరం నాటి కార్ల శాసనం వలన, ఆ రాజు తన పరిపాలనా కాలంలో కొంకణ, అపరాంత దేశాలపై తన ఆధిపత్యాన్ని నిలుపుకోగలిగినట్లు తెలియచస్తున్నది.

3.5.5.1 : పులుమావి తూర్పు తీర విధానం

క్షహరాత శకుల ప్రాబల్యం వలన కోల్పోయిన పశ్చిమ తీర వాణిజ్యానికి మారుగా, తూర్పు తీరాన్ని ఆక్రమించి, అక్కడి ప్రజానీకాలు సాగిస్తున్న విదేశీ వాణిజ్యంపై ఆధిపత్యాన్ని పొందడానికి, గౌతమీపుత్ర శాతకర్ణి ప్రయత్నాలను ప్రారంభించాడు. తూర్పు తీర ప్రాంతం ఆ రాజు కాలం

BRAOU

నాటి శాతవాహన సామ్రాజ్యంలో చేరి ఉన్నట్లు, నాసిక్ ప్రశస్తి శాసనం తెలియజేస్తుంది. ఈ సామ్రాజ్య విస్తరణ, శాతవాహనుల తూర్పు తీరంపై పరిపాలిస్తున్న బరమహామేఘవాహన వంశీయులతో దీర్ఘ కాలిక పోరాటాలకు దారితీసింది. ఆ వంశంలో అత్యంత ప్రసిద్ధుడైన ఖారవేలుడు తన హథిగుంఫ శాసనంలో, శాతకర్ణిని లెక్కచేయకుండా, తన ప్రబల సేనలను పశ్చిమ దిశగా పంపినట్లుగా వర్ణించుకొన్నాడు. ఈ దండయాత్ర నిస్సందేహంగా శాతవాహన సామ్రాజ్యం పైకి పంపిందే. ఈ దండయాత్రతోబాటు, ఖారవేలుడు అనేక త్రమిర రాజ్య సంఘటనను, అనగా కొన్ని ద్రవిడ (తమిళ) రాజ్యాల సమాఖ్యను విచ్ఛిన్నం చేసినట్లు, ఆ రాజు నిర్మించిన పితుండ నగరాన్ని ధ్వంసం చేసి, గాడిదలు పూన్చిన నాగళ్ళతో దున్నించినట్లు, వివరిస్తూంది. ఈ పితుండ నగరం టోలమీ తన భూగోళ శాస్త్రంలో పేర్కొన్న పిటిండ్ర (Pytimdra) నగరం. అయితే, హథిగుంఫ శాసనం పేర్కొనే "అవరాజు" అనే పదాన్ని "అరువ రాజు" అని గ్రహించడం, యుక్తం. తూర్పు తీరంలో క్రీ.శ. మొదటి శతాబ్ది నాటికి, "అరువ" అనే జాతి "కొడుందమిళ్" అనే అపభ్రంశ తమిళ భాషను మాట్లాడే జనులు నివసిస్తున్నట్లు, వారు వర్తక వాణిజ్యాలను నిర్వహిస్తూ నగర రాజ్యాలు, జనపదాలను నిర్వహించినట్లు భావించడానికి అవకాశముంది. బహుశా ఈ జనపదాలు, నగర రాజ్యాల అధిపతులు, శాతవాహనులతో మైత్రి వహించి ఉంటారని, అందుచేతనే ఖారవేలుడు వారిపట్ల తీవ్రమైన ద్వేష భావాన్ని ప్రదర్శించాడని తోస్తుంది.

వాసిష్ఠీపుత్ర పులుమావి పరిపాలనా కాలానికి చెందిన ఒక అమరావతి శాసనం, తీరాంధ్ర దేశంలో పలు చోట్ల లభిస్తున్న అతని నాణేల వలన, ఆ రాజు పరిపాలనాధికారం తూర్పు తీర ప్రాంతంపై పటిష్ఠంగా నిల్చిఉన్నట్లు, గ్రహించొచ్చు. ఖారవేలుడు తాను శాతకర్ణి రాజ్యంపై దండయాత్ర పంపినట్లు, తన హథిగుంఫ శాసనంలో పేర్కొన్నప్పటికి, ఆ సమయంలో శాతవాహన సామ్రాజ్యాన్ని పరిపాలిస్తున్నవాడు వాసిష్ఠీ పులుమావిగా భావించడం, యుక్తం.

ఈ విధంగా వాసిష్ఠీ పుత్ర పులుమావి పరిపాలనా కాలం ఎడతెగని పోరాటాలతో కూడి ఉంది. ఈ పోరాటాలు తీరాంధ్ర ప్రాంతంలో ఆశించిన ప్రయోజనాన్ని చేకూర్చినా, దక్కన్ పీఠభూమి పశ్చిమ భాగాన కార్దమ శకులతో చేసిన పోరాటాలు మాత్రం, విఫలమైనాయి. రుద్రదాముని జునాగఢ్ శాసనం, క్రీ.శ. 150 నాటిది; అనగా, వాసిష్ఠీపుత్ర పులుమావి పరిపాలనా కాలం లోనే, అతని సోదరుడైన శాతకర్ణి రెండు సార్లు కార్దమక శకులతో విఫల పోరాటాలను చేశాడు. శాతవాహన సామ్రాజ్యం చాలా భాగం నష్టమైంది.

3.5.6 : కడపటి శాతవాహనులు

పురాణాలు వాసిష్ఠీపుత్ర పులుమావి తర్వాత శివశ్రీ 7 సంవత్సరాలు పరిపాలిస్తాడని పేర్కొంటున్నాయి. "వాసిష్ఠీపుతస సివసిరి పులుమానిస" అనే నామాంకం కలిగిన నాణేలు, తూర్పు తీర ప్రాంతంలో లభించడాన, నేటి ఆంధ్రప్రదేశ్ తూర్పు తీరంపై శాతవాహనుల ఆధిపత్యాన్ని ఇతడు సుస్థిరం చేసి, పరిపాలించాడని చెప్పొచ్చు. ఇటీవలి కాలంలో, ఇతని శిలా శాసన మొకటి, బనవాసిలో లభించింది. ఈ శాసనం వలన, ఇతడు కుంతల దేశాన్ని కూడ పాలించాడని భావించొచ్చు. "వాసిష్ఠ పుత్ర" అనే మాతృ నామ సంజ్ఞ వలన, ఇతడు గౌతమీపుత్ర శాతకర్ణి కుమారుల్లో ఒకడు, వాసిష్ఠీ పుత్ర పులుమావి సోదరుడని గ్రహించొచ్చు.

BRAOU

పైన పేర్కొన్నట్లు, కన్హేరీ గుహాల్లోని ఒక శాసనం వలన, వాసిష్ఠీ పుత్ర శాతకర్ణి తెలియ వస్తున్నాడు. ఈ శాసనం ఇతని రాణైన ఒక కార్దమక రాకుమార్తె చెక్కించింది. ఆమె తాను రుద్రదాముని కుమార్తెనని, ఆ శాసనంలో వర్ణించుకుంది. రుద్రదాముడు రెండు మార్లు ఓడించి, ప్రాణ దానం చేసిన "దక్షిణాపథ పతి" అయిన శాతకర్ణి ఇతడేనని స్పష్టంగా చెప్పొచ్చు. ఈ రాజు నాణేలు తూర్పు తీర ప్రాంతంలో, తెలంగాణా జిల్లాలలో, మహారాష్ట్రలో పలు చోట్ల లభిస్తున్నాయి.

నానాఘాట్ గుహలో వాసిష్ఠీపుత్ర స్కంద శాతకర్ణి 13వ రాజ్య సంవత్సరంలో చెక్కించిన శాసన మొకటి కానవస్తున్నది. ఇతని నామాంకమైన నాణేలు కూడ, నేటి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలో, పలు చోట్ల కానవస్తున్నాయి. "వాసిష్ఠీపుత్ర" అనే మాతృ నామ సంజ్ఞ వలన, శాతకర్ణి, స్కంద శాతకర్ణి కూడ, వాసిష్ఠీపుత్ర పులుమావి సోదరులు కావచ్చుననిపిస్తుంది. శివశ్రీ పులుమావి అనంతరం, వాసిష్ఠీపుత్ర శాతకర్ణి, అతని తర్వాత వాసిష్ఠీపుత్ర స్కందశాతకర్ణి రాజ్యాన్ని పరిపాలించి ఉండొచ్చు. ఖారవేలుని సమకాలికుడైన శాతకర్ణి, వీరిలో ఒకడై ఉండొచ్చు. అయితే, వీరిద్దరూ వేర్వేరు రాజులు కాక, ఒకనిగానే భావించడం మరింత సమంజసం. కాని, అందుకు మరింత పరిశోధనలు జరుగవలసి ఉంది.

3.5.6.1 : గౌతమీపుత్ర శ్రీయజ్ఞ శాతకర్ణి

శాతవాహన వంశం లోని గొప్ప చక్రవర్తులలో చివరి వాడు, గౌతమీపుత్ర శ్రీయజ్ఞ శాతకర్ణి. అన్ని పురాణ పట్టికలు గౌతమీపుత్ర శ్రీయజ్ఞ శాతకర్ణి 29 సంవత్సరాలు పరిపాలించినట్లు, ఏక వాక్యంగా పేర్కొంటున్నాయి. నేటి ప్రకాశం జిల్లాలోని చిన గంజాం వద్ద, ఇతని 27వ రాజ్య సంవత్సరం నాటి శిలా శాసన మొకటి లభించింది. రెండు తెరచాప కొయ్యలు కలిగిన ఓడ గుర్తుతో, "గోతమీపుత సిరియఞసాతకనిస" అనే నామాంకంతో, ఇతని నాణేలు ఆంధ్రప్రదేశ్ కోస్తా జిల్లాల్లోను, తమిళనాడు తీరం వెంట కడలూర్ వరకు, అనేక ప్రదేశాల్లో లభిస్తున్నాయి. ఈ నాణేలు, శాసనాధారాల వలన, తూర్పు తీరాన ఉన్న అనేక రేవు పట్టణాలు ఆగ్నేయాసియా దేశాల తోను, చైనా దేశం తోను వాణిజ్య సంబంధాలను కలిగి ఉండేవని తెలుస్తూంది. ఈ సముద్రాంతర వాణిజ్యం శ్రీయజ్ఞ శాతకర్ణి వశమైంది. అతని నాణేలపై ఓడ గుర్తు, ఈ సముద్రాంతర వాణిజ్యం పైన అతని ఆధిపత్యాన్ని రుజువు చేస్తూంది.

శ్రీ యజ్ఞ శాతకర్ణి ప్రాబల్యంతో, తూర్పు తీరంపై ఆధిపత్యం కొరకు శాతవాహనులతో పోరా డుతున్న బరమహామేఘవాహనులు బలహీనులైనారు. వారు శాతవాహనుల ఆధిపత్యాన్ని గుర్తించి, సామంతులైనారని భావించొచ్చు. ఆ వంశం లోని సివమకసద, మహాసద, అనే రాజులు, బహుశః శ్రీయజ్ఞ శాతకర్ణికి, అతని అనంతర రాజులకు సమకాలికులై ఉండొచ్చు.

గౌతమీపుత్ర శ్రీయజ్ఞ శాతకర్ణి కాలంలో శాతవాహనుల రాజకీయ ప్రభావం, దక్షిణ భారతదేశం లోనికి, అనగా తమిళగం లోనికి విస్తరించినట్లు తోస్తుంది. ఓడ చిహ్నం గల అతని నాణేలు తమిళనాడు తీరమంతటా లభిస్తున్న విషయాన్ని పైన పేర్కొనడం జరిగింది. ఈ నాణాలు మాత్రమే కాక, ప్రాచీన తమిళ మహా కావ్యమైన సిలప్పదిగారమ్ పాసండసత్తానే ఆ ఉత్సవానికి హాజరైనట్లు, పేర్కొంటూంది. నూరువురు కణ్ణరే, అనగా శాతకర్ణి కాగా, ఈ పేరు గౌతమీపుత్ర శ్రీయజ్ఞ శాతకర్ణిని గూర్చి ప్రస్తావిస్తుందని చరిత్రకారుల అభిప్రాయం. పాసండ సాత్తాన్, అనగా పాషాండమైన శాతవాహనుడు అని అర్థం. పాషాండుడు అనగా, వేదాన్ని నిరసించేవాడు. శ్రీయజ్ఞ శాతకర్ణి కడపటి

BRAOU

కాలంలో బౌద్ధ మతం పట్ల ఆదరణ చూపినట్లు, నాగార్జునాచార్యుణ్ణి తన రాజ్యంలో నిలుపుకొని, ఆయన కొరకు మహా విహారాలు, చైత్యాలను నిర్మించినట్లు, సాంప్రదాయకంగా ఉన్న జన వాక్యాన్ని హ్యూయన్‌త్సాంగ్ పేర్కొన్నాడు. బౌద్ధ మతాన్ని అవలంబించడంలో ఇతన్ని "పాషాండ శాతవాహను" డని ప్రజలు వ్యవహరించి ఉండొచ్చు. ఈతని విహారాల, చైత్యాల నిర్మాణంలో, నాగార్జునకొండ ప్రాధాన్యతను పొందడం ప్రారంభించినట్లు, చరిత్రకారుల అభిప్రాయం.

3.5.6.2 : శాతవాహన సామ్రాజ్య అస్తమయం

గౌతమీపుత్ర శ్రీయజ్ఞ శాతకర్ణి తర్వాత, విజయ శాతకర్ణి 6 సంవత్సరాలు పరిపాలించినట్లు, పురాణ వాఙ్మయం పేర్కొంటూంది. విజయ శాతకర్ణి 6వ సంవత్సరం నాటి శాసనం, నాగార్జున కొండ త్రవ్వకాలలో లభించింది. కనుక, ఇతని పరిపాలన గూర్చి పురాణ వాక్యం విశ్వసనీయమైనదిగా భావించొచ్చు. బహుశ:, శ్రీ పర్వత - నాగార్జునకొండ సమీపాన విజయపురి నిర్మాణాన్ని ఈతడే ప్రారంభించినట్లు, ఆ నగరానికి ఈ రాజు పేరే స్థిరపడినట్లు, హెచ్. సర్కార్ ఊహించాడు. ఆయన ఊహ యుక్త యుక్తంగానే ఉంది. విజయ శాతకర్ణి నాణేలు తరహాల నిధిలో లభించాయి.

విజయ శాతకర్ణి తర్వాత పురాణాలు చందసిరి (లేదా చండసిరి) 7 సంవత్సరాలు రాజ్యం చేసినట్లు పేర్కొంటున్నాయి. వాసిఠీపుత్ర సిరిచందసాతి అనే రాజు, తన ఆరో రాజ్య సంవత్సరంలో వేసిన శిలా శాసనం, తూర్పు గోదావరి జిల్లా లోని కొడవలి అనే గ్రామం వద్ద లభించింది. ఇతని నామాంకం కలిగిన నాణేలు, నేటి ఆంధ్రప్రదేశ్ లోని కోస్తా జిల్లాలలో మాత్రమే లభిస్తున్నాయి. ఇతని తర్వాత శాతవాహన సామ్రాజ్యం ఇంచుమించుగా అంతరించింది.

చందసాతి, లేదా చందశ్రీ తర్వాత, పులుమావి పరిపాలించినట్లు పురాణ వాఙ్మయం పేర్కొం టూంది. అయితే, కొన్ని పురాణాలు పులుమావి పేరు ముందు "అన్యస్తేషాం" అనే పదాన్ని ప్రయోగించాయి. అంటే, ఇతరులైన వారిలో అని అర్థం. కనుక, శాతవాహన సామ్రాజ్యం అస్త మించిన తర్వాత ఏర్పడిన అనేక స్థానిక రాజ వంశాల్లో, ఒక దానికి, లేదా ఒక శాతవాహన వంశ ఉప శాఖకు ఇతడు చెందినట్లు, ఈ పదం సూచిస్తుంది. కాగా, శాతవాహన వంశంలో చివరి వాడు, చంద్రశ్రీ అని భావించడం, యుక్తం.

ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో అనేక ప్రదేశాల్లో సింహం గుర్తు గల నాణేలు "సకసద" అనే నామాంకంతో కానవస్తున్నాయి. 'సకసద' శక శాతకర్ణి అని, కన్హేరీ గుహాలయాల్లోని ఒక శాసనం వలన తెలియవస్తున్న మాఢరీపుత్ర శకసేనుడు కూడ ఇతడేనని, లోగడ కొందరు చరిత్రకారులు భావించారు. కాని, ఈ ఊహలు ఇటీవలి పరిశోధనల వలన నిజం కాదని తెలియవస్తూంది. సకసద అనే రాజు ఐర వంశీయుడు, శాతవాహన వంశీయుడు కాదని, 'సద' అనే నామాంతాన్ని "శాతకర్ణి"కి పర్యాయ పదంగా ఎల్ల వేళలా స్వీకరించరాదని, పైన నిర్ధారణగా చెప్పడం జరిగింది. అలాగే, కన్హేరీ గుహాలయం లోని శాసనాన్ని వేసిన మాఢరీపుత్ర శకసేనుణ్ణి శాతవాహన రాజుగా గుర్తించి, అతడు విజయ శాతకర్ణిని ఓడించి, మహారాష్ట్ర ప్రాంతాల నుండి తరిమివేశాడని, అంటే శాతవాహన రాకుమారుల నడుమ ఒక అంతర్యుద్ధం జరిగిందని, లోగడ మూరేమండ రామారావ్ అభిప్రాయపడ్డాడు. కాని, ఈ గుర్తింపు, దానిపై నిర్మించిన ఊహలు, పూర్తిగా నిరాధారాలు, అసంగతమైనవి. శకసేనుని అతని పేరే సూచిస్తున్నట్లు, ఒక శక వంశీయునిగా భావించడం, యుక్తం. ప్రాచీన కాలంలో ఈ 'సేన' అనే నామాంతం, శక, పహ్లవ జాతులకు చెందిన రాజులే బహుళంగా ధరించారు. అయితే, అతడు

BRAOU

విజయ శాతకర్ణిని ఓడించి, కొంకణ, అపరాంత భూభాగాలను ఆక్రమించినట్లు భావించడం మాత్రం, యుక్తమే.

శక శాతకర్ణి నాణేలపై ఒక వైపు ఏనుగు, రెండవ వైపు ఉజ్జయినీ చిహ్నాలున్నాయి. సకనద నాణాలపై సింహం గుర్తు ఉంది. కనుక, ఈ ఇద్దరు రాజులు ఒకరుగా గుర్తించ రాదు. ఏనుగు, ఉజ్జయినీ చిహ్నం కల నాణేలను, రుద్ర శాతకర్ణి, కర్ణ (లేక కన్హ) శాతకర్ణి, కుంభ శాతకర్ణి, కౌశికీపుత్ర శాతకర్ణి అనే రాజులు కూడ, ముద్రించారు. వీరి నాణేలు ఆంధ్రప్రదేశ్ కోస్తా జిల్లాలు, తెలంగాణా లోని ఖమ్మం, కరీంనగర్, మహారాష్ట్ర లోని కొన్ని ప్రాంతాల్లో కానవస్తున్నాయి. ఈ రాజులు పురాణ పట్టికల నుండి, లేదా శాసనాధారాల నుండి తెలియరారు. వీరిని శాతవాహన వంశీయులుగా భావించడం జరిగితే, సామ్రాజ్యం అంతరించిన తర్వాత ఆ వంశానికి చెందిన ఒక ఉప శాఖ ఈ ప్రాంతాలను ఆక్రమించి, స్వతంత్రంగా పరిపాలించిందని నిర్ణయించడం సమంజసం. పురాణాలు వేర్కొనే ఆంధ్ర భృత్యులైన ఆంధ్రులు, వీరే కావచ్చు.

3.6 : సంగ్రహంగా

శాతవాహన సామ్రాజ్యం ఆంధ్ర దేశ చరిత్రకు ప్రారంభ ఘట్టం. దక్కన్ పీఠభూమిపై ఉన్న అసంఖ్యాకమైన తెగలు నెలకొల్పిన జనావాసాలు (Tribal States, or settlements), ఈ సామ్రాజ్య వ్యవస్థలో చేరడం చేత, రాజకీయంగాను, సాంస్కృతికంగాను, సమైక్యతను సాధించే ప్రక్రియ ప్రారంభమైంది. సుమారు రెండున్నర శతాబ్దాల కాలం వెలసిల్లి, అత్యంత ప్రాధాన్యమైన పాత్ర నిర్వహించిన శాతవాహనుల చరిత్ర, వివాదగ్రస్తంగా, ఏ అంశం లోను స్పష్టంగా గ్రహించలేని సందిగ్ధాలతో నిండి ఉంది. అయితే, విశ్వసనీయమైన సాక్ష్యాధారాలను మాత్రమే పరిగణనలోనికి తీసుకొని, ఈ వంశ చరిత్రను పునర్నిర్మించడం సమంజసం.

మధ్య పశ్చిమ దక్కన్ పీఠభూమి ప్రాంతాలను పరిపాలిస్తూ, శాతవాహనులు స్థాపించిన సామ్రాజ్యం, శక, పహ్లవుల వలన తీవ్రమైన సంఘర్షణలను ఎదిరించాల్సొచ్చింది. మొదటి శాతకర్ణి తర్వాత శాతవాహనుల రాజ్యాధిపత్యం, ఈ సంఘర్షణల కారణంగా కనుమరుగైంది. గౌతమీపుత్ర శాతకర్ణి తిరిగి ఈ వంశ ప్రతిష్ఠను, సామ్రాజ్యాధిపత్యాన్ని పునరుద్ధరించాడు.

నాసిక్ ప్రశస్తి వలన గౌతమీపుత్ర శాతకర్ణి దక్కన్ పీఠభూమి పైన గల జనపదాలను ఓడించి, లోబర్చుకొన్నట్లు, శక, యవన, పహ్లవుల వంటి విదేశీయుల రాజ్యాధిపత్యాన్ని నిర్మూలించినట్లు, తెలియవస్తుంది. జోగల్ తంబి అనే గ్రామం వద్ద లభించిన నాణేల నిధిలో, ఇతడు నహపాణుని నాణాలను పునర్ముద్రించి, విడుదల చేసినట్లు తెలియవస్తూంది. ఈ నాణేలు నాసిక్ ప్రశస్తి వేర్కొన్నట్లు, శకులపై అతడు సాధించిన విజయాన్ని సూచిస్తాయి. అయితే, గౌతమీపుత్ర శాతకర్ణి సాధించిన విజయాలు శాశ్వత ఫలితాల నివ్వలేదు. అతని తర్వాత పాలించిన అతని కుమారులు, క్రమంగా మాళ్వ, సురాష్ట్ర, కొంకణ ప్రాంతాలను పోగొట్టుకొన్నారని, ఆ ప్రాంతాలను వేరొక శాఖకు చెందిన శకులు ఆక్రమించారని, శాసనాధారాల వలన, నాణేల వలన స్పష్టపడుతూంది. కడపటి శాతవాహనుల్లో గౌతమీపుత్ర శ్రీయజ్ఞ శాతకర్ణి, మరొక సారి కొంకణ, అపరాంత భూభాగాలను ఆక్రమించ ప్రయత్నించినట్లు, అతడు పశ్చిమ కనుమల్లోని గుహాలయాల్లో చెక్కించిన కొన్ని శాసనాలు సూచిస్తున్నాయి. అయితే, ఈ విజయాలు గట్టి ఫలితాన్నియ్యలేదని స్పష్టంగా గ్రహించొచ్చు. అతని తర్వాత పరిపాలించిన శాతవాహనులు సమర్థులు కారు. ఆ రాజుల్లోని ఎవరి నాణాలు, నేటి

BRAOU

ఆంధ్రప్రదేశ్ లోను, సన్నిహిత ప్రాంతాలతో కూడిన దక్కన్ పీఠభూమిపై మాత్రమే లభించడాన, వారి పరిపాలన చాల పరిమిత భూభాగంపై మాత్రమే వ్యాపించినట్లు, స్పష్టపరుస్తాయి.

దక్కన్ పీఠభూమిపై నెలకొన్న అనేక స్థానిక రాజ్యాలు క్రమంగా బలపడినందున, శాతవాహనుల సామ్రాజ్య వ్యవస్థ బలహీనమై, పతనమైంది.

3.7 : పరీక్షా నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాస రూప సమాధానాలను రాయుండి.

1. శాతవాహనులు ఆంధ్రులు అవునా, కాదా? విచారించండి.
2. శాతవాహనుల స్వస్థలాన్ని గూర్చి చర్చించండి.
3. శాతవాహనుల వంశ నామం, కులాన్ని గూర్చి గల భిన్న వాదాలను పేర్కొనండి.
4. శాతవాహనుల చరిత్రకు పురాణ వాఙ్మయం, శాసనాలు, నాణేలు ఎంతవరకు ప్రయోజన కరమో పరిశీలించండి.
5. శాతవాహన వంశ కాలానుక్రమణికను ఎలా నిర్ధారించెదవు?
6. గౌతమీపుత్ర శాతకర్ణి ఘనతను విశ్లేషించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయుండి.

1. శాతవాహన రాజ్య స్థాపనను శ్రీముఖుడు ఏవిధంగా కావించాడు?
2. నానాఘాట్ ప్రతిమా శాసనాలు శాతవాహన చరిత్ర కెలా తోడ్పడుతున్నాయి?
3. నాసిక్ ప్రశస్తి శాసన చారిత్రక ప్రాధాన్యతను విశ్లేషించండి.
4. జునాగడ్ శాసన విశేషాల చారిత్రక ప్రాధాన్యతను తెల్పండి.
5. గౌతమీపుత్ర యజ్ఞశ్రీ శాతకర్ణి పాలనా విశేషాలను సమీక్షించండి.

3.8 : ఉపయుక్త గ్రంథాలు

1. Bhandarkar, R.G. : **Early History of the Deccan**, (Reprint), New Delhi, 1983
2. Chattopadhyaya, S. : **Some Early Dynasties of South India**, Delhi, 1974.
3. Gopalachari, K. : **Early History of the Andhra Country**, 2nd Edn. Madras, 1976.
4. Hanumantharao, B.S.L. : **The Age of Satavahanas**, Hyderabad, 1976.

BRAOU

5. Mirashi, V.V. : **The History and Inscriptions of the Satavahanas and Western Kshatrapas**, Bombay, 1981.

6. Parabrahma Sastry, P.V. : **Satavahana Epoch: A New Light**, Hyderabad, 1994.

7. Rama Rao, M. : **Studies in the Early History of Andhra desa**, Madras, 1974.

8. Shastri, A. M. : **Early History of the Deccan**, New Delhi, 1987.

9. Yazdani, G. (Ed.) : **The Early History of the Deccan**, (Reprint) New Delhi, 1982.

10. Hanumantha Rao, B.S.L. : ఆంధ్రుల చరిత్ర, గుంటూరు 1987,

11. M. Rama Rao, (Ed.) : శాతవాహన సంచిక, గుంటూరు, 1940

12. Sundara Rama Sastry, V. : **దక్షిణ భారతదేశ చరిత్ర**, తెలుగు అకాడమి ప్రచురణ, హైదరాబాద్, 1991.

రచయిత : డా.వి. సుందరరామ శాస్త్రి

BRAOU

భాగం-4 : పరిపాలన, ఆర్థిక వ్యవస్థ

విషయక్రమం

4.0 : లక్ష్యాలు

4.1 : పరిచయం

4.2 : సాక్ష్యాధారాల సమీక్ష

4.3 : సామ్రాజ్య విధానం

4.3.1 : శాతవాహన సామ్రాజ్యం - ఒక సమాఖ్య

4.3.2 : శాతవాహన స్సామ్రాజ్యం - సామంత రాజ్యాలు

4.3.3 : శాతవాహన సామ్రాజ్య స్థాపన - అనుకూల పరిస్థితులు

4.4 : పరిపాలనా విధానం

4.4.1 : రాజు, రాజ ధర్మం

4.4.2 : వారసత్వ విధానం - మాతృస్వామ్యం

4.4.3 : రాజు - అధికారం

4.4.4 : అమాత్యులు

4.4.5 : ఇతర ఉన్నతాధికారులు

4.4.6 : స్థానిక పరిపాలన

4.4.7 : ఆర్థిక పరిపాలన

4.5 : ఆర్థిక స్థితిగతులు

4.5.1 : వ్యవసాయం

4.5.2 : పంటలు

4.5.3 : సాగునీటి ఏర్పాట్లు

4.5.4 రాజకీయ-ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం మూలాధారం

4.5.5 : వృత్తులు - పరిశ్రమలు

4.5.6 : వృత్తి సంఘాలు

4.5.7 : పారిశ్రామిక - వర్తక పెట్టుబడులు

4.5.8 : వర్తక వాణిజ్యాలు - వాణిజ్య వస్తువులు

4.5.9 : ప్రాచీన వాణిజ్య సంబంధాలకు సాక్ష్యాధారాలు

BRAOU

4.5.10 : వర్తక మార్గాలు

4.5.11 : వర్తక కేంద్రాలు - రేవు పట్టణాలు

4.5.11 : వాణిజ్య వస్తువులు

4.6 : నాణేలు

4.6.1 : రోమన్ నాణేలు

4.6.2 : దేశీయ నాణేలు

4.6.3 : తొలి శాతవాహనుల నాణేలు

4.6.4 : గౌతమీపుత్ర శాతకర్ణి నాణేలు

4.6.5 : గౌతమీపుత్ర శాతకర్ణి తర్వాతి శాతవాహనుల నాణేలు

4.6.6 : కడపటి శాతవాహనుల నాణేలు

4.7 : సంగ్రహంగా

4.8 : పరీక్ష నమూనా ప్రశ్నలు

4.9 : ఉపయుక్త గ్రంథాలు

4.0 : లక్ష్యాలు

రాజకీయంగాను, సాంస్కృతికంగాను దక్కన్ పీఠభూమిపై వివిధ ప్రజానీకాలు ఏర్పర్చిన జనావాసాలను ఒక వ్యవస్థ క్రింద సమైక్యం చేసిన శాతవాహనుల సామ్రాజ్య విధానం, సామ్రాజ్య స్థాపన, పరిపాలనా విధానాన్ని అధ్యయనం చేయడం, ఈ భాగాధ్యయన లక్ష్యాల్లో మొదటిది. వారి సామ్రాజ్య స్థాపనకు, సుస్థిరతకు సాయపడిన ఆర్థిక స్థితిగతులను విమర్శనాత్మకంగా అధ్యయనం చేయడం, మరొక లక్ష్యం. ఈ ఆర్థిక స్థితిగతుల క్రింద, నాటి వ్యవసాయం, వివిధ వృత్తులు, పరిశ్రమలు, వర్తక వాణిజ్యాల ప్రగతిని సూక్ష్మంగా పరిశీలన చేయడమౌతుంది. శాతవాహనులు విడుదల చేసిన నాణేలు, ఆర్థిక రంగంలో వాటి పాత్రను అధ్యయనం చేయడం, ఈ పాఠ్య భాగ లక్ష్యాల్లో చేరి ఉంది.

4.1 : పరిచయం

భారతదేశ ప్రాచీన చరిత్రలో శాతవాహనులు సామ్రాజ్యాల యుగానికి (Age of Empires) చెందిన వారు. మౌర్య సామ్రాజ్యం అస్తమించిన తర్వాత ప్రాచీన భారతదేశ చరిత్రలో అత్యంత విస్తీర్ణమైన సామ్రాజ్యాన్ని నెలకొల్పినవారు, శాతవాహనులే. ఈ సామ్రాజ్య నిర్మాణానికి తోడ్పడిన అవకాశాలు, వారి సామ్రాజ్య విధానం (Imperial Policy), పరిపాలనా నిర్వహణ మొదలైన అంశాలను గూర్చి, ఆ కాలం నాటి ఆర్థిక స్థితిగతులను గూర్చి అధ్యయనం చేయడ మవసరం. అయితే, అందుకు తగిన సాక్ష్యాధారాలు లభించటం లేదు. లభిస్తున్న సాక్ష్యాధారాల ననుసరించి అధ్యయనం చేసిన చరిత్రకారులు, వివిధ దృక్పథాలను ఏర్పర్చుకున్నారు. వారి నడుమ ఏర్పడిన వాదోపవాదాలను పరామర్శిస్తూ, వాస్తవ పరిస్థితులను, పరిణామాలను గ్రహించాల్సి ఉంది.

BRAOU

4.2 : సాక్ష్యాధారాల సమీక్ష

శాతవాహనుల రాజకీయ చరిత్ర చదివినే, వారి పరిపాలనా విధానాన్ని, రాజనీతిని అవగాహన చేసుకోవడానికి పురాణాలు, ఇతిహాసాలు, ధర్మశాస్త్రాలతో కూడిన వాఙ్మయం, కొంత వరకు ఉప యోగపడుతుంది. కొందరు చరిత్రకారులు శాతవాహనులు **మను స్మృతి** (లేదా మానవ ధర్మశాస్త్రం) ననుసరించి పరిపాలించారని అభిప్రాయపడ్డారు. దానితోపాటు, కౌటిల్యుని **'అర్థశాస్త్రం'** కూడా వారికి మార్గదర్శకమై ఉండొచ్చునని, మౌర్యుల తర్వాత పరిపాలించిన శాతవాహనులు కొంత వరకు వారిని అనుకరించి ఉండొచ్చునని, వారి అభిప్రాయం.

అయితే, శాతవాహన సామ్రాజ్యం అనేక స్థానిక రాజ్యాలను, గణతంత్ర వ్యవస్థలను లోబర్చుకొని విస్తరించింది. ఆయా ప్రాంతాల్లో ఆచరణలో ఉన్న పరిపాలనా విధానాలను అవగాహన చేసికొని, అవసరాలకు అనుగుణంగా రూపొందించుకొన్నట్లు కానవస్తుంది. కేవలం గ్రంథస్థమైన సూత్రాలను కంఠస్థం చేసి, శాతవాహనులు సామ్రాజ్యాన్ని పరిపాలించ లేదు. కనుక, **'అర్థశాస్త్రం'** కూడ ఆయుగం నాటి రాజకీయ తత్వాన్ని, పరిపాలనా సంబంధమైన ఆలోచనా సరళిని తెలియజేస్తుందే కాని, వాస్తవాన్ని వివరించదు.

విదేశీయ రచనలు:- శాతవాహన యుగం నాటి భారతదేశం, విశేషించి దక్షిణ భారత ద్వీపకల్పం, మధ్యధరా సముద్ర ప్రాంతం లోని రోమన్ సామ్రాజ్యంతో, పెద్ద ఎత్తున వాణిజ్య సంబంధాలను కలిగి ఉంది. ఈ వాణిజ్యం వలన, గ్రీక్, రోమన్ నావికులు అసంఖ్యాకంగా భారతదేశానికి వచ్చేవారు. వారిలో కొందరు ఈ దేశంలో తాము చూచిన విశేషాలు, పొందిన అనుభవాలను పొందుపరుస్తూ, గ్రంథ రచన చేయడం వలన, కొంత విశ్వసనీయమైన వాఙ్మయాధారాలు లభిస్తున్నాయి. అటువంటి వాటిలో, ఒక అజ్ఞాత గ్రీక్ నావికుడు చేసిన చర్యగా రచించిన, **పెరిప్లస్ ఆఫ్ ఎరిత్రి (Periplus of Erythree)**, లేక **పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ (Periplus of Erythraean Sea)** అనే గ్రంథం, అత్యంత ప్రసిద్ధమైంది. క్లుప్తంగా దీనిని **'పెరిప్లస్'** అని వ్యవహరిస్తారు. భారతదేశం సందర్శించక పోయినా, నావికుల నుండి సంపాదించిన సమాచారం, వారి రచన లాధారంగా, కొందరు మేధావులు కొన్ని ప్రత్యేక చారిత్రక, భౌగోళిక గ్రంథాలను రచించారు. అటువంటి రచనల్లో, ప్లినీ రచించిన **'ప్రకృతి చరిత్ర' (Natural History)**, టోలమీ (Ptolemy) రచించిన **భూగోళ శాస్త్రం (Geography)** చాలా ప్రాముఖ్యమైనవి.

విదేశీ యాత్రికులు భారతీయ సంస్కృతిని ఉన్నది ఉన్నట్లుగా చూచి, రాశారు. ఈ దేశం లోని మత, సాంఘిక ధర్మాలతో, వాటికి సంబంధించిన వాదోపవాదాలతో సంబంధం లేనివారు. కనుక, వారి రచనల్లో వాస్తవం ప్రతిబింబించినట్లు, అవి చారిత్రక అధ్యయనానికి అత్యంత విశ్వసనీయమైనవని భావించొచ్చు. అయితే, ఈ రచనలు ప్రధానంగా ఆర్థిక విషయాలకు పరిమితమైనవి. భారతదేశపు నైసర్గిక స్వరూపం, వ్యావసాయిక, ఖనిజ, పారిశ్రామిక ఉత్పత్తులు, ఎగుమతులు, దిగుమతులు, వర్తక వాణిజ్య కేంద్రాలు, రేవు పట్టణాలు మొదలైన వివరాలను, ఈ రచనలు తెలియచేస్తాయి. పరిపాలనా విధానాల గూర్చి, సాంఘిక, ధార్మిక జీవనాన్ని గూర్చి, ఈ వాఙ్మయం తగినంత సమాచారాన్ని ఇవ్వదు.

శాసనాధారాలు:- దేశీయమైన సాక్ష్యాధారాల్లో సమకాలీనమైనవి, మరింత వాస్తవ విలువలు కలిగినవి, శాతవాహన యుగం నాటి శాసనాలు. పశ్చిమ కనుమల్లో కార్లా, కన్హేరీ, నాసిక్, నానాఘాట్,

BRAOU

115059
Dr. BRAOU LIBRARY

జున్నార్ మొదలైన చోట్ల, బౌద్ధ గుహాలయాల్లోను, తూర్పు తీరం లోని అమరావతి, భట్టిప్రోలు మొదలైన మహా స్తూపాల చెంత, అసంఖ్యాకంగా శిలా శాసనాలు లభించాయి. వీటిలో సుమారు ఎనభై శాతం, వర్తకులు, వ్యవసాయదారులు, వృత్తి పనివారు మొదలైన ప్రజాసామాన్యమిచ్చినవి. తక్కినవి రాజులు, వారి ఉద్యోగులు, సామంత, స్థానిక పరిపాలకులు ఇచ్చినవి.

శాతవాహన యుగం నాటి శాసనాలు, చాలా నిరాడంబరమైనవి. వాటిలో అతిశయోక్తులు, సాహిత్య సాంప్రదాయాలను అనుసరించే వర్ణనా వైఖరులు కానరావు. కనుక, చరిత్ర అధ్యయనానికి విశ్వసనీయమైన సాక్ష్యాధారాలు. అయితే, అవి చాలా పరిమిత ప్రయోజనం కలవి. బౌద్ధ సంఘారామాలకు, లేదా బ్రాహ్మణులకు భూదానాలు చేస్తూ, ఈ శాసనాలను వెయ్యడం జరిగింది. కనుక, వాటిలో ఆయా ప్రదాన విషయాలే ప్రధాన విషయాలు. సందర్భవశాన కొందరు అధికారులు ఆయా శాసన రచయితలుగాను, రాజాజ్ఞను ప్రకటించి, ఆ ప్రదానాన్ని అమలు చేసేవారు (ఆజ్ఞప్తి) గాను, కానవస్తారు. అంతవరకే, శాసనాలు మనకు అందించగల సమాచారం. ఆ నాటి పరిపాలనా విధానం, సాంఘిక, ఆర్థిక స్థితిగతుల గూర్చిన వివరాలు, సమగ్రంగా ఈ శాసనాల వలన తెలియవు; అవి లభిస్తున్న సమాచారాన్ని బట్టి, ఊహించుకొనవలసినవి.

4.3 : సామ్రాజ్య విధానం (Imperial Policy)

శాతవాహన సామ్రాజ్యం దక్కన్ పీఠభూమి మధ్య భాగం లోని అశ్మక, ముళక జనపదాలు కేంద్రంగా, దక్షిణాపథ మంతటా వ్యాపించింది. "దక్షిణాపథం" అనగా, కృష్ణా నదికి ఉత్తరంగా, వింధ్య పర్వతాలకు దక్షిణంగా ఉన్న పీఠభూమి; కృష్ణా నదికి దక్షిణంగా ఉన్న భారతదేశ ద్వీపకల్పానికి దారి (అపథ) మాత్రమే. అందుచేత, శాతవాహన రాజులు "దక్షిణాపథ పతుల"ని వర్ణించుకొన్నారు. అయితే, ఉచ్ఛ దశలో శాతవాహన సామ్రాజ్యం ఉత్తరంగా వింధ్య పర్వతాలను దాటి, కచ్, సురాష్ట్ర, మాళ్వ భూభాగాలను కూడ ఆక్రమించింది.

4.3.1 : శాతవాహన సామ్రాజ్యం - ఒక సమాఖ్య

శాతవాహన సామ్రాజ్యం విస్తరించడానికి పూర్వం, ఈ భూభాగ మంతట వివిధ ప్రజానీకాలు నెలకొల్పిన జనవాసాలు, క్రమంగా రాజ్యాలుగా, గణతంత్ర వ్యవస్థలుగా స్థిరపడుతున్నాయి. దక్కన్ పీఠభూమి వాయవ్య భాగాన పశ్చిమ కనుమల ఉత్తర భాగం, వింధ్య, సాత్పురా పర్వతాల పశ్చిమ భాగాలు విస్తరించిన భూభాగంలో, సాత్వ తరణ సమాఖ్యకు చెందిన అంధక, భోజక జాతుల రాజ్యాలుండేవి. వింధ్య పర్వతాలకు దిగువన విదర్భ; ఆ రాజ్యానికి పశ్చిమంగా అనూప, అనర్త జనపదాలు ; వాటికి దిగువగా ఋషీక జనపద ముండేది. తూర్పు కనుమల వెంట, శబర, పులింద, మూతిబ జాతులు నివసిస్తూ ఉండేవి. తూర్పు కనుమల తూర్పు భాగాన, తీర ప్రాంతంలో యక్ష, నాగ జాతులకు చెందిన గణ రాజ్యాలు ఉండేవి.

లిపి పరిణామ పరిశీలన వలన, శాతవాహనుల శాసనాలు, నాణేలతో సమకాలీనంగా ఉన్న కొన్ని రాజ వంశాల నాణేలు, శాసనాలు కానవస్తున్నాయి. దక్కన్ పీఠభూమి పశ్చిమ ప్రాంతాలపై 'కుర' అనే నామాంతం కలిగిన రాజులు వేసిన నాణేలు, వాటితోబాటుగా మహారథి, మహాభోజ వంటి బిరుదాలు ధరించిన కొందరు స్థానిక పరిపాలకుల నాణేలు కూడా, కానవస్తున్నాయి. అదే విధంగా, తూర్పు తీర మైదానంపై అనేక చోట్ల 'సద' నామాంతం కలిగిన రాజులు జారీ చేసిన నాణేలు,

BRAOU

విదర్భ, మాళ్వ, సురాష్ట్ర, గుజరాత్‌లలో శక-క్షత్రపులు, ఇతర రాజ వంశాల నాణాలు లభిస్తున్నాయి. శాతవాహన మూల వంశం లోని రాజులు ఇచ్చినవి కాక, "శాతకర్ణి" నామాంతం కలిగిన మరి కొందరు రాజులు విడుదల చేసిన నాణేలు, నేటి తెలంగాణా ప్రాంతంలో కనిపిస్తున్నాయి. ఈ నాణేలను వేసిన వారు శాతవాహన వంశీయులేనని, స్థానిక పరిపాలనా నిర్వహణకై నియమించబడిన వారని, ఊహించొచ్చు.

శాతవాహన శాసనాల లిపితో పోల్చదగిన లిపి కలిగిన, కొందరు స్థానిక పరిపాలకులు వేసిన శాసనాలు, అమరావతి, భట్టిప్రోలు మహాచైత్యాల అవశేషాల్లో లభించాయి. ఈ నాణేలు, శాసనాలు శాతవాహనులకు సమకాలీనంగా, అనేక ప్రాంతీయ రాజ్యాలు ఉన్నట్లు స్పష్టపరుస్తాయి.

4.3.2 : శాతవాహన సామ్రాజ్యం - సామంత రాజ్యాలు

శాతవాహనులు తమ సామ్రాజ్య విస్తరణలో ఈ స్థానిక రాజ్యాలను లోబర్చుకొని, వాటిపై తమ సార్వభౌమత్వాన్ని నెలకొల్పారు. అయితే, వారు ఈ రాజ్యాలను నిర్మూలించి, ఈ భూభాగాలను పూర్తిగా తమ సామ్రాజ్యంలో విలీనం చేసుకొన్నారని, కేంద్రాధిపత్యంతో కూడిన పరిపాలనా వ్యవస్థను నెలకొల్పారని ఊహించడం పొరబాటు.

మౌర్య సామ్రాజ్యం ఇటువంటి కేంద్రీకృతాధికారంతో కూడిన పరిపాలనా వ్యవస్థను కలిగి, స్థానిక పరిపాలనా సౌలభ్యం కొరకు నాలుగు రాష్ట్రాలుగా విభిజింపబడినట్లు చరిత్రకారుల అభిప్రాయం. ఆ సామ్రాజ్య వ్యవస్థలో స్థానిక పరిపాలనా విభాగాలపై అధికారులను నియమించి, వారికి వేతనా లిచ్చే పద్ధతి ఉన్నట్లు, చరిత్రకారులు విశ్వసిస్తారు. ఇందుకు నిర్దిష్టమైన సాక్ష్యాధారాలు లేవు. క్రీ.పూ. మూడో శతాబ్దంలో రాకపోకలకు, సమాచారం కొరకు సౌకర్యాలు లేనప్పుడు, అటువంటి సామ్రాజ్య వ్యవస్థ ఏర్పడిందని భావించడం, సహేతుకంగా తోచదు. మౌర్యుల సంగతి అలా ఉంచినా, వారి అనుగామలే అయినా, శాతవాహనులు కేంద్రీకృతాధికారంతో కూడిన సామ్రాజ్య వ్యవస్థను ఏర్పర్చినట్లు భావించటానికి, అవకాశం లేదు.

శాతవాహన సామ్రాజ్య విస్తరణతో, స్థానిక రాజ్యాలు అంతరించి పోలేదని, వారు తమ సార్వ భౌమత్వాన్ని అంగీకరించడంతో, శాతవాహన రాజులు సంతృప్తి చెందారని భావించడం, సహేతుకం. వారితోబాటు, ప్రాంతీయ పరిపాలనా సౌలభ్యం కొరకు, కొన్ని దూర ప్రాంతాలలో శాతవాహన వంశీయులైన రాకుమారులు నియమించబడినారని చెప్పొచ్చు. మధ్యప్రదేశ్‌లోని తూర్పు ప్రాంతంలో ఆపీలకుని నాణేం లభించడం, తెలంగాణా, విదర్భ ప్రాంతాల్లో 'శాతకర్ణి' నామధేయులైన వారు కొందరు నాణేలను జారీ చేయడం, ఈ ఊహను బలపరుస్తాయి. వీరు స్థానిక అవసరాలకు తగినంత స్వేచ్ఛాయుతమైన పరిపాలనాధికారం కలిగినట్లు, అందువల్లనే నాణేలను జారీ చేయగలిగినట్లు కాన వస్తుంది. వర్తక వాణిజ్యాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, అటువంటి అధికారాలను స్థానిక పరిపాలకులకు శాతవాహనులు అనుమతించినట్లు, గ్రహించొచ్చు.

4.3.3 : శాతవాహనుల 'రాజ' బిరుదం

శాతవాహన రాజులు 'రాజు' అని అర్థం వచ్చే 'రఞో' బిరుదాన్ని మాత్రమే ధరించారు. సమకాలీనంగా ఉత్తర భారతదేశంలో పరిపాలించిన కుషాణులు, "షాహానుషాహీ" (అనగా 'రాజాధి రాజు') వంటి బిరుదాలను ధరించగా, శాతవాహనులు నిరాడంబరంగా "రాజు" బిరుదాన్ని మాత్రమే

BRAOU

ధరించడం, గమనించదగిన విషయం. గౌతమీపుత్ర శాతకర్ణిని, అతని కుమారుడైన వాసిష్ఠీపుత్ర పులుమావిని, నాసిక్ ప్రశస్తి "మహారాజు", "రాజులకు రాజు" అని వర్ణించగా, ఆ రాజులు తాము స్వయంగా వేసిన శాసనాల్లోను, జారీ చేసిన నాణేలపైన "రఞో" బిరుదాన్ని మాత్రమే ధరించారు. మౌర్య చక్రవర్తైన అశోకుడు కూడా, ఇదే విధంగా "రాజు" అని మాత్రమే తన శాసనాల్లో చెప్పుకున్నాడు. క్రీ.శ. ఒకటి, రెండు శతాబ్దాలలో "రాజు" శబ్దం మాత్రమే వాడుకలో ఉందని, సార్వభౌమాధికారాన్ని సూచించే ఆడంబరమైన బిరుదాలేవీ విస్తృతంగా ప్రచారం లోనికి రాలేదని, ఈ అంశం స్పష్టపరుస్తూంది. అంతే కాక, సామ్రాజ్య వ్యవస్థ కేంద్రీకృతాధికారం కలిగింది కాకపోవడాన, తమ సార్వభౌమాధిపత్యాన్ని ఆమోదించిన ఇతర స్థానిక రాజులతోపాటు, శాతవాహన వంశీయులు కూడా తమ రాజ్యాన్ని తాము పాలించుకొంటూ, నిరాడంబరంగా 'రాజ' బిరుదాన్ని మాత్రమే ధరించారని భావించడం, సహేతుకం.

4.3.4 : శాతవాహన సామ్రాజ్య స్థాపన - అనుకూల పరిస్థితులు

మౌర్యుల సామ్రాజ్య పరిపాలనా విధానాన్ని, శాతవాహనులు అనుసరించినట్లు నిరూపించే వాదంలో, ఆచార్య ఆర్. యస్. శర్మ, ఈ ఉభయులు ఇంచుమించు ఒకే విధమైన అవకాశాల నుపయోగించి, సామ్రాజ్య నిర్మాతలైనట్లు అభిప్రాయపడ్డాడు. ఈ ఉభయులు విస్తారంగా నాణేలను ముద్రించి ఉప యోగించడం, ఇనుప సాధనాల నుపయోగించిన వ్యవసాయాన్ని సమాన లక్షణాలుగా కల్గినవారని, మౌర్యుల వలెనే శాతవాహనులు సారవంతమైన నదీ మైదానాలను, జన సాంద్రత కలిగిన ప్రదేశాలను ఎంపిక చేసి, సామ్రాజ్యాన్ని నిర్మించారని, ఆయన అభిప్రాయం. ఈ అభిప్రాయం బండిని గుర్రం ముందు కట్టినట్లు కన్పిస్తుంది. ఏ రాజ వంశమైనా సామ్రాజ్య నిర్మాణాన్ని తలపెట్టి అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేసుకొన్నట్లు, సామ్రాజ్య నిర్మాణానికే అనువైన పరిస్థితులను ప్రయత్న పూర్వకంగా సృష్టించుకొన్నట్లు భావించడంలో, ఔచిత్యం లేదు.

సారవంతమైన నదీ మైదానాలు అధిక జన సాంద్రత కలిగి ఉండడం లోను, వ్యవసాయాభివృద్ధిని సాధించడం లోనూ, విచిత్రం ఏమీ లేదు. అటువంటి ప్రదేశాల్లో ప్రభుత్వాలు, పరిపాలనా వ్యవస్థలు ఆర్థిక సౌష్ఠవాన్ని పొంది, పటిష్టంగా రూపొందడం, సహజం. ఆ విధమైన రాజ్య వ్యవస్థలు పరిసర రాజ్యాలను లోబర్చుకొని, తమ ఆధిపత్యాన్ని వారిపై నెలకొల్పి, సామ్రాజ్యాలుగా రూపొందుతాయి. మౌర్యులకు గంగా నదీ మైదానం వలె, శాతవాహనులకు గోదావరీ మైదానం ఆర్థిక సౌష్ఠవాన్ని చేకూర్చి, సామ్రాజ్య నిర్మాతలు కావడానికి తోడ్పడిందని భావించడం, సహేతుకం.

సారవంతమైన నదీ మైదానాలపై వెలసిన జనపదాలు వ్యవసాయాభివృద్ధిని సాధించడంతో, గ్రామీణ పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. అది, పారిశ్రామికాభివృద్ధికి, తద్వారా వర్తక వాణిజ్యాల అభివృద్ధికి దోహదం చేస్తుంది. వర్తక వాణిజ్యాలు దూర ప్రాంతాల తోను, విదేశాల తోను జరుగుతున్నపుడు, నాణేల వాడుక సర్వ సాధారణం. ఈ పరిణామాలు మౌర్యులు, శాతవాహనులు ప్రయత్న పూర్వకంగా అనువైన ప్రదేశాలను ఎంపిక చేసి, సాధించిన విశేషాలుగా భావించడం సబబు కాదు. అవి, అంతకు పూర్వం బహు కాలంగా ఏర్పడుతున్న పరిణామాల ఫలితం.

ఇనుప పనిముట్లు వాడి, వ్యవసాయ విస్తరణను, అభివృద్ధిని సాధించడం, ఉత్తర భారత దేశంలో సుమారు క్రీ.పూ. 800 నుండి ప్రారంభమైంది. ఈ పరిణామాలు గంగా-యమునా మైదానంపై, ఈ నాటి ఉత్తరప్రదేశ్ పశ్చిమ భాగం పరిసర భూభాగాల్లో ప్రారంభమై, క్రమంగా వికాసం చెందాయి.

BRAOU

అయినా, అక్కడ ఎటువంటి సామ్రాజ్య నిర్మాణం జరుగ లేదు. ఆ తర్వాత మౌర్య సామ్రాజ్యం వృద్ధి చెందటానికి అయిదు శతాబ్దాల కాలం పట్టింది. దక్కన్ పీఠభూమిపై ఇనుప పనిముట్లతో వ్యవసాయాభివృద్ధి ఇంచుమించు క్రీ.పూ. ఏడో శతాబ్ది ప్రారంభం నుండి జరిగింది; శాతవాహన సామ్రాజ్యం క్రీ.పూ. మొదటి శతాబ్దంలో ఏర్పడింది.

కనుక, ఈ సామ్రాజ్యాల ఆవిర్భావానికి, నాలుగు, లేక అయిదు శతాబ్దాల చరిత్ర కలిగిన ఆర్థిక పరిణామాలు కారణమైనట్లు, ఈ కాలంలో ప్రదేశాలు వ్యవసాయానికి అనుకూల పరిస్థితి వలన విశేషంగా ప్రజానీకాలను ఆకర్షిస్తూ, గ్రామాల నిర్మాణం, అభివృద్ధిని సాధించడం, ఇవన్నీ వర్తక వాణిజ్యాల అభివృద్ధికి దోహదం చేయడం జరిగింది. సహజ వనరులు సమకూడిన చోట్ల ఏర్పడే జనావాసాలు క్రమంగా ఆర్థికాభివృద్ధిని సాధించి, పరిపాలనా విధానాలను ఏర్పర్చుకొని, రాజ్యాలుగాను, సామ్రాజ్యాలుగాను రూపొందుతాయని గ్రహించడం, యుక్తం. ఈ పరిణామాలకు ఏ రాజ వంశమో కారణంగా భావించడం, పొరపాటు.

పై పరిశీలన వలన, శాతవాహన సామ్రాజ్యం ఆవిర్భవించడానికి, సారవంతమైన నదీ మైదానం, అందువలన ఏర్పడిన జనపదాల్లో వ్యావసాయిక, పారిశ్రామిక అభివృద్ధి, మూల కారణాలు. పటిష్ట మైన ఆర్థిక వ్యవస్థ వలన శాతవాహన రాజ్యం ప్రబలమైంది. ఇతర జనపదాలను లోబర్చుకొనగలిగింది; సామ్రాజ్యంగా ఏర్పడిందని నిశ్చయించొచ్చు.

4.4 : పరిపాలనా విధానం

సామ్రాజ్య పాలనలో శాతవాహనులు తొలి దశలో తమకు పూర్వులైన మౌర్యులను అనుకరించా రని, చరిత్రకారులు అభిప్రాయపడతారు. ఈ అభిప్రాయం సహేతుకమేననవచ్చు. పైన వివరించినట్లు, మౌర్యుల వలెనే శాతవాహనులు నిరాడంబరమైన 'రాజ' బిరుదంతో తృప్తి చెందారు. అదే విధంగా, ప్రాక్పశ్చిమాన్ని రాజ్య వ్యవహార భాషగా ఉపయోగించారు. ఈ అంశాలు శాతవాహనులు మౌర్యుల ఒరవడిని అనుసరించారని స్పష్టపరుస్తాయి. కాని, క్రమంగా తమదైన ప్రత్యేక పరిపాలనా విధానాన్ని అభివృద్ధి చేశారని, నిస్సంశయంగా చెప్పొచ్చు.

పరిపాలనా విధానాన్ని వివరంగా పరిశీలించడంలో, మొదట రాజు స్థితి, రాచరిక స్వభావాన్ని గూర్చి విచారించడ మవసరం. కౌటిల్యుని 'అర్థ శాస్త్రం', 'మను స్మృతి', 'మహాభారతం' రాజ్యం సప్తాంగాలతో కూడి ఉందని, ఆ ఏడింటిలో రాజు అత్యంత ప్రధానమైన అంశమని పేర్కొన్నాయి.

4.4.1 : రాజు - రాజ ధర్మం

శాతవాహనులు సమకాలీనంగా అభివృద్ధి చెందుతున్న పౌరాణిక హిందూ ధర్మాన్ని ఆదరించి, అనుసరించారు. పౌరాణిక హిందూ ధర్మం దేశం లోని వివిధ ప్రాంతాలను, ప్రజానీకాలను, సంస్కృతులను సమన్వయపర్చి, సమైక్యతను సాధించడానికి కృషి చేసింది. అందుచేత, పౌరాణిక వాఙ్మయం తమ విజయాలతో చక్రవర్తి పదాన్ని అధిష్ఠించి, ధర్మబద్ధంగా పరిపాలిస్తూ, ప్రజల్లో ధర్మనిరతిని పెంపొందించడం, రాజ ధర్మంగా పరిగణించి, అటువంటి చక్రవర్తుల గాథలను అభివర్ణించింది:

నానాఘాట్ శాసనం మొదటి శాతకర్ణి జరిపిన వైదిక క్రతువులను, ముఖ్యంగా రాజసూయ, అశ్వమేధాలను వర్ణించింది. అవి ఈ విధంగా అతని దిగ్విజయాలను, ధర్మనిరతిని చాటేందుకు చేసినవేనని భావించొచ్చు.

BRAOU

శాతవాహనులు పాటించిన రాజ ధర్మం, నాసిక్ ప్రశస్తి వలన మరింత స్పష్టపడుతూంది. ఆ శాసనం గౌతమీపుత్ర శాతకర్ణిని పౌరాణిక - ఇతిహాస వాఙ్మయం నిర్దేశించినట్లు, సుందరరూపి, ఆరోగ్యం, దేహదార్ఢ్యం కలవాడు, ఉన్నత వంశంలో జన్మించినవాడు, అనే లక్షణాలను కలిగినట్లు వర్ణిస్తూంది. అటువంటి లక్షణాలను, "అభిగామిక లక్షణాల"ని, కౌటిల్యుని **'అర్థశాస్త్రం'** కూడ రాజుకు తప్పనిసరిగా ఉండాలని విధిస్తుంది. అటువంటి లక్షణాలు లేని కారణంగా, రాజ్యార్హతను కోల్పోయిన సంఘటనలను పౌరాణిక - ఇతిహాస వాఙ్మయం ప్రస్తావిస్తుంది. గౌతమీపుత్ర శాతకర్ణి కమలం వంటి ముఖం కలిగిన వాడని, పరిపూర్ణమైన చంద్రమండలం వలె ప్రియదర్శనమైన ముఖం కలవాడని, జాతి ఏనుగువలె గంభీరమైన నడక కలవాడు, నాగరాజు శరీరం వలె దృఢమైన దీర్ఘ బాహువులు కలవాడని వర్ణించడంలో, అతని అభిగామిక గుణాలు స్పష్టమౌతున్నాయి.

పురాణ ప్రసిద్ధులైన చక్రవర్తుల వలెనే, గౌతమీపుత్ర శాతకర్ణి గొప్ప పరాక్రమశాలి; అతన్ని ఏక వీరుడు, ఏక ధనుర్ధరుడు, సముద్రాంతంగా సామ్రాజ్యాన్ని విస్తరింపజేసినవాడని, నాసిక్ ప్రశస్తి వర్ణించింది. అతని రథానికి కట్టిన గుర్రాలు మూడు సముద్రాల్లో నీరు త్రాగినాయని వర్ణించడం, అందరికి సుపరిచితం. ఆ రాజు సామ్రాజ్యంలో చేరి ఉన్న జనపదాలను, పర్వతాలను పేర్కొని, ఆ సామ్రాజ్య విస్తీర్ణతను వివరించడమే కాక, సర్వ రాజ లోక మండలం అతని శాసనాలను భక్తి గౌరవాలతో తలదాల్చినట్లు, అనేక యుద్ధాల్లో శత్రు సంఘాలను జయించినట్లు, పరాజయం ఎరుగని వాడని కీర్తించింది.

ఇతిహాస, పురాణ వాఙ్మయం, కౌటిల్యుని 'అర్థశాస్త్రం', రాజు వేద వాఙ్మయం, తత్వశాస్త్రం, వార్తా (ఆర్థిక శాస్త్రం) మొదలైనవి అభ్యసించి ఉండాలనే నియమాన్ని విధిస్తున్నాయి. అటువంటి విద్యావివేకాలు కలిగిన రాజు, ధర్మ నిరతుడు, సత్ప్రవర్తన కలవాడు కావడమే కాక, ప్రజలను ధర్మ మార్గంలో నడిపించగలడని ఆ వాఙ్మయ తాత్పర్యం. అటువంటి రాజు ప్రజల కష్టసుఖాలను కనిపెట్టి ప్రవర్తిస్తాడు; అధిక పన్నులు విధించి ప్రజలను పీడించడు; ధనాగారంలో సమకూడిన సొత్తును ప్రజల సొత్తుగా భావించి, వారికి కావలసిన సౌకర్యాల కొరకు ఖర్చుచేస్తాడు. ఇతిహాసాలు, పురాణాలు, నీతి శాస్త్రం ఇటువంటి పరిపాలనా బాధ్యతలను రాజుకు నిర్దేశించాయి. నాసిక్ ప్రశస్తి గౌతమీపుత్ర శాతకర్ణి త్రివర్గాలను (అనగా ధర్మార్థ కామాలనే మూడు పురుషార్థాలను) సాధించడం కొరకు, చక్కగా దేశ, కాల విభాగాలను ఏర్పరచుకున్నట్లు వివరిస్తూంది. అంటే ఎప్పుడు, ఎక్కడ, ఏవిధమైన కర్మ చేయాలో అతడు చక్కగా గుర్తించినవాడు ; పౌర జనులతో సమానంగా సుఖ దుఃఖాలను అనుభవించినవాడు ; ధర్మానుగుణంగా పన్నులను విధించి వసూలు చేసేవాడు ; ఆగమాలకు నిలయుడు; అని శాసనం వర్ణిస్తూంది. అతడు చాతుర్వర్ణ సాంకర్యాన్ని నివారించినవాడు. బహుశః వర్ణాశ్రమ ధర్మాన్ని వివరించి, ప్రజా సామాన్యాన్ని ఐహికంగాను, పారలౌకికంగాను సవ్యంగా నడిపించడానికి కావచ్చు. బ్రాహ్మణ కుటుంబాలను పోషించి, అభివృద్ధి చేశాడు. అంతేకాక, తానే ఏక బ్రాహ్మణుడుగా, అంటే బ్రాహ్మణ ధర్మానికి సాక్షాత్తు స్వరూపంగా అయిన వాడని, ఆ శాసనం ఆ రాజును వర్ణించింది.

ఇతిహాస, పురాణ వాఙ్మయం విధించిన సకల శుభ లక్షణాలు కలిగినవాడని సుదీర్ఘంగా వర్ణించిన తర్వాత, మరింత మేటిగా గౌతమీపుత్ర శాతకర్ణి నాభాగ, నహుష, జనమేజయ, సగర, యయాతి, రాము, అంబరీషుల వంటి చక్రవర్తులతో సమానమైన తేజస్సు కలవానినిగా, అంటే వారితో సమానమైన పరాక్రమం, ధార్మిక వర్తనం కలిగినట్లు, నాసిక్ ప్రశస్తి వర్ణించింది.

BRAOU

4.4.2 : వారసత్వ విధానం : మాతృస్వామ్య విధానం

శాతవాహన రాజులు వంశపారంపర్యాధికారంతో పరిపాలించారు. తండ్రి నుండి వారికి రాజ్యాధికారం సంక్రమించేది. గౌతమీపుత్ర శాతకర్ణి కుల పురుష పరంపరలో లభించిన రాజ్యాధికారం కలవాడని, నాసిక్ ప్రశస్తి స్పష్టంగా వివరించింది. కాని, ఆచార్య ఆర్. యస్. శర్మ ఈ రాజులు ధరించిన మాతృ నామ సంజ్ఞల వలన (matronymics), వారికి రాజ్యం తల్లి నుండి సంక్రమించేదని, అంటే శాతవాహనులు "మాతృస్వామ్య" (matrilineal) విధానంతో కూడిన సాంఘిక సాంప్రదాయాలు కలిగినవారని అభిప్రాయపడ్డాడు. శాతవాహన రాణులైన నాగానిక, గౌతమీ బాలశ్రీ స్వయంగా దానధర్మాలు చేసి, శాసనాలను చెక్కించారు; కనుక, వారు పరిపాలనలో ప్రముఖ పాత్ర కలిగినట్లు స్పష్టమౌతుందని, నాగానిక తన నానాఘాట్ శాసనంలో పేర్కొన్న వైదిక క్రతువులను ఆమె స్వయంగా నిర్వహించి ఉండొచ్చునని, ఆయన అభిప్రాయపడ్డాడు. ఈ అభిప్రాయం పూర్తిగా అసంగతం.

గౌతమీపుత్ర శాతకర్ణి కంటే పూర్వపు శాతవాహన రాజులు మాతృ నామ సంజ్ఞలను ధరించక పోవడం, గమనించవలసిన అంశం. అంటే, తొలి శాతవాహన రాజులు పితృస్వామ్య సాంఘిక వ్యవస్థను, ఆ వంశం లోని కడపటి రాజులు మాతృస్వామ్య సాంఘిక వ్యవస్థను అనుసరించినట్లు భావించడం, హేతుబద్ధం కాదు. అయితే, ఆర్. యస్. శర్మ కొల్హాపూర్ ప్రాంతంలో లభించిన చిలివాయికుర, సివలకర మొదలైన రాజుల నాణేలు, వాటిపైగల లిపిని అనుసరించి, తొలి శాతవాహనుల కాలం నాటికి చెందుతాయని, ఆ రాజులు మాతృ నామ సంజ్ఞలను ధరించడం, తొలి శాతవాహనులు కూడ అటువంటి సాంప్రదాయాన్ని కలిగిన వారేనని సూచిస్తూందని, ఆయన అభిప్రాయం. కాని, టోలమీ రచన చిలివాయికుర అనే రాజు, వాసిష్ఠీపుత్ర పులుమావి కాలం నాటి వాడని నిరూపిస్తూంది. ఆ రాజులు శాతవాహన వంశీయులు కారు; సీముక, మొదటి శాతకర్ణి, సదవహన, సతసిరి మొదలైన రాజుల నాణేలపై మాతృ నామ సంజ్ఞలు లేవు. కనుక, ఈ సంప్రదాయం గౌతమీపుత్ర శాతకర్ణి నుండే ప్రారంభమైందని నిర్దిష్టంగా చెప్పొచ్చు.

మాతృస్వామ్య సాంఘిక వ్యవస్థ అతి ప్రాచీన కాలంలో, వ్యావసాయిక సాంఘిక జీవన ప్రారంభమైన తొలి దశలో మాత్రమే వాడుకలో ఉండేదని, క్రమంగా ఇనుప యుగం నాటికే అది అంతర్ధానమైందని భావించడం, సహేతుకం. కనుక, శాతవాహన రాజుల మాతృ నామ సంజ్ఞలు మాతృస్వామ్య సాంఘిక వ్యవస్థను సూచిస్తాయని భావించడం, సమర్థనీయం కాదు.

నాగానిక, నానాఘాట్ శాసనంలో తాను గొప్ప కర్మిష్ఠినని వర్ణించుకొన్న మాట నిజం. అయితే, స్త్రీలు స్వయంగా వైదిక క్రతువులను నిర్వహించడం ధర్మశాస్త్రాలు అంగీకరించవు. కనుక, నానాఘాట్ శాసనం పేర్కొనే క్రతువులు నాగానిక తన భర్త సాహచర్యంలో నిర్వహించినవేకానీ, స్వయంగా నిర్వహించినట్లు భావించడానికి ఎటువంటి ఆధారమూ, అవకాశమూ లేదు. వైదిక ధర్మం పట్ల అత్యంతాసక్తితో ఆ క్రతువులను నిర్వహించినప్పటు, ఆ ధర్మానికే విరుద్ధంగా నాగానిక స్వయంగా వాటిని నిర్వహించినట్లు భావించటం, హేతుబద్ధం కాదు.

గౌతమీపుత్ర శాతకర్ణిని నాసిక్ శాసనం, 'అచిపన్నమాతృశుశ్రూషాకరస్య', అంటే నిరంతరం తల్లి సేవ చేసేవాడు, అని వర్ణిస్తూంది. పరిపాలనాధికారం ఆమె హస్తగతం కనుక, ఆ రాజు ఆమెను సేవించాడని, ఆర్. యస్. శర్మగారి అభిప్రాయం. రాజ్యం కోసమే తల్లి సేవ చేసే

BRAOU

కుత్సితునిగా ఆ రాజును ఆ శాసనం వర్ణిస్తున్నట్లు, ఆ విషయం అతని తల్లి స్వయంగా ప్రకటించిందని అర్థం చేసుకోవడం, అసంగతం. అంతేకాక, పైన పేర్కొన్నట్లు, నాసిక్ ప్రశస్తి శాసనం స్పష్టంగా గౌతమీపుత్ర శాతకర్ణి కుల పురుష పరంపరలో రాజ్యాధిపత్యాన్ని పొందాడని వర్ణించడం, ఈ అభిప్రాయాన్ని ఖండిస్తున్నది.

పై పరిశీలన వలన, శాతవాహనులు ఆనాటికే స్పష్టపడుతున్న పౌరాణిక హిందూ ధర్మాన్ని అనుసరించారని, ఆ ధర్మం ప్రకారమే దిగ్విజయ యాత్రలు చేసి, సామ్రాజ్యాన్ని విస్తరింప చేశారు. వైదిక క్రతువులను నిర్వహించారు; ఆ ధర్మం నిర్దేశిస్తున్నట్లు, ప్రజల అవసరాలను, ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలించినట్లు, చెప్పకున్నారు; తాము ధర్మవర్తనులై, పూర్వ చక్రవర్తులకు దీటైనట్లు, వర్ణించుకొన్నారు; ప్రజలు ధర్మచర్తనులై ఉండే విధంగా, రాజ్యాన్ని పరిపాలించినట్లు వర్ణించుకొన్నారు.

4.4.3 : రాజు - అధికారం

శాతవాహన రాజులు నిరపేక్ష రాజరికాన్ని (absolute monarchy) అనుసరించినట్లు భావించొచ్చు. పరిమిత (limited), లేదా రాజ్యాంగబద్ధ (constitutional) రాచరిక విధానాలు, ప్రాచీన కాలం నాటివి కావు ; అటువంటి పదాలు పురాణేతిహాస వాఙ్మయంలో కాని, కౌటిల్యుని 'అర్థశాస్త్రం'లో కాని కనిపించవు. కనుక, వాటి కోసం ప్రాచీన రాచరిక వ్యవస్థలను పరిశీలించడం, ఇనుక నుండి నూనె పిండటం వంటిది.

నానాఘాట్ శాసనం మొదటి శాతకర్ణిని గూర్చి (లేదా కొందరు చరిత్రకారుల అభిప్రాయంలో శ్రీముఖుని గూర్చి) 'అప్రతిహత చకస' అనే బిరుదాన్ని ఉపయోగించింది. అంటే, ఎటువంటి అవరోధాలు లేకుండ, తన సంకల్పాన్ని సాధించగలవాడని, నిరంకుశంగా పరిపాలించేవాడని, ఈ బిరుదం వలన గ్రహించొచ్చు.

క్రీ.పూ. 2వ శతాబ్దారంభం నుండే ఉత్పన్నమైన ధర్మశాస్త్ర వాఙ్మయం, ముఖ్యంగా, నారద, విష్ణు, బృహస్పతి స్మృతులు, రాజు దైవాంశ సంభూతుడని, విశ్వకర్మ అన్ని దేవుళ్ళ నుండి వారి ముఖ్య లక్షణాలను గ్రహించి, రాజును సృష్టిస్తాడని, వివరిస్తాయి. రాజ్యాధిపత్యం నిరంకుశమైనప్పుడే, ఆ విధంగా ధర్మశాస్త్ర వాఙ్మయం వివరించ గలదు. గౌతమీపుత్ర శాతకర్ణిని గూర్చి వర్ణించడంలో, నాసిక్ ప్రశస్తి అలౌకికమైన విశేషాలను అన్వయించడం వలన, శాతవాహన రాజులు కూడ దైవదత్త రాజ్యాధికార సిద్ధాంతాన్ని అనుసరించారని, లోకాతీతమైన వారుగా వర్ణించుకొన్నారని, స్పష్టమౌతుంది.

అయితే, వాస్తవంగా ఇటువంటి నిరంకుశాధికారం దైవదత్త రాజ్యాధికారాన్ని కలిగి ఉండడం, సాధ్యం కాదు. పైన వివరించినట్లు, రాజు ధర్మ నిరతుడై, ప్రజలను ధర్మ మార్గంలో నడిపించడం ధ్యేయంగా, రాజ్యాన్ని పాలించాలని, పురాణేతిహాస వాఙ్మయం, కొంత వరకు కౌటిల్యుని అర్థశాస్త్రం నిబంధిస్తున్నాయి. కాగా, రాజు ధర్మబద్ధుడు. ఆ ధర్మమే, అతని అధికారానికి పరిమితులను విధిస్తుంది. నాసిక్ ప్రశస్తి శాసనం గౌతమీ బాలశ్రీని 'రాజర్షినుతు' అని పేర్కొంటుంది. అంటే, ఆమె భర్త రాజైనా, ఋషి వలె జీవితాన్ని గడిపినవాడు. నానాఘాట్ శాసనం కూడా, నాగానిక దీర్ఘ వ్రతాలను చేసినట్లు వర్ణిస్తూంది. ఆమె ఆ వ్రతాలను, క్రతువులను మొదటి శాతకర్ణితో కలసి నిర్వహించిందని, పైన వివరించడం జరిగింది. కనుక, శాతవాహన రాజులు ధార్మిక జీవనులు, సత్కర్మ నిరతులై, తమ అధికారానికి గల పరిమితులను, గుర్తించి, నడుచుకొన్నారని భావించొచ్చు.

BRAOU

తార్కికంగాను, సిద్ధాంతపరంగాను ఉన్న పరిమితులే కాక, వాస్తవంగా కూడ, రాజ్యాధికారానికి కొన్ని పరిమితులున్నట్లు, ఆనాటి శాసనాలను సూక్ష్మంగా పరిశీలించినప్పుడు, స్పష్టపడుతుంది. స్వపరిపాలనాధికారంతో అనేక ప్రాంతాలను పరిపాలించే సామంతులు, ఈ సందర్భంగా మొట్టమొదటగా పేర్కొనదగిన అంశం. వీరు అనుభవించే పరిపాలనాధికారం, కేంద్రంలో శాతవాహన రాజులు వదిలి వేసిందే. వీరితోబాటుగా స్వతంత్రంగా నాణేలను ముద్రించి, విడుదల చేసిన రాజ పుత్రులు, రాజ ప్రతినిధులుగా పరిపాలిస్తూ, గణనీయంగా స్వపరిపాలనాధికారాన్ని కలిగి ఉన్నారు. ఇది కేంద్రంలో నిరంకుశాధిపత్యానికి పరిమితి.

క్రీస్తు శకారంభ కాలంలో, రాకపోకల సదుపాయాలు, సమాచార సౌకర్యాలు సంతృప్తిగా లేని కాలంలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యం లోని మారుమూల ప్రాంతాల పైన, ప్రతి గ్రామం పైన సంతృప్తికరంగా ఆధిపత్యాన్ని నెరపడం, సాధ్యం కాదు. అటువంటి పరిస్థితుల్లో గ్రామాధికారులు తమ ఇష్టానుసారంగా అధికారాన్ని చెలాయించగలుగుతారు. వారు చెలాయించే అధికారాన్ని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పరిమితిగా భావించడం, సబబు. ఇది రాజ్యాధిపత్యంపై రెండవ పరిమితి.

శాతవాహన యుగం లోనే, భారతదేశ చరిత్రలో మొట్టమొదటగా బౌద్ధ భిక్షు సంఘాలకు, బ్రాహ్మణులకు, భూములను గ్రామాల్లో ప్రదానం చేస్తూ; రాజులు శాసనాలను వెయ్యడం ప్రారంభమైంది. అటువంటి భూములపై పన్నులను మినహాయించి, అట్టి గ్రామాల పైన అన్ని విధాలైన పన్నులు, సుంకాలను వసూలు చేసుకొనే అధికారాన్ని రాజు వదిలివేసి, ఆయా దాన గ్రహీతలకు అర్పించడం జరిగింది.

ఈ విధమైన ధార్మిక, వాస్తవ పరిమితులకు లోబడి, ప్రాచీన భారతదేశంలో రాజులు పరిపాలించేవారు. శాతవాహనులు అందుకు ఏవిధంగాను అతీతులు కారు. కనుక, రాజులు వాస్తవంగా నిరపేక్ష రాజ్యాధికారాన్ని కల్గిన వారు కారు.

అంతే కాక, ప్రాచీన భారతదేశంలో, శాతవాహనులతో సహా, రాజుకు చట్టాలు చేసే అధికారం లేదు. సమస్త వ్యవహారాలను నిర్వహించేందుకు అవసరమైన న్యాయ సూత్రాలన్నింటినీ ధర్మశాస్త్రాలు, సంప్రదాయాలు ఏర్పర్చాయి. కనుక, రాజుకు క్రొత్తగా ఏ రకమైన చట్టాన్ని చేసే అధికారం లేనపుడు, అతనికి నియంతృత్వాధిపత్యాన్ని చెలాయించే అవకాశ ముండదు.

4.4.4 : అమాత్యులు

శాతవాహనుల శాసనాలు 'అమాత్యుల'నే అధికారులను తరచుగా పేర్కొంటాయి. బౌద్ధ జాతక కథలు అమాత్యులు రాజు సన్నిహితులుగా ఉంటూ, రాజ్య వ్యవహారాల్లో అతనికి సలహానిస్తూ, చర్చలలో పాల్గొనేవారు గాను, రాజాజ్ఞలను అమలుపర్చేవారు గాను, ప్రస్తావిస్తున్నాయి. కౌటిల్యుని "అర్థశాస్త్రం" కూడ, అమాత్యులను ఇటువంటి విధులను నిర్వర్తించే ఉన్నతాధికార వర్గంగా పేర్కొంటూంది.

అశోకుని శాసనాలు "మహామాత్రు"లనే పేర ఒక ఉన్నతాధికార వర్గాన్ని పేర్కొంటాయి. శాతవాహన వంశం లోని రెండవ రాజైన కృష్ణుని కొలువులో ఒక మహామాత్రుడు ఉన్నట్లు, ఒక నానేక్ శాసనం ప్రస్తావిస్తుంది. కాగా, శాతవాహన యుగం లోని తొలి దశ లోనికి ఈ మహామాత్రులు కొనసాగినట్లు, ఆ తర్వాత వారే "అమాత్యులు"గా మారినట్లు, భావించొచ్చు.

BRAOU

శాతవాహనుల శాసనాలు "అమాత్యులు", "రాజమాత్యులు" అనే రెండు విధాలైన ఉన్నతోద్యోగులున్నట్లు సూచిస్తున్నాయి. గౌతమీపుత్ర శాతకర్ణి, వాసిష్ఠీపుత్ర పులుమావి కాలం నాటి నాసిక్ శాసనాలు, అమాత్యులను "అహారా"లనే స్థానిక పరిపాలనా విభాగాలను పరిపాలించే ఉద్యోగులుగా పేర్కొంటాయి. కాగా, రాజమాత్యులు కేంద్ర ప్రభుత్వంలో రాజు సన్నిధిలో ఉంటూ, రాజుకు ఆంతరంగిక సలహాదార్లుగాను, ఇతర ఉన్నత పదవులను అధిష్ఠించేవారని, ఆచార్య మిరాశి సహేతుకంగా భావించాడు. కౌటిల్యుని "అర్థశాస్త్రం" సమకాలీన శక క్షత్రపుల శాసనాలు పేర్కొనే 'సచివు'లు, అమాత్యులు ఒకే విధమైన ఉద్యోగి వర్గంగా తోస్తుంది. శక-క్షత్రపుల శాసనాలు "మతి సచివ", "కర్మ సచివ" అనే రెండు విధాలైన అధికారులను పేర్కొంటాయి. వీరి లోని మతి సచివులు రాజుతో సన్నిహితంగా ఉంటూ, రాజ్య వ్యవహారాల్లో ఆంతరంగిక సలహాలనిచ్చే రాజామాత్యులే కావచ్చు. అలాగే, అమాత్యులే స్థానిక పరిపాలనను నిర్వహిస్తూ, రాజాజ్ఞలను అమలుపర్చే కర్మ సచివులతో సమానమైనవారని నిశ్చయించొచ్చు.

అమాత్య పదవులు వంశపారంపర్యంగా వచ్చేవి కావు. రాజు వారిని నియమించడానికి, ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి బదిలీ చేయడానికి, పదవి నుండి తొలగించడానిక్కూడా, పూర్తి అధికారాలను కలిగినవాడు. గౌతమీపుత్ర శాతకర్ణి నాసిక్ శాసనాల వలన, కేవలం ఆరు సంవత్సరాల వ్యవధిలో, గోవర్ధనాహారంపై విష్ణు పాలితుడు, శివదత్తుడు, శ్యాముడు అనే ముగ్గురు అమాత్యులు పరిపాలకులుగా వ్యవహరించినట్లు తెలుస్తున్నది. దీనిని బట్టి, అమాత్యులను ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి అవసరాల ననుసరించి బదిలీ చేయడం జరిగేదని, స్పష్టమౌతుంది.

4.4.5 : ఇతర ఉన్నతాధికారులు

మహామాత్రులు, లేదా అమాత్యులు, నేటి I.A.S. ఉద్యోగుల వలె, ఒక సాధారణమైన (general) ఉన్నతోద్యోగ వర్గం. ప్రత్యేకమైన పరిపాలనా విభాగాలను నిర్వహించే ఉన్నతోద్యోగులు కొందరు, శాతవాహన శాసనాల వలన తెలియవస్తారు. వారు హేరణిక, భండాగారిక, మహాసేనాపతి, లేఖక, నిబంధకార. హేరణికుడు రాజ్య ధనాగారాన్ని (treasury), భండాగారికుడు, కోశాన్ని (Store house) నిర్వహించేవారు కావచ్చు. హేరణిక అనే పదం 'హిరణ్య' పదం నుండి ఉత్పన్నమైంది. 'హిరణ్య' అనగా ధన రూపంలో రాజ్యం వసూలు చేసే పన్నులు. మహాసేనాపతి సేనలను నిర్మించి, నిర్వహించేవాడు. బహుశః శాతవాహన సేనలో, అనేకులు మహా సేనాపతులై ఉండి ఉండొచ్చు. ఆ పదం ఒక ఉన్నత శ్రేణికి చెందిన సేనా నాయకులకు, వర్తించేదిగా తోస్తుంది. లేఖకుడు రాజాజ్ఞలను లిఖిత పూర్వకంగా సిద్ధం చేసేవాడు; నిబంధకారులు రాజ పత్రాలను భద్రపర్చేవారు.

వీరు కాక, 'మహాతరక' అనే అధికారి రాజుకు ప్రత్యేక అంగరక్షకునిగాను, కార్యదర్శిగాను ఉండే వాడు. "ప్రతీహారులు" అనే రాజ ప్రాసాదాన్ని రక్షించే ప్రత్యేక సేనా నాయకులు; "దూతకులు" అనే రాజాజ్ఞలను ప్రకటించడం, చేరవేయడం మొదలైన విధులను నిర్వర్తించే అధికారులుండేవారు. ఈ అధికారులందరు రాజామాత్యులనే అధికార వర్గానికి చెందినట్లు తోస్తుంది. నాసిక్ గుహాలయాల్లో భటపాలిక అనే అమె వేసిన శాసనం, ఆమె రాజమాత్యుడు, భండాగారికుడైన అణియతణకుని భార్యగా వర్ణిస్తుంది. ఈ శాసనంలో రాజామాత్యుడే, భండాగారికుడు కావడం, ఇందుకు నిదర్శనం.

BRAOU

4.4.6 : స్థానిక పరిపాలన

శాతవాహన సామ్రాజ్యం కేంద్రీకృతాధికారం కలిగింది కాదని, పైన వివరించడం జరిగింది. స్వపరిపాలనాధికారం కలిగిన సామంత రాజులు కొన్ని జనపదాలను పరిపాలించేవారని, వారు మహారథిక, మహా భోజక మొదలైన బిరుదాలను ధరించేవారని, పైన పేర్కొనడం జరిగింది.

మహారథికులు వంశపారంపర్యంగా పదవులను పొందేవారని, రాజుకు భూమి శిస్తు, ఇతర సుంకాల రూపంలో ఆదాయాన్ని వసూలుచేసి పెడుతూ, ఒక ప్రాదేశిక విభాగం (రాష్ట్రం వంటి) పై ఆధిపత్యాన్ని చెలాయించేవారని, శ్రీ.కె. సత్యనారాయణ అభిప్రాయం. మహాభోజులు అదే విధమైన విధులను నిర్వహిస్తూ, మహారథికుల కంటె కొంచెం ఉన్నత స్థాయికి చెందినవారని, ఆయన అభిప్రాయపడ్డారు. మొత్తం మీద పరిపాలనా యంత్రాంగం లోని అధికార వర్గంగా నియమితులైనవారు, కాలక్రమాన వంశపారంపర్యాధికారాన్ని పొంది, ప్రబలులైనట్లు, ఈ పరిణామం శాతవాహన యుగం లోనే భూస్వామ్య వ్యవస్థకు బీజం వేసినట్లు వివరించడం, ఆయన ఉద్దేశం. ఈ అభిప్రాయం పూర్తిగా పొరబాటు. ఈ విషయం పైన వివరించడం జరిగింది. మహారథికులు, మహాభోజకులు, మౌర్య పరిపాలనా విధానం లోనే ప్రముఖ పాత్ర వహించినట్లు కానవస్తుంది. అశోకుని శాసనాలు రథిక, భోజక అనే పేర్లను, ఆంధ్ర, పిటినిక వంటి జాతి నామవాచకాలుగా పేర్కొంటున్నాయి. ఆ జాతులు, లేదా తెగలకు చెందిన జనపదాలను, స్వపరిపాలనాధికారంతో వంశపారంపర్యంగా పరిపాలించే అధిపతులు, మహారథికులు, మహాభోజకులై ఉండొచ్చు.

మొదటి శాతకర్ణికి పూర్వమే, మహారథినకయిరో అనే వాడు, శాతవాహనులతో మైత్రి కలిగి, వారి రాజ్య స్థాపనకు తోడ్పడినట్లు కానవస్తుంది. అతని నామాంకంతో నానాఘాట్ గుహాలయంలో, అతని విగ్రహాన్ని శాతవాహన వంశీయుల విగ్రహాల సరసన నిలుపబడినట్లు, పైన వివరించడం జరిగింది. వాసిష్ఠీపుత్ర పులుమావి కాలం నాటి ఒక కార్లా గుహాలయం లోని శాసనం, "బఖళకీయు" (బఖళిక వంశీయుడు)డైన మహారథి వాసిష్ఠీపుత్ర సోమదేవుడు చేసిన ఒక దానాన్ని పేర్కొంటూంది. ఈ శాసనం మహారథికులు రాజు అనుమతి పొందకనే, స్వయంగా దానధర్మాలు చేసే అధికారం కలిగినవారని, స్పష్టపరుస్తూంది. స్వపరిపాలనాధికారం లేకుండా, ఇది సాధ్యం కాదు. అయితే, ఈ స్వపరిపాలనాధికారం వారు వంశపారంపర్యంగా పదవులు పొందడావ సిద్ధించినట్లు భావించడం, తప్పు. వారు స్వపరిపాలనాధిపత్యంతో తమ తెగలను పరిపాలించుకొనే స్థానిక రాజులు. వాసిష్ఠీపుత్ర పులుమావి కాలానికే శాతవాహన సామ్రాజ్య వ్యవస్థ బలహీనమై, స్థానిక పరిపాలకులు స్వపరిపాలనాధికారం పొందారని భావించడానికి, అవకాశం లేదు.

మహారథికులు, మహాభోజకులు కాక, రాజ ప్రతినిధులుగా కొన్ని ప్రాంతాలను పరిపాలించిన రాజ వంశీయులు సైతం, స్వయంగా నాణేలను ముద్రించి విడుదల చేసినట్లు, పైన పేర్కొనడం జరిగింది. ప్రాంతీయ పరిపాలనలో ఈ రాజ ప్రతినిధులు సైతం, గణనీయమైన స్వేచ్ఛ, స్వపరిపాలనాధికారాలను కలిగి ఉన్నట్లు, ఈ అంశాలు సూచిస్తాయి.

సామంతుల పరిపాలన లోని జనపదాలు, రాజ ప్రతినిధుల పాలన లోని ప్రాంతాలను మినహాయించి, తక్కిన సామ్రాజ్య భాగాలు గోవర్ధనాహార, మూలాహార, సోపారాహార మొదలైన పేర్లతో, శాసనాల వలన తెలియవస్తాయి. ఈ పరిపాలనా విభాగాలను అమాత్యులు నిర్వహించేవారు.

BRAOU

స్థానిక పరిపాలనలో రాజుక, ప్రాదేశిక, ప్రతివేదిక, రాజపురుష, మొదలైన అధికార వర్గం ఉన్నట్లు, అశోకుని శాసనాలు పేర్కొంటాయి. కాని, అటువంటి అధికార వర్గం శాతవాహన యుగం నాటి శాసనాల్లో కన్పించదు. అయితే, శాతవాహనుల అనంతరం, రాజ వంశాల శాసనాలు "రాజ పురుష" అనే పదాన్ని తరచుగా పేర్కొంటాయి. రాజ పురుషులు బహుశః రాజు సేవలో ఉన్న క్రింది స్థాయి ఉద్యోగులు కావచ్చు. అటువంటి ఉద్యోగులు ఏకాలంలో అయినా ఉండి ఉండొచ్చు. ముఖ్యంగా, పూర్వం, అనంతరం, అటువంటి ఉద్యోగ బృందం ఉన్నట్లు తెలియవస్తున్నందున, శాతవాహన యుగంలో సైతం ఉండి ఉండొచ్చునని భావించొచ్చు. మొత్తం మీద, శాతవాహన యుగంలో పరిపాలనా యంత్రాంగం చాలా నిరాడంబరంగాను, క్లుప్తంగాను ఉండేదని తోస్తుంది.

శాతవాహన యుగం చివరి దశలో, మూడో పులుమావి పరిపాలించే కాలంలో, శాతవాహనాహారాన్ని మహా సేనాపతి ఖందనాగుడు పరిపాలిస్తున్నట్లు, మ్యాకదోని శిలా శాసనం పేర్కొంటూంది. బహుశః తుది దశలో, శాతవాహన వంశీయులైన రాజకుమారులు రాజ్య కాంక్షతో పరస్పర పోరాటాల్లో మునిగిపోయినప్పుడు, సేనకు, సేనాధిపతులకు విశేష ప్రాధాన్యత ఏర్పడిందని, క్రమంగా వారికి పరిపాలనాధికారం ప్రాప్తించిందని తోస్తుంది.

4.4.7 : ఆర్థిక పరిపాలన

శాతవాహనులు సామ్రాజ్య నిర్మాతలుగా చరిత్ర ప్రసిద్ధులు కావడానికి, వారి రాజ్యం వ్యవసాయాభివృద్ధి వలన సాధించిన ఆర్థిక సౌష్ఠవమే మూల కారణమని, ఇనుప సాధనాల వలన అటువంటి వ్యవసాయాభివృద్ధి సాధ్యమైందని, ఆచార్య R.S. శర్మ అభిప్రాయాన్ని, పైన పేర్కొనడం జరిగింది. వ్యవసాయాభివృద్ధి వలన, గ్రామీణ వృత్తులు అభివృద్ధి చెందడం సహజం. అయితే, సహజ వనరులు అనుకూలించే ప్రదేశాలు మరింత ఆర్థికాభివృద్ధిని సాధించి, వర్తక వాణిజ్యాలను నిర్వహించడంలో ఆ ప్రాంతాలకు మరింత ప్రాముఖ్యత చేకూరుతుంది. గ్రామాధికారులు ఆర్థికంగా బలపడి, రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకోగలుగుతారు. క్రమంగా వారిలో ప్రముఖు డొకడు, మరికొందరు సాటివారిని నయానా, భయాన లోబర్చుకొనడంతో, ఒక స్థానిక పరిపాలకుడు కాగలుగుతాడు. అతని రాజకీయ అభివృద్ధికి అది తొలి మెట్టు. అటువంటి వారిలో ప్రముఖు డొకరు, అదే ప్రక్రియలో రాజు గానూ, రాజుల్లో ప్రబలమైన వాడు చక్రవర్తి గాను అభివృద్ధి చెందడం సహజం. అందుచేత, స్థానిక పరిపాలకులు, రాజులు భూమి శిస్తును తమ ప్రధానమైన ఆదాయ వనరుగా భావించేవారు. గ్రామీణ జీవనం ప్రధాన లక్షణంగా కలిగిన భారతదేశ రాజ్యాలు, భూమి శిస్తు వలననే ఐశ్వర్యవంతమైనాయి. సామ్రాజ్యాల నిర్మాణానికి పునాదులైనాయి.

ధర్మశాస్త్రాలు, కౌటిల్యుని "అర్థ శాస్త్రం" భూమిపై హక్కులు రాజుకు చెందుతాయని చెప్తున్నాయి. అంత మాత్రాన, వ్యవసాయదారులకు, తమ సాగు భూమిపై హక్కులు లేవని భావించరాదు. అయితే, రాజులు మరింతగా వ్యవసాయాన్ని విస్తరించడానికి, నూతన జనావాసాలను నిర్మించడానికి ప్రయత్నించి ఏర్పర్చిన సాగు భూములు, పూర్తిగా రాజ్య వ్యవస్థకే చెంది ఉండేవని నిశ్చయంగా చెప్పొచ్చు. అటువంటి భూములను 'సీత' భూములని, కౌటిల్యుని 'అర్థశాస్త్రం' పేర్కొంటుంది. మౌర్యుల కాలంలో అటువంటి వ్యవసాయ విధానం ఉన్నట్లు కానవస్తూంది. అటువంటి భూముల ఉత్పత్తులు రాజ్యానికి సగం, వ్యవసాయం చేసిన వారికి సగం చెందేవి. ఆవిధంగా సగ పాలు గ్రహించి, వ్యవసాయం చేస్తున్న కృషీవలులను 'అద్దియమనుస్స' (లేక ఆర్థిక మనుష్య) అనే పేర్లతో, శాతవాహనానంతర రాజ వంశాల శాసనాలు పేర్కొంటాయి. శాతవాహనులకు ముందు, వారి తర్వాత,

BRAOU

కానవస్తున్న ఇటువంటి వ్యవసాయ విధానం, వారి కాలంలో కూడ, అమలులో ఉన్నట్లే భావించడం యుక్తం.

వ్యవసాయ విస్తరణ, నూతన జనావాసాల నిర్మాణాలను ఉద్దేశించి, రాజులు దండయాత్రలను నిర్వహించేవారని, ఆక్రమించిన భూములను వ్యవసాయ యోగ్యంగా చేయడానికి, సాగుచేయడానికి, యుద్ధంలో పట్టుబడిన ఖైదీలను ఉపయోగించేవారని, చరిత్రకారులు గుర్తించిన అంశమే. రాజులు తమకు మాత్రమే పరిమితమైన భూముల ఫలసాయంలో సగ భాగాన్ని స్వీకరించి, సైనిక పోషణ, పరిపాలనా నిర్వహణను సాగించేవారు. ఆ భూముల నుండి వారు చేయదలచిన భూ, గ్రామ దానాలను చేసేవారు. ఆ భూములను సాగుచేసే కర్షకులు సక్రమంగా పాటుపడుతుంటే, క్రమంగా వారికి యాజమాన్య హక్కులను ఇయ్యవలసిందిగా, కౌటిల్యుడు **అర్థశాస్త్రం** ద్వారా నిబంధించాడు.

వ్యవసాయదారులు తాము ప్రభుత్వానికి చెల్లించే పన్నులు, భూమి పన్నుతో సహా, దేయ, మేయ, అనే రెండు విధాలుగా ఉన్నట్లు, ప్రాచీన కాలపు శాసనాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వానికి చెల్లించే పన్నులు భోగ, భాగ మనీ, మరో రెండు విధాలుగా కూడ, తెలియవస్తున్నాయి. దేయ, అనగా, ధన రూపంలో ఇయ్యదగింది; మేయ అనగా ధాన్య రూపంలో కొలువ దగింది. వీటిలో 'భోగ' మనే పన్ను సాధారణ గ్రామాల్లోని వ్యవసాయదారులు పూర్తిగా భూమిపై యాజమాన్య హక్కు కలిగి, సాగుచేసుకొంటూ, ఆ ఫలసాయాన్ని అనుభవిస్తున్నందుకు (భోగిస్తున్నందుకు చెల్లించే పన్ను); 'భాగ' అనేది యాజమాన్య హక్కులు రాజుకే పరిమితమౌతున్న భూముల్లో, లేదా ప్రభుత్వ భూముల్లో, వ్యవసాయదారులు చెల్లించే సగ 'భాగ' మని గుర్తించొచ్చు. 'భోగ' ధన రూపం లోను, 'భాగ' ధాన్యరూపం లోను, చెల్లించబడేవని తోస్తుంది. అంటే భోగ- దేయ రూపం గాను, భాగ-మేయ రూపం లోను చెల్లించబడేది.

భూమి పైన, వ్యవసాయదారులు చెల్లించే భోగ, భాగ, పన్నులు కాక, గ్రామీణ వృత్తులు, కళలు, పరిశ్రమల్లో జీవించే పనివారు, తమ వృత్తులకు, పరిశ్రమలకు పన్నులు చెల్లించేవారు. ఇవి కొన్ని సేవల రూపంలో ఉండి ఉండొచ్చు. ధన రూపంలో చెల్లించే పన్నును "కారుకర" అనే పేర **'అర్థశాస్త్రం'** పేర్కొంటుంది. శాతవాహన యుగంలో భారతదేశం రోమన్ సామ్రాజ్యంతో పెద్ద ఎత్తున వర్తక వాణిజ్యాలను నిర్వహించడం, పరిశ్రమలకు మంచి ప్రోత్సాహాన్నిచ్చినట్లు గ్రహించొచ్చు. కనుక, పరిశ్రమలు, వృత్తుల వలన లభించే 'కారుకర', సామ్రాజ్యానికి మరో ముఖ్యమైన ఆదాయ వనరని గ్రహించొచ్చు.

ఆ కాలంలో జరిగిన విదేశీ వాణిజ్యం, వర్తక వర్గానికి అత్యధిక లాభాలను చేకూర్చిందని స్పష్టంగా గుర్తించొచ్చు. పశ్చిమ కనుమల్లోని పెద్ద గుహాలయాల లోను, తూర్పు తీరంలో అమరావతి వంటి ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రాల వద్ద లభించిన వందలాది శాసనాలు, ఇటువంటి ధనవంతులైన వర్తకులు, పారిశ్రామిక జీవనులు, వ్యవసాయదారులు వేసినవి కానవస్తాయి. కనుక, ధనవంతులైన వర్తకులు చెల్లించే ఎగుమతి, దిగుమతి సుంకాలు, ఇతర వాణిజ్య పన్నులు, శాతవాహన సామ్రాజ్యానికి ఆర్థిక పటిష్ఠతను చేకూర్చినట్లు, గ్రహించొచ్చు.

అయితే, శాతవాహనులు ఎంత శాతం పన్నులను, సుంకాలుగా వసూలు చేసే వారో, స్పష్టంగా తెలియదు. ధర్మశాస్త్రాలు రాజు ఆరవ వంతును పన్నుగా గ్రహించవలసిందని చెప్పాయి.

BRAOU

పైన వివరించిన పన్నులు, సుంకాలు కాక, గనులు త్రవ్వడం, ఉప్ప తయారీ ప్రభుత్వానికే పూర్తిగా చెందినవి. గనుల త్రవ్వకాన్ని ప్రభుత్వం అద్దెకు యిచ్చి, ఉత్పత్తుల్లో భాగం తీసుకొనేదని తోస్తూంది. ఉప్ప తయారీ పైన కూడ, ప్రభుత్వం తన స్వంత హక్కులను అద్దెకిచ్చి, సుంకాన్ని వసూలుచేసేదని భావించొచ్చు.

4.5 : ఆర్థిక స్థితిగతులు

శాతవాహన సామ్రాజ్య విస్తరణకు మూలమైన ఆర్థిక పరిణామాలను గూర్చి, ఆ రాజ వంశం మౌర్యుల వలెనే సారవంతమైన భూభాగాలపై ఏర్పడిన జనసాంద్రత గల ప్రదేశాలను ఎంపిక చేసుకోవడం, ఇనుప పనిముట్లను ఉపయోగించే వ్యవసాయ విధానాన్ని అనుసరించడం, విస్తృతంగా నాణేలను ఉపయోగించడంలో, సామ్రాజ్య నిర్మాణం చేయగలిగినట్లు, కొందరు చరిత్రకారులు అభిప్రాయపడడాన్ని గూర్చి, పైన వివరించడం జరిగింది.

దక్కన్ పీఠభూమిపై కృష్ణా, గోదావరీ నదులు, వాటి ఉప నదులైన భీమ, మంజీరా నదులు ప్రవహించే ప్రదేశంపై, క్రీ.పూ. ఆరో శతాబ్ది నాటికి, అశ్మక, ములక అనే రెండు జనపదాలు ఏర్పడినట్లు, బౌద్ధ వాఙ్మయం వలన తెలియవస్తున్నది. ఇందుకు పురావస్తు ఆధారాలు కూడా లభిస్తున్నాయి. ఈ జనపదాల స్థాపన, అభివృద్ధి, ఈ ప్రదేశంలో వ్యావసాయిక జీవనంపై ఆధారపడిన జనావాసాలు ఏర్పడడం వల్లనే సాధ్యమైంది. ఈ జనపదాలకు మూలమైన గ్రామీణ జనావాసాలు, బహుశః నవీన శిలా యుగం, కాంస్య యుగం నాటివి కావచ్చు. అయితే, ఇనుప పనిముట్ల వాడకం ఇక్కడి వ్యవసాయంలో అపూర్వమైన మార్పును తెచ్చి, విస్తృతమైన ప్రదేశాల్లో జరిగిన పురావస్తు త్రవ్వకాలు, నవీన శిలా యుగం నుండి ఇనుప యుగాల వరకు పరిణామం చెందిన ఆర్థిక వ్యవస్థను నిరూపించాయి. ఈ ఇనుప పనిముట్ల వాడకం, దాని వలన కలిగిన వ్యవసాయాభివృద్ధి, సుమారు క్రీ.పూ. ఏడో శతాబ్దికి చెందినట్లు భావించొచ్చు.

BRAOU

4.5.1 : వ్యవసాయం

ఇనుప యుగం నాటి వ్యవసాయాభివృద్ధి, పూర్వపు గ్రామీణ జనావాసాలు మరింతగా విస్తరించడానికి, మరిన్ని వృద్ధి చెందడానికి దోహదపడుతుంది. ఈ విస్తరణ, పరిణామాల్లో ఆంధ్రుల పరిసరాల్లో నివసించే శబర, పులింద, మూతిబ, మొదలైన జాతులు తమ ఆటవిక జీవనాన్ని వదిలి, మైదానం పైకి రావడం, సంస్కృతీకరణ చెందడం జరిగింది. దీని వలన మరింతగా ఈ జనావాసాలు వృద్ధి చెంది, జనపదాలుగా రూపొందడం జరిగింది. అశ్మక, ములక, మాత్రమే కాక, అనూప, ఆనర్త, విదర్భ జనపదాలు నర్మద, తపతీ నదుల మైదానం పైన, ఋషిక, ముషిక, జనపదాలు, అశ్మక, విదర్భ జనపదాలకు నడుమ, తూర్పు కనుమల వెంట ఏర్పడ్డాయి. తీరాంధ్ర ప్రాంతంలో సమకాలీనంగా కొన్ని యక్ష, నాగ జాతుల జనావాసాలు ఏర్పడినట్లు, సంగం వాఙ్మయం పేర్కొనే ఎరుమై, అరువై వంటి జాతులు కూడ తమ ఆవాసాలను ఏర్పర్చుకొన్నట్లు తెలియవస్తూంది.

క్రీ.పూ. మొదటి శతాబ్దంలో, శాతవాహన సామ్రాజ్య స్థాపన జరిగిన సమయాన, దక్కన్ పీఠభూమి పైన ఈ జనావాసాలు, జనపదాలు, రోమన్ సామ్రాజ్యంతో విస్తృతంగా నౌకా వాణిజ్యం చేస్తున్నాయి. వ్యవసాయం అభివృద్ధి చెందడాన, ఆహారానికి లోటు లేదు. కొన్ని పరిశ్రమలకు అవసరమైన మూల పదార్థాలు కూడ, వ్యవసాయం వలన ఉత్పత్తౌతున్నాయి. కనుక, వృత్తులు,

కళలు (arts and crafts) వృద్ధి చెందాయి. ఈ వృత్తులు, కళల వలన ఉత్పత్తౌతున్న వస్తువులకు విదేశాల్లో మంచి గిరాకీ ఏర్పడింది. అది, నౌకా వాణిజ్యానికి దోహదపడింది. ఈ విధమైన ఆర్థిక పరిణామాలు, అప్పటికి రెండు, మూడు శతాబ్దుల పూర్వం ప్రారంభమై, వృద్ధి చెందుతున్నాయని గ్రహించొచ్చు.

ఈ విధమైన వ్యావసాయిక, పారిశ్రామికాభివృద్ధి, వర్తకవాణిజ్యాలు, శాతవాహన సామ్రాజ్య స్థాపనకు తోడ్పడిన ఆర్థిక పరిణామాలు. పైన పేర్కొన్న పురావస్తు పరిశోధనలు, దక్కన్ పీఠభూమిపై వ్యవసాయంతోపాటు పశుపోషణ జరిగినట్లు సూచిస్తున్నాయి. అనేక ప్రదేశాల్లో త్రవ్వకాలు, బూడిద కుప్పలను బయల్పర్చాయి. ఇవి అపారంగా వృద్ధి చెందిన పశు సంపద వలన, వాటి పేడ, ఇతర వ్యర్థ పదార్థాలను భారీ ఎత్తున తగులపెట్టడం వలన ఏర్పడినట్లు, పురావస్తు వేత్తల అభిప్రాయం.

4.5.2 : పంటలు

నవీన శిలా యుగ - తామ్ర యుగాల కాలం లోని వ్యవసాయం, బహుశః సజ్జ, రాగి వంటి ధాన్య జాతులను, ఉలవలను పండిస్తూ, వాటిని ఆహారంగా ఉపయోగించడం జరిగేదని తెలియవస్తున్నది. క్రీ.శ. రెండో శతాబ్దికి చెందిన **'గాధాసప్తశతి'** శాలి, శ్యామక అనే పేర్లతో వరి ధాన్యాన్ని, అందులోని కొన్ని రకాలను పేర్కొంటూంది. వాటితోపాటుగా, జొన్న, కొర్ర మొదలైన చిరుధాన్యాలను కూడ, **'గాధాసప్తశతి'** పేర్కొంటూంది. ఈ ధాన్యాలు సమాజం లోని సామాన్య ప్రజానీకానికి, వరి ఉన్నత వర్గాలకు ఆహారమై ఉండొచ్చునని, ఆ కాలానికే సామాజిక తారతమ్యాలు స్పష్టమైన రూపాన్ని ధరించాయని ఊహించొచ్చు. పైన పేర్కొన్న ఆహార ధాన్యాలు కాక, చెరకు, పసుపు, పోక, తమలపాకు వంటి వాణిజ్య పంటలు కూడ సాగౌతున్నట్లు **'గాధాసప్తశతి'** పేర్కొంటూంది. ప్రజా జీవనంలో కొంత వరకు ఉన్నత వర్గాలు సౌఖ్యవంతమైన జీవనం గడుపుతున్నాయని, ఈ వ్యావసాయిక ఉత్పత్తులు సూచిస్తాయి. ప్రత్తి వాణిజ్య పంటల్లో ఒకటని, తూర్పు తీరం నేత పరిశ్రమకు కేంద్రాలైన అనేక గ్రామాలతో వృద్ధి చెందడానికి, అది కారణమైందని గ్రహించొచ్చు.

"ధాన్య కటక" అనే నామవాచకం ఆ పట్టణ పరిసర భూముల్లో విస్తారంగా ధాన్యం పండేదని, ఆ పట్టణం ధాన్య వర్తకానికి ఒక ప్రసిద్ధ కేంద్రంగా ప్రఖ్యాతి చెందిందని గ్రహించొచ్చు.

అమరావతి మహాచైత్య అవశేషాల్లో లభించిన అనేక శాసనాలు, గహపతులు (సంస్కృతంలో గృహపతులు) ధాన్యకటకం వద్ద ఉన్న మహాచైత్యానికి విరివిగా దానధర్మాలు చేసినట్లు తెలియజేస్తాయి. 'గహపతులు' వ్యవసాయం వలన ఐశ్వర్యవంతులైనవారు. వారు తమ వ్యవసాయోత్పత్తులకు వర్తక కేంద్రంగా, అమరావతి - శ్రీధాన్యకటకాన్ని అభివృద్ధి చేసుకొన్నారని ఊహించొచ్చు. వారు సాధారణ వ్యవసాయదారులు కారు. గణనీయమైన పెద్ద విస్తీర్ణంలో సాగు భూమిని, అందుకు తగినట్లు పాడి పశువులు, జీతగాళ్ళు, పాలేర్లు కలిగిన పెద్ద భూకామందులు. ఈ గహపతులు గ్రామీణ వ్యావసాయిక సమాజాలకు నాయకులు, గ్రామ ముఖ్యులుగా, గ్రామాధికారులుగా వ్యవహరించేవారని తోస్తుంది. తక్కిన చిన్న చిన్న భూస్వాములు, వ్యవసాయంపై ఆధారపడి జీవించే పాటుక జనం, వీరి నాయకత్వాన్ని ఆమోదించేవారని, గహపతులు వారి నందరిని పరిపాలించేవారని అర్థం చేసుకోవచ్చు.

అమరావతి, నాగార్జునకొండ శాసనాలు, ఖేట, తడాగ, తాలవన వంటి పదాలను తరచుగా పేర్కొంటాయి. ఖేట, లేక ఖేత అనగా వ్యవసాయ భూమని అర్థం. సంస్కృతంలో "క్షేత్ర"కు అది ప్రాకృత రూపాంతరం. అది వ్యవసాయదారుల అధీనంలో ఉండి, సాగుబడౌతున్న ప్రదేశం.

BRAOU

'తడాగ' తటాకానికి రూపాంతరం. వ్యవసాయ అవసరాలకు కావలసిన నీటిని నిలువ చేసుకొనేందుకు తటాకాలను త్రవ్వడం, ఒక ప్రసిద్ధమైన విధానమని గ్రహించొచ్చు. కొండలపై కురిసిన వర్ష జలాన్ని నిలువచేసుకొనడం వలన, సాగునీటి విధానాలు అభివృద్ధి చెందినట్లు, అనగా వ్యవసాయం చెప్పుకోదగినంత సాంకేతిక పరిణతిని చెందినట్లు, స్పష్టమౌతూంది.

4.5.3 : సాగునీటి ఏర్పాట్లు

మౌర్యుల కాలంలో తటాక నిర్మాణాలను రాజ్యం చేపట్టినట్లు, మహాక్షత్రప రుద్రదాముని జునాగఢ్ శాసనం వలన తెలియవస్తూంది. కాని, అది ఒక ఉద్యమంగా జరిగినట్లు భావించడం సబబు కాదు. శాతవాహన యుగం నాటి శాసనాలు సైతం, తటాక నిర్మాణంలో రాజ్యం పాల్గొన్నట్లు ప్రస్తావించవు. సాధారణంగా, సాగునీటి అవసరాలకు తటాకాలు, కాలువల నిర్మాణాన్ని, గహపతులు, గ్రామీణ వ్యవసాయదారులు స్వయంగా చేసుకొనేవారని, ఊహించడం యుక్తం. కొన్ని ప్రత్యేక సందర్భాలలో, అధిక వర్షపాతం వలన నదులు గట్లు తెగి, ప్రాణ, ధన నష్టాలను కలిగించే సందర్భాలలో, భారీ ఎత్తున జరగవలసిన ప్రయత్నాలను మాత్రం రాజ్యం నిర్వహించేదని తోస్తుంది. శాతవాహన యుగంలో ఖారవేలుని హథిగుంఫ శాసనం, ఒక కాలువను ఆ రాజు త్రవ్వించినట్లు తెల్పుతూంది. కాని, అది అతని రాజధాని సమీపంలో చేపట్టిన కార్యక్రమం. అలాగే, ఉజ్జయిని రాజధానిగా పరిపాలించే మహాక్షత్రప రుద్రదాముడు, లోగడ మౌర్యుల కాలంలో నిర్మాణమైన ఆనకట్ట, అధిక వర్షాల వలన ధ్వంసమై, సుదర్శన తటాకం గట్లు తెంచుకొని గ్రామాలను ముంచెత్తగా, తను మరమ్మత్తులు చేయించి, ఆ తటాకాన్ని పునరుద్ధరించినట్లు, తన జునాగఢ్ శాసనంలో చెప్పుకొన్నాడు. ఈ రెండు సందర్భాలు మాత్రమే, శాతవాహన యుగంలో రాజ్య వ్యవస్థ జల వనరుల నిర్వహణకు పూనుకొన్నట్లు తెలియవస్తున్న కార్యక్రమాలు. అయితే, అవి కూడ ఆంధ్ర దేశానికి ఆవల, శాతవాహన సామ్రాజ్యానికి వెలుపల జరిగినవే.

తాడి చెట్లతో వనాలను, తాళ్ల వనాలను విస్తారంగా పెంచడం, ప్రాచీన కాలంలో సాధారణ విషయంగా కానవస్తుంది. శాతవాహన యుగం నాటి శాసనాలు అటువంటి సమాచారాన్ని అందించవు. కాని, ఇక్ష్వాకు యుగంలో ఆభీర రాజైన వసుషేణుడు నాగార్జునకొండ వద్ద నిలిపిన శాసనం, అతడు కొన్ని తాళ్ల వనాలను శ్రీపర్వత-విజయపుర ప్రాంతంలో నాటించినట్లు వివరిస్తూంది. తాటి చెట్ల నుండి లభించే పదార్థాలతో మద్యం, బెల్లాన్ని తయారుచేయడం, గృహ నిర్మాణాలకు కావలసిన ఆకులు, వాసాలు లభించడం వలన, తాటి చెట్లను విస్తారంగా పెంచేవారని తోస్తుంది. శ్రీమహాలక్ష్మి తాటి చెట్లపై నివసిస్తుందని, కొన్ని ప్రాచీన కాలపు జనులు విశ్వాసంగాను, తాటి చెట్లనే కోరిన కోరికలు తీర్చే కల్ప వృక్షంగా భావించడం జరిగిందని, పురావస్తు ఆధారాల సాయంతో ఆచార్య జితేంద్రనాథ్ బెనర్జీ నిరూపించారు.

4.5.4 : రాజకీయ - ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం మూలాధారం

పై పరిశీలన వలన వ్యావసాయకాభివృద్ధిలో గహపతుల పాత్ర, వ్యావసాయిక ఉత్పత్తులు, వాటిపై ఆధారపడిన వర్తకులు, వ్యవసాయ ప్రయోజనాల కొరకు సాగునీటి వనరులను ఏర్పర్చుకొని నిర్వహించడం, శాతవాహన యుగం నాటి వ్యవసాయ విధానాలను, ప్రాధాన్యతను స్పష్టపరుస్తున్నాయి. వ్యవసాయాభివృద్ధి వలన ఐశ్వర్యవంతులైన గహపతులు బౌద్ధ సంస్థలకు దానధర్మాలు చేసి, వాటిని ప్రోత్సహించారు; గ్రామాధిపత్యం వహించి, రాజకీయంగా ప్రాముఖ్యత పొందారు. కొన్ని సందర్భాల్లో,

BRAOU

వ్యవసాయాభివృద్ధి వలన విరివిగా ఏర్పడుతున్న గ్రామాలు, ఒక సముదాయంగా ఏర్పడి, బహుశః ఒకే గ్రామాధికారి ఆధిపత్యంలో చేరిపోయేవని, అవి రాజ్య వ్యవస్థగా రూపొందేవని భావించడానికి అవకాశం కానవస్తుంది. ఒక నాగార్జునకొండ శాసనం, అటువంటి ఐదు గ్రామాల సముదాయాన్ని ప్రస్తావిస్తూంది.

వ్యవసాయాభివృద్ధి, దానిపై ఏర్పడిన గ్రామీణ జీవనం, ప్రాచీనాంధ్ర దేశంలో సామాజిక, రాజ్య వ్యవస్థలకు బీజప్రాయమైనట్లు, శాతవాహన సామ్రాజ్య నిర్మాణానికి పునాదైనట్లు, స్పష్టంగా చెప్పొచ్చు.

4.5.5 : వృత్తులు - పరిశ్రమలు

వ్యవసాయాభివృద్ధి గ్రామీణ పరిశ్రమలు, చేతివృత్తుల అభివృద్ధికి దోహదం చేస్తుంది. ఆర్థికాభివృద్ధి వలన ప్రజల జీవన సరళిలో కలిగే మార్పులు, మరింత నాణ్యమైన వస్తువులకు గిరాకీ పెచ్చడం, అది పరిశ్రమలకు, చేతి వృత్తులకు మరింత ప్రోత్సాహకరం కావడం సహజం. ఈ విధమైన పారిశ్రామిక అభివృద్ధి వర్తక వాణిజ్యాలకు మూలం. శాతవాహన యుగం నాటి విదేశీ వాణిజ్యం ఈ విధంగానే సాధ్యమైంది.

శాతవాహన యుగంలో బౌద్ధ విహారాలకు, మహా చైత్యాల నిర్మాణాలకు, వివిధ వృత్తుల, పరిశ్రమలకు చెందినవారు, వర్తకులు విరివిగా విరాళాలు, దానధర్మాలు చేసినట్లు, ఆయా ప్రదేశాల్లోని శాసనాల వలన తెలుస్తూంది. ఆ నాటి పారిశ్రామిక, చేతి వృత్తులకు సంబంధించిన సామాజిక వర్గాలు కూడ, ఈ శాసనాధారాల వలన తెలియవస్తాయి. వారు తమ వృత్తుల వలన సంపాదించే అధికాదాయం వల్ల, ఆ విధమైన దానధర్మాలను చేయడం సాధ్యమైంది.

4.5.6 : వృత్తి సంఘాలు

శాసనాధారాల వలన 'నికమ' లేక 'నిగమ', 'నికాయ' అనే పదాలు తెలియవస్తాయి. వీటిని పారిశ్రామిక వర్గాలు, వివిధ వృత్తులకు చెందినవారు ఏర్పర్చుకొన్న సహకార సంఘాలుగా చరిత్రకారులు గుర్తించారు. ఈ సంఘాలు స్వయంపాలనాధికారం కలిగినవి. ధర్మశాస్త్రాలు, కౌటిల్యుని **'అర్థశాస్త్రం'** రాజు వీటిని సంరక్షించి, గౌరవించాలని, వాటి కట్టుబాట్లను రాజ శాసనం కంటె ప్రాముఖ్యత కలవిగా భావించాలని, నిర్దేశిస్తాయి. భట్టిప్రోలు మహాచైత్యం వద్ద లభిస్తున్న శాసనాలు, అటువంటి సహకార సంఘాలను గోష్ఠి అనే పేర ప్రస్తావిస్తాయి; కొన్ని వాఙ్మయాధారాలు, శాసనాలు "శ్రేణి" అనే పేరున కూడ వ్యవహరిస్తాయి. ఈ సహకార సంఘాలకు వాటి సభ్యులే ఎన్నుకొనే నాయకులు ఉండేవారు. కొందరు చరిత్రకారులు ఈ నాయకులను రాజు నియమిస్తాడని అభిప్రాయపడతారు; కాని, అది సరి కాదు.

పశ్చిమ కనుమల్లోని గుహాలయాల్లోను, అమరావతి మహాచైత్యం వద్ద లభిస్తున్న శాసనాల వలన, అనేక వృత్తులు, పరిశ్రమలకు చెందినవారు తెలియవస్తారు. వారు: (1) కోశిక, నేతపనివారు; (2) తిలపీసక, నూనె గానుగలవారు; (3) సువణకార, బంగారు పనివారు; (4) నెలవధకి, రాతి కట్టుబడి పనివారు, లేదా రాతి చెక్కడపు పనివారు; (5) మీధిక, మెరుగుపెట్టేవారు; (6) మణికార, రత్నాలు, మణులు పొదిగి, నగలు తయారుచేసేవారు; (7) కమర, ఇనుప పనివారు; (8) వెజ, వైద్యులు; (9) మాలాకార, మాలలు కట్టి, విక్రయించేవారు; (10) గాధిక (లేక గదిక, గంధిక) పరిమళ ద్రవ్యాలు తయారుచేసేవారు; వాటిని విక్రయించే వారు ; (11) వధికి, వడ్రంగులు; (12) కులరిక, కుండలు తయారుచేసేవారు; (13) కాసికార, ఇత్తడి పనివారు.

BRAOU

వీరు కాక, ఓదయంత్రిక, అనే సాంకేతిక నిపుణుల సంఘముండేది. వీరు ఉదక యంత్రాలు, అనగా నీటి పారుదలకు సంబందించిన యంత్రాలను తయారుచేసేవారు. బహుశ: ఈ ఉదక యంత్రాలు ఏతాము వలె నీరు తోడి, పొలాలకు మళ్ళించడానికి ఉపయోగించేవి కావచ్చు; లేదా, తటాకాల వంటి నిర్మాణాలకు ప్రణాళిక (Plan) లను తయారుచేసి, నిర్మించేవారు కావచ్చు.

పశ్చిమ కనుమల్లోని గుహాలయాలను త్రవ్వడం, సాంచీ స్తూపం వద్ద ద్వార తోరణాల నిర్మాణం, అమరావతి మొదలైన ఆంధ్ర దేశం లోని మహాచైత్యాల విస్తరణలు, శిల్పాలంకరణలు, అధిక శాతం శాతవాహన యుగం నాటివి. ఇవి ఆనాటి శిల్పులు, శిలా నిర్మాణాలకు చెందిన (నెలవధికి) పనివారి నైపుణ్యానికి నిదర్శనలు. సాంచీ ద్వార తోరణం ఒక దంతపు పనివారి శ్రేణి నిర్మించినట్లు, అక్కడి శాసనం వలన తెలుస్తూంది. భారతదేశంలో తయారైన దంతం వస్తువులకు, రోమన్ సామ్రాజ్యంలో అత్యధికమైన గిరాకీ ఉండేదని **పెరిప్లస్**, టోలమీ రచించిన **భూగోళం**, ప్లినీ రచించిన **ప్రకృతి చరిత్ర** (Natural History) పేర్కొంటున్నాయి. కనుక, దంతపు చెక్కడపు పని శాతవాహన యుగంలో చాలా అభివృద్ధి చెందినట్లు గ్రహించొచ్చు. అమరావతీ శిల్ప ఫలకాల్లో కూడ, దంతపు పనివారి పాత్ర అధిక శాతం ఉండి ఉండొచ్చునని, గులాం యజ్దానీ అభిప్రాయపడ్డాడు.

4.5.7 : పారిశ్రామిక, వర్తక పెట్టుబడులు

పారిశ్రామికాభివృద్ధికి, వర్తక వాణిజ్యాలకు అవసరమైన నిధులు, ప్రధానంగా వ్యవసాయాభివృద్ధి వలన లభించేవని, నిస్సంశయంగా చెప్పొచ్చు. వ్యవసాయ ఉత్పత్తుల మిగులు (surplus) వర్తకానికి మూలమైంది; దాని వలన లభించే లాభం, వర్తకానికి, పరిశ్రమలకు పెట్టుబడులను సమకూర్చింది. అయినా, వర్తక వ్యాపారాలకు, అప్పుడప్పుడు పరిశ్రమలకు, స్వల్పకాలిక ఋణాలు అవసరమౌతూ ఉంటాయి. అవి తప్పనిసరిగా వడ్డీ వ్యాపారాన్ని, బ్యాంకుల వంటి పరపతి సంస్థలను, వృద్ధి చేశాయని ఊహించొచ్చు.

నికాయ, లేక శ్రేణి, తమ సభ్యులకు సహకార ప్రాతిపదికపై ఋణ సౌకర్యాన్ని కలిగించేవి. ఈ సంస్థల నిర్వాహకులైన 'సెట్టి' వంటివారు వడ్డీ వ్యాపారాన్ని నిర్వహించేవారని, జాతక కథల వలన గ్రహించొచ్చు. ఇవి కాక, సాధారణ ప్రజానీకం నుండి, ద్రవ్య రూపంలో దానధర్మాలు స్వీకరించే బౌద్ధ విహారాల్లోని భిక్షు సంఘాలు, తాత్కాలిక అవసరాల కొరకు ధనాన్ని అప్పుగా ఇచ్చి, వడ్డీని సంపాదించేవారు. కొన్ని సందర్భాల్లో బౌద్ధ విహారాల్లోని కార్యక్రమాలను నిర్వహించడానికి అవసరమైన నిధులను సమకూర్చే షరతుపై, నిగమ, శ్రేణి వంటి సంస్థలకు దానధర్మాలు చేస్తూ, వేసిన శాసనాలు, పశ్చిమ కనుమల్లోని గుహాలయాల్లో కానవస్తాయి.

4.5.8 : వర్తక వాణిజ్యాలు - వాణిజ్య వస్తువులు

శాతవాహన యుగంలో భారతీయులు గర్వంగా చెప్పుకోదగిన విదేశీయ వాణిజ్యం జరిగింది. అందులో ప్రధాన పాత్ర నిర్వహించింది, నర్మద-కృష్ణా నదుల నడుమనున్న దక్కన్ పీఠభూమి. శాతవాహన సామ్రాజ్యానికి ఆధార పీఠమైంది, ఈ ప్రదేశమే. శాతవాహనుల సామ్రాజ్యాధిపత్యానికి, ఆ యుగం లోని బౌద్ధ ధర్మ ఔన్నత్యానికి కూడ, ఈ విదేశీ వాణిజ్యం ఆలంబనైంది.

ఆ నాటి దక్కన్ పీఠభూమి, పశ్చిమంగా రోమన్ సామ్రాజ్యంతో; ప్రాచీన కాలం నాటి పర్షియా, మధ్యధరా సముద్ర తీరం లోని ఉత్తర ఆఫ్రికా, ఆసియా మైనర్, ఐరోపా ఖండం లోని దక్షిణ

BRAOU

భాగం మొదలైన ప్రదేశాలతో కూడిన రోమన్ సామ్రాజ్యం తోను ; తూర్పున మలయా ద్వీపకల్పం, ఆగ్నేయాసియా లోని నేటి ఇండోనేషియా (సువర్ణ ద్వీపం), కంపూచియా (కంబోజ), థాయ్‌లాండ్, వియత్నాం, బర్మా మొదలైన దేశాలుగా ఏర్పడిన భూభాగాల తోను; విస్తృతంగా వర్తక వాణిజ్యాలు, సాంస్కృతిక సంబంధాలను నిర్వహించింది. శాతవాహనులు, వారి సమకాలీన రాజవంశాలు - పశ్చిమ క్షత్రపులు, మహిషిక, మహారథి, మహాభోజ, మొదలైనవారు- విరివిగా నాణేలను ముద్రించి, జారీ చేయడాన్ని బట్టి, ఈ వర్తకం ఎంతటి స్థాయిలో జరిగిందో, ఏ రీతిలో జరిగిందో ఊహించొచ్చు.

ఈ వర్తక వాణిజ్యాలు వస్తు మార్పిడి (barter) విధానాన్ని తొలగించి, ద్రవ్య ఆర్థిక వ్యవస్థ (money economy) ను ఏర్పర్చాయని, శాతవాహనులు, వారి సమకాలీన రాజవంశాలు ముద్రించిన నాణేల వలన, దక్షిణ భారతదేశమంతటా లభిస్తున్న రోమన్ బంగారు నాణేల వలన, స్పష్టపడు తూంది. భారతదేశంలో జరిగిన వర్తక వాణిజ్యాల వలన, రోమన్ సామ్రాజ్యం ఏటా 4 కోట్ల పౌండ్లకు సమానమైన బంగారు నాణేలను చెల్లించేది. ఈ విషయాన్ని వివరిస్తూ, ప్లినీ అనే రచయిత, "ఈ విధంగా భారతదేశపు విలాస వస్తువులను దిగుమతి చేసుకొంటూ, ఏటా బంగారాన్ని ప్రవహింప జేస్తూపోతే, అనతి కాలంలోనే రోమన్ సామ్రాజ్యం విచ్ఛిన్నమై, పతనం కాక తప్పదని" హెచ్చరించాడు.

4.5.9 : ప్రాచీన వాణిజ్య సంబంధాలకు సాక్ష్యాధారాలు

BRAOU

భారతదేశం రోమ్‌తో జరిపిన వాణిజ్యాన్ని గూర్చిన సమాచారాన్ని, ఒక అజ్ఞాత గ్రీక్ నావికుడు క్రీ. శ. 80 లో రచించిన **'పెరిప్లస్'** అనే గ్రంథం; టోలమీ (Ptolemy క్రీ.శ. 140) అనే గ్రీక్ భౌగోళిక శాస్త్రవేత్త రచించిన **"జాగ్రఫీ"** అనే గ్రంథం, పైన పేర్కొన్న ప్లినీ రచించిన **ప్రకృతి చరిత్ర** (Natural History క్రీ.శ. 77) అనే గ్రంథం, సమకూర్చుతాయి. ఈ గ్రంథాలు భారతదేశం లోని వర్తక కేంద్రాలు, రేవు పట్టణాలు, వర్తక మార్గాలు, వాణిజ్య వస్తువులు మొదలైన వివరాలను అందిస్తాయి. దక్కన్ పీఠభూమిపై అనేక ప్రాంతాల్లో లభించిన రోమన్ చక్రవర్తుల బంగారు నాణాలు, ఈ రచనల్లోని యదార్థాలను నిరూపిస్తాయి. ఆంధ్ర దేశంలో రోమన్ బంగారు నాణేలు నెల్లూర్, అత్తిరాల (కడప జిల్లా), అమరావతి, వినుకొండ, చేబ్రోలు, నాగార్జునకొండ, ఒంగోల్, నంద్యాల, నల్గొండ జిల్లాలో గూటిపర్తి, అక్కెనపల్లి, ఏలేశ్వరం, విశాఖపట్టణం జిల్లాలో గుండ, కొత్తపాడు, శ్రీకాకుళం జిల్లాలోని శాలిహుండం, కరీంనగర్ జిల్లాలో నుస్తులాపూర్ మొదలైన చోట్ల లభించాయి. ఈ నాణేలు లభించిన ప్రదేశాల్లో, కొన్ని ప్రాచీన కాలంలో ప్రసిద్ధి కెక్కిన వాణిజ్య కేంద్రాలని నిశ్చయంగా చెప్పొచ్చు.

పశ్చిమ కనుమల్లోని కార్లా, నాసిక్, నానాఘాట్, కన్హేరీ మొదలైన ప్రదేశాల్లోని గుహాలయాలు, ప్రధాన వర్తక మార్గాలపై తొలిచినవేనని, పురావస్తు వేత్తల అభిప్రాయం. అదే విధంగా, తీరాంధ్రలో ప్రధాన బౌద్ధ చైత్య నిర్మాణాలు, అనాటి ప్రఖ్యాత వర్తక కేంద్రాల వద్ద నిర్మాణమైనవే. అమరావతి, నాగార్జునకొండ, భట్టిప్రోలు, ఘంటసాల మొదలైనవి, ఇందుకు ఉదాహరణలుగా నిలుస్తాయి. ఈ బౌద్ధ చైత్యాల అవశేషాల్లోను, పైన పేర్కొన్న గుహాలయాల్లోను, కానవస్తున్న అసంఖ్యాకమైన శాసనాలు కూడ, వర్తక కేంద్రాలు, వర్తక వృత్తి సంఘాలను గూర్చి సమాచారాన్ని అందిస్తాయి.

4.5.10 : వర్తక మార్గాలు

పైన పేర్కొన్నట్లు, ప్రాచీన బౌద్ధ కేంద్రాలను కలుపుతూ దేశ పటాన్ని పరిశీలిస్తే, ప్రాచీన వర్తక మార్గాలను గ్రహించొచ్చు. బౌద్ధ వాఙ్మయం, విదేశీ వాఙ్మయాలను పరిశోధించిన చరిత్రకారులు, మరింత వివరంగా ఈ వర్తక మార్గాలను గుర్తించి వివరించారు. వాటిలో కొన్ని ముఖ్యమైన వాటిని ఈ క్రింద పేర్కొనటం జరిగింది.

బౌద్ధ పాళీ వాఙ్మయంలో చేరిన **సుత్తనిపాత** అనే గ్రంథం, దక్షిణాపథం లోని అశ్మక జనపదంలో కోసల నుండి వలస వచ్చిన బావరి అనే బ్రాహ్మణుని గూర్చి, కొంత సమాచారాన్నిస్తుంది. సిద్ధార్థ గౌతముడు బుద్ధుడై అర్హతత్వం పొందిన సమాచారాన్ని విని, అందులోని సత్యాసత్యాలను తెలుసుకొని రావలసిందిగా, బావరి తన శిష్యులను పంపాడు. వారు గోదావరి నదిపై ఉన్న ప్రతిష్ఠానపురం (ముళక జనపదానికి ముఖ్య పట్టణం), నర్మదా నదిపై ఉన్న మాహిష్మతి; తర్వాత ఉజ్జయిని; కౌశాంబి (నేటి అల్హాబాద్ సమీపంలో ఉండేది); అక్కడి నుండి కోసల జనపదానికి ముఖ్య పట్టణమైన శ్రావస్తిని చేరి, అక్కడ నుండి తక్షశిల నుండి, పాటలీపుత్రానికి గల వర్తక మార్గాన, రాజగృహను చేరినట్లు, అక్కడ, వారు బుద్ధుణ్ణి దర్శించారని, **సుత్తనిపాతం** వర్ణించింది. క్రీ.పూ. ఆరో శతాబ్ది నాటికే ఉత్తర, దక్షిణ భారత దేశాల నడుమ ఈ మార్గాన్ని తరచుగా వర్తకులు అనుసరించేవారని, కనుక బావరి శిష్యులు ఈ మార్గాన్ని అనుసరించారని, సులువుగా గ్రహించొచ్చు.

ఆంధ్ర దేశంలో సైతం, బౌద్ధ క్షేత్రాల వెంట వర్తక మార్గాలను గుర్తించడం జరిగింది. మరో విధంగా, వర్తక మార్గాల వెంట బౌద్ధ క్షేత్రాలు ఏర్పడినట్లు భావించి, వాటిని అనుసరించి, మార్గాలను గుర్తించడం జరిగింది. వాటిలో ప్రధానమైనవి: (1) ధాన్యకటక-అమరావతి నుండి కృష్ణను దాటి, విజయవాడ మీదుగా వేంగి నగరాన్ని (నేటి ఏలూరు పట్టణానికి 7 కిలోమీటర్ల దూరంలో పెద వేగి); అక్కడ నుండి ఈశాన్యంగా నడిచి, గోదావరి నదిని దాటి, పిఠాపురాన్ని చేరి, ప్రాచీన కాలంలో పిష్టపురం) సంకారం, తొట్లకొండ, బాలికొండ, రామతీర్థం, శాలిహుండం మీదుగా కళింగ దేశానికి వెళ్ళే మార్గం; (2) వేంగి నగరం నుండి దక్షిణంగా గుడివాడ, సముద్ర తీర రేవుపట్టణమైన ఘంటసాల - కొడ్డూర వరకు; (3) నేటి ప్రకాశం జిల్లాలోని కనువర్తి నుండి చిన గంజాం, పెద గంజాం, భట్టిప్రోలు మీదుగా, ఘంటసాల - కొడ్డూర రేవు పట్టణాలకు; (4) ధాన్యకటక, అమరావతి నుండి గరికపాడు, గోలి మీదుగా నాగార్జునకొండకు, అక్కడి నుండి ఏలేశ్వరం వద్ద కృష్ణా నదిని దాటి, అశ్మక జనపదం ముఖ్యపట్టమైన పోదన నగరానికి; (5) వేంగీ నగరం నుండి నూటిగా ఉత్తర దిశగా ప్రయాణంచేసి, గుంటుపల్లి మీదుగా, గోదావరి నదిని దాటి, దక్షిణ కోసలకు వెళ్ళే మార్గం; (6) వేంగీ నగరం నుండి అల్లూరు, రామిరెడ్డిపల్లె, జగ్గయ్యపేట, నేలకొండపల్లె మీదుగా, నేటి హైదరాబాద్ నగరం సమీపం నుండి, పోదన నగరానికి వెళ్లే మార్గం.

ఈ మార్గాల్లో నాలుగవది, నాగార్జునకొండ సమీపాన ఆగ్నేయంగా మలుపు తిరిగి, కర్ణాటక వైపు గాను; మూడవది, దక్షిణంగా కొనసాగి, తొండైమండలానికి, తమిళగానికి దారి తీసేవి. తొండైమండలం నివాసులైన అరువై, అరుదావాడతలై జాతుల ప్రజలు, వారికి సన్నిహితంగా కర్ణాటక - ఆంధ్ర దేశాల్లో నివసించే ఎరుమై జాతి ప్రజలు కూడ, వర్తక వాణిజ్యాలను అనుసరించినవారే.

ప్రతిష్ఠాన నగరం నుండి తగర, సోపార (శుర్పారక) రేవు పట్టణానికి, కళ్యాణ, భరుకచ్ఛ రేవు పట్టణాలకు వర్తక మార్గాలున్నట్లు, పెరిప్లస్ వలన తెలియవస్తుంది. ఈ మార్గాల పైనే, పశ్చిమ కనుమల్లో కానవస్తున్న అనేక బౌద్ధ గుహాలయాలను తొలవడం జరిగింది. అయితే, పశ్చిమ కనుమల్లో

B.RAO.U

ఈ బౌద్ధ గుహాలయాలు కానవస్తున్న ప్రదేశం, నేటికి దట్టమైన అరణ్యాలతో కూడి, వ్యవసాయానికి అనువుగా కాలేదు. కానీ, ఈ పట్టణాలు వర్తక కేంద్రాలుగా వృద్ధి చెందడానికి కారణం, రోమన్ సామ్రాజ్యంతో జరిగే నౌకా వాణిజ్యం పశ్చిమ తీరం ద్వారా జరగడమే. ఈ వాణిజ్యం పరిసర భూభాగం లోని నగరాలను దేశీయ వర్తక కేంద్రాలుగా (Inland emporia) అభివృద్ధిపర్చింది. అంటే, వ్యవసాయ యోగ్యం కాని ప్రదేశాలు, వర్తక వాణిజ్యాలతో ఆర్థికాభివృద్ధిని సాధించాయి.

4.5.11 : వర్తక కేంద్రాలు, రేవు పట్టణాలు

పైన పేర్కొన్న వాఙ్మయాధారాలు, శాసనాలు, ప్రాచీన కాలం నాటి రేవు పట్టణాలను, వర్తక కేంద్రాలను పేర్కొంటూ, క్రీ.పూ. మొదటి శతాబ్దంలో పడమటి తీరం లోని రేవు పట్టణాల నుండి రోమన్ సామ్రాజ్యంతో జరుగుతున్న నౌకా వాణిజ్యం శాతవాహనులను ఆకర్షించడాన, వారు ఆ దిక్కుగా తమ సామ్రాజ్యాన్ని విస్తరింపజేశారని, పైన వివరించడం జరిగింది. **పెరిప్లస్**, టోలమీ రచించిన **భూగోళశాస్త్రం**, పశ్చిమ తీరంలోని బరిగాజాను భారతదేశంలో అత్యంత ప్రసిద్ధమైన రేవు పట్టణంగా పేర్కొంటాయి. దీని అసలు పేరు భరుకచ్ఛ. ఇది నేటి గుజరాత్ లోని బ్రోచ్ పట్టణం. భారతదేశం లోని అన్ని ప్రాంతాలు భరుకచ్ఛంతో వర్తక మార్గాల ద్వారా అనుసంధించబడినాయి. ఆ రేవు పట్టణానికి భారతదేశం లోని అన్ని ప్రాంతాల నుండి మాత్రమే కాక, ఆఫ్ఘనిస్తాన్, మధ్యాసియా లోని దేశాల నుండి, చైనా నుండి కూడ వస్తువులు చేరుకొని, పశ్చిమ దేశాలకు, రోమన్ సామ్రాజ్యానికి ఎగుమతయ్యేవి. ఈ దేశాలకు, రోమన్ సామ్రాజ్యానికి మధ్య, భారతీయ వర్తకులు సంధాన కర్తలుగా ఉండేవారు.

బ్రోచ్ తర్వాత కళ్యాణ, అత్యంత ప్రసిద్ధమైన రేవు పట్టణం. శకుల ప్రాబల్యం వలన శాతవాహనులు భరుకచ్ఛను పోగొట్టుకొన్నప్పుడు, కళ్యాణ వారి సామ్రాజ్యంలో అత్యంత ప్రాధాన్యత గల నౌకా వ్యాపార కేంద్రమైంది. అయితే, నహపాణుని నాయకత్వంలో శకులు, కొంకణ, అపరాంత జనపదాలను సైతం ఆక్రమించి, కళ్యాణ నుండి శాతవాహన సామ్రాజ్యం విదేశీ వాణిజ్యాన్ని జరపడాన్ని అవరోధించారు క్రీ.శ.80లో **పెరిప్లస్**, కళ్యాణ నుండి శాతవాహన సామ్రాజ్యం విదేశీ వాణిజ్యాన్ని, నిర్వహించలేక పోవడాన్ని ప్రస్తావిస్తూంది. పశ్చిమ తీర రేవు పట్టణాలను తిరిగి స్వాధీనపర్చుకొని, పూర్వం వలె విదేశీ వాణిజ్యాన్ని జరిపించడానికే, గౌతమీపుత్ర శాతకర్ణి శక, యవన, పహ్లవులను ధ్వంసం చేసిన విషయం పైన వివరించబడింది.

పశ్చిమ తీరంలో భరుకచ్ఛ, కళ్యాణ తర్వాత చెప్పదగిన రేవు పట్టణం, సోపార (శూర్పారక); **పెరిప్లస్** సెమిల్లా అనే మరొక రేవు పట్టణాన్ని కూడా పేర్కొంటూంది. ఇది చౌల్ అని గుర్తించబడింది.

పడమటి తీరం లోని ఈ రేవు పట్టణాలు ఉజ్జయిని, ప్రతిష్ఠాన, తగర, కరహాటక మొదలైన ప్రధాన వర్తక కేంద్రాల నుండి వచ్చే వాణిజ్య వస్తువులను, ఎగుమతి చేసేవి.

తూర్పు తీరంలో కంటకొస్సైల (నేటి కృష్ణా జిల్లా లోని ఘంటసాల), పాలూర, అల్లోసెని Allosygne) ప్రధాన రేవు పట్టణాలుగా **పెరిప్లస్**, టోలమీ రచించిన **భూగోళశాస్త్రం** పేర్కొంటాయి. పాలూర బౌద్ధ వాఙ్మయం పేర్కొనే దంతపుర (లేక దంతగుల) అని, చరిత్రకారులు గుర్తించారు. బుద్ధుని దంత అవశేషంపై నిర్మించిన ఒక మహా చైత్యం అక్కడ ఉండేదని, అందుచేత ఆ పట్టణం 'దంతపుర' అని ప్రసిద్ధికెక్కినట్లు, బౌద్ధ వాఙ్మయం వివరిస్తూంది. దంతపురమే తెలుగు భాషలో పాలూరు (పల్+ఊర, క్రమంగా 'పల్' 'పాలు' గా మారింది.) అయింది. పాలూర నుండి మలయా

BRAOU

ద్వీపకల్పానికి, సువర్ణ భూమికి (నేటి ఇండోనేషియా), తరచుగా నౌకలు బయలుదేరేవి. అల్లోసిని అనే రేవు పట్టణాన్ని గుర్తించడం, సాధ్యం కావడం లేదు. చరిత్రకారులు బహుశంగా ఇది గోదావరి ముఖ ద్వారం వద్ద ఉన్న 'కీరింగ' కావచ్చునని భావిస్తారు. ఇక్కడ నుండి కూడ సువర్ణ భూమికి, ఇతర ఆగ్నేయాసియా దేశాలకు నౌకలు బయలుదేరేవని టోలమీ పేర్కొన్నాడు.

తూర్పు తీరం లోని వర్తక కేంద్రాలలో ధాన్యకటక, భట్టిప్రోలు అత్యంత ప్రసిద్ధమైనవి. ధాన్య కటక మనే పేరే, ఆ నగరం ధాన్య వర్తకానికి అత్యంత ప్రసిద్ధికెక్కిందిగా స్పష్టం చేస్తూంది; ఆ నగర పరిసరాలు కృష్ణా నదీ మైదానం కావడాన, సారవంతమైనవిగా, వ్యవసాయ ప్రధానమైనవిగా అభివృద్ధిచెంది, ధాన్యాన్ని ఉత్పత్తి చేస్తుండొచ్చు. ఈ వ్యావసాయాభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి, విదేశీ వాణిజ్యం వృద్ధి చెందడానికి మూలమైందని నిశ్చయించొచ్చు.

కృష్ణా నదీ ముఖ ద్వారం వద్ద ఉన్న కొడ్డూర (నేటి మచిలీపట్నం సమీపం లోని గూడూరు) మరొక ప్రధాన వర్తక కేంద్రం. **పెరిప్లస్, భూగోళం** ఈ వర్తక కేంద్రాన్ని పేర్కొన్నాయి. సమీపం లోని కంటకొస్సెల (ఘంటసాల) ప్రముఖ రేవు పట్టణం; అక్కడి నుండి కొడ్డూర, ధాన్యకటక వర్తక కేంద్రాలు ఎగుమతి, దిగుమతి వ్యాపారాన్ని నిర్వహించేవి. కృష్ణా-గోదావరీ నదుల నడుమ ఉన్న మైదానంపై, బెన్‌గోరా (Bengouron) అనే ప్రముఖ వర్తక కేంద్రం ఉన్నట్లు, టోలమీ **భూగోళం** పేర్కొంటున్నది. ఇది నేటి ఏలూరు పట్టణానికి సమీపం లోని పెద వేగి గ్రామం. వేంగీ నగరం, కళింగ, దక్షిణ కోసల, కర్ణాటక, తమిళ దేశాలతో, వర్తక మార్గాల వలన అనుసంధానం చేయబడింది.

బహుశః ధాన్యకటకంతోపాటు, అతి ప్రాచీన కాలం నుండి, ఇంచుమించు క్రీ.పూ. 3వ శతాబ్ది నుండి, ఆంధ్ర దేశం లోని అత్యంత ప్రసిద్ధమైన వర్తక కేంద్రాలలో భట్టిప్రోలు ఒకటైనట్లు కానవస్తుంది. ఇక్కడి బౌద్ధ చైత్య అవశేషాల్లో లభించిన శాసనాలు, లిపి పరిణామ పరిశీలన వలన, క్రీ.పూ. 3వ శతాబ్దికి చెందినవిగా, అశోకుని శాసనాలతో సమకాలీనమైనవిగా, బూలర్ పండితుడు నిర్ణయించాడు. అమరావతి వద్ద ఇటీవలి కాలంలో లభించిన అశోకుని స్తంభ శాసన శకలం, ఆ ప్రదేశాన్ని క్రీ.పూ. మూడో శతాబ్దికే అత్యంత ప్రముఖ వర్తక కేంద్రాల్లో ఒకటిగా నిర్ధారిస్తూంది. అశోకుడు తన శాసనాలను, శాసన స్తంభాలను జనసాంద్రత కలిగి, రాజకీయంగా, లేక వర్తకంలో ప్రసిద్ధికెక్కిన పట్టణాలకు చేరువగా చెక్కించిన సంగతి, చరిత్రకారులు గుర్తించిందే కనుక, ధాన్యకటక-అమరావతి, దానికి చేరువ లోని భట్టిప్రోలు, అత్యంత ప్రాచీన కాలం నుండి సుప్రసిద్ధమైన వర్తక కేంద్రాలు.

భట్టిప్రోలు వద్ద లభించిన శాసనాలు, అక్కడ గోఠి (గోష్ఠి) అనే వర్తక సభ ఏర్పడినట్లు, తెలియజేస్తున్నాయి. వర్తక గోష్ఠికి నాయకుడైన వాడే 'రాజ' బిరుదాన్ని ధరించి, ఆ పట్టణాన్ని పరిపాలిస్తుండడం వలన, ఆ నగరం పూర్తిగా వర్తకుల ఆవాస (Settlement) మని తోస్తుంది. అక్కడి పౌరులందరు గోష్ఠి సభ్యులైన వర్తకులే అయి ఉండొచ్చు. కౌటిల్యుని **అర్థశాస్త్రం**, బౌద్ధ వాఙ్మయం కేవలం వృత్తికి, జాతికి చెందిన క్షత్రియు, వర్తక రాజ్యాలను సూచిస్తున్నాయి. కనుక, పూర్తిగా వర్తకులే ఒక నగర రాజ్యాన్ని నిర్మించుకొన్నట్లు భావించడం, పొరబాటు కాబోదు.

"రాజకుబీరకు" డనే వ్యక్తి నామం, సంస్కృతం లోని "కుబేర" అనే వ్యక్తి నామానికి, సమానమైనదిగా తోస్తుంది. కుబేరుడు యక్షులకు రాజు; ధనానికి ప్రఖ్యాతి చెందిన దేవుడని, పురాణాలు వర్ణిస్తాయి. దీనిని బట్టి, అతి ప్రాచీన కాలం నుండి భట్టిప్రోలు యక్ష జాతి వారి నివాస

BRAOU

ప్రాంతమని, యక్షులు వర్తక వాణిజ్యాలను నిర్వహించే జాతికి చెందినవారని భావించొచ్చు. వారు వర్తక వాణిజ్యాల వల్ల అత్యధికంగా సంపన్నులైనట్లు, వారు హిందూ సమాజంలో చేరిపోయినప్పుడు, వారి దేవుడు ధనానికి ప్రధానమైన ఒక ఉప దేవుని (Semi-god) గా హిందూ దేవదేవతా వర్గంలో అతడు చేరిపోయాడని గ్రహించొచ్చు. ఖారవేలుని హాథిగుంఫ శాసనం త్రమిర (ద్రవిడ) జనులతో కూడిన సమాఖ్యను ఓడించి, అణచివేసినట్లు, అరువరాజు నిర్మించిన పిటిండ్ర నగరాన్ని నేలమట్టం చేసినట్లు, చెప్తుంది. ఈ పిటిండ్ర నగరం ఒక ప్రముఖ వర్తక కేంద్రమైనట్లు 'టోలమీ' పేర్కొన్నాడు. ఈ నగరం భట్టిప్రోలు కావచ్చునని, ఆచార్య బి.యస్. ఎల్. హనుమంతరావుగారు అభిప్రాయపడ్డాడు. కాని, రేపల్లెకు సమీపం లోని అరవపల్లి కావచ్చునని తోస్తుంది. అరువై జాతి ప్రధానంగా వర్తక వాణిజ్యాలను నిర్వహించేదిగా, మాలెకొండ (ప్రకాశం జిల్లా) గుహల్లోని పార్వతీ గుహలో అరువాళ కులానికి చెందిన నందా శెట్టి చెక్కించిన శాసనం తెలియజేస్తుంది. ఈ శాసనం భట్టిప్రోలు స్తూపం చెంత లభించిన రాజా కుభీరకుని శాసనం, అశోకుని శాసనాలకు ఇంచుమించు సమకాలీనమైంది. ఈ అంశాలు క్రీ.పూ. మూడో శతాబ్ది నాటికి ఆంధ్ర దేశ తీర ప్రాంతంలో వ్యవసాయ, పారిశ్రామిక, వర్తకాభివృద్ధి జరిగినట్లు స్పష్టం చేస్తాయి.

అమరావతి మహాచైత్యం వద్ద లభించిన శాసనాలు, నరసాల, కెవురూర, విజయపుర వంటి వర్తక స్థావరాలను పేర్కొంటాయి. వాటిలోని విజయపుర, తర్వాత కాలంలో ఇక్ష్వాకుల రాజధానిగా ప్రసిద్ధి కెక్కిన పట్టణమే కావచ్చు.

4.5.12 : వాణిజ్య వస్తువులు

శాతవాహన సామ్రాజ్య విస్తరణతో ఆంధ్ర దేశ తీర ప్రాంతంలో వ్యవసాయ విధానంలో గొప్ప పరిణామం సంభవించిందని, అది పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడిందని; ఆ రాజ వంశం పశ్చిమ దక్కన్‌లో విజయవంతంగా అనుసరించిన విధానాలతో, ఈ ఫలితాలను ఆంధ్ర దేశ తీర ప్రాంతంలో సైతం సాధించిందని, ఆచార్య అమిలాదే వివరించడానికి ప్రయత్నించారు. ఈ అభిప్రాయం పూర్తిగా హేతు విరుద్ధం. వ్యవసాయం, పరిశ్రమలు, ఆనాటి నైసర్గిక పరిస్థితుల అనుకూలం వలన ప్రజలు సాధించినవేనని, ఆ ఫలితాలపై రాజ్య వ్యవస్థలు, సామ్రాజ్య వ్యవస్థలు వృద్ధి పొందినాయేగాని, ప్రభుత్వాలు అవలంబించిన విధానాల వలన అవి వృద్ధి చెందలేదని, పైన వివరించడం జరిగింది. అంతే కాక, తీరాంధ్ర దేశం లోనికి శాతవాహనుల విస్తరణ, క్రీ.శ. రెండో శతాబ్ది తొలి పాదంలో జరిగింది. కాని, ఆంధ్ర దేశ తీర మైదానాలు వ్యవసాయాభివృద్ధిపై ఆధారపడి, క్రీ.పూ. మూడో శతాబ్ది నాటికే పారిశ్రామికాభివృద్ధిని సాధించి, వర్తక వాణిజ్యాలతో వృద్ధి చెందాయని, నిస్సంశయంగా చెప్పొచ్చు.

అర్థశాస్త్రంలో కౌటిల్యుడు తన పూర్వులు అభిప్రాయపడినట్లు, హిమాలయ ప్రాంతాలకు పోయే వర్తక మార్గాల కంటే, దక్షిణ భారతదేశం వైపు వచ్చే వర్తక మార్గాలు మరింత లాభదాయకమైనట్లు, తాను గుర్తించినట్లు వివరించాడు. హిమాలయ పర్వత ప్రాంతంలో మేలైన ఉన్ని వస్త్రాలు, తోళ్ళు, గుర్రాలు లభిస్తాయి. కాని, దక్షిణ దేశంలో విలువైన గవ్వలు, (గవ్వలను నాణేలుగా ఉపయోగించేవారు) వజ్రాలు, ముత్యాలు, వైడూర్యాలు, బంగారం సమృద్ధిగా లభిస్తాయి; ఆ వైపు వెళ్ళే మార్గం అపారమైన ఖనిజ సంపద కలిగి, జనసాంద్రత గల పట్టణాలను కలుపుతూ వెళ్ళేది. ఆ మార్గంపై రాకపోకలు కూడా విరివిగా జరుగుతాయని వివరించాడు. ఆ కాలంలో రాకపోకలకు ప్రధాన కారణం వర్తక వాణిజ్యాలేనని ప్రత్యేకించి వివరించ పని లేదు.

BRAOU

పెరిప్లస్, టోలమీ రచించిన **భూగోళం**, ప్లినీ రచించిన **ప్రకృతి చరిత్ర** (Natural History) కూడ, దక్కన్ పీఠభూమి, దక్షిణ భారత దేశం సహజ వనరులు కలిగి, వ్యావసాయిక, పారిశ్రామిక ఉత్పత్తులను అధికంగా కలిగి ఉన్నట్లు, వాటిలో అనేక విధాలైన వస్తువులను రోమన్ సామ్రాజ్యం దిగుమతి చేసుకుంటున్నట్లు, వివరించాయి.

పెరిప్లస్ బరిగాజ (బరుకచ్చ) రేవు పట్టణం నుండి, ఇటలీ, అరేబియా దేశాలలో ఉత్పత్తి అయ్యే మద్యం, రాగి, సీసం, తగరం, వంటి లోహాలు, పగడాలు, మేలైన వస్త్రాలు దిగుమతి అవుతున్నట్లు వివరిస్తూంది. వాటితోపాటు, నడుముకు ధరించే పట్టీలు, (బహుశ: పురుషులు అంగీ పైన ధరించేవి కావచ్చు) వెండి, బంగారు నగలు కూడ భారతదేశానికి దిగుమతి అవుతున్నట్లు వివరిస్తూంది. ఇవన్నీ విలాస వస్తువులే. వీటి వలన భారతదేశం ఎంతో ధనాన్ని వ్యయం చేస్తున్నదని భావించొచ్చు. వస్తు విశేషాలను మించి, భారతదేశం రోమ్ నుండి (రోమ్ సామ్రాజ్యం లోని భాగాల నుండి) గాయకులను, సౌందర్యవంతులైన స్త్రీలను దిగుమతి చేసుకొంటున్నట్లు, **పెరిప్లస్** వలన తెలుస్తూంది. మేలైన పరిమళ ద్రవ్యాలు, సుగంధ విలేపనాలు (ointments) కూడ, ఈ దిగుమతుల్లో చేరి ఉన్నాయి.

అయితే, భారతదేశం ఈ విలాస వస్తువుల దిగుమతి వలన వ్యయం చేసే ధనానికి అనేక రెట్లు, తన ఎగుమతి వలన సంపాదిస్తుందని స్పష్టంగా తెలియవస్తున్నది. భారతదేశం నుండి ఎగుమతుల్లో దంతం, దంతపు వస్తువులు, విలువైన రాళ్ళు (రత్నాలు, వజ్రాల వంటివి), పింగాణీ వస్తువులు (బహుశ: చైనా నుండి రోమన్ సామ్రాజ్యానికి ఎగుమతి అయ్యే వర్తకంలో భారతీయులు మధ్యవర్తులుగా ఉండడం వలన కావచ్చు), నూలు, సిల్కు వస్త్రాలు, దారం, వనమూలికలు విశేషంగా ఉండేవని, **పెరిప్లస్** వివరిస్తూంది. ఇంకా కలప, ముఖ్యంగా ఎబోనీ (నల్ల టేకు) ప్రధానమైన ఎగుమతి. రోమన్ సామ్రాజ్యంలో భవన నిర్మాణాలకు భారతదేశం నుండి దిగుమతి అయిన కలప, ప్రధానంగా ఉపయోగపడేది. కలపతోపాటు, గంధపు చెక్క మరొక ముఖ్య ఎగుమతి.

గోధుమ, వరి, వంటి ఆహార ధాన్యాలు, రోమన్ సామ్రాజ్యానికి విశేషంగా ఎగుమతి అయ్యేవని, **పెరిప్లస్** పేర్కొంటుంది. వీటితోపాటు నేయి, నువ్వుల నూనె, సామాన్య ప్రజానీకం ధరించడానికి అనువైన సాధారణ నూలు వస్త్రాలు, ఎగుమతుల్లో అత్యంత ప్రధానమైనవి. భారతదేశం నుండి జనసామాన్యానికి నిత్యావసర వస్తువులను దిగుమతి చేసుకుంటూ, ఈ వర్తకం వలన రోమన్ సామ్రాజ్యం భారతదేశంపై పూర్తిగా ఆధారపడిందని, స్పష్టమౌతుంది. ఆంధ్ర దేశంలో రోమన్ నాణేలు లభించిన ప్రదేశాలను అన్నిటిని కలిపి సమీక్షించినపుడు, కృష్ణా నదికి దిగువన, అనగా దక్షిణంగా, విశేషంగా వ్రత్తి పండించే ప్రాంతంలో, నేత పరిశ్రమ వృద్ధి చెందగా, నేత వస్త్రాలను అత్యధిక స్థాయిలో దిగుమతి చేసుకొంటూ, రోమ్ ఆ నాణేలను చెల్లించిందని, సహేతుకంగా ఊహించొచ్చు. ప్రతిష్ఠానపుర ప్రాంతం కూడ విశేషంగా నూలు వస్త్రాలను ఉత్పత్తి చేస్తూ, భరుకచ్చ నుండి ఎగుమతి చేస్తున్నట్లు, **పెరిప్లస్** వివరించింది. అలాగే విదిశా పట్టణం విలువైన దంతపు చెక్కడం వస్తువులు, నూలు వస్త్రాలను విశేషంగా ఉత్పత్తిచేసి, ఎగుమతి చేసేది.

టోలమీ దక్కన్ పీఠభూమిపై నర్మద, కృష్ణా నదులు ప్రవహించే రాతి నేలల్లో వజ్రాలు, రత్నాలు, ఇతర విలువైన రాళ్ళు విశేషంగా లభిస్తాయని పేర్కొన్నాడు. **పెరిప్లస్** ఈ ప్రాంతంలో ఇనుము - ఉక్కు పరిశ్రమ విశేషంగా వృద్ధి చెందినట్లు వివరిస్తూంది.

BRAOU

ఈ విధమైన దిగుమతులు రోమన్ సామ్రాజ్య సంపద అపారంగా భారతదేశం లోనికి ప్రవహించేట్లు చేశాయి. వెస్పాసియన్ చక్రవర్తి భారతదేశం నుండి దిగుమతి అవుతున్న విలాస వస్తువులి వాడకంపై ఆంక్షలను విధించాడు. రోమన్ చక్రవర్తులనే ఇటువంటి భయాందోళనలకు గురిచేసిన ఈ వాణిజ్యం ఏ స్థాయిలో జరిగేదో ఊహించొచ్చు. ప్లినీ తన ప్రకృతి చరిత్రలో భారతీయ ఉత్పత్తులు రోమన్ సామ్రాజ్యంలో వాటి వాస్తవ విలువ కంటే నూరు రెట్లు అధికంగా అమ్ముడవుతున్నట్లు, ఈ వర్తకం సామ్రాజ్య సుస్థిరతకు భంగం కాగలదని, తన రచనలో హెచ్చరించాడు.

4.6 : నాణేలు

శాతవాహన యుగం లోని విదేశీయ వాణిజ్యం పూర్తిగా ద్రవ్య ఆర్థిక విధానం (money economy) పై ఆధారపడింది. వస్తుమార్పిడి విధానం (barter) చాల వరకు నిరుపయోగమైంది. శాతవాహన సామ్రాజ్యం విస్తరించిన భూభాగంలో, ప్రధానంగా దక్కన్ పీఠభూమిపైన, నేటి ఆంధ్రప్రదేశ్‌లోను, అనేక ప్రదేశాల్లో లభించిన రోమన్ బంగారు నాణేలు, ఆనాటి విదేశీయ వాణిజ్యం సంపాదించిన సంపదకు నిదర్శనలు. ఈ బంగారంలో అధిక శాతం ఆనాటి ప్రజలు నిధులుగా నిక్షిప్తం చేయడమో, లేదా, కరిగించి ఆభరణాలుగా చేసుకోవడమో జరిగిందని, చరిత్రకారులు అభిప్రాయపడడం యుక్తంగా కనిపిస్తుంది. అమరావతి, నాగార్జునకొండ మహాచైత్యాల అవశేషాల్లో లభించిన శిల్ప ఫలకాలపై స్త్రీలు, పురుషులు అమితంగా ఆభరణాలు ధరించి ఉన్నట్లు చూడొచ్చు. అలాగే, ఆనాడు నిధులుగా నిక్షిప్తం చేసిన నాణేలే, మనకు అక్కడక్కడ త్రవ్వకాల్లో లభిస్తాయి. కనుక, ఈ రెండు విధాలుగా, అప్పటి బంగారం ఉపయోగపడిందని భావించడం యుక్తమే.

4.6.1 : రోమన్ నాణేలు

అయితే, విదేశీయ వాఙ్మయం రోమన్ సామ్రాజ్యం నుండి చేసుకున్న దిగుమతుల్లో, ముద్రించిన బంగారు నాణేలు, ముద్రించని బంగారం, వెండి చేరి ఉన్నట్లు తెల్పుతాయి. ఈ బంగారు నాణేలను భారతదేశం నుండి దిగుమతి చేసుకుంటున్న వస్తువుల కొరకు చెల్లించాల్సొచ్చిందిగా భావించడం యుక్తం. అలా కాని పక్షంలో, రోమన్ చక్రవర్తుల ప్రతిమలతో, రోమన్ అక్షరాలతో ఉన్న నాణేలు భారతదేశంలో చెలామణి అయినట్లు గ్రహించాల్సొస్తుంది. అది అసంగతం. నిత్య వ్యవహారాల్లో బంగారు నాణేలను ఉపయోగించడం అసాధారణం. అందుకొరకు, శాతవాహనులు, వారి సమకాలీన రాజ వంశాలు ముద్రించిన నాణేలు, అపారంగా లభిస్తున్నాయి. ఈ పరిశీలన వలన, లాభకరమైన వాణిజ్యం వలన సంపాదించిన బంగారాన్ని ఆభరణాలుగా నిరుపయోగం చేసి, దిగుమతి చేసుకొంటున్న విలాస వస్తువులకు బదులుగా రోమన్ సామ్రాజ్యానికి వారి నాణేలనే కాని, చెల్లించడం జరిగిందని, మొత్తం మీద ఈ విదేశీ వాణిజ్యంతో భారతదేశం పొందవలసినంత ప్రయోజనాన్ని పొందలేదని తోస్తుంది.

4.6.2 : దేశీయ నాణేలు

పైన వివరించినట్లు, రోమన్ వర్తకులతో జరిగిన వాణిజ్యం బంగారు నాణేల సాయంతో జరిగినా, దేశీయ వర్తకం జరిగేందుకు స్థానిక పరిపాలకులు హీన లోహాలను (base metals) ఉపయోగించి, నాణేలను ముద్రించారు. శాతవాహనులు రాగి, తగరం, సీసం, పోటీన్ (Potin) అనే ఒక మిశ్రమ లోహాన్ని ఉపయోగించి, నాణేలను ముద్రించారు. వారి నాణేలు ఉత్తరాన గంగా- యమునా మైదానం అంచుల నుండి, దక్షిణాన కృష్ణా తీరం వరకు, దక్కన్ పీఠభూమి, మాళ్వ, విదర్భ, తీరాంధ్ర

BRAOU

దేశాల్లోను, కర్ణాటకంలోను లభిస్తున్నాయి. శాతవాహనులతోబాటుగా, వారి సమకాలీన రాజ వంశాలు, మహారథి, మహాభోజ, బిరుదాలను ధరించినవారు, కర్ణాటకంలో "కుర" వంశీయులు, తీరాంధ్రంలో 'సద' వంశీయులు కూడ, స్థానిక వర్తక అవసరాల వలన నాణేలను ముద్రించి, చెలామణీ చేశారు. క్రమంగా ఈ స్థానిక రాజ వంశాలు శాతవాహనులకు లోబడి, వారి సార్వభౌమత్వాన్ని ఆమోదించడంతో, ఆయా ప్రదేశాల్లో సైతం చెల్లుబడి కావడానికి, శాతవాహనులు నాణేలను ముద్రించినట్లు కానవస్తుంది. వారి నాణేలపై కానవస్తున్న వివిధ చిహ్నాలు, వివిధమైన నాణేలు, బహుశః ఈ కారణం చేతనే జారీ అయినట్లు కానవస్తుంది.

అయితే, సామ్రాజ్యం యావత్తును ఒకే కేంద్ర ప్రభుత్వ పరిపాలన లోనికి తీసుకొని రావడం, శాతవాహనుల కాలంలో సాధ్యం కాలేదని, పైన వివరించడం .జరిగింది. అందుచేత, సామ్రాజ్య మంతటికి ఒకే ద్రవ్య విధానాన్ని అమలుచేయడం కూడ సాధ్యం కాలేదని, నిస్సంశయంగా చెప్పొచ్చు. వారి ప్రతినిధులుగా పాలించిన రాజకుమారులు, తమ తమ ప్రాంతీయ అవసరాలను అనుసరించి, స్వతంత్రంగా నాణేలను ముద్రించారు. అలాగే, స్థానిక పరిపాలకులు సైతం, వారి రాజ్య భాగాల్లో తమ నాణేలను ముద్రించి, ఉపయోగించారు. ఇటువంటి స్థానిక స్వాతంత్ర్యాన్ని శాతవాహన చక్రవర్తులు ఆమోదించిందేనని, పైన వివరించడం జరిగింది. విస్తరిస్తున్న వర్తక వాణిజ్యాలు నిరాటంకంగా జరగడానికి, అటువంటి నర్దుబాటైనట్లు గుర్తించడం, సహేతుకం.

4.6.3 : తొలి శాతవాహనుల నాణేలు

తొలి శాతవాహనుల నాణేలు ఇటీవలి కాలంలో కోటిలింగాల వద్ద లభించాయి. అవి ఒకవైపు ఏనుగు బొమ్మను, రెండవ వైపు ఉజ్జయినీ చిహ్నం, దానితోపాటు చంద్రరేఖ, స్వస్తిక, శ్రీవత్సలను, ఉప చిహ్నాలుగా కలిగున్నాయి. ఈ విధమైన నాణేలను శాతవాహన వంశీయులు తుది వరకు కొన సాగించారు. వారి సాంప్రదాయిక చిహ్నాలుగా వీటిని గుర్తించడం, సహేతుకం. తర్వాత పరిపాలించిన శాతవాహన రాజులు శాతవాహన విస్తరణ క్రమంలో, వివిధ ప్రాంతాల ద్రవ్య విధానాలను అనుసంధించి, నాణేలను విడుదల చేయడం వలన, వివిధమైన చిహ్నాలతో కూడిన నాణేలు వాడుక లోకి వచ్చాయి. శ్రీముఖుని కుమారుడైన శాతకర్ణి పై విధమైన చిహ్నాలతో పాటుగా, అనేక విధాలైన నాణేలను ముద్రించాడు. అవి ఉత్తరాన గంగా మైదానంపై ఉన్న కేశాంబి (నేటి అలహాబాద్ సమీపం లోని "కోసం") అనే గ్రామం నుండి, దక్షిణాన కృష్ణా తీరం లోని మాస్కి వరకు లభిస్తున్నాయి. ఈ నాణేలలో అధిక శాతం రెండవ శాతకర్ణి అనే రాజు విడుదల చేసినవిగా చరిత్రకారులు భావిస్తారు. కాని, రెండవ శాతకర్ణి అనే రాజు లేడని, పైన వివరించడం జరిగింది. ఈ రాజు నాణేలు దక్కన్ పీఠభూమిపై నెవాసా, మహేశ్వర్, నవ్దాతోలి, పౌనీలవద్ద జరిగిన త్రవ్వకాల్లోను, ఆంధ్రప్రదేశ్‌లోని కొండాపూర్ (మెదక్ జిల్లా), కర్ణాటక లోని మాస్కి, బ్రహ్మగిరి వద్ద జరిగిన త్రవ్వకాల్లోను లభించాయి. కళింగ, మహిషిక జనపదాలను పరిపాలించిన 'సద' వంశీయులు సింహం గుర్తుతో నాణేలను ముద్రించారు. ఆ చిహ్నం కళింగ జనపదానికి, బహుశః దక్షిణ కోసల, వింధ్య పర్వత పాదాల చెంత ఉన్న భూభాగాల నుండి వ్యాపించినట్లు తోస్తుంది. సింహం వాహనంగా కలిగిన వింధ్య వాసిని దుర్గ, ఈ సందర్భంలో జ్ఞప్తికి తెచ్చుకోదగింది.

శాతకర్ణి నాణేలపై కానవచ్చే మరొక ప్రధాన చిహ్నం మానవాకృతి (Homo). కొన్ని నాణేలపై అస్పష్టంగా ఉన్నా, కొన్నింటి మీద స్పష్టంగా అది స్త్రీ ప్రతిమగా, పద్మంపై నిలిచి ఉన్నట్లు, కొన్ని నాణేలపై చేతిలో తామరతూడు కలిగి ఉన్నట్లు కన్పిస్తుంది. ఈ ప్రతిమ శ్రీమహాలక్ష్మిగా

BRAOU

గుర్తించదగింది. అయితే, క్రీ.పూ. మొదటి శతాబ్ది నాటికి ఆమె శ్రీమహాలక్ష్మిగా రుపొందినట్లు నిర్ధారించడం కష్టం. 'సిరిమా' అనే యక్షిణి కాలక్రమాన శ్రీమహాలక్ష్మిగా రూపొందింది; ఈ ప్రతిమ సిరిమాదేవి శ్రీమహాలక్ష్మిగా పరిణమించే ఒక దశను సూచించేదని భావించొచ్చు.

మొదటి శాతకర్ణి తర్వాత అతని కుమారులు శాతవాహనుడు, సతసిరి అనేవారు, సామ్రాజ్యంలో చెరొక ప్రాంతంపై రాజప్రతినిధులుగా ఉంటూ, స్వతంత్రించారని తోస్తుంది. సతసిరి వేసిన నాణేలు ఉజ్జయినీ (పశ్చిమ మాళ్వ), త్రిపురి, విదిశ (తూర్పు మాళ్వ), హోషాంగాబాద్ మొదలైన ప్రదేశాల్లో లభించాయి. ఇటీవలి కాలంలో పౌనీ, కౌండిన్యపురి, త్రవ్వకాల్లో ఇతని నాణేలు కొన్ని ముందు వైపు చక్రం, రెండో వైపు 'ఉజ్జయినీ చిహ్నం కలిగినవి, లభించాయి.

4.6.4 : గౌతమీపుత్ర శాతకర్ణి నాణేలు

గౌతమీపుత్ర శాతకర్ణి తన పూర్వీకుల నాటి సామ్రాజ్య విస్తీర్ణాన్ని సాధించాడని, పైన వివరించడం జరిగింది. దక్కన్ పీఠభూమి అంతటి, నేటి తెలంగాణా ప్రాంతంలో, లోగడ శాతకర్ణి కాలంలో వలె, కొండాపూర్, పెద బంకూర్ (కరీంనగర్ జిల్లా) నెవాసా, భోకర్దాన్, తేర్, బ్రహ్మపురి మొదలైన ప్రదేశాల్లోను, ఉజ్జయినీ, కథియవాడ్ ప్రాంతాల్లో, ఆంధ్ర దేశ తీర ప్రాంతం లోని అమరావతి, చేబ్రోలు, రెంటాల మొదలైన ప్రాంతాల్లోను, గౌతమీపుత్ర శాతకర్ణి నాణేలు లభించాయి. అవి ప్రధానంగా ఏనుగు, వృక్షం, సిరిమా దేవత, గుర్రం చిహ్నాలు కలవి. వెనుక వైపు ఉజ్జయినీ చిహ్నం, లేదా ప్రాకారంలో వృక్షాన్ని కలిగినవి. మూడు అంతస్తులు, లేదా పది అంతస్తుల చైత్యాలు కొన్ని నాణేలపై కానవస్తాయి. మొత్తం మీద సాంప్రదాయికమైన శాతవాహన రాజ చిహ్నాలే, గౌతమీపుత్ర శాతకర్ణి నాణేలపై కానవస్తాయి.

. గౌతమీపుత్ర శాతకర్ణి నాణేలలో విశేషంగా చెప్పవలసినవి, జోగల్ తంబి నిధిలో లభించిన వెండి నాణేలు. వాస్తవంగా అవి శక క్షత్రపుడైన నహపాణునివి. గౌతమీపుత్ర శాతకర్ణి తన విజయ సూచకంగా పూర్వపు నహపాణుని రాజ్యంలో చెలామణి కావడానికి, వాటిని పునర్ముద్రించి విడుదల చేశాడు. వాటిపై ఒక వైపు నహపాణుని బొమ్మ, మరో వైపు క్రిందకి చూస్తున్న బాణం, వజ్రాయుధం కానవస్తాయి. ఈ నాణేలపై సాధారణంగా గౌతమీపుత్ర శాతకర్ణి నాణేలపై కానవచ్చే చిహ్నాలు కూడ కొంత వరకు కానవస్తాయి.

4.6.5 : గౌతమీపుత్ర శాతకర్ణి తర్వాతి శాతవాహనుల నాణేలు

గౌతమీపుత్ర శాతకర్ణి తర్వాత పరిపాలించిన, అతని కుమారుడైన వాసిష్ఠీపుత్ర పులుమావి, అతని సోదరులు విడుదల చేసిన నాణేలు, ఆ రాజుల పేర్లతో లభిస్తాయి. అవి ఆంధ్రప్రదేశ్ అంతట, మధ్య, పశ్చిమ దక్కన్ లోను విస్తారంగా లభించాయి. ఇతడు తన పూర్వీకుల చిహ్నాలను- ఏనుగు, మూడు అంతస్తుల చైత్యం, అశ్వం, సింహం-కలిగిన నాణేలను, వెనుక వైపు ఉజ్జయినీ చిహ్నం, పది లేక మూడు అంతస్తుల చైత్య చిహ్నాలతో ముద్రించాడు. ఇతని నాణేలు వింధ్య పర్వతాలకు ఆవల మాళ్వ, గుజరాత్‌లలో కనిపించవు.

4.6.6 : కడపటి శాతవాహనుల నాణేలు

గౌతమీపుత్ర యజ్ఞశ్రీ శాతకర్ణి తర్వాత పరిపాలించిన విజయ శాతకర్ణి నాణేలు, చాందా నిధిలో (తరహళ) మాత్రమే లభిస్తున్నాయి. అవి ఏనుగు బొమ్మను, వెనుకవైపు ఉజ్జయినీ చిహ్నాన్ని కలిగి

BRAOU

ఉన్నాయి. అతని తర్వాత రాజ్యాన్ని పరిపాలించిన చంద శాతకర్ణి, లేదా చంద్రశ్రీ నాణేలపై, గుర్రం, మూడు అంతస్తుల చైత్యం, వెనుక ఉజ్జయినీ చిహ్నం కానవస్తాయి. ఇతని నాణేలు తీరాంధ్రంలో మాత్రమే లభించాయి. చంద్రశ్రీ తర్వాత పురాణాలు పేర్కొంటున్న పులుమావి నాణేలపై, ఏనుగు, వెనుక వైపు ఉజ్జయినీ చిహ్నం కానవస్తాయి. ఈతని నాణేలు చాందా (తరహళ) నిధిలో మాత్రమే లభించాయి.

పురాణాలు పేర్కొనని కొందరు రాజులు, శాతకర్ణి నామాంతం కలిగిన వారు, ముద్రించి విడుదల చేసిన నాణేలు, ఏనుగు, ఉజ్జయినీ చిహ్నం కలిగినవి కొన్ని లభిస్తున్నాయి. వాటిలో రుద్ర శాతకర్ణి నాణేలు అమరావతి, గుడివాడ, ఖమ్మం వద్ద, దక్షిణంగా కాంచీపురం, పశ్చిమంగా బ్రహ్మపురి వద్ద లభించాయి. శక శాతకర్ణి నాణేలు తీరాంధ్ర దేశం లోను, కరీంనగర్ జిల్లాలోని వెద బంకూర్ త్రవ్వకాల లోను, బ్రహ్మపురి వద్ద లభించాయి. కర్ల శాతకర్ణి నాణేలు చాందా నిధిలోను, తీరాంధ్ర దేశం లోను లభిస్తున్నాయి. కుంభ శాతకర్ణి నాణేలు కేవలం తరహళ నిధిలో మాత్రమే లభిస్తున్నాయి. ఈ రాజుల నాణేలు అధికంగా తెలంగాణా ప్రాంతంలో లభిస్తుండడాన, వీరు ఈ ప్రాంతంలో పరిపాలించినవారని, దూర ప్రాంతాల్లో బ్రహ్మగిరి, కాంచీపురం వద్ద వీరి నాణేలు వర్తక వ్యవహారాల్లో చేరవేయబడినవిగాను, భావించొచ్చు.

4.7 : సంగ్రహంగా

శాతవాహన సామ్రాజ్య స్థాపనకు దారితీసిన పరిస్థితుల్లో ఆర్థికాభివృద్ధి మూలమైంది. సుమారు అయిదు వందల సంవత్సరాలకు పూర్వం నుండి ఇనుము వాడకం వలన నదీ మైదానాలపై జనావాసాలను ఏర్పర్చుకొన్న జాతులు, వ్యావసాయికమైన అభివృద్ధిని, ఆర్థిక పటిష్ఠతను సాధించగలిగాయి. అటువంటి జనపదాల్లో గోదావరీ నదీ మైదానంపై ఆంధ్ర జాతీయులు నెలకొల్పిన అశ్మక, ముళక, జనపదాలు అగ్రగాములైనాయి. వారు ఇతర జనపదాలను జయించి లోబర్చుకోడానికి, ఈ ఆర్థిక ప్రాబల్యం చాల దోహదం చేసింది.

అయితే, క్రీస్తు శకారంభ కాలంలో (క్రీ.పూ. 27), ఆంధ్ర జాతీయులైన శాతవాహనులు రోమన్ సామ్రాజ్యంతో వర్తక వాణిజ్యాలను నిర్వహించడాన్ని ప్రారంభించారు. వర్తక వాణిజ్యాల అభివృద్ధికి పరిశ్రమలు మూల కారణం. వ్యవసాయాభివృద్ధి పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడిందని, అది విదేశ వాణిజ్యానికి వీలు కల్పించిందని, సులువుగా గ్రహించొచ్చు. ఈ పరిణామం మరింతగా ఆర్థికాభివృద్ధికి, రాజకీయ ప్రాబల్యానికి మార్గాన్ని సుగమం చేసింది.

శాతవాహన సామ్రాజ్యం కేంద్రీకృతాధికారాన్ని కలిగినట్లు భావించ రాదు. అనేక రాజ్యాలు వారి సార్వభౌమత్వాన్ని అంగీకరించాయి. కాని, శాతవాహనులు ఆ రాజ్యాలన్నిటిని తమ పలుకుబడి లోనికి తెచ్చుకొని, ప్రత్యక్షంగా పరిపాలించ లేదు. వారి సామంతులైన 'సద' వంశీయులు, 'కుర' వంశీయులు, తమ నాణేలను చెలామణీ చేసుకునేందుకు శాతవాహనులు అంగీకరించారు. అంతే కాక, సువిశాల సామ్రాజ్యంలో రాజ వంశీయులైన రాకుమారులను ప్రతినిధులుగా నిల్పి, స్థానిక పరిపాలనలో వారు తగినంత స్వేచ్ఛగా పరిపాలించేందుకు అవకాశాలను కల్పించారు. అవసరాలకు అనుగుణంగా ఈ రాజ ప్రతినిధులు సైతం, స్వయంగా తమ పేర్లతో నాణేలను ముద్రించి, చెలామణీ చేయడాన్ని అనుమతించారు.

BRAOU

విదేశీ వాణిజ్యం సమాజంలో ధనవంతులైన వర్తక వర్గాన్ని ఏర్పర్చింది. దాని వలన కలిగిన ప్రోత్సాహంతో, వృత్తి కళాకారులు కూడ సంపన్నులై, తమ తమ వృత్తులను సహకార ప్రాతిపదికపై నిర్వహించుకొనేవారు. వంశపారంపర్యంగా సంక్రమించే వృత్తి సంఘాలలో సభ్యత్వం వలన, వారికి లభిస్తున్న ప్రతిఫలం వలన, వృత్తి సంఘాలు పటిష్ఠమై, క్రమంగా కులాలుగా, కుల కట్టుబాట్లతో ఏర్పడి, బలపడసాగాయి.

4.8 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. శాతవాహనుల రాజనీతిని, సామ్రాజ్య విధానాన్ని సమీక్షించండి.
2. శాతవాహనుల పరిపాలనా విధాన ప్రధాన అంశాలను పరిశీలించండి.
3. శాతవాహన యుగంలో ప్రజల ఆర్థిక స్థితిగతులను విశ్లేషించండి.
4. శాతవాహన యుగం నాటి విదేశీయ వాణిజ్యాభివృద్ధిని తెల్పండి.
5. శాతవాహనుల నాణాలను గూర్చి వివరించి, అవి చరిత్ర అధ్యయనానికి ఎలా తోడ్పడతాయో వివరించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. శాతవాహన పరిపాలనా విధానాన్ని తెలుసుకోడానికి గల సాక్ష్యాధారాలెవ్వి?
2. శాతవాహనుల నాటి వ్యవసాయాభివృద్ధిని సమీక్షించండి.
3. శాతవాహనుల వృత్తులు, వృత్తి సంఘాల గూర్చి తెల్పండి.
4. శాతవాహనుల నాటి ప్రసిద్ధ వర్తక కేంద్రాలు, మార్గాలను తెల్పండి.
5. రోమన్ నాణేలు శాతవాహనుల నాటి ఆర్థిక వ్యవస్థలో ఎట్టి పాత్రను వహించాయి?

BRAOU

4.9 : ఉపయుక్త గ్రంథాలు

1. Hanumantha Rao, B.S.L. : **The Age of Satavahanas**, Hyderabad, 1976
2. Majumdar, R.C., & Pusalkar, A.D. (Ed.) : **History and Culture of Indian people, Vol. II, The Age of Imperial Unity**, Bombay, 1951.
3. Mirashi, V.V. : **The History and Inscriptions of the Satavahanas and Western Kshatrapas**, Bombay, 1981.
4. Ray, Amita. : **Life and Art of Andhra Desa**, Delhi, 1975.

5. Satyanarayana, K. : **A Study of the History and Culture of the Andhras, Vol. I,** Delhi, 1975.

6. Sharma, R.S. : **Aspects of Political Ideas and Institutions in Ancient India,** Second Edition, Delhi, 1968.

7. Yazdani, G. (Ed.) : **The Early History of the Deccan,** (Reprint), New Delhi, 1982.

8. Hanumantha Rao, B.S.L. : ఆంధ్రుల చరిత్ర, గుంటూరు, 1982

9. Rama Rao, M., (Ed.) : శాతవాహన పంచిక, గుంటూరు, 1940

10. Sundara Rama Sastry, V. : దక్షిణ భారతదేశ చరిత్ర, తెలుగు అకాడమి ప్రచురణ, హైదరాబాద్, 1989.

రచయిత : డా.వి. సుందరరామ శాస్త్రి

BRAOU

భాగం-5 : సామాజిక, మత, సాంస్కృతిక పరిస్థితులు

విషయక్రమం

5.0 : ఉద్దేశ్యాలు

5.1 : పరిచయం

5.2 : సాక్ష్యాధారాల సమీక్ష

5.3 : సాంఘిక వ్యవస్థ - వర్ణాశ్రమ విధానం

5.3.1 : సామాజిక విస్తరణ

5.3.2 : సాంఘిక జీవనం

5.3.2.1 : కుటుంబ వ్యవస్థ

5.3.2.2 : సమాజంలో స్త్రీ స్థానం

5.3.2.3 : వినోదాలు

5.4 : మత-ధార్మిక పరిణామాలు

5.4.1 : ప్రాచీన జాతులు - మత విశ్వాసాలు

5.4.1.1 : ఆంధ్రులు - ఆర్యులు

5.4.1.2 : ఆంధ్రులు - ఇక్ష్వాకులు

5.4.1.3 : అగస్త్యుడు - ఆంధ్ర దేశం

5.4.1.4 : ఆంధ్ర దేశంలో వైదిక సంస్కృతి

5.4.2 : స్థానిక జాతులు - మత సంస్కృతులు

5.4.2.1 : జంతు-వృక్ష ఆరాధనలు

5.4.2.2 : మాతృ దేవతారాధన

5.4.2.3 : శివ పూజ

5.4.3 : బౌద్ధ మతం

5.4.3.1 : ఆంధ్ర దేశంలో బౌద్ధ ధర్మం

5.4.3.2 : ఆంధ్ర దేశంలో బౌద్ధ ధర్మానికి అశోకుని కృషి

5.4.3.3 : అంధక భిక్షువులు

5.4.4 : జైన మతం

5.4.4.1 : ప్రాచీనాంధ్ర దేశంలో జైన మత వ్యాప్తి

BRAOU

5.4.4.2 : శాతవాహనులు - జైన మతం
5.4.4.3 : కొండ కుందాచార్యుడు
5.4.4.4 : సింహనంది
5.5 : భాషాసారస్వతాల అభివృద్ధి
5.5.1 : ప్రాకృతం
5.5.2 : సంస్కృతం
5.5.3 : దేశి భాషాభివృద్ధి
5.6 : వాస్తు, శిల్ప కళల ప్రగతి
5.6.1 : పశ్చిమ కనుమల్లోని గుహాలయాలు
5.6.2 : గుంటుపల్లి గుహలు
5.6.3 : చైత్యాలు
5.6.3.1 : అమరావతి మహా చైత్యం
5.6.3.2 : ఇతర ప్రసిద్ధ మహా చైత్యాలు
5.7 : సంగ్రహంగా
5.8 : పరీక్ష నమూనా ప్రశ్నలు
5.9 : ఉపయుక్త గ్రంథాలు

5.0 : లక్ష్యాలు

శాతవాహన యుగానికి పూర్వం నుండి దక్షిణాపథంలో అనేక జాతులు జనావాసాలను ఏర్పర్చుకొని నివసిస్తున్నారు. వారితో మరిన్ని జాతులు వచ్చి చేరడంతో, తమ ఆచారవ్యవహారాలు, ఆరాధనా విధానాలతో, స్థానిక సంస్కృతుల ప్రభావంతో, ఆయా జాతులు సాంఘిక జీవనాన్ని, మత-ధార్మిక విశ్వాసాలను, ఆచారాలు, ఆరాధనా విధానాలను ఏర్పర్చుకొనే ప్రక్రియలో, సాంస్కృతిక సమైక్యతకు మార్గం ఏర్పడింది. ఈ అంశాలను అధ్యయనం చేయడం ఈ భాగం లక్ష్యం.

ఇంకో విధంగా చెప్పాలంటే, శాతవాహనుల నాటి సామాజిక వ్యవస్థ, సాంఘిక జీవనం, ప్రజల మత- ధార్మిక విశ్వాసాలు, ఆచారాలు, బౌద్ధ జైన మతాల వ్యాప్తి, ప్రభావం, భాషాసారస్వతాల అభివృద్ధి, వాస్తు, శిల్ప కళల విభిన్న రీతుల ప్రగతి, ఆదిగా గల అంశాలను, ఈ భాగాధ్యయనం ద్వారా క్షుణ్ణంగా తెలిసికోగల్గాలి. ఆంధ్రుల తొలి చరిత్రకు ఇవన్నీ మూలమై ఉన్నాయి.

5.1 : పరిచయం

భారతదేశ సాంస్కృతిక చరిత్రలో శాతవాహన యుగం ఒక ప్రధాన ఘట్టంతో సమకాలికమైంది. ప్రాచీన, అర్వాచీన సంస్కృతుల పరస్పర ప్రభావం, సమ్మేళన వలన, నూతన సాంఘిక-ధార్మిక వ్యవస్థ రూపుదిద్దుకొంటున్న ఘట్టమది. ఈ నూతన సంస్కృతిని నవ్య వైదిక (Neo -Vedic), లేక

BRAOU

పౌరాణిక హిందూ సంస్కృతిగా నిర్వచించొచ్చు. వైదిక సంస్కృతికి, అవైదిక ధర్మాలకు (non-Vedic religions) నడుమ, భక్తి విధానం నిల్చి, ఈ పరిణామాలను ఏర్పర్చింది. ఈ పరిణామంలో అనేక ప్రాక్తన తెగలు (Primitive tribes) సాంస్కృతిక స్రవంతిలో చేరిపోయి, తమ తమ సాంఘిక, మత, ఆరాధనా విధానాలను, విస్తృతమైన భారతీయ సంస్కృతిలో విలీనం చేశాయి. అలాగే, భారతదేశంలో రాజ్యాలను నెలకొల్పిన అనేక విదేశీయ ప్రజానీకాలు (foreign people) కూడ, భారతీయ సంస్కృతిలో సమ్మేళనం చెందాయి. సాంస్కృతిక పరిణామాలు ఆకస్మికంగా సంభవించవు; ఎవరి ఆలోచనల వలన రూపొందవు. వివిధ సంస్కృతుల నడుమ ఏర్పడే అవగాహన ప్రాతిపదికగా, సుదీర్ఘ కాలంలో క్రమంగా రూపుదిద్దుకొంటాయి. ఈ విధంగా రూపొందిన విస్తృత భారతీయ సంస్కృతిని నవ్య వైదిక, లేక హిందూ సంస్కృతిగా వ్యవహరించడం యుక్తం. ఈ పరిణామాలను స్థూలంగా, ప్రాచీనాంధ్ర దేశంలో, శాతవాహన యుగంలో సంభవించినంతవరకు వివరించడం, ఈ భాగ లక్ష్యం.

5.2 : సాక్ష్యాధారాల సమీక్ష

భారతదేశ సాంస్కృతిక చరిత్రలో నవ్య వైదిక, (హిందూ) సాంఘిక, ధార్మిక జీవన విధానాలు, సుమారు క్రీ.పూ. అయిదో శతాబ్ది నుండి, క్రీ.శ. అయిదో శతాబ్ది వరకు, క్రమ పరిణామంలో రూపుదిద్దుకొన్నవి. క్రీ.పూ. ఒకటో శతాబ్ది తుది పాదం నుండి, క్రీ.శ. మూడో శతాబ్ది తొలి పాదం వరకు నిల్చిన శాతవాహన యుగం, ఈ పరిణామాలకు సమకాలికమైంది. కాని, ఈ పరిణామాలను భౌగోళికంగాను, కాలానుక్రమంగాను, శాతవాహన యుగానికి పరిమితంచేసి, అధ్యయనం చేయడం కష్టసాధనం.

శాతవాహన యుగం నాటి సాంఘిక, ధార్మిక పరిణామాల అధ్యయనానికి, ఆ యుగం నాటి శాసనాలు ప్రధాన సాక్ష్యాధారాలు. అయితే, అవి చాలా క్లుప్తమైనవి; సమగ్రంగా నాటి ప్రజా జీవితాన్ని గూర్చి వివరించవు. శాతవాహన సామ్రాజ్యం విలసిల్లిన భూభాగాలపై సమకాలీనంగా చెప్పకోదగినంత సారస్వతం ఉత్పన్నం కాలేదు. పురాణేతిహాసాలు, ధర్మశాస్త్రాలు ఈ అధ్యయనానికి ఉపయోగకరమైనవి; కాని, అవి దేశ, కాల పరిమితమైనవి కావు; విశేషించి, ఈ ప్రదేశంలో, ఈ కాలంలో ఏర్పడినవి కావు. అయితే, ధర్మసూత్రాల్లో కృష్ణ యజుర్వేదం లోని తైత్తిరీయ శాఖకు చెందిన ఆపస్తంభ ధర్మసూత్రం, దక్షిణ భారతదేశంలో ఉత్పన్నమైనదిగా పండితుల నిర్ణయం. ఈ సూత్రాన్ని అనుసరించే, కృష్ణ యజుర్వేద శాఖకు చెందిన బ్రాహ్మణులు, ఈ నాటికి దక్షిణ భారతదేశంలో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో విస్తృతంగా వ్యాపించి ఉన్నారు. ఈ ధర్మ సూత్రం క్రీ.పూ. అయిదో శతాబ్దికి చెందినట్లు, బూలర్, వింటర్నిట్జ్ పండితుల నిర్ణయం. క్రీ.పూ. అయిదో శతాబ్దిలో చిన్న చిన్న సామాజిక వ్యవస్థలు రాజ్యాలుగా పరిణామం చెందే స్థితిని, ఆపస్తంభ ధర్మసూత్రం ప్రతిబింబిస్తుంది. కనుక, దక్షిణ భారతదేశం లోను, ఆంధ్ర దేశం లోను, ప్రాచీన సాంఘిక జీవనానికి ప్రాతిపదికైన సైద్ధాంతిక (Theoretical) స్వరూపాన్ని, ఈ ధర్మసూత్రాల వలన తెలుసుకోవచ్చు.

ఈ ధర్మ సూత్రాలు ఆదర్శయుతమైన వ్యవస్థను గూర్చి ప్రబోధిస్తాయి. కాని, వాస్తవ స్వరూపాన్ని వివరించవు. వాస్తవమైన సాంఘిక వ్యవస్థను గూర్చి మతేతర (Secular) సారస్వతాన్నుండి అధ్యయనం చేయడం యుక్తం. అటువంటి కోవకు చెందిన గాథాసప్తశతి, ఈ సందర్భంలో చాల ప్రయోజనకరమైంది. గాథాసప్తశతి, సమకాలీన శాసనాలు తెలియజేసే సమాచారాన్ని, ధర్మ సూత్రాలు

BRAOU

వివరించే సైద్ధాంతిక స్వరూపంతో అనుసంధించడం, శాతవాహన యుగం నాటి సాంఘిక వ్యవస్థ, జీవన విధానాల వాస్తవ స్వరూపాన్ని గ్రహించడానికి సరైన విధానం.

5.3 : సాంఘిక వ్యవస్థ - వర్ణాశ్రమ విధానం

ప్రాచీన భారతదేశంలో సాంఘిక జీవనానికి ప్రాతిపదికైంది, వర్ణాశ్రమ విధానం. సమాజం లోని జనులు నాలుగు వర్ణాలకు చెంది ఉన్నట్లు, వ్యక్తి జీవితం నాలుగు ఆశ్రమాలు, అనగా దశలుగా ఏర్పడి ఉన్నట్లు, ఈ విధానం వర్గీకరిస్తుంది. అన్ని ధర్మసూత్రాల వలె ఆపస్తంభ ధర్మ సూత్రం, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలతో సమాజం ఏర్పడినట్లు వివరించి, "ఉగ్ర", "చండాల" అనే మరొక రెండు వర్ణాలకు చెందిన ప్రజానీకాన్ని కూడ పేర్కొంటుంది.

చతుర్వర్ణాల్లో బ్రాహ్మణులు అధ్యయనం, అనగా వేదవేదాంగాలను అభ్యసించడం; అధ్యాపనం అనగా ఆ విద్యలను బోధించడం; యజన, అనగా వైదిక క్రతువులను చేయడం, యాజన, అనగా వైదిక క్రతువులను చేయించడం; దాన, ప్రతిగ్రహాలు, అనగా దానం చేయడం, స్వీకరించడం అనే ఆరు విధాలైన విధులు కలిగినవారు. జీవ యాత్ర సవ్యంగా జరగనప్పుడు, వివిధ వర్ణాలకు చెందిన జనులు తమ వృత్తి ధర్మాలను అనుసరించడాన్ని, ఆపద్ధర్మంగా ధర్మ సూత్రాలు, స్మృతులు ఆమోదిస్తాయి. కాని, బ్రాహ్మణులు వర్తక వాణిజ్యాలు, వడ్డీ వ్యాపారం, వ్యవసాయం, వైద్య, ఆయుధ వృత్తులను అనుసరించడాన్ని, నిర్ద్వంద్వంగా నిషేధించాయి. వారు కేవలం తమ వృత్తి ధర్మానికి కట్టుబడి ఉండవలసిందేనని, సూత్రకారుల అభిమతం.

క్షత్రియులు ఆయుధ వృత్తిలో జీవించేవారు. ఆయుధాలను చేపట్టి పోరాటాలను చేయడం, ప్రజా సంరక్షణ, పరిపాలన, వారి విధులు. వైశ్యులు వ్యవసాయం, పశుపోషణ, వర్తక వాణిజ్యాలను అవలంబించేవారు. అన్ని విధాలైన చేతి వృత్తులు, కళలను (arts and crafts) జీవనోపాధిగా కలిగినవారు, శూద్రులు. వీరిలో శూద్రులు తప్ప, తక్కిన మూడు వర్ణాలు ఉపనయన సంస్కారం కలిగి, వేదాధ్యయనం చేయవలసిందిగాను, ఆ సంస్కారంతో వారు ద్విజులుగా గౌరవింపబడతారు. ఇది ధర్మ సూత్రాలు ఏర్పర్చిన సాంఘిక వ్యవస్థ స్థూలమైన స్వరూపం.

వ్యక్తి జీవితం బ్రహ్మచర్యం, గార్హస్థ్యం, వానప్రస్థం, సన్యాసం అనే నాలుగు ఆశ్రమాలు, ఏక దశలతో కూడి ఉన్నట్లు వివరించడం, వర్ణాశ్రమ విధానం లోని రెండో అంశం. ఈ విధమైన ప్రణాళిక ద్విజులకు మాత్రమే. వారు ఉపనయన సంస్కారంతో బ్రహ్మచర్యాశ్రమంలో ప్రవేశిస్తారు; వేదాధ్యయనం తర్వాత తమ వర్ణధర్మాలకు అనుగుణమైన విద్యలను అభ్యసిస్తారు. విద్యాభ్యాసంతో బ్రహ్మచర్యాన్ని విడిచి, వివాహంతో గృహస్థుగా గార్హస్థ్య ఆశ్రమంలో జీవిస్తారు. ఆ దశలో వ్యక్తులు తమ వర్ణ ధర్మానికి అనుగుణమైన జీవనోపాధితో కుటుంబ పోషణ చేసుకోడానికి, పుణ్య కార్యాలకు, ధర్మ నిర్వహణకు అవసరమైన ధనాన్ని సంపాదిస్తారు; భార్యాబిడ్డలతో సుఖంగా జీవిస్తారు. సంతానం పెరిగి పెద్దవారై, వారు గృహస్థ జీవితం ప్రారంభించిన తర్వాత, సంపాదన, సంసార జీవితం పట్ల అనురక్తిని వదులుకొని, భార్యతో సహా వనవాసం చేస్తూ, ఆధ్యాత్మిక చింతనతో జీవించడం వానప్రస్థం. ఆ తర్వాత కొంత కాలానికి భార్యను కూడ వదిలి, అన్ని బంధాలను తెగత్రెంచి, దేశాటనం చేస్తూ, ప్రజానీకానికి ధర్మ బోధ చేస్తూ జీవించడం, సన్యాసాశ్రమం.

BRAOU

ప్రజా జీవితం వైజ్ఞానికంగాను, ఆర్థికంగాను అభివృద్ధి చెంది, సౌకర్యవంతం కావడానికి, అధికోత్పత్తులు సాధించి, వర్తక వాణిజ్యాలను పెంపొందించి, రాజ్యం సుసంపన్నం కావడానికి, వర్ణాశ్రమ ధర్మాన్ని ఏర్పర్చడం జరిగింది. ఆ విధానాన్ని సంరక్షించి, సక్రమంగా నిర్వహించడమే రాజ ధర్మంగా, ధర్మసూత్రాలు, స్మృతులు నిర్దేశిస్తాయి. వివిధ వృత్తులకు చెందిన ప్రజలు "నికాయ", "నిగమ", "శ్రేణి", "గోష్ఠి" మొదలైన పేర్లతో సంఘాలుగా ఏర్పడి, తమ వ్యవహారాలను సమిష్టిగా, పరస్పర సహకారంతో తీర్చుకొని జీవించవలసిందిగా, మను, యాజ్ఞవల్క్య స్మృతులు బోధించాయి. ఆ సంఘాలు ఏర్పర్చుకొనే నిబంధనలు, కట్టుబాట్లను, వారికి సంబంధించిన న్యాయ చట్టాలు (legal codes) గా గుర్తించి, సంరక్షించవలసిందిగా, సూత్ర, స్మృతి వాఙ్మయం రాజులను, రాజ్య వ్యవస్థను ఆదేశిస్తుంది. శాతవాహన యుగం నాటి శాసనాలు, అటువంటి వర్తక, వృత్తి సంఘాలను పేర్కొంటాయి. -

పటిష్ఠంగా వృత్తి సంఘాలు ఏర్పడి, స్వపరిపాలనాధికారంతో పనిచేయడం వలన, వివిధ వృత్తులు, వర్తక వాణిజ్యాలకు చెందిన ప్రజలు, తమతమ వృత్తి కౌశలాన్ని పెంపొందించుకోవడం, దానిని వంశపారంపర్యంగా తమ సంతతికి అందించడం, సాధ్యమైంది. అవి నిరంతరంగా తమ వృత్తులను కొనసాగించుకొంటూ, అధికోత్పత్తిని, ఆర్థికాభివృద్ధిని సాధించాయి. అయితే, వంశపారంపర్యంగా సంక్రమించే వృత్తి కౌశలం, వృత్తి సంఘాల సభ్యత్వం వలన, జన్మ చేతనే సిద్ధించే సాంఘిక గుర్తింపు కూడ ఏర్పడింది. వృత్తి ధర్మాలు (లేదా వర్ణ ధర్మాలు) కుల ధర్మాలైనాయి.

సమాజంలోని వివిధ కులాలు తమ కుల ధర్మాలను సక్రమంగా నిర్వర్తించనపుడు, రాజ్య వ్యవస్థ ఆర్థికంగా దెబ్బతింటుంది. అందుచేత, ధర్మశాస్త్ర గ్రంథాలు రాజ వర్ణాశ్రమ ధర్మాన్ని సంరక్షించాలని, అదే రాజ ధర్మమని స్పష్టపరుస్తాయి. సమాజంలోని వ్యక్తులు తమ కుల వృత్తినే అనుసరించాలని, తమ కులం లోని కన్యను వివాహం చేసుకొని, సంతానాన్ని కనవలసిందని శాసిస్తాయి. అటువంటి సంతతి మాత్రమే ఉత్తమ సంతతి, పితార్జితమైన సంపదకు వారసత్వ హక్కులు కలదని, వేర్వేరు కులాలకు చెందిన స్త్రీ, పురుషుల సంతతి, తల్లితండ్రుల కులాలకు కాక, వేరే నీచ వృత్తులను అవలంబించే సంకీర్ణ జాతుల (mixed castes), లేదా సంకీర్ణ కులాలకు చెందుతారని ఆ వాఙ్మయం నిర్దేశించింది. ఆ విధంగా "ఉగ్ర" అనే కులం (జాతి) క్షత్రియునికి, శూద్ర స్త్రీ వలన జన్మించినట్లు, వైశ్యునికి, శూద్రస్త్రీ వలన జన్మించినట్లు, ధర్మ శాస్త్ర గ్రంథాలు వివిధంగా పేర్కొంటాయి. అదే విధంగా, "చండాల" జాతి, శూద్రుని వలన బ్రాహ్మణ స్త్రీకి జన్మిస్తాడని, ఈ వాఙ్మయం పేర్కొంటుంది. అయితే, ఆపస్తంభ ధర్మ సూత్రం సంకీర్ణ జాతులను గూర్చి, ఈ రెండు కులాలు ఆ విధంగా ఉత్పన్నమయ్యేవని మాట్లాడదు. "ఉగ్రుడు" కోపోద్రేక స్వభావం కలిగి, శమదమాదులతో కూడిన, సంస్కారంలేని వాడని ఆపస్తంభుని అభిప్రాయంగా, "ఉజ్జ్వలా" అనే వ్యాఖ్యాన గ్రంథాన్ని రచించిన హరదత్తుడు వివరించాడు. అప్పటికి ఇంకా అనేక ఆటవిక జాతులు తగినంతగా ఉదాత్తమైన సంస్కారాన్ని పొందలేదని, ఈర్ష్యాద్వేషాలతో, పగలు, పట్టింపులతో సంఘర్షణలకు పూనుకొనేవారని, అటువంటి వారిని ఆపస్తంభ ధర్మసూత్రం "ఉగ్రు" లని వ్యవహరించిందని భావించడం, సహేతుకం. చండాల జాతులు మరింత అనాగరిక దశలో సభ్య సమాజానికి దూరంగా ఉండే ఆటవికులు.

నాసిక్ ప్రశస్తి గౌతమీపుత్ర శాతకర్ణి చాతుర్వర్ణ సాంకర్యాన్ని నిరోధించినట్లు చెప్పడం, పైన పేర్కొన్న ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను ఆశించి చేసిందేనని గ్రహించడం, యుక్తం. శాతవాహనులు బ్రాహ్మణ కులానికి చెందినవారని, ఆ కారణం చేతనే వారు వైదిక ధర్మాన్ని అత్యంతాసక్తితో ఆచరించారు, వర్ణాశ్రమ ధర్మాన్ని సంరక్షించారనే అభిప్రాయాలు హేతుబద్ధం కాదని, పైన నిర్ణయించిన విషయం జ్ఞప్తిలో ఉంచుకొనవలసుంది.

BRAOU

5.3.1 : సామాజిక విస్తరణ

శాతవాహన యుగం లోని సాంఘిక పరిణామాల్లో గుర్తించాల్సిన, ఆసక్తికరమైన అంశం, శక, యవన, పహ్లవ, మొదలైన విదేశీయ జాతులు, దేశం లోని అనేక ఆటవిక జాతులు, సాంస్కృతిక జీవన స్రవంతిలో చేరిపోవడం.

భారతదేశంలో పలు ప్రాంతాల్లో నివసిస్తున్న ఆటవిక జాతులు కాలక్రమంగా సాంస్కృతిక పరిణామాలను చెందడం, వారి పరస్పర ప్రభావంతో భారతీయ నాగరికతా, సంస్కృతులుగా పరిగణించదగిన జీవన విధానాలు, సాంప్రదాయాలు రూపొందడం, చరిత్ర ప్రసిద్ధమైన విషయం. ఇలువంటి పరిణామాలు ఉత్తర భారతదేశం నుండి దక్షిణ భారతదేశానికి విస్తరించడం, ఆపస్తంభ ధర్మసూత్ర కాలం, ముమారు క్రీ.పూ 5వ శతాబ్దినాడే జరుగుతుండడం, గుర్తించడం జరిగింది. శాతవాహన యుగంలో ఈ పరిణామాలు మరింతగా శక్తివంతమై, సామాజిక విస్తరణను కొనసాగించాయి.

మను స్మృతి పౌండ్రక, ఉడ్ర, ద్రవిడ, కాంభోజ, యవన, శక, పారద, పల్లవ, చీన, కిరాత, దరద, ఖశ, మొదలైన జాతులు వాస్తవంగా క్షత్రియు జాతులై ఉండి, వైదిక సంస్కృతిని వదిలివేసి, బ్రాహ్మణులతో సంబంధాన్ని పోగొట్టుకొనడంచేత, వృషలురు (అనగా కులం లేనివారు) అయినట్లు వివరిస్తూంది. వీరిలో యవన, శక, పహ్లవ (పల్లవ) జాతులు నిశ్శంశయంగా విదేశీయులైనవి. వారిని ధర్మశాస్త్ర కర్తలు వైదిక వర్ణ వ్యవస్థ లోని వారని భావించడం, స్పష్టంగా అప్పటే సామాజిక పరిణామాన్ని సూచిస్తుంది. ఈ జాతులు, దేశం లోని కొన్ని ప్రాక్తన జాతులు, పౌండ్రక, ఓడ్ర, కాంభోజ మొదలైనవి, సామాజిక పరిణామాల్లో వైదిక సంస్కృతికి చేరువగా వస్తున్నట్లు, అందుచేతనే **మనుస్మృతి** ఆ విధంగా వివరించిందని గుర్తించొచ్చు.

మూళ్య, గుజరాత్, అపరాంత ప్రాంతాల్లో పరిపాలించిన శకక్షత్రపులు, వారి సహచరులైన పహ్లవ, ఆభీర, మొదలైన జాతులు, భారతీయమైన వ్యక్తి నామాలను ధరించారు; బ్రాహ్మణులకు విరివిగా దానధర్మాలు చేశారు; అనేక వ్రతాలను అనుష్ఠించి, తీర్థయాత్రలను చేశారు. ఈ విషయాలను వివరిస్తూ, వారు తమ శాసనాలను సంస్కృత భాషలో చెక్కించారు. ఈ దశలో **మనుస్మృతి** వారిని వాస్తవంగా క్షత్రియులై, ధర్మచ్యుతి చేత వృషలులైనట్లు భావించడంలో, వారిని భారతీయులుగా గుర్తించింది.

పైన పేర్కొన్న దేశీయ జాతుల్లోని "ద్రవిడ", దక్షిణాపథం లోని, దక్షిణ భారతదేశం లోని ప్రజానీకాలన్నిటిని చేర్చుకొన్నదిగాన, వారిలో ఆంధ్రులు కూడ చేరి ఉన్నట్లు భావించడం సముంజసం. శాతవాహనులు, వారి తర్వాత ఆంధ్ర దేశాన్ని పరిపాలించిన రాజ వంశాలు, విరివిగా వైదిక క్రతువులను నిర్వహించి, బ్రాహ్మణులను దక్షిణలతో సత్కరించారు. కనుక, ఈ సామాజిక విస్తరణ సుదీర్ఘ కాల ప్రక్రియగా ఆంధ్ర దేశంలో జరిగిందని గ్రహించొచ్చు.

ఈ విధమైన సామాజిక విస్తరణ, నాటి వర్ణ వ్యవస్థ చాలా సరళంగా ఉన్నట్లు సూచిస్తుంది. శాతవాహనులు, వారి అనంతర రాజ వంశాలు, చాతుర్వర్ణ వ్యవస్థను సంరక్షించినట్లు తమ శాసనాల్లో వర్ణించుకొన్నా, ఆ వ్యవస్థ సరళంగా లేనిదే, పైన పేర్కొన్న సామాజిక పరిణామాలు సాధ్యం కావు. **బృహత్కథ** వర్ణాంతర వివాహాలను, బ్రాహ్మణ కన్యలను ఇతర వర్ణాలకు చెందిన వారు వివాహం చేసుకోవడాన్ని, తరచుగా పేర్కొంటుంది. శాతవాహన రాజులు వాసిష్ఠ, మారర, గౌతమ మొదలైన బ్రాహ్మణ గోత్రాలకు చెందిన స్త్రీలను వివాహం చేసుకొన్నట్లు, వారిలో కొందరు రాజులు

BRAOU

దరించిన మాతృ నామ సంజ్ఞ (matronymics) వలన తెలుస్తుంది. ఈ గోత్రాలు ఉత్తర భారతదేశం నుండి వ్యాపించిన వైదిక సంస్కృతిని అవలంబించిన స్థానిక జాతులు, లేదా వారి లోని పూజారి వర్గం వేదాధ్యయనం, వైదిక కర్మకాండననుసరిస్తూ, వారి గురు పరంపరలో వీటిని ధరించారని, చరిత్రకారుల అభిప్రాయం. శక, యవన, పహ్లవ జాతులు, అప్పటికే ఇంకా ఆయుధ వృత్తులను, రాజ్య పరిపాలనను అవలంబిస్తూ ఉండడం చేత, ధర్మశాస్త్ర కర్తలు వారిని క్షత్రియ వర్ణంగా పరిగణించారు. ఇతిహాస వాఙ్మయం వసిష్ఠ- విశ్వామిత్ర సంఘర్షణలో, విశ్వామిత్రుడు బలాత్కారంగా కామధేనువును స్వాధీనపర్చుకొనబోగా, ఆ ధేనువు, స్వీయ రక్షణకు శక, యవన, పహ్లవ సేనలను సృష్టించినట్లు వివరిస్తూంది. ఆ జాతులు హిందూ సమాజంలో ప్రవేశించే తరుణంలో, వసిష్ఠ, విశ్వామిత్ర గోత్ర శాఖలకు చెందిన పురోహిత వర్గం, వారికి అనుగుణమైన అవకాశాల ననుమతించిందని, ఆ జాతులు ఆ గోత్రాలను స్వీకరించారని, ఆచార్య వి.యస్. పాఠక్ చాలా సహేతుకంగా వివరించాడు.

ఒక వైపు వృత్తి సంఘాలు కులాలుగా పరిణమిస్తూ, వర్ణ విధానం జాతి విధానంగా ప్రబలమౌతుంటే, మరొక వైపు సమాజం నిరభ్యంతరంగా నూతన జాతులను, తెగలను విలీనం చేసుకుంటూ, విస్తరిస్తూండడం చాల ఆసక్తికరమైన విషయం.

5.3.2 : సాంఘిక జీవనం

భారతదేశంలో అతి ప్రాచీన కాలం నుండి వస్తున్న గ్రామీణ వ్యవస్థ, శాతవాహన యుగం లోని సాంఘిక జీవనానికి, పరిపాలనా వ్యవస్థకు నైతం, ఆధారమైంది. **గాథాసప్తశతి** "గ్రామణి" అనే గ్రామ పెద్దలను ప్రస్తావిస్తుంది. గ్రామం లోని కర్షక కుటుంబాలు, వివిధ వృత్తులకు చెందిన ప్రజానీకం, గ్రామణి నాయకత్వం క్రింద ప్రవర్తించేవారు. కొన్ని సందర్భాల్లో కొన్ని గ్రామాలు కలసి, "గుల్మ" అనే ప్రాదేశిక విభాగంగా ఏర్పడేవి. అటువంటి సమయాల్లో, గ్రామ పెద్దల నాయకత్వం మరింత విస్తృతమై, వారిలో ప్రబలుడైనవాడు స్థానిక పరిపాలకునిగా, చిన్న రాజ్యాన్ని స్థాపించుకొనగల్గిన స్థితిని పొందే వీలు ఉన్నట్లు తోస్తుంది. గ్రామాధికారి పదవి, అన్ని ఇతర వృత్తుల వలె, వృత్తి సంఘాల సభ్యత్వం వలె, వంశపారంపర్యమైనట్లు గుర్తించడం, యుక్తం. వంశానుగతమైన పదవుల వలన, గ్రామాధికారులు ప్రాబల్యాన్ని పొందడం, భూస్వామ్య వ్యవస్థకు (feudalism) దారితీసిందనొచ్చు.

శాతవాహన యుగం నాటి శాసనాలు, బౌద్ధ జాతక కథా వాఙ్మయం, ఆనాటి గ్రామాలు కర్షక కుటుంబాల తోను, అనేక గ్రామీణ వృత్తులను అవలంబించే వారి తోను కూడి, స్వయంసమృద్ధమైనట్లు, స్పష్టపరుస్తాయి. ఈ వృత్తి జీవనుల్లో హోలిక (వ్యవసాయదారులు), గధిక (సువాసన ద్రవ్యాలను తయారుచేసేవారు; వాటితో వర్తకం చేసేవారు), వధక (వడ్రంగులు), కోలిక (నేత పనివారు), తిలపీసక (నూనె గానుగలవారు), కమర (ఇనుప పనివారు), కులలిక (కుమ్మరులు), ధన్నిక (ధాన్య వర్తకులు), వస్సకర (వెదురు పనివారు), తరచుగా కానవస్తారు.

5.3.2.1 : కుటుంబ వ్యవస్థ

గాథాసప్తశతి వలన ఆనాటి సమాజం పితృస్వామ్యం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థలపై నిల్చి ఉన్నట్లు తెలియవస్తుంది. అమరావతి మహాచైత్యం వద్ద, పశ్చిమ కనుమల్లోని గుహాలయాల్లోను, అసంఖ్యాకంగా కానవచ్చే శాసనాలు, ఈ అభిప్రాయాన్ని బలపరుస్తాయి. ఈ శాసనాలు సాధారణంగా **గహపతులు** (గృహపతులు) అనగా, వ్యవసాయ కుటుంబాల్లో పెద్దలు, నిగమ సభల ముఖ్యులు, తమ

BRAOU

సోదరులు, కుమారులు, కుమార్తెలు, సోదరుల కుమారులు, కుమార్తెలు, మనుమలు, మనుమరాండ్రు మొదలైనవారితో కలసి, బౌద్ధ తీర్థాలను సందర్శించి, అక్కడి బౌద్ధ సంఘాలకు చేసిన దానధర్మాలను తెలుపుతాయి. ఈ శాసనాలు అనాటి కుటుంబాలు కొన్ని తరాలుగా వ్యవసాయ భూములను, వర్తక వ్యవహారాలను సమిష్టిగా ఉంచుకొని, నిర్వహించే ఉమ్మడి కుటుంబాలుగా కానవస్తాయి. ఆనాటి వర్తక వాణిజ్య అవసరాలకు, వ్యవసాయాన్ని నిర్వహించడానికి ఇటువంటి కుటుంబ వ్యవస్థ ఉపకరించిందని, ఆర్థికాభివృద్ధికి దోహదం చేసిందని భావించొచ్చు.

కుటుంబానికి అందరిలో వృద్ధుడైన (Senior) వ్యక్తి, పెద్దగా ఉండేవాడు. ఇందులో కొంత వ్యక్తి స్వేచ్ఛ లోపించినా, సహకార భావంతో ఆర్థికాభివృద్ధికి, కుటుంబ సభ్యుల జీవితాలకు అవసరమైన భద్రత ఏర్పడినాయి.

5.3.2.2 : సమాజంలో స్త్రీ స్థానం

కుటుంబాలకు పురుషులు నాయకత్వం వహించున్నా, స్త్రీలకు గౌరవం, స్వేచ్ఛ ఉన్నాయి. వారు తమ కుటుంబ సభ్యులతో కలసి, తీర్థ యాత్రల్లో, దానధర్మాల్లో పాల్గొన్నారు. కుటుంబ పెద్ద గతిస్తే, అతని భార్యకు ఆ పెద్దరికం సిద్ధించేదని, కొన్ని శాసనాల వలన ఊహించొచ్చు. శాతవాహన రాణుల్లో నాగానిక, బాలశ్రీ మాత్రమే కాక, మరి కొందరు రాజ కుటుంబాలకు, ఉన్నత వర్గాలకు చెందిన కుటుంబాల్లో కూడ, స్త్రీలు తమంతట తామే దాన శాసనాలిచ్చిన సందర్భాలు కానవస్తాయి. వారు సాధారణంగా వ్యవసాయ, వర్తక కుటుంబాలకు చెందినవారే. ఆపస్తంభ ధర్మ సూత్రాలు కుమారులతోపాటు కుమార్తెలు కూడ తండ్రి ఆస్తిలో సమాన భాగాలను పొందడానికి అర్హులుగా నిర్ణయించాయి.

స్త్రీలు స్వయంగానో, లేక కుటుంబ పెద్దలుగానో ఇచ్చిన దాన శాసనాలను లెక్కించిన శ్రీ. కె. గోపాలచారి, అమరావతి శాసనాలు 143లో 72, (పశ్చిమ కనుమల) వద్ద 30 లో 19, నాసిక్ వద్ద 29లో 16 ఉన్నట్లు నిర్ణయించాడు. ఈ శాసనాలు స్త్రీలకు స్వతంత్రమైన ఆర్థిక ప్రతిపత్తి అసాధారణ విషయం కాదని, అది సాంప్రదాయికమైన ఆచారమేనని స్పష్టపరుస్తాయి. అయితే, ఈ కారణం చేత అనాటి సమాజంలో మాతృస్వామ్యమైన కుటుంబ వ్యవస్థ కొనసాగుతున్నదని నిర్ణయించడం, సహేతుకం కాదు.

స్త్రీలు తమ భర్తల హోదాలను బట్టి తమ సాంఘిక స్థాయిని పరిగణించుకొనే ఆచారం, శాతవాహన యుగం నాటి శాసనాలు వలన తెలియవస్తుంది. వారు మహాసేనాపతిని, మహాభోజకి, మహారథిని, వంటి బిరుదులను ధరించడాన్ని, ఆ శాసనాలు పేర్కొంటాయి. ఈ బిరుదులు ఆయా పదవులకు సంబంధించిన అధికార నిర్వహణలో స్త్రీలు ప్రముఖ పాత్ర వహించడాన్ని సూచిస్తున్నట్లు, ఆచార్య ఆర్. యస్. శర్మ అభిప్రాయపడతాడు. కాని, ఈ అభిప్రాయంలో ఔచిత్యం లేదు.

ఉత్సవాలు, పండుగల సందర్భంగాను, సభలు, సమావేశాల్లోను, స్త్రీలు ఎటువంటి అరమరికలు లేక, పురుషులతో సమానంగా పాల్గొనేవారు. **గాథాసప్తశతి** ఇటువంటి వర్ణనలను కలిగి ఉంది; అమరావతి శిల్పం అటువంటి సన్నివేశాలను ప్రదర్శిస్తుంది.

ధర్మ శాస్త్రాలు, ఇతిహాస, పురాణ వాఙ్మయం ఏకపత్నీ వ్రతాన్ని ప్రశంసించి, ప్రబోధించినా, రాజ కుటుంబాల్లోను, ఇతర ఉన్నత కుటుంబాల్లోను బహుభార్యత్వం సాధారణ విషయం. అంతేకాక,

BRAOU

గ్రామీణ జీవితంలో యువతీ యువకుల స్వేచ్ఛా ప్రణయం కొంత వరకు సర్వసాధారణ విషయం గాను, అవివాహితులు మాత్రమే కాక, వివాహితులు సైతం ఇటువంటి స్వేచ్ఛా ప్రణయాన్ని అనుభవిస్తున్నట్లు, **గాథాసప్తశతి** సూచిస్తుంది. అయినప్పటికి, వివాహ సంబంధానికి అత్యంత ప్రాధాన్యత, పవిత్రత ఉన్నట్లు, కుటుంబ జీవనానికి అది ప్రాతిపదికైనట్లు నిస్సంశయంగా చెప్పొచ్చు. స్త్రీలు స్వయంగా వేసిన అనేక దాన శాసనాలు, వారిని "ఘరని" (గృహిణి) అని వర్ణించడం, అతి సాధారణం.

వితంతువులు చాల నియమనిష్ఠలతో బ్రహ్మ చర్యాన్ని పాటించడం, కద్దు. నాగానిక తన భర్తతో కలసి నిర్వహించిన క్రతువుల్ను వివరిస్తూ, నానాఘాట్ శాసనంలో తనను తాను "చరిత బ్రహ్మచర్య", "గృహ తాపసి", అని వర్ణించుకొన్నట్లు భావించడం యుక్తం. అదే విధంగా, గౌతమీ బాలశ్రీ తాను రాజర్షి వధువు, సత్య వచన, దాన, క్షమా, అహింసా నిరతురాలు, తప, దమ, నియమోప వాసతత్పరురాలని, వర్ణించుకొంది.

స్త్రీల అలంకార ప్రియత్వాన్ని శాతవాహన యుగం నాటి శిల్పం స్పష్టంగా ప్రదర్శిస్తుంది. కంఠా భరణాలు, కంకణాలు, కేయూరాలు, మేఖల (వడ్డాణం) లు, పాద మంజీరాలు, కర్ణాభరణాలు, నాసాభరణాలు మొదలైన అనేక విధాల ఆభరణాలు, అమరావతి శిల్పం లోను, పశ్చిమ కనుమల్లోని గుహాలయాల్లో కానవచ్చే ప్రతిమా శిల్పం లోనూ, చూడొచ్చు. ఆనాటి విదేశ వాణిజ్యం వలన లభిస్తున్న బంగారంలో అధిక శాతం, ఆభరణాలకే ఖర్చు అయ్యేదని, పైన వివరించడం జరిగింది. **గాథాసప్తశతి** అనేక రంగుల వస్త్రాలను స్త్రీపురుషులు ధరిస్తారని వర్ణిస్తూంది. ప్రత్యేకంగా స్త్రీలు ఎరుపు రంగు వస్త్రాలపై అధికంగా మోజును కన్పర్చేవారని, ఆ వర్ణనలు సూచిస్తాయి. అమరావతీ శిల్పం అనేక విధాలైన స్త్రీల కేశాలంకరణలను, జడలు, సగలు మొదలైన వాటిని ప్రదర్శిస్తుంది. పాదాలకు పారాణి కేవలం పెండ్లి సమయం లోనే కాక, సాధారణ అలంకరణ విధానంగా కన్పిస్తుంది.

5.3.2.3 : వినోదాలు

శాతవాహన యుగం నాటికే సంగీత, నృత్యాలు చెప్పుకోదగిన అభివృద్ధిని సాధించినట్లు కానవస్తుంది. ఉత్సవ సమయాల్లో పాడుతూ, నర్తించే యువతులను, **గాథాసప్తశతి** వర్ణిస్తుంది. అమరావతీ శిల్పం అనేక నృత్య సన్నివేశాలను ప్రదర్శిస్తుంది. అందలి నృత్యం అనేక భంగిమల్లో కన్పిస్తుంది. వేణువు, వీణ, మృదంగం వంటి తాళ వాద్యం ప్రముఖమైన సంగీత వాద్యాలు; సంగీత, నృత్యాల్లో సాధారణంగా స్త్రీలే అధిక ప్రావీణ్యం పొందేవారని, ఆసక్తితో అభ్యసించేవారని తోస్తుంది.

పురుషులు ఎడ్ల పందాలు, లేక కోడి పందాల వంటి పౌరుష ప్రదానమైన క్రీడలను అభిమానించే వారు.

శాతవాహన యుగం నాటి శిల్పం ఆనాటి నగర జీవితాన్ని, గ్రామీణ జీవితాన్ని స్పష్టంగా ప్రదర్శిస్తుంది. స్వాభావికంగా ఆరెంటి నడుమ ఉండే వ్యత్యాసాన్ని, ఈ శిల్పాన్ని పరిశీలించి గ్రహించొచ్చు. నగరాలు పెద్ద పెద్ద భవనాలతో ఉండేవని, ఆ భవనాలు విశాలమైన గదులు, కొన్ని సందర్భాల్లో అంతస్థులు కలవి, అమరావతి శిల్పంలో కానవస్తాయి. ఆ భవనాల్లో కూర్చునేందుకు ఆసనాలు, శయనించడానికి తగిన తల్పాలు, అనేక విధాలైనవి కానవస్తాయి. ఉన్నత కుటుంబాల్లోను, సంపన్న కుటుంబాల్లోను, దాసదాసీ జనం ఉండేవారు. గృహాల్లో చిలుకలు, పావురాలు మొదలైన పక్షులను పెంచడం, పంజరాల్లో ఉంచి అలంకరించడం, స్త్రీలు వాటితో సరససల్లాపాలు ఆడుతుండడం, అమరావతి శిల్పం వలన, అంతకంటె విస్తృతంగా గాథాసప్తశతి లోని వర్ణనల వలన తెలియవచ్చు.

BRAOU

అటువంటి వినోదాలు స్త్రీలకు శోభను ఇస్తాయని, శృంగారాన్ని ఉద్దీపింపజేస్తాయని, వాత్స్యాయనుడు తన కామ సూత్రాల్లో వివరించాడు. శృంగార రస ప్రధానంగా వసంతోత్సవం, మదనోత్సవం వంటి పండగలను, గాథాసప్తశతి పేర్కొంటుంది. ఆ పండుగలు ప్రధానంగా ఉద్యానవనాల్లో జరుపుకోవడాన్ని, వాటిలోని అంశంగా "ఉద్యాన గమనం" ఈ వర్ణనల వలన గ్రహించొచ్చు. ఈ ఉద్యాన గమనం క్రమంగా ధార్మిక ప్రధానమై, కార్తీక మాసపు వన భోజనాలుగా పరిణమించినట్లు తోస్తుంది.

గ్రామీణ జీవనం పట్టణ జీవితం కంటె భిన్నంగా, కానవస్తుంది. ప్రజలు వారివారి ఆర్థిక స్థితిని బట్టి గృహాలు నిర్మించుకొనగా, గ్రామణి, లేదా గ్రామ పెద్ద భవంతిలో నివసించేవాడు.

శాతవాహన యుగం నాటి ప్రజా జీవితం, పైన చర్చించినట్లు ఉల్లాసంగాను, ఉత్సాహభరితంగాను ఉండేదని భావించడం, యుక్తం. పట్టణ జీవితం క్రమంగా ఆర్థికాభివృద్ధి వలన సౌకర్యవంతంగాను, నాగరికంగాను అభివృద్ధి చెందుతున్నా, గ్రామీణ జీవనం అప్పటివరకు సాధారణ జనులపై ప్రభావాన్ని చూపుతున్న ప్రాక్తన సాంప్రదాయాల్లోని స్వేచ్ఛ, సమానత్వం, వాటితో కొంత అమాయకత్వం, సూటితనం ప్రతిబింబిస్తూ ఉన్నట్లు కానవస్తుంది. సామ్రాజ్య నిర్మాణం, నిర్వహణల ఆవశ్యకతలకే, శాతవాహన రాజులు వారి సామంతులను, వారు గ్రామీణ కర్షక, కార్మిక వర్గాలను, అధికాదాయం కొరకు పీడించేవారని, ఆ విధంగా కోశాగారాన్ని నింపక పోతే, వైదిక క్రతువులను నిర్వహించడం, బ్రాహ్మణులకు దానధర్మాలను చేయడం, అంత పెద్ద ఎత్తున జరపడం సాధ్యం కావని, ఆధునిక చరిత్రకారుల్లో ఒక వర్గం ప్రతిపాదించే సిద్ధాంతం, ఈ పరిశీలన వలన నిరాధారమైన అపోహని నిర్ణయించొచ్చు.

5.4 : మత - ధార్మిక పరిణామాలు

ఇనుప పనిముట్లతో వ్యవసాయం, సంస్కృత భాషతోను, వర్ణాశ్రమ విధానంతోను కూడిన సాంఘిక, ధార్మిక జీవనాన్ని, శాతవాహనులు మొదట పశ్చిమ దక్కన్‌పై విజయవంతంగా అమలుపర్చి, ఆ తర్వాత వాటిని దక్కన్ పీఠభూమి తూర్పు ప్రాంతానికి విస్తరించారని, అప్పటి వరకు ఆంధ్ర దేశంలో బృహచ్ఛిలా (megalithic) సంస్కృతికి చెందిన ప్రాక్తన ప్రజానీకాలు నివసిస్తూండేవారని, ఆచార్య అమితారే అభిప్రాయం. శాతవాహనుల తోనే ఆంధ్ర దేశంలో వ్యవసాయ విప్లవం, వర్తక వాణిజ్య విస్తరణ, నాగరికతా, సంస్కృతులు ప్రవేశించినట్లు, ఆమె భావం. ఇది పూర్తిగా అసమంజసమైన భావం. ఆర్య సంస్కృతీ ప్రభావానికి లోనైన మొట్ట మొదటి దక్షిణ భారతీయులు శాతవాహనులేనని, వారు వర్ణ ధర్మాన్ని సంరక్షించడం, వైదిక క్రతువులను అధిక సంఖ్యలో చేయడం, ఈ అంశాన్నే సూచిస్తాయి. ఆర్యులు దక్షిణ భారత ప్రజానీకాలను, ద్రవిడ జాతీయులను ఓడించి, వారి సంస్కృతిని అణచివేసి, తమ సంస్కృతిని అంటగట్టినట్లు, పలువురు చరిత్రకారులు అభిప్రాయపడతారు. ఈ అభిప్రాయాలను ప్రశాంతంగా, సాకల్యంగా ఆలోచించకుండ ఏర్పర్చుకున్న, ప్రమాణాలు.

5.4.1 : ప్రాచీన జాతులు - మత విశ్వాసాలు

శాతవాహన యుగం నాటి మత-ధార్మిక పరిస్థితులను స్పష్టంగా, నిష్పక్షపాతంగా అవగాహన చేసుకోవడానికి, అప్పటి వరకు ఆంధ్ర దేశం లోని వివిధ ప్రాచీన జాతుల ధార్మిక జీవనాన్ని, మత విశ్వాసాలను, వాటి పరస్పర ప్రభావాన్ని గూర్చి పరిశీలించడ, మవసరం. ఇందుకు వైదిక, పురాణేతిహాస వాఙ్మయం, బౌద్ధ పాళీ వాఙ్మయం కొన్ని సూచనలను చేస్తున్నాయి.

BRAOU

5.4.1.1 : ఆంధ్రులు - ఆర్యులు

జాతి పరంగా ఆంధ్రులు అనార్య సంతతికి చెందినవారు, **ఐతరేయ బ్రాహ్మణం, పురాణేతిహాసాలు** ఈ అంశాన్ని స్పష్టంగా ప్రకటిస్తాయని, ఆచార్య బి. యన్. యల్. హనుమంతరావ్ గారి నిర్ధారణ. ఈ అభిప్రాయంలో సత్యం లేకపోలేదు. కానీ, **ఐతరేయ బ్రాహ్మణం** ఆంధ్రులు, వారి సహచరులైన జాతులు శాపగ్రస్తులై, ఆర్యత్వాన్ని పోగొట్టుకొన్నట్లు వివరిస్తుంది. వారి సహచరులైన శబర, పులింద, మూతిబుల్లో కొన్ని జాతులు, నేటికి ఆటవికులే. కనుక, ఆటవికులతో సహజీవనం చేస్తున్నందున, ఆంధ్రులను అనార్యులుగా భావించడం జరగిందనొచ్చు.

మత్స్య, వాయు, బ్రహ్మాండ పురాణాలు ఆంధ్రులు - చీన, మరు, నభ్గణ, సర్వమూలిక, తుషార, పహ్లవ, దరద, శక జాతులతో కలసి, హిమాలయాలకు ఆవల చక్షు, లేక మక్షు నదీ తీరాన నివసించే వారని, పేర్కొంటాయి. ఈ నది మధ్యాసియాలోనిది; ప్రాచీన గ్రీక్ రచయితలు పేర్కొన్న ఆక్సస్ (oxus), నేటి టుర్క్‌మనియా లోని అముదర్యా (Amu Darya)

మలి వేద కాలానికి ఇంచుమించు సమానమైన ఇనుప యుగం నాటి సాంఘిక, ఆర్థిక పరిణామాల్లో, గంగా-యమునా మైదానంపై జనావాసాలు ఏర్పడుతున్న సమయంలో, మధ్యాసియానుండి, గంగానదీ ముఖ ద్వారం వరకు అనేక జాతుల ప్రజానీకాలు సంచరించినట్లు, కానవస్తున్నది. ఆ సమయంలో ఆంధ్రులు శక, పహ్లవ, దరద మొదలైన జాతులతో కలసి, స్వదేశాన్ని విడిచి వచ్చి, కొంత కాలం గంగా-యమునా మైదానంపై నివసించారని, ఆ తర్వాత మరింత దక్షిణంగా కదిలి, వింధ్య పర్వత ప్రాంతాలకు ఉభయ పార్శ్వాల్లోని అరణ్యాల్లో స్థిరపడ్డారని భావించొచ్చు. అందుచేత, వారు కొంత వరకు వైదిక సంస్కృతీ ప్రభావానికి లోనైనారు; వైదిక వాఙ్మయంలో ప్రస్తావించబడ్డారు. వింధ్య పర్వత ప్రాంతంలో వారు శబర, పులింద, మూతిబులతో సహజీవనం చేశారు; ఆంధ్రుల సాహచర్యంలో వారు సంస్కృతీకరణం చెంది, వారితోబాటుగా వైదిక వాఙ్మయంలో పేర్కొనబడ్డారు.

మధ్యాసియాలో ఆంధ్రులకు పక్కింటివారుగా నివసించినట్లు పురాణాలు పేర్కొనే శక, పహ్లవులు మొదలైనవారు, చారిత్రక కాలంలో పైతం, ఆంధ్రులకు ఇరుగుపొరుగున నివసించి, రాజ్యాలు పాలించినట్లు తెలియవచ్చు. దరదులనే పిశాచులని, వారి భాషనే పైశాచీ భాషగా గుర్తించడం జరిగినట్లు, భాషావేత్తల అభిప్రాయం. పైశాచీ భాష, తుషార జాతి మాట్లాడే తొఖారియన్ (బహుశ తుర్కిస్థాన్‌లో ప్రాచీన కాలంలో మాట్లాడిన భాష కావచ్చు) సంస్కృతంతో దగ్గర సంబంధం కలిగినదిగా, వారి నిర్ణయం. శాతవాహన యుగం నాటి ఆంధ్ర దేశంలో పైశాచి భాష బాగా వృద్ధి చెందింది; గుణాఢ్యుడు తన **బృహత్కథను** పైశాచి భాష లోనే రచించాడు; అమరావతి, నాగార్జునకొండ మహా చైత్యాల వద్ద లభించిన శాసనాలు, భాషా పరంగా పైశాచీ ప్రభావానికి లోనైనవనే, పండితుల అభిప్రాయం. ఈ పరిశీలన బలన, ఉత్తర భారతదేశం నుండి వైదిక సంస్కృతీ ప్రభావానికి లోనైన కొన్ని మధ్యాసియా జాతులు, ఆంధ్ర దేశాన్ని చేరినట్లు గ్రహించొచ్చు. ఈ జాతులను ఆర్య జాతులుగా పరిగణించడం, సమంజసం కాదు. క్రీ.పూ. 1400 నుండి 700 వరకు మధ్యాసియా లోని తుర్క్‌మనియా నుండి గంగా-యమునా మైదానం వరకు నివసించిన అనేక జాతుల భాషల నుండి సంస్కృత భాష, ఆచార వ్యవహారాల నుండి వైదిక సంస్కృతి ఉత్పన్నమైనట్లు, అవి ఏ ఒక్క జాతికి ప్రత్యేకంగా చెందనట్లు తోస్తుంది. 'ఆర్య' అనే పదం గౌరవనీయుడనే అర్థాన్ని కలిగింది. జాతి వాచకం కాదు. అప్పటి సాంస్కృతిక పరిణామాల్లో కొన్ని అభివృద్ధి చెందిన జాతులు తమను తాము అధికులుగా భావించుకొన్నాయని, అభివృద్ధి చెందని ప్రాక్తన జాతులను కొంత నిరసన

BRAOU

భావంతో చూసినట్లు తోస్తుంది. వైదిక వాఙ్మయంలో ప్రస్తావించబడిన ఈ సాంస్కృతిక వ్యత్యాసాలే, చరిత్రకారులు ఒక ఆర్య జాతి, కొన్ని అనార్య జాతులుగా భావించడానికి దారితీసిందని గ్రహించడం యుక్తం. గంగానదీ మైదానాలపై నివసించి, వైదిక సంస్కృతీ ప్రభావానికి లోనైన ఆంధ్రులను తమతో సమంగా భావించడాన్ని గూర్చి, ఇతర అభివృద్ధి చెందిన జాతుల్లో పీర్వడిన సంశయమే, ఆంధ్రులకు విశ్వామిత్రుని శాపాన్ని గూర్చిన ఇతివృత్తం.

5.4.1.2 : ఆంధ్రులు - ఇక్ష్వాకులు

ఆంధ్ర జాతిలో ఇక్ష్వాకు తెగవారు అత్యంత ప్రాచీనులని భావించడానికి, అవకాశముంది. తెలుగులో ఏవైన అతి ప్రాచీనమైన వాటిని గూర్చి వివరించే సందర్భంలో "ఇక్ష్వాకుల కాలం నాటిదనే" సామెత తరచుగా ప్రయోగించడం కద్దు. ఇక్ష్వాకు వంశానికి చెందిన అశ్మక, ములక, అనే రాకుమారులు దక్షిణాపథంలో తమ పేర్లతో రెండు జనపదాలను నెలకొల్పారు. ఇక్ష్వాకులు పరిపాలించే కోసల దేశం నుండి "బావరి" అనే బ్రాహ్మణుడు అశ్మక దేశానికి వలస వచ్చాడు. అతడు తన శిష్యుల సాయంతో గౌతమ బుద్ధుని జీవిత కాలం లోనే బుద్ధ ధర్మాన్ని దక్షిణాపథానికి తెచ్చాడు. రామాయణ ఇతిహాసం శ్రీరాముడు తన వన వాసాన్ని దండకారణ్యంలో గడిపినట్లు, అక్కడ ఆయన అగస్త్య మహర్షి ఆశ్రమాన్ని సందర్శించినట్లు తెల్పుతుంది. ఈ గాథలు ఉత్తర భారతదేశం లోని కోసల జనపదం దక్షిణాపథం లోని అశ్మక, ముళక జనపదాలతో సన్నిహితమైన సంబంధం కలిగి ఉన్నట్లు సూచిస్తాయి. బౌద్ధ వాఙ్మయం, పురాణేతిహాస వాఙ్మయమూ ఈ రెండు జనపదాలు ఆంధ్ర జనపదాలని పేర్కొంటాయి. కనుక, ఈ గాథల వలన ఉత్తర భారతదేశం నుండి తొలుత వైదిక సంస్కృతి, తర్వాత బౌద్ధ సంస్కృతి ఆంధ్రుల వలన, ఇక్ష్వాకుల వలన దక్షిణాపథానికి చేరుతుం డేవని స్పష్టపడుతుంది. ఈ సాంస్కృతిక సన్నిహితత్వమే గౌతమ బుద్ధుని ఇక్ష్వాకు వంశీయునిగా వర్ణించడానికి దారితీసిందని తోస్తుంది.

5.4.1.3 : అగస్త్యుడు - ఆంధ్ర దేశం

ఇతిహాస వాఙ్మయం ఉత్తర భారత దేశం నుండి బయలుదేరి, వింధ్య పర్వత గర్వాన్ని అణచి, దక్షిణాపథంపై అడుగు పెట్టిన ప్రథముడు, అగస్త్య మహర్షిని పేర్కొంటాయి. తమిళ, కర్ణాటక దేశాల్లోని భాషా, సాంస్కృతిక అభివృద్ధి పరిణామాల్లో, అగస్త్య మహర్షిని గూర్చి అనేక గాథలు ప్రచారంలో ఉన్నాయి. ఆంధ్ర దేశంలో అనేక శివాలయాల్లో శివుని ప్రతిష్ఠ అగస్త్య మహర్షి చేసినట్లు, ఆ ఆలయాల్లోని దేవుడు అగస్త్యేశ్వర స్వామని ప్రసిద్ధమైనట్లు, అనేక సాంప్రదాయక గాథలు ఉన్నాయి. ఈ సాంప్రదాయిక గాథలను విశ్వసిస్తే, శివుని ఆరాధన ఆంధ్ర దేశానికి అగస్త్యుని వల్లనే చేరిందని భావించొచ్చు.

శివుడు వైదిక దేవతా గణంలోని వాడు కాదు. కాని, శివుని లోని ఒక అంశైన రుద్రుడు, వైదిక దేవతా గణంలో విధ్వంసక మూర్తులైన మరుత్తులతో చేరినవాడు; మరొక అంశైన పశుపతి, బహుశః సింధు నాగరికతా కాలం నాటి ఉత్తర భారతదేశ మత సంస్కృతులకు చెందినవాడు. రుద్ర, పశుపతులు శివునిలో జేరిపోయిన తర్వాత, ఆ దేవునికి వైదిక సంస్కృతిలో కొంత స్థానం కలిగినట్లు, అందుకు వ్యతిరేకించే పూర్వాచార ఎ...ుణులు స్పష్టంగా పరాజయం పొందినట్లు, పురాణ వాఙ్మయం వివరించే దక్ష యజ్ఞాన్ని కథాంశంగా గ్రహించొచ్చు. ఈ విధమైన శైవ మతం, వైదిక సంస్కృతితో కలసి, అతి ప్రాచీన కాలంలోనే అగస్త్యుని వలన ఆంధ్ర దేశం చేరిందని, గ్రహించొచ్చు. భట్టిప్రోలు

BRAOU

మహాచైత్యం వద్ద లభించిన ప్రాచీన శాసనాల్లో "శివ" అనే వ్యక్తి నామం కానవస్తుంది. అనగా, క్రీ.పూ. రెండో శతాబ్దికి ముందే, శైవ మతం ఆంధ్ర దేశంలో స్థానాన్ని పొంది, ప్రజాదరణకు పాత్రమైందని స్పష్టపడుతుంది.

పై చర్చల వలన, ఆంధ్ర దేశానికి అతి ప్రాచీన కాలం నాడే, ఉత్తర భారత దేశం నుండి వైదిక సంస్కృతి, దానితో గూడి శైవ మతం, ప్రవేశించాయని చెప్పొచ్చు.

5.4.1.4 : ఆంధ్ర దేశంలో వైదిక సంస్కృతి

దక్షిణాపథానికి, ఆంధ్ర దేశానికి వైదిక సంస్కృతిని అగస్త్య మహర్షి తీసుకొనిరాగా, ఆపస్తంభ మహర్షి కృషి వలన విస్తరించి, వికాసాన్ని చెందింది. క్రీ.పూ. అయిదో శతాబ్దానికి చెందిన ఆపస్తంభ ధర్మసూత్రాలు వర్ణాశ్రమ విధానంతో కూడిన సాంఘిక వ్యవస్థను నిలిపినట్లే, ఆయన రచించిన శ్రౌత సూత్రాలు వేదాధ్యయనానికి, వైదిక క్రతువులను ఆచరించడానికి, స్పష్టమైన పద్ధతులను ఏర్పర్చాయి. ఈ బాధ్యతలను బ్రాహ్మణులు నియమనిష్ఠలతోను, అంకిత భావం తోను నిర్వహించడం కొరకు జీవించాలని, ఆపస్తంభ ధర్మ సూత్రాలు నిర్దేశించాయి. వైదికాచారాలతో స్థానిక మత విశ్వాసాలు, ఆచరణలు కూడ, ఆపస్తంభుని వలన నియమబద్ధమైనాయి. అనేక సందర్భాల్లో ఆచారవ్యవహారాలకు శూద్రులను, స్త్రీలను ప్రమాణంగా గ్రహించవలసిందని ఆపస్తంభుడు బోధించడం, గుర్తించాల్సిన విషయం. సాధారణ ప్రజానీకంలో ఆచరణలో ఉన్న ఆచారాలను కూడ, వైదికాచారాలుగా గుర్తించడం చేత, ఆయన ఈ విధమైన నియమాన్ని ఏర్పర్చాడు. ముఖ్యంగా, అంత్య క్రియలకు, శ్రాద్ధ కర్మలకు సంబంధించిన విధివిధానాన్ని, సాధారణ జనుల ఆచరణల నుండే ఆపస్తంభుడు ఏర్పర్చాడు. ధర్మ నిర్ణయానికి వేద వాఙ్మయం, ధర్మ సూత్ర, శ్రౌత సూత్రాలే కాక, పురాణేతిహాసాలను కూడ ప్రమాణంగా స్వీకరించవలసిందిగా, ఆపస్తంభ ధర్మ సూత్రాలు విధిస్తాయి. ఈ వాఙ్మయం ప్రధానంగా ప్రజల్లో ప్రచారంలో ఉన్న గాథలను గ్రహించి, ఏర్పడింది.

BRAOU

క్రీస్తు పూర్వపు శతాబ్దాల నాటి ఆంధ్ర దేశంలో వైదిక సంస్కృతికి ఉన్న ఆదరణను, బౌద్ధ వాఙ్మయం కూడ సూచిస్తుంది. ఆంధ్ర దేశం లోని అశ్మక, ములక జనపదాలు ఉత్తర భారతదేశం నుండి వేదవిదులైన బ్రాహ్మణులను ఆకర్షిస్తున్నట్లు, బావరి ఇతివృత్తం సూచిస్తుంది. అతడు ఈ జనపదాల పరిపాలకులైన ఇక్ష్వాకుల చేతనే కాక, కళింగ దేశపు రాజు వలన కూడ, గౌరవ సన్మానాలు పొందినట్లు తెలియవస్తుంది. జాతక కథల్లోని **భీమసేన జాతకం**, బోధిసత్త్వుడు ఒక బ్రాహ్మణ యువకునిగా జన్మించి, తక్షశిలలో వేద విద్యను అభ్యసించి, తన విద్యకు తగిన గౌరవం పొందేందుకు ఆంధ్ర దేశానికి వచ్చినట్లు వివరిస్తుంది.

వేద విద్యకు, వైదిక క్రతువులకు ఆదరణ, శాతవాహన కాలంలో నాగానిక వేసిన నానాఘాట్ శాసనం వలన తెలుస్తుంది. ఆ శాసనం ఆ రాజ దంపతులు అసంఖ్యాకంగా వ్రతాలు, క్రతువులను చేసి, అపారంగా బ్రాహ్మణులకు దక్షిణలను ఇచ్చినట్లు తెలియజేస్తూంది. ఈ క్రతువులు, వ్రతాలు ఆపస్తంభ, శ్రౌత సూత్రాల ననుసరించి నిర్వహించినవేనని తోస్తుంది. శాతవాహన రాజులు వర్ణాశ్రమ ధర్మాన్ని సంరక్షిస్తూ, ఏక బ్రాహ్మణులుగా భావించుకొని, పరిపాలించడానికి, ఆపస్తంభ ధర్మ, శ్రౌత సూత్రాలు మార్గదర్శకమైనట్లు గ్రహించొచ్చు.

5.4.2 : స్థానిక జాతులు - మత సంస్కృతులు

ఆపస్తంభ **ధర్మ సూత్రాలు, శ్రౌత సూత్రాలు** స్థానిక ప్రజలు ఆచరించే మతాచారాలను, విశ్వాసాలను క్రమబద్ధం చేసి, ప్రామాణికతను చేకూర్చినట్లు, పైన వివరించడం జరిగింది. ఆంధ్రులను దక్షిణాపథంపై అతి ప్రాచీన కాలం నుండి శబర, పులింద, మూతిబులు సహచరులుగా ఉన్నట్లు, **ఐతరేయ బ్రాహ్మణం** తెలియజేస్తుండగా, ఇతర ఆధారాల వలన నాగ, యక్ష, మహిషక మొదలైన జాతులు తెలియవస్తున్నారు. వీరు తమ ఆరాధ్య వస్తువుల (objects of worship) వలన అటువంటి నామవాచకాలను పొందినట్లు, వాస్తవంగా శబర, పులింద, మూతిబుల లోని వారేనని భావించడం, యుక్తం. నాగులను పూజించేవారు యక్షులు; మహిషాన్ని (దున్నపోతు) పూజించేవారు, మహిషకులు. **మహావిద్దేశ"** మనే పాళీ బౌద్ధ గ్రంథం, ఇటువంటి అనేక మత విశ్వాసాలు, ఆచారాలు దేశ మంతటి పలు ప్రాంతాల్లో వ్యాపించి ఉన్నట్లు పేర్కొంటుంది. అటువంటి ఆచారాలు, ఆరాధనలు ఏదో ఒక రూపాన నేటికి కొనసాగుతున్న విషయాన్ని గుర్తిస్తే, క్రీస్తు పూర్వ కాలంలో, ఆ తర్వాత ఇవి ఎంత ప్రబలంగా ప్రజల్లో వ్యాపించి ఉండేవో గ్రహించొచ్చు.

5.4.2.1 : జంతు - వృక్ష ఆరాధనలు

ప్రాచీనాంధ్ర దేశం లోని ప్రజానీకంలో నాగులు చాలా ప్రధానమైనవారు. అమరావతి, నాగార్జునకొండ శిల్పంలో, మానవాకృతితో సగం దేహం కలిగి, సర్పాకృతితో తక్కిన శరీరాలు కల్గినట్లు కానవచ్చే స్త్రీ, పురుష మూర్తులు నాగ జాతికి చెందినవారు. నాగారాధకులకు ఆనాటికే దివ్యత్వం ఏర్పడి, బౌద్ధ శిల్పంలో వారిని ఇటువంటి అలౌకికమైన శరీరం కలవారిగా ప్రదర్శించడం జరిగిందని గుర్తించొచ్చు. ప్రాచీనాంధ్ర దేశంలో కృష్ణా-గోదావరి నదుల ముఖ ద్వారాల చెంత ఉన్న మైదాన భూములను, సింహళ, సయామ్ దేశాల్లో వ్యాపించిన బౌద్ధ వాఙ్మయం "నాగ లోక" మని వ్యవహరిస్తుంది. టోలమి తన **భూగోళశాస్త్రం**లో ఈ ప్రదేశాన్ని "మైసోలియా" అని పేర్కొంటూ, అక్కడి ప్రజల్లో "బెనురనాగో" అనే వారున్నట్లు రాశాడు. గుంటుపల్లి వద్ద లభించిన కొన్ని శాసనాలు, ఆ గుహాలయాలు తొలిచిన పర్వతాన్ని "మహానాగ పర్వత" మని పేర్కొంటున్నాయి. ఈ ఆధారాలు ప్రాచీనాంధ్ర దేశంలో నాగులు ప్రధానమైన ప్రజానీకమని స్పష్టం చేస్తున్నాయి. ఈ నాగులనే ప్రాచీన తమిళ వాఙ్మయం "అరువై" జాతి వారని పేర్కొంటున్నట్లు గ్రహించొచ్చు. అరువై జాతి తొండైమండలంతో నివసించేదిగా, ఆ వాఙ్మయం పేర్కొంటుంది. సంస్కృతంలో "దండక" అని పిలువబడిన ప్రాంతమే, తొండైమండలమని ద్రవిడ భాషల్లో వ్యవహరించబడింది.

టోలమీ పేర్కొన్న మైసోలియా అనే ప్రదేశం, బహుశా మహిషకుల దేశ మని అర్థం వచ్చే స్థానిక భాషా పదానికి, గ్రీక్ విరూపం అని తోస్తుంది. గుంటుపల్లి వద్ద లభించిన ఐర వంశీయుడైన ఏరిసద కాలం నాటి ఒక శాసనం, ఆ రాజు కళింగ, మహిషక జనపదాలను పరిపాలిస్తున్నట్లు పేర్కొంటున్నది. కనుక, మహిషక జనపదం కళింగకు సన్నిహితంగా ఉండేదని భావించడం సముంజసం. అయితే, మహిషకులు ఈ ఒక్క ప్రాంతం లోనే కాక, కృష్ణా నదికి రెండు వైపుల, నేటి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో చేరిన భూభాగాల పైన విస్తరించి, అనేక చోట్ల తమ ఆవాసాలను నిర్మించారని, నాణాల వలన, శాసనాధారాల వలన తెలియవస్తుంది. నేటి ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా నదికి ఇరు వైపులా ఉన్న మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాలు, రాయలసీమ ప్రాంతం, గుంటూరు జిల్లా మహిషకుల నివాస భూమి. ప్రాచీన సంగం వాఙ్మయం మహిషకులనే "ఎరుమై" అనే పేరుతో ప్రస్తావించింది.

BRAOU

యక్షులు బహుశా గంగానదీ మైదానాలపై, నేటి బిహార్, ఉత్తర ప్రదేశ్ లోని తూర్పు ప్రాంతాల్లో నివసిస్తూ, ఛోటానాగపూర్ ప్రాంతం లోని ఆస్ట్రిక్-ముండారీ తెగలతో కలసిపోయిన వారని, కళింగ దేశం లోనికి, క్రమంగా ఆంధ్ర దేశ తీర ప్రాంతాల పైకి విస్తరించారని భావించొచ్చు.

బార్హుత్ స్తూపం పైని శిల్పంలో యక్షులు విస్తారంగా కానవస్తారు. పాట్నా, దిదార్‌గంజ్, బెస్‌నగర్ ప్రాంతాల్లో లభించిన యక్ష ప్రతిమలు, ప్రాచీన కాలంలో యక్షులను ఆరాధించే మత విశ్వాసాలు ప్రబలంగా ఉండేవని సూచిస్తాయి. పైన పేర్కొన్న "మహనిద్దేశ" మనే బౌద్ధ గ్రంథం, మణిభద్ర, పూర్ణభద్ర అనే యక్షులను, వారిని పూజించే మత శాఖలను పేర్కొంటుంది. భట్టిప్రోలు మహాచైత్యం వద్ద లభించిన కొన్ని ప్రాచీన శాసనాలు, రాజా కుబీరకుడనే గోష్ఠి ప్రముఖుని పేర్కొంటున్నాయి. "కుబీరకు" డనే పేరు కుబేరునికి విరూపం కావచ్చునని తోస్తుంది. కుబేరుడు యక్షులకు రాజైనట్లు పురాణ వాఙ్మయం తెల్పుతుంది. కనుక, భట్టిప్రోలు ప్రాంతంలో, ప్రాచీన కాలంలో యక్ష జాతి నివసించేదని గ్రహించొచ్చు. ఆంధ్ర దేశంలో ప్రఖ్యాతి చెందిన "యక్ష గాన" మనే నాటక ప్రక్రియ, వీరి వలననే ఏర్పడినట్లు, ప్రాచీనాంధ్ర ప్రజానీకంలో యక్షులు గణనీయమైన అంశమని, పండితుల అభిప్రాయం.

శాతవాహన రాజుల నాణేల పైన, అశోకుని శాసన స్తంభాల పైన, వృషభం, సింహం, ఏనుగు, అశ్వం మొదలైన జంతువులు, ప్రాకారంలో ఉన్న వృక్షం, (రాచి చెట్టుగా తోస్తుంది) మొదలైనవి కానవస్తాయి. ఇవన్నీ అనాటి ఆరాధ్య వస్తువులని, ఆ కారణం చేతనే అవి నాణాలపై ముద్రించబడడం, బౌద్ధ శిల్పంలో చోటుచేసుకోవడం జరిగిందని గ్రహించొచ్చు. "నాగ" పదానికి కేవలం సర్పమనే అర్థం కాక, ఏనుగు అనే అర్థం కూడ ఉంది. ఏనుగును బౌద్ధం బుద్ధునికి ప్రతి రూపంగా భావిస్తుంది; నవ్య వైదిక మతంలో వినాయకుని పూజగా కొనసాగింది. సింహం కూడ బుద్ధుని ప్రతి రూపమే; గౌతమ బుద్ధుని బౌద్ధ వాఙ్మయం శాక్యసింహుడని వ్యవహరిస్తుంది. నవ్య వైదిక మతంలో సింహం నరసింహునిగా రూపొందడాన్ని గుర్తించొచ్చు. వృషభం, సర్పం కూడ అదే విధంగా ఉభయ మతాల్లో ప్రాధాన్యతను పొందాయి.

BRAOU

5.4.2.2 : మాతృ దేవతారాధన

ప్రాచీన భారతదేశం లోని ఆరాధనా విధానాల్లో మాతృ దేవతారాధన (Worship of mother - goddess) అత్యంత ప్రధానమైంది. సకల సృష్టికి జననిగా, పాడిపంటలకు మూలమైందిగా, ఆమె ఆరాధన ప్రజనన (fertility) తంత్రాలకు కారణమైంది. బహుశా ఈ ఆరాధన, మానవుడు ఆహార సంపాదనా దశ నుండి ఆహారోత్పత్తి దశకు పరిణమించే సమయాన, నవీన శిలా యుగంలో ప్రారంభమైనట్లు తోస్తుంది.

ప్రాచీనాంధ్ర దేశం లోను, పరిసర కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లోను లభించిన కొన్ని శిల్ప ఫలకాలు (plaques), మృణ్మయ (terracotta) విగ్రహాలు, ఒక నగ్నంగా ఉన్న స్త్రీమూర్తి, పెద్ద కడుపు, ప్రసూతంగా కనిపించే జననేంద్రియం కలిగి, కాళ్ళు మడత వేసి, తొడలు విప్పార్చి, కూర్చుని ఉన్నట్లు కానవస్తుంది. ఈ స్త్రీమూర్తి సృష్టికి మూలమైన జగన్మాతగా ఏర్పర్చుకొన్నట్లుంది. నాగార్జున కొండ వద్ద ఇటువంటి స్త్రీ మూర్తి విగ్రహం విచ్ఛిన్నమై లభించింది. ఆ విగ్రహం పాదాలు, మడత వేసిన కాళ్ళు, తొడల మధ్య కడుపు కానవస్తున్నాయి; పైభాగం పూర్తిగా నష్టమైంది. లభిస్తున్న అలంకరణ విధానం వలన నష్టమైన పై భాగం, పూర్ణ కుంభం వలె రూపొందించబడినట్లు

గ్రహించొచ్చు. పైన పేర్కొన్న విగ్రహాల్లో, శిల్ప ఫలకాల్లో ఈ దేవత తలకు బదులు తామర పుష్పం కన్పిస్తుంది. అందుచేతనే, కడుపును పూర్ణ కుంభం వలె తీర్చిదిద్దడం జరిగింది. క్రమంగా, తక్కిన అవయవ భాగాలను వదిలివేసి, మాతృ దేవత చిహ్నంగా, మిగిలిన పూర్ణ కుంభాన్ని, అందునుండి వెలికివస్తున్న తామర పుష్పాలను మాత్రమే ఉంచడం జరిగింది.

దక్షిణ భారతదేశానికి వచ్చిన ఋషుల్లో ప్రప్రథముడుగా పైన వివరించిన అగస్త్య మహర్షి "కుంభ సంభవుడు", అనగా పూర్ణ ఘటం నుండి పుట్టినవాడు. దక్షిణ భారతదేశం లోని బ్రాహ్మణుల్లో అధిక శాతం భరద్వాజ గోత్రులు; వీరి గోత్ర ఋషైన భరద్వాజుడు కూడ కుంభ సంభవుడే. కనుక, అతి ప్రాచీన కాలంలో పూర్ణ ఘటం ఆరాధ్య చిహ్నంగా కలిగిన మాతృ దేవతారాధకులు ఉత్తర భారతదేశం నుండి వచ్చినట్లు భావించొచ్చు.

పూర్ణ ఘటాన్ని, అందునుండి తామర పుష్పాలు బయటికి వస్తున్నట్లు, మంగళదాయకమైన చిహ్నం బౌద్ధ శిల్పంలో భారతదేశ మంతటా కానవస్తుంది. అమరావతి, నాగార్జునకొండ మహాచైత్యాల వద్ద అసంఖ్యాకంగా ఈ చిహ్నం కలిగిన శిల్ప ఫలకాలు, వీటిని సమర్పిస్తూ భక్తులు చెక్కించిన శాసనాలు కానవస్తాయి. పూర్ణ ఘటాన్ని భక్తి శ్రద్ధలతో పూజించడం, ఇంటింట జరిగే శుభ కార్యాల్లో, మండపారాధనలో ప్రతిష్ఠించి పూజించటంగా, ఆంధ్ర దేశంలో నేటికి నిల్చి ఉంది; గ్రామ దేవతలుగా అనేక పేర్లతో మాతృ దేవతారాధన పల్లె ప్రాంతాల్లో కొనసాగుతున్నది. వైదిక వాఙ్మయంలో స్త్రీ దేవతలకు ప్రాముఖ్యత లేదు. మాతృ దేవతారాధనతో వైదిక ధర్మం, నవ్య వైదిక ధర్మంగా పరిణమించింది.

5.4.2.3 : శివ పూజ

ప్రాచీనాంధ్ర దేశం లోని ధార్మిక ఆరాధనా విషయాల్లో, మరొక ప్రధానాంశం శివ పూజ. మాతృ దేవత వలెనే శివుడు కూడ వాస్తవంగా వైదిక దైవం కాదు. రామాయణంలో శ్రీరాముడు శివుని ధనస్సును విరిచివేయడం, అనార్యుల పై ఆర్యుల విజయంగా రాధాకృష్ణన్ వంటి పండితుడే భ్రమించి, శివుని ఆరాధకులు పెద్ద సంఖ్యలో దక్షిణ భారతదేశానికి తరలి వచ్చారని, అందువల్ల శివుడు దక్షిణామూర్తి అని పేరు తెచ్చుకున్నాడని అభిప్రాయపడ్డాడు.

నవ్య వైదిక ధర్మం లోని శివుడు, వైదిక రుద్రుడు, పశుపతి మొదలైన అనేక దైవతాలుగా, వేర్వేరుగా పూజించబడే వాడు. వివిధ సంస్కృతుల పరస్పర ప్రభావం, సమ్మేళనల్లో శివుడు ఉద్భవించాడు. ఆయన లోని కొన్ని అంశలు ప్రాకృత జాతులు పూజించే వేటగాని రూపంలో, పులి తోలును కప్పుకొని ఉండేవి, వేటగాండ్రకు, దొంగలకు, కిరాతకులకు ఆరాధ్య వస్తువుగా ఉండేవి. ఆ కారణం చేత, శివుణ్ణి వైదిక సంస్కృతి మొదట్లో దేవునిగా గుర్తించ లేదని, పురాణాలు వర్ణించే "దక్ష యజ్ఞ" గాధ శివుని ఆరాధనను అంగీకరించే యువ తరానికి, నిరసించిన పూర్వాచార పరాయణులకు నడుమ ఏర్పడిన సంఘర్షణగా, చరిత్రకారుల అభిప్రాయం.

శివుణ్ణి విగ్రహ రూపంలో కాక, లింగాకృతిలో ప్రతిష్ఠించి పూజించటం పరిపాటి. ఈ లింగాకృతి సృష్టికి మూలమైన పురుష శక్తిగా భావించబడింది. ఇటువంటి విశ్వాసం, "లింగ" పదం ముండారీ భాషా సంస్కృతులకు చెందినట్లు, ప్రిజుల్స్కి పండితుని అభిప్రాయం సహేతుకంగా కానవస్తుంది. వృషభారాధన కూడ ఇదే విశ్వాసంపై ఆధారపడింది; కనుక శివారాధనతో, చేరువైంది; అలాగే, మాతృ దేవతారాధన వీటితో చేరిపోవడంతో, జగన్మాతగా భావించబడిన స్త్రీ దేవత; పశుపతికి భార్యగాను, వృషభం వాహనంగాను ఏర్పడ్డాయి.

BRAOU

5.4.3 : బౌద్ధ మతం

వైదిక సంస్కృతి లోని వర్ణ వ్యవస్థ, క్రతు ప్రాధాన్యత, క్రమంగా ప్రజాసామాన్యం నిరసనకు గురైనట్లు, అప్పటి ధార్మిక సంక్షోభంలో బౌద్ధ, జైన మతాలు ఆవిర్భవించినట్లు, చరిత్రకారుల నిర్ణయం. అదే విధమైన పరిణామం ప్రాచీనాంధ్ర దేశంలో సైతం ఏర్పడిందని, బ్రాహ్మణాధిక్యతను యక్ష, నాగ మొదలైన జాతులు సహించలేకపోయారని, ఆచార్య బి. యస్. యల్. హనుమంతరావుగారి అభిప్రాయం. **కథాసరిత్సాగరం** (లేదా దానికి మూలమైన **బృహత్కథ**) బ్రాహ్మణ కన్యలను నాగులు, యక్షులు వివాహం చేసుకోవడం బ్రాహ్మణ వర్గానికి ఆగ్రహం కలిగించినట్లు, ఇతివృత్తాలు ఈ విధమైన సాంఘిక సంఘర్షణను సూచిస్తాయని ఆయన అభిప్రాయం.

తాత్కాలికంగా కూడ ప్రజానీకానికి కలిగిన సంశయాలను వైదిక ధర్మం సమాధానపర్చలేకపోయిందని, అందుచేత ఆదరణ కోల్పోయిందని, ఆచార్య హనుమంతరావుగారి అభిప్రాయం. **సుత్తనిపాతం** దక్షిణ భారతదేశానికి చెందిన సభియు అనే యువకుడు వైదిక వాఙ్మయాన్ని అభ్యసించి, సంతృప్తి కలుగనందున, ఉత్తర భారతదేశానికి వెళ్ళి, బుద్ధుని శిష్యుడైన ఉదంతాన్ని తెలుపుతుంది. **మజ్ఝిమనికాయం** కొన్ధలుడనే బ్రాహ్మణుడు వేదాధ్యయనంతో సంతృప్తి చెందక, దక్షిణ భారతదేశానికి వచ్చి, లోకాయత దర్శనాన్ని అధ్యయనం చేయడం, బుద్ధుని శిష్యుడు కావడాన్ని వివరిస్తుంది. ఈ సంఘటనలు దక్షిణ భారతదేశంలో వైదిక ధర్మానికి ఆదరణ తగ్గి, లోకాయత దర్శనానికి, దాని నుండి బౌద్ధ ధర్మానికి ప్రజాభిమానం ఏర్పడుతున్నట్లు, ఆచార్య హనుమంతరావుగారి అభిప్రాయం. ఆ అభిప్రాయ మసత్య మనరాదు. కానీ, సంపూర్ణంగా సత్యమని గ్రహించడం సహేతుకం కాదు. ఏమతానికి, సంస్కృతికైన ప్రజల్లో నూటికి నూరు పాళ్ళు విశ్వాసనీయత, ప్రజాభిమానం ఏర్పడవు. అనేక కారణాల వల్ల పలువురిలో మత సంస్కృతుల పట్ల అసంతృప్తి, అన్య మతాల పట్ల ఆసక్తి ఏర్పడడం సహజం. అయితే, ఆ అసంతృప్తి ఒక ఉద్యమ రూపం ధరించిందని భావించడం, చారిత్రకంగా సమర్థనీయం కాదు. ఆంధ్ర దేశం లోను, యావద్భారతదేశంలో సైతం, బౌద్ధ ధర్మం అపారమైన ప్రజాదరణ పొందిన యుగాల్లో, వైదిక ధర్మం కూడ అభివృద్ధి చెందుతూనే ఉంది; బౌద్ధులు తమ ధార్మిక, తాత్విక వాఙ్మయాన్ని **త్రిపిటకాలుగా** రూపొందిస్తున్న కాలం లోనే, వైదిక ఋషులు **గృహ్య సూత్రాలను, శ్రౌత సూత్రాలను, ఇతిహాస-పురాణ** వాఙ్మయాన్ని నిర్మించారు. అమరావతి - శ్రీధాన్య కటక వద్ద మహాచైత్యం విస్తరింపబడి, మహా సాంఘికులు బౌద్ధ ధర్మాన్ని ఉద్ధృతంగా ప్రబోధించే యుగంలో, **ఆపస్తంభ ధర్మ సూత్రం** వెలువడింది.

5.4.3.1 : ఆంధ్ర దేశంలో బౌద్ధ ధర్మం

అతి ప్రాచీన కాలం నుండి ఉత్తర భారతదేశం లోని కోసల జనపదానికి, ఆంధ్ర దేశానికి రాజకీయ, సాంస్కృతిక సంబంధాలు ఏర్పడి ఉన్నట్లు, పైన వివరించడం జరిగింది. గౌతమ బుద్ధుడు స్వయంగా కోసల దేశంలో పర్యటించి, సుదీర్ఘ కాలం ధర్మ ప్రబోధాలు చేశాడు. ఆ దేశం నుండి అశ్మక దేశానికి వచ్చి స్థిరపడిన బావరి అనే బ్రాహ్మణుడు, బుద్ధుడు అర్హతత్వాన్ని సాధించినట్లు విని, అందరి సత్యాసత్యాలను తెలిసికొని, బుద్ధ ధర్మాన్ని గ్రహించి రావలసిందిగా తన శిష్యులను పంపాడు. వారు ముందు కోసల జనపదానికి వెళ్ళి, అక్కడి నుండి బయలుదేరి రాజగృహ వద్ద బుద్ధుని బౌద్ధ ధర్మాన్ని వివరించగా, అతడు సన్యసించి బౌద్ధ భిక్షువైనాడు. ఈ ఇతివృత్తం, **సుత్తనిపాతం** లోనిది. తర్వాత కాలానికి చెందిన **"కథావత్థు"** అనే బౌద్ధ పాళీ గ్రంథం, **" పరమార్థదీపని"**, **"మహావస్తు"** వంటి మహాయాన సంస్కృత గ్రంథాలు సైతం, ఇటువంటి ఇతివృత్తాలను, వివరణలను

BRAOU

తెల్పుతాయి. ఈ వాఙ్మయాధారాలు బుద్ధుని జీవిత కాలం లోనే బౌద్ధ ధర్మం ఆంధ్ర దేశాన్ని చేరిందని స్పష్టపరుస్తాయి.

5.4.3.2 : ఆంధ్ర దేశంలో బౌద్ధ ధర్మానికి అశోకుని కృషి

మౌర్య చక్రవర్తైన అశోకుని పదమూడో శిలా శాసనం తన సామ్రాజ్యం లోని ఆంధ్ర, పులిందక, భోజక జాతులు బౌద్ధ ధర్మాన్ని గ్రహించి అనుసరిస్తున్నట్లు వివరిస్తూంది. ఇటీవలి కాలంలో అమరావతి వద్ద లభించిన అశోకుని శాసన స్తంభ శకలం, ఆయనకు ఆంధ్ర దేశంతో సంబంధమేర్పడున్నట్లు, ఋజువు చేస్తూంది. అమరావతి వద్ద జరిగిన పురావస్తు త్రవ్వకాలు అక్కడి మహాచైత్యం వాస్తవంగా అశోకునికి పూర్వం నాటిదై, ఆ చక్రవర్తి కృషి వలన విస్తరణ, శిల్పాలంకరణను పొందినట్లు సూచిస్తున్నాయి. కర్నూల్ జిల్లా లోని ఎర్రగుడి, రాజుల మందగిరి వద్ద అశోకుని శాసనాలు లభించాయి.

అయినప్పటికి, అశోకుని శాసనాలు పేర్కొన్న ఆంధ్రులు కృష్ణా, గోదావరీ ముఖ ద్వారాల చెంత నివసించేవారు కాకపోవచ్చునని, అమరావతి - ధాన్యకటక మహాచైత్యానికి, అశోకునితో ప్రత్యక్ష సంబంధం లేదని భావించడానికి అవకాశం లేక పోలేదు. శాతవాహన సామ్రాజ్య విస్తరణకు పూర్వం కృష్ణా నదీ ముఖ ద్వార మొద్దున్న మైదాన భూములకు, ఆంధ్ర లేక ఆంధ్ర దేశమని, ఇక్కడి ప్రజానీకానికి ఆంధ్రులని గుర్తింపు వచ్చినట్లు కన్పించదు. ఈ అంశం ముందు మరింత వివరంగా తెలియనున్నది.

అశోకుడు మూడో బౌద్ధ మహా సంగీతి ముగిసి తర్వాత, దేశ, విదేశాలకు, అనేక బౌద్ధ భిక్షువులను ధర్మ ప్రచారం కొరకు పంపగా, వీరిలో మహాదేవుడు మహిష మండలానికి వచ్చాడని, సింహళ దేశపు బౌద్ధ చరిత్ర గ్రంథాలు తెల్పుతున్నాయి. మహిష మండలం కృష్ణా-గోదావరీ నదుల నడుమ, తీరాంధ్ర దేశంలో ఉన్నట్లు నిర్ధారించడం జరిగింది. భిక్షు మహాదేవుడు సింహళ దేశంలో "దేవానాంపియతిస్స" అనే రాజు నిర్మించిన "మహావిహారమహ" స్థూపాన్ని ప్రతిష్ఠించే ఉత్సవానికి (Consecration Ceremony) 80 వేల మంది భిక్షులతో పల్లవ బోగ్గ నుండి బయలుదేరాడని, ఈ సింహళ దేశపు గ్రంథాలు వివరిస్తాయి. ఈ పల్లవ బోగ్గ నేటి గుంటూరు జిల్లాలోని "పలనాడు" గా చరిత్రకారులు గుర్తించారు. పలనాటిలో గోళి, కేసానపల్లి, నాగార్జునకొండ వంటి బౌద్ధ క్షేత్రాలు ఏర్పడి ఉండడం వలన, ఈ గుర్తింపు సరైనదిగా అంగీకరించొచ్చు. కనుక, పదమూడో శిలా శాసనంలో ఆంధ్రులు బౌద్ధ ధర్మాన్ని అనుసరిస్తున్నట్లు చెప్పడం, వీళ్ళను దక్కన్‌కు వర్తిస్తుందని, మహిష మండలం, లేక కృష్ణా నదీ మైదానంపై బౌద్ధ ధర్మం విపరీత ధోరణులు కలిగి ఉండడాన, అక్కడ స్వచ్ఛమైన బౌద్ధ ధర్మాన్ని నెలకొల్పి ప్రచారం చేసేందుకు భిక్షు మహాదేవుని పంపడం జరిగిందని ఊహించొచ్చు. ఈ అంశం ముందు మరింత స్పష్టపరుస్తుంది.

5.4.3.3 : అంధక భిక్షులు

మౌర్య చక్రవర్తి అశోకుని కాలం నాడు, అనేక సంఘారామాల్లో బౌద్ధ భిక్షువులు ధర్మాన్ని, వినయ సూత్రాలను, తమ ఇష్టానుసారం వ్యాఖ్యానించడం, దుష్ట సిద్ధాంతాలను ఏర్పర్చి ప్రచారం చేయడం, ఆ చక్రవర్తి మనసును క్షోభ పెట్టినట్లు, ఆయన ఆ వాదాలను సవిమర్శకంగా ఖండించడానికి మూడో బౌద్ధ సంగీతిని ఏర్పర్చినట్లు, బౌద్ధ వాఙ్మయం వివరిస్తుంది. ఈ మహా సంగీతి లోని చర్చల వలన నిర్ధారణైన బౌద్ధ ధర్మాన్ని వివరిస్తూ, ఈ మహా సభకు అధ్యక్షత వహించిన మొగ్గలి పుత్తతిస్స

BRAOU

"కథావత్థుప్పకరణ" అనే గ్రంథాన్ని రచించాడు. ఈ మహా సంగీతిలో ప్రధానంగా ఖండించింది, అంధక భిక్కులు (ఆంధ్ర దేశ భిక్షువులు) ప్రతిపాదించిన సిద్ధాంతాలనే. ఈ సిద్ధాంతాలను వారు రెండో మహాసంగీతి లోనే ప్రతిపాదించి వాదించారు.

గౌతమ బుద్ధుని మహాపరినిర్వాణం తర్వాత ఒక శతాబ్ది కాలానికి, వైశాలీ నగరంలో రెండో బౌద్ధ మహా సంగీతి జరిగింది. వైశాలీ భిక్కులు, వారితో కూడి అంధక భిక్కులు అనుసరిస్తున్న పది అప మార్గాలను (దసవత్థుని) ఖండించి, బౌద్ధ సంఘాన్ని సంస్కరించడాన్ని, ఈ మహా సంగీతి ఉద్దేశించిందని, కొన్ని బౌద్ధ గ్రంథాలు తెలియజేస్తాయి. మరి కొన్ని గ్రంథాలు భిక్కు మహాదేవుడు లేవనెత్తిన ఐదు వివాదాలను గూర్చి చర్చించడానికి సమావేశమైనట్లు తెల్పుతాయి. ఈ భిక్కు మహాదేవుడు అశోకుడు మహిష మండలానికి పంపిన మత ప్రచారకుడు కాడు; పుబ్బసేల (పూర్వ శైల) నివాసి అని, అనగా శ్రీధాన్యకటక - అమరావతి విహారాల్లో నివసించేవాడని తెలియవస్తుంది. ఇతడు లేవనెత్తిన ఐదు వివాదాస్పద అంశాల సారాంశం; అర్హతత్వం పొందిన తర్వాత సంశయాలు కలుగవచ్చునా? అంటే, అర్హతత్వం అసంపూర్ణమైంది, సర్వజ్ఞత్వాన్ని ఇవ్వలేదు; అర్హతుడు తప్పు చేయకుండ ఉండగలడా? అంటే, అర్హతత్వం పొందిన తర్వాత కూడ పాపం చేయడం, పతనం చెందడం తప్పకపోవచ్చు.

రెండో బౌద్ధ మహా సంగీతి ఈ వివాదాలను పరిష్కరించలేక, వాటిని నిర్వివాదంగా ఖండించింది. అంతట వైశాలీ, అంధక భిక్కులు ప్రత్యేకంగా మరొక మహా సంగీతిని సమావేశం చేసి, తమ వాదాన్ని సుస్థిరం చేసుకొన్నారు. వారు వేరుగా ఏర్పర్చుకొన్న మహా సంగీతి, లేక మహా సంఘం వల్ల, వారి సిద్ధాంతాలు మహా సాంఘిక వాదంగా ప్రసిద్ధమైనాయి. క్రమంగా విస్తరించి, ప్రబలమైన మహా సాంఘిక వాదాన్ని పరామర్శించి, దురభిప్రాయాలను తొలగించే ఉద్దేశంతో ఏర్పడ్డ మూడో మహా సంగీతి, మళ్ళీ వాటిని తిరస్కరించింది; "విభజ్య వాద" మనే పేర ధేర వాదాన్నే (హీనయానాన్ని) సమర్థించింది. అశోకుడు బౌద్ధ సంఘంలో విభేదాలు, విభజనలను నిరాకరించాడు; కాని, సంఘం రెండుగా చీలిపోయింది.

కథావత్థుప్పకరణ అంధక భిక్కులను ప్రత్యేకంగా త్రిపిటకాలు ఉన్నట్లు, ప్రధానంగా వారికి ప్రత్యేకంగా వినయ పీటిక ఉన్నట్లు సూచిస్తూంది. వారు చైత్యాలను నిర్మించి, అలంకరించడం, ఆరాధించడం పుణ్యప్రదంగా భావిస్తారని, తెలియజేస్తూంది. కొండల వలె పెద్ద పరిమాణంలో వీరు చైత్యాలను నిర్మించేవారు; కనుక చైత్యకులని ప్రసిద్ధి పొందారు. ధేర వాదులు, అంటే హీనయానులు, నిర్వాణం ఎవరికివారే సాధించదగిన స్థితిగా, కర్మను నిర్మూలించి, సంబుద్ధిని పొందడానికి ఆది భౌతిక (occult), ఆధ్యాత్మిక (Spiritual) కృషిని చేయాల్సుంటుందని వివరిస్తారు. మహాసాంఘిక-చైత్యక వాదులు నిర్వాణాన్ని సంపాదించదగిన స్థితిగా భావిస్తారు. ఆరాధనల వలన కలిగే పుణ్యం, దానధర్మాలతో పుణ్యాన్ని బదలాయించుకోవడం, నిర్వాణాన్ని అందించ గల్గుతాయని వారి వాదం. కనుక, నిర్వాణ మత్యున్నత స్థితి కాదని, వారు వాదించారు.

అశోకుడు అప్పటికే ప్రసిద్ధమైన ధాతు గర్భ స్థూపాల (అనగా చైత్యాల) నుండి సంపాదించిన బుద్ధ ధాతువులను వివిధ ప్రదేశాల్లో స్థూపాల్లో నిక్షిప్తం చేయడానికి పంచి పెట్టినట్లు, బౌద్ధ వాఙ్మయం వివరిస్తుంది. ఆ విధంగా బుద్ధ ధాతువుల్లో అంధక భిక్కులు కొంత భాగాన్ని పొందినట్లు, వాటిని నిక్షిప్తం చేయడానికే, శ్రీధాన్యకటక-అమరావతి స్థూపాన్ని విస్తరించి, పునర్నిర్మించినట్లు తోస్తుంది. ఆ విధంగా ఆంధ్ర దేశంలో చైత్యక వాదం ప్రారంభం కావడానికి, అశోకుడు కూడ కొంత వరకు

BRAOU

కారకుడే ననిపిస్తుంది. అంతకు పూర్వం బుద్ధునికి, బుద్ధ ధర్మానికి ప్రతినిధి (Symbol)గా ఉన్న శ్రీ ధాన్యకటక మహాస్థూపం, బుద్ధ ధాతువులతో మహా పవిత్రమైన చైత్యంగా రూపొందింది.

పైన పేర్కొన్న మహాసాంఘిక వాదం లోని మౌలిక పరిణామాలు, సిద్ధాంత విభేదాలు, స్థానిక ప్రజల మత విశ్వాసాల నుండి, ఆరాధనావసరాల నుండి ఉత్పన్నమైనట్లు ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ సిద్ధాంతాలే కాక, అంధక చైత్యకుల ఆరాధనల్లో కొన్ని ప్రత్యేకమైన ఆవశ్యకతల వలన, మద్యపానం, స్త్రీ సంభోగం ప్రధానాంశాలైనట్లు, **కథావత్థుప్పకరణం** వివరిస్తూంది.

చైత్యారాధనలే మహాసాంఘిక వాదులు క్రమంగా బుద్ధుని విగ్రహ రూపంలో పూజించడం ప్రారంభించగానే, అంధక-మహాసాంఘికులు సైతం ఆ విధానాన్ని అనుసరించసాగారు. అంధక- చైత్యకుల్లోని దురాచారాలను తొలగించడానికే, అశోకుడు మహిష మండలానికి, మహారాష్ట్ర, అపరాంత, బనవాస దేశాలకు మత ప్రచారకులను పంపాడు. దక్కన్ పీఠభూమిపైనున్న ఈ జనపదాలన్ని బహుశ అంధక-మహాసాంఘిక ప్రభావానికి లోబడినట్లు తోస్తుంది. అంధక - చైత్యకుల నుండి క్రమంగా ఆంధ్ర దేశంలో మహాయాన బౌద్ధం, అందలి శైల శాఖలు ఆవిర్భవించాయని, ఈ మహాయాన బౌద్ధం, చైనా, జపాన్, కొరియా, ఆగ్నేయాసియా దేశాలకు విస్తరించిందని భావించొచ్చు. మహాయాన బౌద్ధానికి జన్మభూమి ఆంధ్ర దేశమేనని, ఆచార్య నరిన్ాక్షదత్, ఐ. యన్. యుల్. హనుమంతరావుగార్లు విస్పష్టంగా నిరూపించారు.

5.4.4 : జైన మతం

బౌద్ధ ధర్మం వలెనే జైన ధర్మం కూడ, వేద ప్రామాణ్యాన్ని అంగీకరించని, వైదిక క్రతువులను నిరసించే తాత్విక ఉద్యమం. ప్రాచీనాంధ్ర దేశంలో వైదిక ధర్మం పట్ల ఏర్పడిన అసంతృప్తి వలన, ఇంచుమించు బౌద్ధ మతంతోపాటు, జైన మతం వ్యాప్తిచెంది ఉండొచ్చునని, ఆచార్య బి.యస్.యుల్. హనుమంతరావుగారు అభిప్రాయపడ్డారు. కాని, ఆంధ్ర దేశ చరిత్రలో జైన మతానికి క్రీస్తు శకారంభం నుండి మాత్రమే స్పష్టమైన ఆధారాలు లభిస్తున్నాయి. అంతేకాక, జైన ధర్మం కఠిన నియమాలతో, శరీరాన్ని శుష్కింపజేసే ఆచరణలు, సంపూర్ణంగా ప్రాపంచిక బంధాలను త్రెంచివేసే వైరాగ్యాన్ని బోధించడాన, అంతగా ప్రజాదరణ పొందలేక పోయిందని, ఆయనే అభిప్రాయపడ్డాడు. క్రీస్తు శకారంభ శతాబ్దాల్లో ఆంధ్ర దేశం ముమ్మరమైన వ్యావసాయిక, పారిశ్రామిక, వాణిజ్యాభివృద్ధిని సాధిస్తూ, సౌకర్యవంతమైన ప్రజా జీవితాన్ని కలిగి ఉంది. అటువంటి కాలంలో జైన ధర్మానికి తగినంత ప్రజాదరణ లభించక పోవడంలో ఆశ్చర్యం లేదు.

5.4.4.1 : ప్రాచీనాంధ్ర దేశంలో జైన మత వ్యాప్తి

జైన ధర్మం క్రీ.శ. ఏడో శతాబ్దిలో ఆంధ్ర దేశంలో చాళుక్య రాజ్య మేర్పడడంతో ప్రవేశించిందని, లోగడ చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. వేంగి చాళుక్య రాజుల్లో పలువురు జైన ధర్మం పట్ల ఆసక్తిని కనబర్చిన విషయం యథార్థం. వారి పరిపాలనా కాలం లోనే, ఆ మత సంస్కృతులకు ఆంధ్ర దేశంలో కొంత ప్రాముఖ్యత ఏర్పడింది. అయితే, జైన మతం క్రీ.శ. ఏడో శతాబ్దికి పూర్వం ఆంధ్ర దేశంలో పూర్తిగా అపరిచితమని భావించడం, సహేతుకం కాదు.

క్రీస్తు శకం రెండో శతాబ్దిలో తీరాంధ్ర దేశంపై ఖారవేలుని దండయాత్ర వలన జైన మతం అంధ్ర దేశంలో కొంత ప్రాముఖ్యతను పొందిందని స్పష్టంగా చెప్పొచ్చు. ఆ రోజు వేసిన హాథిగుంప

BRAOU

శాసనం అతడు జైనుడని స్పష్టపరుస్తుంది; శాసనారంభంలో సిద్ధులు, అర్హంతల నుద్దేశించి నమస్కరించడం, అందుకు నిదర్శనం. మూడు వందల సంవత్సరాల క్రితం నంద రాజులు తరలించుకొని పోయిన జిన విగ్రహాన్ని తిరిగి సాధించి తెచ్చినట్లు, ఆ శాసనంలో ఖారవేలుడు చెప్పుకున్నాడు. ఖారవేలుని తర్వాత తీరాంధ్ర దేశం లోని మహిష మండలాన్ని పరిపాలించిన సిరిసిరి అనే రాజు కాలం నాటి గుంటుపల్లి శాసనం, మహామేఘవాహన - చేది వంశీయులు జైన మత పోషణను కొనసాగించారని ఊహించడానికి అవకాశాన్ని కల్గిస్తున్నది. గుంటుపల్లి గుహాలయాలు జైన ధర్మానికి చెందినవిగాను, అక్కడి శాసనాల్లో నాయణనాధుని శిష్యురాలిగా వర్ణించుకున్న ఒక స్త్రీ సోపానాలను నిర్మించినట్లు తెలియజేస్తుంది. నాయణనాధుడనే వ్యక్తి నామం బౌద్ధ, వైదికాచార్యులకు చెందినది కాకపోవచ్చునని, అతడొక జైనాచార్యుడని భావించడానికి అవకాశముంది.

ఖారవేలుడు నంది రాజుల నుండి తిరిగి తెచ్చిన జిన విగ్రహం జైన తీర్థంకరుల్లో పదవ వాడైన సీతల నాధునిది కావచ్చునని, ఆయన భదలపురం, లేక భద్రపురమనే గ్రామంలో జన్మించినట్లు, జైన వాఙ్మయం పేర్కొనే స్థలం ఆంధ్రప్రదేశ్‌లోని భద్రాచలం కావచ్చునని, ఆచార్య హనుమంతరావుగారి నిర్ణయానికి, బలమైన సాక్ష్యాధారం లేదు. జైన వాఙ్మయం నుండి ఆయన ఎత్తిచూపిన అనేక గాథలు, క్రీ.పూ. 5 వ శతాబ్దిలో ఆంధ్ర దేశంలో జైన ధర్మం ప్రవేశించినట్లు సూచిస్తాయని భావించడం కూడ కష్టం. అయితే, క్రీ.పూ. మూడో శతాబ్దాంతంలో మౌర్య చంద్రగుప్తుడు తన గురువైన భద్రబాహునితో కలసి, దక్షిణ భారతదేశం లోని జైన తీర్థాలను సందర్శించినట్లు కొన్ని సాంప్రదాయిక గాథలు వివరిస్తాయి. ఈ గాథలకు చారిత్రక విలువను ఇచ్చినట్లయితే, జైన ధర్మం అప్పటికి దక్షిణ భారతదేశంలో తగినంత ప్రజాదరణ పొంది ఉండవచ్చునని, ఆంధ్ర దేశం కూడ ఈ ధార్మిక ప్రభావానికి లోనై ఉంటుందని భావించొచ్చు.

5.4.4.2 : శాతవాహనులు - జైన మతం

శాతవాహనుల గూర్చి జైన వాఙ్మయం కొన్ని గాథలను తెలియజేస్తుంది. ఆ సామ్రాజ్య స్థాపకుడు (శాతవాహనుడని మాత్రమే ఈ గాథలు పేర్కొంటాయి) స్వతంత్ర రాజ్యాన్ని నెలకొల్పి, బహు కాలం ప్రజారంజకంగా పరిపాలించిన తర్వాత, దుర్మార్గుడై, ప్రజాకంటకుడైనట్లు, రాజ్యంలో తిరుగుబాట్లు చెలరేగినట్లు, కొన్ని గాథలు తెల్పుతున్నాయి. ఈ గాథల ననుసరించి, మౌర్య చక్రవర్తుల బౌద్ధ మతాభిమానానికి వ్యతిరేకంగా, జైన మతానుసారైన శ్రీముఖుడు శాతవాహన సామ్రాజ్యాన్ని స్థాపించాడని, అయితే అతని పరిపాలన ప్రజల తిరుగుబాటు వలన అంతమైందని కొందరు చరిత్రకారుల అభిప్రాయం; అతడు పరిపాలనాంతంలో వైదిక ధర్మాన్ని ప్రోత్సహించడం చేత, జైన రచయితలు ఆ విధంగా రాసిఉండొచ్చునని కొందరు చరిత్రకారులు అభిప్రాయపడతారు. వీటిలో ఏ వాదాన్ని అంగీకరించడానికి సరైన సాక్ష్యాధారాలు లేవు.

"ఆవశ్యక సూత్ర" మనే జైన గ్రంథం ప్రతిష్ఠానపురాన్ని పరిపాలించే శాలివాహనుడు జిన భక్తుడని పేర్కొంటుంది. **"కల్పప్రదీప"**, **'ఆవశ్యక చూర్ణి'** అనే జైన గ్రంథాలు కూడ శాలివాహనుడు, అతని ఆస్థానం లోని 52 మంది మంత్రులు జైన దేవాలయాలను నిర్మించినట్లు పేర్కొంటాయి. ఈ గ్రంథాలు క్రీ.శ. వదో శతాబ్దికి చెందినవి; కనుక వీటికి చారిత్రక విలువను ఇవ్వడం కష్టం; ఈ శాలివాహనుణ్ణి గుర్తించే అవకాశాలు లేవు.

శాతవాహనులను గూర్చిన జైన వాఙ్మయాధారాల్లో **'కాలకాచార్య కథానక'** చరిత్రకారులకు చాలా ఆసక్తిని కలిగించేది. ఈ గాథ కాలకాచార్యుడనే జైన ముని సోదరి, సరస్వతి, చాలా సౌందర్యవతి;

BRAOU

ఆమె కూడ జైన సన్యాసిని; ఉజ్జయినిని పరిపాలించే గర్దభిలుడు మోహించి బలాత్కారంగా చెరపట్టాడు. అంతట కాలకాచార్యుడు శక ద్వీపం నుండి శకులను రప్పించగా, వారు గర్దభిల్లుని ఓడించారు. శకులు ఆ తర్వాత కొంత కాలం ఉజ్జయినిని పరిపాలించగా, గర్దభిల్లుని కుమారుడైన విక్రమాదిత్యుడు వారిని ఓడించి, తరిమివేసి, తిరిగి రాజ్యాన్ని స్వాధీనపర్చుకున్నాడు. అతని విజయ సూచకంగా, క్రీ.పూ. 57-58లో విక్రమ శకం మొదలైంది. ఈ గాథ లోని కాలకాచార్యుడు శాతవాహనుల గురువు; ఆయనకు ఆగ్రహాన్ని కలిగించిన గర్దభిల్లుడు కూడ శాతవాహన రాకుమారుడే; కాని, తిరస్కార సూచకంగా జైన వాఙ్మయం అతనికి అటువంటి మారుపేరు (nick-name) నుంచింది; ఈ గాథ శాతవాహనుల ప్రత్యర్థులుగా శకులు మాళ్వాలో ప్రవేశించడాన్ని సూచిస్తుందని చరిత్రకారులు అభిప్రాయపడతారు. కొన్ని జైన గ్రంథాలు విక్రమాదిత్యుని తండ్రి మహేంద్రాదిత్యుడని పేర్కొంటాయి. కాగా, పురాణ పట్టికల్లోని మహేంద్ర స్వాతి (కర్ణ) అనే రాజు ఈ మహేంద్రాదిత్యుడేనని, అతడే గర్దభిల్లుడని ఆ చరిత్రకారుల ఊహ. ఇవన్నీ నిరాధారమైన ఊహలు; పురాణ పట్టికల్లోని ఆ రాజులను చారిత్రక వ్యక్తులుగా భావించడం పొసగదు; కాలకాచార్య కథానికాన్ని శాతవాహన చరిత్రకు సాక్ష్యాధారంగా గ్రహించడం అసాధ్యం.

5.4.4.3 : కొండ కుందాచార్యుడు

ప్రాచీనాంధ్ర దేశం లోనే కాక, దక్షిణ భారతదేశంలో జైన మత చరిత్రకు కొండకుందాచార్యుని జీవిత చరిత్రతో అవినాభావ సంబంధముంది. ఈయన వాస్తవ నామం పద్మనంది. అయితే, కొండకుంద పురంలో జన్మించినందున, కొండకుందాచార్యుడనే ప్రసిద్ధ నామం ఏర్పడింది. ఈ కొండకుంద గ్రామం నేటి అనంతపురం జిల్లా లోని కొనకండ్లగా గుర్తించడానికి వాఙ్మయాధారాలు, శాసనాధారాలున్నాయి. ఈయన క్రీ.పూ. 41లో జన్మించి, 85 సంవత్సరాల వయసులో క్రీ.శ. 44 లో మరణించినట్లు తెలుస్తున్నది.

జైన సంఘంలో బలాత్కార గణ, వక్రగచ్ఛ మనే రెండు శాఖలను కొండకుందాచార్యుడు ప్రారంభించాడు. జైన మత విస్తరణకు ఈ రెండు శాఖలు చాలా కృషి చేశాయి. ఆయన స్వయంగా యావద్భారతదేశం పర్యటించి, ఇతర మతాలపై జైన ధర్మ ఆధిక్యతను ప్రతిష్ఠించాడని, శ్రవణ బెల్గోళ వద్ద ఒక శాసనం వివరిస్తోంది. మత చర్చల్లో కొంత కర్కశత్వాన్ని, మత ప్రచారంలో తీవ్ర వాదాన్ని (militancy) ఈయన అనుసరించాడని చరిత్రకారుల అభిప్రాయం. ఆయన తన పర్యటనల్లో కేవలం ఇతర మతాలకు చెందిన ప్రత్యర్థులను ఓడించడమే కాక, జైన ధర్మానికి నూతన జవసత్వాలను కూర్చినట్లు గ్రహించొచ్చు. ఆయన జన్మ స్థలం కార్యాచరణ కేంద్రమైన కొండకుందేయపురం (కొనకండ్ల), ఆంధ్ర, తమిళ, కర్ణాటక దేశాలకు చేరువగా ఉండడాన, ఆయనకు ఈ మూడు ప్రాంతాల్లో అపారంగా శిష్యకోటి ఏర్పడింది బాలకపించ, కుందకొద్ది, సామంతభద్ర అనేవారు ఆయన శిష్యుల్లో ప్రముఖులు. ఆయన తర్వాత జైన మత వ్యాప్తికి తీవ్రంగా కృషి చేసిన వారు.

కొండకుందాచార్యుడు తమిళ దేశంలో జైన ధర్మాన్ని వ్యాప్తిచేస్తూ, ద్రమిళ సంఘానికి ప్రధానాచార్యుడైనాడని, ప్రఖ్యాత తమిళ గ్రంథమైన **"తిరుక్కురల్"** రచించిన తిరువళ్లువర్ ఈ ఆచార్యుడేనని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. జైన వాఙ్మయం ఈయన 84 గ్రంథాలను పాహుడు, అనే ప్రాకృతంలో రచించినట్లు పేర్కొంటాయి. వాటిలో సమయసార, ప్రవచనసార, పంచాస్తికాయ అనే గ్రంథాలు ప్రఖ్యాతమైనవి. ఈయన జైన ధర్మం లోని శ్వేతాంబర, దిగంబర విభేదాలకు అతీతంగా, అందరు, భక్తి విశ్వాసాలతో పఠించదగినట్లు; ఆత్మతత్వాన్ని స్పష్టపర్చి, ద్వంద్వాతీతమైన నిశ్చల స్థితిని సాధించడానికి కావలసిన మానసిక పరిపక్వతను కలిగించే విధంగా, గ్రంథ రచన చేశాడు.

BRAOU

5.4.4.4 : సింహనంది

కొండకుందాచార్యుని తర్వాత ఆయన స్థాపించిన వక్రగచ్ఛకు ప్రధాన నాయకులైన వారిలో ప్రసిద్ధుడు, సింహనంది. ఈయన కడప జిల్లా లోని పేరూరు, లేక గంగవేరూరులో తన కార్యాచరణ కేంద్రాన్ని ఏర్పర్చుకొని, తెలుగు, కన్నడ ప్రాంతాల్లో జైన ధర్మ వ్యాప్తికి కృషి చేశాడు. పశ్చిమ గంగ రాజ్యాన్ని స్థాపించిన దడిగ, మాధవ, అనే సోదరులకు ఈయన గురువై, రాజ్య స్థాపనకు తోడ్పడ్డట్లు, కొన్ని సాంప్రదాయక గాథలు గంగ వంశీయుల శాసనాల్లో కానవస్తాయి. ఈ సోదరులు ఇక్ష్వాకు వంశీయులైనట్లు ఆ శాసనాలు వివరిస్తున్నందున, వీరు శ్రీ పర్వత- విజయపురి నుండి పరిపాలించిన ఇక్ష్వాకు వంశంలోని వారని, అక్కడ పరిపాలనాధికారాన్ని పోగొట్టుకొన్న పిదప, సింహనంది ఆశ్రమాన్ని సంపాదించి, ఆ ప్రాంతంలో ప్రజాభిమానం పొందడానికి జైన ధర్మాన్ని స్వీకరించారని చరిత్రకారుల అభిప్రాయం.

పైచర్చ వలన, క్రీ.పూ. మూడో శతాబ్దాంతాన జైన ధర్మం దక్షిణా పథంలో ప్రవేశించిందని, ఆంధ్ర దేశం కూడ ఆ ధార్మిక ప్రభావానికి లోనై ఉంటుందని తెలియవస్తుంది. కాని, క్రీ.శ. రెండో శతాబ్దిలో ఖారవేలుని దండయాత్ర, కొండకుందాచార్యుని కృషి, జైన ధర్మానికి ఆంధ్ర దేశంలో గట్టి పునాదిని ఏర్పర్చాయి. ఇటీవల లభించిన కొండవీడు తామ్ర శాసనాలు, నేటి గుంటూరు జిల్లా వడ్డమాను పద్ద మహామేఘవాహన విహారమున్నట్లు తెలియజేస్తున్నాయి. ఈ విహారాన్ని ఖారవేలుడు తన విజయానంతరం స్థాపించినట్లు భావించొచ్చు.

5.5 : భాషా-సారస్వతాలభివృద్ధి

శాతవాహన యుగం నాటి ఆంధ్ర దేశంలో గొప్ప భాషా - సారస్వత వికాసం జరిగింది. అంతకు పూర్వమే ఆపస్తంభ మహర్షి తన ధర్మ సూత్రాలను ఆంధ్ర దేశంలో రచించాడు; మహాసాంఘికులు తమకు ప్రత్యేకంగా ధార్మిక వాఙ్మయాన్ని రచించుకొన్నారు. ఈ విషయాలను పైన ప్రస్తావించి, వివరించడం జరిగింది.

శాతవాహన యుగంలో ఆచార్య నాగార్జునుడు విస్తృతంగా మహాయాన బౌద్ధ వాఙ్మయాన్ని నిర్మించాడు. ఆయనకు పూర్వమే, అష్ట సాహస్రిక, శత సాహస్రిక అనే పేర్లతో **ప్రజ్ఞాపారమితా శాస్త్రం** ఆంధ్ర దేశంలో అభివృద్ధి చెందిందని తెలియవస్తుంది. ఆయన ప్రజ్ఞాపారమితా శాస్త్రాన్ని "నాగ లోకం" నుండి సంపాదించినట్లు, ఈ నాగ లోకం కృష్ణా నదీ ముఖ ద్వార మొద్దున్న మజేరిక, లేక మైసోలియా అని, పైన వివరించడం జరిగింది. ఆచార్య నాగార్జునుడు రచించిన గ్రంథాల్లో అత్యంత ప్రసిద్ధమైంది, **"ప్రజ్ఞాపారమితా టీక"**, లేక **" మాధ్యమిక కారిక"**. ఆయన వలెనే, జైన ధర్మ ప్రచారానికి కొండ కుందాచార్యుడు అనేక గ్రంథాలను రచించి, వాఙ్మయాన్ని నిర్మించాడు.

ఈ విధమైన ధార్మిక సారస్వతం మాత్రమే కాక, కవితా వైభవంతో కూడిన లౌకిక సాహిత్యం కూడ, శాతవాహన యుగంలో బాగా అభివృద్ధి చెందింది. అయితే, ఈ సాహిత్య వికాసం ప్రధానంగా ప్రాకృత భాషలో జరిగింది.

BRAOU

5.5.1 : ప్రాకృతం

శాతవాహన రాజులు ప్రాకృతాన్ని పరిపాలనా భాషగా ఉపయోగించి, ఆభాష లోనే తమ శాసనాలను వేశారు. వాటిలో నాసిక్ ప్రశస్తి శాసనం చక్కని శైలితో, ఒక చిన్న కావ్యంగా పేర్కొనదగింది. ఆ శాసనం శాతవాహన యుగం నాటి ప్రాకృత భాషాభివృద్ధిని సూచిస్తుంది. కుంతల శాతకర్ణి అంతఃపురంలో చక్కని ప్రాకృత భాష పలుకుబడిలో ఉండేదని, క్రీ.శ. పదో శతాబ్దికి చెందిన రాజశేఖరుడనే కవి తన కావ్య మీమాంసలో ప్రస్తావించాడు. అయితే, ఈ కుంతల శాతకర్ణిని శాతవాహన రాజుగా గుర్తించడం అసాధ్యమనే అంశం, పైన వివరించడం జరిగింది.

శాతవాహన రాజైన హాలుడు సంకలితం చేసినట్లు **"శాలివాహన గాథాసప్తశతి"** అనే గ్రంథం కానవస్తున్నది. ఆ గ్రంథంలో ఆ రాజు ఏడు వందల గాథలను సంపాదించి, సంపుటీకరించాడు. అవన్నీ ప్రజల్లో ప్రచారంలో ఉన్నవే. వాటిని ఈ రాజు గ్రంథ రూపంలో సమకూర్చాడు. "గాథ" అనగా శ్లోకం వంటి నాలుగు పాదాలు కలిగిన వృత్తం; అవి ఏదో ఒక సందర్భంలో చమత్కారంగాను, రసవత్తరంగాను చెప్పిన ముక్తకాలు; అంటే, వేటికవి ప్రత్యేకమైనవి. ప్రాకృత భాషలో అటువంటి వాక్చమత్కారం కలిగిన గాథలు సాధారణ ప్రజానీకంలో ఉత్పన్నమై, ప్రచారంలో ఉండడం, అప్పటి జన సామాన్యానికి ప్రాకృత భాషా పాండిత్యం, కవితాశక్తి, సాధారణ విషయాలని తోస్తుంది. కేవలం రాజాదరణ కారణంగా కాక, ఆనాటి ప్రజానీకం గడుపుతున్న ఉల్లాసకరమైన జీవితం, ఈ విధమైన కవితా వికాసానికి కారణమని నిర్ణయించొచ్చు.

5.5.2 : సంస్కృతం

ఉత్తర భారతదేశంలో ఆనాటికే సంస్కృత భాషలో పురాణేతిహాసాలేకాక, కావ్య, నాటక ప్రక్రియల్లో విస్తృతంగా సాహిత్యమేర్పడింది. ఈ సంస్కృత సాహిత్య వికాసం ఉజ్జయినిలో పరిపాలిస్తున్న శక క్షత్రపులను ఆకర్షించింది. వారు ఆ భాష పట్ల ప్రదర్శించిన గౌరవం, అనక్తిని రుద్రదాముని జునాగఢ్ శాసనం వలన గ్రహించొచ్చు. ఆ శాసనం చక్కని సంస్కృత సాహిత్య భాషావైదుష్యం కలిగినదేకాక, రుద్రదాముడు ప్రసిద్ధమైన సంస్కృత సాహిత్య విశారదుడని వివరిస్తుంది. శక క్షత్రపుల రాజకీయాధికారంతో పాటుగా, దక్కన్ పీఠభూమి పైకి ఈ సంస్కృత భాషా ప్రభావం కూడ వ్యాపించింది.

సంస్కృత భాషా జ్ఞానం లేకపోవడాన, ఒక శాతవాహన రాజు భార్య పరిహాసానికి గుర్తై, తనను ఆరు నెలల కాలంలో సంస్కృత కోవిదునిగా చేయవలసిందని, తన ఆస్థాన విద్వాంసులైన గుణాఢ్యుడు, శర్వవర్మ అనే వారిని అర్థించినట్లు, గుణాఢ్యుడు అది అసాధ్యమనగా, శర్వవర్మ సాధ్యమేనని ప్రకటించి, ఆరు నెలల కాలంలో రాజును సంస్కృత విద్వాంసునిగా తీర్చిదిద్దినట్లు, **కథాసరిత్సాగరం** లోని ఒక ఇతివృత్తం వివరిస్తుంది. శాతవాహన రాజు కొలువులో ఇద్దరు సంస్కృత విద్వాంసులున్నట్టు తెలియడమే, అప్పటి రాజుల సంస్కృత భాషాభిమానానికి సూచన. అయితే, ఈ శాతవాహన రాజెవరో గుర్తించడం సాధ్యం కాదు. హాల శాతవాహనుడేనని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. అయితే, ఈ రాజును శాతవాహన వంశ క్రమంలో గుర్తించడం సాధ్యం కాదు.

ఈ గాథలో శర్వవర్మ **"కాతంత్ర వ్యాకరణ"** మనే గ్రంథాన్ని రచించి, బోధించడం ద్వారా శాతవాహన రాజును సంస్కృత విద్వాంసుణ్ణి చేయగలిగాడు. సంస్కృత వ్యాకరణ ప్రక్రియల్లో ఇదొకటి; కాశ్మీర దేశంలో ఇది ప్రఖ్యాతి పొందింది. అయితే, ఈ ఇతివృత్తం వలన ఈ వ్యాకరణ ప్రక్రియ ఆంధ్ర దేశంలో ఉత్పన్నమైందని తోస్తుంది.

BRAOU

5.5.3 : దేశి భాషాభివృద్ధి

పైన పేర్కొన్న గుణాఢ్య, శర్వవర్మల స్పర్ధను గూర్చిన గాథ, వాస్తవంగా **"బృహత్కథ"** అనే గ్రంథం లోనిది. దీనిని గుణాఢ్యుడే పైశాచీ భాషలో రచించగా, సోమదేవసూరి అనే కాశ్మీర కవి **"కథాసరిత్సాగరం"** అనే పేర, క్షేమేంద్రుడనే మరొక కాశ్మీర కవి **"బృహత్కథామంజరి"** అనే పేర సంస్కృతం లోనికి అనువదించారు. శర్వవర్మ రచించిన **కాతంత్ర వ్యాకరణం** వలెనే, గుణాఢ్యుని **బృహత్కథ** కూడ దేశంలో ప్రఖ్యాతి కావడం ఆసక్తికరమైన అంశం.

ఈ ఇతివృత్తంలో గుణాఢ్యుడు శాతవాహన రాజును ఆరు నెలల కాలంలో సంస్కృత భాషా కోవిదుని చేయగల్గితే, తాను సంస్కృత, ప్రాకృత, దేశి భాషలను పరిత్యజిస్తానని శర్వవర్మతో పంతం పట్టినట్లు తెలియవస్తుంది. వీటిలో ప్రాకృతం బౌద్ధ ధర్మ వ్యాప్తి వలన ఆంధ్ర దేశంలో ప్రవేశించిన పాళీ - అర్ధమాగధి కావచ్చునని తోస్తుంది. ఈ మూడు భాషలను పరిత్యజించడం చేత, గుణాఢ్యుడు తన **బృహత్కథను** పైశాచీ భాషలో రచించినట్లు, అందువలన ఆ గ్రంథం రాజాదరణ పొందలేక పోయినట్లు, **కథాసరిత్సాగరం** వివరిస్తుంది. ఈ ఇతివృత్తం పైశాచి భాష పేశాచాలు ఉపయోగించే భాషగా, తిరస్కారానికి గురైనట్లు సూచిస్తున్నా, అది ఆంధ్ర దేశంలో ప్రచారంలో ఉన్న ఒక ప్రాకృత భాషా భేదం. మధ్యాసియా నుండి ఆంధ్రులతోపాటుగా తరలివచ్చిన కొన్ని జాతులు, తెగలు మాట్లాడే భాష.

కాగా, ఈ ఇతివృత్తం పేర్కొనే "దేశి" భాషను గుర్తించాల్సుంది. "దేశి" అనగా దేశీయమైన, అనగా ఈ ప్రదేశంలో ప్రయోగంలో ఉన్న భాష. ఇది నిస్సంశయంగా తెలుగు భాషకు తొలి రూపమైనదని, స్థానిక జనుల పలుకుబడుల నుండి ఏర్పడుతున్నదని, పలువురు భాషాకోవిదుల నిర్ణయం. ఆ కాలంలో స్థానికులైన ముండారీ, ఆస్ట్రిక్ తెగల భాషలు, ద్రావిడ భాషా శాఖలు పరస్పరం సన్నిహితమై, ప్రభావితం చేసుకొంటున్నట్లు, సహేతుకంగా నిర్ణయించొచ్చు. శాతవాహనులు తమ ఆధిపత్యాన్ని తీరాంధ్రం లోనికి విస్తరించిన తర్వాత, కొన్ని ద్వైభాషిక నాణాలను విడుదల చేసినట్లు, పైన వివరించడం జరిగింది. వాటిపై, ఒక వైపు ప్రాకృతం లోను, రెండవ వైపు ప్రాచీన తమిళ భాషగా అక్కడి చరిత్ర పరిశోధకులు అభిప్రాయపడ్డా, అది ప్రాచీన తెలుగు భాషగాను, అప్పటికి తెలుగు, ద్రావిడ భాషా మూలం (root) నుండి విడిపోలేదని, D.C. సర్కార్ నిర్ణయించాడు. శాతవాహన యుగానికి చెందిన **గాథాసప్తశతిలో** అసంఖ్యాకంగా తెలుగు పదాలున్నట్లు, భాషా శాస్త్రవేత్తల పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. కనుక, తెలుగు ప్రాంతీయ, లేదా దేశి భాషగా, క్రీ.శ. రెండో శతాబ్ది ప్రారంభం నాటికి గణనీయమైన అభివృద్ధి చెందినట్లు, నిస్సంశయంగా చెప్పొచ్చు.

పై పరిశీలన వలన, శాతవాహన యుగం నాటి భాషా సారస్వతాల పరిణామాల్లో పలు తెగలు, జాతులు, వాటి పలుకుబడులు పరస్పరం ప్రభావితమౌతున్నట్లు స్పష్టపడుతున్నది. ఆంధ్రులు, వారిని అనుసరించిన కొన్ని జాతులు తీసుకొని వచ్చిన ప్రాకృత భాషా భేదాలు, బౌద్ధ మత విస్తరణల వలన ప్రవేశించిన సంస్కృతం, వీటిలో ప్రధానమైనవి. ఈ భాషలు స్థానిక ప్రజానీకానికి చెందిన ఆస్ట్రిక్, లేక ముండారీ బాష, మూల ద్రావిడం లోని ఒక శాఖకు చెందిన తమిళ భాషలతో ప్రభావితమై, తెలుగు భాషగా రూపొందే ప్రక్రియ, శాతవాహన యుగం నాటికే స్పష్టమైన స్వరూపాన్ని ధరించిందని నిశ్చయించొచ్చు.

BRAOU

5.6 : వాస్తు, శిల్ప కళల పగతి

మానవుని బుద్ధి వికాసానికి, సౌందర్య దృష్టికి వాస్తు, శిల్ప కళా వికాసం నిదర్శనం. ఇవి రెండు మత విశ్వాసాలు, ఆచారాలతో ముడివడి, వాటి ఆధారంతో అభివృద్ధి చెందుతాయి. దక్కన్ పీఠభూమిపై వాస్తు, శిల్ప కళల వికాసం, బౌద్ధ మత విస్తరణతో ప్రారంభమైదనొన్నది.

సాధారణంగా వాస్తు, శిల్ప కళల వికాసం రాజ పోషణ వలన జరిగేది. సామాన్య కర్షక, కార్మిక జనుల శ్రమ ఫలితాన్ని (మిగులు ఉత్పత్తులను) బలాత్కారంగా రాజులు ఆక్రమించి, భవన నిర్మాణాలు, శిల్ప కళలపై దుర్వ్యయం చేస్తారని, విస్తృతంగా ఆధునిక చరిత్రకారుల అభియోగం. అయితే, శాతవాహన యుగం నాటి బౌద్ధ వాస్తు, శిల్ప కళలు, అనాటి జనుల సౌఖ్యవంతమైన, ఉల్లాసకరమైన జీవితం నుండి ఉత్పన్నమైనవి. ఆనాటి గుహాలయాల్లో అధిక భాగాన్ని తొలిపించడమూ, అమరావతి, భట్టిప్రోలు మొదలైన ప్రదేశాల్లోని మహా చైత్యాల విస్తరణకు పూనుకొన్నవారు, ప్రధానంగా ప్రజలు. వారు వర్తక వాణిజ్యాలకు, వృత్తి సంఘాలకు చెందినవారు, వ్యవసాయదారులైన గహపతులు. వారు సౌకర్యవంతంగా, ఉల్లాసంగా జీవించగల్గడమే, ఈ వాస్తు శిల్ప కళల అభివృద్ధికి కారణమైంది.

వాస్తు, శిల్ప కళా వికాసం ప్రధానంగా మతం ఆలంబనగా జరిగినా, జాతక కథల్లోని సంఘటనలు, బుద్ధుని జీవిత ఘట్టాలు మొదలైనవి ప్రదర్శించడంలో, శిల్పులు, కళాకారుల సౌందర్య దృష్టి, నైపుణ్యం వ్యక్తమౌతాయి. వారి ఊహలకు సమకాలీన జీవితం ఆధారమౌతుంది. ప్రణయ పారవశ్యంలో ఉన్న మిథున శిల్పాలు, ఆకాశంలో సంచరించే దేవతాగణాలు మొదలైనవి, సమకాలీన జనుల విశ్వాసాలు, అభిరుచులు, ఊహల వల్లనే శిల్పంలో చోటు చేసుకోగలిగాయి. పాట్టి దేహాలు, బాన కడుపులతో యక్ష గణాలను ప్రదర్శించడంలో, కొంత హాస్యాన్ని ప్రదర్శించారు. కనుక, మత ప్రేరణల వలన ఉద్భవించి అభివృద్ధి చెందినా, శిల్పం కేవలం ధార్మికంగా, ఆధ్యాత్మికంగా, ఉండ లేదు; వాస్తవ జీవితాన్ని వదిలి, పూర్తిగా అలౌకిక స్వర్గాన్ని భరించ లేదు.

శాతవాహన యుగం నాటి వాస్తు శిల్ప కళలు పూర్తిగా బౌద్ధ ధర్మానికే చెందినవని కావడాన, ఆ కాలంలో మరే ఇతర మత ధర్మాలకు స్థానం లేదని, వైదిక, లేదా మధ్య వైదిక ధర్మం ఇంచుమించు అదృశ్యమైందని, చరిత్రకారులు అభిప్రాయపడేవారు. శాతవాహనులు, వారి అనుయాయ భాణ వంశాలు తిరిగి వైదిక మతాన్ని పోషించగా, అది మరల విజృంభించి, బౌద్ధ ధర్మాన్ని అణచివేసిందని వారి విశ్వాసం. ఈ అభిప్రాయాలు పూర్తిగా అనుమంజసమైనవి. క్రీ.పూ. మూడో శతాబ్ది నుండి క్రీ.శ. మూడో శతాబ్ది వరకు బౌద్ధ ధర్మం ఉచ్ఛ స్థితిని చేరిన కాలం లోనే, ధర్మశాస్త్ర, ఇతిహాస, పురాణ వాఙ్మయం నిర్మాణమైందని, వైదిక ధర్మం మధ్య వైదిక ధర్మంగా పరిణమిస్తున్నదని, పైన వివరించడం జరిగింది. అయితే, దేవ, దేవతా ప్రతిమలను రూపొందించి ప్రతిష్ఠించడం, ఆలయాలను నిర్మించడం ప్రారంభం కాలేదని గ్రహించాము. ఇటీవల కృష్ణా తీరంలో, కర్నూల్ జిల్లాలో జరిగిన త్రవ్వకాలు (వీరాపురం) క్రీ.శ. ఒకటో శతాబ్దికి చెందిన ఆలయాలను బయల్పరిచాయి. అవి కేవలం విగ్రహ ప్రతిష్ఠకై ఉద్దేశించిన చిన్న గదులు (chambers) మాత్రమే. అవి ఈనాటి గ్రామ దేవతల గదులతో పోల్చదగినని.

5.6.1 : పశ్చిమ కనుమల్లోని గుహాలయాలు

భారతదేశంలో శాశ్వతమైన భవన నిర్మాణాల గూర్చిన ఆలోచనలు, ప్రయత్నాలు, శ్రమణ, పరివ్రాజిక, భిక్షు సంఘాలకు వర్షాకాలంలో తాత్కాలిక వసతులను ఏర్పర్చే ఉద్దేశంతో ప్రారం

BRAOU

భమైనాయి. అటువంటి వారు సాధారణ జనావాసాలకు దూరంగా, అరణ్యాల్లో, కొండ గుహల్లో నివసించడం బహుకాలంగా జరుగుతున్నదే. అదే విధంగా, ప్రధాన రహదారులకు చేరువగా, కొండలను తొలచి, కృత్రిమంగా గుహాలయాలను నిర్మించడం ప్రారంభమైంది. అశోకుడు, అతని కుమారుడైన దశరథుడు, బీహార్‌లో బారాబర్, నాగార్జున కొండల్లో గుహాలయాలను తొలిపించడం, ఈ విధంగా జరిగిందే. భారతదేశంలో మత ధార్మిక సంస్థల కొరకు శాశ్వతమైన భవనాలను ఏర్పర్చడం, ఈ విధంగా మౌర్యుల కాలంలో ప్రారంభమైంది.

బుద్ధుడు తన జీవిత కాలం నాటి శ్రమణ, పరివ్రాజక సంఘాల జీవన విధానాన్ని అనుసరించి, బౌద్ధ భిక్షు సంఘాన్ని నిర్మించాడు. భిక్షువులు బహు కాలం ఏ ప్రదేశం లోను నివసించక, దేశాటనం చేస్తూ, ధర్మ ప్రచారం చేయవలసిందిగా, ఆయన ఆదేశించాడు. అయితే, వర్షా కాలంలో వారు సమీప గ్రామాల్లో, లేదా పట్టణాల్లో నివసించొచ్చు. కాలానుక్రమంగా బౌద్ధ సంఘం విస్తరించి, గ్రామాల్లో, పట్టణాల్లో తాత్కాలిక నివాసాలు అసాధ్యం, అవాంఛనీయం కాగా, ధనవంతులైన వర్తకులు, వృత్తి జీవులు వారి కొరకు "వస్సావాస" (వర్షావాస) గా గుహా విహారాలను, వాటికి అనుబంధంగా చైత్య గృహాలను తొలిపించసాగారు. పశ్చిమ కనుమల్లోని నాసిక్, కన్హేరీ, కార్లా, భాజా, కొండానే, నానాఘాట్, అజంతా మొదలైన ప్రదేశాల్లో, నేటికి కానవస్తున్న బౌద్ధ గుహాలయాలు ఈ విధంగానే ఏర్పడ్డాయి. అవి సాధారణంగా భిక్షువులు సంచరించే (వర్తక) మార్గాలకు సమీప ప్రదేశాల్లో తొలిచి ఏర్పర్చినవి.

అజంతా గుహాలయాల్లో ప్రాచీనమైనవి క్రీ.శ. ఒకటో శతాబ్దికి చెందినవి; కాగా, పైన పేర్కొన్న పశ్చిమ కనుమల్లోని గుహాలయాలు, క్రీ.పూ. రెండో శతాబ్దారంభం నుండి, క్రీ.శ. మూడో శతాబ్దాంతం వరకు అభివృద్ధిచెందినాయి. అజంతా వద్ద క్రీ.శ. ఏడో శతాబ్దారంభం వరకు గుహాలయాలను తొలచడం కొనసాగింది. క్రీ.శ. ఒకటో శతాబ్ది పూర్వాపరాల్లోనే, కళింగ దేశంలో ఉదయగిరి, ఖండగిరి కొండల్లోను, ఆంధ్ర దేశ తీర మైదానాల్లో ముసునాగపర్వతం (పశ్చిమ గోదావరి జిల్లాలోని గుంటుపల్లి) వద్ద గుహాలయాలను తొలచడం జరిగింది. తూర్పు తీరం లోని ఈ గుహాలయాలకు ప్రేరణ, నమూనా, మౌర్యుల కాలం నాటి గుహాలయ వాస్తు విధానం నుండి అభించినట్లు కానవస్తుంది. ప్రాచీన కళింగ-ఆంధ్ర దేశ తీర మైదానాలపై విస్తరించిన జైన ధర్మం, ఈ గుహాలయాలను తొలవడానికి కారణంగా తోస్తుంది.

పశ్చిమ కనుమల్లోను, సహ్యాద్రి కొండల్లోను (అజంతా) కానవస్తున్న గుహాలయాలు, అప్పటికే అభివృద్ధి చెందిన వాస్తు సూత్రాలను, అనుభవాలను ప్రదర్శిస్తాయి. అయితే, అంతకు పూర్వం జరిగిన ప్రయత్నాలు శాశ్వత పదార్థాలను ఉపయోగించినవి కాకపోవడం వల్ల, నేడు కానరావు. ఈ గుహాలయాలు సాధారణంగా భవన నిర్మాణంలో పై కప్పును భరించడానికి కొయ్య దూలాలు, దంతెలను ఉపయోగించిన ఆనవాళ్లను కనబరుస్తాయి. కొన్నింటిలో అదే విధంగా పైకప్పు అడుగు భాగాన దూలాలను, దంతెలను రాతిలోనే మలిచారు. ఇది కేవలం అలవాటుగాను, అలంకరణ కొరకు ఉద్దేశించి ఏర్పర్చడం, తర్వాతి దశ. ఈ దశలో అవి అందమైన శిల్పాలకు ఆధారమైనాయి. బుద్ధుని ప్రతిమలు, లేదా చిత్రాలంకరణ ప్రక్రియలు (decorative motifs), ఆకాశయానం చేస్తున్న, యక్ష, సిద్ధ మొదలైన దేవతాగణాలు అటువంటి అలంకరణ శిల్పానికి వస్తువులు. మహాయాన మతం విస్తరించిన తర్వాత, బుద్ధుని ప్రతిమలు అధికంగా ఈ అలంకరణ శిల్పంలో వస్తువులైనాయి. అజంతా గుహల్లో శిల్పం బదులుగా, వర్ణ చిత్రాలను పొందుపర్చడం జరిగింది.

BRAOU

బౌద్ధ వాస్తువు లోని గుహాలయాలు, భవన నిర్మాణాలు రెండు విధాలైనవి. అవి : (1) చైత్య గృహాలు; (2) విహారాలు. బౌద్ధ ధర్మం విగ్రహారాధన ప్రారంభించక పూర్వం, చైత్యం ప్రధానమైన ఆరాధ్య వస్తువు. "చైత్య" మనే శబ్దం "చితి" నుండి ఉత్పన్నమైంది. బుద్ధుని మహాపరినిర్వాణం తర్వాత, ఆయన శారీరక అవశేషాలను, ఉపయోగించిన వస్తువులను నిక్షిప్తం చేసి, వాటిపై నిర్మించిన స్మారక చిహ్నాలు, చైత్యాలు. వాటిని స్తూపాలని వ్యవహరించడం కూడ కద్దు. అయితే, ప్రాచీనాంధ్ర దేశం లోని శాసనాల్లో వాటిని చైత్యాలు, మహా చైత్యాలని పేర్కొనడం జరిగింది. ఇవి గుండ్రని వేదికపై అర్ధగోళాకృతిగా నిర్మించినవి. వాటి పై భాగంపైన హర్మిక అనే ఒక చిన్న చతురస్రాకారపు ప్రాకారం (railing) లో ఒక గది ఉంటుంది. బుద్ధ ధాతువులను ఈ గదిలో ఉంచడం జరిగేది. బుద్ధ ధాతువులు, అనగా శారీరక అవశేషాలు మాత్రమే కాక, ఇతర ప్రసిద్ధాచార్యుల ధాతువులపైన, లేదా వారు ఉపయోగించిన వస్తువులపైన కూడ, ఇటువంటి స్తూపాలను నిర్మించడం జరిగింది. అయితే, ఆంధ్ర దేశం లోని చైత్యాలలో బుద్ధ ధాతువులను ఆయక వేదికలపై నిలిపిన ఆయక స్తంభాల అడుగున ఉంచడం జరిగింది. ఈ విధమైన ఆయక వేదికలు, వాటిపై నిలిపిన ఆయక స్తంభాలు, ప్రాచీనాంధ్ర దేశం లోని మహాయాన బౌద్ధ శాఖకు చెందిన మహాచైత్యాలు, లేదా మహాస్తూపాల లక్షణం.

అర్ధగోళాకృతిగా ఉన్న భాగాన్ని "అండ" మని పిలుస్తారు. దానిపై భాగాన హర్మిక, దానిపై ఆచ్ఛాదనగా, పైకి వెళ్లే కొలది ఒక దాని కంటె ఒకటి చిన్నవిగా రాతిలో నిర్మించిన ఛత్రాలు, అనగా గొడుగులు ఉంటాయి.

భారతదేశ మంతటా వేలాదిగా స్తూపాలు నిర్మాణమైనాయి. వాటిన్నింటిలో బుద్ధ ధాతువులను ఉంచడం అసంభవం. కనుక, అత్యధిక శాతం స్తూపాలు కేవలం స్మారక నిర్మాణాలు, బుద్ధునికి చిహ్నంగా భక్తి భావాన్ని వెల్లడించడానికి ఉద్దేశించినవి. కనుక వాటిని "ఉద్దేశిక స్తూపా" లంటారు. బుద్ధ ధాతువును కలిగిన వాటిని ధాతుగర్భ (ప్రాకృతంలో "దాగలు") స్తూపాలని, ఆంధ్ర దేశంలో చైత్యాలంటారు. బుద్ధుడు కాని, ఇతర ప్రసిద్ధ బౌద్ధాచార్యులు కాని ఉపయోగించిన వస్తువులను నిక్షిప్తం చేసి, స్తూపాలను నిర్మించడం జరిగింది. అటువంటి వాటిని "పారిభోగిక స్తూపా" లంటారు. గుహాలయాల్లోని చైత్య గృహాలు కేవలం ఆరాధనా అవసరం కొరకు గండ శిలలను మలిచి రూపొందించినవి. కనుక, అవి ధాతుగర్భ స్తూపాలు కావు; ఉద్దేశిక స్తూపాలు మాత్రమే. వస్సావాస సమయంలో అక్కడి విహారాల్లో నివసించే భిక్షువుల ఆరాధనకు అవి ఉద్దేశించబడినవి.

విహారాలు చతురస్రాకారంగా విశాలమైన శాల (hall) ను కలిగి, దానికి మూడు వైపుల, లేదా రెండు వైపుల (కుడి, ఎడమ వైపులు) గోడలో తొలిచిన చిన్న చిన్న గదుల (cells)ను కలిగి ఉంటాయి. ఈ గదులు భిక్షువుల నివాసం కొరకు ఏర్పర్చినవి; మధ్య లోని శాల, ప్రతి షణ్మాసం రోజుల కొకసారి జరిగే "ఉపోసథ" సమావేశాలు జరుపుకోడానికి, లేదా పరిసర జనులు బుద్ధ ధర్మం వినగోరి సమావేశమైతే, వారిని కూర్చుండబెట్టి ప్రసంగించడానికి ఉద్దేశించబడింది.

గుహాలయాల్లోని చైత్య గృహాలు దీర్ఘచతురస్రాకారపు మండపాలుగా, కుడి, ఎడమ వైపుల స్తంభాల వరుసలతో తొలిచేవారు. ఈ స్తంభాల వరుసలు రెండు వైపుల గుహాలయ గోడలకు సమానాంతరంగా విస్తరించి, ఒక సందును ఏర్పరుస్తాయి. గుహాలయ వెనుక భాగం అర్ధవృత్తాకారంగా ఉండి, దాని మధ్య భాగంలో ఉద్దేశిక స్తూపాన్ని మలచడం జరిగేది. కుడి ఎడమల ఉన్న స్తంభాలు ఈ స్తూపం చుట్టూ విస్తరించి ఉంటాయి. ఈ స్తంభాల వరుస ఏర్పర్చే సందు, స్తూపం చుట్టు ప్రదక్షిణం

B.RAO U

చేయడానికి ఉపయోగించబడేది. కనుక, "ప్రదక్షిణ పథ" మని అంటారు. చైత్య గుహాలయాల ముఖ తలం (facade) శిల్పాలంకరణలను కల్గి, ప్రవేశ ద్వారం పై భాగాన గుర్రపు నాడా ఆకారంలో ఒక పెద్ద వాతాయనం (కిటికీ)ను కల్గి ఉంటుంది. కాలానుక్రమంగా ఈ వాతాయనం, ముఖ తలం మరింతగా శిల్పాలంకరణలను కలిగి ఉండేవి.

5.6.2 : గుంటుపల్లి గుహలు

గుంటుపల్లి (పశ్చిమ గోదావరి జిల్లాలోని జీలకర్ర గూడెం వద్ద ఉన్నవి) వద్ద గుహాలయాలు, ఆంధ్ర దేశం లోని గుహాలయాలలో అన్నిటికన్నా ప్రాచీనమైనవిగా భావించదగినవి. ఈ గుహల్లో ఒకటి, పైన పేర్కొన్న మౌర్యుల కాలపు బరాబర్ గుహాలయాన్ని పోలి ఉంది. అందుచేత, ఈ గుహాలయం మౌర్య గుహాలయాలకు సుమారుగా సమకాలికంగా భావించదగింది. ఈ గుహాలయాల్లో శిల్పాలంకరణలు చాలా స్వల్పం. ఈ గుహల ప్రాచీనతకు ఇది మరొక నిదర్శనం. ఈ గుహాలయాల్లో ఒకటి వృత్తాకారమైన ప్రణాళిక కలిగి, కేవలం ఉద్దేశిక స్థూపం, ప్రదక్షిణ పథాన్ని, మాత్రమే కలిగి ఉంది. చైత్య గృహాలను చైత్యాలయాలుగా, అనగా స్తంబాల వరుస, ప్రదక్షిణ కలిగి ఉంది. చైత్య గృహాలను చైత్యాలయాలుగా, అనగా స్తంబాల వరుస, ప్రదక్షిణ పథం, రెండు వైపుల ఉన్న స్తంభాల వరునకు మధ్య ఒక శాల (hall) గా, ప్రణాళిక తయారుకాక పూర్వం, కేవలం ఉద్దేశిక చైత్యం మాత్రమే కలిగి ఉండడాన, ఈ గుహాలయం తక్కిన చైత్యాలయాలు, పశ్చిమ కనుమల్లోను, అజంతా వద్ద కానవచ్చే చైత్య గృహాల కంటె పూర్వం నాటిదని నిర్ణయించొచ్చు. ఇక్కడి గుహాలయాల ముఖ తలం గుడిసె కప్పను పోలి ఉంటుంది. ఇది కూడ మౌర్య కాలపు గుహాలయ ప్రక్రియకు చెందిందే. గుహాలయ వాస్తువు ప్రారంభ దశలో సమకాలీనంగా ఉండే నివాస గృహాల నమూనాపై రూపొందించినట్టిది. కనుక, అతి ప్రాచీనమైన విధానంగా గుర్తించదగింది.

5.6.3 : చైత్యాలు

పైన పేర్కొన్నట్లు, కొండల్లో తొలిచిన గుహాలయాల్లో కానవచ్చే ఉద్దేశిక స్థూపాలు కాక, జనసాంద్రత కలిగిన పట్టణాల సమీపంలో సైతం, స్థూపాల నిర్మాణం విస్తారంగా జరిగింది. ఈ పట్టణాలు మొదట్లో బుద్ధుని జీవితంతో సన్నిహిత సంబంధం కలవి. క్రమేణ, బౌద్ధ ధర్మ విస్తరణ వలన, ప్రతి పట్టణం లోను, గ్రామం లోను, ఉద్దేశిక స్థూపాల నిర్మాణం జరిగింది. ప్రాచీనాంధ్ర దేశం లోని శ్రీధాన్యకటక - అమరావతి, శ్రీపర్వత - నాగార్జునకొండ, భట్టిప్రోలు, ఘంటసాల మొదలైన చోట్ల, ఈ విధంగానే స్థూపాల నిర్మాణం జరిగినట్లు తోస్తుంది. ఇవేవీ వాస్తవంగా బుద్ధుని జీవితంతో సంబంధించిన ప్రదేశాలు కావు. అయితే, అశోకుడు పన్నెండు ధాతు గర్భ స్థూపాల నుండి బుద్ధ ధాతువులను వెలికి తీసి, వాటిని పునర్విభజన చేసి, 84,000 స్థూపాలను నిర్మించినట్లు బౌద్ధ వాఙ్మయం తెల్పుతూంది. ఈ వాక్యం లోని స్థూపాల సంఖ్య లోని అతిశయోక్తిని వదిలివేసినా, బుద్ధ ధాతువుల పునర్విభజన జరిగి, వివిధ ప్రదేశాల మధ్య పంపకం జరిగినట్లు విశ్వసించడంలో పొరబాటు లేదు. ఈ పంపకంలో ఆంధ్ర దేశం లోని ప్రఖ్యాత స్థూపాలకు సైతం, బుద్ధ ధాతువులు లభించినట్లు, వాటిని నిక్షిప్తం చేయడం కొరకు స్థూపాలను విస్తరించి, ఆయక వేదికలను నిర్మించడం జరిగినట్లు భావించొచ్చు. ఈ విధంగా పైన పేర్కొన్న స్థూపాలన్నీ మహాచైత్యాలుగా పరిణామం చెందాయి. కాగా, ఈ స్థూపాలు వాస్తవంగా అశోకునికి పూర్వం నాటివని భావించడం యుక్తం.

BRAOU

5.6.3.1 : అమరావతి మహాచైత్యం

నేటి గుంటూర్ జిల్లా లోని అమరావతి గ్రామాన్ని ఆనుకొని ఉన్న ధరణికోట, ప్రాచీన కాలంలో ప్రసిద్ధి కెక్కిన శ్రీధాన్యకటక నగరం. ఇక్కడి మహాచైత్యం, మహాసాంఘిక-చైత్యక వాదుల్లోని పూర్వ శైలీయులకు చెందింది. ప్రాచీనాంధ్ర దేశం లోని మహాచైత్యాలన్నిటికంటె పరిమాణంలో పెద్దది. శ్రీధాన్యకటక-అమరావతి శిల్పం ప్రాచీన భారతదేశ శిల్ప శైలుల్లో ప్రత్యేకమైన గుర్తింపును పొందింది.


అమరావతి స్తూపం (మహాచైత్యం) సుమారు $1\frac{1}{2}$ మీటర్ల ఎత్తు కలిగిన వృత్తాకారమైన వేదికను కలిగింది. దీని వ్యాసం 49.3 మీటర్లు. ఈ వేదిక నిర్మాణానికి ఉపయోగించిన ఇటుకలు 57x28x7.6 సెంటిమీటర్ల పరిమాణం కలిగినవి. వేదికకు నలు వైపుల 7.2 మీటర్ల పాడవు, 2.1 మీటర్ల వెడల్పు కలిగిన ఆయక స్తంభ వేదికలున్నాయి. వీటిపై ఆయక స్తంభాలను నిల్పి, వాటిని పుష్పాలతో అలంకరించి, ఆరాధించడం జరిగేది. ఈ ఆయక స్తంభాలు, ఒక్కొక్క వేదికపై ఐదేసి చొప్పున నిలుపబడి ఉండేవి. ఇవి బుద్ధుని జీవితం లోని ఐదు ఘట్టాలకు ప్రతీకలు. అవి: (1) జననం; (2) మహాభినిష్క్రమణం (సన్యాసం); (3) సంబుద్ధి (జ్ఞానోదయం); (4) ధర్మచక్ర ప్రవర్తన (మొట్టమొదటి ధర్మ ప్రవచనం) ; (5) మహాపరినిర్వాణం.

వర్తులాకారపు వేదికపై 42 మీటర్ల ఎత్తున అర్ధగోళాకృతిలో అండం నిర్మించబడి ఉండేది. దీనిపై 2.32 మీటర్ల ఎత్తు వరకు శిల్పఫలకాలతో అలంకరించి, ఆ పైన సున్నంతో సునుపు చేయబడి ఉండేది. అండాన్ని కప్పిన వందలాదిగా, తెల్లని సలువరాతి వంటి సున్నపు రాతి ఫలకాలపై జాతక కథా ఘట్టాలు, బుద్ధుని జీవిత సంఘటనలు, స్తూప నమూనాలు, బుద్ధుని పూజించే భక్త గణం మొదలైన దృశ్యాలు చెక్కబడి ఉండేవి. పైన పేర్కొన్నట్లు, ఈ శిల్ప ఫలకాలపై కేవలం మతపరమైన అంశాలే కాక, సమకాలీన జీవిత దృశ్యాలు సైతం, ప్రముఖంగా చోటుచేసుకున్నాయి.

మహాచైత్యం చుట్టూ 54 మీటర్ల వ్యాసం కలిగిన స్తంభ ప్రాకార ముండేది. అది 136 నిలువు స్తంభాలు, 348 అడ్డు పలకలతో ఏర్పడింది. అడ్డు పలకలపై గుండ్రని శిల్ప ఫలకాలు బౌద్ధ వాఙ్మయాన్ని దృశ్య రూపంలో ప్రదర్శిస్తూ, చెక్కడం జరిగింది; నిలువు స్తంభాలు, కొన్ని చోట్ల అడ్డు పలకలు, పద్మాలు, అర్ధ పద్మాల శిల్పాలంకరణలను కలిగి ఉండేవి. నిలువు స్తంభాల నన్నింటిని, వాటి పైభాగాన 240 మీటర్ల పొడవైన వేష్టనం (coping) కలుపుతూ ఉండేది. ఈ స్తంభ ప్రాకారం నలు వైపుల ఉన్న ఆయక వేదికల కెదురుగా, 26 అడుగుల వెడల్పు గల ప్రవేశికలు (entrances) ఉండేవి. అక్కడ స్తంభ ప్రాకారం సమకోణం చేస్తూ, 16 అడుగుల మేర ముందుకు చొచ్చుకొని వస్తూ, మరల మలుపు తిరిగి, ఆరున్నర అడుగులు విస్తరించి ఉండేది. ఈ స్తంభ ప్రాకారానికి, వేదికకు నడుమ, 4 మీటర్ల వెడల్పు కల ప్రదక్షిణ పథ ముండేది.

అమరావతి మహా చైత్యం అయిదు దశల్లో అభివృద్ధి చెందిందని వాఙ్మయాధారాల వల్ల, అక్కడ జరిగిన పురావస్తు త్రవ్వకాలవల్ల తెలియవస్తుంది. మొదటి దశ అశోకునికి పూర్వం నాటిది; అప్పుడు స్తూపం పరిమాణంలో చాల చిన్నది. అశోకుని కాలం నాటి బ్రాహ్మీ లిపిలో చెక్కిన శాసనాలు కొన్ని ఈ దశకు చెందినవి, అక్కడి త్రవ్వకాల్లో లభించాయి. రెండో దశ అశోకుని కాలం నాటిది; ఈ దశలో జరిగిన విస్తరణలో బుద్ధ ధాతువులను నిక్షిప్తం చేసినట్లు తెలియవస్తూంది. మూడో దశ శాతవాహన యుగానికి చెందింది. ఈ దశలో స్తూపాన్ని పరిమాణంలో పెంచి, అలంకరించడం

BRAOU



అమరావతి స్తూపాకృతి

1. ఊర్ధ్వావలము (నిలువు స్తంభము). 2. సూచి (అడ్డుకమ్మి). 3. వైత్యలాంచనము. 4. అర్ధస్తంభపీఠిక. 5. ప్రదక్షిణ పథము (వీధి). 6. అర్ధస్తంభము (అయాకకరంబము). 7. అండము. 8. హర్మిక. 9. ఛత్రము.

BYJU

జరిగింది. స్తూపం చుట్టు స్తంభ ప్రాకారం కూడ ఈ దశకు చెందిందే. దీన్ని ఆచార్య నాగార్జునుడు నిర్మించినట్లు బౌద్ధ వాఙ్మయం లోని సాంప్రదాయిక గాథల్లో తారానాథుడు పేర్కొన్నాడు. నాలుగో దశలో స్తూపంపై అలంకరణలు కొనసాగాయి. ఈ దశ ఇక్ష్వాకు రాజుల కాలానికి చెందింది., ఐదో దశ ప్రాచీన పల్లవుల కాలం నాటిది; అంతగా విస్తరణ, అలంకరణ ఈ దశలో జరగలేదని, జరిగినా దానిలో లోగడ కంటె నైపుణ్యం లోపించినట్లు కానవస్తుందని, పురావస్తు వేత్తల నిర్ణయం.

5.6.3.2 : ఇతర ప్రసిద్ధ మహాచైత్యాలు

అమరావతి స్తూపం తర్వాత, శాతవాహన యుగం నాటి స్తూపాల్లో అత్యంత ప్రసిద్ధమైంది, భట్టిప్రోలు స్తూపం. అమరావతి రెండో దశలో లభించినటువంటి ప్రాచీన శాసనాలు, భట్టిప్రోలు వద్ద కూడ లభించాయి. ఇవి అశోకుని కాలం నాటి బ్రాహ్మీ లిపిలో చెక్కబడినవి. అయితే, అమరావతి స్తూపం వద్ద లభించినంతగా శిల్ప ఫలకాలు, అవశేషాలు భట్టిప్రోలు వద్ద లభించ లేదు.

ఇక్ష్వాకు వంశీయుల పరిపాలనా కాలంలో వైభవంగా వెలుగొందిన శ్రీపర్వత-నాగార్జునకొండ, కంటకసేల (ఘంటసాల) స్తూపాలు కూడ, వాస్తవంగా శాతవాహన కాలం నాటివే. అయితే, ఇవి ఇక్ష్వాకుల కాలంలో ప్రసిద్ధమైనవి కనుక, వేరొక భాగంలో వివరించడం జరిగింది.

5.7 : సంగ్రహంగా

అతి ప్రాచీన కాలం నుండి దక్షిణాపథం, విశేషించి, ఆంధ్ర దేశం ఉత్తర భారతదేశంతో సన్నిహిత సంబంధాన్ని కలిగి ఉండేది. గంగా - యమునా మైదానం నుండి ఇక్ష్వాకు వంశీయులు గోదావరీ మైదానాలకు వచ్చి, జనపదాలను నిర్మించారు. బహుశః, అంతకు పూర్వం నుండి తరచుగా జన సంచారాలు ఉభయ ప్రదేశాల నడుమ జరుగుతూ, సన్నిహితమైన సాంస్కృతిక సంబంధాలను ఏర్పర్చాయి. ఈ కారణంగా, ఉత్తర భారతదేశం నుండి వైదిక మత, సంస్కృతులు ఆంధ్ర దేశంలో ప్రవేశించాయి. అవి స్థానిక మత సంస్కృతులతో సమ్మేళనం చెందాయి. వాటికి అనుగుణంగా, వర్ణాశ్రమ విధానంతో కూడిన సామాజిక జీవన విధానం దక్షిణాపథంలో ప్రవేశించింది. శైవ భక్తి కూడ ఆ విధంగానే ఆంధ్ర దేశాన్ని చేరింది.

తర్వాత కాలంలో అదే విధంగా బౌద్ధ మత సంస్కృతులు దక్షిణాపథానికి వ్యాపించాయి. బౌద్ధ సంఘంలో "అంధకు"లని ప్రసిద్ధికెక్కిన ఆంధ్ర దేశ భిక్షువులు అనేక నూతన పరిణామాలకు కారకులైనారు. అశోక చక్రవర్తి ఆంధ్ర దేశానికి బౌద్ధ మత సంస్కృతుల విస్తరణకు చాల కృషి చేశాడు. అమరావతి వద్ద మహా చైత్యానికి విస్తరణ, అలంకరణను ఆ చక్రవర్తి జరిపించినట్లు సాక్ష్యాధారాలు లభిస్తున్నాయి. వైదిక, జైన ధర్మాల వలెనే, భారతదేశం లోని ప్రాచీన మత సంస్కృతుల్లో ఒకటైన జైన మతం కూడ, అతి ప్రాచీన కాలంలోనే ఆంధ్ర దేశంలో ప్రవేశించినట్లు జైన వాఙ్మయం పేర్కొంటుంది. అయితే, అతి ప్రాచీన కాలంలో జైనం ఆంధ్ర దేశంలో ప్రవేశించి, ప్రజానీకాన్ని ప్రభావితం చేసిందని స్పష్టంగా నిర్ధయించడానికి తగిన సాక్ష్యాధారాలు లభించవు.

బౌద్ధ మత వ్యాప్తి ఆంధ్ర దేశంలో వాస్తు, శిల్ప కళా వికాసానికి తోడ్పడింది. మహాచైత్యాలను నిర్మించడం, వాటిని శిల్ప ఫలకాలతో అలంకరించడం వలన, ఈ కళా వికాసం ప్రారంభమైంది.

BRAOU

5.8 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. శాతవాహన యుగం నాటి సాంఘిక వ్యవస్థ ముఖ్య లక్షణాలను పరిశీలించండి.
2. శాతవాహన యుగానికి సంబంధించిన సాంఘిక జీవన మెలాగుంది?
3. శాతవాహనులకు ముందు ఆంధ్ర దేశంలో నెలకొన్న ప్రాచీన జాతులు, వారి మత విశ్వాసాలను విశ్లేషించండి.
4. ఆంధ్ర దేశంలో బౌద్ధ మతం వ్యాప్తి చెందిన తీరును వివరించండి.
5. శాతవాహన యుగానికి చెందిన వాస్తు, శిల్ప కళాభివృద్ధి ప్రధాన లక్షణాలు, రీతులను సమీక్షించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. శాతవాహనుల నాటి సామాజిక, మత, సాంస్కృతిక పరిస్థితులను గూర్చి అధ్యయనం చేసేందుకు గల సాక్ష్యాధారాలెవ్వి?
2. ఆంధ్ర దేశం లోని స్థానిక జాతులు, వారి మత సంస్కృతులను సమీక్షించండి.
3. జైన మత వ్యాప్తికి కొండకుందాచార్యుడు, సింహనంది ఒనరించిన సేవలెట్టివి?
4. శాతవాహనుల పాలనలో ప్రాకృత, దేశి భాషలెట్లు అభివృద్ధి చెందాయి.?
5. అమరావతి మహాచైత్యం శాతవాహనుల కాలంలో ఎలా మెరుగులు దిద్దుకుంది?

BRAOU

5.9 : ఉపయుక్త గ్రంథాలు

1. Hanumantha Rao, B.S.L. : **Religion in Andhra**, Guntur, 1973
2. Majumdar, R.C., and Pusalkar, A.D. (Ed.) : **History and Culture of Indian People, Vol. III, the Classical Age**, Bombay, 1954
3. Ray, Amita : **Life and Art of Andhradesa**, Delhi, 1983
4. Satyanarayana, K. : **Study of the History and Culture of the Andhras, Vol. I.** Delhi, 1975
5. Hanumantha Rao, B.S.L. : ఆంధ్రుల చరిత్ర, గుంటూర్, 1982
6. Sundara Rama Sastry, V. : దక్షిణ భారతదేశ చరిత్ర, తెలుగు అకాడమి ప్రచురణ, 1989.

రచయిత : డా.వి. సుందరరామశాస్త్రి

BRAOU

ఖండం-III : శాతవాహనానంతర యుగం (క్రీ.శ. 624 వరకు)

ఈ ఖండికలో రెండు భాగాలున్నాయి. అవే, 6, 7 భాగాలు. 6 వ భాగంలో శాతవాహన సామ్రాజ్యం అస్తమించిన తర్వాత ఆంధ్ర దేశం లోని భిన్న ప్రాంతాల్లో, ఆయా కాలాల్లో పాలనను గావించిన స్థానిక రాజ వంశాల రాజకీయ చరిత్రను వివరించడం జరిగింది. క్రీ.శ. 624 ను దీనికి హద్దుగా తీసుకోవడమైంది. పాలకులు స్థానికులైనా, ప్రాంతీయ చరిత్రలో వీరి భూమిక ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. బలమైన కేంద్రీయ శక్తి లేమి, రాజకీయ అస్థిరత, అనైక్యత, నిరంతర ఘర్షణలకెలా దారితీస్తుందో, చూడటం జరుగుతుంది.

7వ భాగంలో, ఈ సుదీర్ఘ చారిత్రక యుగంలో, సామాజిక, ఆర్థిక, మత, సాంస్కృతిక రంగాల్లో సంభవించిన పరిణామాలు, వెలకొన్న పరిస్థితులను, పరిశీలించడమైంది. దీని ద్వారా, సుమారు నాల్గు శతాబ్దాల కాలంలో, భిన్న రంగాల్లో సంభవించిన ప్రగతి, పరిణామాలను విశ్లేషించేందుకు, అంచనా కట్టేందుకు వీలౌతుంది..

BRAOU

BRAOU

భాగం-6 : శాతవాహనానంతర యుగం : రాజకీయ పరిణామాలు (క్రీ.శ. 624 వరకు)

విషయక్రమం

6.0 : లక్ష్యాలు

6.1 : పరిచయం

6.2 : ఇక్ష్వాకులు

6.2.1 : ఇక్ష్వాకులు - పుట్టుపూర్వోత్తరాలు

6.2.2 : ఇక్ష్వాకులు - వంశ, కాలానుక్రమణికలు

6.2.3 : ఇక్ష్వాకులు - వంశ చరిత్ర

6.2.3.1 : మొదటి శాంతమూలుడు

6.2.3.2 : మొదటి వీరపురుషదత్తుడు

6.2.3.3 : రెండవ శాంతమూలుడు

6.2.3.4 : రెండవ పురుషదత్తుడు

6.3 : బృహత్ఫలాయనులు

6.4 : శాలంకాయనులు

6.4.1 : శాలంకాయనులు - సాక్ష్యాధారాలు

6.4.2 : శాలంకాయనులు - వంశ, కాలానుక్రమణికలు

6.4.3 : శాలంకాయనుల చరిత్ర - పుట్టుపూర్వోత్తరాలు

6.4.3.1 : మొదటి హస్తివర్మ (క్రీ.శ. 340-365)

6.4.3.2 : మొదటి నందివర్మ (క్రీ.శ. 365-405)

6.4.3.3 : అచండవర్మ (క్రీ.శ. 405-420)

6.4.3.4 : విజయదేవవర్మ (క్రీ.శ. 420-435)

6.4.3.5 : రెండవ హస్తి వర్మ (క్రీ.శ. 435-437)

6.4.3.6 : రెండవ నందివర్మ (క్రీ.శ. 437-455)

6.5 : ఆనంద గోత్రులు

6.5.1 : ఆనంద గోత్రులు - పుట్టుపూర్వోత్తరాలు

6.5.2 : ఆనంద గోత్రులు - జన్మభూమి - రాజధాని

BRAOU

6.5.3 : ఆనందగోత్రులు - చరిత్ర

6.6 : ప్రాచీన పల్లవులు

6.6.1 : ప్రాచీన పల్లవుల పుట్టుపూర్వోత్తరాలు

6.6.2 : ప్రాచీన పల్లవులు - జన్మభూమి

6.6.3 : ప్రాచీన పల్లవులు - వంశోత్పత్తి

6.6.3.1 : పహ్లవులు - పల్లవులు

6.6.3.2 : పల్లవులు - తొండైయార్ జాతి

6.6.4 : ప్రాచీన పల్లవులు - వంశానుక్రమణిక

6.6.4.1 : ప్రాచీన పల్లవులు - ప్రాకృత శాసనాలు

6.6.4.2 : ప్రాచీన పల్లవులు - సంస్కృత శాసనాలు

6.6.4.3 : ఆంధ్ర దేశం లోని ఉప శాఖ

6.6.5 : ప్రాచీన పల్లవుల కాలానుక్రమం - చరిత్ర

6.6.5.1 : కాంచేయక విష్ణుగోపుడు

6.6.5.2 : క్రీ.శ. 350 తర్వాతి పల్లవుల చరిత్ర

6.6.5.3 : ప్రాచీన పల్లవులు - శాలంకాయన సంబంధాలు:-I

6.6.5.4 : ప్రాచీన పల్లవులు - రెండో సింహవర్మ (క్రీ.శ. 436-472)

6.6.5.5 : ప్రాచీన పల్లవులు - శాలంకాయన సంబంధాలు - II

6.6.5.6 : ప్రాచీన పల్లవులు - విష్ణుకుండిన సంఘర్షణలు

6.7 : విష్ణుకుండినులు

6.7.1 : సాక్ష్యాధారాలు

6.7.2 : విష్ణుకుండినులు : వంశ క్రమం

6.7.3 : విష్ణుకుండినులు : కాలానుక్రమణిక

6.7.4 : విష్ణుకుండినులు : జన్మభూమి, రాజధాని

6.7.5 : విష్ణుకుండినులు - రాజ్య స్థాపన

6.7.6 : విష్ణుకుండినుల చరిత్ర : గోవిందవర్మ (క్రీ.శ. 430-470)

6.7.6.1 : రెండో మాధవవర్మ (క్రీ.శ. 470-520)

6.7.6.2 : మొదటి విక్రమేంద్ర వర్మ (క్రీ.శ. 520-525)

6.7.6.3 : రెండో ఇంద్ర (భట్టారక) వర్మ క్రీ.శ. 525-555)

6.7.6.4 : విష్ణుకుండినులు - చతుర్దంత యుద్ధాలు

BRAOU

6.7.6.5 : దాయాద యుద్ధాలు

6.7.6.6 : రెండో విక్రమేంద్రవర్మ (క్రీ.శ. 555-570)

6.8 : విష్ణుకుండినుల అనంతరం ఆంధ్ర దేశ స్థితి

6.9 : సంగ్రహంగా

6.10 : పరీక్ష నమూనా ప్రశ్నలు

6.10 : ఉపయుక్త గ్రంథాలు

6.0 : లక్ష్యాలు

శాతవాహన యుగం తర్వాత సంభవించిన రాజకీయ పరిణామాలను తెలుసుకోవడం, ఈ భాగాధ్యయన ప్రధాన లక్ష్యం. ఆ సామ్రాజ్యం అస్తమించిన తర్వాత ఏర్పడిన అనేక స్థానిక రాజ వంశాలు తమ అధికార విస్తరణతో, తిరిగి సామ్రాజ్య వ్యవస్థను నెలకొల్పడానికి చేసిన ప్రయత్నాలు, అందుకై వారు చేసిన పోరాటాలు, వాటి ఫలితాలను వివరించడం ఈ భాగాధ్యయన లక్ష్యాల్లో భాగమై ఉంది.

6.1 : పరిచయం

శాతవాహన సామ్రాజ్యం అస్తమించడంతో, ఆంధ్ర దేశం లోను, దక్కన్ పీఠభూమి పైన, రాజకీయ సమైక్యత అంతరించింది. ఆ సమయంలో అనేక స్థానిక రాజ వంశాలు తమ స్వతంత్ర పరిపాలనాధికారాన్ని నెలకొల్పి, తమలో తాము ఆధిపత్య పోరాటాలను చేయసాగాయి. శాతవాహనుల తర్వాత రాజ్యాన్ని నెలకొల్పిన వారు ఇక్ష్వాకులు. వారు సుమారొక శతాబ్ది కాలం మాత్రం పరిపాలించి, ప్రాచీన పల్లవులతో జరిగిన పోరాటాల్లో తమ రాజ్యాధికారాన్ని కోల్పోయారు. వారి తర్వాత క్రీ.శ. 4,5, శతాబ్దాల్లో కృష్ణా నదికి దక్షిణంగా పల్లవులు, ఆ నదికి ఉత్తరంగా శాలంకాయనులు ప్రాబల్యాన్ని పొంది, ఆధిపత్య పోరాటాలను చేశారు. ఆ సమయాన పశ్చిమాంధ్ర దేశం (నేటి తెలంగాణా) లో పరిపాలిస్తున్న విష్ణుకుండినులు ప్రాబల్యాన్ని పొంది, శాలంకాయనుల రాజ్యాధికారాన్ని అంతం చేశారు; పల్లవులతో ఆధిపత్య పోరాటాలను కొనసాగించారు.

క్రీ.శ. ఆరో శతాబ్ది ద్వితీయార్ధ భాగం నుండి ఆంధ్ర దేశంపై బాదామి చాళుక్యులు తమ రాజ్య విస్తరణకై పోరాటాలను ప్రారంభించారు. పల్లవులు సైతం మరింత ప్రాబల్యాన్ని పొంది, పోరాటాలను కొనసాగించారు. ఈ పోరాటాల్లో విష్ణుకుండిన వంశం బలహీనమైంది. వారు నెలకొల్పిన సామ్రాజ్య మంతరించింది. వారి అనంతరం స్వతంత్రించిన వారి సామంతులు శ్రీపృథ్వీ మూలరాజును, పృథ్వీ మహారాజును ఓడించి, పల్లవులు, బాదామి చాళుక్యులు, కృష్ణా నది సరిహద్దుగా తమ రాజ్యాలను విస్తరింపచేశారు. రెండో పులకేశి ఆంధ్ర దేశాన్ని ఆక్రమించిన పిదప, పల్లవులను ఓడించి, క్రీ.శ. 624 లో కృష్ణా నదికి దక్షిణంగా ఉన్న యావదాంధ్ర దేశాన్ని ఆక్రమించాడు.

6.2 : ఇక్ష్వాకులు

శాతవాహన సామ్రాజ్యం అస్తమించిన తర్వాత తలెత్తిన స్థానిక రాజ్యాల్లో, కృష్ణా తీరంలో పరిపాలించిన ఇక్ష్వాకులు ఒకరు. ఈ స్థానిక రాజ్యాలను గూర్చి పురాణాలు, శ్రీపార్వతీయ, ఆంధ్ర, ఆభీర,

BRAOU

గర్దభిల అనే ఆంధ్ర భృత్య వంశాలను పేర్కొంటున్నాయి. వీరి లోని అభీరులు కొంకణ, అపరాంత ప్రదేశాల్లో రాజ్యాన్ని నెలకొల్పినట్లు, శాసనాధారాల వలన తెలియవస్తున్నది. అలాగే, బనవాసిలో రాజ్యాన్ని నెలకొల్పిన 'చుటు' లేదా చుటునాగులు, పురాణాలు పేర్కొనే ఆంధ్ర భృత్యులైన ఆంధ్ర వంశంగా గుర్తించొచ్చు. కాగా, "శ్రీపర్వత" మనే పేర, సుప్రసిద్ధమైన నాగార్జునకొండ పరిసరాల్లో పరిపాలించిన ఇక్ష్వాకులది, పురాణాలు పేర్కొంటున్న శ్రీపార్వతీయ ఆంధ్ర భృత్య వంశ మని నిర్ణయించొచ్చు.

6.2.1 : ఇక్ష్వాకులు : పుట్టుపూర్వోత్తరాలు

శాతవాహన సామ్రాజ్యం అస్తమించడంతో, కృష్ణా నదీ మైదానాలపై స్వతంత్ర రాజ్యాన్ని నెల కొల్పిన శ్రీపార్వతీయ ఇక్ష్వాకు వంశం, నాగార్జునకొండ శ్రీపర్వత పరిసరాల్లో జరిపిన త్రవ్వకాల వలన వెలుగులోకి వచ్చింది. ఆ త్రవ్వకాలలో లభించిన శాసనాలు, అక్కడి విజయపురి రాజ ధానిగా పరిపాలించిన రాజ వంశాన్ని, ఇఖాకు (ఇక్ష్వాకు) లేక ఇఖాకు కుల (ఇక్ష్వాకు కుల) అని పేర్కొంటున్నాయి. ప్రాచీన వాఙ్మయం, శాసనాలు 'కులం' అనే పదాన్ని, "వంశం" అనే అర్థంలో ప్రయోగించడం కద్దు. కనుక, ఈ రాజులు ఇక్ష్వాకు వంశీయులని స్పష్టపడుతున్నది. ఇక్ష్వాకు వంశం స్వాయంభూవమనువు సంతతికి చెందిన ఇక్ష్వాకు మహారాజు పరంపర లోనిది. ఆ రాజు పేరునే వంశ నామంగా గ్రహించి, ప్రసిద్ధమైందని ఇతిహాస-పురాణ వాఙ్మయం వివరిస్తుంది.

శ్రీయజ్ఞ శాతకర్ణి మరణానంతరం పరిపాలించిన విజయ శాతకర్ణి, చందసిరి శాతకర్ణి నామేలు, కేవలం కృష్ణా గోదావరీ మైదానాల పైన మాత్రమే లభిస్తున్నాయి. దక్కన్ పీఠభూమి పశ్చిమ భాగం, అనగా నేటి మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ లోని తెలంగాణా ప్రాంతాలను మాఢరీపుత్ర శకసేనుడనే రాజు ఆక్రమించాడు. శాతవాహన వంశం లోని ఒక ఉప శాఖ, తూర్పు కనుమల వెంట ఉన్న తెలంగాణా జిల్లాలు, పరిసర బీరార్ ప్రాంతాల్లో పరిపాలిస్తూ ఉంది. బహుశా మరొక ఉప శాఖకు చెందిన మూడో పులుమావి ఆంధ్ర దేశం లోని పశ్చిమ ప్రాంతంలో, కర్నూల్, బళ్ళారి ప్రాంతంలో పరిపాలిస్తున్నాడు. ఇటువంటి రాజకీయ అనైక్యత, కల్లోల పరిస్థితుల్లో అవకాశాన్ని గ్రహించి, వాసిష్ఠీపుత్ర శ్రీశాంతమూలుడు స్వతంత్రించినట్లు భావించొచ్చు.

6.2.2 : ఇక్ష్వాకులు : వంశ, కాలానుక్రమణికలు

వాసిష్ఠీపుత్ర శాంతమూలుడు ఎంత కాలం పరిపాలించాడో స్పష్టంగా తెలియదు. కాని, ఆ రాజు అశ్వమేధ, వాజపేయ యాగాలను నిర్వహించినవాడు, సమకాలీన రాజ వంశాలను లోబర్చుకొని, 'మహారాజ' బిరుదాన్ని ధరించినవాడు కనుక, అతని పాలన సుదీర్ఘమైనదిగా భావించొచ్చు. పరిపాలనా కాలం స్పష్టంగా తెలియనప్పుడు, ఒక్కొక్క పురుషాంతరానికి (అనగా తరానికి) చరిత్రకారులు సగటున 25 సంవత్సరాలు నిర్ణయిస్తారు.

వాసిష్ఠీపుత్ర శాంతమూలుని తర్వాత, అతని కుమారుడైన మాఢరీపుత్ర వీరపురుషదత్తుడు పరి పాలించాడు. అతని 20వ రాజ్య సంవత్సరం నాటి శాసనాలు లభిస్తున్నాయి. వీరపురుషదత్తుని తర్వాత, అతని కుమారుడైన ఎహువల శాంతమూలుడు, లేదా రెండవ శాంతమూలుడు రాజైనాడు. అతని 24వ రాజ్య సంవత్సరం నాటి శాసనాలు లభిస్తున్నాయి. ఎహువల శాంతమూలుని తర్వాత, అతని కుమారుడైన రుళు, లేదా రుద్రపురుషదత్తుడు లేక (రెండవ పురుషదత్తుడు) సింహాసన మెక్కాడు. అతని కాలం నాటి శాసనాలు అతని 11వ రాజ్య సంవత్సరాన్ని పేర్కొంటున్నాయి. ఈ

BRAOU

శాసనాధారాలు వీరపురుషదత్తునికి, అతని తర్వాత రాజులకు మొత్తం, 55 సంవత్సరాల పరిపాలనా కాలాన్ని సూచిస్తున్నాయి. కనుక, ఇక్ష్వాకు కాలానుక్రమణికను ఈ క్రింది విధంగా ఏర్పర్చడం జరిగింది.

వాసిష్ఠీపుత్ర శాంతమూలుడు	:	క్రీ.శ. 220-245
మాఢరీపుత్ర వీరపురుష దత్తుడు	:	క్రీ.శ. 245- 265
ఎహువల శాంతమూలుడు	:	క్రీ.శ. 265-289
రుళ పురుషదత్తుడు	:	క్రీ.శ. 289 - 300

అయితే, నాగార్జునకొండ త్రవ్వకాల లోని చివరి దశలో లభించిన కొన్ని ప్రాకృత శాసనాలను పరిశీలించిన తర్వాత, డి.సి. సర్కార్ ఇక్ష్వాకు వంశీయుల కాలానుక్రమాన్ని కొంత సవరించాడు. ఆ శాసనాల్లో ఒకటి వీరపురుషదత్తుని కాలం నాటిది; మరొకటి ఎహువల శాంతమూలుని కాలం నాటిది కాగా, మూడవది ఆభీర రాజైన వసుషేణుని 30వ సంవత్సరం నాటిది.

రెండు ఇక్ష్వాకు శాసనాలు ఆ రాజుల రాజ్య సంవత్సరాలను కాక, **సంవచ్ఛరం విజయం** అని పేర్కొంటున్నాయి. డి.సి. సర్కార్ ఈ శాసనాలు ప్రభవాది సంవత్సరాల్లోని విజయ నామ సంవత్సరం గాను, దక్షిణ భారతదేశంలో ఉన్న బార్హస్పత్య విధానంలో "విజయ" మొదటి సంవత్సరం కనుక, ఆ శాసనాలు విజయ నామ సంవత్సరాన్ని పేర్కొంటున్నట్లు భావించాడు. ఈ విధంగా సంవత్సరం నామాన్ని పేర్కొనడం, ఇక్ష్వాకుల, ఈ శాసనాల నుండి ప్రారంభమైనట్లు, ఇవే అందుకు తొలి ఉదాహరణలని, ఆయన తన అభిప్రాయాన్ని సమర్థించుకొన్నాడు. ఎహువల శాంతమూలుని శాసనం పేర్కొంటున్న విజయ నామ సంవత్సరం, క్రీ.శ. 333-34 సరైనదిగాను, వీరపురుషదత్తుని శాసనం పేర్కొంటున్న సంవత్సరం, అంతకు పూర్వం 60 సంవత్సరాల క్రితం క్రీ.శ. 273-74కు సరైనదిగాను, ఆయన నిర్ణయించాడు. ఆయన అభిప్రాయం ప్రకారం, ఇక్ష్వాకు వంశీయుల కాలానుక్రమణిక ఈ విధంగా ఉంటుంది:

మాఢరీపుత్ర వీరపురుషదత్తుడు	:	క్రీ.శ. 255- 275
ఎహువల శాంతమూలుడు	:	క్రీ.శ. 280-335
రుళ పురుషదత్తుడు	:	క్రీ.శ. 335 - 345

ఆభీర రాజైన వసుషేణుని శాసనం పేర్కొంటున్న 30వ సంవత్సరం, క్రీ.శ. 248లో ప్రారంభమైన త్రైకూటక శకానికి చెందినట్లు భావించి, సర్కార్ పండితుడు ఆ శాసనం క్రీ.శ. 278కి చెందినదిగా నిర్ణయించాడు. ఆ శాసనం వసుషేణుడు, కౌశిక గోత్రుడైన శివసేపుడు, సంజయపురిని పరిపాలించే యోన (యవన) రాజు, అవంతిని పరిపాలించే శక రాజు రుద్రదాముడు, బనవాసను పరిపాలించే విష్ణు రుద్ర శివలానంద శాతకర్ణి అనే సహచరులతో కలిసి, శ్రీపర్వత - విజయపురి పరిసరాల్లో ఉన్నట్లు చెపుతూంది. అతడు అక్కడ 'మహానంద' అనే బావి పూడిక తీయించి, ఉపయోగం లోనికి తెచ్చాడు; సేటగిరి సమీపంలో రెండు తటాకాలను నిర్మించాడు; ఆ కొండ పైన అష్టభుజస్వామి ఆలయాన్ని నిర్మించి, దాని ప్రాకారాన్ని శిల్పాలతో అలంకరించాడు. ఆ శాసనం అష్టభుజస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించే సమయాన చెక్కించింది.

BRAOU

ఇక్ష్వాకులు పరిపాలిస్తున్న కాలంలో ఆభీర రాజు తన అనుచరులతో వచ్చి, విజయపురి సమీపాన ఈ కార్యక్రమాలను నిర్వహించడం, ఒక అసాధారణ విషయం. ఆ రాజులు ఒక కూటమిగా ఏర్పడి, విజయపురిపై దండెత్తి వచ్చారని, ఇక్ష్వాకు రాజులను ఓడించి, అ పట్టణం నుండి కొంత కాలం, సుమారు 5 సంవత్సరాలు - క్రీ.శ. 275 నుండి 280 వరకు - అధికారాన్ని చెలాయించారని, డి.సి. సర్కార్ అభిప్రాయపడ్డాడు. మూరేమండ రామారావ్ ఈ వాదాన్ని అధిక్షేపించి, వీరపురుషదత్తుడు, ఎహువల శాంతమూలుడు పరిపాలించిన కాలంలో, శ్రీపర్వత - విజయపురి ప్రాంతాల్లో బౌద్ధ, హిందూ నిర్మాణాలు విరివిగా జరిగాయని, ఇటువంటి దండయాత్ర జరిగి ఉంటే ఆ కార్యక్రమాలు అసాధ్యమై ఉండేవని వాదించాడు. అంతేకాక, వసుషేణుని శాసనం పేర్కొంటున్న రాజులు పలువురు, ఇక్ష్వాకుల బంధుమిత్రులని, కనుక అష్టభుజస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన సమయాన ఇక్ష్వాకు వంశీయుల బంధుమిత్రులు సమకూడినట్లు, ఈ శాసనం తెలుపుతుందని ఆదున భ్రమించారు. కాని, విగ్రహ ప్రతిష్ఠాపన జరిపింది ఇక్ష్వాకు రాజు కాదు; ఆ సమావేశంలో ఇక్ష్వాకు రాజు లేడని గుర్తించినపుడు, మూరేమండ రామారావ్ గారి సిద్ధాంతం తేలిపోతుంది. ఇక్ష్వాకుల రాజధానిలో, ఇక్ష్వాకు రాజు లేకుండ ఆభీర వసుషేణుడు జరిపించడం, నిస్సంశయంగా అతడు తన అనుచరులతో దండెత్తినట్లు స్పష్టపరుస్తుంది.

అయితే, డి.సి. సర్కార్ భావించినట్లు, పైన పేర్కొన్న రెండు ఇక్ష్వాకు శాసనాలు "విజయ" నామ సంవత్సరాలను పేర్కొంటున్నట్లు భావించడం, కష్టం. ఆ రాజులు వేసిన ఇతర శాసనాలలో సంవత్సర నామాలను ప్రస్తావించక, ఆ రెండింటి లోనే పేర్కొనడానికి తగిన కారణం కన్పించదు. కనుక, ఆ శాసనాల లోని "విజయం" యుద్ధ విజయమేనని భావించడం, యుక్తం.

ఈ పరిశీలన వలన, ఇక్ష్వాకు కాలానుక్రమణికను ఈ క్రింది చూపిన విధంగా నిర్ణయించొచ్చు:

వాసిష్ఠీపుత్ర సిరిశాంతమూలుడు	:	క్రీ.శ. 230-260
వీరపురుషదత్తుడు	:	క్రీ.శ. 260- 280
ఆభీర వసుషేణుని మధ్యంతర పాలన	:	క్రీ.శ. 280-285
రెండవ శాంతమూలుడు	:	క్రీ.శ. 285-310
రుద్ర పురుషదత్తుడు	:	క్రీ.శ. 310 - 321

6.2.3 : ఇక్ష్వాకులు - వంశ చరిత్ర

విజయపురి రాజధానిగా ఇక్ష్వాకు వంశీయుల స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించిన వాడు, వాసిటీపుత్ర (వాసిష్ఠీపుత్ర) సిరిచాంతమూలుడు. చాంతమూలుడనే పేరును కొందరు చరిత్రకారులు క్షాంతమూలుడని, మరికొందరు శాంతమూలుడని సంస్కృతీకరిస్తారు. ఇక్ష్వాకుల శాసనాల నుండి లభిస్తున్న సమాచారాన్ని, సమకాలీన రాజ వంశాల చరిత్రలతో మేళవించి, వారి రాజకీయ చరిత్రను కొంత విశ్వసనీయంగా పునర్నిర్మించొచ్చు.

6.2.3.1 : మొదటి శాంతమూలుడు

నాగార్జునకొండ శాసనాలు ఈ రాజును "మహారాజ విరూపాక్షపతి మహాసేన పరిగృహీత, అగ్ని హోత్రాగిరోమ వాజపేయాసమేధయాజి, హిరణ్యకోటి గోసతసహస్ర ప్రదాత సహస్రపదాయి సవధేను

BRAOU

అపతిహత సంకప " (మహారాజ విరూపాక్షపతి మహాసేన పరిగృహీత, అగ్నిహోత్ర - అగ్నిష్టోము వాజపేయ, అశ్వమేధయాజి, హిరణ్యకోటి గోశత సహస్ర ప్రదాయీ, సర్వాప్తోషు అప్రతిహత సంకల్ప...) అని వర్ణిస్తున్నాయి. అనగా, అతడు మహారాజ బిరుదాన్ని ధరించాడు. అనేక స్థానిక రాజులను లోబర్చుకొన్నవాడు. ఈయుననను విరూపాక్షపతి (శివుడు), మహాసేనుడు (కుమారస్వామి) స్వీకరించారు; అంటే ఆ దేవుళ్ళు తమ భక్త కోటి లోని వానిగా ఈయుననను గుర్తించారు; ఆ దేవుళ్ళకు ఇతడు పరమ భక్తుడు. ఈ రాజు కోట్ల కొలదిగా సువర్ణాన్ని, శత సహస్ర సంఖ్యలో గోవులను, నాగళ్ళను దానం చేసినవాడు; అగ్నిహోత్ర, అగ్నిష్టోమ, అశ్వమేధ, వాజపేయ యాగాలను జరిపినవాడు.

ఇక్ష్వాకుల స్వతంత్ర పరిపాలన ప్రారంభమయ్యే దశలో, కృష్ణా నదికి దక్షిణంగా ఉన్న దేశంలో పలువురు స్థానిక వంశీయులు పరిపాలిస్తున్నారు. వారిలో పూగీయులు, ప్రముఖులు. పూగీయులనగా పూగ రాష్ట్రాన్ని పరిపాలించేవారు. ఈ ప్రాంతం నేటి ఒంగోల్, పరిసర ప్రదేశాలకు సమానమైంది. "పూగ", "పోక" అనే పదాలు, తమిళంలో పాక్కై అనే పదం సమానార్థకాలు. పూగి రూపాంతరం పూగి - పూగిప్రోలు, నేటి ఒంగోల్. మధ్యయుగం వరకు పల్లవ, చోళ ప్రభావం చేత ఈ ప్రాంతానికి పాకనాడని పేరు. అలాగే, హిరణ్యకులు మరొక ప్రముఖ రాజ్యాన్నేర్పర్చారు. వారి భూభాగాలు ఇంచుమించుగా నేటి గిద్దలూర్ తాలూకా (ప్రకాశం జిల్లా), నంద్యాల (కర్నూల్ జిల్లా) తాలూకా లోని కొన్ని భూభాగాలు, పరిసరాల్లోని కడప జిల్లాలోని ప్రాంతాలు కలిసి ఏర్పడింది. ఈ ప్రదేశాన్ని చలికి వంశీయులు పరిపాలిస్తున్నారు. వీరే తర్వాత కాలంలో సలుకి, చలిక్య, చాళుక్య వంశీయులుగా ప్రసిద్ధి కెక్కినవారు. ధనక, కులహక వంటి వంశ నామాలు కూడ, శాసనాధారాల వలన తెలియవస్తాయి. కాని, వారు పరిపాలిస్తున్న ప్రదేశాలను గుర్తించడానికి కావలసినన్ని సాక్ష్యాధారాలు కానరావడం లేదు. అయితే, వీరు కూడ దక్షిణాంధ్ర భూభాగం (నేటి రాయలసీమ) లోనే రాజ్యాలను నిర్మించుకొని ఉంటారని, భావించొచ్చు. ఇటువంటి స్థానిక రాజవంశాలను కూడగట్టుకొని, శాంతమూలుడు శాత వాహనుల అధిపత్యాన్ని ధిక్కరించి, స్వతంత్రించాడు. తమ రాజకీయ సంబంధాలను పటిష్ఠపర్చడానికి, ఈ రాజ వంశాలతో వైవాహిక సంబంధాలను ఏర్పర్చాడు. సర్వాప్తోషు అప్రతిహత సంకల్ప అనగానే, ఇతడు తన ఇష్టానుసారంగా, నిరపేక్ష రాచరికాన్ని చెలాయించినట్లు తెలియవస్తుంది.

శాంతమూలుని కుమారుడైన మాఢరీపుత్ర సిరివీరపురుషదత్తుడు, ఉజ్జయినీ రాకుమార్తైన రుద్రధర భట్టారికను వివాహం చేసుకొన్నట్లు, ఒక నాగార్జునకొండ శాసనం వలన తెలియవస్తుంది. ఆంధ్ర దేశం లోని ఇక్ష్వాకు రాజు ప్రభావం వింధ్య పర్వతాలు దాటి, గుజరాత్, మాళ్వ ప్రదేశాలను పరిపాలిస్తున్న శక క్షత్రపులను చేరినట్లు, ఈ శాసనం, తెలుపుతూంది. ఉజ్జయిని రాజధానిగా ఆ కాలంలో పరిపాలిస్తున్న వారు, కార్దమక శకులు.

వాసిష్ఠీపుత్ర శాంతమూలుడు జరిపించిన క్రతువులు, ఇతనికి వైదిక మతం పట్ల ఉన్న ఆసక్తిని, అభిమానాన్ని సూచిస్తాయి. వాటి లోని అగ్నిహోత్రం, ఒక సామాన్యమైన హోమం; శ్రోత్రియులైన బ్రాహ్మణులు ప్రతి దినమూ ఆహూతులతో అగ్నిహోత్రుని కర్పించే క్రతువు. అగ్నిష్టోమం ఒక సాధారణమైన సోమ యాగం. వీటిని నిర్వహించడం ద్వారా, శాంతమూలుడు ద్విజునిగా, ఉన్నతమైన సాంఘిక హోదాను ఆశించినట్లు, తోస్తుంది. వాజపేయం "సామ్రాట్టు" పదవిని పొందగోరిన క్షత్రియులు జరిపే, ఒక మహా యాగం. అలాగే, అశ్వమేధం రాజులు తమ దిగ్విజయాలను ప్రకటించుకోవటానికి జరిపే, ఒక మహా క్రతువు. వీటి నిర్వహణ వలన, శాంతమూలుడు సామ్రాట్టుగా తన రాజకీయ హోదాను ప్రకటించుకొన్నట్లు భావించొచ్చు.

BRAOU

వాసిష్ఠీపుత్ర శాంతమూలుడు అపారంగా సువర్ణం, లక్షల కొలదిగా గోవులు, నాగళ్ళను దానం చేసినట్లు, నాగార్జునకొండ శాసనాలు వర్ణిస్తాయి. అక్కడి త్రవ్వకాల లోని ఒక శిలా స్తంభంపై చెక్కిన శిల్ప ఫలకాలను, ఆ రాజు హిరణ్య, గోదానాలను చేసిన దృశ్యాలను ప్రదర్శించేవిగా, లాంగ్ హొరెస్ట్ గుర్తించాడు. ఒక శిల్ప ఫలకం ఒక రాజు బంగారు నాణేలను రాశులుగా పోసుకొని ఉన్నట్లు, అతని మంత్రి, ఇతర ఉన్నతోద్యోగులు ఆయన చుట్టూ ఉండగా, ఎదురుగా ఒక వ్యక్తి చేయిచాచి అందుకుంటున్నట్లు, దృశ్యాన్ని ప్రదర్శిస్తుంది; మరొక ఫలకం ఒక రాజును, సమీపంలో అతని రాణి ఒక గోవును అలంకరిస్తూ ఉన్నట్లు ప్రదర్శిస్తూంది. ఈ ఫలకాలు శాంతమూలుని స్మృతి చిహ్నంగా నిలిపిన శిలా స్తంభంపై చెక్కినట్లు, వాగేవ్ పండితుడు గుర్తించాడు.

శాంతమూలుడు సహస్ర సంఖ్యలో నాగళ్ళను (హలసతసహస) దానం చేయడం, కేవలం వ్యవసాయ పనిముట్లను దానం చేయడం కాదని, గుర్తించాలి. భూమి లేకుండ నాగళ్ళు నిరుపయోగం. అందుచేత, "హల" మనగా నాగలి మాత్రమని కాక, ఒక నాగలితో దున్ని సాగుచేయడానికి తగిన నేలని, అర్థం చేసుకోవాలి. వేల సంఖ్యలో నాగళ్ళను, అందుకు తగిన వ్యవసాయ భూములను దానం చేయడానికి, చిట్టడవులను నరికి, వ్యవసాయ భూములను ఏర్పర్చాలి. కనుక, హలసతసహస దానం లోని అంతరార్థం, వ్యవసాయ విస్తరణ.

వ్యవసాయ, పశుపాలన, అవినాభావ సంబంధం కలవి కనుక, హలాలతో బాటుగా, వేల సంఖ్యలో గోవులను కూడ ఆ రాజు దానం చేశాడు. చిట్టడవులను నిర్మూలించడానికి, వ్యవసాయ భూములను ఏర్పర్చడానికి, రాజ్య వ్యవస్థ చొరవ తీసుకొని, ఆర్థికంగా ప్రజలకు సాయపడినట్లు, ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి తోడ్పడినట్లు, గ్రహించొచ్చు. అటువంటి ఆర్థిక సాయం, సువర్ణ (హిరణ్య) దానం. ఈ దానాలను వర్ణించడంలో శాసన రచయితలు కొంత మేరకు అతిశయోక్తులను ప్రయోగించారని భావించడం, పొరబాటు కాదు. కాని, అప్పటి సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో, ఇటువంటి కార్యక్రమాన్ని ఆ రాజు చేపట్టినట్లు భావించడంలో, సంశయించ పని లేదు. అనేక ఆటవిక తెగలు సాంస్కృతిక పరిణామాలను చెందడం ద్వారా, తమ ఆటవిక జీవనాన్ని వదిలి, మైదానాలకు చేరుకుంటున్నట్లు, శక, ఆభీర, పహ్లవ మొదలైన విదేశీయ జాతులు, తమ రాజకీయ ప్రాబల్యం తగ్గిపోవడంతో, వ్యవసాయాన్ని చేపట్టి, ప్రశాంతమైన గ్రామీణ జీవనాన్ని అవలంబించడం, బహుళంగా, జరుగుతున్నట్లు గుర్తించడం, యుక్తం. రాజకీయ సంక్షోభాల వలన, విదేశీ వాణిజ్యం కూడ, క్రమంగా సన్నగిల్లుతున్నది. దానిపై ఆధారపడిన వర్తక వర్గాలు, పాటక జనులు (artisans), తమ వృత్తులను పోగొట్టుకొంటున్నారు. వారు కూడ, తమ సాంప్రదాయిక జీవన విధానాలను వదిలివేయడంతో, వ్యవసాయ విస్తరణ అవసరమైంది. దాని వలన, నూతనంగా గ్రామాలు వృద్ధి చెందడం, జనపదాలు ఏర్పడడం జరుగుతున్నది. ఇటువంటి సామాజిక, ఆర్థిక పరిణామాలలో రాజులు చొరవ తీసుకొని, ధనం, పశుగణం, భూములను వృద్ధి చేసి, పంపిణీ చేయడానికి పూనుకొన్నట్లు, గ్రహించొచ్చు. ఇక్ష్వాకు శాంతమూలుని హిరణ్యకోటి గోశతసహస్ర, హలశతసహస్ర ప్రదానాల అర్థం, అవసరాన్ని ఇలా గ్రహించడం, యుక్తం.

6.2.3.2 : మొదటి వీరపురుషదత్తుడు

వాసిష్ఠీ పుత్ర శాంతమూలుని తర్వాత, ఆ రాజు కుమారుడైన మాఢరీపుత్ర వీరపురుషదత్తుడు 'మహారాజ' బిరుదాన్ని, ధరించి, ఇక్ష్వాకు సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతడు పూగీయ వంశానికి చెందిన ఒక రాకుమార్తెను, తన మేనత్తైన శాంతిశ్రీ కుమార్తెను వివాహం చేసుకొన్నాడు. అంతేకాక,

BRAOU

హమ్మసిరి అనే మరొక మేనత్త కుమార్తెలు బాపిసిరి, ఛటసిరి (షష్మిశ్రీ) అనే రాకుమార్తెలను, ఉజ్జయినీ రాజధానిగా పరిపాలిస్తున్న పశ్చిమ (శక) క్షత్రప రాకుమార్తె రుద్ర భట్టారికను కూడ, వివాహం చేసుకొన్నాడు. వీరు కాక, ఎహువల శాంతమూలుని తల్లి మహాదేవి భటిదేవ, వీరపురుషదత్తుని మరొక భార్య. వీరపురుషదత్తుని సోదరైన అడవి శాంతిశ్రీ, ధనక వంశీయుడైన ఖందవిశాఖంణకుని వివాహమాడింది. కుమార్తైన కొడబలిసిరి, ఒక బనవాస రాజును వివాహం చేసుకొంది.

బనవాస, లేక కుంతల దేశంలో "చుటుకులానందు" లనే రాజ వంశం పరిపాలిస్తున్నది. ఆ వంశం లోని విష్ణుకడ (చుటుకులానంద) శాతకర్ణి, శాతవాహనుల అనంతరం, వాసిష్ఠీపుత్ర శాంతమూలునితోపాటుగా, స్వతంత్ర రాజ్యాన్ని నెలకొల్పాడు. వీరితోపాటుగా, కొంకణ, అపరాంత భూభాగాల్లో, ఆభీరులు స్వతంత్రించారు. ఆభీరులు అనతి కాలం లోనే, వింధ్యపర్వతాలకు ఆవల ఉన్న కార్దమక - శక రాజ్యం లోనికి చొచ్చుకొని వెళ్ళినట్లు, ఆ వంశానికి చెందిన ఈశ్వరసేనుడు, ఈశ్వరదత్తుడు విడుదల చేసిన నాణేలు, క్రీ.శ. 228 నుండి 232 సంవత్సరాలకు చెందినవి, గుజరాత్‌లోను, మాళ్వాలోను లభిస్తున్నాయి. ఈ నాణేల వలన, ఆభీరుల ప్రాబల్యం కార్దమక - శకులకు అపాయకరమైనట్లు, స్పష్టమౌతుంది. అలాగే బనవాస లోని చుటుకులానందులకు కూడ, ఆందోళనకరమైనట్లు, సమకాలీన రాజకీయ పరిణామాలు సూచిస్తాయి.

బనవాస ప్రాంతంలో చుటుకులానందులకు, విష్ణురుద్ర సివలానంద శాతకర్ణి ప్రత్యర్థి. చుటు, సివల, అనేవి రెండు వేర్వేరు తెగలుగా భావించొచ్చు. ఆ తెగలకు ఆనందాన్ని కలిగించే, ప్రతిభావంతులుగా, ఆ రాజులు చుటుకులానంద, సివలానంద అనే బిరుదాలను ధరించి ఉండొచ్చునని, చరిత్రకారుల అభిప్రాయం. వీరపురుషదత్తుడు చుటుకులానందులతో సంబంధ బాంధవ్యాలను కలిగి ఉండడంతో, సివలానంద శాతకర్ణి ఆభీర వసుషేణునితో చేయి కలిపినట్లు తోస్తుంది.

శక రాజ్యంలో సైతం అటువంటి అంతఃకలహాలు చెలరేగుతున్నట్లు, ఆభీర వసుషేణునితో కలిసి, విజయపురిపై దండెత్తి వచ్చిన రుద్రదాముడు, శక రాజ వంశం లోని ఒక ప్రత్యర్థి శాఖకు చెందినవాడని, తోస్తుంది. బనవాస, ఉజ్జయినీ రాజ వంశాలు ఇక్ష్వాకులతో సంబంధాలను కలిగి ఉండగా, వారి శత్రువులైన ఆభీరులు, ఈ ఉభయ రాజ్యాల్లోని ప్రత్యర్థి వర్గాలను కూడగట్టుకొని, విజయపురిపై దండెత్తారని భావించడం, యుక్తం. ఈ దండయాత్రలో ఇక్ష్వాకులు ఓడిపోయినట్లు, ఆభీర రాజైన వసుషేణుడు విజయపురిలో కొంతకాలం పరిపాలించినట్లు, అతని నాగార్జునకొండ శాసనం సూచిస్తూంది.

విరపురుషదత్తుని 18వ రాజ్య సంవత్సరం నుండి అతని మేనత్తైన శాంతిసిరి వేసిన శాసనాలు, ఆ రాజు విజయం, దీర్ఘాయువును కోరి, దానాలు చేస్తూ వేసినవి కనుక, అతని రాజ్యాధికారానికి ఏదో తీవ్రమైన ముప్పు వాటిల్లిందని, స్పష్టపడుతూంది. ఆభీర వసుషేణుని శాసనం, క్రీ.శ. 278 గా గుర్తిస్తే, ఆ సంవత్సరంలో విజయపురిపై ఆభీర దండయాత్ర జరిగిందని గ్రహించొచ్చు.

ఇక్ష్వాకు రాజ్యంపై ఆభీర దండయాత్ర కేవలం ఒక సాధారణమైన సంఘర్షణగా కాక, బహు కాలం సాగిన తీవ్ర యుద్ధంగా తోస్తుంది. వీరపురుషదత్తుని 20వ రాజ్య సంవత్సరం నాటి శాసనాలు లభిస్తున్నాయి. కనుక, ఆ రాజు సుమారు 2 సంవత్సరాలకు పైగా ఆభీరులతో పోరాటాలు చేసినట్లు, అందువల్లనే అతని రాజ్యాధికారానికి, జీవితానికి, ఒక తీవ్రమైన ప్రమాదంగా ఈ దండయాత్రను భావించడం జరిగిందని, తోస్తుంది. పైన వివరించినట్లు, ఆభీర వసుషేణుడు కనీసం 5 సంవత్సరాలు విజయపురి నుండి రాజ్యాన్ని పరిపాలించి ఉంటాడని గ్రహించడం, యుక్తం. వీరపురుషదత్తుడు బహుశ, రాజధానిని వదిలి పారిపోయి ఉండొచ్చు, లేదా పోరాటంలో మరణించి ఉండొచ్చు.

BRAOU

6.2.3.3 : రెండవ శాంతమూలుడు

మూఢరీపుత్ర, సిరివీరపురుషదత్తుని తర్వాత, అతని కుమారుడు ఎహువల శాంతమూలుడు, లేక రెండవ శాంతమూలుడు ఇక్ష్వాకు సింహాసనాన్నధిష్ఠించి, 24 సంవత్సరాలు పరిపాలించాడు. ఇతని పదకొండవ రాజ్య సంవత్సరంలో, ఇతని సేనానైన ఏలిసిరి, "స్వర్గ దేవాలయం" అనే పేర, ఒక శివాలయాన్ని కట్టించి, శాసనాన్ని వేయించాడు. ఆ శాసనంలో ఏలిసిరి అనేక యుద్ధాల్లో విజయాన్ని సాధించినట్లు వర్ణించుకొన్నాడు. అనగా, ఎహువల శాంతమూలుని పరిపాలనా ప్రారంభ కాలంలో అనేక పోరాటాలు జరిగాయని, ఆ పోరాటాల్లో ఎలిసిరి తన రాజుకు విజయాలను సాధించిపెట్టాడని తెలియవస్తున్నది. ఎహువల శాంతమూలుని రాణుల్లో ఒకరైన కందువల వేసిన శాసనంలో, ఆమె తను అవిధవ, జీవసుత అని, వర్ణించుకొన్నది. ఈ విదమైన, వర్ణన వలన, ఎహువల శాంతమూలుడు, అతని కుమారులు అనేక యుద్ధాల్లో పాల్గొన్నారని, అనేక మార్లు ప్రాణగండాలు గడిచి, బయటపడ్డారని, అర్థం చేసుకోవచ్చు. పేర్మాడి అనే సేనాని నాయకత్వం వహించిన సేనలో చాలా మంది సైనికులు మరణించినట్లు, వారి స్మృత్యర్థం నిలిపిన చాయా స్తంభాల వలన, తెలియవస్తూంది. అయితే, ఈ స్తంభాలపై శాసనాలు, ఏ ఇక్ష్వాకు రాజు పరిపాలనా కాలానికి చెందినవో, స్పష్టంగా పేర్కొనవు. మొత్తం మీద, ఎహువల శాంతమూలుని పరిపాలనా కాలంలో అనేక తీవ్ర పోరాటాలు జరిగాయని తెలియవస్తున్నది.

ఎహువల శాంతమూలుని పరిపాలనా కాలంలో విజయపురిలో అనేక దేవాలయాల నిర్మాణం, శ్రీ పర్వతంపై బౌద్ధ విహారాల నిర్మాణాలు జరిగాయి. ఈతని 8వ రాజ్య సంవత్సరంలో శ్రీపర్వతంపై చదసిరి అనే ఉపాసకుడు, బౌద్ధ సంఘం కొరకు, ఒక శిలా మండపాన్ని నిర్మించాడు. ఆ రాజు 11 వ రాజ్య సంవత్సరంలో అతని సేనాని, ఏలిసిరి, స్వర్గ దేవాలయాన్ని నిర్మించిన విషయాన్ని పైన పేర్కొనడం జరిగింది. ఈ నిర్మాణాలు ఇక్ష్వాకు రాజధానిలో ఏర్పడిన ప్రశాంత వాతావరణాన్ని సూచిస్తాయి. కనుక, ఎహువల శాంతమూలుడు తన 8వ రాజ్య సంవత్సరం నాటికి, ఆభీర వసు షేణుగ్గి, అతని సహచరులను పారద్రోలి, రాజధాని నగరంలో ప్రశాంత జీవనాన్ని నెలకొల్పాడని స్పష్టపడుతున్నది. ఆ తర్వాత, అతని పరిపాలన ప్రశాంతంగానే సాగినట్లు భావించొచ్చు.

గుంటూర్ జిల్లా లోని పలనాడులో, నాగార్జునకొండకు సమీపంగా మంచికల్లు వద్ద, పల్లవ రాజైన సీహవర్మ (సింహవర్మ) వేసిన ప్రాకృత శాసనం లభించింది. డి.సి. సర్కార్ ఈ శాసనాన్ని వేసిన సింహవర్మ, ఇక్ష్వాకు రాజధానిపై దండెత్తి వచ్చినట్లు ఊహించాడు. నాగార్జునకొండ వద్ద బయల్పడిన కొన్ని భవనాల అవశేషాలు బుద్ధిపూర్వకంగా ధ్వంసం చేయబడినట్లు, తగలబెట్టబడినట్లు సూచిస్తాయని, పురావస్తు శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. డి.సి. సర్కార్ విజయపురిలో ఈ విధ్వంస కాండను పల్లవులే జరిపి ఉంటారని భావించాడు. ఈ అభిప్రాయాలు ఆమోదయోగ్యమైనవి. కాని, ఈ సంఘటనలను స్పష్టంగా, కాలానుక్రమంగా వివరించడానికి, ఆధారాలు లభించడం లేదు. పల్లవ సింహవర్మ క్రీ.శ. 305-330 మధ్య కాలంలో పరిపాలించి ఉండొచ్చునని నిర్ణయించొచ్చు. అతడు క్రీ.శ. 310 ప్రాంతంలో విజయపురిపై దండయాత్ర జరిపినట్లు, ఎహువల శాంతమూలుడు ఈ దండయాత్ర వలన తీవ్ర సంక్షోభానికి గురైనట్లు ఊహించడం, యుక్తమే. అయితే, ఈ సంక్షోభాన్ని ఎదిరించి, ఇక్ష్వాకు రాజ్యాన్ని కాపాడుకొనగలిగినట్లు భావించొచ్చు.

BRAOU

6.2.3.4 : రెండవ పురుషదత్తుడు

ఇక్ష్వాకు వంశీయుల్లో చివరి వాడు, రుద్రపురుషదత్తుడు. ఇతడు ఎహువల శాంతమూలుని కుమారుడు; ఆతని తర్వాత సింహాసనాన్నధిష్ఠించి పరిపాలించిన వాడు. ఇతని పదకొండవ రాజ్య సంవత్సరం నాటి శాసనాలు లభించాయి.

రుద్రపురుషదత్తుడు సింహాసనాన్నధిష్ఠించే సమయాన, పల్లవ సింహవర్మ జరిపిన దండయాత్రా ఫలితంగా, ఇక్ష్వాకు రాజ్యం తీవ్రమైన సైనిక, ఆర్థిక నష్టానికి లోనైనట్లు, తెలుస్తున్నది. ఆ దండయాత్ర వలన కలిగిన అఘాతం నుండి తేరుకొనక పూర్వమే, పల్లవులు మరొక దండయాత్ర చేసి, ఇక్ష్వాకు రాజ్యాన్ని సంపూర్ణంగా అంతం చేసినట్లు, తోస్తుంది. పల్లవ యువ మహారాజు శివస్కందవర్మ తన 10వ రాజ్య సంవత్సరంలో వేసిన మైదవోలు తామ్ర శాసనం, కర్మ రాష్ట్రంలోని విరివర గ్రామాన్ని కొందరు బ్రాహ్మణులకు దానం చేసినట్లు తెలుపుతూంది. కర్మ రాష్ట్రం నేటి గుంటూర్ జిల్లాలోని పశ్చిమ, దక్షిణ ప్రాంతాలతో ఏర్పడింది.

అయితే ఇక్ష్వాకు రాజ్యం పల్లవ శివస్కందవర్మ దండయాత్రకు ముందే, అవసాన దశను చేరినట్లు కానవస్తుంది. అందుకు కారణం, బృహత్పలాయనుల తిరుగుబాటు. పల్లవులు బృహత్పలాయనులను, మిగిలి ఉన్న ఇక్ష్వాకు రాజ్యాధిపత్యాన్ని నిర్మూలించి, కృష్ణా పర్యంతంగా తమ రాజ్యాన్ని విస్తరింపజేశారు.

6.3 : బృహత్పలాయనులు

బృహత్పలాయన గోత్రుడని పర్లించుకొన్న జయవర్మ అనే రాజు వేసిన కొండముది తామ్ర శాసనం వలన, ఈ వంశం తెలియవస్తున్నది. "బృహత్పల" అనే గోత్రం, ఋషి పరంపర లోనిదిగా కన్పించదు. ఈ సందర్భంలో రుద్రపురుషదత్తుని తల్లైన సిరిచమ్మభట్ట, బృహత్పల గోత్రానికి చెందిన ఒక మహాక్షత్రపుని కుమార్తనే విషయం స్మరణకు తెచ్చుకుంటే, ఈ బృహత్పలాయనులు, శక జాతికి చెందినవారని, గుజరాత్ ప్రాంతం నుండి వచ్చినవారని, స్పష్టమౌతుంది. ఎహువల శాంతమూలుని కాలంలో వీరు ఇక్ష్వాకులకు లోబడి, ఆ రాజు కొలువులో సైనికాధికారులుగా ఉన్నారు. క్రమంగా ఇక్ష్వాకు రాజ్యం బలహీన పడడంతో, వీరు ప్రబలులైనారు.

పల్లవ దండయాత్ర వీరికి మరింత అవకాశాన్ని కూర్చిందనొచ్చు. తుదకు వీరు స్వతంత్రించి, తీర ప్రాంత మైదానాలపై తమ రాజ్యాన్ని నెలకొల్పినట్లు, గ్రహించొచ్చు.

కొండముది తామ్ర శాసనం జయవర్మ వంశ పూర్వులను పేర్కొనదు. అతని తర్వాత ఆ వంశీయులు పరిపాలించినట్లు, ఏ సాక్ష్యాధారాలు లేవు. కనుక, బృహత్పలాయన వంశం (లేదా గోత్రం) లో తెలియవస్తున్న రాజు జయవర్మ మాత్రమే. లిపి పరిణామానుశీలన వలన, ఈ శాసనం యువ మహారాజు శివస్కందవర్మ వేసిన మైదవోలు తామ్ర శాసనాన్ని పోలి ఉంది కనుక, క్రీ.శ. 3వ శతాబ్దికి చెందినట్లు, నిర్ణయించొచ్చు.

కొండముది తామ్ర శాసనం జయవర్మ కుడూర నగరం వద్ద విజయస్కంధావారంలో ఉన్నట్లు తెలుపుతుంది. డూబ్రే పండితుడు కుడూర నగరం జయవర్మ రాజధానిగా భావించాడు. స్కంధావారం అనగా సైనిక శిబిరం. రాజు స్థిర నివాసం కాదు. కనుక, జయవర్మ దండయాత్రకై వెళ్ళి, కుడూర నగరం వద్ద విడిది చేస్తున్నట్లు గ్రహించొచ్చు. కుడూర, నేటి మచిలీపట్నం సమీపం లోని

BRAOU

గూడూరు (లేక చిట్టిగూడూరు) అని, చరిత్రకారులు గుర్తించారు. ఆ ప్రాంతాన్ని ఆ సమయంలో ఎవరు పరిపాలిస్తున్నారో తెలుసుకునేందుకు ఆధారాలు లభించడం లేదు. డి.సి. సర్కార్ జయవర్మ రాజధాని పిఠుండ నగరం కావచ్చునని అభిప్రాయపడ్డాడు కాని, అది సంశయాస్పదం. క్రీ.శ. రెండో శతాబ్ది ద్వితీయార్ధంలో, ఆ నగరం ఖారవేలుని దండయాత్రల్లో ధ్వంసమైంది. తిరిగి ఆ నగరం పునర్నిర్మాణమైనట్లు సాక్ష్యాధారాలు లేవు.

కొండముది శాసనాన్ని బృహత్పలాయన గోత్రుడైన జయవర్మ తన 10వ రాజ్య సంవత్సరంలో (క్రీ. శ. 320) "పాంటూర" అనే గ్రామాన్ని, కొందరు బ్రాహ్మణులకు బ్రహ్మదేయంగా దానం చేస్తూ వేశాడు. ఈ దానాన్ని తన ఆయుర్వృద్ధిని, విజయాలను కాంక్షించి చేసినట్లు, అతడు ఆ శాసనంలో వివరించాడు.

క్రీ.శ. 320 నాటికి పల్లవ యువ మహారాజు శివస్కందవర్మ దండయాత్రలో బృహత్పలాయన జయవర్మ, ఇక్ష్వాకు రాజు రుద్రపురుషదత్తుడు, సంపూర్ణంగా తమ రాజ్యాలను కోల్పోయారు.

6.4 : శాలంకాయనులు

శాతవాహనానంతర యుగంలో ఆంధ్ర దేశాన్ని పరిపాలించిన ప్రధాన రాజ వంశాల్లో, శాలంకాయన వంశ మొకటి. వేంగీపురం రాజధానిగా, కృష్ణా నదికి ఇరు వైపులా ఉన్న మైదాన భూములను, క్రీ.శ. 4, 5 శతాబ్దాల్లో, ఈ వంశం సుమారు 125 సంవత్సరాలు పరిపాలించింది. వేంగి పట్టణానికి రాజకీయ ప్రాధాన్యత వీరి పరిపాలన లోనే ప్రారంభమై, సుమారు 11 వ శతాబ్ది ప్రారంభం వరకు కొనసాగింది.

ఆంధ్ర దేశ చరిత్రలో శాలంకాయన, విష్ణుకుండిన వంశాలు పరిపాలించిన కాలం, ఉత్తర భారత దేశంపై గుప్త సామ్రాజ్య యుగానికి సమకాలీనమైంది. ఉత్తర భారతదేశ సాంస్కృతిక చరిత్రలో గుప్త యుగానికి గొప్ప స్థానముంది. ఆకాలంలో వైదిక మత సంస్కృతులు, భక్తి తత్వం వలన ప్రభావితం కాగా, ఏర్పడ్డ నవ్య హిందూ మతం (Neo-Hinduism), లేదా పౌరాణిక హిందూ మతం, భారతదేశ మంతటా వ్యాపించి, సాంస్కృతిక సమైక్యాన్ని సాధించాయి. సంస్కృత భాషా సారస్యాలకు గొప్ప ప్రాచుర్యం లభించింది; వాస్తు శిల్పకళలు చాలా అభివృద్ధి చెందాయి. ఈ లక్షణాలు సమకాలీనమైన ఆంధ్ర దేశంలో కూడ ఏర్పడి, ఈ యుగానికి గణనీయమైన ప్రాముఖ్యతను కలిగించాయి.

6.4.1 : శాలంకాయనులు - సాక్ష్యాధారాలు

శాలంకాయనుల చరిత్రను అధ్యయనం చేయడానికి, వారి శాసనాలే సాక్ష్యాధారాలు. నేటికి లభిస్తున్న శాలంకాయన శాసనాలు, తొమ్మిది తామ్ర శాసనాలు, ఒక శిలా శాసనం. పశ్చిమ గోదావరి జిల్లా లోని జీలకర్ర గూడెం-గుంటుపల్లి గుహాలయాల వద్ద, ఈ శిలా శాసనం ఇటీవలి కాలంలో లభించింది. అలాగే, ధారికాటూర తామ్ర శాసనం కూడ, ఇటీవలి కాలం లోనే లభించింది.

తొమ్మిది తామ్ర శాసనాల్లో, నాలుగు ప్రాకృత భాష లోను, ఐదు సంస్కృత భాష లోను ఉన్నాయి. మహారాజ విజయదేవవర్మ వేసిన ఏలూరు తామ్ర శాసనం ; మొదటి నందివర్మ వేసిన కాసుకొల్లు (ప్రాకృత) శాసనం; హస్తివర్మ వేసిన పెనుగొండ శాసనం; యువ మహారాజు అచండవర్మ వేసిన ధారికాటూర తామ్ర శాసనాలు, ప్రాకృత భాష లోనివి. రెండవ నందివర్మ వేసిన కొల్లేరు,

BRAOU

పెదవేగి, కంతేరు (మొదటి) తామ్ర శాసనాలు, స్కందవర్మ వేసిన కంతేరు (రెండు), కానుకొల్లు (సంస్కృత) తామ్ర శాసనాలు, సంస్కృత భాషలో ఉన్నాయి. గుంటుపల్లి శిలా శాసనం కూడ, మహారాజ రెండవ నందివర్మ వేసిన సంస్కృత శాసనమే. అయితే, అది చాలా శిధిలమై , స్వల్ప భాగం మాత్రమే చదువ సాధ్యమౌతూంది.

రెండవ నందివర్మ పెదవేగి, గుంటుపల్లి శాసనాలు, స్కందవర్మ కానుకొల్లు (సంస్కృత) శాసనం మాత్రమే, ఆయా శాసన ప్రదాతల పూర్వులను మూడు తరాల నుండి పేర్కొంటూ, శాలంకాయన వంశ క్రమాన్ని నిర్మించడానికి సాయపడతాయి. రెండవ నందివర్మ కొల్లేరు శాసనం అతని తండ్రైన అచండవర్మను మాత్రమే, పేర్కొంటూంది. తక్కిన ప్రాకృత, సంస్కృత శాసనాలు, కేవలం శాసన ప్రదాతలను మాత్రమే పేర్కొంటాయి.

6.4.2 : శాలంకాయనులు : వంశ, కాలానుక్రమణికలు

పెదవేగి, గుంటుపల్లి, కానుకొల్లు సంస్కృత శాసనాలు పేర్కొంటున్న రాజుల పరంపరలో, ఇతర శాసన ప్రదాతలను గుర్తించడం వలన, శాలంకాయన వంశ క్రమాన్ని నిర్మించొచ్చు. ఆ శాసనాల్లో, రాజుల పరంపర ఈ క్రింది విధంగా ఉంది:

రెండవ నందివర్మ వేసిన	స్కందవర్మ వేసిన కానుకొల్లు
పెదవేగి, గుంటుపల్లి శాసనాలు	(సంస్కృత) శాసనం
మహారాజ హస్తివర్మ	మహారాజ (మొదటి) హస్తివర్మ
మహారాజ (మొదటి నందివర్మ)	మహారాజ నందివర్మ
మహారాజ అచండవర్మ	మహారాజ (రెండవ) హస్తివర్మ
మహారాజ (రెండవ) నందివర్మ	మహారాజ స్కందవర్మ

BRAOU

పై రెండు పట్టికల్లోని మొదటి ఇద్దరు రాజులు, మహారాజ హస్తివర్మ, అతని కుమారుడైన మహారాజ నందివర్మ ఒకరేనని, వీరి లోని మహారాజ నందివర్మను కానుకొల్లు (ప్రాకృత) శాసన ప్రదాతని గుర్తించొచ్చు. ఆ రాజు కానుకొల్లు ప్రాకృత శాసనంలో, బాలక మహారాజ ఖంద (స్కంద) పోత ఆయురారోగ్యాల కొరకు ధానధర్మాలు చేసినట్లు, వివరిస్తూంది.

"పోత" అనే ప్రాకృత పదం, సంస్కృతం లోని 'పౌత్ర' అనగా మనుమడు అనే పదానికి సమానార్థకం. ఈ ఖండపోత (స్కందపౌత్ర) కానుకొల్లు సంస్కృత శాసనాన్ని వేసిన మహారాజ స్కందవర్మని నిర్ణయించొచ్చు.

పై రెండు పట్టికలను పరిశీలించగా, మహారాజ నందివర్మకు ఇద్దరు కుమారులున్నట్లు, వారిలో ఒకడు రెండవ హస్తివర్మ, రెండవ వాడు మహారాజ అచండవర్మని భావించొచ్చు. నందివర్మ తన కుమారుల్లో ఒకరికి తండ్రి పేరే పెట్టుకోవడం, అతడు జ్యేష్ఠుడని సూచిస్తుందని, భావరాజు కృష్ణారావు గారి అభిప్రాయం. ఆ రెండవ హస్తివర్మ పెనుకొండ తామ్ర శాసనాన్ని వేసిన మహారాజ హస్తివర్మగా గుర్తించొచ్చు.

మహారాజ నందివర్మ రెండవ కుమారుడైన మహారాజ అచండవర్మ ధారికాటూర తామ్ర శాసనాన్ని వేసిన యువ మహారాజు అచండవర్మే. ఈ శాసనాన్ని అతడి 35వ రాజ్య సంవత్సరంలో వేశాడు. అతడు యువ మహారాజే కనుక, ఆ రాజ్య సంవత్సరాలు అతని తండ్రైన మహారాజు స్కందవర్మ పరిపాలనా కాలానికి చెందినవని నిశ్చయించొచ్చు. అయితే, యువ మహారాజు హోదా లోనే, అతడు స్వతంత్ర పరిపాలనను నిర్వహిస్తున్నట్లు, స్వయంగా గ్రాము దానాన్ని చేసి, శాసనాన్ని వేయడం వలన స్పష్టపడుతున్నది. మహారాజ నందివర్మ అప్పటికే వృద్ధుడై, పూర్తిగా రాజ్య వ్యవహారాలను యువ మహారాజు అచండవర్మకే వదిలివేశాడని, అయితే అప్పటికి ఇంకా సజీవుడై ఉన్నాడని. ఆ కారణంగా అచండవర్మ "మహారాజ" బిరుదాన్ని ధరించలేదని భావించొచ్చు.

పై సాక్ష్యాధారాల పరిశీలన వలన, శాలంకాయన వంశ వృక్షం ఈ క్రింది విధంగా ఏర్పడుతుంది.

మహారాజ (మొదటి) హస్తివర్మ

మహారాజ (మొదటి) నందివర్మ
(కానుకొల్లు ప్రాకృత శాసన ప్రదాత)

మహారాజ అచండవర్మ
(ధారికాటూర శాసన (ప్రదాత)

మహారాజ (రెండవ) హస్తివర్మ
(పెనుగొండ శాసన ప్రదాత)

మహారాజ రెండవ నందివర్మ
(పెదవేగి, కంతేరు, కొల్లేరు,
గుంటుపల్లి శాసనాల ప్రదాత)

మహారాజ స్కందవర్మ
(కానుకొల్లు (సంస్కృత), కంతేరు
(రెండవ) శాసనాల ప్రదాత)

విజయదేవవర్మ తన ఏలూరు శాసనంలో, తన తాత, తండ్రులను ప్రసావించక పోవడంతో, శాలంకాయన వంశ క్రమంలో అతని స్థానాన్ని నిర్ధారణ చేయడం కొంచెం కష్టం. ఆ శాసనం అతన్ని 'అశ్వమేధ యాజీ'గా పరిగించడం వలన, కొందరు పూర్వ చరిత్రకారులు అతడే శాలంకాయన వంశాన్ని, అనగా ఆ వంశీయుల స్వతంత్ర పరిపాలనాధికారాన్ని స్థాపించినట్లు, ఆ విజయాన్ని పురస్కరించుకొని అతడు అశ్వమేధ యాగాన్ని జరిపినట్లు, వాదిస్తారు. ఒక చిన్న స్థానిక రాజ్య స్థాపకుడే అశ్వమేధ యాగాన్ని చేయడం సాధ్యం కాదు. ఆ రాజ్యం సుస్థిరమై, ప్రతిష్ఠను సాధించిన తర్వాత, ఆ యుద్ధ విజయాలను పురస్కరించుకొని అశ్వమేధ యాగాన్ని నిర్వహించినట్లు భావించడం, యుక్తం. అందుచేత, మహారాజ దేవవర్మ, మొదటి నందివర్మ కుమారుల్లో ఒకడని, శాలంకాయన రాజ్యాన్ని సుస్థిరం చేయడానికి, నందివర్మ చేసిన యుద్ధాల్లో సైతం పాల్గొని ఉండొచ్చునని, ఊహించొచ్చు.

శాలంకాయనుల కాలానుక్రమణిక

శాలంకాయనుల శాసనాలను భాషా, లిపులను అనుసరించి, స్థూలంగా క్రీ.శ. 4, 5 శతాబ్దాలకు చెందినట్లు నిర్ణయించొచ్చు. రెండవ నందివర్మ పెదవేగి, గుంటుపల్లి శాసనాల లిపి, విష్ణుకుండిన మహారాజు రెండవ మాధవవర్మ వేసిన ఈపూరు (మొదటి), వేల్పూరు శాసనాల లిపితో పోల్చి చూడగా, ఈ విష్ణుకుండిన శాసనాలు క్రీ.శ. 5వ శతాబ్ది ప్రారంభ కాలానికి చెందినవి. దక్షిణ భారతదేశంలో క్రీ.శ. అయిదో శతాబ్ది ప్రారంభం నుండి డి.సి. సర్కార్ చాలా యుక్తియుక్తంగా నిర్ణయించారు. అయితే, ఇక్ష్వాకుల కాలం నుండే ఆంధ్ర దేశం లోనే ప్రాకృత శాసనాలపై సంస్కృత ప్రభావం కానవస్తుంది. శాలంకాయన రాజు రెండవ హస్తివర్మ వేసిన పెనుగొండ శాసనం కూడ, ఈ

BRAOU

సందర్భంగా ఉదహరించదగింది. మొత్తం మీద, ప్రాకృత శాసనాలను నాలుగో శతాబ్దికి, సంస్కృత శాసనాలను అయిదో శతాబ్దికి చెందినవిగా భావించి, కొన్ని సమకాలీన రాజ వంశాలతో వారి సంబంధాన్ని నిర్ధారించడం వలన, శాలంకాయన రాజుల కాలానుక్రమణిక ఏర్పడుతుంది.

1. సముద్ర గుప్తుని అలహాబాద్ శాసనం ఆ చక్రవర్తి తన దక్షిణాపథ దండయాత్రల్లో ఓడించినట్లు చెప్పిన 12 మంది రాజుల్లో, వైంగేయక హస్తివర్మ ఒకడు. "వైంగేయకు"డనగా వేంగికి చెందిన వాడని అర్థం. వేంగిని పరిపాలించిన హస్తివర్మ శాలంకాయన వంశంలో తప్ప, ప్రాచీనాంధ్ర దేశ చరిత్రలో మరే ఇతర రాజ వంశం లోను కానరాడు.

2. ప్రాచీన పల్లవ రాజుల్లోని మహారాజ రెండవ సింహవర్మ వేసిన వేసంత తామ్ర శాసనం, అతని సామ్రాజ్యం నాదత్తపాటి విషయం లోనికి విస్తరించినట్లు సూచిస్తూంది. ఈ ప్రాంతం విష్ణుకుండిన శాసనాలు ప్రస్తావించే నత్తపాటి (మధ్య యుగం నాటి నతనాడి) విషయమేనని, పరిశోధకుల అభిప్రాయం. ఈ భూభాగం నేడు కృష్ణా నదికి ఉత్తరంగా ఉన్న నందిగామ, జగ్గయ్య పేట తాలూకాలు, ఖమ్మం జిల్లా లోని మధిర తాలూకాలతో సమానమైంది. రెండవ సింహవర్మ వేసంత తామ్ర శాసనం అతని 19వ రాజ్య సంవత్సరంలో క్రీ.శ. 455 లో వేయబడింది. కనుక, ఆ సంవత్సరం నాటికి, శాలంకాయన రాజ్యం అంతరించిందని నిర్ణయించొచ్చు.

ఈ సమకాలీనతలను దృష్టిలో ఉంచుకొని, శాలంకాయనుల కాలానుక్రమణికను ఈ క్రింది విధంగా ఏర్పర్చొచ్చు:

1. మహారాజ (మొదటి) హస్తివర్మ	సుమారు క్రీ.శ. 340-365
2. మహారాజ (మొదటి) నందివర్మ	సుమారు క్రీ.శ. 365-405
3. మహారాజ అచండవర్మ	సుమారు క్రీ.శ. 405-420
4. మహారాజ విజయదేవవర్మ	సుమారు క్రీ.శ. 420-438
5. మహారాజ (రెండవ) హస్తివర్మ	సుమారు క్రీ.శ. 438-439
6. మహారాజ స్కందవర్మ	సుమారు క్రీ.శ. 439-440
7. మహారాజ (రెండవ) నందివర్మ	సుమారు క్రీ.శ. 440-455

BRAOU

6.4.3 : శాలంకాయనుల చరిత్ర : పుట్టుపూర్వోత్తరాలు

క్రీ.శ. 150 లో టోలమీ రచించిన **భూగోళ శాస్త్రం**, మైసోలియా (కృష్ణా నదికి ఇరు వైపులా విస్తరించిన దేశం) కు చెందిన "బెన్‌గోర్" (Bengour) అనే పట్టణం, "సెలకెనో" (Selakenoi) అనే ప్రజలను పేర్కొంటుంది. సెలకెనో శాలంకాయనులని, బెన్‌గోర్ అనగా "వేంగీపుర" మని, ఆచార్య హెచ్. సి. రాయ్ చౌదురి, డి.సి. సర్కార్ ప్రభృతులు సహేతుకంగా నిర్ణయించారు. దీనిని బట్టి, శాలంకాయనులు బహు కాలంగా కృష్ణా - గోదావరీ నదుల నడిమి ప్రదేశంపై, ఆవాసాల నేర్పర్చుకొని నివసిస్తున్నట్లు, స్పష్టపడుతూంది. పాణిని తన **అష్టాధ్యాయి** లోని గణ పాఠంలో శాలంకాయనులు వాహ్లిక దేశానికి సమీపంగా ఒక గణ వ్యవస్థగా ఏర్పడినట్లు, వారి దేశాన్ని "శాలంకాయనక" అని పేర్కొన్నాడు. వాహ్లిక దేశం నేటి అఫ్ఘనిస్తాన్, తజకిస్తాన్ లలో చేరిన భూభాగం.

శాలంకాయనులు తమ శాసనాల్లో చిత్రరథస్వామి పాదానుధ్యాతులుగా వర్ణించుకున్నారు. చిత్ర రథస్వామి అనగా సూర్యుడు. వేద వాఙ్మయం లోని సూర్యుని వలె, ఆకాశంలో గోచరించే ప్రకృతి దైవతం కాక, శాలంకాయనులు విగ్రహ రూపంలో ఆలయంలో ప్రతిష్ఠించి, సూర్యుని పూజించినవారని చరిత్రకారుల విశ్వాసం. అటువంటి ఆలోచనా విధానాలు శక ద్వీపం నుండి వచ్చిన పూజారులు భారతదేశంలో ప్రవేశపెట్టారని, ఆర్.జి. భండార్కర్ వివరించాడు. శాలంకాయనులు భారతదేశానికి వెలుపల, ఆక్సస్ మైదానంలో నివసిస్తూ, పరిసరాల్లోని శకుల ప్రభావంచే ఈ ఆరాధనను అనుసరించేవారని భావించడం, సహేతుకం. "శాలంకాయన" అనే పదానికి, "నంది" అని అర్థం. వారి శాసన ముద్రికల పైన, నాణేల పైన, నంది చిహ్నం కనిపిస్తుంది.

6.4.3.1 : మొదటి హస్తివర్మ (340-365)

శాలంకాయన వంశ స్థాపకునిగా తెలియవస్తున్న రాజు, మొదటి హస్తివర్మ. ఇతని పూర్వులు కృష్ణా నది మైదానంలో క్రీ.శ. 150 నాటికే స్థిరపడి, స్థానిక ప్రాధాన్యతను పొందినట్లు, టోలెమీ రచన సూచిస్తూంది. వారు కడపటి శాతవాహనుల సార్వభౌమత్వాన్ని అంగీకరించి ఉండొచ్చునని, డి.సి. సర్కార్ సహేతుకంగా ఊహించాడు. శాతవాహనుల అనంతరం, కృష్ణా నదికి ఉత్తరంగా జగ్గయ్యపేట, ఘంటసాల మొదలైన ప్రదేశాలపై ఇక్ష్వాకుల ఆధిపత్యం విస్తరించినట్లు, సాక్ష్యాధారాలున్నాయి. శాలంకాయనులు శాతవాహనుల అనంతరం ఇక్ష్వాకుల ఆధిపత్యాన్ని అంగీకరించారని, వారి ప్రాబల్యం తగ్గిన తర్వాత, క్రీ.శ. నాలుగో శతాబ్ది ప్రథమ పాదంలో స్వతంత్రించారని భావించొచ్చు.

హస్తివర్మ బృహత్పలాయన జయవర్మను కుడూర వద్ద ఓడించాడని, అంతటితో ఆ వంశం అంతరించిందని, పైన వివరించడం జరిగింది. ఈ విజయంతో శాలంకాయన రాజ్యం దక్షిణంగా కృష్ణా నది వరకు విస్తరించి, ప్రాబల్యాన్ని పొందినట్లు కానవస్తుంది. కాని, క్రీ.శ. 350 లో సముద్రగుప్తుని దండయాత్ర శాలంకాయన రాజ్యాన్ని తీవ్రమైన అస్థిమితానికి గురిచేసి ఉండొచ్చు. అయితే, స్వల్ప స్థాయిలో ఉన్న శాలంకాయన రాజ్యం కోలుకోవడం సులభమే. కనుక, అచిర కాలంలో హస్తివర్మ శాలంకాయన రాజ్య ప్రతిష్ఠను ప్రాబల్యాన్ని తిరిగి సంపాదించి ఉండొచ్చు. ఈ పోరాటాల్లో అతనికి కుమారుడైన నందివర్మ తోడ్పడి ఉండాలాడని భావించొచ్చు. శాలంకాయన శాసనాలు నందివర్మ అనేక శత్రు సామంతుల రాజ్యాలను సాధించినట్లు వర్ణిస్తాయి.

అలహాబాద్ శాసనం వైంగేయక హస్తివర్మతోబాటుగా; "కౌరాళక మంతరాజు" అనే మరొక రాజును కూడ పేర్కొంటుంది. కౌరాళ అనేది కొల్లేరు సరస్సుగా చరిత్రకారులు గుర్తించారు. అనగా, వేంగికి అతి సన్నిహితంగా మరొక స్థానిక రాజ్యం ఏర్పడున్నట్లు, స్పష్టమౌతున్నది. ఈ ఉభయులు పరస్పరం ప్రత్యర్థులని, శాలంకాయనులు తమ రాజ్యాన్ని సుస్థిరం చేసుకొనేందుకు, తూర్పు తీర ప్రాంతాన్ని ఆక్రమించేందుకు, మంతరాజుతో పోరాడి ఉంటారని భావించడం, యుక్తం. సముద్రగుప్తుని దండయాత్ర ఇటువంటి స్థానిక రాజ్యాలను బలహీనపర్చి, శాలంకాయనుల ప్రాబల్యానికి పరోక్షంగా సాయపడిందనొచ్చు.

శాలంకాయన శాసనాలు హస్తివర్మ, "అనేక సమర ముఖ విఖ్యాత కర్ముడని, "అనేక సమరావాప్తవిజయుడని వర్ణిస్తున్నాయి. అందులో కొంత సాంప్రదాయక ధోరణి కన్పించినా, కొంత సత్యమున్నట్లు గుర్తించడం, యుక్తం. ఇటీవల లభించిన గుంటుపల్లి శిలా శాసనం శిథిలమై అరిగిపోయినది పోగా, మిగిలిన పంక్తులు హస్తివర్మను "మహారాజ సదృశ వనవినర్గ" మని వర్ణిస్తూంది.

BRAOU

మహారాజులతో కూడిన అరణ్యాన్ని (అనగా అరణ్యంలో వృక్షాల వలె అసంఖ్యాకంగా ఉన్న మహారాజులను) నిర్మూలించువాడని, ఈ వాక్యానికి అర్థం.

డూబ్రే, బి.వి.కృష్ణారావ్‌గార్లు, అలహాబాద్ శాసనం హస్తివర్మను సముద్రగుప్తుడు ఓడించినట్లు వివరిస్తున్నా, వాస్తవంగా దక్షిణాపథం లోని 12 మంది రాజులు ఒక సమాఖ్యగా ఏర్పడి, సముద్ర గుప్తుణ్ణి ఎదిరించి ఉండొచ్చునని, సముద్రగుప్తుడు భయభ్రాంతుడై వీరితో సంధి చేసికొని మరలిపోయి ఉండొచ్చునని, అయితే తన రాజధానికి చేరి, ఈ రాజ్యాలకు సుదూరంగా, తానే ఆ రాజులను జయించినట్లు పేర్కొంటూ, శాసనాన్ని నిల్పి ఉండొచ్చునని ఊహించారు. ఇది, లభించే సాక్ష్యా ధారాలను గాలికి వదిలి, నిరాధారంగా చేసిన ఊహ. గుంటుపల్లి శిలా శాసనాన్ని ప్రకటిస్తూ, ఐ.కె. శర్మగారు తిరిగి ఈ ఊహను బలపర్చారు. ఆ శాసనంతో సహా, శాలంకాయన శాసనాల్లో రాజుల ప్రశస్తి కేవలం సాంప్రదాయకమైన కావ్య శైలిగా భావించదగింది. కాని, ప్రత్యేకమైన చారిత్రక సమాచారాన్ని అందించడం లేదు. ఆ రాజు సముద్రగుప్తుని జయించి ఉంటే, అతని తర్వాతి రాజులు ఆ విషయాన్ని స్పష్టంగా తమ శాసనాల్లో ప్రస్తావించేవారు. కనుక, అటువంటి ఊహ అసమంజసం.

హస్తివర్మ ఎంత కాలం పరిపాలించింది తెలియదు. ఆ రాజు శాసనాలేవీ ఇంతవరకు లభించ లేదు. అయితే, పైన పేర్కొన్నట్లు, స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించి, అనేక యుద్ధ విజయాలతో తన రాజ్యాన్ని సుస్థిరం చేసినవాడు కనుక, ఆ రాజు 25 సంవత్సరాలు పరిపాలించినట్లు భావించొచ్చు.

6.4.3.2 : మొదటి నందివర్మ (365-405)

మొదటి హస్తివర్మ అనంతరం, అతని కుమారుడైన మొదటి నందివర్మ సింహాసనాన్ని అధిష్ఠించి, రాజ్యాన్ని పరిపాలించాడు. ఇతడు తన కానుకొల్లు (ప్రాకృత) శాసనాన్ని వేంగిపురం నుండి వేశాడు. ఇతని కుమారుడైన అచండవర్మ ధారికాటూర తామ్ర శాసనం, ఈ రాజు 35వ రాజ్య సంవత్సరాన్ని పేర్కొంటుంది. కనుక, ఇతడు కుమారు 40 సంవత్సరాలు పరిపాలించినట్లు నిర్ణయించొచ్చు.

స్కందవర్మ వేసిన కానుకొల్లు (సంస్కృత) శాసనం, ఇతడు స్వప్రతాపం చేత శత్రువులను నిర్మూలించినట్లు వర్ణిస్తుంది. సముద్రగుప్తుని దండయాత్ర ఫలితంగా శాలంకాయన రాజ్యం కల్లోలానికి గురైందని, ఆ పరిస్థితుల్లో శత్రువులను అణచివేసి, వంశ ప్రతిష్ఠను, రాజ్య సుస్థిరతను పునరుద్ధరించడానికి నందివర్మ అనేక పోరాటాలను చేసి ఉండొచ్చు. అయితే, రెండవ నందివర్మ పెదవేగి, గుంటుపల్లి శాసనాలు ఇతని యుద్ధ విజయాలను కాక, వివిధ ధర్మాలను (దానాలను) చేసినట్లు, గోసహస్రాలను ప్రదానం చేసినట్లు వర్ణిస్తాయి. బహుశా మొదటి నందివర్మ యుద్ధ విజయాల్లో అధిక భాగం ఆతని తండ్రి కాలంలో జరిగాయని, ఆతని కాలంలో జరిగిన పోరాటాల్లో అతని షక్షాన అతని కుమారులు అచండవర్మ, విజయదేవవర్మ పాల్గొన్నారని ఉహించడానికి, అవకాశం ఉంది. కాని, ఆ రాజు స్వయంగా వేసిన కానుకొల్లు (ప్రాకృత) శాసనంలో, ఈ రెండు విధాలైన వర్ణనలు కానరావు.

మొదటి నందివర్మ కుమారుల్లో పెద్ద వాడు, రెండవ హస్తివర్మ, రెండవ వాడు అచండవర్మ, మూడవ వాడు విజయదేవవర్మ కావచ్చు. రెండవ హస్తివర్మ రాజ్య వ్యవహారాల్లో ఆసక్తి, దక్షత లేనివాడని, అందుచేత రెండవ వాడైన అచండవర్మ యువ మహారాజు పదవిని అధిష్ఠించి, తండ్రి షక్షాన రాజ్య వ్యవహారాలను నిర్వహించాడని, పోరాటాలు చేశాడని భావించడానికి అవకాశముంది. అచండవర్మకు, అతని కనిష్ఠ సోదరుడైన విజయదేవవర్మ తోడ్పడి ఉండొచ్చు.

BRAOU

6.4.3.3 : అచండవర్మ (క్రీ.శ. 405-420)

మొదటి నందివర్మ పరిపాలనా కాలం లోనే, అచండవర్మ యువ మహారాజు పదవిలో పరిపాలనా బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉన్నందున, తండ్రి తర్వాత "మహారాజు" బిరుదాన్ని ధరించి, సింహాసన మధిష్ఠించినట్లు, కానవస్తుంది. అతన్ని గూర్చి , అతని కుమారుడైన రెండవ నందివర్మ తన శాసనాల్లో "ప్రతాపోపనత సామంతుడని", "చండదండ" బిరుదాన్ని ధరించినవాడని వర్ణించాడు. ఈ బిరుదాలు సాంప్రదాయకమైనవే అయినా, అతడు గొప్ప విజేత, పరిపాలనా దక్షుడని సూచిస్తాయి.

సమకాలీనంగా, గోదావరి నదికి ఉత్తరంగా ఉన్న కళింగ దేశాన్ని పరిపాలిస్తున్న మాఠరులు కూడ, శక్తివంతమైన రాజ్యాన్ని స్థాపించి పరిపాలిస్తున్నవారే. ఆ వంశం లోని ప్రభంజనవర్మ వేసిన నిడిగొండ తామ్ర శాసనం, అతని తండ్రైన శక్తివర్మ కృష్ణా పర్యంతంగా కళింగ సామ్రాజ్యాన్ని దక్షతతో పరిపాలించినట్లు వర్ణిస్తుంది. ఈ శక్తివర్మ పిష్టపురం నుండి రాగోలు శాసనాన్ని వేశాడు. అతడు దక్షిణంగా కృష్ణా నది వరకు దండెత్తి, తన ఆధిపత్యాన్ని విస్తరింప యత్నించాడని, మార్గ మధ్యంలో పిష్టపురం వద్ద ఆగి, అక్కడ పరిపాలిస్తున్న వాసిష్ఠ వంశపు రాజులను కూడగట్టుకొని, దండెత్తాడని ఊహించొచ్చు. రాగోలు శాసనం ఆరాజును వాసిష్ఠీపుత్రుడని పేర్కొంటుంది. అంటే, అక్కడ పరిపాలిస్తున్న వాసిష్ఠ వంశపు రాజులను కూడగట్టుకొని, దండెత్తాడని ఊహించొచ్చు. రాగోలు శాసనం ఆరాజును వాసిష్ఠీపుత్రుడని పేర్కొంటుంది. అంటే, అంతకు పూర్వమే, ఉభయ వంశాల రాజకీయ సంబంధం వైవాహిక సంబంధంతో బలీయమైనట్లు, తోస్తుంది. శక్తివర్మ పరిపాలనా కాలం సుమారు క్రీ.శ. 400-415; కనుక, అతడు శాలంకాయన వంశం లోని మొదటి నందివర్మ, అచండవర్మలకు సమకాలికుడు. మొదటి నందివర్మ పరిపాలనా చివరి దశలో అతడు దక్షిణంగా కృష్ణా పర్యంతంగా ఆక్రమించి, రాజ్యాన్ని విస్తరింపజేశాడని భావించొచ్చు.

కళింగ దేశంలో మాఠర, వాసిష్ఠ వంశీయులు కాక, తమను తాము "పితృ భక్త" అని వర్ణించుకొన్న మరొక రాజ వంశముంది. ఆ వంశంలో బొబ్బిలి, కోమర్తి తామ్ర శాసనాలను వేసిన మరొక అచండవర్మ కానవస్తాడు. అతడు బహుశః ఒక్కలి తామ్ర శాసనాన్ని వేసిన ఉమవర్మ కుమారుడని తోస్తుంది. అతని పేరు, పితృభక్త వంశీయులు శాలంకాయనులకు సామంతులైనట్లు సూచిస్తుంది. సామంత రాజులు తమ కుమారులకు సార్వభౌముల పేర్లను పెట్టుకోవడం, ప్రాచీన ఆంధ్ర దేశ చరిత్రలో ప్రసిద్ధమే.

శాలంకాయన రాజు అచండవర్మ తన ప్రత్యర్థులైన మాఠరులకు పక్కలో బల్లెం వలె, "పితృభక్త" వంశీయులను సమర్థించి, బలపర్చాడని ఊహించొచ్చు. వారి లోని ఉమవర్మ, అతనికి సమకాలికుడు, సామంతుడైనట్లు, అతడు తన కుమారునికి అచండవర్మ అనే పేరుంచి, శాలంకాయనుల పట్ల విధేయత చాటుకొన్నట్లు కానవస్తుంది. ఈ విధమైన కళింగ రాజకీయాల్లో, అచండవర్మ మాఠరులను ఓడించి కృష్ణా మైదానాల నుండి తరిమి వేశాడని, వారిని అదుపు చేసేందుకు పితృభక్త వంశీయులతో మైత్రి వహించి, కళింగం లోనికి తన ప్రాబల్యాన్ని విస్తరింపజేశాడని భావించడం, సమంజసం.

6.4.3.4 : విజయదేవవర్మ (క్రీ.శ. 420-435)

అచండవర్మ మరణించే నాటికి, అతని కుమారుడైన నందివర్మ బాలుడై ఉన్నట్లు, అందుచేత అతని సోదరుడైన విజయదేవవర్మ సింహాసనాన్నధిష్ఠించినట్లు తోస్తుంది.

BRAOU

విజయదేవవర్మ పరిపాలనా కాలం ప్రాచీన పల్లవ రాజుల్లో విజయస్కందవర్మ పరిపాలనా కాలానికి (క్రీ.శ. 400-436) సరైంది. ఆ రాజు తన 33వ రాజ్య సంవత్సరంలో కర్మ రాష్ట్రంలో గ్రామ దానం చేసి, విజయతాంబ్రప స్థానం నుండి తన ఓంగోడు (మొదటి) తామ్ర శాసనాన్ని వేశాడు. తాంబ్రప నేటి గుంటూర్ జిల్లా లోని చేబ్రోలుగా చరిత్రకారులు గుర్తిస్తారు. కనుక, పల్లవ రాజైన విజయస్కందవర్మ తన రాజ్యాన్ని కృష్ణా నది వరకు విస్తరించాడని, శాలంకాయన విజయదేవవర్మ అతన్ని ఓడించి, పల్లవుల విస్తరణను అరికట్టాడని తోస్తుంది. ఏలూర్ తామ్ర శాసనం విజయదేవవర్మ అశ్వమేధ యాగాన్ని చేసినట్లు పేర్కొంటుంది. అతని పేరులోని "విజయ", యుద్ధ విజయాలను సూచించే గౌరవ వాచకంగా, పల్లవ రాజును అనుకరిస్తూ ధరించింది కావచ్చు. పల్లవులపై సాధించిన విజయాలను ప్రకటిస్తూ, విజయదేవవర్మ అశ్వమేధాన్ని జరిపి, అతడు ఈ బిరుదాన్ని ధరించినట్లు ఊహించొచ్చు. ఏలూర్ తామ్ర శాసనం అతని 13వ రాజ్య సంవత్సరం నాటిది. కనుక, అతడు 15 సంవత్సరాలు పరిపాలించాడని భావించొచ్చు.

పల్లవులపై సాధించిన విజయంతో, శాలంకాయనులు కృష్ణా నదీ ముఖద్వారం పద్ద ఉన్న కుడూర ఆహారాన్ని ఆక్రమించారని తోస్తుంది. తర్వాత ఆ వంశం లోని స్కందవర్మ, రెండవ నందివర్మ ఈ భూభాగంలో దానాలను చేసి, తామ్ర శాసనాల నిచ్చారు.

6.4.3.5 : రెండవ హస్తివర్మ (క్రీ.శ. 435 - 437)

విజయదేవవర్మ తర్వాత, అతని సోదరుడైన రెండవ హస్తివర్మ పరిపాలించినట్లు తోస్తుంది. అచండవర్మ, విజయదేవవర్మ వేసిన ప్రాకృత శాసనాల కంటె, రెండవ హస్తివర్మ వేసిన పెనుగొండ తామ్ర శాసనంపై సంస్కృత ప్రభావం అధికంగా కానవస్తుంది. కనుక, వారి తర్వాత అతడు సింహాసనా న్నధిష్ఠించినట్లు భావించడం, సహేతుకం.

రెండవ హస్తివర్మ తన పెనుగొండ తామ్ర శాసనాన్ని "విజయజయపుర" నుండి, తన రెండవ రాజ్య సంవత్సరంలో వేశాడు. ఈ పేరు లోని "విజయ" అనే పదం వల్ల, రెండవ హస్తివర్మ జయపురం వద్ద యుద్ధ విజయాన్ని అపేక్షించి, సేనలతో విడిసి ఉన్నట్లు, అర్థమౌతుంది. ఆ శాసనం, అతడు గొప్ప విష్ణు భక్తుడు, భక్తి తత్పరత కలవాడని వివరిస్తుంది. కాని, అతని యుద్ధ విజయాలు, రాజ్య పాలన గూర్చి ప్రస్తావించవు.

మాఠర వంశంలో, శక్తివర్మ మనుమడైన అనంతశర్మ కూడ, తన అంధవరం తామ్ర శాసనాన్ని విజయజయపురం వద్ద పెద్ద సేనతో కూడిన యుద్ధ రంగం నుండి వేశాడు. ఆ యుద్ధం మాఠర శాలంకాయన రాజుల నడుమనే జరిగి ఉంటుందన్ని ఊహించొచ్చు. అనంతశక్తివర్మ అంధవరం శాసనం, ఆ రాజు 14 వ రాజ్య సంవత్సరం నాటిది. అతని మద్రాస్ మ్యూజియం శాసనం, 28వ రాజ్య సంవత్సరం నాటిది. కనుక, జయపురం వద్ద జరిగిన యుద్ధంలో మాఠరులు గెలుపొందినట్లు స్పష్టపడుతున్నది. పెనుగొండ శాసనాన్ని వేసిన కాలం నాటికి, రెండవ హస్తివర్మ వృద్ధుడని, మాఠరులతో జరిగిన యుద్ధంలో మరణించాడని తోస్తుంది. అందుచేత, అతని పరిపాలన రెండేండ్లకు మించి జరుగలేదని భావించొచ్చు. ఈ పరాజయం శాలంకాయన రాజ్య ప్రతిష్ఠను, సుస్థిరత్వాన్ని భగ్నం చేసిందని చెప్పొచ్చు.

BRAOU

6.4.3.6 : రెండవ నందివర్మ (క్రీ.శ. 437-455)

మొదటి నందివర్మ అనంతరం, అతని కుమారులు వరుస క్రమంలో పరిపాలించినందున, రెండో హస్తివర్మ తర్వాత వారసత్వ పోరాటాలు సంభవించినట్లు తోస్తుంది. ఆ వంశం లోని చివరి రాజులైన స్కందవర్మ, రెండో నందివర్మ తమ శాసనాల్లో, మొదటి హస్తివర్మ నుండి తమ వంశ క్రమాన్ని వివరించడం, తమ తండ్రులను మాత్రమే పేర్కొని, పిన తండ్రి, పెద తండ్రులను ప్రస్తావించక పోవడం, ఈ అంశాన్ని సూచిస్తున్నాయి. అంతేకాక, వారు తమ తాతైన మొదటి నందివర్మను వర్ణించడంలో నైతం, కొంత ప్రత్యేకతను ప్రదర్శించారు. స్కందవర్మ తన కానుకొల్లు (సంస్కృత) శాసనంలో, ఆ రాజును "స్వప్రతాపాపనీతాహిత వర్మ" అనగా, అహితులను (శత్రువులను) తన ప్రతాపం చేత లొంగదీశాడని వర్ణించగా, రెండో నందివర్మ పెదవేగి శాసనం, "వివిధ ధర్మ ప్రదానన్య" అని మాత్రమే వర్ణిస్తుంది. అనగా ఆ రాజు పారలౌకిక దృష్టి కలిగి, దాన ధర్మాలను చేయడమేకాని, పరిపాలనా నిర్వహణను చేయలేదని, ఆ వాక్యం సూచిస్తుంది. అతడు తన తండ్రైన అచండవర్మ "ప్రతాపోపనతసామంతస్య" అని, ఆ శాసనంలో పేర్కొన్నాడు. తన తాతైన నందివర్మ షక్షాన పోరాటాలను చేసినట్లు, అతడు తన తండ్రిని వర్ణించాడని ఈ వాక్యం సూచిస్తుంది. స్కందవర్మ తన పిన తండ్రికి ఈ ఖ్యాతిని కట్టబెట్టక, తన తాతకు ఈ ఘనతను ఆపాదించాడని అర్థం చేసుకోవచ్చు. ఈ విధంగా, వంశ క్రమాన్ని వివరించడంలో, వారు తమ రాజ్యాధికారాన్ని ప్రకటించుకోవడమే ఉద్దేశించినట్లు, స్పష్టపడుతుంది.

రెండో హస్తివర్మ అనంతరం, అతని కుమారుడైన స్కందవర్మ ఈ వంశాంతర్గత పోరాటాల్లో విజయాన్ని సాధించి, సింహాసన మధిష్ఠించాడని భావించొచ్చు. కాని, అతని కానుకొల్లు (సంస్కృత), కంతేరు శాసనాలు, అతని మొదటి సంవత్సరం లోనివే. అందుచేత, శాలంకాయనుల వంశాంతర్గత పోరాటాలు, తుదకు రెండో నందివర్మకు అనుకూలంగా ముగిసాయని, స్కందవర్మ పరిపాలన బహు కాలం జరగలేదని స్పష్టమౌతుంది. అంతర్యుద్ధంలో రెండవ నందివర్మ అతనిపై పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాడని, తుదకు అతన్ని పదవీచ్యుతుని చేసి, బహుశః వధించి, సింహాసనా న్నధిష్ఠించాడని భావించొచ్చు.

రెండవ నందివర్మ క్రీ.శ. 440 నుండి 455 వరకు పరిపాలించి ఉండొచ్చు. శాలంకాయన వంశ చరిత్రలో రెండవ నందివర్మ పరిపాలనా కాలం కొన మెరుపు; ఆ తర్వాత ఆ రాజ్యం అంతమైంది. అంతర్యుద్ధంలో సంక్షోభానికి గురైన శాలంకాయన రాజ్యాన్ని, తిరిగి బలపర్చడానికి అతడు ప్రయత్నించినట్లు తోస్తుంది. కళింగలో తన మిత్రులైన పితృభక్త వంశీయుల షక్షాన, మాఠరులపై ధండెత్తినట్లు కానవస్తుంది. పితృభక్త వంశీయులు "కళింగాధిపతి" బిరుదాన్ని ధరించి, పరిపాలించసాగారు. కనుక, మాఠర వంశీయులు అంతరించారని, సంపూర్ణంగా కళింగ రాజ్యం వారికి సంప్రాప్తించినట్లు ఊహించొచ్చు. అందుకు, రెండవ నందివర్మ సాయపడినట్లు భావించొచ్చు.

ప్రాచీన పల్లవ రాజైన విజయస్కందవర్మ తర్వాత సింహాసనమధిష్ఠించిన అతని కుమారుడు రెండవ సింహవర్మ గొప్ప విజేత. అతని వేసంత శాసనం, పల్లవుల ఆధిపత్యం కృష్ణా పర్యంతంగా విస్తరించినట్లు, శాలంకాయనుల పరిపాలన సంపూర్ణంగా అంతరించినట్లు సూచిస్తుంది.

BRAOU

6.5 : ఆనందగోత్రులు

శాతవాహనుల అనంతరం తీరాంధ్ర దేశాన్ని పరిపాలించిన రాజ వంశాల్లో, ఆనందగోత్రు లొకరు. ఈ వంశీయుల తామ్ర శాసనాలు రెండు మాత్రమే లభించాయి. అవి అత్తివర్మ (హస్తివర్మ) అనే రాజు వేసిన గోరంట్ల శాసనం, దామోదరవర్మ అనే రాజు వేసిన మట్టెపాడు శాసనం. ఇవి కాక, ఈ వంశం లోని కొందరు అర్వాచీన (later) రాజులను ప్రస్తావించే ఒక శిలా శాసనం, గుంటూర్ జిల్లా, నర్సరావుపేట తాలూకా లోని చేజెర్ల గ్రామం వద్ద ఉంది.

ఆనందగోత్రుల చరిత్రలో జన్మభూమి, వంశ కాలానుక్రమణిక కాక, వంశ నామం కూడ, వివాదగ్రస్తమే. గోరంట్ల శాసనం, అత్తివర్మ ఆనంద మహర్షి నుండి ఉత్పన్నమైన వంశంలో "(అతుల విపుల యశసి శ్రీ మత్యానంద మహర్షి వంశ సముద్భూతే) జన్మించినవాడని, కందర నృపతి కులంలో జన్మించిన వాడని (కందరనృపతి కులే సముద్భూతేన) పేర్కొంటుంది. దామోదరవర్మ తన మట్టెపాడు శాసనంలో తాను ఆనందగోత్రుడని చెప్పుకున్నాడు. ప్రాచీన కాలంలో వంశ, కుల, గోత్ర అనే పదాలు శాసనాల్లో, వాఙ్మయంలో సమానార్థకంగా, 'వంశ' మనే అర్థంలోనే ప్రయోగించబడినట్లు, సామాన్యంగా తెలిసిన విషయమే. ఈ శాసన వాక్యాల ననుసరించి, చరిత్రకారులు వీరిని "ఆనందగోత్రు"లని, లేదా ఆనంద వంశీయులని, లేదా "కందర" వంశీయులని వివిధంగా వ్యవహరిస్తారు.

6.5.1 : ఆనంద గోత్రులు : పుట్టుపూర్వోత్తరాలు

వైన పేర్కొన్న రెండు తామ్ర శాసనాలు ఆయా శాసన ప్రదాతలను హిరణ్య గర్భం నుండి పుట్టినవారని (హిరణ్యగర్భోద్భవ) వర్ణిస్తున్నాయి. హిరణ్యగర్భుడనగా బ్రహ్మ, బ్రహ్మ నుండి పుట్టిన వారని, లేదా హిరణ్య గర్భం అనగా బంగారు కడుపు నుండి పుట్టినవారని, ఈ పదానికి అర్థాలను వివరించొచ్చు. ప్రాచీన భారతదేశంలో తక్కువ సాంఘిక స్థాయికి చెందినట్లు గుర్తింపు పొందడానికి, హిరణ్యగర్భ మహా దానాన్ని జరిపేవారు. తర్వాతి తరాలకు చెందిన వారు కూడ, తమ పూర్వులెవరో చేసిన ఈ దాన మహత్యాన్ని ప్రస్తావించి, తాము ఉన్నత కులానికి చెందినట్లు వర్ణించుకొనేవారు.

క్రీ.శ. 3, 4 శతాబ్దాల్లో దక్కన్ పీఠభూమిపై పరిపాలించిన కొన్ని రాజ వంశాలు చిటుకులానంద, ముడానంద, సివలానంద అనే వంశ నామాలను ధరించారు. ఆ పదాల్లోని చుటు, ముడు, సివల, మొదలైనవి జాతి వాచకాలు. 'ఆనంద' అనే పదాన్ని, వారు తమ జాతులకు దొన్నత్వాన్ని కలిగించి, ఆనందాన్ని చేకూర్చిన వారనే అర్థంలో ధరించినట్లు భావించొచ్చు. క్రీ.శ. నాలుగో శతాబ్దాంతానికి ఈ జాతుల సమ్మేళనం వలన, వారి ప్రత్యేక జాతి వాచకాలు అంతరించి, విస్తృతమైన ప్రజానీకంగా ఏర్పడినట్లు, వారు 'ఆనంద' అనే పేరున ప్రసిద్ధులైనారని తోస్తుంది.

ప్రాచీన భారతదేశం లోని యక్షులు పూజించిన 'సిరిమా' దేవత శ్రీమహాలక్ష్మిగాను, ఆమె కుమారుడైన ఆనంద మహర్షి యక్ష జాతులకు వంశకర్తగాను, భావించబడినారని ఊహించొచ్చు. ఆనంద, కర్దమ, బిక్లీత అనే ముగ్గురు ఋషులు ఆమె కుమారులని, ఆమె ఏనుగులు, గుర్రాలు మొదలైన రాజసం కలిగిన జంతుజాలంతో సంబంధాన్ని కలిగి ఉంటుందని, శ్రీసూక్తం వర్ణిస్తుంది. ప్రాచీన ఆంధ్ర దేశంలో ఈ చిహ్నాలతో నాణేలను పలు రాజ వంశాలు విడుదల చేశాయి. వారిని జాతి పరంగా యక్షులని భావించడంలో, అసంగతం ఏమీ లేదు.

BRAOU

ఆనందగోత్రులు ప్రాచీన ఆంధ్ర దేశం లోని యక్ష జాతులకు చెంది, కాలక్రమాన రాజ్య స్థాపకు లైనట్లు, ఆనంద మహర్షి గోత్రానికి, లేదా వంశానికి చెందినవారని, తమను తాము వర్ణించుకొన్నట్లు నిర్ణయించొచ్చు.

6.5.2 : ఆనందగోత్రులు : జన్మభూమి, రాజధాని

అత్తివర్మ గోరంట్ల శాసనం, ఆ రాజు వంకేశ్వర నిలయుడైన శంభుని పాద ధూళి వలన పవిత్రమైనవాడని (భగవతో వంకేశ్వరాధి వాసినస్త్రిభువనకర్తుః శంభోశ్చరణ కమల రాజః పవిత్రీకృతే), వర్ణించింది. వంకేశ్వర మనే శైవ క్షేత్రం నేటి కోస్తా ఆంధ్ర దేశంలో కన్పించడం లేదు. అది బహుశః తెలంగాణాలో మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల సరిహద్దుల్లోని వంకేశ్వరమేనని తోస్తుంది. కాబట్టి, ఆనందగోత్రుల జన్మభూమి కృష్ణా నదికి ఉత్తరంగా ఉన్న తెలంగాణా ప్రాంతమని, వారి రాజధాని సైతం ఆ ప్రాంతం లోనే ఉండేదని భావించొచ్చు.

దామోదరవర్మ తన మట్టెపాడు శాసనాన్ని "విజయకందరపురం" నుండి వేశాడు. వారి వంశ పూర్వుడైన కందరరాజు పేర, ఆ నగరం వెలసినట్లు భావించొచ్చు. ఈ నగరాన్ని గుర్తించడానికి, లోగడ చరిత్రకారులు అనేక ఊహాగానాలను చేశారు. దామోదరవర్మ మట్టెపాడు శాసనంలో "నమ్య క్సంబుద్ధ పాదానుధ్యాతు" డని చెప్పుకోవడం, ఆ శాసనం గాఢమైన ప్రాకృత ప్రభావానికి లోనైన సంస్కృత భాషలో రచించబడినదని హుల్ట్ష్ పండితుడు అభిప్రాయపడడం వలన, ఆ రాజు బౌద్ధుడని, బౌద్ధ వాఙ్మయం "కపోతకందర" మనే పట్టణాన్ని ప్రస్తావిస్తుందని, కపోతేశ్వరాలయం నెలకొని ఉన్న చేజెర్ల గ్రామమే, ప్రాచీన కాలం నాటి "కపోతకందరపుర" మని, చరిత్రకారులు నిర్ణయించారు. అలగ్జాండర్ రే, లాంగ్‌హర్స్ట్ వంటి పురావస్తు శాస్త్రవేత్తలు, చేజెర్ల వద్ద ఉన్న కపోతేశ్వరాలయ గజపృష్ఠ (ప్రణాళిక (apsidal plan) వలన, వాస్తవంగా అది బౌద్ధ చైత్యాలయ మని, క్రీ.శ. 7, 8 శతాబ్దాల్లో శైవ మతం విజృంభించిన సమయంలో శివాలయంగా మార్చబడిందని అభిప్రాయపడ్డారు. దామోదరవర్మ తన రాజధానిని కందరపురంలో ఒక బౌద్ధ చైత్యాలయాన్ని నిర్మించినట్లు, నేటి కపోతేశ్వరాలయం, చేజెర్ల గ్రామమే ఆనాటి కపోతకందరపుర మనేది ప్రాచీన చరిత్రకారుల అభిప్రాయం.

కాని, మతానికి, భాషకు సంబంధం లేదు. బౌద్ధులు కేవలం ప్రాకృత భాషను ఉపయోగించ లేదు. మట్టెపాడు శాసన భాష ప్రాకృతం కాదు. గాఢమైన ప్రాకృత భాషా ప్రభావానికి లోనైన సంస్కృత భాష కాదు. అది పూర్తిగా సంస్కృత శాసనమే. అందులో దాన గ్రహీతల పేర్లు, గోత్రాలు ప్రాకృత భాషలో ఉన్నాయి. ప్రాకృత భాష అనే కంటే, స్థానిక భాషలో ఉన్నాయి. అప్పటికింకా స్థానిక భాషలు పూర్తిగా సంస్కృత ప్రభావానికి లోనుకాలేదని సూచిస్తాయి. ఆనందగోత్రులకు పూర్వమే ప్రాచీన పల్లవులు ప్రాకృత భాషలో శాసనాలను వేశారు; కాని వారు బౌద్ధులు కారు.

దామోదరవర్మను సమ్యక్సంబుద్ధ పాదానుధ్యాతుడని వర్ణించడం చేత, అతడు బౌద్ధుడని సూచించదు. క్రీ.శ. 4వ శతాబ్ది నాటికే, భక్తితత్వం ప్రాతిపదికగా, మహాయాన బౌద్ధ మతం, పౌరాణిక హిందూ మతం (లేదా నవ్య హిందూ మతం) పరస్పరం చేరువౌతున్నాయి. ఆ రాజు మట్టెపాడు శాసనాన్ని, నానాగోత్రచరణ తపస్స్వాధ్యాయ నిరతులైన బ్రాహ్మణులకు "కంగూర" అనే గ్రామాన్ని దానం చేసి, వేశాడు. ఆ రాజు విశేషమైన వర మత సహనం కలవాడని భావించినా, వేదవిదులైన బ్రాహ్మణులకు గ్రామాన్ని దానం చేయడం, నాటి బౌద్ధ మత స్వరూపాన్ని కూడ స్పష్టపరుస్తుంది.

BRAOU

ఇటీవలి కాలంలో కపోతేశ్వరాలయ ప్రాంగణంలో జరిపిన త్రవ్వకాల వలన, ఆ నిర్మాణం ఆనంద గోత్రులకు పూర్వం, ఇక్ష్వాకుల కాలం నాటిదిగా, నిర్ధారణైంది. ఇక్ష్వాకుల కాలం లోనే, గజ పృష్ఠాకార ప్రణాళికతో హిందూ దేవాలయాల నిర్మాణాలు జరిగాయి. ఆ కాలంలో చేజెర్ల వద్ద కూడ, అదే ప్రణాళికలో ఒక ఆలయ నిర్మాణం జరిగిందని, అది దామోదరవర్మ చైత్యాలయంగా ఉద్దేశించి నిర్మించింది కాదని నిశ్చయించొచ్చు.

పై పరిశీలన వలన, దామోదరవర్మకు చేజెర్ల లోని కపోతేశ్వరాలయానికి సంబంధాన్ని కూర్చడం, ఆ గ్రామం ఆ రాజు రాజధానైన కందరపురంగా గుర్తించడం, అంగీకరించదగిన నిర్ణయాలు కావు. ఆచార్య మారేమండ రామారావ్ కందరపురం నేటి గుంటూర్ నగరాన్ని ఆనుకొని ఉన్న "కంతేరు" గ్రామం కావచ్చునని భావించారు. కాని, 'కంతేరు' లోని "ఏరు", కందరపురంలో లేదు. ఏరు నామాంతరంగా ఆంధ్ర దేశంలో అసంఖ్యాకంగా గ్రామ నామాలు ఉన్నాయి. అవేవి భాషాపరమైన పరిణామాన్ని సూచించక, చాలా వరకు ప్రాచీన స్వరూపాలనే కలిగి ఉన్నాయి. అవి, ఏదో ఒక ఏరుతో సంబంధాన్ని కలిగినవిగా గ్రహించొచ్చు. కనుక, కంతేరు, కందరపురం కాదు.

ఆనందగోత్రుల పరిపాలన తీరాంధ్ర దేశంపై అర్ధ శతాబ్దికి మించి లేదు. ఈ స్వల్ప కాలంలో వారొక రాజధాని నగరాన్ని నిర్మించినట్లు భ్రమించి అన్వేషించడం, అనవసర ప్రయత్నం. ఇక్ష్వాకులు విజయపురిని, శాలంకాయనులు వేంగీ నగరాన్ని నిర్మించారని భావించడం, సహేతుకం కాదు. ఆ నగరాలు వారికి పూర్వమే ఆర్థిక, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగి, వారికి ముఖ్య పట్టణాలుగా లభించాయి. అలాగే, ఆనందగోత్రులు తమ రాజకీయ ప్రాబల్యాన్ని తీరాంధ్రం లోనికి విస్తరించి, తమకు అనువైన పట్టణాన్ని ముఖ్య పట్టణంగా చేసుకొన్నారని, దానికి తమ వంశపూర్వుడైన కందర రాజు పేరు ఉంచారని భావించొచ్చు. కాని, వారి రాజ్యాధిపత్యం అచిర కాలంలోనే అంతరించడంలో, ఆ పేరు ప్రజల వ్యవహారంలో స్థిరపడ లేదు.

అసలు ఆనందగోత్రులకు తీరాంధ్రంలో రాజధాని నగరం లేదని భావించడం కూడ, పొరబాటు కాబోదు. వారి కుల దైవమైన వంశేశ్వరుని స్థానం నేటి మహబూబ్‌నగర్ జిల్లా లోనిదిగా కాగా, కందరపురం కూడ ఆ ప్రాంతం లోనే ఉండి ఉంటుంది. అది కందూరు కావచ్చు. కందూరు కాకతీయుల కాలంలో ఒక సామంత చోడ వంశానికి ముఖ్య పట్టణం. ప్రజల వ్యవహారంలో 'కందపురం' కందూరుగా మారిందని, భావించొచ్చు.

BRAOU

6.5.3 : ఆనందగోత్రులు : చరిత్ర

ఆనందగోత్ర రాజుల పరిపాలనా కాలం చాల స్వల్పమైంది. చెప్పుకోదగిన విశేషాంశాలు కలది కాదు. సమకాలీన ఆంధ్ర దేశ రాజకీయాల్లో వీరి స్థానాన్ని నిర్ణయించడానికి ముందు, ఈ రాజుల వంశ క్రమాన్ని, కాలానుక్రమాన్ని నిర్ణయించడ మవసరం.

ఆనందగోత్రుల తామ్ర శాసనాలు లిపి స్వరూప స్వభావాల ననుసరించి, క్రీ.శ. 4, 5 శతాబ్దాలకు చెందినవిగా, శాసన పరిశోధకులు నిర్ణయించారు. ఇవి, ప్రాచీన పల్లవుల ఉరుబవల్లి, మాంగడూరు తామ్ర శాసనాలతో పోల్చదగినవి. అత్తివర్మ గోరంట్ల శాసనాన్ని ప్రకటిస్తూ, ఫ్లీట్ పండితుడు అది ప్రాచీన పల్లవ తామ్ర శాసనంగానే భావించాడు. అలహాబాద్ శాసనం, ఈ వంశీయులను సముద్రగుప్తుని దండయాత్రా కాలం నాటి పన్నెండు మంది దక్షిణాపథ పరిపాలకుల్లో చేర్చి, పేర్కొనదు. కనుక, ఈ రాజులు ఆ దండయాత్ర తర్వాత కాలం నాటి వారని నిశ్చయించొచ్చు.

అత్తివర్మ తన గోరంట్ల శాసనంలో కందరరాజు వంశానికి చెందినట్లు వర్ణించుకోవడం, దామోదరవర్మ మట్టెపాడు శాసనం ఆ రాజు పేరున ఒక పురం, వీరి రాజధానైనట్లు సూచించడం, ఈ ఉభయులకు పూర్వుడైన ఒక కందరరాజు ఉన్నట్లు స్పష్టపరుస్తాయి. అయితే, అతనికి ఈ ఇద్దరికి నడుమ ఉన్న సంబంధం స్పష్టంగా తెలియదు.

అత్తివర్మ, దామోదరవర్మలలో ముందు వెనుకలు నిర్ణయించడానికి, లోగడ కొందరు చరిత్రకారులు మట్టెపాడు శాసనం ప్రాకృత భాషకు చెందినదనే భావంతో, దామోదరవర్మ పూర్వుడని, అత్తివర్మ అతని తర్వాతి వాడని అభిప్రాయపడ్డారు. కాని, డి.సి. సర్కార్ ప్రాకృత భాషను ప్రమాణంగా గ్రహించినట్లయితే, సంస్కృత నామధేయాన్ని కలిగిన దామోదరవర్మ కంటే, ప్రాకృత ప్రభావాన్ని ప్రదర్శించే అత్తివర్మ (హస్తివర్మ) నామధేయం, పూర్వ కాలానికి చెందినట్లు గ్రహించడం యుక్తమని వాదించారు. ఆయన, గోరంట్ల శాసనం అత్తివర్మను **"హిరణ్యగర్భోద్భవు"** డని మట్టెపాడు శాసనం దామోదర వర్మను **"హిరణ్యగర్భోద్భవోద్భవు"**ని వర్ణిస్తున్నట్లు, అత్తివర్మ హిరణ్యగర్భ మహాదానాన్ని చేసినవాడని, దామోదరవర్మ అటువంటి వారి కుమారుడని (అనగా అత్తివర్మ కుమారుడని) సూచిస్తున్నట్లు, అభిప్రాయపడ్డారు. కాని, మట్టెపాడు శాసనం దామోదరవర్మను హిరణ్యగర్భోద్భవుడనే వర్ణించింది. క్రీ.శ. నాలుగో శతాబ్దికి ముందు, శాసనాలు కేవలం ప్రదాతలనే పేర్కొంటాయి; వారి పూర్వులను ప్రస్తావించవు. రాజులను సూటిగా పేర్లతోనే పేర్కొంటాయి. కాని, అలంకారికమైన సూచనలు చేయవు. అలాగే, మట్టెపాడు శాసనం ప్రాకృత శాసనం కాదని, పైన స్పష్టంగా నిర్ణయించడం జరిగింది. కనుక, ఈ వాదాలేవీ ఈ రాజుల పూర్వాపరాలను నిర్ణయించవు.

అయితే, సమకాలీన రాజకీయ స్థితిగతులను పరిశీలించినప్పుడు, అత్తివర్మ పూర్వుడని, దామోదరవర్మ అతని తర్వాతి వాడని స్పష్టపడుతుంది.

క్రీ.శ. నాలుగో శతాబ్ది నడిమి భాగంలో కృష్ణా నదికి దక్షిణంగా తీరాంధ్ర దేశంపై పల్లవుల ఆధిపత్యం సంక్షోభానికి గురైంది. క్రీ.శ. 350 నుండి 436 వరకు దక్షిణాంధ్ర దేశంపై వారి ప్రాబల్యాన్ని సూచించే సాక్ష్యాధారాలేవీ లేవు.

తీరాంధ్ర దేశంపై విస్తరణను ప్రారంభించినవాడు, అత్తివర్మగా తోస్తుంది. అతని గోరంట్ల శాసనం, అతని మాతృ దేశాన్ని, కుల దైవమైన వంకేశ్వర శంభుని ప్రస్తావిస్తుంది. ఆ శాసనం, కృష్ణా తీరంలోని తాన్నికొన్నె గ్రామాన్ని దానం చేస్తూ, వేసింది. ఈ గ్రామం నేటి గుంటూర్ నగరానికి ఉత్తరంగా 12 కి.మీ. దూరంలో ఉన్న తాడికొండ. ఆ రాజు తన సేనతో దండెత్తి వచ్చి, ఈ ప్రాంతంలో విడిసి ఉన్న సమయంలో, ఈ దానాన్ని చేసినట్లు భావించొచ్చు.

అయితే, క్రీ.శ. 433 లో ప్రాచీన పల్లవ రాజైన విజయస్కందవర్మ వేసిన ఒంగోడు (మొదటి) శాసనం, తిరిగి కృష్ణా పర్యంతంగా వారి ఆధిపత్యం విస్తరించినట్లు స్పష్టపరుస్తుంది. ఈ విస్తరణ ఆనందగోత్రుల స్వాతంత్ర్యాన్ని నిర్మూలించింది.

క్రీ.శ. 433 నుండి 570 వరకు దక్షిణాంధ్ర దేశంపై ఆధిపత్యం కొరకు ప్రాచీన పల్లవ, విష్ణుకుండిన వంశీయుల నడుమ తీవ్ర పోరాటాలు జరిగినాయి. ఆ సమయంలో ఆనందగోత్రులు వారి నడుమ నలిగి, ప్రాధాన్యతను కోల్పోయారు. బహుశా ఒక స్థానిక రాజ వంశంగా, వారు మొదట విష్ణుకుండినులకు, తర్వాత పల్లవులకు, సామంతులైనట్లు గ్రహించొచ్చు.

BRAOU

ఆనందగోత్రులు : చేజెర్ల

క్రీ.శ. ఆరో శతాబ్ది ద్వితీయార్ధంలో విష్ణుకుండిన రాజ్యం అంతరించగా, కృష్ణా పర్యంతంగా దక్షిణాంధ్ర దేశంపై పల్లవుల ఆధిపత్యం విస్తరించింది. పల్లవ రాజైన మొదటి మహేంద్రవర్మ (క్రీ. శ. 610-640) ఆధిపత్యాన్ని అంగీకరించిన ఒక స్థానిక పరిపాలకుని చేజెర్ల శాసనం, ఆనందగోత్రులను గూర్చి ప్రస్తావిస్తున్నది.

ఆ శాసనం చాలా వరకు శిధిలమైంది. ప్రస్తుత స్థితిలో ఆ శాసన ప్రదాత పేరును కూడ దాని నుండి గ్రహించడం కష్టం. అయితే, అతనికి "సత్యభామల్ల" అని బిరుదముంది. ఇటువంటి బిరుదాలు (ఉదా. మొదటి నరసింహవర్మకు మహామల్ల అనే బిరుదముంది) సమకాలీనులైన పల్లవ రాజులు ధరించినవి కనుక, ఇతనిపై పల్లవుల ప్రభావముంది. అంతేకాక, ఈ శాసనం మహేంద్ర విక్రమ మహా రాజును, అతని అవనిభాజన, వేగవతీసనాధ అనే బిరుదాలను ప్రస్తావిస్తుంది. ఈతడు నిస్సంశయంగా మొదటి మహేంద్రవర్మ సత్యభామల్ల బిరుదాంకితుడై పల్లవుల సామంతుడని నిశ్చయించొచ్చు.

చేజెర్ల శాసనం, ఆ శాసన ప్రదాత ఒక ఆనందగోత్రీయుడైన కందరరాజు దౌహిత్రుడని పేర్కొంటుంది. ఈ కందరరాజు అత్తివర్మ కంటె పూర్వుడైన మొదటి కందరరాజు కాడని, క్రీ.శ. 600-625 సంవత్సరాల నడిమి కాలానికి చెందిన మరొకడని, అతడు రెండవ కందరరాజని నిర్ణయించొచ్చు. ఈతడు త్రికూట పర్వతపతి, రెండు జనపదాలకు రాజని, ధాన్యకటక వద్ద, కోలేరు సరసు (కొల్లేరు) వద్ద జరిగిన యుద్ధాల్లో అసాధారణమైన పరాక్రమాన్ని ప్రదర్శించినవాడని, ఈ శాసనం వర్ణిస్తూంది. ఈ పోరాటాలు బహుశః పృథ్వీమూలునికి, చాళుక్య మంగళేశునికి జరిగినవిగా తోస్తుంది. అతడు ఆ సమయంలో పృథ్వీమూలుని సామంతుడని, ఆ తర్వాత అతడు బలహీనుడు కావడంతో, పల్లవులు కృష్ణా పర్యంతంగా తమ రాజ్యాన్ని విస్తరించడంతో, వారికి సామంతుడైనాడని తోస్తుంది. అతడు పరిపాలించిన రెండు జనపదాలేవో తెలియరావు. కాని, అవి నేటి గుంటూర్ జిల్లాలో కృష్ణా నది వెంట విస్తరించిన భూభాగంలోనివిగా, నిర్ణయించొచ్చు.

పైన వివరించిన చారిత్రకాంశాల ననుసరించి, ఆనందగోత్ర రాజుల కాలానుక్రమాన్ని ఈ క్రింది విధంగా నిర్మించొచ్చు:

మొదటి కందరరాజు	:	క్రీ.శ. 300 - 325
అత్తివర్మ	:	క్రీ.శ. 400 - 425
దామోదర వర్మ	:	క్రీ.శ. 425 - 436
రెండవ కందరరాజు	:	క్రీ.శ. 600 - 625

6.6 : ప్రాచీన పల్లవులు

శాతవాహన యుగానంతరం ఆంధ్రదేశ చరిత్ర లోనే కాక, దక్షిణ భారతదేశ చరిత్ర లోనే పల్లవులు అత్యంత ప్రఖ్యాత రాజ వంశాల్లో ఒకటి. ఆంధ్ర దేశ చరిత్రలో శాలంకాయన, విష్ణుకుండిన రాజ వంశాలకు సమకాలీనంగా పరిపాలిస్తూ, కృష్ణా నదికి దక్షిణంగా ఉన్న ఆంధ్ర దేశాన్ని (దక్షిణాంధ్ర దేశాన్ని) సమీప తమిళ దేశ భూభాగాలతో కలిపి, వీరు విశాలమైన సామ్రాజ్యాన్ని నిర్మించారు. దక్షిణ భారతదేశ చరిత్రలో శాతవాహన సామ్రాజ్యం తర్వాత అత్యంత విస్తీర్ణం కలిగిన ప్రథమ సామ్రాజ్యం పల్లవులదే. క్రీ.శ. 5, 6 శతాబ్దాల్లోని ఆంధ్ర దేశ రాజకీయ చరిత్ర, పల్లవులు కృష్ణా

BRAOU

పర్యంతంగా సామ్రాజ్య విస్తరణకై శాలంకాయనుల తోను, తర్వాత విష్ణుకుండినుల తోను చేసిన తీవ్ర పోరాటాలనే ప్రధానాంశంగా కలిగి ఉందని చెప్పడం, అతిశయోక్తి కాదు.

6.6.1 : ప్రాచీన పల్లవుల పుట్టుపూర్వోత్తరాలు

పల్లవుల చరిత్ర అనేక వివాదాంశాలతో కూడి, చరిత్రకారుల నడుమ చర్చనీయాంశంగా ఉంది. వారి వంశోత్పత్తి (origin), వంశ, కాలానుక్రమణికలు అపరిష్కృత సమస్యలుగానే మిగిలి ఉన్నాయి. ఇటీవల పల్లవుల చరిత్రపై సమగ్ర పరిశోధన చేసిన ఆచార్య టి.వి.మహాలింగం కూడ, వారి వంశోత్పత్తిని గూర్చి ఖచ్చితమైన వివరణ ఇయ్యలేకపోయాడు. లోగడ కొందరు చరిత్రకారుల వలెనే, ఆయన సమకాలీనంగా వేంగి మండలాన్ని పరిపాలించిన శాలంకాయనులు, తొండైమండలాన్ని పరిపాలించిన ప్రాచీన పల్లవులు, అనేక సారూప్యతలు కలిగి, ఒకే సాంస్కృతిక వారసత్వాన్ని కలిగినవారని, బహుశః ఒకే జాతికి చెందినవారు కావచ్చునని అభిప్రాయపడ్డారు. ఈ అంశం పైన చర్చించి, యుక్తాయుక్తాలను నిర్ణయించడం జరిగింది. ప్రాచీన పల్లవుల పుట్టుపూర్వోత్తరాలు, వారి స్వదేశాన్ని నిర్ణయించడంతో ముడిపడి ఉన్నాయి. కనుక, ముందుగా వారి జన్మభూమిని గూర్చి విచారించడ మవసరం.

6.6.2 : ప్రాచీన పల్లవులు : జన్మభూమి

ప్రాచీన పల్లవులు కాంచీపురం రాజధానిగా పరిపాలించారు. ఇది నేటి మద్రాస్ నగరానికి 70 కి.మీ. నైఋతి దిశగా, తమిళనాడు రాష్ట్రంలో ఉంది.

అయితే, ఇటీవల శ్రీ.టి. అరవముదన్ పండితుడు, పల్లవులు వాస్తవంగా తొండైమండల (నేటి తమిళనాడు ఉత్తర భాగం) నివాసులు కారని, వారి రాజధానైన కాంచీపురం నేటి తమిళనాడు లోని కాంచీపురం కాకపోవచ్చునని వాదిస్తారు. అందుకు ఆయన చూపిన ఉపపత్తులు ఇవి;

1. ప్రాచీన పల్లవులు కాంచీపురం నుండి వేసిన మైదవోలు, హీరహడగళ్ళి, వేసంత, తామ్ర శాసనాలు, తొండైమండలానికి సుదూర ప్రాంతాల్లో దానాలను పేర్కొంటాయి. క్రీ.శ. 5వ శతాబ్ది నాటి ఉదయేందిరం శాసనం, మొట్టమొదటిగా పల్లవ రాజులు తమిళ దేశంలో చేసిన భూదానాన్ని ప్రస్తావిస్తుంది.

2. ప్రాచీన సంగం కాలం నాటి తమిళ వాఙ్మయం (క్రీ.పూ. 150 - క్రీ.శ. 150) కాంచి నగరాన్ని, అక్కడి పల్లవ రాజ వంశాన్ని గూర్చి ప్రస్తావించదు. ఆనాటి పాండ్య, చోళ, చేర రాజులు తమిళ వాఙ్మయాన్ని పోషించి, ప్రోత్సహించారు. కాని, ప్రాచీన పల్లవులు ప్రాకృత, సంస్కృత భాషల్లో తమ శాసనాలను వేశారు. కనుక, వారికి తమిళ దేశం తోను, సంస్కృతి తోను, ఏ విధమైన సంబంధమున్నట్లు భావించడం కష్టం.

పై కారణాల చేత, ప్రాచీన పల్లవ రాజులు దక్షిణాంధ్ర దేశంలో పరిపాలించే వారని, వారి రాజధానైన కాంచీ నగరం నేటి ప్రకాశం జిల్లా లోని పెద గంజాం, చిన గంజాం ప్రాంతాల్లో ఉండేదని, ఆయన ప్రతిపాదించారు. క్రీ.శ. 5, 6 శతాబ్దాల్లో ఆంధ్ర, కర్ణాటక దేశాల్లో చాళుక్యుల విజృంభణ పల్లవులను తమిళ దేశంలోనికి నెట్టివేసి ఉండొచ్చునని, ఆయన వివరించాడు.

BRAOU

ఆచార్య టి.వి.మహాలింగం ఈ సిద్ధాంతం, కేవలం సంగం వాఙ్మయం పల్లవులను, వారి రాజధానైన కాంచి నగరాన్ని పేర్కొనని కారణాన అల్లిన ఊహా వాదంగా, తిరస్కరించారు.

సంగం వాఙ్మయం స్వచ్ఛమైన తమిళ భాషా సంస్కృతులు వెలసిన "తమిళగం"లో అక్కడి పాండ్య, చోళ, చేర రాజ్యాల వైభవాన్ని ప్రశంసించింది. ఆ దేశానికి ఆవల ఉన్న తొండైమండలాన్ని, అక్కడి జనులు సంస్కృతుల పట్ల చెప్పకోదగిన ఆసక్తిని ప్రదర్శించ లేదు. అందుచేత, ఆ అంశాలను గూర్చి ఆ వాఙ్మయం నుండి వివరాలు లభించవు. క్రీ.శ.5వ శతాబ్దిలో పల్లవులను తొండైమండలం లోనికి, లేదా, నేటి తమిళనాడు ఉత్తర ప్రాంతాలకు నెట్టివేయదగినంత ప్రబలంగా చాళుక్యులు అభివృద్ధి చెందలేదు. వారు నూతనంగా జయించిన సుదూర ప్రాంతాలను తమ అధీనంలో నిలుపు కొనే ప్రయత్నం లోనే, వారు మైదవోలు, హీరహడగల్లి, వేసంత తామ్ర శాసనాలను వేసి, గ్రామ, భూదానాలను చేశారు. కనుక, అరవముదన్ పండితుని వాదాన్ని అంగీకరించడం కష్టం. అయితే, అందులోని కొన్ని వాస్తవాంశాలను గురించి సమన్వయం చేయడం ద్వారా, పల్లవుల జన్మభూమిని నిర్ణయించొచ్చు. అందుకు ప్రథమంగా, పల్లవులెవరో నిర్ణయించడ మవసరం.

6.6.3 : ప్రాచీన పల్లవులు - వంశోత్పత్తి

పల్లవుల వంశోత్పత్తిని గూర్చి బహుకాలంగా చరిత్రకారుల నడుమ వాదోపవాదాలున్నాయి. వారు విదేశీయులై, భారతదేశంలో స్థిరపడి, భారతీయ సంస్కృతిని అవలంబించిన పహ్లవులని, కొందరు వాస్తవంగా భారతీయులేనని, విదేశీయ సంతతి కాదని, మరి కొందరు వాదిస్తారు.

6.6.3.1 : పహ్లవులు - పల్లవులు

పల్లవుల వంశోత్పత్తిని గూర్చి చాలా కాలం క్రితం లూయీ రైస్, వారు విదేశీయులైన పహ్లవుల సంతతి (descendants) కావచ్చునని అభిప్రాయపడ్డాడు. ఆయన వాదం లోని కొన్ని అంశాలు సహేతుకంగా కన్పించవు. అయినా, ఆయన నిర్ణయాన్ని జి. జి. దూబ్రే, చిలుకూరి వీరభద్రరావ్ వంటి చరిత్రకారులు, రావ్ బహదూర్ వెంకయ్య వంటి శాసన పరిశోధకులు సమర్థించారు. కాని, ఎన్. కృష్ణస్వామి అయ్యంగార్, ఆయన శిష్యప్రశిష్యులు, ఈ వాదాన్ని నిరాకరించారు. పల్లవులు భారద్వాజ గోత్రులుగా తమ శాసనాల్లో వర్ణించుకొనడం, వైదిక క్రతువులను నిర్వహించడం, వారు భారతీయులని, బ్రాహ్మణ కులానికి చెందిన వారని సూచిస్తున్నట్లు, విదేశీయులైన పహ్లవులకు ఇటువంటి లక్షణాలు ఉండే అవకాశం లేదని, వీరి వాదం. ఆచార్య టి.వి. మహాలింగం వీరితో ఏకీభవించి, పల్లవులు విదేశీయులైన పహ్లవులు కాబోలరని భావించారు.

కాని, భారద్వాజ గోత్రాన్ని ధరించడం, వైదిక క్రతువులను నిర్వహించడం, పల్లవులు పహ్లవులు కారని నిరూపించ లేవు. ఇవి, ఏ రాజ కుటుంబాన్ని పూర్తిగా భారతీయ సంతతిగా, బ్రాహ్మణ కులానికి చెందినట్లుగా నిర్ణయించ లేవు. మహాభారతం, ఆత్రేయ, హారీత, భారద్వాజ మొదలైనవి సింధూ నది మైదానంపై నివసిస్తున్న అనాగరిక తెగలని పేర్కొన్నది. రామాయణ, మహాభారత ఇతిహాసాలు రెండూ, విశ్వామిత్రుడు బలాత్కారంగా వశిష్ఠుని కామధేనువును స్వాధీనపర్చుకునే ప్రయత్నం చేసినప్పుడు, ఆ ధేనువు తన ఆత్మ సంరక్షణకై శక, యవన, పహ్లవ సేనలను సృష్టించినట్లు, వివరించాయి. ఆనాటి సామాజిక వ్యవస్థలో ప్రాక్తన జాతులు, విదేశీయులు ప్రవేశించి, సాంస్కృతిక సమ్మేళన చెందడాన్ని ఈ గాథలు సూచిస్తాయి. కనుక, పహ్లవులు భారతీయ సంస్కృతిని అవలంబిస్తూ, పల్లవులు కావడంలో విపరీతం ఏమీ లేదు.

BRAOU

క్రీ.శ. మొదటి శతాబ్దంలో పహ్లవులు శక, ఆభీర జాతులతో కలిసి, అపరాంత దేశంలో రాజకీయ ప్రాబల్యాన్ని పొందారు. గౌతమీపుత్ర శాతకర్ణి శక, యవన, పహ్లవులను నిర్మూలించినట్లు నాసిక్ ప్రశస్తి వర్ణించినంత మాత్రాన, వారు పూర్తిగా నిర్మూలనం కాలేదు. శక, ఆభీర జాతులు ఇక్ష్వాకుల పరిపాలనా కాలంలో కృష్ణా నదికి దక్షిణంగా విస్తరించినట్లు స్పష్టంగా తెలియచస్తూ ఉండగా, పహ్లవులు రాలేదనుకోవడం సహేతుకం కాదు. వారు దక్షిణాంధ్ర దేశం చేరి, స్థానిక ప్రజా జీవనం, సంస్కృతులతో ప్రభావితులై, పల్లవులుగా పరిణమించినట్లు భావించడం యుక్తం.

6.6.3.2 : పల్లవులు - తొండైయూర్ జాతి

సంగం కాలం నాటి ప్రాచీన తమిళ వాఙ్మయం 'కచ్చి' అనే నగరాన్ని, అక్కడి నుండి పరిపాలిస్తున్న తొండైమాన్ ఇళందిరైయన్ అనే రాజును ప్రస్తావిస్తుంది. అతడు కరికాల చోళుని మనుమడు, కాంచి నగరంలో చోళ చక్రవర్తి ప్రతినిధిగా పరిపాలించిన వాడని, పి.టి. శ్రీనివాస అయ్యంగార్ వివరించాడు. అతడు "తొండైయూర్" తెగకు చెందిన వాడని, "తిరైయన్" తెగకు చెందినవాడని, వివిధంగా వివరణలు కానవస్తున్నాయి; కాగా, అతడు ఈ రెండింటి తోను సంబంధాన్ని కలిగినట్లు, అతని పేరు సూచిస్తుంది. **"మణిమేకలై"** కావ్యం లోని ఒక గాథ, పల్లవులు చోళ-నాగ సంబంధం వలన ఉత్పన్నమైనట్లు వివరిస్తుంది. రసనాయగం పిళ్ళై ఈ గాథ ఆధారంగా, జాఫ్నా ద్వీపకల్పంలో మణిపల్లవం అనే పట్టణాన్ని పరిపాలిస్తున్న ఒక నాగరాజు కుమార్తె ఒక చోళ రాజును ప్రేమించి, గాంధర్వ వివాహం చేసుకొంది; వారికి కలిగిన కుమారుడు గుర్తుగా, ఒక తొండై తీగను చేతికి కట్టుకొని, తండ్రి వద్దకు వచ్చాడు; ఆ తీగను బట్టి గుర్తించి, చోళ రాజు తన కుమారునికి రాజ్యాభిషేకం చేశాడు; అతడు తన తల్లి జన్మస్థలమైన మణిపల్లవం లోని "పల్లవ"ను వంశ నామంగా గ్రహించాడు; అతడే తొండైమాన్ ఇళందిరైయన్.

పైన పేర్కొన్న కావ్యాల లోని ప్రస్తావనలు, గాథల లోని అవాస్తవిక వివరణలను, అతిశయోక్తులతో కూడిన వర్ణనలను పరిశీలిస్తే, తొండై తీగకు కొంత పవిత్రతను ఆపాదించే తొండైయూర్ తెగ నుండి పల్లవులు ఉత్పన్నమైనట్లు, తమిళ దేశంలో సాంప్రదాయకమైన అభిప్రాయం ఏర్పడి ఉన్నట్లు, గ్రహించొచ్చు. తొండైయూర్ అనగా "తొండై" తీగకు సంబంధించిన జాతి; "తిరైయన్" అనగా తీర ప్రాంతీయులని అర్థం. అయితే, తొండైయూర్ అనే పదాన్ని తొండైమండల నివాసులనే సామాన్యార్థకంగా కూడ గ్రహించొచ్చు. ఈ సందర్భంలో అసలు తొండైమండలం ఏది? తొండైయూర్ ఎవరు? అనే ప్రశ్నలు ఉత్పన్నమౌతాయి.

తొండైమండలం, లేదా తొండైనాడు, మొదలైన పదాలు "చండక" అనే సంస్కృత నామవాచకం నుండి ఉద్భవించినవని, ఆ అరణ్యం లోని దక్షిణ భాగాన్ని, అక్కడి భాషల్లో (అనగా దాక్షిణాత్య, లేక (ద్రావిడ) తొండైమండలం మొదలైన పేర్లతో వ్యవహరించడం జరగిందని, శ్రీ చిలుకూరి వీరభద్రరావ్‌గారు చాలా కాలం క్రిందట, తమ ఆంధ్రుల చరిత్రలో వివరించారు. కాగా, తొండైయూర్ అనే పదానికి "దండకారణ్యవాసు" అని అర్థం. తొండైమండలం లోని ఎయినర్, బలియర్, అరువాళర్ మొదలైన జాతులను కరికాల చోళుడు జయించి లోబర్చుకొన్నట్లు, సంగం వాఙ్మయం వివరిస్తుంది. తొండైమండలం సంగం వాఙ్మయం లోని వివరణలను అనుసరించి, దక్షిణాన పాలార్, ఉత్తరాన పెన్నార్ నదుల నడిమి భాగంగా (నేటి తమిళనాడు లోని చెంగల్పట్టు జిల్లా, ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు జిల్లా), లోగడ భావించడం జరిగింది. కాని, అది సరికాదు. నేటి గుంటూర్ జిల్లా లోని ఓలేరు, అరవపల్లి మొదలైన గ్రామ నామాలు, ఒలియర్, అరువాళర్ తెగల

BRAOU

అవశేషాలని, వారందరు తొండైయార్ అనే సామాన్యార్థక జాతి వాచకంలో చేరినవారని, సహేతుకంగా భావించొచ్చు. "తొండై" అనేది తినడానికి పనికి వచ్చే కాయలను ఇచ్చే తీగ. అందుచేతనే, అది కొంత ప్రత్యేకతను కలిగి, పవిత్రతను పొందింది. ఆ తీగ నేటికి తెలుగు భాషలో "దొండ" అనే పేర ప్రసిద్ధమై ఉంది. దొండపాడు, దొండపర్తి వంటి గ్రామ నామాలు; అలాగే పల్లవుల ముఖ్య పట్టణమైన కాంచిపురం మాత్రమే కాక, తెలుగు దేశంలో కంచెర్ల (కంచి+ చర్ల), కంచికచర్ల వంటి గ్రామ నామాలు, తొండైయార్ ప్రజల సాంస్కృతిక అవశేషాలుగా, కృష్ణా మైదానంలో సాధారణంగా కానవస్తున్నాయి.

వాఙ్మయాధారాల నుండి తెలియవస్తున్న గాథల్లోను, వేలూర్పాళెయం తామ్ర శాసనం వంటి పల్లవ రాజుల శాసనాల లోను ప్రస్తావించిన "నాగ" సంబంధాల కొరకు, పూర్వపు చరిత్రకారులు మటు నాగులను బనవాస నుండి ఆంధ్ర దేశం వరకు రప్పించారు. కాని, తొండైయార్ జాతుల లోని అరువాళర్, అనగా మెరిసే శరీరాలు కలవారని, వీరు కూడ నాగజాతివారే కావచ్చునని, కొందరు తమిళ విద్వాంసుల అభిప్రాయం. అయితే, వీరు పచ్చని శరీర కాంతి కలిగిన మంగోలాయిడ్ (ప్రజలు కావచ్చు; నాగులు, లేదా యక్ష (యూ-చీ) జాతికి చెందినవారు కావచ్చు.

నేటి ప్రకాశం జిల్లా లోని మాలెకొండ వద్ద క్రీ.పూ. 3వ శతాబ్దికి చెందిన బ్రాహ్మీ లిపిలో, "అళువాళ" కులానికి చెందిన నందాసెట్టి అనే వ్యక్తి వేసిన దాన శాసనం కానస్తుంది. నందాసెట్టి ఒక వర్తక సంఘానికి శ్రేష్ఠి (నాయకుడు) అని గ్రహించొచ్చు. కృష్ణా తీర పర్యంతంగా అరువా (నాగ), బళియార్ (యక్ష) జాతులు సాంస్కృతికంగా అభివృద్ధి చెంది, వ్యవసాయ జీవనంతో కూడిన గ్రామాలు, పారిశ్రామిక, వర్తక వాణిజ్యంతో కూడిన నగర రాజ్యాలను నిర్మించినట్లు, ఈ ఆధారాల ననుసరించి అర్థం చేసుకోవచ్చు. ఈ జాతులు కొడుందమిళ్, అనే విరూపమైన తమిళ భాషను మాట్లాడేవారని, సంగం వాఙ్మయం తెల్పుతుంది. ఖారవేలుని హథిగుంఫ శాసనం లోని, త్రమిర, (ద్రవిడ, లేక తమిళ) దేశ సంఘటన, ఈ జాతులకు చెందిన ప్రభువులతో ఏర్పడిందే.

పై పరిశీలన వలన, దక్షిణాంధ్ర దేశం తొండైమండలం లోని ఒక భాగమని, అక్కడి తొండైయార్ ప్రజానీకంలో నాగ, యక్ష జాతులు చేరి ఉన్నారని, స్పష్టమౌతుంది. శాతవాహన రాజ్య విస్తరణతో, శక, ఆభీర, పహ్లవ మొదలైన జాతులు కూడ, ఈ ప్రాంతంలో ప్రవేశించారు. ఈ ప్రాంతంలో, ఈ జాతులు సహజీవనాన్ని సాగిస్తూ, ప్రజానీకాల, సంస్కృతుల పరస్పర ప్రభావంతో జరిగిన సమ్మేళన వలన, పహ్లవులు పల్లవులైనారు; స్థానిక తెగలతో కలిసిపోయారు.

6.6.4 : ప్రాచీన పల్లవులు : వంశానుక్రమణిక

ప్రాచీన పల్లవుల వంశ, కాలానుక్రమణికలను నిర్మించడానికి, వారి శాసనాలే ప్రధానాధారం. అవి నాలుగు ప్రాకృత శాసనాలు, సుమారు 20కి పైగా సంస్కృత శాసనాలు. ప్రాకృత శాసనాలు: సీహ (సింహ) వర్మ వేసిన మంచికల్లు శిలా శాసనం, శివస్కంద వర్మ యువ మహారాజుగా వేసిన మైదవోలు, మహారాజుగా వేసిన హీరహడగళ్ళి తామ్ర శాసనాలు, బ్రిటిష్ మ్యూజియం తామ్ర శాసనం.

లిపి లక్షణాలు, భాష ననుసరించి, ప్రాకృత శాసనాలు క్రీ.శ. నాలుగో శతాబ్దికి, సంస్కృత శాసనాలు అయిదో శతాబ్దారంభం నుండి తర్వాతి కాలానికి చెందినట్లు, డి.సి. సర్కార్ సహేతుకంగా నిర్ణయించాడు. పల్లవుల ప్రాకృత శాసనాల లిపి, ఇక్ష్వాకుల శాసనాలతో పోల్చదగింది.

BRAOU

క్రీ.శ. 8, 9 శతాబ్దాలకు చెందిన వాయలూర్ స్తంభ శాసనం, వేలూర్పాళెయం తామ్ర శాసనం మొదలైనవి, సమగ్రంగా పల్లవ రాజుల వంశ క్రమాన్ని వివరిస్తాయి. కాని, అవి తొలి తరాలకు చెందినట్లు పేర్కొన్న రాజులు, చారిత్రక వ్యక్తులని విశ్వసించటం అసాధ్యం. పల్లవులు తమను భారద్వాజ గోత్రులుగా వర్ణించుకొన్నారు. కనుక, ఈ కడపటి యుగాలకు చెందిన శాసనాలు, భరద్వాజ మహర్షి జననం, ఆ వంశంలో, లేదా గోత్రంలో ప్రసిద్ధులైన ద్రోణాచార్య, అశ్వత్థామ వంటి ఐతిహాసిక వ్యక్తులు; అశోక పల్లవ, చూత పల్లవ, వంటి విచిత్ర నామధేయాలు కల కల్పిత వ్యక్తులు, ఆ వంశ క్రమాల్లో కానవస్తారు. మధ్య యుగం లోని రాజ వంశాలు అటువంటి ఐతిహాసిక, పౌరాణిక వ్యక్తుల నుండి వంశానుక్రమాన్ని పేర్కొనడం, సర్వ సాధారణం. వీటిని చరిత్ర పరిశోధనకు సాక్ష్యాధారాలుగా, చరిత్రకారులు అంగీకరించారు.

6.6.4.1 : ప్రాచీన పల్లవులు : ప్రాకృత శాసనాలు

స్పష్టంగా చారిత్రక వ్యక్తిగా గుర్తించదగిన మొట్టమొదటి పల్లవ రాజు, మంచికల్లు ప్రాకృత శిలా శాసనాన్ని వేసిన సీహ (సింహ) వర్మ. ఈ శాసనం, లిపి స్వరూప స్వభావాలను బట్టి, ఇక్ష్వాకు శాసనాలను పోలినది. అందుచేత, ఇక్ష్వాకు రాజ్య చరమ కాలానికి, సుమారు క్రీ.శ. 4 వ శతాబ్దారంభానికి చెందినట్లు, శాసన పరిశోధకుల నిర్ణయం. ఈ సింహవర్మ క్రీ.శ. 305 -330 మధ్య కాలం నాటి వాడని, ఇక్ష్వాకు రాజ్యాన్ని, వారి రాజధానిని ధ్వంసం చేసి, స్వతంత్ర పల్లవ రాజ్యాన్ని స్థాపించినవాడని నిర్ణయించొచ్చు.

పల్లవుల ప్రాకృత శాసనాలు ఆ రాజుల పూర్వులను, అనగా శాసన ప్రదాతల తాత, తండ్రులను గూర్చి ప్రస్తావించవు. అందుచేత, వాటి నుండి తెలియవస్తున్న రాజుల పరస్పర సంబంధాలను గుర్తించి, వంశ క్రమాన్ని ఏర్పర్చడం కష్టసాధ్యం. అయితే, ఒక పల్లవ రాణిని చాందేవి వేసిన బ్రిటిష్ మ్యూజియం తామ్ర శాసనం మహారాజ విజయస్కందవర్మ పరిపాలనా కాలాన్ని పేర్కొంటూ, తన భర్త యువ మహారాజు బుద్ధవర్మ, కుమారుడు బుద్ధియంకురని పేర్కొంటుంది. ఈ విజయస్కందవర్మ, హీరహడగల్లి శాసనాన్ని వేసిన మహారాజ శివస్కందవర్మ ఒకరేనని, ఈ రెండు పేర్ల లోని "శివ", "విజయ" అనేవి కేవలం గౌరవ వాచకాలని, చరిత్రకారులు భావిస్తారు. ఈ మహారాజ స్కందవర్మ, మంచికల్లు శాసనం ప్రస్తావించే మహారాజు సింహవర్మ కుమారుడేనని, భావించొచ్చు. కాగా, ఈ శాసనాల వలన తెలియవస్తున్న రాజులను, ఈ క్రింది చూపిన విధంగా వంశానుక్రమంలో ఏర్పర్చొచ్చు.

సింహవర్మ
(మంచికల్లు శాసనం)
శివ (లేక విజయ) స్కందవర్మ
(మైదవోలు, హీరహడగల్లి శాసన ప్రదాన)
యువ మహారాజ బుద్ధివర్మ
బుధ్యంకుర

6.6.4.2 : ప్రాచీన పల్లవులు : సంస్కృత శాసనాలు

ప్రాచీన పల్లవుల సంస్కృత శాసనాలు కొన్ని కాంచిపురం నుండి వేసినవి కాగా, కొన్ని దశపుర, పలక్కడ మొదలైన ప్రదేశాల నుండి వేసినవి. దశపుర నేటి ప్రకాశం జిల్లా లోని దర్శిగా

BRAOU

గుర్తించబడింది. కాని, పలక్కడను గుర్తించటం సాధ్యం కాలేదు. సముద్రగుప్తుని అలహాబాద్ శాసనం "పాలక్కకోగ్రసేన" అని, ఉగ్రసేనుడనే రాజు "పలక్క" నుండి పరిపాలిస్తున్నట్లు, "కాంచేయక విష్ణుగోప" అని, కాంచిపురంలో విష్ణుగోపుడనే రాజు పరిపాలిస్తున్నట్లు పేర్కొంటూంది.

ప్రాచీన పల్లవుల సంస్కృత శాసనాలు శాసన ప్రదాతనే కాక, అతని వంశ పూర్వులను మూడు తరాల నుండి పేర్కొంటాయి. అందుచేత, పల్లవ వంశ క్రమాన్ని నిర్మించడానికి చాలా సహాయ కరమైనవి. అయితే, సంస్కృత శాసనాల నుండి తెలియవస్తున్న రాజు లందరు కాంచీనగరం నుండి పరిపాలించిన వారేననే వాదం; వారిలో కొందరే అక్కడి నుండి పరిపాలించిన మూల వంశానికి చెందినవారు కాగా, మిగిలినవారు దక్షిణాంధ్ర దేశం (అనగా నేటి గుంటూర్, ప్రకాశం, నెల్లూర్ జిల్లాలు) లో పరిపాలించిన వారనే మరొక వాదం, చరిత్రకారులను రెండు వర్గాలుగా చేశాయి.

పల్లవుల శాసనాలు సమకాలీనమైన ఇతర రాజ వంశాల వలెనే, ఏ స్పష్టమైన కాలగణనను (శకాన్ని) అనుసరించక, కేవలం రాజుల రాజ్య సంవత్సరాలనే పేర్కొంటాయి. వారి శాసనాల లిపి స్వరూపం ఆధారంగా, స్థూలంగా వాటి కాలాన్ని నిర్ణయించి, సమకాలీన వంశాలతో వారికి గల సంబంధాల ననుసరించి, కాలానుక్రమాన్ని ఏర్పర్చొచ్చు.

ప్రాచీన పల్లవుల సంస్కృత శాసనాల్లోని లిపి స్వరూప, స్వభావాల చేత, ఒంగోడు (మొదటి) తామ్ర శాసనం అన్నింటికంటే పూర్వకాలానికి చెందినట్లు గోచరిస్తుంది. అందులో పేర్కొనబడిన రాజులు, వరుసగా తర్వాత శాసనాల్లో వంశ పూర్వులుగా పేర్కొనబడ్డారు. ఆ శాసనం విజయ తాంబ్రప స్థానం నుండి వేసినది. "విజయ" అనే గొరవ వాచకాన్ని బట్టి, శాసన ప్రదాతైన విజయ స్కంద వర్మ, యుద్ధ విజయాన్ని కాంక్షించి, సేనతో తాంబ్రప వద్ద విడిసి ఉన్నట్లు, గ్రహించొచ్చు. ఆ శాసనం నుండి తెలియవస్తున్న రాజుల క్రమం ఇది:

మహారాజ కుమార విష్ణు

మహారాజ స్కందవర్మ

మహారాజ వీరవర్మ

మహారాజ విజయస్కందవర్మ

యువ మహారాజు విష్ణుగోపుని ఉరువపల్లి నెడుంగరాయ తామ్ర శాసనాలు, అతని వంశ క్రమాన్ని ఈ విధంగా తెలియచేస్తున్నాయి.

మహారాజ స్కందవర్మ

మహారాజ వీరవర్మ

మహారాజ స్కందవర్మ

(వర్మ) యువ మహారాజ విష్ణుగోప

ఈ రెండు శాసనాలు శాసన ప్రదాతైన విష్ణుగోపుని తండ్రిగా పేర్కొనే స్కందవర్మ, ఒంగోడు (మొదటి) శాసన ప్రదాతైన విజయస్కందవర్మే. ఆ శాసనంలో అతని తండ్రి, తాతగా పేర్కొనబడిన వీరవర్మ, స్కందవర్మ, విష్ణుగోపుని తాత, ముత్తాతలుగా అతని శాసనాలు పేర్కొనడాన్ని గుర్తించొచ్చు.

BRAOU

యువ మహారాజు విష్ణుగోపుని శాసనాలు, మహారాజ సింహవర్మ రాజ్య సంవత్సరాలను పేర్కొంటాయి. అతడు యువ మహారాజు మాత్రమే కనుక, స్వతంత్రంగా తన రాజ్య సంవత్సరాలను పేర్కొనలేదు. అయితే, ఈ మహారాజు సింహవర్మ ఎవరనేది, ఇటీవల కాలం వరకు చరిత్రకారుల్లో వివాదాంశంగా ఉంది. యువ మహారాజు విష్ణుగోపుని కుమారుడైన మహారాజ సింహవర్మ, తన మాంగడూరు, వేకిరా, ఒంగోడ (రెండు), విళవెట్టి తామ్ర శాసనాల్లో, తన రాజ్య సంవత్సరాలనే పేర్కొన్నాడు. అయితే, అవి కాంచీ నగరం నుండి వేసినవి కావు. ఆ శాసనాలు మహారాజు సింహవర్మ వంశ క్రమాన్ని ఈ విధంగా తెలియజేస్తాయి:

మహారాజ వీరవర్మ

మహారాజ స్కందవర్మ

యువ మహారాజ విష్ణుగోపవర్మ

మహారాజ సింహవర్మ

6.6.4.3 : ఆంధ్ర దేశం లోని ఉప శాఖ

యువ మహారాజ విష్ణుగోపుని ఉరువపల్లి తామ్ర శాసనాన్ని ప్రకటిస్తూ, ఫ్లీట్ పండితుడు ఆ శాసనం పేర్కొనే మహారాజు సింహవర్మ (అప్పటి వరకు తెలియరాని), విష్ణుగోపుని అగ్రజుడు కావచ్చునని ఊహించాడు. అయితే, పలువురు చరిత్రకారులు, ఏకారణం చేతనో, విష్ణుగోపుడు మహారాజ బిరుదంతో సింహాసనాన్నధిష్ఠించక, తన కుమారునికి పట్టం కట్టాడని, అతని శాసనాలు పేర్కొనే రాజ్య సంవత్సరాలు ఆతని కుమారుడైన మహారాజ సింహవర్మవేనని అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయం హేతుబద్ధం కాదు. తండ్రి తన రాజ్యార్జితను వదులుకొంటే, అది కుమారునికి సంక్రమించడం అసాధ్యమని, విష్ణుగోపుని అగ్రజుడు మహారాజుగా పరిపాలిస్తుంటే, తాను యువ మహారాజుగా శాసనాలను వేసి ఉండొచ్చునని, వారు ఊహించ లేదు. సమకాలీన రాజకీయ స్థితిగతులను సమీక్షించినపుడు, కాంచీపురంలో మహారాజ సింహవర్మ పరిపాలిస్తూ, దక్షిణాంధ్ర దేశంపై ఆధిపత్యాన్ని సుస్థిరం చేయడానికి, విష్ణుగోపుని యువ మహారాజుగా నియమించాడని స్పష్టమౌతుంది.

ఇటీవలి కాలంలో లభించిన వేసంత, సక్రపట్న తామ్ర శాసనాలు ఈ విషయాన్ని స్పష్టపరుస్తున్నాయి. అవి మహారాజ సింహవర్మ వేసినవి. వేసంత తామ్ర శాసనాన్ని ఆ రాజు తన 19వ రాజ్య సంవత్సరంలో కాంచీపురం నుండి వేశాడు. సక్రపట్న తామ్ర శాసనాన్ని అతడు తన 41 వ రాజ్య సంవత్సరంలో కర్ణాటకం లోని సేంద్రక విషయం (నేటి షిమోగా జిల్లా) లో చేసిన ప్రదానాన్ని ప్రకటిస్తూ, వేసింది. ఈ శాసనాల వలన మహారాజ సింహవర్మ వంశ క్రమం ఇలా తెలియవస్తుంది.

మహారాజ స్కందవర్మ

మహారాజ వీరవర్మ

మహారాజ స్కందవర్మ

మహారాజ సింహవర్మ

ఈ శాసనాల్లోని వంశ క్రమం పూర్తిగా యువ మహారాజ విష్ణుగోపుని శాసనాలు పేర్కొన్నదే. కాగా, మహారాజ సింహవర్మ యువ మహారాజు విష్ణుగోపుని అగ్రజుడు; అతడు తన శాసనాల్లో

B.RAO.U

పేర్కొన్న రాజ్య సంవత్సరాలు అతని అగ్రజునివేనని స్పష్టపడుతుంది. విష్ణుగోపుని కుమారుడైన సింహవర్మ స్వతంత్రంగా పరిపాలిస్తూ, తన రాజ్య సంవత్సరాలను పేర్కొంటూ, శాసనాలను ఇచ్చినట్లు స్పష్టపడుతున్నది. ఈ విధంగా, పల్లవ రాజ్యంలో రెండు శాఖలు ఏర్పడి, కాంచినగరంలో ప్రధాన శాఖ, దక్షిణాంధ్ర దేశంలో ఒక ఉప శాఖ పరిపాలిస్తున్నట్లు నిస్సందేహంగా చెప్పొచ్చు.

ఇంతవరకు ప్రాచీన పల్లవుల సంస్కృత శాసనాల వలన తెలియవస్తున్న వంశ క్రమ పట్టికల ననుసరించి, వారి వంశానుక్రమాన్ని ఈ విధంగా నిర్మించొచ్చు.

మహారాజ కుమార విష్ణు

మహారాజ స్కందవర్మ

మహారాజ వీరవర్మ

మహారాజ (విజయ) స్కందవర్మ

(ఓంగోడ (మొదటి) శాసన ప్రదాత)

కాంచిపురంలో ప్రధాన శాఖ
(రెండవ) మహారాజ సింహవర్మ
(వేనంత, సక్రపట్ను శాసనాల ప్రదాత)

(ఆంధ్ర దేశంలో ఉప శాఖ)
యువ మహారాజ విష్ణుగోప
(ఉరువపల్లి, వెడుంగరాయ శాసనాల ప్రదాత)
మహారాజ సింహవర్మ
(మాంగడూరు, పెకేరా, ఓంగోడు, పీళవెట్టి
శాసనాల ప్రదాత)

నేటి ప్రకాశం జిల్లా లోని దర్శి వద్ద ఒక తామ్ర శాసనం లోని ఒక రేకు మాత్రమే లభించింది. దానిపై ఉన్న నాలుగు పంక్తులు, పల్లవ వంశం లోని వీరకోర్చవర్మను వర్ణించే వాక్యాలు : వీరకోర్చవర్మ ఒక నాగరాజు కుమార్తెను వివాహం చేసుకోడంతో రాజ్యాధికారాన్ని పొందినట్లు, వేలూరుపాళెయం తామ్ర శాసనం వివరిస్తుంది. లోగడ చరిత్రకారులు ఈ వీరకోర్చవర్మ పల్లవ వంశ స్థాపకుడని, నాగుల సాయంతో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడని భావించారు. ఈ అభిప్రాయం సరి కాదు. క్రీ.శ. 3వ శతాబ్దిలో జరిగిన పల్లవ రాజ్య స్థాపన గూర్చిన సమాచారం, క్రీ.శ. 9వ శతాబ్ది నాటి శాసనాల నుండి గ్రహించడం, యుక్తం కాదు. కనుక, పల్లవ వంశం లోని వీరకూర్చ (లేక కోర్చ) వర్మ, వీరవర్మ ఒకరేనని, దర్శి శాసన ప్రదాత దక్షిణాంధ్ర దేశంలో పరిపాలించిన మహారాజ సింహవర్మేనని, నిశ్చయించొచ్చు.

ఆంధ్ర దేశ ఉప శాఖలో యువ మహారాజ విష్ణుగోపుని మనుమడైన మహారాజ విజయ విష్ణు గోపవర్మ వేసిన శురా తామ్ర శాసనం వల్ల, మరొక తరం ముందుకు నడుస్తుంది. ఆ శాసనం అతని వంశ క్రమాన్ని ఈ విధంగా వివరిస్తుంది:

మహారాజ కందవర్మ

మహారాజ విష్ణుగోపవర్మ

మహారాజ సింహవర్మ

మహారాజ విజయ విష్ణుగోపవర్మ

BRAOU

"స్కంద" అనే సంస్కృత నామవాచకానికి 'కంద' అనేది ప్రాకృత రూపం. కనుక, ఈ శాసనం పేర్కొనే కందవర్మ వాస్తవ నామం స్కందవర్మ. అతడు ఓంగోడు (మొదటి) శాసన ప్రదాతని గుర్తించొచ్చు. అతని తర్వాత పేర్కొనబడినవాడు యువ మహారాజు విష్ణుగోపుడే. కాగా, మహారాజ సింహవర్మ, ఓంగోడు (రెండు), మాంగడూరు శాసనాలను వేసిన మొదటి సింహవర్మ.

ప్రధాన శాఖ

కాంచినగరం నుండి పరిపాలించిన ప్రధాన వంశం, ఉదయేందిరమ్ చందలూరు తామ్ర శాసనాల వలన తెలియవస్తుంది.

మహారాజ నందివర్మ వేసిన ఉదయేందిరమ్ తామ్ర శాసనం, ఆ రాజు వంశ క్రమాన్ని ఇలా పేర్కొంటుంది.

మహారాజ స్కందవర్మ

మహారాజ సింహవర్మ

మహారాజ స్కందవర్మ

మహారాజ నందివర్మ

పశ్చిమ గంగ వంశం లోని మాధవవర్మ అనే రాజు వేసిన పెనుగొండ, కూడలూర్ తామ్ర శాసనాలు ప్రస్తావించే సింహవర్మ, అతని కుమారుడైన స్కందవర్మ, ఈ శాసనం వల్లనే, పల్లవ వంశ క్రమంలో కానవస్తాయి. ఈ శాసనం పేర్కొనే సింహవర్మ, ప్రధాన వంశం లోని రెండవ సింహవర్మే. అతని 41 వ రాజ్య సంవత్సరం నాటి సక్రపట్న తామ్ర శాసనం, అతడు కర్ణాటకం లోని సేంద్రక విషయంలో ఉన్నట్లు తెల్పుతుంది.

చందలూరు శాసనం వలన, ఈ క్రింది విధమైన పల్లవ వంశ క్రమం తెలియవస్తుంది:

మహారాజ స్కందవర్మ

మహారాజ కుమార విష్ణు

మహారాజ బుద్ధవర్మ

మహారాజ (రెండవ) కుమార విష్ణు

పల్లన్ కోవిల్ తామ్ర శాసనం ప్రాచీన పల్లవుల సంస్కృత శాసనాల్లో అన్నింటికంటె కడపటిది. ఇది సంస్కృత, తమిళ భాషల్లో ఉన్న ద్వైభాషిక (bilingual) శాసనం. ఇటువంటి ద్వైభాషిక శాసనాలు సాధారణంగా మధ్య యుగానికి చెందినవి. అయితే, ఈ శాసనం పేర్కొనే ఇద్దరు రాజులు, మహారాజ సింహవర్మ, అతని కుమారుడైన సింహవిష్ణు, వాయలూర్ స్తంభ శాసనం వలన, మొదటి మహేంద్రవర్మ (క్రీ.శ. 610-640) తాత, తండ్రులుగా గుర్తించడం జరిగింది. కనుక, ఈ శాసనం ప్రాచీన యుగాంతాన, మధ్య యుగారంభ కాలాన వేసినదిగా భావించొచ్చు. వీరి లోని సింహవర్మ, మాంగడూక శాసన ప్రదాతైన సింహవర్మ మనుమడు, ఆంధ్ర శాఖలో ఆ పేరు గల రాజుల్లో రెండవ వాడని గుర్తించొచ్చు.

BRAOU

6.6.5 : ప్రాచీన పల్లవుల కాలానుక్రమం - చరిత్ర

ప్రాచీన పల్లవుల కాలానుక్రమణికను నిర్మించి, వారి చరిత్రను అధ్యయనం చేయడంలో, మూడు ప్రధాన సమస్యలు ఎదురౌతాయి. వాటిలో పల్లవుల ప్రాకృత, సంస్కృత శాసనాల వలన తెలియవస్తున్న రాజు లందరు ఒక వంశ క్రమం లోని వారా? లేక, రెండు శాఖలకు చెందినవారా? అనేది, మొదటిది. పై పరిశీలన వలన, కొందరు ప్రాచీన పల్లవ రాజులు కాంచీపురం లోని ప్రధాన శాఖకు చెందినవారు, కొందరు యువ మహారాజు విష్ణుగోపుని కుమారుడైన మహారాజ సింహవర్మ నుండి, దక్షిణాంధ్ర (లేదా గుంటూర్-నెల్లూర్) పల్లవ శాఖకు చెందినవారని స్పష్టమైంది.

తక్కిన రెండు సమస్యలు: (1) ప్రాకృత శాసనాల నుండి తెలియవస్తున్న పల్లవ రాజులకు, సంస్కృత శాసనాల నుండి తెలియవస్తున్న రాజులకు, సంబంధాన్ని సమకూర్చడం, (2) అలహాబాద్ శాసనం పేర్కొంటున్న కాంచేయక విష్ణగోపుని గుర్తించటం. ఈ సమస్యల పరిష్కారానికి సరైన సాక్ష్యాధారాలు లేవు. సమకాలీన రాజకీయ స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని, లభిస్తున్న సాక్ష్యాధారాలను తార్కికంగా సమన్వయం చేయడమే ఏకైక విధానం.

పైన పేర్కొన్నట్లు, చారిత్రకంగా తెలియవస్తున్న మొట్టమొదటి పల్లవ రాజు, మంచికల్లు శిలా శాసనం నుండి తెలియవచ్చే సీహ (సింహ) వర్మ. అతడు క్రీ.శ. 305-330 మధ్య కాలంలో ఇక్ష్వాకు రాజ్యాన్ని తుదముట్టించి, స్వతంత్రమైన పల్లవ రాజ్యాన్ని స్థాపించి, పరిపాలించినట్లు నిశ్చయించొచ్చు. ఇతడు పల్లవ వంశం లోని మొదటి సింహవర్మ.

మైదవోలు, హీరహడగల్లి శాసనాలను వేసిన శివఖంద (స్కంద) వర్మ, మొదటి సింహవర్మ కుమారుడే కావచ్చు. ఇతన్ని పల్లవ వంశంలో మొదటి స్కందవర్మని వ్యవహరించొచ్చు. ఇతని పరిపాలనా కాలం సుమారు క్రీ.శ. 330 - 350

మొదటి స్కందవర్మ మైదవోలు శాసనాన్ని యువ మహారాజుగా వేసినా, అతని పరిపాలనా సంవత్సరాలనే పేర్కొనడం, అతడు స్వయంగానే శాసనం పేర్కొనే గ్రామ దానాన్ని చేయడం వలన, అతడు తండ్రి జీవిత కాలం లోనే ప్రముఖుడైనట్లు భావించొచ్చు. తన తండ్రి దండయాత్రా కార్యక్రమాల్లో పాల్గొంటూ, స్వతంత్ర పాలనాధికారాన్ని చెలాయించినవాడని, తండ్రితో కలసి సంయుక్తంగా పరిపాలించినవాడని తోస్తుంది. అతని మైదవోలు శాసనం అంధాపథ (ఆంధ్రపథం) లోని విరివర అనే గ్రామాన్ని, ఇద్దరు బ్రాహ్మణులకు దానం చేసిన విషయం ధంఞకడ (ధాన్యకటక - అమరావతి)లోని వ్యావృతునికి (స్థానిక అధికారికి) తెలియజేసే, ఆజ్ఞా సందేశం. విరివర నేటి గుంటూర్ జిల్లా, నర్సరావుపేట్ తాలూకా లోని విప్పర్ల గ్రామం. ఈ శాసనాన్ని అతడు కాంచిపురం నుండి వేశాడు. కనుక, మొదటి సింహవర్మ, స్కందవర్మ కాలం నాటికే, పల్లవ రాజ్యం కాంచీనగరం నుండి, ఉత్తరాన కృష్ణా నది వరకు విస్తరించినట్లు స్పష్టపడుతుంది. ఆ రాజు హీరహడగల్లి శాసనాన్ని మహారాజు హోదాతో, కాంచీపురం నుండి వేశాడు.

యువ మహారాజు బుద్ధవర్మ పేరైన చారుదేవి వేసిన బ్రిటీష్ మ్యూజియం శాసనం, విజయ స్కందవర్మ పరిపాలనా కాలం నాటిది. "విజయ", "శివ" అనే పదాలు గౌరవ వాచకాలని, ఈ స్కందవర్మ మైదవోలు, హీరహడగల్లి శాసనాలను వేసిన మొదటి స్కందవర్మేనని, పైన వివరించడం జరిగింది. శివస్కందవర్మ తాను కాంచిపురం నుండి పరిపాలిస్తూ, తన కుమారుడైన బుద్ధవర్మను దక్షిణాంధ్ర దేశంలో రాజప్రతినిధిగా నియమించినట్లు తోస్తుంది. పల్లవులు కాంచీనగరం రాజధానిగా

BRAOU

తమిళ దేశ భూభాగాలను ఆక్రమించి, పరిపాలించడం ప్రారంభమైన నాటి నుండి, వారు కృష్ణా నదికి దక్షిణాన ఉన్న ఆంధ్ర దేశ భూభాగాలపై తను ఆధిపత్యాన్ని నిలుపుకోడానికి ఉప శాఖను ఏర్పర్చినట్లు, స్పష్టంగా చెప్పొచ్చు.

శాతవాహన రాజ్యం అస్తమించిన తర్వాత, కొంకణ, అపరాంత భూభాగాల్లో ఆభీరులు ప్రబలులై నారు. వారు క్రమంగా దక్షిణ దిశగా విస్తరించి, ఇక్ష్వాకు రాజ్యంపై దండెత్తిన విషయాన్ని పైన వివరించడం జరిగింది. ఆభీర వసుషేణుని వలెనే మరికొందరు ఆభీర రాజులు మరింత దక్షిణంగా పల్లవ రాజ్యంపై దండెత్తినట్లు కానవస్తుంది. ప్రాచీన కాలంలో 'వర్మ' వంటి వ్యక్తి నామాంతాలు పహ్లవ, ఆభీరాది విదేశీయులు ధరించినవిగా, చరిత్రకారుల అభిప్రాయం. ఇది వాస్తవమేనని అంగీకరించిన పక్షంలో, సముద్రగుప్తుని అలహాబాద్ శాసనం పేర్కొనే పాలక్కక ఉగ్రసేనుడు, మరొక ఆభీర జాతీయుడని, దక్షిణాంధ్ర దేశంలో వలక్క రాజధానిగా అతడు ఒక స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడని ఊహించొచ్చు. వేలూర్పాళెయం శాసనం, వీరకూర్చవర్మ కుమారుడైన స్కందశిష్యుడు కాంచీ నగరాన్ని, అక్కడి ఘటికా స్థానాన్ని సత్యసేనుడనే వాడు జయించి ఆక్రమించినట్లు వివరిస్తుంది. ఈ సత్యసేనుడు మరొక ఆభీర యోధుడు కావచ్చు. విజయస్కందవర్మ ఆభీర విస్తరణను అరికట్టి, కృష్ణా పర్యంతంగా సామ్రాజ్యాన్ని సంరక్షించడానికి, వర్మ ఆభీర విస్తరణను అరికట్టి, కృష్ణా పర్యంతంగా సామ్రాజ్యాన్ని సంరక్షించడానికి తన కుమారుడైన బుద్ధవర్మను యువ మహారాజుగా నియమించినట్లు, తోస్తుంది.

6.6.5.1 : కాంచేయక విష్ణుగోపుడు

శివస్కంద వర్మ పరిపాలన తుది దశలో సంక్షోభాలకు గురైనట్లు కానవస్తుంది. దక్షిణాంధ్ర దేశం లోనికి చొచ్చుకొని వస్తున్న ఆభీరులను అరికట్టే ప్రయత్నంలో, యువ మహారాజు బుద్ధవర్మ మరణించినట్లు కానవస్తుంది. ఇంచుమించు అదే సమయాన కదంబ వంశీయుడైన మయూరశర్మ తిరుగుబాటుచేసి, శ్రీ పర్వతం నుండి పడమటి భాగాలను, స్వతంత్ర రాజ్యాన్ని నెలకొల్పాడు. సముద్రగుప్తుని దక్షిణాపథ దండయాత్రలో కాంచీపురం ప్రమాదం పాలైంది. ఈ సంఘటనలను క్రీ.శ. 350 నాటివిగా నిర్ణయించొచ్చు.

సముద్రగుప్తుడు ఓడించిన కాంచేయక విష్ణుగోపుడు, లోగడ చరిత్రకారులు ఉరువపల్లి, నెడుంగరాయ తామ్ర శాసనాలను వేసిన యువ మహారాజు విష్ణుగోపుడేనని భావించారు. కాని, అది అసంగతం. యువ మహారాజు క్రీ.శ. 350 నాటి వాడు కారు. అతడు కాంచీపురం నుండి పరిపాలించినట్లు లేదు. శివస్కందవర్మ యువ మహారాజ బుద్ధవర్మ మరణించిన తర్వాత, విష్ణుగోపుడు కాంచీపురంలో సింహాసన మధిష్ఠించాడని ఊహించొచ్చు. అతడు శివస్కందవర్మ కుమారుల్లో ఒకడు కావచ్చు. అతడు సముద్రగుప్తుని చేత ఓడిన తర్వాత, రాజ్యాన్ని పాలించలేదని, అతని సంతతి వారెవ్వరూ సింహాసనా న్నధిష్ఠించలేదని తోస్తుంది. అ కారణాన, అతన్ని నేటి వరకు లభించిన పల్లవ శాసనాలు పేర్కొనక పోవచ్చు.

సముద్ర గుప్తుని దండయాత్ర అనంతరం, పల్లవులు తమ రాజ్యాన్ని తిరిగి సంఘటితం చేసుకొని, ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి చాలా కృషి చేయాల్సొచ్చింది. ఓంగోడు (మొదటి) శాసనాన్ని వేసిన విజయస్కందవర్మ, లేదా మూడో స్కందవర్మ కాలం నాటికి, వారి అధికారం, వైభవం తిరిగి పూర్వ స్థాయికి చేరినాయి.

BRAOU

6.6.5.2 : క్రీ.శ. 350 తర్వాతి పల్లవుల చరిత్ర

మొదటి స్కందవర్మ నుండి మూడో స్కందవర్మ వరకు జరిగిన పల్లవ చరిత్రలో, పైన పేర్కొన్న సంక్షోభాన్ని నివారించడానికి చేసిన ప్రయత్నాల గూర్చి, సరైన సాక్ష్యాధారాలు లేవు. వేలూర్పాళెయం తామ్ర శాసనం కుమార విష్ణువు కాంచీనగరాన్ని ఆక్రమించాడని, వీరకూర్చవర్మ ఒక నాగరాజు కుమార్తెను వివాహం చేసుకొనడంతో రాజ్యాన్ని సంపాదించాడని; అతని కుమారుడైన స్కందశిష్యుడు కాంచీనగరం లోని ఘటికను సత్యసేనున్నుండి ఆక్రమించాడని వివరిస్తూంది. ఈ రాజులు ఓంగోడు (మొదటి) శాసనం వేర్కొనే రాజులే. ఆ శాసన ప్రదాతైన విజయస్కందవర్మ, వేలూర్పాళెయం శాసనం వేర్కొనే స్కందశిష్యుడేనని తోస్తుంది. అతడు తన వంశ పూర్వుల ప్రయత్నాలను కొనసాగిస్తూ, పల్లవుల రాజ్యాధిపత్యాన్ని సుస్థిరం చేయడానికే కాంచీపురం లోని ఘటిక నాక్రమించాడని, తర్వాత దక్షిణాంధ్ర దేశంపై దండెత్తివచ్చాడని నిశ్చయించొచ్చు. అతని ఓంగోడు (మొదటి) శాసనం విజయ తాంబ్రాప స్థానం నుండి వేసింది. తాంబ్రాప నేటి గుంటూర్ నగరానికి 10 కి.మీ. ఆగ్నేయంగా ఉన్న చేబ్రోలు గ్రామం. 'విజయ' అనే గౌరవ వాచకం వలన, స్కందవర్మ అక్కడికి దండయాత్రకై వచ్చినట్లు స్పష్టపడుతుంది.

6.6.5.3 : ప్రాచీన పల్లవులు : శాలంకాయన సంబంధాలు - I

కృష్ణా నదీ దక్షిణ తీర మైదానాలను ఆ సమయంలో ఆనందగోత్రులు పరిపాలిస్తున్నట్లు కానవస్తుంది. సముద్రగుప్తుని దండయాత్రల అనంతరం పల్లవ రాజ్యంలో ఏర్పడిన సంక్షోభం అవకాశంగా, వీరు తీరాంధ్రదేశం లోనికి విస్తరించినట్లు కానవస్తుంది. మూడో స్కందవర్మ తాంబ్రాప దగ్గర విడిసి, ఆనందగోత్ర రాజైన దామోదరవర్మను (క్రీ.శ. 425-436) ఓడించి, లోబర్చుకొన్నట్లు భావించొచ్చు. మూడో స్కందవర్మకు శాలంకాయన రాజైన విజయదేవవర్మ సమకాలికుడు. ఈ ఉభయులు "విజయ" బిరుదాలను ధరించారు. ఆ ఉభయుల రాజ్యాలకు కృష్ణా నది సరిహద్దుగా ఏర్పడింది. అటువంటి పరిస్థితుల్లో వారిద్దరి నడుమ అధిపత్య పోరాటాలు జరిగి ఉండడం, సహజం. శాలంకాయనుల్లో విజయదేవవర్మ తర్వాత పరిపాలించిన స్కందవర్మ, విజయనందివర్మ కుడూర ఆహారంలో గ్రామ దానాలను చేసి, తమ కంతేరు శాసనాలను జారీ చేశారు. కుడూర ఆహారం నేటి కృష్ణా నదీ ముఖ ద్వారానికి ఇరు వైపులా ఉన్న మైదాన భూములతో కూడి ఉంది.

6.6.5.4 : ప్రాచీన పల్లవులు - రెండవ సింహవర్మ (క్రీ.శ. 436-472)

ప్రాచీన పల్లవ చరిత్రలో రెండవ సింహవర్మ పరిపాలనా కాలం ఒక ఉజ్జ్వల ఘట్టం. బహుశః తొలి సారిగా పల్లవులు దక్షిణ భారతదేశ చరిత్రలో అద్వితీయమైన రాజకీయ ప్రతిష్ఠను రెండో సింహవర్మ కాలం లోనే పొందినట్లు భావించొచ్చు.

రెండో సింహవర్మ, మూడో స్కందవర్మ కుమారుడు. ఈతని పరిపాలనా కాలాన్ని నిర్ణయించడం తోనే, ప్రాచీన పల్లవుల కాలానుక్రమణిక ఖచ్చితంగా ఏర్పడుతుంది. "లోకవిభాగ" మనే దిగంబర జైన గ్రంథం చివర, ఆగ్రంథం కాంచీశ్వరుడైన సింహవర్మ 22వ రాజ్య సంవత్సరంలో, దానికి సరైన శక సంవత్సరం 380లో, అంటే క్రీ.శ. 458లో, పూర్తైనట్లు వేర్కొంటుంది. మంచికల్లు శాసనం వేర్కొనే సింహవర్మ, క్రీ.శ. మూడో శతాబ్దికి చెందినవాడు. ఇక్ష్వాకు రాజుల సమకాలికుడు; పల్లన్‌కోవిల్ శాసనం వేర్కొనే సింహవర్మ, క్రీ.శ. ఆరో శతాబ్దికి చెందినవాడు. మూంగడూర్,

BRAOU

ఓంగోడ్ (రెండు) శాసనాలను వేసిన సింహవర్మ, కాంచి పరిపాలకుడు కాడు. కాగా, లోకవిభాగ కాల సూచిక (colophon) కు సరైన సింహవర్మ ఇతడే; వేసంత, సక్రపట్ను శాసనాలను వేసిన రాజు ఇతడే. "లోకవిభాగ" కాల సూచిక నుసరించి, ఈతడు క్రీ.శ. 436లో సింహాసన మధిష్ఠించినట్లు, నిర్ణయించొచ్చు. అతని తండ్రైన మూడో స్కందవర్మ, తన ఓంగోడ్ (మొదటి) శాసనాన్ని తన 33వ రాజ్య సంవత్సరంలో వేశాడు. అతడు తన దండయాత్రను ముగించుకొని, రాజధానిని చేరుకోవడానికి కొంత వ్యవధిని ఇచ్చి, 36 సంవత్సరాలు - క్రీ.శ. 400 నుండి క్రీ.శ. 436 వరకు పరిపాలించినట్లు నిర్ణయించొచ్చు. క్రీ.శ. 350 నుండి 400 వరకు మొదటి కుమార విష్ణువు, రెండో స్కందవర్మ, వీరవర్మ పరిపాలించినట్లు స్పష్టపడుతుంది.

పశ్చిమ గంగ వంశం లోని మాధవవర్మ అనే రాజు వేసిన పెనుగొండ, కూడలూర్ తామ్ర శాసనాలు, తనను పల్లవ మహారాజు స్కందవర్మ సింహాసనంపై నిలిపినట్లు, తన తండ్రైన అయ్యవర్మకు, స్కందవర్మ తండ్రైన సింహవర్మ పట్టం కట్టినట్లు పేర్కొన్నాడు. పశ్చిమ గంగ వంశం లోని ఇద్దరు తండ్రి కొడుకులైన రాజులు, ఉదయేందిరం తామ్ర శాసనం వలన తెలియవస్తున్నారు. ఆ వంశం లోని అయ్యవర్మను సింహాసనంపై నిలిపిన సింహవర్మ కూడ ఇతడే. మాధవవర్మ వేసిన పెనుగొండ శాసనం, క్రీ.శ. 478 నాటిది. రెండో సింహవర్మ తన సక్రపట్ను తామ్ర శాసనాన్ని, తన 41 వ రాజ్య సంవత్సరంలో, అంటే క్రీ.శ. 478 లో కదంబ రాజ్యం లోని సేంద్రక విషయం నుండి వేశాడు. అంటే, అతడు పశ్చిమ గంగ వంశీయుల సహాన కదంబులతో పోరాటాన్ని చేసినట్లు, ఆ శాసనం సూచిస్తుంది.

6.6.5.5 : ప్రాచీన పల్లవులు: శాలంకాయన సంబంధాలు – II

రెండో సింహవర్మకు సమకాలికులైన శాలంకాయనులు స్కందవర్మ, విజయ నందివర్మ. వారు వేంగి సింహాసనం కొరకు వరసపోరాడుకోవడం, పల్లవ రాజుకు చక్కగా అనుకూలించిందని భావించొచ్చు. అతని 19 వ రాజ్య సంవత్సరం నాటి వేసంత తామ్ర శాసనం, క్రీ.శ. 455 నాటికి పల్లవ రాజ్యం నాదత్తపాటి విషయాన్ని ఆక్రమించినట్లు స్పష్టం చేస్తుంది. ఈ నాదత్తపాటి విషయం, కృష్ణా నదికి ఉత్తరంగా, నేటి కృష్ణా, ఖమ్మం జిల్లాల్లోని జగ్గయ్యపేట, నందిగామ, ముదిర తాలూకాలతో కూడినదిగా, చరిత్రకారుల నిర్ణయం. ఈ ప్రదేశాన్ని విష్ణుకుండిన శాసనాలు నత్రిపాటి విషయమని పేర్కొంటాయి. కృష్ణా నదికి ఆవలి దిశగా రెండో సింహవర్మ రాజ్య విస్తరణ, శాలంకాయన రాజ్యం నిర్మూలం కావడం వల్లనే సాధ్యమైందని, నిస్సంశయంగా చెప్పొచ్చు.

దక్షిణాంధ్ర దేశాన్ని పల్లవ రాజ్యంలో చేర్చి, శాలంకాయన రాజ్యాన్ని నిర్మూలించేందుకు, రెండో సింహవర్మ తన సోదరుడైన విష్ణుగోపుని యువ మహారాజ హోదాతో పంపాడు. యువ మహారాజు తన ఉరువపల్లి, నెడుంగరాయ తామ్ర శాసనాలను, సింహవర్మ 11, 12 రాజ్య సంవత్సరాల్లో (క్రీ.శ. 447, 448) వేశాడు. ఆ తర్వాత సింహవర్మ తన 19 వ రాజ్య సంవత్సరంలో వేసిన వేసంత తామ్ర శాసనం, ఈ యుద్ధ విజయాలను, ఆక్రమణలను స్పష్టపరుస్తుంది. ఆ శాసనం కాంచిపురం నుండి వేయబడింది. కాంచిపురంలో ప్రధాన శాఖకు చెందిన రెండో సింహవర్మ పరిపాలిస్తుండగా, అతని సోదరుడు దక్షిణాంధ్ర దేశంలో అతని ప్రతినిధిగా పరిపాలిస్తున్నట్లు, స్పష్టమౌతుంది.

BRAOU

6.6.5.6 : ప్రాచీన పల్లవ - విష్ణుకుండిన సంఘర్షణలు

శాలంకాయన రాజ్యం నిర్మూలం కావడంతో, పల్లవుల ఆధిపత్యానికి మార్గం సుగమం కాలేదు. పశ్చిమాంధ్ర దేశంలో (నేటి తెలంగాణా ప్రాంతంలో) పరిపాలిస్తున్న విష్ణుకుండిన రాజు గోవిందవర్మ (క్రీ.శ. 435-475), రెండో సింహవర్మ సమకాలికుడు. అతడు కృష్ణా నది దక్షిణ తీరంలో పరిపాలిస్తున్న శ్రీపృథ్వీమూల రాజ వంశం నుండి పరమ (భట్టారికా) మహాదేవిని వివాహం చేసుకొన్నాడు. ఈ వంశం పల్లవ-శాలంకాయన రాజ్యాలకు నడుమ కీలక స్థానంలో ఉన్నందున, వారి పోరాటాల్లో ప్రధాన పాత్ర నిర్వహించినట్లు ఊహించొచ్చు. శాలంకాయన రాజ్యం అస్తమించిన తరువాత, కృష్ణా, గోదావరి నదుల నడిమి మైదానాన్ని ఆక్రమించి, కృష్ణా నదికి దక్షిణాన గల భూభాగాలపై విస్తరించడానికి, విష్ణుకుండినులు సమకట్టారు. వారికి పల్లవులతో జరిగిన సంఘర్షణల్లో, పృథ్వీమూల వంశం, కీలక పాత్ర నిర్వహించింది.

విష్ణుకుండిన గోవిందవర్మ తన 37వ రాజ్య సంవత్సరంలో (క్రీ.శ. 467) వేసిన తుమ్మల గూడెం (మొదటి) తామ్ర శాసనంలో, తన రాణి కట్టించిన బౌద్ధ విహారానికి పెన్కవర, ఎంబుదల అనే గ్రామాలను దానం చేస్తున్నట్లు, వివరించాడు. ఈ గ్రామాలు నేటి ప్రకాశం జిల్లా లోని చీరాల తాలూకాలో గుర్తించబడినవి. పెన్కవర చాలా ప్రధానమైన గ్రామంగా తోస్తుంది. తర్వాత కాలంలో, తూర్పు చాళుక్య రాజులు సైతం, ఈ గ్రామాన్ని దానం చేస్తూ శాసనాలు నిచ్చారు.

విష్ణుకుండిన రాజ్య విస్తరణ పల్లవులను కృష్ణా తీరం నుండి గుండ్లకమ్మ, లేదా పెన్నా తీరం వరకు నెట్టివేసినట్లు, ఇది రెండో సింహవర్మకు అందోళనకరమైనట్లు ఊహించొచ్చు. ఈ పరిస్థితిలో రాజ్య సుస్థిరత, విస్తరణలను సాధించటానికి, విష్ణుకుండినులతో శక్తియుతంగా పోరాటాలను చేయడానికి, అతడు దక్షిణాంధ్ర శాఖకు స్వయంప్రతిపత్తి నిచ్చినట్లు, తోస్తుంది. యువ మహారాజు విష్ణుగోపుని కుమారుడైన సింహవర్మ తన శాసనాలను, స్వీయ రాజ్య సంవత్సరాల్లో వేయడం, ఈ స్వయం ప్రతిపత్తిని సూచిస్తుంది. ఈ పరిణామాలు క్రీ.శ. 470 నాటివి కావచ్చు. తర్వాత కాలంలో బాదామి చాళుక్య రాజైన రెండవ పులకేశి తీరాంధ్రాన్ని జయించిన తర్వాత, ఇదే విధంగా తన వంశ శాఖను వేంగిలో నెలకొల్పి, స్వతంత్ర ప్రతిపత్తిని అనుమతించడం గుర్తించాల్సిన విషయం.

ఆంధ్ర దేశం లోని పల్లవ శాఖ ఈ స్వతంత్ర ప్రతిపత్తిని చక్కగా వినియోగించుకొంది. కాంచినగరం లోని కేంద్ర ప్రభుత్వ అనుమతి కొరకు వేచి ఉండక, స్థానిక రాజకీయ పరిణామాలకు అనుగుణమైన విధానాన్ని వారు రూపొందించుకోడానికి, మెరుపెంటనే కార్యాచరణకు ఉపక్రమించడానికి అవకాశం ఏర్పడింది. ఈ శాఖ లోని సింహవర్మ (లేదా, మూడో సింహవర్మ) తన మాంగడూర్ శాసనం వలన, క్రీ.శ. 478 నాటికి కృష్ణా పర్యంతంగా రాజ్య విస్తరణ సాధించినట్లు తెలియుచేసే విషయాన్ని, పైన పేర్కొనడం జరిగింది. సింహవర్మ క్రీ.శ. 470 నుండి 495 వరకు పరిపాలించి ఉండొచ్చు.

వేంగో రాష్ట్రం వేంగి దేశమేనని, సింహవర్మ వేంగి దేశం లోనికి చొచ్చుకొని రాగా, విష్ణుకుండిన రాజైన రెండో విక్రమేంద్రవర్మ అతన్ని ఓడించి, తరిమివేసి ఉంటాడని, చోగడ ఆచార్య మారేమండ రామారావ్ అభిప్రాయపడ్డాడు. కాని, అది అనుంగతం. రెండో విక్రమేంద్రవర్మ ఆంధ్ర పల్లవ శాఖ లోని సింహవర్మ సమకాలికుడు కాడు. అప్పటి విష్ణుకుండిన రాజు, గోవిందవర్మ కుమారుడైన రెండో మాధవవర్మ (క్రీ. శ. 470-520).

BRAOU

పల్లవుల ఆంధ్ర దేశ శాఖలో సింహవర్మ తర్వాత, అతని కుమారుడైన మహారాజు విజయ విష్ణుగోపవర్మ, క్రీ.శ. 495 నుండి 520 వరకు పరిపాలించినట్లు భావించొచ్చు. ఆ రాజు రెండో రాజ్య సంవత్సరంలో కర్మ రాష్ట్రంలోని శురా గ్రామాన్ని దానం చేస్తూ, ఒక శాసన మిచ్చాడు. అయితే, విష్ణుకుండిన వంశంలో గోవిందవర్మ తర్వాత సింహాసన మెక్కిన, ఆరాజు కుమారుడైన రెండో మాధవవర్మ (క్రీ.శ. 475 - 515), ఆ వంశం లోనే కాక, దక్షిణ భారతదేశ చరిత్ర లోనే విజేతలు, సామ్రాజ్య నిర్మాతల్లో అగ్రగణ్యుడు; తన సామ్రాజ్య విస్తరణను సూచిస్తూ, 11 సార్లు అశ్వమేధాలు చేసినవాడు.

మూడో మాధవవర్మ 33వ రాజ్య సంవత్సరం (క్రీ.శ. 508) నాటి వేల్పూర్ శిలా శాసనం, ఆ రాజు పల్లవులపై పోరాటాన్ని ప్రస్తావిస్తుంది. ఆ శాసనం చాలా వరకు శిధిలమైనా, లభిస్తున్న కొన్ని వాక్య భాగాలు "వేల్పూర్ దేశం" లో మాధవవర్మ "స్కందావారగతుడై", అనగా సైనిక శిబిరంలో ఉన్నట్లు, "పల్లవ కులం" తో పోరాటానికై వచ్చి, అక్కడ విడిసి ఉన్నట్లు, అర్థం చేసుకోవడం అసాధ్యం కాదు. ఆ యుద్ధ విజయం తర్వాత, క్రీ.శ. 570లో ఆధిపత్యానికి అవకాశాలు మృగ్యమైనట్లు కానవస్తుంది.

పల్లవులు తమ సామ్రాజ్య విస్తరణకై ఆంధ్ర దేశంలో తమ వంశ ఉప శాఖను ఏర్పర్చడం, విష్ణుకుండినులను అదే మార్గంలో వారి విస్తరణను అరికట్టడానికి పురికొల్పిందని భావించొచ్చు. మాధవవర్మ తన కుమారుడైన దేవవర్మను కృష్ణా నది దక్షిణ తీరంపై తన ప్రతినిధిగా నిల్పినట్లు కానవస్తుంది. ఆ రాజు 33వ రాజ్య సంవత్సరంలో (క్రీ.శ. 508), వేల్పూర్ యుద్ధం ముగిసిన వెంటనే ఈ ఏర్పాటు చేసి ఉంటాడు.

దేవవర్మ కుమారుడైన మాధవవర్మ తన 47వ రాజ్య సంవత్సరంలో వేసిన ఈపూర్ (రెండో) శాసనంలో, తన తండ్రి క్షత్రియులను అణచివేయడంలో తన పరాక్రమాన్ని ప్రదర్శించినట్లు వర్ణించాడు. ఈ క్షత్రియులు పల్లవులేనని భావించొచ్చు. వారు భారద్వాజ గోత్రులుగా వర్ణించుకొన్నా, సమకాలీన రాజ వంశాలు వారిని క్షత్రియులుగానే పరిగణించినట్లు, కదంబ వంశీయుల శాసనాలు కూడ సూచిస్తున్నాయి. కనుక, దేవవర్మ, అతని కుమారుడైన మాధవవర్మ, సుమారొక అర్ధ శతాబ్ది పాటు పల్లవుల విస్తరణను అరికట్టగలిగారని గ్రహించొచ్చు. అయితే, అతడు క్రీ.శ. 555లో విష్ణుకుండిన ప్రధాన శాఖపై తిరుగుబాటు చేయడంతో, ఇంద్రభట్టారకవర్మ అతన్ని ఓడించి, వధించాడు. దీనితో విష్ణుకుండిన ఉప శాఖ అంతమైంది; తిరిగి, పల్లవులు కృష్ణా తీరం వైపు విస్తరించడానికి అవకాశమేర్పడింది.

పల్లవుల ఆంధ్ర శాఖలో విజయగోపవర్మ తర్వాత సింహాసన మధిష్ఠించినవాడు సింహవర్మ. ఇతని శాసనాలేవీ ఆంధ్ర దేశంలో లభించ లేదు. రాజసింహ రెండో నరసింహవర్మ వేసిన వాయలూర్ స్తంభ శాసనం, నవీన పల్లవుల వంశానుక్రమానికి విశ్వసనీయమైన సాక్ష్యాధారమని, డి.సి. సర్కార్ గుర్తించి, ఆ వంశంలో ప్రముఖుడైన మొదటి మహేంద్రవర్మ తండ్రి సింహవిష్ణువు, తాత సింహవర్మ, ముత్తాత విష్ణుగోపవర్మ అని పేర్కొనడాన్ని బట్టి, నవీన పల్లవులు ఆంధ్ర శాఖకు చెందినవారని నిర్ణయించాడు. అయిన అభిప్రాయం సహేతుకం, ఆమోదయోగ్యం. ఈ రాజుల్లోని విష్ణుగోపవర్మ, చురా శాసన మేసిన మహారాజ విజయగోపవర్మని, నిస్సంశయంగా గ్రహించొచ్చు. కాగా, అతని కుమారుడైన సింహవర్మ, మనుమడైన సింహవిష్ణువు, కాంచీనగరం నుండి పరిపాలించినట్లు, వాయలూర్ శాసనం తెలియజేస్తుంది. ఈ ఇద్దరు రాజులు పల్లన్‌కోవిల్ ద్వైభాషిక తామ్ర శాసనం వలన కూడా తెలియవస్తారు. ఈ సింహవర్మను ప్రాచీన పల్లవ చరిత్రలో నాలుగో సింహవర్మగా గుర్తించొచ్చు.

BRAOU

పల్లవుల ప్రధాన శాఖ లోని మూడో కుమార విష్ణువు వేసిన చందలూర్ తామ్ర శాసనం, కర్మ రాష్ట్రంలో గ్రామ దానాన్ని పేర్కొంటుంది. అది ఆ రాజు తన రెండవ రాజ్య సంవత్సరంలో వేసింది. సుమారు క్రీ.శ. 547 నాటిది. ఆంధ్ర శాఖలో విజయగోపవర్మ (క్రీ.శ. 495-525) తర్వాత సింహాసన మెక్కిన నాలుగో సింహవర్మ (క్రీ.శ. 525-65), ఆ రాజుకు సమకాలికుడు. చందలూర్ శాసనం వలన, మూడో కుమార విష్ణువు ఆంధ్ర శాఖ లోని సింహవర్మతో పోరాటాలకు దిగినట్లు, ఆ సందర్భంగా కర్మ రాష్ట్రం లోనికి వచ్చి, గ్రామ దానం చేసినట్లు గ్రహించడం, సహేతుకం. బహుశః ఆంధ్ర పల్లవ శాఖ ప్రధాన శాఖను ధిక్కరించి, సామ్రాజ్యం యావత్తును ఆక్రమించడానికి ప్రయత్నించి ఉండొచ్చు. అదే సమయంలో, విష్ణుకుండిన ఉప శాఖలోని (మూడో) మాధవవర్మ కూడ, అదే విధంగా ప్రధాన శాఖపై తిరుగుబాటు చేశాడు. ఈ ఉభయుల మధ్య సన్నిహితమైన సహకారం ఉండి ఉండొచ్చు. మూడో మాధవవర్మ సాయంతో సింహవర్మ మొదటి ప్రధాన శాఖను నిర్మూలించి, కాంచీ నగరాన్ని ఆక్రమించాడని భావించొచ్చు. తర్వాత ఈ సాయానికి ప్రతికృతిగా, అతడు మాధవవర్మకు ఇంద్రభట్టారకునిపై పోరాడడానికి సాయపడి ఉండొచ్చు.

ఈ వంశాంతర్గత పోరాటాల్లో పల్లవులు విజయాన్ని సాధించినా, విష్ణుకుండినుల పక్షాన ఫలితం మరో విధంగా ఉందని, రెండో విక్రమేంద్రవర్మ శాసనాలు స్పష్టపరుస్తున్నాయి. బహుశః (మూడో) మాధవవర్మ కుడూరపురం వద్ద ఇంద్ర భట్టారకునికి ఓడి, మరణించి ఉంటాడు. ఈ విధంగా, విష్ణుకుండినుల ఉప శాఖ అంతమైంది.

అయితే, పల్లవ - విష్ణుకుండిన పోరాటాలు, ఆ తర్వాత సైతం కొనసాగినట్లు, తుమ్మలగూడెం (రెండో) శాసనం ఉత్తమాశ్రయుడు, అంటే రెండో విక్రమేంద్రవర్మ "సింహ" అనే పల్లవుని సులువుగా ఓడించినట్లు వర్ణిస్తుంది. ఈ సింహ అనే పల్లవుడు, మాంగడూర్ తామ్ర శాసనాన్ని వేసిన సింహవర్మైనట్లు, మారేమండ రామారావ్ సరి అభిప్రాయాన్ని పైన నిరాకరించడం జరిగింది. రెండో విక్రమేంద్రవర్మ తుమ్మల గూడెం (రెండో) శాసనం, అతని రాజ్యం కాంచీనగరం రాజధానిగా, తమిళ దేశం లోని విశాల భూభాగాలను, దక్షిణాంధ్ర దేశాన్ని ఆక్రమించింది. లోగడ, అతడు (మూడో) మాధవవర్మను సమర్థించినవాడు. ఆ కారణం చేత, అతడు కృష్ణా నది దక్షిణ తీర మైదానాలను పూర్తిగా ఆక్రమించదల్చి, విష్ణుకుండిన రాజైన రెండో విక్రమేంద్రవర్మ రాజ్యంపై దండెత్తినట్లు గ్రహించొచ్చు. విష్ణుకుండిన రాజు తన 11 వ రాజ్య సంవత్సరంలో వేసిన, తుమ్మలగూడెం (రెండో) శాసనం ప్రస్తావించిన పల్లవ రాజు సింహవిష్ణువని నిర్ణయించొచ్చు. ఆ శాసనం వివరిస్తున్నట్లు ఈ పోరాటంలో పల్లవులు ఓడిపోయారు. అయితే, క్రీ.శ. 570 నాటికి విష్ణుకుండిన రాజ్యం అంతమైంది. ఆ తర్వాత పల్లవులు కృష్ణా పర్యంతంగా, దక్షిణాంధ్ర దేశాన్ని తమ ఆధిపత్యం లోనికి తెచ్చుకోడానికి, వేంగి చాళుక్యులతో పోరాడాల్సొచ్చినట్లు, క్రీ.శ. 7 వ శతాబ్దికి చెందిన ఒక చేజెర్ల శాసనం, ఆనందగోత్రుల లోని కందరరాజు దౌహిత్రుడొకడు, సత్యభామబల్ల బిరుదాన్ని కలిగినవాడు, పల్లవ మహేంద్రవర్మ సామంతుడైనట్లు వివరిస్తుంది. ఈ మహేంద్రవర్మ (క్రీ.శ. 610-640) చేజెర్ల శాసనం, అతని అవినాభాజన, వేగవతీసనాథ, అనే బిరుదాలనే కాక, 'మహేంద్ర విక్రమ మహారాజ'ని స్పష్టంగా పేర్కొంటున్నది. క్రీ.శ. 624 లో బాదామి చాళుక్య చక్రవర్తైన రెండవ పులకేశి ఆంధ్ర దేశంపై దండెత్తే నాటికి, కృష్ణా పర్యంతంగా, పల్లవ మహేంద్రవర్మ పరిపాలిస్తున్నాడు.

BRAOU

6.7 : విష్ణుకుండినులు

ప్రాచీన ఆంధ్ర దేశ చరిత్రలో శాతవాహనుల తర్వాత కోల్పోయిన రాజకీయ సమైక్యతను, తిరిగి సమకూర్చి, సామ్రాజ్య నిర్మాతలుగా ప్రఖ్యాతి చెందినవారు, విష్ణుకుండినులు. వీరి కృష్ణకి ఫలితంగా, కృష్ణా నదికి ఉత్తరంగా ఉన్న ఆంధ్ర దేశం యావత్తు సమైక్యమై, పరిసరాల్లోని కళింగ, విదర్భ ప్రాంతాలతోను, దక్కన్ పీఠభూమి పశ్చిమ ప్రాంతాలతోను కలిసి, ఒక విశాల సామ్రాజ్యానికి పట్టుకొమ్మైంది. ఇటీవల వెలుగులోకి వచ్చిన తుమ్మల గూడెం రెండవ తామ్ర శాసనం ఈ విషయాన్ని ప్రకటిస్తూ, ఆ వంశంలో అత్యంత ప్రసిద్ధుడైన మాధవవర్మ "ప్రాగ్దక్షిణాపరాంభోనిధిరేఖా సరిత్పర్వతీల వలయ విభూషణాయాభుచోభర్తు" అని, వర్ణించింది. ఈ వర్ణనలో కొంత అతిశయోక్తి ఉన్నా, పీఠభూమి అంతటా అనేక చోట్ల లభించిన విష్ణుకుండినుల నాణాలు, ఈ శాసన వాక్యం చాలా వరకు యదార్థమేనని నిరూపిస్తున్నాయి. శాతవాహనుల తర్వాత దక్షిణాపథం అంతటా విస్తరించిన విశాలమైన ఆంధ్ర సామ్రాజ్యాన్ని విష్ణుకుండినులు స్థాపించారని స్పష్టపడుతుంది. అంతేకాక, వింధ్య పర్వతాలకు ఆవల ఉన్న భూభాగంపై కూడా, సామ్రాజ్యాన్ని విస్తరింప చేయటానికి ఈ వంశీయులు పోరాటాలను చేశారు.

6.7.1 : సాక్ష్యాధారాలు

విష్ణుకుండిన వంశ, కాలానుక్రమణికల నిర్మాణానికి, వారి కాలం నాటి చరిత్రను అధ్యయనం చేయడానికి, వారి శాసనాలే ప్రధాన సాక్ష్యాధారాలు. వారి శాసనాలు కేవలం 10 మాత్రమే లభించాయి. అవి కూడా చాలా క్లుప్తంగా, శాసన ప్రదాతను, గ్రహీతను, దానం చేసిన గ్రామ క్షేత్రాలను గూర్చి మాత్రమే వివరిస్తాయి. ఆ రాజుల యుద్ధ విజయాలు, పరిపాలనా విశేషాలు, ఇతర ఘన కార్యాలు, కనీసం వారి రాజధాని నగరాన్ని, ఆ శాసనాలు వివరించవు. అంతే కాక, ఆ శాసనం లోని లిపి, కొన్నింటిలో క్రీ.శ. 5, 6 శతాబ్దాలకు చెందినట్లు, కొన్నింటిలో అంతకు పూర్వ కాలం నాటిదిగాను కన్పిస్తుంది. అందుచేత, వాటి నుండి చారిత్రకాంశాలను గ్రహించి, వంశ, కాలానుక్రమణికలను ఏర్పర్చడంలో, చరిత్రకారుల నడుమ తీవ్ర వాదోపవాదాలు ఏర్పడ్డాయి. భాషాపరంగా, విష్ణుకుండిన శాసనాలు, సంస్కృత శాసనాలు. కాని, వాటిలో సంవత్సరం, మాస, పక్షాలను పేర్కొనడంలో, ప్రాకృత భాషా ప్రభావముంది. కనుక, అవి శాసన భాషగా, ప్రాకృతం అస్తమించి, సంస్కృత భాష వాడుకలోనికి వస్తున్న సంధి కాలానికి, అంటే, క్రీ.శ. 5, 6 శతాబ్దాలకు చెందినవిగా భావించొచ్చు.

నేటి వరకు లభిస్తున్న విష్ణుకుండిన శాసనాలు : (1) రెండవ విక్రమేంద్రవర్మ వేసిన చిక్కుళ్ళ, తుండి, తుమ్మలగూడెం (రెండవ) తామ్ర శాసనాలు; (2) ఇంద్రవర్మ వేసిన రామతీర్థ శాసనం; (3) రెండు ఈపూర్ శాసనాలు; (4) మాధవవర్మ వేసిన పొలమూర్ శాసనం, ఖానాపూర్ శాసనం; (5) గోవిందవర్మ వేసిన తుమ్మలగూడెం (మొదటి) శాసనం; (6) వేల్పూర్ శిలా శాసనం. ఇవన్నీ సంస్కృత భాషలో రచింపబడినవి. వాటిలో ఖానాపూర్ శాసనం చాలా వరకు నష్టమైంది; లభిస్తున్న భాగం కొంత వరకు మహారాజ మాధవవర్మను వర్ణిస్తుంది.

BRAOU

6.7.2 : విష్ణుకుండినులు : వంశ క్రమం

విష్ణుకుండిన వంశ క్రమాన్ని నిర్మించడానికి, వారి శాసనాల నుండి తెలియవస్తున్న రాజుల పరంపరలతో కూడిన పట్టికలను, పరస్పరం అనుసంధించడమే పద్ధతి. రెండవ విక్రమేంద్రవర్మ వేసిన చిక్కుళ్ళ, తుండి శాసనాల్లోని రాజుల పట్టికల్లో, మొదటి ముగ్గురు, ఇంద్రవర్మ వేసిన రామతీర్థ శాసనం నుండి తెలియవస్తున్న రాజులేనని నిర్ణయించడంలో, సంశయం లేదు. ఆ రాజుల్లో మొదటి వాడు, వంశ పూర్వునిగా కీర్తించబడిన మహారాజ మాధవవర్మ ఏకదశాశ్వమేధాలు, క్రతు సహస్రాలు చేసినవాడు. ఈపూర్ మొదటి శాసనం కూడ, శాసన ప్రదాతైన మహారాజ మాధవవర్మ ఏకాదశాశ్వమేధాలు, క్రతు సహస్రాలను చేసినట్లు వర్ణిస్తుంది. కనుక, ఈ రాజు చిక్కుళ్ళ, రామతీర్థ శాసనాల్లో కీర్తించబడిన మాధవ వర్మగా గుర్తించొచ్చు. ఆ శాసనం వలన, ఆ రాజు తండ్రి గోవిందవర్మని తెలియవస్తుంది. ఇంతవరకు విష్ణుకుండిన రాజుల వంశ పరంపరను ఈ క్రింది విధంగా చూపొచ్చు:

మహారాజ గోవిందవర్మ

|

మహారాజ మాధవవర్మ

|

(ఏకాదశాశ్వమేధయాజి, క్రతు సహస్ర యాజి

ఈపూర్, మొదటి శాసన ప్రదాత)

|

మహారాజ విక్రమేంద్రవర్మ

(విష్ణుకుండి, వాకాటక వంశవ్యయాలంకార జన్ముడు)

|

మహారాజ ఇంద్ర (భట్టారక) వర్మ

|

(రామతీర్థ శాసన ప్రదాత)

|

రెండో విక్రమేంద్రవర్మ

|

(తుండి, చిక్కుళ్ళ శాసనాల ప్రదాత)

BRAOU

ఈపూర్ శాసనాలను ప్రకటిస్తూ హల్ష్ పండితుడు, లిపి పరిణామ పరిశీలన వలన, మొదటి శాసనం కంటె, రెండవ శాసనం మరింత వెనుకటి కాలానికి చెందినట్లు, అందలి లిపి క్రీ.శ. నాలుగో శతాబ్దికి చెందిన కొన్ని ప్రాచీన పల్లవ శాసనాల్లోని లిపిని పోలి ఉన్నట్లు, భావించాడు. అందుచేత, ఈపూర్ (మొదటి) శాసన ప్రదాత, ఈపూర్ (రెండవ) శాసనాన్ని వేసిన మాధవవర్మకు మనుమడు కావచ్చునని, ఆయన అభిప్రాయపడ్డాడు. ఈ అభిప్రాయాన్ననుసరించి, చరిత్రకారులు విష్ణుకుండిన వంశ క్రమంలో, పైన చూపిన రాజుల పట్టికను, ఈ క్రింద చూపిన విధంగా, వెనుకకు పొడిగించారు.

1. మహారాజ మాధవవర్మ

   \

   (ఏకాదశాశ్వమేధాలు, క్రతు సహస్రాలు చేసినవాడు)

   |

2. దేవవర్మ

3. రెండో మాధవవర్మ

(ఈపూర్ రెండవ శాసనాన్ని వేసిన త్రికూట మలయాధిపతి)

4. మహారాజ గోవిందవర్మ

5. మహారాజ (మూడో) మాధవవర్మ

(ఏకాదశాశ్వమేధాలు, క్రతుసహస్రాలు చేసినవాడు,

ఈపూర్ (మొదటి) శాసన ప్రదాత)

ఈ విధమైన వంశానుక్రమంలో, ఏకాదశాశ్వమేధాలు, క్రతు సహస్రాలను చేసిన ఇద్దరు మాధవవర్మ పేరు గల రాజులు ఏర్పడుతున్నారు. తర్వాత లభించిన పొలమూర్ శాసనం, ఆ శాసన ప్రధాతైన మాధవవర్మ కూడ, ఏకాదశాశ్వమేధ, క్రతు సహస్రాలను చేసినవాడేనని వర్ణించింది; కాని, అతని తాత విక్రమ మహేంద్రుడని పేర్కొన్నది. ఈ విక్రమ మహేంద్రుడు చిక్కుళ్ళ శాసనాన్ని వేసిన రెండో విక్రమేంద్రవర్మగా అభిప్రాయపడి, ఆ శాసనాన్ని ప్రకటించిన కొమర్రాజు లక్ష్మణరావుగారు, విష్ణుకుండిన వంశ వృక్షాన్ని ఈ క్రింద చూపిన విధంగా, ముందుకు పొడిగించారు.

5. మహారాజ (మూడో) మాధవవర్మ

(ఏకాదశాశ్వమేధాలు, క్రతు సహస్రాలను చేసినవాడు
(మొదటి) ఈపూర్ శాసన ప్రదాత)

6. మహారాజ విక్రమేంద్రవర్మ

7. మహారాజ ఇంద్ర (భట్టారక) వర్మ

(రామతీర్థ శాసన ప్రదాత)

8. మహారాజ (రెండవ) విక్రమేంద్ర (భట్టారక) వర్మ

(తుండి, చిక్కుళ్ళ శాసన ప్రదాత)


9. రెండో గోవిందవర్మ

10. నాలుగో మాధవవర్మ

(ఏకాదశాశ్వమేధ, క్రతు సహస్ర యాజి, పొలమూర్ శాసన ప్రదాత)

ఇందులో ముగ్గురు మాధవవర్మ నామధేయులు, ఒకే విధంగా పదకొండు అశ్వమేధాలు, సహస్ర క్రతువులను చేసినవారు; అందులో ఇద్దరు గోవిందవర్మ నామధేయుల కుమారులుగా ఏర్పడ్డారు. ఇది చాలా అసహజంగాను, అసమంజసంగాను ఉండడాన్ని ఎత్తి చూపి, డి.సి. సర్కార్ ఒకే విధమైన క్రతువులను జరిపినట్లు, సమాన లక్షణాలు కల్గిన మాధవవర్మ నామధేయులైన రాజులందరిని ఒకరుగా గుర్తించాలని, సూచించాడు. అంతే కాక, ఈపూర్ రెండవ శాసనాన్ని వేసిన మాధవవర్మ, అతని తండ్రైన దేవవర్మ విష్ణుకుండిన వంశం లోని ప్రధాన శాఖకు చెందినవారు కాదని, ఆయన సూచించాడు. ఆయన సూచించిన విష్ణుకుండిన వంశ క్రమం, ఈ విధంగా ఉంటుంది.


BRAOU



తుమ్మల గూడెం శాసనాలు వెలువడిన తర్వాత, విష్ణుకుండిన వంశ క్రమాన్ని నిర్మించడానికి, విశ్వసనీయమైన సాక్ష్యాధారాలు సమకూరాయి. తుమ్మల గూడెం రెండో శాసనం గోవిందవర్మ నుండి, ఆ శాసన ప్రదాతైన రెండో విక్రమేంద్రవర్మ వరకు, రాజుల పరంపరను పేర్కొనడంతో, డి.సి. సర్కార్ సూచించినట్లు; పై విధమైన వంశానుక్రమణిక నిర్ధారణైంది. తుమ్మల గూడెం మొదటి శాసనం, గోవిందవర్మ తండ్రి మాధవవర్మ అని, అతడు ఇంద్రవర్మ కుమారుడని, పేర్కొంటున్నది. అందుచేత, తుమ్మలగూడెం శాసనాలు అందిస్తున్న నిశ్చితమైన సాక్ష్యాధారాలను పరిగణన లోనికి తీసికొని విచారించినప్పుడు, పాలమూర్ శాసనం సమస్యాత్మకమౌతుంది. అందులో పేర్కొనబడిన రాజులకు వంశ వృక్షంలో స్థానాన్నేర్పర్చి, ఆచార్య వి.వి. మిరాషీ, శ్రీ. బి. యన్. శాస్త్రి, నేలటూరి వేంకట రమణయ్య, ఓరుగంటి రామచంద్రయ్య మొదలైన చరిత్రకారులు వివిధంగా వంశానుక్రమణికలను ఏర్పర్చారు. కాని, అవేవీ సంతృప్తికరమైనవి కావు. వాస్తవంగా పాలమూర్ శాసనం, కృతక (spurious) శాసనం; అది అందించే సమాచారం అసంబద్ధమైనది కావడమే, అందుకు కారణం. ఆ శాసనం విష్ణుకుండిన రాజ వంశ మంతరించిన తర్వాత, దానిని గూర్చిన వాస్తవ జ్ఞానం లేనివారు తమకు జ్ఞప్తి ఉన్న రీతిగా, అప్పటికే ప్రచారంలో ఉన్న జనశ్రుతులను చొప్పించి, రాజుల పరంపరను పేర్కొన్నారు. ఆ శాసనాన్ని సృష్టించడంలో సమకాలీన తూర్పు చాళుక్య శాసనాల ప్రణాళికను మక్కికి మక్కీగా అనుసరించి, శాసన పాఠాన్ని తయారుచేశారు. వాస్తవంగా, మాధవవర్మ అటువంటి శాసనాన్ని వెయ్యలేదని చెప్పనక్కరలేదు. కాని, నేడు లభిస్తున్నది మాత్రం, కృతక శాసనం; అసలు శాసనం అప్పటి రాజకీయ సంక్షోభాల్లో నష్టం కాగా, ఏదో వ్యవహారంలో అవసరం కావడం చేత, ఈ కృతక శాసనం సృష్టించబడిందని, ఇటీవలి పరిశోధనలు స్పష్టపరుస్తాయి. కనుక విష్ణుకుండినుల వంశ, కాలానుక్రమణికల నిర్మాణానికి, పాలమూర్ శాసనాన్ని పరిగణించాల్సిన పని లేదు.

పై పరిశీలన వలన, విష్ణుకుండిన వంశ క్రమాన్ని ఈ క్రింది విధంగా నిర్మించడం, యుక్తమని స్పష్టపడుతుంది:

BRAOU



BRAOU

6.7.3 : విష్ణుకుండినులు: కాలానుక్రమణిక

లోగడ, చరిత్రకారులు విష్ణుకుండినుల కాలానుక్రమాన్ని నిర్ణయించడానికి ప్రధానంగా పాలమూర్ శాసనంపై ఆధారపడ్డారు. విష్ణుకుండిన మాధవవర్మ శాసనంతోబాటు, పాలమూర్ గ్రామంలో తూర్పు చాళుక్య రాజైన, మొదటి జయసింహవల్లభుని శాసనం కూడ లభించింది. ఈ రెండు శాసనాలు, ఒకే వంశానికి చెందిన బ్రాహ్మణ కుటుంబం లోని వారికి అదే గ్రామాన్ని దానం చేసినట్లు తెల్పుతాయి. తూర్పు చాళుక్య శాసనం, ప్రత్యేకించి ఆ దాన గ్రహీతను (అనగా, దానం పొందిన వానిని), "పూర్వాగ్రహారికుడిని" ప్రసాదిస్తుంది. ఈ రెండు శాసనాలను ప్రకటించిన కొమర్రాజు లక్ష్మణరావ్‌గారు, రెండింటిలో దాన గ్రహీతల పేర్లను, వర్ణనలను సరిపోల్చి, తూర్పు చాళుక్య శాసన గ్రహీత, విష్ణుకుండిన శాసన గ్రహీత కుమారుడేనని, కనుక ఆ రెండు శాసనాల మధ్య అంతరం, సుమారొక అర్ధ శతాబ్ది కంటే అధికం కాదని నిర్ణయించారు. మాధవవర్మ వేసిన పాలమూర్ శాసనం పేర్కొనే రాజ్య సంవత్సరాన్ని, ఇతర తేదీ వివరాల ననుసరించి, ఆ శాసన కాలం క్రీ.శ. 594 అని, ఆ శాసనం మాధవవర్మ 148 వ రాజ్య సంవత్సరం నాటిది. కనుక, క్రీ.శ. (594-48)=546 లో, సింహాసన మధిష్ఠించినట్లు భావించి, రెండవ పులకేశి క్రీ.శ. 610లో తీరాంధ్రంపై దండెత్తినప్పుడు పరిపాలిస్తూ, అతని చేత ఈ మాధవవర్మ హతుడైనాడని నిర్ణయించారు. ఈ ఆధారంతో, అతని కంటె ముందు పరిపాలించిన రాజుల రాజ్య సంవత్సరాల సాయంతో, ఆయన విష్ణుకుండిన కాలానుక్రమాన్ని, ఈ క్రింది విధంగా నిర్ణయించాడు.

1. మాధవవర్మ	I	357 - 382
2. దేవవర్మ		382 - 407
3. మాధవవర్మ	II	407 - 444
4. విక్రమేంద్ర వర్మ	I	407 - 469
5. ఇంద్రవర్మ		469 - 496
6. విక్రమేంద్ర వర్మ	II	496 - 521
7. గోవిందవర్మ		521 - 546
8. మాధవవర్మ	II	546 - 610

కొమర్రాజు లక్ష్మణరావుగారు, తదితరులు నిర్ణయించిన వంశ, కాలానుక్రమణికలను విమర్శించి, డి.సి. సర్కార్ విష్ణుకుండిన కాలానుక్రమాన్ని నిర్ణయించడానికి, హరహ శాసనాన్ని ప్రధానమైన ఆధారంగా గ్రహించాడు. ఆ శాసనం, మౌఖరి వంశీయుడైన ఈశానవర్మ ఓడించగా, ఆంధ్రాధిపతి వింధ్యపర్వత గుహల్లోనికి పారిపోయి, తలదాచుకొన్నట్లు వర్ణిస్తుంది. ఈ ఆంధ్రాధిపతి పులమార్ శాసన ప్రదాతైన విష్ణుకుండిన మాధవవర్మేనట్లు, ఆ రాజు క్రీ.శ. 535 - 85 సంవత్సరాల నడుమ పరిపాలించినట్లు, డి.సి. సర్కార్, హెచ్. సి. రాయ్‌చౌదురీ అభిప్రాయపడ్డారు.

క్రీ.శ. 631 నాటి కొప్పరం శాసనం వలన, బాదామి చాళుక్య చక్రవర్తైన రెండో పులకేశి తీరాంధ్రాన్ని సంపూర్ణంగా జయించి, తన సోదరుడైన కుబ్జ విష్ణువర్ధనునికి వంశానుగతంగా పరిపాలించుకొనే హక్కుతో పట్టం కట్టినట్లు, తెలియవస్తుంది. కనుక, ఆ సంవత్సరంలో విష్ణుకుండిన రాజ్యం అంతరించిందని భావించి, డి.సి. సర్కార్ విష్ణుకుండిన కాలానుక్రమాన్ని ఈ క్రింది విధంగా సవరించారు:

1. విక్రమమహేంద్ర (లేక మొదటి విక్రమేంద్రవర్మ)	500 -520
2. గోవిందవర్మ	520 - 535
3. మాధవవర్మ	535 - 585
4. (మొదటి, లేక రెండవ) విక్రమేంద్రవర్మ	585 - 590
5. ఇంద్ర (భట్టారక) వర్మ	590 -620
6. (రెండో లేక మూడో) విక్రమేంద్రవర్మ	620 - 631

విష్ణుకుండినుల కాలానుక్రమణిక నిర్మాణానికి, తుమ్మల గూడెం శాసనాలు లభించిన తర్వాత, కొంత స్పష్టమైన ఆధారం లభించింది. తుమ్మలగూడెం (రెండవ) శాసనం, ఆ వంశం లోని చివరి వాడైన రెండవ విక్రమేంద్రవర్మ 11వ రాజ్య సంవత్సరం, శక సంవత్సరం 488 (క్రీ.శ. 566) కు సమానమైనదిగా పేర్కొంటుంది. కనుక, ఆరాజు క్రీ.శ. 570 వరకు పరిపాలించినట్లు, నిర్ణయించొచ్చు. అతని తండ్రైన ఇంద్ర (భట్టారక) వర్మ, రామతీర్థ శాసనాన్ని తన 27వ రాజ్య సంవత్సరంలో వేశాడు. అతని మునుమరుడైన రెండో విక్రమేంద్రవర్మ శాసనాల్లో, ఆ రాజు దాయాద వంశాలను ధ్వంసం చేసినట్లు వర్ణించిన అంశాన్ని, ఆ శాసనం ప్రస్తావించదు. కనుక, అతని 27వ

BRAOU

రాజ్య సంవత్సరం తర్వాత, అతడు దాయాద వంశాలతో చేసిన పోరాటాలకు కనీసం 3 సంవత్సరాల వ్యవధినిచ్చి, అతని పరిపాలన క్రీ.శ. 525 - 555 సంవత్సరాల నడుమ జరిగినట్లు నిర్ణయించొచ్చు.

ఇంద్ర భట్టారకుని తండ్రైన మొదటి విక్రమేంద్రవర్మ వేసిన శాసనాలేవీ, నేటికి లభించ లేదు. అతడు ఎంత కాలం పరిపాలించింది తెలియదు. అతని తండ్రైన మహారాజ మాధవవర్మ ఈపూర్ (మొదటి) శాసనాన్ని 37 వ రాజ్య సంవత్సరంలో వేశాడు. అతని పాలమూర్ శాసనం 48వ రాజ్య సంవత్సరాన్ని పేర్కొంటున్నా, ఆ శాసనం విశ్వసనీయం కాదని, నిశ్చయంగా తెలుస్తున్నది. కాని, సమకాలీన రాజకీయ పరిస్థితులను నిశితంగా సమీక్షిస్తే , ఆ రాజు సుమారు 50 సంవత్సరాల కాలం పరిపాలించి ఉండొచ్చునని తోస్తుంది. మొదటి విక్రమేంద్రవర్మ తండ్రి 50 సంవత్సరాలు, కుమారుడు 30 సంవత్సరాలు పరిపాలించినందున, అతని పరిపాలన క్రీ.శ. 520 - 525 సంవత్సరాల నడుమ, 5 సంవత్సరాల కాలం జరిగినట్లు, మహారాజ మాధవవర్మ క్రీ.శ. 470 నుండి 520 వరకు పరిపాలించినట్లు, నిర్ణయించొచ్చు. మహారాజ మాధవవర్మ తండ్రైన గోవిందవర్మ 37వ రాజ్య సంవత్సరం నాటి మొదటి తుమ్మలగూడెం శాసనం లభిస్తున్నది. కనుక, అతనికి 40 సంవత్సరాల పరిపాలనా కాలాన్ని - క్రీ.శ. 430 నుండి 470 వరకు - నిర్ణయించొచ్చు.

గోవిందవర్మ తండ్రి, తాతలైన మొదటి మాధవవర్మ, మొదటి ఇంద్రవర్మలను గూర్చిన వివరాలేమీ తెలియవు. పరిపాలనా కాలాన్ని నిర్ణయించడానికి ఏసాక్ష్యాధారమూ లేనప్పుడు, సగటున తరానికి 25 సంవత్సరాల కాలాన్ని చరిత్రకారులు పరిగణిస్తారు. ఆ విధంగా, ఆ రాజులిద్దరి పరిపాలనా కాలాన్ని 50 సంవత్సరాలుగా నిర్ణయించొచ్చు. ఈ విధమైన ప్రాతిపదికపై, విష్ణుకుండిన రాజుల కాలానుక్రమాన్ని ఈ క్రింది విధంగా నిర్ణయించొచ్చు.

1. మొదటి ఇంద్రవర్మ	- క్రీ.శ. 380 - 405
2. మొదటి మాధవవర్మ	- క్రీ.శ. 405-430
3. గోవిందవర్మ	- క్రీ.శ. 430 - 470
4. రెండో మాధవవర్మ	- క్రీ.శ. 470 - 520
5. మొదటి విక్రమేంద్రవర్మ	- క్రీ.శ. 520 - 525
6. రెండో ఇంద్ర (భట్టారక) వర్మ	- క్రీ.శ. 525 - 555
7. రెండో విక్రమేంద్ర (భట్టారక) వర్మ	- క్రీ.శ. 555 - 570

BRAOU

6.7.4 : విష్ణుకుండినులు : జన్మ భూమి, రాజధాని

విష్ణుకుండినుల రాజకీయ చరిత్రను అధ్యయనం చేయడానికి ముందుగా, వారి జన్మభూమిని గుర్తించి, వారు ఏ ప్రాంతంలో పరిపాలిస్తూ ప్రాబల్యాన్ని పొందారో, క్రమంగా ఏ వైపుగా విస్తరించారో నిర్ణయించడ మవసరం. కాని, వారి శాసనాలు ఏ ఒక్కటీ, వారి రాజధాని నగరాన్ని పేర్కొనవు. ఏ రెండు శాసనాలు ఒక ప్రదేశం నుండి వేసినవి కావు. అందుచేత, వారి స్వస్థలం, రాజధానీ నగరం చరిత్రకారుల ఊహావాదాలు (hypotheses) గానే మిగిలి ఉన్నాయి. వీటిలో ప్రధానమైన వాదాలను కొన్నింటిని, ఈ క్రింది వివరించడం జరిగింది.

1. చిక్కుళ్ళ శాసనాన్ని ప్రకటిస్తూ కీల్‌హార్న్ పండితుడు, ఈ రాజులు పరమ మహేశ్వరులని, శ్రీపర్వతస్వామి పాదానుధ్యాతులని చెప్పుకొన్నందున, వీరి ఆరాధ్య దైవం శ్రీశైలమల్లికార్జునుడు కావచ్చునని, వీరు వినుకొండ ప్రాంతాన్ని పరిపాలించి ఉండొచ్చునని భావించారు. వినుకొండ అనే ప్రాదేశిక నామం, "విష్ణుకుండిన" అనే వంశ నామం నుండి ఉత్పన్నమై, నేటికి నిల్చి ఉన్నదని, ఆ పట్టణం వారి రాజధాని కావచ్చునని, కీల్‌హార్న్ సూచనలను తర్వాతి చరిత్రకారులు సిద్ధాంతీకరించారు. కాని, శ్రీశైలానికి శ్రీపర్వతమనే నామాంతం, అక్కడి మల్లికార్జున - శివుని ఆలయం విష్ణుకుండిన కాలంనాడు ఉన్నట్లు చారిత్రక ఆధారాలేవీ లేవు. కీల్‌హార్న్ పండితుడు ఈ వంశాల గూర్చి రాసిన నాటికి, శ్రీపర్వత-నాగార్జునకొండ వెలుగు లోనికి రాలేదు. కనుక, ఆయన అలా భావించడం యుక్తమే. కాని, తర్వాత కాలంలో నైతం, శ్రీపర్వత -నాగార్జునకొండ బౌద్ధ క్షేత్రం కనుక, శ్రీ పర్వత స్వామిగా గుర్తించదగిన దేవుడు అక్కడ కన్పించడని, చరిత్రకారులు తమ అభిప్రాయాలను సవరించుకొనలేదు. సాధారణంగా, రాజ వంశీయులు తమ ఆరాధ్య దైవాలకు రాజధానీ నగరం లోనే ఆలయాలను కట్టిస్తారు; లేదా, వారి రాజధాని నగరాలకు సమీపం లోని ఏ ప్రసిద్ధ క్షేత్రంలోనైనా, వారి ఆరాధ్య దైవం వెలసి ఉంటాడు.

అయితే, ఇటీవల వెలుగు లోనికి వచ్చిన తుమ్మలగూడెం శాసనాలు, విష్ణుకుండిన రాజు గోవిందవర్మ బౌద్ధ ధర్మాన్ని అనుసరించి, పోషించినట్లు తెలియచేస్తున్నాయి. కనుక, శ్రీ పర్వతస్వామి శ్రీశైల మల్లికార్జునుడే కానక్కరలేదు. శ్రీపర్వతంపై వెలసినది బుద్ధ భగవానుడు కూడ కావచ్చు. వారి రాజధాని శ్రీపర్వత - నాగార్జునకొండ ప్రాంతం లోనే ఉండి ఉంటుంది.

2. తుమ్మలగూడెం శాసనాలు గోవిందవర్మ రాణైన పరమ (భట్టారికా) మహాదేవి, ఇంద్రపురం అనే పట్టణంలో ఒక మహావిహారాన్ని కట్టించినట్లు వివరిస్తాయి. ఆ శాసనాలు నల్గొండ జిల్లా, రామన్నపేట తాలూకా లోని తుమ్మలగూడెం అనే గ్రామంలో లభించాయి. ఆ గ్రామానికి సమీపంలో ఇంద్రపాలగుట్ట అనే కొండ సమీపంలో, ఒక శిధిల నగర అవశేషాలున్నట్లు, అదే ఇంద్రపురం లేదా ఇంద్రపాల నగరం విష్ణుకుండినుల రాజధానని, ఆ శాసనాలను ప్రకటిస్తూ శ్రీ B.N. శాస్త్రిగారు ప్రతిపాదించారు. అయితే, తుమ్మలగూడెం (రెండో) శాసనం, రెండో విక్రమేంద్రవర్మ "సింహ" అనే పేరుగల పల్లవ రాజును ఓడించి, తిరిగివస్తూ (రాజధానికి) మొదట ఇంద్రపురం చేరుకొన్నట్లు, అక్కడి పరమభట్టారికామహాదేవి విహారానికి ఒక గ్రామ దానం చేసినట్లు వివరిస్తుంది. కనుక, ఇంద్రపురం విష్ణుకుండినుల రాజధాని కాజాలదు. రెండో విక్రమేంద్రవర్మ పల్లవులతో కృష్ణకు దక్షిణంగా పోరాటం చేసి ఉంటాడని, యుద్ధ రంగం నుండి ఆ రాజు మొదట చేరుకొన్న ఇంద్రపురం కూడ కృష్ణా నదికి దక్షిణంగానే ఉండి ఉంటుందని తోస్తుంది. గోవిందవర్మ ఆ విహారానికి దానం చేసిన పెర్కొపర, ఏంబుదల గ్రామాలు నేటి ప్రకాశం జిల్లా చీరాల తాలూకాలో గుర్తించబడినవి. పరమభట్టారికా విహారం నల్గొండ జిల్లా , రామన్నపేట తాలూకాలో ఉంటే, ఈ విహారం లోని బుద్ధ భగవానుని పూజాదికాలకు చేసిన గ్రామ దానాలు ప్రకాశం జిల్లాలో ఉండడం విడ్డూరంగా తోస్తుంది.

పరమ భట్టారికా మహాదేవి శ్రీవృధ్వీమూల రాజ వంశంలో జన్మించినట్లు తుమ్మలగూడెం (రెండో) శాసనం వివరిస్తుంది. ఈ వంశీయులు నేటి గుంటూర్ జిల్లా సత్తెనపల్లి, గుంటూర్ తాలూకాలుగా వీర్పడ్డ ప్రదేశాన్ని, తాడికొండ ముఖ్య పట్టణంగా పరిపాలిస్తున్నట్లు భావించడానికి అవకాశముంది.

BRAOU

3. ఇటీవలి కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పురావస్తు శాఖ హైదరాబాద్ సమీపం లోని కీసరగుట్ట వద్ద త్రవ్వకాలు జరిపింది. అక్కడ క్రీ.శ. 5వ శతాబ్ది నాటి ఆలయాలు, విష్ణుకుండిన నాణేలు, ఒక శాసనం లభించినట్లు, వాటి ఆధారంతో అక్కడ విష్ణుకుండిన రాజధాని ఉన్నట్లు, వారు నిర్ణయించారు. క్రీ.శ. 5వ శతాబ్ది నాటి ఆలయాలు, వారు కనుగొన్న శాసనం, విష్ణుకుండిన రాజధానిని నిరూపించగల సాక్ష్యాధారాలు కావు. విష్ణుకుండిన నాణేలు నేటి ఆంధ్రప్రదేశ్‌లో అనేక చోట్ల విస్తారంగా లభించాయి. అవి ఏ ఒక్క ప్రదేశాన్ని విష్ణుకుండిన రాజధానిగా సూచించడం లేదు.

ప్రాచీన కాలంలో రాజధాని నగరాలు, ప్రజాబాహుళ్యం కలిగిన గ్రామాలు, లేదా వర్తక వాణిజ్యాలకు కేంద్రాలైన పట్టణాలు, లేదా వాటికి సమీపంలో ఉండి ఉండేవి. భూసారం, నీటి వసతి కల్గి, చక్కని వ్యవసాయాభివృద్ధికి అవకాశమున్న ప్రదేశాల్లోనే అటువంటి గ్రామాలు, పట్టణాలు వృద్ధిచెందడం సాధ్యం. క్రీ.శ. 5వ శతాబ్దిలో నల్గొండ జిల్లాలోకాని, హైదరాబాద్ పరిసరాల్లోకాని, అటువంటి వనరులున్నట్లు తోచదు.

విష్ణుకుండినుల నాణేలు విస్తారంగా నల్గొండ, కరీంనగర్, మెదక్ జిల్లాలలో లభించాయి. వీటిని బట్టి, వారి తొలి నివాసం నేటి తెలంగాణా ప్రాంతమని తెలియవస్తూనే ఉంది. అయితే, వారి రాజధాని నగరాన్ని ఖచ్చితంగా గుర్తించడం సాధ్యం కాకున్నా, నల్గొండ జిల్లాలోని ఏలేశ్వరం, మెదక్ జిల్లా లోని కొండాపూర్, కరీంనగర్ జిల్లా లోని ధూళికట్ట, కోటిలింగాల ప్రాంతాల్లో, ఏదో ఒకటి కావడానికి అవకాశముంది. ఈ ప్రదేశాలు కృష్ణా, మంజీరా, గోదావరి నదుల మైదానాలపై, రాజధానికి అనువైన పట్టణాలు అభివృద్ధి చెందడానికి, అనువైన వనరులను కలిగి ఉన్నాయి. ఈ ప్రదేశం పురాతన కాలం నాటి "అశ్మక" జనపదంతో సరిపోతుంది. వీటిలో ఏలేశ్వరం, అన్నింటి కన్న ఎక్కువ అర్హతలు కలిగి, విష్ణుకుండిన రాజధానిగా గుర్తించదగినట్లు కానవస్తున్నది.

BRAOU

6.7.5 : విష్ణుకుండినులు : రాజ్య స్థాపన

తొలి విష్ణుకుండిన రాజులు పూర్వపు అశ్మక జనపదంగా పిలువబడిన ఆంధ్ర దేశ భూభాగాన్ని పరిపాలించేవారని, నిశ్చయంగా చెప్పొచ్చు. కరీంనగర్, మెదక్ జిల్లాల్లో లభించిన విష్ణుకుండిన నాణాలు, ఈ అంశాన్ని ధ్రువపరుస్తాయి. శాతవాహన సామ్రాజ్యం అస్తమించిన తర్వాత ఏర్పడ్డ రాజకీయ కల్లోలంలో, ఈ ప్రాంతం వాకాటక సామ్రాజ్యంలో అంతర్భాగమైంది. ఆ వంశం లోని పత్సగుల్మ శాఖకు చెందిన రెండో వింధ్యశక్తి తన బాసిమ్ తామ్ర శాసనంలో, తన వంశ పూర్వుడైన మొదటి ప్రవరసేనుణ్ణి హారీతిపుత్ర, ధర్మమహారాజ బిరుదాలతో వర్ణించాడు. ఈ బిరుదాలు కుంతల, బనవాస దేశాలను పరిపాలించిన చుటు, కదంబ వంశీయులు ధరించినవి. మొదటి ప్రవరసేనునికి ఆ బిరుదాలను అన్వయించడం మాత్రమే కాక, స్పష్టంగా ఆ రాజు కుంతల దేశాన్ని జయించినప్పుడు, దాని సమీపం లోని అశ్మక (ఆంధ్ర) దేశాన్ని జయించడం సంభవం. బాసిమ్ శాసనంలో వింధ్యశక్తి తాను కూడ అశ్మక, కుంతల దేశాలకు అధిపతైనట్లు వర్ణించుకొన్నాడు. కనుక, అశ్మక దేశాన్ని పరిపాలిస్తున్న విష్ణుకుండినులు, వాకాటకుల సామంతులని స్పష్టమౌతుంది.

విష్ణుకుండిన వంశంలో తెలియవస్తున్న తొలి రాజులు మొదటి ఇంద్రవర్మ, మొదటి మాధవవర్మ. గోవిందవర్మ వేసిన తుమ్మలగూడెం శాసనం, వీరిని వరుసగా, అతని తాత, తండ్రులగాను, "పుహ

రాజు''గాను పేర్కొంటుంది. కాని, వీరిని గూర్చి వివరాలను ఆ శాసన మందించదు. వీరిని గూర్చి తెలుసుకొనేందుకు మరే ఇతర సాక్ష్యాధారం లేదు. ఈ రాజులను మహారాజులుగా పేర్కొనడం, కేవలం సాంప్రదాయికమైన గౌరవసూచకమేనని భావించొచ్చు.

వారి కంటె పూర్వుడు, ఈ వంశ నామానికి కారకుడైన ''విష్ణుకుండి'' అనే రాజు, రెండో ఇంద్రవర్మ వేసిన రామతీర్థ శాసనం నుండి తెలియవస్తాడు. ఇతడు ఎప్పటివాడో నిర్ణయించడానికి ఆధారాలు లేవు.

6.7.6 : విష్ణుకుండినుల చరిత్ర : గోవిందవర్మ క్రీ.శ. 430-470

విష్ణుకుండిన వంశంలో మొట్టమొదటి ప్రముఖుడైన రాజు, గోవిందవర్మ. ఇతడు లోగడ ఈపూర్ (మొదటి) శాసనం వలన తెలియవస్తున్నాడు. ఆ శాసనం, ఇతడు అనేక సామంతుల పూజలను అందుకొన్నవాడని, అపారంగా గో, హిరణ్య, భూమి దానాలను చేసినవాడని వివరిస్తుంది. ఇటీవల లభించిన తుమ్మలగూడెం శాసనం మరింత వివరంగా, ఈ రాజు నిరంతరం ప్రజారంజనే ధ్యేయంగా రాజ్యాన్ని పరిపాలించినవాడు; విద్వాంసులు, శూర జనులు, ఉన్నత కులాలకు చెందినవారిని ఆదరించేవాడు; శౌర్య, ధైర్య, ప్రతాపానుభావాల చేత, అంటే సామ, దాన, భేద, దండోపాయాలతో, అన్య సామంతులను వశపర్చుకొని, రాజ్య విస్తరణ చేసినవాడని, అతని వ్యక్తిత్వాన్ని, రాజనీతిని వివరిస్తుంది. నిరంతర పఠన, శ్రవణ, చింతనల వలన అతడు బుద్ధ ధర్మాన్ని గ్రహించి, అనుసరించే వాడని, తన సమస్త సంపదలను, పుణ్యాన్ని లోక హితం కొరకు త్యాగం చేసేవాడని, విశేషంగా అతని ధార్మిక జీవనాన్ని ఈ శాసనం కీర్తిస్తుంది.

విష్ణుకుండినులు ఒక స్థానిక రాజ్య పాలకుల నుండి, సామ్రాజ్య నిర్మాతలు కావడానికి పునాది వేసినవాడు, గోవిందవర్మ. ఈతని పరిపాలనా కాలం, క్రీ.శ. 430 నుడి 470. ఈ కాలంలో ప్రాచీన పల్లవ వంశం లోని మూడో స్కందవర్మ కృష్ణా నదికి దక్షిణంగా పరిపాలిస్తున్న ఆనంద గోత్రుల నోడించి, తన సామ్రాజ్యాన్ని విస్తరింపజేసినట్లు, అతని ఓంగోడ్ (మొదటి) శాసనం వలన తెలియవస్తుంది. ఆ తర్వాత శాలంకాయన రాజ్యం స్కందవర్మ, రెండవ (విజయ) నందివర్మ నడుమ చెలరేగిన అంతర్యుద్ధం వలన, బలహీనమై అంతరించింది. ఆ సమయంలో, కృష్ణా-గోదావరి నదుల నడుమ ఉన్న వేంగి దేశంపై కూడ, పల్లవుల విస్తరణకు అవకాశమేర్పడింది. అంతట, గోవిందవర్మ విష్ణుకుండిన రాజ్యాన్ని తూర్పు తీర పర్యంతంగా విస్తరించి, వేంగి దేశాన్ని ఆక్రమించాడు. తర్వాత ఆ నదికి దక్షిణంగా పరిపాలిస్తున్న శ్రీ పృథ్వీమూల రాజ వంశంతో మైత్రి వహించి, ఆ వంశానికి చెందిన మూలరాజు కుమార్తె, పరమమహాదేవిని వివాహం చేసుకొన్నాడు. అప్పటికి శ్రీ పృథ్వీమూల రాజ వంశం బహుశా పల్లవులకు సామంత రాజ్యం కావచ్చు. గోవిందవర్మ తన శౌర్య, ధైర్య, ప్రతాపానుభవాలచేత, అన్య సామంత రాజులను లోబర్చుకొన్నట్లు, అతని తుమ్మలగూడెం శాసనం వర్ణించడం, అతడు పృథ్వీమూల రాజ వంశాన్ని లోబర్చుకొనడంలో స్పష్టమౌతుంది.

విష్ణుకుండిన - శ్రీపృథ్వీమూల వంశాల మైత్రి, విష్ణుకుండిన సామ్రాజ్యం నిల్చినంత కాలం నిల్చింది. వీరు లోగడ, పల్లవ-శాలంకాయన పోరాటాల్లో కీలకమైన పాత్ర వహించినట్లు తోస్తుంది. పృథ్వీమూలుడనే రాజు వేసిన గోదావరి తామ్ర శాసనం వలన, ఇంతకు పూర్వం ఆ రాజు మాత్రమే

BRAOU

తెలియవస్తున్నాడు. ఆ తర్వాత అతని కుమారుడైన హరివర్మ వేసిన కట్టుచెరువు తామ్ర శాసనం వలన, ఇటీవల వెలువడిన కొండవీడు తామ్ర శాసనం వలన, ఈ రాజులను గూర్చి మరిన్ని వివరాలు సమకూరుతున్నాయి. పృథ్వీమూలుని తండ్రి ప్రభాకర మహారాజు, తాత మూలరాజని ఈ శాసనాలు పేర్కొంటున్నాయి. ఈ వంశం కృష్ణా నదికి దక్షిణంగా, నేటి గుంటూర్ జిల్లా లోని సత్తెనపల్లి, పల్నాడ్, గుంటూర్ తాలూకాలుగా ఏర్పడిన ప్రదేశాన్ని పరిపాలించేది. ఈ శాసనాన్ని వేసిన పృథ్వీమూలుణ్ణి, రెండో విక్రమేంద్రవర్మ వేసిన తుమ్మల గూడెం (రెండో) శాసనం, విష్ణుకుండిన వంశానికి అత్యంత విశ్వాసపాత్రుడైన సామంత రాజుగా ప్రశంసించింది. బహుశ: ఈ పృథ్వీమూలుని తాతైన మూలరాజు, గోవిందవర్మకు సమకాలికుడు, అతని కుమార్తె నిచ్చి వివాహం చేసినవాడని భావించొచ్చు.

శ్రీపృథ్వీమూల రాజ వంశంతో ఏర్పడ్డ సంబంధం, గోవిందవర్మ పల్లవుల అధిపత్యాన్ని ప్రతిఘటించటానికి తోడ్పడింది. క్రీ.శ. 436లో సింహాసన మధిష్ఠించిన రెండో సింహవర్మ, తన సోదరుడైన విష్ణుగోపుని, యువ మహారాజు హోదాలో, దక్షిణాంధ్ర దేశంలో నియమించాడు. యువ మహారాజు విష్ణుగోపుడు శాలంకాయన రాజ్యాన్ని నిర్మూలించటంతో, రెండో సింహవర్మ క్రీ.శ. 455 నాటికి, నాదత్తపాటి విషయం వరకు, పల్లవ సామ్రాజ్యాన్ని విస్తరింపజేశాడు. అంతట, గోవిందవర్మ వేంగి దేశాన్ని ఆక్రమించి, పల్లవులను కృష్ణా మైదానం నుండి తరిమివేశాడు. అతడి తుమ్మలగూడెం (మొదటి) శాసనం, అతడి రాణైన పరమమహాదేవి ఇంద్రపురంలో కట్టించిన మహా విహారానికి, పెణ్కపర, ఎంబుదల అనే గ్రామాలను దానం చేస్తూ వేశాడు. ఈ గ్రామాలు నేటి ప్రకాశం జిల్లా, చీరాల తాలుకా లోనివిగా గుర్తించొచ్చు. ఈ గ్రామ దానం గోవిందవర్మ కృష్ణా నదిని దాటి, దక్షిణంగా తన సామ్రాజ్యాన్ని విస్తరింపజేశాడని, పల్లవులను బాగా దక్షిణంగా తరిమివేశాడని, నిరూపిస్తాయి. తుమ్మల గూడెం శాసనం అతని 36వ రాజ్య సంవత్సరం, అంటే క్రీ.శ. 476 నాటిది. ఈ రాజ్య విస్తరణ, విష్ణుకుండినులకు గొప్ప ప్రతిష్ఠను, ఆర్థిక, సైనిక ప్రాబల్యాన్ని చేకూర్చిందని భావించొచ్చు.

BRAOU

క్రీ.శ. అయిదో శతాబ్ది తుది పాదం నాటికి, వాకాటక సామ్రాజ్యం సంక్షోభంలో పడింది. ఆ వంశం లోని ఉభయ శాఖలు పరస్పరం విధ్వంసక పోరాటాలను చేస్తున్నాయి. మహాకవి దండి తన **"దశకుమార చరిత్ర"** లో వివరించిన "విశ్రుత చరిత్ర" అనే కథ, విదర్భ కేంద్రంగా కలిగి, అనేక జనపదాలను ఆక్రమించిన ఒక మహా సామ్రాజ్యం సామంతుల్లో ఒకడైన అశ్మక దేశ రాజు, మరికొందరిని కూడగట్టుకొని దండెత్తినందువలన, పతనమైన సంఘటనలను వివరిస్తుంది. ఆచార్య మిరాశీ ఈ కథను హరిషేణుని నాటి వాకాటక సామ్రాజ్య మంతరించిన సంఘటనలుగా భావించాడు. అందుకు భిన్నంగా, సమకాలీన రాజకీయ పరిస్థితి వలన, వత్సగుల్మ శాఖకు చెందిన హరిషేణుడే (అశ్మక దేశంపై ఆధిపత్యాన్ని కల్గి) వాకాటక ప్రధాన శాఖకు చెందిన రెండవ పృథ్వీషేణుని ఓడించిన సంఘటనలను ఈకథ వివరిస్తుందని, హరిషేణుని అజంతా శాసనం అతనికి లోబడిన సామంత రాజ్యాల్లో ఆంధ్ర దేశాన్ని కూడ పేర్కొంటుంది. ఆనాడు అశ్మక నుండి ఆంధ్ర దేశం యావత్తును పరిపాలిస్తున్నవారు విష్ణుకుండినులే. వారు హరిషేణుని షష్ఠాన వాకాటక ప్రధాన శాఖను నిర్మూలించారని, దక్షిణాపథం యావత్తు విస్తరించిన మహా సామ్రాజ్యానికి తొలిన్ని చక్రవర్తిగా చేశారని, ఈ ఇతివృత్తం నుండి గ్రహించొచ్చు.

6.7.6.1 : రెండో మాధవ వర్మ (క్రీ.శ. 470-520)

గోవింద వర్మ కుమారుడైన రెండో మాధవ వర్మ, తండ్రి తర్వాత సింహాసన మధిష్ఠించాడు. అతడు మహావీరుడు, విజేత. తన యుద్ధ విజయాలను ప్రకటిస్తూ, పదకొండు అశ్వమేధాలను చేసినవాడు. గోవిందవర్మ బౌద్ధ ధర్మాచరణను బట్టి, సాధు స్వభావం కలిగినవాడని, అతని కాలంలో రాజకీయ, సైనిక విషయాల్లో మాధవవర్మ చురుకుగా పాల్గొని, విష్ణుకుండిన వంశాన్ని ప్రబలంగాను, ప్రతిష్ఠాత్మకంగాను రూపొందించాడని తోస్తుంది. అందుచేతనే, ఆ రాజు పదకొండు అశ్వమేధాలను చేయగలిగిన యుద్ధ విజయాలను సాధించాడని ఊహించొచ్చు.

మాధవ వర్మ ఒక వాకాటక రాకుమార్తెను వివాహం చేసుకొన్నట్లు, విష్ణుకుండిన శాసనాలు వివరిస్తాయి. ఆమె ఎవరైనదీ, తెలియరాదు. కాని, హరిషేణుడు, తన సామ్రాజ్య విస్తరణకై మాధవవర్మతో బలీయమైన సంబంధాన్నేర్పర్చుకొనేందుకు ఆ వివాహాన్ని చేసినట్లు తోస్తుంది. వారి సామంతుల్లో అగ్రగణ్యుడైన విష్ణుకుండిన మాధవ వర్మ, అత్యంత చాకచక్యంతో ఆ సామ్రాజ్యాన్ని ఆక్రమించాడు. ఆ సామ్రాజ్యంలో చేరిన శరభపురీయ (కోసల), రాష్ట్రకూట (దక్షిణ మహారాష్ట్ర), మొదలైన రాజ్యాలను లోబర్చుకొని, మాధవ వర్మ తన సార్వభౌమత్వాన్ని సుస్థిరపర్చుకొన్నాడు. శరభ పురీయ వంశీయుడైన నరేంద్రుడు (క్రీ.శ. 500 - 525), మాధవ వర్మ సార్వభౌమత్వాన్ని అంగీకరించాడని భావించొచ్చు. దక్షిణ మహారాష్ట్రలో ఖానాపూర్ వద్ద మాధవ వర్మ వేసిన ఒక తామ్ర శాసనం లోని కొంత భాగం లభించింది. నాగ్‌పూర్, పౌనార్ (విదర్భ) నాసిక్ (అపరాంత) మొదలైన అనేక ప్రాంతాల్లో, విష్ణుకుండిన నాణేలు విస్తృతంగా లభించాయి. కనుక, తుమ్మల గూడెం (రెండో) శాసనం వర్ణించినట్లు, నర్మదా నది నుండి దక్షిణంగా ఉన్న దక్కన్ పీఠభూమి సమస్తం మాధవవర్మ సామ్రాజ్యంలో చేరినట్లు గ్రహించొచ్చు.

మాధవవర్మ దక్కన్ పీఠభూమిపై తన సార్వభౌమాధిపత్యాన్ని సుస్థిరం చేసుకొంటున్న సమయంలో, దక్షిణాంధ్ర దేశంలో పల్లవుల ప్రాబల్యం పెరిగింది. మాంగడూర్, చురా తామ్ర శాసనాలు కర్మ రాష్ట్రంలో గ్రామ దానాలను పేర్కొని, కృష్ణా తీరం వరకు, పల్లవుల ప్రాబల్యం విస్తరించినట్లు సూచిస్తాయి. మాధవ వర్మ తన 33వ రాజ్య సంవత్సరంలో వేసిన వేల్పూర్ శిలా శాసనం, అతడు తన 33వ రాజ్య సంవత్సరంలో కృష్ణా నదికి దక్షిణంగా, వేల్పూర్ వద్ద తన సేనలతో విడిసినట్లు తెలియజేస్తుంది. అంతకు పూర్వమే, కొన్ని సంఘర్షణలు జరిగినట్లు, తుదకు ఆ రాజే స్వయంగా పల్లవుల ఆధిపత్యాన్ని నిర్మూలించడానికి కృత నిశ్చయంతో వచ్చినట్లు, సూచిస్తుంది.

వేల్పూర్ యుద్ధంలో మాధవ వర్మ తన ఆశయాన్ని నెరవేర్చుకొన్నట్లు భావించొచ్చు. క్రీ.శ. 508 నాటి ఆ యుద్ధం తర్వాత, తిరిగి క్రీ.శ. 547లో మూడో కుమార విష్ణువు చందలూర్ శాసనంతో తిరిగి కర్మ రాష్ట్రంలో గ్రామ దానం చేసే వరకు, పల్లవుల ఆధిపత్యం వెన్నా నదిని దాటి ఉత్తరంగా విస్తరించినట్లు కన్పించదు. పల్లవుల విస్తరణను అరికట్టేందుకు మాధవవర్మ, తన కుమారుడైన దేవవర్మను దక్షిణాంధ్ర దేశంలో నియమించి, ఒక ఉప శాఖను ఏర్పర్చినట్లు కానవస్తుంది. దేవవర్మ కుమారుడైన మాధవవర్మ, తన ఈపూర్ (రెండో) శాసనంలో, తాను త్రికూట మలయాధిపుడనని వర్ణించుకొన్నాడు. ఈ త్రికూటం, నేటి గుంటూర్ జిల్లా లోని నర్సరావుపేట తాలూకా లోని కోటప్పకొండని చరిత్రకారులు గుర్తించారు. బహుశః వేల్పూర్ ముఖ్య పట్టణంగా ఈ త్రికూట దేశమేర్పడి ఉండొచ్చు. ఆ శాసనంలో మాధవవర్మ తన తండ్రైన దేవవర్మ క్షత్రియులను

BRAOU

అణచివేయడంలో తన పరాక్రమాన్ని ప్రకటించినట్లు, వర్ణించాడు. ఈ క్షత్రియులు పల్లవులేనని, ఈ ఉప శాఖ నాలుగు దశాబ్దాల పాటు పల్లవుల వ్యాప్తిని నిలువరించిందని, నిస్సంశయంగా చెప్పొచ్చు.

పల్లవులపై విజయం సాధించిన తర్వాత రెండో మాధవవర్మ, తూర్పు దిశగా ఉన్న కళింగ-ఆంధ్ర జనపదాలను జయించే ఉద్దేశంతో బయలుదేరాడు. అతడు తన 37వ రాజ్య సంవత్సరంలో గోదావరీ తీరాన ఉన్నప్పుడు, తన ఈపూర్ (మొదటి) శాసనాన్ని వేశాడు. పాలమూర్ శాసనం కూడ, ఇదే విధంగా ఆ రాజు గోదావరీ తీరాన ఉన్నప్పుడు వేసినదే. కాని, అది 47 వ రాజ్య సంవత్సరం నాటిది. ఈ శాసనం కృతకమైనదిగా నిర్ధారించడం జరిగింది. కనుక, మాధవవర్మ పాలమూర్ శాసనం లోని గ్రామ దానాన్ని కూడ, తన 37వ రాజ్య సంవత్సరం లోనే చేసినట్లు భావించడం, యుక్తం.

మాధవ వర్మ కళింగ దేశంలో పిష్టపుర ముఖ్య పట్టణంగా పరిపాలిస్తున్న రాముకాశ్యప వంశీయులను ఓడించి, లోబర్చుకొన్నాడు. ఆ వంశం లోని రణదుర్జయుడు, రెండో మాధవవర్మ సమకాలికుడు. అతడు తన కుమారునికి విక్రమేంద్రుడనే పేరు నుంచాడు. అనాటి రాజకీయాల్లో సామంత రాజులు తమ కుమారులకు సార్వభౌముల పేర్లను ఉంచడం, ప్రసిద్ధం. రణ దుర్జయుడు మాధవవర్మ చేతిలో ఓడి, విష్ణుకుండిన సామంతుడైనట్లు, మొదటి విక్రమేంద్రవర్మ పేరును తన కుమారునికి ఉంచినట్లు భావించొచ్చు.

పిష్టపుర రాజ్యానికి ఆవల ఉన్న దేవరాష్ట్ర (నేటి విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలలో చేరిన భూభాగం)లో వాసిష్ఠ వంశీయులు పరిపాలిస్తున్నారు. వారి రాజ చిహ్నం "శంఖం", కొన్ని విష్ణుకుండిన నాణేలపై కానవస్తుంది. మాధవవర్మ పిష్టపురాన్ని జయించిన తర్వాత, దేవరాష్ట్రను వాసిష్ఠుల నుండి జయించి, విష్ణుకుండిన సామ్రాజ్యంలో చేర్చాడని, వారి రాజ లాంఛనాన్ని స్వంతం చేసుకొని, తన నాణేలపై ముద్రించినట్లు గ్రహించొచ్చు.

శాతవాహన సామ్రాజ్య మస్తమించిన తర్వాత, దక్కన్ పీఠభూమిపై, ఉత్తరాన విదర్భ, పశ్చిమాన అపరాంత, తూర్పున కళింగ వరకు విస్తరించిన ఆంధ్ర సామ్రాజ్యాన్ని స్థాపించినవాడు, విష్ణుకుండిన రెండో మాధవవర్మ. ఇతని శౌర్య పరాక్రమాలు, ధార్మిక వర్తన, న్యాయపరిపాలన గురించి, అనేక గాథలు ప్రజల్లో వ్యాపించి, మధ్య యుగాల నాటి శాసనాల్లోను, తెలుగు సాహిత్యంలోను చోటు చేసుకొన్నాయి. మధ్య యుగం లోని కొన్ని రాజ వంశాలు మాధవ వర్మ తమ మూల పురుషుడని వర్ణించుకొన్నాయి. కాకతీయుల కాలం నాటి కొన్ని ఇతిహాస రచనలు, **"సిద్ధేశ్వర చరిత్ర"** వంటివి, కాకతీయ వంశాన్ని కూడ ఇదే విధంగా వివరించాయి. ఇవన్నీ చారిత్రకంగా దుర్దార్ధమైనవిగా అంగీకరించ దగినవి కాకున్నా, ఆ రాజు ప్రఖ్యాతిని, ప్రజాభిమానాన్ని స్పష్టపరుస్తాయి.

మాధవ వర్మ తన ఈపూర్ (మొదటి) శాసనంలో ఏకాదశాశ్వమేధాలు, సహస్రక్రతువులు (అగ్ని ష్టోమాలు), హిరణ్యగర్భ మహాదానమూ చేసినట్లు చెప్పుకొన్నాడు. పదకొండు అశ్వమేధ యాగాలను చేసిన రాజు, యావద్భారతదేశ చరిత్రలో ఇతడొక్కడే. అతని మనుమలైన మాధవ వర్మ వేసిన ఈపూర్ (రెండో) శాసనం, ఇంద్రవర్మ వేసిన రామతీర్థ శాసనం కూడ, ఈ రాజు జరిపిన క్రతువులు, యాగాలను ఇదే విధంగా వర్ణించాయి. కాని, రెండో విక్రమేంద్ర వర్మ తన చిక్కుళ్ళ శాసనంలో ఇతన్ని గూర్చి వర్ణిస్తూ, హిరణ్యగర్భ మహాదానాన్ని వదిలి వేసి, వాజపేయ, పురుషమేధ, పౌండరీక, రాజసూయ, బహుసువర్ణ మొదలైన అనేక దుష్కర క్రతువులను నిర్వహించినట్లు పేర్కొంటుంది. అతని తుండి శాసనం ఈ క్రతువులన్నింటిని పదకొండు సార్లు జరిపి, పరమేష్ఠి (బ్రహ్మదేవుడు)

BRAOU

అయినట్లు, దేవాదిదేవుడైనట్లు వర్ణించింది. రెండో విక్రమేంద్ర వర్మ కాలం లోనే, ఈ రాజు వ్యక్తిత్వాన్ని అపరిమితమైన భక్తి గౌరవాలతో, అతిశయోక్తులతో వర్ణించటం ప్రారంభమైనట్లు, ఈ వర్ణనల వలన గ్రహించొచ్చు. రెండో విక్రమేంద్ర వర్మ అనేక కఠిన సమస్యలను ఎదిరిస్తూ, తన ముత్తాత ధైర్యసాహసాలను ఆదర్శంగా గ్రహించి, ఉత్తేజం పొందడానికి ప్రయత్నించడంలో ఈ ఆరాధనా భావ మేర్పడినట్లు తోస్తుంది.

6.7.6.2 : మొదటి విక్రమేంద్ర వర్మ (క్రీ.శ. 520 - 525)

రెండో మాధవ వర్మ అనంతరం, వాకాటక మహాదేవి వలన కలిగిన అతని కుమారుడు మొదటి విక్రమేంద్ర వర్మ సింహాసన మధిష్ఠించాడు. మాధవ వర్మ సుదీర్ఘ పాలన తర్వాత, మొదటి విక్రమేంద్ర వర్మ ముదిమి వయసులో రాజ్య పాలన ప్రారంభించి, స్వల్ప కాలమే పరిపాలించి ఉంటాడని తోస్తుంది. అందుచేత, ఇతని శాసనాలేవీ నేటి వరకు లభించ లేదు. ఇతని పరిపాలనా విశేషాలు తెలియరావు.

మొదటి విక్రమేంద్ర వర్మ గూర్చి, అతని కుమారుడు రెండో ఇంద్ర వర్మ, మనుమడు రెండో విక్రమేంద్రవర్మ, తమ శాసనాల్లో, అతడు విష్ణుకుండి, వాకాటక వంశాలు రెండింటికి అలంకార ప్రాయంగా జన్మించాడని, పరమ సౌగతుడు (బౌద్ధుడు), మహాకవి అని వర్ణిస్తాయి. అయితే, అతని కావ్యాలేవీ లభించ లేదు. ఈ వర్ణనలు మొదటి విక్రమేంద్ర వర్మ సౌమ్యమైన ప్రవర్తన కలిగిన వాడని, యుద్ధ విజయాల పట్ల, రాజ్య పాలన పట్ల ఆసక్తి లేనివాడని, వ్యక్తం చేస్తున్నాయి. అలాగే, విష్ణుకుండిన శాసనాలేవీ ఇతనికి అటువంటి ప్రఖ్యాతిని ప్రసాదించవు. అతని సౌమ్య ప్రవర్తన సామంతులు స్వతంత్రించడానికి చక్కని అవకాశాల నేర్పర్చిందని, అందుచేతనే అతని కుమారుడు రెండో ఇంద్ర వర్మ సామ్రాజ్య ప్రతిష్ఠను నిలపడానికి అనేక పోరాటాలను చేయవలసొచ్చిందని తోస్తుంది.

6.7.6.3 : రెండో ఇంద్ర (భట్టారక) వర్మ (క్రీ.శ. 525-555)

మొదటి విక్రమేంద్ర వర్మ తర్వాత అతని కుమారుడైన రెండో ఇంద్ర వర్మ సింహాసన మధిష్ఠించి, సుమారు 30 సంవత్సరాలు పరిపాలించాడు. ఇతని తండ్రి సౌమ్య స్వభావం వలన, సామ్రాజ్య వ్యవస్థ బలహీనమైందని, అందుచేత, స్వతంత్రిస్తున్న సామంతులను అణచి, వంశ ప్రతిష్ఠను నిల్పడానికి ఇంద్ర వర్మ అన్ని వైపుల అవిశ్రాంతంగా పోరాటాలు చేసినట్లు కానవస్తుంది. విష్ణుకుండిన వంశ చరిత్రలో రెండో మాధవ వర్మ తర్వాత, అత్యంత ప్రముఖుడైన విజేత, సామ్రాజ్య వ్యాప్తి చేసినవాడు, ఇతడే. దక్కన్ పీఠభూమిపై విష్ణుకుండిన సార్వభౌమత్వాన్ని తిరిగి నెలకొల్పడమే కాక, వింధ్య పర్వతాల ఆవల గంగా, యమునా మైదానం పైకి కూడ ఆంధ్రుల ఆధిపత్యాన్ని వ్యాపింపజేయడానికి, రెండో ఇంద్ర వర్మ పోరాటాలను చేశాడు.

ఇంద్ర వర్మ తన రామతీర్థ శాసనంలో, అనేక చతుర్దాంత యుద్ధాల్లో విజయాన్ని సాధించినట్లు ప్రకటించుకొన్నాడు. అతని కుమారుడైన రెండో విక్రమేంద్ర వర్మ కూడ, అతన్ని అదే విధంగా ప్రశంసించాడు. అంతే కాక, ఆ రాజు తన విజయాలతో అశేష చక్రవర్తి క్షేత్రాన్ని ఆక్రమించాడని, దాయాద వంశాలను నిర్మూలించాడని కూడ, రెండో విక్రమేంద్ర వర్మ శాసనాలు వర్ణిస్తాయి.

సమకాలీన ఉత్తర భారతదేశంలో కన్యాకుబ్జ (కనోజ్) రాజధానిగా పరిపాలించిన మౌఖరీ వంశంలోని ఈశాన వర్మ ఒక "ఆంధ్రాధిపతి" ని ఓడించినట్లు, అతడు వింధ్య పర్వతాల్లోని గుహల్లో చొరబడి, ప్రాణాలను కాపాడుకొన్నట్లు, ఆ వంశీయుల హరాహా, ఔనాశర్ శిలా శాసనాలు వర్ణిస్తాయి.

BRAOU

లోగడ చరిత్రకారులు ఈ "ఆంధ్రాధిపతి" పాలమూర్ శాసనాన్ని వేసిన (నాలుగో) మాధవ వర్మని భావించారు. పాలమూర్ శాసనం కృతకమైంది. విష్ణుకుండిన వంశ, క్రతు సహస్రాలను చేసిన మాధవ వర్మ నామధేయులందరు ఒకరేనని, పైన నిర్ధారణ చేయబడింది. ప్రస్తుతం అంగీకరించబడిన విష్ణుకుండిన వంశ, కాలానుక్రమణికలు ఈశాన వర్మకు సమకాలికుడైన ఆంధ్రాధిపతి, రెండో ఇంద్ర వర్మగా ఏర్పరుస్తాయి.

6.7.6.4 : విష్ణుకుండినులు : చతుర్దంత యుద్ధాలు

రెండో ఇంద్ర వర్మ వలెనే, పృథ్వీమూలుని గోదావరి తామ్ర శాసనం, తూర్పు గంగ వంశీయుడైన ఇంద్ర వర్మ జిర్జింగి తామ్ర శాసనం, మరికొందరు అప్రఖ్యాతులైన రాజుల శాసనాలు, చతుర్దంత యుద్ధాల్లో ఆయా రాజులు విజయాలను సాధించినట్లు పేర్కొంటున్నాయి. "చతుర్దంత" అనగా నాలుగు దంతాలు కలిగిన ఏనుగులు. అవి వాస్తవంగా ఉండవు; పురాణ వాఙ్మయం ఎనిమిది దిగ్గజాలను అటువంటివిగా వర్ణిస్తాయి. ఈ శాసనాల్లోని "చతుర్దంత యుద్ధాలు" గొప్ప గజ బలం కలిగిన సేనలు, అటువంటి సేనలు కలిగిన రాజులకు జరిగిన పోరాటాలని గ్రహించాలి. ఈ పోరాటాలు విష్ణుకుండిన ఇంద్ర వర్మకు, తక్కిన రాజులతో జరిగినవా? లేక, అతడు వీరందరితో కలిసి, వేరెవరితోను చేసినవా? అనే వివాదాలు చరిత్రకారుల నడుమ ఏర్పడ్డాయి.

చతుర్దంత పోరాటాలను గూర్చి పృథ్వీమూలుని గోదావరీ తామ్ర శాసనం -- ఇంద్ర భట్టారకుని నిర్మూలించే ఉద్దేశంతో పలువురు రాజులు ఒక సంఘటనగా ఏర్పడి, ఉత్సాహంతో వచ్చినప్పుడు "సుప్రతీకం" అనే ఏనుగు పైనుండి "కుముదం" అనే ఏనుగును పడగొట్టిన ఇంద్రాధిరాజు, తన తల్లిదండ్రుల పుణ్యం కొరకు ఒక బ్రాహ్మణాగ్రహారాన్ని ప్రదానం చేయదల్చి పృథ్వీమూలుని అర్థించాడు; అతని కోరికను మన్నించి, పృథ్వీమూలుడు అగ్రహారాన్ని దానం చేస్తూ, ఆ శాసనాన్ని వేశాడని వివరిస్తుంది. సుప్రతీకం ఈశాన్య దిక్కుకు, కుముదం నైఋతి దిశకు సంకేతాలు. కనుక, ఆ దిశల్లో రాజ్యాలను పాలిస్తున్న ఇద్దరు రాజుల నడుమ, ఈ శాసనం ప్రస్తావించే పోరాటాలు జరిగినాయని గ్రహించొచ్చు.

ఇటీవలి కాలంలో వెలువడిన తుమ్మలగూడెం (రెండో) శాసనం, పృథ్వీమూల వంశీయులు తరతరాల నుండి విష్ణుకుండిన వంశంతో సంబంధ బాంధవ్యాలను కల్గిన ముఖ్య సామంత వంశమనీ పలువురు సామంతులు సామ్రాజ్యాధిపత్యాన్ని వ్యతిరేకించి స్వతంత్రించినా, ఆ వంశీయులు భక్తివిశ్వాసాలతో సేవించారని, వివరిస్తుంది. ఆజ్ఞాపైన మూలరాజు, తన సార్వభౌమ వంశం (విష్ణుకుండిన వంశం) తీవ్ర సంక్షోభంతో ఉన్నప్పుడు ఉద్ధరించిన వాడని, పేర్కొంటూందది. అతడు గోదావరీ తామ్ర శాసనాన్ని వేసిన పృథ్వీమూలుడేనని నిస్సంశయంగా చెప్పొచ్చు.

ఇంద్ర భట్టారకునిపై ఒక శత్రు రాజుల సమాఖ్యను ఏర్పర్చి, కుముదంపై ఎక్కి వచ్చిన రాజెవరో, ఇప్పుడు విచారించాల్సి ఉంది. విష్ణుకుండినుల పరిపాల లోని ఆంధ్ర దేశానికి నైఋతి దిశగా ఉన్నది, బాదామీ చాళుక్యుల రాజ్యం. ఆ వంశం లోని రెండవ పులకేశి తీరాంధ్ర దేశంపై దండెత్తి, పిష్టపుర (పిఠాపుర), కొనాళ (కొల్లేరు) వద్ద జరిగిన యుద్ధాల్లో గెలుపొందినట్లు, అతని ఐహోళె (Aihole) శాసనం తెలుపుతుంది. అతడు తీరాంధ్రాన్ని ఒకే దిగ్విజయ యాత్రలో సాధించాడా? లేక రెండు, మూడు యాత్రల్లోనా? అని, లోగడ చరిత్రకారులు ఆలోచించారు. కాని, అంతకు పూర్వం ఈ ప్రాంతంపై బాదామి చాళుక్యులు దండెత్తుండొచ్చునని, ఎవరూ ఊహించ లేదు.

BRAOU

బాదామి చాళుక్యుల్లో మొట్టమొదటి గొప్ప రాజు, మొదటి పులకేశి. అనేక వైదిక క్రతువులను చేసినట్లు, సత్యాశ్రయుడనే బిరుదాన్ని ధరించినట్లు, తెలుస్తున్నది. అతడు జరిపిన క్రతువుల్లో దిగ్విజయ యాత్ర చేసి, సార్వభౌమత్వాన్ని ప్రకటిస్తూ జరిపే అశ్వమేధం కూడ ఉంది. ఆ రాజు కుమారులైన మొదటి కీర్తివర్మ, మంగళేశుడు గొప్ప విజేతలు. వారు తమ యుద్ధ విజయాలతో, తండ్రి చేత అశ్వమేధ యాగాన్ని చేయించారని, సహేతుకంగా నిర్ణయించొచ్చు.

మొదటి కీర్తివర్మ యుద్ధ విజయాలను వివరిస్తూ, మహాకూట స్తంభ శాసనం, వంగ, అంగ, కళింగ, వట్టూర, మగధ, మద్రక, కేరళ, గంగ, మూషక, పాండ్య, చోళీయ, ద్రమిళ, ఆలూక, వైజయంత్యాది రాజ్యాలను జయించినట్లు పేర్కొంటుంది. అవి, ఈనాటికి ఆ పేర్లతో లేవు. కేరళ, గంగ (పశ్చిమ), ఆలూక, వైజయంతి, చోళీయ, ద్రమిళ రాజ్యాలను గూర్చి, ప్రస్తుత సందర్భంలో చర్చింప పని లేదు. అవి చాళుక్య రాజ్య పరిసరాల లోని తమిళ, కన్నడ భాషా ప్రాంతాలు. మిగిలిన కళింగ, ఆంధ్ర దేశానికి ఈశాన్యంగా, 'నల' వంశీయుల పరిపాలనలో ఉంది. కీర్తివర్మ, మంగళేశులను గూర్చి ఐహొళె శాసనం, నల, మౌర్య కదంబ వంశీయులను ఓడించినట్లు వర్ణిస్తుంది. కనుక, వారు కళింగను జయించినట్లు విశ్వసించొచ్చు. నైఋతి దిశ నుండి బాదామి చాళుక్యులు కళింగపై దండయాత్ర చేయడం వలన, ఆంధ్ర దేశం కూడ వీరి దండయాత్రకు గురైంది స్పష్టమౌతుంది. ఏలేశ్వరం వద్ద త్రవ్వకాల్లో వెలువడిన ఒక శాసనం, "రణవిక్రమ" అనే మంగళేశుని బిరుదాన్ని పేర్కొంటున్నది. కనుక, అతడు ఆంధ్ర దేశంపై దండెత్తి, ఏలేశ్వరం వద్ద విడిసి ఉన్నట్లు, స్పష్టమౌతుంది.

పైన పేర్కొన్న దేశాల్లో "మూషక", ఆంధ్ర దేశం లోనే మూసి, కృష్ణా నదుల సంగమ స్థానంలో ఉంది. "వట్టూర" కూడ ఆంధ్ర దేశం లోనిదేనని, తోస్తుంది. ఇది బహుశా, నేటి ఏలూర్ పట్టణానికి దక్షిణంగా 7 కి.మి. దూరంలో ఉన్న వట్లూర్ కావచ్చు.

పశ్చిమ చాళుక్యులు కీర్తివర్మ, మంగళేశుల నాయకత్వంలో, పెద్ద గజ బలంతో, నైఋతి దిశ నుండి విష్ణుకుండినులు పరిపాలిస్తున్న ఆంధ్ర దేశం పైకి దండెత్తి వచ్చారు. వారు మూషక జనపదాన్ని ఆక్రమించి, కృష్ణా గోదావరీ మైదానం పైకి నడిచారు. విష్ణుకుండిన ఇంద్రభట్టారకుడు, పృథ్వీమూలుడు, తూర్పు గంగ వంశీయుడైన ఇంద్ర వర్మ, మొదలైన సామంతులతో కలసి, బాదామి చాళుక్య దండయాత్రను ఎదిరించి, వారిని ఓడించాడు. ఈ పోరాటంలో కుముదం పతనమైనట్లు వర్ణించడం, బాదామి చాళుక్యులు ఓడి, మరలిపోయారని సూచిస్తుంది. ఈ విజయం తర్వాత, ఇంద్రభట్టారకుడు "సత్యాశ్రయ" బిరుదాన్ని ధరించి, చాళుక్యులపై తన విజయాన్ని ప్రకటించాడని భావించొచ్చు. తుమ్మలగూడెం (రెండో) శాసనం, ఇంద్రభట్టారకుడు సత్యాశ్రయ బిరుదాన్ని కలిగినట్లు, సూచిస్తుంది.

మొదటి విక్రమేంద్ర వర్మ పరిపాలనా కాలంలో, దక్షిణ కోసల రాజ్యం విష్ణుకుండినుల సార్వభౌమత్వాన్ని తిరస్కరించింది. శరభపురీయ వంశంలో నరేంద్రుని తర్వాత పరిపాలించిన ప్రసన్నమాత్రుడు (క్రీ.శ. 525-50), చాలా సమర్థుడు. అయితే, అతని తర్వాత సింహాసన మధిష్ఠించిన జయరాజు 9 సంవత్సరాలు మాత్రమే పరిపాలించాడు. ఇంద్ర భట్టారక వర్మ వ్యక్తి రాష్ట్రంలో (నేటి విజయనగరం జిల్లా) తన 27 వ రాజ్య సంవత్సరంలో, పురనిసంగమ వద్ద సేనతో విడిసి ఉన్నట్లు, అతని రామతీర్థ శాసనం తెలుపుతుంది. అతడు దక్షిణ కోసలపై దండెత్తి, మార్గ మధ్యంలో పురనిసంగమ వద్ద ఆగినట్లు, కోసలపై దండెత్తి, జయరాజును ఓడించినట్లు, భావించొచ్చు. దక్షిణ కోసలకు సమీపం

BRAOU

లోని మేకల పర్వత ప్రాంతంలో పరిపాలిస్తున్న పాండు వంశీయులు కూడ, ఇంద్ర భట్టారకునికి లోబడినట్లు కానవస్తుంది. ఆ వంశం లోని నాగబలుడు, ఇంద్ర భట్టారికను వివాహం చేసుకొన్నాడు. ఆమె ఇంద్రభట్టారకుని కుమార్తె కావచ్చునని, చరిత్రకారుల ఊహ.

మౌఖరీ వంశీయుడైన ఈశాన వర్మచే ఓడి, ఆంధ్రాతిపతి వింధ్య పర్వత గుహల్లో తలదాచుకొని, ప్రాణాలు దక్కించుకొన్నట్లు, ఆ వంశీయుల శాసనాలు పేర్కొనే విషయం, పైన ప్రస్తావించటం జరిగింది. దక్షిణ కోసలను, పరిసర రాజ్యాలను జయించిన పిదప, అతడు గంగా మైదానం పైకి నడచినట్లు భావించొచ్చు. ఇంద్రభట్టారక వర్మ నిరంతర పోరాటాల వలన, విష్ణుకుండిన సామ్రాజ్యం సైనికంగా, ఆర్థికంగా బలహీనమైంది. ఆ కారణం చేత, సుదూరమైన మౌఖరీ రాజ్యంపై దండయాత్ర విఫలమైంది. ఇంద్ర భట్టారక వర్మ అపజయంతో కలిగిన అవమానంతో, తిరిగి వచ్చాడు.

6.7.6.5 : దాయాద యుద్ధాలు

ఇంద్రభట్టారకుని అవస్థను అవకాశంగా గ్రహించి, త్రికూట ప్రాంతంలో పరిపాలిస్తున్న మాధవ వర్మ స్వతంత్రించి, సామ్రాజ్యం యావత్తును ఆక్రమించదల్చి వేగి దేశాన్ని ఆక్రమించే ప్రయత్నంలో, కృష్ణా నదిని దాటి, కుడూరపురం వద్ద తన ఈవూర్ (రెండో) శాసనాన్ని వేశాడు. ఆ శాసనంలో అతడు తనను "మహారాజు"గా వర్ణించుకోకున్నా, స్వయంగా తన రాజ్య సంవత్సరాలను పేర్కొని, దాన శాసనాన్ని వెయ్యడం, అతని స్వతంత్ర ప్రవర్తనను సూచిస్తుంది.

రెండో విక్రమేంద్ర వర్మ తుండి శాసనం, ఇంద్రభట్టారకుడు గట్టిగా విశ్వసించడంతోనే, సమగ్రంగా దాయాదులు నిర్మూలమైనారని (సమాఘ్రాత మాత్ర త్రస్త విశీర్ణ కాంతిశీభూత సమగ్రాశేషదాయాదస్య), వర్ణించింది. త్రికూట శాఖకు చెందిన మాధవ వర్మకు పల్లవుల సాయం లభించిందని తోస్తుంది. బహు కాలం తర్వాత, పల్లవుల ఆంధ్ర శాఖ పరిపాలిస్తున్న కర్మ రాష్ట్రంలో, కాంచీపురం నుండి పరిపాలించే ప్రధాన శాఖకు చెందిన రాజులు గ్రామ దానాలను చేయడం, మూడో కుమార విష్ణువు వేసిన చందలూర్ శాసనం వలన తెలియవస్తుంది. అతడు ఈ శాసనాన్ని, ఆంధ్ర దేశంలో పరిపాలిస్తున్న మూడో సింహవర్మ (క్రీ.శ. 525-560) ను లెక్కచేయకుండా వేసినట్లు, ఉభయుల నడుమ వైషమ్యాలు చెలరేగినట్లు కానవస్తుంది. త్రికూట శాఖకు చెందిన మాధవ వర్మ సాయంతో మూడవ సింహ వర్మ, మూడవ కుమార విష్ణువును తొలగించి, కాంచీ నగరంలో సింహాసన మధిష్ఠించాడు. ఆ తర్వాత ఉభయులు విష్ణుకుండిన ప్రధాన శాఖపై దండెత్తారు. ఇంద్ర భట్టారకవర్మ దాయాద వంశాన్ని నిర్మూలించినట్లు వర్ణించడం వలన, మాధవ వర్మను వధించి ఉండొచ్చునని, అయితే ఆ పోరాటంలో ఇంద్రభట్టారకుడు కూడ మరణించినట్లు తోస్తుంది. అతని మరణంతో, శైశవ స్థితి లోనే ఉన్న అతని కుమారుడు రెండో విక్రమేంద్ర వర్మ, సింహాసన మధిష్ఠించాల్సొచ్చింది.

6.7.6.6 : రెండో విక్రమేంద్ర వర్మ (క్రీ.శ. 555-570)

రెండో విక్రమేంద్ర వర్మ తన శాసనాల్లో, శైశవ దశ లోనే రాజ లక్షణాలను పొందినట్లు, రాజ్య భారాన్ని వహించినట్లు వర్ణించుకున్నాడు. ఇంద్రభట్టారకుని మరణం వలన, ప్రకృతి మండలం (మంత్రులు, సేనానులు మొదలైన వారు) రెండో విక్రమేంద్ర వర్మను సింహాసనంపై నిల్పారు. వారిలో పృథ్వీమూలుడు ప్రముఖుడైనట్లు తోస్తుంది.

BRAOU

రెండో విక్రమేంద్రుని కాలం నాటికి, విష్ణుకుండిన రాజ్యం బలహీనమైంది. ఇంద్రభట్టారకుడు చేసిన నిరంతర పోరాటాలు, సుదూర ప్రాంతాలపై దండయాత్రలు, వాటితోకూడి వంశార్గత పోరాటాలు, సామ్రాజ్యాన్ని కృంగ దీశాయి. అందుచేత, రెండో విక్రమేంద్ర వర్మ రాజ్యాన్ని నిలుపుకోవడం కొరకు, నిరంతరం పోరాటాలను చేయాల్సొచ్చింది. అతని ప్రధాన శత్రువులు పల్లవులు ; వారు లోగడ, త్రికూట శాఖతో సహకరించి, విష్ణుకుండినులతో పోరాడినట్లు, పైన వివరించడం జరిగింది. వారి ఆశయం, తిరిగి దక్షిణాంధ్ర దేశాన్ని తమ ఆధిపత్యం లోనికి తీసుకోవడం. అందుచేత, వారు తమ పోరాటాలను కొనసాగించినట్లు తెలుస్తుంది. త్రికూట శాఖ నిర్మూలన వలన, వారిని నిలువరించడం కష్టసాధ్యమైంది. తుమ్మల గూడెం (రెండో) శాసనం, రెండో విక్రమేంద్ర వర్మ 'సింహ' అనే పేరుగల పల్లవుని, సునాయాసంగా ఓడించినట్లు తెల్పుతుంది. ఈ "సింహ" అనే పల్లవుడు, కాంచీనగరంలో పరిపాలిస్తున్న నాలుగో సింహవర్మ షక్షాన సేనలను నడుపుతూ, ఆంధ్ర దేశం వచ్చిన సింహవిష్ణువని తోస్తుంది.

పల్లవులపై విజయాన్ని సాధించినా, పలు ప్రాంతాల్లో స్వతంత్రించిన సామంతులను, మిత్ర రాజ్యాలను అదుపు చేయడం, విష్ణుకుండినులకు అసాధ్యమైంది. పిష్టపురంలో పరిపాలిస్తున్న రామకాశ్యప వంశీయుడైన పృథ్వీమహారాజు తన తాండివాడు, గల్లావల్లి శాసనాలను, "మహారాజ" బిరుదాన్ని ధరించి వేశాడు. అతడు స్వతంత్రించినట్లు, ఈ శాసనాల వలన స్పష్టమౌతున్నది. అంతేకాక, అతడు మహేంద్రగిరి పర్వతాల నుండి, కొల్లేరు సరస్సు వరకు, తీరాంధ్ర దేశాన్ని ఆక్రమించినట్లు ఈ శాసనాలు సూచిస్తాయి. అతడు విష్ణుకుండిన సామ్రాజ్య మస్తమించిన తర్వాత, ఈ చెప్పిన రాజ్య విస్తరణను జరిపినా, రెండో విక్రమేంద్ర వర్మ కాలంలోనే స్వతంత్రించి ఉంటాడు.

రెండో విక్రమేంద్ర వర్మ తుండి శాసనం, అతడు గోదావరికి ఆవల పృథ్వీమహారాజును జయించి, తూర్పు గంగ రాజ్యం పైకి నడుస్తూ, మార్గమధ్యంలో వేసినట్లు తోస్తుంది. అతని దండయాత్రల ఫలితాలు తెలియవు. అతని తుండి శాసనం అతని 14వ రాజ్య సంవత్సరం (క్రీ.శ. 570) నాటిది. ఆ తర్వాత రెండో విక్రమేంద్ర వర్మ, అతని 'సంతతి వారెవరైనా రాజ్యాన్ని పరిపాలించినట్లు ఏవిధమైన సాక్ష్యాధారాలు కానరావు.

BRAOU

6.8 : విష్ణుకుండినుల అనంతరం ఆంధ్ర దేశ స్థితి

రెండో విక్రమేంద్ర వర్మ మరణంతో, విష్ణుకుండిన సామ్రాజ్య మంతరించింది. తర్వాత క్రీ.శ. 624 లో బాదామి చాళుక్య రాజైన రెండవ పులకేశి గోదావరికి ఉత్తరంగా ఉన్న తీరాంధ్ర దేశాన్ని ఆక్రమించి, పిష్టపురం రాజధానిగా తన సోదరుడైన కుబ్జ విష్ణువర్ధనుణ్ణి నియమించి. పరిపాలనకై ఏర్పాట్లు చేశాడు. క్రీ.శ. 631 నాటికి అతడు కర్మ రాష్ట్రాన్ని, అనగా కృష్ణా నదికి దక్షిణంగా ఉన్న తీరాంధ్ర దేశాన్ని ఆక్రమించినట్లు, కొప్పారం శాసనం వలన తెలుస్తున్నది. ఆశాసనం, రెండవ పులకేశి తన సోదరుడైన కుబ్జ విష్ణువర్ధనుడు వంశపారంపర్యంగా తీరాంధ్ర దేశాన్ని స్వతంత్రంగా పరిపాలించే అధికారాన్ని ఇచ్చాడని కూడ, సూచిస్తుంది. ఆ విధంగా, వేంగీ చాళుక్య వంశ పరిపాలన తీరాంధ్ర దేశంపై ఏర్పడింది.

అయితే క్రీ.శ. 570 నుండి 624 వరకు ఎటువంటి రాజకీయ పరిణామాలు సంభవించాయో స్పష్టంగా తెలియుట మవసరం. లోగడ, చరిత్రకారులు రెండవ పులకేశి క్రీ.శ. 611 లో ఆంధ్ర దేశంపై దండెత్తాడని, ఆ సమయాన ఆంధ్ర దేశంలో పరిపాలిస్తున్న నాలుగో మాధవ వర్మను ఓడించి,

వధించడంతో విష్ణుకుండిన రాజ్యం అంతరించిందని, సూచించారు. అయితే, రెండవ పులకేశి క్రీ.శ. 610 లోనే సింహాసన మధిష్ఠించాడని ఇటీవలి పరిశోధనలు స్పష్టపర్చాయి. కనుక, క్రీ.శ. 611 లో అతడు ఆంధ్ర దేశంపై దండెత్తి రావడం అసాధ్యం.

ఇటీవలి కాలంలో లభించిన మారుటూర్ తామ్ర శాసనం, చాళుక్య వంశీయుడైన శ్రీపృథ్వీవల్లభ మహారాజు తన అష్టమ రాజ్య సంవత్సరంలో పిష్టపురాన్ని స్వాధీనపర్చుకొన్న తర్వాత, కలూర గ్రామం వద్ద ఉండగా, జ్యేష్ఠ మాస అమావాస్య నాడు సూర్యగ్రహణ సందర్భంగా మారుటూర్ గ్రామాన్ని దానం చేస్తూ ఇచ్చినట్లు, వివరిస్తుంది. ఈ సత్యాశ్రయ పృథ్వీవల్లభుడైన రాజును రెండవ పులకేశిగానే భావించి, అతని 8వ రాజ్య సంవత్సరం (క్రీ.శ. 618) లోనే, అతడు ఆంధ్ర దేశంపై దండెత్తినట్లు, కొందరు చరిత్రకారులు భావించారు. అయితే, ఆ సంవత్సరంలో జ్యేష్ఠ మాస అమావాస్య నాడు సూర్య గ్రహణం సంభవించ లేదు. అంతకు ముందు సంవత్సరంలో సంభవించింది; కనుక, వాస్తవంగా అతడు క్రీ.శ. 617లోనే తీరాంధ్రంపై దండెత్తి, పిష్టపురాన్ని ఆక్రమించినట్లు, వారు మారుటూర్ శాసన కాలాన్ని నిర్ణయించారు.

మారుటూర్ శాసనాన్ని నిశితంగా అధ్యయనం చేసిన క్రీ. కె.వి. రమేష్, అది భాషాపరంగా మంగళేశుని శాసనాలతో పోలి ఉందని, అందుచేత, అది రెండో పులకేశి శాసనం కాదని, నిర్ణయించాడు. మంగళేశుడు క్రీ.శ. 590 లో బాదామి సింహాసన మధిష్ఠించాడు. అతని 8వ సంవత్సరం క్రీ.శ. 598-99 లో జ్యేష్ఠ మాసంలో అమావాస్య నాడు సూర్య గ్రహణం సంభవించింది. కనుక, ఆ శాసనం మంగళేశునిదేనని, ఆయన చాల సహేతుకంగా నిర్ణయించాడు. ఈ శాసనం, క్రీ.శ. 598 - 99 లో మరొక చాళుక్య దండయాత్ర సంభవించిందని స్పష్టపరుస్తున్నది.

రెండో విక్రమేంద్ర వర్మ మరణించిన తర్వాత విష్ణుకుండిన వంశం పూర్తిగా అంతరించినట్లు, అతని వారసులెవరూ ఆంధ్ర దేశంలో పరిపాలించలేదని భావించొచ్చు. అతని సామంతుల్లో ప్రముఖులైన శ్రీపృథ్వీమూలుడు స్వతంత్రించినట్లు, అతని గోదావరి తామ్ర శాసనం తెలుపుతుంది. అలాగే, రామకాశ్యప వంశీయుడైన పృథ్వీమహారాజు తాండివాడ, గల్లావల్లి శాసనాలు, అతడు స్వతంత్రించి నట్లు స్పష్టపరుస్తాయి. తాండివాడ శాసనం, అతడు తన 46వ రాజ్య సంవత్సరంలో గోదావరికి దక్షిణంగా తన రాజ్యాన్ని విస్తరింపజేసినట్లు, అతని 49వ రాజ్య సంవత్సరం నాటి గొల్లావల్లి తామ్ర శాసనం, తత్సాన్యంగా కళింగ రాజ్యం లోనికి విస్తరించినట్లు సూచిస్తాయి. ఈ రాజ్య సంవత్సరాలు అతని స్వతంత్ర పరిపాలన కాక, మొత్తం పరిపాలనా కాలాన్ని పేర్కొంటున్నట్లు భావించొచ్చు. రామకాశ్యపుల రాజధానైన పిష్టపురం, క్రీ.శ. 598లో చాళుక్య రాజైన మంగళేశుని వశమైనట్లు, మారుటూర్ శాసనం సూచిస్తూ ఉండడం వలన, ఆ రాజు క్రీ.శ. 550లో పరిపాలన ప్రారంభించాడని నిర్ణయించొచ్చు.

కృష్ణా నదికి దక్షిణంగా పరిపాలిస్తున్న శ్రీపృథ్వీమూలుని శాసనాలు కూడ, అతని 25, 43 రాజ్య సంవత్సరాలను పేర్కొంటున్నాయి. ఇవి కూడ అతని పూర్తి పరిపాలనా కాలాన్ని పేర్కొంటున్నట్లు, స్వతంత్ర పరిపాలనను కాదని భావించొచ్చు.

పిష్టపురాన్ని ఆక్రమించిన తర్వాత మంగళేశుడు మారుటూర్ గ్రామాన్ని దానం చేసినట్లు, పైన వివరించడం జరిగింది. ఆ సమయంలో అతడు కలూరపురం వద్ద ఉన్నాడు. మారుటూర్ నేటి ప్రకాశం జిల్లా లోని మార్టూర్‌గా, ఆ శాసనాన్ని ప్రకటించిన శ్రీ. యన్. రమేశన్ అభిప్రాయపడ్డాడు. కాని, అది పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకు తాలూకా లోని మారుటేర్‌గా, శ్రీ. యన్. శంకర్

BRAOU

వారాయణన్ సహేతుకంగా నిర్ణయించాడు. అక్కడి నుండి మంగళేశుడు కృష్ణా నదికి దక్షిణంగా పరిపాలిస్తున్న పృథ్వీమూలునిపై పోరాటానికి పూనుకొని ఉంటాడు.

చేజెర్ల వద్ద ఆనందగోత్రుల దౌహిత్రుడైన ఒక స్థానిక పరిపాలకుడు, క్రీ.శ. 630 నాటికి చెందిన ఒక శిలా శాసనం వలన, తెలియవస్తున్నాడు. అతడు స్పష్టంగా పల్లవ రాజైన మొదటి మహేంద్రవర్మ సామంతుడు. అయితే, అతడు తన మాతామహుడైన కందరరాజు, (ఆ వంశం లోని రెండవ కందరరాజు) ధాన్యకటకం వద్ద, కోలేరు సరస్సు వద్ద జరిగిన పోరాటాల్లో ప్రముఖ పాత్ర వహించిన వాడని వర్ణించాడు. అతడు పృథ్వీమూలుని సామంతుడై, మంగళేశునితో ధాన్యకటక, కోలేరు సరస్సు వద్ద తీవ్ర పోరాటాలను చేయగా, తన ప్రభువు క్షణాన పోరాడి ఉంటాడని తోస్తుంది. ఈ పోరాటాల్లో మంగళేశుడు జయాన్ని సాధించినట్లు స్పష్టంగా తెలియరాదు. రెండో పులకేశి తిరిగి పిష్టపుర, కొనాళ వద్ద పోరాటాలు చేసినందువల్ల, చాళుక్య విజయం తాత్కాలికమైందని స్పష్టమౌతుంది.

అయితే, ఈ పోరాటాలు పృథ్వీమూలుణ్ణి పూర్తిగా బలహీనపర్చినట్లు తోస్తుంది. పల్లవులు ఆంధ్ర దేశం లోనికి తమ రాజ్యాధిపత్యాన్ని విస్తరింపజేసిన సమయంలో, ఇతని రాజ్యం అంతరించిందని, అంతట కందరరాజు పల్లవులకు సామంతుడైనాడని తోస్తుంది. క్రీ.శ. 630 లో కృష్ణా పర్యంతంగా దక్షిణాంధ్ర దేశాన్ని పరిపాలిస్తున్నది పల్లవులని, రెండో పులకేశి వారి నుండి కర్మ రాష్ట్రాన్ని సాధించి, తర్వాత కాంచీపురం పైకి నడచాడని గ్రహించొచ్చు.

6.9 : సంగ్రహంగా

శాతవాహన సామ్రాజ్యం అస్తమించడంతో, ఆంధ్ర దేశంలో వివిధ ప్రాంతాలను పరిపాలించే స్థానిక రాజ వంశాలు ప్రాబల్యాన్ని పొందాయి. వారిలో ఇక్ష్వాకులు ప్రముఖులు. వారు, పరిసర రాజ వంశాలతో సన్నిహిత సంబంధాలను ఏర్పర్చుకొని, శక, ఆభీర మొదలైన విదేశీయుల రాజకీయ ప్రాబల్యాన్ని అరికట్టడానికి, తిరిగి సామ్రాజ్య వ్యవస్థను నెలకొల్పడానికి ప్రయత్నించారు. అయితే, ఆనాటి సంక్షోభ స్థితిలో, వారి శక్తి అంతటి ప్రయత్నానికి సరిపోయింది కాదు. వారు అచిర కాలం లోనే కృష్ణా నదికి దక్షిణంగా ప్రాబల్యాన్ని పొందిన పల్లవుల ధాటికి నిలువలేక పోయారు. అదే సమయాన కృష్ణకు దక్షిణంగా శాలంకాయనులు రాజ్యాన్ని నెలకొల్పి, విస్తరించ సాగారు. వారి విస్తరణ కార్యక్రమం దక్షిణంగా పల్లవుల తోను, ఈశాన్య దిశగా కళింగ రాజ వంశాలతోను, పోరాటాలకు కారణమైంది. పల్లవులు కొంతవరకు కదంబుల తిరుగుబాట్లు, శాలంకాయన సంఘర్షణలతో, సంక్షోభాలకు గురౌతూ ఉండగా, అదే సమయాన సంభవించిన సముద్ర గుప్తుని దండయాత్ర, వారికి మరింత దుస్థితిని కలిగించింది. వారు తిరిగి కోలుకొని విజృంభించడానికి, సుమారొక శతాబ్ది కాలం పట్టింది. ఆ వ్యవధిలో ఆంధ్ర దేశం లోనికి ఆనందగోత్రులు తమ రాజ్యాధికారాన్ని విస్తరింపజేశారు; విష్ణుకుండినులు ప్రాబల్యాన్ని పొందసాగారు.

విష్ణుకుండినులు ఆంధ్ర దేశ చరిత్రలో శాతవాహనుల తర్వాత సుచిశాల సామ్రాజ్యాన్ని నెలకొల్పిన వారు. కృష్ణా నదికి దక్షిణంగా ప్రాబల్యాన్ని సాధించిన ప్రాచీన పల్లవుల తోను, దక్షిణాపథంపై వాకాటకుల అస్తమయం తర్వాత రాజ్యాలను నెలకొల్పిన అనేక స్థానిక రాజ వంశాల తోను, పోరాటాలను చేసి, కృష్ణా-నర్మద నదుల నడుమ, ఉభయ సముద్ర తీరాల మధ్య ఉన్న పీఠభూమి ప్రాంత మంతటిని ఆక్రమించి, సామ్రాజ్య నిర్మాతలైనారు. అయినప్పటికి, ఇంత సామ్రాజ్యాన్ని నిర్వహించడానికి తగిన ఆర్థిక వనరులు ఆనాటి ఆంధ్ర దేశంలో లేకపోవడం, పరిసర రాజ్యాలతో

BRAOU

జరిగిన ఎడతెగని పోరాటాల్లో వారి శక్తియుక్తులు వ్యర్థమైనాయి. అందుచేత, వారు నిర్మించిన సామ్రాజ్యం అచిర కాలం లోనే అంతరించింది. ఆంధ్ర దేశం తిరిగి, అనేక రాజ వంశాలు నెలకొల్పిన స్థానిక రాజ్యాలతో, కల్లోలానికి గురైంది. ఆ కాలం లోని అరాజక స్థితిని అవకాశంగా గ్రహించి, ఆంధ్ర దేశాన్ని ఆక్రమించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న చాళుక్యులకు చక్కని అవకాశం లభించింది.

ప్రాచీన పల్లవుల్లో రెండో సింహవర్మ ఆ వంశ ప్రతిష్ఠను, రాజ్యాధిపత్యాన్ని తిరిగి సాధించాడు. అతని రాజనీతి వలన, దక్షిణాంధ్ర దేశంలో ఒక పల్లవ రాజుల ఉప శాఖ ఏర్పడి, వారి సామ్రాజ్యాధిపత్యాన్ని సంరక్షించింది. అయితే, కాలక్రమాన ఈ ఉప శాఖ మితిమీరిన ప్రాబల్యంతో, కాంచీపురం లోని మూల శాఖతో సంఘర్షణలకు పూనుకొంది. క్రమంగా ఉప శాఖ లోని రాజులు ఈ సంఘర్షణల్లో విజయాన్ని పొంది, కాంచీనగరంలో సింహాసన మధిష్ఠించి, దక్షిణ భారతదేశం యావత్తునూ పరిపాలించ సాగారు. విష్ణుకుండిన సామ్రాజ్య మంతమైన తర్వాత, పల్లవ రాజైన సింహవిష్ణువు కృష్ణా పర్యంతంగా ఆంధ్ర దేశాన్ని జయించాడు. చాళుక్యులు ఆంధ్ర దేశాన్ని, అనగా కృష్ణా నదికి ఉత్తరంగా ఉన్న ఆంధ్ర దేశాన్ని ఆక్రమించేనాటికి, పల్లవులు, ఆ నదికి దక్షిణంగా పరిపాలిస్తున్న శ్రీపృథ్వీమూలుని జయించి, కృష్ణా నది వరకు తమ రాజ్యాధిపత్యాన్ని విస్తరించారు. అప్పుడు సింహవిష్ణువు కుమారుడైన మొదటి మహేంద్రవర్మ, కృష్ణా నది సరిహద్దుగా దక్షిణాంధ్ర దేశాన్ని పరిపాలిస్తున్నాడు.

కృష్ణా నదికి ఉత్తరంగా ఉన్న ఆంధ్ర ధేశాన్ని బాదామి చాళుక్య వంశం లోని మంగళేశుడు క్రీ.శ. 598లో జయించాడు. అయితే, తర్వాత బాదామి రాజ్యంలో చెలరేగిన అంతఃకలహాల్లో మంగళేశుణ్ణి, అతని అన్న కుమారుడైన రెండో పులకేశి వధించి, సింహాసనాన్ని ఆక్రమించే సమయాన, ఆంధ్ర దేశం తిరిగి స్వతంత్రమైంది. రెండో పులకేశి మరల ఆంధ్ర దేశంపై దండెత్తి, పిష్టపురం నుండి పరిపాలిస్తున్న రామకాశ్యప వంశీయుడైన పృథ్వీమహారాజును, కృష్ణా నదికి దక్షిణంగా, బహుశః కృష్ణా-గోదావరీ నదుల నడిమి భాగాన్ని కూడ, పరిపాలించే పల్లవ సామంతుడైన, "సత్యాశ్రయవల్ల" బిరుదాన్ని కలిగిన ఒక రాజును ఓడించి, ఆంధ్ర దేశాన్ని ఆక్రమించాడు. ఆ రాజు తన సోదరుడైన కుబ్జ విష్ణువర్ధనుణ్ణి పిష్టపురం రాజధానిగా, తన ప్రతినిధిగా నిలిపాడు. అనంతరం, క్రీ.శ. 624 లో అతడు ఆంధ్ర దేశాన్ని స్వతంత్రంగా పరిపాలించుకొనే అధికారాన్ని ఇచ్చివేశాడు. దీనితో, ఆంధ్ర దేశ చరిత్రలో చాళుక్య యుగమారంభమైంది.

BRAOU

6.10 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. ఇక్ష్వాకుల చరిత్రను, వారి ఘనతను పరిశీలించండి.
2. శాలంకాయనులెవరు? వారి చరిత్రను సమీక్షించండి.
3. ప్రాచీనాంధ్ర దేశ చరిత్రలో ఆనందగోత్రుల ప్రాముఖ్యతను తెలపండి.
4. పల్లవులెవరు? వారి పుట్టుపూర్వోత్తరాలను, జన్మభూమిని చర్చించండి.
5. క్రీ.శ. 350 తర్వాతి పల్లవుల పాలనా విశేషాలను, వారికి సమకాలీన రాజ వంశాలతో గల సంబంధాలను వేర్కొనండి.

6. విష్ణుకుండినుల చరిత్రను పరిగణించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యానాలను రాయండి.

1. ఆభీర వసుషేణుడు ఇక్ష్వాకుల నాటి రాజకీయ చరిత్రలో నిర్వహించిన పాత్ర ఎట్టిది?
2. బృహత్పలాయనుల గురించి చరిత్ర అందిస్తున్న సమాచార విశేషాలెవ్వి?
3. ఆనందగోత్ర రాజుల చరిత్రను సమీక్షించండి?
4. వేసంత తామ్ర శాసనం తెలియజేస్తున్న చారిత్రక సమాచారమేది?
5. తుమ్మల గూడెం తామ్ర శాసనాలు అందిస్తున్న విశేషాలను వివరించండి.
6. పృథ్వీమూల రాజ వంశం నిర్వహించిన పాత్ర ఎట్టిది?
7. విష్ణుకుండినుల అనంతరం నెలకొన్న ఆంధ్ర దేశ స్థితిని విశ్లేషించండి.

6.11 : ఉపయుక్త గ్రంథాలు

1. Gopalachari, K. : **Early History of the Andhra Country**, 2nd Edn. Madras, 1976.
2. Krishna Rao, B.V. : **Early Dynasties of Andhradesa**, Madras, 1942.
3. Mahalingam, T.V. : **Kanchipuram in Early South Indian History**, Madras, 1965
4. Rama Rao, M. : **Ikshvakus of Vijayapuri**, Tirupati, 1967.
5. do : **Studies in the Early History of Andhradesa**, Madras, 1974.
6. Ramachandrayya, O. : **Satavahanas and Their Successors**, Madras, 1978.
7. Sircar, D.C. : **Successors of Satavahanas in Eastern Deccan**, Calcutta, 1939.
8. Sankaranarayanan, S. : **The Vishnukundis and their Times**, Delhi, 1980
9. Venkataramanayya, N. : **The Vishnukundins**, Madras, 1975
10. Hanumantha Rao, B.S.L. : ఆంధ్రుల చరిత్ర, గుంటూరు, 1982
11. Sundara Rama Sastry, V. : దక్షిణ భారతదేశ చరిత్ర, తెలుగు అకాడమి ప్రచురణ, హైదరాబాద్, 1989.

రచయిత : డా. వి. సుందరరామశాస్త్రి

BRAOU

భాగం-7 : శాతవాహనానంతర యుగం (క్రీ.శ.624 వరకు): పరిపాలనా విధానం, సామాజిక, ఆర్థిక, మత, సాంస్కృతిక పరిస్థితులు

విషయక్రమం

7.0 : ఆక్యూలు

7.1 : పరిచయం

7.2 : రాజ్య వ్యవస్థ

7.2.1 : ప్రాదేశిక రాజ్యాలు (Territorial States)

7.2.2 : భూస్వామ్య విధానం (Feudal System)

7.2.3 : రాజరికం

7.2.4 : రాజరికం - భూస్వామ్య విధానం

7.2.5 : పరిపాలనా విధానం

7.2.5.1 : పరిపాలనా స్వభావం

7.2.5.2 : అమాత్యులు

7.2.5.3 : స్థానిక పరిపాలనా విధానం

7.2.5.4 : స్థానిక పరిపాలనా యంత్రాంగం

7.2.5.5 : గ్రామ పరిపాలన

7.2.6 : ఆర్థిక పరిపాలన

7.3 : సామాజిక స్థితిగతులు

7.3.1 : సమాజం - వర్ణ వ్యవస్థ

7.3.2 : బ్రాహ్మణులు

7.3.3 : సామాజిక విస్తరణ : శూద్ర వర్ణం

7.3.4 : సమాజంలో స్త్రీల స్థానం

7.4 : ఆర్థిక స్థితిగతులు

7.4.1 : వర్తక వాణిజ్యాలు - క్షీణత

7.4.2 : గ్రామీణ వృత్తులు - సమాజం

7.4.3 : వ్యవసాయ విస్తరణ - గ్రామీణ వ్యవస్థ

BRAOU

7.5 : మత-ధార్మిక పరిణామాలు

7.5.1 : బౌద్ధ మతం - శైల శాఖలు

7.5.1.1 : మహాయాన బౌద్ధ మతం

7.5.1.2 : ఆచార్య నాగార్జునుడు

7.5.1.3 : ఇతర బౌద్ధ మత శాఖలు

7.5.1.4 : మహాయాన బౌద్ధం - నవ్య వైదిక మతం

7.5.2 : నవ్య వైదిక పరిణామాలు

7.6 : వాస్తు, కళా వికాసం

7.6.1 : శ్రీపర్వత-నాగార్జునకొండ

7.6.2 : హిందూ దేవాలయ వాస్తువు

7.6.2.1 : చేజెర్ల

7.6.2.2 : గుహాలయ వాస్తువు

7.6.2.3 : విజయవాడ గుహాలయాలు

7.6.2.4 : ఉండవల్లి గుహాలయాలు

7.7 : భాషా వికాసం

7.8 : సంగ్రహంగా

7.9 : పరీక్ష నమూనా ప్రశ్నలు

7.10 : ఉపయుక్త గ్రంథాలు

BRAOU

7.0 : ఉక్తులు

ఈ భాగాధ్యయనం ద్వారా, శాతవాహనానంతర యుగం (క్రీ.శ. 624 వరకు) లో నెలకొన్న పరిపాలనా విధానం, ఆర్థిక, సామాజిక, మత, సాంస్కృతిక పరిస్థితులను తెలుసుకోగల్గాలి. శాతవాహన సామ్రాజ్యం అస్తమించడంతో, అనేక స్థానిక రాజ్యాలు ఆంధ్రదేశ మంతట నెలకొన్నాయి. అందుచేత, రాజకీయ సమైక్యత భంగమైంది. అయినా, ప్రజల జీవన విధానంపై దాని ప్రభావమేమీ లేదు. సామాజికంగా ఏర్పడిన పరిణామాలు ఆర్థిక పరిస్థితుల్లోని మార్పుల వలన ఏర్పడి, భూస్వామ్య వ్యవస్థకు దారితీసిన వైనం, దాని వలన సమాజ వ్యవస్థ ప్రబలమై, కుల వ్యవస్థ కఠినం కావడాన్ని గ్రహించాల్సుంది. పరిణామాలు ఆనాటి రాజకీయ వ్యవస్థను, పరిపాలనా విధానాలను సైతం ప్రభావితం చేసిన తీరును అవగాహన చేసుకోవాల్సుంది. మత రంగలో మహాయాన బౌద్ధ, నవ్య వైదిక మతాల వ్యాప్తి, వాస్తు కళా రంగంలో దేవాలయ, గుహాలయ వాస్తువు అభివృద్ధి, భాషా రంగంలో ప్రాకృత, సంస్కృత, దేశి భాషల ప్రగతి ప్రాముఖ్యతా ప్రభావాలను గమనించాల్సుంది.

7.1 : పరిచయం

ప్రాచీనాంధ్ర దేశ చరిత్రలో శాతవాహనానంతర యుగాన్ని ప్రాదేశిక రాజ్యాల (territorial states) యుగమని వ్యవహరించొచ్చు. సామ్రాజ్య వ్యవస్థ విచ్ఛిన్నం కావడంతో, ఆంధ్ర దేశం రాజకీయ సమైక్యతను కోల్పోయినందున, ఈ ప్రాదేశిక రాజ్యాలు ఏర్పడినాయి. అయితే, శాతవాహన యుగంలోనే ప్రారంభమైన నవ్య భౌగోళిక పరిమితిని, సాంస్కృతిక స్వభావాన్ని పొందింది. అందువలన, ఈ యుగం లోని ప్రాదేశిక రాజ్యాలు తరచుగా రాజ్య విస్తరణకై పోరాటాలు చేస్తున్నా, వివిధ జాతులను, తెగలను, సాంస్కృతికంగా సమైక్యం చేసే పరిణామ ప్రక్రియలు కొనసాగుతూ ఉన్నాయి. రోమన్ సామ్రాజ్య పతనంతో వర్తక వాణిజ్యాలు క్రమంగా అంతరిస్తూ ఉండడం, కొన్ని విదేశీయ జాతులు ప్రశాంత జీవనాన్నవలంబిస్తూ స్థిరపడడం, ఈ సాంస్కృతిక పరిణామాల్లోని సాంఘిక, ఆర్థిక, మత స్థితి గతులను ప్రభావితం చేశాయి. ఈ పరిణామాల సీభాగంలో స్థూలంగా అధ్యయనం చేయడం జరుగుతుంది.

7.2 : రాజ్యవ్యవస్థ

శాతవాహనానంతర యుగం లోని పరిపాలనా విధానాన్ని గూర్చి అధ్యయనం చేయడానికి పూర్వం, అప్పటి రాజ్య వ్యవస్థను గూర్చిన అవగాహన అవసరం. శాతవాహన సామ్రాజ్యం దక్కన్ పీఠభూమిపై అనేక జాతులు, తెగలకు చెందిన ప్రజానీకాలను సామ్రాజ్య వ్యవస్థ లోనికి చేర్చింది. ఆ వ్యవస్థలో వారు పరస్పర ప్రభావంతో కొంత మేర సాంస్కృతిక సమైక్యతను సాధించారు. ఆంధ్ర దేశానికి భౌగోళికంగాను, సాంస్కృతికంగాను స్పష్టమైన స్వరూప మేర్పడింది. అయితే, ఒరిస్సా సామ్రాజ్య విచ్ఛిన్నత వలన రాజకీయ సమైక్యత అంతరించి, పలు ప్రాంతాల్లో అనేక స్థానిక రాజ్యాలు తలెత్తాయి. ఇవి ప్రాదేశిక రాజ్యాలు.

BRAOU

7.2.1 : ప్రాదేశిక రాజ్యాలు

శాతవాహన సామ్రాజ్య విచ్ఛిన్నం తర్వాత ఏర్పడిన ప్రాదేశిక రాజ్యాలు (territorial states), పూర్వపు జనపదాలు, జాతి రాజ్యాలు (tribal states) కావు. అశ్మక, మూలక వంటి జనపదాలు, వాఙ్మయ సాంప్రదాయాలకు పరిమితమైనాయి. పూర్వపు నాగ, యక్ష జాతులు నెలకొల్పిన జనావాసాలు-ఎరువైనాడు. అరువైనాడు మొదలైనవి - తిరిగి ఏర్పడ లేదు. పూర్వపు జాతులు, సంస్కృతుల నడుమ నున్న విభేదాలను తొలగించిన తర్వాత ఏర్పడినవి, ప్రాదేశిక రాజ్యాలు.

శాతవాహనానంతర యుగం లోని ప్రాదేశిక రాజ్యాలు ఏర్పడ్డానికి దోహదం చేసిన పరిస్థితులను పైన పేర్కొన్నట్లు, రాజకీయంగా శాతవాహన సామ్రాజ్య విస్తరణ, సాంస్కృతికంగా నవ్య వైదిక సాంస్కృతిక విస్తరణ, వాటితోబాటుగా మరికొన్ని పరిస్థితులు కూడ ఇందుకు దోహదం చేసినట్లు గుర్తించొచ్చు. అందులో మొదట పేర్కొనవలసింది, విదేశీయ జాతుల విలీనం. శక, పహ్లవ, ఆభీర, మొదలైన జాతులు తమ రాజ్యాధిపత్యం అంతరించే తరుణంలో, ప్రశాంత జీవనాన్ని అవలంబించి స్థిరపడాల్సిన అవసరమేర్పడింది. వారు వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా చేపట్టి, స్థిరపడినట్లు గ్రహించొచ్చు. వారు స్థానిక ప్రజానీకాలతో కలిసిపోయి జీవించడం, వ్యవసాయ విస్తరణను జరిపి, నూతన గ్రామాలను నిర్మించడంతో, జనపదాలు విస్తరించాయి. జాతి, తెగల వ్యత్యాసాలు బలహీనమైనాయి. ఇటువంటి పరిణామాలకు ఆనాటి సాంఘిక వ్యవస్థ అనుకూలించిందని గ్రహించొచ్చు.

అలాగే, రోమన్ సామ్రాజ్యంతో జరిగే వర్తక వాణిజ్యాలు క్రమంగా అంతరిస్తున్నాయి. అందుచేత, ఆ వర్గాలకు చెందిన ప్రజానీకం, పరిశ్రమలు, కళలను అవలంబించి జీవించే వివిధ వృత్తి సంఘాలకు చెందిన జనులు, ప్రత్యామ్నాయ జీవన విధానాలను ఆశ్రయించాల్సొచ్చింది. అటువంటి పరిస్థితిలో, వ్యవసాయం అన్నిటికంటె అనువైంది. వారు చిట్టడవులను నరికి, వ్యవసాయ భూములను ఏర్పర్చుకోవడం, నూతన గ్రామాలను నిర్మించుకొని స్థిరపడడం జరిగింది. ఈ విధంగా, పూర్వపు జాతి, తెగలతో సంబంధంలేని విశాలమైన ప్రాదేశిక రాజ్యాలు ఏర్పడడం, శాతవాహనానంతర యుగం లోని ముఖ్యమైన పరిణామం.

7.2.2 : భూస్వామ్య విధానం (Feudal system)

విశాలమైన ప్రాదేశిక రాజ్యాల పరిపాలన, కొన్ని వ్యవస్థాగతమైన మార్పులకు దారితీస్తుంది. ఆ రాజ్య వ్యవస్థల్లో విలీనమైనప్పటికీ, కొంత వరకు స్థానిక జాతులు, తెగల పూర్వ సంస్కృతి, స్వభావాలు కొనసాగుతుంటాయి. అందుచేత, విస్తారమైన ప్రాదేశిక రాజ్యాలు అన్ని ప్రాంతాలను పటిష్ఠమైన కేంద్రీకృత పరిపాలనా వ్యవస్థ లోనికి తీసుకొని రావడంలో కొన్ని సమస్యలను ఎదిరించాల్సొస్తుంది. రాకపోక సదుపాయాలు, సమాచార సౌకర్యాలు తగినంతగా లభించకపోవడం, అందుకు ప్రధాన కారణం.

ఇటువంటి పరిస్థితిలో రాజ్య వ్యవస్థ అతి తరచుగా దండయాత్రలను చేసి, స్థానిక పరిపాలనా వ్యవస్థలపై తన ఆధిపత్యాన్ని నిలుపుకొనడం, అందుకొరకు వాటి అధికారాలను నిర్మూలించి లోబరుచుకొనడం చేయవలసుంటుంది. దీనివలన, విస్తృతమైన సైనిక నిర్వహణకు, దండయాత్రలకు, అపారంగా ధనాన్ని పోగుచేసుకోవలసుంటుంది. తమ ఆధిపత్యం బలపడుతున్న కొలది, రాజులు భూమిపైన, సంపదపైన తమ హక్కులను నెలకొల్పి, వాటిని మరింతగా పెంపొందించుకోడానికి పోటీ పడతారు. మరిన్ని పోరాటాలను చేస్తారు. ఈ పోరాటాల నుండి బలమైన రాజ్య వ్యవస్థ సామ్రాజ్య వ్యవస్థగా రూపొందుతుంది. సామ్రాజ్య వ్యవస్థలో పరిపాలనా నిర్వహణ మరింత దుష్కరమౌతుంది. పైన పేర్కొన్న సమస్యలు మరింత జటిలం కావడంతో, తిరిగి పోరాటాలు మరల మరల అవసరమౌతూ ఉంటాయి. ఈ ప్రక్రియలో భూముల ఆక్రమణ గురించి, అతి తరచుగా రాజ్యాల నడుమ సంఘర్షణలు ప్రాప్తిస్తాయి. అంతేకాక, ఆక్రమించిన భూములను వ్యవసాయ యోగ్యంచేసి, సాగుచేయడానికి జనశక్తి (man power)ని సంపాదించుకోవడ మవసరం. విస్తారంగా భూములను, జన శక్తిని సంపాదించుకొనే ఉద్దేశంతోనే, శాతవాహనానంతర యుగాల్లో రాజ్యాల మధ్య పోరాటాలు ప్రాప్తించేపని భావించడానికి అవకాశముంది. ఈ పరిణామాలు పరస్పర ప్రేరకంగా పనిచేస్తూ, రాజ్యాలను సార్వభౌమాధికారం (Paramountcy) కలిగిన సామ్రాజ్యాలుగాను, వాటికి లోబడిన వివిధ స్థాయిలకు చెందిన సామంతులు, స్థానిక పరిపాలకులు మొదలైన వారితో రాజ్య వ్యవస్థలను, సామ్రాజ్య వ్యవస్థలను ఏర్పరుస్తాయి.

రాజ్య వ్యవస్థలు సామ్రాజ్య వ్యవస్థలుగా రూపొంది, సార్వభౌమాధికారం చేకూరినప్పుడు, రాజును, లేదా చక్రవర్తిని, దైవాంశసంభూతునిగా భావించడం, రాజ్యాధిపత్యాన్ని దైవదత్తమైనదిగా భావించడం తప్పనిసరిగా ఏర్పడే పరిణామం. శాతవాహన యుగం లోను, ఆ తర్వాత స్థూలంగా ప్రాచీన భారతదేశంలో క్రీ.పూ. 5వ శతాబ్దం నుండి క్రీ.శ. 5వ శతాబ్దం వరకు నిర్మాణమైన మత-ధార్మిక వాఙ్మయం, ఈ విధమైన రాజ్యాధికార సిద్ధాంతాన్ని ప్రచారం చేసింది. అతి ప్రాచీన కాలం నుండి రాజసూయ, అశ్వమేధ, వాజపేయ వంటి రాజకీయ ప్రాధాన్యత కలిగిన వైదిక క్రతువులను ఆచరించడం, ఈ సిద్ధాంతానికి మూలం. శాతవాహన యుగం నుండే ఈ క్రతువుల నిర్వహణ మరింత

BRAOU

ప్రాచుర్యం లోనికి రావడంతో, దైవదత్త రాజ్యాధికార సిద్ధాంతానికి ఆచారణాత్మక ప్రాధాన్యత (Practical significance) ప్రాప్తించింది.

అయితే, దైవదత్త రాజ్యాధికార సిద్ధాంతం సాధారణ జనులను రాజుకు విధేయులుగా చేయగలదు. తమ దండయాత్రలు, సైనికావసరాలకు తగిన విధంగా ప్రజల ఉత్పాదనా సంపదలను గ్రహించడానికి, వారు అలజడులు, తిరుగుబాట్లకు పూనుకొనక, యథావిధిగా తమ వృత్తులను అనుసరిస్తూ, రాజ్యాన్ని పోషించడంలో నిమగ్నులు కావడానికి తోడ్పడుతుంది. కాని, రాజుల నడుమ ఏర్పడే సంఘర్షణలను నివారించ లేదు; సామంతులను తిరుగుబాట్లు చేకుండ ఆప లేదు. ప్రతి రాజు దైవాంశ సంభూతుడే కాక, వారిని సిద్ధాంతాలు అదుపు చేయ లేవు. పరస్పర ప్రయోజనకరమైన వాస్తు విధానం ఏదో ఒకటి ఆధిపత్యాన్ని అంగీకరించడంతో సంతృప్తి చెంది, మైత్రి నేర్పర్చుకోవడం, సామ్రాజ్య నిర్మాతలు అవలంబించిన విధానం. స్థానిక పరిపాలకులు సామ్రాజ్యానికి లోబడి కప్పం చెల్లించడం, గ్రామాధికారులు గ్రామాల ఆదాయం నుండి వారికి కొంత భాగాన్ని చెల్లించడం, విధానంగా ఏర్పడింది. ఇటువంటి విధానాన్ని, లేదా ఈ విధానాన్ని కలిగిన రాజ్య వ్యవస్థను, ఆధునిక చరిత్రకారులు, సాంఘిక శాస్త్రవేత్తలు భూస్వామ్య విధాన (Feudal system) మని వ్యవహరిస్తారు.

భూస్వామ్య విధానంలో గ్రామాధికారులు గ్రామం లోని కర్షక, కార్మిక వర్గాలను, అధిక సుంకాలు, పన్నులను వసూలుచేసి పీడించినట్లే, తమ సైన్యాన్ని స్థానిక పరిపాలకులను వారిపై ఆధిపత్యాన్ని చెలాయించే రాజులు, వారిని అంతకంటే పై స్థాయిలో ఉన్న చక్రవర్తి, తమ తమ ఆదాయం కొరకు పీడిస్తారు. అంతే కాక, యుద్ధ సమయంలో తమ సైన్యంతో వారు తమ పై అధిపతులకు తోడ్పడాల్సిన బాధ్యతను కలిగి ఉంటారు. ఈ విధంగా ప్రతి స్థితి (Stage) లో పరిపాలకులు తమ క్రింది వారిని ఒత్తిడి చేసి పీడించగా, చివరకు ఆ పీడనను సంపూర్ణంగా గ్రామాల ప్రజానీకం అనుభవించాల్సొస్తుంది. గ్రామీణ ప్రజానీకం ఆర్థికంగా దిగజారి, దుర్భర దారిద్ర్యంలో క్రుంగిపోయి, చివరకు జీవితంపై ఆసక్తిని కోల్పోతారు. వ్యవసాయం క్షీణిస్తుంది; గ్రామీణ వృత్తులు అడుగంటుతాయని, వారి సిద్ధాంతం. ఈ సిద్ధాంతం సహేతుకమే. అయితే, ఈ వ్యవస్థ ప్రభావం ఏ కాలంలో ఎంతవరకు ప్రతిఫలిస్తున్నదనే అంశాన్ని సాక్ష్యాధారాలతో అధ్యయనం చేసి, ఆ యుగం లోని ప్రజల జీవన స్థాయిని, తదనుగుణంగా వారి నైపుణ్యంలో కలుగుతున్న మార్పులు, ఆ యుగం నాటి సాంస్కృతిక స్వభావం, మొదలైన అంశాలను అవగాహన చేసుకోవాల్సిన అవసరముంది. అంతేకాని, శిలాక్షరంగా ఆమోదించి అనువర్తింపజేసేదికాదు.

ఈ విధమైన రాజ్య వ్యవస్థ గుప్త యుగానంతరం సంపూర్ణ స్థితి నందుకొన్నదని, అంతకు పూర్వం కొంత కాలం నుండి క్రమ పరిణామాలను పొందిందని పలువురు ఆధునిక చరిత్రకారుల అభిప్రాయం. ఈ విధానం ప్రధానంగా రాజులు తమ సైనికాధికారులకు, పరిపాలనా యంత్రాంగంలోని ఉన్నతోద్యోగులకు జీతాలకు మారుగా భూములు, గ్రామాలను ప్రతిఫలంగా ఇవ్వడంలో ప్రారంభమైందని, అటువంటి విధానం అంతకంటే ముందు బ్రాహ్మణులకు, మత సంస్థలకు చేసిన దానాలతో ప్రారంభమైందని, వారు సిద్ధాంతీకరిస్తారు. ఇటువంటి సిద్ధాంతానికి మూల పురుషుడు, ఆర్. ఎస్. శర్మేతే, ఆయన కంటే పూర్వం, భూస్వామ్య విధానం రెండు విధాలుగా ఏర్పడుతుందని, ఆచార్య డి.డి. కొశాంబి సిద్ధాంతీకరించారు. ఒకటి పై విధంగా ఏర్పడితే, దానిని ఆరుస్న దిగువన ఉన్న ప్రజలపై విధించబడేదని, రెండవది గ్రామాధికారులు, వాని నుండి స్థానికాధికారులు, ఇలా క్రమంగా అధికారం పైకి ప్రసరించే విధాన (Feudalism from below) మని, ఆయన వర్గీకరించారు. సాంప్రదాయలకు, కట్టుబాట్లకు పూర్తిగా లోబడి, విద్యా విజ్ఞానాలు లేక గ్రామీణ ప్రజానీకం జీవిస్తూ,

BRAOU

వంశపారంపర్య వృత్తులను అవలంబిస్తూ ఉంటే, గ్రామాధికారులు, పరిపాలనా యంత్రాంగం లోని ఇతర ఉన్నతాధికారులు సైతం, తమ పదవులు, అధికారాలను వంశపారంపర్యంగా పొందుతూ ఉంటే, తరాలు గడచిన కొద్ది ఈ వ్యవస్థ ప్రాబల్యాన్ని పొందుతూ ఉంటుంది. ప్రజలకు, ప్రభువులకు మధ్య అంతరం పెరిగిపోతుంది. ప్రభువులు అపరిమితమైన అధికారాన్ని పొందడం, ప్రజలు క్రమక్రమంగా దారిద్ర్యంలో క్రుంగిపోతూ దుర్భర జీవితాన్ని గడపడం, సాధారణమౌతుంది. అది, క్రింది నుండి పైకి ప్రసరించే భూస్వామ్య విధాన లక్షణం.

శాతవాహనాంతర యుగం యించుమించుగా ఉత్తర హిందూస్థానంలో గుప్త సామ్రాజ్య కాలానికి, సమకాలీనమైంది. కనుక, భూస్వామ్య విధానం దక్షిణ భారతదేశ చరిత్రలో ఈ యుగంలో ప్రారంభమైనట్లు, పై చరిత్రకారుల అభిప్రాయాల ననుసరించి నిర్ణయించొచ్చు.

7.2.3 : రాజరికం

క్రీ.శ. మూడో శతాబ్ది ప్రారంభ కాలానికి, భారతదేశ మంతట వంశపారంపర్య పద్ధతిలో, ఏకస్వామ్య రాజరిక వ్యవస్థ (monarchy) ప్రధాన లక్షణమైంది. ఉత్తర భారతదేశంలో ఇంకా కొన్ని గణతంత్ర రాజ్య వ్యవస్థలు (republics or oligarchies) కొనసాగుతున్నట్లు, మూళవ, యౌధేయ, అర్జునాయన మొదలైనవారి నాణేలు, ముద్రికలు (seals) సూచిస్తున్నాయి. కాని, దక్షిణ భారతదేశంలో అటువంటి వ్యవస్థలు పూర్తిగా అంతరించినట్లు, కానవస్తుంది. అంతేకాక, క్రీ.శ. మూడో శతాబ్ది నాటికే, రాచరిక వ్యవస్థ అపరిమితమైన అధికారంతో నిరపేక్షం (absolute) గా రూపొందినట్లు, ఇక్ష్వాకు రాజైన శ్రీ శాంతమూలుడు ధరించిన 'నవదేసు అపతిహత సంకపస (సర్వార్థేషు అప్రతిహత సంకల్పస్య)' అనే బిరుదం సూచిస్తుంది. అంటే, వారి సంకల్పానికి ఎటువంటి ప్రతిఘటన లేదని, ఆ వాక్యానికి అర్థం. ఇటువంటి బిరుదాలు శాతవాహన యుగం లోనే, మొదటి శాతకర్ణి కాలం నుండే శాసనాల్లో కానవస్తాయి. ఈ విధమైన సర్వాధికారం, వారు తమ సైనిక బలగాలతో పరిసర రాజ్య పాలకులను, అంటే సామంతులను జయించి, లొంగతీసుకొనడం వలన, సంప్రాప్తమౌతుంది. కనుక, ఈ యుగం లోని రాజులు అపరిమితంగా యుద్ధాలు చేయడం పట్ల ఉత్సుకత కలిగి, తమ విజయాలను ప్రకటించుకొంటూ, అశ్వమేధాలను చేశారు. ఇక్ష్వాకు వంశ స్థాపకుడైన శ్రీ శాంతమూలుడు, ప్రాచీన పల్లవ రాజుల్లో మొదటి స్కందవర్మ (శివస్కందవర్మ), శాలంకాయన రాజుల్లో విజయదేవవర్మ, విష్ణుకుండిన వంశీయుల్లో రెండో మాధవవర్మ, ఈ విధంగా అన్ని ప్రముఖ రాజ వంశాల్లో అశ్వమేధ యాగాన్ని చేసిన రాజులు ఈ యుగంలో కానవస్తారు. రాజులు తమ శాసనాల్లో తమ విజయాలను వర్ణించుకొంటూ, లేదా తమ వంశ పూర్వుల ఘనతను స్మరిస్తూ, "చతురదధి తరంగా లంగిత యశసః (నాలుగు సముద్రాల అలలను కౌగలించిన యశస్సు కలవారు); అనేక సమరవాస్తు విజయనః (అనేక యుద్ధాల్లో విజయాన్ని పొందినవారు); ప్రతాపోపనాత సామంతస్య (తను ప్రతాపంచేత సామంత రాజులను లొంగదీసినవారు); సమరసాసాచ మర్దలబ్ధ విజయ యశసః (లేక, యుద్ధాల్లో సాహసం చేత శత్రువులను ఓడించి, పొందిన విజయం వలన, యశస్సు కలవారు); సకల మహీమండలా వనత సామంత మకుట మణికిరణావదీఢ చరణ యుగో (సమస్త భూమండలం లోని సామంత రాజులు తలలు వంచి నమస్కరించడంచేత మణి కిరణాలు ప్రకాశింపజేసే పాదాలు కలవాడు), మొదలైన బిరుదాలను పేర్కొనడం, పరిపాటైంది. ఈ బిరుదాల్లో అతిశయోక్తి, వాక్చాతుర్యం కొంతవరకు ఉన్నప్పటికి, అప్పటి రాజుల యుద్ధ కాంక్షను, సామంతులను అదుపు చేయడం, తమ సార్వభౌమత్వాన్ని విస్తరింపజేయడం, మొదలైన అంశాలను సూచిస్తాయి. రాజులు

BRAOU

తమ సైనిక బలాన్ని ప్రదర్శించి, రాజ్య విస్తరణ చేయడం, విస్తరించిన సామ్రాజ్యాన్ని నిర్వహించడాన్ని, ఏకైక విధిగా కల్గినట్లు, ఈ బిరుదాల సారాంశం.

రాజ్య వ్యవస్థలో వివిధ స్థాయిలకు చెందిన పరిపాలకు లుండడం చేత, రాజు శాతవాహన కాలంలో పలె "రఞో" అనే సామ్రాజ్య బిరుదంతో తృప్తి చెందడు. అందుచేత, శాతవాహనానంతర యుగం లోని రాజులు, అన్ని వంశాలకు చెందినవారు. సర్వ సాధారణంగా "మహారాజ" బిరుదాన్ని ధరించినవారే. పైన వివరించినట్లు, వారు భూమికి, సంపదలకు అధిపతులుగా వర్ణించుకొంటూ, బిరుదాలను ధరించారు. "భుమోభర్తుఃు" అని, విష్ణుకుండిన శాసనాలు రాజును వర్ణిస్తున్నాయి. ప్రాచీన పల్లవులు "శ్రీవల్లభానాం పల్లవానాం" అని, చెప్పుకున్నారు.

ఈ విధంగా యుద్ధానక్తి, అనేక రాజులు లోబడి సేవిస్తుండగా, మహారాజ పదవిని అందుకొని ఉన్నత స్థితిని సాధించుకొన్నట్లు వర్ణించడం, శాతవాహన యుగం నుండే గమనించొచ్చు. గౌతమీపుత్ర శాతకర్ణిని గూర్చి నాసిక్ ప్రశస్తి శాసనం ఇదే విధంగా వర్ణించినట్లు, పైన వివరించడం జరిగింది. పురాణ - ఇతిహాస వాఙ్మయం లోని చక్రవర్తులను ఆదర్శంగా గ్రహించి, ఇటువంటి ఆశయాలను ఏర్ప ర్చుకోవడం, విజయాలను సాధించడానికి ప్రయత్నించడం జరిగిందని, క్రమంగా అటువంటి ఘనత కల్గిన రాజులు తాము దైవాంశసంభూతులుగా వర్ణించుకొన్నట్లు కూడ, వివరించడం జరిగింది. శాతవాహన యుగానంతరం ఈ లక్షణాలు మరింత స్పష్టపడినాయి. "దేవ" శబ్దం, రాజుకు పర్యాయపదమై "రాజా ధిరాజ"నే అర్థంలో, విష్ణుకుండిన మాధవవర్మను "దేవాధిదేవుడ"ని వర్ణించడం జరిగింది. అయితే, ఇంతకు ముందు వివరించినట్లు, వైదిక క్రతువులను నిర్వహించడంతో సామ్రాజ్యాధిపత్యానికి మరింత ప్రాశస్త్యం చేకూరినట్లు, కానవస్తుంది. విష్ణుకుండిన రెండో మాధవవర్మను "క్రతుపరానుష్ఠాతాదిష్ట పరమేష్ఠిత్వన్య", అంటే క్రతువులను నిర్వహించి పరమేష్ఠి (బ్రహ్మదేవుడు) తో సమానమైన వాడని, అతని వంశానుయాయులు కీర్తించి, దేవాధిదేవుడని వర్ణించారు. మొత్తం మీద సార్వభౌమాధిపత్యం, వైదిక క్రతువులు రాజులకు తిరుగులేని అధికారం కలిగినట్లు నిరూపించి, దైవదత్తరాజ్యాధికారాన్ని కట్టబెట్టినాయి. వారు తమను, లేదా తమ వంశ పూర్వులను, దైవాంశసంభూతులుగా భావించుకొని వర్ణించుకొన్నారు. పురాణ వాఙ్మయం ఇంద్రుడు, కుబేరుడు, వరుణుడు, యముడు లోక పాలకులని వర్ణిస్తుండగా, ఆ రాజులు, లోకపాలురైన దేవతలతోపాటు, తాము అయిదో లోక పాలకులమని వర్ణించుకొన్నట్లు, గుర్తించొచ్చు.

అయితే, ఇంతకు పూర్వం వివరించినట్లు, రాజుల సర్వాధిపత్యం దైవదత్త రాజ్యాధిపత్యాన్ని యదార్థంగా గ్రహించడం యుక్తం కాదు. వారి ఆధిపత్యం, దేశం లోని సాంప్రదాయాలు, కట్టుబాట్లు, ధార్మిక వాఙ్మయం నిర్దేశించే విధులు, మొదలైన అంశాలతో పరిమితమే అయించి. అతను తాము వర్ణాశ్రమ ధర్మ సంరక్షకులమని, ధర్మార్థకామాలను సమానంగా అనుష్ఠించి సాధించే సత్ప్రవర్తన కలవారమని, ప్రజారంజకంగా పరిపాలించినవారమని, ఈ యుగం లోని రాజ వంశాలకు చెందినవారు సగర్వంగా వర్ణించుకొన్నారు. ప్రాచీన పల్లవ రాజులు "ధర్మమహారాజ"ని బిరుదాన్ని ధరించి, తమ శాసనాల్లో "విధివిహిత సర్వమర్యాదన్య", "కలియుగదోషాపనన్న ధర్మోద్ధరణ నిత్య సన్నద్ధ", "ప్రజా సంరంజన పరిపాలనోద్యోగసతత సత్యవ్రత దీక్షిత" వంటి వాక్యాలతో, తమ పరిపాలనా విధానాన్ని వర్ణించుకున్నారు. ధర్మశాస్త్రాలు, రాజులు బ్రాహ్మణులను, వృద్ధులను, విద్వాంసులను సేవించి, ధార్మిక అంశాలను గ్రహించి, పరిపాలించవలసిందిగా నిర్దేశించాయి. అదే విధంగా, ప్రాచీన పల్లవ శాసనాలు "దైవద్విజ గురువృద్ధాపబాయినా" అని, ఆ రాజులను వర్ణిస్తున్నాయి.

BRAOU

7.2.4 : రాజరికం - భూస్వామ్య విధానం

పైన పేర్కొన్నట్లు, శాతవాహనానంతర యుగం లోని రాజ్య వ్యవస్థ, భూస్వామ్య విధానంపై ఆధారపడింది. భూస్వామ్య విధానానికి మూలమైంది, రాజు భూమికి సర్వాధికారనే సిద్ధాంతం. సర్వాధికారాలు రాజ హస్తగతమై నిరపేక్ష రాచరిక విధాన మనుసరించబడుతున్న కాలంలో, రాజు భూమికి భర్తగా గుర్తింపు పొందడం, సహజం. అందుకు, దైవదత్త రాజ్యాధికార సిద్ధాంతం కూడ, దోహదం చేస్తుంది. ఈ లక్షణాలు శాతవాహనానంతర యుగం లోని ఆంధ్ర దేశంలో ఏర్పడినట్లు, పైన వివరించడం జరిగింది. ఈ కారణం చేత, పలువురు ఆధునిక చరిత్రకారులు, భూమి సాగుచేస్తున్న కర్షకునికి భూమిపై హక్కులు తొలగిపోయి, అతడు సేద్య బానిస వలె (Serf) దిగజారిపోయాడని, నిర్ణయిస్తారు. రాజులు తమ ఇచ్ఛానుసారం బ్రాహ్మణులకు, మత సంస్థలకు, భూదానాలను, గ్రామ దానాలను ప్రకటించడం, భూమిపై వారికి సర్వ హక్కులు సంప్రాప్తించినట్లు సూచిస్తున్నట్లు, వారు అభిప్రాయపడతారు. ఈ విధంగా, సర్వ హక్కులు వారి పరం కావడం వల్ల, తర్వాత కాలంలో వరిపాలనా యంత్రాంగం లోని ఉన్నతాధికారులకు నెల జీతాలు, లేదా సాంవత్సరిక జీతాలను చెల్లించకుండ, అంతకు సమానమైన ఫలసాయాన్ని ఇయ్యగలిగిన భూములను ఇచ్చే విధానం అమల్లోనికి వచ్చినట్లు, వారి నిర్ణయం. ఇవన్నీ, కర్షకుడు ఎటువంటి యాజమాన్య హక్కులు లేకుండ, సేద్య బానిసగా రూపొందిన వైనాన్ని స్పష్టపరుస్తాయని, వారి అభిప్రాయం. ఈ అభిప్రాయాలు, వాటికి ఆలంబనైన ఆలోచనా విధానం, తార్కికంగా సమంజసమైనవే. కాని, వాస్తవ స్థితిగతులుగా అంగీకరించడం, కష్టం. అంటే, అటువంటి పరిణామాలేర్పడినట్లు అంగీకరించొచ్చు. కాని, దేశ మంతటా అదే విధమైన దుర్భర పరిస్థితులు వ్యాపించినట్లు భావించాల్సిన అవసరం లేదు.

రాజుకు భూమిపై సర్వాధికారాలు ప్రాప్తించడం, సైద్ధాంతిక (theoretical) మాత్రమే కాని, అటువంటి అధికారాలను అనుభవిస్తూ, కర్షకులకు పట్టాల నియ్యడం, నిబంధనలతో కూడిన అంగీకార పత్రాలను వ్రాయించుకోవడం వంటివి, జరగలేదు. కర్షకులు యథా ప్రకారం తమ భూములను తమవిగానే భావించుకొంటూ, సాగుచేసుకొనేవారు. తాము సేద్య బానిసలుగా దిగజారినట్లుగా వారు భావించుకొన్నట్లు, ఎక్కడా వాఙ్మయంలో, లేదా శాసన రూపంలో ఆధారాలు లేవు. కనుక, వాస్తవంగా కర్షకులకు హక్కులు నష్టమైనట్లు భావించడం, కేవలం ఒక నిరాశా వాదం.

ప్రారంభంలో బ్రాహ్మణులకు, మత సంస్థలకు, క్రమేణ పరిపాలనోద్యోగులకు భూదానాలను, మాన్యాలను రాజులు ప్రకటించిన విషయాన్ని, శాసనాధారాల వలన నిశ్చయంగా చెప్పొచ్చు. శాతవాహనానంతర యుగంలో రాజులు అనేక గోశత సహస్రాలు, హలశతసహస్రాలు, అనగా ఒక నాగలితో దున్ని, సాగుచేయదగిన, పరిమితిగల భూములను, శతసహస్రాలుగా ప్రదానం చేసినట్లు, తమ శాసనాల్లో వివరించారు. అయితే, ఈ భూములను కర్షకుల నుండి తీసుకొని, వారికి ప్రదానం చేశారని, లేదా, ఈ భూములపై హక్కులను కర్షకుల నుండి తీసుకొని, వారికి ప్రదానం చేశారని, లేదా, ఈ భూములపై హక్కులను కర్షకుల నుండి దాన గ్రహీతలకు బదిలీ చేశారని భావించడానికి, ఎటువంటి ఆధారమూ లేదు. పైన వివరించినట్లు, ఆ కాలంలో జరుగుతున్న వ్యవసాయ విస్తరణ, నూతన గ్రామాల నిర్మాణం, ఈ విధంగా జరిగినవే. సాగులో లేని భూములను రాజులు ఈ విధంగా దానాలు చేయగా, గ్రహీతలు అక్కడి పాదలు, చిట్టడవులను నరికివేసి, సాగు భూములుగ మార్చుకున్నారు. కొంత వరకు, రాజులు స్వయంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు, అర్థశాస్త్రం వలన తెలుస్తుంది. అయితే, ఈ విధానం ప్రాచీనాంధ్ర దేశంలో అమలు జరుగుతున్నట్లు, శాసనాధారాలు లభించడం లేదు; అంతమాత్రాన అటువంటి విధానం ఆచరణలో లేదని చెప్పడం సహేతుకం కాదు. శాలంకాయన

BRAOU

విజయ దేవవర్మ వేసిన ఏలూర్ తామ్ర శాసనం "అర్ధికమనుష్య", అంటే సగపాలు తీసుకొనేవారనే పదానికి, ప్రాకృత రూపం. సగ పాలు తీసుకొని సాగుచేసేవారు, బహుశః రాజు అధీనం లోని భూములలో పనిచేసే వారేనని భావించొచ్చు. ఆ విధంగా, సాగుచేసే పాలికాపులను ఒక తరం గడిచిన తర్వాత ఆ భూములను శాశ్వతంగా సాగుచేసే అధికారాలతో నియమించవలసిందిగా, కౌటిల్యుని అర్థశాస్త్రం రాజులను ఉద్బోధిస్తుంది.

రాజులు భూదానాలను, గ్రామ దానాలను ప్రకటించినప్పుడు, తామ్ర శాసనాలను రాయించి ఇచ్చేవారు. ఈ శాసనాలు ఆయా గ్రామాల్లో సమస్త ప్రజానీకాన్ని సమావేశపర్చి, వారి సముఖంలో ప్రకటించడం జరిగేది. ఆయా గ్రామాలను, లేదా భూములను దానం చేయదలచినప్పుడే, గ్రామస్థులకు, గ్రామాధికారులకు ఆ విషయాన్ని తెలియజేసి. వారి అనుమతి పొందిన తర్వాతనే నిర్ణయం తీసుకోవడం జరిగేదని తోస్తుంది. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొన్నప్పుడు, రాజులకు భూమిపై హక్కులు ఏర్పడి ఉండడం వాస్తవం కాదని, కేవలం సిద్ధాంతమేనని గ్రహించొచ్చు. అయితే, తామ్ర శాసన రూపంలో ప్రకటించిన భూ, గ్రామ దానాలను రాజులు తమ రాజ్య పరిధిలో చేయలేదని, వారు దండయాత్రచేసి జయించిన రాజ్య భాగాల్లో, అక్కడి స్థానిక బ్రాహ్మణులకు అగ్రహారాలనిచ్చి, వారి మద్దతును సంపాదించారని, లేదా తాము జయించిన భూభాగాలను తమ అధీనంలో ఉంచుకొనే నిమిత్తం, తమ దేశం నుండి బ్రాహ్మణులు వలసపోయి, అక్కడ నివసించడాన్ని ప్రోత్సహిస్తూ ఈ దానాలను చేసినట్లు ఊహించడం, మరింత యుక్తంగా కనిపిస్తుంది. ఇటువంటి గ్రామ, భూదానాలు సైతం, అప్పటికి ఇంకా ఉపయోగం లోనికి రాని, విస్తారమైన బీళ్ళు, చిట్టడవుల్లో చేసేవారని గ్రహించొచ్చు.

పై పరిశీలన వలన, రాజులకు సాగు భూములపై సంపూర్ణ హక్కులు ఏర్పడడం, సిద్ధాంతపరమైన అంశమే కాని, వాస్తవాంశం కాదని స్పష్టపడుతుంది. గ్రామ, భూదానాల వలన, కర్షకులను భూముల నుండి తొలగించడం, లేదా వారికి గల యోజమాన్య హక్కులను దాన గ్రహీతల కియ్యడం, వాస్తవం కాదని స్పష్టంగా చెప్పొచ్చు. అయితే, రాజులు సైతం వ్యవసాయ విస్తరణకు పూనుకున్నారు. వారి పరంగా సేద్య బానిసలున్నట్లు గ్రహించొచ్చు. కనుక, ఆనాటి గ్రామ, భూదానాలు వ్యవసాయ విస్తరణ, జనపదాల విస్తరణల నుద్దేశించి చేసినవి; రాజులు స్వయంగా "సీత" భూముల నేర్పర్చడం సైతం, ఈ ఉద్దేశంతో చేసిన ప్రయత్నమే. అవి కర్షకుల దుస్థితిని దిగజార్చినట్లు భావించడం, సమంజసం కాదని, నిశ్చయంగా చెప్పొచ్చు.

7.2.5 : పరిపాలనా విధానం

క్రీస్తు శకారంభం తర్వాతి శతాబ్దాల్లో రాజనీతి, పరిపాలనా విధానాలను గూర్చి, విస్తారంగా వాఙ్మయ నిర్మాణం కాలేదు. మహాభారతం, కౌటిల్యుని అర్థశాస్త్రం ఈ అంశాలను గూర్చి విస్తృతంగా చర్చించాయి. కాని, అవి క్రీను పూర్వం నాటివి. తర్వాత వెలువడిన పురాణ వాఙ్మయం, ఈ అంశాల పట్ల అధిక శ్రద్ధను కనబర్చలేదు; ఆ వాఙ్మయంలో వ్యక్తమైన భావాలు, లోగడ ఇతిహాసాలు, అర్థశాస్త్రం చర్చించి నిర్ణయించినవే. గుప్త యుగం నాటిదిగా భావించబడే కామందక నీతి శాస్త్రం సైతం, అర్థ శాస్త్రం లోని అంశాలనే, అదే విధమైన నిర్ణయాలతో ప్రకటిస్తుంది. అందుచేత, క్రీ.శ. మూడో శతాబ్దం నుండి పరిపాలనా విధానాన్ని అధ్యయనం చేయడానికి, ఆ కాలం లోని రాజ వంశాల శాసనాలే-ప్రధానమైన ఆధారం; శాసనాలు చాలా క్లుప్తమైనవి; వాటిలో పరిపాలనా విధానాన్ని, పరిపాలనా యంత్రాంగాన్ని గూర్చిన వివరాలు చాలా స్వల్పం.

BRAOU

7.2.5.1 : పరిపాలనా స్వభావం

రాజ్య పరిపాలన నేటి వలె, పౌర పరిపాలన (civil administration), సైనిక పరిపాలన (military administration) అని, రెండు విధాలుగా ఏర్పడి లేదు. ఆ పరిపాలన ప్రధానోద్దేశం ధర్మబద్ధంగా ప్రజలు తమ తమ వృత్తులను అనుసరించి జీవించేందుకు కావలసిన ప్రశాంతతను ఏర్పర్చడం. అంతేకాని, నేటి వలె శ్రేయో రాజ్యం (welfare state), ఆనాటి నీతికోవిదులు, పరిపాలకుల ఆలోచనల్లో లేదు. రాజ్యంలో అలజడుల నణచి, ప్రశాంత వాతావరణాన్ని, బయట నుండి దండయాత్ర భయం లేని భద్రతను కలిగించడం, రాజ్య ధర్మం. ఇతిహాస, పురాణ వాఙ్మయం, అర్థశాస్త్రం వంటి నీతి శాస్త్రాల భావ మిది. ఇటువంటి పరిపాలనా వ్యవస్థలో సైన్యం పాత్ర మధికం. సైనిక పోషణ కొరకు అవసరమైన నిధులతో కోశాన్ని నింపి, నిర్వహించడం రెండవ ధర్మం. ఈ కారణం చేత, లేఖకులు, గణకులు వంటి సాధారణ ఉద్యోగులు కాక, తక్కిన ఉన్నతోద్యోగులు పౌర పరిపాలన, సైనిక పరిపాలన, రెండింటిని నిర్వహించేవారు.

రాజుకు శాసన నిర్మాణం చేసే అధికారం లేదని, పైన వివరించడం జరిగింది. ధర్మ సూత్ర గ్రంథాలు, స్మృతులు వివరించిన విధంగా న్యాయాన్ని సంరక్షించడం, అమలు జరపడం, రాజు విధి. అలాగే, వివిధ వృత్తి సంఘాలు, శ్రేణులు, నిగమ సభలు, మొదలైన సంస్థలు నిర్ణయించు కొన్న న్యాయాలు, కట్టుబాట్లను అమలు జరపడం, న్యాయ పరిపాలనలో ముఖ్యాంశం. పరిపాలనా యంత్రాంగ మీవిధంగా చాలా క్లుప్తంగా ఉండి, పరిమితమైన ధర్మంతో నడిచింది. కనుక, సమకాలీన శాసనాల్లోకి వివరంగా ఎక్కలేదు; శాసనాల వలన తెలియవచ్చే వివరాలు పరిమితమైనవి.

7.2.5.2 : అమాత్యులు

సమకాలీనమైన పల్లవ, శాలంకాయన, రాజుల శాసనాలు అమాత్యులను పేర్కొంటున్నాయి. కాగా, కళింగాంధ్రలో పరిపాలించిన మాఠర, పిత్రభక్త వంశీయుల శాసనాలు "కుమారామాత్యుల"ను పేర్కొంటున్నాయి. ఉత్తర భారతదేశంలో సమకాలీనంగా గుప్త చక్రవర్తుల శాసనాల్లో సైతం, కుమారామాత్యులు కానవస్తారు. ఈ పదాలు ఒక ఉన్నత శ్రేణికి చెందిన ఉద్యోగులను సూచిస్తాయని, ప్రత్యేక శాఖకు చెందినవి కావని, శ్రీ ఎ.యస్. అల్టేకర్ వివరించాడు. అంతే కాక, ఉత్తర భారతదేశం లోని కళింగాంధ్ర దేశంలో కానవచ్చే కుమారామాత్యులు, కృష్ణా-గోదావరీ మైదానాలపై పరిపాలించిన రాజ వంశాల కొలువు లోని అమాత్యులు, ఒకే తరగతి లోని వారని, ఆయన వివరించాడు. ఆయన అభిప్రాయాలు సహేతుకమైనవి.

అమాత్యులు శాతవాహన యుగం నుండి పరిపాలనా వ్యవస్థలో కానవస్తున్న ఉద్యోగులు. ఆ తరగతికి చెందిన ఉన్నతోద్యోగులు పల్లవ-శాలంకాయన పరిపాలనా వ్యవస్థలో కొనసాగినట్లు, విష్ణుకుండిన శాసనాలు ప్రత్యేకంగా వారిని పేర్కొనకపోయినా, వారి పరిపాలనా విధానంలో కూడ అమాత్యులున్నట్లు భావించొచ్చు. ఈ రాజ వంశాలు శాతవాహనులు నిర్మించిన పరిపాలనా వ్యవస్థను ఉపయోగించారు; ప్రాచీన కాలంలో పరిపాలనా విధానం తరచుగా మార్పులకు, చేర్పులకు గురయ్యేదికాదని భావించొచ్చు. అప్పటి పరిపాలనా విధానాలు నిర్వహణాత్మకంగా వ్యవహరించేవి కాని, నిర్మాణాత్మకంగా కాదు.

గుప్త చక్రవర్తుల శాసనాలు, కళింగాంధ్ర దేశంలో పరిపాలించిన మాఠర, పిత్రభక్త, వాసిష్ఠ వంశీయుల శాసనాలు, కుమారామాత్యులు, మహాదండనాయకులుగా, సంధి విగ్రహకులుగా కూడ వ్యవహరిస్తున్నట్లు, ఈ పదవులను ఒకే వ్యక్తి నిర్వహిస్తున్నట్లు వివరిస్తాయి. పైన పేర్కొన్నట్లు,

BRAOU

కుమారామాత్యులు ఒక సాధారణ (general) తరగతికి చెందిన ఉన్నతోద్యోగులు; కాగా, వారి నుండి వివిధ శాఖలను నిర్వహించే అధికారులను నియమించడం, స్పష్టపడుతున్నది. ఇదే విధంగా ఇక్ష్వాకు శాసనాలు, మహాతలవర, మహాసేనాపతి, మహాదండనాయకులనే ఉద్యోగులను పేర్కొంటాయి. ఈ పదవులన్నిటిని ఒక వ్యక్తి నిర్వహించేవాడు. వారు వివిధ జనపదాలను - పూగ రాష్ట్రం, [illegible]ణ్య రాష్ట్రం మొదలైనవి -- పరిపాలిస్తూ, మహాతలవరులుగా, అంటే ఆ ప్రాంత పరిపాలకులుగా గుర్తింపు పొందినవారు; కేంద్ర ప్రభుత్వంలో మహాసేనాపతి, మహాదండనాయక పదవులను నిర్వహించేవారు. దీనిని బట్టి, శాతవాహన యుగాల్లోను, ఆ తర్వాత పల్లవ, శాలంకాయన శాసనాల్లోను కానవచ్చే అమాత్యులనే ఉద్యోగులు, ఇక్ష్వాకు శాసనాలు పేర్కొనే మహాతలవరులు, ఒకే విధమైన అధికారులు. వారు ప్రధానంగా స్థానిక పరిపాలకులు, కేంద్ర ప్రభుత్వంలో కూడ ఉన్నత పదవులను పొందినవారు.

మహాసేనాపతులు, మహాబలాధికృతులు అనే పదాలను బట్టి వారు సేనానాయకులని, సైనిక బలాల నిర్వహణాధికారులని స్పష్టంగా చెప్పొచ్చు. ఇక్ష్వాకు శాసనాలు మహాసేనాపతులను, కళింగాంధ్ర దేశం లోని శాసనాలు మహాబలాధికృతులను, పేర్కొంటున్నాయి.

మహాదండనాయకులు దండనీతిని అమలు జరిపేవారు; అంటే, నేర విచారణలు జరిపి, శిక్షలను విధించేవారు. సంధి విగ్రహకులు, లేదా మహా సంధి విగ్రహకులు, విదేశీయ విధానాన్ని రూపొందించేవారు; ఇతర దేశాలతో మైత్రి, లేదా శత్రు సంబంధాలను గూర్చి రాజుకు నివేదించేవారు; సలహాలు ఇచ్చేవారు. అంతేకాక, రాజు వాగ్రూపంగా ఇచ్చిన ఆజ్ఞలను లిఖిత రూపంగా, శాసనబద్ధం చేసేవారు. కళింగాంధ్ర దేశం లోని శాసనాల్లో అధిక శాతం, మహాసంధివిగ్రహకులు రాసినవేనని గుర్తించొచ్చు. సమకాలీన విష్ణుకుండిన, ప్రాచీన పల్లవ శాసనాలు ఇటువంటి అధికారులను పేర్కొనవు. కాని, ఎటువంటి ఉద్యోగులు వారి కొలువులో లేరని చెప్పరాదు.

పరిపాలనలో రాజుకు మంత్రులు, సచివులనే ఉన్నతాధికారులు సాయపడుతున్నట్లు, అర్థశాస్త్రం, కామందక నీతిసారం మొదలైన నీతి శాస్త్ర గ్రంధాలు పేర్కొంటాయి. సమకాలీన ఆంధ్రదేశ శాసనాలు ఇటువంటి అధికారులను ప్రత్యేకంగా పేర్కొనవు. అయితే, ఇటువంటి అధికారులు లేరని భావించరాదు. నీతి శాస్త్ర గ్రంధాలు ఈ అధికారులనే మతి సచివులు, కర్మ సచివులనే పేర్లతో కూడ, పేర్కొంటున్నట్లు గుర్తించొచ్చు. మతి సచివులు తమ బుద్ధి విశేషంతో, రాజుకు సలహాలు ఇచ్చేవారు; మంత్రులని గుర్తించొచ్చు. కర్మ సచివులు పరిపాలనా నిర్వహణ (executive) ను, రాజాజ్ఞలను అమలుపర్చడం తమ విధిగా కలిగినవారు. పైన పేర్కొన్న అధికారుల్లో పలువురు మంత్రులేనని, అనగా మతిసచివులని, వారే తమ తమ జనపదాలను పరిపాలించుకొనే సమయంలో, రాజాజ్ఞలను అమలుపరుస్తూ, కర్మ సచివులుగా వ్యవహరిస్తారని భావించొచ్చు.

పై పరిశీలన వలన అమాత్యులు, కుమారామాత్యులు, మహాతలవరులనే పేర్లతో, అత్యున్నత అధికార వర్గం రాజుకు మంత్రాంగాన్ని, అంటే సలహాలను చెప్పడం, పరిపాలనను నిర్వహించేవారని, సైనిక పరిపాలన, న్యాయ పరిపాలన, విదేశాంగ విధానాల్లో వీరు పాత్రధారులని స్పష్టపడుతుంది. వీరే విధాన నిర్ణాయక సమయాల్లో మంత్రులు, లేక మతి సచివులు, పరిపాలనలో కర్మ సచివులని భావించొచ్చు. మంత్రులు, లేదా మతి సచివులను శాతవాహన యుగం నాటి రాజామాత్యులతో పోల్చొచ్చు. వారికంటె కొంచెం తక్కువ స్థాయి కలిగి వ్యవహరించే ప్రత్యేకమైన అధికార వర్గంగా, కొందరు చరిత్రకారులు కర్మ సచివులను వివరిస్తారు. నీతి శాస్త్ర గ్రంధాల తాత్పర్యంగా, వాస్తవం అదే. అయితే, క్రీస్తుశకా

BRAOU

రంభం లోని తొలి శతాబ్దాల్లో పరిపాలనా యంత్రాంగమంత సంక్లిష్టం (Complex) కాలేదని, అధికార వర్గంలో అటువంటి ప్రత్యేకీకరణలు అవసరం కాలేదని తోస్తుంది.

7.2.5.3 : స్థానిక పరిపాలనా విధానం

స్థానిక పరిపాలనా సౌలభ్యం కొరకు, రాజ్యాలు "ఆహార" మనే విభాగాలుగా విభజించబడేవి. ఈ విభాగాలు చాలా వరకు పూర్వపు జనపదాలేనని తోస్తుంది. శాతవాహన యుగంలో సైతం, ఇదే విధంగా "ఆహారాలు" స్థానిక పరిపాలనా విభాగాలుగా ఏర్పడున్నట్లు, అవి ప్రధానంగా పూర్వపు జనపదాలేనని, పైన వివరించడం జరిగింది. ప్రాచీన పల్లవ శాసనాలు ఇటువంటి విభాగాలను "రాష్ట్ర"మనే పేర్కొంటాయి. "రాష్ట్ర" మనే పదానికి వాస్తవంగా "రాజ్య" మనే అర్థం. దీనిని బట్టి, లోగడ రాజ్యాలుగా ఏర్పడున్న ప్రదేశాలు, ఈ వంశీయుల ఆధిపత్యంలో, చాలా వరకు తమ స్థానిక స్వపరిపాలనాధికారాన్ని (local autonomy) కలిగి ఉంటూ, వీరి రాజ్యాల్లో అంతర్భాగాలుగా కొనసాగుతున్నట్లు గుర్తించొచ్చు. మరో విధంగా చెప్పాలంటే, లోగడ శాతవాహన సామ్రాజ్యం వలెనే, ఈ ప్రాదేశిక రాజ్యాలు అనేక స్థానిక జనపదాలను విలీనం చేసుకొన్నవని, పైన వివరించిన విషయం స్పష్టమౌతుంది.

ఈ యుగం లోని ప్రాదేశిక రాజ్యాలు శాతవాహనుల కాలం నాటి సామ్రాజ్య వ్యవస్థ వలెనే ఏర్పడి, విస్తరించినవి కావడాన, సుదూర ప్రాంతాలను అదుపులో ఉంచుకోవడంలో కొన్ని చిక్కులు ఏర్పడినట్లు, గుర్తించొచ్చు. అందువలన, సుదూర ప్రాంతాలను యువ రాజులు, లేదా యువ మహారాజుల ఏలుబడిలో ఉంచడం, ఒక ప్రత్యేక విధానమైంది. ముఖ్యంగా కృష్ణా నదీ ముఖ ద్వారం చుట్టు ఉన్న సారవంతమైన మైదానాలను, జనావాసాలను అదుపులో ఉంచుకోడానికి, కాంచీనగరంలో రాజధానిని కలిగిన పల్లవులు, పశ్చిమాంధ్ర దేశంలో బహుశ: గోదావరీ మైదానంలో రాజధానిని కలిగిన విష్ణుకుండినులు, తీవ్రంగా ప్రయత్నించారు. తీరాంధ్ర దేశం లోని శాలంకాయనులు, ఈ ఉభయులను ప్రతిఘటించాల్సొచ్చింది.

ప్రాచీన పల్లవుల్లో మైదవోలు శాసనాన్ని వేసిన శివస్కందవర్మ యువ మహారాజు. బహుశా, అతడే కాంచీనగరంలో సింహాసనాన్నధిష్ఠించిన తర్వాత, విజయస్కందవర్మగా పరిపాలిస్తూ, తన కుమారుడు బుద్ధవర్మను తీరాంధ్ర దేశంపై యువ మహారాజు హోదాలో నిలిపినట్లు, చారుదేవి వేసిన బ్రిటిష్ మ్యూజియం తామ్ర శాసనం వలన తెలుస్తున్నది. ఆ తర్వాత కాలంలో రెండో సింహవర్మ, తన సోదరుడైన విష్ణుగోపుని తీరాంధ్రంలో యువ మహారాజుగా నియమించాడు. విష్ణుకుండిన రాజు రెండో మాధవవర్మ తన కుమారుడైన దేవవర్మకు ఇదే విధంగా తీరాంధ్రంలో తన ప్రతినిధిగా నియమించినట్లు, పైన వివరించడం జరిగింది. యువ మహారాజుగా నియమించబడిన వారిలో కొందరు రాజకుమారులు, కొందరు రాజ సోదరులు కావడం, ఈ యువ మహారాజు లందరు తర్వాత కాలంలో సింహాసన మధిష్ఠించినవారు కాకపోవడం, గుర్తించదగిన అంశాలు. పరిపాలనలో పాలుపంచుకొని సాయపడడం, లేదా సుదూర ప్రాంతాల్లోను, కీలక ప్రాంతాల్లోను పరిపాలనను నిర్వహించడానికి, యువ మహారాజ పదవుల్లో నియామకాలు జరిగినట్లు గుర్తించొచ్చు. వీరికి తగినంత స్వయంపరిపాలనాధికారమున్నట్లు తోస్తుంది. గ్రామాల సంఖ్య పెరగడం, రాజ్యాల విస్తీర్ణ మధికం కావడం యువ రాజు, లేదా యువ మహారాజ నియామకాలకు కారణమైనట్లు, గ్రహించొచ్చు.

7.2.5.4 : స్థానిక పరిపాలనా యంత్రాంగం

శాతవాహన యుగానంతర కాలంలో ఆహారాలు, రాష్ట్రాలు కాక, విషయాలనే పరిపాలనా భాగాలు, వాటిని పరిపాలించే "విషయపతు"లనే అధికారులు, శాసనాల్లో కానవస్తారు. వీరికి సాయంగా

BRAOU

ఆయుక్తక, నియుక్తక, నైయోగిక, అనే పేర్లతో ఉద్యోగులున్నట్లు, శాసనాలు ప్రస్తావిస్తాయి. ఈ ఉద్యోగులు భూమి శిస్తును, ఇతర సుంకాలు, పన్నుల రూపంలో రాజ్యాదాయాన్ని వసూలుచేసి, రాజ కోశానికి పంపేవారు; ఆదాయ వ్యయ పట్టికలను నిర్వహించేవారు. కొన్ని గ్రామాలు కలిసి, విషయమనే పరిపాలనా విభాగం ఏర్పడిందని, ఆర్థిక పరిపాలనలో ఈ విభాగం చాలా కీలకమైనదిగా భావించబడినట్లు, గ్రహించొచ్చు.

పల్లవ శివస్కందవర్మ వేసిన హీరహడగళ్ళి శాసనం, వల్లవ, గోవల్లవ, శాసన సంచరంత అనే అధికారులను పేర్కొంటుంది. తర్వాతి కాలానికి చెందిన ప్రాచీన పల్లవ సంస్కృత శాసనాలు "రాజవల్లభ"నే అధికారిని పేర్కొంటాయి. వల్లవ, గోవల్లవ అనే అధికారులు పశు సంరక్షక శాఖను, గోవల్లవులు ప్రధానంగా గోసంరక్షణను నిర్వహించేవారు. పశువులకు, గోవులకు దొడ్లు, శాలలను నిర్మించి, వాటిని అభివృద్ధి చేయడం, తద్వారా ఆర్థికాభివృద్ధికి కృషి చేయడానికి, ప్రాచీనాంధ్ర దేశంలో పటిష్ఠమైన చర్యలను తీసుకోవడం జరిగింది. అందుక్కూడా "విషయ" స్థాయి పరిపాలనా యంత్రాంగం కీలక పాత్రను నిర్వహించిందని గుర్తించొచ్చు. తర్వాతి కాలంలో వల్లవులు, గోవల్లవులనే రెండు విధాలైన అధికారులు కాకుండ, రాజవల్లభులనే ఒకే విధమైన అధికారులను నియమించడం జరిగినట్లు, గ్రహించొచ్చు.

విషయ స్థాయిలో శాంతిభద్రతల సంరక్షణ కొరకు, కొంత సైనిక బలం దండనాయకుల అధి పత్యంలో ఉండేది. దండనాయకులు విషయ స్థాయిలో మాత్రం, న్యాయ పరిపాలన, శాంతిభద్రతల సంరక్షణను నిర్వహిస్తూ, విషయపతులకు సహకరిస్తూ ఉండేవారు. ఈ యుగం లోని శాసనాలు చాట, భట, అనే రెండు విధాలైన సైనికులను పేర్కొంటాయి. కొన్ని శాసనాలు "చాట" బదులుగా "చార" అని పేర్కొంటాయి. భటులు సాయుధ సైనికులు కాగా, చాట, లేక చారులు, రహస్యంగా నేర విచారణ చేసే గూఢచార వర్గమని అర్థం చేసుకోవచ్చు.

B.RAO.U

7.2.5.5 : గ్రామ పరిపాలన

అనాది నుండి భారతదేశంలో పరిపాలనా వ్యవస్థకు ఆధారం, గ్రామ పరిపాలన; ప్రజా జీవనానికి గ్రామం ఆధారం కావడం వలన, పరిపాలనా విధానానికి గ్రామ పరిపాలన మూలమైంది. గ్రామ పరిపాలనను, గ్రామాధికారులు నిర్వహిస్తారు. అతి ప్రాచీన కాలం నుండి కొనసాగుతూ వస్తున్నందున, గ్రామ పరిపాలనాధికారం వంశపారంపర్యంగా వచ్చేదని భావించొచ్చు. అయితే, "గ్రామకూట" లేక "గ్రామేయక" అనే పదాలు శాసనాల్లో కానవస్తున్నందున, గ్రామ పరిపాలన సామూహికంగాను, సహకారం ప్రాతిపదికగాను, జరుగుతున్నట్లు, తోస్తుంది. గ్రామం లోని ప్రముఖులు,అనగా గ్రామే యకులు, ఈ గ్రామ కూటాల్లో, అంటే గ్రామ సభల్లో సభ్యులుగా ఉంటూ, వారిలో ప్రముఖుని నాయకునిగా ఏర్పర్చుకొనేవారని గుర్తించొచ్చు. ఇక్ష్వాకు శాసనాలు "తలవర"ని, శాలంకాయన శాస నాలు "ముసుద", లేక "ముత్యద"ని, ఈ గ్రామాధికారిని పేర్కొంటాయి. అనేక గ్రామాధికారులపై వెలుకుబడి, ఆధిపత్యాన్ని పొందినవారు "మహాతలవరులు" లేక "మహాగ్రామికుల"ని పిలువబడుతున్నట్లు గ్రహించొచ్చు. మహాతలవరులు రాజ కొలువులో ఉన్నత పదవులను అధిష్ఠించడాన్నిబట్టి, గ్రామ పరిపాలన ఏ విధంగా రాజ్యాధిపత్యానికి మార్గమో, స్పష్టపడుతుంది. మహాతలవరులు పూగీయ, హిరణ్యక, మొదలైన తెగలకు, వారు నెలకొల్పిన జనపదాలకు అధిపతులుగా, ఇక్ష్వాకు శాసనాలు తెల్పుతున్నాయి.

శాలంకాయన శాసనాలు గ్రామ పరిపాలనలో ముసుద, లేక గ్రామాధిపతికి, కులపుత్త (కులపుత్ర), భద మనుస్స (భటమనుష్య) అనే వారు సహకరిస్తున్నట్లు, సూచిస్తాయి. కులపుత్రులనగా కుల, వృత్తి సంఘాలకు నాయకులు; భటమనుష్యులు సాయుధులైన కావలివారు. గ్రామ పరిపాలనలో తగు నిర్ణయాలను తీసుకొనే సందర్భంలో, ముసుద కులపుత్రులతో కూడిన గ్రామ సభను సమావేశపర్చే వాడని గ్రహించొచ్చు. ఆ విధంగా, గ్రామ పరిపాలన సమిష్టి నిర్ణయంపై జరిగేది. భట మనుష్యులు గ్రామ స్థాయిలో శాంతిభద్రతలను, ఆస్తులను సంరక్షించేవారు.

రాజులు గ్రామ, భూదానాలను ప్రకటించినప్పుడు, సంబంధిత గ్రామం లోని గ్రామాధికారిని, గ్రామకూట ముఖ్యులను సమావేశపర్చి తెలియజేస్తున్నట్లు, శాసనాలు వివరిస్తాయి. బహుశ:, రాజులు తమ నిర్ణయాలను నేరుగా ప్రకటించడం కాక, ఆయా దానాలను చేయదలచినప్పుడు, ముందుగా వారిని సంప్రదించి, అభిప్రాయాన్ని గ్రహించేవారని, ఆ విధంగా గ్రామ పరిపాలనా వ్యవస్థ కొంత స్వపరిపాలనాధికారాన్ని కలిగి ఉండేదని గ్రహించొచ్చు.

7.2.6 : ఆర్థిక పరిపాలన

పరిపాలనా వ్యవస్థకు గ్రామ పరిపాలనా వ్యవస్థ మూలమైనట్లు, ఆర్థిక పరిపాలనకు అతి ప్రాచీన కాలం నుండి భూమి శిస్తు ప్రధానమైన వనరు. వ్యవసాయాన్ని విస్తరించడం, వ్యవసాయాదాయాన్ని పెంచడాన్ని, రాజులు తమ ధర్మంగా భావించవలసిందని, నీతి శాస్త్రాలు ఉద్బోధిస్తాయి. సారవంతమైన మైదాన భూములపై ఏర్పడిన జనపదాలు, ఆర్థికంగా పటిష్ఠం కావడం, సాంస్కృతిక అభివృద్ధిని సాధించడం, భారతదేశ చరిత్రలో గుర్తించాల్సిన ప్రధానాంశం. శాతవాహనానంతర కాలంలో రాజులు ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టి, అపారంగా భూదానాలను చేయడం, హలశతసహస్ర దానాలను చేసినట్లు శాసనాల్లో వర్ణించుకోవడాన్ని పైన వివరించడం జరిగింది.

శాతవాహనుల తర్వాత పరిపాలించిన రాజ వంశాలు తమ శాసనాల్లో 'కర', 'భాగ', 'భోగ' అనే పేర్లతో, తమ ఆదాయ వనరులను సూచిస్తాయి. వీటిలో 'కర' అనగా, పన్ను అని అర్థం. అది భూమి పైన కావచ్చు, పరిశ్రమల పైన కావచ్చు. అయితే, క్రమంగా 'కర', పరిశ్రమలు, వృత్తులు, వ్యాపారాల పైన విధించబడేదిగా, ప్రత్యేక గుర్తింపును పొందింది. రాజులు గ్రామ దానాలను ప్రకటిస్తూ, 'సర్వకరపరిహారంగా' ప్రదానం చేసినట్లు ప్రకటించేవారు. అంటే, అన్ని విధాలైన పన్నుల నుండి దాన గ్రహీతలు మినహాయింపును పొందినట్లు, ఆ వాక్యానికి అర్థం.

"భాగ" మనగా రాజుకు ఫలసాయంతో చెందవలసిన భాగమని, స్పష్టపడుతుంది. రాజ్యం స్వయంగా వ్యవసాయ విస్తరణకు పూనుకొని, సేద్యం చేయించినప్పుడు, ఫలసాయంలో నగ భాగం సేద్యకాండ్రకు, నగం రాజుకు లభిస్తుంది. అటువంటి భూములను "సీత" భూములని అర్థశాస్త్రం పేర్కొంటున్నట్లు, పైన విస్తరించడం జరిగింది. స్వంత హక్కులతో సాగు భూమిని కలిగి, వ్యవసాయం చేసుకొనే కర్షకులు, 'కర' అనే పన్నును చెల్లించేవారు.

"భోగ" అనే పన్ను కూడ, సైద్ధాంతికంగా సాగు భూమి సమస్తం రాజుకే చెంది ఉండగా, కర్షకులు వ్యవసాయం చేసుకొని, ఫలసాయం పొందుతున్నందుకు ప్రతిఫలంగా చెల్లించే పన్నుగా, పలువురు చరిత్రకారులు అభిప్రాయపడతారు. అంతేకాక, కొన్ని శాసనాలు, స్థానిక అధిపతులు, విషయపతులు, ఇతర ఉన్నతోద్యోగులు "భోజక" అనే బిరుదాన్ని ధరించినవారిని, పేర్కొంటాయి. భోజకుడంటే భుజించే వాడని అర్థం. ప్రాంతీయ పరిపాలనా విభాగాలను "ఆహారాల" ని వ్యవహరించడం, కొందరు

BRAOU

ప్రాంతీయ పరిపాలకులు "భోజకు"లని పేర్కొనబడడంతో, సరిపోలుతున్నది. కాగా, "భోగ" అనే పన్ను, రాజు అనుమతితో ప్రాంతీయ పరిపాలకులు వసూలుచేసుకొనేదిగా గ్రహించడం, యుక్తం.

పన్నులు, సుంకాల గురించి శాతవాహనానంతర యుగంలోని శాసనాలు, "దేయ", "మేయ" అనే పదాలను ఉపయోగిస్తాయి. "దేయ" అంటే ఇచ్చేది, లేదా చెల్లించేది; "మేయ" అనగా కొలతవేసి నిర్ణయించబడేది. "దేయ" ధన రూపంలో, లేదా వస్తు రూపంలో చెల్లించబడేది; మేయ ధాన్య రూపంలో చెల్లించబడేదని గ్రహించొచ్చు. వర్తకులు, వృత్తి సంఘాలు తమ ఉత్పత్తులను, లేదా ఆదాయంలో భాగాన్ని ధన రూపంలోను, వస్తు రూపంలోను చెల్లించేవారని, గ్రహించొచ్చు. ధన రూపంలో పన్ను "హిరణ్య" మని పేర్కొనబడింది.

వస్తు రూపంలో చెల్లించే సుంకాల్లో మొట్టమొదట చెప్పవలసింది, పశువులు. శాతవాహనానంతర రాజ వంశాలు అపారంగా భూములను దానం చేసినట్లుగానే, గోశత సహస్రాలు, అంటే లక్షల సంఖ్యలో గోవులను దానం చేసినట్లు, తమ శాసనాల్లో వివరించాయి. ఇందులో కొంత అతిశయోక్తి ఉన్నా, ఆ కాలంలో జరుగుతున్న వ్యవసాయ విస్తరణకు అనుబంధంగా, ఈ విధమైన పశు సంపదను దానం చేయడం యధార్థమేనని భావించొచ్చు. వ్యవసాయంలో ఉపయోగపడేందుకు, పాడి పశువులుగాను, ఇటీవలి కాలం వరకు పశు పోషణ గ్రామీణ జీవితానికి స్వాభావికంగా ఉండేది. అయితే, అంత విరివిగా పశువులను పంపిణీ చేయడమెలా సాధ్యమని ప్రశ్నించుకోవలసి ఉంటుంది. సమకాలీనమైన వాకాటక శాసనాలు, బ్రాహ్మణాగ్రహారాలు, లేక ఇతర గ్రామ, భూదానాలను ప్రకటిస్తూ ఇచ్చిన పరిహారాలలో (పన్ను మినహాయింపులు), "అపారం పర గోబలీవర్ద" అనే వాక్యాన్ని ప్రస్తావించాయి. అంటే, పరంపరాగతంగా గోవులను, ఎద్దులను ఇచ్చే ఆచారం నుండి, ఆ దాన గ్రహీతలు మినహాయింపును పొందారని భావం. దీనిని బట్టి, వ్యవసాయదారులు తమ పశువుల నుండి పారంపర్యంగా, పశువుల రూపంలో ప్రభుత్వానికి సుంకం చెల్లించేవారని, అర్థమౌతుంది. ఆచార్య వి.వి. మిరాషీ వ్యవసాయదారులు తమ పశువులు ఈనిన మొదటి దూడను సుంకంగా ప్రభుత్వానికి సమర్పించేవారని, వివరించాడు. ఈ వివరణ సహేతుకమే అని తోస్తుంది. ఈ విధంగా పశువులను సంపాదించి, సంరక్షించేందుకు "రాజవల్లభు" లనే రాజోద్యోగులున్నట్లు, పైన వివరించడం జరిగింది.

"మేయ" పదాన్ని బట్టి, వ్యావసాయిక ఉత్పత్తులను కొల్చి, ప్రభుత్వానికి ధాన్య రూపంలో పన్ను చెల్లించే విధాన మున్నట్లు గ్రహించొచ్చు.

పైన పేర్కొన్న పన్నులు, సుంకాలకు తోడుగా, కొన్ని శాసనాలు "ఉపకర" అనే పన్నును పేర్కొంటున్నాయి. కాని, ఇది ఎవరిపై, ఎందుకు విధించబడేదో, ఏ విధంగా వసూలుచేయబడేదో, తెలియదు. విష్ణుకుండిన శాసనాల్లో ఇటీవలి కాలంలో లభించిన తుమ్మలగూడెం శాసనం (మొదటిది), "విష్టి" అనే సుంకాన్ని పేర్కొంటున్నది. ఉత్తర భారతదేశంలో గుప్త చక్రవర్తుల కాలం నుండి, ఇటువంటి పన్ను వసూలౌతున్నట్లు, శాసనాల్లో ఉదాహరణలున్నాయి. అయితే, దక్షిణ భారతదేశంలో ఈ విష్ణుకుండిన శాసనమే మొట్టమొదటగా ఈ సుంకాన్ని పేర్కొంటున్నది. "విష్టి" అనగా, ప్రతిఫలం లేకుండ చేసే సేవ, లేదా చాకిరి. రాజులకు, రాజోద్యోగులకు వారు సంచారం (tour) లో ఉన్నప్పుడు అందించే వివిధ సదుపాయాలు, సేవలను, ఈ విధమైన పేర సూచించారు.

పైన వివరించినట్లు వివిధమైన సుంకాలు, పన్నులు కాక, రాజుకు చవిటి నేలల నుండి ఉప్పు త్రవ్వి తీసే హక్కు, గనుల నుండి ఖనిజాలను త్రవ్వి తీసే హక్కులున్నట్లు, దాన శాసనాల్లో పేర్కొన్న పరిహారాలు సూచిస్తాయి. కాగా, ప్రధాన గ్రామాలు కాక, మిగిలిన గ్రామాల్లో ఈ హక్కులు రాజుకే

BRAOU

చెంది ఉండేవని గ్రహించొచ్చు. అంతేకాక, అడవులు, పచ్చిక బయళ్ళు రాజ్యం అధీనం లోనే ఉండేవి. అటువంటి భూములనే హలశతసహస్రంగా రాజులు దానాలుగా చేసి, వ్యవసాయ విస్తరణకు, నూతన గ్రామాలు, జనపదాల నిర్మాణానికి కృషి చేశారు. అటువంటి భూముల్లో అడవులను నిర్మూలించి, వ్యవసాయ విస్తరణ చేసినవారికే, ఆ భూములు పూర్తి హక్కులతో చెందుతాయని ధర్మశాస్త్రాలు ఏర్పర్చాయి. ఈ సూత్రాన్ని "భూమిచ్ఛిద్రన్యాయం" అంటారు. అటువంటి భూములపై సుంకాలను, పన్నులను రద్దు చేయడం, లేదా తగ్గించడంతో, రాజులు ఉత్సాహవంతులైనవారిని ప్రోత్సహించి, ఈ విస్తరణ కార్యక్రమానికి తమ వంతు కృషిని నిర్వహించారు.

గ్రామ, క్షేత్ర దానాలను ప్రకటిస్తూ, దాన గ్రహీతలకు ఇచ్చిన పరిహారాలను గూర్చి కొంత వివరంగా తెలుసుకోవలసిన అవసరముంది. శాతవాహనానంతర యుగంలో ప్రాచీన పల్లవ, వాకాటక (మహారాష్ట్ర ప్రాంతంలో పరిపాలించిన రాజ వంశం) శాసనాల పలన, కొంతవరకు పరిహారాలను గూర్చిన సమాచారం లభిస్తుంది. సాంప్రదాయికంగా ఇవి అష్టాదశ సంఖ్య కలవిగా, అనగా పద్దెనిమిది విధానాలైనవిగా శాసనాలు పేర్కొన్నా, అవి సమగ్రంగా ఎక్కడా ప్రస్తావించబడలేదు.

సర్వకరపరిహారంగానే కాక, శాసనాల నుండి మరికొన్ని వివరాలను గ్రహించొచ్చు. రాజుకు, రాజోద్యోగులకు పాలు, పెరుగు, కూరగాయలను సమర్పించడం, కూర్చునేందుకు ఆసనాలు, పడుకొనేందుకు మంచాలను అమర్చడం, వారికి భోజనాదికాలను వండి, అమర్చడం, మొదలైనవి చేయవలసిన అవసరం లేకుండడం, మొట్టమొదట అంశం. రాజు, రాజోద్యోగులు రాజ్యంలో పర్యటించే సమయాన, సాధారణ గ్రామాల్లోని ప్రజలు సాధారణంగా ఇటువంటి సేవలను అందించవలసిన అవసర మున్నట్లు, దీని వలన బోధపడుతుంది; కాగా, అగ్రహారాల్లో, దేవభోగాల్లో, ఇటువంటి సేవలు వారికి చేయనవసరం లేదు.

ఇటువంటి పరిహారాలు, రాజ్యానికి రావలసిన ఆదాయం ప్రదత్త గ్రామాల నుండి రాకపోవడం, పరిపాలనాధికారం ఆ గ్రామాల్లో చెల్లకపోవడంతో, అవి రాజ్యంలో స్వతంత్ర రాజ్యాలుగా ఏర్పడి, రాజ్యాధికారాన్ని బలహీనం చేశాయని, క్రమేణా ఇటువంటి దానాలు ఉన్నతోద్యోగులకు ఇయ్యడంతో, క్రమక్రమంగా రాజు, రాజ్యాదాయాన్ని, రాజ్యాన్ని కూడ పోగొట్టుకొంటూ, బలహీనం కాగా, ఈ గ్రామాలను పొందిన బ్రాహ్మణులు, రాజోద్యోగులు బలపడ్డారని, ఆధునిక చరిత్రకారులు పలువురు విమర్శిస్తారు. అప్పటి రాజ్యాల్లో సుమారుగా ఎన్ని గ్రామాలుండేవో, ఎన్ని గ్రామాలకుగాను ఎన్ని గ్రామాలు ఈవిధంగో, అగ్రహారాలుగాను, దేవభోగాలుగాను ఏర్పడ్డాయో, స్పష్టంగా తెలియదు. అందు చేత, ఎంత మేర, రాజులు తను రాజ్యాన్ని, రాజ్యాధికారాన్ని నష్టపోయారో నిర్ణయించే వీలులేనందున, పై అభిప్రాయం అంగీకరించదగిందిగా కన్పించదు.

7.3 : సామాజిక స్థితిగతులు

క్రీస్తు శకం మొదటి శతాబ్ది నుండి అయిదో శతాబ్ది వరకు, ప్రాచీన భారతదేశంలో నవ్య వైదిక ధార్మిక సంస్కృతిని వివరించే వాఙ్మయం అపారంగా వెలువడింది. అనేక ధర్మశాస్త్రాలు, లేక స్మృతులు, పురాణేతిహాసాలు, గ్రంథ రూపాన్ని ధరించాయి. ఇవి సాంఘిక, ఆధ్యాత్మిక అంశాల్లో వ్యవస్థాత్మకంగాను, ఆచరణాత్మకంగాను, ప్రజానీకానికి మార్గదర్శకంగా ఉద్దేశించబడినవి. ధర్మశాస్త్రాలు నియమనిబంధనలను ఏర్పర్చగా, పౌరాణిక - ఇతిహాస వాఙ్మయం వివరించే సాంఘిక వ్యవస్థ, వర్ణాశ్రమ ధర్మంపై ఆధారపడింది. ఈ పరిణామాలు లోగడ శాతవాహన యుగంలో ఏర్పడి, కొనసాగుతున్నవే. వీటిని గూర్చి, పైన సంక్షిప్తంగా వివరించడం జరిగింది.

BRAOU

7.3.1 : సమాజం : వర్ణ వ్యవస్థ

పైన పేర్కొన్న ప్రాచీన వాఙ్మయం రూపొందించిన వర్ణాశ్రమ సాంఘిక వ్యవస్థను కుల వ్యవస్థగా భ్రమించి, మలి వేద కాలం నాడే అది ప్రబలంగా ఏర్పడి పోయిందని, లోగడ చరిత్రకారులు పలువురు అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయాలు అసంగతం. చతుర్వర్ణ సిద్ధాంతం స్థూలంగా సమాజం నాలుగు విధాలైన ప్రజలతో ఏర్పడి ఉంటుందని; వారిలో విద్యావంతులు, ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించేవారు, ఆర్థిక జీవనులు - వ్యవసాయ, పారిశ్రామిక, వర్తక రంగాల్లో ఉండేవారు - శ్రమజీవనులు ఉంటారని, ఒక ఆలంకారికమైన, అధివాస్తవ (mystic) మైన ధోరణిలో వివరిస్తుంది. కాగా, కుల వ్యవస్థ ప్రతి వ్యక్తికి జన్మతోనే పారంపర్యంగా ఒక వృత్తి, దానితో గూడిన సాంఘిక స్థితి (social status)ని కలిగిస్తుంది. ఆధునిక చరిత్రకారులు, సాంఘిక శాస్త్రవేత్తలు, ఈ రెండింటిని వర్ణ విధానం, జాతి విధానమని ప్రత్యేకీకరిస్తారు. కుల వ్యవస్థ, లేక జాతి విధానమని ప్రత్యేకీకరిస్తారు. కుల వ్యవస్థ లేక జాతి విధానం, క్రీస్తు శకారంభం నుండి క్రమంగా ఏర్పడుతున్నది. కనుక, ధార్మిక వాఙ్మయం వివరించే వర్ణ విధానానికి వాస్తవ ప్రాధాన్యత లేదు.

స్థూలంగా వర్ణ వ్యవస్థ వృత్తి పరంగా సమాజాన్ని నాలుగు వర్ణాలుగా ఏర్పర్చినా, క్రీ.పూ. మొదటి శతాబ్దారంభం నుండి భారతదేశం విస్తృతంగా మధ్యధరా సముద్ర ప్రాంతాలతో జరిపిన వర్తక వాణిజ్యాలు, దేశంలో విస్తారంగా నూతన, గ్రామాలు, జనపదాల నిర్మాణం వంటి సాంఘిక, ఆర్థిక పరిణామాలు, అనేక మార్పుచేర్పులను కలిగించాయి. బౌద్ధ జాతక కథలు, వివిధ సాంఘిక వర్గాలు, అంటే కులాలు, తమ కుల ధర్మాన్ని కాక, అనేక ఇతర వృత్తులను అవలంబించడాన్ని వివరిస్తాయి. ఆనాటి పరిణామాలు అనేక వృత్తులకు ప్రోత్సాహాన్నిచ్చినందున, నేత పనివారు, శిల్పులు, కమ్మరులు, కుమ్మరులు, చర్మకారులు, మానెగానుగలవారు, వడ్రంగులు, దంతపు పనివారు, మొదలైన వారు తమ తమ వృత్తి సంఘాలను, శ్రేణులను ఏర్పర్చుకొని, తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొన్నారు; పారంపర్యంగా తమ కుటుంబాల్లోనే తర్వాతి తరాలకు అందించారు. దీని వలన వృత్తి పరంగా కులాలు ఏర్పడ్డాయి. వర్ణ విధానం క్రమంగా వాస్తవ ప్రాధాన్యతను పోగొట్టుకోడానికి, జాతి విధానం ఏర్పడి, బలపడ్డానికి, అది కారణమైంది. సమాజంలో వారికి ఉన్న ప్రాముఖ్యత, వారికి ఆర్థికంగా సమకూరుతున్న సౌష్ఠవం, వాస్తవ ప్రాధాన్యత గలవిగా గుర్తించడం, యుక్తం. అంతేకాని, ధర్మశాస్త్ర వాఙ్మయం వారిని శూద్రులుగా పరిగణించిందని, శూద్రులు ఏ విధమైన స్వేచ్ఛ, హక్కులు లేకుండ, పై మూడు వర్ణాలకు చెందిన ద్విజులను సేవించడమే ధర్మంగా విధించిందని మాటి మాటికి స్మరించడం వలన, ప్రయోజనం లేదు. సంస్కృతంలో ఏర్పడిన ధర్మశాస్త్ర వాఙ్మయాన్ని చదవడానికి, దానిని గూర్చి యోచించడానికి, ఆ వర్గాలకు అవకాశం లేదు; అవసరం లేదు. అందుచేత, కేవలం వాఙ్మయాధారాల ననుసరించి, నిర్ణయాలు చేయడం కంటె, అటువంటి వాఙ్మయ ముత్పత్తైన కాల పరిస్థితులను దర్శించగల తార్కిక వివేచన అవసరం.

7.3.2 : బ్రాహ్మణులు

వేదవేదాంగవిదులు, సదాచారసంపన్నులైన బ్రాహ్మణులకు విరివిగా శాతవాహనానంతర యుగంలో అగ్రహారాలు, బ్రహ్మదేయాల నిస్తున్నట్లు వివరించే రాజ శాసనాలు, ఆ యుగంలో బ్రాహ్మణులు సామాజిక వ్యవస్థలో అత్యున్నత స్థానాన్ని పొందినట్లు అర్థం చేసుకోడానికి, దారితీస్తాయి. వారి అగ్రహారాల్లోనికి రాజోద్యోగులు ప్రవేశించరాదనే నియమాన్ని విధించడంతో, వారు రాజు, రాజ్యం కంటె ప్రబలమైన శక్తిగా రూపొందినట్లు, సాధారణంగా ఆధునిక చరిత్రకారులు అభిప్రాయపడతారు.

BRAOU

అటువంటి అగ్రహారాల వాస్తవ ప్రయోజనాన్ని పైన వివరించడం జరిగింది. అవి ఆనాటి సాంఘిక, ఆర్థిక విస్తరణలోను, రాజ్య విస్తరణలోను ప్రయోజనకరంగా భావించబడినందున, అటువంటి దానాలకు ప్రాముఖ్యత పెరిగింది. ఆనాటి బ్రాహ్మణులందరు ఆ విధంగా అగ్రహారాలను పొందినవారని భావించడం సహేతుకం కాదు. ఈ ప్రయోజనాలను సాధించడానికి ఉపయోగించే కొద్ది మందికి మాత్రమే, వాటి నియ్యడం జరిగింది. ఈ సందర్భంలో తాల్గుండ శాసనం లోని కదంబ రాజ్య స్థాపన గూర్చిన ఇతివృత్తాన్ని ప్రస్తావించొచ్చు. కదంబ వంశీయుడైన మయూర శర్మ వేద విద్యను అభ్యసించడానికి కాంచీనగరం వెళ్ళి, రాజోద్యోగుల వలన అవమానించబడ్డాడు; అంతట కలి యుగంలో బలగర్వితులైన క్షత్రియుల చేత అవమానాన్ని పొందుతున్న బ్రాహ్మణుల స్థితికి క్రోధావేశాన్ని కలిగి, తన కుల ధర్మాన్ని విడిచి, కత్తిని చేత పట్టినట్లు, ఆ ఇతివృత్తం లోని సారాంశం. హారీత గోత్రులైన కదంబులు, భారద్వాజ గోత్రులైన పల్లవులు బ్రాహ్మణులని, పలువురు చరిత్రకారులు లోగడ భ్రమించారు. బ్రాహ్మణులు కత్తిని చేతపట్టి రాజ్య స్థాపన చేయడం, వర్ణాశ్రమ ధర్మాన్ని తిరస్కరించడమేననే ఊహ, వారికి రాలేదు. పైగా, ఆనాటి బౌద్ధ మత ప్రాబల్యానికి ప్రతిగా, హిందు మతం చేసిన ప్రతిఘటనగా, ఆ సందర్భాలను అర్థం చేసుకోవడం జరిగింది. ఈ సంఘటనలను జాతి సిద్ధాంతం దృష్ట్యా అవగాహన చేసికోవాల్సుంటుంది. కాని, వర్ణ సిద్ధాంతం దృష్ట్యా కాదు.

బ్రాహ్మణులు తాము అధ్యయనం చేసే వేద శాఖను, అనుసరించే ధర్మ సూత్రాలను బట్టి, శాఖలుగ్గా ఏర్పడ్డారు. ప్రాచీన పల్లవ, శాలంకాయన, విష్ణుకుండిన శాసనాలు తైత్తిరీయ, చంధోగ, వాజసనేయి వేద శాఖలను, ఆపస్తంభ, హిరణ్యకేశి ధర్మసూత్రాలను విస్తారంగా పేర్కొంటాయి. వారు అనేకే గోత్ర, చరణాలకు చెందినవారని, ఆ శాసనాలు వర్ణిస్తాయి. వేద శాఖల ననుసరించి ఏర్పడినవే గోత్రాలు, చరణాలు. గోత్రం గురుశిష్యపరంగా వచ్చేది. చరణమనేది వారనుసరించే ధర్మసూత్రాలు, ఆచార వ్యవహారాలాధారంగా ఏర్పడేది; వృత్తి సంఘాల లోని శ్రేణితో పోల్చదగింది.

పైన పేర్కొన్నట్లు, వేదవేదాంగవిదులు, సదాచారసంపన్నులైన బ్రాహ్మణులను, నూతనంగా ఏర్పడుతున్న గ్రామాల్లో, జనపదాల నడుమ నెలకొల్పడం వలన, ధార్మిక సంస్కృతి వృద్ధి చెంది, ప్రజలు దైవ భక్తితోపాటు, రాజ భక్తిని అలవర్చుకుంటారని, అగ్రహారాల నియ్యడం జరిగింది. దీని వలన, రాజ్యాధికారం ప్రబలమౌతుంది; ప్రజలు తమ తమ వృత్తిధర్మాలను శ్రద్ధాసక్తులతో అనుసరిస్తారు. రాజ్యాల్లో రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయని, వీటిని ఉద్దేశించడం జరిగింది.

7.3.3 : సామాజిక విస్తరణ: శూద్ర వర్ణం

క్రీ.శ. రెండో శతాబ్దికి చెందిన మనుస్మృతి, శక, యవన, పహ్లవ, ఆభీర మొదలైన జాతులు "వ్రాత్య" క్షత్రియులని పేర్కొన్నట్లు, ఈ విదేశీయ జాతులు నవ్య వైదిక సంస్కృతిని అనుసరించి, భారతీయులతో సమాన సాంస్కృతిక లక్షణాలను పొందడం వలన, సంస్కృతికారులు ఈ విధంగా పేర్కొన్నట్లు, పైన వివరించడం జరిగింది. వర్ణ వ్యవస్థను జాతి వ్యవస్థగా పరిగణించే కాలాన, ఆయుధ వృత్తులను అనుసరిస్తూ, పరిపాలనా రంగంలో ఉన్నందున, స్మృతికారులు వారిని క్షత్రియులుగా పరిగణించినట్లు, వారి సంతతి క్షత్రియ కులంగా ఏర్పడినట్లు భావించడం, యుక్తం. వారితోపాటుగా, అనేక దేశీయ జాతులు, తెగలను సైతం, నవ్య వైదిక, ధార్మిక ప్రభావంతో, భారతీయ జీవన స్రవంతిలో పైన పేర్కొనటం జరిగింది. ఆ తరుణంలో వారి ధార్మిక దృక్పథం, సంస్కృత భాషాభిమానం, బ్రాహ్మణ పోషణ, ఒక దశలో వారు బ్రాహ్మణులుగా పరిగణన పొందటానికి తోడ్పడినట్లు భావించొచ్చు. ఈ పరిణామం శాతవాహన యుగం లోనే ప్రారంభమైందని, వారితో వైవాహిక సంబంధాలను

BRAOU

కల్గిన గౌతమి, వాసిష్ఠీ గోత్రీయులు ఈ పరిణామం లోనే ఉత్పన్నమైనారని తోస్తుంది. అందువల్ల, పహ్లవులు భారద్వాజ గోత్రీయులైన పల్లవులుగాను; వాయువ్య సరిహద్దు ప్రాంతంలో బహుశః పారశీకులతో జాతిపరమైన సంబంధం గల శాలంకాయనులు, ఆంధ్ర దేశ తీర మైదానాలను చేరి, శాలంకాయన గోత్రీకులుగా ప్రసిద్ధి చెందినట్లు గుర్తించొచ్చు. **మహాభారతం** సింధూ నదీ ప్రాంతంలో నివసిస్తున్న హారుతులు, ఆత్రేయులు ఆటవికులని, వారు బ్రాహ్మణ ధర్మాన్ని అవలంబించి బ్రాహ్మణులుగా పరిగణన పొందారని పేర్కొంటుంది.

ఈ సామాజిక విస్తరణలో అన్ని జాతులు, కులాల సంఖ్య లోను ఆర్థిక, రాజకీయ రంగాల్లోను, ప్రాబల్యాన్ని పొందాయి. ఆ సమయంలో శూద్ర వర్ణం సైతం అటువంటి పరిణామాలను పొందినట్లు, సూక్ష్మంగా సాక్ష్యాధారాలను పరిశీలించినపుడు స్పష్టపడుతుంది. వారు సైతం ఆయుధ వృత్తులను చేపట్టి, రాజకీయ జీవితంలో ప్రవేశించారు. వారిని ఆశ్రయించిన బ్రాహ్మణులు వారిని మొదట వ్రాత్యులుగాను, తర్వాత క్షత్రియులుగాను, పరిగణించారని గ్రహించొచ్చు. శూద్రులు రాజ్య పాలన చేస్తూ, అశ్వమేధ యాగాలను చేస్తారని **పురాణాలు** పేర్కొనటం, ఈ సందర్భంగా గమనించదగిన అంశం. వ్యవసాయ ప్రధానమైన ఆర్థిక వ్యవస్థలో క్రీస్తు శకారంభ కాలంలో సంభవించిన అభివృద్ధి పరిణామాలు, వారు గ్రామాధికారులుగా, క్రమంగా రాజ్య పాలకులుగా ఉన్నతిని సాధించడానికి తోడ్పడినట్లు భావించడంలో, అసమంజసం లేదు. క్రీ.శ. నాలుగు, అయిదు శతాబ్దాలలో ఆంధ్ర దేశాన్ని పరిపాలించిన రాజ వంశాలు ఈ విధంగా శూద్ర, విదేశీ జాతుల సమ్మేళనంతో ఏర్పడినవేనని గ్రహించడం, యుక్తం. ఈ సందర్భంలో **యజ్ఞవల్క్య స్మృతి** వంటి కొన్ని ధర్మశాస్త్ర గ్రంథాలు, శూద్రులు సేవకా వృత్తిని అవలంబించేవారని చెప్పకపోవడం, గుర్తించదగిన అంశం. వారు వ్యవసాయం, పశు పాలన, వర్తక వాణిజ్యాలు మొదలైన వృత్తులను అనుసరించేవారని, ఈ స్మృతులు తెల్పుతాయి.

BRAOU

సైన పేర్కొన్నట్లు, సామాజిక పరిణామాల్లో వృత్తి సంఘాల ప్రాధాన్యత చాలా ఉంది. వారు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొంటూ, దానిని తమ వరకే పరిమితం చేసుకొని, పారంపర్యంగా తమ సంతతికి అందించడమేకాక, తమకు తామే సాంఘిక కట్టుబాట్లను, చట్టాలను నిర్మించుకొనడంలో వర్ణ వ్యవస్థ జాతి వ్యవస్థగా పరిణమించి, కులాల వారీగా సమాజం ప్రత్యేక వర్గాలుగా ఏర్పడింది. ధర్మశాస్త్రాల తోను రాజ శాసనాలతోనూ, వారి కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు విభేదించినపుడు, వాటికే ప్రాధాన్యత నీయవలసిందిగా, స్మృతులే స్పష్టంగా నిర్దేశించాయి. ఇటువంటి స్పష్టమైన వృత్తి ధర్మంతో కూడిన వృత్తులు, సామాజిక వర్గాలు ఆనాటి ఆర్థికావసరాలకు ఆవశ్యకమైనవి. అందుచేత, నాటి రాజ్య వ్యవస్థలో వర్ణ సాంకర్యాన్ని అరికట్టినట్లు, "కలి యుగ దోషావసన్న ధర్మోద్ధరణ నిత్య సన్నద్ధ" అని, వర్ణించుకున్నారు. వర్ణ వ్యవస్థను దైవ నిర్మిత శాసనంగా, బ్రాహ్మణుల సాయంతో సుస్థిరం చేశారు.

7.3.4 : సమాజంలో స్త్రీల స్థానం

ప్రాచీన భారతీయ సమాజంలో స్మృతికారులు, అంటే ధర్మశాస్త్ర కర్తలు, స్త్రీకి స్వాతంత్ర్యం తగదని నిషేధించినట్లు, అందువలన కాలక్రమంగా స్త్రీ తన హక్కులను కోల్పోయి, పురుషునికి బానిసగా ఏర్పడిందని కనిపిస్తుంది. మనుస్మృతి స్త్రీ బాల్యంలో తండ్రి రక్షణ లోను, యౌవనంలో భర్త సంరక్షణ లోను, వార్ధక్యంలో పుత్రుల సంరక్షణ లోను ఉండవలసిందని వివరించాడు.

అయితే, స్త్రీ గృహిణిగా, గృహస్థుతో అన్ని నిత్య, నైమిత్తిక, ఐహిక, ఆముష్మిక కార్యక్రమాల్లో పాల్గొనదగిందిగా, ధర్మశాస్త్రాలు, పౌరాణిక, ఇతిహాసిక వాఙ్మయం స్పష్టపరుస్తున్నాయి. ఒక ఆర్థిక స్వతంత్రాన్ని మాత్రమే స్మృతులు అనుమతించ లేదు. పురుషునికి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని అనుమతించిన అన్ని సందర్భాల్లో, సహధర్మచారిణైన స్త్రీతో, అంటే భార్యతో, సంప్రదించి నిర్ణయించడం, యుక్తమైందిగా, ఆ వాఙ్మయం నిర్ణయించింది. స్త్రీని ఆదరాభిమానాలతో చూడాలని, స్త్రీలు, పూజించబడిన చోట్ల దేవతలు నివసిస్తారని, స్త్రీని అవమానించడం వలన పుణ్య కార్యాలు నిష్ఫలం కాగలవని, **మనుస్మృతి** వివరిస్తుంది.

ఉన్నత కులాల్లో స్త్రీలు పురుషులతో కలసి, కొన్ని సందర్భాల్లో స్వయంగా, దానధర్మాలను చేయడం, అమరావతి, నాగార్జునకొండ వద్ద లభించిన శాసనాలు స్పష్టపరుస్తున్నాయి. నాగార్జునకొండ వద్ద మహాచైత్యానికి, రాజ కుటుంబాలకు చెందిన స్త్రీలు విరివిగా దానధర్మాలను ప్రకటించడం వలన, వైదిక ధర్మం నిషేధించిన స్త్రీ స్వాతంత్ర్యాన్ని, బౌద్ధ ధర్మం అనుమతించిందని, అందు వల్ల స్త్రీలు ఆ మతం పట్ల అపరిమితమైన ఆదరణను ప్రదర్శించారని, చరిత్రకారులు బహుళంగా అభిప్రాయపడతారు. స్మృతులు, ధర్మశాస్త్రాలకు ఆనాటి సామాజిక వ్యవస్థలో వాస్తవ ప్రయోజనం లేదని, ఋషులు తమకు ఆదర్శంగా కనిపించిన విషయాలను ఆ వాఙ్మయంలో పొందుపర్చారని, పైన వివరించడం జరిగింది. కనుక, ధర్మ శాస్త్రాలు నిరాకరించినంతమాత్రాన, స్త్రీ స్వాతంత్ర్యం పూర్తిగా అంతరించినట్లు, అది తిరిగి బౌద్ధ మత విస్తరణతో పర్పడినట్లు భావించడం, సహేతుకం కాదు. ఇక్ష్వాకులు వైదిక ధర్మాన్ని అనుసరించినా, ఆ కాలంలో స్త్రీలు భర్తలను వ్యతిరేకించి, బౌద్ధ ధర్మాన్ని ఆదరించారని నిర్ణయించడానికి, ఆధారాలు లేవు. ఇక్ష్వాకు వంశపు ఆడబడుచులే కాక, ఆ వంశాన్ని మెట్టిన స్త్రీలు కూడ, మహాచైత్యానికి దాన ధర్మాలను ప్రకటించారు; వారిలో పలువురు వైదిక ధర్మాన్ని అనుసరించే వంశాల్లో జన్మించినవారు.

BRAOU

7.4 : ఆర్థిక స్థితిగతులు

రాజకీయ, సామాజిక స్థితిగతులను వివరించే సందర్భంలో, శాతవాహనుల అనంతర కాలం నాటి ఆర్థిక పరిణామాలను గూర్చి, విస్తృతంగా చర్చించడం జరిగింది. ఆనాటి రాజకీయ, సామాజిక ఫరిణామాలు, ఆర్థిక పరిణామాల వలన ప్రాప్తించినవే! అందుచేత, పై చర్చల లోని ఆర్థికాంశాల సారాన్ని, ఇక్కడ వివరించడం జరిగింది.

7.4.1 : వర్తక వాణిజ్యాలు - క్షీణత

క్రీ.శ. రెండో శతాబ్దం నుండి రోమన్ సామ్రాజ్యంతో జరుగుతున్న వర్తక వాణిజ్యాలు, క్రమంగా అంతరించడం ప్రారంభమైంది. అప్పటికి, ఆంధ్ర దేశ చరిత్రలో ఇక్ష్వాకు వంశీయుల పరిపాలన అంతరించింది. రోమన్ సామ్రాజ్యంతో వర్తకం ఆ సామ్రాజ్య క్షీణత వలన జరిగింది; క్రీ.శ. రెండో శతాబ్ది మధ్య భాగం నుండి భారతదేశంలో లభించిన రోమన్ చక్రవర్తుల బంగారు నాణేలలో క్రమంగా క్షీణిస్తున్న నాణ్యత, ఈ అంశాలను స్పష్టపరుస్తుంది.

అంతర్జాతీయ వర్తకం క్షీణించడంతో, భారతదేశంలో, ఆంధ్రదేశంలో సైతం, వృత్తులు, కళలు, క్షీణించాయి. వర్తక, శ్రామిక ప్రజానీకం క్రమంగా తమ సాంప్రదాయిక జీవన విధానాలను విడిచిపెట్టి, వ్యవసాయం పట్ల ఉత్సుకతను ప్రదర్శించినట్లు, గ్రహించొచ్చు. అపారంగా లభించే బీడు భూములు,

చిట్టడవులను చేదించి, నేలను చదునుచేసి, అప్పటి ప్రజానీకం విస్తృతంగా వ్యవసాయ విస్తరణను ప్రారంభించారు. దాని వలన, పట్టణాలు, నగరాలు, ప్రాముఖ్యతను కోల్పోసాగాయి. ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం కేంద్రమైంది. దీనిపై ఆధారపడి, ఇతర గ్రామీణ వృత్తులు తమ మనుగడను కొనసాగించాల్సొచ్చింది.

7.4.2 : గ్రామీణ వృత్తులు - సమాజం

గ్రామీణ వృత్తులను సంరక్షించటానికి కుల వ్యవస్థను సమర్థించి, పటిష్టపర్చడం తప్పనిసరైంది. కుల వృత్తుల అభివృద్ధితో సాధించిన స్వల్పమైన మిగులు ఉత్పత్తులతో, పరిమితంగా అంతర్దేశీయ వర్తకం (Inland trade), అంతర్జాతీయ వర్తకాన్ని (International trade) నిర్వహించడం ప్రారంభమైంది. అంతర్జాతీయ వర్తకం భారతీయ వర్తకుల నుండి, అరబ్ వర్తకుల హస్తగతమైంది.

పారంపర్యమైన వృత్తి ధర్మంతో కుల వ్యవస్థ బలపడడంతో, వ్యవసాయ రంగంలో శ్రామిక జనులుగా, తక్కువ స్థాయికి చెందిన కులాలు జీవించాల్సొచ్చింది. సామాజిక విస్తరణ జరుగుతూ, నవ్య వైదిక ధర్మ ప్రభావంలో, నాగరిక సమాజంలో ప్రవేశించే జాతులకు తగినన్ని వృత్తులు లభ్యం కానందున, వ్యవసాయ రంగంలోనే పాటక జనంగా స్థిరపడాల్సొచ్చింది. దీర్ఘ కాలం ఎటువంటి ఆర్థిక పురోభివృద్ధి లేక, నిల్చిపోయిన ఈ జనులు, క్రమంగా అనాగరికులు, అస్పృశ్యులుగా పరిగణించబడ్డారు.

అంతర్జాతీయ వర్తకం క్షీణించడంతో, బంగారు, వెండి, నాణేల చెలామణి తగ్గిపోయింది. పరిమితమైన దేశీయ వర్తకం నాణేల ఆవశ్యకతను తగ్గించి వేసింది. దూర ప్రాంతాలతో జరిగే వర్తక సంబంధాల అవసరం వలన, శాతవాహన యుగం లోని ఆంధ్ర దేశం, సీసం, రాగి మొదలైన తక్కువ విలువ గల లోహాల నాణేలను ముద్రించడం జరిగింది. నాణేల రూపంలో ఉన్న ద్రవ్యం కంటే, భూమి విశ్వసనీయమైన స్థిరాస్తిగా భావించబడినట్లు, వ్యావసాయిక ఉత్పత్తులను వస్తుమార్పిడి విధానంలో అవసరమైన అన్ని వస్తువులను, సేవలను పొందడానికి సాధనంగా భావించినట్లు గుర్తించొచ్చు. అందుచేతనే, రాజులు, ఉన్నత వంశీయులు, బ్రాహ్మణులకు, దేవాలయాలకు తమ దానధర్మాలను భూమిగానే ఉంచ సాగారు.

7.4.3 : వ్యవసాయ విస్తరణ : గ్రామీణ వ్యవస్థ

ఆర్థిక వ్యవస్థ వ్యవసాయంపై ఆధారపడడం చేత, రాజ్య వ్యవస్థ సైతం, ప్రభుత్వాదాయం కొరకు కర్షకులపై ప్రధానంగా ఆధారపడాల్సొచ్చింది. భోజకుల వంటి స్థానిక పరిపాలకులు ఈ పరిస్థితిలో మరింత సమస్యాత్మకమైనారు. అయినప్పటికి, విస్తృతంగా వ్యవసాయ భూములు, నూతన గ్రామాలు ఏర్పడుతుండడం, కొంత వరకు పరిస్థితులను సరళం చేసింది. వ్యవసాయ విస్తరణలో రాజ్యం (State) కూడా పాల్గొనడం, కొత్తగా ఏర్పడే వ్యవసాయ భూముల సాగు గురించి జోక్యం చేసుకోవడంతో, కొంత వరకు స్వతంత్రమైన ఆదాయ వనరులను ఏర్పర్చుకొనడం, వ్యవసాయదారులపై కొంత మేర పట్టిడి తగ్గడం సాధ్యమైంది. అయితే, సంపన్నులు కావడానికి, వారు తమ సాటివారితో, బంధు వర్గంతో ప్రాబల్యాన్ని పెంచుకోగల్గడానికి, పరిపాలనాధికారాన్ని సంపాదించడానికి, వ్యావసాయిక, ఆర్థిక వ్యవస్థ దోహదం చేసింది. ఈ విధమైన పరిణామాలు మధ్య యుగంలో క్రీ.శ. వదో శతాబ్ది నాటికి స్పష్ట రూపాన్ని ధరించాయి. కాని, వాటి ప్రారంభం శాతవాహనానంతర యుగం లోనే ఏర్పడింది.

BRAOU

7.5 : మత-ధార్మిక పరిణామాలు

శాతవాహనానంతర యుగం లోని మత-ధార్మిక పరిణామాలు ప్రధానంగా భక్తి ఉద్యమ ఫలితంగా, వైదిక ధర్మం వైదికేతరమైన (అనగా వేద సామ్రాజ్యాన్ని అంగీకరించని) బౌద్ధ ధర్మం ప్రభావితం కావడం వలన, ఏర్పడినవే. వాస్తవంగా ఈ పరిణామాలు క్రీస్తు పూర్వం అయిదో శతాబ్ది నుండి ప్రారంభమైనట్లు, వాఙ్మయాధారాల వలన, శాసనాధారాల వలన, శాతవాహన యుగం లోను ఈ పరిణామాల ప్రభావాన్ని, ఇంతకు ముందే వివరించడం జరిగింది.

7.5.1 : బౌద్ధ మతం - శైల శాఖలు

శైల శాఖలు శాతవాహన యుగం లోనే, ఆంధ్ర దేశం లోని చైత్యక - మహా సాంఘికులు ప్రాబల్యాన్ని పొందిన విషయాన్ని పైన వివరించడం జరిగింది. చైత్యకవాదులు ఆరాధనలకై, పెద్ద శైలాల వలె, ఉన్నతమైన మహాచైత్యాలను నిర్మించేవారు. కనుక, శైలవాదులని కూడ ప్రఖ్యాతి చెందారు. ఇటువంటి మత - ధార్మిక పరిణామం, మొదట శ్రీధాన్యకటక - అమరావతిలో ప్రారంభమైందని, ఆ తర్వాత ఆంధ్ర దేశం లోని ఇతర ప్రాంతాలకు విస్తరించి, మరి కొన్ని స్తూపాలు కూడ బుద్ధ ధాతువులను నిక్షిప్తంచేసి, అభివృద్ధి చేయడం జరిగింది. దీనితో, శైల వాదంలో ప్రాంతీయ శాఖలు ఏర్పడ్డాయి. శ్రీధాన్యకటక - అమరావతి పూర్వ శైల (పుబ్బసేల) మని పేరు పొందగా, శ్రీపర్వత - నాగార్జునకొండ అపర శైలమని, జగ్గయ్యపేట వద్ద (వెలగిరి) మహాచైత్యం ఉత్తర శైలమని, ప్రసిద్ధమైనాయి. అపర శైలీయ శాఖ నాగార్జునకొండ, ఘంటసాల వద్ద లభించిన శాసనాల్లో, "అపరమహావినసేలీయ" మని పేర్కొనబడింది.

ఇక్ష్వాకు వంశం లోని రెండవ రాజైన మాఢరీపుత్ర ఫీరపురుషదత్తుని ఆరో రాజ్య సంవత్సరంలో, శ్రీపర్వత - నాగార్జునకొండ వద్ద ఉన్న మహాచైత్యాన్ని, ఆ రాజు మేనత్త, పూగీయుల నాయకుడైన ఖందసిరి భార్యైన శాంతిసిరి పునరుద్ధరించి, విస్తరణ (నవ కర్మ) కార్యక్రమాన్ని జరిపినట్లు, నాగార్జునకొండ వద్ద లభించిన ఇక్ష్వాకు శాసనాలు తెలుపుతాయి. ఆసందర్భంలో ఇక్ష్వాకు రాకుమార్తెలు, ఆ వంశాన్ని మెట్టిన ఇతర వంశాల రాజకుమార్తెలు, అనగా ఇక్ష్వాకు రాణులు, ఆమె పట్ల గౌరవాభిమానాలతో ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమెతోబాటుగా వారు, మహాచైత్యాన్ని అలంకరించిన ఆయక స్తంభాలను దానం చేశారు.

ఈ నవ కర్మ కార్యక్రమం అపరమహావినసేలీయ ఆచార్యుడైన భదంత ఆనందునికి అప్పగించినట్లు, ఆయన ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించినట్లు, నాగార్జునకొండ శాసనాల వలన తెలియవస్తుంది.

ఆంధ్ర దేశం లోని మహాసాంఘికులకు క్రీస్తు పూర్వం మూడో శతాబ్ది నాటికి, ప్రత్యేకంగా **వినయ పిటకం** ఏర్పడినట్లు, **కథావత్థు** వలన తెలుస్తూంది. మొదట్లో చైత్యక- శైలవాదుల్లో, సిద్ధాంతపరమైన విభేదాలేవీ ఉన్నట్లు కన్పించదు. భదంత ఆనందుడు అపరమహావినసేలీయుడని చెప్పడంలో, ఈ శాఖకు **"మహావినయ పిటకం"** ఒకటి ఉండొచ్చు.

BRAOU

7.5.1.1 : మహాయాన బౌద్ధ మతం

ప్రాచీనాంధ్ర దేశం లోని చైత్యక - మహాసాంఘిక శాఖ, క్రమంగా మహాయాన బౌద్ధ మతాన్ని అభివృద్ధి చేసింది. ఈ పరిణామంలో ఆచార్య నాగార్జునుడు అత్యంత ప్రధాన భూమికను నిర్వహించాడు.

మహాసాంఘికులు అర్హత్వం అత్యున్నత స్థితి కాదని, బుద్ధత్వాన్ని సాధించడం అనుత్తరస్థితని భావిస్తారు. బుద్ధత్వాన్ని సాధించడమనగా, బుద్ధునిలో లీనం కావడం. కాగా, బుద్ధుడు మానవ మాత్రుడైన తాత్విక ప్రవక్తగా కన్పించినా, యదార్థంగా ఆయన విశ్వవ్యాప్తమైన పరమ సత్యం. బౌద్ధతత్వం, విశేషించి మహాయాన తత్వం, పరమసత్యం శూన్యమేనని భావిస్తుంది. కనుక, బుద్ధుడు శూన్యమే. ఆ శూన్యం మాటలకు, ఆలోచనలకు అందనిది; అనుభూతికి, వర్ణనలకు అతీతమైనది; ఆద్యంత రహితమైనది. అందుచేత, దానిని "అది" అని మాత్రమే చెప్పగలం. కనుక, దానిని "తథాత" నిర్వహించడం జరిగింది.

బుద్ధుడు తథత నుండి తన అపార కరుణ వలన మానవ లోకానికి విజ్ఞానాన్ని కలిగించి, జరా మరణాల నుండి ఉద్ధరించేందుకు ఉద్భవిస్తుంటాడు. కనుక, ఆయన తథాగతుడు. ఆద్యంతరహితమైన శూన్యంలో ఇప్పటికి 24 గురు బుద్ధులు ఉద్భవించారు. వారిలో 24 వ వాడు గౌతమ బుద్ధుడు. ఆయన తన చివరి జన్మలో బుద్ధుడు కావడానికి పూర్వం 540 జన్మలెత్తి, ఒక్కొక్క జన్మలో పది విధాలైన సద్గుణాలను (దశబలాలు) సంపూర్ణంగా సాధిస్తూ, శీలం, చిత్తం, ప్రజ్ఞలను సాధించాడు. ఆ విధంగా సంపాదించిన సబుద్ధిని, తన లోని అపారమైన కరుణ వల్ల ప్రపంచ మానవాళికి ఉపదేశించి, వారికి విముక్తి మార్గాన్ని చూపించాడు. పరమ సత్యమైన తథత నుండి ఆయన ఉత్పన్నం కావడం చేత, ఆయన లోకోత్తరుడు, దేవాధిదేవుడు.

గౌతమ బుద్ధుడు చూపిన మార్గంలో, జన్మ జన్మల సంస్కారంతో ప్రజ్ఞను సాధించడం, ప్రపంచ మానవాళిని ఉద్ధరించడానికి ప్రతిజ్ఞ చేయడం, దశ బలాలను పొందడం చేత, ప్రతి జీవి బోధిసత్వుడు కాగలడు. బోధిసత్వుడు తాను కోరుకుంటే, నిర్యాణాన్ని, అనగా అనుత్తర స్థితిని పొంది, బుద్ధునిలో, అనగా తథతలో లీనం కాగలడు. అయితే, అందుపలన, అజ్ఞాన వశమైన ప్రపంచ మానవాళికి ఉపకరించలేడు. కనుక, బోధిసత్వునిగానే ఉండి, తన కారుణ్యాన్ని ప్రదర్శిస్తూ, మానవాళిని కష్టనష్టాల నుండి, జరామరణాల నుండి కాపాడి, ఉద్ధరిస్తూంటాడు. కనుక, కరుణా స్వరూపులైన బోధిసత్వులను, ప్రజ్ఞాస్వరూపమైన తారను పూజించడం వలన, మానవాళికి కష్టాలు తొలగి, కోరికలు సిద్ధిస్తాయి; పుణ్యం ప్రాప్తిస్తుంది ; ఇది సూక్ష్మంగా మహాయాన తత్వం.

మహాసాంఘిక - మహాయాన ధర్మం ఏర్పడి, విస్తరించడంతో, ఆంధ్ర దేశంలో అసంఖ్యాకంగా బౌద్ధ క్షేత్రాలు వెలశాయి. స్తూపాలు, చైత్యాల నిర్మాణం, వాటిని బుద్ధుని జీవిత ఘట్టాలు, జాతక కథల్లోని (బుద్ధుని పూర్వ జన్మ గాథలు) సంఘటనలను ప్రదర్శించే శిల్ప ఫలకాలతో, అలంకరించడం జరిగింది. ఈ బౌద్ధ క్షేత్రాల్లో గొప్ప విహారాలేర్పడి, వాటిలో విద్యాంసులు, బౌద్ధ ధర్మ ప్రవక్తలైన తాత్వికుల చేత గొప్ప విజ్ఞాన కేంద్రాలుగా ప్రఖ్యాతి చెందాయి. ఆ విధంగా, శ్రీధాన్య కటక - అమరావతి, శ్రీపర్వత - నాగార్జునకొండ, బౌద్ధ విజ్ఞాన సంస్కృతులకు నిలయమైన విశ్వవిద్యాలయాలుగా ప్రసిద్ధి కెక్కాయి.

BRAOU

7.5.1.2 : ఆచార్య నాగార్జునుడు

పైన పేర్కొన్నట్లు, ప్రాచీనాంధ్ర దేశంలో మహాయాన బౌద్ధ మతం ఆచార్య నాగార్జునుని వలన స్పష్ట రూపం ధరించి, స్థిరమైన స్థానాన్ని పొందింది. బౌద్ధ తత్వానికి, సంస్కృతికి, గౌతమ బుద్ధుని తర్వాత మరెవ్వరూ ఇంత కృషి చేయలేదని, ఈయన ద్వితీయ బుద్ధుడని (లేదా రెండవ తథాగతుడని) బౌద్ధ వాఙ్మయం ప్రశంసిస్తుంది. అయితే, ఆయన జీవిత విశేషాలను గూర్చి తెలుసుకొనేందుకు, తగిన ఆధారాలు లభించడం లేదు.

ఆచార్య నాగార్జునుడు దక్షిణ భారతదేశం లోని "వేదలి" అనే గ్రామంలో జన్మించినట్లు, **"లంకావతారసూత్ర"** మనే మహాయాన గ్రంథం తెలుపుతూంది. హ్యూయాన్‌త్సాంగ్ కూడ అటువంటి సాంప్రదాయిక గాథను పేర్కొన్నాడు. కొన్ని బౌద్ధ గ్రంథాలు ఆయన శ్రీపర్వతానికి (నాగార్జున కొండ), శ్రీస్థానానికి (అమరావతి) నడుమ, ఒక గ్రామంలో, అనగా ఆంధ్ర దేశంలో జన్మించినట్లు వివరిస్తాయి. శాతవాహనుల పోషణలో ఆచార్య నాగార్జునుడు శ్రీపర్వత - నాగార్జునకొండపై విహారాలను నిర్మించినట్లు, అమరావతి వద్ద మహా చైత్యానికి ప్రాకారాన్ని (railing) నిర్మించినట్లు, శ్రీపర్వతాన్ని ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రంగ అభివృద్ధి చేసినట్లు, అనేక బౌద్ధ గ్రంథాలు వివరిస్తాయి. ఆ శాతవాహన రాజు గౌతమీపుత్ర శ్రీయజ్ఞ శాతకర్ణిగా చరిత్రకారులు అభిప్రాయపడతారు. కాని, అందుకు స్పష్టమైన సాక్ష్యాధారాలు లేవు.

కనిష్కుని కాలంలో సమావేశమైన నాలుగో బౌద్ధ మహా సంగీతిలో ఆచార్య నాగార్జునుడు ప్రాముఖ పాత్ర నిర్వహించినట్లు, మహాయాన బౌద్ధాన్ని స్పష్టపర్చి ప్రకటించినట్లు, కొన్ని బౌద్ధ గ్రంథాలు తెలియజేస్తాయి. కాని, చాలపురు చరిత్రకారులు ఆ గాథలను విశ్వసనీయంగా భావించరు. నాలుగో బౌద్ధ సంగీతి మహాయాన బౌద్ధాన్ని గుర్తించలేదని, చర్చించలేదని, ఆచార్య బి.యన్. యల్. హనుమంతరావ్ గారు స్పష్టంగా నిర్ణయించారు.

ఆచార్య నాగార్జునుడు **ప్రజ్ఞాపారమిత శాస్త్రం, అవతంసక సూత్రం, సద్ధర్మ పుండరీక,** అనే మహా యాన గ్రంథాలను నాగ లోకం నుండి సంపాదించాడని, బౌద్ధ సాంప్రదాయిక గాథలు ప్రచారంలో ఉన్నాయి. కృష్ణా నదీ ముఖ ద్వారం వద్ద ఉన్న మైదానాలను ప్రాచీన కాలంలో "నాగ లోక" మని వ్యవహరించేవారని, సయామ్, సింహళ దేశాల్లోని బౌద్ధ వాఙ్మయం వలన తెలుస్తున్నది. కనుక, ఆచార్య నాగార్జునుని ధార్మిక, తాత్విక కార్యక్రమం పూర్తిగా ప్రాచీనాంధ్ర దేశ తీరమైదానాలపై జరిగిందని గ్రహించొచ్చు. తర్వాత కాలంలో ఈయన నాలందా విశ్వవిద్యాలయంలో ఆచార్య పీఠాన్నధిష్ఠించి, మాధ్యమిక (శూన్య) వాదాన్ని ప్రచారం చేస్తూ, అనేక శిష్యులను తయారుచేసినట్లు, బౌద్ధ మత చరిత్ర గ్రంథంలో తారానాథుడు వేర్కొన్నాడు.

ఆచార్య నాగార్జునుడు సమకాలీనంగా అభివృద్ధిచెందిన బౌద్ధ వాఙ్మయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, తత్కాలీనమైన ప్రజల మత విశ్వాసాలకు, అవసరాల కనుగుణంగా తగిన స్వరూపాన్ని, ఆరాధనా విధానాలను ఏర్పర్చాడు. ఈ సంస్కరణ వలన, ఆనాటి పరిస్థితుల్లో ఏర్పడుతున్న పోటీలో, బౌద్ధ మతం స్థిమితంగా నిలబడే వీలు కలిగింది. ఆయన సుమారు 20 ప్రసిద్ధ మహాయాన గ్రంథాలను రచించి, తన తాత్విక విధానాలను ప్రకటించాడు; మహాయాన బౌద్ధానికి స్పష్టమైన స్వరూపాన్ని చేకూర్చాడు. వాటిలో ప్రధానమైనవి, **ప్రజ్ఞాపారమితాశాస్త్రటీక, మాధ్యమికకారిక, దశభూమికాసూత్ర, సుహృల్లేఖ.**

BRAOU

ఆచార్య నాగార్జునుని తర్వాత మహాయాన-మాధ్యమికా చార్యుల్లో అత్యంత ప్రసిద్ధుడైన ఆర్య దేవుడు కూడ, ఆంధ్రుడే కావచ్చునని చరిత్రకారులు భావిస్తారు.

7.5.1.3 : ఇతర బౌద్ధ మత శాఖలు

శాతవాహనానంతర యుగంలో నాగార్జునకొండ వద్ద మరి కొన్ని బౌద్ధ మత శాఖలు కూడా ప్రచారంలో ఉన్నాయి. ఈ యుగంలో అమరావతి కంటే నాగార్జునకొండ వద్దనే, బౌద్ధ విజ్ఞాన, సంస్కృతులకు చెందిన వివిధ శాఖలు విలసిల్లడం, వాటి నడుమ విభేదాలు, విమర్శలతో కూడిన వైజ్ఞానిక అభివృద్ధి జరిగినట్లు తోస్తుంది.

మహాయాన బౌద్ధానికి చెందిన అపర శైలీయులు కాక, మరొక శాఖకు చెందిన బహుశ్రుతీయులు కూడ, శ్రీపర్వత - నాగార్జునకొండ వద్ద ప్రాముఖ్యతను పొందారు. మాఢరీపుత్ర వీరపురుషదత్తుని భార్యల్లో ఒకతె, ఎహువల శాంతమూలుని తల్లైన మహాదేవి భటిదేవి, ఈ శాఖకు చెందిన బౌద్ధాచార్యులకు ఒక విహారాన్ని నిర్మించిచ్చింది.

కేవలం మహాయాన బౌద్ధమే కాక, శ్రీపర్వత - నాగార్జునకొండ వద్ద ఇక్ష్వాకుల పరిపాలనా కాలంలో థేరవాద (హీనయాన) బౌద్ధ మతం కూడ ఆదరణను పొందింది. ఈ శాఖకు చెందిన "మహావిహారవాసు" లనే ఉప శాఖకు, ఉపాసిక బోధిసిరి విజయపురికి తూర్పుగా ఉన్న జలధమ్మగిరి వద్ద ఒక విహారాన్ని నిర్మించిచ్చింది. ఈ మహావిహార వాసులు సింహళ ద్వీపం లోని అభయగిరి మహావిహారాన్ని కేంద్ర స్థానంగా కలిగినవారు. బోధిసిరి నిర్మించిన విహారం, అక్కడి భిక్షువులు తామ్రపర్ణి ద్వీపం (సింహళం) నుండి వచ్చినట్లు, కాశ్మీర, గంధార, చీన, చిలాట, తోసలి, అపరాంత, వంగ, వనవాస, యవన, దమిళ, పాల్యూర మొదలైన దేశాల్లో, లేదా దేశ జనుల్లో ధర్మ ప్రచారాన్ని చేసేవారని వివరిస్తుంది. ఈ విహారం సీహల విహారమని (సింహళ విహార) ప్రసిద్ధికెక్కింది.

శ్రీ పర్వత-నాగార్జునకొండ శాసనాల వలన తెలియువచ్చే మరొక హీనయాన బౌద్ధ శాఖ, మహీశాసకులు. వీరు థేరవాదుల్లోని ప్రధాన శాఖైన సర్వాస్తివాదానికి చెందినవారు. మహాయాన బౌద్ధం వృద్ధి చెందిన తర్వాత, హీనయానం అంతరించిందని, సాధారణంగా భావించడం జరుగుతున్నది. మహాయాన శాఖతో పాటుగా, హీనయాన శాఖలు కూడ విలసిల్లడం, ఆ అభిప్రాయం సరికాదని సూచిస్తాయి. అయితే, హీనయానం కంటే మహాయానం మరింత ప్రబలంగా ఉందన్నది, స్పష్టంగా గుర్తించొచ్చు. మాఢరీపుత్ర వీరపురుషదత్తుని కుమార్తె, కాదబలిసిరి మహీశాసకులకు ఒక విహారాన్ని నిర్మించినట్లు, ఒక శాసనం తెలుపుతున్నది.

7.5.1.4 : మహాయాన బౌద్ధం - నవ్య వైదిక మతం

క్రీ.శ. మూడో శతాబ్ది ఆరంభం నుండి మహాయాన బౌద్ధంలో వ్యాపించిన భక్తి సిద్ధాంతం, ఆరాధనా విధానాలను, నాగార్జునకొండ శాసనాలు, విష్ణుకుండినుల్లోని గోవిందవర్మ వేసిన తుమ్మలగూడెం (మొదటి) తామ్ర శాసనం, పృథ్వీమూలుని కొండవీడు శాసనాలు తెలియజేస్తాయి. తుమ్మలగూడెం శాసనం పరమ మహాదేవి కట్టించిన మహావిహారంలో బుద్ధుని విగ్రహ రూపంలో ప్రతిష్ఠించి, ధూప, దీప, నైవేద్యాలతో పూజిస్తున్నట్లు, ఆ పూజలకు కావలసిన పూజాద్రవ్యాలను సమకూర్చేందుకు, గోవిందవర్మ రెండు గ్రామాలను దానం చేసినట్లు, ఆ శాసనం వివరిస్తుంది. ఈ విధమైన

BRAOU

భక్తి, పూజా విధానం, మహాయాన బౌద్ధాన్ని నవ్య వైదిక ధర్మానికి అతి చేరువగా తీసుకొని వచ్చాయి. కేవలం తాత్విక చర్చలు, తార్కికమైన వాదోపవాదాలు, కొద్దిమంది మేధావులకు మాత్రమే పరిమితమై, సామాన్య మానవులు ఈ రెండు ధర్మాల నడుమ ఎటువంటి వ్యత్యాసం, వైరుధ్యాన్ని గుర్తించలేదు. ఇక్ష్వాకు వంశీయులైన రాజులు వైదిక క్రతువులను జరిపి, విరూపాక్ష, మహాసేన భక్తులు కాగా, రాణులు బౌద్ధ విహారాలకు, మహాచైత్యానికి దానధర్మాలను సమర్పించడం, ఇందువల్లనే సాధ్యమైంది. సమ్యక్సంబుద్ధ పాదానుధ్యాతుడైన ఆనందగోత్ర రాజు దామోదరవర్మ వేదవేదాంగ నిరతులైన బ్రాహ్మణులకు భూదానాలను చేస్తూ, మళ్ళెపాడు శాసనాన్ని వేశాడు. ఈ శాసనం వల్ల అతడు బౌద్ధుడని, లోగడ చరిత్రకారులు గుర్తించడం సహేతుకం కాదని, పైన వివరించడం జరిగింది. అలాగే, పరమ భాగవతుడైన (వైష్ణవుడు) శాలంకాయన రెండో నందివర్మ, గుంటుపల్లి వద్ద ఉన్న బౌద్ధ సంఘారామాలకు దానధర్మాలను చేశాడు. ప్రాచీన పల్లవ రాజుల్లో స్పష్టంగా బౌద్ధ సంఘారామాలకు దానధర్మాలను చేసిన రాజులు లేకున్నా, బుద్ధ వర్మ, బుద్ధియంకుర వంటి వ్యక్తి నామాలు, వారు బౌద్ధ ధర్మానికి వ్యతిరేకులు కారని సూచిస్తాయి. ఆ రాజులు "కలియుగ దోషావసన్న ధర్మోద్ధరణ నిత్యసన్నద్ధు"లని వర్ణించుకోవడంలో, తీవ్రమైన వైదిక మతాభిమానం దానికి వ్యతిరేకమైన బౌద్ధ ధర్మం పట్ల ద్వేషం కలిగినట్లు వివరిస్తాయని, లోగడ కొందరు చరిత్రకారులు అభిప్రాయపడడం, సహేతుకం కాదు.

విష్ణుకుండిన రాజుల్లో గోవిందవర్మ బౌద్ధ ధర్మాన్ని అనుసరించినట్లు, అతని తుమ్మలగూడెం (మొదటి) తామ్ర శాసనం స్పష్టంగా వర్ణిస్తుంది. తుమ్మలగూడెం రెండో శాసనం కూడ, ఆ రాజును బౌద్ధుని గాను, అనేక విహారాలను కట్టించినట్లు వర్ణిస్తుంది. అయితే, ఆ రాజు వర్ణాశ్రమ ధర్మాన్ని సంరక్షించడం, విహారాలే కాక దేవాయతనాలను నిర్మించడం; భిక్షువులకు, ద్విజులకు విరివిగా దాన ధర్మాలను చేయడాన్ని, ఆ శాసనాలు పేర్కొంటున్నాయి. ఆ రాజు కుమారుడైన రెండో మాధవవర్మ, ఏకాదశాశ్వమేధాలు, సహస్ర క్రతువులను చేసినవాడు. రెండో విక్రమేంద్రవర్మ వేసిన తుమ్మల గూడెం రెండో శాసనాన్ని, పరమభట్టారికా మహావిహారం లోని బౌద్ధ భిక్షువులే రచించుండొచ్చునని, పలువురు చరిత్రకారుల అభిప్రాయం. ఆ శాసనం రెండో మాధవర్మ జరిపిన వైదిక క్రతువులన్నిటిని అత్యంత శ్రద్ధగా వర్ణించడాన్ని బట్టి, అప్పటి బౌద్ధ ధర్మానికి వైదిక కర్మకాండ పట్ల వ్యతిరేకత కూడ లేదని, స్పష్టపడుతుంది.

BRAOU

7.5.2 : నవ్య వైదిక పరిణామాలు

పైన పేర్కొన్నట్లు, వైదిక మతం భక్తి తత్వానికి చెందిన శైవ, వైష్ణవ (భాగవత) మతాల ప్రభావంతో, నవ్య వైదిక, లేక పౌరాణిక హిందూ మతంగా పరిణామం చెందింది. శైవ, భాగవత మత తత్వాలు ప్రారంభంలో, బౌద్ధ, జైన మతాల వలెనే, అవైదిక మతాలు, వేద ప్రామాణ్యతను అంగీకరించినవి. అయితే, అచిర కాలం లోనే వైదిక దేవతలైన రుద్రశివుడు, విష్ణువు ఈ మతాల్లో అధిదైవతాలైనారు. వైదిక మతంలో కర్మకాండకు ప్రాధాన్యత తగ్గి, ఆధిభౌతిక (Metaphysical), ఆధ్యాత్మిక (Epistemalogical) జ్ఞానానికి, ప్రాధాన్యత పెరిగింది. ఈ పరిణామంలో వైదిక మతం భక్తి తత్వంతో కూడి జ్ఞానానికి, ప్రాధాన్యత పెరిగింది. ఈ పరిణామంలో వైదిక మతం భక్తి తత్వంతో కూడిన మూతన మతాలను విలీనం చేసుకోగలిగింది.

భక్తి, పూజా విధానాలు, ప్రాక్తన జాతుల విశ్వాసాలు, ఆరాధనా విధానాల నుండి ఉత్పన్నమైనవి. వాటిని అంగీకరించడంతో, వైదిక మతం అనేక జాతుల ఆరాధ్య వస్తువులు (objects of worship) ఆరాధనా విధానాలను అంగీకరించి, వాటికి గౌరవప్రదమైన స్థానాన్ని కల్పించింది. జ్ఞాన ప్రధానంగా ఏర్పడిన ఉపనిషత్తులు, లేదా వేదాంత దర్శనం, సృష్టి స్థితి లయలకు కారణమైన పరమాత్మ, లేక, బ్రహ్మతత్వాన్ని ప్రతిపాదించాయి. ప్రాపంచిక జీవితాన్ని విశ్లేషించే యోగ-సాంఖ్య దర్శనాలు, నూతన జ్ఞానాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఈ పరిణామాల సమిష్టి సంఘటన (cumulative manifestation), నవ్య వైదిక ధర్మం.

సృష్టి స్థితి లయలకు కారణమైన బ్రహ్మ తత్వంపై ఆధారపడడంతో, నవ్య వైదిక ధర్మం ఏకేశ్వర ప్రధానమైనదే; అంటే దేవుడొక్కడేనని ప్రతిపాదించేది. అయితే, అతి ప్రాచీన కాలం నుండి వివిధ ప్రజానీకాల సంస్కృతుల సంఘర్షణలు, సంబంధాల ఫలితంగా ఏర్పడిన మత-ధార్మిక విలీన, సమ్మేళన ప్రక్రియల్లో, తుదకు మిగిలిన జాతి దైవతాలు (Cult-gods) వేటికవి బ్రహ్మతత్వాన్ని సారభూతంగా కలిగి, ఐదు ప్రదానమైన మతాలను ఏర్పర్చాయి. అవి: 1) శైవ, 2) వైష్ణవ, 3) సౌర, 4) కౌమార, 5) గాణాపత్య. కొద్ది కాలం తర్వాత వీటికి, ఆది శక్తి అధిదైవతంగా ఉండే శాక్తేయ మతం వచ్చి చేరింది. క్రీస్తు శకారంభం నుండి సుమారు ఆరో శతాబ్ది వరకు ఈ మతాల నడుమ ఏర్పడిన పరస్పర ప్రభావం, సమ్మేళనల్లో తుదకు శైవ వైష్ణవాలు మిగిలినాయి. మిగిలిన మతాల్లోని అధిదేవతలు శివకేశవుల్లో లీనం కావడం, (సౌర) లేదా, ఆ దైవతాలకు చెందిన కుటుంబ సభ్యులుగా రూపొందడం, (కౌమార, గాణాపత్యాలు, శైవంతో చేరిపోవడం) వంటి పరిణామాలు కలిగాయి. శాక్తేయం ఈ రెండు మతాల లోను అంతర్భాగమైంది.

శైవ, వైష్ణవ భక్తి ఉద్యమాలు వైదిక ధర్మంతో కలిసి, ఉత్తర భారతదేశం నుండి దక్షిణ భారతదేశానికి, ఆంధ్ర దేశానికి వ్యాపించిన తీరు, పౌరాణిక - ఇతిహాస వాఙ్మయం నుండి తెలుస్తున్నది. అయితే, దక్షిణ భారతదేశంలో ఈ పరిణామాలు కొంత స్వతంత్రమైన చరిత్రను కలిగి ఉన్నట్లు, క్రీ.శ. నాలుగో శతాబ్దం నుండి ఆళ్వారులనే వైష్ణవాచార్యులు, నాయన్మారులనే శైవాచార్యుల రచనల వలన తెలియవస్తుంది. ప్రజల భాషల్లో ఉద్భవించిన ఈ భక్తి వాఙ్మయం, సాధారణ జనుల్లో భక్తి తత్వాన్ని పాదుచేసింది. తమిళ దేశం నుండి ఈ భక్తి ఉద్యమం ఆంధ్ర దేశానికి కూడ విస్తరించి, కొంత ప్రభావితం చేసిందని తోస్తుంది. తమిళ, తెలుగు భాషా ప్రజలను కలిపి పరిపాలించిన ప్రాచీన పల్లవ రాజులు, ఈ భక్తి ఉద్యమ వ్యాప్తికి కారకులైనట్లు భావించొచ్చు.

ప్రాచీనాంధ్ర దేశంలో శాతవాహన యుగం లోనే ఈ నవ్య వైదిక ధార్మిక పరిణామం, స్పష్టమైన స్వరూపాన్ని ధరించిందని, నానాఘాట్ శాసనం వలన తెలుసుకోవచ్చు. ఆ శాసన ప్రారంభంలో ధర్మ, ఇంద్ర వంటి వైదిక దైవతాలతోపాటు, సంకర్షణ వాసుదేవులను, అంటే బలరామ కృష్ణులను ప్రార్థించడం, పైన వివరించిన మత పరిణామాలకు నిదర్శనం. ఆ తర్వాత శాతకర్ణి దంపతులు, రాజసూయ, అశ్వమేధ మొదలైన వైదిక క్రతువులను, వివిధమైన వ్రతాలను జరిపినట్లు, ఆ శాసనం వివరిస్తుంది. అటువంటి వ్రతాలు వైదిక కర్మకాండకు చెందినవి కావు. పౌరాణిక వాఙ్మయం వివరించి, విధించినవి, వాటికి మూలం ప్రాచీన తెగల నుండి, సాధారణ ప్రజానీకంలో వ్యాపించి ఉన్న మత విశ్వాసాలు, ఆరాధనా విధానాలు, హాల శాతవాహనుడు సంకలనం చేసిన **గాథాసప్తశతి** శివ స్తుతితో ప్రారంభమౌతున్నది. నాసిక్ ప్రశస్తి గౌతమీపుత్ర శాతకర్ణి ఔన్నత్యంలో కైలాస పర్వతంతోను, వ్యక్తిత్వంలో రామ, కేశవార్జున, పరశురాములతోను, సమానమైనట్లు వర్ణిస్తుంది. ఈ అంశాలు, శాతవాహన యుగం లోనే పౌరాణిక భక్తి తత్వానికి విస్తృతమైన ప్రచార మేర్పడినట్లు సూచిస్తాయి.

BRAOU

శాతవాహనానంతర యుగంలో ఇక్ష్వాకు మహారాజైన శ్రీశాంతమూలుడు అశ్వమేధ, వాజపేయ మొదలైన వైదిక క్రతువులను నిర్వహించినా, విరూపాక్షపతి, అనగా శివుడు, మహాసేన (స్కంద, కార్తికేయుడు) పాద భక్తుడు. క్రతు ప్రధానమైన వైదిక ధర్మం, శైవ, స్కాంద భక్తి తత్వాలతో ఏకమైన సంఘటనకు, ఇక్ష్వాకు శాసనాలు నిదర్శనాలు. ఎహువల శాంతమూలుని కాలంలో, ఆరాజు "పుష్పభద్రస్వామి" అనే పేరుతో శివాలయాన్ని నిర్మించినట్లు, అతని సేనానైన ఎలిసిరి, "సర్వదేవ" అనే పేరుతో, మరొక ఆలయాన్ని నిర్మించినట్లు, శాసనాల వలన తెలియవస్తుంది. ఈ కాలం లోనే, "నాడగిశ్వర" ఆలయమనే మరొక ఆలయం కూడా నిర్మాణమైనట్లు శాసనాల వలన తెలుస్తుంది కాని, ఆ ఆలయం ఏదేవుని కొరకు నిర్మాణమైంది తెలియదు; పేరును బట్టి అది శివాలయమని ఊహించొచ్చు.

ఇక్ష్వాకు రాజ్యంపై దండెత్తి వచ్చిన ఆభీర వసుషేణుడు, అక్కడ "అష్టభుజస్వామి" అనే పేరున ఒక విష్ణాలయాన్ని నిర్మించాడు.

ప్రాచీన పల్లవ రాజులు భాగవత (వైష్ణవ) మతాన్ని ఎక్కువగా అభిమానించి, అనుసరించారు. వారు తరచుగా తమ శాసనాల్లో "పరమ భాగవత" బిరుదాన్ని ధరించడం, ఈ అంశాన్ని సూచిస్తుంది. అయితే, ఆ వంశం లోని మొదటి సింహవర్మ చేసిన మంచికల్లు శిలా శాసనం, ఆ రాజు తన యుద్ధ విజయాన్ని, ఆయురైశ్వర్యాలను కోరి, "జీవ శివస్వామి" ఆలయానికి వచ్చే తైర్థికుల సౌకర్యం కొరకు, ఏదో దానం చేసినట్లు సూచిస్తుంది. జీవ శివస్వామి శివుడేనని భావించొచ్చు. యువ మహారాజు బుద్ధవర్మ భార్యైన చారుదేవి, "కుటిమహోతరక" అనే పేరున, దాలూర వద్ద ఒక విష్ణాలయాన్ని నిర్మించింది. అలాగే, యువ మహారాజు విష్ణుగోపుడు "విష్ణుహర" దేవాలయాన్ని నిర్మించినట్లు, అతని ఉరువపల్లి తామ్ర శాసనం తెలియజేస్తుంది.

శాలంకాయన రాజులు చిత్రరథ స్వామి పాదానుధ్యాతులు. చిత్రరథుడనగా సూర్యుడు. వైదిక దేవతల్లోని సూర్యుడు, తర్వాత కాలంలో అభివృద్ధిచెందిన శైవ, వైష్ణవ మతాలు రెండింటిలో, ప్రముఖ స్థానాన్ని పొంది ఉన్నాడు. శాలంకాయన రాజుల్లో విజయదేవశర్మ పరమ మహేశ్వరుడని, అతని ఏలూరు శాసనం వలన తెలుస్తుంది. ఆ రాజు అశ్వమేధం కూడ చేసిన వాడు. పరమ మహేశ్వరుడనగా, మహేశ్వరునిపై అత్యంత భక్తి ప్రపత్తులు కలవాడని అర్థం. ఆ వంశానికి చెందిన రెండో నందివర్మ పరమ భాగవతునిగా వర్ణించుకొని, త్రిలోకనాథుడైన విష్ణు గృహస్వామి దేవాలయాన్ని నిర్మించినట్లు, అతని పెదవేగి శాసనం వలన తెలుస్తుంది.

విష్ణుకుండిన రాజుల్లో రెండో మాధవవర్మ గొప్ప కర్మిష్ఠి. అయినా, అతని మనుమడు రెండో ఇంద్రవర్మ, మునిమనుమడైన రెండో విక్రమేంద్రవర్మ, తమ శాసనాల్లో పరమ మహేశ్వరులని చెప్పకొన్నారు. రెండో విక్రమేంద్రవర్మ చిక్కుళ్ళ శాసనం "సోమగిరీశ్వరనాథు" డనే పేర వెలసిన, త్రయంబక శివుని ఆలయానికి చేసిన ప్రదానాన్ని గూర్చి తెలియజేస్తుంది. విష్ణుకుండిన శాసనాలు, ఆ రాజులు శ్రీపర్వత స్వామి పాదానుధ్యాతులని వర్ణిస్తాయి. ఈ దేవుడు శ్రీశైలమల్లికార్జునుడేనని, చిరకాలంగా చరిత్రకారులు అభిప్రాయపడుతూ వచ్చారు. శ్రీపర్వతం శ్రీశైలంకాదని, శ్రీపర్వతస్వామి నాగార్జున కొండవద్ద పూజలను అందుకొంటున్న బుద్ధుడని, ఆచార్య బి.ఎన్.యల్. హనుమంత రావుగారు చాల తార్కికంగా, సాక్ష్యాధారాలను విశ్లేషించి, నిరూపించారు. నాగార్జునకొండ బౌద్ధ క్షేత్రంగానే కాక, పౌరాణిక హిందూ దేవాలయాలతో గొప్ప ప్రఖ్యాతి చెందింది. బుద్ధుడు మహాయాన బౌద్ధం లోని భక్తి ప్రపత్తులు, పూజా విధానాలతో, క్రమంగా పౌరాణిక హిందూ మతంలో చేరిపోయి, అప్పటికే

BRAOU

నారాయణ విష్ణువులతో గుర్తించబడినట్లు, శ్రీపర్వతస్వామి అనే పేరున విష్ణుకుండినులు బుద్ధుని రూపంలో విష్ణువును ఆరాధించారని, ఆయన నిరూపించాడు.

పైన వివరించిన శాసనాధారాల వలన, ప్రాచీనాంధ్ర దేశంలో అనేక ఆలయాలు, శివునికి, విష్ణువుకు, నిర్మించబడినట్లు, వాటికి విశేషంగా ప్రాముఖ్యత లభించి, తీర్థ స్థలాలుగా అభివృద్ధి చెందినట్లు, తెలియవస్తుంది. ఈ రాజుల శాసనాలు వాటికి గ్రామ క్షేత్ర దానాలను ప్రకటించాయి. పౌరాణిక హిందూ ధర్మం శాతవాహనానంతర యుగంలో ప్రజాబాహుళ్య మనుసరించే, ఆదరించే మతాల్లో, అద్వితీయ స్థానాన్ని పొందింది.

శాతవాహన యుగానంతర మత ధార్మిక పరిణామాల్లో ప్రధానంగా గుర్తించవలసింది, పైన పేర్కొన్నట్లు వివిధ మత విశ్వాసాలు, సాంప్రదాయాల మధ్య ఏర్పడుతున్న సంశ్లేషణ (syncretism). ఈ సంశ్లేషణా విధానం భక్తి తత్వం వల్ల సాధ్యమైంది. వైదిక ధర్మంలో క్రతువులకు ప్రాధాన్యత తగ్గించి, క్రతువుల నిర్వహణలో పశు వధ ఆవశ్యకం కావడం తగ్గింది. **మహాభారతం** పిష్ట పశువులను, అంటే పిండితో చేసిన జంతువుల బొమ్మలను బలిచ్చి, సంకేత రూపంగా క్రతువులను నిర్వహించడాన్ని తెలుపుతుంది. బౌద్ధ ధర్మం భక్తి ప్రభావంతో, బుద్ధ, బోధిసత్వుల పూజలను, ఆరాధనలను ప్రవేశపెట్టి, సమస్త విశ్వానికి మూల కారణమైన సత్యం బుద్ధుడేనని వివరించడంతో, అదే విధమైన తాత్విక సత్యంపై ఆధారపడిన శైవ, వైష్ణవ విధానాలతో సమానమైంది. ఆ మతం వివరించే శూన్యత, లేక తథత, కేవలం విద్వద్గోష్ఠులకు, తాత్విక చర్చలకు పరిమితమైంది. కాగా, సాధారణ సమాజం బుద్ధుణ్ణి పరతత్వంగా భావించింది. ఈ మూడు ప్రధాన మత సంప్రదాయాలు ప్రాక్తన మత విశ్వాసాలను జీర్ణించుకొని, వివిధ జంతు, వృక్ష ఆరాధనలను, మాతృదేవతారాధనను విలీనం చేసుకొన్నాయి. బౌద్ధ ధర్మం ఈ పరిణామంలో ధ్యాని బుద్ధులు, బోధిసత్వులు, వారి శక్తి రూపిణులైన దేవతలను భార్యలుగా కలిగిఉన్న దేవదేవతా వర్గం (pantheon) ఏర్పడింది. అలాగే శివుడు, విష్ణువు, వారి భార్యలైన పార్వతి, లక్ష్మి, వారి కుటుంబ సభ్యులుగాను, పరివారంగాను, అనేక దేవతలతో దేవదేవతా గణంగా రూపొందారు. ఈ దేవతల మాహాత్మ్యాలను కీర్తిస్తూ, వారి పట్ల భక్తిని, వారిని పూజించి సంతృప్తిపర్చే విధానాలను వివరిస్తూ, పురాణాలు, ఆగమాలు, తంత్రాలు ఏర్పడడం ప్రారంభమైంది. ఈ వాఙ్మయం, మత పరిణామాల్లో అత్యధిక భాగం క్రీ.శ. అయిదో శతాబ్దారంభం నుండి పదో శతాబ్దాంతంవరకు ఏర్పడినాయి. అయితే, వాటి ప్రారంభం, క్రమవికాస మంతకు పూర్వమే, శాతవాహనాంతర యుగంలో ప్రారంభమైనాయని నిస్సంశయంగా చెప్పొచ్చు.

7.6 : వాస్తు, కళా వికాసం

శాతవాహనానంతర యుగంలో బౌద్ధ ధర్మం మహాయానంగా అభివృద్ధి చెంది, ప్రజాదరణ పొందుతూ విస్తరిస్తూ ఉండడాన, అనేక బౌద్ధ క్షేత్రాలు అభివృద్ధి చెందుతూనే ఉన్నాయి. అమరావతి వద్ద మహాచైత్యం ఇక్ష్వాకుల పరిపాలనా కాలంలో కూడ, విస్తరణ, అలంకరణలను పొంది, అత్యంత ప్రసిద్ధమైన బౌద్ధ తీర్థ స్థలంగా ప్రఖ్యాతి చెందినట్లు, పైన వివరించడం జరిగింది. బౌద్ధ ధర్మం పట్ల భక్తి విశ్వాసాలతో ప్రజలు ఆ మహాచైత్యాన్ని సందర్శించి, ప్రదానాలు చేసే విషయాన్ని అక్కడి శాసనాలు తెలియజేస్తాయి.

7.6.1 : శ్రీపర్వత - నాగార్జునకొండ

అయితే, శాతవాహనానంతర యుగంలో అత్యంత ప్రసిద్ధమైన మహాచైత్యం, శ్రీపర్వత - నాగార్జున కొండ వద్ద ఉన్నట్టిది. బహుశ: దీని ప్రాముఖ్యత శ్రీధాన్యకటక మహాచైత్యంతో సమానంగా

BRAOU

ఏర్పడినట్లు కానవస్తుంది. పైన పేర్కొన్నట్లు, శ్రీపర్వత-నాగార్జునకొండ వద్ద మహాచైత్యం అపర మహావినసేలీయ శాఖకు చెంది, అభివృద్ధిచెంది. ఈ మహాచైత్య విస్తరణ, అలంకరణలను వాసిష్ఠీపుత్ర శ్రీశాంతమూలుని సోదరి, పూగీయరాణైన శాంతిసిరి తలపెట్టి నిర్వహించినట్లు, ఈ ప్రయత్నంలో ఆమెకు భదంత ఆనందుడు సహకరించి, ఆబాధ్యతను నిర్వర్తించినట్లు, అక్కడి శాసనాల వలన తెలియవస్తూంది. కాగా, మహాచైత్యం ఇక్ష్వాకుల కంటె పూర్వ కాలం నాటిది. బౌద్ధ ధర్మంలో ఏర్పడిన పరిణామాల కనుగుణంగా, ఆయన వేదికలు, ఆయక స్తంభాలను నిర్మించి విస్తరించడం, ఇక్ష్వాకుల కాలంలో జరిగిందని చెప్పొచ్చు.

నాగార్జునకొండ వద్ద వెలువడిన బౌద్ధ నిర్మాణాల్లో రెండు అత్యంత ప్రాముఖ్యత కలిగి, అపర మహావినసేలీయ శాఖకు చెందినవి; రెండు మహీశాసకులకు; బహుశ్రుతీయులు, మహావిహారవాసులకు ఒక్కొక్కటి చెందినట్లు తెలియవస్తుంది. శ్రీధాన్యకటక-అమరావతి వద్ద ఇన్ని విధాలైన బౌద్ధ శాఖలు ప్రవర్తిల్లినట్లు స్పష్టంగా చెప్పడం సాధ్యం కాదు; బహుశ: లేవని తోస్తుంది. కాగా, మహాయాన శాఖకు చెందిన అపరమహావినసేలీయులు, బహుశ్రుతీయులు మాత్రమేకాక, హీనయాన శాఖకు చెందిన మహాసాసక, మహావిహారవాసులకు చెందిన విహారాలు కూడ కానవస్తూండడాన, ఇక్ష్వాకుల పరిపాలనా కాలంలో హీనయాన బౌద్ధం కూడ విజృంభించి, మహాయానంతో పోటీ పడిందని ఊహించడానికి, వీలు కలుగుతున్నది. మహాయాన శాఖ అవలంబించే కొన్ని ఆచారాలను, తాత్విక వాదాలను ఖండించి, వారు శ్రీపర్వత - నాగార్జునకొండ కేంద్రంగా, తమ మత ప్రచారాన్ని చేశారని భావించడం సహేతుకం.

శ్రీ పర్వత - నాగార్జునకొండ వద్ద మహాచైత్యం చక్రాకారమైన భూ ప్రణాళిక (Ground Plan) కలది. ఇక్కడి చైత్య, స్తూప నిర్మాణాలు బహుళంగా ఇటువంటి ప్రణాళికను కలిగినవే. వృత్తాకారమైన కేంద్రం, దాని నుండి విస్తరించిన ఆకులను, చక్రాకృతి కలిగిన ప్రణాళికలను, వీటిపై నిర్మించిన అండాన్ని కలిగున్నాయి. కొన్ని సందర్భాల్లో చక్రాకృతికి మారుగా, స్వస్తిక చిహ్నాన్ని కలిగున్నాయి. చక్రాకృతి బౌద్ధ ధర్మంలో అత్యంత ప్రాధాన్యతా ధర్మ చక్రానికి సంకేతం.

మహాచైత్యం 27.5 మీటర్ల వ్యాసాన్ని కల్గిన వృత్తాకార వేదికపై నిర్మించబడింది. బుద్ధుని శారీరక ధాతువును కలిగినట్లు, "ధాతువరపరిగహితస మహాచేతియే" అని శాసనాల్లో దీనిని గూర్చి వర్ణించడం జరిగింది. దీనిని బట్టి, మొదట ఉద్దేశిక స్తూపంగా ఉండి, తర్వాత బుద్ధ ధాతువును నిక్షిప్తం చేసిన ధాతు గర్భస్తూపంగా, అంటే మహాచైత్యంగా పరిణామం చెందినట్లు, గ్రహించొచ్చు. ఈ పరిణామం లోనే, మహాస్తూపాన్ని విస్తరించి ఆయక వేదికలు, ఆయక స్తంభాలను చేర్చి, శిల్పాలంకరణలను చేసినట్లు, ఈ కార్యక్రమం అపరమహావినసేలీయుల ఆధ్వర్యంలో జరిగినట్లు గ్రహించొచ్చు. అపరమహావినసేలీయుల ఆచార్యుడైన భదంత ఆనందుడు ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించాడని, పైన వివరించడం జరిగింది.

ఈ మహాచైత్యానికి అనుబంధంగా ఒక మహావిహారం, దానిలో రెండు చైత్య గృహాలున్నాయి. ఈ చైత్య గృహాలు పశ్చిమ కనుమల్లో తొలిచిన చైత్య గృహాలను పోలి, దీర్ఘ చతురస్రాకారమైన శాల (hall), దాని వెనుక భాగంలో అర్ధ వృత్తాకారంలో ఉన్న రెండు ఉద్దేశిక స్తూపాలను కలిగున్నాయి. ఇవి కేవలం చైత్యారాధన కొరకు ఉద్దేశించినవి. అందుచేత, చాల స్వల్ప పరిమాణాన్ని కలిగున్నాయి.

BRAOU

మహాచైత్యానికి చేరువ లోనే, నుళధమ్మగిరి శిఖరం పైన, కొన్ని విహారాలు, సింహళ దేశం నుండి వచ్చే బౌద్ధ భిక్షువుల వసతి సౌకర్యాల కొరకు నిర్మాణమైనాయి. ఈ విహారాన్ని, చైత్యగృహాన్ని, బోధిసిరి అనే ఒక భక్తురాలు (lay devotee) నిర్మించిచ్చింది. నుళధమ్మగిరిపైన మరొక ప్రక్కగా నాలుగు ఆకులను కల్గిన చక్రాకార ప్రణాళికపై నిర్మించిన ఒక మహాస్తూపం, దానికి అనుబంధంగా మూడు దిక్కులుగా విస్తరించిన మహావిహారం, కానవస్తాయి. ఈ పరిసరాల్లో మరొక స్తూపం కూడ బుద్ధ ధాతువులను కలిగున్నట్లు పురావస్తు త్రవ్వకాల్లో వెల్లడైంది.

నాగార్జునకొండ వద్ద నిర్మాణమైన మహావిహారాల్లో అధిక శాతం ప్రారంభంలో చైత్య గృహాలను కల్గిఉండేవికావని నిశ్చయంగా చెప్పొచ్చు. తర్వాతి కాలంలో చైత్య గృహాలను నిర్మించి, కొన్నిటిలో ఉద్దేశిక స్తూపాలను, కొన్నిటిలో బుద్ధ ప్రతిమలను, ఆయా తమ శాఖల ఆవశ్యకత ననుసరించి ఏర్పర్చడం జరిగింది.

ఇక్ష్వాకు రాజుల్లోని మూడవ వాడైన ఎహువల శాంతమూలుని కాలంలో, అతని రాజ్ఞి మహాదేవి భటిదేవ, బహుశ్రుతీయుల కొరకు ఒక మహావిహారాన్ని, ఒక మహా స్తూపాన్ని నిర్మించింది. ఈ స్తూపం ఎనిమిది ఆకులను కల్గిన చక్రాకార ప్రణాళికను కల్గింది. విహారంలో రెండు ఉద్దేశిక స్తూపాలతో రెండు చైత్య గృహాలు నిర్మాణమైనాయి. తర్వాతి కాలంలో ఈ విహారాని కనుబంధంగా ఉన్న మహావిహారం చెంత, శిల్పాలంకారాలతో ఒక ఎత్తైన రాతి స్తంభాన్ని నిలుపడం జరిగింది. ఇటువంటి స్తంభాలను నిల్పడం, అప్పటి దేవాలయ వాస్తు నుండి గ్రహించడం జరిగిందని తోస్తుంది. దేవాలయ వాస్తువులో ధ్వజ స్తంభాలను నిలపడం, ఈ విధంగా ప్రారంభమై ఉండొచ్చు.

శ్రీ పర్వతం, నుళధమ్మగిరి వద్ద నిర్మాణమైన పై బౌద్ధ విహారాలు, స్తూపాలు కాక, ఎహువల శాంతమూలుని కాలంలో విజయపురి దుర్గ ప్రాకారాలకు సమీపంగా, మరొక విహారాలు, స్థూపాలతో కూడిన భవన సముదాయం, పురావస్తు త్రవ్వకాల్లో వెలికివచ్చింది. ఇది కూడ అపరమహావినసేలీయులకు చెందినదేనని, శాసనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ భవన సముదాయం మరింత అభివృద్ధిచెందిన నిర్మాణ ప్రణాళికలను కలిగున్నట్లు, పురావస్తువేత్తల అభిప్రాయం. దీనిలో బుద్ధ ప్రతిమను గల్గిన మరొక చైత్య గృహాన్ని అదనంగా ఏర్పర్చడాన్ని గుర్తించొచ్చు. ఈ సముదాయం లోని మహాస్తూపం ఎనిమిది ఆకులను కల్గిన చక్రాకార ప్రణాళికతో నిర్మాణమైంది. తూర్పు వైపున ఆయక వేదికపై, బుద్ధ ధాతువులను కల్గిన కలశం లభించింది.

ఎహువల శాంతమూలుని పదకొండవ రాజ్య సంవత్సరంలో శ్రీపర్వత - నాగార్జునకొండ సమీపం లోని మరొక చిన్న గుట్టపై, ఆ రాజు సోదరి, కోడబలిసిరి నిర్మించిన మరొక స్తూప, విహారాలతో కూడిన భవన సముదాయం వెలుగులోనికి వచ్చింది. అక్కడ లభించిన శాసనం ఆమెను, ఆ రాజును ప్రస్తావిస్తూ, అది మహీశాసకుల కొరకు నిర్మాణమైనట్లు తెలుపుతుంది. ఇక్కడి స్తూపాల్లో ఒక దాని నుండి మృణ్మయ పేటికలో ఉంచిన ధాతువులను సంపాదించడం జరిగింది. ఈ సముదాయం లోని విశేషం, జంటగా రెండు స్తూపాలను నిర్మించి, చైత్య గృహాలను నిర్మించక, వదిలి వేయడం. మహీశాసకులు, ధేరవాదులు, చైత్య ఆరాధనలు, బుద్ధ ప్రతిమలను పూజించడం, వారి తత్వానికి విరుద్ధం. కనుక, వారు పూజా గృహాల వంటి చైత్యగృహాలను నిర్మించలేదని గ్రహించొచ్చు. అయితే, నుళధమ్మగిరిపద్ద ఉన్న మహావిహారంలో రెండు చైత్యగృహాలు కానవస్తాయి. మహావిహారవాసులు పూర్వాచారపరాయణులే అయినా, కొంత వరకు స్థానిక, సమకాలీన ప్రభావాలకు లోనైనట్లు ఈ చైత్య గృహాలు సూచిస్తాయి.

BRAOU

పైన వివరించిన ప్రధాన బౌద్ధ మత శాఖలకు చెందిన స్తూప, చైత్య నిర్మాణాలు మాత్రమే కాక, నాగార్జునకొండ వద్ద మరిన్ని విధాలైన నిర్మాణాలు వెలికివచ్చాయి. వాటి పరిశీలన వలన, శాతవాహనానంతర యుగం లోని బౌద్ధ మత పరిణామాలు, వాటికి అనుగుణంగా వాస్తు, నిర్మాణ శైలుల్లో వస్తున్న మార్పులను గ్రహించొచ్చు.

నాగార్జునకొండ తర్వాత బౌద్ధ కేంద్రాల్లో, వాస్తు విశేషాలకు ప్రాముఖ్యత కల ప్రదేశాల్లో పేర్కొనదగినవి, సంకారం, గుంటుపల్లి. అయితే, ఇక్కడి ప్రదేశాల్లో కన్పించేది గుహాలయ వాస్తువు. గుంటుపల్లి జైన కేంద్రంగా ప్రారంభమై, క్రమంగా బౌద్ధ మత కేంద్రంగా పరిణామం చెందినట్లు తోస్తుంది. క్రీ.శ. నాలుగు, ఐదు శతాబ్దాలకు చెందిన అనేక శాసనాలు గుంటుపల్లి గుహల వద్ద ఇటీవలి కాలంలో వెలుగు లోనికి వచ్చాయి. ఈ శాసనాలు అక్కడి బౌద్ధాలయాలకు ప్రజలు, ప్రభువులు అందించిన ప్రదానాలను, పోషణను సూచిస్తాయి. వాటిలో ప్రత్యేకించి పేర్కొనదగింది, శాలంకాయన రాజైన రెండో నందివర్మ వేసిన శాసనం. సంకారం వద్ద కూడ ప్రధానమైంది, రాతి చెక్కడపు పనితో కూడిన వాస్తువే. అక్కడ కొండ పైభాగం యావత్తు వందలాదిగా, చిన్న చిన్న స్తూపాలుగా మలిచినవి కానవస్తాయి. ఇవన్నీ మొక్కుబడి చెల్లించడానికి భక్తులు చెక్కించినవిగా తోస్తుంది. పెద్ద పరిమాణంలో మలిచిన స్తూపాలు సైతం లేకపోలేదు; కాని, వాటిలో కొన్ని అసంపూర్తిగా వదిలి వేసినవి. వాటి సమీపంలో ఒక చైత్య గృహం నిర్మాణమై ఉన్నట్లు, అవశేషాల వలన తెలియవస్తుంది.

ఇటీవలి కాలంలో విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాల్లో శాలిహుండం, బావికొండ, తొట్లకొండ వద్ద, ఖమ్మం జిల్లాలో నేలకొండపల్లి, కరీంనగర్ జిల్లాలో ధూళికట్ట మొదలైన చోట్ల జరిగిన త్రవ్వకాల్లో, స్తూపాలు, విహారాలు బయల్పడ్డాయి. కాని, వాటినింకా సమగ్రంగా అధ్యయనం చేయాల్సుంది. వీటిలో కొన్ని శాతవాహన యుగానికి చెందినవి, ఆ తర్వాత కాలంలో సైతం తమ ప్రాముఖ్యతను నిలుపుకొన్నట్టివిగా కానవస్తాయి. తుమ్మలగూడెం శాసనాల వలన విష్ణుకుండిన రాజు గోవిందవర్మ అనేక విహారాలు, దేవాయతనాలను నిర్మించినట్లు తెలియవస్తుంది. కాని, వాటి జాడలు లభ్యం కావడం లేదు.

7.6.2 : హిందూ దేవాలయ వాస్తువు

బౌద్ధ మతం స్తూపాలు, చైత్యాల నిర్మాణాలతో ఆరాధ్య వస్తువులను, ఆలయాలను సుమారు క్రీ. పూ. నాలుగో శతాబ్ది నుండి ప్రారంభించినా, హిందూ దేవాలయాలు, దేవ, దేవతా విగ్రహాలు అంతకు పూర్వం నుండి లభ్యం కావడం లేదు. హిందూ దేవతలు సుమారు క్రీస్తు శకారంభంవరకు, జంతు, వృక్ష రూపాల్లో, నాగ, యక్ష విగ్రహాల్లోను ఉన్నట్లు, ఆ తర్వాత కాలం లోనే త్రిమూర్తులు, త్రిమాతలు, వారి అవతారాలు, పరివార దేవతలు మొదలైన వాటితో విగ్రహారాధన, ఆలయ నిర్మాణాలు ప్రారంభమైనట్లు కానవస్తుంది.

ఆంధ్ర దేశంలో అత్యంత ప్రాచీనమైనవిగా చెప్పదగిన దేవాలయాలు, కర్నూల్ జిల్లాలో కృష్ణా నది ఒడ్డున వీరాపురం మొదలైన చోట్ల జరిగిన త్రవ్వకాల్లో, వెలుగు లోనికి వచ్చాయి. ఇవి నేటి గ్రామాల్లో గ్రామ దేవతలకు నిర్మించిన గుళ్ళను పోలి, కేవలం మూడు వైపుల గోడలు, ముందు గోడకు ద్వారంతో కూడిన చిన్న గది (Cellar), అందులో ప్రతిష్ఠించిన విగ్రహాన్ని మాత్రమే కలిగున్నాయి. హిందూ దేవాలయ వస్తువు ప్రధానంగా సమాజం లోని అడుగు, బడుగు వర్గాల

BRAOU

అవసరాలకు, శక్తి యుక్తుల కనుగుణంగా ప్రారంభమైందని, ఆ దశలో ఐశ్వర్యవంతులైన వర్తక వాణిజ్య వర్గాలు, "గహపతులు" బౌద్ధ ధర్మానికి అందించినంత విస్తృతమైన పోషణ లభించలేదని తోస్తుంది. అందుక్కారణం హిందూ మతం అప్పటికే ఆరాధనా విధానాలను, ఆరాధ్య వస్తువులను అభివృద్ధి చేయకపోవడమే. బౌద్ధ ధర్మంలో వలె, ఉన్నత స్థాయికి చెందిన తాత్విక చింతన కూడ అభివృద్ధి కాలేదని తోస్తుంది.

నాగార్జునకొండ త్రవ్వకాల్లో విజయపురిలో సర్వదేవ, పుష్పభద్రస్వామి, అనే పేర్లతో, శివాలయాలు, స్కంద, కుమారస్వామి ఆలయాలు విస్తారంగా నిర్మాణమైనట్లు, స్పష్టంగా తెలియవస్తున్నది. ఈ ఆలయాలు గర్భ గృహం, స్తంభాల వరుసలతో కూడిన మండపం, ముదలైన భాగాలను కలిగి, వాస్తు శైలిలో కొంత అభివృద్ధి జరిగినట్లు సూచిస్తాయి. అయితే, అక్కడి త్రవ్వకాల్లో కేవలం వీటి అధిష్ఠాన భాగాలు (foundations) మాత్రమే లభించడాన, గోడలు, పైభాగం ఏ విధంగా ఉండేవో, ఊహించడం సాధ్యం కాదు. ఇవి ఇటుకలతో నిర్మాణమైనవి.

7.6.2.1 : చేజెర్ల

ఆంధ్ర దేశం లోనే కాక, దక్షిణ భారతదేశం లోనే సంపూర్ణంగా నేటికి నిల్చిఉన్న అత్యంత ప్రాచీనమైన దేవాలయం, నేటి గుంటూర్ జిల్లా నరసరావుపేట తాలూకా లోని చేజెర్ల గ్రామం వద్ద కానవచ్చే, కపోతేశ్వరాలయం. ఈ ఆలయం చైత్య గృహాల వలె, వెనుక భాగం అర్ధ వృత్తాకారంగాను, పై కప్పు అర్ధ గోళాకృతిగాను ఉంది. ఎదుటి నుండి చూచినపుడు, ఆలయ ముఖం కపోతంపైన చైత్యవాతాయనం వంటి మకర తోరణ ముంది. గర్భ గృహం లోని శివ లింగం సాధారణంగా శివాలయాల్లో కన్పించే విధంగా పానపట్టం కలిగినట్లు, బ్రహ్మ, విష్ణు, రుద్ర, భాగాలతో కన్పించదు. ఒక బూడిద రంగు గల పలనాటి నాపరాతి స్తంభాన్ని చిరుగగొట్టి నిలిపినట్లు, కానవస్తుంది. ఆలయ నిర్మాణంలో సైతం, నాగార్జునకొండ వద్ద బౌద్ధ నిర్మాణాల్లో ఉపయోగించినటువంటి, చలువరాతిని పోలిన రాతి స్తంభాలు, వాటిపై బాగా అరిగిపోయిన, ఇక్ష్వాకు కాలపు లిపిలో అక్షరాలు, కానవస్తాయి. ఈ కారణాల వలన ఈ ఆలయం మొదట బౌద్ధ చైత్యమని, తర్వాత కాలంలో శివాలయంగా మార్పు జరిగిందని, లోగడ చరిత్రకారులు, పురావస్తువేత్తలు అభిప్రాయపడ్డారు.

క్రీస్తు శకం అయిదో శతాబ్దిలో కృష్ణా తీరాన్ని పరిపాలించిన ఆనందగోత్ర రాజు దామోదరవర్మ తన మట్టిపాడు శాసనంలో, తాను "సమ్యక్సంబుద్ధ పాదానుధ్యాతు"డని వర్ణించుకొనడం, అతని రాజధాని కందరపురం, బౌద్ధ వాఙ్మయం వివరించే "కపోత కందర"మని, అది చేజెర్లని, లోగడ పలువురు చరిత్రకారులు భావించారు. కాగా, ఈ ఆలయాన్ని బౌద్ధ చైత్యంగా దామోదర వర్మ నిర్మించినట్లు, వారి అభిప్రాయం. దామోదర వర్మ బౌద్ధుడు కాడని, ఆనందగోత్ర రాజులకు కృష్ణా తీరంలో రాజధాని లేదని, పైన వివరించడం జరిగింది. ఇటీవల కాలంలో కపోతేశ్వరాలయ ప్రాంగణంలో జరిగిన పురావస్తు త్రవ్వకాలు, ఆ ఆలయం క్రీ.శ. రెండో శతాబ్దికి చెందినట్లు, మొదటి నుండి అది శివాలయంగానే ఉన్నట్లు స్పష్టపడింది. ఈ ఆలయాన్ని శివాలయంగానే మార్చినట్లు, లోగడ చరిత్రకారులు భావించిన విష్ణుకుండిన, చాళుక్య రాజు లెవరూ అంత తీవ్రమైన శైవ మత తత్పరులు కారు. క్రీస్తు శకం తొలి శతాబ్దాల్లో సంభవించిన మత పరిణామాలు, భక్తితత్వం ప్రధానంగా వివిధ మతాలు చేరువౌతున్నట్లు స్పష్టపర్చే అంశాన్ని పైన వివరించడం జరిగింది. చైత్యాలయ ప్రణాళికతో హిందూ దేవాలయాల నిర్మాణం, క్రీ.శ. 11వ శతాబ్దం వరకు ఆంధ్ర దేశం లోను, పరిసర తమిళ దేశం లోను కొనసాగింది. అందుచేత, ఈ ఆలయమే ప్రత్యేకంగా చైత్య ప్రణాళికను కలిగినట్లు, రూపాంతరం చెందినట్లు భావించ పనిలేదు.

BRACU

అయితే, కాలానుగుణంగా శైవ మతాచారాల్లో, సంభవించిన పరిణామాల ననుసరించి, దేవాలయ వాస్తు విధానాల్లో మార్పులు జరిగాయి. అతి ప్రాచీన కాలంలో శివునికి అభిషేకం జరిగేది కాదని, అందుచేత గర్భాలయం నుండి వారి మార్గం (అనగా అభిషేక జలం బయటికి రావడానికి ఏర్పాటు) ఉండేది కాదని, చేజెర్ల ఆలయం వద్ద జరిగిన త్రవ్వకాలు స్పష్టపరుస్తున్నాయి. ఇదే విధంగా నేటి చిత్తూర్ జిల్లాలో రేణిగుంట సమీపం లోని గుడిమల్లం వద్ద ఉన్న పరశురామేశ్వరాలయం కూడ, తర్వాత కాలంలో ఏర్పడ్డ మతాచారాల కనుగుణంగా పునర్నిర్మాణం జరిగినట్లు, అక్కడ జరిగిన పురావస్తు త్రవ్వకాలు స్పష్టం చేస్తున్నాయి. ఆ ఆలయంలో శివ లింగం యధార్థమైన ఆకృతిని కల్గి, దానిపై పరసువు చేత పట్టిన వేటగాని వలె, ఒక చేత చంపిన జింకను మెనుక కాళ్ళతో పట్టుకున్నట్లు, మానవాకృతిలో శివుణ్ణి ప్రతిష్ఠించడం జరిగింది.

7.6.2.2 : గుహాలయ వాస్తువు

క్రీ.పూ. రెండో శతాబ్ది లోనే గుంటుపల్లి వద్ద గుహాలయ వాస్తు విధానం ప్రారంభమైనట్లు, గుహాలయాలను తొలవడం జరిగినట్లు పైన వివరించడం జరిగింది. అయితే, ఆ కాలంలో తొలిచిన గుహాలయాలు జైన, బౌద్ధాలకు చెందినవి. తర్వాత కాలంలో కృష్ణా నదికి ఇరు వైపుల మైదాన భాములో నేటి విజయవాడ పట్టణంలో చేరిన కొండల్లోను, గుంటూరు జిల్లాలోని ఉండవల్లి వద్ద ఉన్న కొండ లోను, గుహాలయాలను త్రవ్వడం జరిగింది. ఇవి హిందూ మతానికి చెందినవి. క్రీ. శ. మూడో శతాబ్ది నుండి వీటి త్రవ్వకం ప్రారంభమైనట్లు నిర్ణయించడం జరిగింది. అయితే, ఈ గుహాలయాల్లో గణనీయమైన అభివృద్ధిని ప్రదర్శించే గుహాలయాలు క్రీ.శ. ఆరో శతాబ్దికి చెంది, విష్ణుకుండినుల పరిపాలనా కాలంలో తొలిచినవి కావొచ్చు.

7.6.2.3 : విజయవాడ గుహాలయాలు

విజయవాడలో ఇంద్రకీలాద్రి దిగువన కానవచ్చే గుహాలయాల్లోని స్తంభాలు చాల పెద్ద పరిమాణాన్ని కల్గినవి; వాటి ఆకృతి ఉదయగిరి గుహాలయాల్లో కానవచ్చే స్తంభాలను పోలినవి. పెద్ద పరిమాణంలో అలంకరణలు లేకుండా, నైపుణ్యం ప్రదర్శించని స్తంభాలు చాల ప్రాచీనమైనవిగా భావించడం కద్దు. అటువంటి స్తంభాలను కలిగి ఉండడం, కళింగ దేశపు గుహాలయాల్లోని స్తంభాల ఆకృతిని కలిగి ఉండడం వలన, ఇక్కడి పనితనం, బహుశః పనివారు కళింగ దేశం నుండి, సుమారు క్రీ.శ. మూడు, నాలుగు శతాబ్దాల్లో చేరినట్లు ఊహించొచ్చు.

ఇంద్రకీలాద్రి పైన, అక్కన్న మాదన్న గుహలకు కొంచెం పై ఎత్తున మరొక గుహాలయం ఉంది. అది అక్కన్న మాదన్న గుహల కంటె అతిశయించిన పనితనాన్ని ప్రదర్శిస్తుంది. మొగల్రాజుపురం (నేటి విజయవాడ లోని ఒక ప్రాంతం) గుహల వద్ద కనిపించే గుహాలయాలు కూడ, ఇటువంటి అభివృద్ధి చెందిన పనితనాన్ని ప్రదర్శిస్తాయి. ఇవి క్రీ.శ. ఐదు, ఆరు శతాబ్దాలకు చెందినవిగా నిర్ణయించొచ్చు.

ఈ గుహాలయాలు రెండు స్తంభాలు కలిగిన వరండాను, వరండా మెనుక గోడ లోనికి తొలిచిన మూడు గర్భ గృహాలను కలిగి ఉన్నాయి. వరండా పైన ముందుకు చొచ్చుకొని వచ్చే కపోతంపై చిన్న చైత్య వాతాయనాలను రూపొందించడం జరిగింది. అవి, మూడు గర్భ గృహాలకు సూటిగా మూడు ఉన్నాయి. వాటిలో బాగా అరిగిపోయిన, బ్రహ్మ, విష్ణు, శివులు, వారి భార్యలతో

BRAOU

కూడిన విగ్రహాలు కానవస్తాయి. దీనిని బట్టి, గర్భ గృహాలు మూడింటిలో అదే విధంగా విగ్రహాలను నిలిపినట్లు భావించొచ్చు. పల్లవ రాజైన మొదటి మహేంద్రవర్మ తన మందగప్పట్టు శాసనంలో, ఇటుకలు, సున్నం, కలప, లోహాన్ని ఉపయోగించకుండ, బ్రహ్మ, విష్ణు రుద్ర, లక్ష్మి, తాయతనాలను, అంటే దేవాలయాలను, నిర్మించినట్లు, చెప్పకోవడాన్ని ఈ సందర్భంగా జ్ఞప్తి చేసుకోవాల్సుంది. అటువంటి విచిత్రమైన నిర్మాణం, గుహాలయ వాస్తువు కాక, మరొకటి, లేదా, అంతకు పూర్వం తమిళ దేశంలో తెలియని ఈ ప్రక్రియను, ఆ రాజు ఆంధ్ర దేశం లోని శిల్పులను తరలించడం ద్వారా అక్కడ ప్రవేశపెట్టాడని గ్రహించొచ్చు. అంతేకాక, విజయవాడ వద్ద గుహాలయాల వలెనే, అవి కూడా స్తంభాలతో కూడిన వరండా, వెనుక గోడ లోనికి తొలిచిన మూడు గర్భ గృహాలను కలిగి, త్రిమూర్తులను ప్రతిష్ఠించినవే. కనుక గుహాలయ వాస్తువు, నిర్మాణ శైలి, వాటి పరమార్థం, సమస్తమూ ఆంధ్ర దేశం నుండి తమిళ దేశానికి వలస వెళ్ళిందని స్పష్టపడుతున్నది. విష్ణుకుండిన సామ్రాజ్యం అంతరించిన తర్వాత, చాళుక్యులు తీరాంధ్ర దేశాన్ని ఆక్రమించక పూర్వం, ఆంధ్ర దేశం పల్లవుల వశమైందని, పైన వివరించడం జరిగింది. ఈ కాలం లోనే ఆంధ్ర దేశపు శిల్పులను పల్లవులు తమ భూభాగాలకు తరలించారని నిస్సంశయంగా చెప్పొచ్చు.

7.6.2.4 : ఉండవల్లి గుహాలయాలు

విజవాడ వద్ద ఉన్న గుహాలయాల కంటే, ఉండవల్లి వద్ద ఉన్న గుహాలయం, ప్రశస్తమైన శిల్పనై పుణ్యాన్ని ప్రదర్శిస్తుంది. కాని, ఆ గుహాలయాన్ని తొలిచిన కొండరాయి నాణ్యమైనది కాకపోవడాన, చాలవరకు శిధిలమై రూపాన్ని కోల్పోయింది.

ఉండవల్లి వద్ద సైతం పైన పేర్కొన్నట్లు, మూడు గర్భ గృహాలను కల్గిన ప్రణాళికతో తొలిచిన గుహాలయ మొకటి కానవస్తుంది. అయితే, అది అసంపూర్ణమైంది. అక్కడి ప్రధాన గుహాలయం, చాల క్లిష్టమైన భూప్రణాళికను కలిగింది. ఇది మూడు అంతస్తులను కలిగి, క్రింది భాగాన్ని అసంపూర్ణంగా వదిలి వేసినట్లు కన్పిస్తుంది. రెండవ అంతస్తు ఒక వరండా, వెనుక గోడ లోనికి తొలిచిన గర్భ గృహాన్ని కలిగింది. దానిలో నుండి ఒక మండపం లోనికి ప్రవేశించే మార్గం, గుహాలయపు ఎడమ గోడలో తొలిచింది, కానవస్తుంది. అక్కడి మహామండపం అడ్డంగా నాలుగు వరుసలను, నిలువుగా రెండు వరుసల స్తంభాలను కలిగి ఉంది. కాని, గర్భ గృహం మాత్రం కానరాదు. ఈ మండపం నుండి మూడో అంతస్తు లోనికి ప్రవేశించే మెట్లు ఉన్నాయి. మూడో అంతస్తులో అడ్డంగా నాలుగు వరుసలు, నిలువున మూడు వరుసలను కలిగిన స్తంభాలతో ఒక మండప ముంది. మండపం ఎడమవైపు గోడకు 25 అడుగుల పొడవు, 12 అడుగుల ఎత్తు కలిగిన అనంతశాయి (అనగా, శేషతల్పం పై పవళించిన విష్ణువు) విగ్రహాన్ని తొలచడం జరిగింది. విష్ణువు నాభికమలం నుండి ఉద్భవించిన బ్రహ్మదేవుడు, ప్రక్కగా మధుకైటభులు, ఇతర దేవతల విగ్రహాలు కానవస్తాయి.

ఈ అనంతశాయి విగ్రహం అజంతా గుహల్లో 26వ నెంబర్ చైత్యాలయంలో కానవచ్చే బుద్ధుని మహాపరినిర్వాణ సన్నివేశాన్ని పోలి ఉంది. గుహాలయ వాస్తువు కేవలం బౌద్ధ మతానికి చెందినదని, ఈ విగ్రహం బుద్ధుని మహాపరినిర్వాణంతో పోల్చదగిందని, కనుక వాస్తవంగా ఈ గుహాలయం బౌద్ధ గుహాలయం కాగా, తర్వాత హిందువులు దీని నాక్రమించి, అనంతశాయి విగ్రహంగా మార్చినట్లు, లోగడ పురావస్తువేత్తలు అభిప్రాయపడ్డారు. ఈ అంతస్తు లోని స్తంభాలపై వైష్ణవ ప్రధానమైన ఇతిహాస పురాణాల గాథలు తొలిచినవి కానవస్తాయి.

BRAOU

ఉండవల్లి గుహకు బౌద్ధ మతం, వాస్తు ప్రక్రియలతో సంబంధమున్నట్లు, పైన వివరించిన వాదం నేటికి చరిత్రకారుల్లో కొనసాగుతూనే ఉంది. ఈ విషయంలో ఏదీ స్పష్టంగా నిర్ణయించడానికి సాక్ష్యాధారాలు లభ్యం కావడం లేదు. అయితే, వాస్తవంగా ఉండవల్లి గుహలు బౌద్ధ ధర్మానికి చెందినవిగా నిర్ణయించడానికి, ఎంత మాత్రం సాక్ష్యాధారాలు కానరావు.

ఉండవల్లి గుహాలయం లోని స్తంభాలు పైన వివరించిన విధంగా, చాల పెద్ద పరిమాణంలో, కళింగ దేశ గుహాలయాల్లోను, విజయవాడ వద్ద అక్కన్న మాదన్న గుహల్లోను కనిపించే విధంగా ఉన్నాయి. ఈ గుహాలయం ప్రాచీనతకు ఇవి నిదర్శనాలు. ఈ గుహాలయం సమీపంలో తక్కువ పరిమాణం కలిగిన, తక్కువ లోతు (low relief)గా తొలిచిన ఆలయ నమూనాలు కానవస్తాయి. ఇవి మామల్లపురం లోని రాతి రథాలతో పోల్చదగిన ఆకారాలను కలిగినవి. పల్లవులు కృష్ణా తీర మైదానాన్ని ఆక్రమించి, ఇక్కడి శిల్పులను తరలించుకొని తమిళ దేశానికి కొనిపోయినందువల్లనే, ఈ శిల్ప శైలిని మామల్లపురం రథాలలో ప్రయోగించడం సాధ్యమైంది. కనుక, ఉండవల్లి గుహాలయం, క్రీ.శ. 6వ శతాబ్దికి పూర్వం నాటిదిగా నిర్ణయించొచ్చు. అయితే, గుహాలయంలో ఒక స్తంభం పై వరాహం చెక్కి ఉంది. వరాహం చాళుక్యుల రాజ లాంచనం. అలాగే, గుహాలయంపై అంచున కానవస్తున్న "శాల-కూట-హారం" కాంచిపురం లోని పల్లవుల కాలపు దేవాలయాల్లో, క్రీ.శ. 9వ శతాబ్దం నాటి వాస్తు శైలికి చెందినవి. ఇటువంటి అనంతర కాలపు వాస్తు, శిల్ప శైలీ ప్రయోగాలు, క్రీ.శ. 7, 8 శతాబ్దాల్లో సైతం ఇక్కడ కొంత పని జరిగినట్లు, అయితే ఆ కాలం నాటి రాజకీయ కల్లోలాల్లో కొనసాగనట్లు సూచిస్తాయి.

7.7 : భాషాభివికాసం

శాతవాహన యుగంలో ప్రాకృత భాష ప్రభుత్వ వ్యవహారాల్లోను, మత వాఙ్మయ, సాహిత్య, వ్యాపార రంగాల్లోను ఉపయోగించబడినా, క్రమంగా సంస్కృత భాషా వ్యాప్తి జరుగుతున్నట్లు, పైన వివరించడం జరిగింది. క్రీ.శ. వందో శతాబ్దారంభం నుండి ఆంధ్ర దేశాన్ని పరిపాలించిన రాజ వంశాలు, తమ శాసనాలను సంస్కృత భాష లోనే వెయ్యడాన్ని గుర్తించొచ్చు. క్రీ.శ. నాలుగో శతాబ్దంలో పరిపాలించిన శాలంకాయన, ప్రాచీన పల్లవ రాజులు ప్రాకృత భాష లోనే శాసనాలను వేసినా, అప్పటి ప్రాకృతం చాల వరకు సంస్కృత భాషా ప్రభావానికి గురౌతున్నట్లు స్పష్టంగా కానవస్తుంది. ఈ విధమైన భాషా పరిణామాన్ని ఇక్ష్వాకుల శాసనాల్లోనే గుర్తించొచ్చు. అంతేకాక, మొట్ట మొదట ఆంధ్ర దేశంలో సంస్కృత భాషా శాసనాలు ఇక్ష్వాకుల్లోని ఎహువల శాంతమూలుని కాలంలో ప్రారంభమైనాయి. అదే విధంగా, క్రీ.శ. 4, 5 శతాబ్దాల నాటి సంస్కృత శాసనాలపై ప్రాకృత భాషా ప్రభావాన్ని కూడ స్పష్టంగా గుర్తించొచ్చు. ఈ విధమైన భాషా పరిణామాలు ఆకస్మికంగా సంభవించినవికావని, క్రమంగా రెండు, మూడు శతాబ్దాల కాలంలో ఏర్పడినవని, ఈ యుగం నాటి శాసనాలను పరిశీలించి గ్రహించొచ్చు.

సంస్కృత భాషా వ్యాప్తికి నవ్య వైదిక మత విస్తరణను ఒక ప్రధాన కారణంగా పేర్కొనొచ్చు. పురాణ, ఇతిహాస వాఙ్మయం, వైదిక వాఙ్మయం క్రమంగా ప్రజల గౌరవాభిమానాలను పొందుతూ, ఆ వాఙ్మయంలో కృష్ణుణ్ణమైన పాండిత్యాన్ని కలిగిన బ్రాహ్మణులకు, గ్రామ, భూదానాలను ఇయ్యడం జరిగింది. పైన వివరించినట్లు, ఇటువంటి వాఙ్మయం ఆనాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థల సుస్థిరత్వానికి అవసరమైంది. ఈ వాఙ్మయం సంస్కృత భాషలో నిర్మించింది కావడాన, ఆ నాటి రాజుల పోషణ పొంది విస్తరించడంతో, క్రమంగా ప్రాకృతం తొలిగిపోయి, సంస్కృత భాష

BRAOU

అగ్ర స్థానాన్ని అందుకొంది. అయితే, ఈ భాషలో గణనీయమైన సారస్వత సృష్టి ప్రాచీనాంధ్ర దేశంలో జరిగినట్లు కన్పించదు. అనగా గ్రంథ రచన జరిగి, అవి నేటికి లభించకుండ పోయినవని ఊహించడానిక్కూడా అవకాశం లేకపోలేదు. విష్ణుకుండిన మాధవవర్మ రచించినట్లు, సాంప్రదాయికంగా **"జనాశ్రయ ఛందోవానిత"** అనే గ్రంథం కానవస్తున్నది. ఇది, ఆపేరు సూచిస్తున్నట్లు, ఛందస్సుకు సంబంధించిన శాస్త్ర గ్రంథం. కావ్య రచన జరిగే సమయం లోనే, ఛందస్సును గూర్చిన శాస్త్ర గ్రంథాలు అవసరమౌతాయి. కనుక, ఆ కాలంలో కొంత సంస్కృత కావ్యాల రచన ఆంధ్ర దేశంలో జరిగిందని, అయితే అవి పూర్తిగా నష్టమైపోయినాయని భావించొచ్చు.

శాతవాహన యుగంలోనే "దేశి" భాష, అంటే స్థానిక ప్రజల పలుకుబడులతో కూడిన భాష, కొంత ప్రాముఖ్యతను పొందినట్లు పైన వివరించడం జరిగింది. ఇది ద్రవిడ, ఆస్ట్రిక్ భాషల పదజాలంతో మౌలికంగా ఏర్పడి, ప్రాకృత భాషా ప్రభావంతో అభివృద్ధి చెందిందని గ్రహించొచ్చు. ప్రాకృతం క్రమంగా అంతర్ధానమై, సంస్కృత, భాషా వ్యాప్తి జరగడంతో, ఈ భాషపై సంస్కృత ప్రభావం ప్రసరించసాగింది. సంస్కృత పదాలు విరివిగా ఈ భాష లోనికి ప్రవహించి, తత్సమ పదాలుగా రూపొందుతున్నాయి. విష్ణుకుండిన రాజైన రెండో విక్రమేంద్రవర్మ వేసిన చిక్కుళ్ళ శాసనం, "విజయరాజ్యసంవత్సరంబుళ్" అనే సంస్కృత పదానికి, తెలుగు ప్రథమా విభక్తి రూపాంతరమైన బిందుపూర్వక "ము" ప్రత్యయాన్ని చేర్చి, తత్సమ పదంగా రూపొందించిన ప్రయోగ మిందుకు నిదర్శనం. ఈ విధమైన భాషా సంస్కరణలు, ప్రయోగాలు కావ్య రచనకే అవసరమైనవి, లేదా కావ్య రచన వలన ఏర్పడతాయి. పైన పేర్కొన్నట్లు, అప్పటికే కావ్య రచన కొంత జరుగుతున్నట్లు, ఈ భాషా పరిణామాల వలన గుర్తించొచ్చు. **జనాశ్రయ ఛందోవానిత,** కొన్ని దేశీయ ఛందస్సులను గూడ పేర్కొనడం, ఈ సందర్భంగా గుర్తించాల్సిన విషయం. అయితే, **"జనాశ్రయ ఛందోవానిత"** విష్ణుకుండినుల కాలం నాటిది కాదు; ఆ వంశం లోని రెండో మాధవవర్మకు జనాశ్రయ బిరుదం లేదు. ఆ గ్రంథం అతని రచన, లేదా, అతని ఆస్థానంలో అతని పేర రచించబడింది కాదని గుర్తించాల్సుంది. విష్ణుకుండినుల కాలంలో జరిగిన భాషాభివృద్ధి ఆ తర్వాత కూడ కొనసాగింది.

BRAOU

7.8 : సంగ్రహంగా

శాతవాహనానంతర యుగం ఆంధ్ర దేశ చరిత్రలో ప్రాధాన్యత కలది. సామ్రాజ్య వ్యవస్థ శిథిలమై, ప్రాదేశిక రాజ్యా లేర్పడిన కాల మిది. ఇందుకు కేవలం, సాంప్రదాయికంగా సామ్రాజ్య వ్యవస్థ బలహీనమైందని, అందుచేత పతనమైందని చెప్పడం, సంపూర్ణమైన వివరణ కాదు. అందుకు ఆర్థిక, సాంఘిక కారణాలు ప్రధాన పాత్ర వహించాయి. పశ్చిమాన రోమన్ సామ్రాజ్య పతనంతో వర్తక వాణిజ్యాలు క్షీణించడం, ఇందుకు మూల కారణం.

వర్తక వాణిజ్యాలు క్షీణించడం చేత, గ్రామీణ వృత్తులను అవలంబించే వారు, తమ సాంప్రదాయిక జీవన విధానాన్ని వదిలివేసి, వ్యవసాయాన్ని చేపట్టారు. వారితో పాటే, అనేక విదేశీ జాతులు తమ రాజకీయ ప్రాబల్య మంతరించడంతో, వ్యవసాయాన్ని ఆశ్రయించి, ప్రశాంత జీవనాన్ని ప్రారంభించారు. ఈ కారణం చేత, విశేషంగా వ్యవసాయ విస్తరణ జరిగింది. అసంఖ్యాకంగా నూతన గ్రామాలేర్పడ్డాయి. స్థానిక రాజ్యాలు విస్తరించాయి. ఈ పరిణామాల్లో గ్రామీణ పరిపాలనా వ్యవస్థ, స్థానిక రాజ్య వ్యవస్థలు బలపడడంతో, సామ్రాజ్య వ్యవస్థ బలహీనమైంది. అయితే, విష్ణుకుండినులు, ప్రాచీన పల్లవులు ఇటువంటి స్థానిక రాజ్య వ్యవస్థలను తోబర్చుకొని, సామ్రాజ్య నిర్మాణం చేయడానికి తీవ్ర

ప్రయత్నాలను చేశారు. ఈ ప్రయత్నాల వలన జరిగే పోరాటాలతో, సామ్రాజ్య వ్యవస్థకు స్థానిక రాజ్యాలు, వాటికి గ్రామ పరిపాలనా వ్యవస్థ, ఏటేటా కప్పం చెల్లించే విధానం ప్రారంభమైంది.

వ్యవసాయ ప్రధానమైన జీవన విధానం గ్రామీణ వ్యవస్థను బలపర్చింది. గ్రామీణ జీవనానికి మూలమైన కుల వృత్తులు, వాటి వలన కుల వ్యవస్థ బలపడ్డాయి. 'దేశం', అనే పదానికి 'గ్రామ' మనే అర్థమేర్పడి, విస్తృతమైన దృక్పథానికి మారు, తమ వరకు, తమ గ్రామం వరకు పరిమితమైన సంకుచిత దృక్పథ మేర్పడింది. స్థానిక సంస్కృతులకు, మతాచారాలకు ప్రాధాన్యత పెచ్చింది. ఈ పరిణామాల్లో బౌద్ధ, వైదిక మత సంస్కృతులు, స్థానిక ప్రభావంతో శాఖోపశాఖలైనాయి. అసంఖ్యాకంగా దేవ, దేవతా గణాన్ని ఇముడ్చుకొని, ఏకత్వంలో తీవ్రమైన భిన్నత్వాన్ని ఏర్పర్చాయి. ఆయా దేవ, దేవతా గణాన్ని గూర్చిన గాథలతో, పురాణ, ఇతిహాస వాఙ్మయం విస్తరించింది.

ఈ విధమైన మత పరిణామాల్లో, సాధారణ ప్రజానీక మనుసరించే భక్తి విధానానికి ప్రాధాన్యత పెచ్చింది. సాధారణ ప్రజలు అనుసరించే దేవ, దేవతాగణానికి ఆలయాలను నిర్మించడం. వారి మహత్వంతో కూడిన గాథలను వస్తువుగా గ్రహించి విగ్రహాలను చెక్కడం, ఆలయాలలో శిల్పాలంకరణలను జరపడం, విస్తారంగా జరిగింది. ఇవి, శాతవాహనానంతర యుగంలో వాస్తు, శిల్పకళా వికాసానికి దోహదమైనాయి.

7.9 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. శాతవాహనానంతర యుగం లోని పరిపాలనా విధానాన్ని వివరించండి.
2. శాతవాహనానంతర యుగం నాటి సామాజికార్థిక స్థితిగతులను సమీక్షించండి.
3. శాతవాహనానంతర యుగం లోని మత-ధార్మిక పరిణామాలను పరిశీలించండి.
4. శాతవాహనానంతర యుగం నాటి వాస్తుకళా రీతులు, ప్రగతిని సమీక్షించండి.

II. క్రింది ప్రశ్నలకు సంక్షిప్త వ్యాఖ్యలను రాయండి

1. ప్రాచీనాంధ్ర దేశంలో నెలకొన్న భూస్వామ్య విధాన మెట్టిది?
2. ప్రాచీనాంధ్ర దేశంలో నెలకొన్న రాజరికాన్ని వివరించండి.
3. శాతవాహనాంతర యుగం నాటి ఆర్థిక పరిపాలనను పేర్కొనండి.
4. శాతవాహనాంతర యుగానికి చెందిన నవ్య వైదిక పరిణామాలను తెల్పండి.
5. శాతవాహనానంతర యుగం లోని భాషా వికాసాన్ని విశ్లేషించండి.

7.10 : ఉపయుక్త గ్రంథాలు

1. Hanumantha Rao, B.S.L. : **Religion in Andhra**, Guntur, 1973

2. Majumdar, R.C., & : **History and Culture of Indian People**,

BRAOU

Pusalkar, A.D. (Ed.) : **Vol. III, the Classical Age**, Bombay, 1954

3. Ray, Amita : **Life and Art of Andhradesa**, Delhi, 1983

4. Satyanarayana, K. : **Study of the History and Culture of the Andhras, Vol. I.** Delhi, 1975

5. Hanumantha Rao, B.S.L. : ఆంధ్రుల చరిత్ర, గుంటూర్, 1982

6. Sundara Rama Sastry, V. : **దక్షిణ భారతదేశ చరిత్ర,** తెలుగు అకాడమి ప్రచురణ, 1989.

రచయిత : డా.వి. సుందరరామశాస్త్రి

BRAOU

ఖండం-IV : ప్రాదేశిక గుర్తింపు: ఆంధ్రలో రాజకీయ కేంద్రాల ఆవిర్భావం (క్రీ.శ. 624-1200)

ఈ ఖండంలో 8,9,10, 11 భాగాలున్నాయి. ఇవన్నీ వేంగీ చాళుక్యుల గురించీ, వారి సమకాలీనుల, అనంతరీకుల చరిత్రలకు సంబంధించినవి. ఆంధ్ర దేశంలో బాదామి చాళుక్య విస్తరణ కారణంగా, వేంగీ చాళుక్య రాజ్యం మూతన రాజకీయ కేంద్రంగా ఆవిర్భవించటం; ద్రవిడ, కర్ణాటక రాజకీయాలు తమ ప్రభావాన్ని ఆంధ్ర రాజకీయలపై చూపటాన్ని, ఇందులో అధ్యయనం చేయడమౌతుంది. సామాజిక, ఆర్థిక, మత సాంస్కృతిక రంగాల్లో ఏ విధమైన మార్పులు, పురోభివృద్ధి సంభవించాయో, వీటిలో వేర్కోవటం జరిగింది. 8వ భాగాధ్యయనం ద్వారా, వేంగీ చాళుక్యుల రాజకీయ చరిత్ర, పరిపాలనను అవగాహన చేసికోగల్గాలి. 9 వ భాగాన్ని చదవడం ద్వారా, ఆంధ్ర దేశ రాజకీయాల మీద పొరుగు రాజ్యాలైన కర్ణాటక, ద్రవిడ ప్రాంతాల ప్రభావం ఎలా సాగిందో గ్రహించగల్గాలి. 10 వ భాగాధ్యయనం ద్వారా వేంగీ సామ్రాజ్య మంతరించటం, చాళుక్య చోళులు తమ ప్రతినిధుల ద్వారా వేంగీలో పాలించటం, ఎన్నో మాండలిక రాజ్యాలేర్పడటం, ఇత్యాది, విషయాలను అర్థం చేసికోగల్గాలి. చివరిదైన 11 వ భాగాన్ని పఠించడం ద్వారా, వేంగీ చాళుక్యులు, వారి తర్వాతి కాలంలో సామాజిక, ఆర్థిక, మత సాంస్కృతిక రంగాల్లో వచ్చిన మార్పుల్ని, సాధించిన పురోగతిని విశదికరించగల్గాలి.

అంటే, కాలమాన రీత్యా, ఆంధ్ర ప్రాంతంలో క్రీ.శ. 624 నుండి 1200 వరకేర్పడ్డ రాజకీయ, సామాజిక ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులను, పరిణామాలను, పరస్పర ప్రభావాలను, తత్ఫలితాలను, క్షుణ్ణంగా గ్రహించి, విశ్లేషించగల్గాలి.

BRAOU

BRAOU

భాగం-8 : వేంగీ చాళుక్యుల రాజకీయ చరిత్ర : పరిపాలన

విషయక్రమం

8.0 : లక్ష్యాలు

8.1 : పరిచయం

8.2 : వేంగీ చాళుక్యులు

8.2.1 : ఆవిర్భావం

8.2.2 : రాజకీయ చరిత్ర (క్రీ.శ. 624 - 848)

8.2.3 : రాజకీయ చరిత్ర (క్రీ.శ. 848 - 973)

8.2.4 : రాజకీయ చరిత్ర (క్రీ.శ. 973 - 1075)

8.2.5 : వేంగీ చాళుక్య - పల్లవ సంబంధాలు

8.2.6 : వేంగీ చాళుక్య - రాష్ట్రకూట సంబంధాలు

8.2.7 : వేంగీ రాజకీయాల్లో పశ్చిమ చాళుక్యులు, చోళుల పాత్ర

8.2.8 : పరిపాలన

8.2.9 : సంఖ్యాంకిత (Numbered) ప్రాంతీయ విభాగాలు : ప్రాముఖ్యత

8.3 : సంగ్రహంగా

8.4 : పరీక్ష నమూనా ప్రశ్నలు

8.5 : ఉపయుక్త గ్రంథాలు

BRAOU

8.0 : లక్ష్యాలు

పరిపాలకులుగా వేంగీ చాళుక్యుల ఆవిర్భావం, సుదీర్ఘమైన వారి రాజకీయ చరిత్ర, ప్రముఖులైన కొందరి పాలకుల వివరాలు, ఇదే కాలానికి చెందిన ఇతర రాజ వంశాలకు వీరితో వున్న సంబంధం, వీరి పరిపాలనా విధానం, ఇత్యాది విషయాలను ఈ పాఠ్య భాగాధ్యయనం ద్వారా గ్రహించగల్గాలి. వేంగీ రాజకీయాల్లో పశ్చిమ చాళుక్యులు, చోళుల పాత్రను, సంఖ్యాంకిత (numbered) ప్రాంతీయ విభాగాల ఏర్పాటు, దాని ప్రాముఖ్యతను తెలుసుకోగల్గాలి.

వేంగీ చాళుక్యుల రాజకీయ చరిత్రను భిన్న కాలాల్లో - క్రీ.శ. 624-848, క్రీ.శ. 848-973, క్రీ.శ. 973-1075 – అవగాహన చేసికోగల్గాలి.

8.1 : పరిచయం

వేంగీ చాళుక్యులనే తూర్పు చాళుక్యులని కూడ పేర్కొంటారు. కృష్ణా, గోదావరీల మధ్య నున్న వేంగీ దేశం వీరికి ప్రధాన స్థానమవటం చేత, వీరి వంశాన్ని వేంగీ చాళుక్య వంశ మంటారు. ఆంధ్ర దేశ చరిత్రలో వీరి రాజ్య స్థాపనను ఓ నూతనాధ్యాయంగా భావించొచ్చు. కర్ణాటక లోని బాదామి నుండి విస్తరించి, తీరాంధ్రాన్ని ఆక్రమించుకున్న ఈ వంశస్తులు క్రీ.శ. 624 నుండి 1075 వరకు, సుమారు నాలుగున్నర శతాబ్దాల కాలం పాలించారు. ఆంధ్రేతరులని పరిగణించటం సహజమే అయినప్పటికీ, వేంగీలో స్థిరపడి, స్థానిక భావంతో పరిపాలన సాగిస్తూ, ఆంధ్ర సంస్కృతీ పరిరక్షణకు వీళ్ళు నడుం కట్టారు. చోళులు, పశ్చిమ చాళుక్యులు మొదలైనవారు, వారి వారి ఆధిక్యత కోసం పోటీపడి, ఆంధ్ర దేశాన్ని యుద్ధ రంగంగా మార్చిన ఈ యుగంలో, ఆంధ్ర దేశపు స్వాతంత్ర్యాన్నీ, గౌరవప్రతిష్టల్నీ నిలబెట్ట ప్రయత్నించింది వీరే. విభిన్న సంస్కృతీ ప్రక్రియల్ని మహోద్యమంగా ప్రోత్సహించి, ఆంధ్రుల కొక వ్యక్తిత్వాన్ని చేకూర్చారు. వీరే, ఆనాటి వరకు రాజాస్థానంలో ఆదరణకు నోచుకోని తెలుగు భాషను ఆదరించి, విశేష ప్రచారంలోకి తెచ్చారు. అంచేత, మధ్య యుగాల ఆంధ్ర దేశ చరిత్ర, తొలి దశలో వేంగీ చాళుక్యుల చరిత్ర మాత్రమే అంటే, ఏ మాత్రం అతిశయోక్తి కాదు.

8.2 : వేంగీ చాళుక్యులు

క్రీ.శ. 624 నుండి 1075 వరకు ఆంధ్ర రాజకీయాల్ని పూర్తిగా వేంగీ చాళుక్యులు అదుపు చేశారు. వీరికి సమకాలీన పాలక వంశాలతో ముఖ్యమైన సంబంధాలున్నాయి. వీరి పరిపాలనా వివరాలు కూడా గమనార్హంగా ఉన్నాయి.

BRAOU

8.2.1 : ఆవిర్భావం

ఎన్నో ఇతర రాజ వంశాల లాగే, చాళుక్యుల వంశ నామం, ఉత్పత్తి, జన్మ స్థానాల గురించి చెప్పటానికి స్పష్టమైన ఆధారాలు లేవు. వేర్వేరు శాసనాల్లో ఉన్న విషయాలు కథలై, సత్యాన్ని మరుగుపరుస్తున్నాయి. అందులోని గాధలు చాళుక్యుల్ని అయోధ్యను పరిపాలించిన చంద్ర వంశం వాళ్ళని చెప్పాయి. జయ కాంక్షతో దక్షిణాపథానికి వచ్చి, కాలక్రమేణా యిక్కడే స్థిరపడ్డట్టు పేర్కొంటాయి. కాని, ఆ శాసనాల్లో పేర్కొబడ్డ ఇలాంటి కథలన్నీ, బాగా తర్వాతి శతాబ్దాల్లోవి కావటం వల్లా, అయోధ్య ఎప్పుడూ చంద్ర వంశీయుల రాజధాని కాకపోవటం వల్లా, వీటిని ఆధునిక చరిత్రకారులు పూర్తిగా లెక్కలోకి తీసుకోరు. బ్రహ్మదేవుని 'చుళుకం' (దోసిలి) నుండి భూలోక రక్షణ కోసం పుట్టిన మహా వీరుడే, ఈ వంశానికి మూల పురుషుడనీ, చుళుకం నుండి పుట్టాడు కనుక, 'చాళుక్యుడ'య్యాడని చెప్పే కట్టు కథలు కూడ, తర్వాత శతాబ్దాల్లో పుట్టినవే. అసందర్భాలు, కల్పితాలైన ఇలాంటి విషయాల్ని చరిత్రలో నమ్మక్కర లేదు. ఈ చాళుక్యులు మొదట్లో దక్షిణాపథ రాజ వంశాలైన వాకాటకులు, కదంబులు మొదలైన వాళ్ళ సామంతులుగా ఉంటూ, తర్వాత కాలంలో స్వతంత్రంగా రాజ్యాన్నేర్పర్చుకున్నారని కూడ, ఓ వాద ముంది. వీళ్ళు ప్రశస్తుల్లో ఎప్పుడూ చెప్పకునే 'హారీతీపుత్ర' అనే మాతృ సంజ్ఞ, మాతృ సంజ్ఞలను ధరించే ఆచారమున్న శాతవాహనులు, ఇక్ష్వాకులు, కదంబులు మొదలైన దక్షిణ ప్రాంతపు రాజ వంశాల్తో వీళ్ళకున్న పోలికని సూచిస్తుంది. అంచేత, వీళ్ళ జన్మ స్థలం దక్షిణాపథమేనని అనుమానించొచ్చు. నిజానికి 'చలికి' అనే మాట,

మొదటగా క్రీ.శ. మూడో శతాబ్దం నాటి నాగార్జునకొండ లోని ఇక్ష్వాకుల ఓ శాసనంలో వస్తుంది. దానిలో 'ఇంద చళికి రెమ్మణక' అనే పేరు కల ఇక్ష్వాకుల సామంతుడు, హిరణ్య రాష్ట్రపు రాజుగా పేర్కొబడతాడు. ఇందులో ఉన్న 'చళికి' అనే పదాన్ని 'చాళుక్య' పదానికి పూర్వ రూపమని అనుకుంటే, చాళుక్యుడైన రెమ్మణక అని అర్థం చేసుకోగలం. పూర్వం హిరణ్య రాష్ట్రమని పిలిచే ఈనాటి కడప, కర్నూల్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు, ఇతని పాలనలో ఉండేవి. చాళుక్యుల్లో ఒకడైన విమలాదిత్యుడి రణస్తిపూడి శాసనంలో (11 వ శతాబ్దం) చెప్పిన విషయాన్ని బట్టి, చాళుక్యుల మూల పురుషుడు, విష్ణుభట్టు సోమయాజినే ఆయన ఆశ్రయంలో, 'ముదివేము' అనే అగ్రహారంలో ఉండేవాడు. ఆ 'ముదివేము' అగ్రహారం ఇప్పటికీ కడప జిల్లాలో, అంటే ఆనాటి హిరణ్య రాష్ట్రంలో ఉంది. అలాగే, రెండో పులకేశి తుమ్మెయనూర్ శాసనం, కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్ని 'చాళుక్య విషయ' మని తెల్పుతుంది. జాతి పేరుని బట్టి నివాస ప్రాంతాలకు పేరు రావడమన్నది సంప్రదాయం కనుక, ములక, అస్సక, ఆంధ్ర, మహిషక మొదలైన జాతుల్లాగే, 'చళికి' అనే జాతి ఉండేదనీ, వారి జన్మస్థానమే చాళుక్య విషయమైందనీ, చరిత్రకారులు భావిస్తారు. అంచేత, చాళుక్యులు మొదట్లో హిరణ్య రాష్ట్ర, చాళుక్య విషయాన్ని, అంటే ఇప్పటి కడప, కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని ప్రాంతాల్ని ఆక్రమించి, కదంబుల తర్వాత స్వతంత్ర రాజ్యాన్ని నెలకొల్పివుంటారనుకోవచ్చు.

చాళుక్య రాజ్యాన్ని దక్షిణాపథంలో స్థాపించినవాడు, మొదటి పులకేశి. కదంబులు, విష్ణుకుండినులు బలహీనపడటం వల్ల, పులకేశి ఉత్తర కర్ణాటక లోని 'బాదామి' రాజధానిగా, స్వతంత్ర చాళుక్య రాజ్యాన్ని స్థాపించాడు. ఇతని పుత్రుడైన కీర్తివర్మ కాలంలో, ఇది ఇంకా విస్తరించింది. ఈ కీర్తివర్మ పుత్రుడే, చరిత్ర ప్రసిద్ధికెక్కిన రెండవ పులకేశి. ఈయనే కర్ణాటక, మహారాష్ట్రాల్ని స్వాధీనం చేసుకొని, దక్షిణాపథం మొత్తాన్ని తన ఏలుబడికి తెచ్చాడు. నర్మదా నదీ పరిసరాల్లో హర్షవర్ధనుడితో తలపడ్డాడు. ఐహోళ్ శాసనంలో ఈయన విజయపరంపర వివరాలున్నాయి.


తూర్పు దిగ్విజయ యాత్రలో పులకేశి, కోసల, కళింగాల్ని జయించి, వేంగిపై దండెత్తాడు. అప్పట్లో ఆంధ్ర దేశంలో ఏర్పడ్డ అరాచక పరిస్థితులు, అతనికి చాల వరకు సహాకరించాయి. కృష్ణా నదికి ఉత్తరంగా వున్న వేంగీ మండలం, ఆ సమయానికి దుర్జయుల పరిపాలనలో ఉంది. తమ సర్వ శక్తులను మోహరించి, దుర్జయులు బలవంతుడైన పులకేశి నెదిరించారు. పిష్టపురం, కొల్లేరుల దగ్గర, ఘోరమైన యుద్ధాలు జరిగాయి. కాని, చాళుక్యుల్ని నిలువరించటం దుర్జయుల తరం కాలేదు. వేంగీ మండలం చాళుక్యుల స్వాధీనమైంది. కృష్ణకు దక్షిణంగా ఉన్న పల్లవులు, ఎందులోనూ చాళుక్యులకి తీసిపోరు. పులకేశి జారీ చేసిన మారుటూర్, కొప్పరం శాసనాలు, ఆంధ్ర ప్రాంతంలో ఆయన సాధించిన విజయాల్ని తెల్పుతాయి.

8.2.2 : రాజకీయ చరిత్ర (క్రీ.శ. 624-848)

వేంగిలో చాళుక్య రాజ్య స్థాపనా కాలాన్ని గురించి చరిత్రకారుల్లో వివిధాలైన అభిప్రాయాలున్నాయి. వారి శాసనాల్లోని అంశాల్ని బట్టి, వేంగిలో వాళ్ళ పరిపాలన క్రీ.శ. 624 లో ఆరంభమైంది. వేర్వేరు దశలలో ఆక్రమణ జరిగినా, వేంగిపై ఆధిపత్యం మాత్రం, క్రీ.శ. 624 లోనే ఏర్పడింది. ఈ ప్రాంతాల్ని స్వాధీనపర్చుకున్న రెండవ పులకేశి, తన తమ్ముళ్ళతో తన కిష్టుడైన కుబ్జ విష్ణువర్ధనుడిని వేంగికి అధిపతిగా నియమించాడు. క్రీ.శ. 624 నుండి వేంగీ రాజ్య పరిపాలన ప్రారంభించిన కుబ్జ విష్ణువర్ధనుడే, వేంగీ చాళుక్య వంశాన్ని స్థాపించాడు. ఎంతో కష్టసాధ్యమయ్యే కోటల్ని నేర్పుతో వశం చేసుకోగలిగే ఇతనికి, విషమసిద్ధి, సర్వసిద్ధి లాంటి బిరుదులుండేవి. అసంఖ్యాకమైన యుద్ధాలల్లో

BRAOU

వేంగీ చాళుక్యుల వంశ కాలానుక్రమణిక



తమ వంశానికి ఎంతో సేవ చేసి, రాజ్య వ్యాప్తికి తోడ్పడ్డ ఎన్నో సైనిక కుటుంబాల వాళ్ళను, భూభాగాలకు సామంతులుగా నియమించి, వారి పట్ల తన అభిమానాన్ని ప్రకటించాడు. అటవీ దుర్జయుణ్ణి ప్రస్తుత విశాఖ జిల్లా లోని ఒడ్డాది ప్రాంతం లోను, బుద్ధవర్మని గుంటూర్ జిల్లా లోని కొండపడమటి ప్రాంతం లోను, సామంతులుగా నియమించాడు. బాదామిలో రెండవ పులకేశి పరిపాలన ముగియగానే, కుబ్జ విష్ణువర్ధనుడు వేంగిని స్వతంత్ర రాజ్యంగా ప్రకటించి ఉంటాడని, చరిత్రకారులు భావిస్తారు.

వేంగీలో చాళుక్య వంశీయుల అధికారాన్ని సుస్థిరం చేయటాన్ని, ఈయన సాధించిన ఘన విజయంగా చెప్పొచ్చు. ఈయన పరిపాలన పదిహేడు సంవత్సరాల పైగా సాగింది. తర్వాత ఇతని కొడుకు జయసింహుడు ముప్పై మూడు సంవత్సరాలు పాలించాడు. రెండో పులకేశి మరణంతో నష్టపడ్డ బాదామి చాళుక్యులకు, వీరు ఎలాంటి సహాయ మందించారో తెలియకపోయినా, వాళ్ళ శత్రువులైన పల్లవులతో తలపడుతూ, నెల్లూర్ ప్రాంతాలలో ఉన్న బోయ రాజులపై ఆధిపత్యాన్ని సంపాదించారు. అలాగే, కళింగాంధ్ర ప్రాంతంలో కూడ శత్రువుల్ని అణచి, రాజ్యాన్ని సుస్థిరం చేశారు. జయసింహుడి తర్వాత వరుసగా ఇంద్ర భట్టారకుడు (క్రీ.శ. 673), రెండో విష్ణువర్ధనుడు (673-82), రెండో జయసింహుడు (706-718) మొదలైన వాళ్ళు రాజ్యానికి వచ్చారు. రెండో జయసింహుడి తదుపరి వేంగీ రాజ్యంలో ఆధిపత్యం కోసం కొట్లాటలు మొదలయ్యాయి. ఆయనకు పిల్లలు లేక పోవటం వల్ల, తమ్ముళ్ళైన మూడో విష్ణువర్ధనుడు (719-55), కొక్కిలి విక్రమాదిత్యుడు, రాజ్యాధికారం కోసం పోటీ పడ్డారు. కొక్కిలి కొద్ది నెలల పాటు వేంగిని ఆక్రమించుకొన్నప్పటికీ, చివరకు విష్ణువర్ధనుడు తిరగబడటంతో, మధ్యమ కళింగ ప్రాంతమైన ఎలమంచిలి రాజ్యానికి పారిపోయాడు. బహుశః మూడో విష్ణువర్ధనుడు ఈ గొడవల్లో ఉన్నప్పుడే, నెల్లూర్ ప్రాంతంలో ఉన్న బోయ కొట్టాల్ని పల్లవులు తిరిగి స్వాధీనపర్చుకొన్నారు.

మూడో విష్ణువర్ధనుడి తర్వాత రాజ్యానికి వచ్చిన విజయాదిత్యుని కాలం (755 -72), చాల ముఖ్యమైంది. అప్పుడే, కర్ణాటక రాజకీయాల్లో ఊహించని మార్పులు జరిగాయి. బాదామి చాళుక్యుల్ని పడగొట్టి, రాష్ట్రకూటులు అధికారంలోకి వచ్చారు. ఆ మార్పు దక్కన్ రాజకీయాల్లో ఎన్నో పరిణామాలకు దారితీసింది. వేంగీ చాళుక్య - రాష్ట్ర కూట వంశాల మధ్య సంఘర్షణలు మొదలైంది, విజయాదిత్యుడి కాలం లోనే. బలవంతులైన రాష్ట్రకూటుల్ని ఎదుర్కోడానికి వాళ్ళ అంతఃకలహాల్ని అదనుగా తీసుకొని, వేంగీ చాళుక్యులు పోరాడినా, కొన్ని సందర్భాల్లో ఓటమి తప్పలేదు. అప్పుడు మొదలైన వేంగీ చాళుక్య - రాష్ట్రకూటుల మధ్య యుద్ధాలు, సుమారు రెండు వందల సంవత్సరాల పాటు కొనసాగి, చరిత్రను రక్తసిక్తం చేశాయి. శత్రు వర్గంలో ఏర్పడ్డ చీలికల్ని, ఇతర అవకాశాల్ని, ఎవరికి వారు తమ కనుకూలంగా మలచుకోవటంలో పోటీపడ్డారు. వేములవాడ ప్రభువైన మొదటి అరికేసరి నాయకత్వంలో రాష్ట్రకూటులు, వేంగీ త్రికళింగం పై దాడి చేశారు. మాన్యఖేట సార్వభౌమాధికారాన్ని వేంగి అంగీకరించాల్సొచ్చింది. సంధి సంప్రదింపుల్లో భాగంగా, వేంగీ రాజు నాల్గో విష్ణువర్ధనుడి (772 - 808) కూతురు శీలమహాదేవిని, రాష్ట్రకూట ప్రభువు ధృవుడికిచ్చి పెళ్ళి చేశాడు. కాని, ఇలాంటి రాజకీయ వివాహ ఒప్పందాల్లాంటి వేవీ, ఈ రెండు వంశాల మధ్య ఏర్పడ్డ బద్ధ వైరాన్ని ఆపలేక పోయాయి.

నాల్గో విష్ణువర్ధనుడి తర్వాత రెండో విజయాదిత్యుడి (808-47)కి, భీమసలుక్కికి రాజ్యం కోసం ఏర్పడ్డ వారసత్వ తగాదాలో రాష్ట్రకూటులు కలుగ జేసుకోవటంతో, వేంగీ రాజ్య ప్రతిష్ట కొంత దెబ్బతింది. అయినప్పటికీ, విజయాదిత్యుడు సైహయ వంశానికి చెందిన నృపరుద్రుని సహాయంతో,

BRAOU

భీమనలుక్కికి మద్దతుదారులైన రాష్ట్రకూట, పశ్చిమ గంగ సైన్యాలతో, పన్నెండు సంవత్సరాలకు పైగా, నూట ఎనిమిది యుద్ధాలు చేసి, చివరకు వేంగిని ఆక్రమించాడు. రాష్ట్రకూట సింహాసనాన్నధిష్ఠించిన అమోఘవర్షుడు చిన్న వయస్కుడు కావటంతో, విజయాదిత్యుడి ధాటికి ఎదురులేక పోయింది. చాళుక్య సముద్రం రాష్ట్రకూటుల వైభవాన్ని ముంచెత్తినట్లు వర్ణించబడింది. రాష్ట్రకూట రాజ్య సంరక్షణా బాధ్యతలను నిర్వహిస్తున్న గుజరాత్ ప్రాంతపు సామంతుడైన సువర్ణవర్ష కర్కరాజు విజయాదిత్యుని ఆధిపత్యాన్ని అంగీకరిస్తూ, తన కూతురు శీలమహాదేవిని విజయాదిత్యుని కొడుకు కలివిష్ణువర్ధనుడికిచ్చి పెళ్ళి చేశాడు. మధ్య భారత ప్రాంతాల్లోని ఘూర్జర, ప్రతీహారులను కూడ ఈ విజయాదిత్యుడు జయించాడు. ఈ విజయాలన్నిటి కారణంగానే, ఇతణ్ణి వేంగీ చాళుక్యుల్లోని ప్రముఖుల్లో ఒకడుగా గుర్తిస్తారు. తను పోరాటాలు చేసిన నూట ఎనిమిది యుద్ధ ప్రాంతాల్లో, శివాలయాలను నిర్మించాడు. బెజవాడకు ఆ పేరు ఇతని వల్లనే వచ్చిందని చెప్పారు.

8.2.3 : రాజకీయ చరిత్ర (క్రీ.శ. 848 - 973)

వేంగీ చాళుక్య రాజులందరిలో ముఖ్యంగా పేర్కొనవలసిన వాడు, కలివిష్ణువర్ధనుని కొడుకైన మూడో విజయాదిత్యుడు (క్రీ.శ. 848-92). ఇతనినే గుణగ విజయాదిత్యుడని కూడ అంటారు. చాళుక్యుల విజయపతాకాన్ని ఉత్తర దేశంలో గంగా నది నుండి, దక్షిణంలో కావేరి దాకా వీర విహారం చేయించింది, గుణగ విజయాదిత్యుడే. క్రీ.శ. 848 లో ప్రారంభమై, నాలుగు దశాబ్దాలకు పైగా, ఇతని పాలనా కాలం సాగి, యుద్ధాల లోను, సంక్షోభాల లోను గడిచింది. అయితే, యుద్ధ నైపుణ్యం, ప్రభు భక్తి కల్గిన పండరంగుడు, వినయడి శర్మ, రాజాదిత్యుడు మొదలైన బ్రాహ్మణ సేనానులు ఈయన విజయాలకు మూల కారణంగా నిలుస్తారు. సింహాసన మెక్కిన తొలి సంవత్సరం లోనే, విజయాదిత్యుడు బోయకొట్టాల మీద యుద్ధాన్ని ప్రకటించాల్సొచ్చింది. మొదట్లో తూర్పు చాళుక్యులకు, పల్లవులకు మధ్య ఈ బోయకొట్టాల కోసం యుద్ధాలు జరిగినా, రాష్ట్రకూట యుద్ధాల్లో చాళుక్యులు నిమగ్నమైనపుడు బోయ రాజ్యాలు స్వతంత్రించి, చాళుక్యుల ఆధిపత్యాన్ని గుర్తించలేదు. అంచేత, ఆ బోయ రాజ్యాల్ని స్వాధీనపర్చుకోవటానికి గుణగుడు తన సేనాని పండరంగడిని పంపించాడు. ఆ సేనాని బోయుల పన్నెండు కొట్టాలను ఆక్రమించి, వాళ్ళ ముఖ్య కేంద్రమైన నెల్లూర్‌ను కాల్చివేసి, ఆప్రాంతపు భద్రత కోసం కందుకూరును కేంద్రంగా, బెజవాడతో సమానమనిపించేటంతటి బలిష్ఠమైన దుర్గంగా తీర్చిదిద్దాడు. అయితే, చాళుక్య సైన్యాలు బోయులపై దాడి చేసినప్పుడే, రాష్ట్రకూట అమోఘవర్షుడు చాళుక్య రాజ్యంపై దాడిచేసి, విజయాదిత్యుణ్ణి బంధించినట్లు తెలుస్తోంది. రాష్ట్రకూటుల సమాచారాన్ని బట్టి, అమోఘవర్షుడున్నంత కాలం చాళుక్యులు ఆయన అధికారానికి పూర్తిగా లోబడ్డారు. గుణగ విజయాదిత్యుడు రాష్ట్రకూటుల ప్రేరణతో, వారికి సహాయంగా గంగవాడిని, నొలంబవాడిని ఈ సందర్భం లోనే జయించాడు. అమోఘవర్షుని మీద ప్రతీకారం తీర్చుకోవటానికి ఎన్నో యుద్ధాలను చేశాడు. రాష్ట్రకూటులు, వారికి సహాయపడ్డ ఎంతో మంది ఇతరులు, గుణగ విజయాదిత్యుని సేనాపతుల చేతుల్లో ఓడిపోయి, ఇబ్బందుల పాలయ్యారు. అచలపురం, కిరణపురం, చక్రకూటం మొదలైన దుర్గాలన్నీ ధ్వంసం చేయ్యబడ్డాయి. గంగా, నర్మదా నదుల మధ్య ప్రాంతమైన డాహళ రాజ్యం, దక్షిణ కోసలం, కళింగ రాజ్యం మొదలైన అన్నింటినీ, చాళుక్య సైన్యాలు వశపర్చుకున్నాయి. అఖండ విజయాన్ని సాధించి, తన పంతం, ప్రతీకారాన్ని తీర్చుకున్న గుణగ విజయాదిత్యుని అధికారాన్ని, రాష్ట్రకూట కృష్ణుడు అంగీకరించక తప్పింది కాదు. అప్పటి వరకు రాష్ట్రకూట ప్రభువుల సార్వభౌమాధికారానికి, దర్పానికి చిహ్నాలుగా వుండే పాళి ధ్వజాన్ని, గంగాయమునా తోరణాన్ని, గుణగ విజయాదిత్యుడు తన స్వాధీనం

BRAOU


చేసుకున్నాడు. ఇలాంటి ఎన్నో విజయాలతో, గుణగ విజయాదిత్యుని కాలంలో తూర్పు చాళుక్యుల అధికారం మహానది నుండి పులికాట్ సరస్సు దాకా వ్యాపించింది. దక్షిణాపథ రాజకీయాల్లో వారి కత్తికి, అధికారానికి ఎదురులేకపోయింది. ఈయన జారీ చేసిన ఎన్నో శాసనాలలో, విపులంగా ఆనాటి రాజకీయ విషయాలెన్నో ఉన్నాయి. ఒక చోళ రాజుకు ఆశ్రయమిచ్చి రక్షించటం, మహాపరాక్రమవంతుడైన వేములవాడ రాజు బద్దెగణ్ణి ఓడించటం, మొదలైన విషయాలెన్నింటినో అవి తెల్పుతాయి. త్రిపురీమర్త్య మాహేశ్వర, పరచక్రకామ, రణరంగ శూద్రక, మొదలైన ఎన్నో బిరుదులు ఈయన కుండేవి. చాళుక్యుల వంశ ప్రతిష్టకు, వేంగీ రాజ్య గౌరవానికి, గుణగ విజయాదిత్యుడు చేసిన కృషి అపూర్వమైంది.

గుణగుని రాజరికం తర్వాత, వేంగీ చాళుక్య రాజ కుటుంబంలో సింహాసనం కోసం కొట్లాటలు ఎక్కువయ్యాయి. వాళ్ళల్లో వాళ్ళే యుద్ధాలు చేస్తూ, రాజ్యాన్ని అస్థిరం చేసి, వేంగీ రాజకీయాల్లో ఇతర రాజ వంశాల ప్రవేయానికి అవకాశమిచ్చారు. దీన్ని అవకాశంగా తీసుకొని, ఎన్నో ఆక్రమిత ప్రాంతాలను తిరిగి శత్రువులు వశపర్చుకొన్నారు. గంగ రాజైన వజ్రహస్తుడు త్రికళింగ రాజ్యాన్ని, తన రాజ్యంలో కలుపుకున్నాడు. చండ చాళుక్యులని ప్రసిద్ధికెక్కిన ఈ కుటుంబం, రాజ్యాధిపత్యం కోసం 'రాక్షసు'ల్లా పోరాడుకుంటూ, వేంగీ రాజకీయ ప్రతిష్టను దిగజార్చారు. సామంతులు, అధికారులు మాత్రమే కాకుండా, 'మూల బలం' లో కూడ చీలిక తెర్పడ్డాయంటే, రాజ్యం లోని పరిస్థితులు ఎంత అస్థిరమయ్యాయో తెలుస్తుంది.

గుణగ విజయాదిత్యుడి వారసుడైన చాళుక్య భీముడు వేంగీ రాజు కాకుండా, అతని దాయాదులైన యుద్ధమల్లుడు లాంటి వారు అడ్డు తగిలారు. అందర్నీ ఎదుర్కొని, క్రీ.శ. 892 లో రాజ్యాధికారాన్ని చేజిక్కించుకొన్నప్పటికీ, చాళుక్య భీముని పరిపాలనా కాలం ప్రశాంతంగా సాగలేదు. గుణగుని కాలంలో పరాభవానికి గురైన వేములవాడ రాజు బద్దెగుడు, రాష్ట్రకూట సైన్యాలతో వచ్చి, చాళుక్య భీముణ్ణి కొల్లేరు వద్ద జరిగిన యుద్ధంలో బంధించాడు. మొసలిని జలాశయం లోనే బంధించినట్లు, చాళుక్య భీముని వేములవాడ బద్దెగుడు బంధించినట్లు, రాష్ట్రకూటుల ఆధారాలు తెల్పుతున్నాయి. బహుశా కొల్లేరు జల దుర్గంలో చాళుక్య భీముడు తలదాచుకొన్నప్పుడు, ఈ సంఘటన జరిగుంటుంది. రాష్ట్రకూట సైన్యాన్ని ఓడించటంలో తనకు సహాయపడిన ముదిగొండ చాళుక్య రాజైన కుసుమాయుధుణ్ణి, చాళుక్య భీముడు అర్ధ సింహాసన మిచ్చి గౌరవించినట్లు, కొరవి శాసనం తెల్పుతూంది. తనకు సన్నిహితులైన ముదిగొండ రాజుల తోడ్పాటుతో ఈ ఇబ్బందుల్నుండి బయటపడ్డ చాళుక్య భీముడు, రాష్ట్రకూట సైన్యాన్ని ఓడించి, తరిమికొట్టాడు.

కాని, అవకాశం చిక్కినప్పుడల్లా, రాష్ట్రకూట సైన్యం వేంగీ రాజ్యంపై దాడి చేస్తూనే ఉంది. వేంగీ రాజ్యాన్ని అల్లకల్లోలపరుస్తూ, రెండో కృష్ణుడు వేంగిపై యుద్ధాన్ని తీవ్రతరం చేశాడు. నిర వద్యపురం, పెరుపంగూరు, కొల్లేరు లాంటి ప్రాంతాలెన్నో యుద్ధ రంగాలయ్యాయి. నిరవద్యపురం సమీప జరిగిన యుద్ధంలో రాష్ట్రకూటుల గజ, అశ్వ, పదాతి బలాలు ఓడిపోయి, తరిమికొట్టబడ్డాయి. పెరుపంగూరు వద్ద జరిగిన యుద్ధంలో చాళుక్య సైన్యాలకు బాలుడైన రాకుమారుడు ఇతీమర్తి గండడు, నాయకత్వం వహించాడు. తన నెదిరించిన రాష్ట్రకూట సైన్యాధిపతి గుండయ్యను చంపి, శత్రు సైన్యం మొత్తాన్ని పారద్రోల గల్గినప్పటికీ, ఆ యుద్ధం లోనే ఇతీమర్తి గండడు కూడ మరణించాడు. ఇది చాళుక్య భీముని చాల కృంగ దీసింది. తన రాజ్య కాలం ముప్పై సంవత్సరాల్లో చాళుక్య భీముడు మూడు వందల అరవై యుద్ధాలను చేసినట్లు శాసనాల్లో ఉంది.

BRAOU


74
76
78
80
82
84
22
20
18
16
14
12
10
8
కర్ణాటక
మహారాష్ట్ర
ఆంధ్ర ప్రదేశ్
తమిళనాడు
కేరళ
కర్ణాటక
గోవా
కర్ణాటక
తమిళనాడు
కేరళ
కర్ణాటక నది
గోదావరి నది
కృష్ణా నది
తుంగభద్ర
కావేరి నది
వైగై నది
పాలార్ నది
పెన్నా నది
పాలక్కాడ్
పాల్ఘాట్
పాలక్కాడ్ కనుమ
పాల్ఘాట్ కనుమ
పాల్ఘాట్ కనుమ
పాలక్కాడ

తర్వాత రాజ్యానికి వచ్చిన ఈతని కొడుకులైన నాలుగో విజయాదిత్య, రెండో విక్రమాదిత్యుల రాజ్య కాలాలు కూడ, రాజకీయ సంక్షోభాల్లోనే గడిచాయి. ఇది అదనుగా, త్రికలింగ ప్రాంతాన్ని గంగులు స్వాధీనపర్చుకున్నారు. దాయాదుల గొడవల్లో వంశ గౌరవాన్ని, ప్రజా క్షేమాన్ని, చివరకు రాజ్య స్వతంత్రాన్ని కూడ పట్టించుకోక, పెనుగులాడటం వల్ల, దేశంలో అంతర్యుద్ధ మొచ్చింది. కొన్ని సంవత్సరాల పాటు, ఎప్పుడు ఏం జరుగుతుందో తెలీని పరిస్థితులేర్పడ్డాయి. అధికార వ్యామోహంలో ఎన్ని దురాగతాలను చెయ్యగలరో, అన్నిటినీ చేశారు. వేంగీలో చోటుచేసుకున్న ఇలాంటి అరాచక పరిస్థితులు, రాష్ట్రకూటుల చొరబాటుకు తిరిగి అవకాశాన్ని . కల్గించాయి.

ఇలాంటి సంక్షోభ పరిస్థితుల్లో మొదటి అమ్మరాజు సైన్యాన్ని తన షక్షాన తిప్పకొని, క్రీ.శ. 922 లో రాజ్యానికి వచ్చాడు. రాజమహేంద్రవరం ఇతని కాలం లోనే నిర్మించబడి, చాళుక్యుల నూతన రాజధానిగా చెయ్యబడి ఉంటుందని, చరిత్రకారుల అంచనా. ఈతని రాజ్య కాలం చాల వరకు తన పిన తండ్రి విక్రమాదిత్యునితో, యుద్ధాల తోనే గడిచింది.

వేంగిలో రాష్ట్రకూటాధిపత్యాన్ని పునరుద్ధరించటానికి ఇది సరైన అవకాశమని, నాలుగో గోవిందుడు భావించాడు. వేంగీ రాజ్య ఆక్రమణ కోసం అర్రులు చాస్తూ, రాష్ట్రకూటుల సహాయ మర్థిస్తున్న చాళుక్య యుద్ధమల్లునికి (930-34) సైనిక సహాయం చేసి, అతను వేంగీ రాజ్య మాక్రమించుకొనేలా చేశాడు. కాని, మితిమీరిన రాష్ట్రకూట సేనాపతుల జోక్యం, యుద్ధమల్లునికి అసంతృప్తినే మిగిల్చింది. దాయాదుల పోరాటాల వల్ల వేంగిని విడిచిపెట్టి, తన అధికారాన్ని కృష్ణా నదీ దక్షిణ ప్రాంతానికే పరిమితం చేసుకోవాల్సొచ్చింది. వేంగి నుండి ఇతనిని తరిమివేసి, రెండో చాళుక్య భీముడు (935-45) రాజయ్యాడు. ఇతడు రాజ్యం కోసం తనతో పోటీపడిన తాతవిక్కి, రాజమార్తాండ, లోవవిక్కి, అయ్యప, మొదలైన వందరినో చంపి, సింహాసనాన్ని ఆక్రమించాడు. ఇతడు వేంగిని పాలిస్తున్నప్పుడు రాష్ట్రకూట రాజ్యంలో నాలుగో గోవిందుని మీద వచ్చిన తిరుగుబాటు, ఇతనికి ఒక మంచి అవకాశమైంది. వేంగి రాజకీయాల మీద రాష్ట్రకూటుల ప్రభావం లేకుండా కొంత వరకు చేయగలిగాడు. ఇతని భార్యైన అంకిదేవి కళింగ రాజు కుమార్తె కనుక, వాళ్ళ సహాయం కూడ ఇతనికి లభించి ఉండొచ్చు. కాని, రాష్ట్రకూటుల సహాయంతో బెజవాడ, చేబ్రోలు ప్రాంతాల్ని ఆక్రమించుకొన్న తన దాయాది యుద్ధమల్లుని, పూర్తిగా కట్టడి చెయ్యడ మితనికి సాధ్యమైనట్లు లేదు. ఇతని మరణం తర్వాత జరిగిన ఒక యుద్ధంలో, ఇతని కొడుకు రెండో అమ్మరాజు ఆ యుద్ధమల్లుని చంపాడు. క్రీ.శ. 945 లో రాజ్యానికి వచ్చిన రెండో అమ్మరాజు పాలన, ఇరవైఐదు సంవత్సరాల పాటు సాగింది. తన పాలనా కాలంలో అమ్మరాజు తన సవతి అన్న దానార్ణవుణ్ణి, తను చంపిన యుద్ధమల్లుని కొడుకులైన బాదప, తాళప రాజుల్ని ఎన్నో సార్లు ఎదుర్కోవాల్సొచ్చింది. ఆ ఘర్షణల్లోనే బాదప, తాళపులు (వేంగీ) సైన్యాన్ని తమ షక్షానికి త్రిప్పకోవటం, సామంతులెందరో వాళ్ళకు సహాయపడటం, రాష్ట్రకూట మూడో కృష్ణుడు కూడ వాళ్ళకే సహకరించి సైన్యాన్ని పంపటంలో, తాత్కాలికంగా అమ్మరాజు రాజ్యాన్ని కోల్పోవాల్సొచ్చింది. కాని, బాదప, తాళపులు వాళ్ళ స్వల్ప పాలనా కాలంలో ప్రజల విశ్వాసాన్ని పొందలేక పోవటంచేత, సామంతులు, సైన్యం తిరిగి అమ్మరాజు షక్షం చేరారు. ప్రముఖ సామంతుడైన కొల్లేటి ప్రాంతాలను పాలించే నృపకాముడు, తన కుమార్తెను అమ్మరాజు కిచ్చి పెళ్ళిచేసి, అతను తిరిగి వేంగీ సింహాసనమాక్రమించుకొనేలా చేశాడు. వేంగి కోసం బాదప, తాళపులతో కలహిస్తున్నప్పుడే, దానార్ణవుడు రాష్ట్రకూట మూడో కృష్ణుని సహాయంతో క్రీ.శ. 956లో అమ్మరాజు మీద తీవ్రంగా దాడి చేశాడు. అమ్మరాజుని పడగొట్టి, తమ కనుకూలుడైన దానార్ణవుని వేంగికి రాజుగా చేయటమే, రాష్ట్రకూటుల దాడికి కారణం..

BRAOU

దాని నెదుర్కోలేని అమ్మరాజు, కళింగ రాజ్యానికి పారిపోవటంతో, వేంగి దానార్ణవుని వశమైంది. రాష్ట్రకూట సేనాని కాకర్త్య గుండ్యన సహాయంతో, దానార్ణవుడు వేంగీ సింహాసనమెక్కాడు. అయితే, దానార్ణవునికి సహాయపడ్డ రాష్ట్రకూట సైన్యాలు వెనుతిరగటంతో, అమ్మరాజు వేంగికి తిరిగొచ్చి, దానార్ణవుని తొలగించాడు. కాని, అదీ తాత్కాలికమే అయింది. బలాలను కూడగట్టుకున్న దానార్ణవుడు, క్రీ.శ. 970లో అమ్మరాజును వధించాడు.

వేంగిలో దానార్ణవుని పాలన మూడు సంవత్సరాలు సాగింది. ఈ స్వల్ప కాలంలో దక్షిణ దేశ రాజకీయాల్లో చాల మార్పు లేర్పడ్డాయి. క్రీ.శ. 973 నాటికి, కర్ణాటక రాజకీయాల్లో రాష్ట్రకూటులు బలహీనపడటం, రెండవ తైలపుడు వాళ్ళను కూలద్రోసి, పశ్చిమ చాళుక్య వంశాన్ని స్థాపించాడు. అలాగే, చోళ మండలంలో పరాంతకుడు మరణించటంతో, అరాచకం చోటు చేసుకొని, రాజరాజు చోళుల ప్రతిష్టను నిలబెట్టే కృషిని ప్రారంభించాడు. ఈ పరిస్థితుల్ని తనకు సానుకూలంగా భావించిన దానార్ణవుడు, దక్షిణ దేశం మీదకు దండెత్తాడు. అప్పటి వరకూ రాష్ట్రకూటుల అధీనంలో ఉన్న రేనాడు, పొత్తపినాడుల నాక్రమించి, అక్కడ నుండి తొండైమండలం మీద కూడ ధాడి చేశాడు. తన స్వల్ప రాజ్య కాలంలో దానార్ణవుడు చేసిన యుద్ధాలు, వేంగీ రాజకీయాల్ని మరో దిక్కుకు మళ్ళించాయి.

8.2.4 : రాజకీయ చరిత్ర (క్రీ.శ. 973-1075)

దానార్ణవుడు ఆంధ్ర దక్షిణ ప్రాంతంలో చేసిన యుద్ధాల్లో విజయాన్ని సాధించినా, చివరకు అతనికి నష్టమే జరిగింది. సమర్థుడు, యోధుడు, మహావీరుడైన జటాచోడ భీముడు (973-99) వేంగీ రాజకీయాల్లోకి దూసుకొని వచ్చాడు. కైలాసనాథ దేవాలయంలో ఉన్న శాసనం, ఇతనిని గూర్చి తెలుపుతుంది. తెలుగుచోడ వంశానికి చెందిన ఇతడు కర్నూల్ జిల్లా లోని పెడకల్లు ప్రాంతాల్ని పాలించేవాడు. ఇతని తల్లి వేంగీ రాజుల్లో ప్రముఖుడైన మొదటి చాళుక్య భీముని మనుమరాలు. కొల్లాభిగండ విజయాదిత్యుని కుమార్తె. వేంగీ రాజ్యాన్ని "స్వభగినీ విషయం"గా చెప్పుకోవటాన్ని బట్టి, రెండో అమ్మరాజు భార్య ఇతని సోదరి కావచ్చు. అమ్మరాజును చంపి దానార్ణవుడు వేంగీ రాజ్యాన్ని ఆక్రమించుకోవటం, అతని సైన్యాలు దక్షిణంలో పొత్తాపినాటి ప్రాంతాల దాకా రావటం, జటాచోడ భీమునికి ఆగ్రహాన్ని తెప్పించాయి. అంచేతనే, వేంగిపై దండెత్తి. దానార్ణవుని చంపి, వేంగీ రాజ్యాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. వేంగీ చాళుక్యుల శాసనాల్లో జటాచోడ భీముని పాలనా కాలం గురించి ఎలాంటి ప్రస్తావన ఉండదు. ఇరవైయేడు సంవత్సరాలకు పైగా సాగిన ఇతని రాజరికాన్ని, అసలు వేంగికి పరిపాలనే లేదన్నట్లుగా వాళ్ళ శాసనాలు చెప్తాయి. ఈతని వేంగీ ఆక్రమణలో ఎంతో మంది విధేయులైన చాళుక్య సామంతులు ఎదురు తిరిగారు. దానార్ణవుని కొడుకులైన శక్తి వర్మ, విమలాదిత్యులు కళింగ రాజ్యానికి పారిపోయి, గంగ కామార్ణవుని సహాయంతో వేంగి మీద దండెత్తారు. ఈ పరిస్థితుల్ని చక్కదిద్దటానికి, అదుపు చేయటానికి జటాచోడ భీముడు అన్ని వైపులా ఎడతెగని యుద్ధాలు చేశాడు. కళింగ రాజ్యాన్ని ఓడించాడు. వైదుంబుల్ని ఓడించి, తన అధికారానికి లోబడేలా చేశాడు. వేంగీ, కళింగ రాజ్యాల్లో ఇతని ఆధికారం బలపడటంతో, దిక్కుతోచని శక్తివర్మ, విమలాదిత్యులు ఆశ్రయం కోసం చోళ రాజ్యానికి పారిపోయారు. ఆ సమయానికి చోళ రాజ్యం శక్తివంతుడైన రాజరాజ చోళుని (985-1013) పాలనలో ఉంది. అప్పటికే దక్షిణ దేశ రాజకీయాల్లో చోళులకు, కర్ణాటక లోని పశ్చిమ చాళుక్యులకు, ఆధిపత్యం కోసం సంఘర్షణలు మొదలయ్యాయి.

BRAOU

దూరదృష్టి కల్గిన రాజరాజ చోళుడు, పశ్చిమ చాళుక్యుల విజృంభణను అడ్డుకోవడానికి, వేంగీ రాజ్యంలో చోళుల ప్రాబల్యం చాల అవసరమని గ్రహించాడు. అందుకే, వేంగి నుండి వచ్చి, తనను శరణుజొచ్చిన శక్తివర్మ, విమలాదిత్యులకు ఎలాంటి సహాయం చేయటానికైనా నిశ్చయించాడు. రాజకీయ సంబంధాన్ని బంధుత్వంతో ముడిపెట్టి, వేంగీ చాళుక్య - చోళ సంబంధాలు బలపడటానికి, తన కూతురు కుందవ్వను విమలాదిత్యునికిచ్చి పెళ్ళి చేశాడు. వేంగీ చాళుక్య - చోళ సంబంధాలను నిర్దేశించటంలో రాజరాజు చూపిన ప్రజ్ఞ, రాజనీతి ఎంతటిదో, తర్వాతి కాలపు చరిత్ర నిరూపిస్తుంది. చోళ రాజుల సహాయంతో, శక్తివర్మ వేంగిలో తిరిగి ప్రవేశించి, జటాచోడ భీమునితో యుద్ధానికి దిగాడు. ప్రభుపర్రు, పెన్నేరు శాసనాలు ఆ యుద్ధాల వివరాలను తెలుపుతాయి. జటాచోడ భీముడు ఒక దశలో కళింగానికి తిరోగమించాల్సొచ్చినా, తిరిగి పుంజుకొని, శక్తివర్మను, చోళ సైన్యాన్ని కాంచిపురం దాకా తరిమికొట్టాడు. కాని, కాంచీపురం సమీపం లోనే, క్రీ.శ. 999 లో వాళ్ళతో జరిగిన యుద్ధంలో మరణించాడు. వేంగీ, కళింగ రాజ్యాలు శక్తివర్మ వశమయ్యాయి. అప్పటి నుండి అతని పాలన క్రీ.శ. 1011 దాకా సాగింది. ఈతని తర్వాత రాజ్యానికి వచ్చిన ఈతని తమ్ముడు విమలాదిత్యుడు, క్రీ.శ. 1018 దాకా పాలించాడు. అయితే, ఈ సోదరు లిద్దరూ వేంగిని తమ స్వాధీనం చేసుకోవటానికి, పాలకులవటానికే సహాయపడ్డ చోళుల పలుకుబడి, వేంగీ రాజ్యంలో క్రమేణా ఎక్కువ కాసాగింది. ఫలితంగా, చాళుక్యుల వంశ గౌరవం క్షీణించటం మొదలైంది. వేంగీ రాజ్యంలో చోళుల పెత్తనాన్ని ఉపేక్షిస్తే, అది దక్షిణ దేశ రాజకీయాల్లో సమతుల్యతను దెబ్బతీస్తుందని, పశ్చిమ చాళుక్యులు గుర్తించారు. చోళ సామ్రాజ్య విస్తరణను పశ్చిమ చాళుక్యులు సహించలేదు. అందువల్లనే, చోళ రాజరాజు (985-1013) కు, పశ్చిమ చాళుక్య సత్యాశ్రయుడికి (997-1009) మధ్య, ఘర్షణలు ప్రారంభమయ్యాయి. వాళ్ళ మధ్య ఏర్పడ్డ స్పర్ధలకు, వైషమ్యాలకు వేంగీ రాజ్యం కేంద్ర స్థానమైంది. శాంతిభద్రతలు పూర్తిగా నశించి, పరిపాలనే ప్రశ్నార్థకమైంది. దీనివల్ల, వేంగీ చాళుక్యుల బలహీనత బయటపడి, రాజకీయంగా వేంగికి చాలా నష్టం జరిగింది.

ఇలాంటి పరిస్థితుల్లో విమలాదిత్యుని కొడుకైన రాజరాజ నరేంద్రుడు రాజ్యానికి వచ్చాడు. క్రీ. శ. 1019 లో రాజ్యానికి వచ్చినా, ఏకారణం వల్లనో నాలుగు సంవత్సరాల తర్వాత వరకు, అంటే, క్రీ.శ. 1022 దాకా, పట్టాభిషేకం జరగలేదు. రాజేంద్రచోళుని (1013-1044) కూతురు అమ్మంగదేవి, ఈతని భార్య. ఇతని రాజ్య కాలం లోని అంశాలు చాల వరకు అస్పష్టంగా ఉన్నాయి. వేంగీ రాజకీయాలకు సంబంధించినంతవరకు, ఈ కాలం లోని చోళ, పశ్చిమ చాళుక్యుల శాసనాల్లోని అంశాలు వివాదగ్రస్తాలే. ఇతనితో రాజ్యాధికారం కోసం చివరి వరకూ తలపడ్డ ఇతని సవతి సోదరుడు విజయాదిత్యుడి విషయాలకు సంబంధించి కూడ, చరిత్రకారుల్లో ఏకాభిప్రాయం లేదు. వేంగీ రాజ్యం కోసం రాజరాజనరేంద్రుడితో విజయాదిత్యుడు జరిపిన పోరాటాల్లో, చోళులు రాజరాజ నరేంద్రుడికి సహాయపడితే, వేంగిలో చోళుల పలుకుబడిని సహించలేని పశ్చిమ చాళుక్య, కళింగ రాజ్యాలు, విజయాదిత్యుడికి తోడ్పడ్డాయి. చోళ రాజ్యాన్ని పాలిస్తున్న రాజేంద్రచోళుడు, పశ్చిమ చాళుక్య రాజైన జయసింహుడు, వేంగీ రాజకీయాల్లో పట్టు కోసం, ఎడతెరపిలేని యుద్ధాలను చేశారు. కొత్త శివారం, తిరువేలంగాడు, కలిదిండి మొదలైన ప్రదేశాల్లోని శాసనాల్ని బట్టి, ఇరు పక్షాల సైన్యాలు వేంగీ రాజ్యంలో ఎంత అరాచకత్వాన్ని సృష్టించాయో, తెలుస్తుంది. చావర్ణరసులాంటి సమర్థులైన పశ్చిమ చాళుక్య సేనానుల సహాయం వల్ల, వేంగి లోని కొంత భాగం విజయాదిత్యుని వశమైంది. దాన్ని తిరిగి రాజరాజ నరేంద్రుడికి స్వాధీనపర్చటానికే, రాజరాజ బ్రహ్మమహారాజు లాంటి సేనానుల

BRAOU

నాయకత్వంలో, పెద్ద చోళ సైన్య మొచ్చింది. వేంగి సమీపం లోని కలిదిండి దగ్గర పెద్ద యుద్ధం జరిగింది. తిరిగి ఆహవమల్ల సోమేశ్వరుడు క్రీ.శ. 1042 లో పశ్చిమ చాళుక్య రాజ్యానికి, క్రీ.శ. 1044లో రాజాధిరాజు చోళ రాజ్యానికి పరిపాలకులు కావటంతో, సంఘర్షణలు తీవ్ర స్థాయికి చేరాయి. వేంగీ, కళింగ రాజ్యాల్ని సోమేశ్వరుడు జయించాడు. వాళ్ళ సామంతులైన శోభనరసులాంటి వాళ్ళు కూడ, 'వేంగీపురవరేశ్వర' బిరుదాన్ని ధరించారు. కాని, వేంగిలో వీళ్ళ ఆధిపత్యాన్ని నాశనం చెయ్యటం కోసం, రాజాధిరాజు ఎన్నో ప్రయత్నాలను చేశాడు. పదేళ్ళకు పైగా ఎన్నో యుద్ధాలు సాగాయి. ధరణికోట దగ్గర జరిగిన యుద్ధంలో గంగాధర, గండపయ్యల్లాంటి పశ్చిమ చాళుక్య సేనాపతులు వధింపబడ్డారు. చోళ సైన్యాలు కొల్లిపాక వరకు ఆక్రమించాయి. ఈ కాలంలో 'చోళ-పశ్చిమ చాళుక్యుల మధ్య జరిగిన యుద్ధాల వివరాలు చాల గజిబిజిగా ఉన్నాయి. చివరకు ఏ యుద్ధంలో ఎవరు గెలిచారో, ఎవరు ఓడారో కూడ, నిర్ణయించలేని పరిస్థితులున్నాయి. క్రీ.శ. 1053 లో జరిగిన కొప్పం యుద్ధంలో రాజాధిరాజు మరణించటంతో, రాజరాజ నరేంద్రుడు చోళ రక్షణ కోల్పోయినట్లుంది. విధి లేని పరిస్థితుల్లో ఆహవమల్ల సోమేశ్వరుడి ఆధిపత్యాన్ని అంగీకరించాల్సొచ్చింది. రాజరాజనరేంద్రుడి పరిపాలన క్రీ.శ. 1061 వరకు సాగింది.

అతని మరణానంతరం వేంగిలో జరిగిన రాజకీయ సంఘటనల వివరాలు కూడ, స్పష్టంగా లేవు. ఇతని కొడుకైన రాజేంద్రుడు, చోళ సింహాసన వారసత్వం లభించటం చేత, దాని మీద ఆసక్తి చూపించి, వేంగీ రాజ్యాన్ని తన పిన తండ్రి విజయాదిత్యుడి అధీనం చేశాడు. అతడు రాజేంద్రుడితో సమాధాన పడి, వేంగికి రాజు కావటం, గతంలో అతనికి తోడ్పడ్డ పశ్చిమ చాళుక్యుల కిష్టమై ఉండదు. అందుచేతనే, క్రీ.శ. 1062-63 లో చాళుక్య విక్రమాదిత్యుడు చక్రకూటం మీదకి దాడి చేస్తూ, వేంగిని కూడ ఆక్రమించబోవటంతో, విజయాదిత్యుడు వాళ్ళ సార్వభౌమాధికారానికి అంగీకరించాడు. అది చోళులకు కోపాన్ని తెప్పించింది. విజయాదిత్యుని అదుపుచేసే ఉద్దేశంతో, వీరరాజేంద్రుడు వేంగి మీద దాడి చేశాడు. విజయాదిత్యుడికి కళింగ గంగ రాజైన రాజరాజ దేవేంద్రవర్మ తోడ్పాటు లభించటంతో, విజయాదిత్యుణ్ణి వేంగీ రాజుగా గుర్తింపక తప్పలేదు. క్రీ. శ. 1075 లో విజయాదిత్యుడు మరణించటంతో, వేంగీ చాళుక్య వంశ మంతరించింది. కులోత్తుంగచోళ బిరుదంతో చోళ సింహాసనాన్నధిష్ఠించిన రాజేంద్రుడు, చివరకు వేంగిని చోళ సామ్రాజ్యంలో విలీనం చేశాడు.

8.2.5 : వేంగీ చాళుక్య - పల్లవ సంబంధాలు

వేంగి రాజ్యాన్ని చాళుక్యులు ఆక్రమించుకొన్ననాటికి, కృష్ణా నది దక్షిణంలో ఉన్న ప్రాంతాలు పల్లవుల పాలనలో ఉండేవి. రెండో పులకేశి వేంగిని తన తమ్ముడు కుబ్జ విష్ణువర్ధనుడి అధీనంలో ఉంచి, పల్లవ రాజ్యాన్ని కూడ జయించే ఉద్దేశంతో, కాంచీపురం దాకా సైన్యాలను నడిపాడు. క్రీ.శ. 630లో కాంచీపురం దగ్గరున్న పుల్లలూర్ దగ్గర, పులకేశికి, మహేంద్రవర్మకు తీవ్రమైన యుద్ధం జరిగింది. పల్లవుల ప్రతిష్ఠకు చాల నష్టం వాటిల్లింది. పల్లవులకు సామంతులుగా ఉన్న రాయలసీమ ప్రాంతాన్ని పాలిస్తున్న బాణులు, రేనాటి చోళులు, చాళుక్య ఆధిపత్యాన్ని అంగీకరించారు. కాని, తర్వాత క్రీ.శ. 642 నాటికి పల్లవ నరసింహవర్మ విజృంభించాడు. మణిమంగళం, పరియాల, సురమల మొదలైన చోట్ల జరిగిన యుద్ధాలను గెల్చి, చివరకు బాదామిని ముట్టడించి, పులకేశిని వధించాడు.

రెండవ పులకేశి పల్లవుల్తో జరిపిన యుద్ధాల్లో వేంగీ చాళుక్యుల జోక్యం ఉండక పోవటానికి అవకాశం లేదు. పులకేశి మరణ కాలం, వేంగిలో కుబ్జవిష్ణువర్ధనుని పాలనాంత కాలం, ఒక్కటే కావటం గమనించదగ్గ విషయం. తన అన్న పులకేశితోపాటు విష్ణువర్ధనుడు కూడ, ఈ పల్లవుల

BRAOU

తోటి యుద్ధాల్లోనే మరణించి వుంటాడని, చరిత్రకారుల అభిప్రాయం. అతని కొడుకైన మొదటి జయసింహుడు కూడ, పల్లవులతో ఘర్షణ పడ్డట్టు అనుమానించటానికి, అవకాశముంది. పోగొట్టుకొన్న ప్రాంతాన్ని తిరిగి స్వాధీనపర్చుకునే ప్రయత్నంలో, పల్లవులు వీరితో ఘర్షణలకు దిగుంటారు. నెల్లూర్ దగ్గరున్న ఉదయగిరి ప్రాంతాల్లో జయసింహుని శాసనం దొరకటం, అతడి కొన్ని శాసనాలు యుద్ధ శిబిరాల నుండే జారీ చేయబడటం, పల్లవ రాజ్యపు ఉత్తర సరిహద్దుల్లో వాళ్ళ మధ్య జరిగిన ఘర్షణల్ని సూచిస్తాయి. ఈ సందర్భం లోనే పల్లవ సామంత రాజ్యాలైన బోయకొట్టాలు, వేంగీ చాళుక్యుల ఆధిపత్యం క్రిందకు వచ్చాయి. వేంగీ చాళుక్య - పల్లవుల మధ్య యుద్ధాలన్నీ, కందుకూరు, నెల్లూర్ ప్రాంతాల్లో ఉన్న ఈ బోయకొట్టాల కోసమే జరిగాయి. మొదటి పరమేశ్వరవర్మ (670 -91) వీటిని జయించినా, మంగియువరాజో, రెండో జయసింహుడో తిరిగి వాటిని వేంగీ ఆధిపత్యం క్రిందకు తేవడమైంది.

వేంగీ రాజ్యంలో మూడో విష్ణువర్ధనుడు తన తమ్ముడు కొక్కిలి విక్రమాదిత్యుడితో తగవులు పడుతున్న సమయంలో, పల్లవ నందివర్మ బోయకొట్టాల మీద యుద్ధాన్ని ప్రకటించాడు. అతని ఉదయేందిరం శాసనాన్ని బట్టి, అతని సేనాని ఉదయచంద్రుడు బోయకొట్టాల్ని వేంగీ ఆధిపత్యం నుండి తప్పించి, తిరిగి వాటిని పల్లవ రాజ్యంలో కలిపాడు. గుణగవిజయాదిత్యుడు వేంగీ రాజ్యానికి వచ్చే వరకు, ఆ బోయ రాజ్యాలు పల్లవుల ఆధిపత్యం క్రిందే ఉన్నాయి. గుణగుడు రాజ్యానికి రాగానే, పండరంగ సేనాని నాయకత్వంలో, బోయ దుర్గాల స్వాధీనం కోసం పెద్ద సైన్యాన్ని పంపాడు. పండ రంగ సేనాని బోయల ప్రధాన స్థావరాలైన నెల్లూర్, కట్టెపుదుర్గం మొదలైన వాటిని ధ్వంసం చేసి, కందుకూరును పటిష్టం చేసి, దీనిని అప్పటి వేంగీ రాజధానైన బెజవాడన్నించేలా తీర్చిదిద్దాడు. దక్షిణ దేశ రాజకీయాల్లో చికాకుపడుతున్న పల్లవులు, నెల్లూర్ ప్రాంతాల్ని వేంగీ చాళుక్యులకు వదిలివేశారు. వేంగీ సార్వభౌమాధికారం క్రింద క్రీ.శ. పన్నెండో శతాబ్ది వరకు, పండరంగని వంశస్తులే ఆప్రాంతాల్ని పరిపాలించారు.

BRAOU

8.2.6 : వేంగీ చాళుక్య - రాష్ట్రకూట సంబంధాలు

క్రీ.శ. 753 లో బాదామి చాళుక్య వంశాన్ని మట్టుపెట్టి, దంతిదుర్గుడు రాష్ట్రకూట వంశాన్ని స్థాపించిన నాటికి, వేంగీ రాజ్యం మొదటి విజయాదిత్యుడి పాలనలో ఉంది. దక్షిణ దేశ రాజకీయాల్లో తమ బంధువులు, మిత్రులైన బాదామి చాళుక్యుల అస్తమయం, వేంగీ రాజ్య భద్రతకు తీరని ముప్పైంది. రెండు శతాబ్దాలకు పైగా రాష్ట్రకూటుల్తో సాగిన నిరంతర యుద్ధాలకు వేంగీ రాజ్యం రంగ భూమిగా మారింది. దంతిదుర్గుని (753-756) తర్వాతి రాజైన మొదటి కృష్ణుడు (756-772), తన పుత్రుడైన రెండో గోవిందుని ఆధిపత్యంలో వేంగిపై దాడి చేయటంతో, వేంగీ చాళుక్య-రాష్ట్ర కూటు సంఘర్షణ ఆరంభమైంది. క్రీ.శ. 769 నాటి అలాస్ శాసనాన్ని బట్టి, మొదటి విజయాదిత్యుణ్ణి (755-772) ఓడించి, రాష్ట్రకూటులు ఎన్నో ధనరాసుల్ని, రాజ్య భాగాల్ని స్వాధీనపర్చుకొన్నారు. ఈ యుద్ధ కారణం స్పష్టంగా తెలీనప్పటికీ, కర్ణాటక రాజకీయాల్లో కృష్ణుని శత్రువులైన రాహప్ప మొదలైన వాళ్ళకు తోడ్పడి, రాష్ట్రకూటుల అంతర్గత వ్యవహారాల్లో విజయాదిత్యుడు జోక్యం చేసుకోవటం, ఒక కారణమని భావించబడుతూంది.

రాష్ట్రకూట కృష్ణుడు మరణించటంతో, అతని పుత్రులైన రెండో గోవిందుడు, ధృవుడు, రాజ్యా ధికారం కోసం పోటీ పడ్డారు. మాళవ, కాంచి, గాంగవాడి పాలకులతోపాటు, వేంగిలో అధికారానికి వచ్చిన నాలుగో విష్ణువర్ధనుడు కూడ, గోవిందుని పక్షం వహించాడు. కాని, వీరందరినీ ఓడించి ధృవుడు

రాజ్యాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. గోవిందుడికి సహాయపడ్డ వేంగీ విష్ణువర్ధనుని శిక్షించటానికి, తన బంధువైన వేములవాడ పాలకుడు మొదటి అరికేసరి నాయకత్వంలో సైన్యాన్ని పంపాడు. వేంగీ, కళింగలు రెండింటినీ, రాష్ట్రకూటులు జయించారు. విష్ణువర్ధనుడు రాష్ట్రకూటుల అధికారానికి లోబడి, కప్పాన్ని చెల్లించటమే కాక, తన కూతురు శీలమహాదేవిని ధ్రువుని కిచ్చి పెళ్ళి చేశాడు. దీని వల్ల, తాత్కాలికంగా రెండు రాజ్యాల మధ్య శాంతి కుదిరినా, క్రీ.శ. 794లో ధ్రువుని మరణంతో, వేంగీ రాజ్యం స్వతంత్రతను ప్రకటించుకుంది. ధ్రువుని కొడుకైన మూడో గోవిందుడు, తన అన్న కంభనితో కలహిస్తున్న కారణం వల్ల, వేంగిపై శ్రద్ధ చూపలేదు. కాని, తర్వాత విష్ణువర్ధనుడి మరణంతో, వేంగీ రాజ్యంలో కూడ వారసత్వపు తగాదా ఏర్పడ్డాన్ని, అవకాశంగా తీసుకొన్నాడు. వేంగి సింహాసనం నుండి రెండవ విజయాదిత్యుడిని తొలగించే ప్రయత్నం చేస్తున్న భీమసలుక్కికి, సైనిక సహాయం చేశాడు. భీమసలుక్కి రాజ్యాన్ని స్వాధీనపర్చుకొని, రాష్ట్రకూటులకు ఊడిగం చేసినట్టు వాళ్ళ శాసనాలు తెలుపుతున్నాయి. ఒకరి వారసత్వపు యుద్ధాల్లో మరొకరు తలదూర్చి, రాజకీయ ప్రయోజనం పొందటం, వేంగీ చాళుక్య - రాష్ట్ర కూట సంబంధాల్లో సర్వసాధారణమైంది.

రాష్ట్రకూటుల సహాయంతో పాలిస్తున్న భీమసలుక్కి నుండి రాజ్యాన్ని స్వాధీనపర్చుకునేందుకు రెండవ విజయాదిత్యుడు పన్నెండు సంవత్సరాలకు పైగా, యుద్ధాలను చేశాడు. క్రీ.శ. 814లో మూడో గోవిందుడు మరణించి, బాలుడైన అమోఘవర్షుడు రాజు కావటంతో, రాష్ట్రకూటుల ప్రభావం కొంత తగ్గింది. వేంగీ రాజకీయాల్లోనూ, దీని వల్ల మార్పు లొచ్చాయి. అవకాశం కోసం చూస్తున్న రెండో విజయాదిత్యుడు, విజృంభించి, భీమసలుక్కిని ఓడించి, వేంగి నుండి పారద్రోలాడు. రాష్ట్రకూట భూభాగాల్లో వీరవిహారం చేస్తూ, స్తంభపురి లాంటి నగరాన్ని ధ్వంసం చేశాడు. చాళుక్య సైన్యం ఉప్పెనలా లేచి, రాష్ట్రకూట వైభవాన్ని తుడిచిపెట్టిందని, రాష్ట్రకూట శాసనాల్లో ఉంది. రాష్ట్రకూటులు పూర్తిగా గాభరాన్ని కోల్పోకుండా, రాష్ట్రకూట పరిపాలనా వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న గుజరాత్ ప్రాంతపు పాలకుడు సువర్ణవర్షకర్కరాజు, తన కుమార్తె శీలమహాదేవిని విజయాదిత్యుని కుమారుడికిచ్చి పెళ్ళి చేశాడు.

వేంగీ చాళుక్య-రాష్ట్ర కూట సంబంధాలలో, గుణగ విజయాదిత్య, మొదటి అమోఘవర్షుని కాలం ముఖ్యమైన ఘట్టం. రెండు రాజ్యాలకీ సమకాలీనంగా పాలకులైన వీరిద్దరూ, బహు సమర్థులని చరిత్రకారుల అంచనా. గుణగ విజయాదిత్యుని తల్లి శీలమహాదేవి రాష్ట్రకూట వంశస్తురాలైనప్పటికీ, ఆ బాంధవ్యం రెండు వంశాల మధ్య యుద్ధాల్ని ఆపలేకపోయింది. గుణగ విజయాదిత్యుడు బోయ రాజ్యాల ముట్టడిలో ఉన్నప్పడు, అమోఘవర్షుని సైన్యాలు వేంగిపై దండెత్తాయి. అవి చాళుక్యులనే భాద్యాల్తో, యమున్ని తృప్తిపర్చాయని వర్ణించబడింది. వింగవల్లి యుద్ధంలో గుణగుడు పరాజయాన్ని పొంది, అమోఘవర్షుని అధికారాన్ని, ఆజ్ఞల్ని అంగీకరించాల్సొచ్చింది. చాళుక్యుల శాసనాల్లో ఈ అంశం లేదు. కేవలం రాష్ట్రకూటుల శాసనాల్లోని ఈ విషయాల్లో, చరిత్రకారుల్లో అభిప్రాయ భేదాలున్నాయి. అమోఘవర్షుని వాహ్యాలి ప్రదేశాన్ని శుభ్రపర్చ వేంగీ రాజును నియోగించి, అవమానపర్చినట్లు తెలుస్తోంది. అవమానకర పరిస్థితుల్లో గుణగుడు రాష్ట్రకూటుల అధికారాన్ని అంగీకరించాడు. రాష్ట్రకూటుల తరపున దండయాత్రల్లో పాల్గొని, అమోఘవర్షుని ధిక్కరించిన నొళంబరాజును జయించాల్సొచ్చింది. చాళుక్య శాసనాల్లో వర్ణించబడ్డ ఈతని విజయాలు, కొన్ని ఈ దండయాత్రల్లోవే అయి వుంటాయి. అయితే, క్రీ.శ. 880 లో అమోఘవర్షుడు మరణించి, రెండో కృష్ణుడు రాష్ట్రకూట రాజు కావటంతో, రాజకీయాల్లో ఎన్నో మార్పు లొచ్చాయి. ఘూర్జర ప్రతీహారులు స్వతంత్రించి, మాళవాన్ని ఆక్రమించారు. అమోఘవర్షుడి వల్ల జరిగిన పరాభవానికి

BRAOU

ప్రతీకారం తీర్చుకొనేందుకు, స్వతంత్రతను ప్రకటించుకొనేందుకు, గుణగవిజయాదిత్యుడికి అవకాశం చిక్కింది. పండరంగ సేనాపతి నాయకత్వంలో వేంగీ సైన్యాలు విజృంభించి, రాష్ట్రకూట రాజ్యం మీద దండయాత్రలు చేశాయి. రాష్ట్రకూట కృష్ణుడు, అతనికి తోడ్పడ్డ డాహలరాజు సంకిలుడు, వేములవాడ రాజైన బద్దెగుడు మొదలైన వాళ్ళెందరో ఓడిపోయారు. నర్మదా నది వరకు చాళుక్య సైన్యాలు పురోగమించాయి. దక్షిణ కోసల, కళింగ, ప్రాంతాలు వేంగీ రాజుల అధీనం లోకి వచ్చాయి. అచలపురం, కిరణపురం, చక్రకూటం మొదలైన శత్రు నగరాలన్నీ తగలబెట్టబడ్డాయి. రాష్ట్రకూటుల సార్వభౌమ సూచకాలైన పాళి ధ్వజాన్ని, గంగాయమునా తోరణాన్ని, చాళుక్యులు వశపర్చుకున్నారు. గుణగవిజయాదిత్యుడు దక్షిణాపథపతిగా గుర్తించబడ్డాడు.

గుణగుని మరణంతో వేంగీ రాజ్య వారసత్వం కోసం కొట్లాటలు రేగాయి. ఈ అంతఃకలహాలు ఎప్పటి లాగే వేంగీ రాజకీయాల్లో రాష్ట్రకూటుల ప్రవేశానికి, ప్రాముఖ్యతకు ఆస్కారమిచ్చాయి. మొదటి చాళుక్య భీముని రాజ్యాభిషేకానికి అడ్డుపడుతున్న అతని దాయాదులకు రాష్ట్రకూటుల తోడ్పాటు లభించింది. గుణగుని చేతిలో ఓడి, పరాభవం చెందిన వేములవాడ రాజైన బద్దెగుని నాయకత్వంలో, చాళుక్య భీమునిపై దాడి జరిగింది. మొసలిని జలాశయం లోనే బంధించినట్లు, చాళుక్య భీముని అతని రాజ్యం లోనే బంధించినట్లు, రాష్ట్రకూటుల ఆధారాలు వర్ణిస్తున్నాయి. కొరవి శాసనాన్ని బట్టి, ముదిగొండ రాజుల తోడ్పాటుతో, వేంగీ సైన్యం రాష్ట్రకూటుల్ని తరిమికొట్టింది. చాళుక్య భీముడు వేంగికి రాజయ్యాడు. కాని, ఈతని పాలనా కాలం మొత్తం వందల కొద్దీ యుద్ధాల్లో నిండి ఉంది. అతని దాయాదులకు రాష్ట్రకూటుల సహాయం లభించటమే, ఆ యుద్ధాలకు కారణం. వేంగీ రాజ్యాన్ని అస్థిరపర్చటంలోనే, రెండో కృష్ణుని పాలనా కాలం గడిచింది. రాష్ట్రకూటుల సైన్యాలు ఎడతెరిపిలేని యుద్ధాల్లో, వేంగీ రాజ్యంలో ఎంతో కల్లోలాన్ని సృష్టించాయి. పెరువంగూరు, నిరవద్యపురం, కొల్లేరు ప్రాంతాల్లో జరిగిన భీకర యుద్ధాల్లో, చాళుక్య భీముడు రాష్ట్రకూట సైన్యాల్తో పోరాడాడు. ఈతని కొడుకైన ఇతిమర్తి గండడు, రాష్ట్రకూట సేనాని గుండయను వధించి, ఆ యుద్ధాల్లోనే ప్రాణాలను కోల్పోయాడు.

నాలుగో గోవిందుడు రాష్ట్రకూట రాజయ్యాక, తిరిగి వేంగిని జయించే ప్రయత్నాలను చేశాడు. వేంగీ రాజ్యం లోని పరిస్థితులు కూడ, అతనికి అనుకూలించాయి. రెండో విక్రమాదిత్యుడి తర్వాత, వేంగీ రాజ్యంలో సింహాసనం కోసం వారసులు "రాక్షసుల వలె" పోరాటాలను చేశారు. వారిలో ఒకడైన రెండో యుద్ధమల్లుడికి (930-34), రాష్ట్రకూట సహాయం లభించింది. దీంతో వేంగీ రాజ్యం లోని బెజవాడ, చేబ్రోలు ప్రాంతాల్ని యుద్ధమల్లుడు ఆక్రమించగల్గాడు. కాని, ఈతనికున్న రాష్ట్రకూట సహాయాన్ని ఛేదించి, రెండో చాళుక్య భీముడు యుద్ధమల్లుని తొలగించి, వేంగీ రాజయ్యాడు. అదే సమయంలో, రాష్ట్రకూట రాజ్యంలో తిరుగుబాట్లు లేచి, గోవిందుడు రాజ్యాన్ని పదిలి, చోళమండలానికి పారిపోవటంతో, చాళుక్య భీముడు వేంగిని నిష్కంటకం చేశాడు.

తిరిగి మూడో కృష్ణుడు (939-67) రాష్ట్రకూట రాజ్యానికి, రెండో అమ్మరాజు(945-70) వేంగీ రాజ్యానికి పాలకులు కాగానే, ఘర్షణలు మొదలయ్యాయి. రాష్ట్రకూటుల సహాయంతో బెజవాడ ప్రాంతాల్ని పాలించిన యుద్ధమల్లుని చంపి, సింహాసన మెక్కడంవల్ల, అమ్మరాజు రాష్ట్రకూటుల కోపానికి గురయ్యాడు. యుద్ధమల్లుని కొడుకులైన బాదప, తాళ రాజులకు, రాష్ట్రకూటుల సహాయం లభించింది. దీనితో బాదప, తాళపులు తిరుగుబాటు చేసి, రాజ్యాన్ని అస్థిర పరుస్తూ, అమ్మరాజు తరచు సింహాసనాన్ని కోల్పోయేలా చేశారు. దానార్ణపుని మాంగల్లు శాసనం ప్రకారం, క్రీ.శ. 958లో మూడో కృష్ణుడు వేంగిపై దండెత్తి, అమ్మరాజును కళింగానికి తరిమికొట్టాడు. రాష్ట్రకూటుల ఆశీస్సులతో

BRAOU

దానార్ణవుడు వేంగికి రాజయ్యాడు. దానార్ణవుని పాలనా కాలం లోనే, కర్ణాటక రాజకీయాల నుండి రాష్ట్రకూటులు తెరమరుగయ్యారు. కర్ణాటకలో కల్యాణకటకం రాజధానిగా, పశ్చిమ చాళుక్య రాజ్య మేర్పడింది.

8.2.7 : వేంగీ రాజకీయాల్లో పశ్చిమ చాళుక్యులు, చోళుల పాత్ర

దానార్ణవుని కొడుకులైన శక్తివర్మ, విమలాదిత్యులు జటాచోడ భీముని ఆధిపత్యానికి, పరాక్రమానికి భయపడి, చోళ రాజ్యానికి శరణు కోరి పారిపోవటం వల్ల, వేంగీ రాజకీయాల్లో చోళుల ప్రవేశానికి అవకాశాన్ని కల్పించినట్లైంది. అప్పటికే, దక్షిణ దేశ రాజకీయాల్లో చోళులకు, పశ్చిమ చాళుక్యులతో స్పర్ధ ఉంది. పశ్చిమ చాళుక్యుల్నే కల్యాణి చాళుక్యులని కూడ అంటారు. గంగవాడి, నొలంబవాడి, తలక్కడ ప్రాంతాలను చోళ సైన్యాలు ఆక్రమించటంతో, వాళ్ళ మధ్య ఘర్షణ జరిగింది. వేంగిలో కూడ చోళ ప్రాబల్యం ఏర్పడితే, పశ్చిమ చాళుక్యులను ఎదుర్కోవటం సులభమని, దూరదృష్టి కల చోళ రాజరాజు గ్రహించాడు. అంచేత, తన ఆశ్రయాన్ని కోరివచ్చిన వేంగీ చాళుక్య సోదరులలో చిన్నవాడైన విమలాదిత్యునికి, తన కుమార్తె కుందవ్వనిచ్చి, చోళ-వేంగీ చాళుక్యుల సంబంధాన్ని దృఢతరం చేశాడు. కాంచిపురం సమీపం లోనే చోళ-చాళుక్యుల ఉమ్మడి సైన్యాలు జటాచోడ భీముడిని వధించటంతో, వేంగీ రాజ్యం శక్తివర్మ స్వాధీనమైంది. అది మొదలు, వేంగిలో చోళుల పలుకుబడి అధికం కాసాగింది. దీన్ని పశ్చిమ చాళుక్యులు సహించ లేదు. వేంగిలో చోళుల ప్రాబల్యం పెరిగి బలపడితే, దక్షిణ దేశ రాజకీయాల్లో వారికి తిరుగుండదని, వేంగి నుండి చోళుల్ని తరిమికొట్టి ప్రయత్నించారు. సత్యాశ్రయుని కాలంలో (1006) బయలునంది అనే సేనాని నాయకత్వంలో, చాళుక్య సైన్యం వేంగి పై దాడికొచ్చింది. ఎనమదల, ధరణికోట మొదలైన కోటల్ని నాశనం చేసి, బయలునంది చేబ్రోలు వరకు జయించాడు. సత్యాశ్రయుని దృష్టిని వేంగి నుండి మరో ప్రక్కకు మరల్చటానికి, చోళ రాజరాజు తన కొడుకు రాజేంద్రుని ఆధిపత్యంలో, ఒక సైన్యాన్ని కర్ణాటక మీదికి పంపాడు. చోళ సైన్యాలు ప్రజల్ని దారుణంగా హింసించి, దోచుకొన్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో చోళ సైన్యాన్ని నిరోధించటానికి అతడు మళ్ళటంతో, సత్యాశ్రయుడు వేంగి నుండి దృష్టిని తాత్కాలికంగా మరలించక తప్పలేదు. కాని, అప్పటి నుండి పశ్చిమ చాళుక్య, చోళుల ఆధిపత్య కాంక్షకు వేంగీ దేశం రంగమైంది.

శక్తివర్మ, విమలాదిత్యుల అనంతరం, రాజరాజనరేంద్రుడు వేంగికి రాజయ్యాడు. ఈతని కాలం లోని చారిత్రకాంశాలలో, స్పష్టత లేదు. చోళులు, పశ్చిమ చాళుక్యుల జయాపజయాల్ని గురించి పరస్పర విరుద్ధమైన ఆధారాలున్నందువల్ల నిజమేమిటో తెలుసుకొనే అవకాశం లేదు. రాజరాజ నరేంద్ర, విజయాదిత్యుల మధ్య ఏర్పడ్డ సంఘర్షణల గురించి, ఇతర అంశాలను గురించి, చరిత్రకారుల్లో ఏకాభిప్రాయం లేదు. రాజేంద్ర చోళుని సేనాపతి చోళవ రాయన్ తన దండయాత్రలో వేంగీ రాజును జయించినట్లు, కొత్త శివారం శాసనంలో ఉంది. అలాగే, రాజేంద్ర చోళుని తిరువాలంగాడు శాసనాన్ని బట్టి, కులూట, ఉత్కళ రాజులు జయించబడ్డట్లు తెలుస్తూంది.కులూట ప్రాంతం వేంగీ రాజ్యంలో అంతర్భాగమే. బహుశః వేంగీ రాజు, పశ్చిమ చాళుక్యుల సహాయంతో వేంగిని ఆక్రమించుకొన్న విజయాదిత్యుడేనని కొందరు భావిస్తారు. రాజేంద్ర చోళుడు అతనిని వేంగి నుండి తరిమి, రాజరాజనరేంద్రుని రాజుగా నిలపడమే కాకుండా, తన కుమార్తె అమ్మంగదేవినిచ్చి, పెళ్ళిచేశాడు.

చావణ్ణరసు నాయకత్వంలో, పశ్చిమ చాళుక్యులు తిరిగి వేంగిపై దండెత్తారు. ఈ దండయాత్ర బహుశః రాజేంద్ర చోళుడు తరిమికొట్టిన విజయాదిత్యునికి తోడ్పడటానికే కావచ్చు. ఈ దండ

BRAOU

యాత్రలో కృష్ణా, గోదావరుల మధ్య ప్రాంతాన్ని, రాజరాజ నరేంద్రుడు కోల్పోయాడు. అతనికి సహాయపడటానికి రాజరాజ బ్రహ్మమహారాజు నాయకత్వంలో, చోళ సైన్యాలు మళ్ళీ వేంగికి వచ్చాయి. కలిదిండి దగ్గర ఘోర యుద్ధం జరిగి, పశ్చిమ చాళుక్య సైన్యాలు ఓడిపోయి, పారిపోయాయి. కాని, తర్వాత ఆహవమల్ల సోమేశ్వరుడు కల్యాణికి, రాజాధిరాజు తంజావూరుకు పాలకులు కావటంతో, పోరాటాలు తీవ్ర స్థాయికి చేరాయి. వేంగీ, కళింగ రాజ్యాల్ని సోమేశ్వరుడు జయించాడు. అతని సేనానైన శోభనరును "వేంగీపురవరేశ్వర" బిరుదాన్ని ధరించడాన్ని బట్టి, వీరి గెలుపు తెలుస్తోంది. కాని, వేంగిలో కల్యాణి చాళుక్యుల ఆధిక్యాన్ని తిప్పికొట్టి, రాజాధిరాజు పెద్ద సైన్యంతో ధరణికోట వరకు జయించాడు. గంగాధర, గండవయ్య లాంటి చాళుక్య సేనానులు చంపబడటం; విక్రమాదిత్య, విజయాదిత్య, సంగమయ్య మొదలైన వాళ్ళు వేంగి నుండి పారిపోవటం జరిగాయి. ధరణికోట, కొల్లిపాక, లాంటి దుర్గాలెన్నో ధ్వంసం చెయ్యబడ్డాయి. విజయోత్సాహంతో చోళ సైన్యాలు కల్యాణి చాళుక్య రాజ్యం మీద కూడ చొచ్చుకుపోయాయి. కాని, అది సత్వరితాల నియ్య లేదు. రాజాధిరాజు కొప్పం యుద్ధంలో మరణించటంతో, చోళ సహాయం లేని రాజరాజ నరేంద్రుడు, విధిలేని పరిస్థితుల్లో కల్యాణి రాజులకు విధేయతను ప్రకటించాడు. అందువల్లనే, 'సత్యాశ్రయ' వంటి కల్యాణి చాళుక్యుల బిరుదాలను కొన్నింటిని, అతడు ధరించాల్సొచ్చింది.

రాజరాజ నరేంద్రుని తర్వాత ఏం జరిగిందనే విషయం మీద, స్పష్టమైన అభిప్రాయం లేదు. అతని కొడుకైన రాజేంద్రుడు చోళ సింహాసనానికొక్కాడ వారసుడు కావటం వల్ల, వేంగీ రాజ్యాన్ని తన తండ్రైన విజయాదిత్యుడి కిచ్చినట్లు తెలుస్తోంది. ఇలా చోళ షక్షం వాడైన రాజేంద్రుడితో విజయాదిత్యుడు అవగాహనకు వచ్చి రాజు కావటం, కల్యాణి చాళుక్యుల కామోదమైనట్లు లేదు. అందువల్లనే, యువరాజు విక్రమాదిత్యుడు దండెత్తి వచ్చి, వేంగీ, చక్రకూటాల్ని జయించాడు. వేంగీ రాజ్యం కల్యాణి వారి సామంత రాజ్యమైంది. కాని, దీన్ని అంగీకరించలేని చోళ రాజ్యం, వీరరాజేంద్రుని కాలంలో తిరిగి తన ఆధిపత్యం కోసం ప్రయత్నాలను మొదలెట్టింది. వీరరాజేంద్రుడు వరుసగా వేంగిపై దాడులను ప్రారంభించాడు. వీటిని తట్టుకోలేని విజయాదిత్యుడు పారిపోయి, కళింగలో ఆశ్రయాన్ని కోరాడు. గంగ రాజైన రాజరాజ దేవేంద్రవర్మ 'ద్రమిళాహవం'లో గెల్చి, విజయాదిత్యుణ్ణి రక్షించాడు. పరిస్థితుల్ని బట్టి సమాధానపడ్డ వీరరాజేంద్రుడు, వేంగిలో విజయాదిత్యుని అధికారాన్ని గుర్తించాడు. ఆహవమల్ల సోమేశ్వరుడి మరణంతో, కర్ణాటక రాజ్యాధిపత్యం కోసం గొడవలు జరగటం వల్లా, చోళ రాజ్యంలో వీరరాజేంద్రుడు మరణించటం వల్లా, వేంగికి ఆరెండు రాజ్యాల నుండి యుద్ధాలు తప్పాయి. రాజేంద్రుడు కులోత్తుంగ చోళ నామంతో, చోళ సామ్రాజ్యానికి పాలకుడై, విజయాదిత్యుని తర్వాత వేంగీ రాజ్యాన్ని చోళ రాజ్యంలో విలీనం చేశాడు.

సుమారు నూట యాభై సంవత్సరాల పాటు వేంగీ రాజ్యం వ్యక్తిత్వాన్ని కోల్పోయి, చోళుల ఆధిపత్యాన్ని, పశ్చిమ చాళుక్యుల అధికారాన్నో భరించాల్సి రావటంవల్ల, రాజకీయంగా దాని పరపతి క్షీణించింది. వేంగీ రాజ్యపు భవితవ్యం విజేతల దయాదాక్షిణ్యాలకు లొంగిపోయిన పరిస్థితికి, దిగజారింది. వేంగీ రాజ్యపు బలహీనత, సమకాలీన రాజ్యాలకు స్పష్టంగా తెలిసింది. వేంగి వారసత్వాన్ని వదిలిపెట్టి, రాజేంద్రుడు చోళ చక్రవర్తిగా దక్షిణ దేశానికి వెళ్ళిపోవటంతో, వేంగీ రాజ్యం తన ప్రతిపత్తిని పూర్తిగా కోల్పోయి, చోళ సామ్రాజ్యంలో ఓ భాగమైంది.

8.2.8 : పరిపాలన

ఆంధ్ర దేశ చరిత్రలో వేంగీ చాళుక్య రాజ్య స్థాపనతోనే, మధ్య యుగమారంభమౌతుంది. రాజకీయ అనైక్యం, అంతఃకలహాలు రాజకీయ లక్షణాలైన ఈ కాలంలో, పాలనాయంత్రాంగం ఏ

BRAOU

విధంగా ఉండేదో స్పష్టంగా తెలీదు. బాదామి చాళుక్యుల నుండి చీలిన శాఖ కనుక, వారి పద్ధతి లోనే వీళ్ళ పాలనాయంత్రాంగం కూడ ఉండి వుంటుంది. ప్రాచీన భారతీయ రాజనీతి శాస్త్రాల్లో చెప్పబడ్డ సంప్రదాయక రాజరికాన్నే, వీళ్ళు అమలు చేశారు. రాజ్యాధికారం సప్తాంగాలుగా వుండేది. రాజు, మంత్రి, రాజ్యం, దుర్గం, కోశం, మిత్ర మనేవి సప్తాంగాలు. రాజుకు కొడుకులు లేని సందర్భాల్లో, తమ్ముళ్ళనో, మరే యితర రాజపురుషుల్నో, సామంతుల్నో, యువ రాజుగా నియమించేవారు. రెండవ అమ్మరాజు తన కేమీకాని భల్లాలదేవుడిని యువ రాజుగా నియమించటం మలాంటిదే. మంత్రి, సేనాపతి, పురోహిత, దౌవారిక, ప్రధాన అధ్యక్ష మొదలైన ఉద్యోగులు, పాలనాయంత్రాంగపు అగ్ర శ్రేణిలో ఉండేవారు. పరిపాలనా శాఖలు పద్దెనిమిది విభాగాలుగా విభజింపబడేవి. స్థానిక పరిపాలన సామంతులు, రాజ వంశస్తుల పాలనలో ఉండేది. విధేయత, ప్రభు భక్తి, యోగ్యతల్ని బట్టి, సామంతుల నియామకం జరిగేది. కప్పం చెల్లించటం, అవసరమైనప్పుడు యుద్ధాల్లో పాల్గొనడం, వీరి బాధ్యత. అయితే, రాజ్యాల కేర్పడే వారసత్వపు తగాదాల్లో వీరు నిర్వహించే పాత్రని బట్టి, రాచరికపు భద్రత, భవిష్యత్తు నిర్ణయింపబడేవి. పాలనా సౌకర్యం కోసం రాజ్యాన్ని విషయం, కొట్టం, నాడు, సీమ, అనే వేర్వేరు విభాగాలుగా పరిగణించేవారు. పాలనా వ్యవస్థకు పునాదైన గ్రామం, రాష్ట్రకూట ప్రముఖులు, గ్రామేయకుల అధికారంలో వుండేది. గ్రామ స్థాయిలో అన్ని నిర్ణయాలు వీరి సమ్మతి తోనే జరిగేవి. గ్రామ పాలనను పర్యవేక్షించటానికి, గ్రామణి అనే రాజోద్యోగి ఉండేవాడు. అవినీతిపరులైన అధికారుల్ని రాజు శిక్షించేవాడు. అవినీతి కారణంగా, గ్రామ స్థాయి అధికారైనా, ఏ విధంగా దండనకు గురైంది, ప్రభుబర్రు శాసనం తెల్పుతుంది. రాజ శాసనాల్లో నైయోగికుల ప్రస్తావనలున్నా, వారి విధి, బాధ్యతలు తెలీవు. ప్రభు సేవలో మరణించిన సైనికాధికారుల, ఇతర ఉద్యోగుల కుటుంబాల సంక్షేమానికి, ప్రభుత్వం బాధ్యతను తీసుకొనేది.

భూమి శిస్తుతోపాటు, ఎన్నో పన్నుల ద్వారా ప్రభుత్వాదాయం లభించేది. డేగర పన్ను, పడెవాలు పన్ను, పడియేరి పన్ను, సంధివిగ్రహం పన్ను, విషయ సుంకం, కల్లనక్కం, బీరదాయం, చిట్టవాటం, మొదలైన పన్నులు, ఈ కాలపు శాసనాల్లో తెలుస్తాయి. ఏ గ్రామానికైనా పన్నుల మినహాయింపువుంటే, ఆ విషయాన్ని శాసనాలు ప్రత్యేకంగా పేర్కొనేవి. మాడలు, ద్రమ్మలు, గద్యాణాలు, వీరి కాలంలో చెలామణిలోనున్న నాణేలు. న్యాయ పరిపాలనకు సంబంధించిన వివరాలు తెలియకపోయినా, కొరవి శాసనాన్ని బట్టి, కొన్ని నేరాల స్వభావం, పరిమితులనుబట్టి, వేటికి ఎలాంటి శిక్షలను విధించేవారో, తెలుస్తోంది. నేరస్తుల్ని శిక్షించటానికి జరిమానా విధింపు నుండి మరణ శిక్ష వరకు అమలులో ఉండేది.

8.2.9 : సంఖ్యాంకిత (Numbered) ప్రాంతీయ విభాగాలు : ప్రాముఖ్యత

రాజ్య పరిపాలనలో కొన్ని కొన్ని గ్రామాలు ఒక్కొక్క విభాగంగా పరిగణింపబడేవి. ఇలా విభాగాల నేర్పరచటం, పరిపాలనా సౌలభ్యం కోసం అవసరమని, మను, విష్ణు స్మృతులు, మహాభారతం కూడా సూచిస్తాయి. నపాదలక్ష దేశం, నొలంబవాడి - 32,000, పాకనాడు-21000, ఆర్వేలనాడు (షట్సహస్రావని), వేంగి - 1000, కొండపల్లి - 300, రేపాక-12 లాంటివి, ఈ కోవ లోవే. సాధారణంగా, ప్రతి విభాగానికి అనుబంధంగా, ఒక సంఖ్య చెప్పబడుతూ ఉంటుంది. ఈ సంఖ్యల అర్థాన్ని గురించిగాని, ప్రయోజనం గురించి గాని, స్పష్టంగా తెలీదు. ఈ సంఖ్యలు ఆ విభాగం లోని గ్రామాల సంఖ్యని సూచిస్తాయని, సాధారణ అభిప్రాయం. కాని, ఈ ప్రాంతీయ విభాగాల కనుబంధంగా ఉన్న సంఖ్యల విషయంలో, అభిప్రాయ భేదాలున్నాయి. కొందరి అభిప్రాయంలో,

BRAOU

ఆ సంఖ్య, ఆ ప్రాంతీయ విభాగంలో పన్నుగా వసూలు చేయబడే బంగారు నాణేల సంఖ్యని తెలుపుతుంది. ఆ సంఖ్య ఆ ప్రాంతపు జనాభాను సూచిస్తుందనీ, కుటుంబాల సంఖ్యను సూచిస్తుందనీ కూడ, వేర్వేరు అభిప్రాయాలున్నాయి. ఏ అభిప్రాయాన్ని అంగీకరించటానికైనా, కొన్ని సాధకబాధకాలున్నాయి. అంచేత, ఆధునిక చరిత్రకారులు ఈ ప్రాంతీయ విభాగాల సంఖ్యను బట్టి, వీటిని మూడు విధాలుగా పరిగణించారు. ఇవి పంద లోపు సంఖ్యను కల్గిన ప్రాంతీయ విభాగాలు, వేల సంఖ్య కల ప్రాంతీయ విభాగాలు, లక్షల సంఖ్యను కల్గివున్న ప్రాంతీయ విభాగాలు. వారి అభిప్రాయాన్ని బట్టి, వెయ్యి సంఖ్య వరకున్న విభాగాల్లోని సంఖ్య, గ్రామాల సంఖ్యను సూచిస్తుంది. ఉదాహరణకు, వేంగి -1000; కొండపల్లి-300 మొదలైనవి. అంతకు మించిన సంఖ్య, నాడుల్ని సూచిస్తుంది. ఉదాహరణకు, నొలంబవాడి-32000, పాకనాడు-21000, ఆర్వేలనాడు మొదలైనవి. లక్షల్లో చెప్పబడ్డ సంఖ్య, పన్నుల చెల్లింపు మొత్తాన్ని సూచిస్తుంది. ఉదాహరణకు, నపాదలక్షదేశం. ఈ ప్రాంతీయ విభాగాల సంఖ్యల అర్థాన్ని తెలిపే ఇతరాధారాలు లేని దృష్ట్యా, సందర్భాన్ని బట్టి వాటి అర్థాన్ని గ్రహించాల్సుంది.

8.3 : సంగ్రహంగా

1. వేంగీ చాళుక్య వంశాన్ని క్రీ.శ. 624 లో బాదామి చాళుక్య రాజైన రెండో పులకేశి తమ్ముడు కుబ్జ విష్ణువర్ధనుడు స్థాపించాడు. ముప్పై మందికి పైగా ఉన్న వీరి వంశీయులు, సుమారు నాలుగు వందల యాభై సంవత్సరాలపాటు, అంటే క్రీ.శ. 1076 వరకూ, తీరాంధ్రాన్ని పాలించారు. మహేంద్రగిరి నుండి నెల్లూర్ దాకా, వీరి పాలనలో ఉండేది.

2. కాంచిపుర పల్లవుల్తో పోరాడి, కృష్ణా నదీ దిగువ ప్రాంతాల్ని ప్రస్తుత ప్రకాశం, నెల్లూర్ జిల్లాలు) తమ రాజ్యంలో కలుపుకున్నారు.

3. బాదామి చాళుక్యుల్ని కూలద్రోసిన రాష్ట్రకూటులతో, సార్వభౌమాధికారం కోసం రెండు శతాబ్దాల పాటు ఎడతెగని యుద్ధాలను చేశారు. రాష్ట్రకూటుల అధికారం కర్ణాటకలో అస్తమించేవరకూ, వీళ్ళకి వాళ్లతో ఘర్షణలు జరుగుతూనే ఉండేవి.

4. చోళ-పశ్చిమ చాళుక్యుల పరస్పర వైషమ్యాల ప్రభావం, వేంగీ రాజకీయాల్లో అస్తవ్యస్త పరిస్థితుల నేర్పి, వేంగీ ప్రతిష్టను దెబ్బతీసింది.

5. చోళ సామ్రాజ్యానికి వారసులు లేక, మాతామహ సంబంధం చేత, వేంగీ రాజేంద్రుడు కులోత్తుంగ చోళ బిరుదంతో, చోళ చక్రవర్తి కావటంతో, వేంగీ రాజ్యం స్వయంప్రతిపత్తిని కోల్పోయి, చోళ సామ్రాజ్యంలో విలీనమైంది.

8.4 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. దక్షిణ దేశ రాజకీయాల్లో వేంగీ చాళుక్యులు నిర్వహించిన పాత్రను సమీక్షించండి.
2. వేంగీ చాళుక్య-రాష్ట్రకూట సంబంధాలను అంచనా వేయండి.
3. వేంగీ దేశ రాజకీయాల్లో పశ్చిమ చాళుక్యులు, చోళులు నిర్వహించిన పాత్రను పరిశీలించండి.

BRAOU

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. వేంగీ చాళుక్యుల ఆవిర్భావాన్ని తెల్పండి.

2. జటాచోడ భీమునికి సంబంధించిన రాజకీయ, పాలనా విశేషాలను విశ్లేషించండి.

3. వేంగీ చాళుక్య - పల్లవ సంబంధాలను పరిశీలించండి.

4. వేంగీ చాళుక్యుల పరిపాలనా విధానాన్ని సమీక్షించండి.

5. సంఖ్యాంకిత ప్రాంతీయ విభాగాలంటే ఏమిటో తెల్పి, వాటి ప్రాముఖ్యతను వివరించండి.

8.5 : ఉపయుక్త గ్రంథాలు

Altekar, A.S. : **Rashtrakutas and Their Times,** (Poona, 1934)

Fleet, J.A : **Dynasties of the Kanarese Districts (Bombay Gazetteer I** (Bombay, 1896)

Ganguly, D.C. : **Eastern Chalukyas,** (Benares, 1937)

Majumdar, R.C. (ed) : **The Age of Imperial Kanauj,** Bharatiya Vidya Bhavan (Bombay, 1964) **Vol. IV.**

Mahalingam, T.V : **Kanchipuram in Early South Indian History.**

Ramesh, K.V. : **Chalukyas of Vatapi,** (Delhi, 1986)

Sastry, K.A.N. : **The Colas** (Madras, 1955)

Suryanarayana, K. : **Feudatories under Eastern Chalukyas** (Delhi, 1987)

- do - : **History of the Minor Chalukya Families in Medieval Andhra Desa** (Delhi, 1986)

Satyanarayana, K. : **A Study of History and Culture of the Andhras, Vol.I.** (Delhi, 1975)

Krishna Rao B.V. : **History of the Eastern Chalukyas of Vengi** (Hyderabad, 1973)

Venkataramanayya, N. : **The Eastern Chalukyas of Vengi** (Madras, 1950)

- do - : **The Chalukyas of L (V)emulavada** (Hyderabad, 1953)

Yazdani, G. (ed). : **The Early History of the Deccan, Vol.II.** (oxford, 1960)

BRAOU

సోమశేఖర శర్మ, మల్లంపల్లి : వేంగీ చాళుక్యులు (భారతి వ్యాసాలు)

- do - : తెలుగు సంస్కృతి, Vol. III., తెలుగు విజ్ఞాన సర్వస్వం (హైదరాబాద్)

సూర్యనారాయణ, కొల్లూరు : చాళుక్య వ్యాస మంజరి (విశాఖపట్నం, 1992)

వెంకటరమణయ్య, నేలటూరి : పల్లవులు - చాళుక్యులు (మద్రాస్, 1969)

వెంకట కృష్ణారావ్, భావరాజు : రాజరాజ నరేంద్రుడు (రాజమండ్రి, 1922)

వెంకట కృష్ణారావ్, (సం.) : రాజరాజనరేంద్ర పట్టాభిషేక సంచిక, (రాజమండ్రి, 1922)

హనుమంతరావ్, బి.యస్.యల్. : ఆంధ్రుల చరిత్ర (గుంటూరు, 1983)

రచయిత : డా. కొల్లూరు సూర్యనారాయణ

BRAOU

భాగం-9 : ఆంధ్ర దేశ రాజకీయ చరిత్రపై పూర్వ చాళుక్య, రాష్ట్రకూట, పశ్చిమ చాళుక్యుల పాలనా ప్రభావం

విషయక్రమం

9.0 : లక్ష్యాలు

9.1 : పరిచయం

9.2 : కర్ణాటక రాజ వంశాలు

9.2.1 : పూర్వ చాళుక్యులు

9.2.2 : రాష్ట్రకూటులు

9.2.3 : పశ్చిమ చాళుక్యులు

9.2.4 : ఆంధ్ర రాజకీయాలపై కర్ణాటక రాజ వంశాల ప్రభావం

9.3 : సంగ్రహంగా

9.4 : పరీక్ష నమూనా ప్రశ్నలు

9.5 : ఉపయుక్త గ్రంథాలు

BRAOU

9.0 : లక్ష్యాలు

ఈ పాఠ్య భాగాధ్యయనం ద్వారా, ఆంధ్ర దేశ పశ్చిమ ప్రాంతాల్లో, క్రీ.శ. 624-1200 మధ్య కాలంలో పాలించిన కర్ణాటక రాజ వంశాలైన పూర్వ చాళుక్యులు, రాష్ట్రకూటులు, పశ్చిమ చాళుక్యుల రాజకీయ చరిత్రకు సంబంధించిన విశేషాలను గ్రహించగల్గాలి; సార్వభౌమాధికారం కోసం సమకాలీనంగా వీరి మధ్య జరిగిన సంఘర్షణలు, వాటి ప్రాముఖ్యతను అవగాహన చేసుకోగల్గాలి; వీటితోబాటు, ఆంధ్ర రాజకీయాలపై ఈ కర్ణాటక రాజ వంశాల ప్రభావాన్ని గూడా అర్థం చేసుకోగల్గాలి.

9.1 : పరిచయం

రాజకీయంగాను, సంస్కృతీపరంగాను ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలకు పరస్పర సంబంధముంది. శాతవాహనుల కాలం నుండి విజయనగర రాజుల కాలం దాకా చరిత్రను పరిశీలిస్తే, చాల సందర్భాల్లో అది స్పష్టమౌతుంది. కావేరి నుండి గోదావరి దాకా ఒకే ప్రాంతంగా, 'కవిరాజమార్గం' లాంటి ప్రాచీన కన్నడ గ్రంథం వేర్కొంటూంది. మధ్యయుగారంభం దాకా రెండు ప్రాంతాల లోను రాయటానికి, ఒకే లిపిని వాడేవారు. కర్ణాటక మత, సాహిత్య రంగాల్లో ప్రముఖులైన వీరబనవ, పంప, మొదలైన వారి పూర్వీకులు, అక్కడికి ఆంధ్ర దేశం నుండే, వలస వెళ్లారు. అలాగే, ఆంధ్ర సాహిత్యాన్ని

ఆరంభించటానికి ప్రోత్సహించిన వేంగీ చాళుక్యులు, ఇక్కడికి కర్ణాటక నుండే వచ్చారు. సామాజిక జీవన విధానం లోనూ, ఇరు ప్రాంతాల ప్రజలకు చాల సారూప్యత ఉంది.

కర్ణాటకలో స్థాపించబడ్డ పూర్వ చాళుక్య, రాష్ట్రకూట, కల్యాణ చాళుక్య రాజ్యాల ప్రభావం, ఆంధ్ర దేశ రాజకీయాల మీద చాలా ఉంది. తెలంగాణా ప్రాంతం చాల వరకు వాళ్ళ అధీనం లోనే ఉండేది. రాయలసీమలో ప్రాబల్యం కోసం ఎంతో ఘర్షణ జరిగింది. క్రీ.శ. ఏడో శతాబ్ది ఆరంభం నుండి, పదకొండో శతాబ్ది అంతం దాకా, ఆంధ్రలో జరిగిన ఎన్నో రాజకీయ మార్పులకు, యుద్ధాలకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను, కర్ణాటక రాజ వంశాల ప్రమేయముంది.

9.2 : కర్ణాటక రాజ వంశాలు

వేంగీ చాళుక్యులు ఆవిర్భవించటం లోను, ఆంధ్ర రాజకీయాల్లో మార్పులు, అరాచక పరిస్థితులు ఏర్పడటం లోను, కర్ణాటక రాజ వంశాలు కీలక పాత్రను వహించాయి. ఈ అంశాల గురించి వివరంగా తెలుసుకుందాం.

9.2.1 : పూర్వ చాళుక్యులు

చరిత్ర ప్రసిద్ధిగన్న ప్రాచీన రాజ వంశాల్లో పూర్వ చాళుక్య లొకరు. విభిన్న ప్రాంతాలకు ఎన్నో శాఖలు పూర్వ చాళుక్య వంశం నుండి విస్తరించటాన్ని బట్టి, దాని ప్రాధాన్యత తెలుస్తోంది. దీనినే బాదామి చాళుక్య వంశమని, వాతాపి చాళుక్య వంశమని అంటారు. ఉత్తర కర్ణాటక లోని గిరి దుర్గమైన బాదామి, వీళ్ళ రాజధాని. మహాకూట పర్వత పంక్తికి, మలప్రభ నదికి, మధ్య భౌగోళిక ప్రాధాన్యత కల్గిన ప్రాంతంలో, బాదామి నిర్మించబడింది.

BRAOU

చాళుక్యుల వంశ నామాన్ని గురించి, వేంగీ చాళుక్యుల భాగంలో చర్చించటం జరిగింది. నాగార్జున కొండ శాసనంలో ఖండ చలికి రెమ్మణక ప్రస్తావనను బట్టి, వీళ్ళ పూర్వీకులు శాతవాహనుల తర్వాత కాలం నుండి పాలనా బాధ్యతల్లో ఉన్నట్లు తెలుస్తోంది. వీరిని హూణుల వలె వచ్చి, భారతదేశంలో స్థిరపడ్డ విదేశీ తెగగా, కొందరు చరిత్రకారులు ఒక దశలో భావించినా, ప్రస్తుతం ఆ వాదాన్ని ఎవ్వరూ అంగీకరించరు. వారు స్వదేశీయులనటానికే ఆధారాలున్నాయి.

వీళ్ళ వంశాన్ని గురించి, పుట్టుపూర్వోత్తరాలను గురించి చెప్పకున్న ఉదంతాలను, కొంత వరకు వేంగీ చాళుక్యుల చరిత్రలో పరిశీలించాం. కొద్దిపాటి మార్పుచేర్పులున్నప్పటికీ, ఆ కథలన్నీ బాదామి చాళుక్యులకీ వర్తిస్తాయి. అయోధ్య వీళ్ళ స్వస్థానమనీ, అక్కడ యూపైతొమ్మండుగురు వరుసగా పాలించిన తర్వాత, దక్షిణానికి వచ్చినట్లు చెప్పకున్నారు. అయిదో విక్రమాదిత్యుని కౌతం శాసనంలో, అలా దక్షిణానికి వచ్చిన వీళ్ళ పాలన పదహారు తరాల పాటు సాగిందని, ఆ తర్వాత స్వల్ప అటుం కాలేర్పడ్డా, జయసింహుడు మాటన్నింటినీ అధిగమించి, రాజ్యాన్ని సుస్థిరం చేశాడనుంది. బిల్హణుడు 'విక్రమాంకదేవచరిత్ర'లో మరో ఆసక్తికరమైన కథ చెప్పాడు. భూభారాన్ని తొలగించటానికి, ఇంద్రుని కోరికను బట్టి బ్రహ్మ అంజలి ఘటిస్తున్న సమయంలో, అతని చులుకం (దోసిలి) నుండి సృష్టింపబడ్డ యోధుడే 'చాళుక్యుడ'ట్యూడట! అతనిచే స్థాపించబడిన వంశమే, చాళుక్య వంశమైదంటారు. ఈ కథనాల నిజానిజాలు ఏమైనప్పటికీ, దక్షిణాపథ రాజకీయ పరిణామాల్లో క్రమంగా ఎదుగుతూ, శాతవాహనుల, కదంబుల అనంతరం వీళ్ళు ప్రాచుర్యానికొచ్చి, రాజ్యాధికారాన్ని చేపట్టి ఉంటారు.

వీళ్ళ మూల పురుషుడు ముదివేము అగ్రహారంలో ఆశ్రయాన్ని పొందినట్లు వేంగీ చాళుక్యుల శాసనాల్లో ఉండటం, ఇతర అంశాల నేపథ్యాల్ని బట్టి, ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల మధ్యనున్న హిరణ్యరాష్ట్ర, చాళుక్య విషయాల్ని, వీళ్ళు తొలి దశలో పాలిస్తూ, క్రమేణా విస్తరించి ఉంటారు.

బాదామి చాళుక్య వంశాన్ని స్థాపించిన వాడు, మొదటి పులకేశి. ఈతని తండ్రి రణరాగుడు; తాత జయసింహుడు. రణరాగ, జయసింహుల వివరాలు పెద్దగా తెలియవు. కదంబులు బలహీనపడటంతో, పులకేశి క్రీ.శ. 543-44 లో బాదామిని పటిష్టమైన దుర్గంగా తీర్చిదిద్ది, స్వతంత్ర చాళుక్య రాజ్యాన్ని స్థాపించాడు. తన సార్వభౌమాధికారానికి చిహ్నంగా, అశ్వమేధంతో సహా, హిరణ్యగర్భం లాంటి ఎన్నో క్రతువుల్ని నిర్వహించాడు. సత్యాశ్రయ, రణవిక్రమ, శ్రీవల్లభ, పృథ్వీవల్లభ, వల్లభేశ మొదలైన బిరుదు లీతని కుండేవి. ఈతని భార్య బాత్పుర వంశానికి చెందిన దుర్లభదేవి. కీర్తివర్మ, మంగలేశులు ఈతని కొడుకులు. మొదటి పులకేశి సామ్రాజ్య వ్యాప్తి కోసం చేసిన యుద్ధాల వివరాలు తెలీవు.

పులకేశి అనంతరం అతని పుత్రుడు కీర్తివర్మ రాజ్యానికి వచ్చాడు. అతని పాలన క్రీ.శ. 566 నుండి 597 వరకు సాగింది. తన తండ్రి కాలం లోనే ఇతను దండయాత్రల్లో పాల్గొనేవాడని తెలుస్తోంది. శెంద్రక రాజ వంశానికి చెందిన రాకుమారి ఈతని భార్య. బాదామి లోని ఆలయాలెన్నో ఈతడు కట్టించినవే. అంగ, వంగ, కళింగ, వట్టుర, మగధ, మద్రక, మూషక, పాండ్య, ద్రమిళ, చోళ, వైజయంతి రాజుల నెందర్నో జయించినట్టు, మంగళేశుని మహాకూట శాసనం చెప్తోంది. దీని లోని నిజానిజాలు ఏమైనప్పటికీ, తర్వాతి కాలపు శాసనాన్ని బట్టి, నల, మౌర్య, కదంబుల మీద ఇతడు విజయాలను సాధించినట్టు తెలుస్తోంది. ఈ విజయాలతో, దక్కన్ రాజకీయాల్లో చాళుక్యులు గుర్తింపు పొందే స్థాయికి వచ్చారు. ఇతడు మరణించిన నాటికి, ఇతని కొడుకులైన పులకేశి, విష్ణువర్ధన, జయసింహ, బుధవర్సులు చిన్న వయస్సు వారు కావటంతో, ఈతని తమ్ముడైన మంగళేశుడు రాజ్య సంరక్షణా భారాన్ని వహించాడు. ఆ సమయం లోనే కాలచుర్యులతో యుద్ధం చేసి, ఉత్తర మరాట్వాడా ప్రాంతాల వరకు చాళుక్య రాజ్యాన్ని విస్తరింపజేశాడు. కాని, రాజ్య లోభంతో సింహాసనాన్ని శాశ్వతంగా ఆక్రమించటానికి ప్రయత్నించాడు. దీన్ని గ్రహించిన కీర్తివర్మ కుమారులలో పెద్ద వాడైన రెండో పులకేశి, అతన్ని ప్రతిఘటించాడు. రాజ్యంలో అంతర్యుద్ధ పరిస్థితు లేర్పడి, పులకేశి బలపడి, మంగళేశుని ఓడించి, చంపి, చాళుక్య సింహాసనాన్ని ఆక్రమించాడు.

రెండో పులకేశి క్రీ.శ. 609-10లో సింహాసనానికొచ్చాడు. పిన తండ్రిని వధించి రాజ్యానికి వచ్చినా, అంతర్యుద్ధంలో రాజ్యం బలహీనపడి, ఎందరో శత్రువులను ఎదుర్కోవాల్సొచ్చింది. మంగళేశుని కాలంలో ఓడింపబడ్డ శత్రువు లెవ్వరూ పులకేశి ఆధిపత్యాన్ని గుర్తించలేదు. ఆప్పాయక, గోవిందయ్య మొదలైనవారు తమ సైన్యాలతో భీమారధీ తీరం వరకు ఆక్రమించారు. కాని, స్వల్ప కాలం లోనే చాకచక్యంతో పులకేశి పరిస్థితుల్ని తన కనుకూలంగా మార్చుకొని, రాజ్యాన్ని నుస్థిరం చేశాడు. పరిస్థితులు చక్కబడగానే, దైత్ర యాత్రలు మొదలయ్యాయి.

ఐహోళె (అయ్యవోలు) ప్రశస్తిలో రవికీర్తి, పులకేశి విజయ యాత్ర లన్నింటినీ, విపులంగా వర్ణించాడు. మొదట దక్షిణాపథం మీద ఆధిపత్యాన్ని సంపాదించే ఉద్దేశంతో, దిగ్విజయ యాత్రలను సాగించి, కదంబ, గంగ, ఆలూప, మౌర్య, లాట, మాళవ, ఘూర్జర రాజులను జయించాడు. కర్ణాటక, మహారాష్ట్రలు మొత్తం అతనికి స్వాధీనమయ్యాయి. నర్మదా నదీ తీరంలో ఉత్తరాపథపతి హర్షవర్ధనుని జయించాడు. గెల్చిన ప్రాంతాల్ని తన సోదరుల్లో ఒక్కొక్కరి ఆధిపత్యంలో ఉంచి, తూర్పు దిగ్విజయ యాత్రకు బయలుదేరాడు. కోసల, కళింగ రాజ్యాలను జయించి, వేంగిపై దండెత్తాడు. ఆంధ్ర దేశంలో

BRAOU

ఆనాటికి అస్తవ్యస్తంగా ఉన్న అరాచక పరిస్థితులు, పులకేశికి బాగా అనుకూలించాయి. తెలంగాణా, రాయలసీమల్లోని అత్యధిక భాగాలు అప్పటికే అతని స్వాధీనమయ్యాయి. కృష్ణా నదీ దిగువ ప్రాంతాలు పల్లవుల ఆక్రమణలో ఉన్నాయి. వేంగీ రాజ్యం దుర్జయుల అధీనంలో ఉంది. కళింగ నుండి ప్రవేశించిన పులకేశి, ఆంధ్రలో మొదటిగా దుర్జయులతో పోరాడాల్సొచ్చింది. పిష్టపురం, కొల్లేరుల దగ్గర జరిగిన ఘోర యుద్ధాలలో దుర్జయుల్ని జయించి, పులకేశి వేంగీ రాజ్యాన్ని ఆక్రమించాడు. అతని కొప్పారం, మారుటూర్ శాసనాల్ని బట్టి, ఆంధ్రలో అతడిచ్చిన దానాలు తెలుస్తున్నాయి. పల్లవ రాజ్యం మీద ఈతని దండయాత్ర ఆంధ్ర దేశం మీదుగానే జరిగిందని, చరిత్రకారుల అభిప్రాయం. కాంచీపురం దాకా పోయి, పుల్లలూర్ వద్ద జరిగిన ఘోర యుద్ధంలో పల్లవ మహేంద్రవర్మ (604-630)ను ఓడించాడు. కాని, పల్లవ రాజధానికి నష్టం వాటిల్లినట్టు లేదు. బాదామి చాళుక్య-పల్లవుల మధ్య ఘర్షణలు జరుగుతున్నప్పుడే, వేంగీ చాళుక్యులు బాదామి వారికి సహాయంగా, కృష్ణా నదీ దిగువ నున్న పల్లవ భూభాగాన్ని జయించి, తమ రాజ్యంలో కలుపుకున్నారు. ఈ ఆక్రమణ పల్లవుల్ని బలహీనపర్చటానికుద్దేశించిందే కావచ్చు. మొదటి మహేంద్రవర్మ మరణంతో, రెండవ పులకేశి పల్లవ రాజ్యాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకొనే ఉద్దేశంతో, మళ్ళీ దాడి చేశాడు. రాయలసీమ ప్రాంతాల్లో ఉన్న బాణులు మొదలైన పల్లవ సామంతులు, ఈ సందర్భం లోనే జయించబడి, చాళుక్యుల ఆధిపత్యానికి లోబడ్డారు. పెరియాల, మణిమంగలం, నూరమార, మొదలైన ఎన్నో చోట్ల, పల్లవ-చాళుక్య సైన్యాల మధ్య పోరాటాలు జరిగాయి. పల్లవ ప్రాంతాలు పులకేశి స్వాధీనమయ్యాయి. కాని, మొదటి నరసింహవర్మ (630-668) విజృంభించటంతో, యుద్ధాలు తీవ్ర రూపాన్ని ధరించి, పులకేశి పల్లవుల చేతిలో మరణించాడు. నరసింహవర్మ బాదామి వరకు పోయి, దాని ప్రాభవాన్ని మట్టుపెట్టి, "వాతాపికొండ" బిరుదాన్ని ధరించాడు. ఇది సుమారు క్రీ.శ. 642 ప్రాంతంలో జరిగింది. అప్పటినుండి క్రీ.శ. 655 లో విక్రమాదిత్యుడు చాళుక్య రాజ్యానికి వచ్చే వరకు, పదమూడు సంవత్సరాల కాలం, బాదామి పల్లవుల ఆక్రమణ లోనే ఉన్నట్లు భావించబడుతోంది. పులకేశి రాజరికం ఈ విధంగా ముగిసినప్పటికీ, దక్షిణాపథ చరిత్ర లోని గొప్ప చక్రవర్తులలో అతి పరాక్రమవంతుడుగా అతనిని పరిగణిస్తారు. ఈతని కాలంలో పర్షియా చక్రవర్తి రెండో ఖుస్రూ, బాదామి రాజ్యంతో దౌత్య సంబంధాలను నెరపాడు. చైనా యాత్రికుడైన హ్యూయాన్‌త్సాంగ్ పేర్కొన్నట్టు, సామ్రాజ్య ప్రతిష్ఠ ఈతని కాలంలో శిఖరాగ్రానికి చేరింది.

రెండో పులకేశి మరణం, నరసింహవర్మ విజృంభణలతో, బాదామి ప్రతిష్ఠ తగ్గింది. పల్లవుల సైన్యాలు రాజ్యాన్ని దోచుకొని, అరాచకాన్ని సృష్టించాయి. సామంతులు, రాజకుమారులు విచ్చిన్నకర ధోరణుల నవలంబించి, రాజ్య రక్షణా బాధ్యతను వహించ లేదు. పులకేశి కొడుకులైన ఆదిత్యవర్మ, చంద్రాదిత్య, విక్రమాదిత్య, జయసింహులు, రాజ్యాన్ని శత్రువుల నుండి రక్షించుకొనే విషయంలో కూడ, ఐక్యంగా ఉండలేకపోయారు. మూడో వాడైన విక్రమాదిత్యుడే (655-682) నడుం కట్టి, రాజ్యాన్ని పల్లవుల బారి నుండి కాపాడి, వారికి సహాయపడిన పాండ్య, చోళ, కలభ్రులను జయించాడు. ఈ దండయాత్ర లన్నింటిలో తనకు తోడ్పడ్డ తన తమ్ముడైన జయసింహుని లాట దేశానికి అధిపతిగా నియమించాడు. విక్రమాదిత్యుని పాలన క్రీ.శ. 682 వరకు సాగింది. ఈతని తర్వాత ఇతని పుత్రుడైన వినయాదిత్యుడు రాజ్యానికి వచ్చి, క్రీ.శ. 696 వరకు పాలించాడు. ఎన్నో యుద్ధాలు చేసి, కలభ్ర, కేరళ, హైహయ, మాళవ, చోళ, పాండ్య రాజుల దగ్గర కానుకలను స్వీకరిస్తూ పోయి, ఉత్తరాపథాన్ని కూడ జయించ సంకల్పించాడు. ఇతని కొడుకు విజయాదిత్యుడు పెద్ద సైన్యంతో దండెత్తి, ఉత్తరాపథం లోని కొన్ని రాజ వంశాల్ని జయించి, గంగాయమునా, తోరణాన్ని, పాళి ధ్వజాన్ని, తమ అధికార చిహ్నంగా స్వాధీనపర్చుకున్నాడు. ఈ దండయాత్ర సందర్భం లోనే,

PRAOU

విజయాదిత్యుడు శత్రువుల చేతిలో బంధింపబడటం, అదే సమయంలో బాదామిలో వినయాదిత్యుడు మరణించటం, సంభవించాయి. చివరకు ఏదో విధంగా విజయాదిత్యుడు శత్రువుల బారి నుండి తప్పించుకొని, బాదామి చేరి, రాజరిక బాధ్యతలను చేపట్టాడు (696-739). పట్టడకల్లు లోని కొన్ని ఆలయాలు, విజయాదిత్యుడు నిర్మించినవే.

విజయాదిత్యుని తర్వాత అతని కొడుకైన రెండవ విక్రమాదిత్యుడు (733-744) రాజ్యానికి వచ్చాడు. పల్లవుల తోడి సంఘర్షణ తోనే ఈతని రాజరికం ప్రారంభమైంది. 'పల్లవమల్ల' బిరుదాన్ని ధరించిన రెండో నందివర్మ (695-722) , ఈతని సమకాలికుడు. వీళ్ళ మధ్య జరిగిన అనేక యుద్ధాల్లో, బాదామి సైన్యం పల్లవుల నోడించింది. విక్రమాదిత్యుడు కాంచీపురాన్ని ఆక్రమించినా, దాన్ని పాడుచేయక, అక్కడి ఆలయాలకు, బ్రాహ్మణులకు ఎన్నో దానా లిచ్చాడు. పాండ్య, చోళ, కేరళ, కలభ్ర రాజ్యాల్ని జయించి, దిగ్విజయ చిహ్నంగా దక్షిణ సముద్ర తీరంలో విజయ స్తంభాన్ని ప్రతిష్టించాడు. కాలచుర్య వంశానికి చెందిన లోకమహాదేవి, రజనీత్రైలోక్యదేవిలు, ఈతని భార్యలే. పట్టడకల్లులోని లోకేశ్వరాలయం, త్రైలోకేశ్వరాలయం, వాళ్ళు కట్టించినవే.

క్రీ.శ. 745లో ఈతని కొడుకైన రెండో కీర్తివర్మ రాజ్యానికి వచ్చాడు. బాదామి చాళుక్యుల్లో ఇతడే ఆఖరి వాడు. ఈతని పాలనా కాలంలో, రాజ్యం చాల విషమ పరిస్థితుల నెదుర్కొంది. పాండ్య రాజైన మారవర్మ, రాజసింహుని చేతిలో ఓడిపోయి, సంధి కొడంబడాల్సొచ్చింది. సామంతుడైన రాష్ట్రకూట దంతిదుర్గుడు ఎల్లోరా ప్రాంతాన్ని ఆక్రమించటమే కాకుండా, చాళుక్య సామంతులైన కోసల, కళింగ రాజుల్ని, తెలుగు చోళుల్ని జయించి, తన ప్రభావానికి త్రిప్పుకొన్నాడు. చివరకు అతడే క్రీ.శ. 752 లో బాదామి చాళుక్య వంశాన్ని కూలద్రోసి, కర్ణాటకలో రాష్ట్రకూట సామ్రాజ్యాన్ని స్థాపించాడు. దక్షిణాపథ రాజకీయాల్లో ఎంతో ప్రభావాన్ని చూపించిన బాదామి చాళుక్య వంశం, అలా రెండో కీర్తివర్మ కాలంలో పతనమైంది.

BRAOU

9.2.2 : రాష్ట్రకూటులు

దక్షిణ భారతదేశ చరిత్రలో రాష్ట్రకూటుల స్థానం విశిష్టమైంది. బాదామి చాళుక్యుల సామంతులుగా రాజకీయ జీవనాన్ని ప్రారంభించి, సార్వభౌమాధికారాన్ని చెలాయించే స్థాయికి చేరుకున్నారు. ఎన్నో ఇతర రాజ వంశాల లాగే, రాష్ట్రకూటుల ఆవిర్భావాన్ని గురించిగాని, జన్మభూమిని గురించిగాని, చరిత్రకారుల్లో ఏకాభిప్రాయం లేదు. వీరి రాజకీయ జీవనం మహారాష్ట్రలో ప్రారంభమైందని కొందరు భావిస్తే, కర్ణాటకయే వీరి స్వరాష్ట్రమని కొందరు వాదిస్తున్నారు. వీళ్ళు మహారాష్ట్ర ప్రాంతాల్లోని 'రథిక' వంశానికి సంబంధించిన వాళ్ళుగాని, ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల లోని 'రెడ్డి' కుటుంబానికి చెందిన వాళ్ళుగాని, అయిఉంటారు. వీళ్ళ వంశ గాధలలో శ్రీకృష్ణుని సోదరుడైన సాత్యకి నుండి ఉద్భవించిన జాతిగా, వీళ్ళు పేర్కొబడ్డారు.

ఎలిచిపూర్ ప్రాంతాన్ని క్రీ.శ. 631 ప్రాంతంలో పాలించిన నన్నరాజు సోదరుడు, వీళ్ళ వంశంలో పూర్వీకుడుగా తెలుస్తాడు. ఇతని తర్వాత దంతివర్మ, ఇంద్ర, గోవిందులు బాదామి చాళుక్యుల అధికారానికి లోబడి, లట్టలూర (లాటూర్) ప్రాంతాన్ని పాలించేవారు. వీళ్ళలో ఇంద్రుడు చాళుక్య రాకుమారి భవనాగని పెళ్ళిచేసుకొన్నాడు. వీళ్ళ పుత్రుడే, రాష్ట్రకూట సామ్రాజ్యాన్ని స్థాపించిన దంతిదుర్గుడు.

దంతిదుర్గుడు తొలి దశలో బాదామి చాళుక్యుల సామంతుడుగా ఉండేవాడు. రెండో విక్రమాదిత్యుడు (733-744) చేసిన దండయాత్రల్లో తోడ్పడి, పల్లవ, మాళవ, గుజరాత్ ప్రాంతాల్ని జయించాడు. క్రమంగా బలపడి, రెండో కీర్తి వర్మ కాలానికి బాదామి చాళుక్య రాజ్యాన్ని పడగొట్టి, స్వతంత్ర రాష్ట్రకూట రాజ్యాన్ని స్థాపించాడు. క్రీ.శ. 742 నాటికి ఎల్లోరా ప్రాంతాల్ని జయించి, మాహి, నర్మద, మహానది ప్రాంతాల దాకా రాజ్యాన్ని విస్తరించి, మాళవ, కోసల, కళింగ రాజ్యాల్ని, శ్రీశైల ప్రాంతం లోని తెలుగు చోళుల్ని తన అధీనం లోకి తెచ్చాడు. ఇతనికి పుత్రులు లేకపోవటంతో, ఇతని తర్వాత ఈతని పిన తండ్రైన మొదటి కృష్ణుడు క్రీ.శ. 756 ప్రాంతంలో రాజ్యానికి వచ్చాడు. దంతిదుర్గుడు చేపట్టిన క్షేత్ర యాత్రల్ని ఇతడు నిర్వహించాడు. దక్షిణ కొంకణాన్ని ఆక్రమించి, యువ రాజైన రెండో గోవిందుణ్ణి పెద్ద సైన్యంతో వేంగిపై పంపాడు. వేములవాడ చాళుక్యుల సహాయంతో, వేంగీ, కళింగ రాజ్యాలపై దాడి జరిగింది. వేంగిని పాలిస్తున్న విజయాదిత్యుడు సంధి కొడంబడి, రాష్ట్రకూట సార్వభౌమత్వాన్నంగీకరించాడు. తొలి రాష్ట్రకూట రాజులలో మొదటి కృష్ణుడు గొప్పవాడని చరిత్రకారులు భావిస్తారు. ఎల్లోరా లోని కైలాసనాథ దేవాలయాన్ని, ఈతడే నిర్మించాడు.

ఈతని తర్వాత రెండో గోవిందుడు రాజ్యానికి వచ్చాడు. కాని, విషయలోలుడై ప్రతిష్ట కోల్పోవటంతో, అంతర్యుద్ధ పరిస్థితు లేర్పడి, రాజ్య పరిరక్షణ కోసం అతని తమ్ముడైన ధృవుడు క్రీ.శ. 780 లో అన్నని పదించి, సింహాసన మాక్రమించాడు. ఈ అంతర్యుద్ధంలో కంచి, గంగవాడి, వేంగి, మాళవ రాజులు ధృవునకు వ్యతిరేకంగా, గోవిందునకు తోడ్పడినా, ధృవుడే (780-93) విజయాన్ని సాధించాడు. రాజ్యాధికారాన్ని స్వీకరించిన వెంటనే, తనకు ఎదురునిల్చి గోవిందునికి అంతర్యుద్ధంలో సహాయపడ్డ ఈ సామంత లందరినీ అణచి, తన అధీనానికి తెచ్చుకున్నాడు. వేంగీ రాజైన నాలుగో విష్ణువర్ధనునిపై, వేములవాడ చాళుక్య అరికేసరిని పంపటంతో, అతడు సంధి కొడంబడి, తన కుమార్తె శీలమహాదేవి సీతని కిచ్చి పెళ్ళి చేశాడు. దక్షిణ దిగ్విజయ యాత్రలను ముగించుకొని, ధృవుడు వింధ్య పర్వతాల్ని దాటి, ఉత్తర దేశం మీద దండయాత్ర చేశాడు. అంతర్యుద్ధంలో తనకు వ్యతిరేకంగా పోట్లాడిన వత్సరాజుకు గుణ పాఠాన్ని నేర్పటం కూడ, ఈ దండయాత్రలో ఒక ఉద్దేశం కావచ్చు.

ఈ సందర్భం లోనే, గంగాతీర మైదానంలో, గౌడ రాజైన ధర్మపాలునితో కూడ, యుద్ధం జరిగింది. వాళ్ళ రాజ చిహ్నాలైన శ్వేతచ్ఛత్రాలు, రాష్ట్రకూటుల స్వాధీనమయ్యాయి. ఈ దండయాత్రల్తో రాష్ట్రకూటుల సైనిక శక్తి, రాజ్య ప్రతిష్ట ఇనుమడించాయి. ప్రముఖ భారతీయ రాజవంశాల సరసన, రాష్ట్రకూటులు కూడ గుర్తింపు పొందారు. ధృవుడు తన పదమూడేళ్ళ పాలనా కాలంలో రాష్ట్రకూట రాజ్యాన్ని సువిశాల సామ్రాజ్యంగా వ్యాపింపజేశాడు. ఈ యుద్ధాలన్నింటిలో, అతని కొడుకులైన స్తంభ, కర్క, గోవింద, ఇంద్రులు తోడ్పడ్డారు. తన అనంతరం తన కొడుకులకు రాజ్య వారసత్వ విషయంలో తగాదాలు రాకుండా, ధృవుడు రాజ్యాన్ని గోవిందుడికి అప్పజెప్పాడు. మిగిలిన కొడుకుల్ని తాను జయించిన వివిధ ప్రాంతాలకు అధిపతుల్ని చేశాడు. స్తంభుడు గంగవాడి ప్రాంతానికి, కర్కుడు ఖాందేష్ ప్రాంతానికి, పాలనా బాధ్యతలను స్వీకరించారు.

మూడో గోవిందుడు (793-813) తన తండ్రి సామ్రాజ్యానికి సర్వాధికారయ్యాడు. ధృవుడు భయపడినట్లుగా, రాజ్యాధికారం కోసం మూడో గోవిందునితో అతని సోదరులు వెంటనే ఘర్షణలు పడనప్పటికీ, తమ కిచ్చిన రాజ్య పాలనా బాధ్యతలతో, సంతృప్తి పడలేదు. పెద్ద వాడైన స్తంభుడు వారసత్వ న్యాయంగా తనకు రావలసిన రాజ్యం కోసం, పన్నెండు మంది రాజులను తనకు మద్దతుగా

BRAOU

సంఘటితపర్చి, గోవిందునితో యుద్ధానికి సిద్ధమైనాడు. పరాక్రమవంతుడు, సమర్థుడైన మూడో గోవిందుడు, స్తంభుని విప్లవాన్ని చాకచక్యంతో ఎదుర్కొన్నాడు. తన తమ్ముడు ఇంద్రుని తోడ్పాటుతో, స్తంభుణ్ణి, అతని మిత్రకూటమిని ఓడించి, క్షమించి, తిరిగి అతనికే గంగవాడి పాలనావ్యవహారాలను అప్పజెప్పాడు. సకాలంలో తనకు చేసిన ఈ సహాయానికి, తన సోదరుడైన ఇంద్రుణ్ణి గుజరాత్ ప్రాంత పాలకునిగా నియమించాడు. ఈ వ్యవహారాలను చక్కదిద్దటంలో గోవిందుడు నిమగ్నమై ఉన్నప్పుడు, అతనికి వ్యతిరేకంగా కాంచీపురంలో పల్లవులు శత్రు చర్యలను చేపట్టారు. ధృవుడు వారి నోడించి, రామేశ్వరం వరకు తరిమికొట్టాడు. అదే విధంగా, తన అధికారాన్ని ధిక్కరించి, స్వతంత్రతను ప్రకటించుకొన్న వేంగీ రాజ్యంపై దండెత్తాడు.

అప్పటి వేంగీ రాజైన రెండో విజయాదిత్యుడు (808-47) ఓడిపోయి, తీవ్ర పరాభవానికి గురయ్యాడు. రధన్‌పూర్ శాసనంలో రాష్ట్రకూటు లతనిని తమ గుఱ్ఱాలకు చావళ్ళను నిర్మించమని నిర్బంధించినట్లు, సంజన్ శాసనంలో అతణ్ణి గోవిందుడి విడిది ప్రాంతాన్ని పరిశుభ్రపర్చమని నిర్బంధించినట్లుంది. ఈ విషయంలో అతిశయోక్తులు, నిజానిజాలు ఎలావున్నా, రాష్ట్రకూటులకు వేంగీ రాజ్యం పై ఉన్న ద్వేష భావం, కినుక, ఏమాత్రం తగ్గలేదని, దీని వల్ల తెలుస్తోంది.

దక్షిణాపథం మీద పూర్తి అదుపును సాధించిన తర్వాత, గోవిందుడు తన సైన్యాన్ని ఉత్తర దేశం మీదకు పంపించాడు. ఈ దండయాత్ర గుజరాత్ ప్రాంత పాలకుడిగా నియమించబడ్డ అతని సోదరుడు, ఇంద్రుని నాయకత్వంలో సాగింది. ఉత్తర దేశాధిపత్యం కోసం కలహించుకుంటున్న ఘూర్జర ప్రతీహార, పాల రాజ్యాలు, రాష్ట్రకూటుల ఆధిపత్యానికి తలొంచాయి. ఘూర్జర ప్రతీహార రాజు రెండో నాగభటుడు యుద్ధంలో ఓడిపోయి, రాజస్థాన్ ఎడారుల్లోకి పారిపోయాడు. కనోజ్ పాలకుడైన చక్రాయుధుడు తనకు తానుగా లొంగిపోయాడు. చిత్రకూటం, ఉజ్జయిని, కాళప్రియం, గంగా-యమునా తీర ప్రాంతాల మైదానం, బెంగాల్‌ల మీద వీళ్ళ అధికారం చెల్లింది. ఈతని విజయ యాత్రలకు భీతి చెందిన సింహళ దేశ పాలకుడు కూడ, ఇతని ఆధిపత్యాన్ని గుర్తించి, మిత్రుడయ్యాడు. బ్రోచ్ పాలకుడైన శ్రీభవన కూడ, ఇతనితో సత్సంబంధాల నేర్పర్చుకొన్నాడు. రాష్ట్రకూట సామ్రాజ్యం ఈతని పాలనా కాలానికి ముందు, వెనుకలలో ఎప్పుడూ యింత గొప్ప ఔన్నత్యాన్ని పొందలేదని, ఎ.యస్. ఆల్టేకర్ వంటి పండితుల అభిప్రాయం.

మూడో గోవిందుడు మరణించే నాటికి, ఆతని ఒకే ఒక్క కొడుకైన మొదటి అమోఘవర్షుడు, ఆరు సంవత్సరాల పసివాడు కావటంతో, రాజ్య సంరక్షణా బాధ్యతను గుజరాత్ ప్రాంతాల్లోని ఇంద్రుడి కొడుకైన సువర్ణ వర్ష కర్కరాజు స్వీకరించాడు. దీని నవకాశంగా తీసుకొని, ఎందరో రాజ వంశీయులు, మంత్రులు, సామంతులు, శత్రువులు వేర్వేరు ప్రాంతాలపై అధికారాన్ని చేజిక్కించుకొని, రాజ్యాన్ని విచ్ఛిన్నపర్చే ప్రయత్నాలెన్నో చేశారు. అమోఘవర్షుణ్ణి పదభ్రష్టుణ్ణి చేశారు. కాని, అమోఘవర్షుని రాజ్య సంరక్షణా బాధ్యతలను చూస్తున్న గుజరాత్ శాఖ పాలకుడు రాష్ట్రకూట కర్కరాజు, సామంతుడైన పాతాళమల్లుని సహాయంతో అన్ని అరాచక శక్తుల్నీ సమర్థవంతంగా అణచి వేశాడు. బాల్యం లోనే అనేక కష్టాలు పడి, అమోఘవర్షుడు క్రీ.శ. 813లో రాజ్యాధికారాన్ని చేపట్టాడు.

మూడో గోవిందుని కాలంలో ఓడిపోయి, పరాభవింపబడ్డ వేంగీ చాళుక్యులకు, రాష్ట్రకూట రాజ్యం లోని అరాచక పరిస్థితులు ప్రోత్సాహమిచ్చి, ప్రతీకారం తీర్చుకొనేలా చేశాయి. వేంగీ చాళుక్య రెండో విజయాదిత్యుడు పన్నెండేళ్ళు అవిశ్రాంతంగా జరిపిన యుద్ధాల్లో, చాల వరకు రాష్ట్రకూటులతోనే

BRAOU

జరిగాయి. చిన్నవాడైన అమోఘవర్షుడు ఇంటాబయటా ఇబ్బందుల నెదుర్కొంటున్న పరిస్థితులలో, వేంగి, రాష్ట్రకూట రాజ్యంపై దండెత్తి, భూభాగాలను స్వాధీనపర్చుకొని, తన ఆధిపత్యాన్ని ప్రదర్శించుకొన్నాడు. కాని, తర్వాత సంవత్సరాలలో పరిస్థితులు మారాయి. అమోఘవర్షుడు అప్పటి వేంగీ రాజైన గుణగవిజయాదిత్యుని (848-92) ఓడించి, లొంగదీసుకొన్నాడు. అమోఘవర్షుని రాజ్య కాలం యావత్తూ, యుద్ధాల లోనే గడిచింది. అతని రాజ్యారంభ కాలంలో సమర్థవంతంగా అంతర్యుద్ధాన్ని, విప్లవాన్ని అణచి, తర్వాత అతని రాజ్య సంరక్షకునిగా, అతనికి విధేయుడైన కర్కరాజు కొడుకుల తోనూ, ఆ తర్వాత వేంగీ రాజుల తోను జరిగిన నిరంతర యుద్ధాల వల్ల, తన పూర్వీకుల్లా ఉత్తర దేశ రాజకీయాల్లో తలదూర్చే అవకాశం ఇతనికి కలుగ లేదు. దక్షిణ దేశ రాజకీయాల్లో వైవాహిక సంబంధాల ద్వారా కొన్ని రాజ వంశాలతో తన సంబంధాన్ని దిట్టపర్చుకొన్నాడు. తన కుమార్తె చంద్రబ్బలబ్బెను గంగ రాజైన బూతుగకు, మరొక కూతురైన రేవక నిర్మడిని (శంఖ), గంగ పల్లవ రాజైన నందివర్మ కిచ్చి వివాహం చేశాడు. రాజకీయ, యుద్ధ రంగాల్లోనే కాకుండా, మత, సాహిత్య రంగాల్లో కూడ, అమోఘవర్షుని కృషి అమోఘమైంది. అరవై రెండు సంవత్సరాల పైబడి, సుదీర్ఘ పాలన తర్వాత శేష జీవితాన్ని సాహిత్య, మతపరమైన కార్యాల్లో గడపటానికి, ఇతడు రాజ్య పరిత్యాగం చేశాడు.

అమోఘవర్షుని తర్వాత అతని కొడుకైన రెండో కృష్ణుడు (880-914) రాజయ్యాడు. ఇతని కాలంలో ఘూర్జర ప్రతీహారుడైన మొదటి భోజుడు, వేంగీ చాళుక్య రాజైన మొదటి చాళుక్య భీముడు, ఈతనిచే జయింపబడ్డారు. గుణగ విజయాదిత్యుని కాలంలో తమకు జరిగిన పరాభవానికి ప్రతిగా, వేంగీ దాడులు గురిపెట్టబడ్డాయి. వేములవాడ చాళుక్య రాజైన బద్దెగుడు కూడ, ఈ దాడుల్లో ముఖ్య పాత్ర వహించి, సీటిలో మొసలిని బంధించిన పద్ధతిలో, స్వస్థానమైన వేంగీ లోనే చాళుక్య భీమును బంధించాడు. కాని, చాళుక్య భీముడు తప్పించుకొని, రాష్ట్రకూట సైన్యాన్ని వేంగి నుండి, ముదిగొండ చాళుక్య రాజైన కుసుమాయుధుని సహాయంతో, తరిమికొట్టాడు. కాని, వేంగీ రాజ్య వారసులకు రాష్ట్రకూటులు సహాయసంపత్తులందించటంతో, వేంగీ సింహాసనం మీద నున్న చాళుక్య భీముడు ఎన్నో సమస్యల్ని ఎదుర్కోవాల్సొచ్చింది. తన పాలనా కాలంలో చాళుక్య భీముడు మూడు వందల అరవై యుద్ధాలను చేయాల్సొచ్చినట్లు, చాళుక్యాధారాలు తెల్పుతున్నాయి. రాష్ట్రకూట కృష్ణుని సైన్యాలు ఎడతెరిపిలేని యుద్ధాల్తో, వేంగీ రాజ్యంలో కల్లోలాన్ని సృష్టించాయి. వెరువంగూర్, నిడదవోలు, కొల్లేర్ లాంటి ప్రదేశాల్లో, ఇరు పక్షాల మధ్య తీవ్రమైన యుద్ధాలు జరిగాయి. చాళుక్య భీముని కొడుకైన ఇరిమత్తి గండడు, ఈ సందర్భం లోనే వధింపబడ్డాడు. ఇలా వేంగీలో ఘర్షణలు పడుతూనే, చోళ రాజకీయాల్లో కూడ రాష్ట్రకూట కృష్ణుడు కలుగజేసుకోవాల్సొచ్చింది. చోళ రాజైన మొదటి ఆదిత్యవర్మకు, తన కుమార్తె నిచ్చి పెళ్ళి చేయటం వల్ల, సంబంధ మేర్పడి చోళ రాజకీయాల్లో తలదూర్చాల్సొచ్చింది. ఆ సందర్భం లోనే, చోళ రాజైన పరాంతకునితో తలపడి, ఓడిపోయాడు. రెండో కృష్ణుని తర్వాత, మూడో ఇంద్రుడు (914-28), రెండో అమోఘవర్షుడు (928-29), నాలుగో గోవిందుడు (930-36), మూడో అమోఘవర్షుడు (936-39), మూడో కృష్ణుడు (939-66) మొదలైన వాళ్ళు, వరుసగా రాష్ట్రకూట రాజ్యాన్ని పాలించారు. వేంగీ రాజ్యపు అంతర్గత వ్యవహారాల్లో కల్గించుకోవటంతో, వీరందరి రాజరికాల్లోనూ, వేంగీ పాలకులతో యుద్ధాలు జరిగాయి. నాలుగో గోవిందుడి సహాయంతో వేంగిని ఆక్రమించుకున్న రెండో యుద్ధమల్లుణ్ణి, రెండో చాళుక్య భీముడు తరిమికొట్టి, వేంగీ పాలనా బాధ్యతలను చేపట్టాడు. యుద్ధమల్లుడి కొడుకులైన బాదప, తాళ రాజులక్కూడ రాష్ట్రకూట సహాయం లభించింది. దీని ఫలితంగానే, రెండో అమ్మరాజు తరచు వేంగీ సింహాసనాన్ని కోల్పోవాల్సొచ్చేది. క్రీ.శ. 958 లో మూడో కృష్ణుడు వేంగిపై

BRAOU

దండెత్తి వచ్చి, అమ్మరాజును కళింగ రాజ్యానికి తరిమికొట్టాడు. రాష్ట్రకూటుల ఆశీస్సుల తోనే, దానార్ణవుడు వేంగికి పాలకుడయ్యాడు. అయితే, తక్కోలం వద్ద చోళ సైన్యాలతో ఓడిపోవటం వల్ల, మూడో కృష్ణుడి కాలంలో, రాష్ట్రకూటుల ప్రతిష్ట తగ్గింది. దీనికి తోడు, పరమార రాజులు రాష్ట్రకూట భూభాగాన్ని ఆక్రమించసాగారు. రాష్ట్రకూటుల రాజధానైన మాన్యఖేటాన్ని కూడ, పరమారులు కొల్లగొట్టారు. అలాంటి అరాచక పరిస్థితుల్ని అవకాశంగా తీసుకొన్న రెండో తైలపుడు, రాష్ట్రకూటుల్ని తుదముట్టించి, కర్ణాటక రాజకీయాల్లో కల్యాణి చాళుక్య వంశాన్ని స్థాపించాడు.

9.2.3 : పశ్చిమ చాళుక్యులు

బాదామి చాళుక్య వంశాన్ని కూలద్రోసి, దంతిదుర్గుడు స్థాపించిన రాష్ట్రకూట సామ్రాజ్యం, రెండున్నర శతాబ్దాల పాటు కొనసాగి, చాళుక్య వంశానికి చెందిన రెండో తైలపుని చేతిలో పతనమైంది. ఈ తైలపుడు రాష్ట్రకూట సామంతుడుగా, అనుమకొండ ప్రాంతాల్ని పాలించిన సత్యాశ్రయ భీమరసు వంశం వాడు. బొంతాదేవి, నాల్గో విక్రమాదిత్యుల కుమారుడు. బొంతాదేవి చేది రాజకుమార్తె కావటంవల్ల, రాష్ట్రకూటులను కూలద్రోయటంలో తైలపునికి వాళ్ళ సహాయం కూడ లభించి ఉంటుంది. ఇతను చివరి బాదామి చాళుక్య రాజు రెండో కీర్తివర్మ పిన తండ్రైన భీమరసు వంశం వాడని కొందరి అభిప్రాయం. ఆ భీమరసు రాష్ట్రకూటుల సామంతుడుగా అనుమకొండ ప్రాంతాన్ని పాలించేవాడు. తైలపుడు కూడ మొదట్లో రాష్ట్రకూట సామంతుడుగానే ఉన్నట్లు, అతని "మహామండలేశ్వర" బిరుదం తెల్పుతుంది. ఆ తైలపుడే పశ్చిమ చాళుక్య వంశాన్ని స్థాపించాడు. వీళ్ళ రాజధాని కల్యాణికటకం కావటం వల్ల, వీళ్ళని కల్యాణి చాళుక్యులని కూడ అంటారు. చివరి రాష్ట్రకూట రాజైన కర్కుని జయించి, చాళుక్య రాజ్యాన్ని స్థాపించాక, తైలపుడు మహారాజాధిరాజ, పృథ్వీవల్లభ మొదలైన బిరుదాల్ని ధరించాడు. తైలపుని పరిపాలన క్రీ.శ. 973 నుండి 997 వరకు సాగింది. చోళ చక్రవర్తైన రాజరాజు ఈతని సమకాలీకుడే. తైలపుడి భార్యైన జాకవ్వె, అతడు జయించిన రాష్ట్రకూట రెండవ కర్కుని కుమార్తె. శాసనాలు ఇతనిని 'చోళుల పాలిటి కారుచిచ్చు' అని వర్ణించటాన్ని బట్టి, దక్షిణాపథాధిపత్యం కోసం బాదామి చాళుక్య - పల్లవుల మధ్య లాగే, వీళ్ళూ చోళులతో పోరాటాలను సాగించారు. చోళులు కర్ణాటక భూభాగాన్ని ఆక్రమించినపుడు, క్రీ.శ. 992 లో తైలపుడు వారిని అనంతపురం పరిసరాల్లో ఓడించి, వారి దగ్గర ఏనుగుల్ని కానుకగా తీసుకొన్నాడు. ఎడతెరిపిలేని యుద్ధాలతో తైలపుడు కర్ణాటక లోని ఒకప్పటి బాదామి చాళుక్యుల భూభాగాన్ని తిరిగి ఆక్రమించి, దక్షిణ గుజరాత్ దాకా రాజ్యాన్ని విస్తరించాడు. పరమార రాజైన ముంజునితో అనేక యుద్ధాలు చేసి, చివరకు అతనిని బంధించి, వధించాడు. కవి చక్రవర్తైన రన్నడు ఈతని ఆస్థానం లోనే వుండేవాడు.

తైలపుని పాలన క్రీ.శ. 997 వరకు కొనసాగింది. ఇతని తర్వాత ఇతనికి జాకవ్వె వలన కల్గిన పుత్రుల్లో పెద్ద వాడైన ఇరివబెంచగ సత్యాశ్రయుడు (997-1008) రాజ్యానికి వచ్చాడు. అనుస్యూతంగా వస్తున్న చోళ రాజుల తోడి వైరం, ఇతని కాలం లోనూ సాగింది. దీనికి తోడు, వేంగి రాజకీయాల్లో దానార్ణవుని కొడుకులైన శక్తివర్మ, విమలాదిత్యుల కాశ్రయమిచ్చి, చోళులు వేంగికి చేరువ కావటం, దక్షిణాపథ రాజకీయాల దృష్ట్యా, సత్యాశ్రయుడు సహించ లేదు. అదీగాక, ఇతని రెండో రాజ్య సంవత్సరంలో, చోళ రాజరాజు కర్ణాటకపై దండెత్తి, గంగవాడిని, నొలంబ వాడిని జయించాడు. వీటన్నింటి కారణంగా, ఈతని కాలం యావత్తూ, చోళులతో అవిశ్రాంతమైన పోరాటాల్తోనే గడిచింది. తన కుమార్తె పంపాదేవిని పల్లవ రాజైన ఇరివనొలంబాధి రాజు కిచ్చి వివాహం చేశాడు. జైన పండితుడైన విమల చంద్రుడు ఈతని గురువు.

BRAOU

సత్యాశ్రయుని తర్వాత అతని అన్న కొడుకైన అయిదో విక్రమాదిత్యుడు రాజ్యాన్నాక్రమించి, క్రీ.శ. 1008 నుండి 1018 వరకు పాలించాడు. సత్యాశ్రయుని అల్లుడైన నొలంబాధిరాజు ఈతని ఆధిపత్యాన్ని అంగీకరించినా, సత్యాశ్రయుని కొడుకైన, బనవాసి రాజ్య పాలనా వ్యవహారాలను చూస్తున్న కుందుమరసు, ఇతన్ని ప్రతిఘటిస్తూనే ఉన్నాడు. అయితే, ఈ కుందుమరసు, సత్యాశ్రయుల మధ్యనున్న సంబంధం విషయమై, చరిత్రకారుల్లో సందేహాలున్నాయి. ఇతడు నిజంగా సత్యాశ్రయుని పుత్రుడా, లేక విశ్వాసపాత్రమైన ఈతని సేవలకు మెచ్చి సత్యాశ్రయుడు ఈతనిని ప్రేమ పుత్రునిగా గుర్తించి, గౌరవించాడో సందేహమే.

కాని, విక్రమాదిత్యుని కాలంలో చోళులు దండెత్తి చాళుక్య భూభాగాల్ని ఆక్రమించినప్పుడు, విక్రమాదిత్యుని ఇతర సామంతులతో కలిసి, కుందుమరసు కూడ చోళులతో పోరాడినట్లు, 'చోళుల పాలిటి మృత్యువు' గా ఇతడు వర్ణించబడటాన్ని బట్టి తెలుస్తోంది. విక్రమాదిత్యుని తర్వాత అతని తమ్ముడైన రెండో జయసింహుడు (1018-1042) రాజయ్యాడు. జయసింహుని రాచరికం ఆరంభమయ్యే సమయానికి, రాజ్యం చిక్కుల్లో ఉంది. పరమార రాజైన భోజుడు కక్ష కట్టి, చాళుక్య రాజ్యంపై ఎన్నో యుద్ధాలను ప్రకటించి, రాజ్య భాగా లాక్రమించాడు. బహుశ తైలపుని కాలంలో తమ ముంజునికి జరిగిన అవమానం, భోజుని దాడులకు ఓ కారణమనుకోవచ్చు. కర్ణాట, లాట, కొంకణ ప్రాంతాల్ని భోజుడు జయించి, విజయోత్సవాల్ని జరిపినట్లు, శాసనాలు పేర్కొంటున్నాయి. అయితే, పరమార శాసనాల్లోని అంశాలకు విరుద్ధంగా, వారిని జయసింహుడు జయించి, కొల్హాపుర ఉత్తర ప్రాంతాల దాకా ఆక్రమించినట్లు, చాళుక్య శాసనాలు తెలుపుతున్నాయి. జయసింహుని సేనాని చావుణ్డరసుకు 'కొంకణధూమకేతు' అనే బిరుదం కూడ ఉంది. వీటన్నింటిని బట్టి, క్రీ.శ. 1020-24 ప్రాంతంలో చాళుక్య - పరమార వంశీయుల మధ్య సంఘర్షణలు తీవ్ర స్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది. జయసింహుడు ఈ దాడుల మధ్యనే చోళుల నుండి కూడ యుద్ధాల్ని ఎదుర్కోవాల్సొచ్చింది. నొలంబవాడి, బళ్ళారి ప్రాంతాలు చోళుల ఆక్రమణలకు గురయ్యాయి. కాని, తర్వాత ఈతని శాసనాలు ఆ ప్రాంతాల్లో దొరకడాన్ని బట్టి, ఆ ప్రాంతాలను ఈతని కాలంలో చోళుల నుండి తిరిగి స్వాధీనపర్చుకొన్నట్లు భావించొచ్చు. కాని, రాజేంద్ర చోళుడు ఇతనిని మాస్కి దగ్గర యుద్ధంలో జయించి, క్రీ.శ. 1026 నాటికి, రట్టపాడి ప్రాంతాల్ని ఆక్రమించాడు. ఫలితంగా, చోళులతో సారు తీవ్రమైంది.

దేవల మహాదేవి, సుగ్గల దేవులు, జయసింహుని భార్యలు. మొదట్లో జైన మత సిద్ధాంతాలను నమ్మినా, తర్వాత జయసింహుడు రాణుల ప్రోత్సాహంతో, కాలాముఖ శైవ మతాన్ని స్వీకరించాడు. బళ్ళారి ప్రాంతాల్ని పాలించే నొలంబ పల్లవ సెర్మాడి, ఈతని ఆధిపత్యాన్ని అంగీకరించటాన్ని బట్టి, ఈతని రాజ్యం బళ్ళారి దాకా విస్తరించినట్లు తెలుస్తోంది.

ఈతని తర్వాత ఈతని కొడుకైన మొదటి సోమేశ్వరుడు రాజ్యానికి వచ్చి, క్రీ.శ. 1042-68 మధ్య, రాజ్యం చేశాడు. పాలనాధికారాన్ని చేపట్టిన నాటికే, ఇతడు పాల్లకెరె ప్రాంతపు రాజ్య వ్యవహారాలను చూసేవాడు. ఈతనికి త్రైలోక్యమల్ల, ఆహవమల్ల, బిరుదులుండేవి. ఇతడు కల్యాణ కటకాన్ని సుందరంగా రూపుదీర్చినట్లు, బిల్హణుడు 'విక్రమాంకదేవ చరిత్ర'లో పేర్కొన్నాడు. ఈతని పట్టపు రాణి మైలాలదేవి క్రీ.శ. 1059లో, శ్రీశైలాన్ని దర్శించి, కాలాముఖ శైవ గురువైన సురేశ్వర పండితుడికి, కానుకలను సమర్పించింది. ఈతని రాజ్య కాలంలో కూడ, చోళులతో పెద్ద ఘర్షణలు జరిగాయి. చోళ రాజులైన రాజేంద్రుడు, రాజాధిరాజు, వీరరాజేంద్రులు వేర్వేరు సమయాల్లో ఇతనిని దారుణంగా ఓడించారు. అయితే, దీనికి ప్రతీకారంగా, విక్రమార్జున విజయాదిత్యుడి నాయకత్వంలో

BRAOU

సోమేశ్వరుడు పెద్ద సైన్యాన్ని పంపి, చోళుల్ని పరాజితుల్ని చేశాడు. సోమేశ్వరుని జైత్ర యాత్ర వేంగీ, కళింగ, పాంచాల, మగధ, మాళవ, కేరళ, నేపాళ రాజ్యాల పైకి సాగినట్లు వర్ణించబడింది. వీరికి, పరమార రాజులతో మొదలైన పోరాటాలు, ఈతని కాలంలో కూడ కొనసాగాయి. పరమార రాజులకు సహాయంగా, వీరిపై కొంకణ, శేవుణ, వింధ్య ప్రాంతాల పాలకులు కూడ, ఎత్తివచ్చారు. చాళుక్య సైన్యాలు వీరి నందరినీ ఎదుర్కొని, విజయాన్ని సాధించినట్లు చెప్పబడింది. సోమేశ్వరుని సేనానైన నాగవర్మ ఈ అనేక యుద్ధాల్లో పాల్గొని, సమర్థవంతంగా పోరాడి, విజయాలను సాధించినట్లు, అతని ఎన్నో బిరుదులు సూచిస్తాయి.

అనంతర కాలంలో ఆంధ్ర దేశ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర వహించిన కాకతీయులు, ఈ చాళుక్య సోమేశ్వరుని కాలం లోనే ప్రాచుర్యానికొచ్చారు. సోమేశ్వరుడు కొంకణ, చక్రకూటాలపై చేసిన దండయాత్రలో, కాకతీయ మొదటి ప్రోలరాజు పాల్గొన్నట్టు, అతని సేవలకు మెచ్చి, సోమేశ్వరుడు అనుమకొండపై ఆధిపత్యాన్నిచ్చి, గౌరవించినట్టు తెలుస్తోంది. ప్రోలుని కొడుకైన బేత, సోమేశ్వరుడు పరమారుల తోను, చోళుల తోను చేసిన యుద్ధాల్లో పోరాడాడు. కాకతీయ సేనానైన బ్రహ్మసోమేశ్వరునికి తోడ్పడి, చోళుల ప్రాభవాన్ని నేలమట్టం చేసినట్టు, శాసనాలు వర్ణిస్తున్నాయి.

ఈ సందర్భం లోనే, పశ్చిమ చాళుక్య - చోళుల స్పర్ధల వెనుకనున్న వేంగీ రాజకీయాల నేపథ్యాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. రాజరాజ చోళుని రాజనీతి కారణంగా, వేంగీ రాజకీయాల్లో చోళుల ప్రాబల్యం పెరిగి, ఆ కారణం వల్ల పశ్చిమ చాళుక్యుల్తో పోరాటాలు మొదలయ్యాయి. వేంగికి సంబంధించి, సత్యాశ్రయుని కాలం లోని విధానాన్నే, సోమేశ్వరుడూ అనుసరించాడు. వేంగీ సింహాసనాన్ని రాజరాజనరేంద్రుడు ఎక్కాక (1022), వేంగిలో చోళ ప్రాబల్యం మరింత పెరిగింది. ఫలితంగా, పరిస్థితులు మరింత దిగజారి, అంతర్గత కలహాలు మళ్ళీ చోటుచేసుకున్నాయి. రాజరికం కోసం అర్రులు చాస్తున్న రాజరాజనరేంద్రుని సవతి సోదరుడైన విజయాదిత్యుడు, వేంగీ రాజకీయాల్లో పశ్చిమ చాళుక్యుల ప్రవేశానికి ఒక అవకాశమయ్యాడు. చోళుల సహాయంతో రాజరికం చేస్తూ, వారి కనుసన్నల్లో మెలుగుతున్న రాజరాజనరేంద్రుని ప్రతిఘటిస్తున్న విజయాదిత్యునికి తోడ్పడి, చోళ సైన్యాల్తో ఎన్నో యుద్ధాలు చేశాడు. ప్రముఖ చోళ సేనానులు ముగ్గురు, పశ్చిమ చాళుక్య సైన్యాల చేతిలో హతమైనట్టు, రాజరాజనరేంద్రుని కలిదిండి శాసనం లాంటివి తెలుపుతున్నాయి. సోమేశ్వరుని కాలం లోను, పోరాటాలు అదే ఉధృతిలో సాగాయి. ధాన్యకటకం, ఎనమదల, కొల్లిపాక ప్రాంతాల్లో తీవ్రమైన యుద్ధాలు జరిగాయి. చోళుల చేతిలో సోమేశ్వరుని సేనానులైన గండపయ్య, గంగాధరులు మరణించారు; సంగమయ్య, గణపతి, మధుసూదన, విజయాదిత్యుడు మొదలైన వాళ్ళు తరిమికొట్టబడ్డారు. ఏతగిరి వరకు చోళులు పురోగమించటంతో, పశ్చిమ చాళుక్య లెంతో నష్టపోవటమే కాకుండా, ఎన్నో నగరాలు ధ్వంసానికి గురయ్యాయి. చోళుల శాసనాల్లోని వివరాలిలావుంటే, పశ్చిమ చాళుక్యుల ఆధారాల్లోని వివరాలు మరో విధంగా తెలుపుతాయి. క్రీ.శ. 1044 నాటికి సోమేశ్వరుని సామంతుడు శోభనరసు, వేంగీ ప్రాంతాలపై అదుపును సాధించి, "వేంగీపురవరేశ్వర" బిరుదాన్ని ధరించాడు. మరొక సామంతుడైన సింగణదేవరస, కొల్లిపాకను చోళుల నుండి రక్షించినట్టు చెప్పకొన్నాడు. క్రీ.శ. 1053-54 నాటి కొప్పం యుద్ధంలో, పశ్చిమ చాళుక్యులు, చోళ రాజాధిరాజుని సంహరించారు. చోళుల నుండి సహాయం లభించని రాజరాజనరేంద్రుడు, విధిలేని పరిస్థితుల్లో పశ్చిమ చాళుక్యుల ఆధిపత్యాన్ని అంగీకరించాడు.

సోమేశ్వరుని కాలం లోని శాసనాల్ని బట్టి, రాజకుటుంబీకులు ఇతనికి వేర్వేరు ప్రాంతపు పాలనా వ్యవహారాలను చక్కబర్చటంలో తోడ్పడేవారని తెలుస్తోంది. ఈతని భార్యైన మైలాలదేవి, బనవాసి

BRAOU

ప్రాంతాల్ని, కొడుకైన రెండో సోమేశ్వరుడు బెల్వల-పులిగెరె ప్రాంతాల్ని, మరో పుత్రుడైన ఆరో విక్రమాదిత్యుడు గంగవాడి ప్రాంతాల్ని, పర్యవేక్షించేవారు. ఎన్నో విజయాలను సాధించిన ఈతని జీవితం లోని ఆఖరి దశ, విషాదాంతంగా ముగిసింది. తన చివరి రోజుల్లో ఇతడు చోళుల దాడుల్లో యిబ్బందులు పడి, అంతిమ సమరంలో జయాపజయాలను తేల్చుకోవటానికి, వీరరాజేంద్రుడిని కవ్వించి, కూడల సంగమానికి ఆహ్వానించాడు. కాని, బహుశ: తన అనారోగ్య కారణంగా, అనుకున్న విధంగా అతణ్ణి ఎదుర్కొనేందుకు కూడల సంగమానికి వెళ్ళలేక, పాటవారిలో ప్రతిష్ట కోల్పోవటంతో, కృంగిపోయి, తుంగభద్రలో మునిగి మరణించాడు.

తర్వాత ఇతని కొడుకైన రెండో సోమేశ్వరుడు 'భువనైకమల్ల' బిరుదాన్ని ధరించి, రాజ్యానికి వచ్చాడు. క్రీ.శ. 1068 నుండి 1076 వరకు పాలించినప్పటికీ, ఈ కాలమంతా తీవ్రమైన అంతఃకల హాలతోనే గడిచింది. నొలంబవాడి, బనవాసి ప్రాంతాల్ని ఆక్రమించి, ఈతని సోదరులైన జయసింహ, ఆరో విక్రమాదిత్యులు ఈతనిపై తిరుగుబాటు చేశారు. విక్రమాదిత్యుడు ఈతని నోడించి, రాజ్యాన్ని' ఆక్రమించినట్టు, బిల్హణుని **'విక్రమాంకదేవచరిత్ర'** చెబుతోంది. ఆరో విక్రమాదిత్యుడు కల్యాణకటకంలో పట్టాభిషేకాన్ని చేసుకొని, క్రీ.శ. 1076 నుండి 1126 వరకు పాలించాడు. పశ్చిమ చాళుక్య రాజు లందరిలో ఇతనిని గొప్పవాడుగా పరిగణిస్తారు. ఇతని ఆస్థానకవైన బిల్హణుని **'విక్రమాంకదేవచరిత్ర'** లో ఇతనిని గురించి చాల వివరాలున్నాయి. తన తండ్రి దుర్మరణం, ఇతనికి కృష్ణా తీర ప్రాంతంలో విడిసి ఉన్నప్పుడు తెలిసింది. వెంటనే కల్యాణకటకానికి వెళ్ళి, తన అన్న రెండో సోమేశ్వరుని ఓడార్చి, అతనిని పట్టాభిషిక్తుణ్ణి చేశాడు. కాని, తర్వాత విక్రమాదిత్యుని కున్న జనాకర్షణకు అసూయపడ్డ సోమేశ్వరుడు, ఇతని ఏలుబడిలోనున్న గంగవాడి, బనవాసి ప్రాంతాల్ని తీసుకోవటంతో, అది అంతర్యుద్ధానికి దారితీసింది. ఈ అంతర్యుద్ధంలో యాదవ రాజైన రెండో శేవుణ చంద్రుని సహాయం, ఇతనికి లభించింది. రాజ్యాధికారాన్ని చేపట్టిన మొట్టమొదటి సంవత్సరమే, ఇతడు తొలి చర్యగా, అప్పటి వరకు వాడుకలో నున్న శాలివాహన శకాన్ని మారుస్తూ, విక్రమ శకాన్ని ఆరంభించాడు. అతని తొలి రాజ్య సంవత్సరమైన క్రీ.శ. 1076 నుండి, చాళుక్య విక్రమ శకం ప్రారంభమైంది. కల్యాణకటకం ముఖ్య పట్టణంగా ఉన్నప్పటికీ, ప్రజారంజకంగా పాలనా విధానాన్ని మెరుగుపర్చటానికి, రాజ్య వివిధ ప్రాంతాలలో యాతగిరి, విజయపురం, మన్నేయకెరె, విక్రమపురం మొదలైన వాటిని ఉప ముఖ్య పట్టణాలుగా తీర్చిదిద్దాడు. అంతర్గత తిరుగుబాటుల నుండి, పై దండయాత్రల నుండి ప్రజల్ని రక్షించటంతో, దేశంలో శాంతి నెలకొంది. తరచుగా ఉప రాజధానుల్లో పర్యటిస్తూ, పరిపాలనా వ్యవహారాన్ని రాజే పర్యవేక్షించటంతో, పరిపాలన జనాభిమానాన్ని చూరగొంది. క్రీ.శ. 1080 ప్రాంతంలో ఈతని తమ్ముడైన జయసింహుడు తిరుగుబాటుకు ప్రయత్నించినా, అది అణచివేయబడింది. అదే విధంగా, అతని రాజ్య ప్రాంతాల్ని ఆక్రమించ ప్రయత్నించిన వేంగీ పాలకుడిని కూడ, ఓడించాడు. కాని, హోయసాల విష్ణువర్ధనుడు ఈతని చివరి రోజుల్లో కొంత రాజ్యాన్ని ఆక్రమించాడు. ఉచ్చంగి, బెల్వల ప్రాంతాల గుండా హోయసాల సైన్యాలు కృష్ణా నది వరకు ఆక్రమించాయి. హోయసాలుల దాడిని అవకాశంగా తీసుకొని, కొందరు సామంతులు కూడ తిరుగుబాటుకు ప్రయత్నించారు. కాని, విక్రమాదిత్యుడు అత్యంత సమర్థవంతంగా ఈ దాడుల్ని, తిరుగుబాటుల్ని అణచి, రాజ్యాన్ని కాపాడుకున్నాడు. ఈతని శేష జీవితంలో సాహిత్య పోషణ, ఆలయ నిర్మాణాలు వృద్ధిపర్చబడ్డాయి. ఎందరో కవిపండితు లీతని ఆస్థానంలో ఉండేవారు. కాశ్మీర పండితుడైన బిల్హణుడు ఇతని కొలువులో ఇరవై సంవత్సరాలకు పైగా ఉన్నాడు. **యాజ్ఞవల్క్యస్మృతికి** వ్యాఖ్యానమైన **'మితాక్షర'** ను రాసిన విజ్ఞానేశ్వరుడు కూడ, ఈతని ఆస్థానం లోనే ఉండేవాడు. పశ్చిమ చాళుక్య రాజు లందరిలో, విక్రమాదిత్యుడి కాలం అన్ని రంగాల్లోనూ గొప్పదని, చరిత్రకారుల అంచనా.

BRAOU

క్రీ.శ. 1126 లో విక్రమాదిత్యుడు మరణించటంతో, అతని కొడుకైన మూడో సోమేశ్వరుడు పాలకుడయ్యాడు. విజ్ఞాన సర్వస్వమని వర్ణించదగిన **'అభిలషితార్థ చింతామణి'** అనే గ్రంధాన్ని ఇతనే రాసాడు. దీనినే **'మానసోల్లాసం'** అని కూడ అంటారు. సోమేశ్వరుడు రాజైన వెంటనే, బనవాసి, గంగవాడి ప్రాంతాల్ని సామంతుల నుండి వశపర్చుకొన్నాడు. కాని, ఈతని కాలం లోనే వేంగీ రాజ్యం కల్యాణి చాళుక్యుల ఆధిపత్యాన్ని ధిక్కరించింది. క్రీ.శ. 1133 నాటికి, చాళుక్య-చోళుల సామంతులైన వెలనాటి రాజులు, కల్యాణి చాళుక్య దండనాయకుని జయించి, వేంగిని పాలించసాగారు.

సోమేశ్వరుని తర్వాత కల్యాణి రాజ్యానికే వచ్చిన వాళ్ళలో, మూడో తైలపుడు ముఖ్యుడు. కాని, ఇతని పాలనా కాలం కూడ, బలమైన సామంతులతో యుద్ధాల లోనే గడిచింది. అప్పటికే పేరి మంత్రిత్వ బాధ్యతలను నిర్వహిస్తున్న కలచురి బిజ్జలుడు క్రమంగా బలపడుతూ, సామంతుల సహకారాన్ని పొందగలిగాడు. క్రీ.శ. 1157లో బిజ్జలుడు తిరిమికొట్టటంతో, తైలపుడు రాజధానిని వదలి పారిపోవాల్సొచ్చింది. ఈతని కొడుకైన నాలుగో సోమేశ్వరుని రాజుగా, కొందరు విశ్వాసపాత్రులైన సామంతులు గుర్తించినప్పటికీ, అతని రాజరికం చెప్పకోదగ్గది కాదు. బిజ్జలుని తిరుగుబాటుతో, కల్యాణి చాళుక్య వంశ మంతరించింది. దేవగిరి యాదవులు ఉత్తర దిక్కు నుండి ద్వారసముద్ర ప్రాంతాల్ని; హోయసాలులు దక్షిణం నుండి చాళుక్య భూభాగాన్ని ఆక్రమించటంతో, రాజ్యం విచ్ఛిన్నమైంది. తెలంగాణా ప్రాంతాల్ని కాకతీయులు స్వాధీనపర్చుకోవటంతో, పశ్చిమ చాళుక్యులు తెరమరుగయ్యారు.

9.2.4 : ఆంధ్ర రాజకీయాలపై కర్ణాటక రాజ వంశాల ప్రభావం

ఆంధ్ర దేశ రాజకీయాలపై కర్ణాటక దేశ రాజకీయాల ప్రభావం చాలా వుంది. బాదామి చాళుక్య, రాష్ట్రకూటు, పశ్చిమ చాళుక్యుల అంతర్గత, బాహ్య రాజకీయాలు, కలహాలు ఎన్నో సందర్భాల్లో, ఆకాలపు ఆంధ్ర దేశాన్ని, రాజకీయాల్ని శాసిస్తున్న వేంగీ రాజ్యాన్ని, విపరీతమైన మార్పులకు గురయ్యేలా చేశాయి. అవేమిటో, వేంగి చాళుక్యుల భాగంలో తెలుసుకొన్నాం.

బాదామి చాళుక్య రాజైన రెండో పులకేశి ఆంధ్ర దేశం లోని వేంగీ ప్రాంతాన్ని జయించి, కుబ్జ విష్ణువర్ధనుడి అధీనంలో ఉంచాడు. అది అనూహ్యంగా ఆంధ్ర దేశ రాజకీయాల్లో నాలుగున్నర శతాబ్దాలకు పైగా పాలించిన వేంగీ చాళుక్య రాజ్య స్థాపనకు కారణమైంది. వేంగీ చాళుక్యులకు పల్లవులతో విరోధం కలగటానికి, రాజ్య విస్తరణ ఒక కారణమైనప్పటికీ, బాదామి చాళుక్య - పల్లవుల మధ్య ఏర్పడ్డ వైర ప్రభావం కూడ, ముఖ్య కారణమని భావించొచ్చు. పల్లవుల్ని బలహీనపర్చి, ఆ విధంగా బాదామి చాళుక్యులకు సహకరించటమే, ఈ దాడుల ఉద్దేశం. బాదామి నుండి వేంగి వరకు విస్తరించటంలో జరిగిన ఎన్నో యుద్ధాల్లో తమకు తోడ్పడ్డ, ఎన్నో విశ్వాసపాత్రమైన సైనిక కుటుంబాల వారిని, ఆంధ్ర దేశంలో వేర్వేరు ప్రాంతాల్లో వేంగీ చాళుక్యులు సామంతులుగా నియమించటం కూడ, గుర్తుంచుకోవలసిన విషయం. ఈ సామంత వంశాల్లో చాల మంది కర్ణాటక ప్రాంతం వాళ్ళు కావటానికి, అవకాశముంది. అనంతర కాలంలో, ఆంధ్ర దేశ రాజకీయాల్లో వీరు నిర్వహించిన పాత్ర స్వల్పమైంది కాదు.

బాదామి చాళుక్య వంశాన్ని పడగొట్టి, రాష్ట్రకూటులు సామ్రాజ్య స్థాపన చెయ్యటంతో, కర్ణాటక రాజకీయాలు పెద్ద మలుపు తిరిగాయి. దీని తాకిడి వేంగీ చాళుక్య రాజ్యాన్ని కూడ ఎన్నో ఇబ్బందులకు గురిచేసి, రెండు శతాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ యుద్ధాలకు దారితీసింది. భూభాగాల ఆక్రమణల కారణం గానో, వైరి వర్గాల దాయాదుల కలహాల్లో కలిగించుకొని, అంతర్యుద్ధాల్ని బలపర్చిన కారణం

BRAOU

గానో, రెండు రాజ్యాల మధ్య పరస్పర వైషమ్యాలు పెచ్చు పెరిగాయి. వేంగీ చాళుక్యులు రాజధానిని బెజవాడ నుండి రాజమహేంద్రవరానికి మార్చుకోవాల్సిరావటానికి కారణం కూడ, రాష్ట్రకూట దండయాత్రలే కావచ్చు. వీళ్ళ మధ్య జరిగిన యుద్ధాల కారణంగా, తెలంగాణా ప్రాంతం లోని వీళ్ళ సామంత రాజ్యాల్లో కూడ, ఎన్నో ఘర్షణలు చోటుచేసుకొని, ఆంధ్ర దేశ రాజకీయాల్ని రక్తసిక్తం చేశాయి. వైవాహిక బంధాల్తో రెండు శత్రు రాజ్యాల మధ్య వైరాన్ని తగ్గించటానికి చేసిన ప్రయత్నాలు కూడ, సత్ఫలితాల నియ్య లేదు. ఉత్తర దేశ రాజ్యాల్ని ఓడించి, రాష్ట్రకూటులు సాధించుకున్న సార్వభౌమ చిహ్నాలన్నీ, ఒక దశలో వేంగీ చాళుక్యుల వశమయ్యాయి. కల్యాణి చాళుక్యులు విజృంభించి, కర్ణాటకలో రాష్ట్రకూటుల్ని కూలద్రోసే వరకు, ఈ పోరాటాలు ఆగ లేదు.

కర్ణాటక రాజకీయాల్లో రాష్ట్రకూటుల స్థానంలో పశ్చిమ చాళుక్యులు పాలకులుగా వచ్చినా, ఆ మార్పు ఆంధ్ర రాజకీయాలకేమాత్రం ప్రయోజనకరం కాలేదు. పశ్చిమ చాళుక్య వంశాన్ని స్థాపించిన రెండో తైలపుని పూర్వీకులు, తెలంగాణం లోని అనుమకొండ ప్రాంతాల్ని పాలిస్తూ ఉండేవారు. పశ్చిమ చాళుక్యుల రాజ్యారంభం నుండే, ఆంధ్ర రాజకీయాల్లో ప్రాబల్యం కోసం తరచు చోళుల్తో ఘర్షణలు జరుగుతూనే ఉండేవి. తెలుగు చోడ కుటుంబాల్తో వీళ్ళకున్న మైత్రి కూడ, ఆంధ్ర రాజకీయాల్లో వీళ్ళకి ప్రమేయాన్ని కల్గించింది. వేంగీ రాజ్యాన్ని చోళుల ప్రాబల్యం నుండి తప్పించటానికి వీళ్ళ సహాయం, జటాచోడ భీమునికి వేంగీ ఆక్రమణలో లభించి ఉండొచ్చు. వేంగీ రాజ్యం కోసం పోరాటాన్ని సాగిస్తున్న విజయాదిత్యుడికి, పశ్చిమ చాళుక్యుల సహాయమందటానికి, విజయాదిత్యుని తల్లి తెలుగుచోడ వంశస్తురాలు కావటాన్ని, ఓ కారణంగా భావించొచ్చు. చోళ-కల్యాణి చాళుక్య రాజ్యాల మధ్య ఎన్నో యుద్ధాలు ప్రారంభమై, ఆంధ్ర దేశం లోని ధరణికోట, ఎనమదల, కొల్లిపాక మొదలైన దుర్గాలెన్నో ధ్వంసమయ్యాయి. వేంగీ రాజ్యాన్ని స్వాధీనపర్చుకోవటం కోసం కాకపోయినా, అక్కడ చోళుల ప్రాబల్యాన్ని అరికట్టటమే ధ్యేయంగా, వాళ్ళ పోరాటాలు సాగాయి. తర్వాత కాలంలో ఆంధ్రాధిపతులైన కాకతీయులు, తమ రాజకీయ జీవనాన్ని పశ్చిమ చాళుక్యుల దగ్గరే ప్రారంభించి, అనుమకొండ ప్రాంతాలకు సామంతులయ్యారు. కర్ణాటక రాజకీయాల్లో చోటుచేసుకున్న ఎన్నో మార్పుల ప్రభావానికి, ఆంధ్ర దేశం ప్రతిస్పందించిందనే చెప్పాలి.

BRAOU

9.3 : సంగ్రహంగా

1. మధ్యయుగారంభంలో ఆంధ్ర దేశంలో పాలన చేసిన వేంగీ చాళుక్యులు, కర్ణాటక దేశం నుండి విస్తరించిన బాదామి చాళుక్య వంశం నుండి ఏర్పడిన శాఖ.

2. వీళ్ళు ఆంధ్ర ప్రాంతాల్ని పాలించిన నాలుగున్నర శతాబ్దాల్లో, కర్ణాటక దేశంలో చాల రాజకీయ మార్పు లేర్పడ్డాయి. బాదామి చాళుక్యుల్ని కూలద్రోసి, రాష్ట్రకూటులు; వారిని పడగొట్టి, పశ్చిమ చాళుక్యులు పాలకులయ్యారు.

3. ఈ మూడు పాలక వంశాల నడవడికలను బట్టి, ఆంధ్ర దేశ రాజకీయాల తీరుతెన్నులు నడిచాయి. వేంగీ రాజ్యం తిరాంధ్రంలో ఏర్పడటానికి బాదామి చాళుక్యులు కారణమైతే, వేంగీ చాళుక్యుల్ని తమ అధీనంలో ఉంచుకునేందుకు, మిగిలిన రెండు వంశాల వారు చివరి దాకా ప్రయత్నించారు.

4. ఎనిమిదో శతాబ్ది ద్వితీయార్ధంలో, కర్ణాటక రాజకీయాల్లో రాష్ట్రకూటులు అడుగు పెట్టింది మొదలు, పన్నెండో శతాబ్ది ద్వితీయార్ధంలో కల్యాణి చాళుక్యులు అస్తమించే వరకు, ఆంధ్రలో జరిగిన రమారమి అన్ని యుద్ధాలు, వాళ్ళ వాళ్ళ ప్రాబల్యాన్ని స్థాపించుకునేందుకే నిర్దేశించబడ్డాయి.

9.4 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. పూర్వ చాళుక్యుల పాలనా విశేషాలను సమీక్షించండి.
2. రాష్ట్రకూటుల పాలనా విశేషాలను, వారికి వేంగీ చాళుక్యులతో గల సంబంధాలను పరిశీలించండి.
3. పశ్చిమ చాళుక్యుల పాలనా విశేషాలతోబాటు, ఆంధ్ర దేశ రాజకీయాల్లో వారు నిర్వహించిన పాత్ర ఎట్టిది?

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. రెండో పులకేశి పాలనా విశిష్టతలను పేర్కొనండి.
2. మూడో గోవిందుని పాలనా ప్రాముఖ్యతను తెలపండి.
3. పశ్చిమ చాళుక్య విక్రమాదిత్యుని పాలనా విశేషాల ప్రసిద్ధి ఎట్టిది?
4. 'విక్రమాంక దేవ చరిత్ర' చారిత్రక ప్రాముఖ్యతను పేర్కొనండి.
5. ఆంధ్ర రాజకీయాలపై కర్ణాటక రాజ వంశాల ప్రభావాన్ని విశ్లేషించండి.

BRAOU

9.5 : ఉపయుక్త గ్రంథాలు

Altekar, A.S. : **Rashtrakutas and their times** (Poona, 1934)

Mazumdar, R.C. (ed). : **The Age of Imperial Kanauj, Bharatiya Vidya Bhavan, Vol. Iv** (Bombay, 1964)

Ramesh, K.V. : **Chalukyas of Vatapi** (Delhi, 1986)

Sastry K.A.N. : **The Colas** (Madras, 1955)

Suryanarayana, K. : **History of the Minor Chalukya Families in Medieval Andhra desa** (Delhi, 1986)

Satyanarayana, K. : **A Study of History and Culture of the Andhra, Vol. I.** (Delhi, 1975)

Krishna Rao, B.V. : **History of the Eastern Chalukyas of Vengi** (Hyderabad, 1973)

Venkataramanayya, N. : **The Eastern Chalukyas of Vengi** (Madras, 1950)

- do - : **The Chalukyas of L (v) emulavada** (Hyderabad, 1953)

Yazdani, G. (ed) : **The Early History of the Deccan** (oxford, 1960)

సోమశేఖరశర్మ, మల్లంపల్లి : తెలుగు సంస్కృతి, Vol.III, తెలుగు విజ్ఞాన సర్వస్వం పునస్సంశోధితం (హైదరాబాద్, 1983.)

వెంకటరమణయ్య, నేలటూరి : పల్లవులు - చాళుక్యులు (మద్రాస్, 1969)

వెంకట కృష్ణారావ్, భావరాజు : రాజరాజ నరేంద్రుడు (రాజమండ్రి, 1922)

హనుమంతరావ్, బి.యస్.ఎల్ : ఆంధ్రుల చరిత్ర (గుంటూర్, 1983)

రచయిత : డా. కొల్లూరు సూర్యనారాయణ

BRAOU

భాగం-10 : ఆంధ్ర దేశంలో చాళుక్య-చోళుల పాలన: చిన్న రాజ వంశాల ఉద్భవం

విషయక్రమం

10.0 : లక్ష్యాలు

10.1 : పరిచయం

10.2 : చాళుక్య - చోళులు (క్రీ.శ. 1076-1200)

10.3 : చిన్న రాజ వంశాల ఉద్భవం

10.3.1 : వెలనాటి రాజులు

10.3.2 :తెలుగు చోడులు

10.3.3 : హైహయులు

10.3.4 : చాళుక్య కుటుంబాలు

10.3.5 : చాగి వంశీయులు

10.3.6 : కొండ పడమటి రాజులు

10.3.7 : పరిచ్ఛేది రాజులు

10.3.8 : కోట రాజులు

10.4 : సంగ్రహంగా

10.5 : పరీక్ష నమూనా ప్రశ్నలు

10.6 : ఉపయుక్త గ్రంథాలు

BRAOU

10.0 : లక్ష్యాలు

నిరంతర సంఘర్షణలతో కర్ణాటక రాజకీయ శక్తుల్ని ఎదుర్కొంటూ, వేంగీ చాళుక్యులు ఆంధ్ర దేశంలో పాలించిన వివరాలను గత భాగాల్లో తెలుసుకొన్నాం. వాళ్ళ పాలన ముగిసేనా దగ్గర్నుండి, కాకతీయ యుగారంభం వరకు, ఆంధ్రుల చరిత్ర ఒక సంధి యుగం లాంటిది. చరిత్రకారులు దీనిని చాళుక్య-చోళ యుగమనీ, మాండలిక యుగమనీ వ్యవహరిస్తుంటారు. ఈ భాగాధ్యయనం ద్వారా, క్రీ.శ. 1076-1200 ల మధ్య పాలించిన చాళుక్య-చోళుల పాలనా విశేషాలను అవగాహన చేసుకోగల్గాలి. దీనితోబాటు, ఆంధ్ర దేశంలో సమకాలీనంగా ఉద్భవించిన పలు ప్రసిద్ధిగాంచిన చిన్న రాజ వంశాల పాలనకు సంబంధించిన విషయాలను గూడా గ్రహించగల్గాలి.

10.1 : పరిచయం

దక్షిణ దేశ రాజకీయాల్లో పశ్చిమ చాళుక్యుల ఆధిపత్యాన్ని ఎదుర్కొవటానికి, చోళ రాజరాజు దూర దృష్టితో పన్నిన రాజకీయ వ్యూహం, చాల వరకు సత్ఫలితాలనే యిచ్చింది. చోళ రాజరాజు కుమార్తె కుందవ్వను విమలాదిత్యునకు, చోళ రాజేంద్రుని కుమార్తైన అమ్మంగదేవిని రాజరాజ నరేంద్రుని కిచ్చి వివాహం చెయ్యటంలో, రాజకీయంగానూ, సంస్కృతీపరంగానూ వేంగీ చాళుక్యులు, తంజావూరు చోళులకు చాల సన్నిహితమయ్యారు. వేంగీ రాజకీయాల్లో స్వావలంబన పూర్తిగా నశించి, క్రమేపీ చోళుల ప్రాబల్యం బలపడింది. రాజరాజ నరేంద్రుని కొడుకు రాజేంద్రుడు, వేంగీ రాజ్యానికే కాక, చోళ సామ్రాజ్యాని క్కూడ వారసుడు కావటంతో, రెండు రాజ్యాలు విలీనం చెయ్యబడ్డాయి. వేంగీ చాళుక్యులకు పరంపరాగతంగా సంక్రమిస్తున్న వేంగీ రాజ్యాన్ని వదిలి, రాజేంద్రుడు 'కులోత్తుంగ' బిరుదాన్ని ధరించి, మాతామహో రాజ్యమైన చోళ దేశానికి వెళ్ళిపోయాడు. వేంగీ చాళుక్య రాజ్యం చోళ సామ్రాజ్యంతో విలీనమై, సువిశాలమైన చాళుక్య-చోళ సామ్రాజ్య మేర్పడింది. కులోత్తుంగ రాజేంద్రుడు చాళుక్య-చోళ వంశ స్థాపకుడయ్యాడు. వీభు కుమార రాజ ప్రతినిధుల్ని పంపి, వేంగీ రాజ్య వ్యవహారాలను నిర్వహిస్తున్నప్పుడే, తీరాంధ్రం లోని సామంత కుటుంబాలు బలపడి, విజృంభించాయి. కులోత్తుంగుడు వేంగి నుండి చోళ రాజ్యానికి పోవటం కూడ, ఈ మాండలికుల స్వతంత్ర వ్యవహారానికి కారణమని అనుకోవచ్చు.

10.2 : చాళుక్య - చోళులు (క్రీ.శ. 1076-1200)

వేంగీ చాళుక్య పాలకుల్లో చివరి వాడైన విజయాదిత్యుడు మరణించటంతో, వేంగీ రాజ్యపు రాజకీయ ప్రాధాన్యత నశించింది. అతని సమీప సోదరుని కొడుకైన రాజేంద్రుడు, చోళ సామ్రాజ్యాని క్కూడ వారసుడు కావటంతో, కులోత్తుంగ బిరుద నామంతో, అక్కడి నుండి పాలించటానికే ఇష్టపడి, చోళ రాజధానైన "గంగైకొండ చోళపురానికి" వెళ్ళిపోయాడు. వేంగీ రాజ్యం చోళ సామ్రాజ్యంలో అంతర్భాగమైంది. వేంగీ రాజ్యపు పాలనను నిర్వహించటానికి, చోళ రాజ్యం నుండి కులోత్తుంగ రాజేంద్ర చోళుడు తన కుమారుల్ని రాజప్రతినిధులుగా పంపించేవాడు. చాళుక్య, చోళ రాజ్యాలు రెండింటిని కలిపి పాలించటం వల్ల, కులోత్తుంగ రాజేంద్రుణ్ణి, అతని సంతతిని, చరిత్రకారులు చాళుక్య - చోళులని పేర్కొంటారు. వీరు చోళ రాజ్యం లోనే పుట్టి, పెరిగి, ద్రవిడ సంస్కృతినే జీర్ణించుకొని, వేంగీ పాలనకు రాజప్రతినిధులుగా రావటం వల్ల, వారితోపాటు ఎందరో వలస రావడం వల్ల, క్రమంగా ద్రవిడ సంస్కృతి, ఆచార వ్యవహారాలతో, ఆంధ్రుల సంస్కృతిలో, జీవన విధానంలో, ఎన్నో మార్పు లేర్పడ్డాయి.

రెండవ రాజేంద్ర చోళుని కుమార్తైన మధురాంతకి, కులోత్తుంగ రాజేంద్రుని పట్టపు రాణి. ఆమె ఒక్కరే కాక, అతనికి ఏతశ్చైవల్లభి, త్యాగవల్లి, త్రైలోక్యమహాదేవి, త్రిభువన మహాదేవి మొదలైన భార్య లెందరో ఉన్నారు. వీరందరి వల్ల ఆయనకు చాల మంది సంతానం కలిగారు. ఒక్క మధురాంతకి వల్లనే, ఏడుగురు కొడుకులు పుట్టారు. ఈతని కుమార్తెలలో ఒకరైన రాజసుందరిని, కళింగ దేశాన్ని పాలించే గంగ రాజరాజ దేవేంద్రవర్మ కిచ్చి వివాహం చేశాడు. వేంగీ రాజ్యానికి పంపబడ్డ కుమార రాజప్రతినిధులైన రాజరాజ ముమ్మడి చోడుడు, రాజరాజ చోడగంగు, వీరచోడుడు, విక్రమచోడుడు, ఇతనికి మధురాంతకి వలన జన్మించినవారేనని తెలుస్తోంది. వీరందరూ విష్ణువర్ధన, సర్వలోకాశ్రయ

BRAOU

మొదలైన తూర్పు చాళుక్యుల బిరుదాల్ని ధరించి, వేంగీ రాజప్రతినిధులుగా వ్యవహరించినవారే. అయితే, అవే బిరుదాల్తో ఉన్న వీరి శాసనాన్ని గుర్తించటం లోను, సమన్వయం చేయటం లోను, చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి.

చివరి వేంగీ చాళుక్య రాజైన సప్తమ విజయాదిత్యుడు మరణించి, వేంగీ రాజ్యం చోళ సామ్రాజ్య అంతర్భాగం కాగానే, వేంగీ రాజ్య పరిపాలనకు, కులోత్తుంగ చోళుని రెండో కొడుకైన రాజరాజ ముమ్మడి చోడుడు, మొదటి రాజప్రతినిధిగా పంపబడ్డాడు. వేంగీ రాజ్యాధిపత్య స్వీకరణ సూచనగా, అతని పట్టాభిషేకం క్రీ.శ. 1076 లో జనవాధ నగరంలో జరిగింది. జనవాధ నగరాన్ని గుర్తించటంలో, చరిత్రకారుల్లో వేరు వేరు అభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ, అది ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా లోని సామర్లకోట కావటానికి, పొచ్చు అవకాశముంది. అతనికన్న పెద్ద వాడైన రాజరాజ చోడగంగు ఉండగా, రాజరాజ ముమ్మడి చోడుడు ఏ కారణాల వల్ల ముందుగా వేంగికి పంపబడ్డాడో తెలియదు. రాజరాజ ముమ్మడి చోడుడు వేంగీ రాజ్య పాలనను నిర్వహించింది స్వల్ప కాలమే. అతను తన శాసనాల్లో, తన తర్వాత వచ్చిన తన సోదరుల వలె కాకుండా, తన రాజ్య కాల సంవత్సరాలను పేర్కొన్నాడు. వాస్తవాలు తెలియనప్పటికీ, రాజ్య సుఖం కన్న పెద్దల పాద సేవయే సుఖమని భావించి, ముమ్మడి చోడుడు స్వల్ప పాలన తోనే వేంగిని విడిచిపెట్టి, తండ్రి దగ్గరకు తిరిగి వెళ్ళిపోయాడని, వీరచోడుని శాసనం వర్ణిస్తుంది. తన స్వల్ప పాలనా కాలంలో ముమ్మడి చోడుడు వేంగిలో ఉండగా, ఈతనికి పశ్చిమ చాళుక్యుల తోను, కళింగ గంగుల తోను, యుద్ధం సంభవించింది. కళింగలో రాజరాజ దేవేంద్రవర్మ మరణించి, అతని కొడుకైన అనంతవర్మ చోడ గంగదేవుడు బాలుడు కావటంతో, అతని దాయాదులు పశ్చిమ చాళుక్యుల సహాయంతో సింహాసనాన్ని ఆక్రమించుకోవటానికి ప్రయత్నించారు. అనంతవర్మ చోడగంగుని తల్లి రాజసుందరి, చోళ వంశజైన సంబంధాన్ని బట్టి, రాజరాజ ముమ్మడి చోడుడు కళింగపై దండెత్తి, శత్రువుల్ని చంపి, అనంతవర్మ చోడగంగును కళింగ సింహాసనంపై కూర్చోబెట్టాడు.

ఆ కళింగ దండయాత్రలో తనకు తోడ్పడిన ముమ్మడి భీముడనే సామంతుడికి, తన వేంగీ రాజ్యంలో పన్నెండు గ్రామాల ఆధిపత్యాన్నిచ్చి సత్కరించాడు. తన శాసనాల్లో తన తండ్రి కులోత్తుంగ చోళుని రాజ్య పాలనా సంవత్సరాలను పేర్కొనక, తన పాలనా సంవత్సరాలను పేర్కొనటాన్ని బట్టి, వేంగిలో ఈతడు స్వతంత్రించ ప్రయత్నించి ఉంటాడని, **ఆ కారణం వల్లనే** స్వల్ప పాలనా కాలం లోనే ఇతడు తిరిగి చోళ మండలానికి తీసుకుపోబడ్డాడని, కొందరు చరిత్రకారులు అనుమానిస్తారు. ముమ్మడి చోడుడు చోళ రాజ్యానికి తిరిగి వెళ్ళిపోగానే, అతని సోదరుడైన వీరచోడుడు వేంగీ రాజప్రతినిధిగా జనవాధ పురానికి వచ్చాడు.

వీర చోడుడు క్రీ.శ. 1078 నుండి 1084 వరకు వేంగిలో ఉన్నాడు. ఇతడు వేంగిలో ఉన్న సమయం లోనే, పశ్చిమ చాళుక్యులు వేంగిపై దండెత్తి, ద్రాక్షారామం వరకు వచ్చారు. వెలనాటి గొంకయ్య బంధువైన వెదురుడు, కళింగ సేనాపతైన బణపతి, మొదలైన వారి సహాయంతో, వీరచోడుడు పశ్చిమ చాళుక్యుల్ని తరిమికొట్టాడు. ఈ దాడిలో తనకు ఎక్కువగా తోడ్పడ్డ వెలనాటి వెదురుణ్ణి, గౌతమీ-వశిష్ఠల మధ్యనున్న భూభాగాలకు అధిపతిగా నియమించాడు.

వీరచోడుడు వేంగిని వదిలి, తిరిగి చోళ రాజ్యానికి వెళ్ళిన తర్వాత, కులోత్తుంగ చోళుడు తన పెద్ద కొడుకైన రాజరాజ చోడగంగుని, రాజప్రతినిధిగా వేంగికి పంపించాడు. స్వల్ప వ్యవధుల్లో ఎంచేత వేంగీలో రాజప్రతినిధుల్ని మారుస్తుండే వారో తెలీదు. ఇతను రాజ్యాన్ని నిర్వహిస్తున్నప్పుడే,

B.RAO

వేంగీ రాజ్యంలో చాళుక్య చోళుల ఆధిపత్యానికి ప్రమాదం కలిగింది. చక్రకూట రాజైన సోమేశ్వరుడు కులోత్తుంగ రాజేంద్ర చోడుని సార్వభౌమత్వాన్ని ధిక్కరించి, తన తండ్రికి జరిగిన అవమానానికి ప్రతీకారం చేసే ఏర్పాట్లలో ఉన్నాడు. చాళుక్య చోళులకు వ్యతిరేకంగా జరుగుతున్న అతని ప్రయత్నాలకు పశ్చిమ చాళుక్యుల, పరమార వంశీకుల సహకారముంది. ఆ సోమేశ్వరుని తోడి ఘర్షణలో, చోళ సైన్యాలు పరాజయం చెందాయి. ఈ సందర్భంలో రాజరాజ గంగు మరణించి వుంటాడని, కొందరు చరిత్రకారుల అభిప్రాయం.

రాజరాజ చోడ గంగు మరణంతోపాటు, చక్రకూట సోమేశ్వరుని చేతిలో ఓటమి చెందటం వలన, చాళుక్య చోళుల ప్రతిష్ట కొంత వరకు దెబ్బతింది. వేంగీ రాజ్యానికి ప్రాతినిధ్యం వహించటానికి, కులోత్తుంగుడు తిరిగి వీరచోడుడిని పంపించాడు. క్రీ.శ. 1089లో వీరచోడుడు మళ్ళీ వేంగికి రాజప్రతినిధిగా వచ్చాడు. సోమేశ్వరుని దాడిలో కోల్పోయిన తమ ప్రాంతాలను తిరిగి జయించటం కూడ, వీరచోడుడిని మరల వేంగికి పంపటంలో ఉద్దేశం కావచ్చు. వీరచోడుడు ఈసారి రాజప్రతినిధిగా రావటంతో, తమిళ ప్రాంతాల నుండి ఎంతో మంది బ్రాహ్మణ కుటుంబాల వాళ్ళు వచ్చి, తీరాంధ్రంలో స్థిరపడ్డారు. వాళ్ళకు 'చతుర్వేది మంగళం' పేరుతో, అగ్రహారాలను రాజే ఇచ్చాడు. ఇలా వచ్చిన కుటుంబాల వల్ల, ఆంధ్ర దేశంలో క్రమంగా తమిళ మత సంస్కృతులు, సంప్రదాయాలు వ్యాప్తి చెందాయి. బ్రాహ్మణులేకాక, ఎన్నో ఇతర కుటుంబాల వాళ్ళు కూడ ఈ కాలంలో తమిళ దేశం నుండి వచ్చి, ఆంధ్ర దేశంలో నివాసాలేర్పర్చుకొన్నారు.

కాని, వీరచోడుడు రెండో సారి వేంగికి రావటం వల్ల, చాళుక్య చోళుల ఉద్దేశం నెరవేర లేదు. చక్రకూటం వాళ్ళతో కొనసాగిన పోరాటం, చివరకు అతని వినాశనానికే దారితీసింది. క్రీ.శ. 1094 లో చక్రకూట రాజైన సోమేశ్వరుడు వేంగిపై దండెత్తి, వీరచోడుణ్ణి చంపి, రాజధానైన జననాథపురాన్ని దగ్ధం చేశాడు. పాత కక్షల కారణంగా, పరమార వంశీయులు, పశ్చిమ చాళుక్యులు ఈ దాడిలో చక్రకూటం వారి పక్షం వహించారు. దీనితో, వేంగి రాజ్యం అల్లకల్లోలమై, ఎంతో మంది సామంతులు స్వతంత్రించటానికి అవకాశమేర్పడింది. కృష్ణా-గోదావరి మధ్య ప్రాంతాల్లో సామంతుడుగా ఉన్న కొలని భీముడు, చాళుక్య చోళుల అధికారాన్ని ధిక్కరించాడు. అదే విధంగా, కళింగలో కూడ చాళుక్య-చోళుల అధికారం, ఉనికిని కోల్పోసాగింది. ఇలాంటి పరిస్థితుల్లో తన ప్రాబల్యాన్ని నిలుపుకోవటానికి, కులోత్తుంగ రాజేంద్ర చోడుడు కళింగపై దండయాత్ర చేశాడు. అయితే, కళింగపై దండయాత్ర లెన్నిసార్లు జరిగాయన్న విషయంలో, చరిత్రకారుల్లో అభిప్రాయ భేదాలున్నాయి. మొదటి దండయాత్ర గోదావరి ప్రాంతం దాగా సాగి, కొలని భీముడు సంహరింపబడ్డాడనీ; రెండో దండయాత్రలో కళింగ రాజైన అనంత శర్మ చోడగంగు ఓడింపబడ్డాడనీ, ఆచార్య కె. ఎ. నీలకంఠశాస్త్రిగారి అభిప్రాయం. కాని, శాసనాల్ని బట్టి చూస్తే, కులోత్తుంగుడు కళింగ మీద ఒకే దండయాత్ర చేసినట్లు తెలుస్తోంది. కళింగాన్ని అనంతవర్మ చోడగంగు తండ్రి దేవేంద్రవర్మ పాలిస్తూ, పశ్చిమ చాళుక్యుల ప్రోత్సాహంతో, వేంగీ రాజ్యంతో తరచు ఘర్షణలను రేపటం వల్ల, అతనిని నిరోధించటానికి ఆ దండయాత్ర సాగిందని, మల్లంపల్లి సోమశేఖర శర్మగారి అభిప్రాయం. కులోత్తుంగుని ఆస్థాన కవైన జయంగొండార్ రాసిన **'కళింగత్తుప్పరణి'** కావ్యానికి, ఈ కళింగ దండయాత్రయే కథా వస్తువు. కళింగలో శత్రువైన అనంతవర్మని కులోత్తుంగుడు జయించినట్టు, అందులో వర్ణించబడింది. చాళుక్య చోళుల ఆ కళింగ దండయాత్రను, వాళ్ళ సామంతుడైన కరుణాకర తొండమాన్ అనే పల్లవ రాజు నిర్వహించాడు. కళింగ దండయాత్ర జరిగాక, అతనిచ్చిన ద్రాక్షారామ శాసనంలో, అతను కళింగాన్ని భస్మీపటలం చేసి, దేవేంద్రవర్మను పారద్రోలి, ఓడ్ర దేశ సరిహద్దులో జయస్తంభాన్ని నిలిపినట్లు తెల్పబడింది.

BRAOU

కులోత్తుంగుని కొడుకైన విక్రమచోళుడు, హైహయ, దుర్జయ, కోట వంశాలకు చెందిన సామంతులు, ఆ కళింగ దండయాత్రలో పాల్గొన్నారు. అసలు విక్రమచోళుడే ఆ దండయాత్ర సమయానికి వేంగీ రాజప్రతినిధని, కొందరు చరిత్రకారులు భావిస్తారు. సింహాచలం లోని కులోత్తుంగుని శాసనాన్ని బట్టి, క్రీ.శ. 1099 నాటికి ఆ ప్రాంతాలన్నీ అతని అధికారం లోనే ఉన్నట్టు తెలుస్తున్నప్పటికీ, కళింగ దండయాత్ర వల్ల చాళుక్య చోళులకు శాశ్వతమైన లాభం కలుగ లేదు.

కులోత్తుంగుని కళింగ దండయాత్ర సమయంలో, వేంగీ రాజ్య వ్యవహారాలు వీరపెర్మాడి దేవుడి పర్యవేక్షణలో సాగాయి. క్రీ.శ. 1093 నుండి 1107 వరకు సర్వలోకాశ్రయ, విష్ణువర్ధన మొదలైన సంప్రదాయక బిరుదాల్ని ధరించి, ఒక వీరపెర్మాడి దేవుడు వేంగిని పాలించినట్టు తెలుస్తోంది. ఈతడెవ్వరో, కులోత్తుంగునితో ఇతని కున్న సంబంధ మేమిటో తెలియదు.

వీరపెర్మాడి దేవుడి తర్వాత, పరాంతక చోళుడు వేంగీ రాజ ప్రతినిధి అయ్యాడు. వేంగీ రాజ్య వ్యవహారాలను పర్యవేక్షించటానికి వచ్చిన చాళుక్య చోళ ప్రతినిధుల్లో, పరాంతకుడే చివరి వాడు. ఈతని బిరుదాల్ని బట్టి, కులోత్తుంగుడు ఇతనిని తన తర్వాత చోళ సింహాసనానికి వారసునిగా గుర్తించి, యువరాజ పట్టం కట్టినట్టు భావిస్తున్నారు. తీరాంధ్రం లోని ఎందరో సామంతులు దాక్షారామం లోని దేవుని సన్నిధిలో సమావేశమై, పరాంతకుడే తమ ఏలికనీ, అతణ్ణి తప్ప ఇతరుల్ని తాము సేవించేది లేదని ప్రకటిస్తూ, కొంత విలక్షణంగా ప్రతిజ్ఞలను చేశారు. సామంతుల విధేయతలు ప్రశ్నార్థక మౌతున్న, ఆ రోజుల్లో, దేవుడి సాన్నిధ్యంలో చేసిన వాళ్ళ ప్రమాణాలు చివరి కెలా పరిణమించినా, మధ్య యుగాల చరిత్రలో ప్రత్యేకతను చాటుకుంటాయి. బహుశ పరాంతకుడి కాలంలో వేంగి మీద పశ్చిమ చాళుక్యుల దండయాత్ర లెక్కువై, రాజ్యం అల్లకల్లోలం కావటం, ఇలా సామంతుల్ని కట్టడి చేయాల్సి రావటానికి కారణమనుకోవచ్చు.

ఇదే సందర్భంలో, చోళ సింహాసన వారసత్వం కోసం, విక్రమ చోళ - పరాంతకుల మధ్య, పోటీ ఏర్పడినట్టు భావించబడుతోంది. ఆ ఘర్షణలో, విక్రమ చోళునికి తల్లి వంక నున్న బంధుత్వాన్ని బట్టి, హోయసాలుల సహాయం లభించింది. క్రీ.శ. 1117 ప్రాంతంలో హోయసాలులు వేంగిలో పరాంతకుడి మీద దండెత్తటానికి, అదొక కారణమై ఉంటుంది. దీని వలన అయితేనేం, పరాంతకుడు అనేక యుద్ధాలను చేయాల్సొచ్చింది. వాటన్నింటిపై పూర్తిగా నిమగ్నం కావటంతో, ఆంధ్ర రాజ్య వ్యవహారాలపై కొంత అదుపు తప్పింది. పరిస్థితి చేయిదాటి పోకుండా, కులోత్తుంగుడు ఆంధ్ర దేశ రాజకీయాల్లో అప్పటి వరకు విశ్వాసపాత్రంగా ఉండి, తమను బలపరుస్తున్న మాండలికులనే, తమ ప్రతినిధులుగా నియమించాడు. దీనితో, ఆంధ్ర దేశ రాజకీయాల్లో చిన్న రాజ వంశాలు ప్రధాన పాత్ర వహించటం మొదలైంది. దీనినే, మాండలిక యుగ మనికూడ అంటారు. అప్పటి నుండి కాకతీయుల కాలం వరకు, ఆంధ్ర దేశ రాజకీయాల్లో వెలనాటి రాజులు, చాళుక్య చోళుల వారసులుగా, చెప్పకోదగిన పాత్రను నిర్వహించారు.

10.3 : చిన్న రాజ వంశాల ఉద్భవం

వేంగీ చాళుక్యులు, తమకెన్నో విజయాల్లో తోడ్పడి, విశ్వాసంతో సైనిక సేవలందించిన వివిధ కుటుంబాల వాళ్ళ కేవిధంగా రాజ్య భాగాలిచ్చి, సామంతులుగా నియమించారో, ఆ భాగంలో తెలుసుకొన్నాం. ఆ సామంతులు తమ రాజులకు యుద్ధాల్లో తోడ్పడుతూ, తమ తమ రాజ్య భాగాల్ని వంశపారంపర్యంగా పాలించేవాళ్ళు. స్థానిక పరిపాలన చాల వరకు వారి ఆధీనంలోనే ఉండేది.

BRAOU

చందోలు రాజధానిగా, గుంటూర్ జిల్లా లోని ప్రాంతాల్ని వెలనాటి రాజులు; కోనసీమ, పల్నాడును హైహయ కుటుంబాలు; నెల్లూర్, కొణిదెన, పొత్తపి ప్రాంతాల్ని తెలుగు చోళులు; జనవాధపురం, ఎలమంచిలి, శ్రీకూర్మం ప్రాంతాల్ని చాళుక్య కుటుంబాలవాళ్ళు; కోరుకొండ ప్రాంతాన్ని మల యులు; నాదెండ్ల ప్రాంతాన్ని కొండపడమట్లు; ధరణికోట ప్రాంతాన్ని కోట రాజులు; కొల్లిపాక ప్రాంతాన్ని పరిచ్ఛేదులూ, పాలించేవారు. వీళ్ళల్లో రమారమి అందరూ చతుర్థ కులం వాళ్ళే కావటం, దిగువ వర్ణాల సామాజిక పురోగతిని సూచిస్తుంది. వీళ్ళు రాజ లాంఛనాలను సాధించుకొని, స్వతంత్రంగానే తమ తమ ప్రాంతాల్ని పాలించేవాళ్ళు. అయితే, అది పరిమిత స్వతంత్రం మాత్రమే. సార్వభౌములకు కప్పం చెల్లించటం, అవసరమైనపుడు యుద్ధాల్లో పాల్గొనటం లాంటి విషయాల్లో, వీళ్ళకు పరాధీనత ఉండేది. వారసత్వ తగాదాల్లో అవకాశాన్ని బట్టి, భిన్న పక్షాల్ని సమర్థించి, వాళ్ళ కలహాన్ని రెచ్చకొట్టడంలో, ఆ సామంతుల పాత్ర తక్కువేం కాదు. వాళ్ళు బలపడుతుండటంతో, కేంద్రాధికారం క్రమంగా బలహీనపడటం, ఈ యుగ విశేష పరిణామం!

10.3.1 : వెలనాటి రాజులు

చాళుక్య చోళుల కాలానికి, రాజకీయంగా ప్రాముఖ్యత వహించిన సామంత పాలక వంశాల్లో గుర్తింపు పొందిన కుటుంబం, వెలనాటి రాజులు. వీరినే, వెలనాటి చోడులని కూడ పేర్కొంటుంటారు.

ఎన్నో పెద్ద రాజ వంశాల లాగే, వెలనాటి రాజులు కూడ, వాళ్ళ పూర్వ చరిత్రను శాసనాల్లో తెలిపారు. వీళ్ళ పూర్వీకులు మధ్య దేశం లోని కీర్తిపురాన్ని పాలిస్తుండేవారనీ, మల్లవర్మ కాలంలో దక్షిణ దేశానికి వచ్చి, త్రిలోచన పల్లవుని వల్ల ఆర్వేలనాడు రాజ్యాన్ని పొందారనీ, తెలుస్తోంది. ఇప్పటి గుంటూర్, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలే అప్పట్లో ఆర్వేలనాడు, లేక వెలనాడని పిలువబడేవి. ఆ ప్రాంతాల్లో, చందోలు రాజధానిగా వీరి పాలన సాగింది. కనుక, వీరిని వెలనాటి రాజులుగా వ్యవహరిస్తారు. తమ ప్రభువులైన చాళుక్య చోళుల మీద వీరి కున్న గౌరవం కొద్దీ, అందునా ముఖ్యంగా, గొంకరాజు కుమారుణ్ణి కులోత్తుంగ రాజేంద్ర చక్రవర్తి పుత్ర భావంతో చేరదీసిన దగ్గర్నుండీ, వారి 'చోళ' శబ్దాన్ని వీళ్ళు ధరించటం మొదలు పెట్టారు. పదకొండో శతాబ్ది మధ్య కాలానికి, వీళ్ళ పాలన కృష్ణా- గోదావరీ ప్రాంత భూములకు విస్తరించింది.

ఆంధ్ర దేశ చరిత్రలో వెలనాటి రాజుల రాజకీయ ప్రవేశం వేంగీ చాళుక్యుల కాలం లోనే జరిగింది. మొదటి చాళుక్య భీముని కాలం నుండి, వీళ్ళ పూర్వీకులు రాజోద్యోగులుగా వేంగీ ప్రభుత్వంలో ఉండేవారు. వీరికి గుడివాడ ప్రాంతాల మీద ఆధిపత్యాన్ని కూడ చాళుక్యులే ఇచ్చారు. రాజరాజనరేంద్రుడి తర్వాత వేంగీ రాజ్యంలో చెలరేగిన అల్లకల్లోలాల్లో, వెలనాటి రాజులు కులో త్తుంగ రాజేంద్ర చోళునికి సహాయపడి, అతని ఆదరాభిమానాలను సంపాదించారు. వేంగీ పాలనకు నియమించబడ్డ చాళుక్యచోళ రాకుమారులకు పరిపాలనా వ్యవహారాల్లో విశ్వాసంతో తోడ్పడ్డారు. వెదు రుడు వీరచోడునికి యుద్ధాల్లో ఎలా సహాయపడి, ప్రత్యుపకారంగా గోదావరీ ప్రాంతంలో రాజ్యభాగాన్ని పొందాడో, లోగడ తెలుసుకొన్నాం. ఆ వెదురుని తండ్రైన గొంకరాజే, వెలనాటి రాజ వంశాన్ని స్థాపించాడు. ఇతని పరిపాలన, దక్షిణంలో గుండ్లకమ్మ నుండి, పశ్చిమంలో త్రిపురాంతకం దాకా సాగింది. మహామండలేశ్వర, చాళుక్యరాజ్య మూలస్తంభ, లాంటి బిరుదు లితని కుండేవి. కులోత్తుంగ రాజేంద్ర చోడ చక్రవర్తి మీద నున్న గౌరవం కొద్దీ, తన కొడుక్కి చోడరాజని పేరు పెట్టాడు. వేంగిలో తన అవసరాన్ని బట్టి, కులోత్తుంగ చక్రవర్తి ఆ చోడ రాజును పుత్ర భావంతో చేరదీసి, కొంత ప్రాముఖ్యత సీయడంతో, అతనే కులోత్తుంగ రాజేంద్రచోడుడుగా ప్రసిద్ధికెక్కాడు. కళింగ దండయాత్రలో

BRAOU

ఇతర మాండలిక రాజుల్ని కూడగట్టి, చాళుక్య చోళుల విజయానికి ఈయన తోడ్పడ్డాడు. కాని, తర్వాత విక్రమచోళ, పరాంతకులు, చాళుక్య చోళ సింహాసనం కోసం యుద్ధాలకు దిగడంతో, పశ్చిమ చాళుక్యులకు అవకాశం కలిగింది. క్రీ.శ. 1115లో చాళుక్య చోళుల్ని వేంగి నుండి తరిమివేసే ఉద్దేశంతో, అనంతపాల దండనాయకుడి ఆధిపత్యంలో పెద్ద సైన్యాన్ని వేంగికి, పరాంతకుడి పైకి పంపించారు. విశ్వాసపాత్రులైన ఇతర సామంతుల సహాయంతో, వెలనాటి రాజేంద్ర చోడుడు వాళ్ళను ఎదిరించినా, ప్రయోజనం లేకపోయింది. పరాంతకుడు అపజయం పాలై, మరణించాడు. ఆంధ్ర దేశం మొత్తం కల్యాణి చాళుక్యుల వశం కావటంతో, వెలనాటి రాజులు కూడ ఆరో విక్రమాదిత్యుని ఆధిపత్యాన్ని అంగీకరించారు. కులోత్తుంగుని అనంతరం విక్రమచోళుడు, చాళుక్య చోళ సింహాసన మెక్కినా, ఆంధ్ర ప్రాంతాల నుండి కల్యాణి చాళుక్యుల్ని పారద్రోలటం, అతనికి సాధ్యం కాలేదు.

క్రీ.శ. 1126లో కల్యాణి రాజ్యంలో విక్రమాదిత్యుడు మరణించి, మూడో సోమేశ్వరుడు రాజు కావటంతో, ఆంధ్ర దేశం లోని కొందరు సామంతులు తిరగబడి, స్వతంత్రించారు. వేంగీ చాళుక్యుల్లోని బేత విజయాదిత్యుని సంతతివాడైన విజయాదిత్యుడు, జననాథపుర చాళుక్య వంశాన్ని స్థాపించి, కళింగ రాజైన అనంతవర్మ చోడగంగు సహాయంతో, గోదావరీ ప్రాంతాల్ని ఆక్రమించాడు. పదమూడో శతాబ్ది మధ్య కాలం దాకా, ఆ ప్రాంతాలన్నీ ఆ చాళుక్య శాఖ పాలన లోనే ఉన్నాయి.

వెలనాటి రాజులు, పల్నాటి హైహయులు, కొండపడమటి దుర్జయులు మొదలైన వారి కోరిక మీద, కల్యాణి చాళుక్యుల్ని తరిమి వేయటానికి, విక్రమచోడుడు ప్రయత్నాలను ముమ్మరం చేశాడు. రెండో కులోత్తుంగుని నాయకత్వంలో చాళుక్య-చోళ సైన్యమొచ్చి, సామంతులందరి తోడ్పాటుతో, మున్నేరు దగ్గర, క్రీ.శ. 1132 ప్రాంతంలో, కల్యాణి చాళుక్యుల్ని ఓడించింది. కాని, ఆ ఫలితం తాత్కాలికమే అయింది. ఆంధ్ర ప్రాంతంలో కల్యాణి చాళుక్యుల పాలన అంతం కాలేదు.

వెలనాటి రాజేంద్రుని తర్వాత రెండో గొంక రాజు రాజ్యానికి వచ్చాడు. యుద్ధ నిర్వహణలో ఆరితేరిన ఇతని సహాయంతో, రెండో కులోత్తుంగుడు మళ్ళీ వేంగి మీద దండెత్తాడు. గోదావరీ తీరంలో జరిగిన పెద్ద యుద్ధంలో, కల్యాణి దండనాయకులు ఓడిపోయారు. క్రీ.శ. 1135లో జరిగిన యీ గోదావరీ యుద్ధంతో, వేంగీ రాజ్యంలో కల్యాణి చాళుక్యుల అధికారం ముగిసింది. రెండో కులోత్తుంగుడు రాజ్యానికి వచ్చాడు. అతనికి దక్షిణ దేశ రాజకీయాల్లో ఉన్న ఆసక్తి కారణంగా, వెలనాటి గొంకరాజు సమర్థత తెలిసినవారు కనుక, అతణ్ణి శ్రీశైల-మహేంద్రగిరుల మధ్యనున్న రాజ్యానికి సామంతుడిగా ప్రకటించాడు. అప్పటి నుండి ఆంధ్ర దేశ రాజకీయాల్లో చాళుక్య చోళుల ప్రమేయం తగ్గింది. కాని, వెలనాటి గొంకరాజుకు లభించిన అధికారం, తీరాంధ్రం లోని కొందరు మాండలికులకు ఇష్టం లేకపోయింది. అలాంటి వారు ధిక్కరించటంతో, తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవటానికి వెలనాటి రాజులెన్నో యుద్ధాలను చేయాల్సొచ్చింది. కొణిదెన, నెల్లూరీ ప్రాంతాల్లో నున్న తెలుగు చోడ కుటుంబాలు కొల్లేరు ప్రాంతం లోని కొలనిమాండలికులు, కోనసీమ, పల్నాటి ప్రాంతాల లోని హైహయ వంశాల్లాంటివన్నీ, చివరకు వెలనాటి రాజుల ఆధిపత్యాన్ని గుర్తించాయి. కాని, జననాథపురం కేంద్రంగా పాలిస్తున్న చాళుక్య వంశం వాళ్ళు, కాకతి వంశం వాడైన రెండో ప్రోలరాజు తోడ్పాటుతో, వెలనాటి వారి అధికారానికి అడ్డు నిల్చారు. అప్పటికే తెలంగాణాలో విస్తరించి, తీరాంధ్రంలోకి ప్రవేశించటానికి సిద్ధమౌతున్న కాకతీయులు, వెలనాటి రాజుల ప్రాబల్యాన్ని సహించ లేదు. తీరాంధ్రం లోని చాళుక్య కుటుంబాల సహాయంతో తమ అధికారాన్ని నెలకొల్పే ప్రయత్నంలో, ప్రోలరాజు వెలనాటి రాజుల్ని ఎదిరించాడు కాని, వెలనాటి యువ రాజైన రెండో రాజేంద్రుడు, ప్రోలరాజుని చంపి, కాకతీయ సైన్యాన్ని తరిమికొట్టాడు.

BRAOU

ఆంధ్ర దేశ రాజకీయాల్లో వెలనాటి చోడులకు స్వతంత్ర ప్రతిపత్తి రెండో రాజేంద్రచోడుని కాలంలోనే ఏర్పడింది. చాళుక్యచోళ సార్వభౌముడైన రెండో రాజాధిరాజు బలహీనుడు కావటం వల్ల, కప్పం చెల్లించటం మాని, రాజేంద్రచోడుడు వెలనాటి రాజ్యాన్ని స్వతంత్రం చేశాడు. రాజ్యానికి రాగానే, తన అధికారాన్ని గుర్తించక, తీరాంధ్రం లోని చాళుక్య కుటుంబాలతోపాటు, తిరుగుబాటు చేసిన మాండలిక కుటుంబాలన్నింటిపై దండయాత్ర చేశాడు. కోనహైహయులు, కొలని మాండలికులు, జననాధపుర చాళుక్యులు మొదలైన వారంతా ఓడిపోయి, వెలనాటి వారి ఆధిపత్యానికి లోబడ్డారు. రాజేంద్రచోడుడీ విధంగా తన రాజ్యాన్ని సుస్థిరంచేసుకుంటున్నప్పుడే, కర్ణాటకలో కల్యాణి చాళుక్యుల్ని పడగొట్టి, కాలచురి బిజ్జలుడు రాజ్యాన్ని ఆక్రమించాడు. బిజ్జలుడు నెల్లూర్ తెలుగు చోడులకు మిత్రుడు కావటంతో, నెల్లూర్ ప్రాంతాల నుండి వెలనాటి చోడుల్ని వెళ్ళగొట్టటానికి, క్రీ.శ. 1179 లో తన కొడుకు సోమేశ్వరుని నాయకత్వంలో, పెద్ద సైన్యాన్ని పంపించాడు. కాని, కొచ్చెర్లకోట దగ్గర జరిగిన తీవ్ర యుద్ధంలో వెలనాటి సైన్యం, కర్ణాటక సైన్యాన్ని తరిమికొట్టి, శ్రీశైలం వరకు ఆక్రమించింది. వెలనాటి వంశీయులందరిలోకి, రెండో రాజేంద్రచోళుని కాలంలో రాజ్యం అత్యున్నత స్థితి కొచ్చినా, ప్రతిష్టను కోల్పోవటం కూడ, అప్పటి నుండే మొదలైంది. వెలనాటి రాజుల బంధువులు, సామంతులైన పల్నాటి హైహయుల కుటుంబ కలహం వల్ల ఏర్పడ్డ పల్నాటి యుద్ధం కారణంగా, వెలనాటి రాజ్యం సంక్షోభానికి గురైందని, కొందరు చరిత్రకారులు భావిస్తారు.

ఈ సందర్భంలో పల్నాటి యుద్ధాన్ని గురించి కొంత వివరణ అవసరం. ఇది పల్నాటి ప్రాంతాన్ని పాలించిన హైహయుల మధ్య జరిగిందని చెప్పబడుతున్న కుటుంబ కలహం. అయితే, దీనికి ఏవిధమైన శాసనాధారం లేదు. పందొమ్మిదో శతాబ్దంలో, జనశ్రుతులాధారంగా ములుగు వీరభద్ర కవి రచించిన **"పలనాటి వీర భాగవత"** మొక్కటే, ఆ యుద్ధపు వివరాలను తెలియజేస్తూంది. అయితే, ఆ గ్రంథం, యుద్ధం జరిగిందన్న కాలానికి బాగా అర్వాచీన కాలానికి చెందిన గ్రంథం కనుక, దాని లోని అంశాలన్నీ సందేహాస్పదాలే. శ్రీనాథకవి ఆ కథను ద్విపద రూపంలో రాసినట్లు కొందరంటున్నా, చరిత్రకారుల్లో ఈ విషయమై తీవ్రమైన అభిప్రాయ భేదాలున్నాయి. అంచేత, అలాంటి జనశ్రుతుల్లోని గాధల్ని శ్రద్ధగా పరిశీలిస్తే గాని, వాటి చారిత్రకాంశాలు బయటపడవు.

రెండో రాజేంద్రచోడుని మరణం, ఆంధ్ర ప్రాంతం మీద కాలచుర్యుల, కాకతీయుల దండయాత్రల కారణంగా, వెలనాటి రాజ్యం సంక్షోభానికి గురైంది. మల్లికార్జున పండితుడు, వీళ్ళ రాజధానైన చందోలు నగరం నాశనమయ్యేట్లు శపించాడని, కొన్ని కథలు ప్రచారంలో ఉన్నాయి.

వెలనాటి రాజులు బలహీనపడటంతో, కాకతీయులు ఒక్కొక్కటిగా సామంత వంశాలన్నింటిని తమ అధీనం చేసుకోసాగారు. ధరణికోటను పరిపాలిస్తున్న కోట రాజులు, నాదెండ్ల రాజధానిగా పాలిస్తున్న కొండపడమటి దుర్జయులు, వరుసగా కాకతీయుల ఆధిపత్యానికి తలొంచారు. వెలనాటి పృథ్వీశ్వరుడు తిరిగి బలపడుతుండటంతో, గణపతిదేవుని సైన్యాలు నెల్లూర్ తెలుగు చోడుల సహాయంతో, పృథ్వీశ్వరుని ఓడించి, వధించాయి. దీనితో, వెలనాటి చోడ వంశం బలహీనపడి, క్రమంగా అంతరించింది.

10.3.2 : తెలుగు చోడులు

వెలనాటి రాజుల ఆధిపత్యాన్ని అవసరాన్ని బట్టి అంగీకరిస్తూ, వీలైనప్పుడు ప్రతిఘటిస్తూ, ఉత్తర తీరాంధ్రం లోని ఎందరో సామంతులు రాజకీయాలను నడిపించారు. దక్షిణ తీరాంధ్రానికి వస్తే, వెలనాటి రాజుల్ని మొదటి నుండి ప్రతిఘటిస్తూ, తమ ఉనికిని చాటుకున్న వంశం, తెలుగు చోడులు.

BRAOU

ఆంధ్ర దేశ చరిత్ర లోనే కాక, దక్షిణ దేశ రాజకీయాల్లోనే సుమారొక శతాబ్దిపాటు, నెల్లూర్, లేక విక్రమసింహపురం కేంద్రంగా, తెలుగు చోడులు చెప్పుకోదగిన పాత్రను నిర్వహించారు. ప్రస్తుత నెల్లూర్, కడప, చిత్తూర్, చెంగల్పట్టు, జిల్లాలు వీరి రాజ్యంలో ఉండేవి.

తెలుగు చోడులు తను మూల పురుషునిగా మధురాంతక పొత్తపి చోడుని పేర్కొని, కరికాల చోళుని సంతతి వారమని చెప్పుకొన్నప్పటికీ, చారిత్రకంగా వీరి వంశ కర్త తెనుంగు బిజ్జన అని తెలుస్తోంది. పశ్చిమ చాళుక్య రాజైన మొదటి సోమేశ్వరుని (క్రీ.శ. 1042-1068) ఏలుబడి లోనే, ఏతగిరి ప్రాంతాల్ని తెనుంగు బిజ్జన పాలించాడు. సోమేశ్వరునికి చోళుల్తో జరిగిన యుద్ధాల్లో పాల్గొని, గౌరవ మన్ననలకు పాత్రుడుకావటాన, రాజ్యంలో వీరి ప్రాముఖ్యత పెచ్చింది. ఆరో విక్రమాదిత్యుని (1076-1126) కాలంలో వీరిని పాకనాటి ప్రాంతాలకు పాలకులుగా నియమించటం జరిగింది. నెల్లూర్‌ను రాజధానిగా చేసుకొని పాలించిన వంశం కనుక, వీరిని నెల్లూర్ తెలుగు చోడులుగా వ్యవహరిస్తుంటారు. వెలనాటి మొదటి రాజేంద్ర చోడుని కాలం నుండి రాజకీయపు ఒత్తిళ్ల మధ్య మనుగడ సాగిస్తూ, ఉనికిని నిల్పుకొన్నప్పటికీ, రెండో రాజేంద్రచోడుని అనంతరం విజృంభించారు. కర్ణాటక రాజ్యంలో ఏ వంశం పాలిస్తున్నప్పటికీ, వాళ్లు దక్షిణాత్య రాజకీయాల్ని బట్టి, చోళుల్ని, వారి మద్దతుదారులైన వెలనాటి రాజుల్ని, శత్రువులుగా పరిగణించటం సహజం; అందువల్లే, ఆ శత్రువులకు శత్రువులైన నెల్లూర్ చోడుల్ని మిత్రులుగా పరిగణించారు. పశ్చిమ చాళుక్యుల చివరి రోజుల్లోను, కాలచుర్యుల కాలం లోను, అదే విధానం కొనసాగింది. నెల్లూర్ చోడుల తోడ్పాటుతో కాలచుర్యులు వెలనాటి రాజుల్ని అణచటానికి పోరాటాలను తీవ్రతరం చేసినట్టు, కొచ్చెర్ల కోట యుద్ధం (1070) లాంటివి తెలుపుతున్నాయి. ఆ పోరాటాల్లో వెలనాటి రాజ్యం ఇబ్బందులను పడుతుండటంతో, తెలుగు చోడులు విజృంభించే అవకాశాలేర్పడ్డాయి. క్రీ.శ. 1187 ప్రాంతంలో నెల్లూర్ చోడ రాజ్య మేలుతున్న నల్లసిద్ధిరాజు, కాంచీపురాన్ని సైతం జయించి, ఆక్రమించాడు. ఇతనినే మనుమసిద్ధంటారు. ఇతని కొడుకే, తిరుకాళత్తి దేవుడనబడే చోడ తిక్కన.

నెల్లూర్ తెలుగు చోడులందరిలో చోడ తిక్కన (1223-48) ప్రముఖుడు. చిన్న వయస్సు లోనే ఇతడు వెలనాటి పృథ్వీశ్వరుణ్ణి వధించినట్టు, తిక్కన **"నిర్వచనోత్తర రామాయణం"** లో వర్ణించాడు. ఇతని ఏలుబడిలో వీరి అధికారం దక్షిణంలో కావేరి వరకూ విస్తరించింది. చాళుక్యచోళులు రాజకీయంగా బలహీనులు కావటం, సామంతుల విజృంభణ, పరస్పర కలహాలు, తెలుగ చోడులకు దక్షిణాత్య రాజకీయాల్లో అవకాశాన్ని కల్పించాయి. క్రీ.శ. 1230లో చాళుక్యచోళ చక్రవర్తైన మూడో రాజరాజు, పాండ్య రాజైన మారవర్మ సుందర పాండ్యుని చేతిలో ఓడిపోవటం; ఆ తర్వాత ఉత్తర ఆర్కాట్ జిల్లాలను పాలిస్తున్న కొప్పరుంజింగడనే పల్లవ సామంతుడి చేతిలో బందీ కావటం, మొదలైన ఇబ్బందుల నెదుర్కోవాల్సొచ్చింది. ఇవి చాలవన్నట్టు, కళింగ రాజైన అనియంకభీముడు చోళ రాజ్యంపై దండెత్తడంతో, పరిస్థితులు విషమించాయి. చాళుక్య చోళులు ఇంతటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో, వారికి సహాయపడేందుకు, హోయసాలులతోపాటు తెలుగు చోడులూ కత్తినట్టాల్సొచ్చింది. చోడ తిక్కన కాంచీపురం సమీపంలో అనియంకభీమున్ణి ఓడించి, మరణించటమే కాకుండా, ఉత్తర ఆర్కాట్‌లో ప్రవేశించి, కొప్పెరుంజింగని కూడ ఓడించి, చాళుక్య చోళ సింహాసనాన్ని తిరిగి మూడో రాజరాజు ఆధీనమయ్యేలా చేశాడు. అయితే, క్రీ.శ. 1246 తర్వాత, మూడో రాజేంద్ర చక్రవర్తి చాళుక్యచోళ రాజ్యానికి వచ్చాక ఏర్పడిన రాజకీయ మార్పుల ఫలితంగా, హోయసాలులు, పాండ్యులు ఏకమై, అతనిపై కత్తికట్టినప్పటికే, చోడ తిక్కన అతనితో చేరి పాండ్యుల్ని, హోయసాలుల్ని కూడ ఓడించి, 'చోళస్థాపనాచార్య' బిరుదాన్ని, తొండైమండలాన్ని

BRAOU

కూడ పొందాడు. చోడ తిక్కన సాధించిన ఈ విజయాలతో దక్షిణ దేశ రాజకీయాల్లో, తెలుగు చోడులు ప్రాబల్యాన్ని పొందారు. మహాకవి తిక్కన సోమయాజి కుటుంబీకులు, ఈ చోడ తిక్కనకు చాల అండగా ఉండేవారు.

చోడ తిక్కన కొడుకు, రెండో మనుమసిద్ధి. ఇతని కాలం నుండి, నెల్లూర్ తెలుగు చోడుల ప్రాభవం క్షీణ దశకు దారితీసింది. చెంగల్పట్టు ప్రాంతాల్ని విజయ గండగోపాలుడనే తెలుగు చోడుడు ఆక్రమించుకొని, మనుమసిద్ధిని ఎదిరించాడు. వైదుంబులు విజృంభించి, మనుమసిద్ధి రాజప్రతినిధుల్ని ధిక్కరించి, కడప ప్రాంతాల్ని స్వాధీనం చేసుకొన్నారు. మరో ప్రక్క దాయాదులైన అక్కన్న, బయ్యన్నలు విజృంభించి, మనుమసిద్ధిని తరిమికొట్టి, నెల్లూర్ సింహాసనాన్ని ఆక్రమించారు. ఇలా అన్ని వైపులా ఇబ్బందులు ఎదురైన పరిస్థితుల్లో, రాజ్యాన్ని కూడా కోల్పోయిన మనుమసిద్ధికి, మహాకవి తిక్కనామాత్యుని రాజకీయ చతురత కారణంగా, కాకతీయ చక్రవర్తి గణపతి దేవుని సహకారం లభించింది. తీరాంధ్రంలో తమ అధికారాన్ని విస్తరించటానికి, కాకతీయులు దీన్ని ఒక అవకాశంగా తీసుకొన్నారు. క్రీ.శ. 1254 ప్రాంతంలో, గణపతిదేవుని దక్షిణ దిగ్విజయ యాత్ర సాగింది. మనుమసిద్ధి శత్రు వర్గాన్ని మొత్తం ఓడించి, మనుమసిద్ధిని తిరిగి సింహాసనం మీద కూర్చోబెట్టినప్పటికీ, తెలుగు చోడులు ప్రతిపత్తిని కోల్పోయి, కాకతీయ సామంతులు కావాల్సొచ్చింది.

మనుమసిద్ధి కాలం లోనే, కనిగిరి సీమ లోని ఎఱ్ఱగడ్డపాడు పాలకుడైన కాటమరాజుతో, మనుమసిద్ధికి పశువుల పుల్లరి గురించి యుద్ధం జరిగినట్టు, జనశ్రుతులు తెలుపుతున్నాయి. తిక్కన సోమయాజి పెద తండ్రి కొడుకైన భద్రతిక్కన, ఆ యుద్ధం లోనే మరణించాడని, ఆ గాధలలో చెపుతారు. కాని, నిర్ధారిత చారిత్రకాంశాల్తో ఆ గాధల లోని అంశాలు సరిపడని కారణంగానూ, కథనం లోని ఇతర లోపాల కారణంగాను, ఆ జనశ్రుతుల చారిత్రక ప్రామాణ్యాన్ని పూర్తిగా శంకించవలసొస్తోంది. మనుమసిద్ధి తర్వాత నెల్లూర్ తెలుగు చోడ రాజ్యం వ్యక్తిత్వాన్ని కోల్పోయి, క్రమంగా కాకతీయ రాజ్యాంతర్భాగమైంది.

ఈ నెల్లూర్ తెలుగు చోడ కుటుంబం కాకుండా, కొణిదెన ప్రాంతంలో క్రీ.శ. పన్నెండు, పదమూడు శతాబ్దాల నుండి మరో చోడ కుటుంబం పాలించింది. తెలిసినంతలో ఈ కుటుంబానికి క్రీ.శ. 1111 నాటి పొత్తపి కామదేవుడే, మూల పురుషుడు. తొలి దశలో వీరి పాలన చాళుక్య చోళ చక్రవర్తుల అధికారానికి లోబడి సాగినప్పటికీ, తర్వాత చాళుక్య చోళ - పశ్చిమ చాళుక్యుల పరస్పర ఘర్షణల మధ్య, వారి విధేయత ఒకే వద్దతిలో సాగ లేదు. ఈ వంశస్తుల్లో ప్రముఖుడే, పెంకణాదిత్యుడనే బిరుదాన్ని ధరించిన త్రిభువన మల్ల చోడుడు (1137-53). ఇతని కుమారుడైన నన్నెచోడుడే, తెలుగు గ్రంధమైన **'కుమారసంభవాన్ని'** రాసి ఉంటాడని కొందరు భావిస్తారు. గుంటూర్, కర్నూల్ జిల్లాల్లోని ప్రాంతాల్లో, ఈ కుటుంబీకుల పాలన కొంత కాలం పాటు సాగినా, చివరకు వెలనాటి రాజుల సామంతులయ్యారు. కాకతీయుల విజృంభణతో, వీరి ఏలుబడి ప్రాంతాలు కూడ, కాకతీయ సామ్రాజ్యంలో విలీనమయ్యాయి.

10.3.3 : హైహయులు

మధ్య యుగ ఆంధ్ర దేశ చరిత్రలో ప్రముఖ పాత్ర వహించిన మూడలిక కుటుంబాలలో, హైహయులు ముఖ్యులు. ఆంధ్ర దేశంలో కోనసీమ, పలనాడు ప్రాంతాల్లో, వీళ్ళ పాలన సాగింది. పరిమిత అధికారమే అయినప్పటికీ, కేంద్ర అధికారాన్ని ప్రభావితం చేయటం లోను, వాటి మనుగడను కొనసాగనీయటం లోను, వీరి పాత్ర తక్కువేమీ కాదు.

BRAOU

కోన హైహయుల మూల పురుషుడుగా, ఒక కీర్తిరాజు చెప్పబడతాడు. బహుశ: వేంగీ రాజ్యం పైన దండెత్తివచ్చిన చేది రాజు యశ:కర్ణదేవునితో కలిసి, ఇతడు వేంగికి వచ్చి ఉంటాడు. వేంగిలో స్థిరపడి, కులోత్తుంగుని కాలంలో, కోన (కోణ) మండలాధిపత్యాన్ని సంపాదించి ఉంటారు. రాకుదురు వీరి రాజధాని. కీర్తిరాజు తర్వాత ముమ్మడి భీమరాజు కాలంలో, వీరు పశ్చిమ చాళుక్య సార్వభౌమత్వాన్ని అంగీకరించారు. ఆ తర్వాత, రాజపతేడు, రాజేంద్రచోళుడు, మొదలైనవారు రాజ్యానికి వచ్చారు. ఇతర సామంత వంశాలైన జననాధపుర చాళుక్యులు, మున్నగువారితో వీరికి బంధుత్వం ఉండేది. వెలనాటి రెండో గొంకరాజు కాలంలో, వీరూ చాళుక్యుల్లాగే స్వతంత్రించి నప్పటికీ, కులోత్తుంగ రాజేంద్రుని మంత్రి అమృతలూరి దేవన ప్రగ్గడచే ఓడింపబడి, వెలనాటి సార్వభౌమత్వాన్ని అంగీకరించారు.

హైహయుల్లో మరో శాఖ పల్నాటి ప్రాంతంలో పాలించింది. కృష్ణా నదీ దక్షిణ తీరం లోని మాండలికుల్లో, వారు ముఖ్యులు. వీరి శాసనాల్లో తాము కార్తవీర్యార్జునుని సంతతిగా చెప్పుకొన్నప్పటికీ, వీరి ప్రాంతాలకు పశ్చిమ చాళుక్యులతోపాటు, వారి వేంగీ దండయాత్ర సందర్భాల్లో వచ్చినట్టు భావించబడుతోంది. వీరి రాజధాని గురజాల. వీరిని గురించిన వివరాలేమీ స్పష్టంగా తెలియవు. క్రీ.శ. 1133 ప్రాంతంలో, వెలనాటి రెండో గొంక, రెండో కులోత్తుంగ రాజేంద్రుని సమకాలీనుడిగా, అనుగు కామరాజొకడు పాలించేవాడు. రెండో గొంకని కుమార్తెన మైలమదేవి ఇతని భార్య. ఆ వివాహ సందర్భం లోనే, వీరికి వలనాటి సీమ అరణంగా లభించింది. వీరి వివరాలను తెలుసుకొనేందుకు, వివాదగ్రస్తమైన **'పలనాటి వీరభాగవత'** మనే అర్వాచీన కాలం నాటి ఓ ద్విపద మాత్రమే ఆధారం. అనుగురాజుకు మైలమదేవి వలన నలగామరాజు, వీరవిద్యాదేవి అనే భార్య వల్ల పెద్దమల్లిదేవ, పినమల్లి దేవులు కలిగారు. రాజ్య భాగాల కోసం సవతి సోదరుల మధ్య జరిగిన కలహమే, ఆంధ్రుల చరిత్రలో పల్నాటి యుద్ధంగా ప్రసిద్ధికెక్కింది. అనుగు కామరాజు కొలువులో వెలనాటి వారి ప్రతినిధులుగా పంపబడ్డ దొడ్డనాయుడు, అతని కొడుకు బ్రహ్మన్న నాయుడు, స్థానిక ప్రజలపై అత్యాచారాలు చేస్తూ, అనుగురాజు పట్ల గూడ అవిధేయులయ్యారు. అనుగురాజు తర్వాత రాజ్యానికి వచ్చిన నలగామరాజుకు మంత్రిణిగా బాధ్యతలను స్వీకరించిన రెడ్డి నాగమ్మ, వాళ్ళను ప్రతిఘటించి, స్థానిక ప్రజల విశ్వాసాన్ని పొందగల్గింది. దానిని సహించలేని బ్రహ్మన్న నాయుడి మంత్రిత్వంలో రాజ్యం చేసినా దాయాదుల శతృత్వం పెచ్చు పెరిగి, కారెంపూడి దగ్గర ఘోర విశ్వాసాన్ని పొందగల్గింది. దానిని సహించలేని బ్రహ్మన్న నాయుడు, పెదమల్లి దేవాదుల్ని రెచ్చగొట్టి, రాజ్య విభజనకు కారణమయ్యాడు. పెదమల్లి దేవుడు మాచెర్ల రాజధానిగా, బ్రహ్మన్న నాయుడి మంత్రిత్వంలో రాజ్యం చేసినా, దాయాదుల శతృత్వం పెచ్చు పెరిగి, కారెంపూడి దగ్గర ఘోర యుద్ధం జరిగింది. కాకతీయులు, హోయసాలులు, వెలనాటి సామంతులైన కోట రాజులు నలగాముడి పక్షం వహిస్తే, మలిదేవునకు కాలచుర్యుల సహాయం లభించింది. ఆ పల్నాటి యుద్ధంతో, వెలనాటి రాజ్యమే కాకుండా, వారి అధికారానికి లోబడిన ఎన్నో సామంత వంశాలు, కోలుకోలేనంతగా నష్టపడ్డాయి.

10.3.4 : చాళుక్య కుటుంబాలు

తీరాంధ్రంలో, అవకాశాన్ని చిక్కించుకొని, రాచరికం చేసిన మాండలిక వంశాల్లో పేర్కొదగ్గవి, చాళుక్య కుటుంబాలు. సమకాలీన రాజకీయాల్లో వీరు నిర్వహించిన పాత్ర ముఖ్యమైంది. జననాధపురం, నిడదవోలు (నిరవద్యపురాలు), ఎలమంచిలి మొదలైన చోట్ల, వీరి ఆధిపత్యం 11, 12, 13 శతాబ్దాల్లో ఏర్పడింది.

BRAOU

జననాధపురాన్ని రాజధానిగా చేసికొని పరిపాలించిన చాళుక్య వంశం, జననాధపుర చాళుక్యులుగా పేర్కొబడతారు. ఆ జననాధపురాన్ని గుర్తించటంలో, చరిత్రకారుల్లో ఏకాభిప్రాయం లేకపోయినప్పటికీ, కొన్ని చారిత్రకాధారాల్ని బట్టి, దానిని ప్రస్తుత సామర్లకోటగా భావించొచ్చు. వేంగీ చాళుక్యుల్లో పదిహేడో రాజైన బేత విజయాదిత్యుడు (929), ఈ వంశ స్థాపకుడిగా కనబడతాడు. ఉత్తరాంధ్ర రాజకీయాల్లో వెలనాటి రాజుల్ని ప్రతిఘటించి, స్వతంత్రించటంలో, ఈ వంశ ప్రాముఖ్యత తెలుస్తోంది. తూర్పు గంగుల, కాకతీయుల సహాయం వీరికి లభించటంతో, సమకాలీన మాండలికుల్లో వీరి ప్రతిష్ట పెరిగింది. తూర్పు గంగులతో వీరికి వైవాహిక సంబంధాలుండటంతో, రాజకీయంగా ఎదగటానికి, వీరికి ప్రోత్సాహం లభించింది. వేంగీ రాజకీయాల్లో పశ్చిమ చాళుక్యులు తరచు కల్గించిన అస్థిర పరిస్థితులు వీరి కుపయోగపడ్డాయి. గోదావరీ తీర భూముల్లో విస్తరిస్తూ, వెలనాటి రాజుల ఆధిపత్యాన్ని ధిక్కరించి, స్వతంత్రత ప్రకటించటానికి వీలు కల్పించాయి. క్రీ.శ. 1078 లో సత్యాశ్రయుని కాలం నుండి, క్రీ.శ. 1241 లో చూడో మల్లపుని కాలం దాకా, వీరి ఏలుబడి గోదావరీ ప్రాంతంలో సాగింది. పశ్చిమ చాళుక్య, తూర్పు గంగుల రాజకీయపు ఒత్తిళ్ల మధ్య, వీరి పాలన సాగింది.

నిడదవోలు రాజధానిగా, మరొక చాళుక్య శాఖ క్రీ.శ. పదకొండు, పదునాల్గు శతాబ్దాల మధ్య, పరిపాలనను సాగించింది. కాకతీయ గణపతి దేవుని పుత్రికైన రుద్రాంబ, ఈ కుటుంబం లోని ఇందు శేఖరుని కొడుకైన వీరభద్రుడిని పరిణయ మాడటంతో, సమకాలీన మాండలిక రాజ కుటుంబాల్లో వీరి ప్రతిష్ట పెరిగింది. జననాధపుర చాళుక్యుల, వెలనాటి రాజుల, కాకతీయుల అధికారానికి లోబడి, వేర్వేరు దశల్లో వీరి అధికారం సాగింది. కోనవైహాయులతో వీరికి వైవాహిక సంబంధాలుండేవి. క్రీ.శ. 1078 నాటి వేంగీశ్వరుడే, తెలిసినంతలో ఈ వంశస్థుల మూల పురుషుడు. కాకతీయులు తీరాంధ్రం మీద దృష్టి సారించటం, జననాధపుర చాళుక్యులు క్రమంగా తెరమరుగు కావటంతో, వీరు కాకతీయుల సామంతులయ్యారు.

పై చాళుక్య వంశాల్లాగే, ఎలమంచిలి ప్రాంతంలో పన్నెండవ శతాబ్ది లగాయతు, సుమారు నాలుగు శతాబ్దాల పాటు, మరో చాళుక్య వంశం పరిపాలించింది. ఈ చాళుక్య వంశం వాళ్ళు కూడ తాము వేంగీ చాళుక్య సంతతి వారమని, రాజరాజనరేంద్రుడి అనంతర వారసులమని చెప్పకొన్నప్పటికీ, క్రీ.శ. 1205 నాటి విజయాదిత్యుని తోనే వీరి పాలన ప్రారంభమైందని చెప్పొచ్చు. మధ్యమ కళింగమైన ఎలమంచిలి ప్రాంతంలో వీళ్ల పరిపాలన పదిహేను తరాల పాటు కొనసాగింది. ఉత్తర తీరాంధ్రంలో సార్వభౌమాధికారాన్ని చెలాయించిన గంగ రాజులు, తమ అధికార పీఠాన్ని ముఖలింగం నుండి కటకానికి మార్చటంతో, ఉత్తర తీరాంధ్రం లోని ఎన్నో సామంత కుటుంబాలు స్వతంత్రతను ప్రకటించుకొన్నాయి. ఒడ్డాది ప్రాంతం లోని మత్స్య రాజులు, జంతర్నాటి సుర భులు, నందపురపు శిలావంశీయులు, మొదలైన పాలక వంశాల్లాగే, ఎలమంచిలి చాళుక్యులు కూడ స్వతంత్రులయ్యారు. విశాఖ జిల్లాలోని పంచదారల, సింహాచలంలోని శాసనాలు వీరి వంశ వివరాల్ని తెల్పుతున్నాయి. వెలమ, రెడ్డి రాజుల తగాదాల మధ్య, కామవరపుకోట తెలుగు చోడులు, కొప్పుల పతులు మొదలైనవారి రాజకీయ కలహాల మధ్య, ఈ వంశీయులు ఎలమంచిలి ప్రాంతాల్ని, రమారమి ముస్లింల స్వాధీనమయ్యేంత పర్యంతం, పరిపాలించారు. ఉపేంద్రదేవ, విశ్వేశ్వర దేవుల వంటి ఖ్యాతి గడించిన పాలకులు, రాచరికంగానే కాక, సంస్కృతీ పోషణ లోనూ, ఈ వంశ ఖ్యాతిని ఇనుమడింపజేశారు. **'పస్యానంద'** మనే వ్యవసాయ గ్రంధం, **'కావ్యాలంకార చూడామణి'** అనే ఛందో గ్రంధం, వీరి పోషణ లోనే వ్రాయబడ్డాయి.

BRAOU

10.3.5 : చాగి వంశీయులు

గుడిమెట్ట రాజధానిగా నతవాడి, విజయవాడ ప్రాంతాల్లో మూడున్నర శతాబ్దాల పాటు (క్రీ.శ. 1100-1477) పరిపాలించి, చాగి వంశీయులు కూడ తమదైన విశిష్టతను చాటుకొన్నారు. ఇతర మాండలిక వంశాలైన కొండపడమటి, పల్నాటి హైహయ, తెలుగుచోడ, కాకతీయ వంశస్తులతో, వీరికి రాజకీయ, వైవాహిక సంబంధ బాంధవ్యాలుండేవి. కొన్ని ప్రముఖ రాజ వంశాల్లాగే, వీరి వంశ ప్రశస్తులు, పురాణ గాధలు కొన్ని శాసనాల్లో వర్ణింపబడ్డాయి. విష్ణువు, బ్రహ్మల నుండి వీరి పూర్వీకుడైన దుర్జయుడు జన్మించినట్లు, పశ్చిమాధిపతిగా నియమింపబడినట్లు, చెప్పకొన్నారు. అయితే, ఈ విధంగా దుర్జయుడనే అభూత వ్యక్తిని మూల పురుషునిగా కొండపడమటి రాజులు, కాకతీయులు, పరిచ్ఛేది రాజులు, నతవాడి పాలకులు కూడ చెప్పకోవటాన్ని బట్టి, ఈ అంశం లోని చారిత్రక ప్రామాణికతను శంకించాల్సొస్తుంది. తెలిసినంతలో, ముప్పరాజునే అతను, వీరి మూల పురుషుడు.

చాళుక్య - చోళ - సార్వభౌముడైన కులోత్తుంగుని కాలంలో (1070-1118), ఈ ముప్పరాజు రాజకీయ జీవితం ప్రారంభమైంది. రాజ లాంఛనాల్తో పాటు, పాలనా ప్రాంతాలు కూడ, అప్పుడే ఈ వంశానికి సంక్రమించాయి. ముప్పరాజు కుమారుడైన మొదటి దోరరాజు (1118-60), వీరిలో సమర్థుడిగా చెప్పబడతాడు. తన తండ్రి లాగే చాళుక్య-చోళుల సామంతుడిగా కొనసాగినప్పటికి, స్వంతంగా 'త్యాగిగద్యల'నే నాణేలను జారీ చేయటాన్ని బట్టి, కొంత వరకు వీరి స్వయంప్రతిపత్తిని గ్రహించొచ్చు. వేంగీ రాజ్యంలో చాళుక్యచోళ - పశ్చిమ చాళుక్యుల మధ్య యుద్ధాలు జరుగుతున్నప్పుడు, దోరరాజు, అతని కొడుకు పోతరాజు (1161-90), చాళుక్య చోళుల పక్షం వహించారు. పల్నాటి యుద్ధంలో పాల్గొన్నట్టు చెప్పబడ్డ రాజుల్లో, త్యాగిపోతరాజు కూడ నలగామునికి సహాయంగా, వేర్కొబడినాడు. జనశ్రుతుల్లో, వేములవాడ భీమకవి గుఱ్ఱాన్ని బంధించి, పోతరాజు అతని కోపానికి గురైనట్టు చెప్తారు. ఇతని కొడుకైన రెండో దోరరాజు కాలంలో (1190-99), వీరి రాజధాని, సామ్రాజ్య విస్తరణ దృష్ట్యా, విజయవాడకు మార్చబడింది. పృథ్వీశ్వరుడి కాలంలో వెలనాటి రాజుల్లాంటి మాండలిక వంశాలు బలహీనం కావటంతో, అది అదనుగా వీళ్లు నకవాడి వంశాన్ని విస్తరించారు. అలాగే, క్రీ.శ. 1173 నాటికి కొండపడమటి రాజ్యం కూడ అంతరించటం, వీళ్ళ విస్తరణకు అనుకూలించింది. మనుమపోత, మనుమత్యాగిరాజు మొదలైన వాళ్లు, ఈ కుటుంబం లోని ఇతర రాజులు.

10.3.6 : కొండపడమటి రాజులు

గుంటూర్ జిల్లా లోని సత్తెనపల్లి ప్రాంతాల్లో, నాదెండ్ల రాజధానిగా, సుమారు ఒకటిన్నర శతాబ్దాలు (క్రీ.శ. 1100-1282) పాలించిన రాజ వంశం, కొండపడమటి రాజులు. వీళ్ల పూర్వీకుడు బుద్ధవర్మ, వేంగీ చాళుక్య వంశ స్థాపకుడైన కుబ్జ విష్ణువర్ధనుని కాలం లోనే గుర్తింపు పొంది, గిరి పశ్చిమ సీమ (కొండపడమటి) ప్రాంతంలో, డెబ్భై మూడు గ్రామాలపై ఆధిపత్యాన్ని పొందాడు. వేంగీ చాళుక్యుల సామంతులుగా, అప్పట్లోనే వీరికి గుర్తింపు లభించింది. ఆ తర్వాత చాళుక్య చోళుల సార్వభౌమత్వాన్ని అంగీకరించి, వెలనాటి రాజులతో కలిసి, కళింగుల తోను, తెలుగు చోళుల తోను జరిగిన యుద్ధాల్లో, ప్రధాన పాత్ర వహించారు. బుద్ధవర్మ కాలం నుండి వీళ్ల ఏలుబడి తెలుస్తున్నప్పటికీ, మండరాజు (1114-18) ఈ కుటుంబంలో తొలి పాలకుడుగా కనిపిస్తాడు. చాగి రాజుల్లాగే వీళ్లు కూడ తమ పేర నాణేలను జారీ చేసినట్టు, మండరాజు తన బిరుదంతో జారీచేసిన 'గంధవారణ మాడలు' తెలియజేస్తాయి. అయితే, వేంగీ ప్రాంతంపై పశ్చిమ చాళుక్యులు జరిపిన దాడుల్లో, మండరాజు, సోదరులతో సహా నశించినట్టు తెలుస్తోంది. ఈతని తర్వాత ఈ

BRAOU

పంశస్తుల్లో పేరుగన్నది, రెండో మండరాజు (1125- 30). చాళుక్య చోళుల సామంతుడుగా సాగిన ఈతని పాలనా కాలం లోనే, రాజేంద్ర చోడుని కళింగ దండయాత్ర సాగింది. ఈ మండరాజు కళింగ గంగుల్ని జయించి, వారి నుండి ఎన్నో ఏనుగుల్ని స్వీకరించి, రాజేంద్ర చోళునికి కానుకగా సమర్పించినట్లు తెలుపటాన్ని బట్టి, ఆ కళింగ దండయాత్రలో చాళుక్యచోళుల తరపున ఈతడు పోరాడినట్లు తెలుస్తోంది. చోడరాజు (1132-35), మల్లరాజు (1139-49), నాలుగో మండరాజు (1149-71), బుద్ధరాజు (1171-73) మొదలైనవారు, తర్వాత కాలంలో కొండపడమటి రాజ్యాన్ని పాలించారు. అనంతరం, కాకతీయుల విజృంబణతో, ఇతర సామంత వంశాల లాగే, వీరు కూడా కాకతీయుల సార్వభౌమాధికారానికి లొంగిపోయారు.

10.3.7 : పరిచ్ఛేది రాజులు

వెలనాడు, కొల్లిపాక ప్రాంతాల్లో కొండపడమటి రాజుల అనుబంధ శాఖగా పరిపాలించిన, పరిచ్ఛేది రాజులు (1040-1290) కూడ, కొంత వరకు రాజకీయాలపై తమదైన ప్రభావాన్ని నెరిపారు. కొల్లిపాక వీరి రాజధానిగా, చాళుక్య చోళులకు రాజకీయ వారసులైన వెలనాటి వారికి లోబడి, వీరి పాలన సాగింది. అయితే, కొన్ని పరిస్థితుల్లో పశ్చిమ చాళుక్యులచే ఓడింపబడి, వారి ఆధిపత్యానికి తలొగ్గినట్లు తెలుస్తోంది.

10.3.8 : కోట రాజులు

షట్సహస్రావనీ అని, ఆర్వేలనాడనీ, పేరుపడ్డ కృష్ణా నదీ దక్షిణ ప్రాంతంలో పన్నెండు, పదమూడు శతాబ్దాల్లో పాలించిన వంశం, కోట రాజులు. ఆ ప్రాంతంలో కొండమడపటి రాజుల వారసులుగా రాజ్యాన్ని ఆక్రమించినప్పటికీ, రాజ్యపు వ్యాప్తి చెందించి, వారికన్న ప్రాముఖ్యతను సంతరించుకొన్నారు. ధాన్యకటకం రాజధానిగా, వీరి పాలన త్రిపురాంతకం, నెల్లూర్ మధ్య ప్రాంతంలో సాగింది. సమకాలీన పాలక వంశాలన్నీ వీరితో వైవాహిక సంబంధాలేర్పర్చుకోవటాన్ని బట్టి, రాజకీయంగా వీరికున్న ప్రాధాన్యత తెలుస్తుంది. వీరి వంశ కర్తగా ధనంజయుడనే అతనిని పేర్కొన్నప్పటికీ, అతని వివరాలు తెలీవు. అలాగే, ఆ ప్రాంతాలపై పాలనాధిపత్యం త్రిలోచన పల్లవుని ద్వారా సంక్రమించినట్లు చెప్పుకొన్నప్పటికి, క్రీ.శ. 1050 ప్రాంతాల్లో పరిపాలనను ప్రారంభించిన బేత రాజే, తెలిసినంతలో మొదటి రాజు. క్రీ.శ. 1108 ప్రాంతంలో పాలించిన భీముడు, ఈ తొలి రాజుల్లో ప్రముఖుడుగా కన్పిస్తాడు. చాళుక్య చోళ - వెలనాటి చోళుల్తో కలిసి, ఇతడు కూడ కళింగ దండయాత్రలో పాల్గొని, చాళుక్యచోళుల విజయానికి కృషిచేసినట్లు తెలుస్తోంది. వేంగీ రాజకీయాల్లో పశ్చిమ చాళుక్యులకు వ్యతిరేకంగా, చాల సందర్భాల్లో ఈ కోట వారి తోడ్పాటు చాళుక్య చోళులకు లభించింది. అయితే, రెండో కోటభీమరాజు కాలంలో స్వతంత్రించే ప్రయత్నం జరిగినా, అణచివేయబడింది. పల్నాటి యుద్ధంలో వెలనాటివారితో కలిసి, కోటబేతరాజు కూడ సలగాముని పక్షం వహించినట్లు తెలుస్తోంది. కోటభీమరాజు కాలంలో కొండపడమటి రాజ్యం ఓడింపబడి, వీరి స్వాధీనమైంది. ఆ విధంగానే, తెలుగుచోడుల భూభాగాల పైకి కూడ దండయాత్రలు చేసినప్పటికీ, రాజ్య విస్తరణకు అవకాశం లేకపోయింది. కాకతీయుల చేతిలో ఇతడు మరణించినట్లు భావించబడుతోంది. కాకతీయ సేనానుల దన్నాలకోట పదవేష్టిత కదన, దన్నాల కోట రాజ వేశ్యా భుజంగ, మొదలైన బిరుదాల్ని బట్టి, కోట రాజ్యానికి కాకతీయుల వలన ఏర్పడ్డ ప్రమాదం తెలుస్తోంది. రెండో కోటరాజు (1182-1231), మూడో భీమరాజు (1231-1234) మొదలైనవారు, తదనంతర పరిపాలకుల్లో ప్రముఖులు.

BRAOU

10.4 : సంగ్రహంగా

1. వేంగి చాళుక్య, చోళ సింహాసనాలు రెండింటికి, రాజరాజనరేంద్రుడి కొడుకైన రాజేంద్రుడే వారసుడు కావటంతో, రెండు రాజ్యాలూ విలీనం చెయ్యబడి, చాళుక్య - చోళ సామ్రాజ్య మేర్పడింది. కులోత్తుంగ బిరుదాన్ని ధరించి, రాజేంద్రుడు చోళ రాజధానికి వెళ్లటంతో, వేంగి రాజ్యపు ప్రాధాన్యత తగ్గింది.

2. ఆంధ్ర రాజ్య పాలన కోసం, చాళుక్య చోళ ప్రతినిధులుగా, కులోత్తుంగుడు వరుసగా తన పుత్రుల్నే పంపించాడు.

3. తీరాంధ్రం లోని సామంత రాజ్యాల తిరుగుబాటు, చక్రకూట రాజుల తోటి యుద్ధాల కారణంగా, ఆ కుమార రాజప్రతినిధుల పాలనా కాలం చాల వరకు ఘర్షణల తోనే గడిచింది.

4. ఆంధ్ర రాజకీయాల్లోని ఆ అస్థిరత కారణంగా, మరిన్ని మాండలిక రాజ్యాలు స్వతంత్రించి, విజృంభించాయి. తీరాంధ్రం లోని ఎన్నో సామంత వంశాలు బలపడి, కేంద్రాధికారాన్ని నిర్వీర్యం చేశాయి.

5. చాళుక్య చోళుల విశ్వాసాన్ని పొందిన వెలనాటి రాజులు, పందోలు రాజధానిగా పాలిస్తూ, ఆంధ్ర దేశ రాజకీయాల్లో కొంత కాలం ప్రముఖ పాత్ర వహించారు.

6. నెల్లూరు తెలుగు చోడుల తోడి వైరం, కాకతీయుల తోడి యుద్ధాల కారణంగా, వెలనాటి వంశ మంతరించింది.

7. పశ్చిమ చాళుక్య - వెలనాటి వారి ఘర్షణల మధ్య చోటుచేసుకొని, తెలుగునాట వేర్వేరు ప్రాంతాల్లో హైహయులు, చాళుక్య కుటుంబాల వాళ్ళు, చాగి వంశీయులు, కొండపడమటి రాజులు, పరిచ్ఛేది రాజులు, కోట రాజులు రాజ్యాలేర్పర్చుకొన్నారు.

మధ్య యుగ ఆంధ్ర దేశ రాజకీయ స్వరూపాన్ని మార్చటంలో, ఈ చిన్న వంశాలన్నీ, చెప్పుకోదగ్గ పాత్రనే నిర్వహించాయి. క్రమంగా ఆంధ్ర దేశం ధూపత్తూ, కాకతీయుల అధికారానికే లోబడింది.

10.5 : సంగ్రహంగా

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. చాళుక్య-చోళ సామ్రాజ్య ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులను, ఆంధ్ర దేశ రాజకీయాలపై దాని ప్రభావాన్ని పరిశీలించండి.
2. వెలనాటి రాజులు ఆంధ్ర దేశ రాజకీయాల్లో నిర్వహించిన పాత్ర ఎట్టిది?
3. తెలుగు చోడులు నిర్వహించిన రాజకీయ పాత్రను వివరించండి.
4. మధ్యాంధ్ర యుగ రాజకీయాల్లో చిన్న రాజ వంశాలు బలపడటానికి దారితీసిన పరిస్థితుల్ని, వాటి ప్రభావాన్ని తెల్పండి.

BRAOU

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. మధ్య యుగ ఆంధ్ర దేశ చరిత్రలో హైహయులు నిర్వహించిన పాత్రను తెలపండి.
2. తీరాంధ్రంలో అధికారాన్ని నిర్వహించిన చాళుక్య కుటుంబాల రాజకీయ చరిత్రను వేర్కొనండి.
3. చాగి వంశీయుల పాలనా విశేషాలను వర్ణించండి.
4. కొండపడమటి రాజులు నిర్వహించిన రాజకీయ పాత్రను పరిశీలించండి.
5. కోట రాజుల రాజకీయ చరిత్రను తెల్పండి.

10.6 : ఉపయుక్త గ్రంథాలు

Sastri K.A.N. : **The Cholas** (Madras, 1955)

Suryanarayana , K. : **History of the Minor Chalukya Families in Medieval Andhra Desa** (Delhi, 1986)

Krishna Kumari M. : **The Rule of the Chalukya - Cholar in Andhra Desa,** (Delhi, 1985)

Krishna Rao, B.V. : **History of the Eastern Chalukyas of Vengi** (Hyderabad, 1973)

Yazdani, G. (ed). : **The Early History of Deccan, Vol.II** (oxford, 1960)

Yasoda Devi V. : 'The History of the Andhra Country (A.D. 1000-1500) Subsidiary Dynasties Published in the **Journal of Andhra Historical Research Society** Volumes.

సోమశేఖరశర్మ, మల్లంపల్లి, : తెలుగు సంస్కృతి, Vol.III తెలుగు విజ్ఞాన సర్వస్వం పునస్సంశోధితం (హైదరాబాద్, 1983)

హనుమంతరావ్, బి.యస్.యల్. : ఆంధ్రుల చరిత్ర (గుంటూర్, 1983)

BRAOU

రచయిత : డా. కొల్లూరు సూర్యనారాయణ

భాగం-11 : చాళుక్య యుగం (క్రీ.శ. 624-1200) : సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు

విషయక్రమం

11.0 : లక్ష్యాలు

11.1 : పరిచయం

11.2 : సామాజిక పరిస్థితులు

11.2.1 :సమాజం, కులాలు, కుల విభాగాలు

11.2.1.1 : బ్రాహ్మణులు

11.2.1.2 : క్షత్రియులు

11.2.1.3 : వైశ్యులు

11.2.1.4 : శూద్రులు, వృత్తి కులాలు, శ్రేణులు

11.2.2 : విద్యలు, విద్యా కేంద్రాలు

11.2.3 : సమాజంలో స్త్రీల స్థానం

11.3 : ఆర్థిక పరిస్థితులు

11.3.1 : వ్యవసాయం, భూవర్గీకరణ, నీటిపారుదల, భూమి కొలతలు

11.3.2 : పరిశ్రమలు

11.3.3 : వాణిజ్యం

11.3.4 : పన్నులు, సుంకాలు

11.4 : సాంస్కృతిక పరిస్థితులు

11.4.1 : మతం, మత శాఖలు

11.4.1.1 : బౌద్ధ, జైనాలు

11.4.1.2 : వైదిక మతం

11.4.2 : దేవాలయాలు : నిర్వహణ

11.4.3 : పంచారామాలు

11.5 : తెలుగు సాహిత్య పోషణ

11.5.1 : తెలుగు భాషా పరిణామ తొలి దశ

11.5.2 : వేంగీ చాళుక్య యుగంలో తెలుగు సాహిత్య ఆవిర్భావం

BRAOU

11.5.3 : అర్వాచీన చాళుక్య యుగంలో తెలుగు సాహిత్యం

11.6 : లలిత కళలు

11.7 : శిల్ప కళా పోషణ : ఆలయ నిర్మాణం

11.8 : సంగ్రహంగా

11.9 : పరీక్ష నమూనా ప్రశ్నలు

11.10 : ఉపయుక్త గ్రంథాలు

11.0 : లక్ష్యాలు

వేంగీ చాళుక్యుల కాలం లోను, ఆ తర్వాతా, జరిగిన రాజకీయ పరిణామాల గురించి, గత భాగాల్లో తెలుసుకున్నాం. వేర్వేరు ప్రాంతాల్లో, వేర్వేరు రాజ వంశాల మధ్య చోటుచేసుకున్న యుద్ధాలు, ఘర్షణలు, సమాజం మీద బలమైన ప్రభావాన్ని చూపించాయి. జీవన విధానం లోను, సాంస్కృతికంగాను ఎన్నో మార్పులొచ్చాయి. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో సంభవించిన ఆ మార్పుల్ని స్పష్టంగా గ్రహించగల్గడమే, ఈ భాగాధ్యయన లక్ష్యం.

నాటి సమాజంలో నెలకొన్న కుల విభజన, వృత్తి కులాలు, శ్రేణులు; విద్యా విధానం, సంస్థలు, సమాజంలో స్త్రీల స్థానం; ఆర్థికంగా వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యాభివృద్ధి; సాంస్కృతికంగా బౌద్ధ, జైన, వైదిక మతాల ప్రగతి; తెలుగు సాహిత్యం, శిల్ప, లలిత కళాభివృద్ధి, ఆదిగాగల ప్రధానాంశాలను అవగాహన చేసుకోగల్గడం కూడా, ఈ భాగాధ్యయన లక్ష్యం.

11.1 : పరిచయం

ఆంధ్రుల మధ్య యుగ చరిత్ర, వేంగీ చాళుక్యుల రాజ్య కాలం తోటే ప్రారంభమైందని తెలుసు కున్నాం. రాజకీయంగా ఐకమత్యం లేకపోవటం, అంతర్యుద్ధాలు, వ్యవసాయం మీదనే ఆధారపడ్డ ఆర్థిక విధానం, పురోహిత వర్గాల ప్రాబల్యం, విద్య కూడా మత విశ్వాసాల మీదే ఆధారపడటం లాంటివన్నీ, ఈ యుగ విశేషాలని చెప్పొచ్చు. వీటన్నింటి నేపథ్యంలో, సమాజంలో ఆసక్తికరమైన పరిణామాలెన్నో జరిగాయి. అప్పటి దాకా వైదిక కర్మకలాపాలకే పరిమితమైన బ్రాహ్మణులలో కొంత మంది ఆయుధోపజీవులుగా మారి, సైనిక పదవులను నిర్వహించటానికే రాజాశ్రయాలకు చేరారు. చేస్తున్న వృత్తుల్లో వస్తున్న అలాంటి మార్పుల కారణం గాను, మత విశ్వాసాల్లోను, ఆచారవ్యవహారాల్లోను ఏర్పడ్డ భేదాల కారణం గాను, సాంఘిక జీవనంలో, వర్ణ వ్యవస్థలో విభేదాలేర్పడ్డాయి. సామాజిక పరమైన ఉన్నతిని, హోదాను పొందించుకోవటం కోసం, అన్ని కులాల వాళ్లు ప్రయత్నించారు. శాతవాహన యుగం తర్వాత అంతగా కన్పించని వృత్తి సంఘాలు, శ్రేణులు, మళ్లీ ఈ శతాబ్దాల్లో ప్రసిద్ధి కెక్కాయి. వ్యవసాయ వృత్తి నవలంబించిన దిగువ వర్గాల, విభాగాల వాళ్లు ఉన్నత పదవుల కొచ్చి, క్రమేపీ పాలనా బాధ్యతలను చేపట్టటం, ఈ యుగంలో చెప్పుకోదగిన విశేషం. ఉపాధి కారణం వల్లనో, రాజకీయ, మత కారణాల వలన ఏర్పడిన యుద్ధాల వలననో, ఆ కాలంలో ప్రజలు ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వలస పోవటం జరిగేది. అలాంటి వలసల వలన, సామాజిక ఆచారవ్యవహారాలు, భాషా సంప్రదాయాలు మొదలైన విషయాల్లో, దేశంలో ఉన్న వేర్వేరు ప్రాంతాల

BRAOU

మధ్య సంబంధం ఎక్కువైంది. ఇది క్రమక్రమంగా, ప్రాంతీయ భాషా, సాహిత్యాలు వృద్ధి చెందటానికి, లలిత కళలు తమ ఉనికిని నిరూపించుకొనేందుకు **అవకాశ మిచ్చింది.** వైదిక కర్మకాండలు తగ్గి, సమాజంలో భక్తి మార్గం విస్తరించి, దేశం నాలుగు వైపులా ఆలయాలెన్నో నిర్మించబడ్డాయి. ఇలా ప్రజల జీవన విధానపు అన్ని రంగాల్లోనూ, ఈ యుగంలో చెప్పుకోదగిన మార్పులెన్నో ఏర్పడ్డాయి.

11.2 : సామాజిక పరిస్థితులు

మధ్య యుగాల తొలి దశగా భావింపబడుతున్న చాళుక్య యుగంలో, సమాజం లోని అన్ని రంగాల్లోను గణనీయమైన మార్పు లేర్పడ్డాయి. సామాజిక పురోగమనం, ఆర్థికాభివృద్ధి, చెప్పుకోదగిన విధంగా వాణిజ్యం వృద్ధి చెందాయి. ఈ పరిణామాలను పరుసగా పరిశీలిద్దాం.

11.2.1 : సమాజం, కులాలు, కుల విభాగాలు

సమాజంలో ఎప్పటి నుండో కొనసాగుతున్న వర్ణ వ్యవస్థ, కాలానుగుణమైన మార్పుల్తో, ఈ దశలో కూడ తన ఉనికిని కోల్పోలేదు. వర్ణాశ్రమ ధర్మ రక్షణ వీరి ఏలుబడిలో చక్కగా జరిగినట్లు, కొన్ని సందర్భాల్లో వర్ణించబడింది. అయితే, ఆసక్తికరమైన సామాజిక మార్పులు ఈ కాలంలో ఎన్నో జరిగాయి. చాతుర్వర్ణ విభాగానికి ఈ కాలంలో మరిన్ని మార్పులేర్పడి, అనేక శాఖోపశాఖలుగా విస్తరించింది. మత ఆధిక్యతను, ప్రత్యేకతను చాటుకొనే ప్రయత్నంలో పోటీ పడ్డారు. కొన్ని కొన్ని కులాలు తమ సాంఘిక కట్టుబాట్లను, సామాజిక నియమాలను తామే మలచుకొనేందుకు ఆయత్తమయ్యాయి. వృత్తులను బట్టి వలసలు, ప్రాంతీయ ప్రాతిపదికలనుబట్టి, వేర్వేరు మతాల ప్రభావాన్ని బట్టి, చాలా కులాల్లో విభాగాలేర్పడ్డాయి. బ్రాహ్మణ కులాల వంటి వాటిలో గోత్ర, వేద, సూత్ర, ప్రవరలను బట్టి విభజన ఏర్పడితే, మరికొన్నింటిలో వృత్తి, వలసల కారణంగా విభజన ఏర్పడి, నాలుగు వర్ణాల స్థానే, ఎన్నో కులాలు, కుల విభాగాలు చోటుచేసుకొన్నాయి. క్రమంగా, సామాజిక ఆంక్షలు, పరిమితుల్లో ఎన్నో మార్పులొచ్చాయి. అట్టడుగు వర్గాల వారి జీవన విధానంలో, సామాజికమైన ఉన్నతి ఈ దశ లోనే లభించింది. అప్పటి వరకు రోజువారి జీవన విధుల్లో, కనీస ప్రవేశం లేని అనేక విషయాల్లో, వీరికి ఆ కాలం నుండే కొంత వెసులుబాటు కల్పించబడింది. ఎవ్వరైనా వారి అభిష్టాన్ని బట్టి దానధర్మాలు చేసుకొనే హక్కు, ఆ దశ నుండే అమలు లోకి వచ్చింది. అప్పటి వరకు పరిమిత కులాల వారికే తప్ప, అందరికీ లభ్యం కాని సంస్కృత విద్యాభ్యాసం అందరికీ అందుబాటులోకి వచ్చింది. సామాజిక జీవితంలో ప్రతి వర్గం, కుల విభాగం తమతమ ప్రత్యేకతల్ని, ఆత్మగౌరవాన్ని పెంచుకొనేందుకు చాల ప్రయత్నాలను చేశారు. ఆ ఆత్మ విశ్వాసం కారణం గానే, అట్టడుగు వర్గాల లోని కొందరు రాజరికాల్ని సాధించటం, రాజకీయ ఉద్యోగాలలో చేరటం లాంటివి సంభవించాయి. ఎవరి కుల ధర్మాలను నిలుపుకోవటానికి, మార్చుకోవటానికి స్వయం నిర్ణయం తీసుకొనే అధికారం ఆ కులాల వారికే వుండేది. అలాగే, అప్పటి సామాజిక పరిస్థితులను బట్టి, కొన్ని రకాల వేడుకలు కొన్ని కులాల వారికే పరిమితమయ్యాయి. వేర్వేరు కులాల గౌరవమర్యాదలకు, కులపు హెచ్చుతగ్గులకు సంబంధించిన శాసనాలు ఈ కాలంలో కన్పిస్తాయి. కుల సంఘాల్ని పటిష్టం చేసుకొనేందుకు, వ్యాప్తి చేసుకొనేందుకు, చాల ప్రయత్నాలు జరిగాయి. ప్రాచీన కాలంలో వర్ణ విభాగాలు నాలుగే అమలులో ఉన్నాయనుకొన్నప్పటికీ, ఈ కాలానికి వైన వేర్కొన్నట్లు, వృత్తి ప్రాంతీయత, మరి కొన్ని ఇతర కారణాల్ని బట్టి, సమాజంలో ఎన్నో అంతరాలేర్పడ్డాయి. దీనికి కేవలం వైదిక మత సంప్రదాయాలు కారణమనుకొనేందుకు వీలు లేదు. సమకాలీన కాలంలో జైన మతం లాంటి అవైదిక మతాల్లో కూడ, చాతుర్వర్ణ వ్యవస్థ ఉండేది.

BRAOU

11.2.1.1 : బ్రాహ్మణులు

ఆ నాటి సమాజంలో బ్రాహ్మణులు అగ్ర స్థానం లోనే గుర్తింపబడి, గౌరవింపబడేవారు. వైదిక వృత్తి, విజ్ఞాన సముపార్జన, అధ్యాపన వృత్తి బాధ్యతలు కారణాలుగా, సమాజంలో వీరి ప్రాధాన్యత ఇనుమడించింది. చారిత్రకాధారాల్లో ఏ కులాన్ని గురించి తెలియనంత పెచ్చుగా, వీరి వివరాలు తెలుస్తున్నాయి. ఆ నాటి సమాజంలో పెచ్చుగా విద్య నభ్యసించినది, వేదవేదాంగ విద్యల అధ్యయన, అధ్యాపనల్ని బాధ్యతగా స్వీకరించింది కారణాలుగా, వీరికి ప్రత్యేక గౌరవం లభించి ఉండొచ్చు. సమకాలీన రాజ వంశాల దాన శాసనాలన్నింటిలో, దాన గ్రహీతలుగా ఎందరెందరో బ్రాహ్మణుల పాండిత్య ప్రకర్ష వివరాలున్నాయి. కొందరు మాత్రం రాజకీయపరమైన లౌకిక వృత్తులలో చేరి, మంత్రులుగా, దండనాయకులుగా పరిపాలనా బాధ్యతలను స్వీకరించారు. ఈ వృత్తిపరమైన తేడాలను బట్టి, బ్రాహ్మణుల్లో నియోగులనే విభాగం ఈ కాలం లోనే ఏర్పడింది. ఈ యుగంలో పాలక వంశాలకు బాసటగా నిల్చి పేరు తెచ్చుకున్న మంత్రులు, దండనాయకులు రమారమి అందరూ, బ్రాహ్మణ కులాల్లోని వారే. అయితే, వారు వారు సాధించిన విజయాలను బట్టి, అది అపాత్ర ప్రోత్సాహమనుకునే అవకాశం లేదు. పండరంగని లాంటి సేనాపతిని ఎదుర్కొగలిగిన యోధులు లేకపోయారంటే, యుద్ధ విద్యలో, రణతంత్రంలో వారి కృషి, పరిశ్రమ తెలుస్తాయి. సమాజం లోని అన్ని వర్గాల తోటి, వీరికి సత్సంబంధాలుండేవి. **'విజ్ఞానేశ్వరం'** లాంటి తర్వాతి కాలపు గ్రంథాలలో, బ్రాహ్మణులకు కొన్ని నిత్య జీవన వ్యవహారాలలో మినహాయింపు లివ్వబడినట్టు, పేర్కొనబడింది. గోత్ర విభాగాల్ని బట్టి, ప్రవర, శాఖ మొదలైన వాటి ప్రాతిపదికనుబట్టి, బ్రాహ్మణులలో విభాగాలున్నాయి. అలాగే, ఏ ప్రాంతం కేంద్రంగా ఏఏ బ్రాహ్మణ కుటుంబాలు ఉండేవో, ఆ ప్రాంతాల్ని బట్టి వారు గుర్తింపబడేవారు. వేంగినాటివారు, వెలనాటివారు, పాకనాటివారు, కమ్మనాటివారు మొదలైన విధంగా, ప్రాంతీయతను బట్టి చెప్పబడేవారు. మత, రాజకీయ విషయాల్లో ఏర్పడిన అసంతృప్తి కారణంగాను, ఈతి బాధలు కారణంగాను, రాజాదరణ లాంటి ఆకర్షణలు కారణంగాను, బ్రాహ్మణ కుటుంబాల్లో ఈ యుగంలో ఎన్నో వలసలు సంభవించాయి. అలాంటి వలసలు పెచ్చు సంఖ్యలో జరిగేటప్పుడు, వారి కందరికి పాలకులే గృహ వసతిని కల్పించటం జరిగేది. చాళుక్యుల కాలంలో, ఘంటసాల ప్రాంతంలో, రెండు వేల బ్రాహ్మణ కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వబడ్డాయి. వీరచోడుని కాలంలో ద్రవిడ దేశం నుండి పెచ్చు స్థాయిలో బ్రాహ్మణుల కుటుంబాలు వచ్చి, గోదావరీ తీర ప్రాంతాల్లో నివాసాలేర్పర్చుకొన్నారు. ఇలాంటి పెచ్చు సంఖ్యలో ఏర్పడిన వలసల కారణం గానే, వీరిలో నాడీ భేదం, ప్రాంతీయ భేదం ఏర్పడ్డాయి. అలాగే, వీరి ఇంటి పేర్లలో కూడ ఆ ప్రభావం కన్పిస్తుంది. (ఉ.దా. పావులూరి మల్లన, కొట్టరువు కొమ్మన మొదలైనవి.)

జన్మతః వీరికి సంక్రమించినదనుకుంటున్న ఔన్నత్యం వలన కంటే, వీరి గౌరవప్రదమైన వృత్తి కారణంగానే, సమాజంలో వీరి స్థానం గుర్తింపబడేది. వైదిక విద్యా సంబంధమైన అంశాల పోషణ నిమిత్తం, వీరికి ఉపాధి కోసం ఇవ్వబడ్డ లెక్కలేనన్ని అగ్రహారాల ప్రస్తావన శాసనాల్లో వస్తుంది. ఎప్పుడో అత్యంత క్లిష్ట సందర్భాల్లో తప్ప, అలాంటి అగ్రహారాలపై అన్ని రకాల పన్నులను విధించేవారు కారు.

11.2.1.2 : క్షత్రియులు

పరిపాలనా బాధ్యతల్ని తమ విధిగా పరిగణించే క్షత్రియులు, యోధుల వర్ణంగా గుర్తింపబడ్డారు. అయితే, వెనుకటిలా, వారొక్కరే యుద్ధాల్లో పాల్గొ లేదు. యుద్ధమే వృత్తిగా, అన్ని కులాల్లోంచి

BRAOU

కొన్ని కుటుంబాలు ముందుకొచ్చాయి. అలా అవలంబించిన యోధ వృత్తిని బట్టి, చతుర్థ కులానికి సంబంధించిన ఎన్నో కుల విభాగాల వాళ్లు పాలనా బాధ్యతల్ని స్వీకరించి, రాజులుగనే చెలామణీ అయ్యేవారు. పూర్వపు క్షత్రియుల్తో సమానమని చాటుకోవటంకోసం, సూర్య, చంద్రుల నుండి వంశానుక్రమణికలను వెతుక్కోవటం, ఇప్పటి నుండే ప్రారంభమైంది. చాళుక్యులు చంద్ర వంశం వాళ్లమనీ, రేనాటి చోళులు సూర్యవంశం వాళ్లమనీ చెప్పుకోవటం, శాసనాల్లో కన్పిస్తుంది. క్రమంగా, క్షాత్ర ధర్మాన్ని నిర్వహించే వాడే క్షత్రియుడనే భావం ప్రబలింది.

11.2.1.3 : వైశ్యులు

ఈ కులం వారు శ్రేష్టి, సెట్టి, కోమటి మొదలైన పేర్లతో పిలవబడతారు. సంప్రదాయకమైన చాతుర్వర్ణ వ్యవస్థలో వీరి వృత్తి వ్యవసాయ, పశుపోషణలే అయినా, ఈ యుగానికి ఎంతో మార్పు వచ్చి, వర్తక వ్యాపారాలే వీరి ముఖ్య వృత్తి అయ్యాయి. వీరు జైన మతావలంబికులనీ, అసలు 'కోమటి' అనే పదం గోమఠేశ్వర పదం నుండి వచ్చిందనీ అంటారు. దేశం లోపల, బయటా, శ్రేణులుగా ఏర్పడి, వీరు సాగించే వ్యాపారం, వీరు ధనవంతులు కావటాన్కి, వర్తక కార్యకలాపాలు విస్తరించటానికి ఉపయోగపడింది. కాలక్రమేణ, ఈ కులం లోని కొన్ని కుటుంబాల వారు పరిపాలనా వ్యవస్థలో, ఆర్థిక సంబంధ వ్యవహారాలలో ప్రవేశించి, రాజ మర్యాదలు పొందినట్టు తెలుస్తోంది. తమ ఆస్తుల రక్షణకు, వ్యాపార ప్రయాణాలలో భద్రతకు, వీరు స్వంత సైన్యాలను ఏర్పర్చుకోవటం, కొన్ని పరిస్థితులలో తమ పరిపాలకులకు సైతం అప్పు లీయటం, ఆర్థికంగా వీరి ఎదుగుదలను, ప్రాబల్యాన్ని తెలియజేస్తాయి. బ్రాహ్మణుల్లాగే గోత్ర నామాలను ధరించటం, ఈ యుగంలో వీరిలో వచ్చిన మరో పరిణామం. ఇతర కులాల్లాగే స్వస్థాన మూలాధారంగా వీరిలో కూడ, విభాగాలేర్పడ్డాయి. వ్యాపార వృత్తి సక్రమ నిర్వహణకు వీరంతా ఒక శ్రేణిగా ఏర్పడేవారు. వారి హక్కుల పరిరక్షణ కోసం, వారు వెసులుగా ఉన్న ప్రాంతాల్లో వారి కుల పరిషత్తులనదగ్గ 'నకరము' లేక 'నగరము'లను ఏర్పాటు చేసుకొనేవారు. తమ కులానికి సంబంధించిన వ్యవహారాలను, సమస్యలను పరిరక్షించటానికే, ఆ శ్రేణులు కృషి చేసేవి. పెనుగొండ లోని వాసవీ కన్యక, ఈ కులం వాళ్ల కుల దేవత. ఆ వాసవీ కన్యకను ఓ చాళుక్య రాజు బలాత్కరించబోగా, ఆమె అగ్నిలోకి దూకి, మరణించిందనే వారి కుల పురాణంలో, చారిత్రక సత్యం లేదు. పరిపాలకుల ఆజ్ఞల కన్న కుల ధర్మాన్ని పాటించటం, కుల కట్టడికి బద్ధులు కావటం, సాంఘిక కార్యకలాపాలకు కుల పెద్దల అనుమతిని తీసుకోవటం జరిగేది. ఈ కులం లోని కొన్ని విభాగాలవారు వేర్వేరు కారణాల వల్ల చతుర్థ కుల విభాగాల్లోకి వెళ్లి పోయారనీ, ఆ విభాగాల్లోని కొందరు వృత్తి సంబంధంగా వీరిలో వచ్చి చేరారనీ, కొందరి అభిప్రాయం.

11.2.1.4 : శూద్రులు, వృత్తికులాలు, శ్రేణులు

చాతుర్వర్ణ వ్యవస్థలో పై మూడు వర్ణాలకు చెందని వర్ణమే, శూద్రులని వ్యవహరింపబడతారు. వీరిది, విభిన్న ప్రత్యేకతలను సంతరించుకొని, వేర్వేరు విభాగాల్తో, కులాల్తో ఏర్పడ్డ బహుళ సంఖ్యాంకితమైన వర్ణం. ఇతర కులాల్లాగే, జీవన మార్గం కోసం చేపట్టిన వృత్తి, పుట్టుక, ప్రాంతీయత మొదలైన భేదాలను బట్టి ఈ కులంలో కూడ ఎన్నో విభాగా లేర్పడ్డాయి. సేద్య వృత్తిని అవలంబించిన కుల విభాగాలవారు కొందరైతే, చేతి వృత్తుల నవలంబించిన ఉప కులాలు మరి కొన్ని ఏర్పడ్డాయి. మధ్య యుగాల్లో జరిగిన యుద్ధాల్లో సైనిక వృత్తి నవలంబించిన వారిలో పెచ్చు మంది నిస్సందేహంగా ఈ కులానికి చెందిన వారే. అనేక పరిశ్రమలు, చేతి వృత్తులతోపాటు, అనంఖ్యాకమైన ఆలయా

BRAOU

ల్లోని క్రియాకలాపాల్లో కూడ, వీరి ప్రమేయముండేది. రాజకీయ, సైనిక ఉద్యోగాల్లో ప్రవేశించి, సామాజికంగా పటిష్టపడటమే కాకుండా, ఆ అవకాశాన్ని అదనుగా తీసుకొని, ఈ కులం వారు కొందరు రాజ్యాధికారాన్ని చేపట్టటానికి కూడ, అవకాశం కలిగింది. చాళుక్య సామంతులైన వెలనాటి రాజులు, కొండపడమట్లు, త్యాగి, పరిచ్ఛేది మొదలైన వారంతా, శూద్ర కులానికి చెందినవారే. రాజకీయ ప్రాబల్యం, ఆర్థిక పుష్టి సాధింపబడగానే, వీరిలో సాంఘిక పరివర్తన మేర్పడింది. అప్పటి వరకు సామాజికంగా కొన్ని జీవన విధుల్లో ప్రవేశం లేని ఎన్నో విషయాల్లో, శూద్ర కులానికి వెసులుబాటు కల్పించబడింది. శూద్ర కులం లోని ఎన్నో విభాగాలు, ఆత్మవిశ్వాసంతో నిబ్బరపడి, విలక్షణాన్ని కోవటాన్కి, ఆ మార్పు దోహదకారైంది.

పాలనాధిపత్యం లభించిన శూద్ర కుటుంబాల వారు కూడ, మిగిలిన పాలక కుటుంబాల వారి లాగే, ఘనమైన వంశ ప్రశస్తుల్ని కల్పించుకోవటం, అట్టహాసమైన బిరుదు నామాల్ని చెప్పుకోవటం మొదలైంది. చేత వృత్తుల్ని అవలంబించిన కుల విభాగాల వారు, వెనుకబడి, సేద్య వృత్తి నవలం బించినవారే రాజ్యాల్ని ఏర్పర్చుకోవటం లోను, పాలనాబాధ్యతలను చేపట్టడం లోను, అధిగమించారు. అయితే, సాంఘిక హోదా కోసం వృత్తి కులాలవారు కూడ ఎంతటి తపన పడ్డారో, సమకాలీన చారిత్రకాధారాలు వెల్లడిస్తాయి. గతంలో తాము ప్రత్యేక ప్రాంతానికి సంబంధించిన వారమని భావిస్తూ, కొన్ని విభాగాల వారు దానినే స్వస్థానంగా చెప్పుకోవటం మొదలు పెట్టారు. సాంఘిక జీవన గమనంలో ఇతర వర్గాలతో పోటీ పడి, తమ ఆత్మగౌరవాన్ని పెంపొందించుకొనేందుకు చేసిన అనేక ప్రయత్నాలు, క్రమంగా వారి వారి కుల ధర్మంగాను, కుల కట్టడిగాను పరిణమించాయి. సాంఘికంగా వెనుకబడ్డామనే తపన, కొంత వరకు ఈ ప్రయత్నాలకు వెనుక నున్న కారణం కావచ్చు. వ్యవసాయం విస్తరించటంతో, చతుర్థ వర్ణం వారి ఆర్థిక పరిస్థితి కూడా క్రమంగా మెరుగు కావటం, దీనికి దోహద కారైంది. రమారమి అన్ని కుల విభాగాల వారికీ కుల సంఘాలు, వృత్తి సంఘాలుండేవి. శూద్రుల లోని వెలమ, కమ్మ మొదలైన విభాగాలు, ఆయాప్రాంతీయ విభాగాల్ని (వెలనాడు, కమ్మనాడు) బట్టి వచ్చాయనీ; రెడ్డి అనేది తొలి దశలో రాష్ట్రకూట ప్రముఖుడు, లేక రట్టోడి అనే గ్రామ పరిపాలనకు సంబంధించిన అధికారనీ, క్రమంగా శూద్రుల లోని ఒక విభాగం పేరుగా, మిగిలిపోయిందనీ చెప్పారు. నాయకులు, రెడ్లు, కాపులు మొదలైన వారికి సంబంధించిన అనేక శ్రేణీ వ్యవస్థలు, ఆనాడు గ్రామ స్థాయిలో పాలనకు, వేర్వేరు తెగల, వృత్తి పనివారల అభ్యున్నతికి పాటుపడుతుండేవి. ఆనాటి సామాజిక వ్యవస్థలో పటిష్టమైన వారి కుల సంఘాలు, వారి సాధారణ జీవనంలో భాగమై, వారి వారి సాంఘిక, ఆర్థిక రంగాల మీద, గణనీయమైన ప్రభావాన్ని చూపించాయి. బ్రాహ్మణులకు అగ్రహారాల నిచ్చే సందర్భంలో, వారికి దఖలుపడే భూములపై అధికారాలను రూఢిపర్చేటప్పుడు, "రైతులతో సహా" అని స్పష్టం చేయబడేది. ఎవ్వరినీ తాము సాగుబడి చేస్తున్న భూముల నుండి తప్పించకుండా, కేవలం శిస్తు వసూలు చేసుకొనే హక్కు మాత్రం అగ్రహారికుల కివ్వబడేది. ద్రాక్షారామ సమీపం లోని ఎడరుపల్లి గ్రామంలో, తెలికి, కుమ్మరి, కమ్మరి, కంసాలి, కంచరి, కొబ్బరి, పోక తోటల వారికి, మంగలి, చాకలి, మేదరి, చర్మకారులకు వేర్వేరుగా మాన్యాలిస్తున్నట్టు, చాళుక్య యుగం నాటి ఓ శాసనంలో ఉంది. తమిళ సంస్కృతికి చేరువైన తెలుగు ప్రాంతాల్లో, 'చిత్రమేలి' మొదలైన శ్రేణీ వ్యవస్థలు, వ్యవసాయదారుల ప్రయోజనాల్ని పరిరక్షించేవి. తెలికివారికి, సాలీలకు, విశ్వకర్మలకు, మొదలైన వారికి, వృత్తి సంఘాలుండేవి. బెజవాడ కేంద్రంగా ఏర్పడ్డ 'తెలికివేవురు' అనే తెలికివారి శ్రేణీ వ్యవస్థ విభాగాలు ఆంధ్ర దేశ మంతటా విస్తరించాయి. వేంగీ చాళుక్యులకు తామే కులక్రమాగత సేవకులమనీ, వారికి రాజ్యారంభ కాలం నుండీ రక్షణ కల్పించి, సుస్థిరపర్చింది తామే అనీ, తెలికివారు గొప్పగా చెప్పుకొన్నారు. ఆ సేవలకు ప్రత్యుపకృతిగానే, చాళుక్యులు వీరిని గొప్పగా సత్కరించినట్టు,

BRAOU

'టీకి' తామ్ర శాసనం తెలియజేస్తూంది. ఇలా వేర్వేరు కుల విభాగాల వారి ఆచారాల గురించి, వివాహ మర్యాదల గురించి, కుల బహిష్కరణలను గురించి, చారిత్రకాధారాల్లో కొన్ని సందర్భాల్లో చెప్పబడింది. అన్ని కులాల, అన్ని వృత్తుల వారి లాగే, వేశ్యలు కూడ శ్రేణులుగా ఏర్పడి, తమ హక్కుల రక్షణ కోసం ఉద్యమించినట్లు, ఎన్నో శాసనాల్లో ప్రస్తావించబడిన "సానిమున్నూర్వురు" అనే వ్యవస్థను బట్టి తెలుస్తూంది. వెలనాటి చోడ రాజైన మొదటి గొంకరాజు ఒక వేశ్యను పెళ్లిచేసుకోవటం, గంగ రాజుల కాలం లోని గోకర్ణ నాయకుడు వేశ్యా పుత్రుడుగా చెప్పబడటాన్ని బట్టి, ఆ కులం వారి సాంఘిక హోదా తెలుస్తుంది.

బోయల కుల విభాగాన్ని గురించి చరిత్ర పరిశీలకుల్లో కొంత సందిగ్ధత ఉంది. 'భోజ' శబ్ద భవులు వాడే అని కొందరి అభిప్రాయం. వీరు వేటగాళ్లని, ఆటవికులని, క్రూరులని, సాహిత్యంలో వర్ణనలున్నాయి. శాసనాల్లో అసంఖ్యాకంగా కనిపించే బోయలు, తర్వాతి దశలో ఏ కుల విభాగంలో కలిసిపోయారో తెలీదు. కందుకూరు, నెల్లూర్ ప్రాంతాల్లో ఈ వేరు గల తెగ పరిపాలిస్తూ, చాళుక్య, పల్లవ రాజ్యాల మధ్య ఒక కీలకమైన పాత్రను నిర్వహించారు. తర్వాతి కాలంలో క్రమంగా వీరు రాజాస్థానాల లోనూ, ఆలయాల్లోనూ సేవకులుగా నియమించబడి, మిగిలిన తెగలలో కలిసిపోయి ఉంటారు.

11.2.2 : విద్యలు, విద్యా కేంద్రాలు

చాళుక్య యుగంలో మత సంబంధమైన వైదిక విద్యలకు ఎంతో ఆదరణ లభించింది. వేద వేదాంగాలు, పురాణేతిహాస, ధర్మశాస్త్ర, ఆగమ, వ్యాకరణ, వేదాంత, తర్క, ఖగోళ, రాజనీతి, గణిత, ఆయుర్వేద శాస్త్రాలు, ఆనాడు అభ్యసింపబడినట్లు తెలుస్తోంది. ఈ యుగ శాసనాల్లో తరచు ద్వివేది, త్రివేది, చతుర్వేదుల ప్రస్తావన వస్తుంది. చాల దాన శాసనాల్లో, దాన గ్రహీత బ్రాహ్మణుల విజ్ఞాన విషయం, గొప్పగా వర్ణించబడింది. వెద మద్దాలి శాసనంలో, గుప్త శర్మ, ఒక్క తర్కం మీదే డెబ్భై వ్యాఖ్యానాలను అభ్యసించాడు. నిడుపర్రు శాసనం లోని కశ్యపశర్మ, వేద, ఇతిహాస, పురాణ, ధర్మశాస్త్ర, ఆగమ, ఉపనిషత్తులను క్షుణ్ణంగా అభ్యసించాడు. అతని తాతైన మండశర్మ పద క్రమ అనుక్రమాల్లో, రెండు వేదాల్ని నేర్చుకోవటమే కాకుండా, కల్ప, పురాణ, ఇతిహాస, ధర్మశాస్త్రాలలో పండితుడిగా, అసనపుర ఘటికాస్థానంలో ఉండేవాడట! చాళుక్యుల కాలంలో ఒక ప్రముఖ ఘటికాస్థానంగా, అసనపురం ప్రసిద్ధి కెక్కింది. సమకాలీన విద్యలకు సంబంధించి, వైదిక శాస్త్ర విద్యలకు సంబంధించి, అత్యంత ఉన్నతమైన కేంద్ర స్థానాన్నే ఘటికాస్థానమంటారు. చాళుక్యుల చాల శాసనాలు అసనపుర వాసకం నుండే ఇవ్వబడ్డాయి. చతుర్దశ విద్యలతోపాటు, ఆయుర్వేద, ధనుర్వేద, గాంధర్వ, అర్థశాస్త్రాలను కూడ బోధించేవారు. ఇలాంటి ఘటికల్లో పట్టభద్రులైన పండితులే, 'ఘటశాసి'గా పిలువబడతారు. రాజరాజ నరేంద్రుడు తాను పురాణాలు, అర్థ, ధర్మ శాస్త్రాలు, కావ్య, నాటకాలను పఠించి, ఈశ్వరాగమాలపట్ల శ్రద్ధ వహించినట్లు, చెప్పుకొన్నాడు. అయితే, మత సంబంధమైన విద్యలు, ఉన్నత వర్గీయులకు కావాల్సిన విద్యలు మాత్రమే ప్రముఖంగా అప్పట్లో బోధింపబడి ఉండొచ్చు. సామాన్య జనం అభ్యసించే విద్యల గురించి తెలుసుకోవటాన్కి, ఆధారం లేదు.

విద్యాభ్యాసం ప్రముఖంగా అగ్రహారాలు, బ్రహ్మపురిలు, ఘటికలు, ఆలయాలు, మఠాల ద్వారా జరిగేది. ఆలయాలు, బ్రాహ్మణ పండితులు స్వీయ విద్యా కేంద్రాల్ని నెలకొల్పడమైంది. సంప్రదాయకమైన సంస్కృత విద్యాభివృద్ధికి, అగ్రహారాలు పట్టుకొమ్మలుగా నిల్చాయి. అలాంటి విద్య,

BRAOU

సంస్కృతుల పోషణకుగానే, పండితులకు ఆ అగ్రహారాలివ్వబడినట్లు అనుకోవచ్చు. కొన్ని అగ్రహారాల దాన పత్రాల్లోనే, అవి విద్యా దానం కోసం ఇవ్వబడినట్లు పేర్కొనేవారు. అగ్రహారాల్లో గాని, ఆలయ మఠాల్లో గాని, విద్య ఉచితంగానే బోధింపబడేది. చాల సందర్భాల్లో వసతి భోజన సదుపాయాలు కూడ కల్పించబడినట్లు ఆధారాల వల్ల తెలుస్తోంది. హేమవతి లోని నొనంబేశ్వర ఆలయం ఒక ఘటికాస్థానమనీ, అక్కడ తొంభై మందికి పైగా విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించబడిందని, హిరె సముద్ర శాసనం (అనంతపురం జిల్లా) పేర్కొంటుంది. కొన్ని విద్యా కేంద్రాలకు అనుబంధంగా, పెద్ద పెద్ద గ్రంథాలయాలు కూడ నిర్వహింపబడినట్లు తెలుస్తోంది. 'నాగాయి'లో ఒక పెద్ద గ్రంథాల యాన్ని, విద్యా కేంద్రపు అనుబంధంగా నడిపారు. ప్రభుత్వ పరిపాలకుల ఆర్థిక సహాయమే కాకుండా, వ్యక్తుల, సంస్థల, శ్రేణుల సహాయసహకారాలు కూడ, వీటి నిర్వహణలో తోడ్పడేవి. ఏలేశ్వరం, ద్రాక్షారామం మొదలైన మత కేంద్రాల్లోని మఠాలు, విద్యా వ్యాప్తికి ఇతోధికంగా తోడ్పడ్డాయి. కొన్ని ఆలయాలు విద్యా సత్రాల్ని నెలకొల్పాయి. కొన్ని రకాల విద్యల పెంపుదలకు, వ్యాప్తికి, మతం అడ్డంకి అయ్యేది కాదు. జ్యోతిష్య శాస్త్ర ప్రభావం వల్ల, శని గ్రహం కారణంగా ఏర్పడ్డ దుష్ఫలితాల్ని నివారించినందుకుగాను, ఒక జైన మఠానికి దానా లొసగబడ్డాయి. జ్యోతిర్వృత్తికి పురస్కారాలు, దానాలు ఇవ్వబడటం; రాజాస్థానాల్లో జ్యోతిష్యులను నియమించుకోవటం, ఆ శాస్త్ర ప్రాచుర్యాన్ని తెలియజేస్తాయి. అలాగే, గణిత శాస్త్రంలో కూడ, ఈ కాలంలో ఎంతో కృషి జరిగింది. రాజరాజ నరేంద్రుని కాలంలో ఉన్న పావులూరి మల్లన, మహావీరాచార్యుడనే జైన పండితుడు వ్రాసిన గణిత శాస్త్రాన్ని **'సారసంగ్రహ గణిత'** మనే పేరుతో అనువదించాడు. ఆ గ్రంథం ఆనాడు వాడుకలో నున్న నాణేలు, మానాలు, కొలతలను పేర్కొంటుంది. ప్రసిద్ధమైన అలాంటి శాస్త్ర గ్రంథాల అనువాదానికి, మతోన్మాదాలు ఆటంకం కాకపోవటమునేది, గొప్ప విషయం. తర్వాతి కాలంలో ఆయుర్వేదం లోను, వ్యవసాయ శాస్త్రం లోను చేసిన ప్రయత్నాలు, విద్యల లోని శాస్త్రీయ, సాంకేతిక పురోభివృద్ధిని తెలియజేస్తాయి.

BRAOU

11.2.3 : సమాజంలో స్త్రీల స్థానం

పితృస్వామ్యమైన సమకాలీన సమాజంలో స్త్రీలపై ఆంక్షలుండటం, అసహజమేమీ కాదు. అయితే, స్త్రీల గౌరవ, హోదాలకు అదేమీ అడ్డంకి కాదు. స్మృతి గ్రంథాల లోను, కొన్ని జైన గ్రంథాల లోను, స్త్రీల స్వేచ్ఛలపై పరిమితులు, ఆంక్షలు విధించబడినప్పటికీ, అవి పూర్తిగా సమకాలీన వాస్తవాలను ప్రతిఫలిస్తున్నాయని అనుకోనక్కర్లేదు. రాజకీయాలు మొదలు లలిత కళల వరకు, కొన్ని వర్గాల స్త్రీల ప్రమేయ, ప్రవేశాల్ని చెప్పగలిగిన ఆధారాలెన్నో ఉన్నాయి. చాళుక్య, రాష్ట్రకూట సంబంధాలలో వైవాహిక దౌత్యం విఫలమైనప్పటికీ, ఇతర సందర్భాల్లో, ముఖ్యంగా చోళ రాణులు వరుసగా చాళుక్య రాజుల్ని పరిణయ మాడటంతో, ఆంధ్రుల చరిత్ర, సంస్కృతుల లోనే, గణమీయమైన మార్పు లేర్పడ్డాయి. కుందవ్వ, అమ్మంగదేవి, మధురాంతకి, వంటి వారి కారణంగానే, వేంగి రాజరికంపై చోళ ప్రభావమేర్పడినట్లు భావించుకోవచ్చు. ఉన్నత కులాల స్త్రీలు, వేశ్యలు లలితకళల లోను, ఇతర అవసర విద్యల లోను, ప్రావీణ్యాన్ని గడించేవారు.

11.3 : ఆర్థిక పరిస్థితులు

శాతవాహన యుగం తర్వాతి కాలంలో సాధింపబడినంత ఆర్థికాభివృద్ధి, ఏ కాలం లోనూ సాధిం పబడలేదు. వ్యవసాయోత్పత్తులు, వాణిజ్యాల మధ్య సమతుల్యత పాటింపబడింది. వీటిని వివరంగా పరిశీలిద్దాం.

11.3.1 : వ్యవసాయం, భూవర్గీకరణ, నీటి పారుదల, భూమి కొలతలు

ఈ శతాబ్దాల నాటికి, సమాజం భూమ్మీద, వ్యవసాయం మీద, ఆధారపడటం మెక్కువైంది. బ్రాహ్మణులకు, సైనిక కుటుంబాల వారికి భూములిచ్చే ఆచారం, క్రమంగా పెరిగింది. జనాభా పెరగటం, భూమి మీద వత్తిడి పెచ్చటం కారణంగా, వ్యవసాయ విస్తరణ తప్పనిసరైంది. గ్రామ కంఠాలలో పీలైనంత మేరకు సాగుదల పెచ్చటం, బంజర భూముల్ని, ఇతర అటవీ భూముల్ని పంట భూములుగా మార్చటం, అవసరమైంది. పన్ను విధింపు కోసం, వ్యవసాయ భూముల్ని వేర్వేరు రకాలుగా పరిగణించేవారు. పల్లపు భూములు, చేక తరి భూములు, మెట్ట భూములు, రేక గరువులు, తోట భూములుగా, భౌగోళిక స్వరూపం, పంటల వైనాన్ని బట్టి, విభజన జరిగేది. నీటి సౌకర్యాన్ని బట్టి, భూసారాన్ని బట్టి, పంటల దిగుబడులను బట్టి కూడ, నీటి నిర్ణయం జరిగేది. ఆ కాలపు శాసనాల్లో వాణిజ్య పంటలైన కొబ్బరి, తమలపాకు, పోక తోటలు, మామిడి, చెరకు, ప్రత్తి, కాయధాన్యాలు, పప్ప దాన్యాలు ప్రస్తావించబడ్డాయి.

పల్లపు వ్యవసాయానికి నీటిపారుదల కోసం, ఆవలు, కుంటలు, చెరువులు, బావులను ఏర్పర్చి, ఆ నీటిని వ్యవసాయానికి ఉపయోగించేవారు. తటాకాలను త్రవ్వించటం, మహా పుణ్య కార్యంగా పరిగణింపబడేది. సంపన్నులు, సామంతులు, ధనిక రైతులు, తటాక నిర్మాణాల కోసం, వాటి నిర్వహణ కోసం, సహాయపడేవారు. వేర్వేరు శాసనాల్లో ఉన్న సరిహద్దు ప్రస్తావనల్లోను, ఇతర చోట్ల, ఎన్నో చెరువుల, ఇతర నీటి వనరుల సూచనలున్నాయి. రెండో అమ్మరాజు తాడికొండ శాసనంలో చెప్పిన చైత తటాకం, భీమ సముద్రం, ఈనాటికీ సేద్య భూములకు నీరందిస్తున్నాయి. గుంటూర్ జిల్లా చేబ్రోలులో, అనంత సరోవర మనే పెద్ద చెరువు ఉన్నట్టు, పశ్చిమ చాళుక్యుల శాసనం పేర్కొంటుంది. మహబూబ్‌నగర్ జిల్లాలో భీమ సముద్రం, గుంటూర్ జిల్లాలో ద్రోణ సముద్రముండేవి. రెండో కులోత్తుంగ రాజేంద్రుని సామంతులు, ప్రోలినాయుక చెరువు, పొట్ట చెరువు, మొదలైన వాటిని త్రవ్వించారు. కొత్త భూములను సాగులోకి తెచ్చిన వారికి, ప్రారంభంలో కొన్ని సంవత్సరాలు పన్ను లేకుండా చేసి, పాలకులు వ్యవసాయాన్ని ప్రోత్సహించేవారు. తోటల్ని, తేట భూముల్ని ఆలయాలకు దానం చేసిన సందర్భాలు కూడ, శాసనాల్లో చాల ఉన్నాయి. ద్రాక్షారామ భీమేశ్వరుని ఆలయంలో అఖండ దీప నిర్వహకు రెండు వేల పోక చెట్ల తోటను, నిజామాబాద్ జిల్లా పెంట గ్రామంలో దేవునికి ఒక మామిడి తోటను; బాపట్ల ఆలయానికి ఒక మామిడి తోటను, ఇచ్చినట్లు శాసనాల్లో ఉంది.

భూమి మీద హక్కులు ఏవిధంగా ఉండేవో, కొన్ని ఆధారాలను బట్టి తెలుసుకోవచ్చు. ప్రతి భూస్వామికి దాన, క్రయ, విక్రయాలకు తన భూమి మీద సంపూర్ణాధికారం ఉంటుంది. కాని, అవి చేసే ముందు, సంబంధిత గ్రామ పెద్దలతో, అధికారులతో చెప్పి, ఆమోదాన్ని పొందాలి. బంజర్ల మీద ఎవ్వరికీ సొంత హక్కు ఉండదు. రాజులకు, సామంతులకు రాజ్య వ్యాప్తంగా సొంత భూములు చాల ఉంటాయి. అవి కాక, సైనిక సేవల దృష్ట్యా ఇచ్చిన మాన్యాలు, అగ్రహారాలు, దేవదేయాలు (ఆలయ దానాలు) కూడ ఉంటాయి. ఏదైనా ఒక గ్రామాన్ని దానం చేసినపుడు, పన్నుల మినహాయింపు ఏ మేరకు ఇవ్వబడింది, స్పష్టంగా పేర్కొనబడేది. 'సర్వకరపరిహారువు' (అంటే, అన్ని పన్నుల నుండీ పరిహరింపబడినది) అని పేర్కొనబడినప్పటికీ, చాల సందర్భాల్లో ఆ మినహాయింపు కొన్ని పన్నులకు మాత్రమే నని తెలుస్తోంది. రాజులు, సామంతులు కూడ దానా లిచ్చిన సందర్భంలో, అవసరాలను బట్టి, వ్యక్తుల స్వంత భూముల్ని కొని యిచ్చే ఆచార ముండేది. దాన మిచ్చిన భూములు, గ్రామాలు, అంతర్యుద్ధ సమయాల్లోను, కల్లోల సమయాల్లోను, చెదిరిపోతే,

BRAOU

తర్వాతి కాలపు పాలకులు వాటిని పునరుద్ధరించి ఇచ్చేవారు. కొన్ని సందర్భాల్లో అక్కడక్కడ, దానప్రతిగ్రహీత తన కివ్వబడిన భూముల్ని వేరే కొంత మందికి భాగాలుగా పంచటం, కన్పిస్తుంది. రెండో విష్ణువర్ధనుడు కొణికి గ్రామాన్ని విదుశర్మకి దానం చేస్తే, అయన ఆ భూమిలో కొంత మందికి భాగాల నిచ్చారు. భూములు వ్యక్తుల స్వంత ఆస్తులుగా వృద్ధి చెందటంతో పాటే, భూమి తగవులు కూడ వృద్ధి చెందాయి. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో దేవాలయ భూముల మీద, అగ్రహారాల మీద కూడ పన్ను విధింపు ఉండేది. పశ్చిమ చాళుక్యుల ఏలుబడిలో ఒకే మారు కొంత మొత్తాన్ని ముందే చెల్లించేస్తే, పూర్తిగా పన్ను తొలగించిన సందర్భాలున్నాయి. సామాన్యంగా పంటను బట్టే భూమి శిస్తు నిర్ణయింపబడేది. ప్రభుత్వమే సీటి వనరులను ఏర్పాటుచేస్తే, దానికి పన్ను, పశువుల మీద పన్ను ఉండేవి. అరి, తగ్గు, తెరె, సిద్ధాయం, మొదలైనవి, వ్యవసాయ సంబంధమైన పన్నులు. పంట నూర్పిడి తర్వాత చెల్లించాల్సిన పన్ననే, 'అరి' అంటారు. పండినా, ఎండినా, సంబంధం లేకుండా, ముందుగానే నిర్ధారింపబడిన పన్ననే, 'సిద్ధాయ' మంటారు.

ఆనాడు విత్తనాలను చల్లటం ద్వారాను, చేలల్లో నారును నాటే విధానం ద్వారాను, వ్యవసాయం జరిగేది. చల్లే విత్తనాల కొలతలను బట్టి, భూమి విస్తీర్ణాన్ని నిర్ణయించటం జరిగేది. నివర్తన, మర్దు, ఖండిక, పుట్టి, మొదలైన కొలమానాలు, క్రమంగా భూమి కొలతలుగా మారాయి. భూమి కొలతలకు రాజమాన, ముమ్మడి భీమకోల, జేనకోల, రాజరాజకోల మొదలైన గేడలు వాడుకలో ఉండేవి. పంటల పరిస్థితుల్ని, రకాల్ని, పంటలకు, వర్షానికున్న అవినాభావ సంబంధాన్ని, కొద్ది కాలం తర్వాతి నాటి 'నస్యానంద' మనే గ్రంథం వర్ణిస్తూంది. వ్యవసాయ పన్నులను వసూలు చేసే పద్ధతి లోను, సమయాల్లోను వైవిధ్య మేర్పడితే, ఘర్షణలు చోటు చేసుకొనేవి. భూములకు సరిహద్దులను నిర్ణయించి, ఎల్ల రాళ్లను పాతటం, కొన్ని చోట్ల తెలుస్తుంది. పంట పక్వానికి రాకుండా పన్నులు వసూలు చేయకూడదనీ, పంట పొలాల మీద సైన్యాన్ని అసలు మోహరింపచేయకూడదనీ, అవి రెండూ రాజ్య క్షేమానికి దారితీస్తాయని, సోమదేవసూరి లాంటి సమకాలీన రాజనీతిజ్ఞుల హెచ్చరిక!

. ఒక విజయాదిత్య రాజు నేంగి మండలం లోని మల్లీశ్వర మహాదేవ పట్టణం లోని ప్రజలకు, ఈ క్రింది విధంగా భూమి పన్నును నిర్ణయించాడు.

ఊడ్పు వరి నేల	పుట్టి ఒక్కింటికి - రెండు చిన్నాలు
ఊడ్పు నేల	- " - ఆరు చిన్నాలు
మెట్టు నేల	- " - నాలుగు చిన్నాలు
జొన్న నేల	- " - (శాసనం లోని ఈ భాగం శిధిలమైంది)
కొత్త నేల	- " - రెండు చిన్నాలు
నువు నేల	- " - (శాసనం లోని ఈ భాగం శిధిలమైంది)

దీనిని బట్టి, భూమి ఉత్పాదకతను బట్టి శిస్తు నిర్ధారితమయ్యేదనీ, కొత్తగా సాగులోకి మళ్ళించబడిన భూములకు శిస్తులో రాయితీలు కల్పించబడి, ప్రోత్సహించబడేవనీ, తెలుస్తోంది.

వ్యవసాయానికి ఇచ్చినంత ప్రాధాన్యత, పశు సంపదకు కూడ ఇచ్చేవారు. రాయలసీమ ప్రాంతాల్లో పశువుల మందల కోసం, వాటి రక్షణ కోసం, జరిగిన కలహాలు, ఘర్షణలు తెలుస్తాయి. పల్లవ, చోళ, బాణ, గంగ రాజుల పాలనలో, పశువుల నిమిత్తంగా దాడులు ముమ్మరంగా జరిగాయి.

BRAOU

11.3.2 : పరిశ్రమలు

చాళుక్యుల సుదీర్ఘ పాలనా కాలంలో వ్యవసాయం, నీటిపారుదల పట్ల జరిగిన అభివృద్ధిని గురించి తెలుసుకొన్నాం. అయితే, ఆ అభివృద్ధి రాశిగతమేననీ, స్వయంసంపూర్ణ గ్రామ వ్యవస్థ వరకు మాత్రమే దాని విస్తరణనీ, కొందరు చరిత్ర రచయితలు భావిస్తున్నారు. ఏమైనా, వ్యవసాయం వల్ల లాభించిన సంపదలో పెచ్చు శాతం యుద్ధాలకు, విలాసాలకు, ఆడంబరాలకు వినియోగమైందే తప్ప, ఉత్పత్తికి దోహదపడే పనులకు అంతగా వెచ్చించటం జరగ లేదు. వృత్తిమాన్యాలనిచ్చి, పన్నును మాఫీ చేసి, చేతి వృత్తుల వారు గ్రామాల్లోనే స్థిరపడేటట్లు, పాలక వర్గం చర్యలను తీసుకొనేది. గ్రామాల్లోని ప్రజల అవసరాలను తీర్చటమే, ఈ వృత్తి పనివారి బాధ్యత. వ్యవసాయానికి, చేతి వృత్తులకు ఆవిధంగా గ్రామ స్థాయిలో సమ తూకం పాటింపబడేది. ద్రాక్షారామ ప్రాంతం లోని ఒక శాసనంలో తెలికి, కుమ్మరి, కమ్మరి, కంసాలి, కంచరి, మేదరి మొదలైన వాళ్ళకు పన్ను మినహాయింపు పొందిన మాన్యాల్ని ఇచ్చినట్లు తెలుస్తోంది. వంశపారంపర్యంగా వస్తున్న కుల విద్యల్ని నిపుణతతో చేపడుతున్నప్పటికీ, వారి ఉత్పత్తులు చాల వరకు గ్రామ స్థాయి వినిమయాలకు సరిపోయేవి. కొన్ని చోట్ల దేవాలయాలు స్వయంగా మాన్యాల్ని, 'పన్నుకూడు' మొదలైన వృత్తుల్ని యిచ్చి, పంచాణం (కంసాలి) లాంటి వృత్తి పనివారల్ని పోషించేవారు. బంగారం మొదలు ఇనుము వరకు, అన్ని లోహాల తోను పనిముట్లు, పాత్రలను ఎంతో నేర్పుతో చేసేవారు. చాల గ్రామాల్లో నూనె గానుగలు, నేత మగ్గాలు ఉండేవి. ఈ పరిశ్రమల ఉత్పత్తి గ్రామీణావసరాల్ని మించి జరిగేది.

11.3.3 : వాణిజ్యం

చాళుక్యుల కాలంలో పరిశ్రమలు గ్రామీణావసరాలకే పరిమితమైనట్లు భావింపబడుతున్నా, వాణిజ్యం ఏ మాత్రం వెనుకబడ లేదు. బలమైన వర్తక శ్రేణులు వ్యాపారాన్ని జోరుగా నిర్వహించేవి. కాని, ఆ వర్తకం కొన్ని తరహా వస్తువులకే పరిమితమయ్యేది. సైనికావసరాలైన ఆయుధాలు, ధనిక, నాగరిక వర్గాల వారి భోగ విలాసాల కవసరమైన వస్తువులు, సుగంధద్రవ్యాలు, అత్యంత నాణ్యమైన వస్త్రాలు, మొదలైనవాటి వ్యాపారం పెచ్చుగా సాగేది. వృత్తి కులాల వారిని గురించి తెలుసుకొనే సందర్భంలో, శ్రేణుల విషయం కూడ తెలుసుకున్నాం. ఆ శ్రేణులకు రాజ్యంలో గొప్ప పరపతి ఉండేది. పాలక కుటుంబాల వారికి, సంపన్నులకు కావల్సిన అనేకానేక వస్తువుల్ని, వీరు సమకూర్చేవారు. పన్నులు, రుసుముల రూపంలో ఎంతో ధనం ఈ శ్రేణుల ద్వారా ప్రభుత్వానికి చేకూరేది. సంతలు, యాత్రా స్థలాలు వాణిజ్య కేంద్రాలుగా రూపుదిద్దుకొన్నాయి. వారపు సంతల్లో వ్యాపారం బాగానే సాగేది. కొణిదెనలో సంత ప్రతి లక్ష్మి వారం సాగేదని, ఓ శాసనం సూచిస్తోంది. అంగడి వీధి, అంగడి నాయకుల ప్రస్తావన చాల శాసనాల్లో ఉంది.

ఆనాటి వాణిజ్యం ప్రముఖంగా 'నకర' మనే వైశ్యుల శ్రేణి ఆధ్వర్యంలో ఉండేది. పెనుగొండ కేంద్ర స్థానంగా, వేంగీ రాజ్యం లోని పద్దెనిమిది ప్రధాన నగరాలు కేంద్రంగా, వారి వ్యాపారం సాగేది. వేంగి, దెందులూరు, ఘంటసాల, ఆచంట, చందవోలు, నిడదవోలు, పాలకొల్లు, జననాథపురం, విశాఖనగరం, మొదలైనవి వీరికున్న వ్యాపార కేంద్రాలు. వీరు కాక, వీరబలంజ, నానాదేశపెక్కండ్రు, మొదలైన వర్తక శ్రేణులు దేశాంతర వాణిజ్యానికి విస్తరించాయి.

చాళుక్యుల కాలానికి చెందిన అహదనకర శాసనం పూర్తిగా అర్థం కానప్పటికీ, రూఢిగా అది సమకాలీన వర్తక, వాణిజ్య శ్రేణుల క్రియాకలాపాల్ని తెల్లపుతుంది. అలాగే, ప్రధ్వీవల్లభపట్నం ఆనాటి

BRAOU

ఒక ప్రముఖ రేవు పట్నంగా భావింపబడుతోంది. తూర్పు చాళుక్యుల నాణేలు బర్మా, సయాం దేశాల్లో దొరకటాన్ని బట్టి, వారి ఖండాంతర వ్యాపారం తెలుస్తోంది. తమిళ, సింహళ ప్రాంతాల వర్తకుల వాణిజ్య వివరాలనేకం, వారి శాసనాల్లో, తెలుస్తున్నాయి. ఆంధ్రలో ఎన్నో రేవు పట్టణాలకు తమిళ పేర్లు పెట్టబడింది, ఈ కాలం లోనే. విశాఖపట్టణానికి కులోత్తుంగ చోళ పట్టణమని, ఘంటసాలకు చోళపాండ్యపురమని, మోటుపల్లికి దేశ్యయక్కొండ పట్టణమనీ, నామాంతరీకరణ జరిగింది.

ఆనాడు వస్తు మార్పిడి పద్ధతి అమలులో ఉన్నప్పటికీ, ద్రవ్య చెలామణీ కూడ వాడుకలో నున్నట్లు తెలుస్తున్న, వెండి, బంగారు, రాగి నాణేల పేర్లు సూచిస్తాయి. గద్యాణ, మూడ, పణం, కలంజు, మొదలైన వేర్వేరు పేర్లు సూచిస్తాయి. గద్యాణ, మూడ, పణం, కలంజు మొదలైన వేర్వేరు నాణేలు శాసనాల్లో పేర్కొబడ్డాయి. పావులూరి మల్లన గ్రంధం ద్వారా, ఆనాడు చెలామణీలో ఉన్న వేర్వేరు నాణేల సంబంధం, ఇలా ఉన్నట్టు తెలుస్తోంది.

4 గోకర కానులు	= 1	సొరకాని
4 సొరకానులు	= 1	పీఠ
4 పీఠలు	= 1	కాని
4 కానులు	= 1	వీశం
4 వీశంలు	= 1	పట్టిక
4 పట్టికలు	= 1	చిన్నం
4 చిన్నంలు	= 1	మూడ

BRAOU

ఈ నాణేలు గాక, సోల, మానిక, అడ్డ, కుంచం పేర్లతో, ద్రవ్య మానాలూ, తులం, శేరు, వీశె, మణగు, పుట్టి పేర్లతో, తులామానాలూ, ఆనాడు ఆంధ్రదేశంలో వాడుకలో ఉండేవి.

11.3.4 : పన్నులు, సుంకాలు

వర్తక వాణిజ్యాలపై అప్పటి ప్రభువులు అనేక రకాల సుంకాలను వసూలు చేసేవారు. అంగడికి అమ్మకానికి తెచ్చే వస్తువుల మీద పేరు సుంకం, స్థల సుంకం విధింపబడేవి. రేవు సుంకం, ఎగుమతుల మీద, దిగుమతుల మీద, వసూలు చేయబడేది. ఉప్ప మీద, పశువుల అమ్మకాల మీద, స్థిరాస్తుల కొనుగోళ్ల పైన, పన్ను ఉండేది. ఈ పన్నులను చాల వరకు విషయ అధికారులే విధించి, వసూలు చేసేవారు. 'కొల్పుపీశాలు' పేరుతో, కొలగారం పన్ను ఉండేది. ధాన్యం వ్యాపారం దినుసులను కొలిచేటప్పుడు, కొలిచిన మొత్తంలో పదహారవ వంతు సుంకాన్ని తీసుకొనేవారు. అహోబిలం శాసనం లాంటి వాణిజ్య వివరాల్ని తెలిపే శాసనంలో, కొన్ని పన్నులు ప్రస్తావింపబడినా, అవేవీ వివరంగా అర్థం కావటం లేదు. వాణిజ్య పన్నులు, సుంకాలు, మరీ హెచ్చు మొత్తంలో లేవని, సమకాలీన పండితుడైన సోమదేవసూరి గ్రంధాలు తెలియజేస్తున్నాయి. కాని, అక్కడక్కడ పాలకులు వర్తకుల్ని పీడించిన సంఘటనలు లేకపోలేదు.

11.4 : సాంస్కృతిక పరిస్థితులు

చాళుక్య యుగంలో మత విధానాల్లో, మత శాఖల్లో ఎన్నెన్నో మార్పు లొచ్చాయి. కొన్ని అవైదిక మతాలు అంతరించటం, వీటికి తోడు, తెలుగు భాషా సాహిత్యాలు, లలిత కళలు, శిల్ప కళ, గణనీయమైన ప్రగతిని సాధించాయి. వీటిని వరుసగా పరిశీలిద్దాం.

11.4.1 : మతం, నుత శాఖలు

చాళుక్య యుగం నుండి, ఆంధ్ర దేశం లోని మత సంబంధమైన అంశాల్లో, ఆసక్తిదాయకమైన ఎన్నో మార్పు లొచ్చాయి. మతాల చాట్నా, వ్యక్తిగత శ్రేయస్సు సాధనాశయంతోపాటు, సామాజిక స్పృహను పెంచుకొని, తమ తమ మతాల్ని వ్యాపింప జేయటానికి పూనుకున్నారు. అవైదికాలైన బౌద్ధ, జైనాలు శాతవాహన కాలం ముందు నుండే ఆంధ్ర దేశంలో ఉన్నప్పటికీ, క్రీ.శ. 5, 6 శతాబ్దాల నుండి బౌద్ధం పూర్తిగా క్షీణించింది. జైన మతం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల్లో ఆదరణను పొందసాగింది. వైదిక మతంలో క్రతుకర్మకాండలు పూర్తిగా తగ్గి, పౌరాణిక వైదికం ప్రాముఖ్యానికి వచ్చింది. ఆలయ నిర్మాణాలకు ఎంతో ప్రాముఖ్యత పెరిగింది.

11.4.1.1 : బౌద్ధ, జైనాలు

వైదిక మతంలో ఏర్పడిన సంస్కరణల ఫలితం గాను, తాంత్రిక పద్ధతుల అనుసరణ వల్ల ప్రజానీకానికి దూరం కావటం కారణంగాను, పోషణను కోల్పోవటం వల్ల, చాళుక్యుల యుగారంభం నాటికే, బౌద్ధ మతం ఆంధ్ర దేశంలో ఉనికిని కోల్పోయింది. అయినప్పటికీ, ఆంధ్ర సంస్కృతి మీద దాని ప్రభావం పూర్తిగా పోలేదు. బౌద్ధ దేవతైన 'హారీతి' సంకుచిత మత ధోరణుల్ని అధిగమించి, నుతాతీత స్థానాన్ని సంతరించుకొంది. హారీతీపుత్రాణ మని, చాళుక్యులు చెప్పుకోవటాన్ని బట్టి, వారి వంశ సంప్రదాయాల్లో 'హారీతి' ఎంతటి గౌరవ స్థానాన్ని పొందిందో, తెలుస్తోంది. బౌద్ధ మతంలో పూజ్యనీయ స్థానం లోని 'తార' క్రమంగా వైదిక మత, శిల్ప సంప్రదాయంలో సరస్వతిగా ఒదిగి పోయింది. కాలక్రమేణా, బుద్ధుడే విష్ణువు అవతారంగా పరిగణింపబడటం మొదలైంది. బౌద్ధ మత క్షీణతకు, తీవ్ర భావాలు కల్గిన కాలాముఖ శైవ శాఖల వంటివి కూడ కారణమని, భావించబడుతోంది. చాళుక్యుల కాలంలో నిర్మించబడిన ప్రముఖ శైవ క్షేత్రాలైన పంచారామాలు, బౌద్ధ మత కేంద్ర శిథిలాల మీదే నిర్మించబడ్డట్లు తెలుస్తోంది. బౌద్ధ, శైవాల ఘర్షణను సూచించే ఎన్నో గాథలు ప్రచారంలో ఉన్నాయి. అమరావతి బౌద్ధారామం లోని బౌద్ధులకు, ప్రముఖ శైవ పండితుడైన మల్లికార్జున పండితారాధ్యునికి, మత సిద్ధాంతాల నిరూపణలో వివాదాలేర్పడి, అవి హత్యల వరకు దారితీశాయని ఐతిహ్యం.

జైనం విషయానికి వస్తే, ప్రాచీన యుగం తర్వాత, ఈ కాలంలో ఉన్నంత ప్రాచుర్యంలో జైన మతం మరెన్నడూ లేదు. తెలంగాణా, కర్ణాటక ప్రాంతాలు జైనానికి కేంద్ర స్థానమైనప్పటికీ, తీరాంధ్రం లోని పాలకులు, ప్రజలు కూడ, జైనానికి ఆదరణ చూపించారు. చాళుక్య, రాష్ట్రకూటు, నొలంబ వంశాల రాజులు, రాణులు, రాజోద్యోగులు, సామంతులు కూడ, జైనాన్ని పోషించారు. కుబ్జ విష్ణువర్ధనుని భార్య అయ్యణ మహాదేవి, బెజవాడలో నెడుంబి వసతిని నెలకొల్పి, దానికి ముషినికుండ అనే గ్రామాన్ని దానం చేసింది. రెండో అమ్మరాజు తన భార్య చామెకాంబ కోరిక

BRAOU

మీద, జైనులకు కలుచుంబర్రు గ్రామాన్ని దానం చేశాడు. సామంతుడైన దుర్గరాజు కోరిక మీద, కటకాభరణ జినాలయానికి దానా లెన్నో ఇచ్చాడు. సేనాపతులైన భీము, నరవాహనుల కోరిక మీద, బెజవాడలో జినాలయాల నిర్మాణానికి, పెదగాదెలవర్రు గ్రామాన్ని ఇచ్చాడు. రామతీర్థం, బిక్కవోలు, దానవుల పాడు, కొనకండ్ల, అనుముకొండ, పాట్లచెరువు, కొలనుపాక, ఉజ్జిలి, వర్ధమాన పురం మొదలైనవి, కొన్ని ప్రముఖ జైన కేంద్రాలు. ఒక్క పొట్లచెరువు (పటాన్ చెరువు) లోనే 500 జైన వసదులుండేవంటే, నాటి జైన ప్రాచుర్యాన్ని గ్రహించొచ్చు. విమలాదిత్యుడు జైనాన్ని స్వీకరించినట్టు కొందరు చరిత్ర కారులు భావిస్తున్నప్పటికీ, దానికి పూర్తి ఆధారాలు లేవు. తెలంగాణా ప్రాంతంలో రాష్ట్రకూటుల సామంతులుగా పాలించిన వేములవాడ చాళుక్యుల రాజధానైన వేములవాడ, తొలి రాజధానైన పాదనపురం (బోధన్) గొప్ప జైన క్షేత్రాలు. కల్యాణి చాళుక్యుల కాలానిక్కూడా, ఆంధ్రలో జైనం ప్రాభవాన్ని కోల్పోలేదు.

మిగిలిన మతాల్లో లాగే, జైనంలో కూడ, ఎన్నో విభాగాలున్నాయి. సంఘ, గణ, గచ్ఛ, బలి, అన్వయ, అనేవి, ఆ విభాగాలు. ఆంధ్ర దేశం లోని జైనంలో, మూల, యాపనీయ, గౌడ, ద్రావిడ సంఘాలుండేవి. కుమురూరి, దేశి, వలహరి, బలత్కారగణాలు; నందిగచ్ఛ, పుస్తక గచ్ఛ, మేషపాషాణ గచ్ఛల ప్రస్తావన, శాసనాల్లో ఉంది. జైనంలో కూడ చాతుర్వర్ణ వ్యవస్థ ప్రభావం ఉండేదనీ, జైన శూద్రుని స్థానం వైదిక శూద్రుని కన్న ఏమంత ఉన్నతంగా లేదని తెలుస్తోంది. వైదిక మతం లోని కొన్ని విశ్వాసాలు, ఆచారాలు, జైనంలో కూడ ఉన్నాయి.

సృజనాత్మకమైన సారస్వత కృషిని కూడ, ఈ కాలంలో జైన మతం చేపట్టింది. వైద్య, జ్యోతిష్య గణిత విద్యలతో, ప్రజలకు సేవ చేసేవారు. రామతీర్థంలో నివసించే ఉగ్రాదిత్యుడు **'కల్యాణకారకం'** అనే వైద్య గ్రంథాన్ని వ్రాశాడు. వేములవాడలో సోమదేవసూరి, **'యశస్తిలక, నీతివాక్యామృత'** మొదలైన ఎన్నో గ్రంథాలను వ్రాశాడు.

చోళ-చాళుక్య ఘర్షణలో, ఆంధ్ర లోని ఎన్నో జైన క్షేత్రాలు ధ్వంసమయ్యాయి.

BRAOU

11.4.1.2 : వైదిక మతం

చాళుక్య యుగం నుండి, బౌద్ధ మతం క్షీణించటం, జైనం సామరస్యపు ధోరణి నవలంబించటంతో, వైదిక మతం పురోగమించింది. స్వతః చాళుక్యులు వైదిక ధర్మాభిమానులు. వారి సంప్రదాయిక ప్రశస్తిలో, "అనేకాశ్వమేధావభృథస్నాన పవిత్రీకృత వపుషాం" అని చెప్పుకున్నారు. పూర్వమీమాంస పద్ధతిని ప్రచారం చేసిన కుమారిలభట్టు, ఈ యుగం వాడే. వైదిక మతపు స్వీయ సంస్కరణల కారణంగానైతేనేం, అవైదిక మత ప్రభావాల వల్లనైతేనేం, కర్మకాండలపట్ల విముఖత కల్గి, పురాణ ఆగమోక్తాల పట్ల ఆసక్తి పెచ్చింది. వ్రత, దానాల పట్ల, విగ్రహారాధన ప్రధానమైన ఆలయ నిర్మాణాల పట్ల ఆదరణ పెచ్చింది. పరమ మాహేశ్వర, పరమ బ్రాహ్మణ్య బిరుదాల్ని చాళుక్యులు ధరించారు. బ్రాహ్మణులకు అగ్రహారాలిచ్చి, వేద విద్యల్ని పోషించారు. అలాగే, ఆంధ్ర దేశంలో ఆలయ నిర్మాణాన్ని ఒక ఉద్యమంగా, ఒక సాంఘిక అవసరంగా, ప్రభుత్వాల చేతనే చేపట్టబడటం, ఈ యుగంలో ఒక చెప్పుకోదగిన విశేషం. ఎన్ని యుద్ధాలను తమ జీవిత కాలంలో చేశారో, అన్ని ఆలయాల్ని నిర్మించటం, చాళుక్య రాజుల సంప్రదాయంగా మారింది. 108 యుద్ధాలను చేసిన రెండవ విజయాదిత్యుడు 108 ఆలయాలను నిర్మిస్తే, 360 యుద్ధాలను చేసిన చాళుక్య భీముడు 360 ఆలయాలను నిర్మించాడు. బిక్కవోలు లోని ఆలయ సముదాయం గుణగ విజయాదిత్యుని కాలం లోను;

ప్రముఖ శైవ క్షేత్రాలైన పంచారామాలు ప్రథమ చాళుక్య భీముని కాలం లోను, నిర్మించబడ్డాయి. రాజరాజ నరేంద్రుని కాలం లోను ఎన్నో ఆలయాలను కట్టారు. దేవాలయాల్లో జాతరలు జరిగేవి. ఆ జాతరలలో విగ్రహాల ఊరేగింపు ముఖ్యమైన అంశం. చేబ్రోలు మహాసేనుని జాతరలో, చేబ్రోలు నుండి బెజవాడ వరకు ఊరేగింపు జరిగినట్లు, యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో సూచింపబడింది. జైన, బౌద్ధాల విధ్వంసంలో ప్రముఖ పాత్ర వహించిన కాలాముఖ శైవ కేంద్రాలు ప్రాముఖ్యానికి వచ్చాయి. బెజవాడ లాంటి చోట్ల, 'సింహపరిషత్తు' అనే ప్రచార పరిషత్తులను స్థాపించారు. శ్రీశైలం, ఆలంపురం, ద్రాక్షారామాలు కాలాముఖ కేంద్రాలే. శ్రీశైలాన్ని కాపాలిక కేంద్రంగా కూడ, భవభూతి వర్ణించాడు. మత విశ్వాసాల ప్రచారం కోసం కావ్య రచనలు ఆరంభమయ్యాయి. వైదిక ధర్మ ప్రచారం కోసమే, పంచమ వేదమైన **భారతం**, ఆంధ్రీకరించబడింది. ఓ ప్రక్క భక్తి పంథా వ్యాప్తిలో ఉన్నప్పటికీ, మరో ప్రక్క గ్రామ దేవతల కొలుపులు కూడ, విస్తారంగానే ఉన్నాయి. వేర్వేరు కులాల వారు వేర్వేరు కుల దైవాల్ని కొలిచేవారు. వైష్ణవాలయాలు తర్వాత కాలంలో ప్రాచుర్యానికి వచ్చినా, చాళుక్యుల తొలి దశలో నిర్మించబడిన రమారమి అన్ని ఆలయాలు శైవ సంబంధమైనవే. బాపట్ల భావ నారాయణ స్వామి ఆలయం, సర్పవరపు భావనారాయణ స్వామి ఆలయం, సామర్లకోటలోని మాండవ్య నారాయణస్వామి ఆలయం లాంటి వైష్ణవ క్షేత్రాలు, చాళుక్యుల కాలంలో ప్రాచుర్యాన్ని సంపాదించాయి. వరాహ లాంచనులమని చెప్పకోవటం, విష్ణువర్ధన బిరుద నామాల్ని ధరించటం మొదలైనవి, చాళుక్యుల వైష్ణవ సమాదరణను తెలుపుతాయి.

11.4.2 : దేవాలయాలు : నిర్వహణ

చాళుక్య యుగపు మధ్య కాలం నుండి దేవాలయాలు మత కేంద్రాలుగానే కాకుండా, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలకు ఆలంబన కాసాగాయి. దేవాలయాలను దర్శించటం, దాన ధర్మాలను చేయటం, పురాణేతిహాస శ్రవణం, పుణ్య కార్యంగా చెలామణయ్యాయి. కొన్ని పెద్ద దేవాలయాలకు అనుబంధంగా, సత్రాలు, విద్యా కేంద్రాలు, వైద్య శాలలు నిర్వహించబడేవి. ఒక్క మాటలో చెప్పాలంటే, మధ్యాంధ్ర యుగ సాంఘిక జీవనం చాల వరకు ఆలయ సంస్కృతితో ముడిపడి ఉండేది. సమాజం లోని ఎన్నో రంగాల వారికి ఉపాధి అవకాశాలను కల్పించటంలో కూడ, ఆలయాలు చెప్పుకో దగిన పాత్రను నిర్వహించాయి. పాలక వర్గాలు, ప్రజలు, శ్రేణులు, ఆలయాల పట్ల, ఆలయ నిర్వహణ పట్ల, ఎంతో శ్రద్ధ వహించేవారు. ఈ యుగం లోని అసంఖ్యాకమైన దేవాలయ దాన శాసనాల్లో, వేర్వేరు రకాల దానాలు ఎలా యివ్వబడ్డాయో, తెలుస్తోంది. దీప దానం నుండి భూదానం వరకు, దాన వస్తువులుగా పేర్కొబడతాయి. ఆలయ వ్యవహారాలపై, స్థానాధిపతి అనే అధికారి అదుపు కల్గి వుండేవాడని, తెలుస్తోంది. సిబంధకారులు, సాని మున్నూర్వారు మొదలైనవారి తోడ్పాటుతో, ఆలయ పాలనా నిర్వహణ సాగేది. అసంఖ్యాకమైన వివిధ దానాల కారణంగా, ఆలయాలు పెద్ద ఆస్థికి, సంపదలకు కేంద్ర బిందువులైనాయి. వాటి నిర్వహణకు ఎంతో సిబ్బంది అవసరమైంది. దేవాలయ ఉద్యోగుల జీతాలు, వారు చేయవలసిన విధులు, హోదాలు, వగైరాలను, దేవాలయ నిర్వహణను పర్యవేక్షించే అధికారులే నిర్ణయిస్తారు. దేవాలయ సిబ్బందికి భత్యాలు, మాన్యాల రూపం లోను, వస్తు రూపం లోను, ధన రూపం లోను ఉండేవి. సామర్లకోట లోని ఒక శాసనంలో, అప్పటి దేవాలయ సిబ్బంది జీతభత్యాల వివరాలు తెలుస్తాయి. ఆలయాల ప్రాముఖ్యత, ప్రాచుర్యం పెరిగిన కొద్దీ, దానాలు పెరగటం, సంపదలు, ఆలయ భోగాలు పెరిగి, వాటి నిర్వహణకు సిబ్బంది సంఖ్య గణనీయంగా పెరిగేది. కడిగి ముగ్గులు పెట్టే వారి నుండి, అర్చనలను నిర్వహించేవరకు, రకరకాల సిబ్బంది శాసనాల్లో పేర్కొబడ్డారు.

BRAOU

11.4.3 : పంచారామాలు

చాళుక్య యుగం నాటి ఆలయాల్లో ప్రాముఖ్యత కల్గినవి, పంచారామాలు. ద్రాక్షారామం, చాళుక్య భీమవరం (సామర్లకోట), సోమారామం (గునుపూడి), క్షీరారామం (పాలకొల్లు), అమరారామం (అమరావతి), పంచారామాలుగా వ్యవహరింపబడతాయి. ఇవన్నీ ప్రముఖ శైవ, క్షేత్రాలు. వీటన్నింటిని మొదటి చాళుక్య భీముడు నిర్మింపజేసినట్లు భావిస్తారు. ఇవి ఒకప్పుడు గొప్ప బౌద్ధారామాలనీ, శైవాధిమానులైన చాళుక్యుల కాలంలో అవి నాశనం చేయబడి, ఆ శిధిలాల మీద ఈ శివాలయాలు నిర్మింపబడ్డాయని కొందరి అభిప్రాయం.

11.5 : తెలుగు సాహిత్య పోషణ

ఆంధ్ర భాషా చరిత్రలో, సాహితీ రంగంలో, సాధికారికంగా తమకంటూ ప్రముఖ స్థానాన్ని సృష్టించుకొన్న ఖ్యాతి, చాళుక్యులకే చెందుతుంది. తెలుగును రాజ భాషగా గుర్తించటమే కాకుండా, కావ్య భాషగా పెంపుచేసి, తెలుగులో తొలి కావ్య సృష్టికి పూర్తి కారణమయ్యారు.

11.5.1 : తెలుగు భాషా పరిణామ తొలి దశ


శాతవాహన కాలం నుండి 'గాథాసప్తశతి'లో కొన్ని తెలుగు పదాలు వ్యవహారంలో ఉన్నట్లు, భావిస్తున్నారు. క్రీ.శ. ఒకటో శతాబ్దం లోని అమరావతీ స్తూపం లోని ఒక రాతి పలక మీద నున్న 'నాగబు' అనే మాట, తెలుగు పదమే అని కూడ అంటారు. శాతవాహనుల అనంతరం ఆంధ్ర దేశంలో పాలించిన శాలంకాయన, విష్ణుకుండిన, మొదలైన వంశాల వాళ్లు చేసిన శాసనంలో, కొన్ని తెలుగు పదాలు, శబ్దాలు వాడబడ్డాయి. గోలశర్మ, కొట్టిశర్మ, దొడ్డి స్వామి మొదలైన పేర్లు; కురువాడ, తెల్లపల్లి, పెరువాటకం మొదలైన గ్రామాల పేర్ల వంటి వాటిని బట్టి, చాళుక్య యుగానికి పూర్వమే తెలుగు భాష జనబాహుళ్య ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది. విక్రమేంద్ర వర్మ చిక్కుళ్ళ శాసనాన్ని బట్టి, చాళుక్యుల పూర్వపు శాసనాల్లోని ప్రయోగాల్ని బట్టి, ఆనాటికే కొద్దిగా తెలుగు వాడుకలో నున్నట్లు తెలుస్తోంది. ఏమైనా, ఇలాంటి వాటిని బట్టి, నాటి తెలుగు స్వరూపాన్ని ఊహించుకోవలసొస్తుంది తప్ప, గ్రంధాల్లో కాని, శాసనాల్లో గాని స్పష్టంగా తెలుగు ప్రయోగాలు కన్పించటం లేదు. కాని, తర్వాతి కాలంలో ఆంధ్ర దేశపు పాలనా బాధ్యతలను స్వీకరించిన కొన్ని రాజ వంశాలు, శాసనాల్లో తెలుగుని కూడ చొప్పించటం మొదలుపెట్టారు. అలాంటి ప్రయోగం చేసిన వంశాల్లో మొదట పేర్కొనవలసింది, రేనాటి చోళ, తూర్పు చాళుక్య వంశాలు.

11.5.2 : వేంగీ చాళుక్య యుగంలో తెలుగు సాహిత్య ఆవిర్భావం

ఆంధ్ర దేశంలో తెలుగును నిల్పిన ఖ్యాతి చాళుక్యులకే చెందుతుందని, నన్నెచోడుడు పేర్కొన్నాడు. చాళుక్య యుగారంభం నుండే, తెలుగు ఉన్నత స్థాయికి చేరుకుంది. రాజరాజ నరేంద్రుని ప్రేరణ, ప్రోత్సాహాల కారణంగానే, నన్నయ తొలి తెలుగు కావ్య సృష్టికి కారణమయ్యాడు.

కుబ్జ విష్ణువర్ధనుని చేజర్ల శాసనంలో, సగానికి పైగా తెలుగే వాడబడింది. అతని కొడుకైన మొదటి జయసింహుని విప్పర్ల, మూచర్ల శాసనాలు, తెలుగులో ఇవ్వబడ్డాయి. లభ్యమైన తెలుగు శాసనాల్లో, ఇదే కాలానికి కొద్ది ముందు వారైన రేనాటి చోళుల్లోని ధనంజయుని కలమళ్ల శాసనం (క్రీ.శ. 575), మొదటిది. ప్రాచీనాంధ్ర భాషా స్వరూపం, ఈ శాసనాలన్నింటిలోనూ తెలుస్తోంది.

BRAOU



భీమేశ్వరాలయము, దాక్షారామము, తూర్పుగోదావరి జిల్లా

ఆంధ్ర సాహిత్య చరిత్రలో మొదటి ఘట్టం, గుణగ విజయాదిత్యుని కాలంలో ఆరంభమైంది. అప్పటికి తెలుగు భాష, సంస్కృత ప్రభావాన్ని సంతరించుకొంది. మాత్రాగణబద్ధాలైన దేశీయ ఛందస్సుతో కవిత్వ రచన మొదలైంది. పండరంగుని శాసనంలో తరువోజ; కందుకూరు, ధర్మవరం శాసనాల్లో సీస పద్యాలు; బెజవాడ శాసనంలో మధ్యాక్కర ఉన్నాయి. క్రమంగా, తెలుగు భాష కావ్య రూపాన్ని సంతరించుకొంది. నన్నయ భారత రచనకు ముందే, తెలుగులో, జైన మతంలో, కొన్ని గ్రంధాలు వచ్చి ఉంటాయని కొందరు వాదిస్తారు. కాని, సరైన ఆధారాలు లభ్యమయ్యేవరకు, దాన్ని అంగీకరించలేం. ఏ కారణాల వల్లనో ఆంధ్ర దేశం లోని కవులు అప్పటి వరకు సంస్కృత, కన్నడ భాషల్లోనే కావ్యాలను వ్రాసారు. అమ్మరాజు ఆస్థానంలో మాధవభట్టు, పోతనభట్టు, భట్ట దేవుడు మొదలైన కవులుండేవారు. కన్నడంలో తొలి కావ్యమైన 'విక్రమార్జున విజయం'ను వ్రాసిన పంప కవి ఆంధ్రుడే. అతని తమ్ముడైన జినవల్లభుడు, కొన్ని పద్యాలైనా తెలుగులో వ్రాసాడు తప్ప, పంప కవి కావ్య సృష్టి కన్నడ భాషకే పరిమితమైంది. దొరికినంతలో నన్నయ మహాభారతమే తొలి తెలుగు కావ్యం మనుకోవటం సమంజసం. ఆంధ్ర మహాభారతం లోని ఆది, సభా పర్వాల్ని, అరణ్య పర్వం లోని మూడో ఆశ్వాసం వరకు నన్నయ వ్రాసాడు. నారాయణ భట్టు సహాయ ప్రోత్సాహాలు కూడ, ఈ మహత్తర కృషిలో ఉన్నట్టు పేర్కొబడింది. రాజరాజ నరేంద్రుని ఆస్థానం లోనే, పావులూరి మల్లన సారసంగ్రహాగజీతాన్ని సుబోధకమైన తెలుగులో వ్రాశాడు. తెలుగును కావ్య భాషా రూపానికి సాధించి, పండిత పామరులు మెచ్చే శైలిని రూపొందించిన ఖ్యాతి నన్నయకు దక్కితే, ఆ కృషి వెనుకనున్న చాళుక్య రాజరాజు ప్రేరణను కూడ, విస్మరించ కూడదు.

ఇదే కాలంలో చెప్పుకోదగిన మరో గొప్ప కవి, నన్నెచోడుడు. ఇతను కొణిదెన ప్రాంతంలో ఓ చిన్న మండలాన్ని ఏలిన తెలుగు చోడ కుటుంబం లోని వాడు. ఈయన తన కావ్యం "కుమార సంభవం"తో తెలుగు సాహిత్యానికి శ్రీకారం చుట్టేడనీ, నన్నయ కన్న ఇతనే పూర్వీకుడనీ, కొందరు వాదిస్తారు. అయితే, ఈ మధ్యనే నన్నెచోడుడనే కవి లేనేలేడనీ, ఆ గ్రంథం ఇరవైయ్యో శతాబ్ది లోని 'కూట సృష్టి' అనీ, ఓ సిద్ధాంతం మొదలైంది. ఈ వాదాల పూర్వాపరాలేమైనప్పటికీ, తెలుగు సాహిత్యానికి సంబంధించినంతవరకు, నన్నయనే ఆది కవిగా అత్యధికులు భావిస్తారు.

11.6.3 : అర్వాచీన చాళుక్య యుగంలో తెలుగు సాహిత్యం

చాళుక్య యుగంలో ప్రారంభమైన తెలుగు సారస్వతోద్యమం, తర్వాత కాలంలో కూడ పురోగమించింది. వీర శైవ మతానికి సాహిత్యం ఊపునిచ్చి, తీవ్ర ప్రచారం చేసిన వాళ్లలో, పండిత త్రయమైన మల్లికార్జున పండితారాధ్యులు, శ్రీపతి పండితుడు, మంచెన పండితుడు, ముఖ్యులు. ప్రజల్లో వీర శైవ మతాన్ని ప్రచారం చేయటం కోసం, శివ భక్తుల కథల్ని సులభమైన శైలిలో దేశీయ ఛందస్సులో వ్రాసి, ప్రచారం చేశారు. పాల్కురికి సోమనాధుడు వ్రాసిన 'పండితారాధ్య చరిత్ర', 'బసవ పురాణం', కూడ, మత ప్రచారం నిమిత్తం వ్రాయబడినవే. తెలుగులో శతక వాఙ్మయానికి శ్రీకారం చుట్టింది, శివ కవులే.

BRAOU

తెలుగు కవులందరి లోను అగ్రగణ్యునిగా పరిగణింపబడుతున్న తిక్కన సోమయాజి, చాళుక్య - చోళ యుగం లోని ప్రముఖ కవి. ఈయన సహజ సారస్వత వ్యక్తిత్వం ఈయన గ్రంథాల్లో తెలుస్తుంది. భారతం లోని అరణ్య పర్వ శేషం తప్ప, నన్నయ ఆంధ్రీకరించని, మిగిలిన **భారత** పర్వాలన్నింటినీ, ఈయన పూర్తి చేశాడు. తన తొలి కావ్యమైన **'నిర్వచనోత్తర రామాయణాన్ని'** నెల్లూర్ తెలుగు చోడ మనుమసిద్ధి కంకితమిచ్చాడు. ఆంధ్ర జాతీయాభిమానంతోపాటు, సమకాలీన విలువల కనుగుణమైన సామాజిక స్పృహ, ఇతనిలో కన్పిస్తూందని, సాహిత్య విమర్శకుల అభిప్రాయం. **'దశ కుమార చరిత్ర'**ని, **'విజ్ఞానేశ్వరాన్ని'** వ్రాసిన కేతన, **'మార్కండేయ పురాణా'**న్ని వ్రాసిన మారన, మొదలైన కవులందరూ, ఈ కాలపు వారే.

11.6 : లలిత కళలు

నృత్యం, సంగీతం మొదలైన లలిత కళలు కూడ, ఈ కాలంలో రాజాస్థానాల్లోనూ, ఆలయాల్లోనూ పోషింపబడ్డాయి. అమ్మరాజుకు 'కవి గాయక కల్పతరువ'నే బిరుద ముండేది. మొదటి చాళుక్య భీముడు 'గాంధర్వ విద్యావేదిని' అయిన చెల్లవ్వకు మాన్యాలిచ్చి ఆదరించాడు. ఆమె తండ్రైన మల్లప్ప, సంగీత విద్యలో తుంబురుని లాంటి వాడని వర్ణించబడింది. బాదపుడు నటుల్ని, గాయకుల్ని పోషించినట్టు తెలుస్తోంది. ఆనాటి శిల్పాల్లో వీణ, పిల్లన గ్రోవి, మృదంగం, తాళాల వంటి వాద్యాలు కన్పిస్తాయి. నర్తకులు, వాద్యగాండ్రు, నాట్యాచార్యుల పేర్లు అనేక శాసనాల్లో ఉన్నాయి. **'పండితారాధ్య చరిత్ర'**లో ఎన్నో రకాల నృత్య గేయాలు; **'కుమార సంభవం'**లో వివిధాలైన రాగాలు పేర్కొబడ్డాయి.

11.7 : శిల్ప కళా పోషణ : ఆలయ నిర్మాణం

వైదిక మత విజృంభణ కారణంగా, దేశంలో ఆలయ నిర్మాణం విరివిగా సాగిందని తెలుసుకున్నాం. పాలనాధికారాల వైవిధ్యం కారణంగా, ఆలయ నిర్మాణ రీతుల్లో, సంప్రదాయాల్లో, తేడా కన్పిస్తుంది. వేంగీ చాళుక్యులు పంచారామాల్లోను, ఇతర చోట్లా నిర్మించిన ఆలయాల్లో, పల్లవ - చాళుక్య సంప్రదాయాల సమ్మిశ్రిత రీతి నవలంబిస్తే; ఆలంపురం లోని నవ బ్రహ్మాలయం లోను, మహానంది లాంటి చోట్లా, పశ్చిమ చాళుక్యుల శైలి కన్పిస్తుంది.

బిక్కవోలు లోని ఆలయాలను గుణగ విజయాదిత్యుడు నిర్మించాడు. శైవ క్షేత్రాలైన పంచారామాల్లోని ఆలయాలు, మొదటి చాళుక్య భీముని కట్టడాలుగా ప్రసిద్ధాలు. ఆ ఆలయాల్లోని కుడ్యాల పైన, కుడ్య కోష్ఠాల పైన ఉన్న దేవతా ప్రతిమలు, ఆగమ సూత్రాల కనుగుణంగా చైతన్య ముట్టిపడుతుంటాయి.

BRAOU

11.8 : సంగ్రహంగా

1. సామాజికమైన మార్పులెన్నో ఈ కాలంలో చోటు చేసుకొన్నాయి. రమారమి అన్ని కులాల్లోను, ప్రాంతీయత, వృత్తి, ఇతర అంశాల కారణంగా, ఎన్నో విభాగా లేర్పడ్డాయి. అన్ని కులాల, కుల విభాగాల ఆలోచనా సరళిలో గణనీయమైన మార్పు వచ్చి, తమ ఆధిక్యతను, ప్రత్యేకతను చాటుకొనే ప్రయత్నాలను చేశాయి. కొన్ని కొన్ని కులాలు తమ సాంఘిక కట్టుబాట్లను, సామాజిక నియమాల్ని, తామే ఏర్పర్చుకొన్నాయి.

2. వృత్తి సంఘాలు, కుల సంఘాలు, వర్తక శ్రేణులు బలపడి, తమ తమ సభ్యుల మీద పూర్తి అదుపును కలిగి ఉండేవి. గ్రామ పాలనా వ్యవస్థ నుండి, ఆలయ నిర్వహణ వరకు, అన్నింటిలో చాల వృత్తి పనివారల ప్రమేయ ముండేది.

3. మత సంబంధమైన వైదిక విద్యలు, లౌకిక విద్యలు, లలిత కళలు కూడ, పాలకుల చేత, ప్రజల చేత, ఆదరింపబడ్డాయి. ఆలయాలు, మఠాలు, ఘటికాస్థానాలు, అగ్రహారాలు విద్యా కేంద్రాలుగా రూపుదిద్దుకొన్నాయి.

4. ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య రంగాల మీద, శ్రద్ధ ఎక్కువైంది. అగ్రహారాలు, వృత్తి మాన్యాలు మొదలైన వాటి కారణంగా, భూమి హక్కు పంపిణీ జరిగింది. భూమిని వర్గీకరించటం లోను, కొలతను చేయటం లోను, నీటి పారుదల ఏర్పాట్లు చేయటం లోను, జరిగిన కృషి తెలుస్తోంది.

5. పేర్వేరు వృత్తుల మీద, ఫలసాయం మీద, వాణిజ్యం మీద విధించిన పన్నుల వివరాలు కొంత వరకు తెలుస్తున్నాయి.

6. వర్తక కేంద్రాల, నగరాల సంఖ్య పెరిగింది. నానాదేశ పెక్కండ్రు లాంటి వర్తక శ్రేణులు, దేశాంతరాలకు వాణిజ్యాన్ని విస్తరించాయి.

7. వైదిక, అవైదిక మతాలన్నింటా, మార్పు లేర్పడ్డాయి. బౌద్ధం రమారమి నశించింది. జైనం, రాజ ప్రాపకాన్ని, ప్రజల అభిమానాన్ని పొందగల్గింది. స్వీయ సంస్కరణల కారణం గాను, అవైదిక మతాలు ప్రాబల్యాన్ని కోల్పోవటం కారణం గాను, శైవ, వైష్ణవాలు విజృంభించాయి. ఆలయ నిర్మాణం ఉద్యమ స్థాయికి చేరుకుంది. కొన్ని వందల ఆలయాలు నిర్మించబడ్డాయి.

8. తెలుగు భాష క్రమ పరిణామం చెంది, కావ్య రూపానికి సమాయత్తమైంది. ఈ యుగం లోనే, ప్రప్రథమ తెలుగు కావ్యం, నన్నయ చేత **అంధ్ర మహా భారతం** పేరుతో వ్రాయబడింది.

9. లలిత కళలు, వివిధాకృతి శిల్ప రీతులు ఆదరించబడ్డాయి.

BRAOU

11.9 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. చాళుక్య యుగ సమాజం లోని కులాలు, కుల విభాగాలను విశ్లేషించండి.
2. క్రీ.శ. 7-12 శతాబ్దాల మధ్య ఆంధ్ర దేశంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితులను పరిశీలించండి.
3. చాళుక్య యుగంలో మతం, మత శాఖల పరిస్థితులను సమీక్షించండి.
4. చాళుక్య యుగంలో తెలుగు భాష క్రమ పరిణామాన్ని , కావ్య దశకు చేరుకున్న విధానాన్ని వివరించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. చాళుక్య యుగంలో విద్యలు, విద్యా కేంద్రాల విశేషాలను తెలపండి.
2. చాళుక్య యుగంలో లలిత కళలు, శిల్ప కళాభివృద్ధిని గూర్చి వివరించండి.

BRAOU

11.10 : ఉపయుక్త గ్రంథాలు

Ramesh, K.V. : **Chalukyas of Vatapi** (Delhi, 1986)

Sastry, K.A.N. : **The Colas** (Madras, 1955)

Suryanarayana, K. : **Feudatories under Eastern Chalukyas** (Delhi, 1987)

- do - : **History of the Minor Chalukya Families in Medieval Andhra Desa,** (Delhi, 1986)

Satyanarayana, K. : **A Study of History and Culture of the Andhras, Vol, I,** (Delhi, 1975)

Krishna Rao, B.V. : **History of the Eastern Chalukyas of Vengi,** (Hyderabad, 1973)

Krishna Kumari, M. : **The Rule of the Chalukya Cholas in Andhra Desa,** (Delhi, 1986)

Venkataramanayya, N. : **The Eastern Chalukyas of Vengi** (Madras, 1950)

Yazdani, G, (Ed.) : **The Early History of the Deccan, Vol. II.,** Oxford, 1960)

సోమశేఖరశర్మ, మల్లంపల్లి, (సం): తెలుగు సంస్కృతి, Vol.III., తెలుగు విజ్ఞాన సరస్వం (పునస్సంశోధితం) హైదరాబాద్, 1983

సూర్యనారాయణ, కొల్లూరు : మధ్యాంధ్ర యుగ చారిత్రక వ్యాసాలు, (కొక్కిరాపల్లి, 1989)

హనుమంత రావ్, బి.యస్.ఎల్. : ఆంధ్రుల చరిత్ర, (గుంటూర్, 1983)

రచయిత: డా. కొల్లూరు సూర్యనారాయణ

BRAOU

BRAOU

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

ద్వితీయ సంవత్సరం

పాఠ్యప్రణాళిక

గ్రూప్ 'ఎ' : కోర్స్-4 : ఆంధ్రుల చరిత్ర (క్రీ.శ. 1565 వరకు)

ఖండం - I : ఆంధ్రులు : తొలి చరిత్ర

భాగం - 1 : ఆంధ్రులు : పరిచయాంశాలు

భాగం - 2 : చరిత్ర పూర్వ, పురా చారిత్రక యుగాలు

ఖండం - II : శాతవాహన యుగం

భాగం - 3 : శాతవాహన యుగం : రాజకీయ చరిత్ర

భాగం - 4 : పరిపాలన, ఆర్థిక వ్యవస్థ

భాగం - 5 : సామాజిక, మత, సాంస్కృతిక పరిస్థితులు

ఖండం - III : శాతవాహనానంతర యుగం (క్రీ.శ. 624 వరకు)

భాగం - 6 : శాతవాహనానంతర యుగం: రాజకీయ పరిణామాలు (క్రీ.శ.624 వరకు)

భాగం - 7 : శాతవాహనానంతర యుగం (క్రీ.శ. 624 వరకు):
పరిపాలనా విధానం, సామాజిక, ఆర్థిక, మత, సాంస్కృతిక పరిస్థితులు

ఖండం - IV : ప్రాదేశిక గుర్తింపు: ఆంధ్రలో రాజకీయ
కేంద్రాల ఆవిర్భావం (క్రీ.శ. 624-1200)

భాగం - 8 : వేంగీ చాళుక్యుల రాజకీయ చరిత్ర : పరిపాలన

భాగం - 9 : ఆంధ్ర దేశ రాజకీయ చరిత్రపై పూర్వ చాళుక్య,
రాష్ట్రకూట, పశ్చిమ చాళుక్యుల పాలనా ప్రభావం

భాగం - 10 : ఆంధ్ర దేశంలో చాళుక్య-చోళుల పాలన :
చిన్న రాజ వంశాల ఉద్భవం

BRAOU

భాగం - 11 : చాళుక్య యుగం (క్రీ.శ. 624-1200):
సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు

ఖండం - V : కాకతీయులు

భాగం - 12 : కాకతీయుల పుట్టుపూర్వోత్తరాలు, రాజకీయ చరిత్ర

భాగం - 13 : కాకతీయుల నాటి పాలనాయుత, సామాజిక, ఆర్థిక పరిస్థితులు

భాగం - 14 : కాకతీయుల సాంస్కృతిక సేవ: మతం, సాహిత్యం, కళలు

భాగం - 15 : మహమ్మదీయ దాడుల నెదిరించిన ఉద్యమాలు: వెలమ,
రెడ్డి రాజ్యాలు, వాటి తోడ్పాటు

ఖండం - VI : విజయనగర యుగం

భాగం - 16 : విజయనగర రాజ్యావిర్భావం : సంగమ వంశ పాలన

భాగం - 17 : సాళువ, తుళువ వంశాలు : కృష్ణదేవరాయలు

భాగం - 18 : రామరాయల రాజ్య సంరక్షకత్వం: తళ్లికోట యుద్ధం

భాగం - 19 : ఆరవీటి వంశ పాలన

భాగం - 20 : విజయనగర యుగం: పరిపాలన, సమాజం, ఆర్థిక వ్యవస్థ

భాగం - 21 : విజయనగర యుగం నాటి సాంస్కృతిక పరిస్థితులు: మతం, సాహిత్యం, కళలు

భాగం - 22 : విజయనగర యుగం నాటి విదేశీయ రచనలు, వాటి చారిత్రక తోడ్పాటు

భాగం - 23 : ఆంధ్ర దేశంపై బహమనీలు, కుతుబ్‌షాహీల ఆధిపత్యం :
వారి సామాజికార్థిక సేవలు

భాగం - 24 : 16వ శతాబ్ది ఆంధ్ర దేశం : రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు

BRAOU

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

ద్వితీయ సంవత్సరం

మాదిరి పరీక్షా పత్రం

గ్రూప్ 'ఎ' : కోర్స్-4 : ఆంధ్రుల చరిత్ర (క్రీ.శ. 1565 వరకు)

సమయం : 3 గంటలు మార్కులు 100

భాగం - ఎ

4 x 15= 60

I. క్రింది ప్రశ్నల్లో ఏ నాల్గింటికైనా వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. పురా చారిత్రక యుగమంటే ఏమిటి? దాని భాగాల లక్షణాలను పరిశీలించండి.
2. శాతవాహన యుగంలో ప్రజల ఆర్థిక స్థితిగతులను విశ్లేషించండి.
3. దక్షిణ దేశ రాజకీయాల్లో వేంగీ చాళుక్యులు నిర్వహించిన పాత్రను సమీక్షించండి.
4. చాళుక్య యుగం (క్రీ.శ. 624-1200) నాటి సామాజిక పరిస్థితులను పరిశీలించండి.
5. కాకతీయుల నాటి పాలనా విధానాన్ని వివరించండి.
6. విజయనగర చరిత్రలో కృష్ణదేవరాయల కాలానికి గల విశిష్టత్ర్పాధాన్యత తెల్పివి?
7. విజయనగర యుగం నాటి సాంస్కృతిక పరిస్థితులను సమీక్షించండి.
8. ఆంధ్ర దేశంపై కుతుబ్‌షాహీల ఆధిపత్యం, వారి సామాజిక, ఆర్థిక సేవలను పేర్కొనండి.

BRAOU

భాగం - బి

5 x 8 = 40

II. క్రింది ప్రశ్నల్లో ఏ ఐదింటికైనా లఘు వ్యాఖ్యలను రాయండి.

9. 'ఆంధ్ర', 'తెలుగు' పదాల ఉత్పత్తిని సమీక్షించండి.
10. నానిక్ ప్రశస్తి శాసన చారిత్రక ప్రాధాన్యతను విశ్లేషించండి.
11. అమరావతి మహా చైత్యం శాతవాహనుల కాలంలో ఎలా మెరుగులు దిద్దుకుంది?
12. ఆభీర వసుషేణుడు ఇక్ష్వాకుల నాటి రాజకీయ చరిత్రలో నిర్వహించిన పాత్ర ఎట్టిది?

13. 'విక్రమాంకదేవ చరిత్ర' చారిత్రక ప్రాముఖ్యతను వేర్కొనండి.

14. చాళుక్య యుగం (క్రీ.శ. 624-1200) లో లలిత కళలు, శిల్పకళాభివృద్ధిని గూర్చి వివరించండి.

15. సామంత కాకతీయుల రాజకీయ కార్యకలాపాల ప్రభావ ఫలితాలను పరిశీలించండి.

16. కాకతీయుల నాటి పాశుపత శైవ మతం, గోళకీ మఠ కార్యకలాపాలను విశ్లేషించండి.

17. కాపయ నాయకుడు సమకాలీన రాజకీయాల్లో నిర్వహించిన పాత్ర ఎట్టిది?

18. బహమనీల కాలం నాటి సామాజికార్థిక పరిస్థితులను, వారి సేవలను సమీక్షించండి.

BRAOU

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

ద్వితీయ సంవత్సరం

గ్రూప్ 'ఎ' : కోర్స్-4 : ఆంధ్రుల చరిత్ర (క్రీ.శ. 1565 వరకు)

అభ్యాసం - 1

గమనికలు :

- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరు వైపుల మూల్యాంకన కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

భాగం - ఎ

I. **క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.**

1. ఆంధ్రప్రదేశ్ భౌగోళిక లక్షణాలను, ఆంధ్రుల చరిత్రపై వాటి ప్రభావాన్ని పరిశీలించండి.
2. శాతవాహనుల నాటి ప్రజల ఆర్థిక స్థితిగతులను విశ్లేషించండి.

భాగం - బి

II. **క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.**

1. వేసంత తామ్ర శాసనం తెలియజేస్తున్న చారిత్రక సమాచారమేది?
2. ఆంధ్ర రాజకీయాలపై కర్ణాటక రాజ వంశాల ప్రభావాన్ని విశ్లేషించండి.

BRAOU

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

ద్వితీయ సంవత్సరం

గ్రూప్ 'ఎ' : కోర్స్-4 : ఆంధ్రుల చరిత్ర (క్రీ.శ. 1565 వరకు)

అభ్యాసం - 2

గమనికలు :

- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరు వైపుల మూల్యాంకన కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

భాగం - ఎ

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. ఇక్ష్వాకుల చరిత్రను, వారి ఘనతను పరిశీలించండి.
2. చాళుక్య యుగం (క్రీ.శ. 624-1200)లో వెలసిల్లిన సాంస్కృతిక పరిస్థితులను వివరించండి.

భాగం - బి

II. క్రింది ప్రశ్నలకు అమ్ము వ్యాఖ్యలను రాయండి.

1. అమ్మో యుగ జీవన విధానాన్ని విశ్లేషించండి.
2. రోమన్ నాణేలు శాతవాహనుల నాటి ఆర్థిక వ్యవస్థలో ఎట్టి పాత్రను వహించాయి.?

BRAOU

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

ద్వితీయ సంవత్సరం

గ్రూప్ 'ఎ' : కోర్స్-4 : ఆంధ్రుల చరిత్ర (క్రీ.శ. 1565 వరకు)

అభ్యాసం - 3

గమనికలు :

- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరు వైపుల మూల్యాంకన కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

భాగం - ఎ

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. పురా చారిత్రక యుగమంటే ఏమిటి? దాని భాగాల లక్షణాలను పరిశీలించండి.
2. శాతవాహనానంతర యుగం (క్రీ.శ. 624 వరకు) నాటి వాస్తుకళా రీతులు, ప్రగతిని సమీక్షించండి.

భాగం - బి

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. గౌతమీపుత్ర యజ్ఞశ్రీ శాతకర్ణి పాలనా విశేషాలను సమీక్షించండి.
2. సంఖ్యాంకిత ప్రాంతీయ విభాగాలంటే ఏమిటో తెల్పి, వాటి ప్రాముఖ్యతను వివరించండి.

BRAOU

BRAOU

అందరికీ అందుబాటులో
ఉన్నత విద్య




చర్చ




సాక్ష్యాలు




గ్రంథాలయ సదుపాయాలు




రేడియో ప్రసారాలు



శ్రవ్య పాఠాలు



కలనచిత్ర పాఠాలు



వీక్ష్య పాఠాలు


BRAOU

డా॥ బి.ఆర్
అంబేద్కర్
సార్వత్రిక
విశ్వవిద్యాలయం

రోడ్ నెం. 46, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ - 500 033

M.A.H.(F)A-4

ఆంధ్రుల చరిత్ర (క్రీ.శ. 1565 వరకు)



2

BRAOU

చరిత్ర

ఆంధ్రుల చరిత్ర (క్రీ.శ. 1565 వరకు)

ఖండాలు : V - VI

BRAOU

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

హైదరాబాద్

2004

రచయితల బృందం

సంపాదకుడు

ఆచార్య సి. సోమసుందర రావ్

సహ సంపాదకులు

ఆచార్య వి. రామకృష్ణారెడ్డి
కుమారి ఇ. సుధారాణి

రచయితలు

ఆచార్య ఎ. కమలవాసిని

డా. వి. సుందరరామశాస్త్రి

డా. కె. యస్. కామేశ్వర రావ్

డా. జె. దుర్గాప్రసాద్

డా. ఎ. మురళీమోహన్

డా. కె. సూర్యనారాయణ

ముఖ చిత్రం

యమ్. రమేష్

BRAOU

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
హైదరాబాద్.

ప్రథమ ముద్రణ : 1997 **2002** 2004

(C) 1997 డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకం లోని ఏ భాగాన్నైనా ఉపయోగించదల్చుకుంటే, విశ్వవిద్యాలయ అనుమతిని పొందాలి. ఈ పుస్తకం సార్వత్రిక విశ్వవిద్యాలయ ప్రోస్ట్రగ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ఒక భాగం. పాఠ్యప్రణాళిక మొత్తం వివరాలు ఈ పుస్తకం చివరలో ఉన్నాయి.

ఇతర వివరాలకు : ఎకడమిక్ డైరెక్టర్, డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, రోడ్ నెం. 46, జ్యూబిలీ హిల్స్, హైదరాబాద్ - 500033. ఆం.ప్ర.

Printed by : Siddeshwar Printers, Market Street, Secunderabad - 500 003.
Lr. No.967/Dr.BRAOU/DMP/PTG/F.No.38/J.O.278/Dt: 07-09-2004 - 200 Copies

పరిచయం

కొన్ని ప్రాంతాల సంలీనంతో దేశ మేర్పడుతుంది. ప్రతి ప్రాంతానికి భిన్నమైన, విలక్షణమైన భౌగోళిక లక్షణాలు, ఆర్థిక పద్ధతులు, సాంఘిక కట్టుబాట్లు, ఆచారాలు, వ్యవహారాలు, భాషా మతాలు, వాస్తుకళా రీతులుంటాయి. ఇట్టి ప్రాంతీయ సంస్కృతుల కలయికతో, సాగసైన, విశిష్టమైన, సుసంపన్నమైన దేశ సంస్కృతి రూపు తీసుకొంటుంది. దీనిని ప్రతిఫలింపజేసే ఒకానొక ప్రాంతీయ చరిత్రే, ఆంధ్రుల చరిత్ర. శాతవాహనులు, ఇక్ష్వాకులు, శాలంకాయనులు, ఆనందగోత్రులు, పల్లవులు, విష్ణుకుండినులు, వేంగీ చాళుక్యులు, కాకతీయులు, వెలమ నాయకులు, రెడ్డి రాజులు, విజయనగర చక్రవర్తులు, బహమనీ, కుతుబ్‌షాహీ సుల్తాన్‌లు, ఆసఫ్‌జాహీ నవాబులు, చివరగా ఆంగ్లేయులు, ఈ సువిశాల, సుందర ప్రాంతంపై తమ పాలనా ప్రభావాలను నెరపారు. వీరే కాకుండా, నాటి ఆంధ్ర దేశ రాజకీయాల్లో కర్ణాటక, తమిళ రాజ వంశాలైన పూర్వ చాళుక్యులు, రాష్ట్రకూటులు, పశ్చిమ చాళుక్యులు, చోళులు, చురుకైన, ప్రభావయుక్తమైన పాత్రను నిర్వహించారు. క్రీ.పూ. 30 నుండి ఈ ప్రాంతంలో నిరాటంకమైన, శక్తివంతమైన పరిపాలన, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ప్రగతి, కొనసాగుతూ వచ్చింది.

చరిత్రలో ద్వితీయ సంవత్సర స్నాతకోత్తర పాఠ్యాంశాలను అధ్యయనం చేసే, డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ విద్యార్థులకు, 'ఆంధ్రుల చరిత్ర (క్రీ.శ. 1565 వరకు)' కోర్స్‌గా రూపొందించబడింది. ఆంధ్రులు, ఆంధ్ర దేశ రాజకీయ, పాలనా చరిత్రలతోబాటు, ఇక్కడి నాగరికతా సంస్కృతులు, సామాజిక, ఆర్థిక వ్యవస్థలు, శతాబ్దాలు, యుగాల పర్యంతం, ఎలా పరిణామం చెందుతూ వచ్చాయో, వివరంగా అధ్యయనం చేయబడినాయి. ఇట్టి అధ్యయన, పరిశీలనలు, ప్రాంతీయ చరిత్ర సమగ్ర అవగాహనకు, తద్వారా దేశ చరిత్ర సంపన్న సంగ్రహణకు దోహదమైతాయని ఆశిస్తున్నాం.

ఈ కోర్స్‌లో మొత్తం ఆరు ఖండాలు, ఇరవైనాల్గు భాగాలున్నాయి. పఠనా సౌలభ్యం కోసం, దీనిని రెండు పుస్తకాలుగా ముద్రించడమౌతూంది. మొదటి పుస్తకంలో, తొలి నాల్గు ఖండాలకు సంబంధించిన పదకొండు భాగాలను చేర్చడం జరిగింది. వీటిలో, పరిచయాంశాలు, శాతవాహన యుగం, శాతవాహనానంతర యుగం (క్రీ.శ. 624 వరకు), చాళుక్య యుగం (క్రీ.శ. 624-1200) నాటి రాజకీయ పరిణామాలు, పాలనా విధానాలు వివరంగా చర్చించబడినాయి. వీటితోబాటు, నాటి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు, ప్రగతీ పరిణామాలు విపులంగా విశ్లేషించబడినాయి. రెండో పుస్తకంలో, చివరి రెండు ఖండాలకు చెందిన పదమూడు భాగాలను పొందుపర్చడం జరిగింది. వీటి ద్వారా ఆంధ్రుల చరిత్రలో అత్యంత ప్రసిద్ధి గాంచిన కాకతీయ, విజయనగర యుగాలు, వీటితోబాటుగా వెలమ, రెడ్డి రాజ్యాలు, బహమనీ, కుతుబ్‌షాహీల పాలనా విశేషాలు కూలంకషంగా చర్చించబడినాయి. వీటి అధ్యయనం ద్వారా, నాటి సామాజిక, ఆర్థిక వ్యవస్థల్లో సంభవించిన మార్పులను, పురోగతిని, సాంస్కృతిక పరిణామాలు, ప్రగతిని, విద్యార్థులు స్పష్టంగా అవగాహన చేసికోగలరని ఆశించడమౌతూంది.

అత్యంత ప్రాధాన్యత, అభిమానంతో కూడుకొన్న "ఆంధ్రుల చరిత్ర (క్రీ.శ. 1565 వరకు)" ను క్షుణ్ణంగా తెలుసుకునేందుకు, ఈ పాఠ్య భాగాలు తోడ్పడగలవని విశ్వవిద్యాలయం ఆశిస్తూంది.

BRAOU

BRAOU

విషయక్రమం

		పుట నెం.
ఖండం - V :	కాకతీయులు ...	01
భాగం - 12 :	కాకతీయుల పుట్టుపూర్వోత్తరాలు, పాలనాంశాలు ...	3
భాగం - 13 :	కాకతీయ రాజ్య వ్యవస్థ, సామాజిక, ఆర్థిక పరిస్థితులు ...	19
భాగం - 14 :	కాకతీయుల సాంస్కృతిక సేవ : నాటి మతం, సాహిత్యం, కళలు	37
భాగం - 15 :	రెడ్డి, నాయక రాజ్యాలు: రాజకీయ, సాంస్కృతిక కార్యకలాపాలు ...	49
ఖండం - VI :	విజయనగర యుగం ...	67
భాగం - 16 :	విజయనగర రాజ్య ఆవిర్భావం: సంగమ వంశం ...	69
భాగం - 17 :	సాళువ, తుళువ వంశాలు: కృష్ణదేవరాయలు ...	102
భాగం - 18 :	రామరాయల రాజ్య సంరక్షకత్వం: తళ్లికోట యుద్ధం ...	123
భాగం - 19 :	ఆరవీటి వంశం ...	151
భాగం - 20 :	పరిపాలన, సమాజం, ఆర్థిక వ్యవస్థ ...	170
భాగం - 21 :	విజయనగర యుగం: మతం, సాహిత్యం, కళలు ..	196
భాగం - 22 :	విదేశీయుల రచనలు ...	220
భాగం - 23 :	ఆంధ్ర దేశంపై బహమనీల, కుతుబ్‌షాహీల ఆధిపత్యం, సాంస్కృతిక పరిస్థితులు ...	234
భాగం - 24 :	16వ శతాబ్దం: ఆంధ్ర దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు ...	249
	పార్శ్వప్రణాళిక	
	మాదిరి పరీక్షా పత్రం	
	అభ్యాసాలు	

BRAOU

BRAOU

ఖండం-V : కాకతీయులు

ఈ ఖండంలో 12, 13, 14, 15 భాగాలున్నాయి. వీటిలో మొదటిదైన 12వ భాగంలో, కాకతీయుల పుట్టు పూర్వోత్తరాల గురించి, సామంత స్థాయిలో పరిపాలించిన ఆ వంశ పాలకుల గురించి, స్వతంత్ర కాకతీయ రాజులు రుద్రదేవ, గణపతిదేవ, రుద్రమ, ప్రతాపరుద్రుల చరిత్ర గురించి, శేవుణ, హోయసాల, పాండ్యులతో వీరి సంబంధాల గురించి, వివరణ వుంది. 13వ భాగంలో, వారి కాలంలో పరిపాలనా విధానం, సామాజిక, ఆర్థిక పరిస్థితుల విపులీకరణ ఉంది. 14వ భాగంలో కాకతీయుల కాలం నాటి మతం, సాహిత్యం, కళల ప్రగతి చోటు చేసుకుంది. చివరిదైన 15వ భాగంలో, కాకతీయుల అనంతరం ఆంధ్ర దేశంపై ముస్లిం దాడులు, తత్పరిణామాలు, ముసునూరి, రెడ్డి, వెలమ రాజ్యాల ఆవిర్భావం, వీరి కాలంలో నెలకొన్న సాంస్కృతిక పరిణామాలు చర్చించబడినాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ ఖండంలో కాకతీయుల నాటి రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు, తదనంతరం రెడ్డి, వెలమ పాలకుల కృషి గురించి, విద్యార్థులు స్పష్టంగా తెలుసుకోగల్గాలి.

BRAOU

BRAOU

భాగం-12 : కాకతీయుల పుట్టుపూర్వోత్తరాలు, పాలనాంశాలు

విషయక్రమం

12.0 : లక్ష్యాలు

12.1 : పరిచయం

12.2 : కాకతీయుల పుట్టుపూర్వోత్తరాలు

12.3 : సామంత కాకతీయులు

12.4 : స్వతంత్ర ప్రభువులు

12.4.1 :రుద్రదేవుడు

12.4.2 :గణపతిదేవుడు

12.4.3 :రుద్రమదేవి

12.4.4 :ప్రతాపరుద్రుడు

12.4.5 :తురుష్క దండయాత్రలు

12.5 : సంగ్రహంగా

12.6 : పరీక్ష నమూనా ప్రశ్నలు

12.7 : ఉపయుక్త గ్రంధాలు

BRAOU

12.0 : లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం ద్వారా

- కాకతీయుల పుట్టుపూర్వోత్తరాల గురించి, సామంత స్థాయిలో పరిపాలించిన ఆ వంశీయుల పాలన గురించి వివరించగలగాలి.
- స్వతంత్రంగా పాలించిన రుద్రదేవ, గణపతిదేవ, రుద్రమ, ప్రతాపరుద్రుల కాలపు కాకతీయ రాజ్య విస్తృతి, శేవుణ, హోయసాల, పాండ్య పాలకులతో వీరి సంబంధాలు, తురుష్క దండయాత్రల కారణంగా ఎలా రాజ్యం విచ్ఛిన్నమైంది విశ్లేషించగలగాలి.

12.1 : పరిచయం

శాతవాహనుల అనంతర కాలంలో ఆంధ్ర దేశాన్ని, ఆంధ్ర జాతిని సమైక్యం చేసి, వీకచ్ఛత్రాధిపత్యం కిందికి తెచ్చిన రాజ వంశం, కాకతీయ వంశం. క్రీ.శ. 12, 13 శతాబ్దాలలో చిన్న చిన్న మాండలిక

రాజ్యాలకు ఆంధ్ర దేశం ఆలవాలంగా వుండేది. వివిధ సామంత మాండలిక రాజులు తరచూ యుద్ధాలలో మునిగి, చాళుక్య, చాళుక్య-చోళ, గంగ వంశీయుల సహాయసహకారాలను పొందుతూ, ఆంధ్ర దేశాన్ని యుద్ధ భూమిగ మార్చేశారు. ఇటువంటి పరిస్థితులలో కాకతీయులు తెలంగాణా నుండి విజృంభించి, సమస్తాంధ్రాన్ని జయించి, ప్రాంతీయాభిమానాలను విస్మరించి, ఆంధ్రత్వానికి సమగ్ర రూపాన్నిచ్చి, జాతీయ భావాన్ని సాధించారు. ఈ ఆంధ్ర దేశాధీశ్వరులు కవులను, పండితులను, కళాకారులను పోషించి, ఆంధ్ర సంస్కృతికి విశేషమైన సేవల నందించారు. సమగ్రాంధ్రాన్ని క్రీ.శ.14వ శతాబ్దిలో జరిగిన తురుష్కుల దండయాత్రల నుండి రెండు దశాబ్దాల కాలం నిరోధించి, కాపాడగలిగారు. భారతీయ సంస్కృతీ పరిరక్షణలో రెడ్డి, విజయనగర పాలకులకు ఆదర్శప్రాయులయ్యారు.

12.2 : పుట్టుపూర్వోత్తరాలు

కాకతీయుల పుట్టుపూర్వోత్తరాల గురించి అనేక వాదాలు కన్పిస్తున్నాయి. గణపతిదేవుని గరవపాడు తామ్ర శాసనాన్ని ప్రచురించిన సి.ఆర్.కె.చార్లు ఆ శాసన మాధారంగా కాకతీయుల పూర్వీకుడు కరికాల చోడుడని, కాకతి గ్రామం పాత బస్తర్ సంస్థానం లోని కాకెర, లేదా కాకతీయ నగరమని వాదించాడు. అయితే, చోళ కుటుంబాలన్నీ శాసనాలలో తప్పనిసరిగా ప్రస్తావించిన కాశ్యప గోత్రాన్ని, కాకతీయులు తమ ప్రశస్తిలో ఎప్పుడూ పేర్కొనడం జరుగలేదు. ఈ గరవపాడు శాసనం మినహా మరే కాకతీయ శాసనమూ, కరికాలుణ్ణి ఆ వంశ పూర్వీకునిగా చెప్పలేదు. అందుచేత, ఈ వాదాన్ని సమర్థించేవారూలేరు. ఇదే విధంగా, క్రీ.శ. 6వ శతాబ్దం లోని కళింగ దుర్జయదేవుని వారసులే కాకతీయులని, మరి కొంతమంది నమ్మారు. అయితే, దీనికీ నిర్దిష్టమైన సాక్ష్యం లేదు.

కాకతీయుల గురించి మొదటి సారిగా తూర్పు చాళుక్య దానార్ణవుని మాంగల్లు తామ్ర శాసనం (క్రీ.శ. 956) ప్రస్తావించింది. రాష్ట్రకూట మూడవ కృష్ణని సహాయంతో వేంగీ రాజ్య సింహాసనాన్ని ఆక్రమించుకున్న దానార్ణవుడు, తనకు తోడ్పడ్డ రాష్ట్రకూట సేనాని కాకర్త్య గుండ్యనను సంతోష పెట్టడానికి, ఒక బ్రాహ్మణునికి మాంగల్లు గ్రామాన్ని అగ్రహారంగా దానమిచ్చిన సందర్భం లోనిదీ శాసనం. ఈ సందర్భం లోనే శాసనంలో గుండ్యనకు వెనుక మూడు తరాల పూర్వీకుల ప్రస్తావనుంది. ఈ కాకర్త్య గుండ్యనాదులు అనుమకొండ కాకతీయుల పూర్వీకులే అనే విషయం, కాకతి గణపతిదేవుని సోదరి మైలాంబ వేయించిన బయ్యారం చెరువు శాసనం (క్రీ.శ. 1250) ధృవీకరిస్తున్నది. ఇంతేగాక, కాకతీయులు రాష్ట్రకూటుల కింద తమ సామంతత్వ సూచకంగా, గరుడ లాంఛనాన్ని కూడా అధికార చిహ్నంగా ఉపయోగించారు. ఈ రీతి లోనే, రాష్ట్రకూటుల అనంతరం సార్వభౌములైన కళ్యాణి చాళుక్యుల వరాహ లాంఛనాన్ని కూడా, వారి సామంతులుగా మారిన కాకతీయులు ఉపయోగించారు.

'కాకతి' అనే పదం నుండి కాకతీయ వంశ నామం వచ్చినట్లు కన్పిస్తున్నది. అయితే ఈ 'కాకతి' పదానికి అర్థాన్ని వివరించటంలో రెండు పరస్పర భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. 'కాకతి' అనేది దుర్గా శక్తి అనీ, ఈ శక్తిని ఆరాధించేవారు గనుక వీరు కాకతీయులైనారని, క్రీ.శ. 15వ శతాబ్దంలో నివసించిన కుమారస్వామి సోమపీఠి (విద్యానాథుని ప్రతాపరుద్రీయ వ్యాఖ్యాత) పేర్కొన్నాడు. ఓరుగల్లులో కాకతమ్మ, ఏకవీర దేవతా ప్రతిమలు ఒక దాని ప్రక్క మరొకటి ప్రతిష్ఠించబడినట్లు, వల్లభరాయుని 'క్రీడాభిరామం' తెలుపుతున్నది. క్రీ.శ. 1508 నాటి చిత్తాపఖానుని శాసనం కూడా, తురుష్కులు నాశనం చేసిన కాకతీయ రాజ్య పద్మాకరమూ, జగన్మాతృక అయిన ఈ దేవతా విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించటం గురించి ప్రస్తావించింది. ఏకవీర లాంటి గ్రామ దేవతతో కలిపి ప్రస్తావించడాన్ని

BRAOU

బట్టి, ఈ కాకతి కూడా గ్రామదేవతే కావచ్చు. అయితే, అసంఖ్యాకమైన గ్రామ దేవతలను దుర్గాదేవి రూపాలుగానే, సాధారణంగా పరిగణిస్తున్నారు.

'కాకతి' అనేది ఒక ప్రదేశాన్ని సూచిస్తున్నదని మరికొంతమంది అభిప్రాయం. కాకతీయ వంశ మూల పురుషుడైన వెన్నడు, కాకతి నుండి పాలించటం వలన, ఆ వంశస్థులంతా కాకతీయులయ్యారని బయ్యారం చెరువు శాసనం తెలుపుతున్నది. అంటే, వీరు కాకతి పురాధీశులైనందున, కాకతీయులనే పేరు వచ్చిందని పరిగణించాలి. కర్ణాటక రాష్ట్రంలో బెల్గాంకు ఉత్తరంగా, 12 మైళ్ళ దూరంలో, 'కాకతి' అనే గ్రామముంది. ఇదే, వీరి ప్రథమ నివాస స్థానం కావచ్చు. రాష్ట్రకూటుల క్రింది ఉద్యోగులుగా తమ రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన కాకతీయులు, కర్ణాటక ప్రాంతం నుండే వచ్చివుంటారనటంలో అసాధ్యమేమీలేదు. అయితే, ఈ విషయంలో ఇంకా పరిశోధన జరగాల్సుంది.

మొదట్లో జైనులుగా ఉన్న కాకతీయులు, జైన దేవత కూష్మాండిని (కాకతి) ఆరాధకులనీ, శైవ మతస్థులయ్యాక సంప్రదాయాన్ని విడిచిపెట్టలేక, ఆ దేవతనే కాకతమ్మ అనే దుర్గాశక్తిగా పూజించారని, కొంతమంది పూర్వ రచయితలు భావిస్తున్నారు. బహుశ, కాకతీయులు కాకతి పురం నుండి వచ్చేటప్పుడు, ఈ దేవతను కూడా తమతో తెచ్చుకొని, అనుమకొండలో స్థిరపడ్డాక, ఒక ఆలయంలో ఈ దేవతను ప్రతిష్ఠించుండొచ్చు. ఏది ఏమైనా, నగరాన్ని బట్టికాని, దేవతను బట్టికాని, వారు కాకతీయులయ్యారు. ఈ కాకతీయ పదానికి, కాకత్య, కాకర్త్య, కాకతి, కాకత్తియ, కాకతియ్య వంటి పదాలు, శాసనాలలో కన్పిస్తున్నాయి.

కాకతీయులు విష్ణి (వృష్ణి) వంశ క్షత్రియులని, ఒక వాదముంది. మల్కాపురం, మోటుపల్లి శాసనాలు కాకతీయ ప్రభువులను క్షత్రియులనే పేర్కొంటున్నాయి. అయితే, ఈ ఒకటి, రెండు శాసనాలు మినహా, ఇతర శాసనాలు గాని, వాఙ్మయం కాని, ఇది వాస్తవం కాదని స్పష్టం చేస్తున్నాయి. ఆనాటి క్షత్రియ పాలకులందరకూ, వంశ ప్రశస్తిలో తమ గోత్ర నామాన్నుదహరించటం సంప్రదాయం. కాకతీయు లెక్కడా తమ గోత్ర నామాన్ని ప్రస్తావించ లేదు. ప్రతాపరుద్రుని ఆస్థాన కవి విద్యానాథుడు "సోమార్కాభిజనమ్ అద్యజయతి శ్రీ కాకత్యాన్వయమ్" అంటూ, సూర్య చంద్ర వంశాల (క్షత్రియుల) ప్రతిష్ఠను తలదన్నే ప్రతిష్ఠ, కాకతీయ కులానిదని ప్రశంసించటంలో అర్థం, కాకతీయులు క్షత్రియులు కాదని పరోక్షంగా చెప్పడమే. సైనికులుగా, సేనానాయకులుగా, పాలకులుగా, క్షాత్ర ధర్మాలను నిర్వర్తించినందువలన, క్షత్రియులమని చెప్పకొన్న ఇతరులు అనేకులు, చరిత్రలో కన్పిస్తారు. ఆంధ్ర దేశ చరిత్రలో శూద్రులైన వెలనాటి, కొండవడమటి, కోట, పరిచ్ఛేది, మండ వంశీయులంతా, తాము క్షత్రియులమని చెప్పకొన్నవారే. మహాపరాక్రమవంతులై సామ్రాజ్య స్థాపకులవడం వలన, కాకతీయులు కూడా ఒకటి రెండు శాసనాలలో క్షత్రియులమని చెప్పకొన్నారు. నిజానికి భారతదేశంలో మౌర్యుల అనంతర కాలంలో, క్షత్రియుల ఉనికినే నేటి పరిశోధనలు పరిహసిస్తున్నాయి.

కాకతీయులు శూద్రులని చెప్పొచ్చు. బయ్యారం చెరువు శాసనంలో కాకతీయులు, నతవాడి వంశీయులు సవర్ణులని పేర్కొన్నారు. వీరివురూ రెండు మూడు తరాలు వైవాహిక సంబంధాలందు కున్నారు. అమరావతి లోని ఒక శాసనం, నతవాడి వంశీయులు చతుర్థాన్వయులని స్పష్టీకరించింది. గణపతిదేవుని ప్రసిద్ధ సేనాని మల్యాల గుండయ బోత్యార్, వడ్డమాను శాసనాలు, కాకతీయులు శూద్రులని మరింత ధృవీకరించాయి. వీరు కమ్మ కర్షకులని సామాన్యంగా భావింపబడుతూంది.*

*Malkapuram Village - a monograph, Census of India, 1961, Vol. II, Andhra Pradesh.

BRAOU

12.3 : సామంత కాకతీయులు

మాంగల్లు శాసనం లోని గుండియ, అతని కుమారుడు ఎఱియలు, కాకతీయ వంశంలో మొదటి చారిత్రక వ్యక్తులు. ఇద్దరూ 'రాష్ట్రకూట' బిరుదాంకితులే. 'రాష్ట్రకూట' అంటే ప్రాంతాధికారి, గ్రామాధికారి, గ్రామోద్యోగి అనే అర్థాలు కన్పిస్తున్నాయి. క్రీ.శ. 746-క్రీ.శ. 973 మధ్య దక్కన్ ప్రాంతాన్నంతటినీ ఏలిన రాష్ట్రకూట ప్రభువులకు అనుయాయులుగా కూడా, ఈ గుండియ, ఎఱియలు వ్యవహరించారు. బయ్యారం చెరువు శాసనంలో మొదటివాడైన వెన్న భూపతి ప్రపౌత్రుడే, గుండియ రాష్ట్రకూటుడు. తీరాంధ్రాన్ని పాలిస్తున్న వేంగీ చాళుక్యులతో, రాష్ట్రకూటులకు బద్ధ వైరం. రాష్ట్రకూటులు వేంగీ రాజ్యంపై అనేక సార్లు దాడులను నిర్వహించారు. రాష్ట్రకూట రెండో కృష్ణుడు వేంగిపై చేసిన దాడుల్లో, గుండియ ప్రముఖ పాత్ర వహించాడు. బెజవాడను పట్టుకోవడంలో సాహసాన్ని ప్రదర్శించాడు. అనంతరం జరిగిన వెరువంగూరు యుద్ధంలో గుండియ మరణించాడు.

గుండియ తన సేవలో ప్రాణాలను కోల్పోయాడనే కృతజ్ఞతతో, రాష్ట్రకూట రెండో కృష్ణుడు గుండియ కుమారుడు ఎఱియను కుఱువాడి సీమకు అధిపతిగా నియమించాడు. ఇది రాష్ట్రకూట సామ్రాజ్య తూర్పు సరిహద్దు ప్రాంతం. వేంగినాడుకు, రాష్ట్రకూట సామ్రాజ్యానికి మధ్య, వేంగి చాళుక్యులకు లోబడి పాలిస్తున్న ముదిగొండ చాళుక్యుల రాజ్యాంతర్గతమైన కొరవిలో భాగం. ఓరుగల్లుకు దగ్గరలో ఉంది. ఈ ప్రాంతానికై వేంగి, మాన్యఖేటాల మధ్య తరచూ సంఘర్షణలు జరిగాయి. రాష్ట్రకూట సామ్రాజ్య తూర్పు సరిహద్దు రక్షణగా, ముదిగొండ చాళుక్యులపై అదుపుగా కుఱువాడి సీమ ఉపయోగిస్తుందనే, కృష్ణుడు ఎఱియను దాని కధిపతిగా నియమించాడు. ఎఱియ ఓరుగల్లును రాజధానిగా చేసుకొని పాలన ప్రారంభించాడు. ఈ విధంగా, కాకతీయులు రాష్ట్రకూట సేనానులుగా, సరిహద్దు రక్షణోద్యోగులుగా తెలుగు సీమలో ప్రవేశించారు.

ఎఱియ కుమారుడు బేతియ అసమర్థత వలన, కుఱువాడిని ముదిగొండ చాళుక్యులు తిరిగి ఆక్రమించారు. ఈ బేతియ కొడుకే, బయ్యారం చెరువు శాసనంలో 'పిండిగుండ'గా వ్యవహరించబడ్డ కాకర్త్య గుండ్యన. వేంగి అంతఃకలహాలలో చాళుక్య దానార్ణవుడు, రాష్ట్రకూటుల తోడ్పాటుతో తమ్ముడు రెండో అమ్మరాజును తొలగించి, వేంగి సింహాసనమధిష్ఠించాడు. దానార్ణవునికి సాయపడిన గుండ్యన, నతవాడి (వరంగల్, ఖమ్మం జిల్లాల లోని ప్రాంతం)కి పాలకుడయ్యాడు. క్రీ.శ. 973లో రాష్ట్రకూటులను తొలగించి, రెండో తైలపుడు కల్యాణి రాజధానిగా, చాళుక్య వంశాన్ని పునఃప్రతిష్ఠించాడు. వేంగిలో దానార్ణవుని చంపి, జటాచోడ భీముడు సింహాసనమాక్రమించటంతో, దీని నవకాశంగా తీసుకొని, గుండ్యన ముదిగొండ చాళుక్యుల నుండి కుఱువాడిని స్వాధీనం చేసుకొన్నాడు. అయితే, పశ్చిమ చాళుక్య సేనాని, విరియాల ఎర్రభూపతి తోడ్పాటుతో, ముదిగొండ చాళుక్య బొట్టు బేతడు, గుండ్యనను చంపి, క్రీ.శ. 995 ప్రాంతంలో రాజ్యాన్నాక్రమించుకున్నాడు.

గుండ్యన కుమారుడు గరుడ బేతన, పిన్న వయస్కుడు. అండగా నిలిచే రాష్ట్రకూటులు అంతరించారు. రాజ్యాన్ని కోల్పోయాడు. ఈ కష్ట కాలంలో అతనికి మేనత్త కామసాని అండగా నిలబడింది. ఈ విషయాన్ని గూడూరు శాసనం, సిద్ధేశ్వర చరిత్రలు తెలుపుతున్నాయి. కల్యాణి చాళుక్య సేనాని విరియాల ఎఱ్ఱన భార్యయే, ఈ కామసాని. ఈమె చాళుక్య చక్రవర్తి తైలపుని ఆశ్రయించి, చిన్నవాడైన బేతనికి అనుమకొండ విషయాధిపత్యాన్ని ఇప్పించింది. ఈ విధంగా, కొరవిలో ముదిగొండ

BRAOU

చాళుక్యులు, ఓరుగల్లులో కాకతీయులు అధిపతులయ్యారు. అనుమకొండకు వచ్చిన మొదటి కాకతీయుడు ఈ బేతనయేనని, బయ్యారం చెరువు శాసనం చెబుతున్నది. ఇతడే చరిత్రలో ప్రసిద్ధుడైన మొదటి బేతరాజు. ఈ విధంగా, కాకతీయులు విరియాల వారి సాయంతో, కళ్యాణి చాళుక్యులకు విధేయులైన సామంతులుగా, అనుమకొండ విషయాధిపతులయ్యారు.

క్రీ.శ. 1051 నాటి శనిగారం శాసనం అప్పటి వరకు మొదటి బేతరాజు జీవించున్నట్లు ధృవీకరిస్తున్నది. శనిగారం (కరీంనగర్ జిల్లా) శాసనం ఉనికిని బట్టి, వేములవాడ చాళుక్య రాజ్యం లోని ఆ ప్రాంతం, బేతని వశమైనట్లు స్పష్టమౌతున్నది. బేతన సేనాని రేచర్ల బ్రహ్మ చాళుక్య త్రైలోక్య సోమేశ్వరుని పనుపున, చోళ రాజధానిపై దాడి చేశాడు. ఈ దాడిలో బేతన కూడా పాల్గొని ఉండొచ్చునని, ఇతని 'చోళ చమూవార్ధి ప్రమధన' బిరుదం సూచిస్తున్నది.

బేతని కొడుకు ప్రోలరాజు (క్రీ.శ. 1052-76), చాళుక్య యువరాజు (ఆరో) విక్రమాదిత్యుడు జరిపిన కొంకణ, చక్రకూట దండయాత్రలలో పాల్గొని, 'సమధిగత పంచమహాశబ్ద' బిరుదాన్ని పొందాడు. వేములవాడ, కొడ్పర్తి, గుణసాగరం మొదలైన ప్రాంతాలను జయించి, అనుమకొండ విషయంలో కలుపుకున్నాడు. పరాక్రమ, స్వామిభక్తిపరాయణతలతో, త్రైలోక్యమల్ల సోమేశ్వరుని మెప్పించి, అనుమకొండ విషయాన్ని శాశ్వత పట్టాగా పొందాడు. గరుడ లాంఛనంతోబాటు, చాళుక్య సామంత ప్రతిపత్తిని సూచిస్తూ, వరాహ లాంఛనం కూడా ఉపయోగంలోకి వచ్చింది. 'అరిగజ కేసరి' బిరుదాంకితుడైన ఈ ప్రోలరాజు, బిరుద నామం తోనే 'కేసరి తటాకాలను' త్రవ్వించాడు.

ప్రోలుని కొడుకు రెండో బేతరాజు, క్రీ.శ. 1076లో అనుమకొండ రాజ్యాధిపతయ్యాడు. చాళుక్య రాజ్య వారసత్వ సంఘర్షణలో, ఈతడు ఆరో విక్రమాదిత్యుని సమర్థించి, అతని ఆదరణకు పాత్రుడై, 'విక్రమ చక్రి' 'త్రిభువనమల్ల' బిరుదులను పొందాడు. మంత్రి వైజదండనాయకుని సాయంతో, విక్రమాదిత్యుని ప్రోత్సాహంతో, బేతరాజు కొల్లిపాక రాష్ట్ర పాలకుడైన పరమార జగద్దేవుని, పొలవాస అధినేత మేడరాజుని అణచి, సబ్బిమండలాన్ని చాలా వరకు, అనుమకొండ రాజ్యంలో కలిపాడు. దీనితో, కాకతీయ రాజ్యం విస్తరించడమారంభమైంది. కాలాముఖ శైవాచార్యుడు రామేశ్వర పండితుని నుండి శైవ దీక్ష పొందిన రెండో బేతరాజు, గురు దక్షిణగా అనుమకొండలో శివపురాన్ని, ఆ ప్రాంతంలో తన పేరిట బేతేశ్వరాలయాన్ని నిర్మించిచ్చాడు. బేతరాజు మరణానంతరం, పెద్ద కొడుకు దుర్గరాజు ఎనిమిది సంవత్సరాలు పరిపాలించాడు.

సామంత కాకతీయులలో ప్రసిద్ధుడు, రెండో ప్రోలరాజు (క్రీ.శ. 1116-57). అన్న దుర్గరాజు తర్వాత రాజైన ఇతడు శూరుడు. రుద్రదేవుని అనుమకొండ శాసనం, ఇత్యాదివి ఇతని సైనిక విజయాలను వర్ణిస్తున్నాయి.'నిశ్శంకప్రథన ప్రబంధన మహాహంకార లంకేశ్వరుని'గా వర్ణింపబడిన ఈతడు, ముందుగా తనపై దండెత్తిన కొలనుపాక పరమార జగద్దేవుని తరిమివేశాడు. ఈ కాలం లోనే కందూరునాడును చాళుక్య రాజప్రతినిధిగా ఏలుతున్న ఆరో విక్రమాదిత్యుని రెండో కొడుకు తైలపుడు, స్థానిక పాలకుల సాయంతో, అన్న భూలోకమల్ల మూడో సోమేశ్వరునికి వ్యతిరేకంగా స్వతంత్రించడానికి ప్రయత్నించాడు. క్రీ.శ. 1137లో కళ్యాణి సింహాసనాశీనుడైన రెండో జగదేకమల్ల చక్రవర్తికి, కాకతీయ ప్రోలుడు బాసటగా నిల్చాడు. చక్రవర్తి సైన్యానికి నాయకత్వం వహించిన ప్రోలుడు, ముందుగా కందూరుపై దండెత్తి తైలపుని ఓడించి, సైనిక పర్యవేక్షణలో కళ్యాణికి పంపించాడు. తైలపుని ఓటమితో, కందూరు చోడభీమన అజ్ఞాతవాసం లోకి వెళ్ళిపోయాడు. మంధెనలో పొలవాసాధీశులలో ఒకడైన గుండరాజుని ప్రోలుడు పట్టుకొని, తల గొరిగించి, వక్ష స్థలంపై వరాహ

BRAOU

లాంఛనాన్ని ముద్రించి, ఊరేగించి వధించాడు. పొలవాస మంత్రకూటు మేడరాజు పారిపోయాడు. గోవింద దండనాయకుని పారద్రోలి, పానుగల్లులో చోడ ఉదయుణ్ణి ప్రోలుడే నిలిపాడు. శ్రీశైలం వరకు పురోగమించి, అక్కడ జయ స్తంభాన్ని ప్రతిష్ఠించాడు.

ఈ విధంగా తెలంగాణంలో తిరుగుబాట్లను అణచివేసి, తోటి సామంతులకు తన పరాక్రమాన్ని ప్రదర్శించి, రాజాభిమానాన్ని సంపాదించిన రెండో ప్రోలరాజు, తీరాంధ్రానికి విస్తరించడానికి చేసిన ప్రయత్నంలో, అనువుల్ని కోల్పోవాల్సొచ్చింది. వెలనాటి రాజులపై తిరుగుబాటు చేస్తున్న పిఠాపురం చాళుక్యుల సహాయార్థం వెళ్ళి, వెలనాటి యువరాజు రాజేంద్రచోడుడు, వెలనాటి సామంతులైన కోట, హైహయాది మాండలికుల చేతుల్లో ప్రోలుడు మరణించాడు. ఇది క్రీ.శ. 1157 ప్రాంతంలో జరిగుంటుంది.

12.4 : స్వతంత్ర రాజులు

కాకతీయులలో రుద్రదేవుడు, గణపతి, రుద్రమ, ప్రతాపరుద్రులు స్వతంత్ర రాజులు.

12.4.1 : రుద్రదేవుడు (క్రీ.శ. 1158-95)

రెండో ప్రోలరాజు జ్యేష్ఠ పుత్రుడు, రుద్రదేవుడు సింహాసనమెక్కేనాటికి, చాళుక్య సామ్రాజ్యంలో పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. క్రీ.శ. 1151లో రెండో జగదేకమల్లుని తొలగించి, అతని తమ్ముడు (మూడో) తైలపుడు సింహాసనమెక్కాడు. అయితే, జగదేకమల్లుని రాజ్యాధికారం కొంత భాగంలో సాగుతూనే ఉంది. క్రీ.శ. 1156-57 నాటికి తైలపుని గెంటివేసి, ఆరో విక్రమాదిత్యుని దౌహిత్రుడు, కలచురి బిజ్జలుడు కళ్యాణి నాక్రమించాడు. చాళుక్య సార్వభౌమాధికారానికి వారసుడిగా బిజ్జలుడు, కాకతీయులను లొంగదీయ చూశాడు. దీనికి తోడు, కాకతీయ విజృంభణ పట్ల అసూయాపరులైన చాళుక్య సామంత వంశాలూ, అవకాశం కోసం పొంచి చూస్తున్నాయి. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్ని కాకతి రుద్రుడు అసమాన రాజనీతితో అధిగమించి, విస్తృత స్వతంత్ర కాకతీయ సామ్రాజ్యానికి పటిష్ఠమైన పునాదుల్ని వేశాడు.

రుద్రదేవుని అనుమకొండ శాసనం అతని దిగ్విజయ యాత్రలను అభివర్ణిస్తున్నది. తన అధికారాన్ని గుర్తించని రుద్రుని లొంగదీయడానికి, కలచురి బిజ్జలుడు తన కుమారుడు మైలగిదేవుని నాయకత్వంలో సైన్యాన్ని తెలంగాణం పైకి పంపాడు. నగునూరి దొమ్మరాజు, పొలవాస మేడరాజు తమ అజ్ఞాతవాసం నుండి బయటపడి, మైలగితో చేతులు కలిపారు. రుద్రుడు వారి నోడించి, మైలగి నాయకత్వం లోని కూటమిని విచ్ఛిన్నం చేశాడు. అంతేగాక శ్రీ పి.వి.పరబ్రహ్మ శాస్త్రి చెప్పినట్లు, కలచురి రాజ్యంపై కూడా దండెత్తినట్లు కన్పిస్తుంది. ఉత్తరాన గోదావరి వరకు జయించాడు. నగునూరు, పొలవాస రాజ్యాలతో కూడిన సబ్బినాడు, పూర్తిగా కాకతీయుల అధీనం లోకి వచ్చింది. అనంతరం, రుద్రుడు కందూరు చోడులపై దాడి చేశాడు. తన రాజ్య విస్తరణ విధానంలో భాగంగా, అతనీ దాడి నిర్వహించాడు. కుమార తైలపుడు మరణించటంతో స్వతంత్రించిన కందూరి భీమచోడుని పైకి, పానుగల్లులో స్వతంత్రించ ప్రయత్నిస్తున్న ఉదయచోడుని పైకి దాడులు జరగాయి. భీమచోడుడు రాజధాని వర్ధమానపురాన్ని విడిచి పారిపోగా, చోడోదయుడు తన కుమార్తె పద్మావతి నిచ్చి పెండ్లి చేసి, రుద్రునితో సంధిచేసుకున్నాడు. క్రీ.శ. 1160-62 ప్రాంతంలో సాధింపబడిన ఈ విజయాలతో, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కూడ, కాకతీయుల అధికారం సుస్థిరమైంది. వీటన్నిటి

BRAOU

పర్యవసానంగా, గోదావరి నది, బీదర్ పట్టణం, శ్రీశైలాలు, కాకతీయ రాజ్యానికి ఉత్తర, పశ్చిమ, దక్షిణ సరిహద్దులయ్యాయి. దీని అనంతరం, కాకతి రుద్రుడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొన్నట్లు, అనుమకొండ శాసనం సూచిస్తున్నది. ఈ సందర్భంలో తన పేర రుద్రేశ్వర, వాసుదేవ, సూర్యదేవుల్ని ప్రతిష్ఠిస్తూ, అనుమకొండలో వేయి స్తంభాల గుడిని అతడు నిర్మించాడు. ఒక విజయ శాసనాన్ని అక్కడే వేయించాడు.

దీని తర్వాత రుద్రుడు తన తండ్రి మరణానికి కారకులైన వెలనాటి రాజులపై ప్రతీకారేచ్ఛతోను, తన అధికారాన్ని తీరాంధ్రంలో విస్తరింపజేయాలని ప్రయత్నించాడు. ఈ సమయానికి మాండలిక రాజుల అంతఃకలహాలతో వెలనాటి రాజ్యానికి దుర్దినాలు వచ్చాయి. వేంగి మండలం కుట్రలు, కుతంత్రాలతో వేగిపోతున్నది. ఈ పరిస్థితులలో కాకతి రుద్రుడు క్రీ.శ. 1176-82ల మధ్య జరిగిన పలనాటి యుద్ధంలో నలగాముని పక్షానికి సహాయం పంపినట్లు **'పలనాటి వీర చరిత్ర'**ను బట్టి తెలుస్తున్నది. ఈ యుద్ధంలో రుద్రుడు ఆశించినట్లు వెలనాటి రాజ్యం నీరసించింది. దీనిని అవకాశంగా తీసుకొని, అతడు ధాన్యకటకం కోట రాజులను జయించి, సామంతులుగా చేసుకుని, గిరిపశ్చిమ దుర్గములను నిర్జించాడు. త్రిపురాంతకం వరకు జైత్ర యాత్ర సాగినట్లు, అక్కడి క్రీ.శ. 1185 నాటి శాసనం సూచిస్తున్నది. క్రీ.శ. 1186 నాటి ద్రాక్షారామ శాసనాన్ని బట్టి, పిఠాపురం చాళుక్యులు రుద్రదేవునితో మైత్రి వహించినట్లు కన్పిస్తున్నది.

పశ్చిమ చాళుక్యుల అధికార క్షీణ దశలో రాజనీతిని, బలపరాక్రమాలను ప్రదర్శించి, ఇతర సామంతులను సాధించి, స్వతంత్ర కాకతీయ రాజ్యాన్ని స్థాపించిన రుద్రదేవుడు, ఓరుగల్లును దుర్భేద్య దుర్గంగా రూపొందించి, రాజధానిగా చేసుకున్నాడు. ఇతని పాలనా కాలం లోనే ఆరంభమైన జైన, శైవ సంఘర్షణలలో, జైనం కొంత క్షీణించింది. భాషాభిమాని, కవి, 'విద్యాభూషణ' బిరుదాంకితుడైన ఈతడు, సంస్కృతంలో **"నీతిసారం"** అనే గ్రంధాన్ని రచించాడు. ఇతని మత నిరతికి, కళాభిమానానికి, అనుమకొండ లోని రుద్రేశ్వరాలయం (వేయి స్తంభాల గుడి) ప్రతీక.

రుద్రదేవుని కాలం లోనే కాకతీయ-యాదవ (శేవుణ) సంఘర్షణ ఆరంభమైంది. దేవగిరి జైత్రపాలుడు క్రీ.శ. 1195లో కాకతీయ రాజ్యంపై దండెత్తి, ఇతణ్ణి చంపి, ఇతని దత్త పుత్రుడు, తమ్ముడు మహాదేవుని కుమారుడైన గణపతిని, బందీగా తీసుకువెళ్ళాడు. ఈ పరిస్థితుల్లో సింహాసన మధిష్ఠించిన మహాదేవుడు (క్రీ.శ. 1195-98-9), ప్రతీకారాన్ని తీర్చుకొని, కుమారుడు గణపతిని విడిపించుకోవాలని యాదవులపై చేసిన దాడి విఫలమై, యుద్ధంలో అతడు మరణించాడు.

12.4.2 : గణపతి దేవుడు (క్రీ.శ. 1199-1262)

యాదవుల చేతుల్లో మహాదేవుడు చనిపోవటం, గణపతి దేవగిరిలో బందీగా ఉండటంతో, సామంతుల తిరుగుబాట్లు ఒక ప్రక్క, ఇరుగు పొరుగు రాజుల దాడులు మరో ప్రక్క, కాకతీయ రాజ్యం ఉనికికే ముప్పు తెచ్చినై. యాదవులకు పక్కలో బల్లెంలా తయారైన హోయసాల రెండో బల్లాలుడు కృష్ణా-తుంగభద్రల అంతర్వేది నాక్రమించాడు. ఆంధ్ర దేశంలో అరాజకం హోయసాలులకు మరింత అనుకూలించి, యాదవులకు ప్రమాదం తెచ్చిపెట్టేలావుంది. దీనితో, ఆంధ్ర దేశంలో స్థిరమైన స్నేహపూర్వక ప్రభుత్వం నెలకొనటం యాదవ రాజ్యానికే మంచిదని గుర్తించిన జైత్రపాలుడే, గణపతిని బంధవిముక్తుణ్ణి చేసి పంపివుంటాడు. రేచర్ల రుద్రసేనాని వంటి మహావీరుల విశ్వాసం, విధేయతలతో విచ్ఛిన్నం కాకుండా కాపాడబడిన కాకతీయ రాజ్యాన్ని, గణపతిదేవుడు క్రీ.శ. 1199 నుండి పాలిస్తున్నట్లు శాసనాలు స్పష్టం చేస్తున్నాయి.

BRAOU

మహావీరుడు, అసాధారణ రాజనీతిజ్ఞుడైన గణపతిదేవుని అరవైమూడేళ్ళ పరిపాలనా కాలం, తెలుగు దేశ చరిత్రలో ఒక మహోజ్వల ఘట్టం. పాండ్య, హోయసాల, శేవుణ రాజుల దురాక్రమణలకు గురికాకుండా ఉండాలంటే, ఆంధ్ర దేశం సమైక్యంగా ఉండవలసిన అవసరాన్ని అతడు గ్రహించాడు. ఉత్తరావధపతులైన తురుష్కుల దండయాత్రల ప్రమాదం కూడ, అతని దృష్టిలో ఉండివుంటుంది. కనుకనే, సమైక్య ఆంధ్రపై ఏకచ్ఛత్రాధిపత్య సాధనకు దిగ్విజయ యాత్రలను సాగించాడు. అయితే, జయించిన రాజులను తొలగించ లేదు. వారి భూభాగాలను ఆక్రమించ లేదు. వారితో సంబంధ బాంధవ్యాల నందుకొని, వారి సామంత ప్రతిపత్తిని గుర్తించి, తద్వారా తన రాజ్యానికే వారి అండదండలను సంపాదించి, తన రాజనీతిజ్ఞతను చాటాడు.

గణపతిదేవుని దిగ్విజయ యాత్రలు వెలనాటిపై దాడితో ప్రారంభమయ్యాయి. సామంతులు, బంధుపులైన కోట, నతవాడి, మల్యాల ప్రభువుల సాయంతో, కాకతీయ సైన్యం క్రీ.శ. 1201లో బెజవాడను ఆక్రమించింది. పిదప, దివి సీమ దోచుకోబడింది. వెలనాటి పృథ్వీశ్వరుని సామంతుడూ, దివి ప్రభువూ అయిన అయ్యచోడిరాజు, తన కుమార్తెలు నారమాంబ, పేరమాంబలను గణపతికిచ్చి వివాహం చేసి, సంధి చేసుకొన్నాడు. గణపతి చోడిరాజు కొడుకు జాయపను తన సైన్యంలో గజసాహిణిగా చేశాడు. క్రీ.శ. 1206-08ల మధ్య కాకతీయులు, తెలుగు చోడులు కలిసి, పృథ్వీశ్వరు నోడించి, చంపివేశారు. చోడ తిక్కన పృథ్వీశ్వరుని శిరస్సుతో బంతి ఆట ఆడుకొన్నట్లు, 'నిర్వచనోత్తర రామాయణం' తెలియజేస్తున్నది. గణపతి దేవుడు కూడ 'పృథ్వీశ్వర శిరఃకందుకక్రీడావినోద' బిరుదాంకితుడు. అమరావతి సీమ నేలే కోట రుద్రుని కొడుకు బేతరాజుకు, తన పెద్దకూతురు గణపాంబ నిచ్చి, గణపతి అప్పటికే పెళ్లి చేశాడు. ఈ విధంగా, విజయ పరంపరంతో, వివాహ సంబంధాలతో, వెలనాడు పూర్తిగా కాకతీయ రాజ్యంలో కలిసింది. ఈ ప్రాంతంపై జాయప, మహామండలేశ్వరునిగా నియమింపబడ్డాడు.

అనంతరం, వెలనాటి పృథ్వీశ్వరునిపై యుద్ధంలో తనకు తోడ్పడ్డ నెల్లూరు తిక్కనకు, గణపతి ప్రత్యుపకారం చేయ తలపెట్టాడు. చోళరాజు సాయంతో అన్న మనుమసిద్ధికి వ్యతిరేకంగా నెల్లూరు రాజ్యాన్ని పొందిన తమ్ముడు తమ్ముసిద్ధిని తరిమివేసి, తిక్కచోడుణ్ణి గణపతి నెల్లూరు సింహాసనంపై నిలిపాడు. ఈ యుద్ధంలో తమ్ముసిద్ధికి సాయంగా వచ్చిన శేవుణ, కర్ణాట, లాట సైన్యాలు కూడా ఓటమి పాలై, వెనుదిరిగినాయి. గణపతి చేసిన ఈ ఉపకారానికి ప్రతిగా, తిక్కరాజు తన రాజ్య పశ్చిమోత్తర భాగమైన కడప మండలాన్ని కాకతీయుల అధీనం చేశాడు. గణపతి ఈ మండలానికే కాయస్థ గంగయను సామంతుని జేశాడు.

దీని తర్వాత గణపతి వేంగి, కళింగ రాజ్యాలను ఆక్రమించడానికి పూనుకొన్నాడు. కాకతీయ సైన్యాలు కళింగపై మూడు దాడులను జరిపాయి. వేంగి, కొలను రాజ్యాలను ఆక్రమించుకొన్నాయి. ఇందులూరి సోమయమంత్రి కొలను మండలేశ్వరుడయ్యాడు నిడదవోలు చాళుక్య వీరభద్రునితో గణప తిదేవుని కుమార్తె రుద్రమ వివాహం జరిగింది. కళింగాన్ని కూడా గణపతి జయించినట్లు శాసనాలు చెబుతున్నాయి. బస్తర్, చక్రకూటాల వరకు కాకతీయ సైన్యాలు నడిచాయి. అయితే, తూర్పు గంగ అనియంక భీముని విజృంభణతో, గంగులు కోల్పోయిన భాగాలను గెల్చుకొన్నారు. కాని, భీముని తర్వాత (క్రీ.శ. 1238) అతని కొడుకు కాకతీయ సైన్యం చేతిలో ఓడి, పారిపోయాడు. గోదావరి తీరం వరకు కాకతీయ అధికారం నిలబడింది.

BRAOU

క్రీ.శ. 1248లో నెల్లూరు చోడతిక్కరాజు మరణించడంతో, అతని కొడుకు రెండో మనుమసిద్ధి (వీరగండగోపాలుడు) దాయాదులకు రాజ్యాన్ని కోల్పోయి, ఆస్థాన కవి తిక్కన సోమయాజి ద్వారా గణపతిదేవుని సాయాన్ని కోరాడు. సామంత భోజుని నాయకత్వం లోని కాకతీయ సైన్యం నెల్లూరుపై దాడిచేసి, మనుమసిద్ధి దాయాదులు అక్కన, బయ్యనలను చంపివేసింది. ద్రావిడ మండలంలో పళైయూరు వద్ద మనుమసిద్ధి విరోధి విజయగండగోపాలుడు, అతనికి తోడ్పడ్డ ద్రావిడ, కర్ణాటాధీశులను ఓడించింది. నాయనిపల్లి శాసనం ఈ వివరాలను తెలియజేస్తున్నది. వైదుంబ రక్కసగంగని నోడించి, కాకతీయ సైన్యాలు కడప ప్రాంతంలో గంగయ సాహిణిని పునరుద్ధరించాయి. గణపతి దేవుని సామంతునిగా, గంగయ త్రిపురాంతకం నుండి కోలార్ వరకు గల రాజ్యాన్ని, నల్లూర్ కేంద్రంగా పాలించాడు.


నెల్లూర్ రాజ్యవ్యవహారాలలో కాకతీయుల జోక్యం, పాండ్య-కాకతీయ సంఘర్షణకు దారితీసింది. గణపతిదేవుని పరిపాలన చివరి దశలో ఇది జరిగింది. ద్రావిడ దేశంలో చాళుక్య-చోళుల ప్రాబల్యం అంతరించే దశలో, వారి రాజ్యాన్ని పాండ్యులు ఆక్రమించుకొన్నారు. క్రీ.శ. 1257 నాటికి దక్షిణ దేశాన్నంతా తన సార్వభౌమత్వం కిందికి తెచ్చుకొన్న జటావర్మ సుందరపాండ్యుడు, అంతకు ముందు చోళ సామంత రాజ్యమైన నెల్లూరుపై కూడ తన ఆధిపత్యాన్ని నెలకొల్పాలనుకున్నాడు. కంచిని స్వాధీనం చేసుకొన్న విజయగండ గోపాలుడు, ముందే పాండ్యుల సార్వభౌమత్వాన్ని అంగీకరించాడు. నెల్లూరు రెండో మనుమసిద్ధి కాకతీయుల, యాదవుల, బాణ రాజుల సహాయాన్ని స్వీకరించాడు. శత్రు బలగాలను చీల్చడానికి కొప్పెరుంజింగని నాయకత్వం క్రింద కొంత పాండ్య సైన్యం ద్రాక్షారామం దాకా నడిస్తే, అదే సమయంలో జటావర్మ మిగతా సైన్యంతో నెల్లూరుపై దండెత్తాడు. కొప్పెరుంజింగడు ఓడిపోయి, గణపతిదేవుని సామంతుడయ్యాడు. అయితే, క్రీ.శ. 1263లో నెల్లూర్ దగ్గర ముత్తుకూరులో జరిగిన యుద్ధంలో, మనుమసిద్ధి మరణించాడు. కాకతీయ, శేవుణ మిత్ర సైన్యాలు తిరోగమించాయి. నెల్లూర్ రాజ్యం పాండ్య సామ్రాజ్యంలో అంతర్భాగమైంది. పరిపాలన చివరి దశలో గణపతిదేవుని కిది తీవ్ర పరాభవమే.

'రాయగజకేసరి' బిరుదాంకితుడైన గణపతిదేవుడు, శాతవాహనుల అనంతర కాలంలో సమగ్ర ఆంధ్ర దేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యం కిందికి తెచ్చి, సమర్థమైన పాలన నందించి, వ్యవసాయం, వాణిజ్యం, పరిశ్రమలకు ప్రోత్సాహాన్నిచ్చి, నదుపాయాలను కల్పించి, తెలుగు సంస్కృతి నాగరికతల నాదరించి, కాకతీయ పాలకులందరిలో గొప్ప వాడయ్యాడు. ఓరుగల్లును ఆంధ్ర నగరిగా తీర్చిదిద్దాడు. మగ సంతతి లేని అతడు, రెండో కూతురు రుద్రమకే తగిన శిక్షణ నిచ్చి, క్రీ.శ. 1259లో యౌవరాజ్యాభిషేకాన్ని చేశాడు. నెల్లూర్ వద్ద పాండ్యుల చేతిలో అపజయానెదుర్కొన్నాక, అధికారాన్ని పూర్తిగా రుద్రమకే ఇచ్చివేశాడు. అయితే, క్రీ.శ. 1269 వరకు అతడు జీవించియున్నట్లు, శాసన సాక్ష్యముంది. అంతవరకు, రుద్రమ రాజమకుటాన్ని ధరించ లేదు.

12.4.3 : రుద్రమదేవి (క్రీ.శ. 1262-89)

రుద్రదేవ మహారాజు పేరుతో క్రీ.శ. 1259లోనే పాలనాధికారాన్ని చేపట్టిన రుద్రాంబ, వృద్ధుడైన తండ్రి మరణానంతరమే, బహుశా క్రీ.శ. 1269లో పట్టాభిషిక్తురాలైంది. ముత్తుకూరు యుద్ధంలో జటావర్మ పాండ్యుని చేతిలో ఓడి, పారిపోయిన కాకతీయ సైన్య పేరుప్రతిష్ఠలు దెబ్బతిన్నాయి. దాయాదుల ప్రతిఘటన, స్త్రీ పాలనాధికారాన్ని సహించని సామంతుల తిరుగుబాట్లను రుద్రమ ఎదుర్కోవాల్సొచ్చింది. ఈ అవకాశాన్ని తీసుకొని, పొరుగు శత్రు రాజులు కాకతీయ రాజ్య భాగాల నాక్రమించ ప్రయత్నించారు. దీనితో, రుద్రమ పాలనా కాలమంతా యుద్ధాల తోనే సరిపోయింది.

BRAOU



BRAOU

'ప్రతాప చరిత్ర' ననుసరించి రుద్రమ సవతి తమ్ముళ్లైన హరిహర మురారిదేవులు ఆమెపై తిరుగుబాటు చేశారని, అయితే విశ్వాసపాత్రుడైన రేచర్ల ప్రసాదిత్యుడు, కాయస్థ జన్నిగదేవుడు, గోనగన్నారెడ్డి మొదలైన సేనానుల సాయంతో వారిని నిర్దయగా అణచివేసిందని తెలుస్తున్నది. కాని, ఈ హరిహర మురారిదేవుల ఉనికిని బలపర్చే మరే సాక్ష్యం దొరకలేదు. అయితే, రుద్రమ అధికారాన్ని సువ్యవస్థితం చేయడంలో, కాకతీయ సేనానులు ప్రశంసనీయమైన సేవ చేసినట్లు, వారు వహించిన 'రాయస్థాపనాచార్య' వంటి బిరుదులు సూచిస్తున్నాయి.

రుద్రమ అంతఃకలహాలను రూపుమాపుతున్న సమయంలో, తూర్పు గంగ నరసింహదేవుడు వేంగి నాక్రమించినట్లు, క్రీ.శ. 1262 నాటి అతని ద్రాక్షారామ శాసనం సూచిస్తున్నది. మళ్ళీ క్రీ.శ. 1274లో నరసింహదేవుని కొడుకు మొదటి భానుదేవుడు, వడ్డాది మత్స్యరాజు, అర్జునదేవునితో కలసి, వేంగిపై దండెత్తాడు. కాకతి సేనానులు పోతి, ప్రోలి నాయకులు గోదావరి తీరాన గంగ, మాత్స్యులను ఓడించి, తరిమివేశారు. కనుకనే, వారు 'గజపతి మత్తమాతంగసింహ', 'ఒడ్డెయరాయ మానమర్దన' బిరుదులను వహించారు.

ముత్తుకూరు యుద్ధానంతరం నెల్లూరు రాజ్యం పాండ్య సార్వభౌమత్వానికి దాసోహమన్నది. వల్లూరు కాయస్థ రాజ్యం (కడప) కూడా పాండ్యుల వశమైనట్లు, నందలూరు, తిరుపతుల లోని పాండ్య శాసనాలను బట్టి తెలుస్తున్నది. అయితే, త్వరలోనే రుద్రమ ఈ ప్రాంతాల్లో కాకతీయ అధికారాన్ని పురుద్ధరించగలిగింది. కాకతీయ సేనాని సామంత నాగదేవ మహారాజు వీరరాజేంద్ర చోళుని ఓడించి, నెల్లూరు నుండి పారద్రోలాడు. చిత్తూరు, కడప ప్రాంతాల నుండి కాయస్థ జన్నిగదేవుడు క్రీ.శ.1268 నాటికి పాండ్యులను, వారి అనుయాయులు కలుకడ వైదుంబులను తొలగించి, తన అధికారాన్ని కొనసాగించాడు. కాని, జన్నిగుని తమ్ముడు అంబదేవుడు క్రీ.శ. 1272లో అధికారాన్ని చేపట్టేదాకా, వైదుంబుల బెడద తొలగ లేదు.

ముత్తుకూరు యుద్ధంలో ఓటమి పాలయ్యేవరకు, కాకతీయ-శేవుణ (యాదవ) సంబంధాలు మైత్రీ పూర్వకంగానే కొనసాగాయి. కాని, గణపతిదేవుడు పూర్తిగా రాజకీయాల నుండి వైదొలగాక, ఈ సంబంధాలు వికటించాయి. దీనిక్కారణం ఒక స్త్రీ పాలనాధికారాన్ని జీర్ణించుకోలేని యాదవ మహాదేవరాజు ఆభిజాత్య భావన కారణం కావచ్చు. మహాదేవుడు ఓరుగల్లుపై పెద్దెత్తున దాడిచేశాడు. ఈ సంఘర్షణ ఫలితాలను గురించిన సమాచారం పరస్పర విరుద్ధంగా ఉంది. దండయాత్ర తొలి దశలో యాదవులదే పైచేయిగా వుందని భావించొచ్చు. కాని, మహాదేవుని ఓరుగల్లు ముట్టడిని నిరోధించి, యాదవ సైన్యాన్ని దేవగిరి వరకు రుద్రమ తరిమికొట్టి, పెద్ద మొత్తాన్ని యుద్ధ నష్టపరిహారంగా అతని నుండి గ్రహించిందని 'ప్రతాప చరిత్ర' చెబుతున్నది. కాకతీయుల వరాహ లాంచనంతో, తెలంగాణాలో అనేక చోట్ల ఇటీవల దొరికిన యాదవుల బంగారు నాణేలు, ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నాయి. ఈ విజయం తర్వాత రుద్రమ 'రాయగజకేసరి' బిరుదు ధరించింది. అనేక మంది యాదవులు కాకతీయుల కొలువులో చేరారు.

రుద్రమదేవి పరిపాలన చివరి దశలో కాయస్థుల తిరుగుబాటు జరిగింది. గణపతిదేవుని కాలంలో కడప మండలాధిపతైన కాయస్థ గంగయ సాహిణి, అతని అనంతరం అతని మేనల్లుళ్ళు జన్నిగ, త్రిపురారిదేవులు కాకతీయులకు విధేయ మిత్రులుగానే కొనసాగారు. గంగయ మరో మేనల్లుడు అంబదేవుడు క్రీ.శ. 1272లో రాజ్యాధిపతయ్యాడు. అతడు మొదట్నో కాకతీయ విధేయుడే. అపరిమిత బలపరాక్రమ సంపన్నుడైన అంబయ, రుద్రమ పాలన యిచ్చగించనివాడు. ఆమె యిక్కట్లు బహుశ అతనిలో

BRAOU

సామ్రాజ్య కాంక్షను రేకెత్తించుంటాయి. కాయస్థ రాజ్యాన్ని సామ్రాజ్యంగా నిర్మించదలచాడు. క్రీ.శ. 1285లో కంచి విజయగండ గోపాలుడు మరణించాక, అంబదేవుడు విజృంభించి, నెల్లూరులో తన షష్టీయుడైన తెలుగుచోడ మనుమగండ గోపాలుని రాజుని చేశాడు. జటావర్మ సుందర పాండ్యుని సేనాని, కాకతీయ సామంతుడైన కొప్పెరుంజింగని చంపి, దక్షిణాంధ్రంలో కాకతీయుల పాలనను అంతం చేశాడు. కాకతీయ నాయంకరుల నోడించి, త్రిపురాంతకం దాకా కాయస్థ రాజ్యాన్ని విస్తరించినట్లు, అక్కడి అతని క్రీ.శ. 1290 నాటి శాసనమే సాక్ష్యం. కర్నూల్ ప్రాంతపు చెరకు బొల్లయరెడ్డితో విద్యుమందాడు. ఈ విజయ పరంపరతో కాకతీయ శత్రువులైన పాండ్య, యాదవ రాజులకు మిత్రుడయ్యాడు. అంబదేవుని తిరుగుబాటు నణచడంలో, కాకతి సేనానులు, సామంతులు విఫలమవడంతో, రుద్రమ స్వయంగా నాయకత్వం వహించి, మల్లికార్జున నాయక సేనానితోబాటు వల్లూరు రాజ్యంపై దండయాత్ర సాగించింది. చందుపట్ల శాసనాన్ని అనుసరించి, క్రీ.శ. 1289 నవంబర్ నాటికి, రుద్రమ, మల్లికార్జున నాయకులు మరణించారని తెలుస్తున్నది. అంబయ వారిని వధించినట్లు చెప్పకొన్నాడు. అతనితో జరిగిన యుద్ధం లోనే వారు మరణించారని అంగీకరించొచ్చు.

నిరంతరం యుద్ధాలలో నిమగ్నమైనా, రుద్రమ పరిపాలనా నిర్వహణలో సమర్థురాలిగా రాణించింది. మట్టికోట, అగడ్త, బురుజుల వంటి అదనపు నిర్మాణాలతో, ఓరుగల్లు కోటను దుర్భేద్యంగా తీర్చిదిద్దింది. పరిపాలన కట్టుదిట్టంగా వుందని, పరిశ్రమలు, వాణిజ్యం వృద్ధి చెందుతున్నాయని, నాటి వెనిస్ యాత్రికుడు మార్కోపోలో అభివర్ణించాడు.

12.4.4 : ప్రతాపరుద్రుడు (క్రీ.శ. 1289-1323)

పురుష సంతతి లేని రుద్రమ, తన ముగ్గురు కుమార్తెలలో పెద్దదైన ముమ్మడమ్మకు, కాకతీయ వంశస్థుడే అయిన మహాదేవరాజు ద్వారా పుట్టిన ప్రతాపరుద్రుణ్ణి, బహుశ తండ్రి సలహా మేరకు దత్తత స్వీకరించి, యువరాజును చేసింది. కాకతి రుద్రకుమార, కుమార రుద్రదేవ పేర్లతో, ఆమె కాలం లోనే ప్రతాపరుద్రుడు రాజ్య వ్యవహారాలను నిర్వహించడం ప్రారంభించాడు. క్రీ.శ. 1289లో రుద్రమ మరణానంతరం పట్టాభిషేకం చేసుకున్నా, శాసనాలలో కుమార రుద్రదేవ అనే పేరు వ్యవహారంలో కొనసాగినట్లు, శాసనాలు తెలియజేస్తున్నాయి. ప్రతాపరుద్రుడు మూడు దశాబ్దాలకు పైగా పరిపాలించి, కాకతీయ సామ్రాజ్యాన్ని దేదీప్యమానంగా ప్రకాశింపజేశాడు. అయితే, సామ్రాజ్య విచ్ఛిత్తి, పంశచ్యుతి కూడా, ఇదే కాలంలో జరిగింది.

అంబదేవుని అణచి, అతణ్ణి తిరుగుబాటుకు ప్రేరేపించిన పాండ్యుల, యాదవులపై చర్య తీసుకోవడం, కాకతీయ వంశ ప్రతిష్ఠను, సామ్రాజ్య ఔన్నత్యాన్ని పునరుద్ధరించడం, రాజ్యాధికారాన్ని చేపట్టిన ప్రతాపరుద్రుని ప్రథమ కర్తవ్యమైంది. దీని కోసం అతడు సైన్యాన్ని పునర్వ్యవస్థీకరించడానికై నాయంకర విధానాన్ని కట్టుదిట్టం చేశాడు. రాజ్యాన్ని 77 నాయంకరాలుగా విభజించి, విశ్వాసపాత్రులైన సేనానుల వరం చేశాడు. నాయక సైన్యాన్ని సుశిక్షితం చేసి, సమరానికి సన్నద్ధం చేశాడు. అయితే, నాయంకరులలో అధిక భాగం వెలమలు కావడంతో, ఇది పర్ణ వైషమ్యాలకు దోహదపడిందని, రెడ్లకు అతని పట్ల ఆగ్రహాన్ని కలిగించిందని, స్థానిక చరిత్రలు తెలుపుతున్నాయి. అంబయపై, అతని మిత్రులపై కాకతీయ సైన్యం త్రిముఖంగా దాడి చేసింది. శత్రువులు పరస్పరం సహకరించుకునే వీలు లేకుండా చేయడమే, ప్రతాపరుద్రుని ఈ త్రిముఖ వ్యూహ లక్ష్యం. ఇందులో భాగంగా, కొలని గన్నయ సేనాని అంబదేవుణ్ణి ఓడించి, క్రీ.శ. 1291లో త్రిపురాంతకాన్ని ఆక్రమించాడు. అడిదం మల్లు నెల్లూరుపై దాడిచేసి, అంబయ వర్గీయుడైన మనుమగండ గోపాలుణ్ణి చంపి, రాజగండగోపాలుణ్ణి

BRAOU

సింహాసనంపై నిలిపాడు. కాని, ఈ రాజగండ గోపాలుడు పాండ్యులతో కలసి, కాకతీయులకు ఎదురు తిరగడంతో, నెల్లూరుపై కాకతీయ సైన్యం మరో మారు దాడి చేసింది. చివరకు, మహా ప్రధాని ముప్పిడి నాయకుడు నెల్లూరు రాజ్యాన్ని కాకతీయ సామ్రాజ్యంలో కలిపేశాడు. ఇక, పశ్చిమ రంగంలో వర్ధమానపురాన్ని పాలిస్తున్న కాకతీయ సామంతుడు గోన విఠలుడు, శేవుణ రాజ్య దక్షిణ సరిహద్దులపై దాడి చేశాడు. కృష్ణ-తుంగభద్ర అంతర్వేదిని కాకతీయ సామ్రాజ్యంలో చేర్చి, రాయచూరు దుర్గాన్ని కట్టుదిట్టంగా నిర్మించాడు. దీనితో, యాదవుల దురాక్రమణ కట్టుబడింది. క్రీ.శ. 1311 ప్రాంతంలో పాండ్యుల దాడిని త్రిప్పికొట్టడం, కాంచీ నగరాన్ని ఆక్రమించిన కేరళ రవివర్మను తరిమి వేయడం జరిగాక, కంచి వరకు కాకతీయాధికారం చెల్లుబాటైంది. ఈ విజయాల తర్వాత ప్రతాపరుద్రుడు, దక్షిణాన జంబుకేశ్వరం వరకు తీర్థయాత్ర చేశాడు.

స్వతంత్ర కంపిలి రాజ్య విస్తరణ కోసం, హోయసాలులకు వ్యతిరేకంగా కాకతీయులు తనకు సహకరించలేదని, కంపిలదేవుడు 'మూరు రాయరగండ', 'వీరరుద్రనగండ' బిరుదులను దాల్చి, ప్రతాపరుద్రునికి ఆగ్రహాన్ని తెప్పించాడు. అతణ్ణి అణచడంలో, బెండపూడి అన్నయామాత్యుడు, రేచర్ల సింగమనాయడు కృతకృత్యులయ్యారు. ఓరుగల్లుపై గాంగులు జరిపిన దాడిని ప్రతాపుడే త్రిప్పికొట్టాడు.

12.4.5 : తురుష్క దండయాత్రలు

క్రీ.శ. 1296లో ఢిల్లీ సింహాసనాన్నధిష్ఠించిన అల్లాఉద్దీన్ ఖిల్జీ ఉత్తరాపథాన్ని జయించాక, తన అపార సైనిక బలగాల పోషణకు అవసరమైన నిధులకు, దాక్షిణాత్య రాజ్యాల వైపు దృష్టిని మళ్ళించాడు. కారా గవర్నర్‌గా ఉండగా, దేవగిరిపై దాడిలో తాను సాధించిన ధనరాశుల్ని, ఇతర దక్షిణ రాజ్యాల ఆర్థిక వైభవాన్ని గురించి సంపాదించిన పరిజ్ఞానాన్ని, అతడు మరచిపోలేదు. ఈ రాజ్యాలను సామంత రాజ్యాలుగా మార్చి, వాటి నుండి కప్పాన్ని గ్రహించటమే, అతని ఆశయం. తురుష్కుల దండయాత్రల సందర్భంలోనైనా, దక్షిణ భారత రాజ్యాలు తమ వైరాలను మరచి, సమైక్యంగా శత్రువును ప్రతిఘటించక పోవడం, దురదృష్టకరం.

సమకాలీన 'ప్రతాప చరిత్ర' వంటి స్థానిక చరిత్రలు, విలస, కలువచేరు తామ్ర శాసనాల ప్రకారం, ప్రతాపుని కాలంలో, తెలుగు దేశంపై తురుష్కులు కనీసం ఎనిమిది సార్లు దండెత్తారని తెలుస్తున్నది. కాని, మహమ్మదీయ చరిత్ర రచనలు ఐదు దాడుల్ని మాత్రమే ప్రస్తావించాయి. వీటి ఫలితంగా, చివరకు కాకతీయ సామ్రాజ్యమే అంతరించింది. వీటిలో మొదటిది, క్రీ.శ. 1303లో జరిగింది. అల్లాఉద్దీన్ పెద్ద సైన్యంతో, మాలిక్ ఫక్రుద్దీన్ జునా, జాజులను బెంగాల్ మీదుగా తెలంగాణం పైకి పంపాడు. ఉప్పరపల్లి (కరీంనగర్ జిల్లా) వద్ద కాకతీయ సేనానులు రేచెర్ల పెన్న, పోతుగంటి మైలిల చేతుల్లో ఓడి, ఢిల్లీ సైన్యం వెనుదిరిగింది. ఉత్తరాపథంలో తన వ్యవహారాలను చక్కబరచుకున్నాక, అల్లావుద్దీన్ క్రీ.శ. 1309లో మాలిక్ నాయిబ్ కపూర్, ఖ్వాజా హాజిలను సైన్యంతో దక్షిణ దిగ్విజయ యాత్రకు పంపించాడు. అమీర్ ఖుస్రూ, బరనీలు ఈ దాడుల వివరాలను వర్ణించారు. ఢిల్లీ సైన్యం ఈ సారి దేవగిరి ఆతిథ్యాన్ని స్వీకరించి, బసీర్‌ఘర్, సిర్పూర్, కూనర్బాల్‌ల గుండా, అనుమకొండ చేరింది. అనుమకొండను ఆక్రమించుకున్నాక, ఓరుగల్లుని ముట్టడించింది. నెల రోజులు ముట్టడి కొనసాగింది. మట్టి కోట తురుష్కుల ఆక్రమణ లోకి వచ్చింది. రాతి కోటను ముట్టడిస్తూనే, తురుష్కులు చుట్టుప్రక్కల గ్రామాలను దహించి వేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో, ప్రతాపరుద్రుడు అపారంగా ధనమర్పించి, ప్రతి సంవత్సరం ఢిల్లీకి కప్పం చెల్లించడానికి అంగీకరిస్తూ, కపూర్‌తో సంధి చేసుకున్నాడు. క్రీ.శ. 1316లో అల్లావుద్దీన్ మరణించాక, అతడు ఢిల్లీకి కప్పం

BRAOU

చెల్లించడం ఆపేశాడు. దీనితో, సుల్తాన్ కుత్బుద్దీన్ ముబారక్, ఖుస్రావ్ ఖాన్‌ని ఓరుగల్లు పైకి దాడి పంపించాడు. ప్రతాపరుద్రుడు బకాయిలను చెల్లించి, మళ్ళి సంధి చేసుకోక తప్పలేదు.

క్రీ.శ. 1320లో ఘియాజుద్దీన్ తుగ్లక్ ఢిల్లీ సింహాసనాన్ని కైవసం చేసుకున్నాడు. ఆ సమయంలో నెలకొన్న రాజకీయ సంక్షోభాన్ని అవకాశంగా తీసుకొని, ప్రతాపరుద్రుడు కప్పం చెల్లించడం ఆపేశాడని, పెరిష్టా కథనం. తుగ్లక్‌ల పరిపాలన ఆరంభమైంది మొదలు, ఢిల్లీ పాలకులు అంతవరకూ దక్షిణాత్య రాజ్యాల పట్ల అనుసరిస్తూ వచ్చిన విధానం (వీలైనంత సంపదను దోచుకోవడం)లో మార్పు వచ్చింది. దక్షిణాపథాన్నంతా తన ప్రత్యక్ష పాలన లోకి తీసుకురావాలని ఘియాజుద్దీన్ అభిలషించాడు. దీని కనుగుణంగానే, 'ఉలూగ్ ఖాన్' బిరుదాంకితుడైన యువరాజు జూనాఖాన్ (ఈతడే ఆ తర్వాత 'మహమ్మద్ బిన్ తుగ్లక్'గా సింహాసనమధిష్ఠించాడు) ఆధ్వర్యంలో ఢిల్లీ సైన్యం దేవగిరి మీదుగా పురోగమించి, క్రీ.శ. 1321-22లో ఓరుగల్లును ముట్టడించింది. ఈ దాడి ఓరుగల్లుపై తురుష్కులు జరిపిన నాలుగోది. ముట్టడి ఆరు నెలలు కొనసాగింది. విజయం వరించే సమయంలో ఉజెయిడ్ అనే కవి కారణంగా, ఢిల్లీ సుల్తాన్ మరణించాడనే వార్త వ్యాపించి, ముస్లిం సైన్యంలో ఖైమూర్, టిగ్రిన్ అనే సేనాపతులు తిరుగుబాటు చేసి, ప్రతాపరుద్రునితో సంప్రదింపులు ప్రారంభించారు. ఈ కల్లోలంలో జూనాఖాన్ ముట్టడిని విరమించి, వెనుదిరగాల్సొచ్చింది. తిరోగమిస్తున్న ఢిల్లీ సేనలకు కాకతీయ సైన్యాలు అపార నష్టాన్ని కలిగించినట్లు, ఇసామీ, పెరిష్టాల రచనలు, **'వెలుగోటివారి వంశావళి'** తెలుపుతున్నాయి.

దేవగిరి చేరిన జూనా, ఢిల్లీ నుండి అదనపు బలగాలు వచ్చి చేరడంతో, తిరిగి ఓరుగల్లుపై దండ యాత్రకు పూనుకొన్నాడు. బీదర్, బోధన్ నగరాలను ఆక్రమించి, ఓరుగల్లును క్రీ.శ. 1323లో ముట్టడించాడు. ఈ ముట్టడి ఐదు నెలలు కొనసాగింది. తురుష్కుల చేతుల్లో తరచూ పొందుతున్న పరాజయాలు కాకతీయ ప్రజల్లోను, సైన్యం లోను, నైతిక స్థైర్యాన్ని కోల్పోయేలా చేశాయి. ఆర్థికంగా రాజ్యం బలహీనమైంది. యుద్ధ నిర్వహణా విధానం ఎటువంటి సంస్కరణలకు నోచుకోలేదు. పైగా వర్ణ వ్యత్యాసాలు సైన్యంలో ఐకమత్యానికి విఘాతాన్ని కలిగించాయి. రెడ్డి నాయకులు ప్రతాపరుద్రుని పట్ల, వెలమ నాయకుల పట్ల, ద్వేష భావాన్ని పెంచుకొన్నారు. శత్రువుతో యుద్ధం క్లిష్ట దశకు చేరుకున్న సమయంలో, సేనాని బొబ్బారెడ్డి తన దళంతో యుద్ధ భూమి నుండి వైదొలగినట్లు, **'ప్రతాపచరిత్ర'** చెబుతున్నది. ఈ ప్రతికూల పరిస్థితుల్లో, ప్రతాపరుద్రుడు యుద్ధంలో పరాజితుడై, జూనాఖాన్‌కు బందీ అయ్యాడు. ఢిల్లీకి కొనిపోబడుతూ, మార్గ మధ్యంలో నర్మదా తీరాన మరణించాడు. తెలుగు దేశం ఢిల్లీ సామ్రాజ్యంలో అంతర్భాగమైంది. ఆంధ్ర నగరి ఓరుగల్లు సుల్తాన్‌పూర్‌గా మారింది.

12.5 : సంగ్రహంగా

కాకతీయులకు ఆపేరెలా వచ్చిందో స్పష్టంగా తెలియదు. కాకతి అనే దేవతను ఆరాధించేవారు కాబట్టి, వీరు కాకతీయులయ్యారని ఒక వాదన. రాజధాని ఓరుగల్లుకు కాకతిపురమని పేరుండేదని, కనుకనే వీరు కాకతిపురవల్లభులని బిరుదు వహించారని, ఒక భావం. శాసనాలలో వీరు సూర్య వంశ క్షత్రియులమని, కరికాలచోళుని సంతతి వారమని చెప్పుకున్నా, వీరు శూద్రులనే అనేక మంది భావిస్తున్నారు. కమ్మ మాండలిక రాజులతో వివాహ సంబంధాలనందుకున్నారు గనుక, వీరు కమ్మ కులస్థులై యుండొచ్చని కొంతమంది భావించారు.

BRAOU

మాంగల్లు శాసనం లోని గుండియ, అతని కొడుకు ఎఱియలు, కాకతీయ వంశంలో మొదటి చారిత్రక వ్యక్తులు. దక్కన్‌నంతా పాలించిన రాష్ట్రకూటు ప్రభువులకు, వీరు అనుయాయులు. వారికి సేనానులుగా, సరిహద్దు రక్షణోద్యోగులుగా, ఈ గుండియ, ఎఱియలు తెలుగు సీమలో ప్రవేశించారు. ఎఱియ మనుమడు, కాకర్త్య గుండ్యన. చాళుక్య దానార్ణవునికి సాయపడి, నతవాడికి పాలకుడయ్యాడు. గుండ్యన కొడుకు బేతన, కళ్యాణి చాళుక్య చక్రవర్తి తైలపునాశ్రయించి, అనుమకొండ విషయాధిపతయ్యాడు. వారసత్వ యుద్ధంలో సహాయం చేసి, సబ్బి మండలాన్ని పొందాడు. ఈతని మనుమడు రుద్రదేవుడు (క్రీ.శ. 1158-1195) అసమాన రాజనీతితో అనేక దిగ్విజయాలను సాధించినట్లు, అతని అనుమకొండ శాసనం వర్ణిస్తున్నది. కాకతీయులు పూర్తిగా స్వతంత్రులైంది ఈ కాలం లోనే. అయితే, దేవగిరి శేవుణ జైతుగి కాకతీయ రాజ్యంపై దండెత్తి, రుద్రుని సంహరించాడు. అనంతరం పగతీర్చుకోడానికి యాదవ రాజ్యంపై దండెత్తిన రుద్రుని తమ్ముడు మహదేవుడు కూడా జైతుగి చేతుల్లో మరణించాడు. గణపతిదేవుని పాలనా కాలంలో రాజ్యం సామ్రాజ్యంగా విస్తరిల్లింది. సామంత మాండలికులతో వైవాహిక సంబంధాల ద్వారాను, సైనిక విజయాల ద్వారాను, యావదాంధ్ర దేశం కాకతీయ సామ్రాజ్యంలో చేరింది. యాదవులపై పగ తీరింది. గణపతి అనంతరం సింహాసన మధిష్ఠించిన అతని కూతురు రుద్రమ కూడా, యాదవుల నోడించింది. కాని, కాయస్థ అంబదేవుని తిరుగుబాటు నణచడంలో ఆమె విఫలమై, ప్రాణాలను కోల్పోయింది. కాకతీయ పాలకుల్లో చివరి వాడైన ప్రతాపరుద్రుడు (క్రీ.శ. 1289-1323) వంశ గౌరవప్రతిష్ఠలను కొంత మేరకు పునరుద్ధరించాడు. ఇది అంబదేవుణ్ణి, అతనికి సహకరించిన పాండ్య, యాదవులను, నెల్లూరు చోడుల నోడించడం ద్వారా జరిగింది. కాని, ఈ కాలం లోనే కాకతీయ రాజ్యంపై తురుష్కుల దాడులు జరిగాయి. వీటి పర్యవసానంగా కాకతీయ రాజ్యం అస్తమించింది. ఆంధ్ర దేశం ముస్లింల అధీనమైంది.

12.6 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. కాకతీయ వంశ నామం, వారి ఆవిర్భావం గురించి వెలువడిన అభిప్రాయాలను విశ్లేషించండి.
2. కాకతీయులు సామ్రాజ్య నిర్మాణంలో వహించిన పాత్రను వివరించండి.
3. కాకతీయ-శేవుణ (యాదవ) సంబంధాలను విపులీకరించండి.
4. కాకతి గణపతిదేవుడు సాధించిన ఘన కార్యాలను వివరించండి.

II. క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.

1. సామంత కాకతీయులు
2. అనుమకొండ శాసనం
3. ఆంధ్ర దేశంపై తురుష్క దండయాత్రలు

BRAOU

12.7 : ఉపయుక్త గ్రంథాలు

Desai, D. : **The Mahamandalesvaras under the Chalukyas of Kalyani,** Indian Historical Research Institute, Bombay, 1951.

Desai, P.B. : **Basaveswara and His Times,** Dharwar, 1968.

Parabramha Sastri, P.V. : **The Kakatiyas, A.P. Archaeological Series No. 52,** Hyderabad, 1978.

Ritti, S.H. : **The Seunas of Devagiri,** Dharwar, 1972.

Satyanarayana, K. : **A Study of the History and Culture of the Andhras, Vol. II,** Peoples Publishing House, Delhi, 1983.

Venkataramanayya, N. : **The Eastern Chalukyas of Vengi,** Madras, 1950.

Do : **Early Muslim Expansion in South India.**

Yasodadevi, V. : **The History of Andhra Country (1000 A.D. - 1500 A.D.)** Gyan Publishing House, New Delhi, 1993.

Yazdani, G. (ed.) : **The Early History of the Deccan, Vol. II,** Oxford, 1960.

రామారావు, ఎం.(సం.) : కాకతీయ సంచిక, A.P. Archaeological Series No. 52, Hyderabad, 1978.

సుబ్బారావు, ఆర్, (సం.) : కళింగదేశ చరిత్ర

సుబ్రహ్మణ్యం, ఆర్.మొ||(సం.లు) : తెలుగు సంస్కృతి, (మొ. సం.), తెలుగు భాషా సమితి, హైదరాబాద్, 1983.

BRAOU

రచయిత : డా. జె. దుర్గాప్రసాద్.

భాగం-13 : కాకతీయ రాజ్య వ్యవస్థ, సామాజిక, ఆర్థిక పరిస్థితులు

విషయక్రమం

13.0 : లక్ష్యాలు

13.1 : పరిచయం

13.2 : రాజ్య వ్యవస్థ స్వభావ, స్వరూపాలు

- 13.2.1 : రాజధాని
- 13.2.2 : దుర్గం
- 13.2.3 : కేంద్ర ప్రభుత్వం
- 13.2.4 : రాష్ట్ర ప్రభుత్వం
- 13.2.5 : జిల్లా పాలనా వ్యవస్థ
- 13.2.6 : స్థానిక ప్రభుత్వం, లేదా గ్రామ పాలన
- 13.2.7 : సైనిక వ్యవస్థ-నాయంకర విధానం
- 13.2.8 : న్యాయ వ్యవస్థ

13.3 : సామాజిక వ్యవస్థ : మత ప్రభావం

- 13.3.1 :కుల వ్యవస్థ - కులాల పెరుగుదల
- 13.3.2 : స్త్రీల స్థానం

13.4 : ఆర్థిక వ్యవస్థ : ప్రభుత్వ విధానం

- 13.4.1 :వ్యవసాయం
- 13.4.2 :పరిశ్రమలు - దేశీయ, విదేశీయ వాణిజ్యం
- 13.4.3 : ప్రభుత్వ ఆదాయం - పన్నులు
  - 13.4.3.1 :భూసంబంధిత పన్నులు
  - 13.4.3.2 :పరిశ్రమలపై పన్నులు
  - 13.4.3.3 :వృత్తి పన్నులు
  - 13.4.3.4 :వర్తక సంబంధిత పన్నులు

13.5 : సంగ్రహంగా

BRAOU

13.6 : పరీక్ష నమూనా ప్రశ్నలు

13.7 : ఉపయుక్త గ్రంథాలు

13.0 : లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం ద్వారా కాకతీయుల కాలం నాటి రాజ్య వ్యవస్థ, సామాజిక, ఆర్థిక వ్యవస్థల గురించి విపరంగా తెలుసుకోగలగాలి.

13.1 : పరిచయం

దక్షిణ భారతదేశ చరిత్ర లోను, ఆంధ్ర దేశ చరిత్రలో ప్రత్యేకంగాను, కాకతీయులకు విశిష్ట స్థానముంది. శాతవాహనుల అనంతరం, విజయనగర సామ్రాజ్య కాలానికి ముందు, ఆంధ్ర దేశంపై సార్వభౌమాధికారాన్ని చేపట్టినవారు, కాకతీయులు. క్రీ.శ. 10వ శతాబ్ది నుండి, క్రీ.శ. 14వ శతాబ్ది మొదటి పాదం వరకు, ఆంధ్ర దేశ భవిష్యత్తుకు నాయకత్వం వహించిన వారు, కాకతీయులు. కాకతీయులు తొలి మధ్య యుగ చివరి కాలానికి చెందినవారు. కాకతీయుల కాలానికి ప్రాదేశిక రాజ్యాలు (Territorial States), లేక ప్రాంతీయ రాజ్యాలు (Regional Kingdoms) ఒక స్పష్టమైన రూపును కలిగున్నాయి. దాదాపుగా మూడు శతాబ్దాలు విలసిల్లిన కాకతీయుల కాలం నాటి రాజ్య వ్యవస్థ స్వభావం, స్వరూపాల గూర్చిన విశేషాలను, మౌలిక, అనుషంగిక పురావస్తు, వాఙ్మయ ఆధారాల సహాయంతో, వీటితోబాటు ఆకాలపు సామాజిక పరిస్థితులు, ఆర్థిక వ్యవస్థ, ఆనాటి ఆంధ్ర దేశపు ప్రజలు ఎలా జీవించారో తెలుసుకోగలుగుతాం. కాకతీయ యుగ విశేషాలను ఇటాలియన్ యాత్రికుడు మార్కోపోలో రచనల వల్ల కూడా, తెలుసుకోగలుగుతాం.

BRAOU

13.2 : రాజ్య వ్యవస్థ స్వభావ, స్వరూపాలు

కాకతీయులు రాజ్యాధికారాన్ని చేపట్టే నాటికే, రాజ్య వ్యవస్థకు స్పష్టమైన స్వరూపం కనిపిస్తుంది. ఆనాటి రాజ్యాలు వంశపారంపర్య రాజ్యాలు (lineage-based States). కనుక, వంశపారంపర్యమైన రాజార్హతకు ప్రాధాన్యమియ్యబడింది. అంతేకాక, దైవదత్త రాజ్యాధికార సిద్ధాంతం సాధారణ ఆమోదాన్ని పొందింది. ఆనాటి పాలకులు సర్వాధికారాలను కలిగుండి, పౌర, సైనిక పరిపాలనను చేస్తూ, శాసన నిర్మాణ, శాసన అమలు, న్యాయ నిర్ణయ అధికారాలను కలిగుండి, నిరంకుశంగా పాలించారు. కనుక, ఆనాటి రాజ్య వ్యవస్థ రాచరికంపై నిర్మింపబడింది. అయితే, రాచరిక స్వభావాన్ని గురించి అభిప్రాయ భేదాలున్నాయి. కాకతీయులు వంశపారంపర్య నిరంకుశ రాచరికాన్ననుసరించారన్న అభిప్రాయముండగా, కాకతీయులపై సమగ్ర పరిశోధన చేసి, సమగ్రమైన గ్రంథాన్ని రూపొందించిన పి. వి. పరబ్రహ్మ శాస్త్రి కాకతీయుల కాలం నాటి రాజ్య వ్యవస్థ వికేంద్రీకృత అధికారంపై నిర్మించబడిందని అభిప్రాయపడ్డారు. ఈ రాచరికం వికేంద్రీకృత మనటానికి నిదర్శనం, ఆనాటి సామంత విధానం, లేదా భూస్వామ్య విధాన ప్రాబల్యం పెరగటం. ఈ సామంత విధానం, లేదా భూస్వామ్య విధానం కాకతీయ రాజ్య వ్యవస్థను పటిష్ఠపర్చిందా, లేదా బలహీన పర్చిందా అన్న విషయంపై, అభిప్రాయ భేదాలున్నాయి. కాకతీయ రాజ్య వ్యవస్థ స్వభావం గురించి అమెరికన్ చరిత్రకారుడు బర్టన్‌స్టీన్ ప్రతిపాదించిన 'సెగ్మంటరి స్టేట్' (Segmentary State) అన్నది ఎంతవరకు సరిపోతుందన్న విషయాన్ని సి.వి. రామచంద్రరావు పరిశీలించారు. సి.వి. రామచంద్రరావ్ అభిప్రాయం ప్రకారం, కాకతీయ రాజ్య వ్యవస్థలో బర్టన్‌స్టీన్

ప్రతిపాదించిన 'సెగ్మెంటరి స్టేట్' లక్షణాలు కొన్ని వున్నప్పటికీ, అది 'సెగ్మెంటరి స్టేట్'కు దగ్గరగా ఉన్నట్లు కనిపిస్తుంది కాని, కాదంటూ, మౌర్య రాజ్య వ్యవస్థైన 'మెట్రోపాలిటన్ స్టేట్'లాగా, కాకతీయులది 'మెట్రోపాలిటన్ స్టేట్' అని, రోమిలా ధాపర్ ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను ఇంకా పరిశీలించాల్సుంది. ఈ విధంగా కాకతీయుల రాజ్య వ్యవస్థ గురించి, వంశపారంపర్య నిరంకుశ రాచరికమని, వంశపారంపర్య వికేంద్రీకృత రాచరికమని, సెగ్మెంటరీ స్టేట్‌కు దగ్గరగా ఉందని, 'మెట్రోపాలిటన్ స్టేట్' అని, అభిప్రాయాలున్నాయి. ఈ అభిప్రాయాల్లో ఎక్కువ మంది ఆమోదాన్ని పొందిన అభిప్రాయం, కాకతీయులది వికేంద్రీకృత రాచరికమన్నది.

కాకతీయుల కాలం నాటి రాజ్య వ్యవస్థ స్వరూపం, క్రింద నుండి పైకి అంచెలంచెలుగా గ్రామ, జిల్లా, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలుగా రూపొందించబడింది. వివిధ స్థాయిలలో వున్న కేంద్ర, రాష్ట్ర, జిల్లా, గ్రామ పాలనా వ్యవస్థలకు అధికారాలు నిర్దేశించబడినా, కేంద్ర ప్రభుత్వానికి అజమాయిషీ ఉండేది. అయితే, ఈ వివిధ స్థాయిల పాలనా వ్యవస్థలతోపాటుగా, సామంతులు పాలనా వ్యవస్థలో కీలక పాత్రను నిర్వహించేవారు.

13.2.1 : రాజధాని

కాకతీయుల రాజధాని ఓరుగల్లు, లేక వరంగల్. 'క్రీడాభిరామం' ఓరుగల్లును 'ఆంధ్ర నగరిగా' గుర్తించింది. గరుడ బేత, లేక మొదటి బేతుని కాలంలో, అనుమకొండ వీరి రాజధాని కాగా, స్వతంత్రుడైన మొదటి రుద్రుడు అనుమకొండకు 5కి.మి. దూరంలో వరంగల్లులో కోటను నిర్మించి, రాజధానిగా చేసుకొన్నాడు. దీనిని ఒంటి కొండ, లేదా ఓరుంగల్లు, లేదా ఏకాశిలా నగరమని కూడా పిలిచారు. రెండవ ప్రోలుడు నిర్మించిన స్వయంభూ శివాలయం చుట్టూ కాకతి రుద్రుడు (1158-1195) కోటను, నగర నిర్మాణాన్ని ఆరంభించగా, గణపతిదేవుడు ఆ కోట నిర్మాణాన్ని పూర్తి చేశాడు. గణపతి దేవుని గణపేశ్వరం శాసనం, వరంగల్లు నగరం లోని వివిధ ప్రాంతాలను, వాటి పేర్లను తెలుపుతూంది. అంతేకాక, గణపతిదేవుని శాసనాలు, వరంగల్లు ఏ విధంగా ఒక గొప్ప నగరంగా రూపొందిందో, ఆ నగర ప్రజల జీవనవిధానాల స్థాయి గురించి, అనాటి ప్రజల కొనుగోలు శక్తి గురించి, వివరంగా తెలియపరుస్తాయి. 'క్రీడాభిరామం' కూడా వరంగల్లు నగర వర్ణనను వివరంగా తెలుపుతుంది. ఏకామ్రనాథుని 'ప్రతాప రుద్ర చరిత్ర' వరంగల్లులో ఒక లక్షా యాభై వేల గృహస్థులున్నారని, వీరందరు అష్టా దశ వర్ణాలకు చెందినారని తెలుపుతుంది. దీన్ని బట్టి, అనాటి వరంగల్లు జనాభా ఐదు లక్షలకు తక్కువ కాదని ఊహించొచ్చు. 'ప్రతాపరుద్ర చరిత్ర' ప్రకారం ఆ నగరంలో దాదాపు 420 మంది కోటీశ్వర్లు ఉండేవారు. ఆ నగర విస్తీర్ణం దాదాపు 10 లేక 12 మైళ్ళు ఉందని, ఆ నగరంలో అతి పెద్దవైన వ్యాపార సంస్థలు 300, సాధారణ వ్యాపార సంస్థలు 300 ఉన్నాయని, ఏకామ్రనాథుడు రాసివున్నాడు. ఈ రచనను పూర్తిగా అతిశయోక్తులతో నిండివుందని కొట్టివేయకుండా పరిశీలిస్తే, ఇతర ఆధారాలతో పోల్చి చూపినట్లయితే, ఇంకా విశిష్టమైన వివరాలను తెలుసుకోవచ్చు. గణపతి దేవుని కాలం నాటి వరంగల్లు, ఆంధ్రప్రదేశ్ లోని ఒక గొప్ప మహా నగరంగా కనిపిస్తుంది. ఎందుకనగా, దూర ప్రాంతానికి చెందిన తిక్కన సోమయాజి, మత ప్రచారకుడు, గ్రంథ రచయితైన పాల్కురికి సోమనాథుడు, వరంగల్లుకు తమ లక్ష్య సాధనకు వచ్చారు. ఈ విధంగా వరంగల్లు కాకతీయుల రాజధానిగా, ఆంధ్ర దేశం లోని ప్రధాన నగరంగా రూపొంది, ఒక మెట్రో పాలిటన్ సిటీగా అవతరించింది. వరంగల్లు కేంద్రంగా పాలన కొనసాగించబడింది. ఈ విధంగా కాకతీయుల కాలంలో వరంగల్లు ఒక మహానగరంగా రూపొందిందని మార్క్ పోలో, ఫ్రయర్ జోర్డానస్ వేర్కొన్నారు.

BRAOU

13.2.2 : దుర్గం

కాకతీయులు వరంగల్లులో నిర్మించిన దుర్గం అవశేషాలు అతి తక్కువగా దొరుకుతున్నాయి. ఆనాడు ఒక మట్టి కోట, లోపలగా రాతి కోటను, ఈ కోటల చుట్టూ కందకాలు, ఎత్తైన గోడలు, ఆగోడలపై కోటను కాపలా కాయడానికి సైనికులుండేందుకు స్థావరాలను నిర్మించారు. ఈ కోటను 72 మంది నాయకులు కాపలా కాచేవారని చారిత్రక ఆధారాలున్నాయి. లోపలగా నున్న కోట లోనే బహుశా రాజ ప్రాసాదం, స్వయంభూదేవాలయం, పరిపాలనా శాఖల కార్యాలయాలుండి ఉండొచ్చు. వల్లభరాముడు వ్రాసిన 'క్రీడాభిరామం'లో వరంగల్లు కోట వర్ణన వివరంగా ఇవ్వబడింది. అయితే, మనకు రెండు గోడలు-మట్టి, రాతి-కందకాలు, నాలుగు దిక్కులా ప్రవేశ ద్వారాలు మాత్రమే కనిపిస్తాయి. విరిగిపోయిన శిల్పాలు మనకు ఆనాటి వైభవాన్ని మన కళ్ళముందు ఉంచుతాయి. స్వయంభూ దేవాలయంతో పాటుగా, వీరభద్ర, వెంకటేశ్వర దేవాలయాలు కూడా కన్పిస్తాయి. కాకతీయ తోరణాలు అపురూప శిల్ప శోభితాలు.

13.2.3 : కేంద్ర ప్రభుత్వం

కాకతీయుల కాలంలో రాజు సర్వాధికారాలు కల్గియుండేవాడు. అయినప్పటికీ, కాకతీయ పాలకులు సర్వాధికార చిహ్నాలైన 'మహారాజాధిరాజ', 'పరమేశ్వర' మొదలైన బిరుదాలను ధరించ లేదు. అంతేకాక, సామంత పాలకులు ధరించే 'సమధిగత పంచమహాశబ్ద', 'మహా మండలేశ్వర' అన్న బిరుదాలనే సర్వసాధారణంగా కొనసాగించారు. తాము సార్వభౌములమన్న అహంకారంతో, నిరంకుశంగా పాలించలేదు. పి.వి.పరబ్రహ్మశాస్త్రి అభిప్రాయం ప్రకారం, కాకతీయులు ఒక కొత్త రకమైన రాచరికాన్ని అమలుపర్చారు. అదేమంటే, సామంత పాలకులకు అంతర్గత పాలనా వ్యవహారాల్లో తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. కాకతీయ పాలకులు సామంతుల అధికారం పెరగకుండా చూస్తూ, తమచే నియమించబడిన రాజోద్యోగులను రాజ్యమంతటా, వివిధ పదవులలో ఉంచారు.

కాకతీయుల కాలంలో సామంత ప్రభువుల తిరుగుబాటు, ఒకేసారి క్రీ.శ. 1290లో కాయస్థ అంబదేవుని తిరుగుబాటులో కనిపిస్తుంది. దీనిక్కారణం, సామంత పాలకులను తమతోపాటుగా సహ పాలకులుగా భావించుటే. ఇంకో విషయమేమిటంటే, కాకతీయ పాలకులు తాము జయించిన ప్రాంతాల్లో స్థానిక సంప్రదాయాలను గౌరవించి, కొనసాగించారు. ఈ విధంగా కాకతీయ పాలకులు రాజకీయ విజ్ఞత, దూరదృష్టిని ప్రదర్శించి, తాము సార్వభౌములన్న అహంకారంతో పరిపాలించలేదని చెప్పొచ్చు. ఎందుకంటే తరతరాలుగా కాకతీయుల సామంతులుగా వ్యవహరించిన చెరకు కుటుంబం వారు సార్వభౌముల పేర్లను పేర్కొనక పోయినా, వారిపై చర్య తీసుకోలేదు. అలాగే, చెరకు కుటుంబం విధేయతను తక్కువగా చూపించలేదు.

కాకతీయ పాలకులకు పరిపాలనలో సహాయపడడానికి మంత్రిమండలి ఉండేది. ఆ మంత్రి మండలిలో మహాప్రధానులు, ప్రధానులు, అమాత్యులు, ప్రెగ్గడలు, సామంతులు, దండనాయకులు, సేనాపతులున్నారని తెలుస్తోంది. అయితే, ఈ పదవుల వలన వారికున్న అధికారాలు, ఉద్యోగ పరిధి గురించి స్పష్టంగా చెప్పలేం. కాకతీయుల కాలంలో పారమిలటరి (Para-military) ఉద్యోగాల్లో అన్ని వర్గాలకు చెందిన వారిని చేర్చుకున్నారు. ఈ విధంగా మల్యాల హేమాద్రి రెడ్డి, గణపతిదేవునికి మహాప్రధానికాగా, ప్రతాప రుద్రునికి మహాప్రధాని ముప్పిడి నాయకుడని, 'సకల నీతి సమ్మతం' అష్టాదశ తీర్థులను తెలుపుతుంది. గణపతి దేవుని కాలం నాటి శివదేవయ్య వ్రాసిన 'పురుషార్థ సారం' తరచు రాజు మంత్రులతో,

BRAOU

తీర్థులతో సంప్రదించాలని తెలుపుతుంది. రాజుకు తప్పనిసరిగా అంగరక్షకులుండేవారు. అంతఃపుర రక్షకునకు 'నగరి శ్రీకావలి' అనే పేరుంది. రాజ్యోద్యోగులను నియోగాలుగా విభజించారు. అట్టి నియోగాలు 72 ఉండేవి. ఈ 72 నియోగాలపై అధిపతి బాహత్తర నియోగాధిపతి. గణపతిదేవుని కాలంలో కాయస్థ గంగయసాహిణి బాహత్తర నియోగాధిపతి కాగా, రుద్రమ కాలంలో త్రిపురారి, పొంక మల్లయ్య ప్రెగ్గడలు, వరునగా ఆ పదవిని నిర్వహించారు. ఈ విధంగా కేంద్ర ప్రభుత్వంలో రాజు, మంత్రిమండలి. తీర్థులు, బాహత్తర, నియోగాధిపతులు, రాజోద్యోగులు అనే వారుండేవారు.

13.2.4 : రాష్ట్ర ప్రభుత్వం

కాకతీయులు తమ సామ్రాజ్యాన్ని పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా, రాజ్యాలుగా విభజించారు. రాజ్యాన్ని మరల మండల, నాడు, స్థల, భూములుగా విభజించారు. ఈ రాజ్య పాలకులు సామంతులై ఉండొచ్చు. కేట, నతవాడి, చాళుక్య, అయ్య, తెలుగుచోడ సామంతుల అధీనంలో ఈ రాజ్యాలుండి ఉండొచ్చు. ఈ రాజ్య పాలకులకు అంతర్గత స్వాతంత్ర్యముంది. వీరికి భూమిపై యాజమాన్య మియ్యబడింది. ఈ భూమి పైన వచ్చే పన్నులతో జీవించేవారు.

13.2.5 : జిల్లా పాలనా వ్యవస్థ

కాకతీయులు తమ రాజ్యాన్ని అనేక 'నాడులు'గా, 'మండలాలు'గా, 'స్థలాలు'గా, 'భూములు'గా విభజించారు. ప్రతాపరుద్రుని కాలం నాటి శ్రీశైల శాసనం (క్రీ.శ. 1313), కాకనాడు, పెదకల్లు, కమ్మనాడు, ఐజనాడు, మంగలనాడు, సిద్దం నాడు, కుశలనాడు, సబ్బినాడు, కొండ కర్నాడు, పల్లినాడు, నరవాఢి, మూరటనాడు, మోటవాడి, పాకనాడు, రేనాడు, ముమీనాడు, కందూరునాడు, అనే భూములను పేర్కొంటూంది. ఇవి కాక, వెలనాడు, నతవాడి, కోనమండల, విసురునాడు వితువనాడు, మార్జవాడి, కొండపల్లి నాడు, సాకరినాడు, ప్రోలినాడు అనేవి కూడా, శాసనాలలో కనిపిస్తాయి.

BRAOU

ఇంకా, గురిందాలస్థల, పింగళి స్థల, తంగేడ స్థల, మగలాలస్థల, కైలాస కోటస్థల, నాదెండ్లస్థల, కొండూరి స్థల, మన్ననూరి స్థల, కొచ్చెర్ల కోట స్థల, గంగాపుర స్థల మొదలైనవి శాసనాల్లో కనిపిస్తాయి. స్థలం, నాడులో అంతర్భాగమని పి.వి. పరబ్రహ్మశాస్త్రి అభిప్రాయం. స్థల మంటే 20 గ్రామాల కూటమని, పరబ్రహ్మశాస్త్రి నిర్వచనం. పెదకొండూరు స్థలంలో 18 గ్రామాలు, మానూరు స్థలంలో 12 గ్రామాలు, గురిందాల స్థలంలో 60 గ్రామాలున్నాయి. ఈ నాడు అధికారులుగా అమాత్య, లేక ప్రెగ్గడలను నియమించారు. స్థల అధికారులను స్థల కరణాలనీ, స్థల తత్పరులనీ, స్థల శుంకరులనీ, అనేవారు.

13.2.6 : స్థానిక ప్రభుత్వం, లేదా గ్రామ పాలన

పరిపాలనా యంత్రాంగంలో చిట్ట చివరిది గ్రామం. 'అయగార్లు' అనే ఉద్యోగులు గ్రామ పరిపాలనా వ్యవస్థలో కీలక పాత్రను నిర్వహించారు. గ్రామంలో పన్నులను వసూలు చేయడం, గ్రామాల్లోని భూముల లెక్కలు చూడడం, వీరి విధులు. తలారి, నీరుకట్టు మొదలగు అయగార్లున్నారు. వీరికి జీతాలకు బదులుగా భూములను వృత్తులుగా ఇచ్చారు. ఇంకా, అయగార్లు గ్రామస్థుల వద్ద నుండి 'మేర' అనే ధాన్యాన్ని సంపాదించారు.

ఇంకా, తంత్రపాల, శాసనాధికారి, పడాలు శ్రీకరణ, తత్పరి, శ్రీభండారు, సర్వాధికారి, ఆలవట్టం, ఇత్యాది పేర్లు శాసనాలలో కనిపిస్తాయి.

ఆనాడు గ్రామ సభలున్నాయని శాసనాలు తెలుపుతున్నాయి. నగర, మహాజన అనేవి గ్రామ సభలు. నగర అనేది సాధారణ గ్రామాల లోని సభ. గ్రామాల్లోని అన్ని వర్గాల వారి నుండి భూమి శిస్తును వసూలు చేయడం, వీరి విధి. అగ్రహారాలలో బ్రాహ్మణులతో కూడినది "మహాజన" సభ. అగ్రహార పాలనా బాధ్యత వీరిదే. ఊరు సమయ, స్థల సమయ అనేవి కూడా శాసనాలలో కనిపిస్తాయి. ఈ సభలకు విశేషాధికారాలున్నాయి. సామంత ప్రభువులు అదనపు పన్ను వసూలుకు, ఈ గ్రామ సభ అనుమతిని తీసుకొనేవారు. అంతేకాక, ఆ గ్రామం లోని దేవాలయాలకు పెద్దలు ఎవరైనా దానమియ్యదల్చుకుంటే, ఆగ్రామ సభల అనుమతిని తప్పక తీసుకోవాలి. ఈ విధంగా, గ్రామ సభలు విశేషాధికారాలతో పాలనా బాధ్యతను నిర్వర్తించాయి.

13.2.7 : సైనిక వ్యవస్థ - నాయంకర విధానం

కాకతీయులు కూడా మధ్య యుగం లోని ఇతర పాలక వంశాల వలె, రాజ్య విస్తరణ కాంక్షతోను, తమ రాజ్యాన్ని సమకాలీన పాలక వంశాల రాజ్య విస్తరణ కాంక్ష నుండి కాపాడుకోడానికి, శక్తి వంతమైన సైనిక శక్తిని రూపొందించారు. అనాటి పాలకులు పౌర సంరక్షణ, వర్ణాశ్రమ ధర్మ సంరక్షణతోపాటుగా, రాజ్య విస్తరణ చేయటం కూడా, తమ లక్ష్యంగా భావించారు. కనుక, బలమైన, శక్తివంతమైన సైనిక వ్యవస్థను రూపొందింపచేయడ మనివార్యమైంది. అనాటి రాజనీతి గ్రంథాలలో రథ, గజ తురగ, పదాతి బలాలను వేర్కొన్నా, రథాలు వాడుకలో ఉన్నట్లు నిశ్చయంగా చెప్పలేం. ప్రతాపరుద్రుని సైన్యంలో 100 ఏనుగులు, 20,000 గుఱ్ఱాలు, తొమ్మిది లక్షల కాల్బలమున్నట్లు, తెలుస్తోంది. ఈ సేనాధిపతులను గజసాహిణి, అశ్వసాహిణి, అని పిల్చారు. నల్గొండకు చెందిన గణపతి దేవుని శాసనం ప్రకారం, ఉత్తర దేశానికి చెందిన కాయస్థ గంగయ సాహిణిని, తన అశ్వ దళానికి రక్షణ నివ్వడానికి గణపతి దేవుడు తీసుకువచ్చాడని తెలుస్తూంది. ఇందులూరి అన్నయ్య 5 లక్షల కాల్బలానికి అధ్యక్షుడు. గణపతి కాలంలో, జాయప సేనాని గజ సాహిణి. ప్రతాపరుద్రుని కాలంలో బెండపూడి అన్నయ్య గజ బలాధ్యక్షుడు.

కాకతీయుల కాలంలో సైనిక వ్యవస్థలో మూల బలం లేదా, స్థిర సైన్యం, సామంత సైన్య మని రెండు రకాలైన సైన్యాలుండేవి. మూల బలం పాలకుని ప్రత్యక్ష పర్యవేక్షణ క్రింద, లేదా పాలకునిచే నియమింపబడిన వారి అధీనంలో, పాలకుని పోషణలో ఉండేది. అటువంటివారు సైన పేర్కొన్న సైనికాధికారులు. కాకతీయులు సైనిక శక్తితోపాటు, రాజ్య రక్షణలో దుర్గాలకు ఎంతో ప్రాధాన్యమిచ్చారు. అనాడు వన, గిరి, స్థల, జల దుర్గాలున్నాయి. 'నీతి సారం' దుర్గ రక్షణకున్న ప్రాధాన్యతను వివరిస్తుంది. 'పురుషార్థ సారం' కూడా దుర్గాల ప్రాధాన్యతను తెలుపుతుంది. బహుశా, దుర్గాలకు దుర్గాధ్యక్షులను నియమించుంటారు. కీలక స్థానాలలో దుర్గాలనుంచి, వాటి రక్షణా బాధ్యతను విధేయులైన సైనికాధికారులకు అప్పజెప్పారు. కాకతీయుల కాలం నాటి స్థిర సైన్యం యావత్తు మహారాజ, పట్టసాహిణి పర్యవేక్షణలో ఉండేది. యుద్ధాలలో రాజే స్వయంగా సైన్యానికి నాయకత్వం వహించేవాడు. రాజు క్రింద ఉన్న పెద్ద సైన్యాధికారిని "సకల సేనాధివతి" అనేవారు. ప్రతాపరుద్రుడు అంబదేవునిపై దండెత్తినపుడు, సోమయాజుల రుద్రదేవయ్య సకల సేనాధివతిగా వ్యవ హరించాడు. అడిదం మల్లు, సోమాయ వెంక కూడా సకల సేనాధిపతులుగా వ్యవహరించారు. సాధారణ సైనికులకు జీతాలకు బదులుగా, వృత్తులు ఈయబడ్డాయి. సైనికాధికారులను నాడు గవర్నర్లుగా నియమించారు.

BRAOU

కాకతీయుల కాలం నాటి సైనిక వ్యవస్థలో ప్రధానాంశం, నాయంకర విధానం. ఈ నాయంకర విధానం ప్రకారం పాలకుడు నాయకునికి కొంత భూమిని, లేదా కొంత ప్రాంతాన్ని జీతానికి బదులుగా ఇచ్చి, రాజుకు యుద్ధ సమయాలలో సహాయపడేందుకు సైన్యాన్ని పోషించి, దానితో యుద్ధ సమయాలలో రాజుకు తోడ్పడాలి. నాయకులు పోషించాల్సిన సైనికుల సంఖ్య, వారికీయబడిన ప్రాంతంపై ఆధారపడి ఉండేది. ఈ నాయకులు అవసరమైనపుడు సైన్యాన్ని సరఫరా చేయుటమే కాక, తమకీయబడిన ప్రాంతాలలో శాంతిభద్రతలను కాపాడడం కూడా చేయాలి. ప్రతి సంవత్సరం తమ విదేయతను ప్రకటించుకొంటూ, రాజునకు కప్పం విధిగా చెల్లించాలి. అట్టి వాటిని నాయంకర స్థల వృత్తులన్నారు. అట్టి నాయకులను సామంతులన్నారు. ఆనాటి పాలకులు తమ పరిమితులను గుర్తించినవారై, సుదూర ప్రాంతాలను స్వయంగా పర్యవేక్షించలేరు కాబట్టి, ఆ ప్రాంతాన్ని తమ విధేయులైన నాయకులకు అప్పజెప్పారు. ఈ విధంగా రూపొందించబడిందాన్నే, నాయంకర విధానం, లేక సామంత విధానం, లేదా భూస్వామ్య విధానమని పిలిచేవారు. ఈ విధంగా, సేనానాయకులు పరిపాలకులై, క్రమంగా వారి సంతతి ఆయా ప్రాంతాల్లో బలపడటం, ఈ సామంత విధానం లోని ప్రధాన లక్షణం. కనుక, పాలకునకు, ప్రజలకు మధ్య ప్రత్యక్ష సాన్నిహిత్యం తగ్గుతూ వచ్చింది. పెద్ద పెద్ద నాయకులు తమ ప్రాంతాన్ని విభజించి, చిన్న చిన్న నాయకులకు అధికారమిచ్చారు. ఇట్టి విధానం వల్ల, సామ్రాజ్య పరిపాలనా వ్యవస్థతోపాటుగా, వివిధ స్థాయిలకు చెందిన అనేక పరిపాలనా వ్యవస్థలు, ఏక కాలంలో వివిధ ప్రాంతాల్లో ఉండేవి. ఈ నాయంకర విధానం, లేక సామంత విధాన బాగోగులు, పరిపాలకుని సామర్థ్యం పైన ఆధారపడుండేవి. పాలకుడు సమర్థవంతుడైతే, నాయకులు విధేయులుగా ఉండేవారు. పాలకుడు బలహీనుడైతే, నాయకులు తమ తమ ప్రాంతాల్లో స్వతంత్రించేవారు. కాకతీయుల కాలం నాటి యుద్ధ విధానం కాని, వ్యూహ రచనా పద్ధతిగాని, మనకు ఎక్కువగా తెలియదు. కాని, ఆనాడు 'కూట యుద్ధ నీతి' అనుమతించబడిందని, 'సకల నీతి సమ్మతం' వలన తెలుసుకోవచ్చు. కాకతీయ సైనిక వ్యవస్థలో అన్ని కులాలకు సరైన ప్రాతినిధ్యాన్నిచ్చారు. కాని, 'ప్రతాపరుద్ర చరిత్ర' ప్రకారం, వెలమల ప్రాబల్యం హెచ్చని తెలుస్తూంది. కాకతీయ రాజ్య పతనానికి, మహమ్మదీయ దాడులతోపాటుగా, ఆనాటి సైనిక వ్యవస్థ లోని లోపాలు కూడా, ముఖ్య కారణంగా మనం గుర్తించాలి.

13.2.8 : న్యాయ వ్యవస్థ

అంచెలంచెలుగా నియమించబడ్డ న్యాయ వ్యవస్థ ఆనాడు కనిపించదు. న్యాయ సంబంధమైన విషయాల్లో పాలకునకు, ప్రాడ్వీవాకులు సలహానిచ్చేవారు. తగాదాలను పరిష్కరించేందుకు 'రాజనీతి రత్నాకరం' నాలుగు రకాల సభలు లేక న్యాయస్థానాలను పేర్కొంటుంది. అవి ప్రతిష్ఠత, అప్రతిష్ఠత, సముద్రిత, శాశిత. ఆ గ్రంధం ప్రకారం, ప్రతిష్ఠత అనేది ఒక నగరం లోని, లేక రాజధానిలో గాని, తాత్కాలికంగా నియమించబడ్డ న్యాయస్థానం. గ్రామాల్లో తాత్కాలికంగా నియమించబడ్డ న్యాయస్థానాన్ని అప్రతిష్ఠత అంటారు. ప్రాడ్వీవాకులు, లేక మంత్రులు, న్యాయాధిపతులుగా నియమించబడ్డ న్యాయస్థానాలను, సముద్రిత అంటారు. శాశిత అంటే, పాలకుడే న్యాయాధ్యక్షునిగా ఉన్న న్యాయస్థానం. క్రీ.శ. 1214 నాటి దుగ్గిరాల శాసనం ప్రకారం, దుగ్గిరాల, మోరంపూడి, ఈయ్యని గ్రామాల ప్రజలు, తమ సరిహద్దుల విషయమై పాలకునికి విన్నపాన్ని చేసుకోగా, గణపతి దేవుడు మల్లపురాజు, రుద్రపురాజును తన మంత్రులను పంపి, తగాదాలను పరిష్కరించమని ఆదేశించాడు. ప్రజలు తమ అభిప్రాయాలను మంత్రులకు తెలిపితే, మంత్రులు మహాజనుల అభిప్రాయాలను తెలుసుకొని, అనంతరం అందరి ఆమోదంతో ఈయని గ్రామానికి చెందిన సూరపరాజును మధ్యవర్తిగా

BRAOU

సరిహద్దు సమస్యను పరిష్కరించారు. దీనిని బట్టి, స్థానిక ప్రజలు, స్థానిక మహాజనులు తమ సమస్యలను మంత్రుల సమక్షంలో పరిష్కరించుకొన్నారని తెలుస్తోంది. బహుశా, సూరపరాజు ఈయని కరణమై ఉండొచ్చునని, పి.వి. పరబ్రహ్మశాస్త్రి వ్రాశారు. క్రీ.శ. 1246 నాటి శాసనమొకటి, కాలవ నీటిని గురించిన తగాదాను ఏవిధంగా పరిష్కరించింది, తెలుపుతుంది. ఆ శాసనం ప్రకారం, పాలకుడే స్వయంగా ఆ తగాదాను పరిష్కరించి, శాసనం ద్వారా తన నిర్ణయాన్ని తెలియపర్చాడు. ఈ రెండు ఉదాహరణలను బట్టి, 'రాజనీతి రత్నాకరం'లో చెప్పినట్లుగా, తాత్కాలిక న్యాయ స్థానాలు సమస్యల పరిష్కారానికి నియమించబడ్డాయని, మొదటిది అప్రతిష్ఠిత సముద్రిత సభ కాగా, రెండోది శాశ్వత అప్రతిష్ఠిత సభ అని చెప్పొచ్చు. న్యాయ సంబంధిత తగాదాలలో ప్రజలు, మహాజనుల అభిప్రాయాలను గౌరవించి, పాలకుడు, లేదా పాలకునిచే నియమించబడ్డ న్యాయమూర్తులు తీర్పు చెప్పేవారని చెప్పొచ్చు. ప్రత్యేక నేరాలను విచారించడానికి నిపుణులతో కూడిన ధర్మాసనాలను ఏర్పాటుచేసినట్లు **'క్రీడాధిరామం'** సూచిస్తూంది. మరొక విశేషమేమిటంటే, అష్టాదశ వర్ణాలకున్న సమయ సభలు కూడా, తమ సభ్యులు చేసిన నేరాలను విచారించి, శిక్షలను విధిస్తుండేవి. సమయ సభలు కూడా న్యాయస్థానాలుగా వ్యవహరించాయి. ఆనాడు శిక్షలు కఠినంగా ఉండేవి. ఈ శిక్షలను గ్రామాల్లో వీరభటులు అమలుపర్చారు. ఈ పైన పేర్కొన్న న్యాయ విధానాన్ని బట్టి, ఆనాడు ప్రజలు చట్టబద్ధంగా జీవించేవారని, చట్టాలను గౌరవించారని, కనుక శాశ్వత న్యాయస్థానాల అవసరం లేకుండా పోయుండొచ్చునని చెప్పొచ్చు.

13.3 : సామాజిక వ్యవస్థ : మత ప్రభావం

తొలి మధ్యయుగానికి చెందిన కాకతీయుల కాలం నాటి సామాజిక వ్యవస్థను గురించి తెలుసుకొనే ముందర, ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తుంచుకోవాలి. ఆనాటి సమాజంపై మత ప్రభావం ఎక్కువన్న విషయం. మత రంగంలో వచ్చిన మార్పులు, సంక్షోభాలు, సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి. సమాజంలో వివిధ వర్గాలు, వర్గాల మధ్య నున్న సంబంధబాంధవ్యాలు, వారి కివ్వబడిన స్థానం, వివిధ వర్గాల మధ్య నున్న సాంఘిక దూరం, ఇత్యాది అంశాల ద్వారా సమాజ ఆదర్శాలపై మత ప్రభావం తప్పని సరిగా కనిపిస్తుంది. మధ్య యుగంలో కనిపించే మరొక లక్షణం, సాంప్రదాయక నాలుగు వర్ణాలకు తోడుగా, అనేక కులాలు, ఉప కులాలు తలెత్తాయి. వృత్తులను బట్టి ఉప కులాలు తలెత్తాయి. సామాజిక అవసరాలను తీర్చేందుకు అనేక వృత్తులు అవసరమయ్యాయి. వృత్తులు వంశపారంపర్యంగా రావటం చేత, అవి కులాలైనాయి. ప్రతి కులానికి కొన్ని కట్టుబాట్లు, నిబంధనలు ఏర్పడ్డాయి. ఆ నిబంధనలను అమలుపర్చడానికి కుల సమయాలు తలెత్తాయి. కుల సమయం ఆ కులం లోని మానవ జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేసింది. ఆనాడు జైన, శైవ, వైష్ణవ మతాల మధ్య తలెత్తిన ఘర్షణలు, సమాజం లోని వివిధ వర్గాల మధ్య ఐకమత్యం లేకుండా, సామాజిక ఐక్యతకు అవరోధంగా మారాయి.

13.3.1 : కుల వ్యవస్థ - కులాల పెరుగుదల

ఆనాటి సామాజిక వ్యవస్థను గురించి పరిశీలించే ముందర, పాలకులైన కాకతీయులు ఏ కులానికి చెందింది విస్పష్టంగా చెప్పలేం. కాకతీయులు క్షత్రియులు కారు. కాకతీయులు చతుర్థ కులానికి చెందినవారు. హైందవ ధర్మశాస్త్రాల ప్రకారం, రాజ్యాధికారం క్షత్రియులకు చెందాలి. కనుక, రాజ్యాధికారాన్ని సాధించిన కాకతీయులు తమ అధికారాన్ని చట్టబద్ధం చేసుకోడానికి (Legitimation

BRAOU

Process), క్షత్రియ వర్గంగా చెప్పుకొన్నారు. చోళులు, చాళుక్యులు, సూర్య వంశ, చంద్ర వంశ క్షత్రియులుగా చెప్పుకోగా, ఆంధ్ర దేశంలో వివిధ ప్రాంతాలను పరిపాలిస్తున్న అనేక మంది చతుర్థ కులజులు, తాము చతుర్థ కులజుల మని సగర్వంగా చెప్పుకొన్నారు తప్ప, క్షత్రియులమని చెప్పుకోడానికి, క్షత్రియ వంశాలతో సంబంధబాంధవ్యాలున్నాయని చెప్పుకోడానికి ప్రయత్నించ లేదు. కాకతీయులు కూడా గణపతిదేవుని కాలం వరకు, తాము క్షత్రియులమని చెప్పుకోడానికై ముందుకు రాలేదు. కాకతి గణపతి దేవుడు విజిగీషు (Conqueror) కావటం చేత, తన సాహసం, ధైర్యం చేత, అనేక మందిని జయించి, సార్వభౌమాధికారాన్ని సంపాదించిన తర్వాత, ఆంధ్రదేశ మంతటిని రాజకీయంగా ఏకం చేసిన తర్వాత, క్షత్రియులమని చెప్పుకొన్నాడు. అయితే, దక్షిణ దేశంలో క్షత్రియ వర్గం అనేది లేదని, చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలు ఆమోదించినదే. కాకతీయులు తమ కులం, లేక వర్గం గురించి స్పష్టంగా చెప్పుకోలేదు. గణపతి దేవుని శాసనాల్లో వారు సూర్య వంశ క్షత్రియులని చెప్పుకోగా, విద్యానాథుడు ప్రతాపరుద్రుని వంశం సూర్య, చంద్ర క్షత్రియులను మించినదని వేర్కొన్నాడు. ఈ విషయాన్ని గురించి చర్చించిన పరబ్రహ్మశాస్త్రి గారు, గుణాలను బట్టి, అంటే, వారి ధైర్య సాహసాలను బట్టి, వారు క్షత్రియులన్నారు. అయితే, కాకతీయులు కమ్మ కులానికి చెందిన వారన్న గాఢమైన అభిప్రాయం ప్రచారంలో ఉంది.

కాకతీయుల కాలంలో సమాజం ఒక సంధి యుగంలో వుంది. ఆనాడు తీవ్రమైన మత సంఘర్షణలు, సామాజిక వర్గ వైషమ్యాలు, సామాజి వ్యవస్థలో చోటు చేసుకొన్నాయి. మత పరమైన, కుల సంబంధమైన ఘర్షణ, వైషమ్య మేఘాలు కమ్ముకొంటున్న రోజులవి. ఆనాడు వివిధ వర్గాలు తమ ప్రాబల్యాన్ని రాజకీయ, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతికపరంగా పెంచుకోడానికి, పాలకుల ఆమోదం పొందడానికి, కృషి చేశారు. ఈ విషయాలను 'ప్రతాపచరిత్ర' విపులంగా తెలియజేస్తుంది. ఉదాహరణకు, ప్రతాపరుద్రుడు విద్యాధికుడైన కొందరు బ్రాహ్మణులకు బంగారు ఆవులను, ద్రవ్యాన్ని దానం చేయగా, ఆదానం పొందని కొందరు బ్రాహ్మణులు చండాలురను రెచ్చగొట్టి, జీవం లేని ఆ బంగారు గోవులు తమకు దక్కాలని ఆందోళన చేయించారు. అలాగే, విశ్వ బ్రాహ్మణులు, శైవ బ్రాహ్మణులు, వైదిక బ్రాహ్మణులు జ్యోతిష్యం పై అధికారం తమ ప్రత్యేకతని చెప్పుకోడానికి, రాజు ముందరే ఘర్షణపడి, ఎవరికి వారు తాము అధికులమని బుజువు చేయడానికి ప్రయత్నించారు. చతుర్థ కులానికి చెందిన శ్రీ మొల్ల, 'రామాయణాన్ని' రచింపగా, దానిని రాజునకు కృతి ఇవ్వడానికి బ్రాహ్మణులు అడ్డుపడ్డారు. అంతేకాక, మొల్ల రామాయణం కన్నా, భాస్కర రామాయణాన్ని చెప్పేందుకు ముందుకు వచ్చారు. ప్రతాపరుద్రుడు అశక్తుడై, మొల్లను గౌరవించి, ఆ కావ్యాన్ని తనకు కృతి భర్తృత్వం లేకుండా చేసుకొన్నాడు. ఆనాడు భక్తి భావం ఎంత మూర్ఖంగా తయారయిందంటే, చక్రపాణి రంగనాథుడు వైష్ణవ మత ప్రచారకుడు, త్రిపురాంతక గోపురాన్ని చూడటం ఇష్టం లేక, తనను గుడ్డినాడుగా చెప్పుకొన్నాడు. వీర శైవ మత ప్రచారకుడైన పాల్కురికి సోమనాథుడు వైదిక బ్రాహ్మణులను కర్మ చండాలురని, వృత భ్రష్టులని, పశుకరులని తిట్టగా, వైష్ణవులను 'నామాల కుక్కల'ని, జైన బౌద్ధ మతాలను రూపుమాపాలని పిలుపునిచ్చాడు. 'ప్రతాప చరిత్రం', 'సిద్ధేశ్వర చరిత్రం' జైన, బౌద్ధ మత పండితులకు, వీర శైవ, బ్రాహ్మణ పండితులకు మధ్య, ఘర్షణలు జరిగాయని చెపుతాయి. ఈవైన వేర్కొన్న తీవ్రమైన ధోరణికి భిన్నంగా, స్వామి దండనాయక, బెక్కల్లు మల్లి రెడ్డి ఎంతో సహనాన్ని ప్రదర్శించి, చతుస్సమయ సముద్ధరణులుగా తమను గురించి చెప్పుకొన్నారు. తీవ్ర శైవ, వైష్ణవ ధోరణికి భిన్నంగా, తిక్కన హరిహర తత్వాన్ని బోధించాడు.

BRAOU

ఈ పైన పేర్కొన్న మతపరమైన, కులపరమైన అసహనం, సామాజిక ఏకత్వానికి అవరోధమవడమే కాక, రాజకీయ వ్యవస్థను కూడా ప్రభావితం చేసింది. కాకతీయ పాలకులు అన్ని కులాల వారిని ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించడానికి కృషి చేశారు. మూల బలం లోను, నాయంకర సైన్యం లోను, సాధ్యమైనంత వరకు అందరికి ప్రాతినిధ్యాన్ని కలిగించేందుకు కృషి చేశారు. అయినా, ప్రతాపరుద్రుడు వెలమలకు ఎక్కువ ప్రాధాన్యమివ్వడం వలన, రెడ్లకు బాధ కలిగి, తమ ప్రాధాన్యతను గుర్తింప చేయటానికి, ఒక యుద్ధం మధ్యలో ప్రతాపరుద్రుణ్ణి వదిలివెట్టారు. ఇందుకు బాధ్యుడైన తేరాల భోజరెడ్డి ఉద్దేశం అపాయకరం. ఆ పరిస్థితుల్లో రాజును, రాజ్యాన్ని రక్షించి, తమ ప్రాధాన్యతను పెంపొందించుకోవాలి. వారి లక్ష్యం నెరవేర లేదు. ఎందుకనగా, రాజు, రాజ్యం రెండు లేకుండా పోయాయి. ఈ విధంగా, ఆనాడు సామాజిక అశాంతి కనిపిస్తుంది. ఈ సామాజిక అశాంతి, కొంత వరకు అంతర్గతంగా కాకతీయుల పాలన పతనం కావటానికి దోహదం చేసిందని చెప్పొచ్చు. ఈ సామాజిక అశాంతికి కారణమైన కులాల మధ్య వైషమ్యం, కాకతీయుల పతనానంతరం కొనసాగి, బహమనీ రాజ్య విస్తరణకు దారితీసింది.

కాకతీయ యుగ సామాజిక వ్యవస్థకు ఒక ప్రత్యేక లక్షణం, కుల సంఘాలు. కుల సంఘాలను 'సమయము'లన్నారు. బ్రాహ్మణ సమయానికి 'మహాజనులు', వైశ్య సంఘానికి 'నకర', మని పేర్లు. 'సాని మున్నూరు', 'తెలికివేవురు', 'పంచాణం' వారు మొదలైనవి ఇతర సమయాలు. శాసనాల్లో ఊరు సమయం, స్థల సమయాలుండడంవల్ల, వివిధ స్థాయిల్లో కుల సమయాలున్నాయనుకోవచ్చు. ఈ సమయాలకు విశేషాధికారాలున్నాయి. ఇవి ఆ కులం వారిని, లేదా వృత్తి వారిని, సంరక్షించడమే కాక, పన్నులు వసూలు చేయడం, న్యాయ విచారణ చేయడం మొదలైన అధికారాలను కలిగి ఉన్నాయి. క్రీ.శ. 10,11 శతాబ్దుల నాటి శాసనాల్లో అష్టాదశ వర్గాలు, 18 సమయాలంటూ సమాజాన్ని నిర్వచించాయి. సి.వి.రామచంద్రరావ్ దీనికి 'అందరం' 'అన్ని కులాల'ని అర్థం చెప్పారు. బ్రాహ్మణులలో వైదిక మతస్థులతోపాటుగా, రాజోద్యోగాలు చేస్తున్నారన్న వారు కనిపిస్తారు. ఈ యుగంలో బ్రాహ్మణులకు రాజకీయ ప్రాబల్యం తగ్గింది. చతుర్థ కులజుల ప్రాబల్యం పెరిగింది. ఆర్థికంగా, రాజకీయంగా బలవంతులైన చతుర్థ కులజులు ప్రాబల్యాన్ని పెంచుకొని, సామాజిక గౌరవాన్ని సంపాదించి, సామాజిక అంతస్థులో తమ పలుకుబడిని పెంచుకొన్నారు. (Vertical mobility). వివాహ విషయాల్లో పాలక వర్గాలు పలుకుబడి కలిగిన వర్గాలతో, వివాహ సంబంధాలను కలిగున్నారు. కుల వ్యవస్థ కఠినంగా, జటిలంగా ఉండేదని చెప్పలేం. అన్ని వర్గాల లోను దురాచారాలు ఎక్కువైనాయి. బాల్య వివాహాలు, వీరశుల్కం, ఒలి యిచ్చి స్త్రీని పెండ్లాడడం, నిర్బంధ వైధవ్యం, సతీసహగమనం తరచూ కనిపిస్తాయి. సామాన్యులు విద్యకు దూరంగా ఉన్నారు. జూదం, మద్యపానం, కోడి, పొట్టేళ్ళ పందేలు, మొదలైనవి సర్వసాధారణం.

13.3.2 : స్త్రీల స్థానం

కాకతీయులకు చరిత్రలో ఒక విశిష్ట స్థానముంది. ఎందుకంటే పురుషాధిక్య సామాజిక వ్యవస్థలో, వంశపారంపర్యంగా రాజ్యాధికారం పురుష సంతతికి చెందాలన్న సంప్రదాయం కల మధ్య యుగంలో, ఆ సంప్రదాయానికి భిన్నంగా, గణపతి దేవుని అనంతరం అతని కుమార్తె రుద్రమదేవి రాణిగా పట్టాభిషేకం చేసుకొని పాలించింది. అంతమాత్రాన, స్త్రీకి ఉన్నత స్థానం, గౌరవం పెరిగాయని మనం అనుకోకూడదు. ఇది ఒక విశేషమైన మార్పుగా మాత్రమే గుర్తుంచుకోవాలి. ఇంతకు ముందు మనం చెప్పుకున్న బాల్య వివాహం, వర శుల్కం, ఒలి ఇచ్చి స్త్రీని పెండ్లాడటం, నిర్బంధ

BRAOU

వైధవ్యం, సతీసహగమనం, ఆనాటి సాధారణ స్త్రీల పరిస్థితిని వివరిస్తాయి. అయితే, దేవదాసీలకు, వేశ్యలకు, సంఘంలో గౌరవప్రదమైన స్థాన మియ్యబడింది. వారి నాట్యం లేకుండా వివాహాలు కాని, దేవతా కార్యక్రమాలు గాని జరిగేవి కావు. ఆనాడు వేశ్యాలోలత్వం సర్వసాధారణం. ఈ వేశ్యలు బహు భాషా కోవిదులు. నృత్య, సంగీత, చిత్రలేఖనాల్లో ప్రవీణులై, కవి, పండిత పోషణా సామర్థ్యాన్ని కలిగుండేవారు.

13.4 : ఆర్థిక వ్యవస్థ : ప్రభుత్వ విధానం

ఆంధ్ర దేశం కాకతీయుల పాలనలో సిరిసంపదలతో వైభవంగా ఉన్నట్లు, సమకాలీన దేశీయ వాఙ్మయం, తదుపరి విదేశీ రచయితలైన అమీర్ ఖుస్రు, అబ్దుల్లా వాసఫ్, రచనల వలన, మార్కోపోలో వంటి విదేశీ యాత్రికుల రచనల వల్ల తెలుస్తూంది. క్రీ.శ. 1323 నుండి క్రీ.శ. 1330 వరకు భారతదేశంలో నున్న ఫ్రెయర్ జోర్డానస్ రచించిన 'ది వండర్స్ ఆఫ్ ది ఈస్ట్' అన్న గ్రంథం, ఆ నాటి తెలుగు దేశం లోని ఆర్థిక పరిస్థితిని తెలియపరుస్తుంది. తెలుగు దేశంలో జొన్నలు, ధాన్యం, పంచదార, లక్క, తేనె, పప్పు దినుసులు, కోడిగ్రుడ్లు, మేకలు, గేదెలు, పాలు, వెన్న అనేక రకాల పండ్లు భారతదేశం లోని ఏ ప్రాంతంలోకన్నా పుష్కలంగా దొరికేవి. ఒక పేరు తెలియని కవి రచించిన హనుమకొండ నిరోష్ఠ్య కావ్య శాసనం, ఆనాటి ఆంధ్ర దేశం ఏ విధంగా సుభిక్షంగా ఉందో తెలుస్తూంది. ఈ సంపద, వస్తువులు, బహుశా ఢిల్లీ సుల్తాన్లు కాకతీయులపై దండెత్తేందుకు ముఖ్య కారణమై ఉండొచ్చు.

కాకతీయ రాజ్యం, ముఖ్యంగా పీఠభూమిపై, వర్షాచ్ఛాయ ప్రదేశంపై సరైన నదీ ప్రవాహాలు లేని భూభాగంపై విస్తరించున్నప్పటికి, వ్యవసాయానికి అనుకూలమైన వాతావరణం లేకపోయినప్పటికి, నీటి వసతి తక్కువైనప్పటికి, ఆర్థికంగా పటిష్ఠమవడానికి కారణం, కాకతీయ పాలకుల సామంత ప్రభువులు అవలంబించిన ప్రభుత్వ ప్రోత్సాహ విధానమనే చెప్పకోవాలి. ప్రభుత్వ ప్రోత్సాహం లేకుండా ఏ దేశం ఆర్థికంగా ముందంజ వేయలేదు. కాకతీయ పాలకులు ముందు చూపుతో, దూరదృష్టితో ఒక ప్రక్కన వ్యవసాయాన్ని, మరొక ప్రక్కన పరిశ్రమలను ప్రోత్సహించి, ఆంధ్ర దేశాన్ని ఆర్థికంగా పరిపుష్టం చేశారు.

13.4.1 : వ్యవసాయం

కాకతీయుల కాలంలో ప్రధాన వృత్తి, వ్యవసాయం. కాకతీయ ప్రభువులు, వారి సామంతులు వ్యవసాయాభివృద్ధికి అనేక చర్యలను చేపట్టారు. అందుకు గాను, పెద్ద చెరువులు, కాలువలను త్రవ్వించి, నీటిపారుదల సౌకర్యాలను కల్పించారు. ఆనాటి పౌరాణిక మతం తటాక నిర్మాణం సప్త సంతానాలలో ఒకటని, అన్ని దానాలకన్నా మిన్నయని చెప్పటు కూడా, ఈ తటాక నిర్మాణం విశేషంగా జరగడానికి సహాయపడింది. కాకతీయ పాలకులు అడవులను నరికి, వ్యవసాయానికి అనువుగా చేసి, నూతన గ్రామాల స్థాపనకు దోహదం చేశారు. ఈనాటి మంథెన, కాళేశ్వరం, చెన్నూరు, నరసింహపేట, అచ్చంపేట, ఖమ్మం, కొత్తగూడెంలు, కాకతీయుల కాలం లోనే స్థాపించబడ్డాయి. మంథెన, కాళేశ్వరం శాసనాలు ఏ విధంగా గ్రామాలు ఏర్పడ్డాయో తెలుపుతాయి. ఘనాపూర్, రుద్రవరం, మహాదేవపురం, బయ్యారం, ముప్పవరం మొదలైన గ్రామాలను, అడవులను నరికించి, గణపతి దేవ, రుద్రదేవ, బయ్యలదేవి, ముప్పాంబ మొదలగు కాకతీయ పాలకులు నిర్మించారు. గణపతి దేవుని చెల్లెలు కుందమాంబ, కుంద సముద్రమనే తటాకాన్ని, ఒక గ్రామాన్ని ఏర్పాటు చేసింది. గణపతి దేవుని తల్లి బయ్యల దేవి పేరు మీద బయ్యారం అనే పేరుతో గ్రామాలు

BRAOU

నిర్మించబడ్డాయి. తటాక నిర్మాణం వలె, నూతన గ్రామ నిర్మాణం కూడా, ఒక పవిత్ర కార్యంగా ఆనాడు భావించారు. గణపతి దేవుని రాజగురువు విశ్వేశ్వర శివాచార్యుడు 850 గద్యాణాలను వెచ్చించి, అడవి ప్రాంతాన్ని కొని, విశ్వనాదపురమనే గ్రామాన్ని నిర్మింప చేశాడు. కొత్తగా నిర్మించబడ్డ గ్రామాలకు కొన్ని పన్ను రాయితీల నిచ్చారు. ఉదాహరణకు క్రీ.శ. 1144 కు చెందిన ఒక శాసనం ప్రకారం, నల్గొండ జిల్లాలో నూతనంగా ఏర్పడ్డ గ్రామం సిద్దాయకు, అరి, కోరు పన్నులకు రాయితీల నిచ్చారు. కాకతీయుల కాలంలో నీటి పారుదల శాఖ అంటూ ప్రత్యేకంగా ఏమీ లేదు. అయినా, తటాక నిర్మాణం, కాలువల, బావుల నిర్మాణాన్ని సాధారణంగా సామంత ప్రభువులు, మంత్రులు పర్యవేక్షించారు. మొదటి ప్రోలుడు కేసరి తటాకాన్ని నిర్మించాడని, మోటుపల్లి, బయ్యారం శాసనాల వల్ల తెలుసుకోవచ్చు. అతని కుమారుడు బేత, సెట్టి కెరియ, కేసరి సముద్ర తటాకాలను నిర్మించాడని, పానుమకొండ శాసనం తెలుపుతూంది. నేడు దాదాపు 9,037 ఎకరాలకు నీరు సరఫరా చేస్తున్న పాకాల తటాకాన్ని గణపతి దేవ మహారాజు కాలంలో, మంత్రి బయ్యన నాయక కుమారుడైన జగదాలు ముమ్మడి నిర్మించాడు. గణపతి దేవుని కాలం లోనే, క్రీ.శ. 1213 లో అతని సేనాని రేచర్ల రుద్రుడు రామప్ప తటాకాన్ని నిర్మించాడు. దీనివలన దాదాపు 4,350 ఎకరాల భూమి సాగులోకి వచ్చింది. అలాగే, ఘనాపూర్, లక్నవరం తటాకాలు కూడా ఆ కాలం లోనే నిర్మించబడ్డాయి. ఊట కాలువల అన్ని కాలువలు కూడా నిర్మించబడ్డాయి. గొనుగు కాలువ, ముస్తేది కాలువ, ఆలేటి కాలువ, కూచినేని కాలువ, రావిపాటి కాలువ, బొమ్మకంచె కాలువ, ఉత్తమ గండకాలువ, చిలూల కాలువ అనేవి కనుపిస్తాయి. పెద్ద బావుల నుండి ఏతం, లేక మోట ద్వారా నీరును తోడి పోసి, పొలాలను సాగుచేశారు. ఈ ఏతంలను ఆనాడు 'రాలానా' అనేవారు. కుంటలు, లేక చిన్న చెరువులు నిర్మించబడ్డాయి. ఈ విధంగా నిర్మించబడ్డ తటాకాల, కాలువల భూముల బాగోగులను ప్రభుత్వం చూసింది. కాకతీయ పాలకులు ఈ పనికై అనేక మందిని నియమించారన్న విషయాన్ని, శాసనాలు ఋజువు చేస్తున్నాయి. అటువంటి ఉద్యోగులకు 'దశబంధ' అనే ఆదాయం లభించేది. ప్రతి పుట్టి పంటకు ఒక కుంచంను ప్రతి రైతు వద్ద నుండి పన్నుగా వసూలు చేసి, దశబందంగా ఇచ్చేవారు. ఇది కాకుండా, 'దశబంధమాన్య' మనే ప్రతిఫలం కూడా ఉండేది. తటాకం క్రింద సాగుచేయబడ్డ భూభాగంలో కొంత భూభాగాన్ని ఇవ్వటమే, దశబంధమాన్యమై వుండొచ్చు.

BRAOU

వ్యవసాయం చేయబడిన భూమిని మాగాణి, మెట్ట భూముల క్రింద విభజించారు. మాగాణి భూములను నీరి నేల, తొంట నేల క్రింద విభజించారు. నీరి నేలనగా ధాన్యం పండే భూమి. తొంటనగా తోటలు. మెట్ట భూముల్లో నువ్వులు, ఆవాలు, ఆముదం, నీలిమందు, రాగులను పండించేవారు. నాగళ్ళచే దున్నబడిన భూములను అచ్చుకట్టు భూములన్నారు. అచ్చుకట్టనగా అరి అనే పన్ను వసూలు చేయబడే భూములు. వరిలో అనేక రకాలున్నాయి. ఓరుగల్లు ప్రాంతంలో సువాసనలు గల బియ్యాన్ని పండించారు. కందిపప్పు వాడకం లోకి వచ్చినట్లు కనిపించదని, బి.యస్. యల్ హనుమంతరావ్ అభిప్రాయం. కొబ్బరి, జామ, మామిడి, అరటి, ఆకు కూరల తోటలు సర్వసాధారణం. బెల్లం, పంచదార, నూనె పరిశ్రమ ప్రతి గ్రామం లోను తప్పనిసరిగా ఉండేవి. ఆనాడు దేవాలయాలకు దానం చేసిన పశువుల సంఖ్యను బట్టి, పశు సంపద ఎంతో వుందని తెలుస్తూంది. ఆనాడు పూటకూటింట్లుండేవి. ఒక రూపాయికి సమృద్ధిగా భోజనం దొరికేది.

13.4.2 : పరిశ్రమలు - దేశీయ, విదేశీయ వాణిజ్యం

వ్యవసాయంతో పాటుగా అనేక పరిశ్రమలు అభివృద్ధిచెందాయి. పాల్కురికి సోమన 'పండితారాధ్య చరిత్ర'లో 20 కి మించిన వస్త్రాల రకాలను పేర్కొన్నాడు. మార్కోపోలో మాటల్లో, మైసోలియా, లేక మచిలీపట్నంలో, మహారాజులు సైతం మెచ్చుకొనే వస్త్రాలను తయారుచేశారన్నారు. వరంగల్లులో

రత్న కంబళ్ళు, మొఖమల్ వస్త్రాలను నేసేవారు. పంచ లోహాలలో అనేక రకాల వస్తువులను తయారుచేశారు. ఆనాటి శాసనాల్లో, దేవాలయాలలో తరచూ ఉపయోగించే లోహ దివ్వెలు, కంచుకరదీపికలు, పళ్ళేలు, గంటలు, పిడి గంటలు ఉదాహృతమయ్యాయి. **'పల్నాటి వీర చరిత్ర'** ప్రకారం, బ్రహ్మనాయుడు త్రిపురాంతకంలో పంచలోహ స్తంభాన్నెత్తించాడు. గుత్తికొండ, పల్నాటి సీమలు ఇనుప పరిశ్రమకు కేంద్రాలు. ఆనాటి యుద్ధాలలో ఉపయోగించిన ఆయుధ సామాగ్రి, స్థానికంగా తయారయ్యేది. నిర్మల్‌లో తయారైన కత్తులు విదేశాల్లో కూడా ప్రచారం లోకి వచ్చాయి. గోల్కొండ ప్రాంతంలో వజ్రాల గనులున్నట్లు, మార్కోపోలో తెల్పాడు. రాయల సీమలో కూడా వజ్రాలు గనులున్నాయి. ఇంకా, వజ్రంగులు కర్రుతో రంగుల రాట్నాలు, దంతపు పెట్టెలను తయారు చేసేవారు. ఆంధ్ర దేశం లోని వివిధ ప్రాంతాల్లో లక్క బొమ్మలు, ఆట వస్తువులను విరివిగా తయారుచేసేవారు. ఆనాడు తోలుబొమ్మలాటకు బొమ్మలను తయారుచేసి, రంగులను వేయడం, పెద్ద పరిశ్రమైంది.

కాకతీయుల కాలంలో ప్రముఖ వ్యాపారవర్తక కేంద్రాలు-ఓరుగల్లు, పానుగల్లు, జడ్చర్ల, అలంపూర్, మక్తల్ మంథెన, పేరూరు, వేల్పూరు, త్రిపురాంతకం, పెనుగొండ, కొచ్చెర్ల కోట, పెద గంజాం, వెల్లూరు, ఘంటసాల, గుడివాడ, దుర్గి, మాచర్ల, తంగెడ, ఎనమదల, లేబాక, నందలూరు, ఉప్పరపల్లె, మోపూరు, దోర్నాల. గణపతిదేవుని వరంగల్ దుర్గ శాసనం, మార్కెట్ యార్డ్‌లో వివిధ వర్తకులు చేసే వర్తకం గురించి, వివరిస్తూంది. వర్తకులు శ్రేణులుగా రూపొందారు. ఆనాటి శాసనాల్లో కనుపించే శ్రేణులు-స్వదేశీ, పరదేశీ, వాడలవారు, సాసర్‌బురు, తగరంబురు, ఉభయనానా దేశి ఇత్యాదివి. ఆనాడు వర్తకం కోమట్ల చేతిలో కేంద్రీకృతమైంది. ఈ కోమట్లనే, చెట్టిలు, లేక శ్రేష్ఠిలని పిలుస్తారు. **'నీతి శాస్త్రముక్తావళి'** రచయిత్రైన బద్దెన, ఈ కోమట్లకున్న ప్రాధాన్యతను క్రింది విధంగా వివరించాడు: కోమటి నగరానికి ఊపిరి వంటి వాడు; ధాన్యం పంటకు నీరు ఎలాగో, ఏనుగుకు తొండం ఎలాగో, కోమటి కూడా నగరానికి అలాంటి వాడు. రాజ్యం వర్తకవ్యాపార అభివృద్ధికై కోమట్లను ప్రోత్సహించింది. క్రీ.శ. 1268 నాటి మహబూబూబాద్ వద్ద గల శాసన మొకటి, కాకతి రుద్రమదేవి ప్రెగ్గడైన చారం గోవింద సెట్టిని పేర్కొంటూంది. ద్రాక్షారామ శాసనంలో కులోత్తుంగ గొంకరాజుకు సెట్టి అయిన సూరప సెట్టి ప్రస్తావన ఉంది. ఒక శాసనం అయ్యపరెడ్డి కుమారుడైన రడ్డినుంకనను పేర్కొంటూంది. దీనిని బట్టి, రెడ్లు కూడా రాజు సెట్టీలుగా నియమించబడ్డారని తెలుస్తూంది. ప్రభుత్వం వద్ద నుండే లైసెన్సుంటే తప్ప, వర్తకం చేయడానికి వీలు లేదు. క్రీ.శ. 1282 నాటి త్రిపురాంతకం శాసనం ప్రకారం, నానాదేశి పెక్కండ్రు అనే వర్తక శ్రేణి, వర్తకం చేయడానికి లైసెన్సును సంపాదించింది. ఈ విధంగా లైసెన్సును పొందిన వర్తకులు, పేంట, అడ్డ, సంత అనే చోట్ల వర్తకాన్ని చేసుకొనేవారు. ఈ వర్తక కేంద్రాలతో పాటుగా, వీధి బేహారులు కూడా ఉన్నారు. ఈనాటి మార్కెట్ యార్డ్స్ వలె, ఆనాడు ప్రభుత్వాలు కొన్ని స్థలాల్లో అనేక సదుపాయాలను కలుగజేశారని, క్రీ.శ. 1310 నాటి కాకతీయ సేనాని దేవర నాయకుని కొచ్చెర్లకోట శాసనం వలన తెలుస్తోంది. ప్రభుత్వమే పేంటలో పాకలను వేయించి, పాకకు ఒక గద్యానం చొప్పన అద్దె తీసుకొని, ఒక వారం పాటు వర్తకం చేసుకోనిచ్చింది. అక్కడ నుండి మార్కెట్ యార్డ్‌కు తీసుకొని వెడితే, అక్కడ గద్యానం అద్దె ఇవ్వాలి. వర్తకుడు ముద్ర సుంకాన్ని చెల్లించి, ఆ మార్కెట్‌లో తన వేరును నమోదు చేయించుకోవాలి. వస్తువులపై వివిధ రకాలైన సుంకాలను విధించారు. ఈ విధంగా ప్రభుత్వ నియంత్రణలో, ప్రభుత్వ ప్రోత్సాహంతో, దేశీయ వ్యాపారం కొనసాగించబడింది. వ్యవసాయాభివృద్ధి, దేశీయ వ్యాపారాభివృద్ధికి, ప్రభుత్వం ఎంతగానో దోహదం చేసిందని చెప్పడం, అతిశయోక్తి కాదు.

BRAOU

దేశీయ వ్యాపారంతోపాటు, విదేశీయ వ్యాపారం బాగా కొనసాగించబడింది. కాకతీయుల కాలం నాటి వాణిజ్య కేంద్రాలను, రేవు పట్టణాలైన మోటుపల్లి, మచిలీ పట్టణాలతో కలుపుతూ, రహదారులున్నాయి. ఆంధ్ర, కర్నాటకాలను మోటుపల్లి నుండి త్రిపురాంతకం మీదుగా, బళ్ళారి మార్గం కలిపేది. పలనాడు నుండి నల్గొండ, నకరికల్లుల మీదుగా, ఓరుగల్లుకున్న మార్గాన్ని 'క్రీడాభిరామం' పేర్కొంటోంది. శాసనాల్లో కనిపించే రేవు సుంకాన్ని బట్టి, కృష్ణా, గోదావరి నదులు కూడా ప్రయాణ మార్గాలుగా ఉపయోగించారని చెప్పొచ్చు. విదేశీ వాణిజ్యానికి మోటుపల్లి ప్రధాన కేంద్రం కాగా, కృష్ణపట్నం, హంసలదీవి, మచిలీ పట్నం రేవులు కూడా విదేశీ వాణిజ్యాన్ని జరుపుతుండేవి. విదేశీ వర్తకులకు అభయమిస్తూ గణపతిదేవుడు మోటుపల్లిలో ఒక శాసనాన్ని వేయించాడు. ఆశాసనాన్ని బట్టి, నాటి ఎగుమతి, దిగుమతులను తెలుసుకోవచ్చు. ఏనుగులు, గుఱ్ఱాలు, బంగారం, రత్నాలు, చందనం, జవ్వాజి, కర్పూరం, కర్పూర తైలం, పన్నీరు, దంతం, రాశి, తగరం, సీసం, పాదరసం, పట్టు, పగడాలు, సుగంధ ద్రవ్యాలలో విదేశీ వాణిజ్యం జరిగేది. చైనా, పర్షియా, అరేబియా, దేశాల తోను, సింహళం, తూర్పు ఇండియా దీవుల తోను వాణిజ్యం సాగింది. వస్తువు స్వభావాన్ని బట్టి, వసూలు చేసే సుంకముండేది. ఉదాహరణకు, 30 ఏనుగులను ఎగుమతి చేస్తున్నట్లయితే, ఒక ఏనుగును సుంకంగా చెల్లించాలి. గణపతిదేవుడు మోటుపల్లి శాసనంలో, సుంకాలు తక్కువగా ఉంటాయని హామీ నిచ్చాడు.

పైన పేర్కొన్న విధంగా, కాకతీయ పాలకులు ఉదారమైన విధానాన్నవలంబించి, దేశీయ, విదేశీయ వర్తక వ్యాపారాభివృద్ధికి కృషి చేసి, ఆంధ్ర దేశం సిరిసంపదలతో తులతూగునట్లుగా చేశారు. వర్తక వ్యాపారస్థులను ప్రభుత్వాధికార్లు పీడించకుండా, కాకతీయ పాలకులు జాగ్రత్తలను తీసుకొన్నారు. అలాగే, వర్తకులు కూడా అవినీతిమయంగా వ్యాపారం చేయడాన్ని కూడా అరికట్టేందుకు వీరు కృషి చేశారు. ఈ విధంగా, దేశీయ, విదేశీయ వర్తక వ్యాపారం బాగా అభివృద్ధి చెందినా, కాకతీయుల నాణేలు ఎక్కువగా దొరకలేదు. ఆనాటి నాణేలలో పెద్దది గద్యాణం. దీనికి మరోపేరు నిష్కం. మూడ, ఒక బంగారు నాణెం. రూక, మరొక నాణెం. ఇది బహుశా వెండి నాణెమైవుండొచ్చు. ఇంకా, అడ్డుగ, పాదిక, వీస అనే నాణేలు కూడా, శాసనాల్లో కనిపిస్తాయి. బహుశా ఇవి రూకకు విభాగాలై వుండొచ్చు. కొన్ని శాసనాలు 'చిన్నం' అనే నాణేన్ని పేర్కొంటాయి. దీని విలువ ఎంతో స్పష్టంగా తెలియదు.

BRAOU

13.4.3 : ప్రభుత్వ ఆదాయం - పన్నులు

కాకతీయుల కాలంలో ప్రభుత్వానికి ఆదాయం పన్నుల రూపం లోను, సుంకాల రూపం లోను వసూలు చేయబడ్తూ, మరొక ప్రక్క దేవాలయ దానాలను సూచించే శాసనాలలో ఎన్నో పన్నులకు, సుంకాలకు, పరిహారాలు (Remissions) కూడా ఇవ్వబడినాయి. కాకతీయ శాసనాలు ఎన్నో రకాలైన పన్నులను సూచించే పదాలను పేర్కొంటాయి. అయితే, పదాలను నిర్దిష్టమైన అర్థాన్ని ఖచ్చితంగా చెప్పలేం. పి.వి. పరబ్రహ్మశాస్త్రి కాకతీయుల కాలంలో 5 రకాల పన్నులు వసూలు చేయబడేవన్నారు. అవి : 1) భూసంబంధమైన పన్నులు; 2) పరిశ్రమల, ఆస్తి పన్ను; 3) వృత్తి పన్నులు; 4) వర్తక సంబంధమైన పన్నులు; 5) రకరకాల పన్నులు (miscellaneous taxes).

13.4.3.1 : భూసంబంధిత పన్నులు

ఆనాడు భారతదేశంలో ప్రతి రాజ్యానికి ముఖ్య ఆదాయ మార్గం, భూమి శిస్తు. పరబ్రహ్మ శాస్త్రి అభిప్రాయం ప్రకారం, దేవాలయాల, బ్రాహ్మణుల, ప్రభువుల, సామంతులకు చెందిన భూములపై

శిస్తు వసూలు చేయబడేది. రాచ భూములు, బంజరులు, అడవులు మాత్రమే ఈ శిస్తు వసూళ్ల నుండి పరిహరింపబడేవి. పరబ్రహ్మ శాస్త్రి అభిప్రాయం ప్రకారం, సర్వమాన్య పరిహారాలలో దానం చేయబడిన బ్రాహ్మణ, అగ్రహార, దేవ వృత్తులకు చెందిన భూములపై తక్కువ (concession) శిస్తు వసూలు చేయబడేది.

దీనిని బట్టి కాకతీయుల కాలంలో అగ్రహార, దేవాలయ భూములపై కూడా శిస్తు వసూలు చేయబడేదని అంగీకరించక తప్పదు. నూతన గ్రామాలు ఏర్పడినపుడు మొదట్లో మూడు సంవత్సరాల తర్వాత అట్టి గ్రామాల నుండి కూడా, భూమి శిస్తును వసూలు చేసేవారు. అటువంటి భూములను అచ్చుకట్టు, లేక ఆయకట్టు అన్నారు. ప్రభుత్వం భూమి శిస్తును ధన, ధాన్య రూపంలో వసూలు చేసేది. ఈ భూమి శిస్తును వసూలు చేయడానికి, ఆయగాండ్రు, లేక న్యాయగాండ్రు నియమించబడ్డారు. కాకతీయ శాసనాలలో పన్ను, పంగం లేక పంగ, కానిక, దర్శనం అనే పేర్లు కనిపిస్తాయి. ఇవి కాక, ఇంకా నీరువీడి, వెన్ను పన్ను, లేక ఎన్నుపన్ను, బంటి లాయం, పుల్లరి మొదలైనవి కూడా, భూమికి సంబంధించిన పన్నులను సూచిస్తాయి. మధ్య యుగంలో కాకతీయులకు ముందర పాలించిన వారు వసూలు చేసిన భూమి శిస్తుకు సంబంధించిన పన్నుల కన్నా, ఎక్కువ పన్నులను వీరు వసూలు చేశారు. వ్యవసాయానికి అనువైన భూమి ఎంతమాత్రం ఉన్నా, ప్రతివాడు పన్ను చెల్లించేవాడు. పన్నుతో బాటుగా, 'అరి' అన్న పదం కనిపిస్తుంది. అది కూడా, భూమి శిస్తును తెలుపుతుంది. పరబ్రహ్మ శాస్త్రి అభిప్రాయంలో పన్ను, అరి, రెండు కూడా ధన రూపంలో వసూలుచేయబడ్డ భూమి శిస్తు. పంగము, లేక పంగ అన్న పదాల అర్థం స్పష్టంగా తెలియదు. డి.సి. సర్కార్ పంగ అనేది సాధారణంగా వసూల చేయబడిన భూమి శిస్తని, ఇందులో అనేక రకాలున్నాయన్నారు. పంగ తప్ప అనే పదం కనిపిస్తుంది. దీని అర్థం ఏమిటో ఖచ్చితంగా చెప్పలేం. క్రీ.శ. 1269 నాటి రుద్రమదేవి దుర్గ శాసనంలో, పంగతప్ప, పంగ సుంకం, పన్ను, కానిక, దర్శనం అనే పన్నులు పరిహరింపబడినాయని పేర్కొనడమైంది. పంగ సుంకం ధాన్య రూపంలో వసూలు చేయబడే భూమి శిస్తై వుండొచ్చునని ఊహించొచ్చు. పండిన పంటలో ఒక భాగంగా దీన్ని తీసుకోవచ్చు. ప్రతి పుట్టికి ఒక తూము చొప్పున శిస్తును వసూలు చేసి వుండొచ్చు, లేక $\frac{1}{20}$ భాగాన్ని మొత్తం ఉత్పత్తిలో శిస్తుగా వసూలు చేసివుండొచ్చు. క్రీ.శ. 1317 నాటి సలకలనాడు శాసనం, 12 రకాలైన పన్నులను పేర్కొంటుంది. అవి పంగతప్ప, పన్ను, కానిక, పుల్లరి, సాదం, సుంకం, తలారికానిక, అష్టభోగతేజ స్వామ్యమనేవి. పైన పేర్కొన్న పన్నుల్లో పంగతప్ప, కరికొలుచు, పన్ను, కానిక, దర్శనకానిక, అనేవి భూమి శిస్తునకు సంబంధించిన పన్నులు. క్రీ.శ. 1172 నాటి రుద్రదేవుని ఆకునూరు శాసనంలో, 'నీరువిడి' అన్న పదం కనిపిస్తుంది. 'వెన్నుపన్ను' అన్న పదం క్రీ.శ. 1301 కి చెందిన ప్రతాపరుద్రుని భార్య లక్ష్మీదేవి శాసనంలో ఉంది. బహుశా, ఈ పన్ను పంట వెన్నుబట్టినపుడు, కోతకు ముందు వసూలు చేయబడేదేమో! క్రీ.శ. 1317 నాటి ప్రతాపరుద్రుని సేనాధిపతి మాయిదేవ వెంక శాసనంలో, 'బంటులాయం' అన్న పదముంది. దీన్ని ఒంటుల కొరకు వసూలు చేసే పన్నుగా భావించొచ్చు. పరబ్రహ్మశాస్త్రి నాయంకర గ్రామాల్లో రైతు వద్ద నుండి సైన్యాన్ని పోషించడానికి, ఈ పన్నును వసూలు చేసి వుంటారన్నారు. అర్ధ్య అనేది, మరొక భూమి శిస్తు. క్రీ.శ. 1219 నాటి గణపతి దేవుని రాగి శాసనం వలన, రైతులు (అర్ధసిరులు) తాము చెల్లించాల్సిన సగం పన్నును ప్రభువుకు గాక, దానం పుచ్చుకొన్న వారికి చెల్లించారని తెలుస్తోంది. దీనిని బట్టి కొందరు రైతులు పండిన పంటలో సగ భాగం భూమి శిస్తుగా చెల్లించారని చెప్పుకోవచ్చు. కొన్ని సందర్భాలలో $\frac{2}{3}$ వంతు భూమి శిస్తు వసూలు చేయబడేదని తెలుస్తోంది. బంజరు లోను, అడవులలోను, పశువులను మేపడానికి అనుమతిచ్చినందుకు వసూలు చేసిన పన్నును, పుల్లరితో బాటుగా, పుల్లరి కానుకనేవారు.

BRAOU

13.4.3.2 : పరిశ్రమలపై పన్నులు

కాకతీయుల కాలంలో సర్వసాధారణంగా కనిపించే చిన్న పరిశ్రమలవారు-నూనెను తయారుచేయడం, నేతపని, గానుగతో నూనెను తయారు చేయడం నేతపని వాండ్రు - ప్రభుత్వానికి పన్ను చెల్లించేవారు. ఇంకా, వారు స్థానిక దేవాలయానికి, తమ సమయానిక్కూడా పన్నులను చెల్లించేవారు. పశు సంపదపై పన్ను వసూలు చేశారు. ఇల్లరి, లేక ఇల్లడి, లేక ఇల్లడేర అనే పన్నును, ఇల్లు కలిగిన వారి వద్ద నుండి వసూలు చేశారు.

13.4.3.3 : వృత్తి పన్నులు

కాకతీయుల కాలంలో ప్రతి వృత్తిని చేపట్టేవారు ప్రభుత్వానికి వృత్తి పన్నును చెల్లించారు. క్రీ.శ. 1219కి చెందిన గణపతి దేవుడు వేసిన శాసనంలో వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, కంసాలి, చాకలి, మంగలి, ఛండాల, అర్థసిరి, లేదా రైతులు వృత్తి పన్నును చెల్లించేవారని తెలుస్తూంది. అయితే, ఈ వృత్తుల వారు ఎంత పన్ను చెల్లించారో తెలియదు. ప్రతి కోమటి ఒక రూక పన్ను గాను, ప్రతి రైతు (కాపులు) అర రూకను, బ్రాహ్మణులు (మర్త్యులు) భూమి ఉన్నట్లయితే ఒక రూకను, లేదా, పుట్టి ధాన్యాన్ని కలిగి వుంటే, ఒక రూకను పన్నుగా చెల్లించేవారు. ప్రతి నేత నేసేవాడు అర రూకను, ప్రతి కరణం ఒక గజ్జను చెల్లించేవాడు. ఇంకా, గొల్లలు, పూల దండలను తయారుచేసే వారు కూడా పన్నులను చెల్లించేవారు. దేవాలయ అర్చకులు కూడా వృత్తి పన్నును చెల్లించారు. సైనికులపై కూడా పన్నులను వసూలు చేశారు. ప్రతి గుఱ్ఱపు రౌతు ఒకటిన్నర రూక, కాల్బంటు $1\frac{1}{2}$ రూక, ఒంటె పై ప్రయాణం చేసే బంటు $1\frac{1}{4}$ రూకను, ప్రతి సైనికుడు సంవత్సరానికి $\frac{1}{2}$ చిన్నం, కొంతమంది సైనికుల గుంపుకు అధిపతి, సంవత్సరానికి రెండు చిన్నాలను పన్నుగా చెల్లించేవారు.

13.4.3.4.: వర్తక సంబంధితమైన పన్నులు

వర్తక సంబంధమైన సుంకాల్లో పేర్కొదగినవి, అడ్డవట్టు లేక అడ్డ సొత్తు, పెంట సుంకం, ఇత్యాదివి. వీటిని వసూలు చేయడానికి, సుంక మాన్యగాడనే అధికారిని నియమించారు. ఇంకా, సుంకరి (Tax controller), తీర్పరి అనే అధికారులున్నారు. ఈ పదవులను ప్రతి సంవత్సరం వేలం వేసేవారు. కొలగాడు మరొక ఉద్యోగి. ఈతడు పెంట, లేక అడ్డాకు తెచ్చిన ధాన్యాన్ని కొల్చేవాడు, లేక తూకం వేసేవాడు. మొత్తం అమ్మకం మీద అమ్ముబడి సుంకాన్ని, ఒక మూడాకు ఒక వీస చొప్పున వసూలు చేసేవారు. దీనిని కూడా, వీసేది, విచ్చు వీసమని కూడా పిల్చేవారు. అమ్మకం పన్ను, కొనుగోలు పన్ను రెండూ వసూలు చేయబడేవి. ఇంకా ముద్రసుంక, అడ్డ సుంకాలు వసూలు చేయబడేవి. ఆనాడు వసూలు చేయబడిన సుంకాల గురించి, క్రీ.శ. 1122 నాటి పానుగల్లు శాసనం నుండి తెలుసుకోవచ్చు. ఈ సుంకాన్ని ధన, ధాన్య రూపంలో వసూలు చేశారు. గణపతి దేవుని మోటుపల్లి అభయ శాసనాన్ని బట్టి, ఎగుమతి, దిగుమతులపై విధించిన సుంకాన్ని తెలుసుకోవచ్చు. ఎగుమతి, దిగుమతుల సుంక మీవిధంగా ఉండేది. సరకుపై 30 కి ఒకటి చొప్పున శుల్కాన్ని విధించారు. ఒక తులం విలువ గల గంధంపై శుల్కం ఒక వరహా, పాచ్చపణం; వరహా విలువగల కర్పూరం, ముత్యాలపై $\frac{3}{4} + \frac{1}{16}$ పణం; వరహా విలుగల మిరియాలపై $\frac{3}{4} + \frac{1}{16}$ పణం; పట్టు బట్టల మూట ఒక్కింటికి $5\frac{1}{5}$ పణాలు; 1 ఱక్ష వక్కలకు 1 వరహా, $3\frac{1}{4}$ పణాలను సుంకంగా వసూలు చేశారు. గణపతి దేవుని నాదెండ్ల శాసనం, దుర్గ శాసనం ఎంత సుంకాన్ని వసూలు చేశారో తెలుపుతాయి. ఇవి కాక, మాదిగ సుంకం, పుట్టుపేరు సుంకం, పెండ్లి పన్ను, గండి సుంకం, రేవు

BRAOU

సుంకం, మొదలైన వాటిని వసూలు చేశారు." పై వివరణను బట్టి, కాకతీయుల కాలంలో మొత్తం మీద ప్రజలపై పన్నుల భారం చాలా ఎక్కువని చెప్పాలి. కాకతీయ పాలకులు వర్తక, వాణిజ్య సుంకాలను నిర్ణయించి, ప్రజలకు, వర్తకులకు తెలిసేటట్లు సంతల్లో, రేవు పట్టణాల్లో శాసనాలను వేయించారు. బహుశా వర్తకులు, సామాన్య ప్రజానీకం, పన్నుల భారాన్ని భరించలేక భరించుండొచ్చు.

13.5 : సంగ్రహంగా

కాకతీయులు సమర్థవంతమైన, ఉదారవంతమైన పరిపాలనా వ్యవస్థను ఏర్పర్చి, సైనిక అవసరాలకు ప్రాధాన్యత నిచ్చి, నాయంకర విధానం ద్వారా విడేయులైన సామంతుల సాయంతో సైన్యాన్ని పోషింపచేసి, వ్యవసాయాభివృద్ధికి కృషి చేసి, ఆంధ్ర దేశ ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చినప్పటికి, పన్నుల భార మెక్కువైందని ఒప్పుకోక తప్పదు.

13.6 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. కాకతీయ రాజ్య వ్యవస్థ స్వభావం, స్వరూపాలను వివరించి, వివిధ స్థాయిల పాలనా యంత్రాంగాన్ని పేర్కొనండి.
2. కాకతీయ సామాజిక వ్యవస్థను విశదీకరించండి.
3. కాకతీయ పాలకులు సాధించిన ఆర్థికాభివృద్ధిని పరిశీలించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. కాకతీయ రాజ్య వ్యవస్థలో రాజు, మంత్రి మండలి పాత్ర, వారి స్థానాన్ని సమీక్షించండి.
2. కాకతీయుల కాలం నాటి నాయంకర విధాన లక్షణాలను పేర్కొనండి.
3. కాకతీయ న్యాయ పాలనా విధాన మెలాగుండేదో తెలియజేయండి.
4. కాకతీయ కాలంలో కుల వ్యవస్థ ఎలాగుండేది?
5. కాకతీయ రాజధానిని వర్ణించండి.
6. కాకతీయుల కాలం నాటి వ్యవసాయాభివృద్ధిని సోదాహరణంగా పేర్కొనండి.
7. కాకతీయుల కాలం నాటి పరిశ్రమలు, దేశీయ, విదేశీయ వ్యాపార ప్రగతిని సమీక్షించండి.
8. కాకతీయ రాజ్యానికి ఆదాయమెలా వచ్చేదో తెల్పి, ఎన్ని రకాల పన్నులను వసూలు చేశారో, ప్రజలపై పన్నుల భారమెలా ఉండేదో పరిశీలించండి.

BRAOU

13.7 : ఉపయుక్త గ్రంథాలు

Parabrahma Sastri, P.V. : **The Kakatiyas**

Ramachandra Rao, C.V. : "The Kakatiya Polity, Economy and Society- A Few Considerations," **Presidential Address, APHC XIV Session**, Warangal, 1990.

Talbot, Cynthia : "Political Intermediaries in Kakatiya Andhra, 1175-1325," **The Indian Economic and Social History Review**, 31-3-1994

Yazdani, G. (Ed.) : **The Early History of the Deccan, Vol. II.**

ప్రతాపరెడ్డి, ఎన్. : ఆంధ్రుల సాంఘిక చరిత్ర

మలయశ్రీ : కాకతీయుల నాటి సామాజిక జీవితం

రామారావ్, ఎం. (సం.) : కాకతీయ సంచిక

వైదేహి, ఏ. : ఆంధ్రుల సాంఘిక, ఆర్థిక చరిత్ర (మధ్య యుగం)

సుబ్రహ్మణ్యం రాయప్రోలు. మొ.(సం.) : తెలుగు సంస్కృతి, మొదటి సంపుటి

హనుమంతరావ్, బి.ఎన్.ఎల్. : ఆంధ్రుల చరిత్ర

BRAOU

రచయిత : డా. జె. దుర్గాప్రసాద్

భాగం-14 : కాకతీయుల సాంస్కృతిక సేవ: నాటి మతం, సాహిత్యం, కళలు

విషయక్రమం

14.0 : లక్ష్యాలు

14.1 : పరిచయం

14.2 : కాకతీయుల కాలం నాటి మత పరిస్థితులు

14.2.1 : 1 పాశుపత శైవం

14.2.2 : గోళకీ మఠ కార్యకలాపాలు

14.2.3 : వైష్ణవం

14.2.4 : జైనం

14.3 : సాహిత్యాభివృద్ధి

14.3.1 : సంస్కృత సారస్వతం

14.3.2 : తెలుగు సారస్వతం

14.4 : వాస్తు, శిల్ప కళాభివృద్ధి

14.4.1 : వేయి స్తంభాల గుడి

14.4.2 : రామప్ప దేవాలయం

14.4.3 : మతేతర (లౌకిక) నిర్మాణాలు

14.5 : సంగ్రహంగా

14.6 : పరీక్ష నమూనా ప్రశ్నలు

14.7 : ఉపయుక్త గ్రంథాలు

14.0 : లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం ద్వారా, కాకతీయుల కాలం నాటి మత పరిస్థితులు, సాహిత్యాభివృద్ధి, వాస్తు, శిల్ప కళల ప్రగతి గురించి వివరంగా తెలుసుకోగలగాలి.

BRAOU

14.1 : పరిచయం

తెలుగు భాష వాడుకలో గల భూభాగాన్నంతటినీ తమ ఏకచ్ఛత్రాధిపత్యం క్రిందికి తెచ్చి, ఆంధ్ర భావానికి అంకురార్పణ చేసిన కాకతీయ చక్రవర్తుల పరిపాలనా కాలంలో, జైన, శైవ, వైష్ణవ మతాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. వీటి మధ్య పరస్పర సంఘర్షణలూ ఉన్నాయి. సంస్కృతాంధ్రాల పోషణకు, అభివృద్ధికి, మతోద్యమాలు తోడ్పడ్డాయి. కాకతీయ రాజులు, వారి సామంతులు, దుర్గ నిర్మాణంతో బాటు, తమ మతాభిమానానికి నిదర్శనంగా, శిల్పాలంకృతాలైన, సుందరమైన దేవాలయాలను అనేక చోట్ల నిర్మించారు. ఆంధ్ర శిల్పుల ప్రతిభానైపుణ్యాల విజృంభణ, ఓరుగల్లు, అనుమకొండ, పాలంపేట, పిల్లలమర్రి మొదలైన చోట్ల, ఆలయ శిల్పంలో ప్రస్ఫుటమైంది.

14.2 : కాకతీయుల కాలం నాటి మత పరిస్థితులు

కాకతీయుల పరిపాలనా కాలంలో శైవ మతానికి, ముఖ్యంగా వైదిక శైవానికి, బాగా ప్రచారం లభించింది. వేదాల ప్రామాణికత నంగీకరిస్తూ, చాతుర్వర్ణ విధానానికి లోబడి, శివ మాహాత్మ్యాన్ని ఆమోదించేదే, వైదిక శైవం. కాకతీయ పాలకులు, వారి సామంతులు, ఈ శైవాన్నే ఆదరించారు. ఆ నాటి కాలాముఖ, కాపాలిక, పాశుపత, ఆరాధ్య శైవం, వీర శైవం వంటి శాఖల్లో, పాశుపత శాఖ ఎక్కువగా ప్రచారాన్ని పొందింది. జైనంతో తమకున్న సన్నిహిత సంబంధాన్ని వదిలిపెట్టాక, సామంత, కాకతీయ ప్రభువులు కాలాముఖ శైవాన్ని ఆదరించారు. లకులేశ్వర ఆగమ మహాసిద్ధాంతంలో ఉద్దండుడైన రామేశ్వర పండితునికి, అతనికత్యంత ప్రియ శిష్యుడైన రెండో బేతడు, వైజనపల్లి గ్రామాన్ని శివపురం పేరుతో బహూకరించినట్లు, హన్మకొండ శాసన శకలం చెబుతూంది. శ్రీశైలం లోని శిలామఠ ప్రధానాచార్యుడే ఈ కాలాముఖ రామేశ్వర పండితుడని, ఈతడే రెండో బేతని, అతని కుమారులు దుర్గరాజు, రెండో ప్రోలుడనీ, కాలాముఖ శైవ దీక్ష నైకొనేలా ప్రోత్సహించాడని, స్పష్టమౌతూంది. ఈ శ్రీశైల శిలా మఠాధిపతి రామేశ్వర పండితుడే, దాక్షారామ ఆలయానికి, ఇతర ప్రధాన మఠాలకు స్థానపతిగా వ్యవహరించినట్లు భావించొచ్చు. తుంగభద్రా తీరం లోని అలంపురం, నాటి ఆంధ్ర దేశంలో మరో ముఖ్య కాలాముఖ కేంద్రం. అక్కడి బ్రహ్మేశ్వరాలయ స్థానాధిపతులు వైదుష్యానికి, దాతృత్వానికి పెట్టింది పేరు. అలంపురం దగ్గరలో ఉన్న అగస్త్యేశ్వరం కూడా, ఈ మతాచార్యులకు నెలవే. మొత్తం మీద క్రీ.శ. 12వ శతాబ్ది చివరకు, కాలాముఖ శైవం అంధ్ర దేశ మంతటా ఆలయాల్లోను, మఠాల్లోనే కాకుండా, రాజాస్థానంలో కూడా పరివ్యాప్తమైంది. మొదటి ప్రోలుడు, రెండో బేతడు, రెండో ప్రోలుడు పరమ మాహేశ్వరులని, శనిగారం శాసనాలు చెబుతున్నాయి. రుద్రదేవుడూ పరమ మాహేశ్వరుడే. అనుమకొండ శాసన రచయిత అచింతేంద్రుని తండ్రి రామేశ్వర దీక్షితుడు, రుద్రదేవుని ఆధ్యాత్మిక గురువై ఉండొచ్చు. మహాదేవుని రాజ గురువు భృవేశ్వర పండితుడు.

14.2.1 : పాశుపత శైవం

ఆంధ్ర దేశంలో శైవ మత చరిత్రలో గణపతిదేవుని పాలనా కాలం ఒక మహోజ్జ్వల ఘట్టం. పాశుపత శైవ మతాచార్యులు ఆంధ్ర దేశంలో వ్యాప్తి చెందడంతో, కాలాముఖ శైవ ప్రాబల్యానికి విఘాతం కలిగింది. సైద్ధాంతికంగా, కాలాముఖ, పాశుపతాలకు పెద్ద అంతరం లేకపోయినా, ఆచారవ్యవహారాల్లో వైరుధ్యాలున్నాయి. పాశుపతులకు మంత్రం ప్రణవం. అంటే, ఓంకారంతో కూడిన పంచాక్షరి.

BRAOU

జీవులు పశువులని, పాశం ప్రకృతి బందమని, పతియైన శివుని వల్ల అది నిర్మూలమౌతుందని, పాశుపత సిద్ధాంతం. లింగ ధారణ, లింగ పూజ, భస్మ ధారణం, పాశుపతులకు ముఖ్య చిహ్నాలు, మత ధర్మాలు.

14.2.2 : గోళకీ మఠ కార్యకలాపాలు

గణపతి దేవుని కాలంలో గోళకీ మఠానికి చెందిన పాశుపత శైవులు విశేషంగా అటు పాలకుల నుండి, ఇటు ప్రజల్లోనూ ఆదరణ పొందారు. నర్మదా తీరంలో దాహళ దేశంలో సద్భావశంభు అనే యోగి స్థాపించిన గోళకీ మఠానికి, ద్రాక్షారామం, మందడం, భట్టిప్రోలు, త్రిపురాంతకం, శ్రీశైలం, పుష్పగిరి మొదలైన చోట్ల, శాఖలు వెలిశాయి. మల్కాపురం, తదితర శాసనాలను బట్టి, పాశుపత శైవాచార్యుడైన విశ్వేశ్వర శివుడు గణపతిదేవునికి, అతని కుమార్తె రుద్రమకు, రాజ గురువు. రుద్రమ ప్రకటించిన మల్కాపురం శాసనమే, గోళకీ మఠానికి చెందిన శైవాచార్యుల గురించి ఆసక్తికరమైన వివరాలను తెలుపుతూంది. వేలాదిగా ఉన్న ఈ ఆచార్యులు, వారి శిష్యులు, ప్రభువుల్ని దీవించడానికైనా, శపించడానికైనా సమర్థులని, గోళకీ వంశానికి చెందిన వీరు 'భిక్షా మఠ సంతాన' మని శాసనాలు చెబుతున్నాయి. మందడం గ్రామాన్ని తండ్రి కోరిక మేరకు రుద్రమదేవి విశ్వేశ్వర శంభునికి దానమిచ్చినట్లు, రాజ గురువు అక్కడ ఒక శివాలయాన్ని, శుద్ధ శైవ మఠాన్ని, ఒక అన్న సత్రాన్ని నిర్మించి, అనేక మంది విప్రుల నక్కడ స్థిరపర్చి, దానిని 'విశ్వేశ్వర గోళకి', లేదా 'విశ్వనాథ గోళగిరి' అని తిరిగి పేరిడినట్లు, మల్కాపురం శాసనమే తెలుపుతోంది. ఈ మఠంలో ప్రసూతారోగ్యశాలను కూడా ఏర్పర్చినట్లు తెలుస్తోంది. విశ్వేశ్వర శంభే, కాళేశ్వరం, ఏలేశ్వరాల్లో మఠాలను, మంత్రకూట, చంద్రవల్లి, కొమ్ము గ్రామం, ఉత్తర సోమశిల, తదితర ప్రాంతాల్లో శివ లింగాలను ప్రతిష్ఠించాడని ప్రతీతి. గోళకీ మఠ శాఖలు వెలసిన అన్ని ప్రాంతాల్లో, ఈ మఠానికి చెందిన శైవాచార్యులే స్థానపతులుగా వ్యవహరించి, సామాన్య ప్రజానీకంపై తమ ప్రభావాన్ని చూపారు. ప్రతాపరుద్రుని పరిపాలన తుది వరకూ కూడా, ఈ పాశుపత శైవ శాఖలు పరిఢవిల్లినై. కాకతీయ రాజ్య పతనానంతరం ఈ శైవం ప్రసక్తి పెద్దగా కన్పించదు.

కాకతీయ యుగంలో కన్పించే మరో శైవ శాఖ, ఆరాధ్య శైవం. ప్రభువులు ఈ వీర శైవ సంప్రదాయాన్ని ఆదరించకున్నా, పండిత త్రయంగా ప్రసిద్ధికెక్కిన శ్రీపతి పండితుడు, మంచన పండితుడు, మల్లికార్జున పండితుల కారణంగా, ఆంధ్ర దేశ మంతటా వ్యాపించింది. వర్ణ వ్యత్యాసాన్ని పాటించే ఈ ఆరాధ్యులు, లేదా లింగధారులు ఈ నాటికీ అనేక ప్రాంతాల్లో కన్పిస్తారు. ప్రతాపరుద్రుని సమకాలికుడైన పాల్కురికి సోమనాథ కవి రచించిన తెలుగు ద్విపద కావ్యం 'పండితారాధ్య చరిత్ర' పండిత త్రయంలో చివరివాడైన మల్లికార్జునుని జీవితాన్ని, బోధనల్ని వివరిస్తుంది. కర్ణాటకలో మహిమలను చూపి, వీర శైన మతాన్ని అఖండంగా వ్యాప్తి జేసిన బసవను, మల్లికార్జునుడు అభిమానించాడు. అయితే, ఈ బసవ సంప్రదాయం తెలుగు ప్రజాబాహుళ్యంపై ఏ మాత్రం కన్పించక పోవడం విచిత్రమే.

కాకతీయ యుగంలో వివిధ శైవ మఠాలన్నీ విద్యా సంస్థలుగా, గొప్పగా సేవలందించాయి. ఈ మఠాలు మత బోధనతోబాటు, వేదాలు, శాస్త్రాలు, ఆగమాలు, దర్శనాల్లో కూడా విద్యా బోధన జరిగింది. పదవాక్య ప్రమాణమైన వ్యాకరణం, తర్కం, వైద్యం తదితరాలు కూడా బోధింపబడ్డాయి. శైవ మఠాల్లోని విద్యా మండపాల ప్రసక్తి, మల్కాపురం, ఇటిగుళ్ళపాడు, పొందలూరు శాసనాల్లో కన్పిస్తుంది.

BRAOU

14.2.3 : వైష్ణవం

కాకతీయులు అభిమానించిన శైవమే, ఆంధ్రలో ఏక మతం కాదు. వైష్ణవం కూడా ఎంతో కొంత ఆదరణకు పాత్రమైంది. కాకతీయులుపయోగించిన వరాహ లాంఛనం, త్రికూట ఆలయాలన్నిటా ప్రతిష్ఠించిన విష్ణు ప్రతిమలు, వారి విష్ణు భక్తిని చాటుతున్నాయి.

రుద్రదేవుడు అనుమకొండ రుద్రేశ్వరాలయంలో వాసుదేవ మూర్తిని ప్రతిష్ఠించగా, అతని ప్రధాని గంగాధరుడు విష్ణ్వాలయాన్ని నిర్మించి, అందులో ప్రసన్న కేశవమూర్తిని నిలిపాడు. ఈ ఆలయ శిథిలాలు ఇటీవలి సంవత్సరాల్లో హనుమకొండ కొత్త బస్ స్టాండ్ దగ్గరలో లభించాయి. గణపతిదేవుని సోదరి మైలాంబ గోపాలకృష్ణునికై ఆలయాన్ని నిర్మించినట్లు, ఇనుగుర్తి శాసనం చెబుతోంది. ప్రతాపరుద్ర చక్రవర్తి అనేక వైష్ణవాలయాలకు విరివిగా దానాలిచ్చాడు. అయితే, కాకతీయుల కాలం నాటి వైష్ణవంలో కొంత మార్పు వచ్చింది. ఇది పౌరాణిక భాగవత సంప్రదాయాన్నిగాక, రామానుజాచార్యుని విశిష్టాద్వైత సంప్రదాయాన్ననుసరించింది. తిరుపతి, ధర్మపురి, నెల్లూర్, అహోబిలం, మాచర్ల, బాపట్ల, మంగళగిరి, సర్పవరం, సింహాచలం, శ్రీకూర్మం, ఇత్యాది క్షేత్రాలు ముఖ్య వైష్ణవ కేంద్రాలుగా ప్రాబల్యం లోకి వచ్చాయి. మఠాలు, సమయాలు వెలిశాయి. కొన్ని చోట్ల శైవ, వైష్ణవాలకు సంఘర్షణలూ తలెత్తాయి. కొన్ని శైవ క్షేత్రాలను రామానుజుడు వైష్ణవ క్షేత్రాలుగా మార్చాడని, **శ్రీపతి భాష్యం, వెంకటాచల ఇతిహాసమాల** చాటుతున్నాయి. పల్నాటి యుద్ధానికి కారణాల్లో, ఈ మత వ్యత్యాసాలు ఒక కారణమంటారు.

14.2.4 : జైన మతం

కాకతీయుల కాలం నాటికి బౌద్ధ మత సంప్రదాయాలు పూర్తిగా నశించాయి. బుద్ధుడు విష్ణువు దశావతారాల్లో ఒక అవతారంగా పరిగణింపబడ్డాడు. బుద్ధదేవ, బుద్ధేశ్వర మూర్తులతో పూజితుడయ్యాడు. త్రిపురాసురుణ్ణి మాయచేయడానికి విష్ణువు బుద్ధావతారాన్ని దాల్చాడని, అతనికి ప్రత్యేకంగా ఒక ఆలయాన్ని నిర్మించినట్లు, క్రీ.శ. 1171 నాటి గంగాధర మంత్రి కరీంనగర్ శాసనం చెబుతున్నది.

బౌద్ధంలా గాక, జైన మతం క్రీ.శ. 12వ శతాబ్ది ఆరంభం వరకు వ్యాప్తిలో ఉంది. పశ్చిమ చాళుక్యుల పోషణలో, తెలంగాణా ప్రాంతంలో, బాగా ప్రజాదరణ పొందింది. బోధన్, వేములవాడ, పొట్లచెరువు, అనుమకొండ, కొల్లిపాక మొదలైన జైన క్షేత్రాలు ప్రసిద్ధిలో ఉన్నాయి. కాకతీయులు మొదట్లో జైనులనే ప్రతీతి ఉంది. మొదటి బేతడు, రెండే బేతడు, రెండో ప్రోలుడు జినాలయాలకు దానాలిచ్చినట్లు, శనిగారం, బనజిపేట, పద్మాక్షి ఆలయ శాసనాలు స్పష్టం చేస్తున్నాయి. అనుమకొండ వద్ద కొండపై ఇప్పుడు శైవ దేవతగా పూజలందుకొంటున్న పద్మాక్షి, జైన దేవతే. మొదటి బేతడు ప్రతిష్ఠించిన ఈ పద్మాక్షినే, కాకతిగా వ్యవహరించి ఉండొచ్చు. మలి కాకతీయుల కాలంలో కూడా, జైనం కన్పిస్తోంది. రుద్రదేవుని మంత్రి గంగాధరుడు పద్మాక్షి జినాలయాన్ని కొంత పునరుద్ధరించినట్లు అన్మకొండ శాసనం తెలియజేస్తోంది. ప్రతాపరుద్రుని పాలనలో అప్పయార్యుడనే జైన కవి 'జినేంద్రకళ్యాణాభ్యుదయం' రచనను పూర్తి చేసినట్లు చెప్పాడు.

అయితే, జైనుల ప్రాబల్యాన్ని ఎండగట్టడంలో కాలాముఖులు, వీరశైవులు ప్రముఖ పాత్ర వహించారని, పాల్కురికి సోమనాథుని రచనలు వర్ణిస్తున్నాయి. గణపతిదేవ చక్రవర్తి అన్మకొండ లోని జైనులను క్రూరంగా హింసించినట్లు 'సిద్ధేశ్వర చరిత్ర' చెబుతున్నది. శైవ వాఙ్మయం అతిశయోక్తులతో కూడుకున్నదని అనుకున్నాగాని, వివిధ ప్రాంతాల్లో కన్పిస్తున్న జైన శిథిలాలు, అప్పటి శైవుల విధ్వంస

BRAOU

కాండకు నిదర్శనాలు. అలాగని, సామాన్య ప్రజానీకం ఏదో ఒక వైపు పూర్తిగా మొగ్గు చూపిన దాఖలాలు లేవు. తీవ్రవాద మతోద్యమాలు వర్ణ వ్యత్యాసాలను, ఇతర సంప్రదాయాలను నిరసించినా, వర్ణరహిత సమాజమేమీ ఏర్పడ లేదు. శివకేశవులకు అభేదాన్ని పాటించిన స్మార్త సమన్వయ మతం ప్రజల్లో వ్యాపించడంతో, బహు దేవతారాధన ఎక్కువైంది. జైనాచారాలూ హైందవంలో చోటు చేసుకున్నాయి. గ్రామ దేవతలు, జంతు బలులు, ఆత్మబలి దానాలు, వీరారాధన, విపరీతమయ్యాయి.

14.3 : సాహిత్యాభివృద్ధి

కాకతీయ యుగంలో సాహిత్య రంగంలో నూతనోత్తేజం కన్పించింది. ప్రభువులు, సామంతులు, ఇతర ఉన్నతోద్యోగులు సారస్వత కార్యకలాపాలను ప్రోత్సహించారు. మందడం, శ్రీశైలం, పుష్పగిరి మొదలైన ప్రధాన ఆలయాల్లోని విద్యా మంటపాల ప్రసక్తి శాసనాల్లో కన్పిస్తుంది. ఈ మంటపాల్లో మత చర్చలు, సాహిత్య గోష్ఠులు జరిగేవని భావించొచ్చు. ప్రతాపరుద్రుని ఖండవిల్లి శాసనం ఘటి శాసనులైన బ్రాహ్మణులను పేర్కొన్నది. వీరు ఘటికాస్థానాల్లో (కళాశాలలు) ఆచార్యులై ఉంటారు. అనేక శాస్త్రాల్లో విద్యాభివృద్ధి జరిగింది. అయితే, ఇవన్నీ చాలా వరకు సమాజంలో అగ్ర వర్ణాలకే పరిమితమయ్యాయి.

14.3.1 : సంస్కృత సారస్వతం

ఈ కాలంలో విద్యా రంగంలో సంస్కృత భాషదే అగ్ర తాంబూలం. అనేక శాసనాలే దీనికి నిదర్శనం. అన్నకొండ, పాకాల, పాలంపేట, వర్ధమానపుర, బూదపుర శాసనాలను చిన్న ఖండ కావ్యాలే అని, అనొచ్చు. రుద్రదేవుని అన్నకొండ శాసనాన్ని, అచింతేంద్రుడు చక్కటి ఖండ కావ్యంగా మల్చాడు. పాణినీయంలో మహా విద్వాంసుడైన మయూర భట్టు కుమారుడు ఈశ్వర భట్టోపాధ్యాయుడు, బోత్పూర్ శాసన కవి. చక్రబంధ శైలిలో పద్యానికి, ఈ శాసనం ఒక ఉదాహరణ. కోట ప్రభువుల వేల్పూరు, అమరావతి శాసనాల్లో, క్లిష్టమైన అనుప్రాస, ప్రాతిలోమ్య, యమకాలు కన్పించాయి. నంది, అనంతసూరి, దేవనభట్టు, బాల భారతి వంటి ఇతర శాసన కవులూ, తమ పైదుష్యాన్ని ప్రదర్శించారు. పాకాల శాసన రచయిత కవి చక్రవర్తిని, గణపతిదేవుని ఆస్థాన కవిగా భావించొచ్చు. గ్రంథ రచయిత విషయానికొస్తే, కాకతి రుద్రదేవుడు స్వయంగా కవి. 'విద్యాభూషణ' బిరుదాంకితుడైన ఇతడు **'నీతిసార'** మనే రాజనీతి గ్రంథాన్ని రాశాడని ప్రతీతి. ప్రతాపరుద్రుని ఆస్థానం కవిపండితులకు కల్పతరువే అయింది. నేటికీ, అలంకార శాస్త్రంపై ప్రామాణికంగా ఉన్న **'ప్రతాపరుద్ర యశోభూషణం'** గ్రంథ రచయిత, విద్యానాథుడు ఈతని ఆస్థాన కవి. ఆనాటి కవులందరిలో అగ్రగణ్యుడు. **'భాలభారతం', 'నలకీర్తి కౌముది', 'కృష్ణచరితం'** వంటి 74 కావ్యాలను రాసిన అగస్త్యుడు, విద్యానాథుడు ఒక్కరేనని కొందరు; కాళిదాసు కావ్యాలకు వ్యాఖ్యాతైన మల్లినాథుడే, విద్యానాథుడని మరికొందరు భావిస్తున్నారు. **'మధురావిజయం'** కావ్య రచయిత్రి గంగాదేవి, అగస్త్యుని తన గురువుగా ప్రస్తుతించింది. ప్రతాపరుద్రుని ఆస్థానం లోని మరో విద్వాంసుడు, కవి అయిన శాకల్య మల్లభట్టు, **'ఉదాత్త రాఘవ కావ్యం', 'నిరోష్ఠ్యరామాయణ'** కావ్యాలను రచించాడు. **'ప్రమేయ చర్చామృతా'**న్ని రాసిన విద్దనాచార్యుడు; శ్రీహర్షుని **'ఖండనఖండఖాద్య'** మనే అద్వైత గ్రంథానికి వ్యాఖ్యానాన్ని రాసిన గండయభట్టూ, ప్రతాపరుద్రుని ఆస్థాన్ని అలంకరించిన వారే. ఇతర శాస్త్ర గ్రంథాల్లో, రుద్రమ, ప్రతాపరుద్రుల సేనాని, కొలని రుద్రదేవుని **'శ్లోకవార్తికావ్యాఖ్య, రాజరుద్రీయం)'** వ్యాకరణ గ్రంథం. గణపతి దేవుని సేనాని జాయప. ఆనాటి ఆంధ్ర దేశం లోని

BRAOU

స్థానిక, ప్రాంతీయ నృత్యాలను వివరించే 'దేశీ నృత్త'మనే ప్రత్యేక ప్రకరణాన్ని జొప్పించి, నృత్యంపై **'నృత్తరత్నావళి'** అనే శాస్త్రీయ గ్రంథాన్ని రాశాడు. సంగీతంపై **'గీతరత్నావళి'**, సంగీత వాయిద్యాలపై **'విద్యారత్నావళి'** అనే మరో రెండు రచనలను కూడా, జాయపుడే చేశాడు.

14.3.2 : తెలుగు సారస్వతం

తెలుగుతనానికి వ్యక్తిత్వం, తెలుగు వారిలో జాతీయ చైతన్య వికాసాన్ని కలిగించిన కాకతీయ పాలకులు, స్వయంగా తెలుగు వాఙ్మయానికి దోహదపడ లేదు. అయితే, వారి సామంతులు, ఇతర ఉన్నత రాజోద్యోగులు, స్వయంప్రతిపత్తితో పరిపాలిస్తున్న ప్రాంతాల నాయకులు, కృతి కర్తలు, కృతి భర్తలయ్యారు. తెలుగు వాఙ్మయ చరిత్రలో విజయనగర స్వర్ణ యుగానికి, క్రీ.శ. 13 వ శతాబ్దం నాలుగో పాదం నుండి పునాది ఏర్పడింది. తెలుగు వాఙ్మయం ప్రవాహంలా ఉద్భవించింది. ఈ భాషా వికాసానికి శైవ, వైష్ణవ మతోద్యమాలు దోహదపడ్డాయి. ప్రజలకు సుపరిచితమైన భాషలో ధర్మ బోధనకై దేశి కవిత్వాన్ని సాదనంగా గ్రహించారు. జాను తెనుగులో దేశి కవిత్వోద్యమాన్ని పాల్కురికి సోమన ఆద్యునిగా, శైవ కవులు ప్రారంభించారు. ఈ ఉద్యమం వైష్ణవుల పైనా, మార్గ కవుల పైనా కూడా, ప్రభావాన్ని చూపించింది. ప్రజల పైకి కవుల దృష్టి మరలింది. ఒక విధంగా, మత, సాంఘిక పరిణామాలకు కవులు కారకులయ్యారు.

కాకతీయ యుగ జైన మత సారస్వతంలో అదర్వణుడు అనువదించిన మహాభారత విరాట పర్వం లోని కొన్ని పద్యాలు లభించాయి. మరో జైన కవి అప్పయార్యుడు **'జ్ఞానేంద్ర కల్యాణాభ్యుదయం'** కావ్యాన్ని ప్రతాపరుద్రుని కాలంలో పూర్తి చేశాడు. శైవ సాహిత్యానికి సంబంధించి, ఇంచుమించు రుద్రదేవుని కాలానికి చెందిన మల్లికార్జున పండితుడు, తెలుగులో మొదటి శతకం **'శివతత్త్వ సారం'**ను రచించాడు. ప్రతాపరుద్రుని సమకాలీనుడైన పాల్కురికి సోమనాధుడు, బసవేశ్వరుడు బోధించిన వీర శైవ ధర్మాలను వివరిస్తూ, **'పండితారాధ్య చరిత్ర'**, **'బసవపురాణ'** మనే రెండు ద్విపద కావ్యాలను రాశాడు. వీటిలో మొదటిది, మల్లికార్జునుని జీవిత చరిత్ర; రెండోది వీర శైవ బసవని జీవిత చరిత్ర. ఈ రచనలు అనాటి మత, సామాజిక పరిస్థితులపై కూడా ఎంతో వెలుగును ప్రసరిస్తున్నాయి. పాల్కురికి చేసిన మరో రచన, **'వృషాధిప శతకం'**. దీనికి కొద్దిగా ముందు, యథావాక్కుల అన్నమయ్య **'సర్వేశ్వర శతకాన్ని'** రాశాడు. పాల్కురికిదే అయిన **'బసవోదాహరణం'**, రావిపాటి పురాంతకుని **'త్రిపురాంతకోదాహరణం'** తెలుగులో ఉదాహరణ కావ్యాలకు నిదర్శనం.

కాకతీయ యుగంలో వైష్ణవ సాహిత్యం పెద్దగా కన్పించదు. ఉన్న వాటిలో మార్గ కవితా రీతి లోని **'భాస్కర రామాయణం'**ను మొదటి గ్రంథంగా చెప్పొచ్చు. హళక్కి భాస్కరుడు తన కుమారుడైన మల్లికార్జున భట్టు, శిష్యులైన రుద్రదేవ, అప్పలార్యుల తోడ్పాటుతో, ఈ రచనను చేసుండొచ్చు. ప్రతాపరుద్రుని సైనికోద్యోగి సాహిణీమారుని ప్రోత్సాహం దీనికి లభించుంటుంది. కవి త్రయం లోని తిక్కన సోమయాజి తాత, మంత్రి భాస్కరుడే ఈ **'భాస్కర రామాయణ'** కర్తని కొందరి అభిప్రాయం. ఇక, వైదిక మతాభిమాని, మార్గ కవితా రీతి సంస్కర్త, ఉభయ కవిమిత్రుడు, నాటి మత, సారస్వతోద్యమాలలో పాత్రవహించిన వాడు, తేట తెనుగులో ఆంధ్ర మహాభారతాన్ని అందించిన వాడైన తిక్కన, రామాయణ ఉత్తర కాండపై **'నిర్వచనోత్తర రామాయణం'** ను రాశాడు. తిక్కన శిష్యులే మాదన, కేతనలు. మారన **'మార్కండేయ పురాణ'** మాంద్రీకరణ స్మార్త మతాన్ని ప్రబలం చేసింది. అభినవదండి కేతన అనువాదం **'దశకుమార చరిత్ర'** తెలుగులో మొదటి కథా కావ్యం. క్రీ.శ. 1260 ప్రాంతంలో నండూరి గుండ్యన మంత్రి **'కేయూర బాహు చరిత్ర'** కథా

BRAOU

కావ్యాన్ని మంచన నుండి అంకితం పొందాడు. గోన బుద్ధరాజు రాసిన **'రంగనాథరామాయణం'** తెలుగు ద్విపద కావ్యాల్లో అత్యుత్తమమైంది.

కాకతీయ యుగం నాటి లౌకిక వాఙ్మయంలో శాస్త్ర గ్రంథాలు, శృంగార రస ప్రధాన ప్రబంధాలున్నాయి. యాజ్ఞవల్క్య ధర్మ శాస్త్రాన్ని కేతన **'విజ్ఞానేశ్వరీయం'**గా అనువదించాడు. అతడే **'ఆంధ్ర భాషా భూషణం'** పేరుతో, తెలుగులో వ్యాకరణ గ్రంథాన్ని వెలువరించాడు. బద్దెన రాసిన **'నీతిశాస్త్ర ముక్తావళి'** రాజనీతి గ్రంథం. **'సుమతీశతకా'**న్నందించినవాడితడే. శ్లేషేంద్రుడు **'ముద్రామాత్యం'**ను; శివదేవయ్య **'పురుషార్థసారం'**ను; భోజుని వైద్య గ్రంథం **'చారుచర్య'**ను అనువదించిన ఆంధ్ర భోజుడు అప్పన మంత్రి **'నీతిభూషణం'**ను రాశారు. వర్ణనాత్మకమైన శృంగార కావ్యాలు, ప్రబంధాల సృష్టి, కాకతీయ యుగం లోనే ఆరంభమైందని, విమర్శకుల భావన. ఆనాటి శృంగార సృష్టికి, కేతన **'కాదంబరి'**, రావిపాటి త్రిపురాంతకుని **'మదనవిజయం'** గ్రంథాలు నిదర్శనం. వినుకొండ వల్లభామాత్యుని **'క్రీడాభిరామం'**, ఓరుగల్లు సామాజిక జీవనానికి అద్దం పడ్తూంది.


14.4 : వాస్తు, శిల్ప కళాభివృద్ధి

కాకతీయులు, వారి సామంతులు వాస్తు, శిల్ప కళలను పోషించారు. వారు ప్రధానంగా చాళుక్య యుగపు వాస్తు రీతిని వారసత్వంగా స్వీకరించారు. అయితే, వాస్తు, శిల్ప శాస్త్ర గ్రంథాల్లో చెప్పిన నియమాలకు కట్టుబడక, తమదైన ప్రాంతీయ కళా శైలిని ప్రదర్శించడం, కాకతీయ వాస్తు నిర్మాణాల్లో, ఒక ప్రత్యేకత. స్థానికంగా లభించే నల్ల రాయి, ఇసుక రాళ్ళనే ప్రధానంగా నిర్మాణాల్లో ఉపయోగించారు. ఆలయాల్లో విమాన భాగం వరకు, ఈ రాళ్ళనే ఉపయోగించినా, ఆపై నిర్మాణానికి ఇటుక, సున్నాలను వాడారు. గణపతి దేవుని కాలం నాటి కొండపర్తి శాసనం, కాకతీయ ఆలయ స్థపతుల నైపుణ్య పరిపక్వతను స్తుతించింది. ఎత్తైన అధిష్ఠానాలు, వివిధ శిల్పాలతో అలంకరింపబడ్డ స్తంభాలు, జాలాలతో అలంకరింపబడ్డ పేట్ట గోడలతో మండపాలు, తోరణ స్తంభాలు, కాకతీయుల ఆలయాల్లో కన్పించే, గమనించదగ్గ లక్షణాలు. బయటి ఆడంబరం లేకుండా, లోపలి పనితనాన్ని చాటడం, ఒక విశేషం.

14.4.1 : వేయి స్తంభాల గుడి

కాకతీయ యుగారంభంలో నిర్మాణమైన జైన వసదులు, ఆలయాలు చాల భాగం శిథిలమైనాయి. క్రమేణా, శైవ, వైష్ణవ ఆలయాల నిర్మాణం పెరిగింది. ముఖ్యంగా, రుద్రదేవుడు హన్మకొండలో క్రీ.శ. 1163లో నిర్మించిన వేయి స్తంభాల గుడి, ఆనాటి శిల్పుల వాస్తు ప్రావీణ్యానికి మచ్చు తునక. ఈ ఆలయం ప్రస్తుతం రెండు భాగాలుగా ఉంది. మొదటిది, రుద్రేశ్వర, వాసుదేవ, సూర్యదేవులకుద్దేశించిన 'త్రికూటాలయం'. ఇక రెండోది, త్రికూటాలయానికి ఎదురుగా శిథిలావస్థలో ఉన్న మండపాలు. రుద్రుడు తన సార్వభౌమాధికారాన్ని ప్రకటించుకున్న సందర్భంలో నిర్మించిన ఆలయమిది. ఈ ఆలయంపై విమానాలు కన్పించవు. అవి శిథిలమై ఉండొచ్చు. మధ్యలో ఒక నలు చదరపు చావడి (హాలు)తో, తూర్పు, పడమర, ఉత్తరాలకు మూడు దేవాయతనాలు, దక్షిణంగా ఒక మండపం విస్తరించున్న ఏకఖండ నిర్మాణం కన్పిస్తుంది. దక్షిణాన ఉన్న మండపంలో దాదాపు 300 స్తంభాలున్నాయి. అసలైన మొత్తం నిర్మాణంలో వేయి స్తంభాలు, 'వేయి స్తంభాల గుడి' అనే పేరును సార్థకం చేస్తూ, ఉండి వుంటాయి. ముఖ మండప స్తంభాలు, గర్భాలయ ద్వార బంధాలు, శివలింగ పానవట్టం, నంది విగ్రహం, నిగనిగలాడుతూ, లోహ స్తంభాలనే భ్రాంతిని కల్పిస్తూ,

BRAOU



సహస్ర స్తంభాలయములోని స్తంభము, అనుమకొండ

శిల్ప సంపదతో అలరారుతున్నాయి. ప్రధాన దైవమైన రుద్రేశ్వరుని గర్భాలయంపై, శిల్పులు ప్రత్యేక శ్రద్ధను ప్రదర్శించారు. మధ్యలో నృత్యపీఠం, పై కప్పులో పెద్ద పద్మం నల్లరాతితో చెక్కబడి, నునుపు చేసి ఉన్నాయి. లోపలికి గాలి, వెలుతురూ, ధారాళంగా వచ్చేలా, వాస్తు నిర్మాణముంది.

14.4.2 : రామప్ప దేవాలయం

వరంగల్ జిల్లా పాలంపేట లోని 'రామప్ప గుడి' అని, వ్యవహారంలో ఉన్న రుద్రేశ్వరాలయాన్ని, గణపతి దేవుని ప్రసిద్ధ సేనాని రేచెర్ల రుద్రుడు క్రీ.శ. 1213 ప్రాంతంలో నిర్మించినట్లు, అక్కడి శాసనం తెల్పుతోంది. 8 మైళ్ళ విస్తీర్ణంలో ఉన్న రామప్ప చెరువు ప్రక్కనే ఈ ఆలయాన్ని నిర్మించారు. సాధారణంగా, కాకతీయ ఆలయాలన్నీ త్రికూట నిర్మాణాలు. అంటే, ప్రధాన ఆలయం సరసనే, మరో రెండు చిన్న ఆలయాలను నిర్మించడం, లేదా ప్రధానాలయాన్ని మూడు భాగాలుగా విభజించి, ఏక ఖండంగా నిర్మించడం. అయితే, రామప్ప గుడి త్రికూటాలయం కాదు. ఎత్తైన అధిష్ఠానం మీద, నాలుగంతస్థుల విమానంతో, గర్భగృహం, అంతరాళంలో విస్తృత మండపం ఒక ప్రక్క, మిగిలిన మూడు వైపుల ప్రవేశ ద్వారాలతో, ఈ ఆలయం రూపొందింది. 2 మీటర్ల ఎత్తైన చతురస్రాకార పీఠంపై రూపొందిన ఆలయానికి, మూడు మీటర్ల వెడల్పున్న తిన్నె, ప్రదక్షిణ పథంగా ఉంది. ఆలయం లోతట్టునే, బ్రహ్మాండమైన నంది శిల్పం ప్రతిష్ఠించబడింది.

ఆలయం పైకప్పులో చక్కని రామాయణ, భాగవత కథా శిల్పాలను చెక్కారు. లోపలి నాలుగు స్తంభాలు శిల్పాలంకృతమై, నిగనిగ లాడుతున్నాయి. పన్నెండు నాట్యకత్తెల విగ్రహాలు వివిధ భంగిమల్లో ఉన్నాయి. మనిషెత్తున, అతి సున్నితంగా చక్కని అంగ సౌష్ఠవంతో, నర్తకీ భంగిమల్లో మలచబడ్డ ఊతకమ్మలుగా కన్పిస్తున్న సుందర నాసికా విగ్రహాలు, ప్రత్యేకంగా పేర్కొనదగ్గవి. వివిధ భంగిమల్లోని ఈ నగ్న స్త్రీ మూర్తుల విగ్రహాలు, సహజ సౌందర్యంతో, జీవకళ ఉట్టిపడుతూ, మదనికా విగ్రహాలుగా, లేదా నాగినీ విగ్రహాలుగా భ్రమింపజేస్తాయి. నంది విగ్రహం చూసేవారికి ఎటువైపు నుండి చూసినా, అది వారి వైపే చూస్తున్న భ్రాంతిని కల్గిస్తుంది. కాకతీయుల కాలం నాటి ఇతర ఆలయ నిర్మాణాల్లో, ఓరుగల్లు కోట ప్రాంతం లోని ఏకవీర, మండాలమ్మ, నేల శంభువు, వెంకటేశ్వర, రామాలయాలున్నాయి. బహుశా, గణపతి దేవుని కాలం నాటిదైన స్వయంభు శివుని ఆలయ నిర్మాణంలో, ఇవి భాగమై ఉంటాయి. స్వయంభూదేవుడు కాకతీయ చక్రవర్తుల ఆరాధ్య దైవం. ఈ ఆలయానికి నాలుగు వైపులా ఉన్న నాలుగు శిలా నిర్మిత కీర్తి తోరణాలు, సాంచీ స్తూప తోరణాలను గుర్తుకు తెస్తాయి. ఇక్కడే ప్రతాపరుద్రుని ప్రతిమ లోని శిరస్సు భాగం దొరికింది. పానుగల్లు పంచేశ్వరాలయం లోని శివుని, విఘ్నేశ్వరుని శిల్పాలు, ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. కాకతీయ పాలకులు పిల్లలమర్రి, త్రిపురాంతకం, మాచర్ల, కొండపల్లి, నాగులపాడు, అత్తిరాల ఆదిగా గల చోట్ల కూడా, ఆలయాలను నిర్మించారు. వీటిలోని మంటప స్తంభాలు, ద్వారాలు, మంటపాల కప్పులు, గర్భగృహ పార్శ్వాతలాలు, పౌరాణిక కథా శిల్పాలతో, నృత్య ప్రదర్శనలు, దేశ కోలాటాల దృశ్యాలతో, అలంకరించబడ్డాయి.

14.4.3 : మతేతర (లౌకిక) నిర్మాణాలు

మధ్య యుగంలో రాజ్య రక్షణలో దుర్గాల ప్రాముఖ్యం పెరగడంతో, కాకతీయుల కాలంలో దుర్గ నిర్మాణం కూడా విరివిగా జరిగింది. ఓరుగల్లు, రాయచూర్, గోల్కొండ, రాచకొండ, దేవర కొండ, ఇత్యాది దుర్గాలు దీనికి నిదర్శనం. ఓరుగల్లు దుర్గ నిర్మాణం రుద్రదేవుని కాలంలో ఆరంభమైంది.

BRAOU



ఎడమ–నర్తకి; కుడి–అలసాకన్య పొలంపేట

మూడు రక్షణ శ్రేణులతో నిర్మించబడిన ఓరుగల్లు కోట, దుర్భేద్యం. ఇందులో పుట్ట కోట శిథిలాలు ఇప్పుడు కన్పించడం లేదు. దాని తర్వాత ఉన్నది, మట్టి కోట. దీని చుట్టూ కందకం, నాలుగు వైపులా నాలుగు దర్వాజాలున్నాయి. ఈ మట్టి కోట ఎత్తు, 20 అడుగులుండేది. దీనికి ఫర్లాంగు దూరంలో, తిరిగి అగడ్త, రాతి కోట ఉన్నాయి. ఈ రాతి కోటలో 77 బురుజులుండేవని, 'ప్రతాపచరిత్ర' చెబుతోంది. ఈ రాతి కోట లోనే, అనేక రాజ ప్రాసాదాలు, ఆలయాల శిథిలాలు కన్పిస్తున్నాయి. నాలుగు వైపులా శిలా తోరణాలున్నాయి.

14.5 : సంగ్రహంగా

దాదాపు మూడు శతాబ్దాలు విలసిల్లిన కాకతీయుల పరిపాలనలో, తెలుగుతనానికి సమగ్రమైన రూపాన్ని దిద్ది, జాతీయ భావాన్ని సాధించడం జరిగింది. సామంత కాకతీయులు జైనం వైపు మొగ్గు చూపినా, స్వతంత్ర కాకతీయ సార్వభౌములు శైవాన్ని ఎక్కువగా అభిమానించి, ఆదరించారు. అక్కడక్కడా మత సంఘర్షణలకు తావున్నా, మత సామనస్యాన్ని, సర్వసమభావాన్ని పెంచే ప్రయత్నాలు సాగాయి. భాషా సారస్వతోద్యమానికి కొత్త స్ఫూర్తి లభించింది. రాజ భాష సంస్కృతమే అయినా, తెలుగు భాష సర్వతోముఖాభివృద్ధిని సాధించింది. జానుతెనుగులో దేశి కవిత్వోద్యమం ప్రారంభమైంది. కథా కావ్యాలు, శతకాలు, శాస్త్ర గ్రంథాలు, శృంగార రస ప్రధానమైన గ్రంథాలు వెలువడ్డాయి. వాస్తు, శిల్పాలకు పోషణ లభించింది. వేయి స్తంభాల గుడి, రామప్పగుడి వంటి ప్రసిద్ధ వాస్తు నిర్మాణాలు, నేటికీ ఆనాటి వాస్తు, శిల్ప కళలకు, సంగీత, నృత్య కళలకు అద్దం పడుతున్నాయి.

14.6 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. కాకతీయుల కాలం నాటి మత పరిస్థితులను విశ్లేషించండి.
2. భాషాసారస్వతాలు, వాస్తు, శిల్పకళాభివృద్ధికి కాకతీయులొసరించిన సేవ ఎట్టిది?

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. కాకతీయ యుగపు పాశుపత శైవ మతం, గోళకీ మఠ కార్యకలాపాలను పేర్కొనండి.
2. కాకతీయుల కాలం నాటి సంస్కృత సారస్వతాభివృద్ధిని చర్చించండి.
3. కాకతీయుల తెలుగు సారస్వత పోషణను వివరించండి.
4. వేయి స్తంభాల గుడి, రామప్ప దేవాలయాల వాస్తు, శిల్పకళా వైశిష్ట్యాన్ని సమీక్షించండి.

14.7 : ఉపయుక్త గ్రంథాలు

Desai, P.B. : **Basavesvara and His Times**

Parabrahma Sastri, P.V. : **The Kakatiyas**

Yazdani G. (ed.) : **The Early History of the Deccan, Vol. II.**

BRAOU

పరబ్రహ్మశాస్త్రి, పి.వి. : కాకతీయ శాసన సాహిత్యం

ప్రసాదరావ్, చలసాని : కాకతీయ శిల్పం

రామారావ్, మారేమండ (సం) : కాకతీయ సంచిక

సుబ్రహ్మణ్యం. : తెలుగు సంస్కృతి, మొ. సం.
ఆర్. మొ. వారు (సం. లు)

రచయిత : డా. జె. దుర్గాప్రసాద్

BRAOU

భాగం-15 : రెడ్డి, నాయక రాజ్యాలు : రాజకీయ, సాంస్కృతిక కార్యకలాపాలు

విషయక్రమం

15.0 : లక్ష్యాలు

15.1 : పరిచయం

15.2 : ఆంధ్ర దేశంపై ముస్లిం దండయాత్రలు

15.3 : ముస్లింల పరిపాలన - పతితాలు

15.4 : తిరుగుబాట్లా? విముక్తి పోరాటమా?

15.5 : ముసునూరి నాయకులు

15.5.1 : ప్రోలయ (1325-33)

15.5.2 : కాలయ (1333-69)

15.6 : రెడ్డి రాజులు

15.6.1 : ప్రోలయ వేమారెడ్డి (1325-53)

15.6.2 : అనపోతారెడ్డి (1353-64)

15.6.3 : అనవేమారెడ్డి (1364-86)

15.6.4 : కొమరగిరిరెడ్డి (1386-1402)

15.6.5 : పెదకోమటి వేమారెడ్డి (1402-20)

15.6.6 : రాజమహేంద్రవర రెడ్డి రాజ్యం

15.7 : పద్మనాయకులు

15.8 : రెడ్డి-నాయక యుగం నాటి సాంస్కృతిక విశేషాలు

15.9 : సంగ్రహంగా

15.10 : పరీక్ష నమూనా ప్రశ్నలు

15.11 : ఉపయుక్త గ్రంథాలు

BRAOU

15.0 : లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం ద్వారా, ముస్లిం దాడుల ఫలితంగా పతనమైన కాకతీయుల సామ్రాజ్యంపై ముస్లింల సైనిక పరిపాలన ఏర్పడటం; వారి పాలనలో అనేక కష్టనష్టాలకు గురవడం; ఢిల్లీ సామ్రాజ్యం నలు దిక్కులా చెలరేగిన తిరుగుబాట్లలో అంతర్భాగంగా, తెలుగు దేశంలో విభిన్న ప్రాంతాల్లో కూడా అలజడులు రేగి, ముసునూరి, రెడ్డి, పద్మ నాయకులు, స్వతంత్ర రాజ్యాలను స్థాపించి, పరిపాలించడం; ఆ యుగపు రాజకీయ పరిణామాల్ని, సాంస్కృతిక విశేషాలను వివరంగా గ్రహించగల్గాలి.

15.1 : పరిచయం

కాకతీయానంతర యుగాన్ని రెడ్డి-నాయక యుగంగా పేర్కొనొచ్చు. కాకతీయ సామ్రాజ్యం పతనమయ్యాక, ముస్లిం పాలనను ధిక్కరించి, ఆంధ్ర దేశంలో విభిన్న ప్రాంతాలు స్వతంత్ర రాజ్యాలుగా అవతరించాయి. ఓరుగల్లులో ముసునూరి నాయక రాజ్యం, రాచకొండ, దేవరకొండల్లో పద్మనాయక రాజ్యం, తీరాంధ్రంలో రెడ్డి రాజ్యం ఏర్పడగా, రాయలసీమలో అత్యధిక భాగం విజయనగర రాజ్యం తర్వాగమైంది. పశ్చిమోత్తర ఆంధ్ర ప్రాంతం క్రమేణా, బహమనీ రాజ్యంలో చేరింది. దాదాపు ఒక శతాబ్ది కాలం ఈ రెడ్డి-నాయక రాజ్యాలు ఆంధ్రుల చరిత్రలో ప్రాబల్యాన్ని వహించాయి. రాజకీయంగా ఐక్యత లోపించినా, ఈ యుగం చతుర్ధ కులజులది. ఈ శూద్రుల కింద పనిజేయడానికి బ్రాహ్మణులు సంకోచించ లేదు. వర్తకవాణిజ్యాలకు లోటు లేదు. సామాజిక వ్యవస్థను పరిపుష్టం చేయడంలో, ఉత్సవాలు ప్రాముఖ్యతను వహించడం, ఈ యుగంలో చూస్తాం. సాహిత్యం-సంస్కృతాంధ్రాలు రెండూ-సరికొత్త శకం లోకి అడుగు పెట్టడం కన్పిస్తుంది. ఈ యుగ రాజకీయ పరిణామాల్ని, సాంస్కృతిక విశేషాలను సమకాలీన ప్రభువుల శాసనాలు, అపారంగా ఉత్పత్తైన సారస్వత రచనలు తెలియజేస్తున్నాయి.

15.2 : ఆంధ్ర దేశంపై ముస్లిం దండయాత్రలు

దక్షిణ భారతం పైకి దండెత్తాలనే ఆకాంక్ష, మొదట అల్లావుద్దీన్ ఖిల్జీకి కల్గింది. కోరా, మణిక్‌పూర్ గవర్నర్‌గా ఉండగా, ఢిల్లీ సింహాసనాన్ని చేజిక్కించుకోడానికి ధనం కోసం, క్రీ.శ. 1294 లో దేవగిరిపై అతడు దాడి చేశాడు. అపారంగా ధన రాసులను సాధించాడు. వీటిని విరజిమ్మే, ఢిల్లీ సుల్తానయ్యాడు. అనంతరం తన సైనిక బలాన్ని పెంపొందించుకోడానికి, ఉత్తరాపథాన్ని జయించాక, దాక్షిణాత్య రాజ్యాల వైపు దృష్టిని మళ్ళించాడు. ఈ సమయంలో కూడా, ఓరుగల్లు రాజధానిగా తూర్పు దక్కన్‌ను పాలిస్తున్న కాకతీయులు; ద్వారసముద్రం రాజధానిగా పాలిస్తున్న హోయసాలులు; మదుర రాజధానిగా పాలిస్తున్న పాండ్యులు; రాయచూర్ అంతర్వేదిలో ఉన్న కంపిలిదేవుడు, పరస్పర కలహాలతో మునిగి, సమైక్యంగా ముస్లిం దాడులకు ఎదురు నిలవక పోవడం దురదృష్టకరం.

ఆంధ్ర దేశంపై ముస్లింలు మొత్తం ఎనిమిది సార్లు దండెత్తారని 'ప్రతాపచరిత్ర' వంటి స్థానిక చరిత్రలు, విలస, కలువచేరు శాసనాలు చెబుతున్నాయి. అయితే, ముస్లిం చరిత్ర రచనల్లో ఐదు దండయాత్రలు మాత్రమే నమోదయ్యాయి. ఇవన్నీ కాకతీయ ప్రతాపరుద్రుని కాలం లోనే జరిగాయి. వీటిలో మొదటిది, క్రీ.శ. 1303 లో జరిగింది. మాలిక్ ఫక్రుద్దీన్ జునా, జాజుల నాయకత్వంలో ఢిల్లీ సైన్యం బెంగాల్ మీదుగా ఓరుగల్లు పైకి నడచింది. ఈ సైన్యాన్ని కాకతీయ సేనానులు రేచెర్ల

B RAO U

చెన్న, పోతుగంటి మైలి ఓడించి, తరిమేశారు. క్రీ.శ. 1309 లో మాలిక్ కాఫర్, ఖ్వాజా హాజీల ఆధ్వర్యంలో, ఢిల్లీ సైన్యం దేవగిరిలో ఆతిథ్యం తీసుకొని, దారిలో సిర్పూర్ కోటను, తర్వాత హనుమకొండను ఆక్రమించి, ఓరుగల్లును ముట్టడించింది. ఒక మాసం పైగా సాగిన ముట్టడిలో, పౌరులు అనేక కష్టనష్టాలకు గురైనారు. మట్టి కోట నాక్రమించిన శత్రు సైన్యం రాతి కోటపై బడింది. చుట్టుప్రక్కల గ్రామాలను తగులబెట్టారు. గత్యంతరం లేక, ప్రతాపరుద్రుడు అపారంగా ధనమిచ్చి, ప్రతి సంవత్సరం ఢిల్లీకి కప్పం చెల్లించడానికి అంగీకరించి, కాఫర్‌తో సంధి చేసుకున్నాడు. క్రీ.శ. 1316 లో అల్లావుద్దీన్ మరణించడంతో, ప్రతాపరుద్రుడు ఢిల్లీకి కప్పం చెల్లించడం మానేశాడు. దినితో, ముబారక్ ఖిల్జీ, ఖుస్రూఖాన్‌ను ఓరుగల్లు పైకి సైన్యంతో దాడికి పంపాడు.

ప్రతాపుడు బకాయిలను చెల్లించి, మళ్ళీ సంధిచేసుకొన్నట్లు అమీర్ ఖుస్రూ, ఇసామీల రచనలు తెలియజేస్తున్నాయి. క్రీ.శ. 1320 లో ఢిల్లీ లో తుగ్లక్ వంశం అధికారం లోకి వచ్చిన సమయంలో నెలకొన్న రాజకీయ సంక్షోభాన్ని అవకాశంగా తీసుకొని, ప్రతాపరుద్రుడు కప్పం చెల్లించడం ఆపేశాడు. దినితో, సుల్తాన్ ఘియాజుద్దీన్ సైన్యంతో తన కుమారుడైన జునాఖాన్‌ను క్రీ.శ. 1321-22లో, ఓరుగల్లు పైకి దాడికి పంపాడు. ముట్టడి ఆరు మాసాలు కొనసాగింది. విజయం వరించే సమయంలో, ఢిల్లీ సుల్తాన్ మరణించాడనే పీలి వార్త వ్యాపించి, ముస్లిం సైన్యంలో కల్లోలం రేగింది. జూనాఖాన్ (మహమ్మద్‌బిన్ తుగ్లక్) ముట్టడిని విరమించుకొని, వెనుదిరగాల్సొచ్చింది. దేవగిరి చేరిన జూనా, ఢిల్లీ నుండి అదనపు బలగాలు రావడంతో, మళ్ళీ క్రీ.శ.1323లో ఓరుగల్లుపై దండెత్తాడు. బీదర్, బోధన్ దుర్గాల నాక్రమించి, ఓరుగల్లును ముట్టడించాడు. ఈ ముట్టడి ఐదు నెలలు కొనసాగింది. సంస్కరణకు పోచుకోని యుద్ధ నిర్వహణా విధానం, సైన్యంలో వర్ణ వ్యత్యాసాల వల్ల నెలకొన్న అనైక్యత వంటి ప్రతికూల పరిస్థితుల్లో, ప్రతాపరుద్రుడు ఓడిపోయి, జూనాఖాన్‌కు బందీగా ఢిల్లీకి కొనిపోబడుతూ, మార్గ మధ్యంలో నర్మదా నదీ తీరాన మరణించాడు. కాకతీయ సామ్రాజ్య మంతరించింది.

15.3 : ముస్లింల పరిపాలన - ఫలితాలు

క్రీ.శ. 1323 లో ఓరుగల్లును ఆక్రమించిన జూనాఖాన్ సేనలు క్రమంగా తెలుగు దేశాన్ని ఆవరించాయి. ఆరు మాసాల ముట్టడి అనంతరం కొండపల్లి ఢిల్లీ సేనల వశమైంది. తూర్పు తీరంలో ఉన్న కొలమపీడు, నిరవద్యపురం, (నిడదవోలు), రాజమహేంద్రవరం, కొండపీడు, నెల్లూర్ కోటలను తక్కువ కాలం లోనే ముస్లిం సేనలు ఆక్రమించుకొన్నాయి. క్రీ.శ. 1323 లోనే నెల్లూర్ నుండి క్విలన్ వరకు విస్తరించిన మాబార్ దేశం కూడా జయించబడింది. మదుర ప్రాంతమూ వశమైంది. ఒరిస్సాలో జాజ్‌నగర్ మినహా, వింధ్య పర్వతాలకు దక్షిణంగా ఉన్న ప్రాంతాలన్నీ, తుగ్లక్ సామ్రాజ్యంలో అంతర్భాగమయ్యాయి.

ఒక సంవత్సర కాలం లోనే జూనాఖాన్ ఆంధ్ర దేశాన్నంతా జయించాడని స్పష్టమౌతుంది. క్రీ.శ. 1324 నాటి ఘియాజుద్దీన్ శాసనం, రాజమండ్రి పెద్ద మసీదులో వుంది. ఏలూర్ దగ్గరలో అతనివే నాణేలు దొరికాయి. అబ్దుల్లా వాసఫ్ రచనను బట్టి, మాబార్ క్రీ.శ. 1323 లోనే ఢిల్లీ అధీనం లోకి వచ్చింది. మదుర, తెలంగాణాలు ఢిల్లీ సామ్రాజ్యంలో రెండు రాష్ట్రాలయ్యాయి. ఆంధ్ర దేశాన్ని ఒక క్రమ పద్ధతి లోకి తెచ్చి, పరిపాలనను కట్టుదిట్టం చేయడానికి, జూనాఖాన్ కొరత కాలం ఇక్కడే ఉన్నాడు. ఓరుగల్లుకు, సుల్తాన్‌పూర్ అనే పేరు పెట్టి, కీలక కేంద్రాల్లో ముస్లిం సేనల్ని నిలిపాడు. పరిపాలన కోసం అమీర్లు, మాలిక్‌లను నియమించాడు. తెలుగు దేశమంతా దౌలతాబాద్

BRAOU

(దేవగిరి) వజీరైన మాలిక్ బుర్హానుద్దీన్ అధికారంలో ఉంచబడింది. ఈ వజీర్‌కు సాయంగా, ఓరుగల్లు లో మాలిక్ మక్బూల్ నాయబ్ అనే మరో అధికారి నియమించబడ్డాడు. షమ్స్-యి-సిరాజ్ అఫీఫ్ రచనను బట్టి, ప్రతాపరుద్రుని సేనాని కన్ను అనే అతడు, జూనాఖాన్ మన్ననా పొంది, ఇస్లాం మతాన్ని స్వీకరించి, తెలంగాణా పాలకుడయ్యాడని తెలుస్తున్నది. ప్రతాపరుద్రుని సేనాని, కటక్ పాలకుడైన నాగయగన్న మంత్రే కన్ను అనీ, అతడే ఓరుగల్లు వజీరైన మాలిక్ మక్బూలని చరిత్రకారుల భావన. మొత్తం మీద ఆంధ్ర దేశంలో ముస్లింల సైనిక పరిపాలన ఏర్పడింది.

ముస్లిం సైనికాధికారుల పాలనలో ప్రజలు అనేక కష్టనష్టాలకు గురయ్యారు. అనేక బాధల ననుభవించారు. అప్పటి దుస్థితిని విలస తామ్ర శాసనం ఈ క్రింది విధంగా వర్ణించింది: "అసహజమైన, అక్రమమైన, దుర్భరమైన పన్ను లెన్నో వేసి, పీడించడం సాగించారు; గ్రామాలకు గ్రామాలనే దోచారు; నిర్దోషుల నెందరినో చంపారు. స్త్రీలను చెరబట్టారు; ఎన్నో ఇళ్ళను భస్మీపటలం చేశారు; అనేక ఆలయాలను, దేవతా విగ్రహాలను ముక్కలు ముక్కలుగా చేసి, అగ్రహారాలను కొల్లగొట్టి, బ్రాహ్మణులను హింసించారు; ఆ మహా విపత్కాలంలో ప్రజలకు ఏదైనా తమది అనే భావమే అంతరించింది. కల్లు తాగడం, రైతులకు జీవనాధారమైన గోవుల్ని చంపడం, బ్రాహ్మణులను తుద ముట్టించడం, ముస్లిం పాలకుల ప్రధాన వృత్తి అయింది". గంగాదేవి రాసిన 'మధురా విజయం' లోను, ముస్లింల పాలనలో దేశ స్థితి ఈ విధంగానే వర్ణించబడింది. అంతకుముందుకంటే పన్నులను అనేక రెట్లు సుల్తాన్ పెంచడంతో, పలు రైతు కుటుంబాలు నాశనమైనాయనీ, బీద రైతులు దరిద్రంతో బిచ్చగాళ్ళయ్యారనీ, ధనికులు అగ్రహంతో తిరుగుబాటు సేనలో చేరడంతో, గ్రామాల్లోని భూములు బీడువడి, వ్యవసాయం పూర్తిగా సన్నగిల్లిందనీ, జియావుద్దీన్ బరనీ గంగా-యమున అంతర్వేది ప్రజల ఇబ్బందుల గురించి చేసిన వర్ణన, ఎంతో కొంత ఈ ప్రాంతానికీ వర్తిస్తుంది. చాళుక్యుల, కాకతీయుల కాలం నాటి అనేక ఆలయాలను, దేవతా విగ్రహాలను ధ్వంసం చేశారని చెప్పడానికి, సాక్ష్యాలు కన్పిస్తున్నాయి. రాజమండ్రి లోని పెద్ద మసీదు, ఏలూర్, కొండపల్లి, బిక్కవోలు మసీదులు, ఆ విధంగా ఆలయాలను పడగొట్టి నిర్మించినవే.

ఆంధ్ర దేశంలో పరిస్థితు లీవిధంగా ఉంటే, ఢిల్లీ సామ్రాజ్యం తక్కిన భాగాల్లో మరింత అధ్వాన్న స్థితి నెలకొనుంది. క్రీ.శ. 1325 లో తండ్రిని కుట్రతో చంపి, జూనాఖాన్ మహమ్మద్ బీన్ తుగ్లక్ పేరుతో సుల్తానయ్యాక, పరిపాలనలో అనేక ప్రయోగాలను చేశాడు. ఆదర్శప్రాయమే అయినా, ఆచరణ యోగ్యం కాని విధానాలను ప్రజాభిప్రాయంతో నిమిత్తం లేకుండా, అమలు చేయాలని ప్రయత్నించి, విఫలుడయ్యాడు. దీనితో, ప్రజల్లో ఆందోళన ప్రబలింది. సామ్రాజ్యం నలు వైపులా తిరుగుబాట్లు చెలరేగాయి. సనాతన ముస్లింలూ మహమ్మద్ బీన్ తుగ్లక్ మత సహన విధానాన్ని నిరసించి, ఎదురు తిరిగారు. అనేక రాష్ట్రాల పాలకులు అతని అధికారాన్ని ధిక్కరించారు.

15.4 : తిరుగుబాట్లా? విముక్తి పోరాటమా?

ఇటువంటి పరిస్థితుల్లో ఆంధ్ర దేశం లోని వివిధ ప్రాంతాల్లో కూడా, స్వతంత్ర రాజ్య స్థాపనకు తిరుగుబాట్లు చెలరేగాయి. వీటిని విముక్తి పోరాటంగా, సంఘటిత ప్రజోద్యమంగా, మల్లంపల్లి సోమశేఖర శర్మ వంటి చరిత్రకారులు, భారత స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో అభివర్ణించారు. ఇది కొంత అనౌచిత్యమన్పిస్తుంది. అధికార వ్యామోహం, పదవీ దాహం, మానవ నైజమని చెప్పాలి.

BRAOU

కాకతీయ సామ్రాజ్యం పతనమయ్యాక, దర్బారంగా ఢిల్లీలో ఉన్న సుల్తాన్ తన ప్రతినిధి ద్వారా ఈ ప్రాంతాలపై ఎక్కువ కాలం అధికారాన్ని చెలాయించడం సాధ్యం కాదని గుర్తించిన స్థానిక సామంతులు, దండనాయకులు, సుల్తాన్ పరిపాలనలో దుస్థితిని అనుభవిస్తున్న ప్రజల అసంతృప్తిని అవకాశంగా తీసుకున్నారంటే తప్పేముంది? హిందూ మత స్ఫూర్తితో ఈ నాయకులంతా ఉద్యమించారనడం కూడా, హేతు బద్ధంగా లేదు. అదే నిజమైతే, మదుర ప్రతినిధి జలాలుద్దీన్, గుల్బర్గా ప్రాంతంలో అల్లావుద్దీన్ హసన్ గంగూలు, తుగ్లక్ అధికారాన్ని ధిక్కరించి, స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకోవడంలో, మరి ఈ మతమనే కొలబద్దను చరిత్రకారు లేవిదంగా అన్వయించగలరు? తిరుగుబాటుచేసిన వారిలో సంఘటిత ప్రతిఘటన కాని, సమైక్య నాయకత్వం కాని కన్పిస్తే గదా, వారిని స్వాతంత్ర్య యోధులుగా కీర్తించాలి! మరి అటువంటిదేమీ కన్పించదే! కనుకనే, ఆంధ్ర దేశంలో, లేదా దక్షిణ భారతంలో ఢిల్లీ అధికారానికి వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాట్లకు, హిందూ మత, సంస్కృతుల రక్షణకు సాగిన సంఘటిత ప్రజోద్యమంగా, విముక్తి పోరాటంగా ముసుగు తొడగడం, అసమంజసమని చెప్పాలి. రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర అధికారంపై తిరుగుబాటు చేయడం, అంతకు ముందు చాళుక్య, కాకతీయ యుగాల్లోనూ జరిగింది. ఇదే విధంగా, మహమ్మద్ బీన్ తుగ్లక్ కాలం లోనూ కన్పిస్తున్నది. అతడు సింహాస మధిష్ఠించిన మరుసటి సంవత్సరమే, అతని మేనత్త కొడుకు, సాగర్ రాష్ట్ర పాలకుడైన బహాఉద్దిన్ గుస్తాస్ప్ తిరుగుబాటుతో మొదలైన పరంపర, గుజరాత్, సింధుల్లో తిరుగుబాట్లను అణచివేసే ప్రయత్నంలో సుల్తాన్ మరణించే వరకు, కొనసాగింది. ఈ దేశ వ్యాప్తమైన తిరుగుబాట్లలో భాగం గానే, ఆంధ్ర దేశంలో వృద్ధి కాకతీయ నాయకులిచ్చిన స్ఫూర్తితో, కొత్త తరం నాయకులు ఢిల్లీ సుల్తాన్ పరోక్ష పాలనకు స్వస్తి పలికి, విభిన్న ప్రాంతాల్లో స్వతంత్ర రాజ్యాలను స్థాపించారు. రేకపల్లి కేంద్రంగా, ఉత్తర తీరాంధ్రంలో ముసునూరి నాయకులు ప్రోలయ, కాపయలు; దక్షిణ తెలంగాణంలో రేచర్ల సింగముడు; అద్దంకి (ఆ తర్వాత కొండవీడు) కేంద్రంగా, ప్రోలయ వేమారెడ్డి; రాయలసీమలో ఆరవీటి సోమదేవరాజు; ఏఱువ నాయకుడు తెలుగు చోడ భక్త రాజు; ఆనెగొంది కేంద్రంగా, బళ్ళారి జిల్లాలో సంగమ సోదరులు, హరిహర బుక్కలు; సుల్తాన్ అధికారాన్ని ధిక్కరించి, స్వతంత్ర రాజ్యాలను స్థాపించినారే. ఈ తిరుగుబాట్లన్నీ ఒక్కమ్మడిగా ఏక కాలంలో జరుగలేదు. ఈ నాయకులందరూ పరస్పర అవగాహనతో వ్యవహరించినట్లు, నిదర్శనాలూ లేవు. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన ఇంకో విషయమేమంటే, కులానికో స్వతంత్ర రాజ్య మేర్పడటం. ముసునూరి నాయకులు కమ్మవారు; రేచర్ల నాయకులు వెలమలు; ఏఱువ చోడులు కాపులు; కొండవీటి నాయకులు రెడ్లు; సంగమ సోదరులు యాదవులు. వీరంతా శూద్రులే. రాజ్యకారంతో క్షత్ర ధర్మాన్ని నిర్వర్తించినా, క్షత్రియులమని గట్టిగా చెప్పుకున్నారు, విజయనగర పాలకులు మినహా, మిగిలిన వారెవ్వరూ లేరు. వీరి మధ్య సంబంధ బాంధవ్యాలూ అంతంత మాత్రమే. పరస్పర అవగాహన లేదనే విషయాన్ని, ఆ తర్వాతి చారిత్రక సంఘటనలే నిరూపిస్తున్నాయి. క్రీ.శ. 12, 13 శతాబ్దాల్లో ఆర్థిక సంఘర్షణ ప్రాతిపదికగా జరిగిన మతోద్యమాలు, సామాజిక పరిణామాల్లో భాగం గానే, క్రీ.శ.14వ శతాబ్దపు ఈ పరిణామాన్ని పరిగణించాలి. వంశ నామాలు పోయి, కుల రాజ్యాలు అవతరించడం, మొదట్లో ఈ విభిన్న వర్గాల మధ్య నున్న సంబంధ బాంధవ్యాలు 14 వ శతాబ్దంలో కనుమరుగవడం, సామాజిక పరిణామంలో ప్రాముఖ్యం వహించిన విషయమనే చెప్పాలి. ఈ నాడు ఏ వర్గాని కావర్గమే తమ గొప్ప తనాన్ని వర్ణించుకొన్నా, ఈ వ్యవసాయదారుల కులాలన్నిటికీ మూలం ఒక్కటే అనేది, అందరూ గుర్తుంచుకోవాల్సిన విషయం.

BRAOU

15.5 : ముసునూరి నాయకులు

ఢిల్లీ సుల్తాన్ మహమ్మద్ బీన్ తుగ్లక్ పాలన నుండి ఉత్తర తీరాంధ్రాన్ని, ఉత్తర తెలంగాణాను విముక్తం చేసిన ముసునూరి నాయకుల చరిత్రకు, ప్రోలయ విలస తామ్ర శాసనం, కాపయ పోలవరం శాసనాలు ప్రధాన ఆధారం. చోడ భక్తిరాజు పెంటపాడు శాసనం, రాజమహేంద్రవరం రెడ్డి రాజు వీరభద్రా రెడ్డి రాణి అనితల్లి కలువచేరు శాసనం, ముసునూరి నాయకుల్ని ప్రస్తావించాయి. అయితే, వీరి సమగ్రమైన చరిత్రకు ఈ ఆధారాలు సరిపోవడం లేదు. కృష్ణా జిల్లాలో ఉయ్యూరు సమీపం లోని ముసునూరు గ్రామం, ఈ కుటుంబీకుల తొలి నివాసంగా కన్పిస్తున్నది. పెలనాటి చోడులు తీరాంధ్రంలో అధిపత్యం చెలాయించిన కాలంలో, వారి సామంతులైన దివిసీమ పాలకులు అయ్య వంశీయులకు, ఈ ముసునూరి వారు అనుయాయులు. వీరు ప్రాయికంగా కమ్మ కర్షక కుటుంబీకులు. అయ్య వంశంతో వియ్యమందిన కాకతీయ చక్రవర్తి గణపతి దేవుడు, ఆ వంశీయుడైన జాయపుడ్ని తన కొలువులోకి చేర్చుకోవడంతో, ముసునూరి వారూ కాకతీయుల్ని సేవించుండొచ్చు.

15.5.1 : ప్రోలయ (1325-33)

ముసునూరి ప్రోలయ తండ్రి పోచి నాయకుడు, వేంగి వాసి. తన ముగ్గురు తమ్ముళ్ళతో అతడు కాకతి ప్రతాపరుద్రుణ్ణి సేవించాడు. ప్రోలయ తమ్ముడు, ఎరపోత నాయకుడు. కాపానేడు (కాపయ నాయకుడు), ముమ్మడి నాయకుడు, దేవనాయకుడు, అనపోత నాయకుడు, ప్రోలయ పిన తండ్రుల సంతానం. వీరందరూ తండ్రుల కాలం లోనే కాకతీయ సైన్యంలో శిక్షణ పొందారు. ప్రోలయకు ఈ సోదరులంతా చేదోడువాదోడయ్యారు. వీరిలో కాపయ ఆతని కుడి భుజం. కాకతి రుద్రమదేవి అల్లుడైన ఇందులూరి (బెండపూడి) అన్నమంత్రికి, ఈ ముసునూరి సోదరులంతా నమ్మినబంట్లు.

ప్రోలయ నాయకుడు ఓరుగల్లు పతనం వెమ్మట, ముస్లిం లాక్రమించిన ఆంధ్ర దేశంలో ప్రబలిన అసంతృప్తిని అవకాశంగా తీసుకొని, వృద్ధ కాకతి సేనానులు ఇందులూరి అన్న మంత్రి, కొలని రుద్రదేవుల ప్రోత్సాహస్ఫూర్తితో, భద్రాచల ప్రాంత మన్య భూముల్లోని గిరివన దుర్గాలను స్థావరంగా చేసుకొని, ముస్లింలతో తలపడ్డాడు. ఈ పోరాటంలో అతనికి సోదరుల అండతోబాటు, వేంగి పాలకుడైన వేంగ భూపతి తోడ్పాటు లభించింది. ముస్లింలను పారదోలి, రేకపల్లి కేంద్రంగా స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. ఇదే సమయంలో, దక్షిణ తీరంలో ప్రోలయ వేమారెడ్డి అద్దంకి రాజధానిగా, స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. క్రీ.శ. 1325-26 మధ్య కాలంలో ఈ విజయాలు లభించాయి. క్రీ.శ. 1326 అనంతరం తుగ్లక్ నాణేలు ఆంధ్ర దేశంలో లభించక పోవడం, ఈ విషయాన్ని నిర్ధారిస్తున్నది.

ప్రోలయ సాధించిన ఘన కార్యాలను అతడే ప్రకటించిన దాన శాసనం, విలస తామ్ర శాసనం పేర్కొన్నది. ముస్లింల దాడుల్లో నష్టమైన అగ్రహారాలతో బాటు, వైదిక ధర్మాన్ని అతడు పునరుద్ధరించాడు. మునులు తమ తపః ఫలంలో ఆరవ భాగాన్ని రాజుకిచ్చినట్లే, రైతులు తమ పంటలో ఆరవ భాగాన్ని సంతోషంగా ప్రోలయ కిచ్చేవారు. ప్రోలయ ఆదరణ కారణంగా అనేక బ్రాహ్మణ కుటుంబాలు. మల్లంపల్లి, అరిపిరాల, దేవులపల్లి మొదలైనచోట్ల స్థిరపడ్డాయి.

15.5.2 : కాపయ (1333-69)

ప్రోలయకు సంతానం లేదు. అతని తమ్ముడు ఎరపోతా నాయకుడు ముస్లింలతో జరిగిన యుద్ధాల్లో బహుశ మరణించుండొచ్చు. ఈ కారణంగా, ప్రోలయ అనంతరం, అతని పినతండ్రి దేవనాయకుని

BRAOU

కొడుకు కాపయ, రేకపల్లి సింహాసన మధిష్ఠించాడు. తెలంగ్గాణా నుండి ముస్లింలను తరిమివేసే లక్ష్యాన్ని ఇతడు సాధించాడు. ముస్లిం చరిత్రకారులు ఇతణ్ణి కన్యానాయిక్, కృష్ణనాయిక్, కన్యాపాయిక్, కనాబాయర్డ్ అనే పేర్లతో వ్యవహరించారు. కాపయకు కాపానాయన్డు, కాపానీడు అనే పేర్లు కూడా స్థానిక రచనల్లో కన్పిస్తున్నాయి. భావ ప్రభావోదయుడని, ప్రతాపరుద్ర ప్రతిమా ప్రభావుడని, కాశీవిశ్వపతి ప్రసాద మహిమా ప్రాప్తాఖిల ప్రాభవుడని శాసనాలితణ్ణి కీర్తిస్తున్నాయి.

సాగర్ గవర్నర్ జహాఉద్దీన్ గుస్తాస్ప్ క్రీ.శ. 1326-27లో ఢిల్లీ సుల్తాన్‌పై చేసిన తిరుగుబాటు విఫలమైంది. గుస్తాస్ప్‌కు కంపిలిదేవుడు ఆశ్రయ మిచ్చాడు. అయితే, చివరకు క్రీ.శ. 1328 లో సుల్తాన్ కంపిలి రాజ్యాన్ని ఢిల్లీ సామ్రాజ్యంలో భాగంగా చేశాడు. కంపిలిదేవుడు యుద్ధంలో మరణించాడు. అతని కుమారులు, ఉద్యోగులు బందీలుగా ఢిల్లీకి తరలింపబడ్డారు. వీరిలో కొందరు ఇస్లాం మతాన్ని స్వీకరించారు. విజయనగర రాజ్య స్థాపకులైన హరిహర బుక్కలూ, వీరిలో ఉన్నారు. ఆశ్రయం కోసం, ద్వారసముద్ర మొచ్చిన గుస్తాస్ప్‌ను, హోయసాల మూడో బల్లాలుడు సుల్తాన్ కప్పగించాడు. మహమ్మద్‌బీన్ తుగ్లక్ ఢిల్లీకి మరలాక, రాయలసీమలో ఆరవీటి సోమదేవరాజు సుల్తాన్ విధేయుల్ని గంగినేనికొండ దగ్గర ఓడించి, ముసలిమడుగు, సాతానికోట, కందనవోలు, కల్వకొండ, రాచూరు, వీతగిరి మొదలైన కోటల్ని ఆక్రమించాడు. ఆనెగొంది లోని సుల్తాన్ ప్రతినిధి శరణు కోరి, ప్రాణం దక్కించుకున్నాడు. ఈ వరస తిరుగుబాట్లలో హోయసాల బల్లాలుడూ ఢిల్లీకి కప్పం కట్టడం మాని, స్వతంత్రాన్ని ప్రకటించుకొన్నాడు. దక్షిణ భారతంలో ఈ తిరుగుబాట్లన్నీ బల్లాలునితో చేతులు కలిపి, కాపయ రూపొందించిన సుసంఘటిత ప్రణాళిక ప్రకారం జరిగాయని, పెరిష్టా కథనం. కాని, దీనికి ధృవీకరణ సాక్ష్యం కన్పించదు.

ఈ పరిస్థితుల్లో కంపిలి తిరుగుబాటు అణచి, బల్లాలుణ్ణుండి కప్పం రాబట్టడానికి, స్థానికుల్నే సైన్యంతో పంపిస్తే మంచిదని, హరిహర, బుక్క సోదరుల్ని నసైన్యంగా పంపించాడు. ఈ సంగమ సోదరులకు ఆనెగొంది వశం కాలేదు. ఢిల్లీ సేనల అపజయాలను అవకాశంగా తీసుకొని, మాబార్ నవాబ్ జలాలుద్దీన్ హసన్ క్రీ.శ. 1334 - 35 లో సుల్తాన్‌ను దిక్కరించి, తన పేరుతో నాణేలను ముద్రించి, మదురలో స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొన్నాడు. హసన్‌ను శిక్షించడానికి సుల్తాన్ సైన్యంతో ఓరుగల్లు వరకు వచ్చినా, అక్కడ ప్లేగు వ్యాధి వ్యాపించడంతో, గత్యంతరం లేక, వెనుదిరిగి పోయాడు. ఇదే అదనుగా, కాపయ అకస్మిక దాడిలో ఓరుగల్లు కోటను వశపర్చుకొన్నాడు. స్థానిక ముస్లిం గవర్నర్ పారిపోయాడు. ఈ విధంగా ఓరుగల్లు కోట బురుజులపై మళ్ళీ ఆంధ్ర పతాకం క్రీ.శ. 1336లో ఎగిరింది. 'ఆంధ్ర సురత్రాణ', 'ఆంధ్రదేశాధీశ్వర' బిరుదులతో, కాపయ నాయకుడు ఓరుగల్లు రాజధానిగా తీరాంధ్రం, తెలంగాణా ప్రాంతాలపై ఆధిపత్యాన్నొహించాడు. ఇదే సమయంలో గుత్తి కేంద్రంగా, సంగమ సోదరులు ఆనెగొందిలో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించారు.

ఆంధ్ర దేశాధీశ్వరుడైన పిదప, కాపయ ఓరుగల్లు కోటను బలపర్చి, కట్టుదిట్టమైన పరిపాలన నేర్పర్చడానికి ప్రయత్నించాడు. తనతో సహకరిస్తూ వస్తున్న విధేయులైన అనుయాయుల్ని, బంధువుల్ని రాజ్యం వివిధ ప్రాంతాల్లో రాజప్రతినిధులుగా నియమించాడు. పిన తండ్రి కొడుకు అనవోత నాయకుడు మధ్యాంధ్రానికి అధిపతయ్యాడు. గోదావరి దక్షిణ తీరంలో సబ్బినాటికి (ఆదిలాబాద్ జిల్లా భాగం), గురిజాల తెలుంగు నృపుని కొడుకు ముప్ప, రాజప్రతినిధి. కొప్పుల నాయకులు పిఠాపురం పరిసర ప్రాంతాల్ని పాలించారు. కొత్తగా నిర్మించిన కోరుకొండ దుర్గంలో, కూనయ నాయకుడు రాజప్రతినిధి. ఈ కూనయ కొడుకు ముప్పిడి నాయకునికి, కాపయ తన మేనకోడల్నిచ్చి పెళ్ళి చేశాడు.

BRAOU

దక్కన్ ముస్లిం సేనానులు జాఫర్ ఖాన్, (హసన్ గంగూ) ఆధ్వర్యంలో క్రీ.శ. 1347లో సుల్తాన్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినప్పుడు, ఒక స్వతంత్ర మిత్ర రాజ్యం పొరుగున ఉంటే, భవిష్యత్తులో ఢిల్లీ నుండి తనకే ప్రమాదముండదని పొరపాటుగా భావించిన కాపయ, కొంత సైన్యాన్ని వారికి సహాయంగా పంపాడు. ఈ విషయం ఫెరిష్టా రచన నుండి తెలుస్తున్నది. అయితే, అవసరం తీరాక, బహమనీ సుల్తాన్ అల్లాఉద్దీన్ బహమన్‌షా (హసన్‌గంగూ) తెలంగాణా పైకి దాడులను పంపాడు. క్రీ.శ. 1350లో బహమనీ సేనాని సికిందర్ ఖాన్ చేసిన దాడిలో ఓడిన కాపయ, కౌలాస్ (నిజామాబాద్ జిల్లా) కోటను, పరిసర భూములిచ్చి, సంధి చేసుకొన్నాడు. అయితే, కప్పం కట్టడానికి నిరాకరించాడనే నెపంతో, బహమనీ సేనలు మళ్ళీ క్రీ.శ. 1356లో ఓరుగల్లుపై పడ్డాయి. ఈ దండయాత్ర కృష్ణా తీరం లోని ధాన్యకటకం వరకూ సాగింది. మళ్ళీ పరాజితుడైన కాపయ, కప్పం చెల్లించడానికి అంగీకరించి, భువనగిరి దుర్గాన్ని కూడా అర్పించాడు.

అల్లాఉద్దీన్ బహమన్‌షా తర్వాత సింహాసనాసీనుడైన మొదటి మహమ్మద్‌షా, కౌలాస్ ప్రాంతాల్ని తిరిగి స్వాధీనం చేసుకోడానికి చేసిన ప్రయత్నాలను వమ్ము చేశాడు. బహమనీ సుల్తాన్ దాడుల్ని ఎదుర్కోడానికి, కాపయ కొడుకు వినాయక దేవుడు ప్రయత్నించాడు. ఇతనికి సహాయంగా, ఇరవై వేల విజయనగర అశ్విక సైన్య మొచ్చింది. అయినా, వినాయక దేవుడు ఓడిపోయి, వేలుంపుట్టన్ కోటలో తలదాచుకొన్నాడు. క్రీ.శ. 1362 లో అరబ్బు పత్రకుల ఫిర్యాదులపై బహమనీ సుల్తాన్ వేలుంపుట్టన్‌ను స్వాధీనపర్చుకొని, వినాయక దేవుణ్ణి చిత్రహింస చేసి, సజీవంగా దహనం చేయించాడు. ఈ దౌర్జన్యకాండను భరించలేక, కాపయ ఢిల్లీ సుల్తాన్ ఫిరోజ్ షా సహాయాన్ని కోరడంతో, మరింత కోపోద్రిక్తుడైన బహమనీ సుల్తాన్, సేనల్ని గోల్కొండ, ఓరుగల్లు పైకి నడిపాడు. మరోసారి పరాజయం పాలైన కాపయ, గోల్కొండతోబాటు అపార ధనరాసుల్నిచ్చి, గుల్బర్గాతో సంధి చేసుకొన్నాడు. గోల్కొండే రెండు రాజ్యాలకూ సరిహద్దు అయింది.

బహమనీ దాడుల్లో పరాజయాల పాలవడంతో, కాపయ గౌరవ ప్రతిష్ఠలు దెబ్బతిన్నాయి. దీనితో, సామంతులు అతని అధికారాన్ని ధిక్కరించి, స్వతంత్రులవడానికి ప్రయత్నించారు. క్రీ.శ. 1353 లో ఏరువ చోడభక్తిరాజు, తొయ్యేటి అనవోతుని మరణానికి కారకుడయ్యాడు. ఈ భక్తిరాజుకు, మధ్యాంధ్రంపై కన్నువేసిన రెడ్డి ప్రభువులు తోడ్పడ్డారు. పిఠాపురంలో కొప్పుల నాయకులు స్వతంత్రించారు. కాపయకు బంధువైన కోరుకొండ పాలకుడు, మంచికొండ ముప్పిడి నాయకుడు గోదావరి ఉభయ తీర ప్రాంతాలను జయించి, స్వతంత్రించాడు. అయితే, కొండవీటి అనవోతారెడ్డి దండయాత్రతో, తీరాంధ్రం మొత్తం రెడ్ల అధీనమైంది. మంచికొండ వారు రెడ్డి రాజులకు సామంతులయ్యారు. ఇదే కాలంలో, ఆమనగల్లులో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించుకొన్న రేచర్ల సింగమనాయకుడు, కృష్ణా-తుంగభద్ర అంతర్వేది ప్రాంతాన్ని (మహబూబ్‌నగర్ జిల్లా) స్వాధీనం చేసుకొన్నాడు. పిల్లలమర్రి ప్రాంతాన్ని, చివరకు కాపయ నుండీ, చేజిక్కించుకొన్నాడు. కాని, జల్లిపల్లి క్షత్రియుల చేతిలో, మోసపూరితంగా సింగముడు మరణించడంతో, రేచర్ల సింహాసన మధిష్ఠించిన సింగముని కొడుకు అనపోతా నాయడు, రాజకొండకు రాజధానిని మార్చి, జల్లిపల్లి క్షత్రియుల్ని వధించి, ప్రతీకారాన్ని తీర్చుకొన్నాడు. అనంతరం, బహమనీల ప్రోత్సాహంతో రాచకొండ నుండి సైన్యంతో వెళ్ళి, ఓరుగల్లు సమీపం లోని భీమవరం వద్ద, క్రీ.శ. 1369లో జరిగిన యుద్ధంలో, కాపయ నాయకుణ్ణి నేల కూల్చాడు. దీనితో, ముసునూరి వంశ మంతరించింది.

BRAOU

15.6 : రెడ్డి రాజులు

కాకతీయుల అనంతరం ఆంధ్ర దేశంలో ముస్లింల నిరంకుశ దుష్పరిపాలనతో ప్రజల్లో చోటుచేసుకున్న అసంతృప్తిని అవకాశంగా తీసుకొని, ముస్లింలను తరిమివేసి, తీరాంధ్రంలో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించిన మరో వర్గం, రెడ్డి రాజులు. వీరు పంట వంశీయులు. పంటరాష్ట్ర వాసులైనందువల్ల, పంట రెడ్లుగా కూడా వ్యవహారంలోకి వచ్చింది. పాకనాడు భాగాలైన గూడూరు, ముట్టింబాక (నెల్లూరు జిల్లా) ప్రాంతాలే, పూర్వపు పంట రాష్ట్రం. అయితే, క్రమంగా వీరు ఇతర ప్రాంతాలకు విస్తరించడంతో, ఆయా నివాస ప్రాంతాలను బట్టి, మోటాడు, వెలనాడు, మొరస, భూమంచి, దేసటి మొదలైన శాఖలుగా విడిపోయినట్లు కన్పిస్తోంది. రెడ్డి రాజులది దేసటి కులం. పంట-దేసటి శబ్దాలు అధికార ప్రాదేశిక సూచకాలనేది స్పష్టం. వీరిది పంటదేసటి మహోన్నయమని, శ్రీనాథ కవిసార్వభౌముడు చెప్పాడు. ఎఱ్ఱన తన ప్రభువు ప్రోలయ వేమారెడ్డిని దేసటి వంశ గ్రామణి యని, పంట వంశోద్భవుడని వర్ణించాడు. కొండవీటి రెడ్డి వంశం వారు దొంతి వారని, కొండవీటి దండకవిళె, కైఫీయత్‌లు చెబుతున్నాయి. 'రాష్ట్రకూట' అనే ఉద్యోగ నామం రట్టకుడి, రట్టోడి, రట్టడి, రడ్డి పదాలుగా రూపాంతరం చెంది, చివరకు 'రెడ్డి' అనే వంశ నామంగా స్థిరపడిందని, శాసనాలు, తెలుగు గ్రంథాలు సూచిస్తున్నాయి. మొదట్లో వ్యవసాయదారులైన రెడ్లు క్రమంగా ధనవంతులై, గ్రామ ప్రముఖులై, తర్వాత ఆయుధాలు చేబూని, రాజకీయాల్లోకి వచ్చి వుండొచ్చు. వంశపారంపర్యంగా రెడ్డి రాజులు ధరించిన పాండ్యరాయ గజకేసరి, జగన్నొబ్బగండ, రామూరి దుర్గ విభాళ వంటి బిరుదుల్ని చూస్తే, క్రీ.శ. 13వ శతాబ్దం నాటికి నెల్లూరు చోడ పాలకుల సైన్యంలో పేరుప్రతిష్ఠ లార్జించి, కాకతీయ సైన్యంలో ప్రాపకం పొంది, ఆ ప్రభువుల ఆదరణకు పాత్రమైనట్లు తెలుస్తున్నది.

BRAOU

15.6.1 : ప్రోలయ వేమారెడ్డి (1325-53)

కొండవీటి రాజ వంశ కర్త కోమటి వేమారెడ్డి. ఈతని కొడుకు ప్రోలారెడ్డికి అన్నమాంబ ద్వారా జన్మించిన వారిలో రెండో వాడు, ప్రోలయ వేమారెడ్డి. అతడే రెడ్డి రాజ్య స్థాపకుడు. సోదరులు, మేనమామల తోడ్పాటుతో, నిరంకుశులైన, దుష్పరిపాలన సాగిస్తున్న ముస్లింలను తరిమివేసి, దక్షిణ తీరాంధ్రంలో 1325లో అద్దంకి కేంద్రంగా ప్రోలయ వేమారెడ్డి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. కనుకనే, 'మ్లేచ్ఛాబ్ధికుంభోద్భవు' డయ్యాడు. వాణిజ్య సంపదకు కీలకమైన తూర్పు తీరాంధ్ర దేశం కోసం, ఇరుగు పొరుగైన రెడ్డి రాజ్యం, విజయనగరాలు రెండూ తలపడటం, ఈ కాలం లోనే ఆరంభమైంది. సంఘర్షణ ఒక శతాబ్దం పాటు కొనసాగి, చివరకు కొండవీటి రెడ్డి రాజ్యం విజయనగర సామ్రాజ్యంలో అంతర్భాగం కావడంతో, ముగిసింది. 1329 నాటికి, వెన్న దక్షిణ ప్రాంతాలను - అంటే, రెడ్ల జన్మ భూమైన పాకనాడు – విజయనగర రాజ్య స్థాపకుడు హరిహర రాయలు తన తమ్ముడు కంప ద్వారా జయించి, ఆక్రమించాడు. అయితే, ప్రోలయ వేమారెడ్డి శ్రీశైల, త్రిపురాంతక ప్రాంతాలను చోళ వంశీయుల నుండి వశం చేసుకొన్నాడు. 1347లో బహమనీ రాజ్యాన్ని స్థాపించిన అల్లాఉద్దీన్ బహమన్‌షా, కాపయ రాజ్యంపై దండెత్తిన సందర్భంలో, కృష్ణా తీరం వరకు దాడి చేస్తే, ఆ దాడిని ప్రోలయ వేముని తమ్ముడు, సైన్యాధ్యక్షుడు మల్లారెడ్డి తిప్పికొట్టాడు. మల్లారెడ్డే మోటుపల్లి రేవు కేంద్రాన్ని ఆక్రమించాడు. ప్రోలయ వేముడు దూరదృష్టితో ధరణికోట, చందవోలు, వినుకొండ, కొండవీడు, బెల్లంకొండ, కందుకూరు మొదలైన చోట్ల, కోటల్ని నిర్మించి, పటిష్ఠం

చేశాడు. వైదిక మతాభిమానైన వేముడు అనేక అగ్రహారాలను దానంగా ఇచ్చి, 'నిస్సీమభూదాన పరశురామ' అని, బిరుదు వహించాడు. ఈ కాలంలో దానాలకు, వ్రతాలకు, ప్రాధాన్యత పెచ్చింది. ఎర్రాప్రెగడ ఆస్థాన కవిగా ఆదరం పొందాడు.

15.6.2 : అనవోతారెడ్డి (1353-64)

ప్రోలయ వేముని పెద్ద కొడుకే అనవోతడు. సింహాసన మధిష్ఠించిన సంవత్సరం లోనే, ఇతడు తూర్పు దిగ్విజయ యాత్రకు పూనుకున్నాడు. కృష్ణా తీరం వరకు నడచిన కళింగ గంగులను నిలువరించాడు. ఏరువ చోడ భక్తి రాజు సాయంతో, ముందుగా తలగడ దీవిని ఆక్రమించుకొని, అనంతరం శత్రువుల్ని తరిమాడు. ఈ దండయాత్రలో ఇతనికి రాజమహేంద్రవర ప్రాంతపు ముమ్మడి నాయకుడు, పిఠాపుర కొప్పుల నాయకులు లొంగిపోయారు. కాని, తిరుగు ప్రయాణంలో భక్తిరాజు కృష్ణా-గోదావరీ మండలాల క్షత్రియులతో చేతులు కలిపి, సూరవరం వద్ద అనవోతుని ఓడించినట్లు, అన్నదేవచోడుని (భక్తిరాజు కొడుకు) రాజమంత్రి తామ్ర శాసనం తెలుపుతున్నది. రేచర్ల పద్మనాయకుల వ్యవహారాల్లో అనవోతుడు జోక్యం చేసుకున్నందుకు, రెడ్లకు, వెలమలకు సంఘర్షణ ఆరంభమైంది. రేచర్ల సంగముని రెండో కొడుకు మాదానాయకుడు, అనవోతారెడ్డిని ధరణికోట వద్ద యుద్ధంలో జయించి, శ్రీశైల ప్రాంతాన్ని కూడా ఆక్రమించాడు. ఇదే సమయంలో, మల్లారెడ్డి అమరావతిపై దాడి చేసిన బహమనీ సేనల్ని పారదోలి, అమరేశ్వరాలయాన్ని పునరుద్ధరించాడు. వెలమలతో, బహమనీలతో అనవోతుని యుద్ధాల్ని అవకాశంగా తీసుకొని, విజయనగర బుక్కరాయలు వెలమల్ని తరిమి, శ్రీశైలం, మార్కాపురం ప్రాంతాలను స్వాధీనం చేసుకొన్నాడు. అనవోతుని కాలంలో, రాజధాని అద్దంకి నుండి కొండవీడుకు మారడం, విశేషం. వెలమలు, విజయనగర పాలకుల బెడద కారణంగాను, స్థల దుర్గమైన అద్దంకి కంటే, కొత్తగా పటిష్ఠం చేయబడ్డ గిరి దుర్గం కొండవీడైతే, ఉత్తరంగా విస్తరిస్తున్న రెడ్డి రాజ్యానికి అనుకూలంగా ఉంటుందనీ, ఈ మార్పు జరిగుండొచ్చు.

15.6.3 : అనవేమారెడ్డి (1364-86)

అనవోతని కొడుకు, కొమరిగిరి బాలుడవటం వల్ల, అతని మరణానంతరం తమ్ముడు, అనవేముడు సింహాసన మధిష్ఠించాడు. కనుకనే, శాసనాలు అనవేమున్ని 'రాజ్యశ్రీరమణీ స్వయంవరపతిం' అని పేర్కొన్నాయి. రెడ్డి రాజ్య కీర్తిప్రతిష్ఠలను, బలగౌరవాలను పెంచే బాధ్యత, అతని భుజాలపై పడింది. భక్తి రాజు మరణించడంతో, అతని కుమారులు అన్నదేవ చోడుడు, చోడ ఓముల మధ్య, వేంగి వారసత్వ యుద్ధం ప్రారంభమైంది. అనవేమారెడ్డి తన బావమరది చోడభీమునికి సాయపడి, అతన్ని వేంగి పాలకుణ్ణి చేశాడు. అనంతరం, దివి దుర్గాన్నాక్రమించి, తూర్పు దిగ్విజయ యాత్రకు శ్రీకారం చుట్టాడు. 'దీవి దుర్గ విభాళు' డయ్యాడు. నిరవద్యపుర దుర్గాన్ని వశపర్చుకొన్నాడు. తర్వాత, కోరుకొండ ముమ్మడి నాయకుని పానాల (తణుకు, నరసాపురం, భీమవరం ప్రాంతాలు), కోన (కోనసీమ), కురవాటి (కాకినాడ దగ్గర కూరాడ ప్రాంతం)లను, రాజమహేంద్రవరాన్ని, అనేక తీర జలదుర్గాలను పట్టుకొన్నాడు. బావమరిది కాటయరెడ్డి, దువ్వూరి వొడ్డారెడ్డి తదితర బంధువులు ఈ విజయాలకు సహకరించారు. అనంతరం పిఠాపురపు కొప్పుల నాయకులు, ఎలమంచిలి చాళుక్యులు, వడ్డాది రాజులు, అనవేముని చేతిలో ఓడారు. సింహాచలం వరకు ఈ కళింగ దండయాత్ర సాగింది. అయితే, దాక్షారామ-సింహాచలం మధ్య భాగం, రెడ్డి రాజుల ప్రత్యక్ష పాలన లోకి రాలేదు. అయినా, అనవేముని గౌరవప్రతిష్ఠలు పెరిగాయి. అతని పశ్చిమ దిగ్విజయ యాత్రతో, రేచర్ల నాయకుల్ని

BRAOU

ఓడించి, వాడపల్లి, బూరుగుగడ్డ (నల్గొండ జిల్లా ప్రాంతాలు)లను వశం చేసుకొన్నాడు ఈ దాడి లోనే, విజయనగర పాలకుల నుండి శ్రీశైల ప్రాంతాన్నాక్రమించాడు. అనవేముడు ఆధ్యాత్మిక చింతనాపరుడు, శైవాచార తత్పరుడు. అనేక దాన ధర్మాలను చేశాడు. ఏటేటా వసంతోత్సవాన్ని నిర్వహించి, కవిపండితుల్ని, నటగాయకుల్ని గౌరవించి, కర్పూర వసంతరాయనిగా ప్రసిద్ధుడయ్యాడు.

15.6.4 : కొమరగిరి రెడ్డి (1386 - 1402)

అనవేముని మరణానంతరం, అనవోతని కొడుకు కొమరగిరికి, ప్రోలయ వేముని అన్న మాచారెడ్డి పౌత్రుడైన పెదకోమటి వేమునికి, వారసత్వ పోరాటం ఆరంభమైంది. ఈ అంతర్యుద్ధంలో కొమరగిరికి, బావమరది కాటయ వేముడు అండగా నిలబడ్డాడు. రెండు వర్గాలూ చివరకు చేసుకొన్న రాజీ ఒప్పందం ప్రకారం, కొమరగిరిని కొండవీటి రాజ్యాధిపతిగా, పెదకోమటి వేముడు అంగీకరించాడు. ఈ అంతఃకలహం జరిగిన కాలంలో, వినుకొండ వరకూ శ్రీశైల ప్రాంతాన్నాక్రమించుకొన్న విజయనగర రెండో హరిహరరాయలు, కొండవీటి రాజ్య ప్రధాని, సర్వసైన్యాధ్యక్షుడైన కాటమ వేమారెడ్డి చేతిలో ఓటమి చెంది, బహమనీ - పద్మనాయక కూటమికి బద్ధ శత్రువులైన రెడ్లతో స్నేహం మంచిదని భావించి, కాటయ వేమునితో సంధి చేసుకొన్నాడు. దీని ప్రకారం, త్రిపురాంతకం, వినుకొండ ప్రాంతాలు తిరిగి, కొమరగిరి అధీనంలోకి వచ్చాయి. మైత్రిని మరింత బలీయం చేస్తూ, హరిహరుడు తన కూతుర్ని కాటయ వేమారెడ్డి కిచ్చి పెళ్ళి చేశాడు. దీని తర్వాత, 1388 ప్రాంతంలో, రాజమహేంద్రవరపు అల్లాడరెడ్డి, అతని కొడుకు సాయంతో, కాటమ వేముడు రంప, మొల్లేరు, కిమ్ముారు, బెండపూడి, రామగిరి, వీరఘట్టం, జంతరునాడు వడ్డాది, నస్తమాడేలను జయించుకుంటూ, కటకం వరకూ ఆక్రమించి, 'కటక చూరకారు' డయ్యాడు. విజయానంతరం, ఈ ప్రాంతాలన్నిటినీ, రాజమహేంద్రవర రాజ్యంగా ఏర్పర్చి, యువ రాజు అనవోతుణ్ణి పాలకునిగా నిలిపాడు. అయితే, అనవోతారెడ్డి 1395 లో అకాల మరణంతో, కాటయ వేముణ్ణి రాజమహేంద్రవర పాలకునిగా, కొమరగిరి నియమించాడు. రాజ్య విభజనగా భావించి, దీన్ని పెదకోమటి వేముడు వ్యతిరేకించాడు. దీనితో, శత్రువుల కార్యకలాపాలు ముమ్మరమయ్యాయి. సామంతులు తిరుగుబాట్లను చేశారు. వీరిని చేరదీసి, పెదకోమటి వేముడు 1402 లో కొమరగిరిని పారదోలి, కొండవీటి సింహాసనాన్నాక్రమించాడు. రాజమహేంద్రవరం పారిపోయి, కాటయ వేముని ఆశ్రయాన్ని పొందిన కొమరగిరి, ఆ తర్వాత జబ్బుపడి, చనిపోయాడు. రాజ్యంలో శాంతిభద్రతలు, రాజ్య వ్యవహారాల నిర్వహణను కాటయ వేముడు చూస్తుంటే, కొమరగిరి ఎక్కువగా సాహిత్య, కళాపోషణలో కాలం వెళ్ళబుచ్చేవాడు. ఇతడు నాట్య కళా ప్రియుడు.

15.6.5 : పెద కోమటి వేమా రెడ్డి (1402 - 20)

తిరుగుబాటుతో సింహాసన మధిష్ఠించిన పెద కోమటి వేముడు, క్రమేణా తన స్థానాన్ని సుస్థిరం చేసుకొని, రాజమహేంద్రవర రాజ్యాన్ని కొండవీటితో విలీనం చెయ్యాలని సంకల్పించాడు. అతని సేనాని గజరావ్ తిప్పన, గుండుగోలను, కోమార్ యుద్ధాల్లో కాటయ వేముణ్ణి ఓడించాడు. కాటయ వేముడు విజయనగర సాయాన్ని కోరాడు. ఈ కొండవీటి - రాజమహేంద్రవర రాజ్యాల సంఘర్షణను అవకాశంగా తీసుకొని, ఏరువ అన్నదేవ చోడుడు, దేవగిరి పద్మనాయక పెదవేదగిరి తోడ్పాటుతో, తాను కోల్పోయిన చేంగి రాజ్యాన్ని తిరిగి సంపాదించుకొన్నాడు. బహమనీ సుల్తాన్ కూడా, అతనికి సహకరించాడు. పద్మనాయకులకు, బహమనీలకు, సన్నిహితుడైన అన్నదేవచోడునితో చేతులు కలిసి,

BRAOU

పెదకోమటి వేముడు రాజమహేంద్రవరంపై దండెత్తాడు. అత్తిలి, కాకరపర్రుల వద్ద, భీకర యుద్ధాలు జరిగాయి. కాటయ వేముడు విజయనగర మొదటి దేవరాయల సాయాన్ని పొందినా, ఫలితం దక్కలేదు. అతడు ఓడిపోవడమేకాక, ప్రాణాలను కూడా కోల్పోయాడు (1414). అయినా, రాజమహేంద్రవరం పెద కోమటి వేమునికి వశం కాలేదు. కాటయ వేముని వియ్యంకుడు అల్లాడరెడ్డి, కాటయ కొడుకు, (రెండో) కొమరగిరిని రాజును చేసి, అండగా నిలబడ్డాడు. దేవరాయలు కూడా తోడ్పడ్డాడు. అన్నదేవ చోడుడు అల్లాడరెడ్డి చేతిలో మరణించడంతో, నిస్సహాయుడైన కోమటి వేముడు బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా సాయంతో, రాజమహేంద్రవరంపై 1417 లో దండెత్తాడు. అల్లాడరెడ్డి, అతని కొడుకులు ఈ దాడిని తిప్పికొట్టారు. ఇదే సమయంలో, దేవరాయలు కొండవీటి పైకి, తెలంగాణా పైకి, ఏక కాలంలో సైన్యాలను పంపాడు. బహమనీ సుల్తానోడి, పారిపోయాడు. మోటుపల్లితో సహా, కొండవీటి దక్షిణ ప్రాంతాలు విజయనగర వశమయ్యాయి. రెడ్డి - వెలమ బద్ధ వైరం తీవ్ర రూపాన్ని ధరించి, పరస్పర హత్యాకాండకు దారితీసింది. కోమటి వేముని తమ్ముడు, మాచారెడ్డిని, దేవరకొండ కుమార వేదగిరి చంపాడు. అతణ్ణి కోమటి వేముడు వధించాడు. వేదగిరి తమ్ముడు లింగమనీడు ప్రతీకారంగా, కోమటి వేముణ్ణి పరాజితుణ్ణి చేశాడు. వెలమలతో ఘర్షణ పడుతూనే, 1420 లో 'సర్వజ్ఞ చక్రవర్తి'గా ప్రసిద్ధుడైన పెద కోమటి వేముడు అసువులను బాశాడు.

కొండవీటి రెడ్డి రాజుల్లో చివరి వాడు, రాచవేముడు (1420-24). ఇతడు అసమర్థుడు, వివేక శూన్యుడు. 'పురిటి సుంకం' వంటి వాటితో ప్రజాకంటకుడయ్యాడు. చివరకు సేవకుని చేతి లోనే ఇతడు హతుడవటంతో, కొండవీటి రాజ్య భాగాలను విజయనగర, కళింగ పాలకులు వశపర్చుకున్నారు.

15.6.6 : రాజమహేంద్రవర రెడ్డి రాజ్యం

అనవోత, అనవేముల కాలంలో రాజమహేంద్రవరానికి వలస వెళ్ళిన పాకనాటి రెడ్లే, రాజమహేంద్రవర రెడ్డి రాజ్యానికి మూల పురుషులు. ప్రోలయ వేమారెడ్డి కుమార్తె దొడ్డాంబికకు, రాజమహేంద్రవరానికి వలసొచ్చిన కాటారెడ్డి పౌత్రుని ద్వారా జన్మించిన కుమారుడే, కాటయ వేమా రెడ్డి. ఇతడు మేనమామ అనవోతారెడ్డి కూతురు, దొడ్డాంబికను పెళ్ళి చేసుకొన్నాడు. ఆ విధంగా, ఇతడు కొమరగిరి రెడ్డికి బావమరిది. తూర్పు దిగ్విజయ యాత్రను విజయం చేసి, రాజమహేంద్రవర రాజ్యాన్ని కాటయ వేమారెడ్డి స్థాపించాడు. ఆ రాజ్య ప్రతినిధి యువ రాజు రెండో అనవోతడు 1395లో మరణించడంతో, కొమరగిరి కాటయ వేముని సేవలకు బహూకృతిగా, సామంత ప్రతిపత్తితో, అతణ్ణి రాజును చేశాడు. కాని, దీన్ని రాజ్య విభజనగా భావించి, పెద కోమటి వేముడు ప్రతిఘటించడంతో, రాజ్యం అల్లకల్లోలమైంది. ఇతర సామంతుల్ని కూడగట్టుకొని, కోమటి వేముడు 1402 లో కొమరగిరిని తరిమివేసి, కొండవీటిని స్వాధీనం చేసుకోడం తెలిసిందే. నిరాశతో, చివరకు కొమరగిరి రాజమహేంద్రవరంలో మరణించాడు.

రెడ్డి రాజ్యాలను సమైక్యం చేసే లక్ష్యంతో, కోమటి వేముడు రాజమహేంద్రవరంపై పోరు సాగించాడు. రాజమహేంద్రవర రాజ్య స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోడం కోసం, కాటయ వేముడు తన వియ్యాలవారు దువ్వూరి వారు, విజయనగరం వారు, ఇతర బందువుల సాయం పొందాడు. కాని, కోమటి వేముని ప్రోత్సాహంతో, వెలమల సాయంతో ఏరువ అన్నదేవ చోడుడు వేగి భాగాలను తిరిగి ఆక్రమించుకొన్నాడు. తనుకు వద్దున్న కాకరపర్తి దగ్గర జరిగిన యుద్ధంలో, అన్నదేవచోడుడు కాటయపై విజయం సాధించి, గోదావరి దక్షిణ తీరాన్నంతా స్వాధీనం చేసుకొన్నాడు. కాటయ వేముడు ఈ యుద్ధం లోనే చనిపోయాడు (1414). బహుశ, కోమటి వేముని సేనాని గజరావ్ తిప్పన చేతిలో ఈ మరణం సంభవించుండొచ్చు.

BRAOU

కాటయ వేముని మరణానంతరం అతని వియ్యంకుడు అల్లాడరెడ్డి, కాటయ కొడుకు రెండో కొమరగిరిని సింహాసనంపై నిలిపాడు. రాజ్య సంరక్షకునిగా అల్లాడరెడ్డి వ్యవహరించాడు. 1415లో అన్నదేవ చోడుణ్ణి చంపి, వేంగిని తిరిగి ఆక్రమించాడు. కాని, బాలుడైన కొమరగిరి ఆ మరునటి సంత్సరమే మరణించడంతో, కాటయ కూతురు, తన కోడలైన అనితల్లిని రాణిని చేసి, అల్లాడ రెడ్డి రాజ్యాన్ని రక్షించాడు. బహమనీ సుల్తాన్ సాయంతో, కోమటి వేముడు రాజమహేంద్రవరంపై దండెత్తగా, వారిని ఓడించి, తరిమి వేసాడు. సుల్తాన్‌కు సాయంగా వచ్చిన మాళవ పాలకుని గుర్రాలను కూడా పట్టుకొన్నాడు. అల్లాడరెడ్డి మరణించాక (1420), రాజ్యాన్ని స్వల్ప కాలం అతని అన్న కొడుకులు కొమరగిరి, అనవోతా రెడ్లు ఆక్రమించుకొన్నారు. కాని, 1423లో అనితల్లి భర్త వీరభద్రారెడ్డి, అన్న వేమారెడ్డి సహాయంతో రాజ్యాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. వేమారెడ్డే ప్రధానిగా పాలనా భారాన్ని వహించాడు. అయితే, 4, 5 సంవత్సరాలు కళింగోత్కల రాజు వీరభానుదేవుని ఆక్రమణలో ఈ ప్రాంతాలుండిపోయినాయి. విజయనగర పాలకుడు రెండో దేవరాయలు 1429లో భానుదేవుణ్ణి తరిమివేసి, సింహాచలం వరకు ఆక్రమించిన ప్రాంతాలను తనకు సామంతులుగా ఉండ డానికి సమ్మతించిన వేమ, వీరభద్రారెడ్ల అధీనం చేశాడు. 1435లో గంగులను తొలగించి, కటకాన్ని ఆక్రమించిన గజపతి కపిలేశ్వరుడు, ఈ ప్రాంతాలను ఆక్రమించడానికి ప్రయత్నాలను ముమ్మరం చేశాడు. రెడ్లకు సాయంగా విజయనగర సేనాని మల్లప్ప ఒడయర్ సైన్యంతో వచ్చినట్లు, అతని ద్రాక్షారామ శాసనం (1444) వల్ల స్పష్టమౌతోంది. అయితే, తర్వాత విజయనగర రెండో దేవరాయల మరణంతో (1446), అస్తవ్యస్త పరిస్థితులేర్పడ్డాయి. దీనితో, కపిలేశ్వరుడు వెలమ లింగమనీడుతో బాటు, రాజమహేంద్రవరంపై దండెత్తాడు. 1448 నాటికి రెడ్డి రాజ్యం కళింగలో అంతర్భాగమైంది.

15.7 : పద్మ నాయకులు

రేచర్ల వెలమ నాయకులు పద్మనాయకులు. రేచర్ల అనేది గోత్ర నామం. పద్మనాయకులు రాజకీయంగా కాకతీయుల కాలంలో ప్రాముఖ్యానికి వచ్చారు. ఉన్నతోద్యోగాల్లో వీరికి ప్రభువులు ప్రాధాన్యతనిచ్చారనే, రెడ్లు కినిసి, కాకతీయ సామ్రాజ్య పతనానికి పరోక్షంగా కారకులయ్యారు. కాకతీయ సామ్రాజ్యం పతనమయ్యాక ముస్లిం పాలనను ప్రతిఘటించి, స్వతంత్రులైన నాయకుల్లో పద్మనాయకులూ ఉన్నారు. తెలంగాణాలో రాచకొండ, దేవరకొండలు రాజధానులుగా, రెండు శాఖలుగా వీరు పరిపాలించారు.

కాకతి ప్రతాపరుద్రుని ఆస్థానంలో సేనానిగా ప్రసిద్ధుడైన రేచర్ల సింగమ నాయడు, ప్రతాపుని మరణానంతరం ముస్లింలను పారదోలి, పిల్లలమర్రి, ఆమనగల్లు ప్రాంతాల్లో బలపడి, స్వతంత్ర రాజ్య స్థాపనకు ప్రయత్నించాడు. దక్షిణ తీరాంధ్రంలో రెడ్లు తూర్పుగా విస్తరిస్తుండటంతో, పద్మనాయకులూ విజృంభించారు. సింగమనాయడు కృష్ణ-తుంగభద్ర అంతర్వేది ప్రాంతాన్ని (మహబూబ్‌నగర్ జిల్లా) ఆక్రమించాక, గోల్కొండ కోటనూ చేజిక్కించుకొన్నాడు. కాపయ నాయకుణ్ణుండి పిల్లలమర్రిని తిరిగి పట్టుకొన్నాడు. రాజ్య విస్తరణ ప్రయత్నంలో జల్లిపల్లి క్షత్రియులకు బందీగా చిక్కిన బావమరదిని విడిపించడానికి జల్లిపల్లిని ముట్టడించినప్పుడు, రెడ్ల ప్రోత్సాహంతో క్షత్రియులతణ్ణి మాయోపాయంతో చంపించారు(1361.)

సింగమనాయని పెద్ద కొడుకు రాచకొండ రాజ్య నిర్మాత. తమ్ముడు మాదానాయనితో కలిసి, ఈతడు జల్లిపల్లి క్షత్రియుల పైనా, రెడ్డి నాయకుల పైనా ప్రతీకారాన్ని తీర్చుకొన్నాడు. అనవోతారెడ్డి

BRAOU

నోడించి, శ్రీశైల ప్రాంతాన్ని ఆక్రమించుకున్నాడు. 1369లో భీమవరం యుద్ధంలో ముసునూరి కాపయ హతుడవడంతో, తెలంగాణా కంతటికీ రాచకొండ రాజులే అధినేతలయ్యారు. అనవోతా నాయుడు అంధ్రదేశాధీశుడయ్యాడు. అప్పటి నుండి దాదాపు ఒక శతాబ్ది కాలం పద్మనాయకుల చరిత్రే తెలంగాణా ప్రాంత చరిత్రైంది. పాలనా సౌలభ్యం కోసం అనవోతానాయడు తన తమ్ముడు మాదానాయణ్ణి రాజ్య దక్షిణ భాగంలో దేవరకొండ ప్రతినిధిగా నియమించాడు. నాటి నుండి రెండు వెలమ రాజ్యాలూ పరస్పర సహకారంతో కొనసాగాయి. వీరికి బహమనీలతో స్నేహం పెంపొందింది. రెండో అనవోతా నాయని కాలంలో (1399-1421), పద్మనాయకులు కొండపీటి పెద కోమటి వేమునికి సన్నిహితమైన బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షాకు వ్యతిరేకంగా, విజయనగరంతో చేతులు కలిపారు. వీరికీ, రెడ్లకు వైరం మరింత తీవ్రమైంది. పరస్పరం దాడులు, హత్యాకాండ కొనసాగాయి. దీనిలో భాగం గానే, పెద కోమటి వేముడు 1420లో మరణించాడు. 1424లో విజయనగర-బహమనీ పోరాటంలో, వెలమలు విజయనగర పక్షం వహించడంతో, రెండో దేవరాయలుతో సంధి చేసుకున్నాక, సుల్తాన్ అహ్మద్‌షా వారిని శిక్షించడానికి దండెత్తి, ఓరుగల్లుతో సహా తెలంగాణాలో అధిక భాగాన్నాక్రమించాడు. స్వతంత్రంగా పరిపాలించిన పద్మనాయకుల్లో, రాచకొండ రెండో అనవోతని కొడుకు, మహావిద్వాంసుడైన సర్వజ్ఞ సింగముడు(1430-75), దేవరకొండ లింగమనాయుడు, చివరి వారు. వీరూ చివర్లో గజపతులకు, విజయనగర పాలకులకు సామంతులయ్యారు. రెండో మహమ్మద్‌షా కాలం(1482-1518)లో ముస్లిం సేనలు తెలంగాణా దుర్గాలతోబాటు, తీర ప్రాంతం లోని కొండవీడు, రాజమహేంద్రవరాలనూ వశపర్చుకొన్నాయి. తెలంగాణా పూర్తిగా బహమనీల పాలన లోకి వచ్చింది. రాజ్యాన్ని కోల్పోయిన వెలమలు, విజయనగర సేవలో చేరారు.

15.8 : రెడ్డి-నాయక యుగం నాటి సాంస్కృతిక విశేషాలు

రెడ్డి-నాయక యుగంలో రాజకీయ ఐక్యత లేకున్నా, సంస్కృతిపరంగా చూస్తే, కాకతీయ యుగానికి అనుబంధంగా కన్పిస్తున్నది. రాజ్య పాలనా విధానంలో, ప్రభుత్వ యంత్రాంగంలో, న్యాయ నిర్వహణలో సాంప్రదాయిక పద్ధతులే కన్పించాయి. ప్రజలపై పన్నుల భారం అధికం. రాజ్యాల మధ్య పరస్పర యుద్ధాల కారణంగా, ఆదాయంలో ఎక్కువ భాగం సైన్య పోషణకే సరిపోయేది. రాజుల పట్ల ప్రజల అభిమానం తక్కువని అన్పిస్తుంది. పోతన వారిని 'ఇమ్మనుజేశ్వరాధములు' అనగా, ధూర్జటి 'రాజుల్ మత్తులు వారి సేవ నరకప్రాయంబు' అని వర్ణించాడు. ఆర్థికాభ్యున్నతి విషయంలోనూ దిగజారుడుతనం కన్పిస్తోంది. శూద్రులతోబాటు రాజాస్థాన జీవితంతో విసుగెత్తిన బ్రాహ్మణులూ, వ్యవసాయాన్ని ఆశ్రయించారు. రెడ్డి రాజులు, వెలమలు, తటాకాల ద్వారా నీటి పారుదల సౌకర్యాలను కల్పించారు. జొన్నలు ప్రధాన ఆహార ధాన్యం. పరిశ్రమల్లో వస్త్ర పరిశ్రమది అగ్ర స్థానం. దేశీయ, విదేశీయ వాణిజ్యాన్ని తెలిక, వైశ్య, బలిజ కులాలు నిర్వహించేవి. సంతలుండేవి. విదేశీ వాణిజ్యానికి మోటుపల్లి కేంద్రం. వర్తకుల కభయమిస్తూ అనవోత రెడ్డి ఇక్కడే శాసనాన్ని వేయించాడు. విలాస వస్తువులు దిగుమతయ్యేవని శ్రీనాథుని హరవిలాసం చెబుతున్నది.

ముస్లింల దుష్పరిపాలనపై తిరుగుబాటు కారణంగా ఏర్పడ్డ రెడ్డి, నాయక రాజ్యాలు, హిందూ మత, సంస్కృతుల రక్షణకు పూనుకొన్నాయని చెప్పొచ్చు. అగ్రహారాలు పునరుద్ధరింపబడినాయి. సమన్వయ స్మార్త విధానానికి మద్దతు దొరికింది. అయితే, ఇది అగ్ర వర్ణాలకు పరిమితం. భక్తి లక్షణాలతో శైవ, శాక్తేయ, వైష్ణవాలు ఆదరాన్ని పొందాయి. ముసునూరు, రెడ్డి, నాయక రాజుల్లో మొదటి వారు శైవాభిమానులు. రెడ్డి, పద్మనాయక రాజులు చివర్లో వైష్ణవాన్ని అభిమానించారు.

BRAOU

సామాజిక, మత కార్యకలాపాలకు ఆలయాలు కేంద్రాలుగా కొనసాగాయి. సమాజంలో అన్ని వర్గాలు ఉత్సవాల్లో పాల్గొనేయి. సమాజ ఐక్యతకు వర్ణ విభేదాలు ఆటంకమయ్యాయి.

సారస్వత పోషణలో రెడ్డి, నాయక రాజులు కాకతీయులకు నిజంగా వారసు లన్పించారు. ప్రభువులు కూడా అనేక శాస్త్రాల నభ్యసించారు. సింగముడు, కోమటి వేముడు 'సర్వజ్ఞ' బిరుదు వహించారు. బ్రాహ్మణులు జ్యోతిషం, షడ్దర్శనాలు, శబ్ద మీమాంస శాస్త్రాలు, సంగీతం, సాహిత్యం, ఆయుర్వేదం, ధర్మశాస్త్రం వంటి విద్యల్లో పరిణతు లవుతున్నట్లు, విలస శాసనం పేర్కొంది. లలిత కళల్లో కూడా ప్రగతి సాధించారు. అనవేముడు, కొమరగిరి తదితరులు వసంతోత్సవాలను నిర్వహించి, సభ, గాయకుల్ని ఆదరించారు. ఉత్సవాలలో నాటకాలూ ఒక భాగమయ్యాయి. సంస్కృతాంధ్రాలు విశేష ఆదరణకు నోచుకున్నాయి. ముఖ్యంగా రెడ్డి, పద్మనాయక ఆస్థానాల్లో సంస్కృత కవులు ఆస్థాన కవులుగా, విద్యాధికారులుగా వుండేవారు. కొమరగిరి భరతశాస్త్రప్రవీణుడై **'వసంతరాజీయం'**ను వెలువరించాడు. అతని బావమరది కాటయవేముడు కాశిదాను నాటక త్రయానికి **'కుమారగిరిరాజీయు'**మనే వ్యాఖ్యానాన్ని రాశాడు. కోమటి వేముడు మహా కవి. **'సంగీత చింతామణి', 'సాహిత్య చింతామణి', 'సప్తశతిపారటీక'** మొదలైన రచనలు చేశాడు. అతని ఆస్థాన కవి వామనభట్ట బాణుడు **'కనక లేఖా కల్యాణం', 'ఉషాపరిణయం', 'రఘునాథాభ్యుదయం', 'హంస సందేశం', 'వేమ భూపాల చరిత్ర', 'శబ్ద చంద్రిక'** వంటి అనేక నాటకాలు, పద్య కావ్యాలు, గద్య కావ్యం, నిఘంటువులను రచించాడు. పద్మనాయక అనవోతుని ఆస్థానం లోని నాగవాడ కవి **'మదన విలాస బాణం'**ను రాశాడు. సర్వజ్ఞ సింగముడు **'రసార్ణవ సుధాకరం'** అనే లక్షణ గ్రంథం, **'రత్న పాంచాలిక'** నాటకం, **'సంగీత సుధాకరం'** అనే వ్యాఖ్యానాన్ని సృష్టించాడు. అలంకార శాస్త్ర గ్రంథం **'చమత్కార చంద్రిక'**ను రాసిన విశ్వేశ్వరుడు, అమరకోశ వ్యాఖ్యాత అప్పయార్యుడు సింగభూపాలుని పోషణ లోని వారే.

ఇంక తెలుగు సారస్వత చరిత్రలో రెడ్డి, నాయక యుగం మహోజ్జ్వలమైంది. ఆస్థాన భాషగా తెలుగు, సంస్కృతంతో పోటీ పడింది. శ్రీనాథుడు కోమటి వేముని ఆస్థాన విద్యాధికారి కావడంతో, తెలుగు భాషా చరిత్రలో కొత్త శకం ఆరంభమైంది. దీన్ని సంధి యుగంగా విమర్శకులు పేర్కొంటారు. కొంత సామాజిక స్పృహతో కవులు రచనలను చేశారు. ఇంకో వైపు ఆస్థానాల్లో వినోదానికి చిత్ర కవిత్వాన్ని అల్లారు. హిందూ క్షేత్రాల మాహాత్మ్యాన్ని వర్ణిస్తూ, శ్రీనాథుని **'కాశీఖండం', 'భీమఖండం'**, దగ్గుపల్లి దుగ్గన **'కాంచీమాహాత్మ్యం'** వంటి గ్రంథాలు వచ్చాయి. సత్యనిష్ఠ, ధర్మ పరాయణత్వాలను బోధిస్తూ, **'భోజరాజీయం', 'విక్రమార్క చరిత్ర'** వంటి కావ్యాలు వెలిశాయి. ప్రోలయ వేమారెడ్డి ఆదరణలో ఎఱ్ఱన అరణ్య పర్వ శేషాన్ని పూర్తి చేయడమే కాక, **'ఉత్తర హరివంశం', 'నృసింహపురాణం'**లను రాశాడు. ఇదే కాలంలో శ్రీగిరి కవి **'నవనాథ చరిత్ర'**ను, విన్నకోట పెద్దనామాత్యుడు **'కావ్యాలంకార చూడామణి'**ని అందించారు. అనంతరం మడికి సింగన **'పద్మపురాణ'**, దశమ స్కంధాలను, **'వాసిష్ఠ రామాయణం'**, **'సకల నీతి సమ్మతా'**లను వెలువరించాడు. కొమరగిరి సమకాలికుడైన వినుకొండ వల్లభామాత్యుడు తెలుగు సాహిత్యంలో మొదటి వీధి నాటకం **'క్రీడాభిరామా'**న్ని అందించాడు. ఈ యుగ కవులందరిలోనూ ప్రసిద్ధుడు శ్రీనాథుడు. ఇతడెక్కడివాడో తెలియదు. కన్నడ జాతీయుడనే భావం చాలా మందికి వుంది. అయితే, అతని ఆంధ్ర భాషా సేవ అనుపమానం. విజయనగరంలో గౌడ డిండిమభట్టు ను ఓడించి, దేవరాయలు నుండి కనకాభిషేకం, కవి సార్వభౌమ బిరుదాన్ని సాధించాడు. రాచకొండ సర్వజ్ఞ సింగముని మర్యాదలను పొందాడు. మామిడి సింగనకు **'శృంగార వైషధా'**న్ని, అవచితిప్పయకు **'హరవిలాసం'**ను అంకితమిచ్చాడు. బెండ పూడి అన్నయామాత్యుని ఆస్థానంలో **'భీమఖండ', 'కాశీఖండా'**ల రచనను చేశాడు. నిరాశ్రయంగా

BRAOU

పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ, శ్రీశైలంలో 'శివరాత్రి మహాత్మ్యం'ను రాశాడు. పద్మనాయకుల ఆస్థానంతో సంబంధమున్న ప్రసిద్ధ తెలుగు కవులు, గౌరన, పోతనలు. సర్వజ్ఞ సింగని కోరికపై 'భోగినీదండకం'ను రాసిన పోతన, క్రమేణా రాజాస్థాన జీవితంపై విసుగెత్తి, హాలికునిగా జీవించాడని అంటారు. మొదట్లో శైవ ప్రభావంలో 'వీరభద్ర విజయం'ను రాసిన ఇతడు, తర్వాత పూర్తి వైష్ణవ ప్రభావంలో భక్తి ప్రధానంగా 'మహాభాగవతం'ను అందించాడు. ద్విపద కావ్యాల్లో ప్రసిద్ధి చెందిన 'రంగనాథ రామాయణా'న్ని, గోన బుద్ధరాజు ఈ యుగం లోనే వెలువరించాడు.

15.9 : సంగ్రహంగా

కాకతీయ సామ్రాజ్యం పతనమయ్యాక ఏర్పడ్డ ముస్లింల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా చెలరేగిన తిరుగుబాట్ల ఫలితంగా, ఆంధ్ర దేశంలో చతుర్థ కులజులు పాలకులుగా, విభిన్న ప్రాంతాల్లో స్వతంత్ర రాజ్యాలను స్థాపించారు. ముసునూరి నాయకులు, రెడ్డి రాజులు, పద్మనాయకులు, ఈ కాలంలో ఆంధ్రుల సామాజిక, ఆర్థిక, సాహిత్య, కళా పరిణామాలకు ప్రాతినిధ్యం వహించారు. ముఖ్యంగా 14వ శతాబ్దపు పరిణామాలు వివిధ రంగాల్లో, సంధి యుగాన్ని ప్రతిబింబించడాన్ని చూడొచ్చు.

15.10 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. ముసునూరి నాయకుల కార్యకలాపాల గూర్చి వివరంగా తెల్పండి.
2. ఆంధ్ర దేశ చరిత్ర, సంస్కృతుల్లో రెడ్డి రాజుల ప్రాధాన్యతను విశదీకరించండి.

II. క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.

1. ఆంధ్ర దేశంపై ముస్లిం చండమోత్రలు
2. దక్కన్, దక్షిణ భారతదేశంలో ముస్లిం పరిపాలన, ఫలితాలు
3. ముస్లిం దాడుల నెదిరించిన వ్యతిరోకోద్యమాల స్వభావం
4. రాజమహేంద్రవర రెడ్డి రాజ్యం
5. కొమరగిరి రెడ్డి
6. కాపయ నాయకుడు
7. పద్మనాయకులు
8. రెడ్డి, పద్మనాయక రాజుల సాంస్కృతిక సేవలు

15.11 : ఉపయుక్త గ్రంథాలు

Habib, M. & Nizami, K.A. (Eds.) : **Comprehensive History of India, Vol. II**

Sherwani, H.K. & Joshi, P.M.(Eds.) : **History of Medieval Deccan, (1294-1724), 2 Vols.**

BRAOU

Somasekhara Sharma, M. : A Forgotten Chapter of Andhra History.

Do : History of the Reddi Kingdoms.

Venkataramanayya, N. : Early Muslim Expansion in South India.

Yasodadevi, V. : History of Andhra Country, A.D. 1000-1500

Corpus of Telangana Inscriptions, Parts I to IV, South Indian Inscriptions, Vols. IV, V, VI, & X

వడ్డాది అప్పారావు : రెడ్డి సంచిక

ఆరుద్ర : సమగ్ర ఆంధ్ర సాహిత్యం, 3,4, సంపుటాలు

సత్యనారాయణ, కె. : ఆంధ్రుల సంస్కృతి-చరిత్ర, 2 సంపుటాలు

సుబ్రమణ్యం, ఆర్.మొ.వారు(సం.లు) : తెలుగు సంస్కృతి (మొ.సం.)

రచయిత : డా. జాస్తి దుర్గాప్రసాద్.

BRAOU

BRAOU

ఖండం-VI : విజయనగర యుగం

ఈ ఖండం విజయనగర యుగానికి సంబంధించి, భిన్న అంశాలను వివరిస్తూంది. దీనిలో 9 భాగాలున్నాయి. మొదటిదైన 16వ భాగంలో, విజయనగర రాజ్య పుట్టుక, అందుకు సంబంధించిన వివిధ సిద్ధాంతాలు చర్చించబడ్డాయి. విజయనగర రాజ్యాన్ని మొదటగా పాలించిన సంగమ వంశ రాజకీయ కార్యకలాపాలు వివరించబడ్డాయి. విజయనగర రాజ్యాన్ని తదుపరి పాలించిన సాళువ, తుళువ, ఆరవీటి వంశాల రాజకీయ చరిత్ర, 17, 18, 19 భాగాల్లో వివరంగా తెలియజేయబడింది. 20, 21 భాగాల్లో ఇదే యుగానికి చెందిన పరిపాలన, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలను గూర్చిన విశేషాలను మీరు క్షుణ్ణంగా తెలుసుకోగలుగుతారు. 22 వ భాగం ద్వారా, విజయనగర రాజ్యం, రాజధాని, పాలకులు, ప్రజల స్థితిగతులపై సమకాలీన విదేశీ యాత్రీకుల రచనలు తెలియజేసే ఆసక్తికర విషయాలను మీరు గ్రహించగల్గాలి. వీటితోపాటు, ఆంధ్ర దేశంపై బహమనీ, కుతుబ్‌షాహీల ఆధిపత్యం, వారి సామాజిక, ఆర్థిక సేవలను, 23 వ భాగం ద్వారా, చివరగా 24వ భాగం ద్వారా, క్రీ.శ. 16వ శతాబ్ది నాటి ఆంధ్ర దేశపు రాజకీయ, ఆర్థిక సాంఘిక పరిస్థితులను గురించి కూడా, మీరు అవగాహన చేర్చుకోగల్గాలి. ఈ విధంగా, ఈ విస్తృత ఖండాధ్యయనం ద్వారా చరిత్ర ప్రసిద్ధి గాంచిన విజయనగర యుగ సర్వాంశాలను సమగ్రంగా గ్రహించగల్గుతారు.

BRAOU

BRAOU

భాగం-16 : విజయనగర రాజ్య ఆవిర్భావం : సంగమ వంశం

విషయక్రమం

16.0 : లక్ష్యాలు

16.1 : పరిచయం

16.2 : విజయనగర సామ్రాజ్య స్థాపనా ధ్యేయం

16.3 : విజయనగర సామ్రాజ్య స్థాపనకు ముందు దక్షిణ దేశ పరిస్థితి

16.4 : విజయనగర పుట్టుపూర్వోత్తరాలు : తత్సంబంధిత సిద్ధాంతాలు

16.5 : విజయనగర స్థాపన జరిగిన విధం : విద్యారణ్యుల పాత్ర

16.6 : సంగమ వంశం

- 16.6.1 : వంశానుక్రమణిక
- 16.6.2 : మొదటి హరిహరుడు (క్రీ.శ. 1336-1357)
  - 16.6.2.1 : రాజ్యాభివృద్ధి
  - 16.6.2.2 : హోయసాల రాజ్య ఆక్రమణ
  - 16.6.2.3 : బహమనీ రాజ్యంతో యుద్ధం
- 16.6.3 : బుక్కరాయలు (క్రీ.శ. 1357 - 1377)
  - 16.6.3.1 : విజయాలు : తొండమండలం
  - 16.6.3.2 : బహమనీలతో యుద్ధం
  - 16.6.3.3 : రెడ్డి రాజ్యంపై దండయాత్ర
  - 16.6.3.4 : మదుర దండయాత్ర
- 16.6.4 : రెండో హరిహరరాయలు (క్రీ.శ. 1377 - 1404)
- 16.6.5 : మొదటి దేవరాయలు (క్రీ.శ. 1406 - 1422)
  - 16.6.5.1 : గజపతులతో యుద్ధం
  - 16.6.5.2 : మొదటి దేవరాయల పుత్రులు
- 16.6.6 : రెండో దేవరాయలు (క్రీ.శ. 1422-1446)
  - 16.6.6.1 : బహమనీలతో యుద్ధం
  - 16.6.6.2 : కొండవీటి ఆక్రమణ- గజపతులతో యుద్ధం

BRAOU

16.6.6.3 : సింహళ దండయాత్ర

16.6.7 : రెండో విజయ రాయలు (క్రీ.శ. 1446-1447)

16.6.8 : మల్లికార్జున రాయలు (క్రీ.శ. 1446-1465)

16.6.9 : రాజశేఖర రాయలు (క్రీ.శ. 1465-1471)

16.6.10 : రెండో విరూపాక్ష రాయలు (క్రీ.శ. 1465-1485)

16.6.11 : ప్రౌఢ రాయలు (క్రీ.శ. 1485)

16.7 : సంగ్రహంగా

16.8 : పరీక్ష నమూనా ప్రశ్నలు

16.9 : ఉపయుక్త గ్రంథాలు

16.0 : లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం ద్వారా దక్షిణ భారతదేశ చరిత్రలో విజయనగర సామ్రాజ్య ప్రాముఖ్యం, రాజ్య స్థాపన, పుట్టుపూర్వోత్తరాలు, సంగమ వంశస్థుల పాలనా విశేషాలు, ప్రత్యేకించి మొదటి దేవరాయలు, రెండో దేవరాయలు సాధించిన ఘన కార్యాల గురించి, మీరు క్షుణ్ణంగా, స్పష్టంగా తెలుసుకోగల్గాలి.

BRAOU

16.1 : పరిచయం

పధ్నాలుగో శతాబ్దపు ప్రథమ భాగంలో విజయనగర సామ్రాజ్య స్థాపన ఒక ముఖ్య సంఘటన. విజయనగర సామ్రాజ్య స్థాపన దక్షిణ దేశ చరిత్ర లోనే కాక, భారతదేశ చరిత్రలో ఒక నూతన శకానికి నాంది. దక్షిణ భారతదేశాన్ని మహమ్మదీయుల బారి నుండి కాపాడడమేగాక, దక్షిణ దేశ సంస్కృతిని రక్షించడం కూడా, వీరి ప్రధాన ధ్యేయం. దక్షిణ దేశంలో ఇస్లాం మత వ్యాప్తిని అరికట్టి, హిందూ మతాన్ని, సంస్కృతిని పరిరక్షించడానికి స్థాపితమైన రాజ్యమే విజయనగరం. దక్షిణ దేశ రాజకీయాల్లోను, సాంఘికార్థిక వ్యవస్థ లోను, మతం లోను, సాహిత్య, కళల లోను, శాశ్వతమైన చెరగని ముద్ర వేసిన రాజ్యమే, విజయనగరం. విజయనగర రాజులు దక్షిణ దేశపు ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేసి, సంస్కృతాంధ్ర, కన్నడ భాషలను ఆదరించి, పోషించారు. విజయనగరం అనేక కళలకు కేంద్రమైంది. ఎంతో మంది విదేశీ యాత్రికులు విజయనగరాన్ని దర్శించి, దాని వైభవాన్ని వేనోళ్ళ పొగిడారు. ఈ రాజ్యం ఎంతో మంది గొప్ప పరిపాలనాదక్షులను అందించింది. ఇన్ని విధాల అభివృద్ధిని సాధించడం వల్ల, విజయనగరాన్ని ఆఖరి గొప్ప వైభవోపేత రాజ్యంగా వర్ణించారు.

16.2 : విజయనగర సామ్రాజ్య స్థాపనా ధ్యేయం

విజయనగర సామ్రాజ్య స్థాపనా ధ్యేయంపై చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. మహమ్మదీయ పాలన్నుండి దక్షిణ దేశాన్ని విముక్తి చేయడానికి జరిగిన ఉద్యమంలో ఒక భాగంగా, విజయనగర సామ్రాజ్య స్థాపన జరిగిందని, సాధారణ భావన. హిందూ-ముస్లింల సంఘర్షణే విజయనగర సామ్రాజ్య స్థాపనకు ప్రధాన హేతువని, హోయసాల రాజు మూడవ బల్లాలుడు దక్షిణ దేశం నుండి

మహమ్మదీయులను తరిమి వేయడంలో తీవ్ర కృషి చేసి, అతను, అతని వంశం పతనమైందని, ఈ జాతీయ దేశాభిమానమే విజయనగర రాజులకు ధ్యేయంగా నిల్చి, వారు విజయాన్ని సాధించారని, ఇస్లాం నుండి ధర్మాన్ని రక్షించడానికి జరిగిన వీర పోరాటమే, విజయనగర చరిత్రని యస్. కె. అయ్యంగార్ అభిప్రాయపడ్డారు. మహమ్మదీయ పాలనకు విరుద్ధంగా తెలుగు నాయకులు, కంపిలి దేవుడు, మూడవ బల్లాలుడు మొదలైన వారు చేసిన తిరుగుబాట్లను, మతపరమైన, లేదా జాతిపరమైన స్వాతంత్ర్యాభిలాషతో చేసిన తిరుగుబాట్లగా వర్ణించడానికి వీలు లేదు. వీటిని, రాజకీయ స్వాతంత్ర్యాన్ని సంపాదించడానికి, మహమ్మదీయ పాలన నుండి విముక్తి పొందడానికి జరిగిన స్థానిక ఉద్యమాలుగా భావించాల్సుంది. అప్పటి రాజకీయ పరిస్థితులలో స్వతంత్ర రాజ్యాలను స్థాపించుకోవడానికే, దక్షిణ భారతదేశం లోని నాయకులు, పాలకులు చేసిన ప్రయత్నాలుగా మాత్రమే, ఈ పోరాటాలను భావించొచ్చు.

కృష్ణస్వామి అయ్యంగార్‌తోపాటు, నీలకంఠశాస్త్రి, నేలటూరి వెంకట రమణయ్య, మల్లంపల్లి సోమశేఖరశర్మ, పి.బి. దేశాయ్ ఇత్యాది ఎంతో మంది చరిత్రకారులు, 1336 లో హరిహర, బుక్కరాయ సోదరులు విజయనగర రాజ్య స్థాపనకు పూనుకోడంలో ప్రదాన ఉద్దేశం, ఇస్లాం మతం నుండి హిందూ వైదిక ధర్మ పరిరక్షణ, దక్షిణ దేశ సంస్కృతి పరిరక్షణని భావించారు. " దక్కన్ లోని మహమ్మదీయ పాలకులకు, దక్కన్ లోని హిందూ పాలకులకు మధ్య జరిగిన పోరాటమే, విజయనగర చరిత్ర"ని, వెంకట రమణయ్య గారి అభిప్రాయం. "భారతదేశం లోని సాంప్రదాయబద్ధమైన సంస్కృతి, వ్యవస్థలను దక్షిణ భారతదేశంలో పరిరక్షించే బాధ్యతలను తన మౌలిక స్వభావంగా చేసుకొని, విజయనగరం ఒక చారిత్రక పాత్రను నిర్వహించింది. దాదాపు మూడు శతాబ్దాలపాటు ఘనత వహించిన విజయనగర రాజ్యం మహమ్మదీయుల పోటీని అడ్డుకొని, హైందవ సంస్కృతి, నాగరికతలను కాపాడుతూ, ప్రాచీన సాంప్రదాయ రాజనీతిని, కళలను, విద్యను సంరక్షించింది", అని, నీలకంఠశాస్త్రి గారి అభిప్రాయం. వర్ణాశ్రమ ధర్మంపై ఆధారపడిన ధార్మిక ఆదర్శంతో ప్రభావితమైన విజయనగర రాజ్యం, సైనిక బలంపై నిర్మించబడి, యుద్ధ ప్రయోజనమైన రాజ్య లక్షణాన్ని కల్గి ఉండడమే కాక, హైందవ సమాజానికి మహమ్మదీయ మతం వల్ల కలిగే ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు, బలప్రయోగానికి సిద్ధంగా ఉండే విధంగా హైందవ సమాజాన్ని రూపొందించింది. కనుకనే, విజయనగర పాలకులు ఆత్మ చైతన్యంతో కూడిన ఆత్మ రక్షణకు అవసరమైన ఆదర్శంతో ప్రభావితులై, మహమ్మదీయుల విస్తరణను నిరోధించి, పరిమితం చేసే విధానానికి వీలైన సైనిక, రాజ్య వ్యవస్థలను నిర్మించారు. ఫలితంగానే, హైందవ రాజ్యాలన్నిటిలోను యుద్ధానికి సిద్ధంగా ఉండే రాజ్యంగా, విజయనగరం రూపొందించబడిందని కూడా, నీలకంఠశాస్త్రి అభిప్రాయపడ్డారు. విజయనగర సామ్రాజ్య స్థాపన ముగ్గురు మహా పురుషులు, విద్యారణ్య స్వామి, హరిహర, బుక్క రాయల దృఢ సంకల్పానికే ఫలితమని, వెంకట రమణయ్య గారు పేర్కొన్నారు. మహమ్మదీయ దాడుల ఫలితంగా, పాలనా ఫలితంగా, దక్షిణ భారతదేశంలో 'మధురా విజయం'లో, నిలస తామ్ర శాసనంలో వర్ణించిన విధంగా, హిందూ సమాజంలో ఏర్పడిన అరాచక పరిస్థితి, హిందూ ధర్మ సంస్కృతులకు కల్గిన తీవ్ర భంగపాటు, విజయనగర రాజ్య స్థాపనకు ప్రేరణను కల్గించాయని, పండితులు భావించారు.

విజయనగర స్థాపనలో రాజ్య స్థాపనా కాంక్ష్యే ప్రధానమైందని, హిందూ మత రక్షణకు, మహమ్మదీయ ప్రతిఘటనోద్యమం ఉన్నతాదర్శం కాదని, బర్టన్ స్టీన్ వంటి కొందరు చరిత్రకారులు భావించారు. వీరి అభిప్రాయం ప్రకారం, విజయనగర రాజ్య వ్యాప్తి మొదట్లో హిందూ రాజ్యాలైన హోయసాల రాజ్యం, రెడ్డి రాజ్యం మొదలైన వాటిని కబళించడంతో ప్రారంభమైందికానీ, ముస్లిం

BRAOU

రాజ్యాలను ప్రతిఘటించడంతో ప్రారంభం కాలేదు. విజయనగరం దక్షిణంలో చేసిన దండయాత్రలు చాలా వరకు దోపిడీ దండయాత్రలే. కొందరు పండితులు పేర్కొన్నట్లు, విజయనగర కాలంలో తమిళ దేశంలో చిరకాలంగా ఉన్న సభ, ఊర్ మొదలైన స్థానిక స్వపరిపాలనా సంస్థలు నశించిపోయాయి. పూర్వ మర్యాద, పద్ధతి సంరక్షకులుగా పేర్కొన్న విజయనర పాలకులు, ఈ సభలను గాని, ఉర్‌లను గాని రక్షించడానికి ఏవిధమైన ప్రయత్నం చేయలేదు. అంతేగాక, వానిని అణగదొక్కే ప్రయత్నాలు కూడా కొన్ని చోట్ల జరిగాయి. ఇస్లాంను ప్రతిఘటించి, హిందూ వర్ణాశ్రమ ధర్మాన్ని పరిరక్షించడానికి ఉన్నామని గొప్పలు పోయిన విజయనగర సామ్రాజ్యానికి, ప్రధాన శత్రువులు హిందూ నాయకులు, రాజులే. రాజధానీ నగరమైన విజయనగరంలో తురుష్కుల పేట, మసీదు, ముస్లిం సమాధులుండేవి. వీటిని బట్టి అక్కడ అధికారం స్పష్టంగా లౌకికమైందేకాని, మత దృష్టి కల్గిందికాదు. ఇంకా, కాకతీయ సామ్రాజ్య పతనానంతరం, తెలుగు దేశం లోని కమ్మ, రెడ్డి, వెలమ నాయకులు స్వతంత్ర రాజ్యాలను స్థాపించుకోవాలనే రాజకీయ కాంక్షతో, ఆంధ్ర దేశంలో ముస్లిం పాలన నుండి విమోచనోద్యమాన్ని నడిపినట్లే, విజయనగర రాజ్య స్థాపనలో, సామ్రాజ్య వ్యాప్తిలో, ఆశయాలలో రాజకీయపరమైన అధికార కాంక్షే ప్రధాన ఆశయం కానీ, హిందూ మత సంరక్షణ కాదు.

1336లో హరిహర, బుక్క రాయలు విజయనగర సామ్రాజ్య స్థాపన చేసిన విధానానికి, ఆంధ్ర దేశంలో తెలుగు నాయకులు రాజ్య కాంక్షతో స్వతంత్ర రాజ్యాలను స్థాపించిన విధానానికి, పోలిక లేదు. విజయనగర స్థాపనకు మూల పురుషుడు విద్యారణ్యస్వామి. వెంకట రమణయ్య గారి అభిప్రాయం ప్రకారం, "ఆయన వంటి విశాల హృదయుడైన సన్యాసి, ఆయుగంలో మరొకడు కానరాడు. శాస్త్ర విజ్ఞానంలో అతన్ని మించిన వారు మరెవ్వరూ లేరు; అద్వైత వేదాంతంలో మొదటి బంతి లోని వాడు; సర్వకళా విశారదుడు, సర్వతంత్ర స్వతంత్రుడు; రాజ్య తంత్ర పారంగతుడు. ఈ గుణాలన్నీ కొంచెమో, గొప్పో, అన్యులందూ కానరావచ్చును; కాని, అతని విశిష్టత, మ్లేచ్ఛ దోషావసన్నమైన, నమసిపోవ సంసిద్ధమై ఉండిన సనాతన హిందూ ధర్మాన్ని పునరుద్ధరించాలనే దృఢ సంకల్పం. కాని, రాజకీయ స్వాతంత్ర్యం లేక, హిందూ ధర్మాన్ని పునరుద్ధరించుట దుస్సాధ్యమని, అతడెరుగును. ఇంకా విద్యారణ్యులవారు ఆంధ్ర దేశం లోని ములకనాడు వాస్తవ్యుడగుట చేత, అపుడు ఆంధ్ర దేశంలో ముంచుకొనుండిన జాతీయాభిమానమతని హృదయాంతరాళాన నిండుకొన్నది. కావున, సంగమ రాజ పుత్రుల (హరిహర, బుక్క) యెడ సానుభూతిని చూపి, వారిని తన శిష్యకోటి యందు చేర్చుకొని, వారి మూలాన దక్షిణ భారతాన్నుండి తురకలను సంపూర్ణంగా తరిమి వేసి, హిందూ ధర్మానికి నూతనాభ్యుదయాన్ని కల్గించాలని నిశ్చయించుకొనెను" విద్యారణ్యుల మహోన్నత ఆశయమే, ఆయన ప్రభావం లోకి వచ్చిన హరిహర, బుక్క సోదరులలో ప్రేరణను కల్గించి, విద్యారణ్యుల ఆశీస్సులతో, సహాయసహకారాలతో విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించేటట్లు చేసింది. విజయనగర స్థాపకుల ఆశయం, హిందూ ధర్మ రక్షణే అనడానికి మరొక నిదర్శనం, "విజయనగర సామ్రాజ్య చరిత్రను పఠించు వారెల్లప్పుడూ జ్ఞప్తియందుంచుకొనాల్సిన విషయ మొకటి కలదు. సామ్రాజ్యానికి వాస్తవమైన అధిపతి, పంపా విరూపాక్ష స్వామి. అది ఆ దేవుని సొమ్ము. హరిహరాది రాయపీఠస్థులందరూ ఆ దేవుని పేర దేవాలయ భూములను పాలించు పారుపత్యకాండ్రు. దేవుని కార్యాలను నిర్వహించు సేవకులు. కావుననే, రాజ శాసనాలు, దర్మ శాసనాలు, రాయల సంతకంతో కాక, విరూపాక్ష స్వామి వారి సంతకంతో ప్రకటింపబడుతూ వచ్చాయి. రాయలొనర్చు దానధర్మాలన్నీ, విరూపాక్ష స్వామి వారి సన్నిధానాన్నే జరుగుతూవచ్చాయి. నూతన రాజధానగు విద్యానగరం విరూపాక్షస్వామి వారి కోవెలకు సమీపాన నిర్మించబడింది", అని, వెంకట రమణయ్యగారు పేర్కొన్నారు.

BRAOU

దక్షిణ దేశంలో కొన్ని హిందూ రాజ్యాలను జయించినంతమాత్రాన, విజయనగరం రాజకీయంగా రూపొందిన లౌకిక రాజ్యమని చెప్పలేం. రాజకీయంగా సుస్థిరతను సాధిస్తేనే కదా మిగిలిన విజయాలను సాధించగల్గేది. మహమ్మదీయులు కూడా ఉత్తర భారతంలో ముందు రాజ్యాధికారాన్ని సాధించి, రాజకీయంగా బలపడిన తర్వాతే, మత వ్యాప్తికి పూనుకొన్నారు. ఆంగ్లేయులు కూడా రాజకీయంగా వారి అధికారాన్ని సవాలుచేసే వారు లేరన్న తర్వాత, క్రైస్తవ మతాన్ని ప్రచారం చేశారు. శివాజీ హిందూ స్వరాజ్య స్థాపన చేయడానికి సోదర మోరే వంశస్థులపై దాడులను జరపలేదా! బలమైన రాజ్యాన్ని స్థాపిస్తేనే కాని, హిందూ మతాన్ని రక్షించి, పోషించడం జరుగదు. సార్వభౌమత్వ ఆశయ సిద్ధిలో వారు పొరుగునున్న హిందూ రాజులను గెలిచినందువల్ల, వారి రాజ్యాలను ఆక్రమించినందువల్ల, విజయనగర రాజులు హిందూ ధర్మ రక్షణకు అంకితం కాలేదని చెప్పడం సరికాదు. అలాగే, విజయనగర సైన్యంలో ముస్లింలున్నారని, వారికి ఒక పేట, మసీదులున్నాయని, వారి సమాధులున్నాయని, అందుచేత విజయనగర సామ్రాజ్య ఆశయం హిందూ మత సంరక్షణ కాదని చెప్పడం, సమంజసం కాదు. రాజకీయ భద్రత కోసం, అశ్విక దళంలో ప్రసిద్ధి వహించిన మహమ్మదీయులను ఎదుర్కొనుటకు, అశ్విక దళం లోను, పిరంగి దళం లోను కొద్ది మంది మహమ్మదీయ సైనికులను చేర్చుకోవడం, రాజకీయ ప్రయోజనాలకు సంబంధించింది. మహారాష్ట్ర నాయకుడు శివాజీ కూడా నౌకా బల నిర్మాణంలో కొందరు మహమ్మదీయులను చేర్చుకోలేదా! కృష్ణదేవరాయలు మహమ్మదీయులను ఎదుర్కోవడానికి, అశ్విక దళ ఆవశ్యకతను గుర్తించి, పోర్చుగీస్ వారి సహాయాన్ని పొందలేదా!

ఈ విషయాలన్నీ విజయనగర రాజుల మత సహనాన్ని రుజువు చేస్తాయి. కానీ, వారి రాజ్యం లౌకిక రాజ్యమని రుజువు చేయలేవు. వాస్తు విషయాలలో మహమ్మదీయ సాంప్రదాయాలను కొన్ని టిని అనుసరించినంత మాత్రాన, విజయనగర రాజులు హిందూ ధర్మ రక్షకులు కాదని చెప్పలేం. మహమ్మదీయులు హిందూ వాస్తు పద్ధతులను, హిందువులు మహమ్మదీయ పద్ధతులను అనుసరించుట, ఆ కాలంలో వచ్చిన వాస్తు పద్ధతుల మార్పును సూచిస్తాయి. విజయనగర రాజులు నిర్మించి, పోషించిన అసంఖ్యాక దేవాలయాలు, వారికి హిందూ మతం పట్ల అభిమానాన్ని, ఆదరణను వ్యక్తం చేస్తాయి. విజయనగర రాజులు రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా కొన్ని మహమ్మదీయ పద్ధతులను అవలంబించినా, విజయనగర రాజ్య స్థాపన చేయడంలో ప్రధాన ఉద్దేశం, దక్షిణ భారతదేశంలో ఇస్లాం మత వ్యాప్తిని అరికట్టి, హిందూ వైదిక ధర్మ సంస్కృతీ పరిరక్షణ చేయడమేనని భావించడం యుక్తం.

16.3 : విజయనగర సామ్రాజ్య స్థాపనకు ముందు దక్షిణ దేశ పరిస్థితి

1336లో సంగముని కుమారులు హరిహర, బుక్క రాయలు, విద్యారణ్యుల ఆశీస్సులతో, విజయనగర రాజ్య స్థాపన చేయడానికి ముందు, దక్షిణ దేశ పరిస్థితులను తెలుసుకోవడం అవసరం. 1206లో డిల్లీ సుల్తాన్ సామ్రాజ్య మేర్పడి, ఉత్తర భారతదేశమంతా మహమ్మదీయుల అధీనం లోకి వచ్చినా, చాలా కాలం దక్షిణ హిందూదేశం మహమ్మదీయ దాడులకు గురి కాలేదు. దక్షిణ హిందూదేశం లోకి ప్రవేశించిన మొదటి మహమ్మదీయులు ఖిల్జీలు. ఖిల్జీ వంశ స్థాపకుడు జలాలుద్దీన్ ఖిల్జీ కాలంలో, అతని అల్లుడైన అల్లాఉద్దీన్ ఖిల్జీ దక్షిణ దేశంపై దాడి చేశాడు. ఆనాడు దక్షిణ దేశంలో నాలుగు ప్రముఖ రాజ్యాలున్నాయి. అవి : 1. దేవగిరి రాజధానిగా ఉన్న యాదవ రాజ్యం; 2. ఓరుగల్లు రాజధానిగా కాకతీయ సామ్రాజ్యం; 3. ద్వారసముద్రం రాజధానిగా హోయసాల రాజ్యం; 4. మదుర రాజధానిగా పాండ్య రాజ్యం. 1294 లో అల్లాఉద్దీన్ దేవగిరిపై దండెత్తి,

BRAOU

ఆపార ధనరాశులను దోచుకెళ్ళాడు. అల్లాఉద్దీన్ ఢిల్లీ సింహాసనాన్ని ఆక్రమించిన తర్వాత, దక్షిణ దేశాన్నంతటినీ జయించ నిశ్చయించాడు. 1303లో చజ్జా నాయకత్వంలో బెంగాల్, ఒరిస్సాల గుండా అల్లాఉద్దీన్ సైన్యం తెలంగాణా ప్రవేశించింది. కాని, కాకతీయ ప్రతాపరుద్రుడు ఈ సైన్యాన్ని ఓడించి, వెనుకకు తరిమాడు. అల్లాఉద్దీన్ సైన్యం ప్రతాపరుద్రుని చేతిలో ఓడిపోవడంతో, ధైర్యాన్ని పొందిన యాదవ రామచంద్రుడు కప్పం కట్టడం మానివేశాడు. దానితో 1306-07లో అల్లాఉద్దీన్ బానిస, మాలిక్కాఫర్ దేవగిరిపై దండెత్తాడు. దేవగిరి అల్లాఉద్దీన్ వశమైంది. 1303 లో పొందిన ఓటమికి ప్రతీకారాన్ని చేయడానికి, 1308లో మాలిక్కాఫర్ ఓరుగల్లును ముట్టడించాడు. అకస్మాత్తుగా జరిగిన ఈ దాడిలో, కాకతీయ సైన్యం అనేక నష్టాలకు గురై , చివరకు ప్రతాపరుద్రుడు విలువైన కానుకలను సమర్పించి, సాలీనా కప్పం కట్టడానికి అంగీకరించాడు. 1310లో ద్వారసముద్రం, 1311లో మదుర, ఖిల్జీ దండయాత్రలకు గురై, కప్పం కట్టడానికి అంగీకరించాయి. అల్లాఉద్దీన్ దక్షిణ రాజ్యాలన్నిటినీ ఓడించి, కప్పం వసూలు చేశాడేకాని, వాటిని తన రాజ్యంలో కలుపుకోలేదు.

ఉత్తర భారతంలో ఖిల్జీల తర్వాత రాజ్యానికి వచ్చిన ఘియాసుద్దీన్ తుగ్లక్, తన కుమారుడైన ఉలుగ్ ఖాన్‌ను ఓరుగల్లు పైకి దాడికి పంపాడు. 1322 లో జరిగిన ఈ దాడిని, ప్రతాపరుద్రుడు వీరోచితంగా ఎదుర్కొన్నాడు. కాని, మరునటి సంవత్సరమే (1323)లో ఉలుగ్‌ఖాన్ తిరిగి దాడి చేసి, ప్రతాపరుద్రుని బందీగా ఢిల్లీకి పంపాడు. మార్గ మధ్యంలో ప్రతాపరుద్రుడు ఆత్మ హత్య చేసుకొన్నట్లు తెలుస్తోంది. ఓరుగల్లు పతనానంతరం ఉలుగ్‌ఖాన్ మిగిలిన దక్షిణ దేశాన్ని కూడా జయించడానికి పూనుకున్నాడు. అనతి కాలం లోనే, కొండపల్లి, నెల్లూరు, కొండవీడు, కొలనవీడు, నిడదవోలు, రాజమహేంద్రవరం మొదలైనవి మహమ్మదీయుల వశమైనాయి. తెలుగు దేశమే గాక, నిబాపర్ (నెల్లూరు) మొదలుకొని, కులం (క్విలన్) వరకు వ్యాపించిన 'మాబార్' దేశం కూడా, 1323లోనే జయించబడినట్లు, 14వ శతాబ్దం నాటి వనాఫ్ అనే ముస్లిం చరిత్రకారుడు తెలియజేస్తున్నాడు. తెలుగు దేశమే కాక, హోయసాల రాజ్యం, కంపిలి రాజ్యం కూడా, సుల్తాన్ అధికారం లోకి వచ్చాయి. 1325 లో ఉలుగ్ ఖాన్ తండ్రి మరణానంతరం మహమ్మద్ బిన్ తుగ్లక్ పేరుతో, ఆక్రమించిన దక్షిణ దేశాన్ని తన పాలన లోనికి తెచ్చాడు.

దక్షిణ దేశం లోని ప్రజలు మహమ్మదీయ పాలనలో పడరాని పాట్లు పడ్డారు. దేశమంతటా అరాచక పరిస్థితి తాండవించింది. ముస్లింల పాలన ఎంతో దుష్టంగాను, క్రూరంగాను ఉండేది. అప్పటి పరిస్థితులను విలస తామ్ర శాసనం, గంగాదేవి రచించిన 'కంపరాయ విజయం' అని, పేరుగల్గిన 'మధురా విజయం' విపులంగా వర్ణించాయి. విలస తామ్ర శాసనం ప్రకారం, "ప్రతాపరుద్రుడను భానుడు అంతర్హితుడుకాగా, లోకాన తురుష్క అంధకారం వ్యాపించింది..... దేశం యవనాక్రాంతమైన పిదప, ధనికులు అనేక పాపోపాయాల చేత, ధనం నిమిత్తం పీడింపబడ్డారు. పారశీకులను (తురుష్కులను) చూచీ చూచుట తోడనే, కొందరు తమ ప్రాణాలను వదలినారు. ద్విజులు తమ యజ్ఞ కర్మలను వదులుకొనాల్సొచ్చింది. దేవ ప్రతిమలు సమస్తం భగ్నాలైనాయి. చిరకాలంగా మహాపండిత భుక్తా లగుచున్న అగ్రహారాలన్నియు ముస్లింలచే అపహృతాలైనాయి. పాపులైన యవనులు వ్యవసాయాన్ని చేసినందువల్ల, పంట పర్యాయాలను బలాత్కారంగా లాగుకొనుటచేత, దరిద్రులు, ధనికులు అను భేదం లేక, సైతు కుటుంబాలన్నీ నాశనమైనాయి. ఆ మహా విపత్కాలాన విత్తం, భార్య మొదలగు నేని యందును, ప్రజలకు స్వాయత్తతాభావం (ఇది నాది అను భావం) పోయినది. కల్లు తాగాలి, ఆవు మాంసాన్ని తినాలి, బ్రాహ్మణులను చంపాలి. ఇది యవనాధముల వృత్తి. వారి వ్యాపారం ఇట్లుండినపుడు, ఇక భూమి మీద ప్రాణి లోకం బ్రతుకు లెట్లు? ఈ విధంగా రాక్షసుల వంటి తురుష్కుల వలన పీడింపబడిన త్రిలింగ దేశం, రక్షించు వారెవరును మనస్సుకు కూడా తట్టక,

BRAOU

కారుచిచ్చు అంటుకున్న అడవి వలె సంతసించి పోయింది". 'ఆంధ్రావనీ చక్రం యవనుల చేత అపహృతమైనపుడు, సర్వజనులు అధర్మ కర్మ నిరతులైనారని, ఆనాటిదే మరొక శాసనం తెలుపుతోంది. ఆంధ్ర దేశ పరిస్థితి ఇట్లా దుర్భరంగా ఉంటే, ద్రావిడ దేశ పరిస్థితి ఇంతకన్నా శోచనీయంగా ఉన్నట్లు మదురావిజయం వల్ల తెలుస్తోంది. 'పూజా పురస్కారాలు నిల్చి పోవుట వలన, దేవాలయాలు పాడుపడినాయి. మృదంగ ధ్వానాలకు బదులు, వాటి యందు నక్కల యూళలు కలగుచున్నాయి. నీతి లేని తురుష్కుల వలె, కావేరి తన పూర్వ మర్యాదలను ఉల్లంఘించి, తరచుగా తన ప్రవాహం వలన సర్వనాశనాన్ని గావించుచున్నది. అగ్రహారాలందు శతతాధ్వర సౌరభాలకు బదులు, వచ్చిమాంసపు పొల గుబులుకొనుచున్నది; వేద ఘోషణకు మారు, విక్రుత తురుష్క సింహనాదాలు వినవచ్చుచున్నవి. మధురాపురి పరిసరాస్థందతి ఉపవనాలు, చూచుటకు ఘోరాలై ఉన్నవి. నారికేళ ఖండాలు ఖండితాలైనవి; ఎటు చూచినను మనుష్య కపాల మాలికలు ప్రేలాడు శూల పరంపరలు గానవచ్చుచున్నవి; ఏ పట్టణపు రాజ వీధులు రమణీమణుల మణినూపుర ప్రణాదాల వలన రమణీయాలై ఉండెనో, అవి ఇపుడు ద్విజుల సంకెళ్ల చప్పుడు వలన, కర్ణశూలాలైనవి. సాలీని గూండ్లు, పుర గోపుర సాలభంజికలకు పట్టు పుట్టాలైనవి. హిమచందనవారి శాకాలచే నే రాజమందిరాంగణముల జల్వలీను చుండెనో, అవి నేడు బందీకృతులైన వనితా జనాల కన్నిటిచే దడియుచున్నవి. పూర్వం జలకాలాడు స్త్రీల మేని చందనాల వలన, దేని జలాలు పాండుర మగుచుండెనో, అ తామ్రపర్ణి పావనోదకాలు నేడు వృశంసులైన తురుష్కులచే జంపబడిన గోవుల రక్తం వలన, ఎర్రనై పారుచున్నవి. వేదం విస్మరింపబడింది. ధర్మం దాగింది. న్యాయోచార్యాలు భూమియుండెందునూ గానరావు. దిక్కులేని ద్రావిడుల ముఖాలందు నిరాశ నెలకొని ఉంది!

పై ఆధారాలే కాక, సమకాలీన యాత్రికులు కూడా, మహమ్మదీయ రాక్షస కృత్యాలను వర్ణించారు.

ఈ విధంగా మహమ్మదీయ పాలనకు లోనై, అరాచక పరిస్థితిలో ఉన్న దక్షిణ భారతదేశాన్ని, ముస్లిం పాలన నుండి విముక్తి చేయడానికి, విమోచనోద్యమాలు ప్రారంభమైనాయి. కాకతీయ ప్రతాపరుద్రుని సేనానులైన తెలుగు నాయకులు ఆంధ్ర దేశం లోను, హోయసాల బల్లాలుడు కర్ణాటక, ద్రావిడ దేశాల లోను, విమోచనోద్యమాలను నడిపారు. ఆంధ్ర దేశంలో ఈ ఉద్యమానికి నాయకత్వం వహించిన వాడు, ప్రోలయ నాయకుడు. ప్రతాపరుద్రుని కొలువులో ఉన్న 75 గురు నాయకుల సంతతిలో కొందరు, ముఖ్యంగా అద్దంకి వేమారెడ్డి, రావు సింగమనీడు, చోడభక్తిరాజు మొదలైనవారు, ప్రోలయ నాయకుడితో సహకరించారు. వీరి విషయానికైన పోచినాయని పుత్రుడు ప్రోలయ నాయకుడు, రేకపల్లి దుర్గ కేంద్రంగా, ఈ విమోచనోద్యమాన్ని నడిపాడు. అతని పినతండ్రి కుమారుడు, కాపయ నాయకుడు అతనికి కుడి భుజమైనాడు. ఈ ఉద్యమం ఏ విధంగా నడిచిందో తెలుసుకోవడానికి, సరైన ఆధారాలు లేవు. తీరాంధ్రదేశం కాకతీయ సామ్రాజ్య పతనానంతరం 3-4 ఏండ్లలోనే, అంటే 1326 నాటికి, ముస్లిం పాలన నుండి విముక్తి పొందినట్లు, శాసనాల వల్ల తెలుస్తోంది. 1325 నాటికి ఒక శాసనం వేమారెడ్డిని 'మ్లేచ్ఛాబ్ధి కుంభోద్భవుడ'ని వర్ణిస్తోంది. 1326 నాటి మరొక శాసనం, ప్రతాపరుద్రుని సేనాధిపతి కొలని రుద్రదేవుడు, ప్రతాపరుద్రునికి పూర్వంగా చేసిన దానాన్ని గురించి చెబుతూంది. వీటిని బట్టి, 1325-26 మధ్య తీరాంధ్ర దేశం ముస్లిం పాలన నుండి విముక్తి పొందినట్లు చెప్పొచ్చు. 1326 తర్వాత ముద్రించిన తుగ్లక్ నాణేలు ఆంధ్ర దేశంలో లభ్యంకాకపోవడం కూడా, ఈ విషయాన్ని సమర్థిస్తుంది.

1330 ప్రాంతంలో ప్రోలయ నాయకుడు మరణించిన తర్వాత, అతని పినతండ్రి కుమారుడు కాపయ నాయకుడు, ఈ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. తెలంగాణాను కూడా మహమ్మదీయ

BRAOU

పాలన నుండి విముక్తి చేయడానికి, పొరుగునున్న హిందూ రాజులతో రాయబారాలను నడిపి, సైన్యాన్ని వృద్ధిచేసుకొని, తెలంగాణాలో రాజకీయ విప్లవాన్ని లేపడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు.

తుగ్లక్ పాలనకు విరుద్ధంగా తిరుగుబాట్లు విజయవంతమవడంతో, దక్కన్‌లో సాగర్ పాలకుడు, సైన్యాధిపతైన మల్లిక్ బహాఉద్దీన్ గుష్టాస్ప్, తుగ్లక్ అధికారాన్ని ధిక్కరించి, కప్పం పంపుట మానివేశాడు. ఈ రాజద్రోహిని శిక్షించడానికి, తుగ్లక్ ఖాజా జహాన్‌ను పంపాడు. దేవగిరి వద్ద జరిగిన యుద్ధంలో, బహాఉద్దీన్ ఓడిపోయి, కంపిలి రాజును శరణు కోరాడు.

కంపిలి, విజయనగర రాజ్య స్థాపనకు పూర్వం, హంపి ప్రాంతాన స్థాపించబడిన చిన్న రాజ్యం. ఇది మొదట్లో దేవగిరి యాదవ రాజ్యానికి సామంత రాజ్యంగా ఉండేది. దేవగిరి పతనమైన తర్వాత, స్వతంత్ర రాజ్యంగా ఏర్పడింది. ముమ్మడి సింగదేవుడు, అతని కుమారుడు కంపిలి రాయలు, అతని కుమారుడు రామనాథ, కంపిలిని పాలించినట్లు తెలుస్తోంది. వీరు మాలిక్కాఫర్ దండయాత్రను వీరోచితంగా ఎదుర్కొని, స్వతంత్రంగా నిల్చారు. వీరు మొదటి నుండి తుగ్లక్‌కు శత్రువులుగానే ఉన్నారు. కాకతీయ రాజ్యం పతనమైన తర్వాత, అక్కడ నుండి వచ్చిన నాయకులకు, తుగ్లక్‌పై తిరుగుబాటు చేసిన బహాఉద్దీన్‌కు ఆశ్రయం ఇచ్చారు. దీనితో, తుగ్లక్ ఆగ్రహానికి గురికావలసొచ్చింది. ఢిల్లీ సైన్యాలు కంపిలిపై దాడులను చేశాయి. ఈ దండయాత్రల్లో కంపిలి రాయల కుమారుడు రామనాథుడు చూపిన ధైర్యసాహసాలను, కన్నడం లోని **'పరదార సోదర రామనాథ కథ'**, తెలుగు లోని **'కుమార రాముని కథ'** తెలుపుతున్నాయి. మొదటి రెండు దాడులను రామనాథుడు ఓడించి, వెనుకకు పంపాడు. మూడవ సారి ఖ్వాజా జహాన్ పెద్ద సైన్యంతో కంపిలిపై దండెత్తగా, 1327-28 లో జరిగిన ఘోర యుద్ధంలో కంపిలి రాజ్యం సుల్తాన్ సేనల వశమైంది. తుగ్లక్ అక్కడ రెండు సంవత్సరాలుండి, మాలిక్ నెబీను అధిపతిగా నియమించి, ఢిల్లీకి తిరిగి వెళ్ళాడు.

తుగ్లక్ ఢిల్లీకి మరలగానే, తెలుగు నాయకులు కాపయ నాయకత్వంలో తెలంగాణాను విముక్తి చేయడానికి పూనుకున్నారు. ఈ ఉద్యమంలో హోయసాల బల్లాలుడు మొదలైనవారు, కాపయతో సహకరించినట్లు తెలుస్తోంది. 1328 - 37లో కాపయ నాయకుడు ఓరుగల్లును ముట్టడించాడు. ఓరుగల్లు పాలకుడుగా ఉన్న నాయబ్ వజీర్ మల్లిక్ మగ్బుల్, యుద్ధంలో ఓడి, పారిపోయాడు. ఓరుగంటి కోట కాపయ వశమైంది. ఇదే సమయంలో, ప్రోలయ వేమారెడ్డి గుండ్లకమ్మ, కృష్ణా నదీ మధ్య ప్రాంతాన్ని జయించినట్లు, అతని శాసనాలు చెబుతున్నాయి. ఈ విధంగా ముస్లిం పాలన నుండి విముక్తి పొందిన తెలుగు దేశాన్ని 'ఆంధ్రదేశాధీశ్వర', 'ఆంధ్రసురత్రాణ' బిరుదులతో, ఓరుగల్లు రాజధానిగా, కాపయ నాయకుడు పాలించాడు.

ఆంధ్ర ప్రాంతంలో స్వాతంత్ర్యోద్యమం విజయం పొందడంతో, దక్షిణ దేశం లోని ఇతర రాజులు కూడా, తుగ్లక్ పాలన నుండి విముక్తి పొందడానికి తిరుగుబాట్లు చేశారు. అలువంటి వారిలో ఆరవీటి వంశ పూర్వీకుడైన సోమదేవరాజు, ప్రముఖుడు. దోనేరు కోనేరునాథకవి రచించిన **'ద్విపద బాల భాగవతం'**, అందుగుల వెంకయ్య రచించిన **'రామరాజీయం'**, ఈ విజయాలను తెలుపుతున్నాయి. సోమదేవరాజు ఒకే రోజున ముసలిమడుగు, సాతానికోట, కందనవోలు (కర్నూలు), కల్వకొలను, రాచూరు, యాతగిరి, గంగనేనికొండలను సాధించినట్లు, గ్రంథాలు తెలుపుతున్నాయి. ఇవేకాక, నాగులపాడు, ముదుగల్లు, ఆనెగొంది మొదలైన చోట్ల జరిగిన యుద్ధాల్లో, ఎంతో మంది వీరులను ఓడించాడు. ఈ స్థలాలన్నీ ఇప్పటి బళ్ళారి, కర్నూలు, రాయచూర్ జిల్లాల్లో ఉన్నాయి. ఈ ప్రాంతానికి మహమ్మదీయ అధికారైన మాలిక్ నాయబ్ మహమ్మద్, సోమదేవరాజు పైకి

BRAOU

దండెత్తి వచ్చాడు. కానీ, సోమదేవరాజు చేతిలో ఓడి, ఆరువేల గుర్రపు దళంతో బందీగా దొరికాడు. సోమదేవరాజు అధికారాన్ని గుర్తిస్తానని, తన బిడ్డకు అతని పేరు పెట్టుకుంటానని వేడుకొనగా, సోమదేవరాజు అతణ్ణి విడిచిపెట్టాడు. సోమదేవరాజు కృష్ణ, తుంగభద్రల మధ్య, కోటలను వశం చేసుకొని, తన బంధువులను పాలకులుగా పెట్టాడు. ఈ తిరుగుబాట్లలో, సోమదేవరాజు, కాపయ నాయకుల మధ్య సహకారమున్నట్లు ఆధారాలున్నాయి.

తుగ్లక్ దక్కన్ నుండి వెళ్ళిపోయిన తర్వాత, అంతవరకు ఆతనికి కప్పం కడుతున్న ద్వార సముద్రపు హోయసాల బల్లాల రాజు కూడా, కర్ణాటకాన తిరుగుబాట్లు చేశాడు. కంపిలి పాలకుడైన మాలిక్ నాయబ్ ఈ తిరుగుబాట్లను అణచుట సాధ్యం కాదని, ఈ ప్రాంతం వాడే ఇక్కడికి అధిపతిగా వస్తే తిరుగుబాట్లను అణచవచ్చని, తుగ్లక్‌కు సూచించాడు. అపుడు సుల్తాన్, తన వజీర్లతో సంప్రదించి, కంపిలి రాజ్యం లోని హోస దుర్గాన్ని సాధించినపుడు బందీలుగా చిక్కిన హరిహర, బుక్క సోదరులను, ఇస్లాం మతమిచ్చి, వారిని సామంతులుగా కంపిలి రాజ్యాన్ని పాలించుటకు పంపెనని, న్యూనిజ్, బరనీ **రాజ కాల నిర్ణయం, విద్యారణ్య వృత్తాంతం, విద్యారణ్య కాలజ్ఞానం** మొదలైన వాటిని బట్టి తెలుస్తున్నది. ఈ పరిస్థితులే విజయనగర రాజ్య స్థాపనకు దారితీశాయి. హరిహర, బుక్క సోదరులు ఏ విధంగా విజయనగర రాజ్య స్థాపన చేసింది, ఇదే భాగంలో తెలుసుకుంటారు.

16.4 : విజయనగర పుట్టుపూర్వోత్తరాలు : తత్సంబంధిత సిద్ధాంతాలు

విజయనగర రాజ్య స్థాపకులైన హరిహర, బుక్కరాయల పుట్టుపూర్వోత్తరాల గురించి, చరిత్రకారుల మధ్య అనేక అభిప్రాయ భేదాలున్నాయి. దీనిక్కారణం, వీరి జన్మ వృత్తాంతాన్ని తెలిపే ఆధారాలలో విభేదాలుండడమే. **విద్యారణ్య కాలజ్ఞానం, విద్యారణ్య వృత్తాంతం, రాజకాల నిర్ణయం** వంటి స్థానిక రచనలు; బరనీ రచించిన **'తారీఖ్-ఇ-ఫిరోజ్ షాహీ'**; ఇసామీ రచించిన **ఫుతూహుస్ సలాతిన్**; పెరిష్టా వ్రాసిన గుల్షన్ ఇబ్రాహీమీ వంటి ముహమ్మదీయ రచనలు; న్యూనిజ్, ఇబ్నబతూతా వంటి విదేశీ యాత్రికుల రచనలు, వారి పుట్టుపూర్వోత్తరాల గురించి ప్రస్తావించాయి.

విస్మృత విజయనగర సామ్రాజ్యం (A Forgotten Empire) అనే గ్రంథం ద్వారా విజయనగర చరిత్రను వెలుగులోకి తీసుకువచ్చిన రాబర్ట్ సీవెల్, స్థానిక, విదేశీ రచనలను విశ్లేషించి, విజయనగర స్థాపన గురించి ఏడు సంప్రదాయాలు ప్రచారంలో ఉన్నాయని, ఇవన్నీ నమ్మశక్యం కాని కట్టుకథలతో నిండి ఉన్నాయని, వీటిని విమర్శనాత్మకంగా, చారిత్రక దృక్పథంతో విశ్లేషించినపుడే వాస్తవ విషయాన్ని తెలుసుకోగలమని సూచన చేశాడు. విజయనగరం 1336లో స్థాపించబడిందని, మొదటి హరిహరుని 1340 నాటి శాసనం బుజువు చేస్తుందని, ఇబ్నబతూత పేర్కొన్న తుగ్లక్ దక్షిణ దండయాత్ర, న్యూనిజ్ రచనలో ఇవ్వబడిన ఉదంతానికి సరిపోతుందని, సీవెల్ అభిప్రాయపడ్డారు. సీవెల్ పేర్కొన్న మరొక ఉదంతం. హరిహర, బుక్క అను సోదరులు వరంగల్ పాలకుల కొలువులో ఉండగా, ముహమ్మదీయులచే వరంగల్ రాజ్యం నాశనం కాగా, కొద్ది మంది అశ్విక దళంతో తప్పించుకుపారిపోయి, అనెగొంది చేరుకుని, వారితోపాటుగా మాధవ, లేక మాధవ విద్యారణ్య అనే బ్రాహ్మణుడున్నాడని, వారే కొంత కాలానికి ఆప్రాంత పాలకులై విజయనగరాన్ని నిర్మించారని చెబుతోంది. ఇంకొక కథ ప్రకారం, 1309లో వరంగల్‌ను పాలిస్తున్న రాజప్రతినిధి కొలువులో బుక్క, హరిహరులున్నారని, మాలిక్కాఫర్ నాయకత్వంలో ముహమ్మదీయ సైన్యం హోయసాల బల్లాలునిపై దండెత్తి, ద్వారసముద్రాన్ని ఆక్రమించగా, సోదరులిద్దరూ ఉన్న సైన్యం ఓడిపోగా, కొండ ప్రాంతమైన

BRAOU

ఆనెగొందికి పారిపోయి, మాధవ అనే పుణ్య పురుషుని కలుసుకొని, అతని సహాయంతో రాజ్యాన్ని, విజయనగరాన్ని నిర్మించారని తెలుస్తోంది. ఇంకొక కథ ప్రకారం, భూమిలో ఉంచబడిన నిధులు లభ్యమైన తర్వాత, మాధవ విజయనగరాన్ని నిర్మించి, తన మరణానంతరం కురుబు వంశం వారి కివ్వగా, వారే మొదట వంశ స్థాపన చేశారని తెలుస్తోంది. కూచో విజయనగర స్థాపన గురించి మరొక రకంగా తెలియచేశాడు. 1220లో మాదవాచార్యులు కొండలలో సన్యాసి వలె నివసిస్తుండగా, పశువుల కావరైన బుక్క ఆహారం పెట్టి, పరిచర్యలు చేస్తుండగా, "నీవు రాజువై భారతదేశానికి చక్రవర్తివౌతావ"ని సన్యాసి ఆశీర్వదించగా, ఈ విషయాన్ని విని, మిగిలిన పశువుల కావరులు బుక్కను గౌరవ భావంతో తమ నాయకునిగా చేసుకొన్నారు.. కొంత కాలానికి, రాజ పదవిని సంపాదించి, తన సరిహద్దులో ఉన్న రాజ్యాలను జయించగా, ఢిల్లీ సుల్తాన్ దండెత్తి వచ్చి, ఓడి, తిరిగి వెళ్ళిపోయాడు. బుక్క అనంతరం ఒక నగరాన్ని నిర్మించి, విజయనగర మనే పేరు పెట్టాడు. 1474లో భారతదేశాన్ని దర్శించిన రష్యా యాత్రికుడు నికిటిన్, ప్రాచీన రాజ వంశమైన బనవాసి కదంబ వంశానికి చెందిన వారని అభిప్రాయపడి, 'బీజ్‌నగర్' నుండి పాలించిన 'ది హిందూసుల్తాన్ కదమ్' ను పేర్కొన్నాడు. ఈ గాధలే కాక, ఇంకా గాథలనేకం ఉన్నాయని, హరిహర, బుక్క సోదరులు కదంబ తెగకు చెంది, మతాభిమానంగల హిందువులని, వీరు కోశాధికారులుగా ఓరుగల్లు రాజు కొలువులో ఉండేవారని, 1323 లో ఓరుగల్లు పతనమైన తర్వాత ఆనెగొంది రాజు కొలువులో చేరి, అక్కడ మంత్రి, కోశాధికారి పనిచేశారని, మహమ్మద్ బీన్ తుగ్లక్ పై తిరుగుబాటు చేసిన బహాఉద్దీన్‌కు ఆశ్రయమివ్వగా, మహమ్మద్ దండెత్తి, మల్లిక్‌ను పాలకుడిగా నియమించాడని, మల్లిక్ అక్కడ తిరుగుబాట్లను అణచలేక పోయాడని, అపుడు సుల్తాన్ హిందూ సోదరులను రాజుగాను, మంత్రిగాను నియమించాడని, వారే మొదటి హరిహరుడు, మొదటి బుక్కరాయలని, సీవెల్ నిర్ణయించాడు.

ఈ విషయం పై ఫాదర్ హీరాస్ వ్రాస్తూ, "ఈ సాంప్రదాయక కథలలో ఖచ్చితమైనదని చెప్పదగిన ఒకటైనా చారిత్రక వాస్తవం లేకపోవడమేకాక, దాన్ని కాదనలేరనే నమ్మకంతో కూడిన సమంజసమైన వాదాన్ని, ఎంతమాత్రమూ ప్రతిపాదించలేం. కాలాన్ని నిర్ణయించే సంఘటనలు వైవిధ్యంతో కూడుకున్నవే గాక, సూక్ష్మ వివరణలతో గందరగోళంగా ఉన్నాయి", అని అభిప్రాయపడుతూ, విజయనగరాన్ని నిర్మించినవాడు హోయసాల మూడవ బల్లాలుడని నిర్ణయించారు. వీరి వాదనకు మూలం, ఫెరిష్టా రచన. ఫెరిష్టా తన రచనల్లో హోయసాల బల్లాలుడు తన కుమారుని పేర 'బీజనగర్' ను 1344 లో స్థాపించినాడని, ఈ బీజనగర్ విజయనగరమైందని పేర్కొన్నాడు. ఈ వాదాన్ని లూయీస్ రైస్, కృష్ణస్వామి అయ్యంగార్, శాలిటోర్, పి.బి. దేశాయ్, జి. యస్. గాయ్, మొదలైన చరిత్రకారులు బలపర్చారు. విజయనగర నిర్మాతలు హోయసాల సామంతులని భావించడానికి తగిన కారణముందని, రైస్ అభిప్రాయం. హెచ్. కృష్ణశాస్త్రి హరిహర, బుక్కరాయలు మూడవ బల్లాలుని సామంతులని నిర్ధారణగా చెబుతూ, మూడవ బల్లాలుని కాలం లోనే తమ బలాన్ని పెంచుకోవడం వల్ల, మూడవ బల్లాలుడు తన రాజధానిని ద్వారసముద్రం నుండి తిరువణ్ణామలైకి మార్చుకొని ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. 1340 నాటికి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకోక పోయినప్పటికీ, బలవంతులై, కోటలను నిర్మించుకొని, ప్రాధాన్యాన్ని సంపాదించి, విదేశీయుల దృష్టిని ఆకర్షించుకొని, 1346లో మూడవ బల్లాలుడు మరణించేంతవరకు, హరిహర, బుక్కలు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకోవాలని ప్రయత్నం చేయలేదు. విజయనగర నిర్మాతలుగా శాసనాల్లో పేర్కొనబడ్డ 5 గురు సోదరులు, బహమని దండయాత్రల నుండి కాపాడడానికి నియమించబడ్డారని, మూడవ బల్లాలుడు 1328, 1329లో హోగు పట్టణం, లేదా విరూపాక్ష పట్టణ నిర్మాణానికి పునాది వేయగా, తుదకు అదే విజయనగరమైందని, కృష్ణస్వామి అయ్యంగార్ అభిప్రాయపడ్డారు. సత్యనాధయ్యర్ అభిప్రాయం

BRAOU

ప్రకారం హోయసాల పాలకులు మదుర రాజ్యాన్ని ఆక్రమించడంతో, విజయనగర రాజ్యానికి పునాది వేయబడిందని, ఈ ప్రయత్నంలో 5 గురు సోదరులు ప్రముఖులుగా కనిపిస్తారని అభిప్రాయపడ్డారు. హరిహర, బుక్క సోదరులు కర్ణాటకులే అనే వాదాన్ని, బి. ఎ. శాలిటోర్, యమ్. హెచ్. రామశర్మ, జి. యస్. గాయ్, పి. బి. దేశాయ్ మొదలైన వారు సమర్థించారు. విజయనగర స్థాపకులు కన్నడిగులేనని అభిప్రాయపడుతూ, దానికి ఆధారంగా విజయనగర రాజులు వేసిన 5,000 శాసనాల్లో సగానికి పైగా కన్నడంలో ఉన్నాయనీ, మొదటి హరిహరుని నాణేలపై ఉన్న హనుమాన్, గరుడ చిహ్నాలు, కదంబ యాదవ రాజులవి పోలి ఉన్నాయనీ, **మదురావిజయం** విజయనగరాన్ని కర్ణాటకమనీ, మొదటి బుక్కరాయలను 'కర్ణాటకుల తిలకుడ'ని వర్ణించిందనీ, **క్రీడాభిరామం** మొదటి బుక్క రాయలనే 'కర్ణాటక క్షితిపాల' అని పిలిచిందని, శ్రీనాథుడు విజయనగరాన్ని 'కన్నడలక్ష్మీ' అని, రెండవ దేవరాయలను కర్ణాటక క్షితిపాలని వర్ణించాడని, **'ఆముక్తమాల్యద'**లో కృష్ణరాయలు 'కన్నడ రాయల'ని పిలుచుకున్నాడనీ, పెద్దన మనుచరిత్రలో కృష్ణరాయలను 'కర్ణాట రాజ్య రమారమణా' అని పిలిచాడని, పెరిష్టా కూడా వీరిని కర్ణాటక రాజులని పిలిచాడనీ, అందుచేత హరిహర, బుక్కరాయలు కన్నడిగులని వీరి వాదన.

కాని, ఈ వాదనలలో కొన్ని లోపాలు లేకపోలేదు. ఈ వాదానికి మూలమైన పెరిష్టాయే, మరో చోట విజయనగర స్థాపకులు మహమ్మదీయ బందిఖానా నుండి విముక్తి పొంది, విజయనగరాన్ని స్థాపించారని పేర్కొన్నాడు. హోయసాల బల్లాలుడు మహమ్మదీయ బందిఖానాలో ఉన్నట్లు ఆధారాలు లేవు. పైగా వారు సూచించిన కన్నడ బిరుదులు విజయనగర రాజులు కర్ణాటకం నుండి పాలించారని రుజువు చేస్తాయి గాసి, వారు మొదటి నుండి కర్ణాటక వాసులని రుజువు చేయలేవు.

కొంత మంది చరిత్రకారులు కన్నడంలోని **'కుమార రాముని కథ', 'కంపిలి యుద్ధం'** మొదలైన స్థానిక చరిత్రల ఆధారంగా, కంపిలి సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. కంపిలి దేవరాయలు కంపిలిని పాలించాడనీ, హోయసాలుల నుండి, కాకతీయుల నుండి, యాదవుల నుండి, తన రాజ్యాన్ని రక్షించుకున్నాడని, ఇతని కుమారుడు, రామనాథుడు గొప్ప వీరుడనీ, హరిహర, బుక్కరాయల తండ్రైన సంగముడు వీరికి దగ్గర బందువని, ఈ గాథలు తెలియచేస్తున్నాయి. మహమ్మద్ బీన్ తుగ్లక్ పై తిరుగుబాటు చేసిన బహాఉద్దీన్‌కు రామనాథుడు ఆశ్రయ మివ్వడం వలన, తుగ్లక్ కంపిలిపై దండెత్తాడు. ఈ దండయాత్రలో కంపిలి రాయలు, అతని కుమారుడు రామనాథుడు మరణించారు. తుగ్లక్‌ను అనుసరించి వచ్చిన ఇబ్నబతూత ఈ విషయాన్ని గురించి వ్రాస్తూ, కంపిలి పట్టణం మహమ్మదీయుల వశమైందని, పడకొండు మంది రాజకుమారులను బందీలుగా ఢిల్లీకి తీసుకు వెళ్ళారనీ, వారిని మహమ్మదీయులుగా మార్చారని, అందులో ఇద్దరు తుగ్లక్‌కు విశ్వాసపాత్రులయ్యారనీ, వారి ప్రవర్తన చూసి వారికి స్వేచ్ఛ నిచ్చాడనీ, 1335లో దక్షిణ రాజ్యాలు తిరుగుబాటు చేసినపుడు వారిని ఈ ప్రాంతానికి పాలకులుగా పంపాడని పేర్కొన్నాడు. ఈ విధంగా హరిహర, బుక్కరాయలు కంపిలి పాలకులైనారనీ, అదే విజయనగర రాజ్య స్థాపనకు మూలమైందని, కొందరు చరిత్రకారుల అభిప్రాయం. అంతేకాక, విజయనగర పాలకులు హోయసాలులకు గాని, కాకతీయులకు గాని, సామంతులు కారనీ, 1342 నాటికే హరిహర, బుక్క రాయలు బాదామి, గోవాల నుండి బేలూరు, హలెబీడుల వరకు అధిపతులుగా ఉన్నారని పేర్కొన్నాడు. హోయసాల శాసనాలు విజయనగర సంబంధాలను ప్రస్తావించడం లేదని, అందుచేత, విజయనగరం హోయసాల రాజ్య అనంతక్రమం కాదని, మొత్తం మీద విజయనగర స్థాపకులు కన్నడిగులని భావించారు.

BRAOU

ఈ సిద్ధాంతానికి భిన్నంగా, ఆచార్య నీలకంఠ శాస్త్రి, డా. నేలటూరి వెంకట రమణయ్యలు, విజయనగర రాజ్య స్థాపకులు తెలుగువారని ప్రతిపాదించారు. వెంకట రమణయ్య సంస్కృత, కన్నడ, తెలుగు భాషలలో లభించే స్థానిక చరిత్రలు, ఇసామీ, బరని వంటివారి మహమ్మదీయ చారిత్రక రచనలు, విదేశీ వర్తకుడైన న్యూనిజ్ వ్రాతలు, శాసనాలలో పేర్కొన్న విషయాలను సమన్వయం చేసి, తన ప్రతిపాదనను చేశారు. వెంకట రమణయ్య వాదన ప్రకారం :

1. హరిహర, బుక్క సోదరులకు, 1336కు పూర్వం, హోస పట్టణంతో గానీ, విజయనగరంతో గాని సంబంధం ఉన్నట్లు ఆధారాలు లేవు. కంపిలి రాయలు విరూపాక్ష దేవాలయాన్ని నిర్మించినట్లు, శాసనాల వల్ల తెలుస్తోంది. కనుక, విరూపాక్ష ఆలయ ముండడంవల్ల, ఈ పట్టణాన్ని విరూపాక్ష పట్టణ మని కూడా అన్నారు;

2. ద్వారసముద్రాన్ని 1328లో ఢిల్లీ సుల్తాన్ నాశనం చేసాడనడం, వాస్తవం కాదు. ఎందుకంటే, తిరుగుబాటుదారుడైన బహాఉద్దీన్ గుష్టాస్ప్‌ను, మూడవ బల్లాలుడు సుల్తాన్‌కు అప్పగించి, సంధి చేసుకున్నట్లు, ఇబ్నబతూత వ్రాతల వల్ల తెలుస్తోంది. ఢిల్లీ సుల్తాన్‌కు వైన పేర్కొన్న కారణం చేత, ద్వారసముద్రాన్ని నాశనం చేయాల్సిన అగత్యం లేదు;

3. మూడవ బల్లాలుడు ద్వారసముద్రం నుండి పరిపాలిస్తున్నట్లు, 1329 - 1340 మధ్య కాలం నాటి శాసనాలు రుజువు చేస్తున్నాయి. 1335-40 మధ్య కాలంలో, 1329 లో కొద్ది కాలం తప్ప, మిగిలిన కాలమంతా ద్వారసముద్రంలో ఉన్నట్లు, శక 1250, 1257, 1258, 1261, 1262 శాసనాల వల్ల తెలుస్తోంది. 1343 వరకు ద్వారసముద్రమే మూడవ బల్లాలుని రాజధాని;

4. ఢిల్లీ సుల్తాన్ కంపిలి రాజ్యాన్ని 1327-28 లో ఢిల్లీ సామ్రాజ్యంలో కలుపుకున్నాడు; పలితంగా కంపిలి రాజ్య ప్రాంతంలో మూడవ బల్లాలుడు నగరాన్ని నిర్మించే అవకాశం లేదు; పోనీ నిర్మించాడనుకున్నా, బల్లాలుని శాసనాలలో హోస పట్టణాన్ని నిర్మించాడన్న ఆధారాలు లభ్యం కాలేదు;

5. హరిహర సోదరులైన మారప్ప, ముద్దప్పలు మలినాడు ప్రాంతాన్ని పాలించినట్లు, 1352 నాటి శాసనాల వల్ల తెలుస్తోంది; అయితే, మలినాడు మూడవ బల్లాలుని రాజ్యంలో అంతర్భాగమని చెప్పే ఆధారం లేదు;

6. హరిహర సోదరులు మూడవ బల్లాలుని అస్థాన ఉద్యోగులని చెప్పేందుకు ఆధారం లేదు; ఈ పై ఆధారాల సహాయంతో, విజయనగర స్థాపకులు కన్నడిగులు, మూడవ బల్లాలుని సామంతులు కారని, వెంకట రమణయ్య సిద్ధాంతీకరించారు.

నెల్లూరు జిల్లా, కనిగిరి తాలూకా (ఇప్పటి ప్రకాశం జిల్లా), గుజ్జలవీడులో దొరికిన బుక్కరాయల శాసన మాధారంగా, వెంకట రమణయ్యగారు ఈ శాసనం లోని బుక్క రాయలు, సంగమ రాయల తండ్రి, అంటే హరిహర, బుక్క రాయల తాత అని ఒక చోట, మరొక చోట హరిహర రాయల తమ్ముడైన బుక్కరాయలే అని, అతడు నెల్లూరు ప్రాంతాన్ని కాకతీయుల సామంతుడిగా పరిపాలిస్తూ ఉండే వాడని, అందువల్ల హరిహర, బుక్క రాయలు మొదట్లో నెల్లూరు ప్రాంతానికి చెందినవారని, కాకతీయ ప్రతాపరుద్రుని కొలువులో ఉన్నారని పేర్కొన్నారు. అయితే, ఈ శాసనం వెంకట రమణయ్య గారు భావించినట్లుగా శక 1236 (క్రీ.శ. 1314) నాటిది కాదని, శక 1296 (క్రీ. శ. 1374) నాటిదని, అందులో చెప్పిన బుక్కరాయల బిరుదులైన సమస్త భువనాశ్రయ, అరిరాయ విభాడ, భాషగె తప్పువ రాయరగండ, మొదలైన కన్నడ బిరుదులు, విజయనగర రాజులవని, ఈ

BRAOU

శాసనం మొదటి బుక్క రాయలదని పి.బి. దేశాయ్ నిర్ణయించారు. సంగముడు కర్ణాటక ప్రాంతం వాడని, హంపి నివాసి అని, అతని కుమారుడు హరిహరుడు హోయసాల బల్లాలుని కొలువులో ఉన్నాడని, చివరకు తన అధిపతైన బల్లాలుని సహాయంతో విజయనగర స్థాపన చేశాడని భావించారు.

విజయనగర స్థాపకులైన హరిహర, బుక్క రాయలు తెలుగు వారనడానికి ఓరుగల్లు ప్రతాపరుద్రుని కొలువులో ఉండేవారనడానికి, ఎక్కువ ఆధారాలు కనబడుతున్నాయి. మొదట, హరిహరుని తొలి శాసనాలలో ఒకటి, హరిహరుడు తూర్పు నుండి పశ్చిమం వరకు జయించినట్లు తెలుపుతోంది. ఈ దిగ్విజయంలో అతని సోదులైన కంపన, బుక్క, మద్దప్ప, మారప్పలు సహాయపడ్డారు. ఇంకో రెండు శాసనాలు హరిహరుడు సోదరులతో కలసి పరిపాలించినట్లు, 5 గురులో బుక్క, పాండవ మధ్యముడని పేర్కొంటున్నాయి. శాసనాలు హరిహర సోదరులు సంగముని కుమారులని, యాదవ కులస్థులని తెలుపుతున్నాయి. కాని, వారి పూర్వ వృత్తాంతాన్ని గురించి ఏమి తెలపవు. **రాజకాల నిర్ణయం** అనే 17వ శతాబ్దం నాటి సంస్కృత గ్రంథం, కేతన బసవరాజు రచించిన **'శివతత్వ రత్నాకర'** గ్రంథం, హరిహర, బుక్కలు కాకతీయ ప్రతాపరుద్రుని కొలువులో కోశాధికారి, దౌవారికులుగా పనిచేసేవారని తెలుపుతున్నాయి. లింగన్న రచించిన **'కేతదిన్నప విజయం'** వారిని ఉత్తర భారతదేశ క్షత్రియులు గాను, దక్షిణ దేశానికి వలస వచ్చి, కురుబ తెగ వారితో సైనిక సంబంధాలను పెంచుకున్నారని తెలుపుతూంది. నంజుడు రచించిన **'బల్లాల రాయనియుద్ధ'** మనే గ్రంథం వల్ల, హరిహర, బుక్క రాయలు కంపిలి కొలువులో కోశాధికారులని తెలుస్తోంది. మహమ్మద్ బీన్ తుగ్లక్ ఆస్థానంలో ఉన్న జియాఉద్దీన్ బరనీ అనే మహమ్మదీయ చరిత్రకారుడు కూడా, 'సుల్తాన్' కంపిలను పాలించడానికి పంపిన వ్యక్తి, వరంగల్ పాలకుడైన కన్యానాయక బంధువులలో ఒకడ'ని పేర్కొన్నాడు. న్యూనిజ్ వ్రాతల వల్ల, అతడే బీజనగర స్థాపకుడని తెలుస్తోంది. సమకాలీన మహమ్మదీయ రచయితల రచనలాధారంగా హరిహర, బుక్కలు తెలుగువారని, కాకతీయ బంధువులని చెప్పొచ్చు. కన్నడ రచయిత సర్వజ్ఞ తన **'కాలజ్ఞానం'**లో, బుక్కరాయలను ఓరుగల్లు బుక్క అని సంబోధించాడు. బుక్కరాయలు ఉత్తర హరివంశ గ్రంథకర్తైన నాచన సోమున్ని పోషించాడు. ఈ గ్రంథం హరిహరనాదునికి అంకితమియ్యబడింది. వెంకట రమణయ్య గారి అభిప్రాయం ప్రకారం, హరిహరనాధునికి అంకితమియ్యడం, పరోక్షంగా హరిహరునకు అంకితమిచ్చినట్లే సూచిస్తూంది. ఆనాటి శాసనాలు కర్ణాటకానికి అనేక తెలుగు గౌడ కుటుంబాలు వలసపోయినట్లు తెలుపుతున్నాయి. బహుశ, పాలకుల చొరవవల్లే, ఈ కుటుంబాల వారు వలస వెళ్ళిఉండొచ్చని భావించడం సరియైనదేనని, వెంకటరమణయ్య గారి అభిప్రాయం. మారప్ప చంద్రగుత్తిలోని ఒక అగ్రహారాన్ని, తెలుగు బ్రాహ్మణులకు దానమిచ్చాడు. విద్యారణ్య వృత్తాంతం, విద్యారణ్య కాలజ్ఞానం పైన పేర్కొన్న విషయాలను బలపర్చడమేకాక, విద్యారణ్య వృత్తాంతం సంగముడు మంగళ నిలయాధిపతని తెలుపుతున్నాయి. మంగళ నిలయం గుంటూరు జిల్లా లోని ప్రాచీన నగరమైన మంగళగిరి అయిఉండొచ్చని, పండితుల అభిప్రాయం. ఈ పైన పేర్కొన్న వాదాల సహాయంతో, వెంకట రమణయ్యగారు హరిహర, బుక్కలు ఆంధ్రులే కాని, కన్నడులు కారని రుజువు చేశారు. ఈ అభిప్రాయాన్ని, ఆచార్య నీలకంఠ శాస్త్రి, డా. ఆర్. సుబ్రహ్మణ్యం మొదలైనవారు సమర్థించారు.

16.5 : విజయనగర స్థాపన జరిగిన విధం : విద్యారణ్యుల పాత్ర

ఇంతకు ముందు భాగంలో ఆంధ్ర ప్రాంతం లోను, మిగిలిన దక్షిణ దేశం లోను, మహమ్మద్‌బీన్ తుగ్లక్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాట్లను గురించి తెలుసుకున్నాం. పైన పేర్కొన్నట్లు, కంపిలి పాలకుడైన మల్లిక్ నాయబ్ దక్షిణ దేశం లోని తిరుగుబాట్లను అణచలేక, ఈ ప్రాంతం

BRAOU

వాడే ఇక్కడకు అధిపతిగా వచ్చిన, ఈ తిరుగుబాట్లను అణచవచ్చని తుగ్లక్‌కు విన్నవించాడు. అప్పుడు సుల్తాన్ తన వజీర్లతో సంప్రదించి. కంపిలి రాజ్యం లోని హోస దుర్గంను సాధించినపుడు, బందీలుగా చిక్కిన హరిహర, బుక్క సోదరులకు మహమ్మదీయ మతమిచ్చి, వారిని సామంతులుగా కంపిలి రాజ్యాన్ని పాలించుటకు పంపెనని, న్యూనిజ్, బరని **రాజకాల నిర్ణయం, విద్యారణ్య వృత్తాంతం, విద్యారణ్య కాలజ్ఞానం** మొదలైన ఆధారాలను బట్టి తెలుస్తోంది. కంపిలి రాజ బంధువులతో వారికి సంబంధమున్నా, ప్రజల ఆదరాభిమానాలకు గురికారని, దాక్షిణాత్యులైనను కంపిలి దేశస్థులు కారు; వారికి కంపిలి పాలనతో అనుభవం కలదు. వారికి స్థాన బలం తక్కువగుట వలన, వారు తమ బలం పైనే ఆధారపడి ఉంటారని తలచిన తుగ్లక్, వారిని కంపిలికి మండలేశ్వరులుగా నియమించి, కొంత సైన్యమిచ్చి పంపాడు.

ఈ విధంగా హరిహర, బుక్క సోదరులు కంపిలికి చేరారు. కానీ, కంపిలి మండల మంతా జాతీయ నాయకుల అధీనంలో ఉంది. ఢిల్లీ నుండి కొత్త మండలేశ్వరులు వచ్చారని వార్త తెలియగానే, దేశ నాయకులు సైన్యాలను సమకూర్చుకొని, కాపయ నాయకులు, బల్లాల దేవుడు కలసి, హరిహర, బుక్కరాయలను కంపిలి నుండి తరిమివేయుటకు వచ్చారు. రెండు షక్షాల వారికి తుంగభద్రా తీరాన యుద్ధం జరిగింది. హరిహర, బుక్క రాయలు జాతీయ సైన్యం దాటికి తట్టుకోలేక, ఓడిపోయి, సమీప అరణ్యంలో తలదాచుకున్నారు. ఈ పరిస్థితి ఇట్లుండగా, మదుర రాజ్య పాలకుడు జలాలుద్దీన్ హసన్ సాహ సుల్తాన్ అధికారాన్ని ధిక్కరించి, స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాడు. అతని పైకి పంపిన సైన్యం కూడా, అతనితో కలసిపోయి, సుల్తాన్‌ను ప్రతిఘటించారు. అప్పుడు సుల్తాన్ స్వయంగా బయలుదేరి ఓరుగల్లు చేరాడు. కాని, అక్కడ అంటు వ్యాధి సోకి, అతని సైన్యం చాలా భాగం నశించింది. సుల్తాన్‌కు కూడా వ్యాధి సోకడంతో, భయపడి, ఢిల్లీకి తిరిగి వెళ్ళాడు. ఢిల్లీకి వెళ్ళే ముందు, తెలంగాణను రెండు భాగాలుగా చేసి, తూర్పు తెలంగాణాకు మల్లిక్ మగ్బూల్‌ను, పశ్చిమ తెలంగాణాకు నసరత్ ఖాన్‌ను పాలకులుగా నియమించాడు. కానీ, ఈ ఏర్పాటు ఎక్కువ కాలం నిలవలేదు. తుగ్లక్ సామ్రాజ్యం బలహీనపడి, అనేక నూతన రాజ్యాలేర్పడ్డాయి. జలాలుద్దీన్ మదురలో స్థిరపడినాడు. కాపయ నాయకుడు తెలంగాణాను విముక్తి చేసి, ఓరుగల్లు రాజధానిగా, కొంత తెలంగాణా, కొంత కోస్తా ఆంధ్ర ప్రాంతాన్ని పాలించాడు.

కంపిలి పాలకులుగా వచ్చిన హరిహరరాయలు, బుక్కరాయలు, జాతీయ నాయకులచే ఓడింపబడి, పదభ్రష్టులైనారు. వారికి ఢిల్లీ నుండి సహాయం వచ్చే అవకాశం కూడా లేదు. వారు మహమ్మదీయ మతాన్ని స్వీకరించడం వల్ల, ప్రజలు వారిని ఆదరించే పరిస్థితి లేదు. పైగా, వారు హిందూ కంటకుడైన తుగ్లక్ సుల్తాన్ ప్రతినిధులుగా, రాష్ట్ర పాలకులుగా వచ్చారు. ఈ పరిస్థితుల్లో తుంగభద్రా తీరంలో, పంపా క్షేత్రంలో తపస్సు చేస్తున్న విద్యారణ్య స్వామిని ఆశ్రయించారు. విద్యారణ్యులు, శృంగేరి అద్వైత మతాధిపతగు విద్యాతీర్థులకు, ప్రియ శిష్యుడు. శృంగేరి మఠం ఆదిశంకరులు స్థాపించినది, అద్వైత మఠాలలో ఆది పీఠం. దాని అధిపతి ఆదిశంకరుల ప్రతినిధి, జగద్గురువు. ఆయనకు విద్యారణ్యుల మీద గౌరవాభిమానాలే కాక, అన్ని విషయాల్లో విద్యారణ్యుల సలహాను పొందేవారు. ఇటువంటి వారిని ఆశ్రయించిన మేలు కలుగునని, హరిహర సోదరులు విద్యారణ్య స్వామిని ఆశ్రయించారు. మహమ్మదీయ పాలనలో అనేక కష్టాలకు గురైన దక్షిణ హిందూ దేశాన్ని, హిందూ ధర్మాన్ని పునరుద్ధరించవలెనని విద్యారణ్యుల దృఢ సంకల్పం. కాని, రాజకీయ స్వాతంత్ర్యం లేక, హిందూ ధర్మాన్ని పునరుద్ధరించుట కష్టం. అందుచేత, సంగమ రాజ పుత్రులపై సానుభూతి చూపి, వారిని తన శిష్యులుగా చేర్చుకుని, వారి ద్వారా దక్షిణ భారతం నుండి మహమ్మదీయులను

BRAOU

తరిమివేసి, హిందూ ధర్మాన్ని పునరుద్ధరించవలెనని నిశ్చయించారు. కానీ, హరిహర, బుక్కరాయలు మహమ్మదీయ మతాన్ని స్వీకరించి, తుగ్లక్ ప్రతినిధులుగా కంపిలి పాలకులైనారు. ఇస్లాం మతాన్ని ద్వేషిస్తున్న దక్షిణ దేశ ప్రజలు, వీరి పాలన నంగీకరించుట కష్టం. వేలటూరి వెంకటరమణయ్యగారి అభిప్రాయం ప్రకారం, హరిహర, బుక్క రాయలు హిందూ మతం లోకి మారడంలో విద్యారణ్యులు సాయపడ్డారని, విద్యారణ్యులు చేసిన సంవిధానాన్ని కంపిలి రాష్ట్ర ప్రజలు, దొరలు ఒప్పుకొని, హరిహర, బుక్క రాయల ఆధిపత్యాన్ని అంగీకరించారని, ఈ వీర్వాటంతటినీ ఆచరణ లోనికి తేవడానికి, 1336 ఏప్రిల్ 18వ తేదీన రాజ్యాధిపతైన పంపావిరూపాక్ష దేవుని సన్నిధిలో, హరిహర రాయలకు పట్టాభిషేకం జరిగిందని వ్రాశారు. హరిహర, బుక్క రాయలు విద్యారణ్య సహాయంతో హిందూ మతం లోకి మారి, స్వతంత్ర రాజ్య స్థాపన చేశారని, సాధారణ అభిప్రాయం. డా. బి. యస్. యల్. హనుమంతరావు దీనికి కేవలం ఇసామి రచనయే ఆధారమని, హిందూ రచన లేవీ ఈ కథను ప్రస్తావించవన్నారు. కొందరు హరిహర, బుక్క రాయల మతాంతీకరణ వృత్తాంతాన్ని సందేహిస్తున్నారు. అయితే, పైన వివరించినట్లుగా, విజయనగర స్థాపన ప్రధానోద్దేశం, హిందూ ధర్మ పరిరక్షణ. ఇదే వారి ధ్యేయమని ప్రజలను నమ్మించేందుకు, విరూపాక్ష పేరనే పరిపాలన చేశారు. విజయనగర రాజులకు ముందుగానీ, వెనుకగానీ, ఈ విధంగా దైవం పేరుతో పరిపాలించిన వంశం కానరాదు. బహుశ, ఈ విధంగా పరిపాలించినందుకు కారణం, హరిహరాదులు మహమ్మదీయ మతం నుండి హైందవ మతం లోకి మారడం, హైందవ ధర్మ రక్షణకు పూనుకోవడం అయిఉండొచ్చని, డా. కె. యస్. కామేశ్వరరావు అభిప్రాయం. విజయనగర పాలకులు మతమౌఢ్యంతో కాక, మత సహనాన్ని ప్రదర్శిస్తూ, హైందవ ధర్మ రక్షణకు కృషి చేశారు. విజయనగర పాలకులు దేవాలయాలకు, బ్రాహ్మణులకు, మహమ్మదీయ దాడుల వలితంగా మూతబడిన దేవాలయాలను తెరిపించి, పూజా పునస్కారాలు జరిగేటట్లు దానాలిచ్చడం, రాజకీయ వ్యవహారాల్లో బ్రాహ్మణులకు సైన్యాధిపతులుగా, అమరనాయకులుగా, గవర్నర్లుగా ప్రాధాన్యమివ్వడం, మహార్నవమి పండుగను వైభవోపేతంగా మొమ్మిది రోజులు జరపడం, తమ ఆదర్శాన్ని దృష్టిలో ఉంచుకొని కావాలని చేశారని, పై కారణం చేతనే హరిహరాదులు హిందూ మతం లోకి మారారనడం అసమంజసం కాదని కూడా, డా. కామేశ్వరరావు అభిప్రాయం. విజయనగర సామ్రాజ్య స్థాపనలో విద్యారణ్యుల పాత్రపై, చరిత్రకారులు భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చారు. పాదర్ హీరాస్ చివరి సంగమ వంశస్థుల బలహీనతను అవకాశంగా తీసుకొని, శృంగేరి పీఠాధిపతులు ఈ గాథను సృష్టించి ప్రచారం చేశారని, అభిప్రాయ పడ్డారు. దీనికి భిన్నంగా వెంకట రమణయ్య విజయనగర స్థాపనలో హరిహర సోదరులకు విద్యారణ్యుల సహాయం లభించిందని, ఈయన సలహా పైనే విజయనగరాన్ని నిర్మించారని, వారికి మార్గదర్శకుడై పట్టాభిషేకం కూడా జరిపించాడని, గాఢంగా విశ్వసిస్తున్నారు. ఈ అభిప్రాయాన్ని యమ్. హె.చ్. రామశర్మ, రాయప్రోలు సుబ్రహ్మణ్యం, గుర్తి వెంకటరావు, కందూరి ఈశ్వర దత్తు మొదలైనవారు బలపర్చారు. విద్యారణ్యుల జీవితం లోని ముఖ్య ఘట్టాల గురించి, పండితుల్లో ఏకాభిప్రాయం లేదు. న్యూనిజ్ తన గ్రంధంలో 'విద్యుజ' ను పేర్కొన్నాడు. స్థానిక చరిత్రలు విజయనగర రాజ్య స్థాపన కాలం నాటికి విద్యారణ్యులు శృంగేరి పీఠాధిపతని చాటుతున్నాయి. దీనికి తోడుగా, హరిహర సోదరులు 1346 లోను, 1356 లో బుక్కరాయలు భారత తీర్థులను సేవించినట్లు తెలుస్తోంది. అంతేగాక, బుక్కరాయలు కాశీలో ఉన్న విద్యారణ్యులను దక్షిణ దేశానికి రప్పించవలసిందిగా కోరినట్లు, 1356 నాటి శాసనం సాక్ష్యం చెబుతూంది. రెండవ హరిహర రాయలు 1380, 1384, 1386 లలో, విద్యారణ్యని పొగుడుతూ, శాసనాలను వేయించాడు. న్యూనిజ్ మహమ్మద్ బీన్ తుగ్లక్ వాగుండిం రాజ్యాన్ని పాలించడానికి పంపిన దేవరాయ తుంగభద్ర తీరంలో విద్యారణ్యుల సలహాపై నగరాన్ని నిర్మించినట్లు పేర్కొన్నాడు.

BRAOU

విరూపాక్ష చంపూను రాసిన అహోబళపతి దేవ నృపతి రాజుగాను, ఋషులకు రాజైన విద్యారణ్యులు విజయనగరాన్ని నిర్మించినట్లు వేర్కొన్నాడు. అంతే కాక, తన శిష్యులతో విద్యారణ్యులు విరూపాక్ష స్వామిని, పంపాంబికను ఆరాధించినట్లు, తన ప్రత్యక్ష సాక్షిగా అహోబళపతి వేర్కొన్నాడు. విద్యారణ్యులు 1386లో మరణించడం వల్ల, దానికి ముందుగానే అహోబళపతి తన గ్రంథాన్ని వ్రాసి ఉండాలి. 1336-37 నాటి కాపలూరు శాసనం, విద్యారణ్యుని ఆజ్ఞ ప్రకారం హరిహరుడు విద్యా నగరాన్ని నిర్మించాడని తెలుపుతూ, విద్యారణ్యుడు ఈ క్రింది విధంగా హరిహరునకు చెప్పాడని తెలుపుతూంది: "ఓ ప్రభువా, విద్య అనే పేరుతో నగరాన్ని నిర్మించు; కుబేరుని అలకా నగరమంత ఉండేది, విద్యకు అడవి లాంటిది". అయితే, 1368 నాటి శాసన మొకటి, మొదటి బుక్క ప్రపంచాన్ని జయించిన తర్వాత, విజయనగరి అనే గొప్ప నగరాన్ని నిర్మించాడని తెలుపుతోంది. ఈ శాసనాల విషయాన్ని హరిహరుని కాలంలో యువరాజైన మొదటి బుక్కరాయలు, విద్యారణ్యుని పధకం ప్రకారం విజయనగరాన్ని నిర్మించి ఉంటాడని, డా. రాయప్రోలు సుబ్రహ్మణ్యం సమన్వయం చేశారు. ఈ శాసనాల ప్రామాణికతను ఫ్లీట్, రైస్, హీరాస్, నరసింహాచారు, గోపీనాథరావు వంటి పండితులు అనుమానిస్తున్నారు. అయితే, మనం గనుక విజయనగర రాజ్యాన్ని హైందవ ధర్మ రక్షణార్థం స్థాపించబడిందని, హరిహర, బుక్కరాయలు మహమ్మదీయ మతంలో నుండి హిందూ మతం లోనికి మారి ఉండవచ్చని అంగీకరిస్తే, విద్యారణ్యుల పాత్రను సహితం అంగీకరించాల్సొస్తుందని, డా. కామేశ్వరరావు అభిప్రాయం. వెంకటరమణయ్య గారు అభిప్రాయపడినట్లు, విద్యారణ్యస్వామి హరిహర, బుక్కలు మారడానికి తోడ్పడటమే గాక, మార్గదర్శకుడై తమను ప్రజలకు ఆమోదయోగ్యమయ్యేటట్లు చేసి ఉండొచ్చు.

BRAOU

16.6 : సంగమ వంశం

విజయనగర సామ్రాజ్యాన్ని వరుసగా నాలుగు వంశాలు పాలించాయి. 1336 నుండి 1485 వరకు సంగమ వంశం, 1485 నుండి 1505 వరకు సాళువ వంశం, 1505 నుండి 1570 వరకు తుళువ వంశం, 1570 నుండి 1649 వరకు ఆరవీటి వంశం పాలించాయి. విజయనగర స్థాపకులైన హరిహర సోదరులు యదు వంశ క్షత్రియుడైన సంగముని కుమారులు. ఇతని తండ్రి బుక్కరాజు. సంగముడు మంగళ నిలయవాసని విద్యారణ్య వృత్తాంతం తెలుపుతూంది. ఈ మంగళ నిలయం గుంటూరు జిల్లా లోని మంగళగిరి అయి ఉండొచ్చు. సంగముని చరిత్ర గాని, విజయాలు గాని, ఎక్కడా వర్ణించబడలేదు. సంగమునికి అయిదుగురు పుత్రులు. హరిహర, కంప, బుక్క, మారప్ప, ముద్దప్ప. వారిలో హరిహర, బుక్క రాయలిద్దరూ ప్రసిద్ధులు.

16.6.1 : వంశానుక్రమణిక

విజయనగరాన్ని పాలించిన రాజుల వంశానుక్రమణిక, కాలం విషయాల్లో కొన్ని నిభేదాలున్నాయి. రాబర్ట్ సీవెల్ సూచించిన వంశానుక్రమణికను, విద్యారణ్య, శివయ్య, వీరప్పయ్య పాలజ్ఞావాల తోను, కేళది నృప విజయం, విజయనగర సామ్రాజ్యం, గొరకల్లు కవిలలు, రెండవ వెంకటపతి రాయల కాలంలో తయారుచేయబడ్డ అట్టవ వంశానుక్రమణిక శాసనాల ఆధారంగా, పునర్నిర్మించాల్సుంది. న్యూనిజ్ పది మంది సంగమ రాజులను వేర్కొన్నాడు. సీవెల్ ఈ సంఖ్యను ఆమోదిస్తూనే, రెండవ దేవరాయలు, మల్లికార్జునుల మధ్య ఇంకొక పాలకుణ్ణి వేర్కొంటూ, 14 మంది పేర్లను తన 'టేబుల్

ఆఫ్ రిఫరెన్స్‌తో ఇచ్చాడు. కృష్ణశాస్త్రి, న్యూనిజ్, సీవెల్ పేర్కొన్న సంఖ్యను అంగీకరిస్తూనే, మార్చడానికి ప్రయత్నించాడు. విద్యారణ్య కాలజ్ఞానం 13 పేర్లను ఇస్తూంది. శాసనాలు, విద్యారణ్య కాలజ్ఞానం లోని సమాచారాన్ని ధృవపరుస్తున్నాయి. విద్యారణ్య కాలజ్ఞానం సంగమ వంశానికి 150 సంవత్సరాలనిస్తే, ధీరప్ప 155 సంవత్సరాలు, కేతని నృప విజయం 232 సంవత్సరాల నిచ్చాయి. శాసనాల ప్రకారం 1336 లో విజయనగర సామ్రాజ్య స్థాపన జరిగింది. 1486 లో రెండవ వంశ స్థాపకుడైన సాళువ నరసింహుడు అధికారాన్ని సంపాదించాడు. దీనిని బట్టి, విద్యారణ్య కాలజ్ఞానంలో ఇవ్వబడిన 150 సంవత్సరాలు సంగమ వంశం పాలించినట్లు తెలుస్తోంది.

16.6.2 : మొదటి హరిహరుడు : (క్రీ.శ. 1336-1357)

1336 ఏప్రిల్ 18వ తేదీన విరూపాక్షుని సన్నిధిలో హరిహర రాయుల పట్టాభిషేకం జరిగింది. పట్టాభిషేకం నాటికి ఇతని రాజ్యం చాలా చిన్నది. కర్ణాటకం లోని బళ్ళారి, చిత్తదుర్గ, కూడూరు, శివమొగ్గ, ధార్వాడ్ జిల్లాలు, ఆంధ్ర దేశం లోని రాయచూర్, కర్నూల్, అనంతపురం, కడప, కోలార్, నెల్లూర్, చిత్తూర్ జిల్లాల్లోని ఎక్కువ భాగం, అతని అధికారంలో ఉన్నాయి. ఈ రాజ్యమంతా హరిహర రాయలు జయించినట్లు ఎక్కడా ఆధారాలు లేవు. ఒక వేళ హరిహరుని సుల్తాన్ కంపిలి మండలానికి పాలకునిగా నియమించడానికి పూర్వమే, ఈ ప్రాంతమంతా ఆ మండలంలో ఉన్నదేమో అనే సందేహాన్ని వెంకట రమణయ్యగారు వెలిబుచ్చారు. ఈ విధంగా ఏర్పడిన విజయనగర రాజ్యాన్ని, తన సోదరుల సహాయంతో విస్తరింప చేశాడు.14వ శతాబ్ది చివరి నాటికి, కృష్ణ నుండి రామసేతు వరకు, దక్షిణ దేశమంతా హరిహర రాయుల పాలన క్రిందకు వచ్చింది. హరిహర రాయలు తన రాజ్యాన్ని విస్తరించడానికి పూనుకొనే నాటికి, దక్షిణ దేశ పరిస్థితులను గూర్చి తెలుసుకోవాలి. ఇంతకు ముందు తెలిపినట్లు, తుగ్లక్ సామ్రాజ్యం క్షీణించి, అనేక, నూతన రాజ్యాలేర్పడ్డాయి. ముసునూరి కాపయ నాయకుడు ఓరుగల్లు రాజధానిగా, ఆంధ్ర దేశంలో అధిక భాగాన్ని పాలించాడు. కానీ, ఇంతకు ముందు విమోచనోద్యమంలో ఇతనితో సహకరించినవారిలో కొందరు, స్వతంత్ర రాజ్యానేర్పర్చుకొన్నారు. నల్గొండ జిల్లాలో రాచకొండ ప్రాంతంలో రావుసింగమనీడు చుట్టుప్రక్కల చిన్న చిన్న రాజ్యాలను జయించి, స్వతంత్ర రాజ్యాన్నేర్పర్చుకున్నాడు. అద్దంకి (అనంతరం కొండవీడు) రాజధానిగా చేసుకుని పరిపాలిస్తున్న రెడ్డి ప్రభువులు, దక్షిణాన నెల్లూర్ మండలం లోని కందుకూరు నుండి, ఉత్తరాన కృష్ణానది వరకు, పశ్చిమాన శ్రీశైలం, అహోబిలం నుండి, తూర్పున సముద్రం వరకు గల ప్రాంతాన్ని పరిపాలిస్తున్నారు. ఈ కొండవీటి రెడ్డి రాజ్యానికి దక్షిణ, పశ్చిమ సరిహద్దులు విజయనగరం. విజయనగర పాలకులు కృష్ణ వరకు తీరాంధ్ర భూమిని తమ రాజ్యంలో కలుపుకోవలెనని ప్రయత్నం చేయడంతో, రెడ్డి, విజయనగర యుద్ధాలు తప్పనిసరయ్యాయి. దక్షిణాన ద్రావిడ దేశంలో రెండు రాజ్యాలున్నాయి. అవి: 1. సంబువరాయ స్థాపనం: 2. మదుర మహమ్మదీయ రాజ్యం. సంబువరాయల రాజధాని కంచి. పడైవీడు, లేక రాజగంభీర దుర్గం, ఇతని ప్రధాన దుర్గం. దక్షిణ అర్కాట్‌లో కొంత భాగం, తంజావూర్, తిరుచినాపల్లి, మదుర, రామనాదపురం, కోయంబత్తూర్‌లో కొంత భాగాన్ని, మదుర సుల్తాన్ పాలిస్తున్నారు. మదుర వీరి రాజధాని. మదుర సుల్తాన్ మొత్తం ద్రావిడ దేశంపై మహమ్మదీయుల ఆధిపత్యాన్ని పెంచాలనే కృత నిశ్చయం కలవాడు. కానీ, హోయసాల చక్రవర్తి మూడవ బల్లాలుడు ఇతని ప్రయత్నాలకు ఆటంకాన్ని కల్గిస్తున్నాడు. ఇదే విధంగా, హోయసాల బల్లాలునకు, హరిహర రాయలకు వైరముంది. కృష్ణా నది ఈ రెండు రాజ్యాలను వేరుపరుస్తోంది. దక్షిణాపథంలో ఢిల్లీ సుల్తాన్‌ల రాజకీయ ప్రాబల్యం క్షీణించినా, మహారాష్ట్ర, ఉత్తర, కర్ణాటకలు ఢిల్లీ సుల్తాన్ పలుకుబడిలో ఉన్నాయి. కాని, 1347 లో జాఫర్ ఖాన్ అనే అతడు

BRAOU

ఢిల్లీ సైన్యాన్ని ఓడించి, సుల్తాన్ అల్లాఉద్దీన్ హసన్‌గంగూ బహమని అనే బిరుదును పొంది, స్వతంత్ర బహమని రాజ్యాన్ని స్థాపించాడు. ఇట్టి పరిస్థితిలో హరిహర రాయలు రాజ్య విస్తరణకు పూనుకున్నాడు.

16.6.2.1 : రాజ్యాభివృద్ధి - ఉదయగిరి

నెల్లూర్ మండలం లోని ఉదయగిరి, దక్షిణ దేశంలో పేర్కొనదగ్గ గిరి దుర్గాలలో ఒకటి. ఉదయగిరిని స్వాధీనపర్చుకున్న వారికి, తీరాంధ్ర దేశంలో ప్రవేశించడం సులువు. హరిహర రాయుల తమ్ముడు బుక్కరాయలు, సాయణ మాధవాచార్యుల సహాయంతో, ఈ దుర్గాన్ని జయించాడు. దానికి బుక్కరాయల కుమారుడు విరూపణ్ణ దుర్గాధ్యక్షుడుగా నియమితుడైనాడు. ఈ విజయంతో, రెడ్డి రాజ్య ఆక్రమణకు పునాది వేయడం జరగింది.

16.6.2.2 : హోయసాల రాజ్య ఆక్రమణ

హోయసాల మూడవ బల్లాలుడు తొండమండలం లోను, దక్షిణంలో మదుర సుల్తాన్‌ల తోను పోరాడుతున్న సమయంలో. బుక్కరాయలు హోయసాల రాజ్యాన్ని జయించడానికి పూనుకున్నాడు. 1340 నాటికి పెనుగొండ దుర్గాన్ని ఆక్రమించాడు. మూడవ బల్లాలుడు మదుర సుల్తాన్‌లతో చాలా యుద్ధాలను చేసి, చివరకు 1342 లో తిరుచునాపల్లి వద్ద జరిగిన మోర యుద్ధంలో బల్లాలుడు సుల్తాన్ సైన్యానికి పట్టుబడి, మదుర చెరసాలలో మృతి చెందాడు. ఇతని తర్వాత ఈతని కుమారుడు విరూపాక్ష నాల్గవ బల్లాలుడు రాజ్యానికి వచ్చాడు. ఇతడు అసమర్థుడు. విజయనగర సైన్యం ద్వారసముద్రం పై దండెత్తగా, అతడు పారిపోయి, బనవాస కదంబుల వద్ద తలదాచుకున్నాడు. బుక్క రాయలు 1346 నాటికి హోయసాల రాజ్యాన్ని విజయనగర రాజ్యంలో చేర్చాడు.

16.6.2.3 : బహమని రాజ్యంతో యుద్ధం

పైన పేర్కొన్నట్లు, 1347 లో అల్లాఉద్దీన్ హసన్ బహమని రాజ్య స్థాపన చేశాడు. పూర్వం ఢిల్లీ సుల్తాన్ అధికారం క్రిందున్న హిందూ రాజ్యాలను జయించి, తన రాజ్యాన్ని విస్తరించడానికి ప్రయత్నించాడు. కృష్ణ-తుంగభద్ర అంతర్వేది ప్రాంతం కీలక స్థానంలో ఉంది. ఈ అంతర్వేదిలో రాయచూర్, ముద్గల్లు, మొదలైన బలిష్ఠమైన దుర్గాలున్నాయి. ఈ ప్రాంతాన్నాక్రమించినవారు సులభంగా దక్షిణాపథ సార్వభౌములు కాగలరు. బహమని రాజ్యంలో అధిక భాగం నిస్సారమైన పీఠభూమి ప్రాంతమైనందున, తూర్పు తీర మైదానాన్ని ఆక్రమించాలని ప్రయత్నించారు. విజయనగర రాజ్యం సస్యశ్యామలం గాను, సమృద్ధిగాను ఉండడంవల్ల, దానిని కొల్లగొట్టాలని బహమని సుల్తాన్‌లు ప్రయత్నించారు. ఈ రాజకీయ, ఆర్థిక కారణాలకు, మతం తోడైంది. విజయనగర రాజులు ఇస్లాం మతాన్ని అరికట్టి హైందవ మతాన్ని రక్షించడానికి, బహమనీలు ఇస్లాం మతాన్ని విస్తరించడానికి కంకణం కట్టుకున్నారు. ఈ కారణాల వల్ల, విజయనగర, బహమని రాజ్యాల మధ్య సంఘర్షణ తప్పలేదు. 1347 నాటికే, వీరి మధ్య సంఘర్షణ ప్రారంభమైంది. ఈ సంవత్సరంలో జరిగిన ఒక తిరుగుబాటు సవకాశంగా, అల్లాఉద్దీన్ బహమని తన సేనాధిపతులలో ఒకడైన ముబారక్ ఖాన్ నాయకత్వంలో కొంత సైన్యాన్ని హరిహర రాయల రాజ్యం పైకి పంపాడు. సుల్తాన్ సైన్యం రాయచూర్ వరకు గల రాజ్యాన్ని జయించింది. అక్కడ రెండు పక్షాలకు తీవ్ర పోరాటం జరిగింది. విజయనగర సైన్యాలు సుల్తాన్ సేనల నోడించి, వెనుకకు తరిమాయి. కాని, హరిహరరాయలు

BRAOU

రాయచూర్ దుర్గానికి నశ్చిమంలో, ఉత్తరంలో, బాదామి వరకు గల దేశాన్ని కోల్పోయాడు. కొందరు చరిత్రకారులు విజయనగర - బహమని సంఘర్షణ 1356 లోనే ప్రారంభమైందని రాశారు. అయితే, పి. యన్. చోప్రా, టి. కె. రవీంద్రన్, యన్. సుబ్రహ్మణ్యంలు "1343-44 నుండి 1353-54 మధ్య కాలంలో, మదుర సుల్తాన్‌ల నాణాలు దొరక్కపోవడం వల్ల, మదుర సల్తనత్ మరుగున పడిపోయింది. కానీ, నూతనంగా స్థాపించబడిన బహమని పాలకుడు, విజయనగర పాలకునితో ఘర్షణకు దిగడం చేత, మదుర సల్తనత్ విజయనగరం చేతిలో పూర్తిగా నాశనం కాలేదు. బహమని సుల్తాన్ బహమన్‌షా విజయనగర భూభాగాలపై హక్కు కలదంటే, హరిహరుడు అంగీకరించలేదని, ఫలితంగా బహమని, విజయనగర ఘర్షణ ఆరంభమైందని, అయితే, ఘర్షణ సరిహద్దు ప్రాంతాలైన రాయచూర్, సాగర్ వద్దున్న కేంద్రాకు పరిమితమైందని, పెద్ద యుద్ధం జరగలేదనీ, కాని హరిహరుడు మదుర సల్తనత్‌పై ఆశను వదులుకోవాల్సొచ్చిందని, విజయనగర పాలకులు ఉత్తరాన బహమని, దక్షిణంలో మదుర సుల్తాన్‌ల మధ్య నలిగిపోయి, క్లిష్ట పరిస్థితుల నెదుర్కోవాల్సొచ్చిందని రాశారు. బహమన్‌షా రాజ్యానికి రాగానే, లేదా హరిహర రాయుల చివరి కాలంలో దండెత్తి వచ్చాడా అన్నది, నిర్ధారణగా చెప్పలేం. వెంకట రమణయ్య హరిహర రాయలు బహమనీలతో యుద్ధం జరుగుతున్నప్పుడో, లేదా ముగిసిన కొద్ది దినాలకో చనిపోయాడని రాశారు. హరిహర రాయలు 1356 లో మరణించాడు.

హరిహర రాయలు 1336 నుండి 20 సంవత్సరాలు విజయనగరాన్ని పాలించాడు. అతడు సమర్థుడైన పాలకుడు. తన సోదరుల సహాయంతో, చిన్న రాజ్యంగా ఉన్న విజయనగరాన్ని, తూర్పు, పశ్చిమ సముద్ర తీరాలకు విస్తరింపచేశాడు. ఇతని సోదరులందరూ ఇతని పాలనా కాలంలో ప్రముఖ పాత్ర వహించి, వివిధ ప్రాంతాలకు అధిపతులై, అతని ప్రతినిధులుగా పాలించారు. కంపరాయలు, ఉదయగిరి రాజ్యానికి; బుక్కరాయలు, హోయసాల రాజ్యానికి; మారప్ప, అరగ-మలినాడు రాజ్యానికి; ముద్దప్ప, ఉలువాయి రాజ్యానికి మండలేశ్వరులుగా ఉన్నారు. సోదరులే కాక, సోదరుల కుమారులు కూడా, రాజ్య విస్తరణలో ప్రముఖ పాత్ర వహించారు. బుక్కరాయలు, మారప్పలు యువ రాజులుగా వ్యవహరించారు. బుక్క రాయలు రాయ పదాన్ని పొంది, హరిహరునితో రాజ్యాన్ని పాలించాడని, వెంకట రమణయ్య అభిప్రాయం. హరిహరునికి మాధవ, విద్యారణ్యులు మార్గదర్శకులు. చంద్రభూషణ క్రియాశక్తి రాజగురువు. అనంతరను ఇతని మంత్రులలో ముఖ్యుడు. ఇతడు హరిహరునకు కుడి భుజమై, సమర్థవంతమైన పాలనా వ్యవస్థను రూపొందించాడు. ఇతని సేవకు మెచ్చి, హరిహర రాయలు ఇతనికి సర్వశిరః ప్రధాని పదవిచ్చి 'చిక్కవడయ'ను బిరుదు నిచ్చాడు.

16.6.3 : బుక్కరాయలు (క్రీ.శ. 1357-1377)

విజయనగర రాజ్య స్థాపన లోను, విస్తరణ లోను, హరిహరునితోపాటు ప్రముఖ పాత్ర వహించిన అతని రెండవ తమ్ముడు బుక్కరాయలు, హరిహరుని తర్వాత విజయనగర వజ్ర సింహాసనాన్ని అధిష్ఠించాడు. నిజానికి 1346 నుండి బుక్కరాయలు హరిహరునితో కలసి, రాజ్య పాలనా బాధ్యతను వహించాడు. హరిహరునికి పుత్ర సంతతి లేకపోయిననూ, అతని పెద్ద తమ్ముడు కంప రాయలు, అతని పుత్రులు ఉండగా, రెండవ వాడగు బుక్కరాయలు ఎట్లు రాజ్యానికి వచ్చెనన్న ప్రశ్న ఉదయించక మానదు. 1356 నాటి నెల్లూర్ శాసనం ప్రకారం, బుక్క రాయల కన్నా పెద్దవాడైన కంప రాయలు హరిహరుని అనంతరం రాజ్యానికి వచ్చాడని, అతని అనంతరం కంపరాయల కుమారుడు రెండవ సంగమ రాయలు పరిపాలనకు వచ్చి ఉంటాడని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. అతడిని తొలగించి బుక్కరాయలు అధికారానికి వచ్చాడని; కాని, హరిహరుని తర్వాత తానే రాజ్యానికి

BRAOU

వచ్చినట్లు చెప్పుకున్నాడని కొందరి అభిప్రాయం. కాని, వెంకట రమణయ్య గారు ఇది నిజం కాదని, మొదటి కంపరాయలు బ్రతికుండగానే హరిహరుడు తన రెండవ తమ్ముడికి తనతో సమానంగా రాజ పదవి నిచ్చి, రాజ్యంలో భాగస్వామిని చేసి, అతని సహాయంతో రాజ్య పాలన చేశాడని, ఈ ఏర్పాటుకు కంపరాయలు కాని, అతని కుమారులు కాని, ప్రతిఘటించినట్లు కనబడదని, వారు బుక్కరాయల అధికారాన్నంగీకరించినట్లు తెలుస్తోందని, పైగా తుగ్లక్ కంపిలి రాజ్యానికి వారిరువురిని అధిపతులుగా నియమించాడని, రాజ్య స్థాపన లోను, రాజ్య విస్తరణ లోను, సర్వ కార్యాలందు, బుక్కరాయలు ప్రధాన పాత్ర వహించాడని, అందుకే అతని అధికారాన్ని అందరూ మొదటి నుండే ఆమోదించారని వేర్కొన్నారు.

హరిహరుని అనంతరం రాజ్యాధికారాన్ని చేపట్టిన బుక్కరాయలు దూర దృష్టి గల పాలకుడు కావడంవల్ల, దేశ ద్రోహానికి పాల్పడ్డవారిని అణచివేసి, దూర ప్రాంతాలలో ఉన్న రాష్ట్రాలకు పాలకులుగా తన సోదరులను నియమించాడు. కంపనను ఉదయగిరి పాలకుడుగాను; మారప్పను మలినాడు, బనవాసి పాలకుడు గాను, నియమించాడు. కంపన మరణానంతరం అతని కుమారుడైన సాళువ రెండవ సంగముడు ఉదయగిరిని విభజించి, బుక్క రాయల అధికారాన్ని గుర్తించకుండా పాలించడంతోను, మారప్ప కుమారులైన సాళువ, హరియప్పలు కూడా ఇదే విధంగా ప్రవర్తించడంతో, వారందరినీ తొలగించి, తన కుమారులను పాలకులుగా నియమించి, వారందరినీ తనకు బాధ్యులుగా చేసుకున్నాడు.

16.6.3.1 : విజయాలు - తొండమండలం

బుక్క రాయలు సామ్రాజ్యంపై అధిపత్యం వహించిన వెంటనే, 1659-60లో తొండమండలంపై దండెత్తి, సంభూవరాయల నోడించి, ఆ ప్రాంతాన్నాక్రమించాడు. దానిక్కారణం బహమని సుల్తాన్ విజయనగరంపై దండెత్తడం వల్ల, మదుర దండయాత్రను ఆపి, దక్షిణ దేశం నుండి సైన్యాన్ని రప్పించుకోవడం వల్ల, హరిహరుని మరణం వల్ల, బుక్కరాయలు దక్షిణ దేశంపై దృష్టిని మరల్చక పోవడం వల్ల, సంభూవ రాయలు స్వతంత్రంగా పాలించుటకు ప్రయత్నించాడు. ఈ దండయాత్రకు నాయకుడు ముల్బాగల్ రాష్ట్రపతి కుమార కంపణ, ఇతనితో కూడా ప్రధాని సాళువ దండ నాయకులు, అతని కొడుకు గండరగూళి మారయ నాయకుడు, కోపన దండనాయకుడు, సాళువ మంగి బయలుదేరారు. వీరికి సహాయంగా ఉదయగిరి సైన్యం సాళువ ఉడయలు నాయకత్వంలో బయలుదేరింది. అతనితో కూడా, సోదరుడు సంగముడు, కుల గురువు సాయణాచార్యులు కూడా బయలుదేరారు. ఈ దండయాత్ర రెండు భాగాలుగా నడచింది. ఉదయగిరి నుండి బయలుదేరిన సైన్యం తీర దేశం లోని అనేక ప్రాంతాలను ఆక్రమించుకొని, బరుడనగరి వద్ద సంభూవరాయల సైన్యాన్ని ఓడించి, కాంచీపురంను ఆక్రమించాయి. సాయణాచార్యుల ధైర్యసాహసాలు వేర్కొనదగినవి. కంపణ నాయకత్వం లోని సైన్యం తూర్పు కనుమ లోని లోయ మార్గం గుండా ప్రయాణించి, విరించి పురం చేరింది. సంభూవ రాయలు స్వయంగా దండెత్తి వచ్చాడు. పాలారు తీరంలో జరిగిన ఘోర యుద్ధంలో సంభూవరాయల ఓడిపోయి, పడైవీడు రాజగంభీరగిరి దుర్గంలో తలదాచుకున్నాడు. కంపణ దుర్గాన్ని ముట్టడించి, సంభూవరాయలను వధించాడు. రాయల సైన్యం రాజగంభీర దుర్గాన్ని ఆక్రమించి, సంభూవ రాయల కుమారుడు, ఉమ్మడి వెంద్రుమన్ కొండను బంధించాడు. కంపణ తొండ మండల మంతటినీ ఆక్రమించి, దానిని పాలించాడు. కొందరు చరిత్రకారులు ఈ యుద్ధం 1362 లో జరిగిందని, కంపణ సంభూవ రాయలను బందీచేసి, మళ్ళీ అతనిని ఈ రాజ్యంలో నిలబెట్టాడని, సంభూవ రాయలు విజయనగర సామంతుడుగా తుండీర రాజ్యాన్ని పాలించాడని భావించారు.

BRAOU

16.6.3.2 : బహమనీలతో యుద్ధం

1359 లో అల్లాఉద్దీన్ హసన్‌గంగూ చనిపోయిన తర్వాత, అతని కుమారుడు మొదటి మహమ్మద్‌షా, బహమని పాలకుడైనాడు. ఇతడు సింహాసనానికి రావడానికి ఇష్టం లేని అమీర్లు కొందరు తిరుగుబాటు చేయడంతో, అతని స్థానం కొద్దిగా బలహీనమైంది. దీనిని అవకాశంగా తీసుకొని, అల్లాఉద్దీన్ కాలంలో ఆక్రమించిన రాయచూర్ అంతర్వేదిని ఇచ్చివేయమని బుక్కరాయలు, కొలాస్‌ను తిరిగి అప్పగించమని తెలంగాణా పాలకుడు కాపయ నాయకుడు, లేనిచో దండెత్తి రాగలమని రాయబారాలను పంపారు. ఇదే సమయంలో, ఢిల్లీ పాలకుడు ఫిరోజ్‌షాతుగ్లక్ దక్కన్‌పై దండెత్తి వస్తున్నాడని తెలిసి, శత్రువులతో పోరాడడానికి ఇది సమయం కాదని, రాయబారులను 18 నెలలు నిలిపివేశారు. ఢిల్లీ సుల్తాన్ దండెత్తి రాకుండా మార్గాన్ని సుగమం చేసుకొని, మహమ్మద్ షా, బుక్కరాయలు, కాపయ నాయకుడు తనకు సామంతులని, అందుచేత వారు తనకు చెల్లించాల్సిన కప్పాల్ని వెంటనే చెల్లించాలని, రాయబారుల చేత తిరిగి కబురు చేశాడు. ఆ వార్త తెలిసిన బుక్క రాయలు, కాపయ నాయకుడు మహమ్మద్‌షాపై యుద్ధాన్ని ప్రకటించారు. ఫెరిష్టా ఈ యుద్ధం గురించి రాస్తూ, ప్రతి యుద్ధంలో బుక్కరాయలు ఓడిపోయాడని, చివరకు బుక్కరాయలు విజయనగరానికి పరిగెత్తాడని, బుక్కరాయలను యుక్తితో బయటకు రప్పించి, అతనిని ఓడించి, తనకు ఇష్టమొచ్చినట్లు సంధి షరతులను విధించాడని పేర్కొన్నాడు. డా. వెంకట రమణయ్య ఇది వాస్తవానికి దూరమని, ఫెరిష్టా చెప్పిన వాటిలో కొన్ని నిజాలు ఉండవచ్చు; కాని, ఫెరిష్టా రచించిన విధంగా విజయనగరం పరాజయాన్ని పొంది ఉండదనే, అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఈ సంధి నియమాల ప్రకారం : 1. ఉభయ రాజ్యాల మధ్య, కృష్ణా నది సరిహద్దుగా ఉండాలి. కాని, నదికి దక్షిణంగా ఉన్న కొన్ని మహాళ్ళు మాత్రం, ఉమ్మడి పాలన క్రింద ఉండాలి. 2. యుద్ధంలో చిక్కిన బందీలను విడిచి వెట్టాలి. తర్వాతి కాలంలో రెండు రాజ్యాల మధ్య యుద్ధం జరిగితే, స్త్రీలను, శిశువులను వధించకూడదు. ఈ సంధి షరతులు బహమని సుల్తాన్‌లు లాభకరం కాదని, ఈ సంధి వలన సుల్తాన్ తన తండ్రి జయించిన రాష్ట్రాలను తిరిగి ఇవ్వాల్సొచ్చిందని, సంపూర్ణ విజయుడైన ఏ రాజు రాష్ట్ర నష్టానికి అంగీకరించడని, అందుచేత ఫెరిష్టా చెప్పినట్లు మహమ్మద్‌షాకు విజయం చేకూరలేదని, బుక్కరాయలే చివరకు విజయం పొందాడని నిష్కర్షగా చెప్పవచ్చని, వెంకటరమణయ్య గారి అభిప్రాయం. ఈ సంధి 1365లో కుదిరి, అది మొదలు 1378 వరకు రెండు రాజ్యాల మధ్య యుద్ధాలు జరగలేదు.

16.6.3.3 : రెడ్డి రాజ్యంపై దండయాత్ర

బహమని దండయాత్ర ముగిసిన తర్వాత బుక్క రాయలు రెడ్డి రాజ్యంపై దండెత్తాడు. ఈ దండయాత్ర కారణాలు గాని, యుద్ధం గురించి గాని, తెలియట్లేదు. రెడ్డి రాజ్య స్థాపకుడైన ప్రోలయ వేమారెడ్డి 1353లో మరణించగా, అతని కుమారుడు అనపోతారెడ్డి సింహాసనానికి వచ్చాడు. ఈ తూర్పు తీర దండయాత్ర 1363-64 ప్రాంతంలో జరిగినట్లు, స్థానిక చరిత్ర వల్ల, అక్కడ లభించిన శాసనాల వల్ల, తెలుస్తోంది. అనపోతారెడ్డి ఓడించి, బుక్క రాయలు రెడ్డి రాజ్యం లోని అహోబళం, వెనుకొండ ప్రాంతాలను విజయనగర సామ్రాజ్యంలో చేర్చాడు.

16.6.3.4 : మదుర దండయాత్ర

మదుర దండయాత్ర విశేషాలు గంగాంబ మదురా విజయంలో కీర్తించింది. దాని నాయకుడు, ఆమె భర్త కుమార కంపణ. 'కంపణ మదుర దండయాత్ర కేవలం రాజ్య సంపదల కొరకు

BRAOU

తలపెట్టిన జైత్ర యాత్ర కాదు. అది ధర్మ విజయ యాత్ర. మహమ్మదీయుల జిహాద్‌కు, అది హిందువుల జవాబు. మ్లేచ్ఛ సంహారం కొరకు, హిందూ సనాతన ధర్మ సంరక్షణ కొరకు ఉద్యమింపబడింది. సింగరాయపురాన విడిసియుండిన కావేటిరంగని నిజ నిలయానికి చేర్చి, అచ్చట ఆ దేవుని నెలకొల్పుట, దాని ప్రధాన ఉద్దేశమని, వెంకట రమణయ్య గారు పేర్కొన్నారు. విజయనగర రాజుల తొండమండల ఆక్రమణతో, వారి సరిహద్దు మదుర రాజ్యం వరకు వ్యాపించింది. ఈ రెండు రాజ్యాల మధ్య యుద్ధం తప్పనిసరైంది. బుక్క రాయల విజయాలలో ఇది ప్రధానమైంది. ఈ దండయాత్రలో కుమార కంపణకు సాళువ మంగి, గోపనాచార్యులు సహాయపడ్డారు. సాళువ మంగి అతి శౌర్యసాహసాలతో పోరాడి, మదుర సుల్తాన్‌ను సంహరించి, 'సరక్షసాళువ' బిరుదాన్ని ధరించాడు. మదుర రాజ్యం విజయనగర సామ్రాజ్యంలో కలిసిపోయింది. తిరుపతిలో తలదాచుకుంటున్న శ్రీరంగనాథుని, శ్రీరంగంలో పునఃప్రతిష్ఠచేసి, రామేశ్వరం, మదుర, శ్రీరంగం మొదలైన పుణ్యక్షేత్రాలలో మళ్ళీ పూజా పునస్కారాల నారంభింపచేశాడు. ఈ మదుర విజయం ఏ సంవత్సరంలో జరిగింది అన్న విషయంపై చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. డా. ఎ. కృష్ణస్వామి మదురను 1371 ఏప్రిల్, లేదా మే లో, ఫక్రుద్దీన్ ముబారక్‌షా సరిపోలిస్తుండగా జయించారన్న నిర్ణయానికి వచ్చారు. కానీ, మదుర సల్తనత్ రెండవ హరిహర రాయల కాలంలో కాలగర్భంలో కలసిపోయినట్లు తెలుస్తోంది. ద్రావిడ దేశాన్నంతటినీ జయించిన కుమార కంపణ, దానికి పాలకుడుగా ఉన్నాడు. కాని, 1374లో అకాల మరణం చెందాడు.

విజయనగర చరిత్ర గమనంలో మదుర సుల్తాన్‌పై విజయానికి ఎంతో ప్రాధాన్యతుందని, బర్టన్ స్టీన్ అభిప్రాయం. 'తొలి విజయనగర పాలకులు, క్షీణిస్తున్న హోయసాల రాజ్య పునాదులపై నిర్మించిన విజయనగర రాజ్యాన్ని స్థాపించిన 30 సంవత్సరాల లోపునే, మదుర సుల్తాన్‌పై, 1371 లో విజయాన్ని సాధించి, ద్వీపకల్పం లోని దక్షిణ ప్రాంతంపై తమ సార్వభౌమాధికారాన్ని విస్తరింప చేసుకున్నారు. మదురపై విజయం, అనశ్చిత పునాదులపై నిర్మించబడ్డ విజయనగర సంగమ వంశాన్ని, రాజ్యాన్ని, చోళులకు యోగ్యమైన వారసునిగా చేసింది. ఈ దృష్టితో చూస్తే, హోయసాలులు సాధించలేకపోయినదాన్ని యవ్వనోత్తేజంతో ఉన్న విజయనగర పాలకులు సాధించగలిగారు. విజయనగర పాలకులు ఈ ఘన కార్యాన్ని సాధించడానికి అవకాశాన్ని కల్గించింది, వారికి ఉత్తర సరిహద్దున స్థాపించబడ్డ సమకాలీన బహమని రాజ్యం. బహమని రాజ్యం విజయనగర రాజ్య విస్తరణకు ఎడతెగని అవరోధంగా కన్పించడం వల్ల, విజయనగర పాలకులకు తమ ప్రధాన అధికారిక కేంద్రమైన తుంగభద్ర తీరం నుండి ప్రక్కగా ద్వీపకల్పం లోని పశ్చిమ, తూర్పు దిక్కులలో ఆత్మ రక్షణా విధానాన్ని అవలంబించాల్సిన అగత్యమేర్పడింది. కనుకనే, తమ పూర్వీకులైన హోయసాలులు చేసిన తప్పులకు, బలహీనతలకు దూరంగా ఉండే విధానాన్ని అవలంబించారని, బర్టన్ స్టీన్ భ్రాశారు.

హరిహర రాయలు స్థాపించిన విజయనగర సామ్రాజ్యాన్ని బుక్కరాయలు సమర్థవంతంగా నిర్వహించి, వ్యాప్తి చేశాడు. బుక్క రాయలు దక్షిణ దేశాని కంతా చక్రవర్తయ్యాడు. బుక్క రాయల ప్రధాని, అనంతరాయలు. ఇతణ్ణి పెనుగొండ దుర్గానికి నియమించాడు. బుక్కరాయలు తన సామ్రాజ్యాన్ని అనేక రాజ్యాలుగా విభజించి, సమర్థులైన వారిని పాలకులుగా నియమించాడు. ఇతని సామ్రాజ్యంలో ఉదయగిరి రాజ్యం (నెల్లూరు, కడప జిల్లాలు), పెనుగొండ రాజ్యం (బళ్ళారి, అనంతపూర్ జిల్లాలు, మైసూర్ ఉత్తర ప్రాంతంలో కొంత), ముళువాయి రాజ్యం (మైసూర్‌లో కొంత, సేలం, ఆర్కాట్ జిల్లాలు), ఆరగ మలినాడు రాజ్యం (బనవాసి, చంద్రగుత్తి, గోవా), తుళు, కేడా బరకూరు-మంగుళూరు రాజ్యం, రాజగంభీర రాజ్యం (తొండమండలం) ఉన్నాయి.

BRAOU

బుక్క రాయలకు పుత్రులనేక మంది ఉన్నారు. వారిలో ఉదయగిరి, విరూపణ, చిక్క కంపణ, భాస్కర భవదూరుడు, హరిహరుడు ముఖ్యులు. అందరూ ఆరితేరిన శూరులు, పాలనాదక్షులు. వీరిలో హరిహరరాయలను తన వారసునిగా ప్రకటించి, 1377 లో బుక్క రాయలు మరణించాడు.

16.6.4 : రెండో హరిహర రాయలు (క్రీ.శ. 1377- 1407)

1377 లో బుక్క రాయల మరణం తర్వాత, రెండవ హరిహర రాయలు రాజ్యానికొచ్చాడు. ఇతని అధికారాన్ని అందరూ అంగీకరించినట్లు లేదు. ఉదయగిరి పాలకుడు విరూపణ, కేంద్ర ప్రభుత్వాన్ని ధిక్కరించి, అంగ రాజ్యాన్ని స్వతంత్రంగా పాలించసాగాడు. ద్రావిడ దేశంలో తుండీర, చోళ, పాండ్య ప్రభువులు సీకమై, తిరుగుబాటు చేసి, హరిహర రాయల అధికారాన్ని ధిక్కరించారు. కుమార కంపణ కుమారులు, మరికొందరు నాయకులు కూడా హరిహరుని అధికారాన్ని లెక్కచేయలేదు.

హరిహర రాయలు తిరుగుబాట్లను అణచి, తన అధికారాన్ని సామ్రాజ్య మంతటా నెలకొల్పడానికి, వెంటనే తగిన ఏర్పాట్లను చేశాడు. తన కుమారుడు విరూపణను, దక్షిణ దేశానికి అధిపతిగా నియమించాడు. అతడు అనతి కాలం లోనే తిరుగుబాట్లను అణచి, సేతువు వరకు గల దేశంపై రాయల అధికారాన్ని సుస్థిరం చేశాడు. తర్వాత విరూపణ్ణ సింహళంపై దండెత్తి, సింహళ రాజు నోడించి, కప్పాన్ని వసూలు చేశాడు. హరిహరుని కాలం లోనే మొదటిసారిగా విజయనగరానికి, సింహళానికి యుద్ధం జరిగింది.

హరిహర రాయలకు విరుద్ధంగా తిరుగుబాట్లు జరుగుతున్నాయని తెలిసిన బహమని సుల్తాన్, ముజాహిద్ షా, విజయనగరంపై దండెత్తడానికి ఇదే తగిన సమయమని భావించి, హరిహర రాయలకు 'కృష్ణ తుంగభద్ర నదుల మధ్య ఉన్న సీమలు, రెండు సంస్థానాల ఉమ్మడి పాలన క్రింద ఉన్నాయి; ఈ కారణం వల్ల, ఉభయ రాజ్యాలకు నిరంతర ఘర్షణ కల్గుతోంది; కాబట్టి, కృష్ణ, తుంగభద్రల మధ్యగల ప్రదేశాన్నంతటినీ బహమని సుల్తాన్ కిచ్చివేసి తుంగభద్రను రెండు రాజ్యాలకు సరిహద్దుగా అంగీకరించాల్సిందం'ప రాయబారాన్ని పంపాడు. దీనికి రెండవ హరిహరుడు అంగీకరించ లేదు. దీని కారణంగా, ముజాహిద్ షా, హరిహరుల మధ్య యుద్ధం జరిగింది. చివరకు ముజాహిద్ షా ఓడిపోయి, రాజధానికి తిరిగి వెళ్తున్నప్పుడు, మార్గమధ్యంలో 1378లో వధింపబడినాడు. ఇతని వధ వల్ల ఏర్పడ్డ అరాచక పరిస్థితులు అదనుగా, హరిహర రాయలు ఉత్తర కర్ణాటక, కొంకణ ప్రాంతాలను జయించాడు. బనవాసి పాలకుడైన మాధవమంత్రి తురుష్కులను జయించి, గోవా రేవుపట్టణం, సప్త కొంకణా న్నాక్రమించాడు. మాధవమంత్రి కుమారుడు బాచరసు పొండాకు దక్షిణంలో ఉన్న రంగిని (రంగాణ) అనే గిరి దుర్గాన్ని ఆక్రమించాడు. సప్త కొంకణాన్ని జయించినపుడే, ఉత్తర కొంకణ తీరం లోని చౌల్, దాబోల్ అను ముఖ్య రేవు పట్టణాలు రెండింటిని, హరిహర రాయలు వశపర్చుకున్నాడు. ఈ దండయాత్రల వల్ల, పశ్చిమ సముద్ర తీరమంతా, హరిహరుని అధికారం లోకి వచ్చింది.

పశ్చిమ సముద్ర తీరాన్ని ఆక్రమించిన తర్వాత, తీరాంధ్ర భూమి నంతటినీ ఆక్రమించి, పూర్వ సముద్రాధీశ్వరుడు కావలెనని, హరిహరరాయలు రెడ్డి రాజ్యంపై దండెత్తాడు. నెల్లూరు మండలం లోని కందుకూరి సీమ మొదలు కళింగ దేశం వరకున్న తీరాంధ్ర దేశం రెడ్డి రాజుల పాలనలో ఉంది. మొదటి బుక్క రాయలు కొండపీటి రాజ్యానికి చెందిన కొన్ని ప్రాంతాల నాక్రమించాడు. అనవేమారెడ్డి మరణం తర్వాత ఏర్పడిన అంతఃకలహాలు అదనుగా, హరిహరుని కుమారుడు, ఉదయగిరి దుర్గాధిపతైన దేవరాయలు, ఉదయగిరి నుండి బయలుదేరి, అద్దంకి, శ్రీశైలాలను ఆక్రమించాడు.

BRAOU

శ్రీశైల ప్రాంతాన్ని రాయలు ఆక్రమించడం, రాచకొండ వెలమలతో యుద్ధానికి దారితీసింది. వెలమలకు రాయల శత్రువైన బహమని సుల్తాన్, మిత్రుడు. వెలమరాజు అనపోతా నాయకుడు, బహమని సుల్తాన్ మహమ్మద్ షాను ఆశ్రయించాడు. ఈ విధంగా పద్మనాయకునితో వైరం, బహమని యుద్ధానికి దారితీసింది. పద్మనాయక - బహమని కూటమిపై, హరిహర రాయలు రెండు దండయాత్రలను నిర్వహించాడు. మొదటి దండయాత్ర తెలంగాణ పైకి నడచింది. యువరాజు రెండవ బుక్కరాయలు, గుండమ దండనాయకుడు, సాళువరాయలు, ఈ దండయాత్రకు నాయకత్వం వహించారు. ఈ యుద్ధంలో సాళువ రామదేవుడు వీరోచితంగా పోరాడుతూ మరణించాడు. బుక్క రాయలు బహమని సైన్యం చేతిలో కొత్తకొండ దగ్గర ఓడిపోయాడని, కొందరి అభిప్రాయం. వెంకట రమణయ్యగారు కొత్తకొండ వద్ద ఘోర సంగ్రామం జరిగిందని వ్రాశారు. కొత్తకొండ ఓటమికి ప్రతీకారంగా, 1397 లో రెండో పర్యాయం దండెత్తాడని, ఈ దాడిలో భాగం గానే దేవరాయలు అలంపురం పై దాడి చేశాడని, మరికొందరి అభిప్రాయం. 1397- 1422 మధ్య పాలించిన సుల్తాన్ ఫిరోజ్ షా ఈ దాడిని తీవ్రంగా ప్రతిఘటించగా, ఘోర యుద్ధం తర్వాత పాసుగల్లు బుక్కరాయల వశమైందని తెలుస్తోంది. చౌల్, దబోల్ విజయనగరంలో చేరినాయని కొందరి అభిప్రాయం. దేవరాయలు బహమని రాజ్యంపై దండయాత్ర చేస్తుండగానే, బహమని సైన్యంతో కూడి, వెలములు ఉదయగిరి రాజ్యం పైకి దండెత్తారు. దేవరాయల కుమారుడు రామచంద్రరాయలు వారి నోడించి, తరిమాడు. ఈ యుద్ధం చివరకు ఎలాముగిసిందో తెలియదు. 'కానీ, దీని వల్ల, వెలమ పాలకుల కోరిక ఈడేరనూ లేదు; బహమని సుల్తాన్ సైన్య మెక్కడా విజయాన్ని పొందనూ లేదు. దీనిని బట్టి చూడగా, ఈ యుద్ధంలో విజయలక్ష్మి రామరాయలునే వరించినట్లు తెలుస్తోంద'ని, వెంకటరమణయ్యగారు అభిప్రాయపడ్డారు.

విజయనగరాన్ని పరిపాలించిన ప్రముఖ రాజులలో రెండవ హరిహరరాయలు ఒకడు. ఇతడు పరిపాలించిన 28 సంవత్సరాల్లోనూ, విజయనగరం అన్ని దిశలా విస్తరించి, మహా సామ్రాజ్యంగా విస్తరించింది. పశ్చిమ సముద్ర తీరమంతా స్వాధీనం కావడం వలన, అందలి రేవు పట్టణాలన్నీ, రాయల ఏలుబడి కిందకు వచ్చాయి. అందువల్ల, విజయనగర సామ్రాజ్యానికి ద్వీపాంతరాలతో రాకపోకలు పెరిగి, విదేశ వ్యాపారం విరివిగా జరిగింది. దీని వలన, విజయనగర రాజుల సిరిసంపదలు పెరిగాయి. విజయనగర పాలకులలో "మహారాజాధిరాజ" బిరుదు నొందిన మొదటివాడు, రెండవ హరిహర రాయలు.

రెండవ హరిహరరాయలు 1404 లో మరణించగా, అతని కుమారులు రెండవ బుక్క, మొదటి విరూపాక్ష, మొదటి దేవరాయల మధ్య, సింహాసనం కోసం కలహాలు ప్రారంభమయ్యాయి. తండ్రి మరణించిన వెంటనే, యువ రాజుగానున్న రెండవ బుక్కను ధిక్కరించి, మొదటి విరూపాక్షుడు పట్టాభిషేకం చేసుకొని ఒక సంవత్సరం పరిపాలించాడు. అతనిని తొలగించి, రెండవ బుక్కరాయలు కొంత కాలం పాలించాడు. అతని తర్వాత మొదటి దేవరాయలు 1406 లో విజయనగర సింహాసనాన్ని అధిష్ఠించాడు.

16.6.5 : మొదటి దేవరాయలు (క్రీ.శ. 1406-1422)

మొదటి దేవరాయలు సోదరులపై విజయాన్ని సాధించి, 1406 లో నవంబర్ నెల 7వ తేదీన, విజయనగర వజ్ర సింహాసనానికి వచ్చాడు. శాసనాలు ఇతనిని "ప్రతాపదేవరాయలు", "ప్రౌఢదేవ రాయలు" అని పేర్కొంటున్నాయి. ఇతడు పాలించిన 16 సంవత్సరాలలో అనేక యుద్ధాలను చేయాల్సొచ్చింది. బహ్మనీ సుల్తాన్ల తోనూ, వారి మిత్రులు వెలమ రాజుల తోనూ, కొండవీటి రెడ్ల తోనూ పోరాడినాడు. ఈ దండయాత్రలను ఎదుర్కొని, విజయనగర పరువుప్రతిష్ఠలను కాపాడుతూ,

BRAOU

రాజ్యాన్ని విస్తరించినాడు. ఇతని పట్టాభిషేకం జరిగిన వెంటనే, బహ్మనీ సుల్తాన్ ఫిరోజ్‌షా విజయనగరం పైకి దండెత్తినాడు. ఈ దండయాత్రలకు కారణాన్ని, మహమ్మదీయ చరిత్రకారులు పలు రకాలుగా వర్ణించినారు. **తబకాత్-ఇ-అక్బర్** రచయిత నిజాముద్దీన్ అహ్మద్ ప్రకారం, దేవరాయలు ముద్గల్ ప్రాంతంలో సైన్యాన్ని ఒక విలాసినిపై మరులు గొని, ఆమెను తీసుకురావడానికి సైన్యాన్ని పంపాడు. ముద్గల్ బహ్మనీ రాజ్యం లోనిది కాబట్టి, ఫిరోజ్‌షా కోపగించి, విజయనగరం పైకి దండెత్తి వచ్చాడు. 'ఫెరిష్టా పై కథను పేర్కొంటూ, దేవరాయలు గుజరాత్, మాళవ సుల్తాన్‌లతో స్నేహం పెంచుకొని, ఫిరోజ్‌షాను లెక్క చేయక, కప్పం కట్ట నిరాకరించాడని, అందువల్ల ఫిరోజ్‌షా దండెత్తి వచ్చాడని' వ్రాశాడు.. **'బుర్హాన్-ఇ-మాసిర్'** రచయిత 'ఆల్ బీన్' అజీజ్ ఉల్లా తబతబా, మత కారణంగా ఫిరోజ్‌షా దండెత్తినాడని వ్రాశాడు. ఫెరిష్టా రచన ప్రకారం, ఫిరోజ్‌షా ఏ అడ్డంకులు లేకుండా, ప్రతిఘటన లేకుండా విజయనగరానికి చేరి, దానిని ముట్టడించాడని, తుదకు దేవరాయలు అతనితో సంది చేసుకుని, కీలక బంకాపుర దుర్గాన్ని ఇచ్చి వేయడమే కాక, తన కుమార్తెను సుల్తాన్ కిచ్చి పెళ్ళిచేశాడని వ్రాశాడు. ఇది కొంత అతిశయోక్తిలా కనపడుతుంది. మిగిలిన మహ్మదీయ చరిత్రకారులు దేవరాయల కుమార్తె వివాహాన్ని కానీ, నేరుగా విజయనగరాన్ని ముట్టడించినట్టుగాని, పేర్కొన లేదు. కానీ, మొత్తం మీద, దేవరాయలు ఓటమిని పొందినట్లే కనిపిస్తుంది. ఈ దండయాత్రలో రాయచూర్ జిల్లాలో వాయవ్య ప్రాంతం లోని భానూరు, ముసరికల్లు దుర్గాలు, ఫిరోజ్‌షా వశమయ్యాయి. ఫిరోజ్‌షా విజయనగరంపై దండెత్తి, కడప జిల్లా లోని పొత్తపినాడు, పులుగునాడులను ఆక్రమించాడు. సుమారు 7 ఏండ్ల కాలం, ఈ ప్రాంతాలు రెడ్ల అధీనం లోనే ఉన్నాయి. కానీ, 1413-14 ప్రాంతంలో, దేవరాయలు, రెడ్లను తరిమివేసి, ఈ ప్రాంతాలను తిరిగి ఆక్రమించినాడు. మొదటి దేవరాయలు కొండవీడు, కందుకూరు పాలకులకు వ్యతిరేకంగా, రాజమహేంద్రవరానికి చెందిన కాటయ వేమునితో అంగీకారాన్ని కుదుర్చుకొన్నాడు. వీరు, పెదకోమటి అన్న దేవచోడ, ఫిరోజ్‌షాల కూటమిని ఎదిరించారు. కాని, కాటయ వేమారెడ్డికి సహాయంగా పంపిన విజయనగర సైన్యాలు, పరాజయాన్ని పొందాయి. కాటయ వేముని మరణం తర్వాత రాజమహేంద్రవర వ్యవహారాలను పర్యవేక్షించిన అల్లాడరెడ్డి, పెద కోమటి, ఫిరోజ్‌షాలను ఓడించినాడు. దేవరాయలకు, రాజమహేంద్రవర పాలకులకు మధ్యనున్న సంబంధాన్ని చెడగొట్టేందుకు, ఫిరోజ్‌షా ఇంకొక ఎత్తు వేసి, పానుగల్లు దుర్గాన్ని ముట్టడించాడు. ఈ ముట్టడి 2 సంవత్సరాలపాటు సాగింది. ఈ కాలంలోనే, వెలమ నాయకులు బహమనీల పాత్ర వదిలి, విజయనగర పక్షంలో చేరారు. పద్మనాయకుల సహాయంతో దేవరాయలు భయంకర యుద్ధాన్ని జరిపి, ఫిరోజ్‌షాను ఓడించి, పానుగల్లు, నల్గొండ ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాడు. దేవరాయలు కృష్ణా, తుంగభద్ర, మధ్యప్రదేశాలను ఆక్రమించుకోవడమేగాక, బహ్మనీ రాజ్యం లోకి ప్రవేశించి, దేశాన్ని ధ్వంసం చేశాడని, వెంకటరమణయ్యగారి అభిప్రాయం. మోటుపల్లి పైకి పంపిన దేవరాయల సైన్యాలు ఆ రేవు పట్టణాన్ని 1417 ప్రాంతంలో స్వాధీనం చేసుకున్నాయి.

16.6.5.1 : గజపతులతో యుద్ధం

రాజమహేంద్రవర రాజ్యంలో జోక్యం చలన, దేవరాయలకు గంగులతో వైరం ఏర్పడింది. నాలుగవ భానుదేవుడు రాజమహేంద్రవంలో ఏర్పడిన అంతఃకలహాలను అదనుగా తీసుకొని, రెడ్డి రాజ్యం పైకి దండెత్తాడు. అల్లాడరెడ్డి దేవరాయలకు మిత్రుడవడం వల్ల, అతనికి సహాయంగా గోదావరి తీరానికి సైన్యాన్ని పంపాడు. రాయగజపతి సైన్యాలు యుద్ధానికి సిద్ధమయ్యాయి. ఈ యుద్ధం వలన తన రాజ్యం పాడౌతుందని తలచి, అల్లాడరెడ్డి రెండు పక్షాలను యుద్ధంలో పాల్గొనకుండా చేసి, ఎవరి

BRAOU

రాజ్యాలకు వాళ్ళను, పంపేశాడు. సుమారు 100 సంవత్సరాలుగా తీరాంధ్ర ప్రాంతాన్ని సంక్షోభ పెట్టిన నరపతి (విజయనగర), గజపతుల వైరానికిది మొదలు. ప్రస్తుతానికి విజయనగర కళింగ యుద్ధం తప్పిపోయినా, ఇది విస్మరించదగిన విషయం కాదని, విజయనగర విదేశీ వ్యవహారాలలో ఇక్కడ నుండి నూతన యుగం ప్రారంభమైందని, వెంకటరమణయ్య గారు అభిప్రాయపడ్డారు.

దేవరాయల పాలన చివరి కాలంలో, ఉదయగిరి రాజ్యానికి పడమర ప్రాంతమైన పుష్పగిరి ప్రాంతంలో అప్రతిమల్ల వంశానికి చెందిన అహోబలుడనే తెలుగు చోళ పాలకుడు తిరుగుబాటు చేశాడు. దేవరాయలు, అతని కుమారుడు విజయరాయలు, దండెత్తి, అతని రాజధానిని ధ్వంసం చేసి, తిరుగుబాటును అణచారు.

దేవరాయలు పాలనాదక్షుడు, గొప్ప వీరుడు, రాజనీతి విశారదుడు. విజయనగర ప్రాకారాలను బలపర్చి, సైన్యంలో అశ్విక దళ ప్రాధాన్యతను గుర్తించి, అరబ్బీ, పారశీక దేశాల నుండి మంచి గుఱ్ఱాలను తెప్పించి, అశ్విక దళాన్ని బలపర్చాడు. జాతి, మత భేదాలను పాటించకుండా, ముహమ్మదీయ విలుకాండ్రను చేర్చుకొని, కాల్బలాన్ని అభివృద్ధి చేశాడు. దేవరాయలు గొప్ప నిర్మాత. అతని నీటిపారుదల నిర్మాణాలు, అతను తుంగభద్రపై నిర్మించిన ఆనకట్ట, నీటి కాలువలు గమనించదగినవి. దేవరాయల పాలనా చివరి రోజుల్లో, ఇటలీ యాత్రికుడైన నికోలో కాంటి విజయనగరానికి వచ్చి, పట్టణ వైభవాన్ని పొగిడాడు. ఇతని ఆస్థానంలో అనేక మంది కవులు, గాయకులు, శాస్త్రవేత్తలు, తత్వజ్ఞులుండేవారు.

16.6.5.2 : మొదటి దేవరాయల పుత్రులు

మొదటి దేవరాయలకు చాలా మంది పుత్రులున్నారు. వారిలో రామచంద్రరాయలు, మొదటి విజయరాయలు ముఖ్యులు. దేవరాయల తర్వాత రామచంద్ర రాయలు కొద్ది కాలం రాజ్యం చేశాడు. ఇతడు కొంత కాలం ఉదయగిరి దుర్గాధిపతిగా ఉన్నాడు. ఇతని పాలన ఆరు నెలలు మాత్రమే సాగింది. ఇతనిని తొలగించి, విజయరాయలు బలవంతంగా సింహాసనాన్ని ఆక్రమించాడు. ఇతనికి విజయభూపతి, విజయబుక్క, వీరబుక్క అనే పేర్లున్నాయని, శాసనాలు తెలుపుతున్నాయి. ఇతడు ఎంత కాలం పాలించాడో చెప్పడం కష్టం. ఇతడు ఆరేళ్ళు పాలించాడని 'న్యూనిజ్', ఐదేళ్ళు పాలించాడని ఫెరిష్టా లు చెబుతున్నాయి. ఇతడు రాజ్యం చేస్తున్న కాలం లోనే, ఇతని కుమారుడు రెండవ దేవరాయల శాసనాలు కన్పిస్తున్నాయి. శాసనాలను బట్టి, రెండవ దేవరాయలు తండ్రితో కలిసి, రాజ్యమేలినట్లు భావించాల్సుంది.

16.6.6 : రెండో దేవరాయలు (క్రీ.శ. 1422-1446)

రెండో దేవరాయలు పైన పేర్కొన్నట్లు, 1422 నుండి తన తండ్రి విజయరాయలుతో కలిసి, రాజ్య పాలన చేశాడు. తండ్రి మరణానంతరం 1426 నుండి 1446 వరకు, రాజ్య పాలన చేశాడు. ఇతడు సంగమ వంశస్థుల్లో ప్రముఖుడు. ఇతని కాలంలో విజయనగర సామ్రాజ్యం ఎంతో వ్యాప్తి చెందింది. కృష్ణా నది మొదలు సింహళం వరకూ, అరేబియా సముద్రం మొదలు బంగాళాఖాతం వరకూ గల దక్షిణ భారతదేశం ఇతని పలుకుబడి లోకి వచ్చింది. ఇతడి పరిపాలనా కాలమంతా శత్రువులతో నిరంతరం యుద్ధం చేయడంతో సరిపోయింది.

BRAOU

16.6.6.1 : బహమనీలతో యుద్ధం

ఫిరోజ్‌షా కాలంలో మొదటి దేవరాయలు బహ్మనీ రాజ్యంపై దండెత్తి, సంక్షోభాన్ని కల్గించాడు. దీనికి ప్రతీకారం చేసే ఉద్దేశంతో, అతని తర్వాత రాజ్యానికే వచ్చిన అహమ్మద్‌షా, రెండవ దేవరాయలు సింహాసన మధిష్ఠించిన వెంటనే (1422 లో), విజయనగరం పైకి దండెత్తాడు. ఈ దండయాత్రలో ఏమి జరిగిందీ, చివరకు ఎలా ముగిసిందీ, చెప్పడం సాధ్యం కాదు. దీనిక్కారణం మహమ్మదీయ చరిత్ర కారుల మధ్య ఏకాభిప్రాయం కనపడదు. ఫెరిష్టా తన సహజ ధోరణిలో దేవరాయలు ఓడిపోయాడని, కొన్ని ఏండ్ల నుండీ చెల్లించని కప్పం కట్టి, సంధి చేసుకున్నాడని వ్రాశాడు. ఇది నిజమనడానికి వీలు లేదు. యుద్ధ ప్రారంభ దశలో విజయనగర సైన్యం బహ్మనీ రాజ్యంలో ప్రవేశించి, గుల్బర్గా మండలం లోని యాతగిరి దుర్గం వరకూ దండెత్తినట్లు తెలుస్తూంది. వెలుగోటివారి వంశావళి, వెలమ రాజులు, తోరగల్లు, బాదామి పట్టణాలను పట్టుకున్నారని, యాతగిరి దుర్గాన్ని జయించారని చెబుతోంది. తెలంగాణా ప్రభువు దేవరాయలకు సహాయంగా వచ్చి, పోరాడినట్లు ఫెరిష్టా చెప్పి ఉండటం వల్ల, పైన పేర్కొన్న వెలమవారి విజయాలన్నీ ఈ యుద్ధం లోనే సంభవించి ఉండాలి. కానీ, తర్వాత విజయనగర సైన్యం అపజయాన్ని పొందినట్లు తెలుస్తూంది. దీనిక్కారణం ఫెరిష్టా చెప్పినట్లు , యుద్ధంలో తెలంగాణా ప్రభువు రాయలను వదిలి వెళ్ళిపోవడం వల్ల, పైగా, కళింగ నాలుగవ భానుదేవుడు తీరాంధ్ర దేశంపై దండెత్తడం కారణమై ఉండొచ్చని, వెంకటరమణయ్యగారి అభిప్రాయం. ఈ విధంగా, రాయల రాజ్యంపై దండయాత్ర సాగిఉండొచ్చు. కానీ, విజయనగరాన్ని ముట్టడించి, రెండవ దేవరాయలను సంధికి ఒప్పించాడనుట, సంశయాస్పదమని కూడా, వెంకట రమణయ్యగారి అభిప్రాయం. ఈ యుద్ధం జరిగిన మరునటి సంవత్సరమే, అహమ్మద్‌షా తన రాజధానిని గుల్బర్గా నుండి బీదర్‌కు మార్చాడు. విజయనగర సైన్యం గుల్బర్గా వరకూ దండెత్తడం వల్లే రాజధానిని మార్చిఉండొచ్చునని, కొందరి అభిప్రాయం. అహమ్మద్‌షాకు సంపూర్ణ విజయం లభించలేదనడానికి, శాసనాధారాలు కూడా ఉన్నాయి. 1429-30 సంవత్సరాల్లో రాయల శాసన మొకటి, దేవరాయలు తురకల అశ్విక దళాన్ని నిర్జించెనని చెబుతూంది. అహమ్మద్‌షా దండయాత్రా కాలం లోనే ఈ విజయాన్ని పొంది ఉండొచ్చు.

1435-36 లో కృష్ణా-తుంగభద్ర - అంతర్వేది లోని ముద్గల్, రాయచూర్ దుర్గాలకై, బహ్మనీ, విజయనగర రాజ్యాల మధ్య యుద్ధాలు జరిగాయి. 1435 - 36 లో రెండవ అల్లాఉద్దీన్ అంతర్వేదిపై దండెత్తి, ముద్గల్ కోటను పట్టుకున్నాడని , ముస్లిం చరిత్రకారులు రాశారు. కానీ, ముద్గల్ కోట లోని ఒక శాసనం, 1435-36 లో ఈ దుర్గాన్ని విజయనగర రాయల ఆజ్ఞాన, వరద నాయకుడు పాలించినట్లు తెలుపుతూంది.

1443లో దేవరాయలే బహ్మనీ సుల్తాన్‌లపై దండెత్తి, రాయచూర్, బంకాపురాలను ముట్టడించాడు. అల్లావుద్దీన్ తెలంగాణా, దౌలతాబాద్‌ల నుండి సైన్యాన్ని రప్పించి, రాయలను ఎదుర్కొన్నాడు. ఈ యుద్ధం 2 నెలల పాటు సాగింది. ఈ యుద్ధంలో విజయం ఎవరికి లభించిందన్న విషయంపై, ఫెరిష్టా, అబ్దుల్ రజాక్‌లు భిన్నాభిప్రాయాలను తెల్పారు. ఫెరిష్టా ప్రకారం రాయలు ఓడిపోయి, కప్పం చెల్లించడానికి అంగీకరించాడని, పాత పాటనే వల్లించాడు. అబ్దుల్ రజాక్ విజయనగరం విజయాన్ని సాధించిందని పేర్కొన్నాడు. సమకాలికుడైన అబ్దుల్ రజాక్ మాటలే విశ్వసనీయమని, వెంకట రమణయ్య గారి అభిప్రాయం.

16.6.6.2 : కొండవీటి ఆక్రమణ - గజపతులతో యుద్ధం

కొండవీటి రాజులలో చివరి వాడైన రాచవేమారెడ్డి 1424 లో మరణించడంతో, ఆ రాజ్యం అంతమైంది. దానిని అవకాశంగా తీసుకొని, రెండవ దేవరాయలు కొండవీటిని ఆక్రమించి, తన

BRAOU

రాజ్యంలో కలిపాడు.1419 - 20 ల్లో కళింగ గజపతి నాలుగవ భానుదేవుడు తీరాంధ్రాన్ని జయించి, 12 సంవత్సరాలు పరిపాలించినట్లు, స్థానిక కైఫియత్‌లు తెలుపుతున్నాయి. కానీ, అంత కాలం గజపతులు తీరాంధ్రాన్ని పాలించారనడానికి, ఇతర ఆధారాలు లేవు. 1422 లో రెండవ దేవరాయలు తీరాంధ్రం మీద దండెత్తి, సింహాచలం వరకూ గల దేశాన్ని జయించాడు. రాజమహేంద్రవర పాలకుడైన వీరభద్రారెడ్డి విజయనగర సామంతుడయ్యాడు.


నాలుగవ భానుదేవుని తొలగించి, 1434-35లో కపిలేశ్వర గజపతి కటక్ సింహాసనాన్నాక్రమించాడు. నాలుగవ భానుదేవుని కాలంలో విజయనగర రాజులకు, వారి సామంతులకు, కోల్పోయిన దక్షిణ కళింగ ప్రాంతాలను ఆక్రమించడానికి, 1444 లో కపిలేశ్వర గజపతి దండెత్తి, విశాఖపట్టణం జిల్లా లోని కోరుకొండ వరకూ వచ్చాడు. రాజమహేంద్రవర రాజ్యాన్ని రక్షించడానికి, రెండవ దేవరాయలు వీరభద్రా రెడ్డికి సహాయంగా సైన్యాన్ని, అతని ప్రధానైన మల్లప్ప వడయల నాయకత్వంలో పంపాడు. 1444 నాటి ద్రాక్షారామ శాసనాన్ని బట్టి, విజయనగర సైన్యాలు గజపతి సైన్యాలను ఓడించి, తరిమినట్లు తెలుస్తోంది.

16.6.6.3 : సింహళ దండయాత్ర

బహ్మనీ సుల్తాన్‌లతో పోరాడుతున్న సమయంలోనే, రెండవ దేవరాయలు సింహళం పైకి రెండు నౌకా దండయాత్రలను పంపాడు. రెండవ హరిహరుని కాలం నుండి సింహళం విజయనగర అధికారాన్ని గుర్తించింది. దక్షిణ సముద్రాధిపత్యానికి విజయనగర, సింహళాల మధ్య ఏర్పడిన సంఘర్షణ, సింహళ దండయాత్రకు కారణమై ఉండొచ్చు. పారశీక రాయబారి అబ్దుల్ రజాక్ రచనలను బట్టి, 1442 లో రెండవ దేవరాయల ప్రధాని లక్కణ దండనాయకుడు సింహళంపై దండెత్తాడు. ఈ దండ యాత్ర విజయవంతమై, సింహళ పాలకుడు కప్పం కట్టడానికి ఒప్పుకున్నాడు. అందుచేతనే, లక్కణ దండనాయకుడు తన శాసనాల్లో "దక్షిణ సముద్రాధీశ్వర" బిరుదు వహించాడు. కొన్ని శాసనాలు రెండవ దేవరాయలను 'ఇరంతిరైకొండ (సింహళం నుండి, కప్పం కొన్నవాడు) అని పేర్కొన్నాయి. ఈ దండయాత్ర వల్ల, సింహళం విజయనగరం అధీనం లోకి వచ్చింది.

రెండో దేవరాయలు శక్తి సంపన్నుడైన చక్రవర్తి. అతనికి అనేక బిరుదులున్నట్లు శాసనాల వల్ల, సాహిత్యం వల్ల తెలుస్తోంది. వాటిలో ప్రధానమైనవి, ప్రతాప, ప్రౌఢ ప్రతాప, గజ బెంలుకార (ఏనుగుల వేటకాడు). ఇతని కాలం లోని విజయనగర వైభవాన్ని పర్షియా రాయబారి అబ్దుల్ రజాక్, ఇటాలియన్ యాత్రికుడు నికోలో కాంటీ, ఎంతో పొగిడారు. ఇతనికి లెక్కలేనంత ఆదాయం వచ్చేది. రాష్ట్రాల నుండి వసూలయ్యే పన్నులు కాక, అనేక రేవు పట్టణాల నుండి సుంక రూపంలో అపార ధనం వసూలయ్యేది. అతనికి కొల్లం, సింహళం, పెగుతెనంసరి పాలకులు కప్పం కట్టినారని, న్యూనిజ్ వ్రాశాడు. ఎక్కువ కాలం యుద్ధాలతో, రాజ్య విస్తరణతో గడిపినప్పటికీ, ప్రజా పాలనా విధానాలను శ్రద్ధగా నిర్వహించాడు. ప్రజలు సుఖశాంతులతో, సౌభాగ్యంతో కాలం గడిపారు. ఇతనికి 1000 ఏనుగులు, పదకొండు లక్షల పదాతి దళమున్నట్లు తెలుస్తోంది. ఇతడు స్వయంగా కవి, కవి పోషకుడు. **మహానాటక సుధానిధి** అనే పేరుతో, రామాయణ కథను చంపూ కావ్యంగా రచించాడు. బ్రహ్మ సూత్ర భాష్య మొకటి ఇతని పేరుతో ఉంది. ఇతడు అనేక సంస్కృత, ఆంధ్ర, కన్నడ కవులను ఆదరించాడు. ఇతని ఆస్థాన పండితుడైన డిండిమభట్టును, కవిసార్వభౌముడైన శ్రీనాథుడు వాదనలో ఓడించాడు. దేవరాయలు శ్రీనాథునికి కనకాభిషేకం చేశాడు. ఇతడు శైవుడైనప్పటికీ, అన్ని మతాల నాదరించి, గౌరవించాడు.

BRAOU



BRAOU

16.6.7 : రెండో విజయరాయలు (క్రీ.శ. 1446-47)

రెండో దేవరాయలు స్వర్గస్థుడైన వెంటనే విజయనగరంలో ఏమి నడిచిందో స్పష్టంగా తెలియట్లేదని, చరిత్రకారులు ఇతని అనంతరం మల్లికార్జునుడు సింహాసనాన్ని అధిష్టించాడని అభిప్రాయపడుతున్నారని, ఇది సరికాదని, వెంకట రమణయ్యగారి అభిప్రాయం. "ప్రౌఢ దేవరాయలు మరణించిన పిదప, విజయనగర రాజకీయాల్లో కొన్ని నెలలు అస్తవ్యస్త పరిస్థితి ఏర్పడిందని భావించుటకు, అప్పట్ శాసనాలు, సారస్వతాధారాలు సాక్ష్యను కల్పించుచున్నాయ"ని కందూరి ఈశ్వర దత్తు ప్రశాంతు. వెంకట రమణయ్యగారు రెండవ దేవరాయల తర్వాత, అతని తమ్ముడు రెండవ విజయ రాయలు సింహాసనాన్ని ఆక్రమించి, కొంత కాలం పాలించాడని, శాసన సాక్ష్యం చెబుతుందని భావించారు. అంతేకాక, విజయరాయలు రాజ్యం చేస్తున్న కాలం లోనే, మల్లికార్జునుడు కూడా విజయనగరాన్ని పాలించినట్లు శాసనాలు పేర్కొంటున్నాయి. కానీ, రెండవ విజయరాయలు, మల్లికార్జున రాయలు, ఇరువురు రాజ్య పాలన చేశారనడానికి ఆధారాలు లేవని, విజయరాయలు తన సోదరుని మరణానంతరం అతని పుత్రుని బాల్యాన్ని అవకాశంగా తీసుకొని, సింహాసనాన్ని ఆక్రమించుకోవలెననియు, చిరకాలం తన అధికారాన్ని నిలుపుకొనుటకు శక్తి లేకపోవుటచే, అతడు మల్లికార్జున రాయలుతో సంది చేసుకుని, తన పూర్వ స్థానమైన పెనుగొండకు మరలి, అచట నుండి పరిపాలన చేసినట్లు, ఊహించాల్సుందని వెంకట రమణయ్యగారు అభిప్రాయపడ్డారు. ఇతడు ఉద్యోగుల దుశ్చర్యలను నిలుపుచేయిస్తూ, ఒక శాసనాన్ని వేయించినట్లు, తెలుస్తూంది.

విజయనగర రాజ్యాన్ని విస్తరించి, వైభవంగా పాలించిన రెండవ దేవరాయల మరణంతో, విజయనగరానికి చెడ్డ రోజులు ప్రారంభమైనాయి. ఇతని అనంతరం విజయనగరాన్ని పాలించిన వారు అసమర్థులు కావడం వల్ల, సంగమ వంశానికే కాక, విజయనగరానికి ప్రమాద పరిస్థితి ఏర్పడింది. విజయరాయలు కొద్ది కాలం పరిపాలించిన తర్వాత, అతనిని తొలగించి, దేవరాయల కుమారుడైన మల్లికార్జున రాయలు సింహాసనానికి వచ్చాడు.

16.6.8 : మల్లికార్జున రాయలు (క్రీ.శ. 1446-1465)

రెండవ దేవరాయలు మరణించడం, మల్లికార్జున రాయలు బలహీనుడవడంతో, గజపతులు, బహ్మనీలు విజయనగరంపై దండెత్తారు. గంగాధరుడు రచించిన 'గంగాదాసి ప్రతాపవిలాస' నాటకంలో, గజపతులు, బహ్మనీలు విజయనగరం పైకి దండెత్తినారని, వారిని మల్లికార్జున రాయలు త్రిప్పికొట్టాడని పేర్కొంటూంది. కొందరు చరిత్రకారులు గజపతి, అశ్వపతి ఒక కూటమిగా చేరారని భావించారు. వీరు కూటమిగా ఏర్పడి, దండెత్తలేదని, ఎవరికి వారే కాకతాళీయంగా ఒకసారి విజయనగరం పైకి దండెత్తినారని, కొంతమంది భావించారు. ఈ దండయాత్ర మల్లికార్జున రాయలు సింహాసనానికి వచ్చిన వెంటనే జరిగినట్లు తోచదు. మల్లికార్జున రాయల శాసన మొకటి, 1450 లో మహమ్మదీయులపై విజయాన్ని పొందినట్లు తెల్పుతుంది. అదే సంవత్సరం వరకూ, కొండవీడుపై విజయనగర అధికారం కొనసాగింది. గజపతి కపిలేశ్వరుడు 1450-54 సంవత్సరాల మధ్య, తన కుమారుడు హంవీరుని నాయకత్వంలో తీరాంధ్రం మీదకు సైన్యాన్ని పంపాడు. ఇతడు రాజమహేంద్రవర రాజ్యాన్ని జయించి, గజపతుల రాజ్యంలో కలిపాడు. ఇంకొక గజపతి సైన్యం గజరావుతిప్పనాయకుని నాయకత్వంలో తెలంగాణాలో ప్రవేశించి, అక్కడ బహ్మనీ సైన్యంతో యుద్ధం చేసి, ఆ ప్రాంతాన్ని ఆక్రమించింది. అక్కడ రఘుదేవ నరేంద్ర మహాపాత్రుడు పాలకుడుగా నియమింపబడ్డాడు. ఈ విధంగా కృష్ణా నది గజపతి, విజయనగర రాజ్యాల సరిహద్దయింది. కృష్ణకు దక్షిణ ప్రాంతాల్లో 1453 వరకూ,

BRAOU

కరారి సాళువ తిప్ప దేవమహారాయలు విజయనగర సామంతుడుగా పాలించాడు. 1454 నాటికి ఈ ప్రాంతాన్ని కూడా గజపతులు ఆక్రమించి, గాణ దేవుణ్ణి పాలకుడుగా నియమించారు. ఈ ప్రాంతంలో గజపతి సైన్యాన్ని నడిపిన పూసపాటి తిమ్మ భూపాలుడు ఒక ముట్టడిలో బెల్లంకొండ, వాడపల్లి, రంగరాజుకొండ మొదలైన దుర్గాలను సాధించాడు. అతడు 1460 లో ఉదయగిరిని కూడా వశం చేసుకున్నాడు. ఇతని కుమారుడు బనవ భూపాలుడు ఉదయగిరి పాలకుడుగా నియమింపబడ్డాడు. కపిలేశ్వరుని నాయకత్వంలో ఇంకొక సైన్యం కర్నూలు ప్రాంతాన్ని జయించి, అక్కడ విజయ స్తంభాన్ని ప్రతిష్టించాడు.

గజపతులు విజయనగర రాజ్యం మధ్యలోకి రాకుండా ప్రతిమటించడానికి, మల్లికార్జున రాయలు కొన్ని ఏర్పాట్లు చేశాడు. ఆనాటి సైన్యాధిపతుల్లో ప్రముఖుడైన సాళువ నరసింహరాయలను, చంద్రగిరి నుండి పెనుగొండకు మార్చాడు. చంద్రగిరిని రామచంద్రదాయల అధీనంలో ఉంచాడు. మల్లికార్జున రాయలు స్వయంగా తిమ్మదండ నాయకునితో పెనుగొండకు వెళ్ళి, అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షించాడు. కానీ, ఈ ఏర్పాట్లు గజపతులను ఆపలేకపోయాయి. హంవీరుని నాయకత్వంలో నగర సామ్రాజ్యం లోని అదిక ప్రాంతాన్ని ఆక్రమించాయి. 1464 నాటి దక్షిణ ఆర్కాట్ శాసనాలు హంవీరుని కుమారుడైన కపిలేశ్వర మహాపాత్రుడు కొండపల్లి, తిరువనల్లూరు, తిరుచునాపల్లి, చంద్రగిరి ప్రాంతాలను పాలిస్తున్నట్లు తెలుపుతాయి. గజపతులు ఈ ప్రాంతాలను కొంత కాలం పాలించారా? లేక గజపతి సైన్యం దండయాత్రలు చేసి, వెనుకకు పోయిందా? అనే విషయం పై, చరిత్రకారుల్లో ఏకాభిప్రాయం లేదు. గజపతులు కొంత కాలం ఈ ప్రాంతాన్ని పాలించారని కొందరు భావిస్తే, వెంకటరమణయ్యగారు ఇవి వట్టి దండయాత్రలు మాత్రమేనని, గజపతులు దక్షిణ దేశంలో ఎక్కువ కాలం ఉండలేదని భావించారు. ఈ దండయాత్రలు ముగిసిన కొద్ది కొలానికే, మల్లికార్జున రాయలు 1465 జూన్‌లో మరణించాడు.

16.6.9 : రాజశేఖర రాయలు (క్రీ.శ. 1465-1471)

మల్లికార్జున రాయలు తర్వాత, అతని పుత్రుడు రాజశేఖర రాయలు 1465లో అధికారాన్ని చేపట్టాడు. కాని, ఇతడు విజయనగరం నుండి పాలించినట్లు కనపడదు. **విద్యారణ్య కాలజ్ఞానం** 13 నంగము రాజుల్లో ఇతనిని కూడా చేర్చింది. దక్షిణ ఆర్కాట్ మండలంలో కనపడే సాళువ నరసింగ రాయల శాసనాల్లో మాత్రమే, రాజశేఖర రాయల పేరు కనపడటం వలన, ఇతడు నరసింగరాయల సహాయంతో పాలించినట్లు తోస్తున్నది. మల్లికార్జున రాయలను వధించి, అతని పినతండ్రి కుమారుడైన రెండవ విరూపాక్ష రాయలు విజయనగర సింహాసనాన్ని ఆక్రమించాడు. అందుచేత, రాజశేఖర రాయలు విజయనగరం నుండి పారిపోయి, సాళువ నరసింగరాయల అండచేరినట్లున్నది.

16.6.10 : రెండో విరూపాక్ష రాయలు (క్రీ.శ. 1465-1485)

మల్లికార్జున రాయలను వధించి, అతని పినతండ్రి ప్రతాప దేవరాయల కుమారుడు రెండో. విరూపాక్ష రాయలు సింహాసనాన్ని ఆక్రమించాడు. ఇతడు గజపతుల సహాయంతో రాజశేఖర రాయలను విజయనగరం నుండి తొలగించి, సింహాసన మధిష్ఠించినట్లు కనపడుతుంది. కాని, ఇతడు కర్ణాటక, పశ్చిమ ఆంధ్రాలను మాత్రమే పాలించినట్లు తెలుస్తోంది. ఇతడు త్రాగుబోతు, స్త్రీలోలుడని, న్యూనిజ్ వ్రాశాడు. విరూపాక్షుడు రాజ్యానికి వచ్చిన మొదటి 5 సంవత్సరాలు శాంతంగానే గడిచింది. కాని 1470 లో ఇతనికి అండగావున్న కళింగ గజపతి మరణించడంతో, రాజకీయ వాతావరణంలో

BRAOU

మార్చ్చింది. గజపతుల నుండి ప్రమాదం లేదని భావించిన బహ్మనీ సుల్తాన్, కొంకణంపై దండెత్తినాడు. గోవాను శత్రువులు ఆక్రమించడం వల్ల విదేశీ వ్యాపారం వల్ల, విజయనగరానికి వచ్చే ఆదాయం పడిపోయింది. గుర్రాల సరఫరా కూడా నిల్చిపోయి, సైన్యం బలహీనపడింది.

నానాటికి క్షీణిస్తున్న విజయనగరాన్ని కాపాడటానికి, సాళువ నరసింహరాయలు ప్రయత్నించాడు. కపిలేశ్వర గజపతి మరణం తర్వాత, అతని కుమారులు హంవీర, పురుషోత్తములు సింహాసనం కోసం దెబ్బలాడుకోసాగారు. బహ్మనీలు హంవీరునికి సహాయపడగా, కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాన్ని బహ్మనీల కిచ్చాడు. ఈ ప్రాంతంలో బహ్మనీల ఆధిపత్యం విజయనగరానికి ప్రమాదమని తలంచి, నరసింగరాయలు పురుషోత్తమునికే సహాయపడ్డాడు. కొండవీడులో బహ్మనీ గవర్నర్‌పై తిరుగుబాటు జరిగి, అతనిని వధించారు. సాళువ నరసింహుడు తన తెలివితేటలతో, హంవీర, పురుషోత్తముల మధ్య రాజీ కుదిర్చాడు. సాళువ నరసింహుడు బహ్మనీలను ఓడించి, తన బలాన్ని పెంచుకున్నాడు.

16.6.11 : ప్రౌఢరాయలు (క్రీ.శ. 1485)

గజపతుల అంతఃకలహం విరూపాక్ష రాయలకు తీరాంధ్రదేశాన్ని తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశాన్నిచ్చింది. కానీ, విరూపాక్షుడు నిర్లక్ష్యం చేశాడు. ఇతని దుశ్చర్యలను సహించ లేక, అతని పెద్ద కుమారుడు అతనిని వధించి, పిత్రు హంతకుడు రాజ్యానికి అర్హుడు కాడని, తన తమ్ముడు ప్రౌఢ దేవరాయలను సింహాసనాన్నెక్కించాడు. కానీ, అతడు కృతఘ్నుడై, అన్నను వధించాడు. ఇట్లు, పిత్రు హంతకులు, భ్రాతృ హంతకులు రాజులు కావడంతో, ప్రజలలో అసంతృప్తికి, సామంతుల తిరుగుబాటుకు కారణమైంది. పురుషోత్తము గజపతి అంతఃకలహం నుండి బయటపడి, బహ్మనీలతో యుద్ధానికి దిగాడు. 1482 లో మూడవ మహమ్మద్ మరణంతో, బహ్మనీ రాజ్యంలో అరాచక పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితులన్నిటిని అవకాశంగా తీసుకొని, శూరుడు, సమర్థుడైన చంద్రగిరి దుర్గాధిపతి సాళువ నరసింగరాయలు విజయనగర సామ్రాజ్యం లోని ముఖ్య సామంతులందరినీ కూడగట్టుకొని, దుష్టుడైన ప్రౌఢ దేవరాయలను విజయనగరం నుండి తరిమివేసి, 1485లో విజయనగర సింహాసనాన్ని ఆక్రమించాడు. దీనితో, సంగమ వంశం అంతమై, సాళువ వంశ పాలన ప్రారంభమైంది.

16.7 : సంగ్రహంగా

దక్షిణ హిందూ దేశాన్ని మహమ్మదీయుల బారి నుండి రక్షించి, హిందూ మతాన్ని, సంస్కృతిని పరిరక్షించడానికి, 1336 లో హరిహర రాయలు, బుక్కరాయలు, విద్యారణ్యుల ఆశీస్సులతో, విజయనగర సామ్రాజ్య స్థాపన చేశారు. ఈ విజయనగరాన్ని పాలించిన వారిలో మొదటి వారు, సంగమ వంశస్థులు, వీరి పాలనలో దక్షిణ దేశం రాజకీయ ఐక్యతను సంపాదించుకోవడమేకాక, బహ్మనీ సుల్తాన్‌ల బారి నుండి కాపాడబడింది. ఈ వంశంలో రెండవ దేవరాయల వంటి ప్రముఖులు పాలించారు. సంగమ వంశస్థులు సాహిత్య, కళలను కూడా పోషించారు.

16.8 : పరీక్షా నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. దక్షిణ దేశంలో విజయనగర సామ్రాజ్య స్థాపనకు దారితీసిన పరిస్థితులను వివరించండి.

BRAOU

2. విజయనగర పుట్టుపూర్వోత్తరాలను సమీక్షించండి.

3. మొదటి హరిహర రాయల పాలనా విశేషాలను విశ్లేషించండి.

4. బుక్క రాయల పాలనా విశేషాలెట్టివి?

5. రెండవ దేవరాయలు సాధించిన ఘన కార్యాలను పరిశీలించండి.

6. సంగమ వంశస్థులకు, బహ్మనీ సుల్తాన్‌లకు మధ్య గల సంబంధాలను విశ్లేషించండి.

II. క్రింది ప్రశ్నలకు అతి వ్యాఖ్యలను రాయండి.

1. విజయనగర సామ్రాజ్య స్థాపన జరిగిన విధానాన్ని తెలపండి.

2. విజయనగర సామ్రాజ్య స్థాపనా ధ్యేయాన్ని తెల్పండి.

3. కుమార కంపణ మదుర దండయాత్రను వివరించండి.

4. రెండో హరిహర రాయల పాలనా విశేషాలను సమీక్షించండి.

5. మొదటి దేవరాయలు సాధించిన కార్యాలెవ్వి?

6. సంగమ - గజపతుల సంబంధాలను సమీక్షించండి.

16.9 : ఉపయుక్త గ్రంథాలు

Aiyyangar, S.K. and Rangaswamy Saraswathi : **Sources of Vijayanagara History,** Madras, 1919

Neelakanta Sastry and Venkataramanayya, N. : **Further Sources of Vijayanagara History,** Madras, 1946

Ramasarma, M.H. : **The History of the Vijayanagara Empire,** Bombay, 1978

Sewell, Robert : **A Forgotten Empire,** New Delhi, 1982

Sherwani H.K. and Joshi P.M.(eds) : **History of Medieval, Deccan, Volume I,** Hyderabad , 1973

నేలటూరు వెంకటరమణయ్య : 'విజయనగర చరిత్ర', ప్రథమ సంపుటి

తెలుగు విజ్ఞాన సర్వస్వం : Volume III (Telugu Bhasha Samithi, 1983)

డా. కె. యస్. కామేశ్వరరావ్ : విజయనగర సామ్రాజ్యం : తెలుగు అకాడమి, హైదరాబాద్ ; 1990

రచయిత : డా. ఏ. మురళీ మోహన్

BRAOU

భాగం-17 : సాళువ, తుళువ వంశాలు : కృష్ణదేవరాయలు

విషయక్రమం

17.0 : లక్ష్యాలు

17.1 : పరిచయం

17.2 : సాళువ దురాక్రమణ

17.3 : సాళువ వంశం

17.3.1 : నరసింహరాయలు (క్రీ.శ. 1485-1491)

17.3.2 : రెండో నరసింహరాయలు (క్రీ.శ. 1491-1505) - తుళువ దురాక్రమణ

17.4 : తుళువ వంశం

17.4.1 : వీరనరసింహరాయలు (క్రీ.శ. 1505-1509)

17.4.2 : కృష్ణదేవరాయలు (క్రీ.శ. 1509 - 1529)

17.4.2.1 : పోర్చుగీస్‌వారితో ఒప్పందం

17.4.2.2 : కృష్ణదేవరాయల విజయాలు

17.4.2.2.1 : బహమనీలతో యుద్ధం

17.4.2.2.2 : ఉమ్మత్తూరు దండయాత్ర

17.4.2.2.3 : కళింగ దిగ్విజయ యాత్ర

17.4.2.2.3.1 : ప్రథమ ఘట్టం

17.4.2.2.3.2 : ద్వితీయ ఘట్టం

17.4.2.2.3.3 : తృతీయ ఘట్టం

17.4.2.2.3.4 : చతుర్థ ఘట్టం

17.4.2.2.3.5 : పంచమ ఘట్టం

17.4.2.2.4 : కొటూరు దండయాత్ర

17.4.2.2.5 : దక్కన్ సుల్తాన్‌లతో యుద్ధం

17.4.2.2.5.1 : రాయచూర్ యుద్ధం (1520)

17.4.3 : కృష్ణదేవరాయల చివరి రోజులు

17.5 : సంగ్రహంగా

BRAOU

17.6 : పరీక్ష నమూనా ప్రశ్నలు

17.7 : ఉపయుక్త గ్రంథాలు

17.0 : లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం ద్వారా సాళువ నరసింహుని విజయనగర సింహాసన ఆక్రమణ, సాళువ వంశస్థుల పాలన, తుళువ వంశ ఆక్రమణ, కృష్ణదేవరాయల పాలనా విశేషాలు, వైభవాలను తెలుసుకోగల్గాలి.

17.1 : పరిచయం

చివరి సంగమ వంశస్థులు బలహీనులవడంతో, విజయనగర సామ్రాజ్యం పతనమయ్యే పరిస్థితి ఏర్పడింది. అపుడు సాళువ నరసింహుడు 1485 లో విజయనగర సింహాసనాన్ని ఆక్రమించాడు. ఇది దురాక్రమణ అయినప్పటికి, అతడే కనుక అధికారాన్ని చేపట్టకపోతే, విజయనగర రాజ్యం అంతఃకలహాల తోటి, విదేశీ దాడుల తోటి, పతనమైవుండేది. సాళువ నరసింహుని కుమారులు చిన్న వారవడంతో, వారి రక్షకుడు, సైన్యాధిపతైన తుళువ నరసనాయకుడు విజయనగర సింహాసనాన్ని ఆక్రమించి, తుళువ వంశ పాలనను ప్రారంభించాడు. తుళువ వంశస్థుల్లో కృష్ణదేవరాయలు అగ్రగణ్యుడు. ఇతని పాలనా కాలం విజయనగర చరిత్ర లోనే కాక, దక్షిణ దేశ చరిత్రలో స్వర్ణ యుగం.

17.2 : సాళువ దురాక్రమణ

రెండవ దేవరాయల మరణంతో విజయనగర బలం సన్నగిల్లింది. రెండవ విరూపాక్షరాయల తర్వాతి వారు అసమర్థులు, దుష్టులు కావడం వలన, విజయనగర సామ్రాజ్య పరిస్థితులు నానాటికి దిగజారాయి. శత్రువులు అన్ని వైపులా విజృంభించారు. పాలకుల దుశ్చర్యలు, ప్రజల ఏవగింపుకు, సామంతుల తిరుగుబాట్లకు కారణమయ్యాయి. ఆనాటి అరాచక పరిస్థితులను గమనించి, శూరుడు, సమర్థుడైన చంద్రగిరి పాలకుడు సాళువ నరసింహరాయలు, సంగమ వంశస్థుల్లో చివరి వాడైన ప్రౌఢరాయలను విజయనగరం నుండి తరిమివేసి, 1485 లో విజయనగర సింహాసనాన్ని ఆక్రమించాడు.

సాళువ వంశానికి చెందిన నరసింహరాయలు అక్రమంగా, బలాత్కారంగా విజయనగర సింహాసనాన్ని ఆక్రమించాడు. ఇతడు స్వామిద్రోహం చేసి, బలాత్కారంగా సంగమ వంశస్థుల నుండి అధికారాన్ని చేపట్టడం వాస్తవమేకానీ, సాళువ నరసింహరాయలు విజయనగర రాజ్యాధికారాన్ని చేపట్టడానికి ప్రధాన కారణం, అతని స్వార్థపూరిత రాజ్య కాంక్ష కాదని చెప్పొచ్చు. విజయనగర సామ్రాజ్య ఐక్యతను నిలబెట్టుటకు, హిందూ ధర్మ రక్షణ కొరకు, దుష్టులైన కడపటి సంగమ వంశస్థులను తొలగించి, సింహాసనాన్ని ఆక్రమించుట ఆవశ్యకమైంది. ఈ బలహీనతకు తోడు, బహ్మనీయుల నుండి, గజపతుల నుండి విజయనగరాన్ని రక్షించాల్సిన అవసరమేర్పడింది. హిందూ ధర్మ పరిరక్షణ కొరకు స్థాపితమైన విజయనగర సామ్రాజ్యం వారి వశం కావడం ఇష్టం లేని నరసింహరాయలు, దురాక్రమణకు పూనుకున్నాడు. "ఇది దురాక్రమణేకావచ్చు. కానీ, పరిస్థితుల వలన తప్పనిసరైంది. విజయనగర తర్వాతి చరిత్ర వలన ఇది సమర్థనీయమైంద"న్న కొందరి చరిత్రకారుల అభిప్రాయంలో ఎంతైనా నిజముంది. సాళువ దురాక్రమణ వలన రాక్షసతంగడి యుద్ధం, 80 సంవత్సరాల తర్వాత జరిగిందని, మరొక చరిత్రకారుని అభిప్రాయం.

BRAOU

17.3 : సాళువ వంశం

సాళువ వంశస్థుల పుట్టుపూర్వోత్తరాలు, పాలకులు సాధించిన విజయాలను తెలియజేసే ఆధారాలు అనేకమున్నాయి. రాజనాథ డిండిముడు రచించిన **"సాళువాభ్యుదయం"**, **"అచ్యుతరాయాభ్యుదయం"**, పోతరాయల **"ప్రసంగరత్నావళి"** పిల్లలమర్రి పినవీరభద్రుని, **"జైమినీ భారతం"**, నంది తిమ్మన **"పారిజాతాపహరణం"**, తిరుమలాంబ **"వరదాంబికా పరిణయం"**, నంది మల్లయ్య, ఘంట సింగయ్యల **'వరాహపురాణం'** మొదలైన గ్రంథాలు; గోరకల్లు, కుత్తూరు పాళెం, పెరణిపాడు, సిద్ధవటం, బొమ్మవరం, ఆదవాని, దువ్వూరు, మేనాలచింత, కొండవీడు, అనంతపురం, గంగరాజపురం, అల్లూరు, సిరివెళ్ళ, రామేశ్వరం (కడప జిల్లా) మొదలైన శాసనాలు; పోర్చుగీస్ వారైన న్యూనిజ్, బార్బోసా, డామింగో పేస్ మొదలైనవారి రచనలు; చరిత్రకారుల రచనలు, అనేక రాగి, శిలా శాసనాలు ఉపయోగపడుతున్నాయి.

సాళువ వంశస్థులు వారి శాసనాలలో యదు సంతతి వారమని, చంద్ర వంశ క్షత్రియులమని చెప్పుకొన్నారు. కళ్యాణి నుండి పాలించిన చాళుక్య, కాలచూరి వంశాలకు చెందినవారమని, కళ్యాణి పురవరాధీశ్వరులని కూడా చెప్పుకున్నారు. వీరు కళ్యాణిలో ఎపుడు వర్ధిల్లారో తెలియదు. దేవగిరి యాదవుల కాలంలో తిక్కమ మొదలైన సాళువ వంశస్థులు దండనాయకులుగా ఉన్నారు. వారికి, ఆంధ్రప్రదేశంలో ప్రసిద్ధి చెందిన సాళువ కుటుంబాలకు ఏమి సంబంధమో తెలియదు. విజయనగర సామ్రాజ్య స్థాపనకు ముందు, వారు ఆంధ్ర దేశానికి వచ్చి ఉంటారని, వెంకటరమణయ్యగారి అభిప్రాయం. వారు ముస్లిం దండయాత్రల కాలంలోనే, ఆంధ్ర దేశానికి వచ్చి ఉంటారని మరికొందరి అభిప్రాయం. సాళువ వంశజులు ఆంధ్ర దేశంలో తామరతంపరగా అభ్యుదయ మంది, పెక్కు శాఖలై చీలి, రాయరాజ్య మందు అనేక స్థలాల్లో చిన్న చిన్న సంస్థానాలను స్థాపించి, రాయలకు సామంతులై పాలించుచుండిరి; మరికొందరు రాయ కుటుంబాలతో సంబంధబాంధవ్యాలను నెరపి, మాండలికులై వెలసిరి. సాళువ వంశాన ప్రసిద్ధి గాంచింది "సంద్రగిరి శాఖ"ని వెంకటరమణయ్యగారు రాశారు. మొదట ఈ శాఖవారు అమరాల ననుభవిస్తూ, ఉదయగిరి దుర్గాధ్యక్షుని ఏలుబడిలో ఉన్నారు.

సాళువ వంశానికి మూల పురుషుడు సాళువ మంగు. ఇతడు కంపరాయల దక్షిణ దిగ్విజయ యాత్రలో ప్రముఖ పాత్ర వహించాడు. ఇతడు దక్షిణ సురత్రాణు నోడించి, కంపరాయల కప్పగించాడు. సంబువ రాయలను అతని రాజ్యంలో నిలిపి, "సంబువరాయ స్థాపనాచార్య" బిరుదును పొందాడు. మదుర సుల్తాన్ నోడించి, "పరపక్షసాళువ" బిరుదును వహించాడు. ఇతని ధైర్యసాహసాలకు మెచ్చి, కంపరాయలు ఇతనికి చంద్రగిరి రాజ్యంలో ఉన్న నారాయణవన ప్రాంతాన్ని అమర మాగాణిగా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇక్కడే ఇతని సంతతివారు అభివృద్ధి చెంది, క్రమంగా చంద్రగిరి దుర్గాన్ని వశం చేసుకున్నారు.

సాళువ వంశ కుమారుడు గొతరాజు. అతని కుమారుడు గుండరాజు. అతనికి ఇద్దరు కొడుకులు, నరసింహుడు, తిమ్మరాజు. వీరిలో పెద్ద కొడుకైన నరసింహుడే ప్రసిద్ధిగాంచిన చంద్రగిరి పాలకుడు. పైన చెప్పినట్లు, సంగమ వంశస్థుల్లో చివరి వాడైన ప్రౌఢ రాయలను తొలగించి, విజయనగర సింహాసనాన్ని ఆక్రమించాడు.

BRAOU

17.3.1 : నరసింహరాయలు (క్రీ.శ. 1485-1491)

విరూపాక్షునికి చెందిన చివరి శాసనం 1485 జులై 25వ తేదీది కావడం, సాళువ నరసింహుని సామ్రాజ్య బిరుదులతో ఉన్న శాసనం 1486 నవంబర్ 1వ తేదీది కావడం వల్ల, ఈ రెండు తేదీల మధ్య, సాళువ నరసింహుడు సంగమ వంశాన్ని తొలగించి, అధికారాన్ని చేపట్టుంటాడు.

నరసింహరాయలు 6 సంవత్సరాల కాలం మాత్రమే పరిపాలించాడు. ఈ 6 సంవత్సరాల కాలంలో, సామ్రాజ్యంలో శాంతి లేక, అలజడులు రేగినాయి. అనేకమంది సామంతులు నరసింహరాయల అధికారాన్నంగీకరించక, తిరుగుబాటు చేశారు. చివరి సంగమ వంశ రాజుల కాలంలో వీరు నామమాత్రంగా రాయల అధికారానికి లోబడినట్లు ప్రవర్తిస్తూ, స్వతంత్ర అధికారాలను చెలాయించారు. సాళువ నరసింహుడు సమర్థుడు కావడం వల్ల, వారి ఆటలు సాగవని తలచి, తిరుగుబాటు చేసిన వారిలో, గండికోట సీమలో పెరణిపాడు లోని సంబెటవారు, హోయసల రాజ్యాల్లోగల ఉమ్మత్తూరు, తలకాడ పాలెగాండ్రు ముఖ్యులు. సంబెట శివరాజు విజయనగరంలో జరిగిన విప్లవాన్ని అవకాశంగా తీసుకొని, కప్పం చెల్లించక పోవడమే గాక, రాయల అధికారాన్ని ధిక్కరించి, చుట్టుప్రక్కల సీమల నుండి పన్నులను వసూలు చేశాడు. ఇతనికి తోడు సంబెట వీరనరసింహుడు కూడా తిరుగుబాటు చేశాడు. సాళువ నరసింహరాయలు వారి మీదకు బసివి నాయుడిని పంపాడు. బసివి నాయుడు శివరాజ దుర్గమైన మద్దిగుండాలను నేలమట్టం చేసి, శివరాజు సంస్థానాన్ని రాయల రాజ్యంలో కలిపాడు.

బొమ్మవరం అధిపతైన సాళువ మల్లిదేవుడు కూడా, తిరుగుబాటు చేశాడు. ఆ సమయంలో నరసింహరాయలు ఉదయగిరిపై జరిగిన విదేశీ దండయాత్రను ఎదుర్కొనడానికి బయల్దేరాడు. మార్గ మధ్యంలో తన అభిప్రాయాన్ని మార్చుకొని, బొమ్మవరంపై దాడిచేసి, దుర్గాన్ని నేలమట్టం చేశాడు. మల్లిదేవుడు, అతని అనుచరులు చెరువులో దూకి, ఆత్మహత్య చేసుకున్నారు.

మైసూర్, తుళు దేశాలను పాలిస్తున్న ఉమ్మత్తూర్, సంగీతపుర పాలెగాండ్రు కూడా, నరసింహరాయల అధికారాన్ని ధిక్కరించారు. వారిని జయించడానికి, నరసింహరాయలు ఎట్టి ప్రయత్నం చేశాడో తెలియదు. సంగీతపురం మాత్రం అతను మరణించే నాటికి, అతని ఆధీనంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మత్తూర్ రాయల అధికారం లోనికి వచ్చినట్లు కనబడదు.

ఈ తిరుగుబాటును అణచిన తర్వాత, నరసింహరాయలు పశ్చిమ తీర ప్రాంతాలను జయించినట్లు తెలుస్తోంది. 1490-1506 నాటి శాసనాలు, పశ్చిమ తీరం లోని హనోవర్, భట్కల్, మంగళాపురం మొదలైనవి విజయనగరానికి స్వాధీనమైనట్లు తెలుపుతున్నాయి. గోవాను కోల్పోవడం వల్ల కలిగిన నష్టం, కొంత వరకు భర్తీ అయింది.

సాళువ నరసింహుని పాలనా కాలంలో జరిగిన సంఘటనల్లో, గజపతుల ఉదయగిరి ముట్టడి ప్రధానమైంది. గజపతుల అంతఃకలహాల్లో విజయాన్ని సాధించి, పురుషోత్తమ గజపతి, తీరాంధ్రాన్ని జయించడానికి బయల్దేరాడు. 1481లో బహ్మని సుల్తాన్ మహమ్మద్‌షా మరణించాడు. చిన్నవాడైన అతని కుమారుడు, బీదర్ సింహాసనాన్ని అధిష్ఠించాడు. కాని, మంత్రులు, సర్దార్లు స్వార్థపరులై, కలహించుకోవడం వల్ల, బహమని రాజ్యం క్షీణ దశ కొచ్చింది. దీని నవకాశంగా, పురుషోత్తమ గజపతి అంతకు ముందు హరిహరుడు మహమ్మద్‌షాకు ఇచ్చివేసిన రాజ్యాన్ని తిరిగి జయించడాన్కి దండెత్తాడు. 1482-83లో కృష్ణ వరకు గల తీరాంధ్రాన్ని, ఆ మరునటి సంవత్సరం కొండవీటి రాజ్యాన్ని ఆక్రమించాడు. అప్పటి నుండి ఉదయగిరిపైన కన్నువేసి, అవకాశం కొరకు ఎదురుచూస్తున్నాడు.

BRAOU

విజయనగరంలో జరిగిన తిరుగుబాట్లు, పురుషోత్తమునికి మంచి అవకాశమిచ్చాయి. 1485-90 ల మధ్య, ఉదయగిరి దుర్గాన్ని ముట్టడించాడు. తుళువ నరసింహరాయలు అపుడు ఉదయగిరి దుర్గం లోనే ఉన్నాడని, తప్పించుకోలేక, దుర్గాన్ని, దాని క్రిందున్న రాష్ట్రాన్ని గజపతులకిచ్చి, విడుదల పొందాడని, గజపతుల శాసనాలు తెలుపుతున్నాయి. ఇది సత్యమని రుజువు చేయగల ఆధారాలు లేవు. కాని, సాళువ నరసింహరాయలు ఉదయగిరిని కోల్పోవడం మాత్రం, వాస్తవం. 1513లో కృష్ణదేవరాయలు దానిని తిరిగి జయించే వరకు, గజపతుల అధీనంలోనే ఉంది. ఉదయగిరి దుర్గాన్ని కోల్పోయిన కొద్ది రోజులకే, సాళువ నరసింహుడు మరణించాడు.

నరసనాయకుడు 6 సంవత్సరాలు మాత్రమే విజయనగరాన్ని పాలించాడు. ఈ కాలంలో ఆంతరంగిక, విదేశీ శక్తులను ఎదుర్కొంటూ, విజయనగరాన్ని బలవర్చడానికి ప్రయత్నించాడు. సంగమ వంశస్థుల కాలం నాటి సంస్కృతి సాంప్రదాయాలను పదిలపర్చి, బహమనీలను, గజపతులను ఎదుర్కొనడానికి తగిన విధంగా సైన్యాన్ని, ప్రజల్లో యుద్ధాసక్తిని పెంచాడు. అరబ్బి వర్తకులతో స్నేహం చేసి, ఉత్తమ అశ్వాలను సంపాదించి, అశ్విక బలాన్ని వృద్ధిచేశాడు. సామాన్య ప్రజలక్కూడా, ఆత్మ రక్షణ కొరకు గారడి, కత్తిసాములను నేర్పించాడని, విదేశీ యాత్రికులు రాశారు. పరిపాలనా యంత్రాంగాన్ని తీర్చిదిద్ది, విచ్ఛిన్నమైపోతున్న రాయ సామ్రాజ్యాన్ని పునరుద్ధరించి, తన జీవితాన్ని విజయనగర సేవకు అంకితం చేసి, శాశ్వత కీర్తిని గడించాడు.

సాళువ నరసింహుడు తనకు మరణకాల మాసన్నమగుటచే, రాయచూర్, కొండవీడు, ఉదయగిరి దుర్గాలను శత్రువుల నుండి జయించడానికి వీలులేక పోయిందని, తన కుమారులైన తిమ్మరాజు, నరసింహుల్లో అర్హునికి పట్టాభిషేకం చేయమని, సర్వసేనాధిపతైన తుళువ నరసనాయకునికి అధికారమిచ్చి, ఉదయగిరి, కొండవీడు, రాయచూర్ దుర్గాలను, కృష్ణా-తుంగభద్ర నడిమి ప్రాంతాన్ని జయించమని ఆదేశించినట్లు, న్యూనిజ్ వ్రాతలను బట్టి తెలుస్తోంది.

BRAOU

17.3.2 : రెండో నరసింహరాయలు (క్రీ.శ. 1491-1505) - తుళువ దురాక్రమణ

సాళువ నరసింహునికి ఇద్దరు కొడుకులు. మొదటి వాడు తిమ్మరాజు, రెండవ వాడు నరసింహుడు. సాళువ నరసింహుని ఆదేశం ప్రకారం, నరస నాయకుడు అతని పెద్ద కుమారుడు తిమ్మరాజును రాజ్యాభిషిక్తుణ్ణి చేశాడు. కాని, అతడు కొద్ది కాలానికే మరణించాడు. ఇతని మరణం గురించి, విభిన్న అభిప్రాయాలున్నాయి. సర్వసేనాధిపతి, రక్షకుడైన నరసనాయకుని అపఖ్యాతి పాలు చేయడానికి, తిమ్మరుసు అనే మంత్రి తిమ్మరాజును హత్య చేయించాడని, న్యూనిజ్ వ్రాశాడు. ఫెరిష్టా, బహమనీలతో యుద్ధంలో గాయాలు తగిలి, మరణించాడని వ్రాశాడు. ఫెరిష్టా కథనం కంటే, న్యూనిజ్ వ్రాతే విశ్వసనీయమైందని, వెంకట రమణయ్యగారి అభిప్రాయం.

తిమ్మరాజు మరణించిన తర్వాత, సాళువ నరసింహుని రెండో కుమారుడు, రెండో నరసింహుని సింహాసన మెక్కించి, తుళువ నరసనాయకుడే అతని పేర రాజ్యకార్యాన్ని నడిపాడు. ఇతని పరిపాలన పేరుకు 15 సంవత్సరాలు నడిచినా, సామ్రాజ్యానికి అసలైన అధిపతి నరసనాయకుడు. అతడు సర్వాధికారాలను చెలాయించడమే కాకుండా, 'రక్షకర్త', 'స్వామి', 'సేనాధిపతి', 'మహాప్రధాని', 'కార్యకర్త' అనే బిరుదులతోపాటు, 'మహామండలేశ్వర', 'భసగితప్పవరాయరగండ', 'అరిరాయ విభాళ', 'రాజాధిరాజ', 'రాజపరమేశ్వర' అనే బిరుదులను కూడా కల్గినట్లు తెలుస్తోంది. రెండో నరసింహుడు అలంకారప్రాయంగా రాజ్యాధికారాన్ని నిర్వహించేందుకు ఇష్టపడలేదని, అందువల్ల

నరసనాయకుడు రెండో నరసింహుని పెనుగొండలో బందీగా చేసి, అతని పేర పరిపాలన చేసినట్లు తెలుస్తోంది. వెంకటరమణయ్యగారు నరసనాయకుడు రాజ్యాధికారాన్ని నిర్వహించి, రాయ బిరుదులను వహించినప్పటికీ, రాయలను తొలగించి, అతని పదవిని ఆక్రమించుకోలేదని అభిప్రాయపడ్డారు. ఇంకా, శ్రీరామశర్మ నరసనాయకుని చర్యల్లో దేశ ద్రోహం గాని, దురాక్రమణ చేసినట్లు ఆధారాలుగానీ లేవని, నరసనాయకుడు రెండో నరసింహరాయలను బంధించలేదని, దానికి ఆధారంగా శక సంవత్సరం 1427 లో నరసింహరాయలను కోయిలూరు దేవాలయాన్ని స్వయంగా దర్శించినట్లు, శాసనాధారాలను చూపించారు. 1503 లో నరసనాయకుడు మరణించే వరకు, సాళువ వంశానికి విధేయుడుగానే ఉన్నాడని కూడా, అభిప్రాయపడ్డారు.

తుళువ వంశానికి చెందిన నరసనాయకుడు దురాక్రమణదారుడా, కాదా, అన్న విషయంలో చరిత్రకారుల మధ్య భేదాభిప్రాయాలున్నాయి. కృష్ణస్వామి అయ్యంగార్, గుర్తి వెంకటరావ్, ఓరుగంటి రామచంద్రయ్య, ఆర్ సుబ్రహ్మణ్యం గార్లు, నరసనాయకుడు దురాక్రమణదారుడు కాదని అభిప్రాయపడ్డారు. రామచంద్రయ్యగారు నరసనాయకుడు దురాక్రమదారుడుగానీ, రాజహంతకుడుగానీ కాక, పటిష్టమైన క్రమశిక్షణ గలవాడని, సింహాసనాన్ని ఆక్రమించలేదుగానీ, సంపూర్ణాధికారాన్ని హస్తగతం చేసుకొని, రాజ బిరుదులను ధరించక, కిరీటం పెట్టుకోకుండా విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించడంలో తృప్తిపడ్డాడని, నొక్కి చెప్పారు. ఈ అభిప్రాయానికి భిన్నంగా కొందరు, నరసనాయకుడు సింహాసనాన్నాక్రమించడం యదార్థమని, దురాక్రమణదారుడని అభిప్రాయపడ్డారు.

నరసనాయకుడు విజయనగర భారాన్ని వహిస్తూ, అంతరంగిక శత్రువులను, బాహ్య శత్రువులను ఓడించినట్లు తెలుస్తోంది. చోళ, పాండ్య, చేర పాలకులను ఓడించి, మదుర రాజైన మానభూషణ్ణి ఓడించి, కప్పం వసూలు చేసినట్లు తెలుస్తోంది. నరస నాయకుడు గజపతి ప్రతాపరుద్రుణ్ణి ఓడించి, పారద్రోలినట్లు, శాసనాలు చెప్తున్నాయి. బీజాపూర్ పాలకుడైన యూసుఫ్ ఆదిల్ ఖాన్, అంతరంగిక కల్లోలాల నుండి విజయనగరానికి భద్రత కలిగించి, కొంత వరకు విజయాన్ని పొందినట్లు తెలుస్తోంది. కాని, శత్రువుల చేతిలో ఉన్న కొండవీడు, ఉదయగిరి, రాయచూర్ ప్రాంతాలను ఆక్రమించక పూర్వమే, 1503లో మరణించాడు.

నరసనాయకుని మరణానంతరం అతని పెద్ద కుమారుడు వీరనరసింహుడు మొదట రాజ్య సంరక్షకుడై, తర్వాత 1508 లో పెనుగొండ దుర్గంలో బందీగా ఉన్న రెండవ నరసింహరాయలను చంపి, విజయనగర సింహాసనాన్ని అధిష్ఠించాడు.

17.4 : తుళువ వంశం

20 సంవత్సరాల కాలం మాత్రమే పరిపాలించిన సాళువ వంశాన్ని అంతం చేసి, తుళువ వంశస్థుడైన నరసనాయకుని కుమారుడు వీరనరసింహరాయలు విజయనగర సింహాసనాన్ని ఆక్రమించాడు. న్యూనిజ్ నరసనాయకునికి 5 గురు కొడుకులని రాయగా, శాసనాలు మాత్రం వీరనరసింహ, కృష్ణ, రంగ, అచ్యుత అని, నలుగురు కుమారులనే పేర్కొంటున్నాయి. వీరిలో వీరనరసింహరాయలు నరసనాయకుని మరణం తర్వాత కొద్ది కాలం రక్షకుడిగా ఉండి, న్యూనిజ్ వ్రాసినట్లు రెండవ నరసింహుని చంపి, రాజ్యాధికారాన్ని చేపట్టాడు. న్యూనిజ్ పొరపాటున ఈ రాజ హత్యను, దురాక్రమణను, నరసనాయకునికి ఆపాదించాడు. వీరప్రద్యు కాలజ్ఞానం కూడా, వీరనరసింహరాయలు తండ్రి మరణానంతరం సుమో సేనాధిపతిగాను, మహా ప్రధాని గాను వ్యవహరించి, కొంతకాలం అతి

BRAOU

విధేయుడుగా సాళువ రెండవ నరసింహుని పట్ల వ్యవహరించి, కుట్ర పన్ని, అతనిని చంపించి, రాజ్యాధికారాన్ని చేపట్టాడని తెలుపుతోంది. ఈ రకంగా విజయనగర చరిత్రలో రెండవ దురాక్రమణ జరిగి, తుళువ రాజ్య స్థాపన జరిగింది. తుళువ దురాక్రమణకు వీరనరసింహరాయలే కారణమని భావించాలి.

తుళువ వంశస్థులు వారి శాసనాల్లో వారి వంశాన్ని బ్రహ్మ, అత్రి, చంద్రుడు, పురూరవ, నహుష మొదలైన వారి నుండి ఉద్భవించినట్లు పేర్కొన్నాడు. 1514 నాటి నిర్లకరి తామ్ర శాసనం, చంద్ర వంశానికి చెందిన తుర్వసుని సంతతి వారిలో తుళువేంద్రులందు తిమ్మభూపతి, అతనికి ఈశ్వర క్షితిపాలుడు, వారికి నరసనాయకుడు, అతనికి తిప్పాజీ యందు వీరనరసింహుడు, నాగలా దేవి యందు కృష్ణదేవరాయలు జన్మించారని తెలుపుతోంది. ఈ వంశ క్రమమే కొద్దిపాటి మార్పులతో, సంస్కృతాంధ్ర గ్రంథాల్లో కనబడుతోంది. **'ఆముక్త మాల్యద'** లోనూ, కృష్ణ రాయలకు అంకితం చేయబడిన గ్రంథాల్లోనూ, తుర్వసు వంశమే తుళువ వంశమైందని, అందు కృష్ణదేవరాయల ముత్తాత, తిమ్మభూపాలుడు ఉదయించాడని చెప్తున్నాయి. తుర్వసు వంశం తుళువ శబ్దం కావడానికి వీల్లేదు. తుళువ శబ్దం తుళు శబ్ద విశేషం. తుళువ శబ్దం తుళు దేశ సంబంధమైంది. అందువల్ల, తుళు దేశం పశ్చిమ సముద్ర తీరాన దక్షిణ కన్నడ జిల్లాలో ఒక ప్రాంతం. నందిమల్లయ్య, ఘంట సింగయ్య రచించిన **'పరాపాపురాణ'** పీఠికలో తుళువ వంశానికి మూల పురుషుడైన తిమ్మభూపాలుడు తుళు దేశస్థుడని స్పష్టంగా చెప్పబడింది.

17.4.1 : వీరనరసింహరాయలు (క్రీ.శ. 1505-1509)

వీరనరసింహరాయలు 1505 మే 1వ తేదీ నుండి 1509 మే 4 వ తేదీ వరకు పరిపాలించినట్లు, శాసనాల ద్వారా తెలుస్తోంది. ఇతడు పరిపాలించిన 5 సంవత్సరాల కాలంలో తనపై తిరుగుబాటు చేసిన సామంతులను అణచడంలోనూ, రాయచూర్ అంతర్వేదిని ఆక్రమించిన బిజాపూర్ పాలకుడు యూసఫ్ ఆదిల్ ఖాన్‌ను ఎదిరించడం లోనూ, కాలం గడిపాడు, ఆరవాని దుర్గ పాలకుడు కాచప్ప వడయలు, ఉమ్మత్తూర్, శ్రీరంగపట్టణం పాలకులు, వీరనరసింహునికి ఎదురు తిరిగిన సామంతుల్లో ప్రముఖులు. కాచప్ప వడయలు విజయనగరానికి బద్ధ విరోధైన యూసఫ్ ఆదిల్ ఖాన్‌తోను, ఉమ్మత్తూర్ పాలెగాండ్ర తోను చేతులు కలిపి, వీరనరసింహరాయలపై దండెత్తాడు. రాయల సామంతుడైన ఆరవీటి రామరాజు, అతని కొడుకు తిమ్మరాజు, యూసఫ్ ఆదిల్ ఖాన్‌ను ఓడించి, కాచప్ప వడయలును చంపి, ఆదోని మార్గాన్ని తిరిగి వీరనరసింహునికి అప్పగించారని, అందుకుగాను తిమ్మరాజుకు 'స్వామిద్రోహరగండ', అన్న బిరుదాన్ని బట్టి, ఆదోని, కందనవోలునకు అధిపతిగా చేశాడని తెలుస్తోంది. వీరనరసింహరాయల కష్టాలను అవకాశంగా తీసుకొని, గజపతి ప్రతాపరుద్రుడు విజయనగరం మీదకు దండెత్తాడు. 1509లో గజపతి విజయనగరం మీదకు దండెత్తినట్లు, **కటకరాజవంశావళి'** తెల్పుతోంది. ఈ విషయాన్ని **చైతన్య భాగవతం** కూడా ప్రస్తావించింది. చైతన్య స్వామి 1509 ఫిబ్రవరి, మార్చి నెలల మధ్య నీలాచలానికి చేరినప్పుడు, ప్రతాపరుద్రుడు విజయనగరంలో ఉన్నట్లు **చైతన్య భాగవతం** పేర్కొంటోంది. గణపతి దండయాత్ర నెదుర్కొనే భారాన్ని తన తమ్ముడైన కృష్ణరాయలుకు అప్పగించాడు. కృష్ణరాయలు గజపతిపై విజయాన్ని సాధించి, అతన్ని తిప్పికొట్టినట్లు తెలుస్తోంది. ఈ యుద్ధాన్ని గురించి విశేషాలు తెలియవు. కాని, తర్వాత కృష్ణరాయలు తన రాజ్యాభిషేక కాలంలో వేయించిన హంపి శాసనంలో, 'గజపతి గజకూట పాకల' అనే విశేషణం వల్ల, ఈ యుద్ధంలో రాయలకు విజయం లభించినట్లు తెలుస్తోంది.

BRAOU

ఉమ్మత్తూర్ పాలకుని అణచే ప్రయత్నంలో వీరనరసింహుడు 1509 లో మరణించాడు. వీరన రసింహరాయలు 5 సంవత్సరాలు మాత్రమే పాలించాడు. దక్షిణ భారతదేశం లోని వివిధ గొప్ప దేవాలయాలకు అనేక విరాళాలిచ్చి, ధర్మాసక్తి గల పాలకుడని, పొగడబడ్డాడు. బహుశా తాను రాజ హంతకుడై, దురాక్రమణ చేసిన పాపాన్ని ప్రక్షాళన చేయడానికే, ఈ దానధర్మాలను చేశాడేమో! వీరనరసింహరాయలు విజయనగర సామ్రాజ్య సుస్థిరతకు, విస్తరణకు శాయశక్తులా ప్రయత్నించాడు. పోర్చుగీస్ వారితో ఒక ఒడంబడికను కుదుర్చుకొని, ఉత్తమ అశ్వాలను కొని, అశ్విక దళాన్ని బలపర్చి, ప్రజల్లో దేహదారుఢ్యాన్ని పెంచడాన్కి కృషి చేసి, యుద్ధాలకు ప్రజలను సిద్ధపర్చి, విజయనగరాన్కి అమూల్య సేవ చేసి కృతార్థుడైనాడని, వెంకటరమణయ్యగారి అభిప్రాయం. అతడు కర్షకుల కష్టాలను శ్రద్ధతో విచారించి, వారి స్థితిగతులను మెరుగుపర్చడానికి ప్రయత్నించాడు. ప్రజా క్షేమాన్ని కాంక్షించి, పెండ్లి సుంకాలను తీసివేశాడు.

వీరనరసింహరాయలు తను చనిపోవడానికి ముందు, కృష్ణరాయలకు కళ్ళు తీయించి, తన తర్వాత 5 ఏండ్ల కుమారుడికి పట్టాభిషేకం చేయాల్సిందని తిమ్మరుసును కోరినట్లు, కానీ తిమ్మరుసు మేక కళ్ళను వీరనరసింహానికి చూపి, అతని తర్వాత కృష్ణరాయలను పట్టాభిషేకుణ్ణి చేసినట్లు, ఒక కథను న్యూనిజ్ వ్రాశాడు. కానీ, వీరనరసింహుని తర్వాత కృష్ణరాయలు సక్రమంగా సింహాసనానికి వచ్చినట్లు, 'రాయవాచకం', శాసనాలు తెలుపుతున్నాయి.

17.4.2 : కృష్ణదేవరాయలు : (క్రీ.శ. 1509-1529)

కృష్ణదేవరాయలు విజయనగర రాజుల్లోనే గాక, దక్షిణ దేశ చక్రవర్తుల్లో ప్రఖ్యాతుడు. భారతదేశ ప్రసిద్ధి చక్రవర్తుల్లో ఒకడు. దక్షిణ భారత కడపటి గొప్ప హిందూ చక్రవర్తి కృష్ణదేవరాయలు. బహుముఖ ప్రజ్ఞాశాలి, ఓటమి నెరుగని ధీరుడు, సాహితీవేత్త. హిందూ సంస్కృతిని పరిరక్షించి, తెలుగు దేశాన్నంతటినీ ఒకే ఛత్రం క్రిందకు తెచ్చి, సుస్థిర పాలనను అందించిన ఘనత, కృష్ణదేవ రాయలకే దక్కునని, ఆచార్య కృష్ణశాస్త్రి అభిప్రాయం. కృష్ణదేవరాయలు విజయనగర సింహాసనాన్ని అధిష్ఠించడంతో, నూతన శక మారంభమైంది. ఇతని కాలంలో విజయనగర సామ్రాజ్యం అత్యంత వైభవాన్ని, ఐశ్వర్యాన్ని పొందింది.

BRAOU

కృష్ణదేవరాయల చరిత్రను తెలియజేసే ఆధారాలు అనేకమున్నాయి. వీటిలో శాసనాలు, సాహిత్యం ప్రధానమైనవి. రాయల కాలం నాటి అనేక రాగి, శిలా శాసనాలు లభ్యమయ్యాయి. సాహిత్యాధారాలు అనేకం. రాయల కాలంలో రచింపబడిన కావ్యాలే కాక, మహమ్మదీయ చరిత్రకారుల రచనలు, పోర్చుగీస్ యాత్రికుల రచనలు, వంశ చరిత్రలు, గాథలు, చాటువులు, గ్రామ కవితలు, కైఫియత్‌లు మొటలైనవి. సంస్కృత కావ్యాలైన రాజనాథ డిండిమని 'అచ్యుతరామాభ్యుదయం', బండారు లక్ష్మీనారాయణ రచించిన 'సంగీత సూర్యోదయం', మొదలైనవి, కృష్ణదేవరాయల కళింగ దండయాత్ర, ఆదిల్ ఖాన్‌పై విజయం, కబబరిగె దండయాత్రలను గురించి తెలుపుతాయి. అల్లసాని పెద్దన 'మనుచరిత్ర', కృష్ణరాయల 'ఆముక్తమాల్యద', నంది తిమ్మన 'పారిజాతాపహరణం', విశ్వనాథ నాయకుని స్థానపతి రచించాడనబడే ఆర్వాచీన కాలం నాటి 'రాయవాచకం', 17 వ శతాబ్దంలో కుమార ధూర్జటి రచించిన 'కృష్ణరాయ విజయం' మొదలైన తెలుగు కావ్యాలు, కృష్ణరాయల చరిత్రను వర్ణించాయి. మహమ్మదీయ గ్రంథాలైన 'తారీఖీ ఫరిష్టా', 'బుర్హాన్- ఇ-మఆసిర్', 'తారీఖీ మహమ్మద్ కులీ కుతుబ్‌షాహీ' మొదలైనవి, బహమనీ రాజుల పరిపాలన ఉద్భవించిన సుల్తానేట్‌లు, విజయనగర సంబంధాలను తెల్పుతాయి. విజయనగరాన్ని దర్శించిన పోర్చుగీస్ రాయబారులు, యాత్రికులు, విజయనగర చరిత్రను, సంస్కృతిని

గురించి రాశారు. వాటిలో ముఖ్యమైనవి, **'కామెంట్రీస్ ఆఫ్ ది గ్రేట్ అల్‌ఫాన్ సో డి అల్బూకర్క్'**, దురాతి బార్బోసా రచించిన **'ఈస్ట్ ఆఫ్రికా అండ్ మలబార్'**, **క్రానికల్ ఆఫ్ డోమింగోపేస్'**, **'క్రానికల్ ఆఫ్ పెర్నివో న్యూనిజ్'** పేస్, న్యూనిజ్‌ల రచనలు నమకాలీనమైనవని వెంకటరమణయ్య గారి అభిప్రాయం. వంశ చరిత్రైన లింగణ రచించిన **'లేవదిన్నపవిజయం'** అనేక గాధలు, చాటువులు, గ్రామ కవితలు, కైఫియత్‌లు, కృష్ణరాయల చరిత్రను తెలియజేస్తాయి.

కృష్ణరాయల వంశం, లేదా తుళువ వంశాన్ని గురించి, ఇంతకు ముందు భాగంలో ప్రస్తావించాం. కృష్ణదేవరాయలు చంద్ర వంశానికి చెందిన తుర్వసు సంతతికి' చెందిన క్షత్రియుడని, శాసనాలు, గ్రంథాలు తెలుపుతున్నాయి. అయితే, వారు క్షత్రియులు కారని, శూద్రులై ఉండవచ్చని, కొందరి అభిప్రాయం. కానీ, వెంకటరమణయ్య గారు తుళువ రాజులు శూద్రులనడం కంటే క్షత్రియులని చెప్పటం ఒప్పు అన్నారు. కృష్ణదేవరాయల పుట్టుక గురించి అనేక గాధలు ప్రచారంలో ఉన్నాయి. కృష్ణదేవరాయల తల్లి నాగల దేవి కుల వధువు కాదని, భోగకాంతయని, అందువల్ల అతడు క్షత్రియుడు కాడని, దాసి పుత్రుడని తెల్పుతున్నాయి. కాని, వెంకటరమణ్యగారు ఇది నమ్మడానికి వీలు లేనిది, న్యూనిజ్ వ్రాతలు గానీ, రాయవాచకం గాని, శాసనాల్లో గాని, కుల స్త్రీ కాదనడానికి ఆధారాలు లేవని అభిప్రాయపడ్డారు.

కృష్ణదేవరాయలు ఏజాతి వాడన్న విషయంపై, విభేదాలున్నాయి. ఇతడు ఆంధ్రుడా? కర్ణాటకుడా? పుట్టుకతో వీరు తుళు జాతి వారు. కానీ, తిమ్మరాజు కాలంలో ఆంధ్ర దేశానికి వచ్చి, చంద్రగిరిలో సాళువ రాజుల కొలువులో స్థిరపడ్డ వీరు, ఆంధ్ర దేశాన్ని స్వదేశం గానూ, ఆంధ్ర భాషను మాతృ భాషగానూ స్వీకరించి, ఆంధ్ర రాజ కుటుంబాలతో సంబంధాన్ని కలిగి, ఆంధ్ర స్త్రీల వల్ల జన్మించి, ఆంధ్రులతో కలిసి జీవించి, తెలుగు గ్రంథాలను రచించి, తెలుగు కవులను పోషించి, తెలుగు భాషను అభివృద్ధి చేసిన తుళువ రాజులు తెలుగువారు కాక, ఇతరులు ఎట్లు కాగలరని, అందుచేత కృష్ణరాయలు ఆంధ్రుడనుట ఒప్పునని, వెంకటరమణయ్య గారి అభిప్రాయం.

BRAOU

కృష్ణదేవరాయలు విజయనగర సింహాసనాన్ని ఆక్రమించడాన్కి ముందు చరిత్ర, తెలియటం లేదు. అతను ఎప్పుడు జన్మించాడో చెప్పలేం. 1480 సంవత్సరంలో జన్మించి ఉండవచ్చునని కొందరి అభి ప్రాయం. శాసనాలను బట్టి అతడు 1529 వరకు పరిపాలించాడు. ఒక కన్నడ శాసనం కృష్ణరాయలు రాజ్యానికి రావడానికి ముందు, పెనుగొండ, చంద్రగిరి దుర్గాలను పాలించాడని తెలుపుతోంది. ఇది నమ్మదగింది కాదని, వెంకటరమణయ్య గారి అభిప్రాయం. కృష్ణదేవరాయలు అన్న నరసింహరాయలకు, పరిపాలనలో తోడ్పడినట్లు తెలుపుతోంది.

కృష్ణదేవరాయల పట్టాభిషేకం గురించి అనేక గాధలు ప్రచారంలో ఉన్నాయి. ఈ గాధలన్నిటినీ నమ్మక పోయినా, నరసింహరాయల కిష్టం లేకపోయినప్పటికీ, తిమ్మరసు అనుగ్రహంతో కృష్ణరాయలు రాజ్యాధికారాన్ని చేపట్టినట్లు భావించొచ్చు. ఇతడు ఎపుడు రాజ్యానికి వచ్చాడో, పట్టాభిషేకం ఎప్పుడు జరిగిందో నిర్ధారణగా చెప్పలేం. 1509 మే 4 జులై 26 ల మధ్య అధికారాన్ని చేపట్టి ఉంటాడని, 1509 ఆగస్ట్ 8వ తేది, కృష్ణజయంతి నాడు, రాజ్యాభిషేకం జరిగిందని, వెంకటరమణయ్య, సుబ్రహ్మణ్యంగార్ల అభిప్రాయం.

కృష్ణదేవరాయలు సింహాసనం ఎక్కేనాటికి, విజయనగర పరిస్థితులు క్లిష్టంగా ఉన్నాయి. వీరనర సింహరాయలు సామంతులందరిని అణచి, సీమలను స్వాధీనం చేసుకున్నాడని చెప్పినప్పటికీ, కొందరు పాలెగాండ్రు రాయల అధికారాన్ని ధిక్కరించారు. కృష్ణరాయలు, లోపల, బయట కూడా, శత్రువులను ఎదుర్కొనాల్సొచ్చింది. ఆంతరంగికంగా అతని సవతి సోదరులు కృష్ణరాయలను వ్యతిరేకించారు. బాహ్య శత్రువుల్లో ఉమ్మత్తూర్, శ్రీరంగపట్టణ పాలకులు ముఖ్యులు. వారు రాయల అధికారాన్ని ధిక్కరించి, తిరుగుబాటు కొనసాగిస్తున్నారు. తీరాంధ్రాన్ని ఆక్రమించిన గజపతి, రాజ్య విస్తరణ ప్రయత్నాలను చేస్తున్నాడు. కొండవీడు, ఉదయగిరి, గజపతుల అధీనం లోనే ఉన్నాయి. బీజాపూర్ సుల్తాన్ ఆదిల్ ఖాన్ చేతుల్లో రాయచూర్, అంతర్వేది ప్రాంతాలున్నాయి. వీరనరసింహరాయలు రాజ్యానికి రావడానికి 8 ఏండ్లు ముందుగా భారతదేశానికి వచ్చిన పోర్చుగీస్ వారు, క్రమంగా పశ్చిమ తీరం లోని రేవు పట్టణాల నాక్రమించి, బలాన్ని పుంజుకున్నారు. సాధారణంగా విజయనగరం పట్ల స్నేహసంబంధాలను కలిగిఉన్నా, అప్పుడప్పుడు విరోధాన్ని చూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో కృష్ణదేవరాయలు విజయనగర సింహాసనాన్ని ఆక్రమించి, తిమ్మరుసు మంత్రి సహాయంతో అనేక విజయాలను సాధించి, రెండు దశాబ్దాల కాలం విజయనగరాన్ని వైభవంగా పరిపాలించాడు.

17.4.2.1 : పోర్చుగీస్ వారితో ఒప్పందం

పోర్చుగీస్ వారు వర్తకం నిమిత్తం భారతదేశానికి వచ్చి, పశ్చిమ తీరంలో విజయనగర సామంతులైన భట్కల్, హనోవర్ ప్రభువుల అధికారాన్ని ధిక్కరించడమే గాక, కొచ్చిన్, కన్ననూర్‌లలో కోటలను కట్టుకొని, కల్లికోట జామొరిన్ అధికారాన్ని కూడా, ధిక్కరించాడు. పశ్చిమ తీర వాణిజ్య వ్యాపార గుత్తాధిపత్యం పోర్చుగీస్‌వారి పరమైంది. అప్పటి పోర్చుగీస్ గవర్నర్, అల్బూకర్క్, గోవాను ఆక్రమించి, తమ ప్రధాన కేంద్రంగా చేసుకొనడానికి, బిజాపూర్ ఆదిల్‌ఖాన్‌ను, కళ్లకోట జామొరిన్‌ను ఓడించేందుకు రాయల సహాయాన్ని కోరుతూ, లూయి ఫ్రయర్ అనే రాయబారిని పంపాడు. బిజాపూర్ సుల్తాన్‌తో శత్రుత్వాన్ని కల్గిన పోర్చుగీస్‌వారితో స్నేహసంబంధాలను పెంపొందించుకోవడం మంచిదని, కృష్ణదేవరాయలు భావించాడు. లూయీ ఫ్రయర్ 1510 జనవరి తర్వాత కృష్ణదేవరాలను కలిసి, భట్కల్, మంగుళూర్ మధ్య వర్తక స్థావరాన్ని నిర్మించుకోవడానికి అనుమతి నివ్వమని, జామొరిన్‌కు వ్యతిరేకంగా సహాయాన్ని చేయమని, దానికి బదులుగా తాము అమ్మే ఉత్తమ అశ్వాలను విజయనగర పాలకులకు తప్ప మరెవరికీ అమ్మమని చెప్పాడు. కృష్ణదేవరాయలు పోర్చుగీస్ వారికి వెంటనే సమాధానం చెప్పక, ముందుగా ఆంతరంగిక పరిస్థితులను చక్కబర్చాడు. తన సవతి సోదరులను, అన్న గారి కుమారుణ్ణి చంద్రగిరిలో బందీలుగా చేసి, ఆదాయవ్యయాలను స్థిరీకరించి, సామంతుల వద్ద నుండి కప్పాన్ని వసూలు చేశాడు. అప్పుడు పోర్చుగీస్ వారితో అంగీకారానికి వచ్చి, వారి సహకారాన్ని పొందాడు. భట్కల్, మంగుళూర్‌ల మధ్య, ఫ్యాక్టరీ నిర్మాణానికి స్థలాన్నిచ్చాడు.

17.4.2.2 : కృష్ణదేవరాయలు - విజయాలు

కృష్ణదేవరాయలు సాధించిన విజయాలను తెలియజేసే ఆధారాలనేకమున్నాయి. న్యూనిజ్, ఉదయగిరి దండయాత్రకు ముందు మరో విజయాన్ని ప్రస్తావించ లేదు. కాని, కృష్ణదేవరాయలు మొదట తన ఉత్తర శత్రువులతో తలపడినట్లు తెలుస్తోంది.

BRAOU

17.4.2.2.1 : బహమనీలతో యుద్ధం

1509 సంవత్సరం చివరిలో, బిజాపూర్ పాలకుడైన యూసఫ్ ఆదిల్‌ఖాన్ ప్రోత్సాహంతో, బహమనీ సుల్తాన్ రెండవ మహమ్మద్‌షా విజయనగరంపై జీహాద్‌ను ప్రకటించి, తన సామంతులైన బిజాపూర్, గోల్కొండ, అహ్మద్‌నగర్ పాలకులతో కలిసి, పెద్ద సైన్యంతో విజయనగరంపై దండెత్తాడు. విజయనగర సరిహద్దుల లోని ధోని దగ్గర, కృష్ణరాయలు వారిని ఎదుర్కొన్నాడు. అక్కడ ఘోర యుద్ధం జరిగింది. మహమ్మదీయులు పరాజయాన్ని పొందారు. 1510 జనవరి 28 నాటి హంపి శాసనం కృష్ణరాయలు ఒక సుల్తాన్‌ను పరాభవించినట్లు తెలుపుతోంది. 1510 జనవరిలో పోర్చుగీస్ రాయబారి లూయి ఫ్రయర్ విజయనగరానికి వచ్చి, దక్కన్ పాలకులతో అపుడు రాయలు చేసే యుద్ధాల్లో, పోర్చుగీస్‌వారు సహాయపడతామని, కళ్ళికోట మీద యుద్ధం చేయడానికి రాయలను సహాయపడమని కోరాడు. దీనిని బట్టి, కృష్ణదేవరాయలు సింహాసన మెక్కిన 5, 6 నెలల్లోనే బహమనీ సుల్తాన్‌లతో యుద్ధాన్ని చేసినట్లు తెలుస్తోంది. విజయనగరం మీదకు దండెత్తిన బహమనీ సుల్తాన్ 1482 నుండి 1518 వరకు పాలించిన షిహాబుద్దీన్ మహమ్మదని, షేర్వాణీ అభిప్రాయం. ఫెరిష్టా, సయ్యద్ ఆరీలు, ఈ దండయాత్రలో మహమ్మద్‌షాకు కొన్ని అపజయాలు కల్గినట్లు, అతను తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. కానీ, దండయాత్ర కాలాన్ని వేరువేరుగా చెప్పారు. ఈ దండయాత్రలో మహమ్మద్‌షాతోపాటు, మల్లిక్ అమ్మద్ బహ్రీ, నూరిఖాన్ క్వాజాఇజహాన్, ఆదిల్‌ఖాన్, కుతుబ్-ఉల్-ముల్క్, ఇమాదుల్-ముల్క్, దస్తూర్-ఇ-మమాలిక్, మొదలైన వారు పాల్గొన్నారు. వీరిని రామరాజు, తిమ్మరాయల నాయకత్వం లోని విజయనగర సైన్యం ఎదుర్కొంది. బహమని సేనలు ఓడి, బీదర్‌కు తిరిగి పోయాయి. విజయనగర సైన్యాలు వారిని వెంబడించాయి. కోవెలకొండ వద్ద ఆదిల్ ఖాన్ సైన్యం వెనుదిరిగి, విజయనగర సైన్యంతో తలపడింది. యూసఫ్ ఆదిల్ ఖాన్ ఓడి, యుద్ధంలో మరణించాడు. విజయనగర సైన్యం కోవెలకొండను వశం చేసుకొంది. యూసఫ్ ఆదిల్ ఖాన్ కోవెలకొండలో చనిపోయినట్లు, **'తారిఖీ మహమ్మద్ కులీకుతుబ్‌షాహి'**, కోవెలకొండకు కొంచెం దూరంలో మరణించాడని, **'బుర్హాన్-ఇ-మాసిర్'** పేర్కొన్నాయి. యూసఫ్ ఆదిల్ ఖాన్ 1510 లో తన 75వ ఏట సహజ మరణాన్ని పొందినట్లు, షేర్వాణీ పేర్కొన్నాడు.

BRAOU

మహమ్మదీయులతో యుద్ధం ఇంతటితో ముగియ లేదు. యూసఫ్ ఆదిల్‌ఖాన్ మరణం తర్వాత అతని కుమారుడు ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్ బిజాపూర్ సింహాసనాన్ని ఎక్కాడు. ఇతడు చిన్నవాడై నందున కమాల్‌ఖాన్ అనే సర్దార్ రాజ్యానికి సంరక్షకుడై, ఇరుగుపొరుగు రాజ్యాలను ఆక్రమించడం మొదలు పెట్టాడు. మొదట కలుబరిగెను ముట్టడించాడు. ఇది మల్లిక్ దస్తూర్ అధికారంలో ఉంది. కమాల్‌ఖాన్ దండెత్తగా, మల్లిక్ దస్తూర్ కోటను వదిలి, బీదర్‌కు పారిపోయి, రెండవ ప్రధాన మంత్రైన బరీద్-ఇ-మమాలిక్‌ను ఆశ్రయించాడు. బీదర్ రాజ్యంలో పేరుకు మహమ్మద్‌షా సుల్తాన్ అయినా, అధికారమంతా బరీద్ చేతిలో ఉంది. ఇతడు మల్లిక్ దస్తూర్‌కు ఆశ్రయమిచ్చి, సైన్యంతో మహమ్మద్‌షాను వెంట తీసుకొని, కలుబరిగె పై దండెత్తాడు. కానీ, కమాల్‌ఖాన్ వీరిని ఓడించి, బీదర్‌ను ఆక్రమించి, మహమ్మద్‌షాను బందీగా చేశాడు. బిజాపూర్‌పై బరీద్, దస్తూర్‌లు దండెత్తారు. ఈ లోగా, బెల్గాం ప్రజలు కమాల్‌పై తిరుగుబాటు చేసి, కృష్ణరాయలును దండెత్తిరమ్మని ఆహ్వానించారు.

కృష్ణదేవరాయలు దండెత్తి, రాయచూర్ అంతర్వేదిని జయించాడు. ఈరకంగా పరిస్థితులు మారడంతో, కమాల్, బరీద్‌లు కలిసిపోయి, ఒక అంగీకారానికి వచ్చారు. కమాల్ ఖాన్ బిజాపూర్‌లో ఇస్మాయిల్‌ను బందీగా చేయడానికి, బరీద్ సుల్తాన్ మహమ్మద్‌షాను బీదర్‌లో బందీగా చేయడానికి,

అంగీకారానికి వచ్చారు. ఈ విధంగా కమాల్ రాజ ద్రోహానికి తలపడడంతో, రాజ మాత కుట్ర పన్ని, అతన్ని హత్య చేయించింది. బిజాపూర్‌లో కల్లోల పరిస్థితులేర్పడ్డాయి. కృష్ణరాయలు వెంటనే దండెత్తి, గుల్బర్గా వద్ద బరీద్‌ను ఓడించి, మహమ్మద్‌షాను చెర నుండి విడిపించి, అతన్ని సింహాసనంపై తిరిగి కూర్చుండబెట్టాడు. ఈ విజయానికి గుర్తుగా, కృష్ణరాయలు 'యవనరాజ్య స్థాపనాచార్య' అనే బిరుదు వహించాడు. అల్లపాని పెద్దన యవనక్షోణీధన స్థాపన' అని, రాయలను పొగిడాడు. కృష్ణరాయలు అవకాశం దొరికినా, బహమనీ సుల్తాన్‌ను శిక్షించకుండా అతన్ని సింహాసనంపై పునఃప్రతిష్ఠించడానికి కారణముంది. రాయలు రాజనీతి విశారదుడు. ఎంతటి బలహీనుడైనా, బహమని సుల్తానే అపుడు సింహాసం మీద ఉన్నంత కాలం, బహమనీ సామంతులకు సంపూర్ణ స్వాతంత్ర్యముండదు. పైగా, దక్కన్‌పై వారధికారం కోసం ఒకరితో ఒకరు పోరాడుకుంటూ ఉంటారు. వారు అంతఃకలహాల్లో మునిగి ఉన్నంత కాలం విజయనగరానికి వారి నుండి ప్రమాద 'ముండదు. అందుకే, కృష్ణరాయలు మహమ్మద్‌షాను అతని సింహాసనంపై కూర్చుండబెట్టి, విజయనగరానికి తిరిగొచ్చాడు.

1510 జనవరి నాటి హంపి శాసనం కృష్ణరాయలను 'ఏరిభూత సురత్రాణ' అని వేర్కొంటూంది. వెంకటరమణయ్యగారు కృష్ణరాయలు 1510 జనవరికి ముందే, బహమనీ సుల్తాన్‌పై దండెత్తి, జయించి ఉంటాడని, అభిప్రాయపడ్డారు. రామచంద్రయ్యగారు ఈ అభిప్రాయాన్ని విమర్శిస్తూ, సురత్రాణుడు బహమని సుల్తాన్ కాదని, బిజాపూర్ సుల్తాన్ అయిన యూసఫ్ ఆదిల్‌షా అని వేర్కొన్నాడు. కృష్ణదేవరాయ బహమనీ యుద్ధాలు 1510 కి ముందే ప్రారంభమై, 3 ఏండ్లు కొనసాగాయని, భావించాల్సుంటుంది.

17.4.2.2.2 : ఉమ్మత్తూర్ దండయాత్ర

కృష్ణదేవరాయలు బహమనీ సుల్తాన్‌లతో పోరాడుతున్న కాలం లోనే, తిరుగుబాటు చేస్తున్న ఉమ్మత్తూర్ పాలెగాండ్ర పైకి సైన్యాన్ని పంపాడు. **'రాయవాచకం', 'కృష్ణరాయ విజయం'**, కృష్ణరాయలు సింహాసనం ఎక్కిన తర్వాత సంవత్సరం కాలం సైన్యాన్ని సమకూర్చుకుంటూ, విజయనగరం లోనే ఉన్నాడని, ఏళ్ళ కొలది కప్పం బకాయిలు పడిన అమరనాయకుల వద్ద నుండి పైకానికి బదులు, ఏనుగులు, గుత్తాలు, కాల్బలాన్ని తెప్పించి, ఉమ్మత్తూర్‌పై దండెత్తాడని చెప్తున్నాయి.

ఉమ్మత్తూర్ పాలెగాండ్ర బలమంతా, ఉమ్మత్తూర్, శివ సముద్ర మార్గాలపై ఆధారపడి ఉంది. అపుడు ఆ దుర్గాలను గంగరాజు పరిపాలిస్తున్నాడు. కృష్ణరాయలు దండెత్తుతాడని ముందే ఊహించిన గంగరాజు, శివసముద్ర జల దుర్గాన్ని ముఖ్య స్థావరంగా చేసికొని, కోట బురుజులను మరమ్మత్తు చేసి, ఫిరంగులు మొదలైన ఆయుధాలను బురుజుపైని ఎక్కించి, యుద్ధానికి సిద్ధమయ్యాడు. ఈ ఉమ్మత్తూర్ దండయాత్ర 2 ఏండ్లు సాగింది. కృష్ణదేవరాయలు ముందుగా పెనుగొండను ఆక్రమించి, రాజనీతితో ఉమ్మత్తూర్ పాలకుని దాయాదైన చిక్కర్లామణ్ణి తన వైపు తిప్పుకొని, ఉమ్మత్తూర్ పైకి దండెత్తినాడు. మొదట ఉమ్మత్తూర్ కోటను నేలమట్టం చేశాడు. తర్వాత శివసముద్రంపై దండెత్తాడు. ఈ దుర్గం అంత సులువుగా కృష్ణరాయల వశం కాలేదు. ఒక సంవత్సర కాలం పోరాటం నడిచింది. కృష్ణరాయలు కోటను చుట్టుముట్టి, వెలుపల నుండి కోట లోనికి ప్రవేశం లేకుండా చేశాడు. చివరకు గంగరాజుకు రాయలను ఎదిరించే శక్తి లేక, నదీ మార్గం ద్వారా పారిపోతూ, ఒక మడుగులో పడి మరణించాడు. శివసముద్రం కృష్ణరాయల వశమైంది. ఆ దుర్గాన్ని కూడా నాశనం చేసి, అక్కడ నుండి శ్రీరంగపట్టణానికి వెళ్ళి దానిని ఆక్రమించాడు. శత్రువుల అధీనంలో ఉండే ప్రాంతాలన్నిటినీ ఆక్రమించి, శ్రీరంగపట్టణం ప్రధాన కేంద్రంగా, ఒక నూతన రాజ్యాన్ని నిర్మించి,

BRAOU

వాటిని కెంపె గౌడ, హరప్ప గౌడల కిచ్చి, విధేయులైన, విశ్వాసపాత్రులైన పాలెగాండ్ర కప్పగించి, ఉమ్మత్తూర్‌లో కొంత భాగాన్ని బుక్క రాయల కిచ్చి, విజయనగరం చేరాడు.

ఈ విధంగా సింహాసన మెక్కిన 3 ఏండ్లలో బహమనీ సుల్తాన్‌ను, యూసఫ్ ఆదిల్ ఖాన్‌ను, ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్‌ను ఓడించి, రాయచూర్, ముద్గల్ దుర్గాలను, కృష్ణ, తుంగ్రభద్రల మధ్య సీమలను స్వాధీనపర్చుకున్నాడు. కలుబరిగె మీదకు దండెత్తి, నిజాం మొదలైన బహమనీ సామంతులను శిక్షించి, వరాహ ధ్వజాన్ని ఆకోటపై స్థాపించాడు. బరీద్‌ను ఓడించి, అతని సప్తాంగాలను హరించి, బందీయైన మహమ్మద్‌షాను చెర నుండి విడిపించి, సింహాసనం మీద కూర్చోబెట్టి, 'యవనరాజ్య స్థాపనాచార్య' బిరుదు వహించాడు. అనేక సంవత్సరాలుగా విజయనగర పాలకులను ధిక్కరించిన ఉమ్మత్తూర్, శివసముద్ర పాలెగాండ్రను శిక్షించి, శాంతిభద్రతలను చేకూర్చాడు.

17.4.2.2.3 : కళింగ దిగ్విజయ యాత్ర

కృష్ణదేవరాయల శత్రువుల్లో ప్రతాపరుద్ర గజపతి ప్రముఖుడు, బలవంతుడు. ఇతని గజ బలం భారతదేశం లోనే ప్రసిద్ధికెక్కింది. ఇతడు అనేక యుద్ధాల్లో విజయాన్ని సాధించి, తిరాంధ్ర ప్రాంతాన్ని, తెలంగాణాలో అధిక భాగాన్ని ఆక్రమించాడు. గజపతుల నుండి వీటిని తిరిగి ఆక్రమించడానికి, కృష్ణరాయలు గొప్ప దిగ్విజయాన్ని చేశాడు.

1510 జనవరి నాటి హంపి శాసనం కృష్ణరాయలను 'గజపతిగజకూటపాకల'ని వేర్కొంది. 'చైతన్యభాగవతం', 'చైతన్యమంగళం' అనే గ్రంథాలు, కళింగ ప్రతాపరుద్ర గజపతి విజయనగరంపై 1510 లో దండెత్తాడని వేర్కొంటున్నాయి. అందుచేత, ప్రతాపరుద్ర గజపతి వీరనరసింహుని చివరి రోజుల్లో కానీ, చనిపోయే ముందుగానీ, దండెత్తి ఉంటాడు. కృష్ణదేవరాయలు సింహాసన మధిష్ఠించిన వెంటనే, ప్రతాపరుద్రుణ్ణి ఓడించి, తరిమి ఉండాలి.

తిరాంధ్ర, తెలంగాణా ప్రాంతం లోని దుర్గాల్లో ప్రతాపరుద్ర గజపతి తనకు సన్నిహితులు, విధేయులైన ప్రతినిధుల నుంచి, కొండవీడును ప్రధాన కేంద్రంగా చేసి, తన కుమారుని పాలకుడిగా ఉంచాడు. కృష్ణరాయల కళింగ దండయాత్ర 1513 లో ఆరంభమై, 1519 వరకు సాగిందని, కొందరి అభిప్రాయం. దండయాత్ర ఏకధాటిగా సాగలేదని, ఇందులో 5 లేక 6 ఘట్టాలున్నాయని వెంకటరమణయ్యగారి అభిప్రాయం. దీనికి ఆధారం, ఉదయగిరి, తిరువతి, అమరావతి, అహోబిలం, తిరుపతి శాసనాలు. ఈ శాసనాలు కృష్ణరాయలు ఉదయగిరిని జయించిన తర్వాత, కొండవీడును జయించిన తర్వాత, సింహాద్రి, పాట్నూరుల వద్ద విజయ స్తంభాలను ప్రతిష్ఠించిన తర్వాత, విజయ నగరానికి వెళ్ళి, సైన్యాన్ని కలుపుకొని, తిరిగి యుద్ధాల నారంభించినట్లు తెలుపుతాయి. సింహాద్రి శాసనం ఉదయగిరి, కొండవీడు, కొండపల్లి, రాజమహేంద్రవరం అనే దుర్గాలను జయించినట్లు తెలుపుతూంది. 'అముక్తమాల్యద' లో మొదటి ఆశ్వాసం చివర ఉదయగిరి విజయాన్ని, రెండవ ఆశ్వాసం చివర కొండవీడు విజయాన్ని, మూడవ ఆశ్వాసం చివర కొండపల్లి విజయాన్ని, నాలుగో ఆశ్వాసం చివర సింహాచలం, పాట్నూరుల్లో విజయ స్తంభాల ప్రతిష్ఠను వరుసగా వర్ణించాడు. మ్యూనిజ్ కూడా, ఉదయగిరి, కొండవీడు, కొండపల్లి, సింహాచల విజయాలను వరుసగా వర్ణించాడు. బండారు లక్ష్మీనారాయణ తన 'సంగీత సూర్యోదయం' లో కూడా, ఇదే వరుసలో కృష్ణరాయల కళింగ విజయాన్ని వేర్కొన్నాడు.

BRAOU

17.4.2.2.3.1 : ప్రథమ ఘట్టం

కళింగ దండయాత్ర ఉదయగిరి కోట ముట్టడితో ప్రారంభమైంది. ఉదయగిరి, కొండవీడులు చాలా కాలంగా గజపతుల అధీనంలో ఉన్నాయి. 1513 జనవరిలో కృష్ణరాయలు విజయనగరం నుండి పెద్ద సైన్యంతో బయలుదేరి, ఉదయగిరిని ముట్టడించాడు. ఈ ముట్టడి 18 నెలలు సాగింది. ప్రతాపరుద్ర గజపతి పినతండ్రైన తిరుమల రాహుత్తరాయలు దుర్గ రక్షణ వహించి, విజయనగర సైన్యాన్ని కోట గోడలకు చేరకుండా, తరిమికొట్టసాగాడు. కృష్ణరాయలు దుర్గం చుట్టూ ఉండే గుట్టలను, బండలను పగులగొట్టి, కోట గోడల దగ్గరకు సైనికులు సులువుగా పోవడానికి మార్గాల నేర్పర్చాడు. కోట సంరక్షకుల పరిస్థితి కష్టమైంది. ఆహార పదార్థాలు కరువయ్యాయి. ఈ కోట రక్షణకు, కృష్ణరాయలను తరమడానికి, ప్రతాపరుద్ర గజపతి సైన్యంతో వచ్చాడు. కానీ, కృష్ణరాయలు గజపతిని ఓడించి, కొండవీడు వరకు తరిమి, తిరిగొచ్చి ఉదయగిరిని సాధించాడు. తిరుమల రాహుత్తరాయలను బందీగా చేసి, ఉదయగిరిని రాయసం కొండమరసు అధీనంలో ఉంచి, తిరుపతి, కాళహస్తిని దర్శించి, విజయనగరానికి చేరాడు.

17.4.2.2.3.2 : ద్వితీయ ఘట్టం

రెండవ ఘట్టంలో విజయనగర సైన్యం కొండవీడుపై దండెత్తింది. ఉదయగిరి దండయాత్ర తర్వాత కృష్ణరాయలు విజయనగరం చేరినప్పటికీ, అతని సైన్యం కొండవీడు పైకి నడిచింది. దారిలో అద్దంకి, వినుకొండ, బెల్లంకొండ, నాగార్జునకొండ, తంగెడ మొదలైన ప్రదేశాలను జయించి, విజయ నగర సైన్యం కొండవీడును ముట్టడించింది. కొండవీడు ముట్టడి సాళువ తిమ్మరుసు నాయకత్వంలో 3 నెలలు సాగింది. కొండవీడు బలిష్ఠమైన గిరిదుర్గమవడంవల్ల, సులువుగా స్వాధీనపడలేదు. ఈ పరిస్థితుల్లో కృష్ణరాయలు విజయనగరం నుండి వచ్చి, సైన్యానికి ప్రోత్సాహమిచ్చి, కోటను దిగ్బంధం చేసి, కోట లోకి ఎట్టి ఆహార పదార్థాలు చేరకుండా చేసి, సైనికులు కోట గోడ లెక్కడానికి ఏర్పాట్లు చేసి, కోటను లొంగదీశాడు. ఈ దుర్గం 1515 జూన్ 23న రాయల వశమైంది. అక్కడ ప్రతాపరుద్ర గజపతి రాణులలో ఒకామె, అతని కుమారుడు, కొండవీడు పాలకుడైన వీరభద్ర గజపతి, అనేక మంది పాత్ర, సామంతులు రాయలకు పట్టుబడ్డారు. కొండవీడు దుర్గ పాలనను రాయసం తిమ్మరుసుకు అప్పగించి, కృష్ణా నది వరకు వ్యాపించిన తెలుగు దేశాన్ని ఆక్రమించి, అమరేశ్వరుని పూజించి, శ్రీశైలం మీదుగా విజయనగరం చేరాడు.

17.4.2.2.3.3 : తృతీయ ఘట్టం

సాళువ నరసింహుని చివరి కోరిక ప్రకారం, కృష్ణరాయలు కొండవీడు, ఉదయగిరి దుర్గాలను స్వాధీనం చేసుకొన్నాడు. కానీ, వాటితో తృప్తి పడలేదు. గజపతి రాజ్యాన్ని జయించడానికి నిర్ణయించుకొని, కృష్ణను దాటుమని సైన్యానికి ఆదేశమిచ్చాడు. విజయనగర సైన్యం కృష్ణను దాటి, బెజవాడను ముట్టడించింది. ఈ లోగా, కృష్ణరాయలు విజయనగరం నుండి వచ్చి, సైన్యాన్ని కలిశాడు. బెజవాడ రాయల వశమైంది. బెజవాడ కేంద్రంగా, తూర్పున వేంగీ దేశాన్ని, పశ్చిమాన తెలంగాణాను జయించడానికి పూనుకున్నాడు. బెజవాడకు పశ్చిమోత్తరంగా 10 మైళ్ళ దూరంలో ఉన్న కొండపల్లిని ముట్టడించాడు. ఇది ఆంధ్ర దేశంలోని బలమైన గిరి దుర్గాల్లో ఒకటి; పైగా తెలంగాణాకు పోవడానికి మార్గం. తెలంగాణాను జయించడానికి ముందు, కొండపల్లిని వశం చేసుకోవాలి. అందుకని, విజయనగర సైన్యం కొండపల్లిని ముట్టడించింది. ఈ ముట్టడి సాగుతుండగా, ప్రతాపరుద్ర గజపతి

BRAOU

కృష్ణను దాటి, వెనుక నుండి రాయల సైన్యంపై దాడి చేశాడు. కృష్ణరాయలు కొంత సైన్యాన్ని కోట చుట్టూ కాపుంచి, తక్కిన వారితో ప్రతాపరుద్రుణ్ణి ఓడించి, తరిమికొట్టాడు. కృష్ణరాయలు వెనుకకు వచ్చి, కోట ముట్టడిని కొనసాగించాడు. ఈ ముట్టడిని 2 నెలలు సాగించి, చివరకు కోటను రక్షిస్తున్న ప్రహరేశ్వర మహాపాత్రుడు, అతని మిత్రులైన బోడజన మహాపాత్రుడు, బిజలీ ఖాన్ లొంగిపోయారు; కొండపల్లి రాయల వశమైంది.

17.4.2.2.3.4 : చతుర్థ ఘట్టం

కొండపల్లిని ఆక్రమించిన తర్వాత కళింగ దండయాత్ర ప్రారంభమైంది. ఈ కళింగ యాత్రలో వేంగిని జయించాడని నిశ్చయంగా చెప్పడానికి వీల్లేదు. **'రాయవాచకం', 'కృష్ణరాయ విజయం'** మొదలైన గ్రంథాలు దీనిని ప్రస్తావించ లేదు. కొన్ని శాసనాలు రాజమహేంద్రవరాన్ని జయించినట్లు చెప్తాయి. **'మనుచరిత్ర'**లో పెద్దన దీన్ని ప్రస్తావించాడు. అందుచేత, కృష్ణరాయలు వేంగిని జయించాడని నిశ్చయంగా చెప్పొచ్చని వెంకటరమణయ్య గారి అభిప్రాయం.

కృష్ణరాయల తెలంగాణా దండయాత్ర శాసనాల్లోను, గ్రంథాల్లోను విపులంగా వర్ణించబడింది. కళింగాన్ని జయించడానికి ముందు, తెలంగాణాను వశపర్చుకోవడం మంచిదని కృష్ణరాయలు భావించాడు. తెలంగాణాలో అధిక భాగం ప్రతాపరుద్ర గజపతి సామంతుల ఏలుబడిలో ఉంది. విజయనగర సైన్యం మొదట ఖమ్మంమెట్టుపై నడిచింది. అక్కడ చిత్తాపుఖానుడు, లేదా షిత్తాపుఖాన్ అనే బిరుదు గల సీతాపతి, గజపతుల సామంతుడిగా తెలంగాణాను పాలిస్తున్నాడు. ఓరుగల్లు కోట కూడా సీతాపతి వశంలో ఉంది. రాయల సైనిక ధాటికి తట్టుకోలేక, సీతాపతి ఖమ్మం వదిలి పారిపోయాడు. కృష్ణరాయలు ఖమ్మంమెట్టును, వరంగల్లును వశపర్చుకొని, తర్వాత అనంతగిరి, ఉండ్రకొండ, ఉర్లకొండ, అరువపల్లి, జల్లిపల్లి, కందికొండ, నల్లగొండ, రాచకొండ, దేవరకొండ, కనకగిరి, శంకరగిరి మొదలైన దుర్గాలను ఏకధాటిని ఆక్రమించి, సింహాచలం వైపు నడిచాడు. లోయ గుండా ప్రయాణం చేస్తున్న విజయనగర సైన్యాన్ని, గజపతి ఆదేశం ప్రకారం, 60,000 అశ్వారూఢులైన విలుకాండ్రతో ఎదిరించాడు. అపుడు కృష్ణరాయలు వెనుక నుండి సీతాపతిపై దాడిని చేశాడు. ఈ దాడిని తట్టుకోలేక, సీతాపతి పారిపోయాడు. కృష్ణరాయలు కొంత సైన్యాన్ని కనుమ దగ్గర కాపుంచి, సింహాచలం సమీపంలోని పొట్నూరు చేరి, విజయ స్తంభం నాటి, నరసింహస్వామిని దర్శించి, విజయనగరానికి చేరాడు.

17.4.2.2.3.5 : పంచమ ఘట్టం

సింహాద్రి, పొట్నూరుల్లో విజయ స్థంభాల స్థాపనతో రాయల కళింగ యాత్ర ముగిసిందని, ఆ సమయం లోనే గజపతి తన కుమార్తెను రాయల కిచ్చి వివాహం చేసి, అతనితో సంధి చేసుకున్నాడని, యస్. కృష్ణస్వామి అయ్యంగార్ అభిప్రాయం. వెంకటరమణయ్యగారు దీనితో ఏకీభవించక, ఈ యాత్ర ఇంతటితో ఆగలేదని, కటక్ వరకు కృష్ణరాయలు దండెత్తాడని అభిప్రాయపడ్డారు. 1517 నాటి కొమ్మూరు శాసనం, కృష్ణరాయలు కటకం వరకు దండెత్తినట్లు తెలుపుతూంది. రామచంద్రయ్యగారి అభిప్రాయం ప్రకారం, కృష్ణరాయల సైన్యాలు శ్రీకూర్మం, పూరి వరకు నడిచాయని, కటకాన్ని ధ్వంసం చేయడం సహేతుకమైనదేనని అభిప్రాయపడ్డారు.

కళింగంపై తుది విజయం 1519 ఆగస్ట్ 8 నాటికి కానీ, అంతకు ముందుగానీ సంభవించి ఉండాలి. **'రాయవాచకం'**, కృష్ణరాయలు మళ్ళీ సైన్యాన్ని సమకూర్చుకొని, గజపతి రాజధాని కటకంపై

BRAOU

దండెత్తాడని, తన పదహారుగురు పాత్ర, సామంతులతో కలసి, గజపతి కృష్ణరాయలను ఎదుర్కోవడానికి చేసిన ప్రయత్నం, మహామంత్రి తిమ్మరుసు భేదాభిప్రాయం విఫలం చేసినట్లు తెలుపుతూంది. కృష్ణరాయలు కటకం చేరగానే, ప్రతాపరుద్ర గజపతి పారిపోయినట్లు, రాయల సైనికులు కటకపురిని కాల్చినట్లు, **'రాయవాచకం', 'ఆముక్తమాల్యద'** తెలుపుతాయి. చివరకు ప్రతాపరుద్ర గజపతి రాయలకు తన కుమార్తె నిచ్చి, వివాహం చేసి, సంధి చేసుకున్నాడు. కృష్ణరాయల 12 మంది భార్యల్లో ఒకరిస్సా రాకుమార్తె ఒకతెని వేన్ వేర్కొన్నాడు. ఈమె పేరు విషయంలో కూడా ఏకాభిప్రాయం లేదు. తిరుమలాంబ, భద్ర, జగన్మోహిని, తుక్కా, లక్ష్మీదేవమ్మని, గ్రంథాలు పేర్కొంటున్నాయి. వెంకట రమణయ్యగారు **'ఆముక్తమాల్యద'** పీఠిక లోని "లక్ష్మీకనుగందిని ఏడుకం కృష్ణదేవరాయలంజేరునకాన" అన్న వాక్యాన్నాధారంగా చేసుకొని, ఈమెపేరు లక్ష్మీదేవని అభిప్రాయపడ్డారు.

ఈ కళింగ దిగ్విజయ యాత్ర ఫలితాలను వర్ణిస్తూ, వెంకటరమణయ్యగారు ఈ విధంగా అభిప్రాయపడ్డారు. "కళింగ యుద్ధం వల్ల కృష్ణరాయల కీర్తి భారతావని అంతటనూ బలివింది. అతని శౌర్యప్రతాపాలు ప్రకటితమైనాయి. అతడసాధారణ ప్రతిభాసంపన్నుడైన దండనాయకాగ్రేసురుడని తెల్లమైంది. రాయరాణువ ప్రతిష్ఠ అతిశయించింది. లుప్తమైన రాయ సామ్రాజ్య భాగాలు మరల స్వాధీనమైనవి. ఇవి తాత్కాలిక ఫలాలు. దీర్ఘ దృష్టితో ఆలోచించిన, కళింగ యుద్ధం దక్షిణ భారత భూమికి అనర్థమని చెప్పాల్సుంది. విజయనగర చక్రవర్తులు, గజపతులు సుహృద్భావంతో నేకీభవించి పూనుకుని యుండిన, మహమ్మదీయుల అధికారాన్ని సమూలంగా పెకలించి యుండొచ్చు. వారి పరస్పర వైషమ్యం మహమ్మదీయులకు లాభకరమైంది. మొదట బహమనీ సుల్తాన్‌లు, వారి అనంతరం గోల్కొండ కుతుబ్‌షాహీలు, తీరాంధ్రాన ప్రవేశించడానికే వైరం చాల అనుకూలపడింది. కావున, కృష్ణరాయల కళింగ జైత్ర యాత్ర గజపతి సామ్రాజ్య నిర్మూలనకు, దేశ పారతంత్ర్యానికీ, హేతుభూతమయ్యేనని చెప్పవలసి యున్నది".

వెంకటరమణయ్య గారి వ్యాఖ్యానం పూర్తిగా సత్యం కాదని, డా. కె.యన్. కామేశ్వర్‌రావ్ అభిప్రాయం. విజయనగర పాలకులు, కేవలం హిందూ మత రక్షణకే ప్రాధాన్యమివ్వకుండా రాజకీయాలను కూడా దృష్టిలో ఉంచుకొని, వ్యవహరించారు. అందుకే పోర్చుగీస్ వారితో సఖ్యత చేసుకోవడం, మహమ్మదీయ విలుకాండ్రను సైన్యంలో చేర్చుకోవడం వంటి రాజకీయ నిర్ణయాలను తీసుకొని, సామ్రాజ్య రక్షణకు, విస్తరణకు పూనుకున్నారు. హిందూ సహకార మన్నది గజపతుల కూడ వర్తించొచ్చుగదా! గజపతులు విజయనగరంపై దండెత్తి ప్రాంతాలను ఆక్రమించడమేగాక, శత్రువులైన మహమ్మదీయులతో చేతులు కలపలేదా! గజపతులతో యుద్ధం చేయడంలో కృష్ణరాయల లక్ష్యం శాశ్వత శాంతి ఒడంబడికను కుదుర్చుకోవడమేనని, కృష్ణరాయలు కోరిన విధంగా గజపతి శాంతి ఒడంబడికకు అంగీకరించాడని, న్యూనిజ్ వ్రాశాడు.

17.4.2.2.4 : కాటూరు దండయాత్ర

ప్రతాపరుద్ర గజపతితో సంధి చేసుకున్న తర్వాత కృష్ణరాయలు కాటూరుపై దండెత్తి, ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నట్లు, న్యూనిజ్ పేర్కొన్నాడు. ఈ దండయాత్ర గురించి ఇతర గ్రంథాలు గానీ, శాసనాలు గానీ, ప్రస్తావించ లేదు. ఈ కాటూరు ఎక్కడ ఉన్నదీకూడా, సరిగా గుర్తింపబడ లేదు. ఇది తామ్రపర్ణి ముఖద్వారంలో ఉన్న కాయత్తారు అయిఉండొచ్చునని, దీనిని పోర్చుగీస్‌వారు కైతరు అని పిలిచారని, ఇది పాండ్య రాజ్యం లోనిదని, వెంకటరమణయ్యగారు అభిప్రాయపడ్డారు. ఈ సమయం లోనే, కృష్ణదేవరాయలు సింహళ పాలకుల నుండి కప్పాన్ని వసూలు చేసినట్లు తెలుస్తోంది.

BRAOU

17.4.2.2.5 : దక్కన్ సుల్తాన్‌లతో యుద్ధం

బహమని సుల్తాన్ మహమ్మద్‌షా మరణంతో, బహమని రాజ్యం అంతరించి, 5 దక్కన్ రాజ్యాలు అవతరించాయి. వీటిలో బిజాపూర్ బలమైంది. కృష్ణదేవరాయలు కళింగ దండయాత్రలో ఉండగా, 1516 ప్రాంతంలో బిజాపూర్ పాలకుడు, ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్, గోల్కొండ పాలకుడు సుల్తాన్ కులీకుతుబ్‌షాతోనూ, అహ్మద్‌నగర్ పాలకుడు బుర్హాన్ నిజామ్ షా తోను కలిసి, విజయనగర రాజ్యంపై దండెత్తి, కోవెలకొండ, పానుగల్లు, దేవరకొండ, ఘన్‌పూర్ దుర్గాలను స్వాధీనం చేసుకున్నారు. అంతే కాక, ప్రతాపరుద్ర గజపతికి సహాయం చేయడానికి ఒప్పుకున్నారు. అందుచేత, కృష్ణరాయలు కళింగ దండయాత్రల్లో ఉండగానే, మహమ్మదీయులను ఎదుర్కోవాల్సొచ్చింది. కృష్ణరాయలు కోవెల కొండ మొదలైన దుర్గాల పైకి సైన్యాన్ని పంపి, ఇంకొక సేనతో బిజాపూర్‌పై దండెత్తాడు. కోవెల కొండను రక్షించుకోవడానికి కులీకుతుబ్‌షా మిగిలిన వారితో కలవలేక పోయాడు. అందుచేత, అహ్మద్‌నగర్, బిజాపూర్ పాలకులు మాత్రమే రాయలను ఎదుర్కొన్నారు. ఆ యుద్ధ వివరాలు సరిగ్గా తెలియవు. **'ఆముక్తమాల్యద'**, కృష్ణదేవరాయలు కెంబావి వద్ద ఘన విజయాన్ని సాధించి, అహ్మద్‌నగర్‌ను నేలమట్టం చేసినట్లు చెబుతూంది. **'తారిఖీ మహమ్మద్‌కుతుబ్‌షా'** రచయిత, ఈ యుద్ధాన్ని గురించి ప్రస్తావించినప్పటికి, ఎప్పుడు జరిగిందో చెప్పలేదు.

17.4.2.2.5.1 : రాయచూర్ యుద్ధం (1520)

మహమ్మదీయుల అధీనంలో ఉన్న కృష్ణ-తుంగభద్ర అంతర్వేదిని, ముఖ్యంగా రాయచూర్ దుర్గాన్ని తిరిగి జయించడానికి, 1520 ప్రాంతంలో కృష్ణరాయలు దండెత్తాడు. ఈ రాయచూర్ యుద్ధాన్ని, ఫెరిష్టా, న్యూనిజ్‌లు వర్ణించారు. కానీ, యుద్ధ కారణాలను న్యూనిజ్, ఫెరిష్టాలు వేరువేరుగా పేర్కొన్నారు. విజయనగర స్వాధీనంలో ఉన్న రాయచూర్‌ను సాధించడానికి, ఇస్మాయిల్ ఆదిల్ ఖాన్ అంతర్వేది మీద దండెత్తినట్లు, ఆ దండయాత్రను తిప్పికొట్టడానికి రాయలు ఇస్మాయిల్ ఆదిల్ ఖాన్ పైకి దండెత్తినట్లు, ఫెరిష్టా పేర్కొన్నాడు. ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్ స్వాధీనం లోని రాయచూర్‌ను రాయలు ముట్టడించి స్వాధీనం చేసుకున్నట్లు, న్యూనిజ్ వ్రాశాడు. కొందరు చరిత్రకారులు ఫెరిష్టాను సమర్థిస్తే, మరికొందరు న్యూనిజ్ అభిప్రాయాన్ని సమర్థించారు. న్యూనిజ్ కృష్ణదేవరాయలకు దగ్గర సమకాలికుడని, అందుచేత అతని కథనాన్ని అంగీకరించొచ్చని వెంకటరమణయ్య గారి అభిప్రాయం. న్యూనిజ్, ఫెరిష్టాలే కాక, ఈ యుద్ధాన్ని పోర్చుగీస్ రచయిత కాస్టన్ హెడా ప్రస్తావించాడు. గోవా పోర్చుగీస్ పాలకుడు సెక్వెయిరా, గోవాలో లేకుండా సముద్రం మీదకు తరలిపోయినప్పుడు, విజయనగర పాలకుడు, ఆదిల్‌ఖాన్‌ల మధ్య యుద్ధం జరిగిందని, చివరకు ఈ యుద్ధంలో ఆదిల్ ఖాన్ ఓడి, పారిపోయాడని, హిందువులు రాయచూర్‌ను, మరికొన్ని స్థలాలను పట్టుకున్నారని, కాస్టన్ హెడా వ్రాశాడు. సెక్వెయిరా 1520 ఫిబ్రవరి 13న గోవాను వదలి, ఎర్ర సముద్రానికి వెళ్ళాడు. దీన్నిబట్టి, కృష్ణరాయలు ఆ తర్వాత కొద్ది రోజుల్లో రాయచూర్‌ను జయించుండాలి. బండారు లక్ష్మీనారాయణ తన **"సంగీత సూర్యోదయం"**లో గొబ్బూరు యుద్ధాన్ని, ఆదిల్‌ఖాన్ పలాయనాన్ని, రాయలు రాయచూరును స్వాధీనం చేసుకోవడాన్ని ప్రస్తావించాడు.

1520 ప్రారంభంలో కృష్ణరాయలు గొప్ప సైన్యంతో రాయచూర్ దుర్గాన్ని ముట్టడించాడు. కృష్ణకు దక్షిణంలో ఉన్న గొబ్బూరు వద్ద ఘోర యుద్ధం జరిగింది. 1520 మే 19న జరిగిన యుద్ధంలో ఆదిల్ ఖాన్ పూర్తిగా ఓడిపోయి, సైన్యాన్ని కోల్పోయాడు. బిజాపూర్ సర్దార్‌లనేకులు రాయలకు పట్టుబడ్డారు. ఈ యుద్ధంలో పోర్చుగీస్ రాయబారి క్రిష్టావోడా ఫిగర్డో, పోర్చుగీస్ తుపాకీ

BRAOU

దళంతో కృష్ణరాయలకు సహాయపడ్డాడు. కృష్ణ-తుంగభద్ర అంతర్వేది తిరిగి విజయనగర పాలన లోనికి వచ్చింది. 1521 జులై 21 నాటి కృష్ణరాయల శాసనం, రాయచూర్ కంటమరాజు సింగరాజు నిర్మించిన దేవాలయాన్ని గురించి ప్రస్తావించింది. కృష్ణరాయలు రాయచూర్ యుద్ధంలో విజయాన్ని పొందిన తర్వాత, భయాందోళనలకు గురైన మిగిలిన సుల్తాన్‌లు, రాయచూర్‌ను ఇస్మాయిల్ ఆదిల్‌షాకు తిరిగి ఇచ్చివేయవలసిందిగా కోరుతూ, రాయబారం పంపారు. అయితే, రాయలు తిరిగి ఇవ్వడానికి అంగీకరించ లేదు. అంతేకాక, మిగిలిన సుల్తాన్‌లు యుద్ధాన్ని ప్రకటిస్తే, వారిని ఎదుర్కోవడానిక్కూడా సిద్ధమేనని, రాయలు సమాధానం చెప్పాడు. కృష్ణరాయలు విజయనగరానికి 2 మైళ్ళ దూరంలో నిర్మించబడ్డ నూతన రాజధానైన నాగలాపురంలో ఉండగా, మహమ్మదీయ రాయబారి రాయలను కలుసుకున్నాడు.

కృష్ణరాయలు పట్టుకున్న గుఱ్ఱాలను, ఏనుగులను, ఫిరంగులను తిరిగి ఇచ్చివేయమని, రాయబారి ద్వారా ఇస్మాయిల్ ఆదిల్‌షా అడిగించాడు. కానీ, కృష్ణదేవరాయలు 'ఇస్మాయిల్ ఆదిల్‌షా నా కాలికి మొక్కితే రాయచూర్‌ను తిరిగి ఇస్తా' నని, సమాధానం పంపాడు. తర్వాత ముద్గల్‌లో సమావేశం కావడానికి నిర్ణయించుకున్నారు. కృష్ణరాయలు ముద్గల్‌లో కొంత కాలం వేచి ఉన్నాడు. కాని, ఇస్మాయిల్ ఆదిల్‌షా రాలేదు. అక్కడ నుండి ఇస్మాయిల్ భూభాగంలో ఉన్న బిజాపూర్ చేరుకున్నాడు, కృష్ణరాయలు. అక్కడిక్కూడా ఇస్మాయిల్ రాలేదు. అంతేగాక, బిజాపూర్ లోని సీటి నంతటినీ తోడించి వేసి, కృష్ణరాయలు బిజాపూర్‌లో ఉండడం కష్టతరం చేశాడు. కృష్ణరాయలు ఆగ్రహించి, బిజాపూర్‌పై దండెత్తి, గుల్బర్గా, ఫిరోజాబాద్, హసన్‌బాద్, సాగర్ నగరాలను ధ్వంసం చేసి, తిరిగి వెళ్ళాడు. రాయచూర్ యుద్ధ విజయం సైనికపరంగా కృష్ణరాయల ప్రతిష్ఠను పెంచింది. కానీ, రాజకీయపరంగా చూస్తే, విజయనగరానికి ఏమీ లాభం చేకూరలేదు. బీజాపూర్ రాజకీయ పరంగా చూస్తే, విజయనగరానికి ఎటూ లాభం చేకూర లేదు. బిజాపూర్‌తో శాంతి ఒప్పందం కుదర లేదు. సరిహద్దుల నిర్ధారణ జరగలేదు. తుదిగా, యుద్ధ విరమణ జరగలేదు. తాత్కాలికంగా, విజయనగర పాలకులకు తృప్తి కలిగింది. ఓరుగంటి రామచంద్రయ్యగారి అభిప్రాయం ప్రకారం, కృష్ణరాయలు బిజాపూర్, గుల్బర్గాలపై దండెత్తటం తప్పటడుగు. ఆ దండయాత్ర ఫలితంగా, ఇస్మాయిల్ ఆదిల్‌షా కృష్ణరాయల శరణు కోర లేదు. పోగా, మిగిలిన మహమ్మదీయ సుల్తాన్‌లు కృష్ణరాయలకు శత్రుపులయ్యారు. కృష్ణరాయలు మిగిలిన సుల్తాన్‌లతో ప్రవర్తించిన విధానం, రాజనీతి జ్ఞుడుగా కృష్ణరాయల ప్రతిష్ఠను దెబ్బతీసింది. ఫలితంగా, మహమ్మదీయ పాలకుల్లో విజయనగరం పట్ల విపరీతమైన భయవిద్వేషాలు పెరిగి, ఏకమయ్యేందుకు ఉపకరించింది. ఇస్మాయిల్ ఆదిల్‌షా కాలక్రమేణ తన బలాన్ని, శక్తిని, అహ్మద్‌నగర్‌కు చెందిన బుర్హాన్ నిజాంషాతోను, బీదర్‌కు చెందిన అల్లావుద్దీన్ ఇమాద్‌షాతోనూ, వివాహ సంబంధాన్ని పెట్టుకొని, బీదర్‌కు చెందిన అమీర్ బరీద్‌ను ఓడించి, 1528 -29లలో దండెత్తి వచ్చి, రాయచూర్, ముద్గల్ కోటలను తిరిగి జయించాడు. ఈ ఓటమి కృష్ణరాయల ప్రతిష్ఠకు తీరని దెబ్బ. రాయచూర్, ముద్గల్ కోటలను ఆక్రమించడానికి రాయలు చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు.

సమకాలీన ఆంధ్ర గ్రంథాలు, కృష్ణదేవరాయలు నీవాడ పాలకుడిపై, శకంధరుడిపై, పంచగౌడ పాలకుడిపై విజయాన్ని సాధించనట్లు చెబుతాయి. కె.వి. లక్ష్మణరావుగారు శకంధరుని, గుజరాత్ పాలకుడైన శకంధర్‌షాగా భావిస్తే, వెంకటరమణయ్య గారు ఢిల్లీ పాలకుడైన సికందర్ లోడిగా గుర్తించాడు. కానీ, వీటిని రుజువు చేయగల ఆధారాలు లేవు.

BRAOU

17.4.3 : కృష్ణరాయుల చివరి రోజులు

కృష్ణరాయుల చివరి రోజులు రాజ్యంలో కలిగిన సంక్షోభం వల్ల, ప్రశాంతంగా గడవ లేదు. కృష్ణరాయలకు అప్పటికే వయసు మీరడంతో, విశ్రాంతి తీసుకోదల్చాడు. అప్పటికి అతనికి తిరుమల రాయలని ఆరేళ్ళ కొడుకున్నాడు. తను మరణించిన తర్వాత ,సింహాసం అతనికి దక్కుతుందో, దక్కదో అన్న భయంతో, తను బతికి ఉండగానే, అతనిని రాజును చేసి, తాను ప్రధానై, తిమ్మరుసు సహాయంతో పరిపాలన కొనసాగించదల్చాడు. అందుచేత, తిరుమల రాయలకు పట్టాభిషేకం చేశాడు. పట్టాభిషేక మహోత్సవం 8 నెలలు నడిచింది. కాని, ఆ బాలుడు 1524 లో మరణించాడు. ఆ బాలునికి తిమ్మరుసు విష ప్రయోగం చేశాడని రాయలు అనుమానించి, తిమ్మరుసును, అతని కుటుంబ సభ్యులను చెరసాలలో ఉంచాడు. తిమ్మరుసు కొడుక్కైన తిమ్మదండనాయకుడు చెరసాల నుండి తప్పించుకొని, రాయలుపై తిరుగుబాటు చేసి, అల్లర్లను లేపాడు. దీనికి కోపించి, కృష్ణరాయలు చెరసాలలో ఉన్న తిమ్మరుసు కళ్ళు పీకించాడని, న్యూనిజ్ వ్రాశాడు.

కాని, ఈ విషయాన్ని నిరూపించే ఇతర ఆధారాలు లేవు. విజయనగరం లోని ఈ పరిస్థితులను అవకాశంగా, ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్, కుతుబ్‌షా అడపాదడపా విజయనగర భాగాలపై దండెత్తారు. రెండేళ్ళ పాటు జరిగిన ఈ యుద్ధాల్లో, చివరకు కృష్ణరాయలకే విజయం లభించింది. సామ్రాజ్యంలో శాంతి సమకూరినప్పటికి, వారసత్వ సమస్య కృష్ణరాయలను కలత పెట్టింది. చివరకు వెనుగొండలో బందీగా ఉన్న తన సవతి తల్లి కుమారుడు అచ్యుతరాయలను తన వారసుడిగా నియమించి, 1529లో మరణించాడు.

కృష్ణదేవరాయలు విజయనగర ప్రభువుల్లో అగ్రగణ్యుడు. గొప్ప పరిపాలనాదక్షుడు. కృష్ణరాయలు ఆదర్శవంతమైన, క్రమబద్ధమైన ప్రభుత్వ యంత్రాంగాన్నేర్పర్చి, ప్రజా క్షేమాన్ని పెంపొందించి, ఉదార పాలకుడిగా ప్రశంసలందుకున్నాడు. పోర్చుగీస్ ఇంజనీర్ల సహాయంతో చెరువులను, కాలువలను, త్రవ్వించి, నీటిపారుదల సౌకర్యాలను పెంపొందించి, వ్యవసాయాన్ని అభివృద్ధిపర్చాడు. దేశీయ, విదేశీయ వాణిజ్య సంబంధాలను పెంపొందించి, ఆర్థికాభివృద్ధికి కృషి చేశాడు. సాహిత్య, కళా రంగాల్లో కృష్ణరాయల సేవ అపారం. సాహితీ సమరాంగణ సార్వభౌముడు, సంస్కృతాంధ్ర భాషల్లో అసమాన ప్రతిభ గలవాడు. తెలుగులో "ఆముక్తమాల్యద"నే మహా కావ్యాన్ని రచించి, ఆంధ్ర భాషను పోషించి, "ఆంధ్ర భోజుడని' కీర్తి గడించాడు. అష్టదిగ్గజ కవులను పోషించి, ఉత్తమ కావ్య రచన చేయించాడు. రాజధాని లోను, రాజ్యం లోనూ అతడు కట్టించిన భవనాలు, అతడు నిర్మించిన గోపుర, మండపాలు, అతని దైవ భక్తి, వాస్తు నిర్మాణాన్ని రుజువు చేస్తాయి. పోర్చుగీస్ యాత్రికుడైన డామింగో పేస్ కృష్ణరాయల వ్యక్తిత్వం గురించి రాస్తూ, "కృష్ణరాయలు అంత పొట్టి, పొడగరి కాదని, అతని ముఖంలో స్ఫోటక మచ్చలున్నాయని, సుందరరూపని, ఉల్లాసవంతుడని, విదేశీయుల పట్ల దయతో, మర్యాదతో వ్యవహరించేవాడని, ఆకస్మిక ఆగ్రహాన్ని కనపర్చేవాడని, కాని ధర్మాత్ముడని, అతడంటే భారతదేశం లోని పాలకులందరికీ భయమని" వర్ణించాడు.

17.5 : సంగ్రహంగా

సంగమ వంశంలో చివరి రాజులు బలహీనులవడం వలన, విజయనగర సామ్రాజ్యం పతనమయ్యే పరిస్థితి ఏర్పడినప్పుడు, సాళువ నరసింహుడు విజయనగర సింహాసనాన్ని ఆక్రమించి, విజయనగరాన్ని అంతఃకలహాల నుండి, విదేశీ దాడుల నుండి రక్షించాడు. అతని తర్వాత అతని సైన్యాధిపత్యాన

BRAOU

తుళువ నరసనాయకుడు తుళువ వంశాన్ని స్థాపించాడు. ఈ వంశస్థుల్లో కృష్ణదేవరాయలు ప్రముఖ రాజు. ఇతని పాలనలో విజయనగర సామ్రాజ్యం నలు దిశలా వ్యాపించి, ఎంతో ఆర్థిక ప్రగతిని సాధించి, సాంస్కృతిక రంగంలో స్వర్ణ యుగాన్ని సృష్టించింది.

17.6 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. కృష్ణదేవరాయల సైనిక విజయాలను సమీక్షించండి.
2. విజయనగర చరిత్రలో కృష్ణదేవరాయల పాలనా కాలం స్వర్ణ యుగంగా ఎందుకు పరిగణింప బడింది?
3. కృష్ణదేవరాయలు, బహమనీ సుల్తాన్‌లకు గల సంబంధాలను విశ్లేషించండి.

II. క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.

1. సాళువ దురాక్రమణ.
2. సాళువ నరసింహుడు
3. తుళువ దురాక్రమణ
4. వీరనరసింహరాయలు
5. కృష్ణదేవరాయలు-గజపతులు

BRAOU

17.7 : ఉపయుక్త గ్రంథాలు

Aiyangar, S.K. & Ranga Swamy Saraswati, A. : **Sources of Vijayanagara History** (Madras, 1919)

Neelakanta Sastry & Venkataramanayya, N. : **Further Sources of Vijayanagara History** (Madras, 1946)

Ramachandrayya, O : **Krishna Devaraya of Vijayanagara,** (Waltair, 1953)

Rama Sarma, M.H. : **The History of the Vijayanagara Empire,** (Bombay 1978)

Sewell, Robert : **A Forgotten Empire** (New Delhi, 1982)

Sherwani H.K. & Joshi P. : **History of Medieval Deccan, Volume I** (Hyderabad 1973)

నేలటూరు వెంకటరమణయ్య : విజయనగర చరిత్ర, ప్రథమ సంపుటం

" : కృష్ణదేవరాయలు

తెలుగు విజ్ఞాన సర్వస్వం : మూడో సంపుటి (తెలుగు భాషా సమితి, 1983)

డా. కె. యన్. కామేశ్వర రావ్ : విజయనగర సామ్రాజ్యం, తెలుగు అకాడమి (హైద్రాబాద్, 1970)

రచయిత : డా. పి. మురళీమోహన్

BRAOU

భాగం-18 : రామరాయల రాజ్య సంరక్షకత్వం : తళ్ళికోట యుద్ధం

విషయక్రమం

18.0 : లక్ష్యాలు

18.1 : పరిచయం

18.2 : కృష్ణదేవరాయల మరణానంతరం విజయనగర పరిస్థితులు

18.3 : అచ్యుతదేవరాయలు

- 18.3.1 : అచ్యుత రాయలు - రామరాయలు
- 18.3.2 : ఆదిల్‌షా దండయాత్ర
- 18.3.3 : అచ్యుతదేవరాయల చివరి రోజులు

18.4 : వెంకటపతిదేవరాయలు

18.5 : సలకరాజు తిరుమల రాజు

18.6 : సదాశివరాయలు

- 18.6.1 : రామరాయలు
- 18.6.2 : రామరాయలు - దక్కన్ సుల్తాన్‌లు
- 18.6.3 : మహమ్మదీయులతో యుద్ధం
- 18.6.4 : ఆదిల్‌షాకు విరుద్ధంగా కూటమి ఏర్పాటు
- 18.6.5 : పోర్చుగీస్‌లతో ఒప్పందం
- 18.6.6 : దక్షిణ దేశ దండయాత్ర
- 18.6.7 : రామరాయలు - ఇబ్రహీం ఆదిల్‌షా
- 18.6.8 : రామరాయలు - నిజాంషా
- 18.6.9 : ఆదిల్‌షాతో యుద్ధం
- 18.6.10 : ఇబ్రహీం కుతుబ్‌షాను గోల్కొండ సింహాసనంపై ప్రతిష్ఠించుట
- 18.6.11 : కుతుబ్‌షాతో యుద్ధం
- 18.6.12 : బన్నిహట్టి యుద్ధం
  - 18.6.12.1 : బన్నిహట్టి యుద్ధానికి కారణాలు
  - 18.6.12.2 : యుద్ధం జరిగిన ప్రదేశం

BRAOU

18.6.12.3 : పాల్గొన్న సుల్తాన్‌లు

18.6.12.4 : యుద్ధం

18.6.12.5 : ఫలితాలు

18.6.13 : రామరాయల గుణగణాలు

18.7 : సంగ్రహంగా

18.8 : పరీక్ష నమూనా ప్రశ్నలు

18.9 : ఉపయుక్త గ్రంథాలు

18.0 : లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం ద్వారా, కృష్ణదేవరాయల తర్వాతి పరిస్థితులు, అచ్యుతదేవరాయల పాలన, సదాశివ రాయలు, అతని సంరక్షకుడిగా అళియ రామరాయలు సాధించిన విజయాలు, విజయనగర, దక్కన్, సుల్తాన్‌ల మధ్య గల సంబంధాలు, బన్నిహట్టి, లేదా రాక్షసతంగడి యుద్ధం, దాని ఫలితాలను గూర్చి తెలుసుకోగల్గాలి.

18.1 : పరిచయం

కృష్ణదేవరాయల మరణంతో విజయనగర చరిత్రలో ఒక శకం ముగిసింది. అతని మరణం తర్వాత, ఆనాటి కాలం లోనే, విజయనగర అంతఃకలహాల్లోనే క్షీణించే పరిస్థితి ఏర్పడింది. కాని, సదాశివరాయల సంరక్షకునిగా అళియ రామరాయలు, విజయనగర చరిత్రలో ప్రముఖ పాత్ర వహించాడు. దక్కన్ సుల్తాన్‌లను అదుపులో ఉంచి, వారి మధ్య విభజించు పాలించు విధానాన్ని అనుసరించి, విజయనగ రాన్ని వారి బారి నుండి రక్షించాడు. అతని ఆధ్వర్యంలో విజయనగర అధికార వైభవాలు తారా స్థాయికి చేరుకున్నాయి. పెరుగుట విరుగుట కొరకే అన్నట్లుగా, విజయనగర వైభవానికి కన్నుకుట్టి, మహమ్మదీయ సుల్తాన్‌లు వారి మధ్యనున్న విభేదాలను మర్చి, కూటమిగా ఏర్పడి, విజయనగరంపై దండెత్తి, బన్నిహట్టి యుద్ధంలో విజయనగర సైన్యాన్ని ఘోరంగా ఓడించి, విజయనగర పట్టణాన్ని ధ్వంసం చేశారు.

18.2 : కృష్ణదేవరాయల మరణానంతరం విజయనగర పరిస్థితులు

ఇంతకు ముందు భాగంలో పేర్కొన్నట్లు, శ్రీకృష్ణదేవరాయలు 1524లో తన ఆరేండ్ల కొడుకు తిరుమల రాయలకు పట్టాభిషేకం చేశాడు. అతడు పట్టాభిషేకం జరిగిన కొద్ది రోజులకే మరణించాడు. తిమ్మరుసు విష ప్రయోగం చేశాడని, అందువల్లే అతడు మరణించాడని, న్యూనిజ్ వ్రాశాడు. ఇది అసత్యమని చాలామంది చరిత్రకారులు దీనిని త్రోసిపుచ్చారు. కాని, వెంకటరమణయ్యగారు, 1524 తర్వాత తిరుమల దేవరాయల శాసనాలు కనబడవని, 1524 తర్వాత తిమ్మరుసు గాని, అతని బంధువులు గాని, ప్రస్తావన శాసనాలలో కనబడరని, అందువల్ల రాజకీయ రంగం నుండి వారు తొలగిపోయారని, న్యూనిజ్ చెప్పినట్లు కొండమరుసయ్య కొడుకు అయ్య పరుసయ్య ప్రధాన మంత్రి అయ్యాడని, అందుచేత న్యూనిజ్ వ్రాత అసత్యమని త్రోసిపుచ్చలేమని వ్రాశాడు. వెనుగొండ

BRAOU

సైఫియత్, కృష్ణరాయలకు వారసులు లేరని, అతని మరణం తర్వాత రామరాయలు రాజయ్యాడని పేర్కొంటుంది. పేరు తెలియని గోల్కొండ చిత్రకారుడు కొంత కాలం తర్వాత కృష్ణరాయలు మరణించాడని, సింహాసనానికి వారసుడు అడ్డాలలో బిడ్డ యని, అందువల్ల రామరాజు మొదట సంరక్షకుడై, తర్వాత సింహాసనాన్ని ఆక్రమించాడని వ్రాశాడు. ఈ విషయం పై రఫీ ఉద్దీన్ షిరాజీజ్, రామరాజు హిజ్రా శకం 1942 లో విజయనగర రాజై, కృష్ణదేవరాయల కొడుకు వేర రెండు సంవత్సరాలు రాజ్యం చేశాడనే రాశాడు. క్యూరోజ్, కృష్ణదేవరాయలు తన చివరి రోజుల్లో తన అల్లునికి పరిపాలనా బాధ్యత, అతని తమ్ముడు తిరుమలకు సైన్యాధిపత్యాన్నిచ్చాడని రాశాడు.

పైన పేర్కొన్న ఆధారాలు రెండు, వేరొక చోట కృష్ణదేవరాయల తర్వాత అచ్యుత దేవరాయలు రాజ్యానికి వచ్చాడని పేర్కొన్నాయి. వెనుగొండ సైఫియత్, కృష్ణదేవరాయలు మరణించే ముందు రామరాయలను యువరాజుగా కొనసాగుతూ, అతడు నిర్ణయం చేసిన వారసుడు అచ్యుతరాయలకు పరిపాలనలో సహాయపడమని ఆదేశించినట్లు చెబుతూంది. దాన్ని ధృవపరుస్తూ క్యూరోజ్, కృష్ణదే వరాయలు తన అల్లుణ్ణి అచ్యుత రాయలకు అధికారాన్ని అప్పగించమని, అతనితో కలిసి పరిపాలన నిర్వహించమని ఆదేశించినట్లు వ్రాశాడు. ఈ విషయంపై న్యూనిజ్ వ్రాస్తూ, కృష్ణదేవరాయలు జబ్బుపడి మరణం దగ్గర పడిందని భావించి, తన కొడుకు 18 మాసాల వయసు కలచాడవడం వలన రాజ్యానికి అనర్హుడని భావించి, విల్లు రాశాడని, అందులో తన తర్వాత తన సోదరుల్లో సమర్థుడైన అచ్యుతరాయలు సింహాసనానికి రావాలని, చంద్రగిరిలో అతడు బందీగా ఉండడం వల్ల, అతడు వచ్చే వరకు సాళువ నాయకునికి బాధ్యత అప్పగించాడని వ్రాశాడు.

అచ్యుత రాయలు చంద్రగిరి నుండి విజయనగరానికి వచ్చే లోపల, రామరాయలు, కృష్ణరాయల 18 మాసాల కొడుకుని సింహాసనం పై కూర్చుండబెట్టి, అతని రక్షకుడిగా పాలనా బాధ్యతలను నిర్వహించాడు. రామరాయల ఉద్దేశాలకు భయపడిన అచ్యుత రాయలు, ముందు తిరుమల లోను, తర్వాత కాళహస్తి లోను పట్టాభిషేకం చేసుకొని, విజయనగరానికి బయలుదేరాడు. ఈ లోగా ప్రతాపరుద్రగజపతి, గోల్కొండ కుతుబ్ షా, విజయనగరంపై దండెత్తారని వార్త తెలిసి, విజయనగర ప్రయాణం మాని, శత్రువులను ఎదుర్కొనడానికి కొండవీడు ప్రాంతానికి చేరాడు. అక్కడ జరిగిన యుద్ధంలో శత్రువులు ఓడి, గజపతి కృష్ణను దాటి, తన రాజ్యానికి, అల్లే కుతుబ్ షా కూడా గోల్కొండ దారి పట్టాడు. శత్రువులను తరిమివేసి, అచ్యుతరాయలు విజయనగరం చేరాడు.

18.3 : అచ్యుత దేవరాయలు (క్రీ.శ. 1529-1542)

విజయనగరం చేరిన అచ్యుతదేవరాయలు, రామరాయలతో వైరం కారణంగా రాజ్యంలో సంక్షోభం కలగడం మంచిది కాదని, రామరాయలతో అంగీకారానికి వచ్చాడు. అచ్యుతదేవరాయలతోపాటు కృష్ణ దేవరాయల 18 మాసాల కుమారుడు కూడా సామ్రాజ్యాధిపత్యంలో భాగస్వామి కావలెనని, అతని రక్షకుడిగా రామరాయలు కార్యకర్తగా రాజకార్యాలను నిర్వహించవలెనని కూడా నిర్ణయమైంది. ఈ అంగీకారం వల్ల, అంతవరకు సర్వాధికారిగా ఉండి, సింహాసనాన్ని శత్రువునుండి కాపాడిన సాళువ నరసింహరాయ నాయకుడనే చెల్లప్ప, కోపగించి, ద్రావిడ దేశానికి పోయి, తిరుగుబాటు చేశాడు. అతడు వీరనరసింహరాయల కాలం నుండి, ద్రావిడ దేశానికే అధిపతిగా ఉండేవాడు. రాజధానిలో జరిగిన మార్పుకు అసంతృప్తి చెంది, తిరువడి తుంబిచ్చి నాయకుడు మొదలైన వారిని కలుపుకొని, తిరుగుబాటు చేశాడు. దీనిని అవకాశంగా, ఉమ్మత్తూరు పాలెగాండ్రు కూడా స్వాతంత్ర్యాన్ని

BRAOU

ప్రకటించుకోవడానికి ప్రయత్నించారు. అల్లీ, ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్ కృష్ణ-తుంగభద్ర అంతర్వేదిపై దండెత్తి, రాయచూర్ దుర్గాన్ని ఆక్రమించాడు.

అచ్యుతదేవరాయలు మొదట సాళువ నరసింగనాయకుని తిరుగుబాటును అణచడానికి, పెద్ద సైన్యంతో బయల్దేరాడు. ఈ యుద్ధ వివరాలు అంతగా తెలియడం లేదు. రాయల సైన్యానికి అతని బావమరిది సలకరాజు చిన తిరుమలరాజు నాయకత్వం వహించాడు. సాళువ నాయకుడు కేరళకు పారిపోయి, అక్కడ మిత్రుడైన తిరువడిని కలుసుకొని, పెంకాశిపై దండెత్తి, పాండ్య రాజును తొలగించాడు. అచ్యుతరాయలు కుటుంబంతో కంచి, తిరువణ్ణామలై మీదుగా పయనించి, తిరువడిని, నరసింగనాయకుని పట్టిచ్చి, అనేక కానుకలను సమర్పించాడు. అచ్యుతరాయలు పాండ్య రాజు కూతురిని వివాహమాడి, అతనిని తిరిగి తన రాజ్యంలో పునఃప్రతిష్ఠించాడు. అక్కడి నుండి కావేరి తీరం గుండా ఉమ్మత్తూర్ చేరి, అక్కడ పాలెగాండ్రనణచి, వారి వద్ద కప్పం వసూలు చేసి, విజయనగరానికి చేరాడు.

18.3.1 : అచ్యుతరాయలు - రామరాయలు

అచ్యుతరాయలు దక్షిణ దండయాత్రలో నుండగా, కేంద్రం లోని పరిస్థితుల్లో కొన్ని మార్పులొచ్చాయి. రామరాయలు రక్షకుడిగా ఉన్న కృష్ణదేవరాయల కుమారుడు 1533 లో మరణించాడు. ఈ మరణంతో, అచ్యుతరాయలతో సమానంగా రాజ్య భారం వహిస్తున్న రామరాయల బలం సన్నగిల్లింది. ఇపుడు అచ్యుతరాయలు అతనికే లోబడి ప్రవర్తించాల్సిన అవసరం పోయింది. 1535 ఫిబ్రవరి 7 నాటి శాసన మొకటి, రామరాయలు రాజుతో కలసి రాజ్య భారం వహిస్తున్నట్లు పేర్కొంది. అచ్యుతరాయలు విదేశ దండయాత్రను ఎదుర్కోవడం లోను, తిరుగుబాట్లను అణచడం లోను, నిమగ్నుడై ఉండటం వల్ల, 1535 వరకు రామరాయల అధికారం కేంద్రంలో కొనసాగుండొచ్చు. రామరాయల ఆధిపత్యాన్ని తగ్గించడానికి, అచ్యుతరాయలు తన బావమరదులైన సలకరాజు పుత్రులు, పెద, చిన తిరుమల రాజులకు రాజ్య పాలన నప్పగించాడు. 1534లో పెద తిరుమల రాయలను ప్రధానిగా చేశాడు. తర్వాత కొద్ది కాలానికే అతన్ని సర్వాధికారి ప్రధానిగా చేశాడు. చిన తిరుమలను కోశాధికారిగా నియమించి, సైన్యాధిపతిగా కూడా నియమించాడు. ఈ విధంగా అచ్యుతరాయలు రామరాయలను లెక్క చేయక, అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి ప్రయత్నించాడు.

కేంద్రంలో పరిస్థితులీవిధంగా మారడంతో, రామరాయలు తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి, ప్రయత్నాలను ప్రారంభించాడు. కొద్ది కాలం లోనే ఇతనికి మంచి అవకాశం లభించింది. 1534లో బిజాపూర్ పాలకుడైన ఇస్మాయిల్ ఆదిల్‌షా మరణించి, అతని పెద్ద కొడుకైన మల్లు ఆదిల్‌షా సింహాసనాన్ని ఎక్కాడు. కాని, అతని తమ్ముడు ఇబ్రహీం తగాదాకు దిగాడు. దీన్ని అవకాశంగా, అచ్యుతదేవరాయలు కృష్ణదేవరాయల మరణానంతరం కోల్పోయిన రాయచూర్‌ను ఆక్రమించడానికి బిజాపూర్‌పై దండెత్తాడు. ఈ వార్త తెలిసిన మల్లు, సైన్యంతో కృష్ణ ఒడ్డుకు చేరి, అచ్యుతరాయల నెదుర్కొన్నాడు. అక్కడ జరిగిన యుద్ధంలో మల్లు ఓడిపోయి, రాయచూర్ దుర్గాన్ని స్వాధీనం చేసి, సంది చేసుకొన్నాడు. అచ్యుతరాయలు విజయాన్ని సాధించి, విజయనగరం చేరినప్పటికీ, మళ్ళీ వెంటనే రాజధాని వదలి వెళ్ళాల్సొచ్చింది. 1536లో గుత్తి దుర్గాధిపతి రాయలపై తిరుగుబాటు చేశాడు. అతనిని అణచడానికి అచ్యుతరాయలు అమరనాయక సేనాధిపతులతో గుత్తిపై దండెత్తి, దుర్గాధిపతిని ఓడించి, 1537 లో వెంకటేశ్వరుని దర్శించడానికి తిరుపతి చేరాడు.

BRAOU

అచ్యుతరాయలు రాజధానిలో లేని సమయంలో, రామరాయలు అధికారాన్ని పటిష్టం చేసుకోవడానికి ప్రయత్నించాడు. అచ్యుతరాయలు తిరుమల నుండి వచ్చిన తర్వాత రాజధానిలో ఏం జరిగిందో స్పష్టంగా చెప్పలేం. మహమ్మదీయ చరిత్రకారులు ఈ విషయాన్ని ప్రస్తావించారు. కాని, వారి రచనలు పూర్తిగా నమ్మదగినవి కావు. వారు రామరాయలను ద్వేషించినంతగా ఏ ఇతర విజయనగరరాజును ద్వేషించలేదు. అచ్యుతరాయలు రాజధానిలో లేని సమయంలో, పాత ఉద్యోగులందరిని రామరాయలు తొలగించి, తన బంధువులను నియమించాడని రాశారు. కాని, ఇది నమ్మదగిన విషయం కాదు. హుండే అనంతపూర్ కైఫియత్, కృష్ణదేవరాయల దేవేరులైన తిరుమలదేవి, చిన్నాదేవి, రామరాయలకు పట్టం కట్టడానికి తలపెట్టారని, కానీ సుంకం తిమ్మయ్య ప్రతిఘటన వలన ఇది సాధ్యపడలేదని, అందువలన రామరాయలు తన సోదరులతో వెనుగొండ పోవాల్సొచ్చిందని పేర్కొంది. రామరాజ భూషణుడు కూడా పట్టాభిషేకం గురించి ప్రస్తావించాడు. ఫెరిష్టా, రామరాజు తానే రాయలై, తన వేర రాజ్యం చేయ తలపెట్టాడనీ, కాని సామంతుల ప్రతిఘటన వలన, అది కొనసాగలేదని రాశాడు. పట్టాభిషేక ప్రయత్నం విఫలమవడంతో, రామరాయలు అచ్యుతరాయల అన్న రంగరాయల కుమారుడైన సదాశివరాయలను రాజుగా ప్రకటించి, అచ్యుతరాయలను బందించి, రాజ్య భారం వహించాడు. కాని, దీని నంగీకరించని అనేక సామంతులు తిరుగుబాటు చేశారు. కేంద్రంలో తన ప్రతినిధిని ఒకరిని ఉంచి, రామరాయలు తిరుగుబాట్లను అణచడానికి దక్షిణ దేశానికి వెళ్ళాడని, అక్కడ తిరుగుబాట్లను అణచడానికి ఎక్కువ కాలం పట్టిందని, ధనం అవసరమైతే తన ప్రతినిధికి కబురు పంపాడనీ, అతడు బొక్కసం తెరచి, అందులోని సంపదను చూచి, కన్నుకుట్టి అచ్యుతరాయలను విడుదల చేసి, తానే అచ్యుతరాయలకు మంత్రిగా ఉన్నాడని, అచ్యుతరాయల బావమరిది అతణ్ణి వధించి, అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడని, ఫెరిష్టా రాశాడు. రామరాయలు తన శత్రువులతో సంధి చేసుకొని, విజయనగరానికి బయలుదేరాడు. కాని, ఈ లోగా అచ్యుతరాయలు విడుదలై, స్వయంగా రాజ్యాధికారాన్ని నిర్వహిస్తున్నాడని తెలిసి, నాయకులనేక మంది రామరాయలను వదిలి, అచ్యుతరాయల పక్షం చేరారు.

18.3.2 : ఆదిల్‌షా దండయాత్ర

విజయనగరం లోని పరిస్థితులను అవకాశంగా తీసుకొని, ఇబ్రహీం ఆదిల్‌షా విజయనగరంపై దండెత్తాడు. అతన్ని ఎదుర్కోవడానికి సామర్థ్యమున్నా, అచ్యుతరాయలు ఆదిల్‌షా, రామరాయలు ఏకమౌతారేమోనని, భయపడి ఊరుకొన్నాడు. అట్లే, రామరాయలు కూడా, అచ్యుతరాయలు, ఆదిల్‌షా ఏకమౌతారేమోనని భయపడి, ఆదిల్‌షాను ఎదుర్కొనలేదు. ఆదిల్‌షా ప్రధాని అసద్‌ఖాన్‌లారీ కుతంత్రం వల్ల, ముట్టడి కొనసాగలేదు. అసద్‌ఖాన్ ప్రోత్సాహంతో, నిజామ్ బిజాపూర్‌పై దండెత్తాడు; పైగా, రామరాయలను ఆదిల్‌షా పై దండెత్తమని ప్రోత్సహించాడు. అసద్‌ఖాన్ కుట్ర ఆదిల్‌షాకు తెలిసి, ఆపద శంకించి, అచ్యుతరాయలకు, రామరాయలకు సంది కుదిర్చి, వెనక్కి మరలాడు. ఈ సంధి ప్రకారం, రామరాయల పాలన క్రిందున్న ప్రాంతాలు తప్ప, మిగిలిన రాజ్యానికి అచ్యుతరాయలు అధిపతి. రామరాయల అధికారంలో ఉన్నవాటిని రామరాయలు స్వతంత్రంగా పాలించుకోవచ్చు. ఈ విధంగా రాజ్యంలో శాంతి కుదిరింది.

18.3.3 : అచ్యుతదేవరాయల చివరి రోజులు

అచ్యుతరాయలు చివరి రోజుల్లో స్త్రీలోలుడయ్యాడని, పరిపాలన ప్రజాకంటకంగా తయారైందని, న్యూనిజ్ వ్రాశాడు. అతడు రాజ్య వ్యవహారాలను తన బావమరుదులైన సలకరాజు సోదరులకు అప్పగించాడు. సమకాలీన రచనలు వారిని దుష్టులుగా పేర్కొంటున్నాయి. ఈ సమయంలో విజయ

BRAOU

ఈ సంఘటన విజయనగరి సామ్రాజ్యంలో కలవరాన్ని లేపింది. ఈ వార్త తెలిసిన రామరాయలు, యుక్తి పన్ని, తాము చేసినది తప్పని, తిరుగుబాటు చేసినందుకు చింతిస్తున్నామని, తమను క్షమించమని, ఇంకెప్పుడు ఇటువంటి తప్పచేయమని, తురకలను రాజ్యంలో పెట్టుకోవడం, రాజ్యానికి, జాతికి ముప్పు కలుగుతుందని, లేఖలు వ్రాసి పంపాడు. తిరుమల రాయలు వారి మాటలు నమ్మి, ఆదిల్‌షాకు యాభై లక్షల హన్నులు సమర్పించి, అతన్ని సైన్యంతో తన రాజ్యానికి మరలిపొమ్మని కోరాడు. అతడిచ్చిన ధనం, బహుమతులతో సంతృప్తిచెంది, ఆదిల్‌షా తన సైన్యంతో బిజాపూర్‌కు మరలిపోయాడు. ఈ వార్త తెలిసిన వెంటనే రామరాజు, అతని అనుచరులు విజయనగరంపై దండెత్తారు. ఫెరిష్టా వ్రాసిన ప్రకారం, తిరుమలరాయల సహచరులందరు శత్రుపక్షం చేరారని తెలిసి, రాచనగర్ లోనికి ప్రవేశించి, తలుపుమూసుకుని పిచ్చివాడై, ఏనుగులు, గుర్రాలు శత్రువులకు ఉపయోగపడకుండా కళ్ళు పొడిపించి, తోకలను నరికించి, కోశాగారం లోని వజ్ర వైడూర్యాలను తిరగళ్ళతో పిసిరించి, ఆ పిండిని నేలపై చల్లించి, భవనం లోని ఒక స్తంభానికి కత్తి కట్టి, పరుగెత్తుతూ వచ్చి ఆ కత్తి గుండెల నుండి పీపు పైకి వచ్చునట్లు పొడుచుకొని మరణించాడు. అప్పుడు శత్రువులు కోట తలుపు తెరిపించి, లోపలకు ప్రవేశించారు. ఈ ఫెరిష్టా కథ నమ్మదగింది కాదు. దోనేరు కోనేరు నాథకవి, రామరాజు భూషణుడు, మూర్తి కవి, మొదలగు తెలుగు కవులు తిరుమలరాయలు యుద్ధంలో రామరాయల చేత వధింపబడినట్లు వేర్కొన్నారు. దీన్నిబట్టి ఫెరిష్టా చెప్పినట్లు, పిచ్చివాడై ఆత్మ హత్య చేసుకోలేదని, క్షత్రియుని పలె చివరి వరకు యుద్ధం చేశాడని భావించాలి. తుంగభద్రా నదీ తీరంలో తిరుమలరాయలు శత్రు సైన్యాలను ఎదుర్కొన్నాడు. తిరుమలరాయల పతనమాసన్నమైందని తెలిసి, అతని సహచరులు రామరాజు పక్షం వహించారు. ఈ పరిస్థితుల్లో శత్రువుతో పోగాడలేక, యుద్ధ రంగం నుండి పారిపోవడానికి ప్రయత్నించాడు. కాని, రామరాజు సేనాధిపతులు అతన్ని పట్టుకుని, శిరచ్ఛేదం చేశారు. దీనితో, తిరుమల రాయల చరిత్ర ముగిసింది.

18.6 : సదాశివరాయలు (1543-1570)

తిరుమలరాయలపై విజయాన్ని సాధించి, రామరాయలు సదాశివరాయల తోను, బంధుమిత్రుల తోను, కార్తీక శుద్ధ 11 శోభకృత్ వామ సంవత్సరంలో (శక 1465) విజయనగరంలో ప్రవేశించి, సదాశివరాయలను వజ్ర సింహాసనంపై ఆనందోత్సాహాల మధ్య పట్టాభిషిక్తుడ్ని చేశాడు. సదాశివరాయలు ఏ తేదీన పట్టాభిషిక్తుడైనాడో చెప్పడం కష్టం. 1542 జూలై శాసనంలో సదాశివరాయలు "వీరప్రతాపకరాల సాళువ వీర సదాశివరాయ మహారాయ" బిరుదును వహించడం వల్ల, కొందరు చరిత్రకారులు సదాశివరాయలు 1542లో పట్టాభిషిక్తుడైనాడని భావించాడు. దానిని అంగీకరిస్తే, సదాశివరాయలు రెండు సార్లు పట్టాభిషేకం చేసుకున్నట్లు కనిపిస్తోంది. కొరియా ఆధారంగా హీరాస్ పండితుడు సదాశివరాయలు మొదట తిరుపతిలో పట్టాభిషిక్తుడయ్యాడని భావించారు. పై శాసన ఆధారంగా, 27 జులై 1542 కు ముందే రామరాయలు సదాశివరాయలును రాజుగా ప్రకటించి ఉండాలి. తిరిగి విజయనగరంలో అతని పట్టాభిషేకం 1543 లో జరిగుండాలి. విజయనగర శాసనాలు సదాశివరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని ఏకచత్రాధిపత్యంగా పాలించినట్లు తెలుపుతున్నాయి. కానీ, సదాశివరాయల పేరిట రామరాయలే రాజ్యభారాన్ని వహించాడు. సదాశివరాయలు రాజ్యమేలినంత కాలం, రామరాయలు, అతని సోదరులు, తిరుమల వెంకటాద్రుల వారి దాయాదులైన సంధ్యాల, అవుకు వారి సహాయంతో, విజయనగర పాలనను నిర్వహించాడు.

BRAOU

18.6.1 : రామరాయలు

కృష్ణదేవరాయల అల్లుడుగా, సదాశివరాయల కార్యకర్తగా, విజయనగర చరిత్రలో ప్రముఖ పాత్ర వహించిన అళియ (అల్లుడు) రామరాయలు, ఆరవీటి వంశస్థుడు. ఆరవీటి వంశం విజయనగర చరిత్రలో ప్రముఖ పాత్ర వహించింది. 'రామరాజీయం' మొదలైన గ్రంథాల్లో, వీర హెమ్మాళి రాయల నుండి వీరి వంశం ప్రస్తావించబడింది. శాసనాలు వీరిని క్షత్రియులుగానూ, ఆత్రేయ గోత్రులు గాను వర్ణించాయి. వీర హెమ్మాళి రాయల రాజధాని మాయపురం, లేదా గంగాపురం. వెలమ నాయకులైన అనపూత మాదయ్యలతో జరిగిన ఇనుగుర్తి యుద్ధంలో, హెమ్మాళి రాయలు, అతని కుమారుల్లో నాలుగవ వాడైన తాత పిన్నమ తప్ప, మిగిలినవారు మరణించారు. తాత పిన్నమ అనమదుంలో కర్నూల్ సీమలో చెరకు రాచనరేంద్రుని ఓడించి, అధికార స్థాపనకు ప్రయత్నిస్తున్నాడు. తాత పిన్నమకు ఇద్దరు కుమారులు. మొదటి భార్యకు జన్మించినవాడు, కోటికంటి రాఘవుడు. ఇతడు కందనోలు నాడు (కర్నూలు సీమ) లోకి ప్రవేశించడం వల్ల, కంపిలి రాయలుతో తలపడాల్సొచ్చింది. తాత పిన్నమ, అతని కుమారుడు, ఎవరికైనా సామంతులుగా ఈ విజయాలను సాధించారా, లేక స్వతంత్రంగా సాధించారనేది చెప్పడం కష్టం. సార్వభౌముల ప్రస్తావన లేకపోవడం వలన వీరు ఈ దండయాత్రలను తమ రాజ్య వ్యాప్తి కొరకే చేశారని, భావించాల్సొచ్చింది. ఓరుగల్లు ప్రతాపరుద్రునితో, హోయసల రాజుల తోను చేసిన యుద్ధాల వలన బలహీనపడిన కంపిలి రాయలను ఓడించి, కోటికంటి రాఘవుడు గండరశూలి బిరుదం వహించాడు. తుగ్లక్ దండయాత్రల వలన, కంపిలి రాయలు రాఘవుణ్ణి శిక్షించలేకపోయాడు. తుగ్లక్ కంపిలి రాయల నోడించి, మల్లిక్ మగ్బూల్‌ను ఆ ప్రాంతానికి గవర్నర్‌గా నియమించాడు. మొదటి భాగంలో ప్రస్తావించినట్లు, ఈ ప్రాంత ప్రజలు మహమ్మదీయ పాలనను అంగీకరించలేకపోయారు. తీరాంధ్రం లోను, మధ్యాంధ్రం లోనూ, ప్రోలయ, కావయ నాయకుల నాయకత్వంలో, మహమ్మదీయ పాలనకు విరుద్ధంగా తిరుగుబాట్లు ప్రారంభమైనాయి. తాత పిన్నమ రెండవ కుమారుడైన సోమదేవుడు తుంగభద్రా నదికి దక్షిణం గాను, రాయచూర్ అంతర్వేది ప్రాంతం లోని ముసలిమడుగు, పాణగల్లు, కందనవోలు, కలవకొలను, రాయచూర్, యాతగిరి, గంగసేనికొండ దుర్గాలను ఒకే రోజులో సాధించాడు. 'ద్విపదబాల భాగవతం', "రామరాజీయం" తర్వాతి కాలం నాటి శాసనాలు, సోమదేవుడు సాధించిన ఇతర విజయాలను వర్ణించాయి. ముదుగల్లు, ఆకులపాడు, ఆనెగొంది, కుంతి, శార యుద్ధ రంగాల్లో శత్రువులను జయించాడు. ఈ ప్రాంతంలో తుగ్లక్ గవర్నర్‌గా ఉన్న మల్లిక్‌ను ఓడించాడు. కర్నూల్ జిల్లా లోని 'ఆరవీడు', వీరి రాజధానైంది. అప్పటినుండి వీరిని ఆరవీటి వంశస్థులుగా పిలుస్తున్నారు.

సోమదేవుని కుమారుడు, రాఘవదేవుడు. ఇతడు "యవన బలవర్దనోత్సాహ", 'తుళువబల సంహారవిహార', 'శబరకులబలనిహోననవినోద' మొదలైన బిరుదులు వహించాడు. ఇతని కుమారుడు పిన్నభూపాలుడు. ఆరవీటి వంశస్థులు ఇప్పటి వరకు స్వతంత్ర పాలన చేసినప్పటికి, అనతి కాలం లోనే వీరు విజయనగర సామంతులైనారు. పిన్నభూపాలుడు అతని కుమారునికి 'బుక్క' పేరు పెట్టుకోవడం వలన, విజయనగర పాలకుడు మూడవ బుక్క (1422- 1430) కాలం నుండి, ఆరవీటి వంశస్థులు విజయనగర సామంతులై ఉండొచ్చు. పిన్నభూపాలుని కుమారుడు బుక్క. ఇతడు సాళువ, తుళువ వంశస్థులకు సమకాలికుడు. ఇతడు సాళువ నరసింహానకు మిత్రుడు గాను, సాళువనర్సింహరాయ స్థాపనాచార్యునిగాను వర్ణింపబడ్డాడు. కుమారధూర్జటి 'కృష్ణరాయ విజయం'లో, శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేకాన్ని దర్శించిన ప్రముఖుల్లో, బుక్కను కూడా పేర్కొన్నాడు.

BRAOU

బుక్క మొదటి భార్య కుమారులైన సింగ, మొదలగు వారు నంద్యాల ప్రాంతాన్ని పాలించాడు. రెండవ భార్య కుమారుడైన రామభూపాలుడు ఆరవీడును కేంద్రంగా పాలించాడు. ఇతడు హొల్లీ సుసేనున్ని, సవాయి సైన్యాన్ని, ఆదవాని దుర్గ నివాసి కాసవడయల్ని, సవాబిబ్బిని ఓడించినట్లు, గ్రంథాలు వర్ణించాయి. హొల్లీ సుసేనుణ్ణి యమునాపుర పాలకుడైన హుస్సేన్ షా గాను, సవాబిబ్బిని బిజాపూర్ పాలకుడు ఆదిల్ ఖాన్ గాను చరిత్రకారులు గుర్తించారు. వీరనర్సింహరాయల కాలంలో ఆదవాని దుర్గ పాలకుడు కాచప్పవడయలు తిరుగుబాటు చేసినపుడు, రామభూపాలుడు, అతని కొడుకు తిమ్మభూపాలుడు, అతన్ని ఓడించి, విజయనగర రాజుకు అప్పగించారు. రామభూపాలుని కుమారుల్లో శ్రీరంగరాజు, కర్ణాట రాజ్య పదస్థునిగా వర్ణింపబడ్డాడు. ఇతడు కృష్ణదేవరాయలకు సామంతునిగా, కందనవోలు సీమను పాలించాడు. శ్రీరంగరాజుకు కోన, తిమ్మ, రాము, తిరుమల, వెంకటాద్రి అను అయిదుగురు కొడుకులు. వీరితో రామరాజు సదాశివరాయల కార్యకర్తగా, మహామండలేశ్వరునిగా, రాజప్రతినిధిగా, విజయనగర చరిత్రలో ప్రముఖ పాత్ర వహించాడు. అతని సోదరులైన తిరుమల, వెంకటాద్రులు అతనికి అండగా నిల్చారు.

రామరాయల బాల్యం గురించిన వివరాలు లేవు. అతని తండ్రి శ్రీరంగరాజు విజయనగర కొలువులో మహామండలేశ్వరునిగా ఉండటంవల్ల, రామరాయల బాల్యం చాల వరకు విజయనగర రాజధానిలో గడిచుండొచ్చు. అక్కడే, అతడు రాజనీతి, యుద్ధ విద్యల్లో అభ్యాసాన్ని పొంది ఉండాలి. రామరాయలు వయసొచ్చిన తర్వాత, కృష్ణరాయల కొలువులో చేరి, అతని యుద్ధాల లోను, పరిపాలన లోను ప్రసిద్ధి పొందాడు. కానీ, పేరు తెలియని గోల్కొండ రచయిత, రామరాయలు మొదట్లో గోల్కొండ కొలువులో ఉన్నాడనీ, కొన్ని సరిహద్దు ప్రాంతాలకు పాలకునిగా నియమించబడ్డాడని, ఆ ప్రాంతాలను ఆదిల్ షా ముట్టడించినపుడు రామరాయలు ఆ దాడికి తట్టుకోలేక, గోల్కొండకు పారిపోయివచ్చినట్లు, అపుడు కుతుబ్ షా అతన్ని కొలువు నుండి పంపివేస్తే, విజయనగరానికి వచ్చి కృష్ణరాయల కొలువులో చేరినట్లు, కొంత కాలానికి కృష్ణరాయలకు అతనిపై మంచి అభిప్రాయం ఏర్పడి, తన కుమార్తెనిచ్చి వివాహం చేసినట్లు పేర్కొన్నాడు. ఈ కథ నమ్మశక్యం కానిది. కుతుబ్ షా 1512 లో స్వతంత్రతను ప్రకటించాడు. మార్కాపుర శాసనం, గ్రంధాలు, రామరాయలు 1513 నాటి కృష్ణరాయల కళింగ దిగ్విజయ యాత్రలో ప్రముఖ పాత్ర వహించినట్లు తెల్పుతున్నాయి. అతని తండ్రి విజయనగర కొలువులో ఉండగా, కొడుకు విజయనగరానికి శత్రువులైన మహమ్మదీయుల కొలువులో పనిచేశాడనడం, నమ్మశక్యం కానిది.

రామరాయలు, కృష్ణదేవరాయల ఆస్థానంలో ఉన్నట్లు, అతని కుమార్తె తిరుమలాంబను వివాహ మాడినట్లు, అనేక ఆధారాలు పేర్కొన్నాయి. పోర్చుగీస్ రచయిత, రామరాయలను కృష్ణదేవరాయల కొలువులో గొప్ప సైన్యాధికారిగా పేర్కొన్నాడు. పెనుగొండ కైపియత్ కృష్ణరాయలకు కుమారులు లేనందున, తన కుమార్తెనిచ్చి వివాహం చేసి, రామరాజును యువ రాజుగా నియమించినట్లు పేర్కొంది. శ్రీకృష్ణరాయల పాలనా కాలంలో రామరాయలు ప్రముఖ పాత్ర వహించాడనడంలో సందేహం లేదు. కృష్ణరాయల మరణానంతరం అచ్యుతరాయల పరిపాలనా కాలం లోను, సలకం తిరుమలను ఎదిరించి వధించడం లోను, సదాశివరాయలను విజయనగర సింహాసనంపై ప్రతిష్ఠించడం లోను, రామరాయలు నిర్వహించిన పాత్ర గురించి, ఇంతకు ముందే తెలుసుకున్నాం. సదాశివరాయలను సింహాసనంపై ప్రతిష్ఠించిన తర్వాత, అతని కార్యకర్తగా, మహామండలేశ్వరునిగా విజయనగర అధికారాన్ని విస్తరించడం లోను, సుల్తాన్‌లను అదుపులో ఉంచడం లోను గొప్ప రాజనీతిని ప్రదర్శించి, విజయనగర ఔన్నత్యానికి కారకుడైనాడు.

BRAOU

18.6.2 : రామరాయలు - దక్కన్ సుల్తాన్‌లు

రామరాయలు గొప్ప రాజనీతి దురంధరుడు. మహ్మదీయ వ్యాప్తిని అరికట్టి, హిందూ స్వాతంత్ర్య ధర్మ పునరుద్ధరణ కొరకే రాయ సంస్థాన ముత్పన్నమగుటవల్ల, మొదటి నుండి విజయనగర ప్రభువులకు, మహ్మదీయులకు సంబంధాలు తప్ప లేదు. రామరాయలకు ముందు విజయనగర రాజులు మహ్మదీయులతో స్నేహం చేసి, వారి రాజకీయాల్లో జోక్యం చేసుకోలేదు. కృష్ణదేవరాయల మరణం తర్వాత ఆదిల్‌షా బలవంతుడై, విజయనగర భూభాగాలను కొన్నిటిని ఆక్రమించడమేకాకుండా, అప్పుడప్పుడు విజయనగరంపై దండెత్తుతూనే వున్నాడు. అతణ్ణి అరికట్టి, అతడు ఆక్రమించిన రాష్ట్రాలను తిరిగి ఆక్రమించడానికి, ఆదిల్‌షాను శిక్షించడానికి, రామరాజు అహ్మద్‌నగర్‌తో మైత్రి చేసి, తన ఆశయాన్ని నెరవేర్చుకోవాలని తల్చాడు. నిరంతరం కలహించుకుంటున్న దక్కన్ సుల్తాన్ రాజ్యాలలో అవకాశం దొరికినప్పుడల్లా కలుగజేసుకున్నాడు. కొందరితో సఖ్యం చేసి, ఇతరులతో యుద్ధం చేశాడు. మొత్తం మీద దక్కన్ సుల్తాన్ లందరినీ ఓడించి, వారిపై ఆధిపత్యాన్ని సాధించి, విజయనగర అధికారాన్ని పెంచాడు. చివరకు విజయనగర అభ్యుదయానికి కన్నుకుట్టి, వారి మధ్య నున్న విభేదాలను మర్చి, సుల్తాన్‌లు ఏకమై, రామరాయల్ని వంచించి పడగొట్టారు.

18.6.3 : మహమ్మదీయులతో యుద్ధం (1542-43)

సలకం తిరుమలను వధించి, విజయనగర పట్టణంలో ప్రవేశించిన వెంటనే, తిరుమలకు సహాయంగా వచ్చిన మహ్మదీయులను తరమడానికి, సైన్యాన్ని పంపాడు. విజయనగర సైన్యాన్ని మూడు భాగాలుగా విభజించి, తను, తన సోదరులైన తిరుమల, వెంకట్రాదులు నాయకత్వం వహించారు. 'రామరాజీయం' ముగ్గురు సుల్తాన్‌లు నిజాంషా, కుతుబ్‌షా, ఆదిల్‌షాలతో సోదరులు తలపడినట్లు వేర్కొంది. కానీ, ఇతర ఆధారాలు, బరీద్‌షాతో సహా నలుగురు సుల్తాన్‌లతో తలపడినట్లు వేర్కొంటున్నాయి. నలుగురు సుల్తాన్‌లు విజయనగర సైన్యంతో తలపడి, ఓడిపోయి, వారి రాజ్యం వైపు పారిపోయారు. వెంకట్రాది నాయకత్వం లోని విజయనగర సైన్యం ఆదిల్‌షాపై దండెత్తింది. ఆదిల్‌షా అతని సేనానులలో ప్రముఖుడైన అసద్‌ఖాన్‌ను, ఆదోని దుర్గాన్ని ఆక్రమించమని పంపాడు. బీదర్ సుల్తాన్ ఆలిబరీద్ కూడా, అతనికి సహాయపడినట్లు తెలుస్తూంది. వెంకటాద్రికి, అతని దాయాది అప్పలరాజు సహాయపడినాడు. అసద్‌ఖాన్ ఆదోని దుర్గాన్ని ఆక్రమించడంతో, వెంకటాద్రి సైన్యంతో దుర్గాన్ని ముట్టడించాడు. అసద్‌ఖాన్ వెంకటాద్రి ముట్టడికి తట్టుకోవడం వల్ల, వెనక్కి తిరిగి, 20 మైళ్ళ దూరంలో గుడారాలను నిలిపాడు. వెంకటాద్రి కూడా అతనికి కొంత దూరంలో గుడారాలను నిలిపాడు. అసద్‌ఖాన్ 4000 అశ్వదళంతో అర్ధ రాత్రి వెంకటాద్రి సైన్యంపై దాడి చేశాడు. వెంకటాద్రి, అతని సైన్యం కల్లోలానికి గురై, చెల్లాచెదరైనారు. వెంకటాద్రి స్త్రీజనం అసద్‌ఖాన్‌కు చిక్కారు. ఉదయాన్నే వెంకటాద్రి సైన్యాన్ని సమీకరించి, అసద్‌ఖాన్‌ను ముట్టడించాడు. వెంకటాద్రి తన కుటుంబాన్ని రక్షించుకోవడం కోసం, సంధిని కోరాడనే, పెరిష్టా రచన నమ్మదగింది కాదు. తురకచర్ల వద్ద జరిగిన యుద్ధంలో అసద్‌ఖాన్, బనీద్‌లు ఓడిపోయారు. ఈ యుద్ధంలో అప్పలరాజు ప్రాణాన్ని కోల్పోయాడు.

రామరాయల నాయకత్వం లోని సైన్యం, జంషీద్ కుతుబ్‌షాను అతని రాజ్యం వైపు తరిమింది. పానుగల్లు వద్ద కుతుబ్‌షా రామరాయలను ఎదుర్కొన్నాడు. అక్కడ జరిగిన యుద్ధంలో రామరాయలు కుతుబ్‌షాను ఓడించి, గోల్కొండ వరకు తరిమాడు. రామరాయలు గోల్కొండ దుర్గాన్ని ముట్టడించడంతో, కుతుబ్‌షా సంధికి వేడు కోగా, ఇరువురకు సంధి జరిగింది.

BRAOU

తిరుమల నాయకత్వం లోని సైన్యం నిజాంషాను తరిమి, కళ్యాణీ దుర్గాన్ని ముట్టడించాయి. ఈ లోగా రామరాయలు, వెంకటాద్రి కూడా తిరుమల రాయలను కలిశారు. తిరుమల రాయలు కళ్యాణీ దుర్గాన్ని ఆక్రమించాడు. నిజాంషా ముగ్గురు సోదరుల దాడిని తట్టుకోలేక, అహ్మద్‌నగర్‌కు పారిపోయాడు. విజయనగర సైన్యం అహ్మద్‌నగర్ సైన్యాన్ని ముట్టడించింది. అహ్మద్‌నగరాన్ని, కోటను ధ్వంసం చేశారు. నిజాంషా వారి దాడికి తట్టుకోలేక, గౌతమీ నది ఆవలకు పారిపోయాడు. రామరాయలు సోదరులతో విజయనగరం చేరాడు.

18.6.4 : ఆదిల్‌షాకు విరుద్ధంగా కూటమి ఏర్పాటు (1543-44)

రామరాయల చేతిలో ఆదిల్‌షా ఓడింపబడినప్పటికీ, అతడు నిజాంషాపై విజయాన్ని సాధించి, షోలాపూర్ జిల్లాలను ఆక్రమించడంతో, అతని బలం పెరిగింది. ఇదిలా వుండగా, కుతుబ్‌షా మరణం తర్వాత సింహాసన మెక్కిన జంషీద్, అతని సోదరుడైన ఇబ్రహీంను బంధించడాన్ని ప్రయత్నించాడు. ఇబ్రహీం బరీద్‌ను ఆశ్రయించడంతో, బరీద్ గోల్కొండపై దండెత్తాడు. జంషీద్ బుర్హాన్ నిజాం సహాయాన్ని కోరాడు. నిజాం కోహీర్ ప్రాంతాన్ని ఆక్రమించి, గోల్కొండ పైకి నడిచాడు. ఆలీబరీద్ బుర్హాన్, జంషీద్‌లను ఎదుర్కొనలేక, ఆదిల్‌షా సహాయాన్ని కోరాడు. నిజాం ఆదిల్‌షాను శిక్షించడాన్కి ఇదే మంచి అవకాశంగా భావించి, రామరాయలతో ఆదిల్‌షాకు విరుద్ధంగా కూటమిని ఏర్పాటుచేయమని, కుతుబ్‌షా వద్దకు ఫాతాహీర్‌ను రాయబారిగా పంపాడు. రామరాయలు దీనికి వెంటనే అంగీకరించాడు. ఆదిల్‌షాను శిక్షించడాన్కి, రామరాయలు, గోల్కొండ, అహ్మద్‌నగర్ కూటాలు ఏర్పడ్డాయి. నిజాం బీదర్, బరీద్‌లను కూడా కూటమిలో చేర్చాడు. వీరు కుదుర్చుకున్న అంగీకారం ప్రకారం, విజయనగరం దక్షిణం నుండి, గోల్కొండ తూర్పు నుండి, బుర్హాన్, అతని మిత్రులైన ఆలీబరీద్, అల్లావుద్దీన్ ఇమాద్‌లు ఉత్తరం నుండి, బిజాపూర్‌ను ముట్టడించాలని నిర్ణయించుకున్నారు.

రామరాయలు విజయనగర సైన్యాన్ని వెంకటాద్రి నాయకత్వంలో ఉంచి, కృష్ణ-తుంగభద్ర అంతర్వేదిని ముట్టడించాడు. నిజాం, అతని మిత్రులు షోలాపూర్ పైకి నడిచారు. జంషీద్, గుల్బర్గా వరకున్న ప్రాంతాలను ఆక్రమించి, యాతగిరి కోటను ముట్టడించాడు. మూడు వైపులా ముట్టడించడంతో, తట్టుకోలేక, అసద్‌ఖాన్ సలహాపై రాయచూర్, ముద్గల్ కోటలను, అనేక బహుమానాలను రామరాయలకు, షోలాపూర్, ఐదు జిల్లాలను నిజాంకు సమర్పించి, కుతుబ్‌షాను శిక్షించడాన్కి అసద్‌ఖాన్‌ను పంపినాడు. అసద్‌ఖాన్ కుతుబ్‌షాను గోల్కొండ వరకు తరిమి, అక్కడ జరిగిన యుద్ధంలో కుతుబ్‌షాను వధించి, బిజాపూర్‌కు మరలినాడు. బీదర్‌కు మరలిన ఆలీబరీద్ ఇబ్రహీంకు రక్షణ కల్పించడాన్కి బదులు, అతని ఏనుగులను, ఆస్తులను స్వాధీనం చేసుకోడాన్కి ప్రయత్నించాడు. ఇబ్రహీం విజయనగరానికి పారిపోయి, రామరాయల రక్షణను కోరాడు. రామరాయలు అతనికి రక్షణ కల్పించి, ఒక జాగీరు నిచ్చాడు. ఇబ్రహీం గోల్కొండ సుల్తాన్ అయ్యేవరకు విజనయనగరం లోనే ఉన్నాడు.

18.6.5 : పోర్చుగీస్‌లతో ఒప్పందం

15వ శతాబ్ది చివర భారతదేశానికి వచ్చిన పోర్చుగీస్ వారు మొదటి నుండి విజయనగర ప్రభువులతో స్నేహాన్ని పాటిస్తూ వచ్చారు. కాని, 1542లో గవర్నర్‌గా వచ్చిన డిసౌజా, విజయనగరంపై కత్తిగట్టి, అందలి రేవు పట్టణాలను, దేవాలయాలను దోచుకోవడం మొదలుపెట్టాడు. అతని పాలన

BRAOU

అనతి కాలం లోనే అంతమై, అతని స్థానంలో గవర్నర్‌గా వచ్చిన డికాస్ట్రో భిన్న స్వభావం కలవాడు. దక్కన్ రాజకీయాల్లో వచ్చిన మార్పును దృష్టిలో ఉంచుకొని, రామరాయలతో అంగీకారానికి వచ్చాడు. 1547లో వీరి మధ్య జరిగిన అంగీకారం ప్రకారం, ఒకరి మిత్రులను రెండవవారు కూడా మిత్రులుగాను, ఒకరి శత్రువులను రెండవవారు శత్రువులుగాను భావించాలి. గోవాకు వచ్చిన అరేబియా, పర్షియా గుర్రాలను విజయనగర రాజులకే అమ్మారు. విజయనగర వర్తకులు వారి సరుకులను హోనావర్, బసరార్‌ల గుండా పోర్చుగీస్ వర్తకులకు అమ్మారు. ఇరు పక్షాలకు శత్రువైన ఆదిల్‌షాపై యుద్ధాన్ని ప్రకటించాలి.

18.6.6 : దక్షిణ దేశ దండయాత్ర (1545-47)

రామరాయలు సదాశివరాయలను విజయనగర సింహాసనంపై ప్రతిష్టించిన కొద్ది కాలానికే, దక్షిణ దేశ దండయాత్రను నడపాల్సొచ్చింది. ఆధునిక చరిత్రకారులు ఈ దండయాత్రకు మూడు కారణాలను పేర్కొంటున్నారు. మొదటిది, తిరువాన్కూర్ ప్రభువు విజృంభణ. ఇతని పేరు ఇన్‌క్విత్తిచిరమ్ అని, పోర్చుగీస్‌వారు పేర్కొన్నారు. ఇతడు ఉదయమార్తాండవర్మ అని కొందరు, వీరకేరళవర్మ అని కొందరు, ఉన్నికేరళవర్మ అని కొందరు, భావిస్తున్నారు. ఇతడు ఉన్నికేరళవర్మ అనడానికే, ఎక్కువ కారణాలు కన్పిస్తున్నాయి. రెండవ కారణం, పోర్చుగీస్ మతప్రచారకుడైన సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ మత కార్యకలాపాలు. ఇతడు ఇరవై నుండి ముప్పై వేల వరకు, పర్వరులు అనే జాలరులను క్రైస్తవ మతం లోనికి మార్చాడు. మూడవది, పోర్చుగీస్ అధికారులు ద్రావిడ దేశం లోని దేవాలయాలను దోచుకోవడం. ఈ పరిస్థితులను చక్కదిద్దుకోవడాన్కి దక్షిణ దిగ్విజయాన్ని చేయాల్సొచ్చింది. తిరువాన్కూర్ రాజు రాయల అధికారాన్ని ధిక్కరించి, తన రాజ్యాన్ని విస్తరించడం మొదలు పెట్టాడు. చోళ మండల తీర దేశమందు రోమన్ కాథలిక్ మిషనరీల మత ప్రచారం వల్ల, రాయల అధికారానికి, హిందూ ధర్మానికి భంగం వాటిల్లింది. క్రైస్తవ మిషనరీలు అక్కడ పరవ జాలరులను తమ మతంలో కలుపుకొని, పోర్చుగీస్ రాజే వారి రాజని, రాయలు కాదని ప్రకటించారు. అక్కడి దేవాలయాలను కూడా నాశనం చేసి, చర్చీలను నిర్మించసాగారు. అల్లే, కొందరు క్రైస్తవ మిషనరీలు మద్రాస్, శాంథోమ్, నాగపట్టణంను కేంద్రంగా, పరిసర ప్రాంతాల్లోని దేవాలయాలను దోచుకొని, నాశనం చేసి, వాటి స్థానంలో చర్చీలను నిర్మించసాగారు.

ఈ పరిస్థితులను మదుర నాయకుడైన విశ్వనాథ నాయకుడు, సరిదిద్దలేకపోయాడు. అందువల్ల, రామరాయలు తన పెదతండ్రి రామరాజు తిమ్మరాజు పుత్రుడైన విఠల రాజును, అతనికి అండగా అతని తమ్ముడు చినతిమ్మరాజును దక్షిణ దేశానికి పంపాడు. విఠలరాజు, రామరాజు ఆదేశం ప్రకారం, దక్షిణ దేశానికి బయల్దేరి, చంద్రగిరిలో సోదరుడు చిన్నతిమ్మరాజును కలుసుకొని, శ్రీరంగం వైపు నడిచాడు. శ్రీరంగస్వామి దేవాలయం అనేక సిరిసంపదలతో తులతూగడం వల్ల, పోర్చుగీస్ వారు పరవ జాలరుల సహాయంతో శ్రీరంగాన్ని ముట్టడించాడు. విఠలరాయ సోదరులు శ్రీరంగం చేరి, పోర్చుగీస్ వారిని, పరవ జాలరులను ఓడించారు. విజయనగర సైన్యం ముట్టడికి తట్టుకోలేక, నాగపట్టణానికి పారిపోయారు. ఈ విధంగా, శ్రీరంగనాథుని సిరిసంపదలను రక్షించి, చినతిమ్మనను శత్రువులను పూర్తిగా అణచడాన్కి పంపి, విఠలరాజు మదుర చేరాడు. కల్లోల పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రధాన మంత్రి ముస్తాఫాఖాన్ విజయనగరంలో ఉన్న ఇబ్రహీం కుతుబ్‌ను, గోల్కొండకు పచ్చి పరిపాలనను చేపట్టమని కోరాడు. ఇబ్రహీం తన సహచరులను సంప్రదించి, గోల్కొండ సింహాసనాన్ని ఆక్రమించడానికి ఇష్టపడలేదని, తర్వాత మనసు మార్చుకొని అంగీకరించాడని, అతనితో కూడా

BRAOU

10,000 అశ్విక దళం తోను, 20,000 పదాతి దళం తోను, వెంకటాద్రిని పంపడానికి అంగీకరించాడని, కాని ఇబ్రహీం ఇంత పెద్ద సైన్యంతో వెంకటాద్రి గోల్కొండను ఆక్రమిస్తాడేమోనని భయపడి, సహాయాన్ని తీసుకోకుండానే విజయనగరం నుండి బయల్దేరడానికి నిర్ణయించుకొని, తరువాత ముస్తాఫాఖాన్, సలబత్ ఖాన్‌ల సహాయంతో సయిఫ్‌ఖాన్, జగత్‌రావులను బందించి, 1550 లో సింహాసనాన్ని అధిష్టించాడని పేర్కొనడమైంది. గోల్కొండ రచయిత వ్రాతలు నమ్మదగినవి కావు. **'నరసభూపాలీయం'** ఇబ్రహీం కుతుబ్‌షాను రామరాయలు గోల్కొండ సింహాసనంపై నిల్పి, అతని సుస్థిరతకు ఎంతో సహాయం చేశాడని స్పష్టంగా తెలియజేస్తోంది. రామరాయల సహాయం తోనే, ఇబ్రహీం గోల్కొండ సింహాసనాన్ని ఆక్రమించాడనడంలో సందేహం లేదు.

18.6.7 : రామరాయలు - ఇబ్రహీం ఆదిల్‌షా

1533లో బుర్హాన్ నిజాంషా, రామరాయలు కూటమిగా ఏర్పడి, బిజాపూర్‌ను ముట్టడించారు. ఇబ్రహీం ఆదిల్‌షా దాడిని తట్టుకోలేక, బిజాపూర్ వదలి, పూనా కోటలో తలదాచుకున్నాడు. నిజాం అకస్మాత్తుగా జబ్బుపడి, ముట్టడి చాలించి, రాజధానికి చేరి, మరణించాడు. రామరాయలు కూడా ముట్టడి విరమించి, విజయనగరం చేరాడు.

బుర్హాన్ నిజాంషా మరణం తర్వాత, అతని కుమారుడు హుస్సేన్ నిజాంషా 1553లో సింహాసనమధిష్ఠించాడు. ఇది వారసత్వ యుద్ధానికి దారితీసింది. అతని సోదరులు షా ఆలీ, మీరాయ్‌లు, ఇబ్రహీం ఆదిల్‌షా బంధువులు, బిజాపూర్‌కు పారిపోయారు. ఇబ్రహీం ఆదిల్‌షాతో నిజాం సైన్యాధిపతి ఐన్-ఉల్-ముల్క్ చేతులు కలిపి, హుస్సేన్ నిజాంషాతో యుద్ధం చేశారు. కాని, దురదృష్టవశాత్తు ఆదిల్‌షా ఓడిపోయి, ఇద్దరూ బిజాపూర్ చేరారు. ఐన్-ఉల్-ముల్క్ సైన్య సమీకరణకు, ఆదిల్‌షా సహాయాన్ని కోరాడు. ఆదిల్‌షా అతన్ని అనుమతించి, కొలువు నుండి తరిమి వేశాడు. ఈ చర్యకు కోపగించిన ఐన్-ఉల్-ముల్క్ తిరుగుబాటు చేసి, ఆదిల్‌షాపై క్రొన్ని విజయాలను సాధించాడు. ఆ ధైర్యంతో, బిజాపూర్ రాజ్యంలో పన్నులను వసూలు చేయడం ప్రారంభించాడు. ఇబ్రహీం స్వయంగా ఇతడిపై దండెత్తి, ఓడిపోయి, రాజధాని చేరాడు. ఐన్-ఉల్- ముల్క్ అతడిని బిజాపూర్ వరకు తరిమి, బిజాపూర్‌ను ముట్టడించాడు. ఆదిల్‌షా పరిస్థితి దుర్భరమైంది. అతడు రామరాయల వద్దకు లక్ష ఇరవైవేల హొన్నులను బహుమానంగా పంపి, అతని సహాయాన్నర్థించాడు. రామరాయలు వెంకటాద్రి నాయకత్వంలో ఐన్-ఉల్-ముల్క్‌ను తరమడానికి, సైన్యాన్ని పంపాడు. ఐన్-ఉల్-ముల్క్, అతని మిత్రుడు గులబర్‌ఖాన్, అనేక ఇబ్బందులకు గురై, అహమ్మద్‌నగర్ పారిపోయి, అక్కడ మోసంతో వధింపబడ్డారు. రామరాయలు ఈ విధంగా ఆదిల్‌షాకు సహాయపడి, అతన్ని ఇబ్బందుల నుండీ రక్షించాడు.

ఐన్-ఉల్-ముల్క్ తిరుగుబాటు తర్వాత, ఆదిల్‌షాపై రామరాయల దృక్పథంలో మార్పొచ్చింది. ఆదిల్‌షా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సహాయం చేసి, తద్వారా కృష్ణ-తుంగభద్ర అంతర్వేదిని కాపాడుకోవాలని నిర్ణయించాడు. ఐన్-ఉల్-ముల్క్ తిరుగుబాటు చేస్తున్నప్పుడే, అబ్దుల్లా పోర్చుగీస్ వారి సహాయంతో, బిజాపూర్ సుల్తాన్‌గా ప్రకటించుకొని, ఆదిల్‌షా సరిహద్దుల్లోని గోండాను ఆక్రమించి, కొంకణ తీరం లోని భిస్తులను పోర్చుగీస్ వారికి కానుకగా ఇచ్చాడు. గోవాకు గవర్నర్‌గా వచ్చిన ఫ్రాన్సిస్ కోబరెట్, బిజాపూర్ రాజ్యం లోనికి దాడులను పంపాడు. ఈ లోగా ఆదిల్‌షా విజయనగర సహాయంతో, ఐన్-ఉల్-ముల్క్ తిరుగుబాట్లు నణచివేశాడు. ఇంకా, బిజాపూర్ రాజ్యం లోనే ఉన్న వెంకటాద్రిని, అబ్దుల్లాను, పోర్చుగీస్ దాడులను ఎదుర్కోవడానికి సహాయాన్ని కూడా అర్థించాడు.

BRAOU

1555-56 నాటికి, విజయనగర, బిజాపూర్ సైన్యాలు పోర్చుగీస్ వారిని, అబ్దుల్లాను తరిమివేసి, పోండాను తిరిగి ఆక్రమించి, సాల్‌శెట్టి, బర్దెస్‌లను కూడా ముట్టడించారు. పోర్చుగీస్‌వారు సాల్‌శెట్టి, బర్దెస్‌లు కూడా పోతాయేమోనని భయపడి, 1556లో విజయనగరం తోను, ఆదిల్‌షా తోను, శాంతి ఒప్పందాన్ని చేసుకున్నారు. పెరియా సైసాజా అనే పోర్చుగీస్ చరిత్రకారుని ప్రకారం, అబ్దుల్లా ఆదిల్‌షా బందిఖానాలో మరణించాడు.

18.6.8 : రామరాయలు - నిజామ్‌షా

1556- 57 లో హుస్సేన్ నిజామ్‌షా, ఆదిల్‌షా అధీనంలో ఉన్న గుల్బర్గాను జయించాలని ఆశించాడు. అతని తండ్రి బుర్హాన్ కళ్యాణిని జయించినప్పటికి, గుల్బర్గాను జయించలేకపోయాడు. ఇబ్రహీం కుతుబ్‌షా గోల్కొండ సింహాసనమధిష్టించగానే, హుస్సేన్ నిజాంషా అతనికి అభినందనలు, కానుకలను పంపి, ఇద్దరూ కలిసి, అంగీకారానికి వచ్చి, గుల్బర్గాను ముట్టడించారు. ఆదిల్‌షా వీరిద్దరి దాడిని తట్టుకోలేక, రామరాయలకు బహుమానాలను పంపి, సహాయాన్నర్థించాడు. రామరాయలు ఇబ్రహీం కుతుబ్‌షాను, నిజామ్‌తో తెగతెంపులు చేసుకోమని లేఖలు పంపి, సైన్యంతో ఆదిల్‌షా సహాయానికి బయల్దేరాడు. కుతుబ్‌షా దీనికి అంగీకరించడేమోనని అనుమానించి, కుతుబ్‌షాను భయపెట్టడానికి, తన సోదరుడు ఎర్ర తిమ్మను గోల్కొండ భూభాగాలపై దాడిచేయమని ఆదేశించాడు. దీనికి బయపడిన కుతుబ్‌షా, రామరాయలను కలిసి, ఆయన సలహా మేరకు కంగీకరించాడు.

18.6.9 : ఆదిల్‌షాతో యుద్ధం (1549-1560)

దక్షిణ దేశంలో పోర్చుగీస్ వారి జోక్యాన్ని అరికట్టి, తిరుగుబాట్లు అణచి, సదాశివరాయలు దక్షిణ దేశంపై ఎదురులేని అధికారాన్ని స్థాపించాడు. కళ్యాణి, రాయచూర్, ముద్గల్ మొదలైన దుర్గాల నాక్రమించి, అళియ రామరాయలు ఆదిల్‌షాను అదుపులో ఉంచగలిగాడు. పోర్చుగీస్ వారితో సంధి కూడా విజయనగర బలాన్ని పెంచింది. ఆదిల్‌షా ఈ పరిస్థితికి తట్టుకోలేక, పోర్చుగీస్‌వారితోను, అహమ్మద్‌నగర్, గోల్కొండ సుల్తాన్‌లతోను సఖ్యంగా ఉండాలని తలచాడు. పోర్చుగీస్ వారికి సాల్‌శెట్టి, బర్దెస్ ప్రాంతాల నిచ్చి, వారు ఇతనిపై శత్రుత్వం వహించకుండా చేశాడు. ఈ లోగా ఇబ్రహీం కుతుబ్‌షా, బరీద్‌షా నుండి ప్రమాదాన్ని శంకించి, బరీద్‌కు విరుద్ధంగా బుర్హాన్ దండెత్తడానికి నిజామ్‌షా సహాయాన్ని కోరాడు. నిజామ్ దానికి అంగీకరించడమే కాకుండా, ఆదిల్‌షాకు కూడ లేఖలను పంపాడు. ఆదిల్‌షా దీనిని మంచి అవకాశంగా భావించి, నిజామ్ కుతుబ్‌షాలతో అంగీకారానికి వచ్చాడు. ఈ రహస్య ఒడంబడిక ప్రకారం, బరీద్ రాజ్యంపై బుర్హాన్ దండెత్తడానికి ఆదిల్‌షా అంగీకరించాడు. దీనికి బదులుగా, విజయనగరంపై ఆదిల్‌షా చేసే యుద్ధంలో, నిజాం, బరీద్‌ను తరిమివేశాడు. ఈ రహస్య ఒడంబడిక గురించి తెలియని బరీద్, బిజాపూర్‌కు చేరి, ఆదిల్‌షా సహాయాన్ని కోరాడు. ఆదిల్‌షా అతన్ని పట్టుకొని బందించాడు.

ఆదిల్‌షా, నిజామ్, కుతుబ్‌షాలు జోక్యం చేసుకోరని నిర్ణయించుకొన్న తర్వాత అకస్మాత్తుగా విజయనగర రాజ్యంపై దాడి చేసి, కళ్యాణి, రాయచూర్, ముద్గల్ కోటలను ఆక్రమించాడు. విజయనగరసైన్యం సిద్దంగా లేక పోవడం వలన, వాటిని వెంటనే రక్షించలేకపోయారు.

రామరాయలు ఆదిల్‌షా దాడులను త్రిప్పికొట్టడానికి, పోయిన ప్రాంతాలను తిరిగి ఆక్రమించడానికి, సైన్యాన్ని సిద్దం చేశాడు. ఈ లోగా ఆదిల్‌షా సేనాని అసద్‌ఖాన్ మరణించాడనే వార్త రావడంతో,

BRAOU

నిజామ్ ఆదిల్‌షానుండి షోలాపూర్, గుల్బర్గాలను తిరిగి ఆక్రమించడానికి, రామరాయల సహాయాన్ని అర్థించాడు. రామరాయలు వెంటనే నిజామ్‌తో అంగీకారాన్ని కుదుర్చుకొన్నాడు. ఈ వార్త తెలిసిన ఆదిల్‌షా, అతని కొలువులో ఉన్న విజయనగర రాయబారులను అవమానించి పంపాడు. ఈ వార్త విన్న రామరాయలు, బుర్హాన్ నిజామ్‌షాను కళ్యాణి కోటను ముట్టడించమని ఆదేశించాడు. నిజామ్ సైన్యం కోటను ఆక్రమించడంతో, ఆదిల్‌షా పారిపోయి, దారిలో పురెండా కోటను ఆక్రమించాడు. నిజామ్ సైన్యం ఆ కోటను తిరిగి ఆక్రమించి, ఆదిల్‌షా సైన్యాన్ని తరిమివేశాడు. బీజాపూర్ చేరిన ఆదిల్‌షా కళ్యాణి దుర్గాన్ని తిరిగి ఆక్రమించడానికి ప్రయత్నించాడు. నిజామ్ రామరాజును రాయచూర్ వద్ద కలిసి, ఇద్దరు ఒకేసారి ఆదిల్‌షా రాజ్యం పైకి దండెత్తడానికి నిర్ణయించుకున్నారు. నిజాం షోలాపూర్‌పై దండెత్తాడు. రామరాయలు వెంకటాద్రిని సహాయంగా తీసుకొని, రాయచూర్‌ను ఆక్రమించాడు. ముద్గల్, తోరంగల్ కోటలను కూడా ఆక్రమించి, రామరాయలు విజయనగరం చేరాడు. ఈ లోగా నిజామ్ షోలాపూర్‌ను ఆక్రమించాడు. విజయనగరం నుండి గాని, గోల్కొండ నుండి గాని, సహాయం రాకపోవడంతో, గుల్బర్గాను ఆక్రమించకుండగానే, అహమ్మద్‌నగర్ చేరాడు. ఈ విధంగా 1549-50లో రామరాయలు, ఆదిల్‌షా ఆక్రమించిన ప్రాంతాలను తిరిగి ఆక్రమించగల్గాడు.

18.6.10 : ఇబ్రహీం కుతుబ్‌షాను గోల్కొండ సింహాసనంపై ప్రతిష్టించుట (1550)

జంషీద్ కుతుబ్‌షా 1550 లో మరణించాడు. చిన్న వాడైన అతని కుమారుడు సుభాన్ కులీని సింహాసనంపై ప్రతిష్ఠించి, సైన్‌ఖాన్ అతనికి సంరక్షకుడైనాడు. భగత్‌రావ్ అనే హిందూ నాయకుడు అతనికి సహాయకుడైనాడు. కానీ, ఈ ఏర్పాటు గోల్కొండ లోని కొంత మంది ప్రముఖులకు అంగీకారం కాలేదు. సంరక్షకుడు, అతని సహాయకుని దుశ్చర్యలవల్ల, గోల్కొండలో సదాశివరాయల కోరిక మేరకు, రామరాజు తిరువడి రాజ్యాన్ని విశ్వనాథ నాయకునికి అమర మాగాణిగా ఇచ్చాడు.

విఠలరాజు దిగ్విజయం యింతటితో ముగియ లేదు. తిరువాన్కూర్‌కు సహాయంగా నిల్చిన పోర్చుగీస్ వారి పైకి నడిచింది. కొచ్చిని కోరిన్‌ను ముట్టడించి, బెట్టుపెరుమాళ్ళు బావమరిదిని రక్షించాడు. అక్కడి నుండి కన్యాకుమారి లోని పుణ్యకోవెలను ముట్టడించి, అక్కడి పోర్చుగీస్ సైన్యాధికారి, గృహాన్ని, ఓడను నాశనం చేశారు. పోర్చుగీస్ సైన్యాధికారి క్రైస్తవ మతం లోకి మారిన పర్వారులు పారిపోయారు. విజయనగర సైన్యం మలయాద్రి వద్ద విజయ స్తంభాన్ని నాటింది.

శివతత్వరత్నాకరం, కేళది సదాశివ నాయకుని కుమారుడైన దొడ్డసంకన్న నాయకుడు రామ రాయల ఆజ్ఞ మేరకు, విఠల రాయలతో కలసి, గోవాపై దండెత్తి, పోర్చుగీస్ గవర్నర్‌ను ఓడించి, రామరాయల వద్దకు బందీగా తీసుకొచ్చారని, రామరాయలు సంతోషించి, సంకన్న నాయకునికి మహోదే వపురాన్నిచ్చి సత్కరించాడని వేర్కొంటూంది. తిరువాన్కూర్ రాజుకు సహాయంగా వచ్చిన పోర్చుగీస్ గవర్నర్‌ను, రామరాయలు వద్దకు తీసుకొని వచ్చుండొచ్చు. అందువల్లే, 1546లో పైన వేర్కొన్న సంధి జరిగుండొచ్చు. దొడ్డ సంకన్న నాయకుడు జంబూదేశ రాజైన విరూపన్ననాయకుని కూడా ఓడించి, కప్పాన్ని వసూలు చేసినట్లు పై గ్రంథం వేర్కొంటోంది.

ఈ విధంగా రామరాజు పంపిన దక్షిణ దండయాత్ర విజయవంతమైంది. రాయల అధికారం దక్షిణ దేశ మంతటి ఎప్పటి వలెనే కొనసాగింది. ఈ దండయాత్రలో అత్యంత ప్రతిభ చూపిన విఠల రాజును, రామరాయలు దక్షిణ దేశానికి అధిపతిగా నియమించాడు. చిన్న తిమ్మ నాగూర్ (నాగపట్టణం) ను ముట్టడించి, శత్రువులను ఓడించి, ఆ ప్రాంతాన్ని విశ్వనాథనాయకుడు పాలిస్తున్న

BRAOU

పాండ్య రాజ్యంలో కలిపాడు. అక్కడి నుండి దక్షిణ ఆర్కాట్ జిల్లా లోని భువనగిరి కోటను ముట్టడించి, ఆక్రమించాడు. భువనగిరి, మదురల మధ్య నున్న చిన్న చిన్న రాజుల వద్ద కప్పాన్ని వసూలు చేసి, చిన తిమ్మన మదుర చేరి, సోదరుని కలిశాడు. అక్కడి నుండి సోదరులిద్దరూ తిరువడి రాజ్యం మీదకు నడిచారు. ఈ యుద్ధంలో విశ్వనాధ నాయకుడు, అతని కుమారుడు కృష్ణప్ప నాయకుడు, కేళది సదాశివ నాయకుడు పాల్గొన్నారు. తిరువడై మరదూర్ అనే బ్రాహ్మణ సైన్యాధికారుడు కూడా, ఈ యుద్ధంలో ప్రముఖ పాత్ర వహించాడు.

విఠల రాజు పైన పేర్కొన్న ప్రముఖుల్లో తిరువడిరాజు ఉన్నికేరళవర్మ పైకి నడిచాడు. విజయనగర పురోగమన 'దళాన్ని', చెంకాశిరాజు ఎదుర్కొన్నాడు. కానీ, అతను ఓడిపోయి, విఠలరాజు అధికారాన్ని, అంగీకారాన్ని, విజయనగర రక్షణ వహించాడు. పోర్చుగీస్ వారు తిరువడిని రాజుకు సహాయంగా నిల్చి, బెట్టుపెరుమాళ్ బావమరిదిని బంధించారు. సైంట్ జూనియర్ తన దివ్య శక్తులతో ఉన్ని కేరళవర్మకు, విఠల రాజుకు మధ్య, యుద్ధాన్ని నివారించాడనే, పోర్చుగీస్ వారి వ్రాతలు నమ్మదగినవి కావు. విజయనగర సైన్యం తిరువడి రాజ్యాన్ని ముట్టడించి, ఐదు తిరువతులలో (తిరువడులలో) విభత్వాన్ని సృష్టించింది. తిరువడి రాజు ఓడిపోయి క్షమాపణ కోరడంతో, అతడిని తిరిగి తిరువడి రాజ్యంలో ప్రతిష్టించారు. కాని, విఠలరాజు దక్షిణ దిగ్విజయం పూర్తికాక ముందే, ఉన్నికేరళవర్మ మరణించాడు. అతని తర్వాత అతని కుమారుడు భూతలవీరుడు విజయనగర అధికారాన్నంగీకరించి తిరునల్వేలి జిల్లాలనిచ్చి, సాలీన కప్పం కట్టడానికి అంగీకరించాడు. సంధి కుదర్చడానికి అంగీకరించాడు. నిజామ్ నలుగురు రాజుల సమావేశానికి అంగీకరించి, అందరికీ ఆమోదమైన సంధిని కుదుర్చుకొని, నిరాశతోనే వెనుకకు మరలాడు.

1558లో ఇబ్రహీం ఆదిల్‌షా మరణించిన తర్వాత, అతని కొడుకు ఆలీఆదిల్‌షా బిజాపూర్ సింహాసన మెక్కాడు. అతడు చిన్నవాడు, రాజతంత్రం తెలియనివాడని, నలుగురు రాజుల సంధిని విస్తరించి, నిజామ్, కళ్యాణి మొదలైన దుర్గాలను ఆక్రమించడానికి ఇదే మంచి అవకాశమని భావించి, బిజాపూర్‌పై దండెత్తి, కళ్యాణి దుర్గాన్ని ముట్టడించాడు. ఆదిల్‌షా తన రాజ్యాన్ని రక్షించుకునే శక్తి లేక, తిరిగి రామరాజును ఆశ్రయించాడు. నలుగురు రాజుల ఒడంబడిక ప్రకారం, అతన్ని రక్షించడం తన విధియని భావించి, సైన్యంతో బయల్దేరి, కుతుబ్‌షాను కూడా పై ఒడంబడిక షరతుల ప్రకారం నిజాంతో యుద్ధం చేయడాన్కి ఆహ్వానించాడు. కుతుబ్‌షాకు ఇష్టంలేక పోయినా, రామరాజుకు భయపడి, అంగీకరించాడు. ఈ విధంగా విజయనగర, బిజాపూర్, గోల్కొండ సైన్యాలను నిజామ్‌షా ఎదుర్కొనలేక, భూపాల్‌రాయుడు అనే హిందూ సర్దార్‌ను కళ్యాణి కోటకు కాపలాగా పుంచి, మిగిలిన దళంతో తన రాజ్యానికి పోయి అహ్మద్‌నగర్‌లో వుండటం మంచిది కాదని, గోదావరి తీరం లోని ప్రతిష్ఠాన పురంలో తలదాచుకున్నాడు. రామరాయల సైన్యంలో ఒక భాగం కళ్యాణ దుర్గాన్ని ముట్టడించడానికి బయల్దేరి, మిగిలిన సైన్యంతో అహ్మద్‌నగర్‌ను ముట్టడించాడు. ఈ ముట్టడి రెండు నెలలు కొనసాగింది. ఇబ్రహీం కుతుబ్‌షా రహస్యంగా శత్రువులకు సహాయం చేసినా, కోట శత్రువుల హస్తగతం కాలేదు. రామరాయలు కేళదిసదాశివనాయకుని పరిసర ప్రాంతాల్లో దాడి చేసి, ధ్వంసం చేయమని ఆజ్ఞాపించాడు. హుస్సేన్ నిజాంషా తన కొలువులో ఉన్న ఇరాక్ ఖురాసాని సైన్యపు దళాలను నవాతిఖాన్, సంజార్‌ఖాన్, దౌలత్‌ఖాన్, దస్తూర్‌ఖాన్ మొదలైన సర్దార్‌లను, సదాశివనాయకుని ఎదుర్కొడాన్కి పంపాడు. సదాశివనాయకుడు వీరిని ఓడించాడు. రామరాజు తమ్ముడు వెంకటాద్రి సైన్యంతో గోదావరి దాటి, దౌలతాబాద్ వరకు గల నిజామ్ రాష్ట్రాలను ధ్వంసం చేశాడు. నిజామ్‌షా ఈ దాడులను తట్టుకోలేక, సదాశివరాయలతో సంధిచేసుకొని, కళ్యాణి

BRAOU

దుర్గాన్ని ఆదిల్‌షాకు సమర్పించాడు. రామరాయలు, ఆదిల్‌షాకు చేసిన సహాయానికి యాదగిరి, బాగల్ కోటలను పొందాడు.

18.6.11 : కుతుబ్‌షాతో యుద్ధం (1563)

రెండవ అహ్మద్‌నగర్ దండయాత్ర విజయవంతమైన తర్వాత, రామరాజు గోల్కొండ రాజ్యంపై దండెత్తాడు. ఈ దండయాత్రకు కారణం, మహ్మదీయ చరిత్రకారులు ఒక్కో విధంగా పేర్కొన్నారు. ఫెరిష్టా రచన ప్రకారం, కుతుబ్‌షా అహ్మద్‌నగర్ ముట్టడి సమయంలో నిజాంకు సహాయం చేశాడని, దానిని ఆదిల్‌షా రామరాజుని సంజాయిషీ అడగ్గా, జవాబు చెప్పక, రాత్రికిరాత్రే గోల్కొండ పారిపోయాడని, అతన్ని శిక్షించడాన్కి రామరాయలు, ఆదిల్‌షా, కుతుబ్‌షా రాజ్యంపై దండెత్తారు. పేరు తెలియని గోల్కొండ రచయిత, అహ్మద్‌నగర్‌ను ముట్టడించిన సందర్భంలో, కుతుబ్‌షా ముట్టడి మాని, సైన్యాన్ని వెనుకకు తీసుకుపోయేదానిపై, కొండపల్లి రాజ్యాన్ని ఇస్తానని వాగ్దానం చేశాడని, ముట్టడిని లేవుకునిపోయిన పిమ్మట, కుతుబ్‌షా వాగ్దానం ప్రకారం నడచుకోపోగా, నిజామ్‌తో సఖ్యం చేశాడనీ, ఈ సఖ్యాన్ని బలపర్చుకోవడానికి నిజామ్‌షా కూతురును వెళ్ళాడుటకు నిశ్చయించి, వివాహాన్ని ఆదిల్‌షాకు చెందిన కళ్యాణ దుర్గంలో చేయుటకు, ఇద్దరి దళాలతో అక్కడికి చేరారని, అపుడు ఆదిల్‌షా రామరాజుతో మొరపెట్టుకోగా, అతనికి సహాయంగా యుద్ధానికి వచ్చాడని వ్రాశాడు. వీటినిబట్టి, రామరాయల గోల్కొండ దండయాత్రకు కారణం లేక పోలేదని, కుతుబ్‌షా కుతంత్రమే దీనికి కారణమని తెలుస్తోంది.

ఆదిల్‌షా విజయనగరానికొచ్చి కుతుబ్‌షా, నిజామ్‌ల ఎత్తుగడలను రామరాయలకు తెల్పగానే, అతడు వెంకటాద్రి, జగదేవరాయ, ఐన్ ఉల్ ముల్క్ మొదలైన సేనాపతులను కుతుబ్‌షా రాజ్యం పైకి పంపి, రామరాయలు ఆదిల్‌షాను వెంటబెట్టుకుని కళ్యాణికి బయల్దేరాడు. రామరాయలు వస్తున్నాడన్న వార్త తెలిసిన వెంటనే, కుతుబ్‌షా, నిజామ్‌లు తమ రాజ్యానికి తరలిపోయారు. రామరాయలు అంతటితో ఆగక, నిజామ్‌షాను తరుముతూ, అతని రాజ్యం లోకి ప్రవేశించాడు. ఈ దండయాత్రలో కేవది సదాశివనాయకునికి విజయం లభించినట్లు , 'కేవదినృపవిజయం' పేర్కొంటోంది. అహ్మద్‌నగర్ నుండి తిరిగొచ్చి విజయనగర సైన్యం కుతుబ్‌షా రాజ్యంలో ప్రవేశించి, రాజధాని సమీపం లోని తర్లపల్లి వద్ద యుద్ధం జరిగింది. ఇబ్రహీం అతన్ని తరమడానికి చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. ఇంకో ప్రక్క వెంకటాద్రి, ఇన్‌ఉల్‌ముల్క్, జగదేవరావ్‌ల సేనలు, గోల్కొండ పరిసర ప్రాంతాలను కొల్లగొట్టాయి. రామరాజు మేనల్లుడు, కొండవీటి దుర్గాధ్యక్షుడైన సిద్ధిరాజు తిమ్మరాజు, కొండ పల్లి, మచిలీపట్టణాలను ముట్టడించాడు. చిత్తాప్‌ఖాన్, విజయార్తులు ఏలూర్, రాజమహేంద్రవరాలను జయించడానికి బయల్దేరారు. సిద్ధిరాజు తిమ్మరాజు కొండవీడులో లేకపోవడంతో, రామరాయల దృష్టిని మరల్చడానికి కుతుబ్‌షా, యాకూబ్‌ఖాన్, చింతగుంట ధర్మారావులను వెంటబెట్టుకుని, కొండవీడు పైకి నడిచాడు. కానీ, ఎర్రతిమ్మ ఆజ్ఞ మేరకు, వెలుగోటి చిన తిమ్మనాయుడు కొండవీడును శత్రువుల పరం కాకుండా కాపాడాడు. శత్రువుల నోడించి పారద్రోలడమే కాకుండా, కృష్ణను దాటి కుతుబ్‌షా రాజ్యం లోని దక్షిణ సీమ లోని ప్రసిద్ధ దుర్గాలను ఆక్రమించారు. దేవరకొండ వద్ద శత్రుసైన్యాలు కొంత ప్రతిఘటించాయి. కానీ, చిలెల, పేరూరు, దేవులపల్లి, నాగులపాడు, ఓడపల్లి, నల్గొండ, అరవపల్లి, ఇంద్రకొండ, ఇత్యాది దుర్గాలు యుద్ధం లేకుండా లొంగిపోయాయి. మరో ప్రక్క జగదేవరాయల ఆజ్ఞ మేరకు, కోవెలకొండ, పానుగల్లు, గణపుర దుర్గాలు రామరాజుకు లొంగిపోయాయి. ఈ విధంగా అన్ని వైపులా పరాజయాన్ని చవిచూచిన కుతుబ్‌షా, రామరాజును సంధికి వేడుకున్నాడు.

BRAOU

గణపురం, పానుగల్లు దుర్గాలను ఇస్తే, సంధికి అంగీకరిస్తానని రామరాయలు చెప్పగా, ఆ రెండు కోటలను సమర్పించి, కుతుబ్‌షా సంధి చేసుకున్నాడు.

రామరాయలు ఈ విధంగా మహ్మదీయ రాజులపై ఆధిపత్యాన్ని సాధించి, గోదావరి, సింహాచాల మధ్యగల దక్షిణ భారతదేశానికి సర్వాధిపతైనాడు. ఇది అతనిచే పరాజితులైన మహమ్మదీయులకు కంటకప్రాయమైంది. రామరాయలను ఎలాగైనా పడగొట్టాలని, వారి మధ్యనున్న విభేదాలను మర్చి, ఏకం కావడానికి ప్రయత్నించారు.

18.6.12 : బన్నిహట్టి యుద్ధం (1565)

అళియ రామరాయల నాయకత్వంలో 1564 నాటికి, విజయనగర అధికార వైభవాలు తారా స్థాయికి చేరుకున్నాయి. రాజకీయంగా, భౌగోళికంగా, ఆర్థికంగా రామరాయలు సాధించిన విజయాలు, విజయనగర సామ్రాజ్యాన్ని దక్షిణ దేశంలో తిరుగులేని రాజ్యంగా మార్చాయి. వితలరాజు, తిమ్మరాజుల దక్షిణ దిగ్విజయంతో, పోర్చుగీస్ వారిని అదుపులో ఉంచడంతో బలం పెరిగిన రామరాయలు, అంతఃకలహాల్లో మునిగున్న మహమ్మదీయ సుల్తాన్‌లపై సంపూర్ణ ఆధిపత్యాన్ని సాధించగల్గాడు. కృష్ణ-తుంగభద్ర అంతర్వేదిపైన, కుతుబ్‌షా రాజ్యం లోని దక్షిణ, పశ్చిమ భాగాల పైన తిరుగులేని అధికారాన్ని స్థాపించాడు. విజయనగర ఆధిపత్యం మహమ్మదీయ సుల్తాన్‌లకు కన్నుకుట్టింది. రామరాయలను ఉపేక్షిస్తే, తమ్ము మనుగడకే ముప్పు వాటిల్లుతుందని భయపడి, వారి మధ్యనున్న విభేదాలను మర్చి, మహమ్మదీయ సుల్తాన్‌లంతా ఏకమై, రామరాయలను పడగొట్టడానికి సిద్ధపడ్డారు.

18.6.12.1 : బన్నిహట్టి యుద్ధానికి కారణాలు

బన్నిహట్టి యుద్ధానికి దారితీసిన కారణాలపై చరిత్రకారుల్లో ఏకాభిప్రాయం లేదు. రామరాయల అహంకార ప్రవర్తనే మహమ్మదీయుల కూటమి ఏర్పాటుకు కారణమని, హీరాస్ అభిప్రాయం. రామరాయలపైన, హిందువులపైన ద్వేషమున్న ఫెరిష్టా వంటి వారి రచనలే, ఈ అభిప్రాయానికి ఆధారాలు. మహమ్మదీయులపై యుద్ధాల తర్వాత, ముఖ్యంగా అహ్మద్‌నగర్ దండయాత్ర తర్వాత, మహమ్మదీయ ఉద్యోగులను రామరాయలు హీనంగాను, జుగుప్సతోను చూసేవాడని, ఫెరిష్టా పేర్కొన్నాడు. ఓడిపోయిన వారిపై గెలిచిన వారు కొంత అధికారాన్ని చెలాయించడం, మధ్య యుగం నుండీ వస్తున్న ఆచారమైనప్పటికీ, రామరాయలు మహమ్మదీయ ఉద్యోగులను కించపర్చడాన్కి ఆధారాలు లేవు. రామరాయల వంటి రాజనీతిజ్ఞుడు అటువంటి హీన స్థితికి దిగజారాడనడం, సమంజసం కాదు. పైగా, అతని సైన్యం లోను, అతని రాజ్యం లోనూ, అనేక మంది మహ్మదీయులుండేవారు. వారికి రామరాయలు ప్రత్యేక ఏర్పాట్లు చేసేవాడని తెలుస్తూంది. అందువల్ల, బన్నిహట్టి యుద్ధానికి ఇది కారణమని చెప్పడం సబబు కాదు.

రామరాయలు మహమ్మదీయ మతాన్ని కించపర్చాడని, అదే బన్నిహట్టీ యుద్ధానికి కారణమని కొందరి అభిప్రాయం. ఈ అభియోగాని కర్కాడా, మహమ్మదీయ చరిత్రకారులు, రచనలే ఆధారం. జాతి స్వభావ వైరం కల్గిన మహమ్మదీయ చరిత్రకారులు, రామరాయలకు బద్ధ శత్రువులైన దక్కన్ సుల్తాన్‌ల కొలువులో ఉండటం వల్ల, వారు తమ రాజుల అధికార్యాన్ని, న్యాయ దృష్టిని నిరూపించడం కోసం, రామరాయల గురించి ఎన్నో అసత్యాలను వ్రాశారు. రామరాయలు తన దండయాత్రలో మసీదుల పవిత్రతను పాడుచేశాడని, ఖురాన్‌ను తిరస్కరించాడని, మహమ్మదీయ స్త్రీలను భంగపర్చాడని, ఫెరిష్టా

BRAOU

వ్రాశాడు. ఇతని రచనలు నమ్మదగినవి కావు. రామరాయల సైన్యంలో నేల కొద్ది తురుష్కులున్నారు. అంతేగాక, అనేక మంది మహమ్మదీయ సర్దార్లు ఉన్నత పదవులను చేపట్టారు. వీరి ఉపయోగం కోసం రామరాయలు రాజధానిలో ఒక మసీదును నిర్మించడమే గాక, వారి మతాచారాలను నిర్విఘ్నంగా కొనసాగించుకోడానికి ఏర్పాట్లు చేశాడు. అతని సింహాసనం ప్రక్కన ఖురాన్ ఉండేదని, మహమ్మదీయులు ఒక మతేతరుడికి నమస్కారం చేశారనే భావం కల్గకుండా దానిని ఏర్పాటు చేశాడని, మహమ్మదీయ చరిత్రకారులే వ్రాశారు. పైగా, బిజాపూర్ ఆలీ ఆదిల్‌షా అతనికి ఆప్త మిత్రుడు. ఇతని సహాయాన్నే రామరాయలు తక్కిన దక్కన్ సుల్తాన్‌లతో పోరాడాడు. ఈ దండయాత్రల్లో విజయనగర, బిజాపూర్ సైన్యాలు కలిసిమెలిసి పని చేశాయి. ఈ పరిస్థితుల్లో రామరాయలు తన కొలువు లోని మహమ్మదీయ సైనికులను, సర్దార్‌లను కించపర్చాడనడం సమంజసం కాదు.

హిందూ ఆధారాలైన **"రామరాజనబత్తైరు"** వంటివి, మత ద్వేషానికి దారితీసిన సంఘటనలను వర్ణించాయి. ఒక సారి ఆలీ ఆదిల్‌షా ప్రతినిధి విజయనగరాన్ని దర్శించాడని, అపుడు రామరాయలు దొమ్మరులు చేసే విన్యాసాలను దర్శిస్తున్నాడని, తర్వాత దొమ్మరులకు బహుమానాలు ఇచ్చేవాడని, వాటిలో రెండు పందులను కూడా ఇచ్చాడని, మహమ్మదీయ ప్రతినిధి పందులను చూచి చీదరించుకొన్నాడని, రామరాయలు అది చూచి మీరు కోళ్లను తింటారు కదా! పందుల విసర్జనను కోళ్లు కెక్కరించి అందులోని గింజలను తినడం చూపించాడని, దానికి కోపించి ఆ ప్రతినిధి ఆదిల్‌షా వద్దకు పోయాడని, ఆదిల్‌షా అందులో ఏ తప్పు కనబడలేదని పలుకగా, అతడు బాల్నాకు వెళ్ళి, అక్కడ నిజామ్‌షా ఆధ్వర్యంలో ఉన్న మిగిలిన ముగ్గురు సుల్తాన్‌లకు జరిగిన దానిని వివరించి, మత ద్వేషాన్ని రెచ్చకొట్టాడని, రామరాజనబత్తైరు పేర్కొంటూంది. ఇటువంటి గాథలు ఇంకా కొన్ని ప్రస్తావించబడ్డాయి. దీనిని బట్టి, ఆ సంఘటన జరగడాన్కి పూర్వమే, ఆదిల్‌షా తప్ప మిగిలిన సుల్తాన్‌లు కూటమిగా ఏర్పడుటకు సమావేశమైనారని తెలుస్తూంది. దినిలో రామరాయలు మహమ్మదీయ మతాన్ని కించపరచడాన్కి ఆధారం లేదు. అందుచేత, బన్నిహట్టీ యుద్ధ కారణాలు మతపరమైన కారణాలు కావు.

ఫెరిష్టా వంటి వారి రచన లాధారంగా హీరాస్, రాధేశ్యాం, ఎమ్.హెచ్. రామ్‌శర్మ మొదలైన వారు, రామరాయల అహంకారం, సాంఘిక, మత ద్వేషం, బన్నిహట్టీ యుద్ధానికి ప్రధాన కారణాలుగా భావించారు. ఫెరిష్టా వంటి వారి రచనలను విమర్శనాత్మకంగా పరిశీలిస్తే, మహమ్మదీయులు ఏకమై విజయనగరంపై యుద్ధం ప్రకటించడాన్కి, రాజకీయ, సైనిక, ఆర్థిక, కారణాలు ప్రధానంగా కన్పిస్తాయి. వాస్తవానికి అపుడు రామరాయలు భారతదేశాన్ని పాలించిన రాజులందరిలోకి ప్రముఖుడు. సమకాలీన ఆంధ్ర ప్రపంచం అతనిని 'బడే రామరాజు' అనియు, 'బడే రామప్పయ్య' అని ప్రశంసించారు. దక్షిణ హిందూదేశంలో అతని రాజకీయ అధికారం తిరుగులేనిది. ఈ రాజకీయ అధికారమే మహమ్మదీయుల్లో కలవరాన్ని కల్గించింది. ఫెరిష్టా రచనల్లో ఈ విషయం కనబడుతుంది. కుతుబ్‌షా ఆస్థానంలో ప్రముఖ నాయకుల్లో ఒకరైన ముస్తాఫాఖాన్, అహ్మద్‌నగర్ చేరి, పూర్వం బహమనీ సుల్తాన్‌ల కాలంలో మహ్మమ్మదీయులు ఏకంగా ఉండటం వలన విజయనగర రాజుల ధాటికి తట్టుకోగల్గినారని, ఇపుడు మహమ్మదీయ రాజ్యాలు విడిపోవడం వలన విజయనగరాన్కి బలం చేకూరిందని, అందువల్ల మహమ్మదీయ సుల్తాన్‌లందరూ ఏకమై, రామరాయలను ఎదుర్కోవాలని సూచించాడు. దీనిని బట్టి, విజయనగర రాజకీయాధిపత్యమే సుల్తాన్‌లు ఏకమవడాన్కి ప్రధాన కారణమని తెలుస్తున్నది. అంతేకాక, రామరాయలు మహమ్మదీయ అంతఃకలహాల మూలంగా, ఎంతో రాజకీయ లబ్ధి పొందాడు. కుతుబ్‌షా రాజ్యం లోని నైఋతి భాగాల్లో పానుగల్లు, కోవెలకొండ, కొండవల్లి, ఘన్‌పూర్

BRAOU

మొదలైన కోటలను ఆక్రమించాడు. అల్లే, ఆదిల్‌షాకు సహాయం చేయడం వలన, రాయచూర్, ముద్గల్, యాదగిరి, భాగల్ కోటలను సంపాదించాడు. ఈ ప్రాంతాలను ఆక్రమించడం వలన, విజయనగర అధికారం మహమ్మదీయ ప్రాంతాల్లో కూడ ప్రవేశించింది. దీనికి తోడు, హుస్సేన్ నిజాంషా రామరాయల చేతిలో పరాభవాన్ని మర్చిపోలేక, ప్రతీకారాన్ని తీర్చుకోడానికి రామరాయలను పడగొట్టడాన్కి, మహమ్మదీయ సుల్తాన్‌లు ఏకం కావడాన్కి కృషి చేశాడు.

1547 లో రామరాయలు పోర్చుగీస్ వారితో చేసుకొన్న ఒప్పందం విజయనగర సైనిక బలాన్ని పెంచింది. ఈ సంధి వలన పోర్చుగీస్ వారితో వర్తకవ్యాపారాలు, విజయనగర రాజుల గుత్తాధిప త్యమైంది. విజయనగర సైన్యం అశ్విక దళ విషయంలో, తిరుగులేని ఆధిపత్యాన్ని సంపాదించింది. ఇంతకు ముందు దక్కన్ సుల్తాన్ రాజ్యాలతో పోర్చుగీస్ వారు చేసే వర్తకవ్యాపారాలు స్తంభించి, విజయనగర, పోర్చుగీస్ వర్తక సంబంధాలు పెరిగాయి. దీని వలన విజయనగర సామ్రాజ్యం ఎంతో ఆర్థికాభివృద్ధిని సాధించింది. ఈ ఆర్థికాభివృద్ధి మహమ్మదీయులకు కన్నుకుట్టింది. ఈ విధంగా, విజయనగర రాజకీయ, ఆర్థిక, సైనిక పురోభివృద్ధికి కన్నుకుట్టిన దక్కన్ సుల్తాన్‌లు, వారి మధ్యనున్న విభేదాలను మర్చిపోయి, నిజామ్‌షా, కుతుబ్‌షాలు వివాహ సంబంధాలతో దగ్గరై, రామరాయలకు విరుద్ధంగా మహమ్మదీయ కూటమిని ఏర్పాటు చేసి, బన్నిహట్టి యుద్ధానికి కారణమైనారు.

18.6.12.2 : యుద్ధం జరిగిన ప్రదేశం

బన్నిహట్టి యుద్ధం ఎక్కడ జరిగింది, ఆ యుద్ధాన్ని ఏమని పిలవాలని, చరిత్రకారుల్లో భేదాభిప్రాయా లున్నాయి. **'విస్మృత విజయనగర చరిత్ర'** ను రచించిన రాబర్ట్ సీవెల్, యుద్ధం అక్కడ జరగలేదని తెలిసున్నప్పటికి, దానిని తళ్ళికోట యుద్ధమని పిలిచాడు. అహ్మద్‌నగర్, గోల్కొండ, బిజాపూర్ సుల్తాన్‌లు, విజయనగరానికి విరుద్ధంగా కూటమి ఏర్పాటు గురించి, తళ్లికోట వద్ద సమావేశమైనారు. ఈ సమావేశం తర్వాత, సుల్తాన్‌లు వారి వారి రాజధానులకు మరలి, సైన్యాలను సమాయత్తపర్చి, తళ్లికోట గుండా దక్షిణానికి బయల్దేరారు. తళ్లికోట వద్ద యుద్ధం జరుగకపోయినా, మహమ్మదీయ చరిత్రకారులు, యస్. కె. అయ్యంగార్, యస్. యస్. కంబళ్గిమట్, సత్యనాధఅయ్యర్ వంటి చరిత్ర కారులు, దీన్ని తళ్లికోట యుద్ధంగా వ్యవహరించారు. దీనికి భిన్నంగా పట్వర్ధన్, చందోర్కర్, హేరస్ వంటి పండితులు, దీనిని 'రాక్షస తంగడి యుద్ధం'గా పరిగణించారు. కె. ఎ. నీలకంఠశాస్త్రి, యన్. వెంకటరమణయ్యగార్లు **సోమరాజనబక్కైర్' క్రైఫియత్‌లు, కేలదిన్నప విజయం, 'బసాతిన్-ఉస్-సలాతిన్', 'గృహన్-ఇ-నా', 'అసిర్'** వంటి గ్రంధాలాధారంగా దీనిని చర్చించి, రాక్షసతంగడి యుద్ధంగా పేర్కొ న్నాడు. పైన పేర్కొన్న రెండు మహమ్మదీయ ఆధారాలు కృష్ణా తీరంలో యుద్ధం జరిగిందని వ్రాయగా, హిందూ ఆధారాలు కృష్ణా నది ఒడ్డున రాక్షసి, తంగడి గ్రామాల మధ్య జరిగిందని వ్రాశాయి. పై చరిత్రకారులు ఈ యుద్ధం కృష్ణా ఉత్తర ఒడ్డున, రాక్షసి, తంగడి గ్రామాల మధ్య జరిగిందని నమ్మి, దానికి రాక్షసతంగడని పేరుపెట్టారు. చరిత్రకారుల్లో భేదాభిప్రాయం రావడానిక్కారణం, కొంత మంది హిందూ ఆధారాలను నమ్మితే, మరికొందరు మహమ్మదీయ రచనలను నమ్మారు. యుద్ధం ఎక్కడ జరిగిందో ఆపేరుతో దీనిని పిలవాలని చరిత్రకారుల అభిప్రాయం. జె. ఎ. కేంప్‌బెల్, బిజాపూర్ జిల్లా గెజిటీర్‌లో వ్రాస్తూ, యుద్ధం కృష్ణా నది కుడి ఒడ్డున తళ్ళికోటకు 30 మైళ్ల దూరంలో, సలత్‌వాడకు 6 మైళ్ల దూరంలో జరిగిందని భావించాడు. అంతేకాక, ముస్లిం సైన్యాలు ఎడమ ప్రక్కన ఇంగల్‌గి రేవు గుండా నదిని దాటాయని, కృష్ణకు కుడి ఒడ్డున తండిహాల్ గ్రామం వద్ద రామరాయలు మట్టితో నిర్మించిన రక్షణ కుడ్యాలను కనుగొన్నట్లు పేర్కొన్నాడు. సీవెల్ కూడా

BRAOU

ముస్లిం సైన్యాలు ఇంగల్‌గి రేవు గుండా నదిని దాటాయని, బహుశ ఇంగల్‌గి బాయపురా తదా బాగాపురా గ్రామం పద్ద గల మైదానంలో, యుద్ధం జరగొచ్చునని భావించారు.

హెచ్. కె. షేర్వాణి, రాక్షసతంగడి సిద్ధాంతాన్ని అంగీకరించ లేదు. ఆయన అభిప్రాయం ప్రకారం 'రామరాజనబకైర్', 'కైఫియత్'లు నమ్మదగినవి కావని, యుద్ధం కృష్ణకు దక్షిణ ఒడ్డున జరిగిందని, రాక్షస, తంగడి గ్రామాలు ఉత్తర ఒడ్డున ఉన్నాయని, ముస్లిం సైన్యాలు ఉత్తర ఒడ్డున ధనూర్ రేవు వరకూ వెళ్లి, మళ్లీ వెనక్కు తిరిగి, ఇంగల్‌గి రేవును దాటి, మస్కీ, దాని దక్షిణ ఉప నదికి మధ్య వున్న బన్నిహట్టి గ్రామానికి చేరారని, ఈ లోగా విజయనగర సైన్యాలు కూడా అక్కడకు చేరాయని భావించి, కృష్ణ యుద్ధంగా పేర్కొన్నాడు. రాధేశ్యామ్, షేర్వాణితో అంగీకరిస్తూ, కృష్ణా నది ఒడ్డున యుద్ధం జరుగలేదు కాబట్టి, దీనిని కృష్ణా యుద్ధమని పిలవడం కంటే, బన్నిహట్టి వద్ద జరిగింది కాబట్టి, బన్నిహట్టి యుద్ధం గానే పిలవాలని భావించారు. ఈ సిద్ధాంతంలో కూడా, కొన్ని లోపాలున్నాయి. భారతదేశ సర్వే పటాల్లో యుద్ధ స్థలాన్ని ఇస్లాం పూర్‌కు మూడు మైళ్ల దూరంగా గుర్తించారు. బన్నిహట్టి అని గుర్తించ లేదు. షేర్వాణి గారే యుద్ధం ఇస్లాం పూర్ వద్ద జరిగిందని, స్థానిక గాధలు ప్రచారంలో ఉన్నాయని, పేర్కొన్నారు. షేర్వాణి, రాధేశ్యామ్‌లు దాన్ని ఎందుకు విస్మరించారో, కారణం తెలువ లేదు. బన్నిహట్టి గ్రామం యుద్ధం జరిగే నాటికి ఉన్నదా, లేదా అనే విషయాన్ని కూడా ప్రస్తావించ లేదు. బన్నిహట్టి గ్రామం అప్పుడు లేకపోతే, ఈ నిర్ణయం సరైందికాదు. ఈ యుద్ధాన్ని రాక్షసతంగడి యుద్ధమని పిలవాలని, విశ్వసించే వారింకా ఉన్నారు.

'రామరాజనబకైర్', బుర్హాన్-ఇ-మాసిర్' గ్రంథాలను బట్టి, సుల్తాన్‌ల సైన్యాల, విజయనగర సైన్యాల మధ్య యుద్ధాలనేకం జరిగిన తర్వాత, సుల్తాన్‌ల విజయానికి, రామరాజు మరణానికి కారణమైన చివరి యుద్ధం జరిగింది. ఈ చివరి యుద్ధానికి ముందు జరిగిన యుద్ధాల్లో ఒకటి, కృష్ణా నదికి దక్షిణ తీరంలో బన్నిహట్టి సమీపంలో ఉండొచ్చు. గ్రామకైఫియత్‌లు పక్షపాత రహితమైన ఆధారాలు; ముస్లిం చరిత్రలు కొంత పక్షపాతంతో చేసిన రచనలు; అందుచేత, గ్రామకైఫియత్‌లు పేర్కొన్నట్లు, ఈ చివరి యుద్ధం కృష్ణా, మలావహరి నదుల సంగమ స్థానంలో, రక్కస, తంగడి గ్రామాల మధ్యనే, జరిగింది; అందువలన ఈ యుద్ధాన్ని రక్కస తంగడి యుద్ధమని పిలవాల్సుంచని, సి.వి. రామచంద్రరావుగారి అభిప్రాయం.

బన్నిహట్టి యుద్ధం జరిగిన తేది గురించి కూడా, చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. 'రామరాజనబకైర్', రామరాయుల మరణం, శాలివాహన శకం 1486, రాక్షస సంవత్సరం, వైశాఖమాసం 8వ రోజున, అంటే 1565 లో సంభవించిందని పేర్కొన్నది. రాధేశ్యామ్ దీన్నంగీకరించక, మహమ్మదీయ సైన్యాలు డిసెంబర్ 25న తళ్లికోట నుండి బయల్దేరాయని, చివరి యుద్ధం 1565 జనవరి 23వ జరిగిందని భావించారు. ఈ యుద్ధం తర్వాత, ముస్లిం సుల్తాన్‌లు 4 నెలలు విజయనగరంలో ఉన్నారు. అహ్మద్‌నగర్ సుల్తాన్ విజయనగరం నుండి తిరిగి వెళ్ళిన తర్వాత, జూన్ 6, 1565 లో మరణించాడు. దీన్ని బట్టి, యుద్ధం మే నెల్లో కాక, జనవరి నెల్లో జరిగిందని భావించారు. "శోభకృత్ పృథివిజయం", ఫిబ్రవరి 1565 లో జరిగిందని పేర్కొంటోంది. ఇది ఫెరిష్టా, గోల్కొండ రచయిత పేర్కొన్న తేదీలకు దగ్గరగా ఉన్నది. సీవెల్, గోల్కొండ రచయిత రచన లాధారంగా, 1565 జనవరి 23వ తేదీని నిర్ణయించారు. ఒక్క రామరాజనబకైర్ తప్ప, మిగిలిన ఆధారాలు జనవరి ఆఖరి వారంలో జరిగిందని పేర్కొన్నాయి. అందుచేత, ఆఖరి యుద్ధం, రామరాయల మరణం జనవరి 23 లేదా 25వ తేదిన సంభవించిందని భావించాలి.

BRAOU

18.6.12.3 : పాల్గొన్న సుల్తాన్‌లు

ఈ యుద్ధంలో ఎంత మంది సుల్తాన్‌లు పాల్గొన్నారనే విషయంలో కూడా ఏకాభిప్రాయం లేదు. గుత్తి కైఫియత్ దక్కన్ సుల్తాన్‌లు, మొగల్ చక్రవర్తి అక్బర్ పాల్గొన్నట్లు పేర్కొన్నది. రామరాజన-బ్రైర్ దక్కన్ సుల్తాలు, అక్బర్ బాదుషా పాల్గొన్నట్లు పేర్కొంటూంది. కడప కైఫియత్ బిజాపూర్, బీదర్, దౌలతాబాద్, అహ్మద్‌నగర్ సుల్తాన్‌లు పాల్గొన్నట్లు పేర్కొంటూంది. తెలుగు ఆధారాల్లో, సంఖ్యలో కాని, పేర్లలో గాని, ఏకాభిప్రాయం లేదు. అక్బర్ ఈ యుద్ధంలో పాల్గొనడాన్కి ఆధారాలు లేవు. ఫెరిష్టా, అహ్మద్‌నగర్ హుస్సేన్ నిజాంషా, గోల్కొండ ఇబ్రహీం కుతుబ్‌షా, బిజాపూర్ ఆలీ ఆదిల్‌షా, బరీద్‌షాలను పేర్కొన్నాడు. బీరార్ సుల్తాన్‌లను పేర్కొనలేదు. సయ్యద్ ఆలీ, ఇబ్రహీం జుబారీలు, బీరార్ సుల్తాన్‌లు పాల్గొనలేదని వ్రాశారు. మహమ్మదీయ చరిత్రకారులందరూ 4 గురు సుల్తాన్‌లనే పేర్కొన్నారు. పోర్చుగీస్ ఆధారాలు కూడా, నల్గురు సుల్తాన్‌లను పేర్కొంటున్నాయి. దీనిని బట్టి, నిజామ్, ఆదిల్‌షా, కుతుబ్‌షా, బరీద్‌షాలు మాత్రమే పాల్గొన్నారు. అందుచేత, దీనిని నల్గురు సుల్తాన్‌ల కూటమని పిలవొచ్చు.

ఈ కూటమిని ఏర్పర్చి, ప్రోత్సహించింది ఎవరన్నది కూడ, ఏకాభిప్రాయంతో లేదు. మహమ్మదీయ చరిత్రకారులు వారివారి పోషకులకు, దానిని ఆపాదించడాన్కి ప్రయత్నించారు. రామరాయుల ఆశ్రయాన్ని, సహాయాన్ని పొందిన ఆదిల్‌షాగాని, కుతుబ్‌షాగాని, దీనిని ప్రోత్సహించడాన్కి వీలులేదు. రామరాయలు వారి కోరిక మేరకే, వారికి సహాయం చేశాడు. వారికి సహాయం చేయడం వల్ల ఎక్కువగా నష్టపోయిన వాడు, అహ్మద్‌నగర్ నిజామ్‌షా. అందుచేత, నిజామ్‌షాయే ఈ కూటమి ఏర్పాటుకు గట్టిగా కృషి చేశాడని భావించొచ్చు.

ఇంతకు ముందు పేర్కొన్నట్లు, హుస్సేన్ నిజామ్‌షా మహమ్మదీయ సుల్తాన్‌ల కూటమి నేర్ప ర్చడాన్కి, యినైతుల్లాఖాన్ అనే వానిని కుతుబ్‌షా వద్దకు పంపాడు. కుతుబ్‌షా దీని కంగీకరించి, ముస్తఫాఖాన్ అనే వాణ్ణి అహ్మద్‌నగర్‌కు పంపాడు. ఇతడు నిజామ్‌తో చర్చలు జరిపి, యినైతుల్లాతో బిజాపూర్‌కు వెళ్ళాడు. వారి స్నేహాన్ని బలపర్చడాన్కి, నిజామ్ తన కుమార్తెను ఆదిల్‌షాకు, ఆదిల్‌షా చెల్లెల్ని నిజామ్ కుమారునికి, నిజాం ఇంకొక కుమార్తెను కుతుబ్‌షాకిచ్చి వివాహం చేయ డాన్కి, అంగీకారం కుదిరింది. బిజాపూర్, అహ్మద్‌నగర్‌లలో జరిగిన ఈ వివాహాల సందర్భం లోనే, రామరాయులకు విరుద్ధంగా కూటమి ఏర్పాటుకు సన్నాహాలు జరిగాయి. నిజామ్‌షా కోరిక మేరకు, బీదర్ సుల్తాన్ కూడ కూటమిలో చేరాడు. బీరార్ సుల్తాన్ కూటమిలో చేరడాన్కి అంగీకరించ లేదు. ఈ కూటమి ఏర్పాటు గురించి సమాచారమందిన రామరాయలు, కూటమిని ఎదుర్కొనడానికి ఏర్పాట్లను ప్రారంభించాడు.

రామరాయలు యుద్ధ ప్రయత్నాలు చేస్తున్నప్పుడు, ఆదిల్‌షా యాదగిరి, చాగల్ కోట, రాయ చూర్, ముద్గల్ కోటలను వశం చేయమని, రామరాయల వద్దకు రాయబారిని పంపాడు. రామరాయలు ఆదిల్‌షా కోర్కెను తిరస్కరించాడు. మహమ్మదీయులకు కావాల్సిందదే. దాని నెపంగా, రామరాయలపై యుద్ధాన్ని ప్రకటించాడు.

18.6.12.4 : యుద్ధం

నలుగురు సుల్తాన్‌లు సైన్యాలతో తళ్లికోట గుండా, కృష్ణా నది ఉత్తర ఒడ్డుకు చేరారు. అప్పటికి రామరాయలు సైన్యంతో దక్షిణ ఒడ్డుకు చేరాడు. విజయనగర సైన్యాలు ఎదురుగా వుండటం వలన,

BRAOU

ఇంగల్‌గీ రేవును దాటడానికి సాధ్యపడక, సుల్తాన్‌లు యుక్తి పన్ని, కొంత నది దిగువకు నడిచారు. అప్పుడు రామరాయల సైన్యాలు కూడా మహమ్మదీయుల సైన్యాన్ని గమనిస్తూ దిగువకు నడిచాయి. దీనితో, ఇంగల్‌గీ రేవుకు రక్షణ లేకుండా పోయింది. మహమ్మదీయ సైన్యాలు, 3వ రోజు దాటి, త్వరితంగా వెనుకకు తిరిగి, ఇంగల్‌గీ రేవును దాటి, విజయనగర రాజ్యంలో ప్రవేశించాయి. ఈ విషయం తెలిసిన రామరాయలు దావరగిరి, కన్నశిరిల మధ్యకు సైన్యాన్ని నడిపి, తన పురోగమన దళాన్ని పంపాడు. వీరు మహమ్మదీయ పురోగమన దళంతో తలపడ్డారు. ఇరు పక్షాలు తీవ్ర నష్టానికి గురయ్యాయి. ఈ లోగా రెండు సైనాలూ హుక్కేరి, ఇర్కాల్ సంఘం వద్దకు చేరాయి. రామరాయలు తన సైన్యాన్ని మూడు భాగాలుగా విభజించి, కుడి భాగానికి తిరుమలను, ఎడమ భాగానికి వెంకటాద్రిని నియమించి, మధ్య భాగానికి తానే నాయకత్వం వహించాడు. మహమ్మదీయ సైన్యాలలో ఆదిల్‌షా కుడి భాగానికి, ఎడమ భాగానికి 'కుతుబ్‌షా, ఆలీబరీద్‌లు, మధ్య భాగానికి నిజామ్ నాయకత్వం వహించారు. యుద్ధం ప్రారంభం కావడానికి ముందు, తిరుమల, వెంకటాద్రులు 80 సంవత్సరాలు పైబడ్డ అన్న గారిని సురక్షిత ప్రాంతాలకు వెళ్లమని కోరారు. రామరాయలు వారి కోర్కెలను తిరస్కరించి, సైన్యాలను ఆదేశిస్తూ ముందుకు నడిపాడు. వెంకటాద్రి బిజాపూర్ సైన్యాలను వీరోచితంగా ఎదుర్కొని, తీవ్ర నష్టాన్ని కల్గించాడు. తిరుమల కూడా కుతుబ్‌షా సైన్యాలను వీరోచితంగా ఎదుర్కొని, తీవ్ర నష్టానికి గురిచేశాడు. ఈలోగా బిజాపూర్, బీదర్, గోల్కొండ సుల్తాన్‌లు సైన్యాన్ని సమీకరించి, విజయనగర సైన్యాన్ని ఎదుర్కొన్నారు. మూడు రోజులు జరిగిన పోరాటంలో, రెండు వైపులా తీవ్ర నష్టం జరిగింది. చివరకు విజయనగర సైన్యాలను కొంత వెనుకకు నెట్టగలిగారు. రామరాయలు సైనిక నాయకులందరిని సమీకరించి, కూటమి సైన్యాలను ఎదుర్కోవడానికి సిద్ధపరుస్తూ, రహస్యంగా ఆదిల్‌షాకు కానుకలు పంపి, కూటమి నుండి వైదొలగమని కోరాడు. ఆదిల్‌షా దాని కంగీకరించి, రామరాయలకు కూడా కానుకలను పంపాడు. రామరాయలు రెండవ దాడికి సైన్యాలను సిద్ధపర్చాడు. కొంత మంది ఆదిల్‌షా వెనుక నుండి దాడి చేయకుండా, కొంత సైన్యాన్ని కాపుంచమని, రామరాయలుకు సలహా ఇచ్చారు. కానీ, రామరాయలు ఆదిల్‌షా మాటపై నమ్మకంతో, దాన్ని త్రోసి పుచ్చాడు. రామరాయల ప్రోత్సాహంతో విజయనగర సైన్యం విజృంభించింది. కుతుబ్‌షా, నిజామ్‌షాలు, వెనుకకు తగ్గాల్సొచ్చింది. మహమ్మదీయ సైన్యాలు వెనుకకు వెళ్లి, మోస బుద్ధితో సంధి సంప్రదింపులు ప్రారంభించారు. ఒక ప్రక్క సంప్రదింపులు జరుగుతూనే, రామరాయలు కొలువులో వున్నప్పుడు మహమ్మదీయ సైన్యాధిపతులతో కుట్ర చేసి, వారిని స్వామిద్రోహానికి పురిగొల్పారు. ఇంత వరకు ఉదాసీనంగా ఉన్న ఆదిల్‌షాలో మత ద్వేషాన్ని రెచ్చగొట్టి, యుద్ధానికి పురిగొల్పారు. సుల్తాన్‌ల సంధి సంప్రదింపులను నమ్మిన విజయనగర సైన్యం అశ్రద్ధగావున్న సమయంలో, ఆదిల్‌షా హఠాత్తుగా రామరాయల సైన్యంపై దాడి చేశాడు. ఈ లోగా, రామరాయల సైన్యంలో మహమ్మదీయ సేనాపతులు తిరుగుబాటు చేసి, సుల్తాన్‌ల వైపు చేరారు. కుతుబ్‌షా, నిజామ్‌షాలు కూడా సైన్యాలను సమీకరించి, విజయనగర సైన్యంపై పడ్డారు. ఈ హఠాత్ పరిణామాల వల్ల, విజయనగర సైన్యం ధైర్యాన్ని కోల్పోయింది. ప్రాణ రక్షణ కోసం పారిపోసాగారు. రామరాయలు ధైర్యంతో వారిని వుసిగొల్పి, ముస్లిం సైన్యాలను ఎదుర్కొనడానికి ప్రయత్నించాడు. కానీ, ముస్లిం సైన్యాలు విజయనగర సైన్యాలను అన్ని వైపుల చుట్టుముట్టాయి. వెంకటాద్రి కన్నుకు గాయమై, యుద్ధ రంగం నుండి నిష్క్రమించాడు. చివరకు రామరాయలు కూడా చేలకొరగాల్సొచ్చింది.

రామరాయల మరణంపై భిన్నాభిప్రాయాలున్నాయి. రామరాయల కొలువులో ఉన్న ముస్లిం సర్దార్ ఒకడు వెనుక నుండి బల్లెంతో పొడిచి, చంపాడని కొందరూ; రామరాయలు ఏనుగు దిగి,

BRAOU

గుర్రాన్నెక్కుతుండగా, నిజామ్ సైనికులకు చిక్కాడని, హుస్సేన్ నిజామ్‌షా అతని తలను నరికి, బల్లెంపై ఎత్తి చూపగా, విజయనగర సైన్యం చెల్లాచెదురైందని కొందరు వేర్కొన్నారు. రామరాయలు ఓటమి తప్పదని తెలిసిన తర్వాత, ఇతర సుల్తాన్‌లకు చిక్కకుండా తన పెంపుడు కొడుకుగా భావించిన ఆదిల్‌షాను చంపమని కోరాడని, అతను చంపాడని రామరాజనబకైర్ వేర్కొంది. సమకాలీన ఢిల్లీ చరిత్రకారుడైన నిజాముద్దీన్ అహ్మద్, ఈ యుద్ధంలో జయం రామరాయల వైపు మొగ్గుతుండగా, హుస్సేన్ నిజామ్‌షా సైనికులు కాల్చిన ఫిరంగి గుండొకటి రామరాయల తలను పగలగొట్టిందని, అపుడు విజయనగర సైనికులు బెదిరి పారిపోవటం మొదలు పెట్టారని, సుల్తాన్‌ల సైన్యాలు వారిని చుట్టుముట్టి పారిపోకుండా వధించాయని వ్రాశాడు.

విజయనగర ఓటమి, రామరాయల మరణ వార్త విన్న విజయనగర ప్రజలు మహమ్మదీయులు హింసిస్తారని భయపడి, పట్టణాన్ని విడిచి, పారిపోయారు. తిరుమల రాయలు యుద్ధ రంగం నుండి త్వరితంగా విజయనగరం చేరి, సదాశివరాయలను, స్త్రీ జనాలను, పుత్రులను, మిగిలిన సేనా నాయకులను తీసికొని, 15,000 ఏనుగులపై ధనాలను, రత్నాలను, వజ్ర సింహాసనాలను తరలించుకొని, పెనుగొండ చేరినాడు.

విజయం పొందిన సుల్తాన్‌లు 10 రోజుల పాటు యుద్ధ రంగం లోనే ఉండి, తర్వాత విజయనగరాన్ని బయల్దేరారు. రక్షణ లేని విజయనగరంలో మహమ్మదీయ సైన్యాలు ప్రవేశించి, 6 నెలలు మకాం వేసి, వేల కొలది ప్రజలను వధించి, సుందర భవనాలను, దేవాలయాలను, విగ్రహాలను నాశనం చేశారు. ముస్లింలు గొడ్డళ్ళతో, గునపాలతో, తమ కసితీరా రోజుల తరబడి విధ్వంసకాండను సాగించి, ఆ మహా నగరాన్ని శ్మశానంగా మార్చారు. ఇటువంటి విషాదాంత దారుణ సంఘటన ప్రపంచ చరిత్రలో ముందెన్నడూ సంభవించలేదని, సీవెల్ వేర్కొన్నాడు.

BRAOU

18.6.12.5 : ఫలితాలు

ఈ యుద్ధ ఫలితాలను గూర్చి, చరిత్రకారులు భిన్నాభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ యుద్ధం భారతదేశ భవిష్యత్తునే మార్చింది. ఈ యుద్ధం దక్షిణ దేశంలో హిందూ సామ్రాజ్యానికి అంతిమ గీతాన్ని పాడిందని, ఈశ్వరీ ప్రసాద్ అభిప్రాయం. ఈ యుద్ధంతో, విజయనగర సామ్రాజ్య వైభవానికి, అభ్యున్నతికి కారణమైన తుళువ వంశ మంతరించి, విజయనగరం తన పూర్వ రాజకీయ ప్రాధాన్యతను కోల్పోయింది. ఈ యుద్ధంతో, దక్షిణ భారత సింహద్వారం బ్రద్దలు కొట్టబడి, గోల్కొండ, బిజాపూర్ సుల్తాన్‌లు దక్షిణ దేశం లోకి వ్యాపించడానికి అవకాశ మేర్పడింది. కానీ, మహమ్మదీయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోక, పరస్పర అసూయాద్వేషాలతో విచ్ఛిన్నమై, మొగల్ సామ్రాజ్యం దక్షిణంలో వ్యాప్తి చెందడానికి కారకులైనారు.

విజయనగర పతనం పరోక్షంగా, పోర్చుగీస్ వారు ఎక్కువగా విజయనగరం తోనే వర్తకవ్యాపారాలను చేయడం వలన, వారి వర్తకవ్యాపారాలు క్షీణించి, త్వరలోనే పతనమైనారు. ఈ యుద్ధం విజయనగర సామ్రాజ్య పూర్తి పతనానికి దారితీసిందని చెప్పలేం. విజయనగర పట్టణం నాశనమైనా, తిరుమల రాయలు పెనుగొండ రాజధానిగా, అరవీటి వంశాన్ని స్థాపిస్తే, వారు ఒక శతాబ్ది కాలం దక్షిణ దేశంలో రాజకీయ అధికారాన్ని కొనసాగించారు. మొత్తం మీద ఈ యుద్ధం విజయనగర సామ్రాజ్యానికే తీరని దెబ్బని చెప్పక తప్పదు.

18.6.13 : రామరాయల గుణగణాలు

16వ శతాబ్దంలో దక్షిణ దేశ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర వహించి, విజయనగర సామ్రాజ్యాన్ని అత్యున్నత స్థాయికి చేర్చిన రామరాయలుపై, ముస్లిం చరిత్రకారుల రచన లాధారంగా విమర్శల వర్షం కురిపించి, కొంత అన్యాయం చేశారనే చెప్పాలి. విజయనగర సింహాసనాన్ని దురాక్రమణ చేశాడని, సదాశివ రాయలను బంధించి పాలించాడని, దక్కన్ సుల్తాన్‌లలో కలహాలను లేపి, లాభాన్ని పొందడానికి ప్రయత్నించాడని, బన్నిహట్టి యుద్ధానికి అతడే బాధ్యుడని, విజయనగర పతనానికి కారకుడైనాడని, అనేక మంది విమర్శించారు. ఇవి పూర్తిగా నమ్మదగిన విషయాలు కావు. సమకాలీన ఆంధ్ర సాహిత్యం అతనిని గొప్ప రాజుగా వర్ణించింది. విజయనగర సామ్రాజ్యాన్ని అత్యున్నత స్థాయికి చేర్చినవాడు రామరాయలే. అతని అధికారం కృష్ణ నుండి సింహళం వరకూ, ఎదురు లేకుండా నడిచింది. విజయనగర సింహాసనాన్ని అధిష్టించాడని గాని, సదాశివ రాయలను బంధించినాడని అనడానికి, సరైన ఆధారాలు లేవు. అసంఖ్యాకమైన విజయనగర శాసనాలు, సదాశివ రాయలే విజయనగర వజ్ర సింహాసనాన్ని అధిష్టించాడని పేర్కొంటున్నాయి. రామరాయలే కనుక విజయనగర సింహాసనాన్ని అధిష్టించాలనుకుంటే, అది అంత కష్టమైన పని కాదు. అతడు కార్యకర్తగాను, మహామండలేశ్వరుడుగా మాత్రమే ప్రసిద్ధి వహించాడు. సలకం తిరుమల దుష్ట పరిపాలనకు గురి కాకుండా విజయనగరాన్ని రక్షించి, అన్ని విధాలా దాని అభ్యున్నతికి కృషి చేశాడు. రామరాయలు చేసిన సేవను నిస్వార్థమైన సేవగానే భావించాలి. 80 సంవత్సరాలు పైబడినా, ధైర్యంగా మహమ్మదీయ సైన్యాలతో పోరాడి, వీర మరణాన్ని పొందాడు. మహమ్మదీయ కుట్రకు బలైనాడుకాని, ధైర్యసాహసాలు లేక గాదు. అతడు గొప్ప వీరుడు, విజేత, పరిపాలనాదక్షుడు, రాజనీతిజ్ఞుడనడంలో సందేహం లేదు. రాజనీతిజ్ఞుడు చేసే సామ, దాన, భేద, దండోపాయాల్లో, భేదోపాయాన్ని కొంత ఎక్కువ మోతాదులో ఉపయోగించుండొచ్చు.

ఇతడు గొప్ప భాషాభిమాని. అనేక మంది విద్వాంసులను చేరదీసి, వారికి వసతులను కల్పించి, గ్రంథ రచనలను ప్రోత్సహించాడు. 'సర్వమేళ కళానిధి' ని రచించిన రామయామాత్యుడు. ఇతడు ప్రోత్సహించిన వారిలో ముఖ్యుడు. ఆంధ్ర రచయితల్లో ముఖ్యుడైన భట్టుమూర్తి, ఇతని ప్రోత్సాహంతోనే గ్రంథ రచనకు పూనుకొన్నాడు. 'రామరాజభూషణుడు' అనే బిరుదు నామమే, దానికి నిదర్శనం. రామరాయలు వైష్ణవ మతాభిమాని. వైష్ణవాచార్యుడైన తాతాచార్యులకు శిష్యుడు. సదాశివరాయల కాలంలో అనేక సుందర భవనాలు నిర్మించబడ్డాయి. రామయామాత్యని ఆధ్వర్యంలో రత్నకూటాన్ని నిర్మించాడు. ఇది దేవ లోక వైజయంతిగా ప్రసిద్ధి పొందింది.

18.7 : సంగ్రహంగా

కృష్ణదేవరాయల మరణం తర్వాత సింహాసన మధిష్టించిన అచ్యుతరాయలకు, కృష్ణరాయల అల్లుడు రామరాయలకు మధ్య, అంగీకారం కుదిరి, విదేశీయుల జోక్యాన్ని నిరోధించి, ఇద్దరూ కలసి, పాలనా భారాన్ని వహించారు. అచ్యుతరాయల మరణం తర్వాత, అతని కుమారుడు వెంకటపతిరాయలు సింహాసన మధిష్టించాడు. కానీ, అతని మేనమామ సలకరాజు తిరుమలరాజు, వెంకటపతి రాయలను వధించి, అధికారాన్ని చేపట్టడానికి ప్రయత్నించాడు. అపుడు రామరాయలు సదాశివరాయలను రాజుగా ప్రకటించి, సలకరాజును వధించి, సదాశివరాయల కార్యకర్తగా ' విజయనగర రాజకీయాల్లో ప్రముఖ పాత్ర వహించాడు. దక్కన్ సుల్తాన్‌ల పట్ల విభజించి పాలించు విధానాన్ని అనుసరించి, విజయ

BRAOU

నగరాన్ని విస్తరించడంతోపాటు, ఆర్థికంగా ఎంతో పురోభివృద్ధిని సాధించాడు. కాని, విజయనగర అధికార వైభవాలు దక్కన్ సుల్తాన్‌లలో ఈర్ష్యా ద్వేషాలను కలిగించి, వారి మధ్యనున్న విభేదాలను మరపించి, కలసికట్టుగా విజయనగరంపై దండెత్తి, బన్నిహట్టి యుద్ధంలో విజయనగర సైన్యాన్ని ఓడించి, రామరాయలను వధించి, విజయనగర పట్టణాన్ని సర్వనాశనం చేసేందుకు దారితీశాయి. ఈ యుద్ధం తర్వాత, విజయనగర సామ్రాజ్యం ఒక- 100 సంవత్సరాలు మనుగడ సాగించినప్పటికి, పూర్వ వైభవాన్ని తిరిగి పొందలేక పోయింది.

18.8 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. అచ్యుతదేవరాయల నాటి ప్రధాన పరిణామాలను పేర్కొనండి.

2. రామరాయలు దక్కన్ సుల్తాన్‌ల పట్ల అవలంబించిన విదేశీ విధానాన్ని విశ్లేషించండి.

3. బన్నిహట్టి యుద్ధ కారణాలు, జరిగిన తీరు, ఫలితాలను సమీక్షించండి.

II. క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.

1. కృష్ణదేవరాయల మరణానంతర విజయనగర పరిస్థితులు

2. సలకరాజు తిరుమలరాజు

3. రామరాయల గుణగణాలు

BRAOU

18.9 : ఉపయుక్త గ్రంథాలు

Aiyangar S.K. and Rangaswamy Saraswati, A. : **Sources of Vijayanagara History,** Madras, 1919

Heras : **The Aravidu Dynasty of Vijayanagara,** Madras, 1929

Nilakanta Sastri K.A. & Venkataramanayya, N. : **Further Sources of Vijayanagara History,** Madras, 1945

Radhey Shyam : **The Kingdom of Ahmadnagar,** Delhi, 1966

Rama Sarma, M.H. : **The History of the Vijayanagara Empire,** Bombay, 1978.

Sewell, Robert : **A Forgotten Empire (Accounts of Nuniz, Paes, Barbosa etc)** New Delhi, 1982

Sherwani H.K.& Joshi P. (eds) : **History Medieval Deccan, Vol. II,** Hyderabad, 1973

Venkataramanayya, N. : **Studies in the History of Third Dynasty of Vijayanagara,** Madras, 1935

Veerabhadra Rao, Ch. : అలియరామరాయులు, కాకినాడ

Venkataramanayya, N. : విజయనగర చరిత్ర, ప్రథమ సంపుటి, హైదరాబాద్, 1972

రచయిత : డా. వి. మురళిమోహన్

BRAOU

భాగం-19 : ఆరవీటి వంశం

విషయక్రమం

19.0 : లక్ష్యాలు

19.1 : పరిచయం

19.2 : బన్నిహట్టి యుద్ధం తర్వాతి పరిస్థితులు

19.3 : తిరుమల రాయలు

19.3.1 : సదాశివరాయల తుది పాలన

19.4 : మొదటి శ్రీరంగరాయలు

19.4.1 : ఆదిల్ షా దండయాత్ర

19.4.2 : కుతుబ్ షా దండయాత్ర

19.5 : రెండో వెంకటపతి దేవరాయలు

19.5.1 : మహమ్మదీయులతో యుద్ధాలు

19.5.2 : సామంతుల తిరుగుబాట్లు

19.5.3 : మొగల్‌లు, ఐరోపా రాజ్యాలతో, వెంకటపతి సంబంధాలు

19.5.4 : ఘనత

19.6 : రెండో శ్రీరంగరాయలు

19.7 : రామదేవరాయలు

19.8 : మూడో వెంకటపతి దేవరాయలు

19.9 : మూడో శ్రీరంగరాయలు

19.10 : సంగ్రహంగా

19.11 : పరీక్ష నమూనా ప్రశ్నలు

19.12 : ఉపయుక్త గ్రంథాలు

BRAOU

19.0 : లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం ద్వారా విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన చివరి వంశమైన ఆరవీటి వంశస్థుల చరిత్ర, విజయనగర సామ్రాజ్య చివరి దశ, పతనం గురించి తెలుసుకోగల్గాలి.

19.1 : పరిచయం

బన్నిహట్టి యుద్ధంలో విజయనగర సైన్యం ఘోరంగా ఓడిపోయినప్పటికి, విజయనగర సామ్రాజ్యం పూర్తిగా పతనమవలేదు. మహమ్మదీయుల చేతిలో విజయనగర పట్టణం నాశనమై, పూర్వ వైభవాన్ని కోల్పోయింది. దక్కన్ సుల్తాన్‌ల మధ్య అనతి కాలం లోనే విభేదాలొచ్చి, వారి కూటమి విచ్ఛిన్నమైంది. ఈ యుద్ధం తర్వాత విజయనగర సామ్రాజ్య గౌరవ ప్రతిష్ఠలు సన్నగిల్లినప్పటికీ, సుమారు వంద సంవత్సరాల పాటు కొనసాగింది. ఈ విజయనగరాన్ని పాలించిన చివరివారు ఆరవీడు వంశస్థులు. వీరు నేటి అనంతపురం జిల్లా లోని పెనుగొండ రాజధానిగా, విజయనగర రాజ్యాన్ని పాలించారు.

19.2 : బన్నిహట్టి యుద్ధం తర్వాతి పరిస్థితులు

బన్నిహట్టి యుద్ధంలో రామరాయల మరణం, విజయనగర సైనిక విచ్ఛిన్నం, విజయనగర ప్రజల్ని భయోత్పాతంలో ముంచెత్తింది. సైన్యాన్ని సమీకరించి విజయనగర పట్టణాన్ని, రాజ్యాన్ని రక్షించే నాయకుడు కరువైనాడు. యుద్ధంలో మరణించగా మిగిలిన నాయకులు, మహమ్మదీయ సైన్యానికి భయపడి, పట్టణం వదలి పారిపోయారు. రామరాయల సోదర్లుల్లో, మిగిలిన తిరుమల రాయలు, పట్టణ రక్షణకు ప్రయత్నించకుండా, క్రిందటి భాగంలో పేర్కొన్నట్లు, బంధుజనంతో, సంపదతో, పెనుగొండ చేరాడు. రక్షణ లేని పట్టణం దొంగలకు, దోపిడీదార్లకు గురైంది. విజయనగర పట్టణాన్ని, పరిసర గ్రామాలను మహమ్మదీయులు నాశనం చేశారు.

విజయనగర పట్టణం దోచుకోబడినప్పటికీ, పూర్తిగా నాశనం కాలేదు. మహమ్మదీయులు పట్టణం వదలి వెళ్ళగానే, పురజనులు వారి నివాసాలకు తిరిగి వచ్చినప్పటికీ, ప్రభుత్వం లేకపోవడం వలన, విజయనగర పట్టణం పూర్వ వైభవాన్ని పొందలేదు. సదాశివరాయల రక్షణ భారాన్ని నహించిన తిరుమల రాయలు, మహమ్మదీయులు వెళ్ళగానే విజయనగరానికి వచ్చి, విజయనగరాన్ని తిరిగి పునరుద్ధరించడానికి ప్రయత్నించాడు. కాని, ఫలితం లేకపోవడంతో, రాజధానిని పెనుగొండకు మార్చాడు. తిరుమల రాయలు రాజధానిని మార్చడానికి గల కారణాలపై, చరిత్రకారులు భిన్న అభిప్రాయాలను వెలిబుచ్చారు. మహమ్మదీయ దండయాత్రల నుండి ప్రమాదం లేకపోయినప్పటికీ, రాజధానిని మార్చడానికి వేరే కారణాలను పేర్కొన్నారు. రామరాయల కుమారుడైన పెద తిరుమల (తిమ్మ) తన తండ్రి స్థానాన్ని పొందాలని ప్రయత్నించాడు. అతడు మహమ్మదీయుల సహాయాన్ని కూడా అర్థించడంతో, తిరుమల రాయలు విజయనగరంలో ఉండటం క్షేమం కాదని, పెనుగొండ రాజధానిగా విజయనగర సింహాసనాన్ని ఆక్రమించాడు. దానితో, విజయనగర పట్టణానికి ప్రాముఖ్యత తగ్గి, అనతి కాలం లోనే పతనమైంది.

19.3 : తిరుమల రాయలు (క్రీ.శ. 1570-1571)

బన్నిహట్టి యుద్ధానికి, తిరుమల రాయలు సింహాసనాన్ని అధిష్ఠించడానికి మధ్య జరిగిన ఆరు సంవత్సరాల కాలంలో, రాజ్యంలో అరాచక పరిస్థితులు తాండవించాయని, క్రైస్తవయాత్రలు వర్ణిస్తున్నాయి. విజయనగర సామ్రాజ్యానికి ఇది పరీక్షా సమయంగా పరిణమించింది. ఆంతరంగిక విభేదాలు, అంతఃకలహాలు, విదేశ దాడులు సామ్రాజ్యాన్ని కుదిపేశాయి. రామరాయల మరణంతో కేంద్ర అధికారం బలహీనమై, రాష్ట్ర పాలకులు స్వార్థ బుద్ధితో ఎదురు తిరిగి, స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకోవడానికి

BRAOU

ప్రయత్నించారు. వీరిలో ఎక్కువ భాగం రామరాజు కొలువులో అమరనాయకులుగా నియమింపబడిన బంధువులు, ఆప్తులున్నారు. ఆదోనిని పాలిస్తున్న 'కోనేటి కొండరాజు' మొదట స్వాతంత్ర్యాన్ని ప్రకటిం చాడు. తర్వాత బంకాపుర పాలకుడైన వేల్పురాయుడు, దక్షిణంలో ఉన్న అమర నాయకులు ఎదురు తిరిగారు. మదురలో విశ్వనాధనాయకుని కొడుకు కృష్ణప్ప నాయకుడు, తంజావూరులో అచ్యుతప్ప నాయకుడు, జింజిలో కృష్ణప్ప, క్రమంగా పాండ్య, చోళ, తొండ మండలాల్లో బలవంతులయ్యారు.

ఈ పరిస్థితులన్నింటిని ఎదుర్కొనడానికి తిరుమల రాయలకు తగిన అంగ బలం గాని, అర్థ బలం గాని, లేకపోయింది. గోవా నుండి పోర్చుగీస్ వర్తకులను మోసగించి, కొంత అశ్విక బలాన్ని సమకూర్చుకోగలిగాడు. తిరుమల రాయలు విజయనగర రాజ్య రక్షణా ప్రయత్నంలో ఉండగానే, విదేశీ దాడులను ఎదుర్కోవాల్సొచ్చింది. రామరాయల కుమారుడు పెద తిరుమల, సదాశివరాయల రక్షకుడుగా తన తండ్రి స్థానాన్ని ఆక్రమించి, తిరుమలను పదవీచ్యుతుని చేయడానికి, ఆదిల్ షా సహాయాన్ని కోరాడు. ఆదిల్ షా తన రాజ్యాన్ని విస్తరించుకోవడానికి ఇదే మంచి అవకాశమని భావించి, ఆనెగొందిపై దండెత్తాడు. కానీ, దుర్గ రక్షకుడైన నవరం చెన్నప్ప నాయకుడు ఆదిల్ షాను ఓడించి, తరిమాడు. అదే సమయంలో తిరుమల రాయలు అహ్మద్‌నగర సుల్తాన్ వద్దకు రాయబారిని పంపి, ఆదిల్ షాకు విరుద్ధంగా సహాయాన్ని కోరాడు. నిజామ్‌షా, ఆదిల్ షా రాజ్యంపై దండెత్తడంతో, ఆనెగొందిని వదలి, ఆదిల్ షా వెనుకకు మళ్ళాడు.

ఇది జరిగిన కొద్ది కాలానికే, నిజామ్‌షా, కుతుబ్‌షాలు, ఆదిల్‌షాపై దండెత్తి, తిరుమలను కూడా ఆహ్వానించారు. తిరుమల పదివేల సైన్యంతో తన కుమారుణ్ణి యుద్ధానికి పంపాడు. కాని, ఈ యుద్ధం వలన తిరుమలకు ఏ ప్రయోజనం చేకూరకపోగా, మరోసారి ఆదిల్ షాను యుద్ధానికి ఆహ్వానించినట్లైంది. నిజామ్‌షా, కుతుబ్ షాలతో సర్దుబాట్లు చేసుకున్న ఆదిల్ షా, 1568లో ఆదోనిని ముట్టడించాడు. ఇంకొక సైన్యాన్ని మలీఖాన్ నాయకత్వంలో పెనుగొండ పైకి పంపాడు. పెనుగొండ దుర్గాధిపతి చెన్నప్పనాయకుడు, ఆదిల్ షా సైన్యాలను వెనుకకు తరిమాడు. కాని, ఆదోని సరిహద్దుల లోని ఇతర దుర్గాలు మహమ్మదీయుల అధీనమైనాయి.

ఆదోని వంటి సరిహద్దు ప్రాంతాలు పోయినా, మిగిలిన విజయనగర సామ్రాజ్యాన్ని కాపాడ్డానికి, తిరుమల రాయలు కృషి చేశాడు. నవరం చెన్నప్ప, ఇమ్మిడి జగదేవరావు వంటి సమర్థులైన నాయకులు ఇతనికి సహాయపడ్డారు. విజయనగర అధికారాన్ని ధిక్కరించిన మదుర, జింజి, తంజావూర్, మొద లైన అమరనాయకులను మాత్రం, తిరుమల లొబర్చుకోలేకపోయాడు. చివరకు వారు స్వతంత్రంగా అధికారాన్ని చెలాయిస్తూ, తనకు సాలీనా కప్పం చెల్లిస్తే చాలని భావించాడు. అమరనాయకులను అదుపులో ఉంచడానికి తన సామ్రాజ్యాన్ని మూడు భాగాలుగా విభజించి, తన ముగ్గురు కుమారుల్ని అధిపతులుగా నియమించాడు. పెద్ద కొడుకు శ్రీరంగదేవరాయలు పెనుగొండ రాజధానిగా తెలుగు దేశాన్ని; రెండవ కొడుకు శ్రీరామరాజు శ్రీరంగపట్నం రాజధానిగా, కన్నడ దేశాన్ని; మూడవ కొడుకు వెంకటపతిదేవరాయలు చంద్రగిరి ముఖ్య పట్నంగా, తమిళ దేశాన్ని నిర్వహించారు.

విజయనగర సామ్రాజ్యాన్ని పతనం కాకుండా కాపాడి, జీర్ణ కర్ణాటక సామ్రాజ్య రక్షకుడిగా, పునరుద్ధరించిన వాడిగా కీర్తిపొంది, 1570లో పట్టాభిషేకం చేసుకొన్నాడు. అప్పటికే వయోవృద్ధుడైన తిరుమల రాయలు 11 నెలలు మాత్రమే రాజ్యమేలి, పదవీ విరమణ చేసి, కుమారుడు మొదటి శ్రీరంగరాజుకు సింహాసన మప్పగించాడు.

BRAOU

కృష్ణదేవరాయల కాలం నుండి విజయనగర చరిత్రలో ప్రముఖ పాత్ర వహించిన వ్యక్తుల్లో తిరుమల రాయలు ఒకడు. సదాశివరాయల కాలంలో సోదరుడు రామరాయలకు కుడి భుజమై, విశేష అనుభవాన్ని గడించాడు. అనేక పదవుల్లో పాలనా సామర్థ్యాన్ని ప్రదర్శించాడు. బన్నిహట్టి యుద్ధం తర్వాత అంతఃకలహాల తోటి, విదేశీ దాడుల తోటి పతనమవ్వకుండా తిరుమల రాయలు కాపాడినాడనడంలో సందేహం లేదు. క్షీణించిన కర్ణాటక సామ్రాజ్యాన్ని రక్షించిన వాడుగా, పునరుద్ధరించిన వాడుగా కీర్తించబడ్డాడు.

19.3.1 : సదాశివరాయల తుది పాలన

సీజర్ ఫ్రెడరిక్ రచనల ఆధారంగా, సదాశివరాయలను తిరుమల రాయలు గాని, అతని కుమారుడు గాని, హత్య గావించి, అధికారాన్ని చేపట్టారని కొందరు భావించారు. కాని, ఇది సత్యమని భావించలేం. గ్రామ శైఫియత్తులు అనేకం, సదాశివరాయలు బన్నిహట్టి యుద్ధం తర్వాత ఆరు సంవత్సరాలు పరిపాలించినట్లు పేర్కొంటున్నాయి. ఇదే కాక, అనేక శాసనాలు సదాశివరాయలు 1576 వరకు జీవించి ఉన్నట్లు, రాజ్య పాలన చేస్తున్నట్లు పేర్కొంటున్నాయి. వీటిని బట్టి చూస్తే, సీజర్ ఫ్రెడరిక్ చెప్పింది నిజం కాదని తోస్తుంది. తిరుమల రాయల అధికారాన్ని అంగీకరించని కొందరు నాయకులు, అతణ్ణి అపఖ్యాతి పాలు చేయడానికి దీన్ని ప్రచారం చేశారని, వెంకటరమణయ్య వంటి వారు భావించారు. సదాశివ రాయల శాసనాలు 1576 వరకు లభించడం వలన, అతడు నామమాత్రంగా 1576 వరకు పరిపాలించాడని భావించొచ్చు. నామమాత్రుడైన సదాశివ రాయల నుండి ఏ రకమైన ప్రమాదం లేనప్పుడు, అతనిని హత్య చేయాల్సిన అవసరం తిరుమల రాయలకు లేదు. 1576 వరకు తిరుమలరాయలు, అతని తర్వాత శ్రీరంగరాయలు, సదాశివరాయలు కలిసే పరిపాలన సాగించారని భావించొచ్చు. అతని మరణంతో తుళువ వంశ పాలన అంతమై, ఆరవీటి వంశస్థుల పాలన ప్రారంభమైంది.

19.4 : మొదటి శ్రీరంగరాయలు (1572 - 85)

తిరుమల రాయలు పట్టాభిషేకం తర్వాత ఒక సంవత్సర కాలం మాత్రమే పరిపాలించిన తదుపర్ని అతని పెద్ద కుమారుడైన మొదటి శ్రీరంగరాయలకు రాజ్య మప్పగించి, అతడు రాజకీయాల నుండి నిష్క్రమించాడు. శ్రీరంగరాయలు ఎప్పుడు సింహాసన మధిష్ఠించాడో, శైఫియత్తులు, శాసనాలు తెలియజేస్తున్నాయి. కొండవీటి శైఫియత్ గంగాధర రామేశ్వర దేవాలయం లోని శాసనాన్ని ఉదహరిస్తూ, తిరుమల రాయలు ఏప్రియల్ 1572 నాటికి రాజ్యం చేస్తున్నాడని, అతని పాలన ఆ సంవత్సరాంతానికి అంతమైందని పేర్కొంటూంది. మొదటి శ్రీరంగరాయల పాలన మే 1572 లో ప్రారంభమైనట్లు, వీరప్పయ్య కాలజ్ఞానం పేర్కొంటూంది. జులై 1572 నాటి శ్రీపెరంబుదూర్ శాసనం, చంద్రగిరి కేంద్రంగా, తమిళ దేశాన్ని పాలిస్తున్న వెంకటపతి తన సోదరుడు శ్రీరంగరాయల సార్వభౌమత్వాన్ని గుర్తించినట్లు వర్ణిస్తూంది. వీటిని బట్టి, శ్రీరంగరాయల పాలన ఏప్రియల్, జులై 1572 మధ్య కాలంలో ప్రారంభమైనట్లు భావించాలి. సింహాసన-మధిష్ఠించిన శ్రీరంగరాయలు అనేక సమస్యలను ఎదుర్కొనాల్సొచ్చింది. బన్నిహట్టి యుద్ధ భీభత్సం నుండి దేశం ఇంకా తేరుకోలేదు. గ్రామాలన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. భూముల్లో సేద్యం లేదు. దేవాలయాల్లో ఆరాధన లేదు. పాళెగాండ్రు, స్థానిక నాయకులు కేంద్ర అధికారాన్ని ధిక్కరించడమే గాక, వారిలో వారు కలహించుకొంటున్నారు. దానికి తోడు, తరచుగా ముహమ్మదీయ దండయాత్రలు ప్రారంభమైనాయి.

BRAOU

19.4.1 : ఆదిల్‌షా దండయాత్ర

బిజాపూర్ సుల్తాన్ అలీ ఆదిల్‌షా 1576లో ఆదోని దగ్గర పెద్ద సైన్యాన్ని సమీకరించి, హండే తిమ్మనాయకుడు తోడురాగా, పెనుగొండపై దండెత్తాడు. ఈ వార్త విన్న శ్రీరంగరాయలు, కోట రక్షణ భారాన్ని సవరం చిన్నప్పకు అప్పగించి, ధన రాశులతో చంద్రగిరిలో తలదాచుకొన్నాడు. ఆదిల్‌షా దాడిని తట్టుకోలేక, పెనుగొండ పతనమయ్యే పరిస్థితి ఏర్పడటంతో, శ్రీరంగరాయలు కుతుబ్‌షా సహాయ మర్థించాడు. శ్రీరంగరాయలకు, కుతుబ్‌షాకు 1576 లో ఒప్పందం కుదిరింది. కుతుబ్‌షా సైన్యం మహమ్మద్ అంజూ నాయకత్వంలో దక్షిణంగా బయల్దేరింది. ఈ లోగా శ్రీరంగరాయలు హండే తిమ్మప్పకు ధన మాశ చూపి, ఆదిల్‌షా పక్షం వదిలేసేటట్లు చేశాడు. ఈ విధంగా పరిస్థితులు అనుకూలించడంతో, సవరం చిన్నప్ప డిశంబర్ 1576లో ఆదిల్‌షా సైన్యాల నోడించి, పెనుకకు పంపాడు. కాని, ఈ విజయం వలన శ్రీరంగరాయలకు పెద్ద లాభం చేకూర లేదు.

19.4.2 : కుతుబ్‌షా దండయాత్ర

శ్రీరంగరాయలతో చేసుకొన్న ఒప్పందాన్ని విస్మరించి, కుతుబ్‌షా విజయనగరంపై దాడులను ప్రారంభించాడు. 1578, 79లో కుతుబ్‌షా సైన్యాధిపతి, మహారాష్ట్ర నాయకుడైన మురహరిరావు మహమ్మదీయ సైన్యానికి నాయకత్వం వహించి, కృష్ణను దాటి, హండె మల్కప్ప, కదంబరాయలతో కలిసి, కర్నూలు మండలాన్ని ఆక్రమించి, హండే వారికి అప్పగించాడు. కాని, కర్నూలు హండేవారి అధీనంలో అట్టే కాలం నిలువలేదు. శ్రీరంగరాయలు పంపిన తెలుగు చోడుడు కొండ్రాజు వెంకటరాజు దండెత్తి, హండేవారిని తరిమి, వారి రాష్ట్రాన్ని ఆక్రమించాడు.

విజయనగర నాయకుల అంతఃకలహాలు, గృహ కలహాలు, కుతుబ్‌షాకు మంచి అవకాశాన్నిచ్చాయి. కొండ్రాజు వెంకటరాజు తన సోదరుల్లో వారి ఓబళరాజు నోడించి, అతని భూములను ఆక్రమించాడు. ఓబళరాజు అభ్యర్థనపై వెలుగోటి రంగప్ప బావ దామెర్ల వెంకటపతి, రెండు వేల సైన్యంతో అతనికి సహాయంగా వచ్చాడు. కొండ్రాజు సోదరుడు మట్లి తిమ్మరాజు కడప మండలంలో కోడూరు వద్ద వారిని ఎదుర్కొన్నాడు. 1579 సెప్టెంబర్ 27న జరిగిన యుద్ధంలో రంగప్ప, మట్లి తిమ్మరాజును వధించాడు. కొండ్రాజు సైన్యం పారిపోవడంతో, ఓబళరాజు తన భూములను తిరిగి ఆక్రమించుకొన్నాడు.

ఈ అంతఃకలహాలను అవకాశంగా, కుతుబ్‌షా సేనలు 1579 మార్చి 29న హైదర్ ఉల్ ముల్క్ నాయకత్వంలో విజయనగరంపై దండెత్తాయి. మహమ్మదీయ సైన్యం బెల్లంకొండ, వినుకొండ, నాగార్జునకొండలను జయించి, కొచ్చర్లకోట దగ్గర ఉన్న కస్తూరి రంగప్ప సైన్యం పైకి నడిచింది. కాని, వెలుగోటి సైన్యం యుద్ధం చేయకుండానే వెనుదిరగడంతో, కుతుబ్‌షా సైన్యాలు ఉదయగిరిని ముట్టడించి, దుర్గాధిపతి వెంకటరాజును తరిమి, కోటను ఆక్రమించాయి. కృష్ణ మొదలు ఉదయగిరి వరకు ఉన్న ప్రాంతాలు మహమ్మదీయుల వశమైనాయి. కస్తూరి రంగప్ప ఈ ప్రళయాన్ని ఆపడానికి ప్రయత్నించాడు. కాని, కుతుబ్‌షా సైన్యాధిపతి అతని ప్రయత్నాన్ని సాగనివ్వలేదు. కుతుబ్‌షా సైన్యం కొండవీడు దుర్గాన్ని ముట్టడించింది. కొండవీడు దుర్గం శత్రు సైన్యాలకు లొంగలేదు. కుతుబ్‌షా, హైదర్ ఉల్ ముల్క్ స్థానంలో, నయ్యద్ షాతక్‌ను సైన్యాధిపతిగా నియమించాడు. అయినప్పటికి, కొండవీడును జయించలేకపోయారు. చివరకు కుతుబ్‌షా వెలుగోటి తిమ్మ నాయకునికి లంచమిచ్చి, అతని సహకారంతో కొండవీడును స్వాధీనం చేసుకొన్నాడు. దీనితో, ఈ ప్రాంతంలో విజయనగర

BRAOU

అధికారం క్షీణించింది. శ్రీరంగరాయలకు, అతని సోదరులు గాని, సామంత నాయకులు గాని సహాయం చేయక పోవడంతో, ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా తనవారే శత్రువులుగా వ్యవహరించడంతో, రాజ్యం నానాటికి క్షీణిస్తుండగా, 1585 నవంబర్‌లో శ్రీరంగరాయలు మరణించాడు.

19.5 : రెండో వెంకటపతి దేవరాయలు (1586 -1614)

మొదటి శ్రీరంగరాయలకు సంతానం లేదు. అతని అన్నగారు శ్రీరంగపట్ను రాజప్రతినిధైన రామరాజు ముందే మరణించడం, అతని కుమారులైన తిరుమల, శ్రీరంగ పసివారవడం వలన, సింహాసనాన్ని ఆక్రమించి విజయనగర పరిస్థితులను చక్కబర్చే పరిస్థితుల్లో లేరు. అట్టి పరిస్థితుల్లో చిన్నపట్నం పాలకుడైన జగదేవరావు నాయకత్వంలో, విజయనగర ప్రభువులు విజయనగర సామంతులను కట్టడి చేసి, మహమ్మదీయుల నుండి విజయనగరాన్ని కాపాడగల సమర్థుడు శ్రీరంగని తమ్ముడైన వెంకటపతి ఒక్కడే అని భావించి, అతనిని పాలకుడుగా నిర్ణయించారు. **వీరప్పయ్య కాలజ్ఞానం,** జనవరి 21, 1586 లో, రెండో వెంకటపతిరాయలు విజయనగర సింహాసనాన్ని అధిష్టించినట్లు పేర్కొంటూంది. శాసనాలు కుడా దీనిని సమర్థిస్తున్నాయి. ఆరవీటి వంశస్థుల్లో రెండో వెంకటపతి దేవరాయలు సమర్థుడు. విజయనగర పరిస్థితులను చక్కదిద్దడానికి విశేషంగా కృషి చేశాడు.

19.5.1 : మహమ్మదీయులతో యుద్ధాలు

రెండో వెంకటపతి దేవరాయలు గోల్కొండ సుల్తాన్ ఆక్రమించిన విజయనగర భాగాలను తిరిగి ఆక్రమించుట తన ప్రథమ కర్తవ్యంగా భావించాడు. గోల్కొండ అజ్ఞాత చరిత్రకారుని రచనల ప్రకారం, కుతుబ్ షా మిగిలిన విజయనగర సామ్రాజ్యాన్ని జయించడానికి అమర్-ఉల్-ముల్క్‌ను విజయనగరం మీదకు పంపాడు. మహమ్మదీయ సైన్యాలు కర్నూలు జిల్లా, నందికొట్కూర్ తాలుకా, మొసలి మడుగు ప్రాంతంలో కృష్ణను దాటి, కొంత ప్రతిఘటన తర్వాత ఆ కోటను ఆక్రమించి, నంద్యాల పాలకుని జయించి, కడప జిల్లా జమ్మలమడుగు లోని గండికోట వైకి నడిచాయి. కర్నూల్, గుత్తి దుర్గాలు కూడా మహమ్మదీయుల వశమైనాయి. ఈ దాడి ఫలితంగా కర్నూల్ ప్రాంతం, కడప, అనంతపూర్ జిల్లాల్లో కొన్ని భాగాలు మహమ్మదీయుల వశమైనాయి. ఈ ప్రాంతాలను ఆక్రమించిన తర్వాత, మహమ్మదీయ సైన్యాలు గండికోటను ముట్టడించాయి. వెంకటపతి దేవరాయల దూర బంధువైన నంద్యాల నరసింహరాజు, దాని పాలకుడు. ఇతడు కొంత కాలం మహమ్మదీయ సైన్యాన్ని ప్రతిఘటించి, చివరకు ఇతర నాయకుల్లా కప్పం కట్టడానికి అంగీకరించాడు. ఈలోగా కుతుబ్ షా స్వయంగా సైన్యాన్ని నడిపించుకొని, పెనుగొండ దుర్గాన్ని ముట్టడించాడు. ఈ దండయాత్రను ఎదుర్కోడానికి సిద్ధంగా లేని వెంకటపతి, కొంత కాలయాపన చేయడానికి, గోపరాజు తిమ్మరాజును, వాసయశెట్టిని శాంతి ప్రయత్నాలు చేయడానికి కుతుబ్ షా శిబిరానికి పంపాడు.

ఈ వ్యవధిలో వెంకటపతిరాయలు, వెలుగోటి కస్తూరి రంగప్ప నాయకుడు, అతని కుమారుడు వెంకటపతి జగదేవరావ్, మల్లి అనంతరాజు, తంజావూర్ రఘునాధ నాయకుడు మొదలైన నాయకులందరిని సమావేశపర్చి, పెనుగొండను రక్షించడానికి ఏర్పాట్లు చేసి, కుతుబ్ షాను ఎదుర్కొన్నాడు. జగదేవరావ్ కుతుబ్ షా సైన్యాన్ని ఎదుర్కొని, అక్కడ జరిగిన యుద్ధంలో మూర్తజాఖాన్, నూరాఖాన్ దళాల నోడించి, సాజలోఖాన్‌ను పధించి, చిత్తాఖాన్‌ను బందీగా పట్టుకొన్నాడు. ఈ పరిణామాలకు భయపడిన కుతుబ్ షా ముట్టడిని విరమించుకొని, తన రాజ్యం వైపు మరలాడు. తన

BRAOU

రాజ్యంలో ప్రవేశించడానికి ముందు, గండికోటకు నంజర్‌ఖాన్, నంద్యాలకు జగత్‌రావ్‌ను, మొసలి మడుగుకు అశ్వారావ్‌ను రక్షకులుగా నియమించి, ముర్తజాఖాన్‌ను ఈ ప్రాంతాలకు సైన్యాధిపతిగా నియమించాడు.

కుతుబ్‌షాను పెనుగొండ నుండి తరిమిన తర్వాత, విజయనగర సైన్యం అంతటితో ఆగలేదు. కుతుబ్‌షా ఆక్రమించిన ప్రాంతాలను తిరిగి ఆక్రమించడానికి పూనుకొన్నారు. విజయనగర సైన్యాలు గుత్తి దుర్గాన్ని ఆక్రమించి, గండికోట వైకి నడిచాయి. కుతుబ్‌షా కొండవీడు పాలకుడుగా ఉన్న అఫజల్‌ఖాన్‌ను, గండికోటకు సైన్యం పంపవలసిందిగా ఆదేశించాడు. ఇది తెలిసిన వెంకటపతి దేవరాయలు అఫజల్ ఖాన్ సైన్యాన్ని అడ్డుకోవడమేగాక, కొండవీడు, గోల్కొండల మీదకు సైన్యాన్ని పంపాడు. గుర్రంకొండ వద్ద జరిగిన యుద్ధంలో, అఫజల్‌ఖాన్ సైన్యాన్ని ఓడించడంతో, సహాయక సైన్యం గండికోట చేరలేక పోయింది. కుతుబ్‌షా సేనాపతి ముర్తజాఖాన్ కడప మీదకు దండెత్తాడు. వెంకటపతి ఎర్రతిమ్మరాజును పంపాడు. కాని, ముర్తజా అతని నోడించి తరిమాడు. ఈ లోగా కుతుబ్‌షా రుస్తుంఖాన్‌ను, ముర్తజాఖాన్‌కు సహాయంగా పంపాడు. విజయనగర సైన్యానికి, కుతుబ్‌షా సైన్యానికి, పెన్నా నది ఒడ్డున తుమ్మల దగ్గర యుద్ధం జరిగింది. విజయనగర సైన్యం, కుతుబ్‌షా సైన్యాన్ని ఓడించి, కృష్ణానది అవతలకు తరిమాయి. చివరకు, కుతుబ్‌షా కృష్ణా నదిని రెండు రాజ్యాల మధ్య సరిహద్దుగా అంగీకరించాడు.

19.5.2 : సామంతుల తిరుగుబాట్లు

కుతుబ్‌షా పై విజయాన్ని సాధించిన తర్వాత, రెండో వెంకటపతి దేవరాయలు విజయనగర అధికారాన్ని ధిక్కరించిన నాయకులను అణచడానికి పూనుకొన్నాడు. మహమ్మదీయుల దాడులను అదనుగా తీసుకొని, కోలార్ ప్రాంతం లోని తమ్మన గౌడ, మొదలైన వారు, వెంకటపతి రాయలకు ఎదురు తిరిగి, కప్పం కట్టడం మానేశారు. తంజావూర్ రఘునాధనాయకుడు, వెలుగోటి కస్తూరి రంగప్ప, మట్లి అనంత భూపాలుడు మొదలైనవారు తోడు రాగా, విజయనగర సైన్యం కోలార్‌ను ముట్టడించింది. అనంతరాజు కోటను ముట్టడించగా, వెంకటపతి ముందుకు సాగి, కొత్త కనుమ వద్ద శత్రువులను ఎదుర్కొన్నాడు. కస్తూరి రంగప్ప విజృంభించి, తమ్మన గౌడను బంధించి, రాయలకు అప్పగించాడు. తమ్మయ్య కప్పం మొత్తం చెల్లించి, సామంతుడుగా ఉండటానికి అంగీకరించాడు.

రాయల అధికారాన్ని ధిక్కరించిన వారిలో, వెంకటపతి రాయల దూరపు బంధువైన కృష్ణంరాజు ఒకడు. ఇతడు రాయల అధికారాన్ని ధిక్కరించి, పొత్తపి సిద్ధవటం అధిపతి కొండ్రాజు తిరుపతి రాజు, కర్నూలు గోపాలరాజు సహాయంతో, మట్లి వారి భూములను ఆక్రమించాడు. వీరికి విరుద్ధంగా, మట్లి ఎల్లమరాజు, హండే వెంకప్ప నాయకుడు, వెమ్మసాని తిమ్మానాయకుడు, రాయల పక్షం వహించారు. కృష్ణంరాజు జమ్మలమడుగులో రాయల నెదుర్కొన్నాడు. కాని, ఓడిపోయి, నంద్యాల కోటలో తలదాచుకొన్నాడు. రాయలు కోటను చుట్టుముట్టాడు. ముట్టడి 3 నెలలు సాగింది. చివరకు కృష్ణంరాజు నంధికి వేడుకొన్నాడు. అతని భూములను వశం చేసుకొని, వెమ్మసాని వారికి, హండేవారికి పంచిచ్చాడు. నాటి నుండి వెమ్మసాని వారికి గండికోట రాజధానైంది. కృష్ణంరాజు చంద్రగిరి దుర్గంలో బంధించబడి, తర్వాత మరణించాడు. ఇతనికి అండగా నిల్చిన కొండరాజు, తిరుపతి రాజుల పైకి, రాయలు మట్లి ఎల్లమరాజును ఉసిగొల్పాడు. ఊటకూరు దగ్గర జరిగిన యుద్ధంలో, తిరుపతిరాజు ప్రాణాలను కోల్పోయాడు. పులుగునాడు, సిద్ధవటం, చెన్నూరు, దువ్వూరు, కమలాపురం, పోరుమామిళ్ళ, బద్వేలు మొదలైన సీమలు, మట్లి వారికి అమరంగా లభించాయి.

BRAOU

17వ శతాబ్ది ఆఖర్లో తమిళ దేశం లోని నాయకులు తమ అమరాలను వారసత్వంగా వచ్చినవిగా భావించి, వీటిలో వెంకటపతి రాయల జోక్యాన్ని సహించలేక, అనేక తిరుగుబాట్లు చేశారు. రాయలు తన అధికారాన్ని ఈ ప్రాంతాలపై స్థిరపర్చుకోవడానికి, ప్రయత్నాలను ప్రారంభించాడు. వెల్లూరు సీమకు అధిపతైన లింగమ నాయకుడు, దాని అధిపతిగా భావించసాగాడు. వెంకటపతి రాయలు ఆ ప్రాంతాలపై తన అధికారాన్ని చాటడానికి, వెలుగోటి కస్తూరి రంగప్ప కుమారుడైన యాచమ నాయకునికి, పెరుంచేడు సీమ (చెంగల్పట్టు- మధురాంతకం తాలూకా) ను అమరంగా ఇచ్చాడు. యాచమ మధురాంతకాన్ని కేంద్రంగా చేసుకొని, ఉత్తర మల్లూరు కోటపై అకస్మాత్తుగా దాడిచేసి, దాని నాక్రమించాడు. ఇది లింగమ సామంతుడైన నాగని అధికారంలో ఉంది. అతడు లింగమ సహాయాన్ని అర్థించాడు. వెంకటపతి రాయల మద్దతు గల యాచమను అంత సులువుగా తొలగించలేమని తెలిసిన లింగమ, తన అధీనంలో ఉన్న సామంతులను మదుర, తంజావూరు, జింజి, నాయకులు పంపిన సైన్యాల తోను, పెద్ద సేనను సమకూర్చుకొని, దావుల పాపా నాయకుడిని సర్వసైన్యాధ్యక్షుడిగా నియమించాడు. ఈ సైన్యం 31 మే 1601లో, ఉత్తర మల్లూరు చేరి, కోటకు తూర్పు భాగంలో శిబిరాన్ని నిల్పారు.

ఇంత పెద్ద సైన్యాన్ని చూచిన యాచమ నాయకుడు భయపడక, ధైర్యంతో తన తమ్ముడు సంగమ నాయకుడు తోడురాగా, మూడు వేల వెలమ సైన్యంతో, శత్రువుపై దూకాడు. వారి ధాటికి శత్రు నాయకులు చెల్లాచెదరయ్యారు. పాపానాయకుడు మరణించాడు. కొందరు నాయకులు పారిపోయారు. గాయాలు తగిలిన అనేక మంది నాయకులు బందీలుగా చిక్కారు. యాచమ నాయకునికిది అద్భుత విజయం.రాయలు అతనిని ఆస్థానానికి రప్పించి, ఘనంగా సన్మానించాడు.

ఉత్తర మల్లూరు యుద్ధంలో యాచమ నెదుర్కొన్న నాయకులందరిని వేరు వేరుగా అణచడానికి, వెంకటపతిరాయలు బయల్దేరాడు. మట్లి అనంతరాజు రాయల సైన్యానికి నాయకత్వం వహించాడు. ఇతనికి సహాయంగా అతని కుమారుడు తిరువెంగళనాథుడు, ముఖ్యులుగా గల రెండవ చిక్కరాజు, దామెర్ల చిన్న మొదలైన వారు బయల్దేరారు. ఈ సైన్యం చంద్రగిరి నుండి బయల్దేరి, వెల్లూరి రాజ్యం వైపు ఎక్కువ ప్రతిఘటన లేకుండానే నడచింది. మిన్నూలు దగ్గర లింగమ వారి నెదుర్కొన్నాడు. ఇక్కడ జరిగిన పోరులో, దామెర్ల చిన్నమ చూపిన ధైర్యంతో, లింగమ పారిపోయాడు. తర్వాత, రాయల సైన్యం చోళ దేశంలో ప్రవేశించి, అక్కడ తిరుగుబాటుదార్ల నణచి, కావేరిని దాటి, పాండ్య భూములను భీభత్సం చేస్తూ, ముందుకు సాగింది. మదుర నాయకుడు వారిని తూముల యుద్ధంలో ఎదుర్కొని, పరాజితుడయ్యాడు. ఈ విజయాల వలన, వెంకటరాయల అధికారం అన్ని వైపుల వ్యాపించింది. లింగమ నాయకుడు ఇంకను వెంకటపతి అధికారాన్ని గుర్తించక, వెల్లూరు కోటలో తలదాచుకొన్నాడు. రాయల సైన్యం వెల్లూరును ముట్టడించి, వెల్లూరు దుర్గాన్ని ఆక్రమించి, లింగమను బందీగా పట్టుకొన్నారు. వెంకటపతిరాయలు తన రాజధానిని వెనుగొండ నుండి వెల్లూరుకు మార్చాడు.

19.5.3 : మొగల్‌లు, ఐరోపా రాజ్యాలతో, వెంకటపతి సంబంధాలు

వెంకటపతి రాయల ఆస్థానానికి మొగల్ చక్రవర్తి అక్బర్ తన సార్వభౌమాధికారాన్నంగీకరించమని కోరుతూ, రాయబారాన్ని పంపినట్లు తెలుస్తూంది. అయితే, అక్బర్ కోరికను మన్నించక, అవసరమైతే యుద్ధానికి సిద్ధమేనని, వెంకటపతి రాయలు కబురు చేసినట్లు తెలుస్తూంది. వెంకటపతి రాయలు పోర్చుగీస్ వారి పట్ల దృఢమైన విధానాన్ని అనుసరించాడు. పోర్చుగీస్ వారి తోను, స్పెయిన్ రాజైన

BRAOU

రెండవ ఫిలిప్ తోను, సత్సంబంధాల నేర్పర్చుకొన్నాడు. డచ్ వారికి పులికాట్ వద్ద ఫ్యాక్టరీ నిర్మించుకొని, వ్యాపారం చేసుకోవడానికి అనుమతిచ్చాడు. కాని, పోర్చుగీస్‌వారు 1612 లో డచ్‌వారిని పులికాట్ నుండి తరిమేశారు. వెంకటపతి డచ్‌వారికి తిరిగి పులికాట్‌లో స్థానాన్ని కల్పించాడు. వారు అక్కడ ఒక కోటను నిర్మించుకొన్నారు.

19.5.4 : ఘనత

ఆరవీటి వంశస్థుల్లో రెండవ వెంకటపతిరాయలు సమర్థుడు. అంతఃకలహాల తోను, విదేశీ దాడుల తోను, క్షీణావస్థకు వచ్చిన విజయనగర సామ్రాజ్యాన్ని రక్షించి, అంతర్గత శత్రువులను, బహిర్గత శత్రువులను అణచి, విజయనగర పూర్వవైభవాన్ని పునరుద్ధరించడానికి ఇతడు విశేష కృషి సల్పాడు. బన్నిహట్టి యుద్ధం తర్వాత నిర్జనమైన గ్రామాలను తిరిగి పునరుద్ధరించి, వ్యవసాయాన్ని ప్రోత్సహించి, పూర్వపు ఆర్థిక పాటవాన్ని తీసుకువచ్చాడు. ఇతని సామంత రాజులు కూడా వ్యవసాయాన్ని ప్రోత్సహించి, చిన్నాభిన్నమైన విజయనగర ఆర్థిక వ్యవస్థను తిరిగి నిర్మించారు. వెంకటపతి రాయలు ఏలిన 30 సంవత్సరాల కాలంలో, అతడు ఎంతో కష్టించి, విజయనగర సామ్రాజ్యాన్ని కాపాడటమేగాక, దాని పూర్వవైభవాన్ని పునరుద్ధరించడానికి కృషి చేశాడు. ఇతడు విద్యను, పండితులను, కళలను, పోషించాడు. ఎన్నో దేవాలయాలకు దానధర్మాలను చేశాడు. స్వయంగా పండితుడు. తాతాచార్యులు, అయ్యప్ప దీక్షితులు మొదలైన వేదాంతులను, తెనాలి రామకృష్ణ, మల్లన, చిన్నమరాజు మొదలైన కవి పండితులను ఆదరించాడు.

19.6 : రెండో శ్రీరంగరాయలు (క్రీ.శ. 1614)

రెండో వెంకటపతి రాయలకు సంతానం లేకపోవడంతో, తన అన్న రామరాజు కుమారుడు శ్రీరంగరాయలను, వారసుడిగా ప్రకటించాడు. కాని, అతని భార్యల్లో అళియ రామరాయల మనుమరాలు, గొబ్బూరి ఓబరాజు కుమార్తైన బాయమ్మ గర్భవతిగా నటించి, ఒక బ్రాహ్మణ బాలుణ్ణి వెంకటపతి కుమారునిగా నమ్మించాలని చూచింది. ఈ విషయం వెంకటపతి రాయలకు తెలిసినప్పటికి, అపకీర్తికి భయపడి, ఆ బాలుని కాదనలేదు. ఆ బాలునికి 14 ఏళ్ళురాగానే, బాయమ్మ సోదరుడు జగ్గరాజు కూతురు నిచ్చి వివాహం చేశారు. కాని, వెంకటపతి రాయలు చివరి రోజుల్లో తన సోదరుని కుమారుడైన శ్రీరంగరాయలను రాజుగా ప్రకటించాడు. 1614 ఆగస్ట్‌లో శ్రీరంగదేవరాయలు రాజయ్యాడు. ఇతడు రాజ్యానికి రావడం ఇష్టం లేని జగ్గరాజు, అతని అనుయాయులగు మూకరాజు, తిమ్మానాయకుడు మొదలైనవారు, రాజును దర్శించే మిషతో కోటలో ప్రవేశించి, అంతఃపురాన్ని చుట్టుముట్టి, శ్రీరంగదేవరాయలను, అతని భార్యాపుత్రులను బంధించి, జగ్గరాజు అల్లుడిని సింహాసనంపై ప్రతిష్ఠించారు. అక్కడ చేరిన ప్రభువులందరూ అతనిపై విశ్వాసాన్ని ప్రకటించారు.

జగ్గరాజు చర్యను వెలుగోటి యాచమ నాయకుడెదుర్కొన్నాడు. దానితో, విజయనగరంలో తీవ్ర అంతర్యుద్ధం చెలరేగింది. యాచమ నాయకుడు యుక్తితో శ్రీరంగదేవరాయలను, అతని సంతానాన్ని చెరసాల నుండి తప్పించడానికి ప్రయత్నించాడు. కాని, శ్రీరంగదేవరాయల పుత్రుల్లో ఒకడైన రామదేవుడు మాత్రమే, చెర నుండి తప్పించుకో గలిగాడు. యాచమ నాయకుడు అతనిని సాదరంగా ఆహ్వానించి, మిగిలిన రాజ కుటుంబీకులను చెర నుండి తప్పించడానికి ప్రయత్నించాడు. రామదేవుడు చెర నుండి తప్పించుకొన్నాడని తెలియగానే, జగ్గరాజు చెరసాల కావలాను ఇంకా కట్టుదిట్టం చేశాడు. యాచమ నాయకుడు తన వారిని 20 మందిని కారాగార అధిపతైన తళవాయి దగ్గర కోలువులో చేర్చి, రాజ కుటుంబాన్ని రక్షించడానికి ప్రయత్నించాడు. వీరు రాజకుటుంబీకులను తప్పించడానికి

BRAOU

ఒక సారంగాన్ని త్రవ్వి, రాజ కుటుంబాన్ని తప్పిస్తుండగా, చివరి క్షణంలో జగ్గరాజు దానిని తెలుసుకొని, శ్రీరంగరాయలను ఇంకొక చెరసాలకు మార్చి, తానే కారాగార రక్షణా బాధ్యతను స్వీకరించాడు. యాచమ నాయకుడు నిరాశ చెందక, వేలూరు దళవాయి ఈ ఓబులేశునకు సొమ్ము ఆశ చూపి, తన పక్షం తిప్పుకొన్నాడు. యాచమ నాయకుడు గొబ్బూరి వారిని బలహీనం చేయడానికి, గొబ్బూరి రామరాజుకు చెందిన పొదలకూరు, కుల్లూరులను ఆక్రమించాడు. రామరాజు పారిపోయి, ఓగూరులో తలదాచుకొన్నాడు. మట్లి తిరువెంగళనాథుడు అడ్డుకోవడం వలన, యాచమనాయకుని సేనలు వెనుతిరగాల్సొచ్చింది. యాచమ నాయకుడు రామదేవ రాయలకు అండగా ఉండటం, గొబ్బూరి వారిపై కొన్ని విజయాలను సాధించడంతో, నాయక ప్రభువులు చాలా మంది క్రమంగా యాచమ నాయని పక్షంలో చేరసాగారు.

వేలూరులో జగ్గరాజు లేని సమయం చూసి, ఈ ఓబులేశుడు కాపలాదారుని వధించి, శ్రీరంగా దులను విడిపించమని, యాచమ నాయకునికి వార్త పంపాడు. కాని, ముందుగానే ఈ వార్త తెలిసిన జగ్గరాజు వేరే ద్వారం గుండా కోట లోకి ప్రవేశించి, ఓబులేశుని, అతని అనుచరులను చంపి, ఉగ్రుడై, శ్రీరంగదేవరాయలను, అతని సంతానాన్ని ఘోరంగా వధించాడు. ఈ ఘోర కృత్యాన్ని విన్న విజయనగర ప్రజలకు, రామదేవరాయలుపై సానుభూతి పెరిగింది. జగ్గరాజుకు అండగా నిల్చిన మట్లి తిరువెంగళనాథుడు సైతం, రామదేవుని పక్షం వహించాడు. యాచమ నాయకుడు 20 వేల మంది సైన్యంతో జగ్గరాజు పైకి బయల్దేరాడు. అతనితో కూడా, అతని సోదరులు సింగప్ప, రాయప్ప, అయ్యప్పలతోపాటు, దామెర్ల చిన్న మొదలైన నాయకులు కూడా, బయల్దేరారు. జగ్గరాజు కూడా యుద్ధ సన్నద్ధుడై, మాకరాజు, రావెళ్ళ వెంక మొదలైన వారు వెంట రాగా, యాచమ నాయకుని ఎదుర్కోడానికి బయల్దేరారు. వీరి మధ్య జరిగిన యుద్ధంలో, యాచమ నాయకుడు విజయాన్ని సాధించి, గొబ్బూరి వారి అధీనంలో ఉన్న కరిమిలి, పాణెం కోటలను ఆక్రమించాడు. జగ్గరాజు పారిపోయి, మదుర, జింజి నాయకుల సహాయాన్ని అర్థించాడు. యాచమ నాయకుడు కూడా, జింజి, మదుర నాయకులతో శత్రుత్వమున్న తంజావూర్ రఘునాథ నాయకుడిని, రామదేవరాయల పక్షం వహించేటట్లు చేశాడు.

వేలూరు, తంజావూరు నుండి బయల్దేరిన యాచమ, రఘునాథ నాయకుల సైన్యాలు, తిరు చినాపల్లి వైపు నడిచాయి. యాచమ నాయకుని తమ్ముళే కాక, దామెర్ల కరి చిన్నయ్య, చెరకు వెంగళ కేతిరెడ్డి, రసునాదుడు, పాపాడ కృష్ణుడు మొదలైన నాయకులు, యాచమునితో బయల్దేరారు. దారిలో తంజావూర్ రఘునాథనాయకుడు చేరడంతో, వారి బలం అధికమైంది. వీరు పళమనేరు చేరేటప్పటికి, జగ్గరాజు తన సైన్యంతో తోప్పూర్ వద్ద ఉన్నట్లు తెలిసింది.

ఆ మరునాడు తోప్పూర్ వద్ద బీకర సంగ్రామం జరిగింది. జింజికృష్ణప్ప, మదుర వీరప్ప, మాకరాజు, రావెళ్ళ, సాకమూరు నాయకులు, అద్భుత ధైర్యసాహసాలను చూపినప్పటికి, మిత్ర సైన్యాల ధాటికి తట్టుకోలేక పోయారు. తంజావూర్ రఘునాథ నాయకుడు జగ్గరాజును వధించాడు. అతని మరణంతో, సైన్యం చెల్లాచెదరైంది. మూకరాజు, రావెళ్ళ వెంక పారిపోయారు. వీరప్ప చిరుచినాపల్లి కోటలో తలదాచుకొన్నాడు. కృష్ణప్ప జింజి చేరి, కోట తలుపులు మూసుకొన్నాడు. జగ్గరాజు అల్లుడు బందీగా చిక్కడంతో, రామదేవరాయలు విజయనగర సింహాసనాన్ని అధిష్ఠించాడు.

BRAOU

19.7 : రామదేవరాయలు (క్రీ.శ. 1619-1630)

తోప్పూర్ యుద్ధం తర్వాత, రామదేవరాయలు విజయనగర సింహాసనంపై ప్రతిష్ఠింపబడ్డాడు. కాని, అంతర్యుద్ధం ముగియ లేదు. తోప్పూర్ యుద్ధం తర్వాత, అంతర్యుద్ధం రూపురేఖలు మారాయి. జగ్గరాయల మరణంతో, అతని పక్షానికి నాయకుడు లేని పరిస్థితి ఏర్పడింది. దీన్ని అవకాశంగా చేసుకొని, వెలమ నాయకులు గొబ్బూరు వారి భూములను ఆక్రమించారు. మాకరాజును ఓడించి, బంగారు జగ్గని వధించి, వారి భూములను యాచమ నాయకుడు ఆక్రమించాడు. జింజి కృష్ణప్పను ఓడించి, బంధించి, అతని అధీనం లోని నాలుగు కోటలను కూడా, యాచమ నాయకుడు ఆక్రమించాడు. జగ్గరాజు సామంతుడైన యతిరాజును, పాలెం కోట వద్ద ఓడించాడు. ఈ విధంగా రామదేవ రాయల శత్రువులందరిని యాచమ నాయకుడోడించాడు.

యతిరాజు, అతని శత్రువులు పరాజితులయినప్పటికి, వారి అధికారం పూర్తిగా క్షీణించలేదు. మదుర, జింజి నాయకులు, ఇంకా జగ్గరాజు అల్లుడు చిక్కరాయలను రాజుగా సమర్థించారు. తంజావూరు నాయకులు రామదేవుని సమర్థించారు. 1619లో జగ్గరాజు అల్లుడు చిక్కరాయలు మరణించడంతో, యతిరాజు తన కుమార్తెను రామదేవ రాయలకిచ్చి వివాహం చేసి, అతని పక్షం వహించాడు. దానితో, మదుర, జింజి నాయకులు రామదేవరాయలను రాజుగా గుర్తించక, తిరుగుబాటు ధోరణి వుండి నాయకులను కలుపుకొని, వారి పైకి నడిచాడు.

ఈ దండయాత్ర విషయాలు అంతగా తెలియవు. మదుర తంజావూరు పైకి దండెత్తి, 1625లో తంజావూరు లోని ముఖ్య ప్రాంతమైన కోటను ముట్టడించాడు. కాని, అతడిని అక్కడి నుండి వెనుకకు తరిమారు. రామదేవరాయలు, యతిరాజు తిరుచినాపల్లిని ముట్టడించారు. కాని, రాజధాని పరిసర ప్రాంతాలలో తిరుగుబాట్లు వ్యాపించాయని వార్త తెలియడంతో, చిరుచినాపల్లి నుండి వెనుదిరిగారు.

రామదేవరాయలు, యతిరాజుల కలయిక, యాచమ నాయకుని ఆగ్రహానికి కారణమైంది. రామదేవరాయలు, యతిరాజు తిరుచినాపల్లి ముట్టడిలో ఉండగా, యాచమ నాయకుడు తీర ప్రాంతం పైకి ఆధిపత్యం వహిస్తున్న తన బంధువర్గాన్ని రెచ్చగొట్టి, తిరుగుబాట్లను ప్రోత్సహించాడు. యాచమని సోదరుడు, బెంగళ్‌పట్ పాలకుడైన సింగముడు, ఆర్ముగం పాలకుడైన తిమ్మా నాయకుని తోను, మిగిలిన నాయకుల తోను, కలిసి, పెద్ద సైన్యంతో పులికాట్‌ను ముట్టడించడానికి, శాంతోమ్ వైపు నడిచారు. కాని, పులికాట్ ప్రాంతానికి, తిమ్మా నాయకునికి మధ్యగల ప్రాంతాలను పాలిస్తున్న తిరువెంగళనాదరాజు సౌక్యం వల్ల, పోర్చుగీస్ వారు సహకరించక పోవడం వల్ల, యతిరాజు, రామదేవరాయల రాక తోను, సింగముడు వెనుదిరగాల్సొచ్చింది.

జింజి, మదుర నాయకులు యాచముని కుమారుడైన కస్తూరి రంగప్ప అధీనం లోని పుదుచ్చేరిని ముట్టడించారు. రామదేవరాయలకు, వారికి సంబంధాలు సరిగాలేకపోవడం చేత, వారి నుండి ఎట్టి సహాయం లభించలేదు. రంగప్ప అనేక భూభాగాలను కోల్పోయాడు. ఈలోగా, కాళహస్తి పాలకుడైన దామెర్ల వెంకటపతి, 1628 లో తిరుగుబాటు చేశాడు. రామదేవరాయలు, యతిరాజులు తిరుగుబాటు నణచడానికి ప్రయత్నించారు. 1629 నాటికి, తిరుగుబాట్లనదుపులోకి తేగలిగారు. జింజి నాయకుడు రామదేవరాయల పక్షం వహించాడు. కస్తూరి రంగప్ప, అతని పినతండ్రి సింగముడు ఓడిపోయి,

BRAOU

చెంగల్పట్, కరుంగోళిపాళెం కోటలను రామదేవరాయలకు అప్పగించారు. యతిరాజు కుమారుడు పులికాట్ పరిసర ప్రాంతాల్లోని తిరుగుబాట్లను అణచి, తిరువత్తూరు, నదియంబాకా, కలూరు మొదలైన ప్రాంతాలను ఆక్రమించాడు. దామెర్ల వెంకటపతి ప్రతిఘటన లేకుండా లొంగిపోయాడు. ఈ విధంగా రామదేవరాయలు అతి కష్టం మీద తిరుగుబాట్లు నణచి, విజయనగర భాగా లన్నింటిపైన ఆధిపత్యాన్ని సాధించాడు.

విజయనగర రాజ్యమంతా అంతర్యుద్ధంలో మునిగి ఉండగా, దానిని అవకాశంగా తీసుకొని, బిజాపూర్ ఆదిల్‌షా విజయనగరంపై దండెత్తాడు. 1619-20ల్లో అబుల్ వాహబ్ నాయకత్వంలో కర్నూల్ దిశగా, ఒక సైన్యాన్ని పంపాడు. కర్నూల్ దుర్గాధిపతి గోపాలరాజు గోల్కొండ సహాయాన్ని అర్థించాడు. దానితో, ఇబ్రహీం ఆదిల్‌షా సంధి చేసుకోవడం మేలని భావించాడు. కాని, కొద్ది కాలానికే ఈ సంధిని విస్మరించి, 1623-24ల్లో కర్నూల్ పైకి మరొక దండయాత్రను పంపాడు. గోపాలరాజుకు హండే, పెమ్మసాని, మల్లె నాయకులు సహాయం చేశారు. రామదేవరాయలు అంతఃకలహాలను అణచడంలో నిమగ్నమై ఉండటం వలన, ఎట్టి సహాయాన్ని పంపలేకపోయాడు. 1624 లో కర్నూల్ ఆదిల్‌షా వశమైంది.

రామదేవరాయలు 1629 నాటికి, తిరుగుబాట్లను అణచి, రాజ్యంలో సుస్థిర పరిస్థితుల నేర్పర్చి, కర్నూల్‌ను తిరిగి జయించొచ్చని భావించుంటాడు. కాని, 1630 మే 24న, పిన్న వయసులో అతని మరణంతో, అది నెరవేరలేదు. రామదేవరాయలకు కుమారులు లేకపోవడంతో, అళియ రామరాయల మనుమడైన పెద వెంకటపతిని, తన అనంతరం వారసునిగా నియమించాడు.

19.8 : మూడో వెంకటపతి దేవరాయలు క్రీ.శ. (1630-1642)

రామదేవరాయల మరణం తర్వాత, అతని నిర్ణయం ప్రకారం, అళియరామరాయల మనుమడు పెద వెంకటపతి రాయలు, రాజు కావాల్సుంది. కాని, అతని అధికారం సుస్థిరమవడానికి ఐదు సంవత్సరాలు పట్టింది. ఇతని నియామకాన్ని రామదేవరాయల పినతండ్రి, తిమ్మరాజు వ్యతిరేకించాడు. మళ్ళీ అంతర్యుద్ధం ప్రారంభమైంది. తిమ్మరాజు వెంకటపతిని అతని స్థానమైన ఆనెగొంది నుండి కదలకుండా చేశాడు. కాని, అమరనాయకులెవరు తిమ్మరాజును సమర్థించలేదు. మదుర, జింజి, తంజావూర్ నాయకులు వెంకటపతి దేవరాయలకు సహాయం చేశారు. ఈ వారసత్వ యుద్ధం 1635 వరకు కొనసాగింది.

1632లో తిమ్మరాజు వందవాసి సమీపంలో గల కరుంగుళి పాళెం, పులికాట్ సమీపం లోని కొటుమాచ్చిలను, వశం చేసుకొన్నాడు. వెంకటపతి దేవరాయల తమ్ముని కొడుకు శ్రీరంగదేవరాయలు, పులికాట్ లోని డచ్‌వారి మందుగుండు సామాగ్రితో, తిమ్మరాజును ఎదుర్కొన్నాడు. కొటుమాచ్చి సమీపం లోని కుయూరు (కోలురు) వద్ద యుద్ధం జరిగి, ఏప్రియల్ 15, 1635 నాటికి, కొటుమాచ్చి శ్రీరంగరాయల వశమైంది. కుయూరు, చోళవరాలు కూడా, శ్రీరంగరాయల వశమవడంతో, తిమ్మరాజు రాజీకి వచ్చి, చోళవరం, తోరివత్తూరు, సతవూర్లను వెంకటపతి రాయల వశం చేశాడు. కాని, తిమ్మరాజు మళ్ళీ అవిధేయతను ప్రకటించడంతో, జింజి నాయకుడు 1635లో తిమ్మరాజును వధించాడు. అనంతరం, వెంకటపతి దేవరాయలు నెల్లూరు చేరి, అక్కడ స్థిరపడినాడు.

BRAOU

వెంకటపతిరాయల సమస్యలు అంతటితో తీర లేదు. బిజాపూర్ సుల్తాన్ కర్నూల్ నాక్రమించిన తర్వాత, వెనుగొండను కబళించడానికి ప్రయత్నాలను సాగించాడు. రాయలు వెనుగొండను రక్షించ డానికి, చంద్రగిరి కోనేటి నాయకుడిని పంపాడు. ఇంతలో మదుర, తంజావూరు నాయకులు, జింజి, తుసాకి కృష్ణమ నాయకునితో సహా, విజయనగరాన్ని పట్టుకోవడానికి కుట్ర పన్నారు. బిజాపూర్ నుండి వెనుగొండకు రానున్న ప్రమాదాన్ని గ్రహించిన వెంకటపతి, తంజావూరు, మదుర నాయకులతో సర్దుబాట్లు చేసుకొన్నాడు.

ఈ అంతఃకలహాలను అవకాశంగా, బిజాపూర్ సుల్తాన్ విజయనగరం పైకి దండెత్తాడు. పరికెరె, బసవపట్నం పాలకుడు కెంగి హనుమని ప్రోత్సాహంతో, బిజాపూర్ సేనాని రణ్దుల్లాఖాన్‌ను, ఇక్కేరి వీరభద్రనాయకుని జయించడానికి పూనుకొన్నారు. రణ్దుల్లాఖాన్ యుక్తితో, వెంకటపతి దేవరాయలలో ఒప్పందాన్ని కుదుర్చుకొన్నాడు. కర్నాటకంలో వెంకటపతిని ఎదురిస్తున్న నాయకుల్ని అణచివేయడానికి, దానికి ప్రతిఫలంగా ధన రూపంలో పరిహారమిచ్చేటట్లు అంగీకారం కుదిరింది. కాని, త్వరలోనే ఖాన్ గుట్టు తెలుసుకొన్న వెంకటపతి, ఈ ఒప్పందాన్ని త్రోసిపుచ్చి, కర్ణాటక సామంతులతో ఖాన్‌ను ఎదుర్కొన్నాడు.

ఇంతలో వెంకటపతి తమ్ముని కొడుకైన శ్రీరంగరాయలు రాజద్రోహై, రణ్దుల్లాతో చేతులు కలి పాడు. బిజాపూర్ సైన్యం ఇక్కేరి వీరభద్ర నాయకు నోడించి, ఇక్కేరి, భువనగిరిల నాక్రమించింది. తదుపరి, రణ్దుల్లా మలినాడు కర్ణాటక లోని దుర్గాలను జయించి, అక్కడ నుండి తూర్పుగా సాగి, వెమ్మసాని నాయకుల స్థావరమైన తాడిపత్రిని ముట్టడించడానికి ప్రయత్నించాడు. కాని, ఈ లోపుగా అతని దృష్టి బెంగుళూరుపై పడింది. దాని పాలకుడు కెంపగౌడని ఐశ్వర్యం, ఆ ప్రాంతంలో శ్రీరంగనాయకుని తిరుగుబాటు కూడా కారణమైంది. శ్రీరంగరాయల తిరుగుబాటు వార్త తెలిసిన వెంకటపతి, తిరుగుబాటు నణచడానికి 25 వేల సైన్యాన్ని పంపాడు. రణ్దుల్లా 90 వేల సైన్యంతో కర్నాటకంలో ప్రవేశించడంతో, అతనిని ఎదిరించడానికి శక్తి చాలదని, వెంకటపతి రాజధాని చేరి, నాయక రాజుల సహాయాన్ని అర్థించాడు. రణ్దుల్లా ఖాన్ బెంగుళూరుర్‌ను నివాసం చేసుకొని, అక్కడ షాజహాన్‌ను అధిపతిగా నియమించి, శ్రీరంగపట్టణాన్ని ముట్టడించాడు. నెల రోజుల ముట్టడి తర్వాత, దాని పాలకుడైన నర్సరాజు నుండి 5 లక్షల హన్నులను నష్ట పరిహారంగా తీసుకొని, బిజాపూర్‌కు మరలాడు. కాని, 1648లో రచింపబడిన కంఠీరవ 'నరసరాజేంద్ర విజయం', నరసరాజు చేతిలో రణ్దుల్లాఖాన్ పరాజయాన్ని పొందినట్లు వర్ణిస్తూంది.

మలినాడు ప్రాంతంలో కెంగి హనుమ, పరిసర నాయకులు తిరుగుబాటు చేయడంతో, రణ్దుల్లాఖాన్ మరోసారి దండెత్తొచ్చాడు. ఇక్కేరి వీరభద్రుని కూడా సహాయానికి రమ్మని కోరాడు. మొదట్లో హనుమను లొంగిపోవలసిందిగా కోరాడు. అతడు నిరాకరించడంతో, బిజాపూర్ సైన్యాలు బసవపట్నాన్ని ముట్టడించి, హనుమ సోదరులను బందీలుగా పట్టుకొన్నాయి. హనుమ సైన్యాలు ఓడిపోవడంతో, పెద్ద మొత్తంలో ధనమిచ్చి, సంధి చేసుకొన్నాడు.

రణ్దుల్లాఖాన్ ఈ తిరుగుబాటు నణుస్తున్న సమయంలో, వెంకటపతిరాయలు నాయక రాజుల సైన్యంతో, బిజాపూర్ సైన్యాన్ని ఎదుర్కోవడానికి బయల్దేరాడు. కాని, ఈ దండయాత్ర విశేషాలు తెలియడం లేదు. వెంకటపతి పరాజితుడై వెనుకకు మరలినట్లు తెలుస్తోంది. వెంకటపతి తిరిగి 20 వేల సైన్యంతో, బెంగుళూరును స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించాడు. కాని, ఈ లోగా బసవపట్నం శత్రువుకు చిక్కడంలో వెనుదిరిగాడు.

BRAOU

రణ్దేలాఖాన్ బసవపట్నంలో ఉండగా, తుంకూర్ జిల్లా లోని చిక్కనాయకనహళ్ళి నాయకుడు తిరుగుబాటు చేశాడు. ఈ తిరుగుబాటు నణచడానికి అఫజల్ ఖాన్‌ను ముందు పంపి, వెనక రణ్దేలా బయల్దేరాడు. తిరుగుబాటు నాయకుడు భయపడి, కోటను అఫజల్ ఖాన్ కప్పగించాడు. బిజాపూర్ సైన్యాలు బేలూర్, తుంకూర్, బల్లాపూర్, మణిగత్ దుర్గాలను ఆక్రమించాయి. రణ్దేలా ఇక్కడ సంపదలన్నింటిని స్వాధీనం చేసుకొని, ఉత్త కోటలను మాత్రం అంగీకారం ప్రకారం శ్రీరంగరాయల కప్పగించాడు.

1641లో బిజాపూర్ సైన్యం రణ్దేలా నాయకత్వంలో మరోసారి విజయనగరంపై దండెత్తింది. దాని నడ్డుకోవడానికి వెంకటపతిరాయలు బయల్దేరాడు. కాని, వర్షా కాలం ప్రవేశించడంతో, వెనుదిరగాల్సొచ్చింది. శ్రీరంగరాయలు, రణ్దేలాఖాన్‌లు వెంకటపతి రాజ్యం లోనే రెండు కోటల నాక్రమించడంలో, వేలూర్‌కు మార్గమేర్పడి, వారు వేలూర్‌కు 12 మైళ్ళ దూరంలో శిబిరాన్ని నిలిపారు. ఇంతలో, మదుర, జింజి, తంజావూర్, నాయకుల సహాయంతో, వెంకటపతి వారిని నిరోధించగల్గాడు.

బిజాపూర్ సుల్తాన్ విజయనగర భూభాగాల నాక్రమించడాన్ని చూచిన గోల్కొండ సుల్తాన్ కూడా, విజయనగర భూభాగాల నాక్రమించడానికి పూనుకొన్నాడు. నాలుగు వేల గుర్రాలను, పదమూడు వేల పదాతి దళాన్ని, తూర్పు తీరం గుండా, విజయనగరం వైపు పంపాడు. 1642 ఏప్రిల్‌లో బయల్దేరిన ఈ సైన్యం, తూర్పు తీరంలో ఎనిమిది కోటల నాక్రమించి, నెల్లూర్‌కు దక్షిణంగా ఉన్న ఆర్ముగం చేరింది. వెంకటపతి ఆర్ముగం పాలకుడైన వెలుగోటి తిమ్మా నాయకునితో, శత్రువు నెదుర్కోవడానికి బయల్దేరాడు. కాని, గోల్కొండ సైన్యాన్ని ప్రతిఘటించడంలో విఫలులైనారు. వెలుగోటి తిమ్మ అనేక కోటలను వదులుకొని, కొండల్లోకి పారిపోయాడు. వెంకటపతి రాయలు కూడా, చిత్తూర్ జిల్లా లోని కొండ ప్రాంతాలకు పారిపోయాడు. అక్కడ నిస్సహాయ పరిస్థితుల్లో, అక్టోబర్ 10, 1642లో మరణించాడు.

19.9 : మూడో శ్రీరంగరాయలు (క్రీ.శ. 1642-1650)

మూడో వెంకటపతిరాయలకు సంతానం లేదు. అతని సోదరుని కుమారుడు, మూడో శ్రీరంగరాయలు విజయనగర సింహాసనాన్ని ఆక్రమించి, అక్టోబర్ 29, 1642 లో రాజుగా ప్రకటించుకొన్నాడు. ఇతనే విజయనగర రాజ్య చివరి పాలకుడు. ఇతని పాలనాకాలమంతా తిరుగుబాట్లతో గడిచింది. అప్పటికే విజయనగర భూభాగాలపై దండెత్తిన మహమ్మదీయులను తరమడం, అతని ప్రధమ కర్తవ్యం. గోల్కొండ సైన్యాన్ని నివారించడానికి సైన్యంతో బయల్దేరి, తిరుపతి వద్ద శిబిరాన్ని దింపాడు. కాని, శత్రు బలం అధికంగా ఉండటం, విజయనగర నాయకుల తిరుగుబాటు ధోరణికి భయపడి, శ్రీరంగ రాయలు శిబిరాన్ని ఎత్తివేసి, వేలూర్ మార్గం పట్టాడు. గోల్కొండ సైన్యం అతన్ని వెంబడించడం మానేసి, ఉదయగిరి కోటను ముట్టడించింది. శ్రీరంగరాయలు విజయనగర నాయకుల తిరుగుబాటు కారణంగా, ఉదయగిరికి సహాయం పంపలేకపోయాడు. కాళహస్తి పాలకుడైన దామెర్ల వెంకటపతి, శ్రీరంగరాయలు తిరుపతిలో ఉండగా, గోల్కొండ సుల్తాన్‌తో చేతులు కలపడంతో, అతన్ని బంధించి, అతని భూములను కొన్నిటిని ఆక్రమించి, విడుదల చేశాడు. వెంకటపతి జింజి కృష్ణప్పతో చేతులు కలిపి, శ్రీరంగరాయలపై కత్తి కట్టాడు. ఇంతలో కర్నాటకంలో, తిరుగుబాట్లు చెలరేగాయి. మలినాడులో ఇక్కేరి వీరభద్రుడు తిరుగుబాటు చేసి, బిజాపూర్ అధికారాన్ని ధిక్కరించాడు. ఈ వార్త తెలిసిన

BRAOU

బిజాపూర్ సుల్తాన్ పెద్ద సైన్యంతో రణ్దుల్లాఖాన్‌ను పంపాడు. ఇతనికి సహాయంగా, అంబర్‌ఖాన్, మొహమ్మద్‌ఖాన్, యాకుబ్‌ఖాన్, అమీర్‌ఖాన్, సాజాఖాన్, ఫతేఖాన్, పరషంద్ ఖాన్, ఖాన్ ఖానాలు బయల్దేరారు. వీరు మలినాడు చేరి, ఇక్కేరి దుర్గాన్ని ఆక్రమించారు. ఖాన్‌జాన్‌ను దాని కదిపతిగా నియమించి, రణ్దులా షిమొగాను ముట్టడించాడు. వీరభద్రుడు పెద్ద సైన్యాన్ని సమీకరించి, శివప్పనాయకుడిని మహమ్మదీయుల పైకి పంపాడు. ఇక్కడ జరిగిన యుద్ధంలో, మహమ్మదీయులు ఓడిపోయి, వెనుకకు మరలారు. శివప్ప ఇక్కేరిపైబడి, ఖాన్‌జాన్‌ను తరిమి, కోటను ఆక్రమించాడు.

ఈ వార్త తెలిసిన బిజాపూర్ సుల్తాన్ స్వయంగా సైన్యాన్ని నడుపుకొని, జనవరి 11, 1644 నాటికి బంకాపూర్ చేరి, ముస్తాఫాఖాన్, ముజఫర్ ఉద్దీన్‌లను దండయాత్రలకు నాయకులుగా నియమించాడు. శివప్పనాయకుడు యుద్ధానికి దిగక, ఇక్కేరి కోటను పటిష్టంచేసి, కొండ ప్రాంతాలకు చేరాడు. మహమ్మదీయ సైన్యాలు సాగర్, ఇక్కేరిలను ఆక్రమించి, వీరభద్రుడున్న కళప్పూరు ప్రాంతానికి చేరాయి. వీరభద్రుడు సుల్తాన్‌ను ప్రతిఘటించ లేక, సంధికి వేడుకొన్నాడు. ఆదిల్‌షా వీరభద్రునితో సంధి కుదుర్చుకొని, మార్చి 25, 1644 లో రాజధానికి చేరాడు.

ఇక్కేరి తిరుగుబాటును అణచడంలో, బిజాపూర్ సైన్యం నిమగ్నమై ఉన్నప్పుడు, శ్రీరంగరాయలు ఉదయగిరి నుండి గోల్కొండ సైన్యాలను తరిమి, మదుర, తంజావూర్, జింజి నాయక రాజులను లొంగదీయడానికి ప్రయత్నించాడు. కాని, గోల్కొండ సైన్యం తిరిగి దండెత్తడంతో, గోల్కొండ సైన్యాన్ని ఎదుర్కొన్నాడు. 1644 ఆగస్ట్ 24న వెంగల్లు వద్ద జరిగిన యుద్ధంలో, గోల్కొండ సైన్యాధిపతి మరణించాడు. విజయనగర సైన్యం గోల్కొండ సైన్యాన్ని కందుకూరు వరకు తరిమింది. కాని, ఈ విజయం ఆల్పే కాలం నిలువ లేదు. గోల్కొండ, బిజాపూర్ సహాయంతో, విజయనగర సామ్రాజ్యంపై దండెత్తింది. శ్రీరంగరాయలు వీరిని ఎదుర్కొన లేక, కందుకూరును వదలి, వెనుకకు మరలాడు. గోల్కొండ సైన్యాలు మీర్‌జుమ్లా నాయకత్వంలో, కర్నూల్ తూర్పు ప్రాంతాలను జయించాయి. బిజాపూర్ సైన్యాలు ఖాన్‌ఖానా నాయకత్వంలో, నంద్యాల, సిరివెళ్ళ, కనిగిరి మొదలైన కోటలను ఆక్రమించాయి.

ఇంతలో, దక్షిణ దేశంలో మదుర, తంజావూర్, జింజి నాయకులు ఒకటై, శ్రీరంగరాయలుకు ఎదురు తిరిగారు. శ్రీరంగనాయకులు దక్షిణ దేశం పైకి దండెత్తి, చేతిపట్టు వద్ద తిరుగుబాటు నాయకుల కోసం ఎదురుచూడసాగాడు. తిరుగుబాటు నాయకులు బిజాపూర్, గోల్కొండ నాయకుల సహాయమర్థించారు. కాని, అప్పటికే మొగల్ చక్రవర్తి షాజహాన్, కర్నాటకాన్ని అంతటిని జయించ మని, గోల్కొండ, బిజాపూర్ సుల్తాన్‌లను ఆదేశించాడు. బిజాపూర్ సైన్యాధిపతి ముస్తఫాఖాన్, మలినాడు నుండి బెంగుళూర్ జిల్లా లోని శివగంగ చేరాడు. అక్కడ మదుర, తంజావూర్, జింజి నాయకుల రాయబారులు, అతన్ని కలిసి, సహాయాన్ని కోరారు. ముస్తఫాఖాన్ దాని కంగీకరించి, వెల్లూర్ పైకి నడచి, కర్నూల్ వద్ద ఉన్న ఖాన్‌ఖానాను కూడా, రమ్మని కోరాడు. ఈ పరిస్థితుల్లో శ్రీరంగరాయలు ముస్తఫాఖాన్ వద్దకు సంధి ప్రయత్నాలనే నెపంతో, ఒక రాయబారాన్ని పంపి, మదుర, తంజావూర్, జింజి నాయకులు బిజాపూర్ సైన్యాధిపతిని చేరకముందే, సైన్యాలను దక్షిణంగా నడిపి, జింజి నాయకున్ని ఓడించి, లొంగదీసుకున్నాడు. తర్వాత, మదుర, తంజావూర్‌ల పైకి, సైన్యాన్ని పంపాడు. ముస్తఫాఖాన్‌కు ఈ విషయం తెలిసి, శ్రీరంగరాయల దృష్టిని మరల్చడానికి, వెల్లూరు పైకి దండెత్తాడు. శ్రీరంగరాయలు రాజధాన్ని రక్షించుకోవడానికి వెనుదిరగాల్సొచ్చింది. బిజాపూర్ సైన్యం వెల్లూర్‌పై దండెత్తుతున్నప్పుడే, గోల్కొండ సైన్యాలు తూర్పు తీరంపై దండెత్తి, వినుకొండను ఆక్రమించి, ఉదయగిరిని ముట్టడించాయి. శ్రీరంగరాయలు ఉదయగిరికే సహాయంగా,

B.RAO.U

సైన్యాన్ని పంపాడు. కాని, ఉదయగిరి దుర్గాధిపతి మల్లయ్య దుర్గాన్ని ముస్లిమ్‌ల కప్పగించాడు. మీర్‌జుమ్లా అక్కడ నుండి మట్లి నాయకుల అధీనంలో ఉన్న కోటలను ఆక్రమించడంతో, మట్లి నాయకులు గోల్కొండకు సామంతులుగా ఉండడానికి అంగీకరించారు.

శ్రీరంగరాయలను అన్ని వైపుల నుండి మట్టుముట్టడంతో తన రాజ్యాన్ని, మతాన్ని రక్షించడం కోసం, ప్రజలను సహాయమర్థించాడు. కాని, ఫలితం లేకపోయింది. నాయక రాజులు కూడా, వారి రాజ్యాలకు, మతానికి వచ్చే ప్రమాదాన్ని గుర్తించలేకపోయారు. విఫలుడైన శ్రీరంగరాయలు, ముస్తఫాఖాన్, ఖాన్‌ఖానాలతో సంధికి ప్రయత్నించాడు. కాని, వారు కోరిన ధనం ఇతని దగ్గర లేదు. కాని, బిజాపూర్ వారి దగ్గర ఉన్న రాయబారి వెంకన్న సోమయాజి ముస్తఫాఖాన్‌ను ఒప్పించడంతో, రాయలతో సంధికి అంగీకరించి, వారి రాయబారితో నెల్లూర్‌కు బయల్దేరాడు. వెంకన్న సోమయాజి సలహా మేరకు, శ్రీరంగరాయలు వెల్లూర్ మార్గం లోని లోయదారులను అడ్డుకోవడానికి ప్రయత్నించాడు. బిజాపూర్ సేనానుల మధ్య వచ్చిన విభేదాలు శ్రీరంగరాయలకు అనుకూలించాయి. కాని, రాయల ఆస్థానం లోని వారే, ముస్తఫాఖాన్‌కు ఈ విషయాలను తెలియజేశారు. ముస్తఫాఖాన్ శ్రీరంగరాయలతో ఒప్పందాన్ని కుదుర్చుకొని, వెనుకకు మరలాలనుకొన్నాడు. కాని, శ్రీరంగరాయలను తొలగించడానికి పూనుకొన్న నాయక రాజులు, ముస్తఫాఖాన్‌కు సహాయంగా, సైన్యాన్ని పంపారు. ముస్తఫాఖాన్‌ను వెనుగొండను ముట్టడించవలసిందిగాను, బిజాపూర్ నుండి తిరిగొచ్చిన ఖాన్‌ఖానాకు కోలార్‌ను ముట్టడించవలసిందిగా కోరారు. ముస్తఫాఖాన్ వెనుగొండ పైకి నడిచాడు. దాని రక్షకుడైన కోనేటి నాయుడు, అతణ్ణి వెనుకకు తరిమాడు. ఈలోగా, ఖాన్‌ఖానా కోలార్ పైకి నడచి, కోకంటి వరకు ఆక్రమించాడు.

శ్రీరంగరాయలు తన్ను రక్షించుకోవడానికి ప్రయత్నించాడు. అతడు నాయక రాజుల దృష్టిని మరల్చడానికి, దళవాయి రామరాజును చేటపట్టు, మలూరు, తిండివనం పైకి పంపుతూ, వెల్లూర్‌ను రక్షించడానికి పూనుకొన్నాయి. దళవాయి దండయాత్ర విశేషాలు తెలియలేదు. కాని, శ్రీరంగ రాయలు 1645 డిశంబర్‌లో నాయక రాజుల చేతిలో ఓడిపోయి, నెల్లూర్ చేరి, ముస్తఫాఖాన్ సహాయ మర్థించాడు. ముస్తఫాఖాన్ వెల్లూర్‌ను చేరిన శ్రీరంగరాయల తోను, ఇతర నాయకుల తోను, సంప్రదింపులు ప్రారంభించాడు. అతడు కోరిన ధనాన్ని శ్రీరంగరాయలు సమకూర్చలేకపోవడమే కాక, బిజాపూర్, గోల్కొండ సుల్తాన్‌ల మధ్య అంగీకారం కుదిరినందున, ఈ సంధి ఫలించదని తెలిసినప్పటికి, ముస్తఫాఖాన్‌తో చేరి, ఉదయగిరిని రక్షించడానికి పూనుకొన్నాడు. కాని, ఈలోగా సుల్తాన్ మరణ వార్త విన్న ముస్తఫాఖాన్, ఖాన్‌ఖానాలు బిజాపూర్‌కు మరలడంతో, శ్రీరంగరాయలు కొంత ఊపిరి పీల్చుకొన్నాడు.

ఈ లోగా మీర్‌జుమ్లా గోల్కొండ నుండి బయల్దేరి, ఉదయగిరిని ముట్టడించాడు. శ్రీరంగరాయలు 50 వేల మంది సైన్యంతో చెన్నమ నాయకుని పంపాడు. కాని, ఇతడు ఉదయగిరిని మీర్‌జుమ్లా కప్పగించి, తన పరివారంతో వెనుకకు మరలాడు. మీర్‌జుమ్లా పశ్చిమంగా బయల్దేరి, కడప జిల్లా లోని మట్లి నాయకుల అధీంలో ఉన్న చిట్టివేలిపై దండెత్తి, కలితూరు, దువ్వూరు, చెన్నూరు, బద్వేల్, పోరుమామిళ్ళ, కమలాపురాలను ఆక్రమించాడు. మట్లి కుమార అనంతరాజు అతనికి పెద్ద మొత్తంలో ధన మిచ్చి, సంధి కుదుర్చుకొన్నాడు.

ఇంతలో ముస్తఫాఖాన్ బిజాపూర్ నుండి తిరిగొచ్చి, కర్ణాటక దండయాత్రలను కొనసాగించ దల్చాడు. బిజాపూర్, గోల్కొండ సుల్తాన్‌లు విజయనగర రాజ్యాన్ని పూర్తిగా ఆక్రమించడానికి

BRAOU

సహకరించుకోదల్చారు. సుల్తాన్‌లు విజయనగరాన్ని జయించిన తర్వాత, తమ రాజ్యాలను కూడా కబళిస్తారని భయపడిన తంజావూర్, జింజి నాయకులు, శ్రీరంగరాయలకు ఒక చోట విజయం లభించినా, కుంగుది, మైసూర్ నాయకులు శ్రీరంగరాయల క్షేత్రాన్ని వీడిపోవడంతో, ఈ విజయం విఫలమైంది. శ్రీరంగరాయలు వెల్లూర్ చేరాడు. ముస్తఫాఖాన్ అతనిని వెంబడించాడు. నాయక రాజుల సైనిక సహాయ మందకముందే, ముస్తఫాఖాన్ వెల్లూర్ దగ్గరకు చేరాడు. 1646 ఏప్రిల్ 4న, వెల్లూర్ దగ్గర జరిగిన యుద్ధంలో శ్రీరంగరాయలు ఓడిపోయి, కోటలో తలదాచుకొన్నాడు. ముస్తఫాఖాన్ కోటను ముట్టడించాడు. ఈలోగా, మీర్‌జుమ్లా పాన్నేరి, మావపల్లి, కాంచీపురం, బెంగల్‌పట్‌లను పట్టుకొని, వెల్లూర్ సమీపంలో తన శిబిరాన్ని నిల్పాడు.

శ్రీరంగరాయలు తన రాజ్యాన్ని రక్షించే ఆశ లేక, వెల్లూర్‌కు తిరిగి వెళ్ళే ఆలోచన వదులుకొని, తంజావూర్ నాయక రాజుల ఆస్థానానికి చేరాడు. శ్రీరంగరాయలు నాయక రాజుల సహాయంతో రాజ్యాన్ని, మతాన్ని రక్షించడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. నాయక రాజుల అనైక్యత దీనికి తోడైంది. తంజావూర్, జింజి నాయకులు మహమ్మదీయులను ప్రతిఘటించడానికి కొంత ప్రయత్నించారు. వారి సైన్యాలతో బయల్దేరి, ముస్తఫాఖాన్ సహాయమర్థించి, వందవాసి దగ్గర గోల్కొండ సైన్యాన్ని ఎదుర్కొన్నాడు. అప్పటికే మీర్‌జుమ్లాకు లొంగిపోయిన వెలుగోటి, మొదలైన నాయకులు, అతనికి సహాయం చేశారు. మదుర, మైసూర్ పాలకులు పరాజితులై పారిపోయారు. మీర్‌జుమ్లా వందవాసి ప్రాంతాలను ఆక్రమించి, జింజిని ముట్టడించడానికి బయల్దేరాడు. ఈ విధంగా, కర్ణాటకంలో అధిక భాగంపై గోల్కొండ సుల్తాన్ ఆధిపత్యాన్ని సాధించాడు.

గోల్కొండవారు మదుర, మైసూర్ పాలకులపై సాధించిన విజయాలకు అసూయ చెందిన బిజాపూర్, ముస్తఫాఖాన్‌ను కర్నాటకం పైకి పంపింది. అతడు జింజిని సమీపించడంతో, మీర్‌జుమ్లా యుద్ధానికి సిద్ధమయ్యాడు. ముస్తఫాఖాన్, ఖాన్‌ఖానాను, రుస్తుం జమాన్‌ను, అఫజల్‌ఖాన్‌ను సహాయంగా రమ్మన్నాడు. అప్పుడు మీర్‌జుమ్లా ముస్తఫాఖాన్‌తో సంధి చేసుకొని, గోల్కొండ రాజ్యానికి మరలాడు. ముస్తఫాఖాన్ జింజి కోటను ముట్టడించాడు. కాని, దాన్ని ఆక్రమించే లోగా, జబ్బుచేసి, మరణించాడు. బిజాపూర్ సుల్తాన్ ఖాన్‌ఖానాను నాయకుడిగా నియమించాడు. అతడు జింజి కోటను ఆక్రమించాడు.

1649 నాటికి తంజావూర్ కూడా బిజాపూర్‌కు లొంగిపోవడంతో, శ్రీరంగరాయలు మైసూర్‌కు వెళ్ళాడు. మైసూర్ చేరిన తర్వాత, రెండు, మూడు సంవత్సరాల వరకు అతని విశేషాలు తెలియడం లేదు. 1649 నాటికి బిజాపూర్, గోల్కొండ సుల్తాన్‌ల మధ్య విభేదాలొచ్చాయి. బిజాపూర్ సుల్తాన్ అనుమతిపై, అబ్దుల్లా కుతుబ్‌షా గండికోటను ఆక్రమించడానికి మీర్‌జుమ్లాను పంపాడు. మీర్‌జుమ్లా గండికోటతోపాటు, గుత్తి దుర్గాన్ని కూడా ఆక్రమించి, బిజాపూర్ భాగాలను కూడా ఆశించాడు. కాని, బిజాపూర్ సేనాపతి ఖాన్ మహమ్మద్, దీన్ని ప్రతిఘటించాడు. 1652 ప్రారంభంలో, గోల్కొండ 6 లక్షల హోన్నులను సమర్పించి, బిజాపూర్‌తో సంధి చేసుకొంది. ఆ మరుసటి సంవత్సరం ఖాన్‌మహమ్మద్ పెనుగొండను ఆక్రమించి, జింజికి బయల్దేరి, దారిలో అనంతపురం మండలం లోని రొద్దం వద్ద విడిది చేశాడు. మీర్‌జుమ్లాకు ఇది కంటగింపై, మైసూర్ నాయకుని తోను, శ్రీరంగరాయల తోను, మంతనాలు జరిపాడు. బిజాపూర్ పట్ల శత్రుత్వమున్న మహమ్మదీయుల సహాయంతో, మైసూర్ నాయక ప్రభువు, పూర్వం ముస్తఫా ఆక్రమించిన భూభాగాల నన్నింటిని మరలా ఆక్రమించాడు. శ్రీరంగరాయలు వెల్లూర్ చేరి, కర్ణాటక నుండి బిజాపూర్ వారిని తరిమివేయడానికి, సైన్యాన్ని సేకరించడం మొదలుపెట్టాడు. ఈ వార్తలు విన్న ఖాన్

BRAOU

మహమ్మద్ సైన్యంతో రావడంతో, మైసూర్ రాజు పారిపోయాడు. కృష్ణగిరి, మరి నాలుగు కోటలు మహమ్మదీయుల వశమైనాయి. సీదీమాసూద్ నాయకత్వంలో మరొక బిజాపూర్ దళం, ఇతర మైసూర్ దుర్గాలను ముట్టడించగా, ఖాన్ మహమ్మద్ వెల్లూర్‌పై నడిచాడు. చివరకు 1654లో ఖాన్‌మహమ్మద్ వెల్లూర్‌లో ప్రవేశించడానికి, శ్రీరంగరాయలకు చంద్రగిరి మండలాన్నివ్వాల్సొచ్చింది.

ఇంతలో, దక్కన్‌లో మొగల్ రాజప్రతినిధైన ఔరంగజేబ్‌ను కలుసుకోవడానికి వెళ్ళాడు. ఇంతలో అబ్దుల్లా కుతుబ్‌షా శ్రీరంగరాయలకు మిత్రుడై, కర్నాటక మంతటిని ఆక్రమించమని ప్రోత్సహించాడు. హిందూ నాయకులు చాలా మంది రాయలతో చేతులు కలిపారు. 1656 నవంబర్‌లో ఆదిల్‌షా మరణం, 1657, మార్చిలో ఔరంగజేబ్ బిజాపూర్‌పై దండెత్తడాన్ని అవకాశంగా, శ్రీరంగరాయలు తిరిగి తన వశం చేసుకొని, ఆ ప్రాంతాల్లో తన అధికారాన్ని విస్తరించడానికి ప్రయత్నించాడు.

ఇంతలో ఔరంగజేబ్, అతనితో మీర్‌జుమ్లా ఉత్తర భారతదేశానికి మరలడంతో, అబ్దుల్లా కుతుబ్‌షా తన సేనలను కర్ణాటకం పైకి పంపాడు. మదుర తిరుమల నాయకుడు రాజద్రోహై, కుతుబ్‌షాకు సహాయం చేశాడు. కర్ణాటకంలో అధిక భాగం మళ్ళీ చేతులు మారింది. శ్రీరంగరాయలు ఇక్కేరి శివప్ప నాయకుని ఆశ్రయించాడు. ఇక్కేరికి చెందిన హాసన్, బేలూర్ జిల్లాల్లో శ్రీరంగరాయలు 1663 వరకున్నట్లు తెలుస్తూంది. ఇతని సహాయంతో, శ్రీరంగరాయలు వెల్లూర్‌కు వెళ్ళి, 1678 వరకు నామమాత్రపు అధికారంతో పరిపాలించాడు. 1678 తర్వాత శ్రీరంగరాయల జాడ కనబడదు. ఆచార్య నీలకంఠశాస్త్రి, 1672లో శ్రీరంగరాయలు మరణించాడని వ్రాశారు. రాయప్రోలు సుబ్రహ్మణ్యం, 1669లో శ్రీరంగరాయల రాజ్యాధికారాన్ని తెలుపుతున్న శాసనం కనబడుతూందని వ్రాస్తూ, ఆ తర్వాత ఎంత కాలం జీవించాడో తెలపడం కష్టమని భావించారు. అతని, మరణంతో, ఆరవీటి వంశం, విజయనగర సామ్రాజ్యం అంతరించాయి.

19.10 : సంగ్రహంగా

బన్నిహట్టి యుద్ధం తర్వాత, విజయనగర అధికార వైభవాలు క్రమంగా క్షీణించాయి. ఆరవీటి వంశస్థులు పెనుగొండ రాజధానిగా, విజయనగర సామ్రాజ్యాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నించారు. వీరి ప్రయత్నాలు అంత సఫలం కాలేదు. సామంత రాజుల ద్రోహబుద్ధి, విజయనగరాన్ని బలహీనపర్చింది. దీన్ని అవకాశంగా, మహమ్మదీయులు విజయనగరంపై దండెత్తి, అధిక భాగాన్ని జయించారు. రెండవ వెంకటపతి రాయల వంటి వారు విజయనగర వైభవాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నించినప్పటికీ, అది తాత్కాలికమైంది. 17వ శతాబ్ది చివరి భాగంలో, మూడవ శ్రీరంగరాయల మరణంతో, ఆరవీటి వంశం, విజయనగర సామ్రాజ్యం అంతరించాయి.

19.11 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. ఆరవీటి వంశస్థుల్లో రెండో వెంకటపతిరాయలు సాధించిన విజయాలను వివరించండి.

2. విజయనగర సామ్రాజ్య పునరుద్ధరణకు మూడో శ్రీరంగరాయలు చేసిన ప్రయత్నాలను తెలపండి.

B RAO U

II. క్రింది వాటిపై లఘు వ్యాఖ్యలను రాయండి.

1. తిరుమల రాయల పాలనా విశేషాలు
2. ఆరవీడు పాలకులు, గోల్కొండ సంబంధాలు
3. విజయనగర సామ్రాజ్యంలో క్రీ.శ. 1614-19 మధ్య నడచిన అంతర్యుద్ధం
4. రెండో శ్రీరంగరాయల పాలనా విశేషాలు
5. రామదేవరాయల పాలనా కాలానికి సంబంధించిన ముఖ్య సంఘటనలు
6. మూడో వెంకటపతి దేవరాయల పాలనకు చెందిన ప్రధాన పరిణామాలు

19.12 : ఉపయుక్త గ్రంథాలు

Nilakanta Sastri K.A. & Venkataramanayya, N. : **Further Sources of Vijayanagara History** (Madras, 1946)

Father Heras : **The Aravidu Dynasty of Vijayanagara,** (Madras, 1927)

Sherwani H.K. & Joshi P.M. (eds) : **History of Medieval Deccan, Vol. I,** (Hyderabad, 1973)

Satyanatha Iyer, R. : **History of the Nayaks of Madura** (Madras, 1924)

Vriddhagirisan, V. : **History of the Nayaks of Tanjore,** (Annamalainagar, 1942)

: తెలుగు విజ్ఞాన సర్వస్వం, మూడవ సంపుటి, తెలుగు భాషా సమితి, హైదరాబాద్, 1983.

BRAOU

రచయిత : డా. వీ. మురళిమోహన్

భాగం-20 : పరిపాలన, సమాజం, ఆర్థిక వ్యవస్థ

విషయక్రమం

20.0 : లక్ష్యాలు

20.1 : పరిచయం

20.2 : పరిపాలనా వ్యవస్థ స్వభావ, స్వరూపాలు

- 20.2.1 : కేంద్ర ప్రభుత్వం
- 20.2.2 : రాష్ట్ర ప్రభుత్వం
- 20.2.3 : జిల్లా పాలనా వ్యవస్థ
- 20.2.4 : స్థానిక పాలన
- 20.2.5 : నాయంకర వ్యవస్థ : గుణదోషాలు
- 20.2.6 : సైనిక వ్యవస్థ
- 20.2.7 : న్యాయ వ్యవస్థ

20.3 : సామాజిక వ్యవస్థ

- 20.3.1 : కుడి, ఎడమ విభాగాలు
- 20.3.2 : స్త్రీల స్థానం

20.4 : ఆర్థిక పరిస్థితులు - వ్యవసాయం, ఉత్పత్తులు, మార్కెట్లు

- 20.4.1 : పరిశ్రమలు - దేశీయ, విదేశీయ వ్యాపారం
- 20.4.2 : రేవు పట్టణాలు
- 20.4.3 : విజయనగర రాజ్య ఆదాయం: పన్నులు

20.5 : ఐరోపీయులతో సంబంధబాంధవ్యాలు

20.6 : సంగ్రహంగా

20.7 : పరీక్ష నమూనా ప్రశ్నలు

20.8 : ఉపయుక్త గ్రంథాలు

BRAOU

20.0 : లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం ద్వారా, విజయనగర సామ్రాజ్య కాలమందలి పరిపాలన, సామాజిక, ఆర్థిక వ్యవస్థలు, వాటికి సంబంధించిన స్వభావ, స్వరూపాలు, విన్నాంశాలు, లక్షణాల గురించి, స్పష్టమైన అవగాహన, పరిజ్ఞానాన్ని ఏర్పర్చుకోగల్గాలి.

20.1 : పరిచయం

విజయనగర సామ్రాజ్యం మధ్య యుగానికి చెందింది. క్రీ.శ. 7 వ శతాబ్ది నుండి, క్రీ.శ. 18వ శతాబ్ది వరకు విస్తరించిన మధ్య యుగాన్ని, తొలి, మలి మధ్య యుగాలని విభజించారు. విజయనగర సామ్రాజ్య కాలం మలి మధ్యయుగానికి చెందింది. మధ్యయుగంలో దాదాపు 350 సంవత్సరాలు విలసిల్లిన విజయనగర సామ్రాజ్యపు పరిపాలనా వ్యవస్థ, స్వభావం, దాన్ని, స్వరూపాల గురించిన విశేషాలను మౌలిక, అనుషంగిక ఆధారాల సహాయంతో తెలుసుకొనుట; ఆకాలపు సామాజిక స్థితిగతులెలా ఉన్నాయనే విషయాన్ని గ్రహించుట; ఆకాలపు ఆర్థిక పరిస్థితులను తెలుసుకొనుటకు వ్యవసాయం, ఉత్పత్తులు, వ్యాపారం, అంతర్గత, బాహ్య వ్యాపారం, రేవు పట్టణాల గురించి తెలుసుకొనుట ఎంతైనా ఆవశ్యకం. ఆ కాలంలో మన దేశానికి వర్తకవ్యాపారాల నిమిత్తం వచ్చిన విదేశీయులైన పోర్చుగీస్ వారితో విజయనగర పాలకులు, ప్రజలకున్న సంబంధబాంధవ్యాలను కూడా గ్రహించాల్సుంది.

20.2 : పరిపాలనా వ్యవస్థ స్వభావ, స్వరూపాలు

విజయనగర పరిపాలనా వ్యవస్థను గురించి తెలుసుకోడానికి, శాసనాలు, వాఙ్మయం ముఖ్య ఆధారాలు. ఈ ఆధారాల సహాయంతో, కె. ఏ. నీలకంఠశాస్త్రి, టి.వి. మహాలింగం, అప్పాదొరై, నేలటూరి వెంకటరమణయ్యలు, ఆకాలం నాటి పరిపాలనా వ్యవస్థ స్వభావ, స్వరూపాలను వివరిస్తూ, గ్రంథాలను రచించారు. బి. ఏ. శాలటోర్ విజయనగర సామాజిక, రాజకీయ జీవితాన్ని గురించి రెండు సంపుటాలను ప్రచురించారు. దాదాపు 90 సంవత్సరాలుగా, చరిత్రకారులు ఎన్నో కొత్త విషయాలను ఎప్పటికప్పుడు బయటకు తెస్తున్నారు. అయినా, అనేక ప్రధాన సమస్యలకు పరిష్కారాన్ని వెదుకుతున్నారు. ఆ వెదుకులాటలో 1980 లో ప్రచురించబడ్డ **'పెజంట్ స్టేట్ అండ్ సొసైటి ఇన్ మెడీవల్ సౌత్ ఇండియా'** అన్న గ్రంథంలో బర్టన్ స్టీన్ అనే అమెరికన్ చరిత్రకారుడు నూతన కోణాన్నుండి పరిశీలించాడు. ఇంకొంత విపులంగా, తన అభిప్రాయాలను 1993 లో ప్రచురించబడ్డ **'ది న్యూకేంబ్రిడ్జి హిస్టరి ఆఫ్ ఇండియా'**లోని 'విజయనగర' అధ్యాయంలో వివరించాడు. బర్టన్ స్టీన్, విజయనగర రాజ్యాన్ని 'సెగ్మంటరి స్టేట్', లేదా 'ఖండిత రాజ్య' మన్నాడు. దక్షిణ భారతదేశ చరిత్రను అధ్యయనం చేస్తున్న జపనీయ చరిత్రకారుడు నొబొరో కరాషిమా 1984 లో ప్రచురించబడ్డ **'సౌత్ ఇండియన్ హిస్టరి అండ్ సొసైటి'** అన్న గ్రంథంలో, దక్షిణ భారత సమాజంలో వచ్చిన మార్పులను అధ్యయనం చేశాడు. ఈతడు బర్టన్ స్టీన్ వెలిబుచ్చిన 'సెగ్మంటరి స్టేట్' అనే దాన్ని అంగీకరించలేదు. ఆర్. చంపకలక్ష్మి, డి. యన్. ఝా, ఎమ్. జి. యన్. నారాయణన్‌లు తమ వ్యాసాల్లో బర్టన్ స్టీన్ ప్రతిపాదించిన 'సెగ్మంటరి స్టేట్' ను తిరస్కరించారు.

కె. ఏ. నీలకంఠశాస్త్రి విజయనగర రాజ్యం 'మిలిటరి స్టేట్' అన్న అభిప్రాయాన్ని 1946లో వెలిబుచ్చి, 1964 నాటికి, విజయనగర రాజ్యం అనేక సైనిక నాయకులతో కూడిన సైనిక సమ్మేళనా రాజ్యమన్నాడు. డి.సి. సర్కార్ 1969 లో ప్రచురించబడ్డ **'లాండ్‌లార్డిజమ్ అండ్ సొసైటి ఇన్ ఎన్షియెంట్ అండ్ మెడీవల్ ఇండియా యూజ్ రికార్డెడ్ ఇన్ ఎపిగ్రాఫికల్ రికార్డ్స్'** అన్న గ్రంథంలో, అమరమను స్థిరాస్థి అనుభన హక్కు విజయనగర రాజ్య ప్రధాన లక్షణం కాబట్టి, విజయనగర రాజ్యాన్ని 'ఫ్యూడల్' రాజ్యమన్నారు. ఈ భావాన్నే డి. యన్. ఝా, ఆర్. చంపకలక్ష్మి, యమ్.

BRAOU

జి. యస్. నారాయణన్‌లు తెలిపారు. ఈ పై అభిప్రాయాలకు భిన్నంగా, విజయనగర సామ్రాజ్యంలో సంప్రదాయమైన రాచరికమే అమలు జరిగిందని, నేలటూరి వెంకటరమణయ్య, అప్పాదొరై, నీలకంఠ శాస్త్రి, బి.యస్. యల్ హనుమంతరావ్, పి. శ్రీరామశర్మ మొదలగు వారు ప్రతిపాదించారు. ప్రస్తుతానికి విజయనగర సామ్రాజ్య స్వభావం గురించి, స్థూలంగా సంప్రదాయ రాచరికమే అమల్లో ఉందని, చరిత్రకారులు అంగీకరించారని తెలుసుకొన్నాం.

విజయనగర పాలకులు పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా, తమ సువిశాల సామ్రాజ్యాన్ని, క్రమబద్ధమైన రీతిలో అంచెలంచెలుగా, క్రింద నుండి పైకి - స్థానిక, జిల్లా, రాష్ట్ర, కేంద్ర, ప్రభుత్వాలుగా విభజించారు. వరుసగా పై నుండి, క్రింద వరకున్న ప్రభుత్వ పాలనా యంత్రాంగ విధులు, పరిధిని గురించి తెలుసుకుందాం.

20.2.1 : కేంద్ర ప్రభుత్వం

విజయనగర రాజ్య వ్యవస్థకు పాలకుడే ముఖ్య కేంద్రం. పాలకుని స్వభావం, సామర్థ్యం, శక్తి పైననే రాజ్య ప్రతిష్ఠ, గౌరవం ఆధారపడి వున్నాయి. విజయనగర పాలకుల చేతిలో సర్వాధికారాలు కేంద్రీకృతమై ఉన్నాయి. అయినా, తాము సర్వాధికారులమన్న అహంభావంతో, నియంతల వలె, విజయనగర పాలకులు ప్రవర్తించ లేదు. నేలటూరి వెంకటరమణయ్య "రాజ్యంలో సర్వాధికారి చక్రవర్తి అంటూనే, చక్రవర్తి అధికారానికి కళ్ళెం వేసేందుకు, ప్రభు మండలి కాని, ప్రజా సభలు కాని, లేవన్నారు. అయినప్పటికీ, విజయనగర పాలనా విధానం నిరంకుశ రాచరికం కానేకాదన్నారు". కాని, ఎప్పుడైనా చక్రవర్తి నిరంకుశంగా, ప్రజా సంక్షేమానికి భిన్నంగా, నీతి తప్పి ప్రవర్తిస్తే, తిరుగుబాటు చేయుటకు ఆనాటి సంప్రదాయక రాచరిక వ్యవస్థలో అవకాశం లేదన్నది నేలటూరి వెంకటరమణయ్య అభిప్రాయం. శాసనాలు, ముఖ్యంగా 1533 నాటి కవుటాల సీమ రైతులు, ప్రభుత్వోద్యోగుల నిరంకుశ ధోరణికి వ్యతిరేకంగా భూములను వదిలిపెట్టి వెళ్ళిపోయినట్లు తెలుపుతున్నాయి. ఈ తిరుగుబాటు పాలకులకు వ్యతిరేకంగా ప్రత్యక్షంగా జరిగింది కాక, పాలకుల ఉదాసీన వైఖరికి వ్యతిరేకంగా, ప్రభుత్వోద్యోగుల నిరంకుశ ధోరణికి ప్రత్యక్షంగా జరిగిన తిరుగుబాటుగానే గుర్తించాలి. ఈ తిరుగుబాటు వలన రాజకీయంగా ఎటువంటి పరిణామాలు జరిగినట్లు ఆధారాలు లేవు. అయితే, పైన పేర్కొన్న కవుటాల సీమ రైతులు తమ భూముల్లో పంట పండించక, బీడులుగా ఉంచడంలో, ఆర్థికపరమైన నష్టం వాటిల్లింది. నేలటూరి వెంకటరమణయ్య అభిప్రాయానికి భిన్నంగా, బి.యస్. యల్. హనుమంతరావ్, సాళువ, తుళువ, ఆక్రమణలను విజయనగర ప్రజానీకం అంగీకరించేందుకు కారణం, వంశానుగతమైన రాచరిక వ్యవస్థలు కొనసాగించినప్పటికి, అసమర్థులకు, బలహీనులకు పాలకుడిగా స్థానం లేకపోవటమేనన్నారు. విజయనగర పాలకులు ధరించిన 'రాజపరమేశ్వర' 'రాజాధిరాజ' వంటి బిరుదులు, ఆనాటి పాలకులు దైవాంశతో జన్మించారన్న భావజాలాన్ని ప్రచారం చేయుటకు ఉపయోగపడ్డాయని చెప్పొచ్చు.

విజయనగర రాజ్య వ్యవస్థలో పాలకులకు చట్టబద్ధమైన అధికారాన్నిచ్చే పట్టాభిషేక మహోత్సవానికి ఒక ప్రత్యేక స్థానమియ్యబడింది. ఈ విషయాన్ని సమకాలీన విదేశీయ యాత్రికుల రచనలు, శాసనాలు తప్పక బుజువు చేస్తున్నాయి. కుమార ధూర్జటిచే రాయబడ్డ **'కృష్ణరాజ విజయం'**, కృష్ణదేవరాయల పట్టాభిషేక ఉత్సవానికి అనేక మంది సామంత ప్రభువులు వచ్చారని తెలుపుతూంది. విజయనగర పాలకుడు ఉత్సవ విగ్రహం వంటివాడు కాదు. రాజ్య వ్యవహారాల విషయంలో ఎంతో శ్రద్ధను కనబర్చాడు. కృష్ణదేవరాయలు 'ఆముక్తమాల్యద'లో రాజ విధుల గురించి విపులంగా తెలిపాడు.

BRAOU

న్యూనిజ్ రచన వల్లను, **'రాయవాచకం'** వల్లను, కృష్ణదేవరాయల దిన చర్యను తెలుసుకోవచ్చు. వీరనరసింహరాయలు తెల్లవారక పూర్వమే లేచి, భక్తి గీతాల నాలకించి, స్నానం చేసి, బ్రాహ్మణులను పూజించి, దైవ దర్శనానంతరం వివిధ రాష్ట్ర పాలకుల్ని కలసి, మధ్యాహ్నం రాజ కార్యాలను పరిశీలించి, సాయంత్రం వేళల్లో ప్రజల సమస్యలను వినేందుకు, ప్రజలను కలుసుకొనేవాడు. కృష్ణదేవరాయలు కూడా ఉదయమే లేచి, తగినంత కాలం వ్యాయామం, కుస్తి, గుఱ్ఱపు స్వారి, కత్తి సాము చేసి, స్నానం తర్వాతనే మిగతా కార్యక్రమాలను చేపట్టేవాడు.

చక్రవర్తి తర్వాతి స్థానం యువ రాజు కియ్యబడింది. యువ రాజు పరిపాలనా వ్యవహారాల్లో చక్ర వర్తికి చురుకుగా సహాయసహకారాలందించేవాడు. శాసనాల వల్ల మొదటి హరిహరుడు తన సోదరుడైన బుక్కరాజును యువ రాజుగా నియమించాడని తెలుస్తోంది. అదే విధంగా, **'అచ్యుతరాయాభ్యుదయం'** అచ్యుతరాయలు చక్రవర్తిగా పట్టాభిషేకం చేసుకొని, తన కుమారుడైన వెంకటాద్రిని యువ రాజుగా ప్రకటించాడని తెలుపుతూంది. యువ రాజులను, రాకుమారులను, రాష్ట్ర పాలకులుగా నియమించే ఆచారం, సర్వసాధారణం.

పాలకుడెంత సమర్థవంతుడైనా, శక్తివంతుడైనా, ప్రజాక్షేమాన్ని చూచేవాడైనా, ఒక్కనికి అన్ని విషయాలను చూచుకోవడం, సమర్థవంతంగా నడిపించడం సాధ్యం కాదు. కాబట్టి, విజయనగర పాల కులు మంత్రులను, మంత్రి మండలిని నియమించారు. 'ఆముక్తమాల్యద'లోను, పేస్ రచనల్లోను, కృష్ణదేవరాయలకు సలహాలిచ్చేందుకు మంత్రిమండలి ఉండేదని తెలుస్తోంది.

మంత్రిమండలి సమావేశాలు జరిగేందుకు ప్రత్యేకమైన భవంతులుండేవి. అబ్దుల్ రజాక్ వ్రాతల ద్వారా, మంత్రి మండలి సమావేశమయ్యే భవనం, విజయనగర పాలకుని భవనానికి కుడి వైపున ఉండేదని తెలుస్తోంది. మంత్రి మండలి సమావేశాలు, నిర్ణయాలు రహస్యంగా ఉంచబడేవి. మంత్రి మండలి సలహాలను పాలకులు విధిగా పాటించాలన్నది లేదు; ఎందుకనగా, ఆనాటి సాంప్రదాయిక రాచరిక వ్యవస్థలో మంత్రులు, రాజాజ్ఞలను అమలుపర్చే కార్యదర్శుల వంటివారు మాత్రమే. కృష్ణదేవ రాయలు రాయచూర్ పై దండెత్తే ముందర, రెండు సార్లు మంత్రి మండలి సమావేశాన్ని జరిపాడని, న్యూనిజ్ తెలియజేస్తున్నాడు.

మంత్రి మండలికి, లేదా మంత్రి పరిషత్‌కు సర్వాశిరప్రధాని, అధ్యక్షుడు. కృష్ణదేవరాయల కాలంలో సర్వాశిరప్రధాని తిమ్మరుసు. చెల్లప్ప అనే సాళువ నరసింహనాయకుడు అచ్యుతరాయల కాలంలో సర్వాశిరప్రధానిగా వ్యవహరించాడు. ఒక శాసనం ప్రకారం తిమ్మరుసు సర్వాశిరప్రధానిగా వుండగా, సోమరసు ఉప ప్రధాని పదవిని నిర్వహించాడు. ఈ పదవి తరచూ ఉండేదో, లేక ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిందో చెప్పలేం. సర్వాశిరప్రధానికి సభానాయక, తంత్రనాయక, కార్యకర్త యున్న పేర్లు కూడా వున్నాయి. మంత్రులుగా సాధారణంగా పండితులైన, నేర్పరులైన, శక్తిసామర్థ్యం గల బ్రాహ్మణులను నియమించేవారు. ఇతర కులాలకు చెందిన క్షత్రియ, వైశ్యులను కూడా నియమించేవారు. కులం కన్నా అర్హతకు ప్రాధాన్యమిచ్చారు. 'ఆముక్తమాల్యద' మంత్రుల నియామకంలో ఈ క్రింద పేర్కొన్న వారిని నియమించవద్దని తెలిపింది: "నీచ కుటుంబంలో జన్మించినవాడిని, పల్లెటూరిలో పుట్టిన వాడిని, చదువుకోనివాడిని, పిరికివాడిని, అబద్దాలు చెప్పేవాడిని, కుట్రదారుణ్ణి, విదేశీయుణ్ణి, అప్రతిష్ఠకు సిగ్గుపడని వాడిని, అధర్మంగా ప్రవర్తించే వాడిని, బ్రాహ్మణుడైనా" నియమించకూడదు. ఆనాడు భాండాగారిక, లేక కోశాధికారి, 'రాయవాచకం' పేర్కొన్న ధర్మశాసనాధికారి, మొదలగు మంత్రులుండేవారు. విజయనగర పాలనా కాలంలో మంత్రిమండలి సభ్యుల సంఖ్య ఎంతో తెలియదు.

B.R.A.O.U

కాని, నేలటూరు వెంకటరమణయ్య అనేక మంది మంత్రులుండి వుంటారని, వారిని గురించి తెలిపే చారిత్రకాధారాలు దొరకలేదన్నారు.

సంప్రదాయక రాచరిక వ్యవస్థలో యువ రాజు, మంత్రి మండలితో పాటుగా, రాజ గురువుకూడా ప్రత్యేక స్థానముంది. రాజ గురువులకు ఎంతో గౌరవమిచ్చేవుండింది. రెండవ హరిహర రాయల కాలంలో క్రియాశక్తి ఆచార్యునకు, రెండవ దేవరాయల కాలంలో నరసింహాచార్యుడు, కృష్ణదేవరాయలకు రంగనాథ దీక్షితులు, రామరాయలకు తాతాచార్యులు, రాజ గురువులుగా విశిష్ట స్థాన మాక్రమించారు. ఇంకా, అప్పయ దీక్షితులు, గోవింద దీక్షితులు మొదలైన పేరుపొందిన గురువు లుండెడివారు.

విజయనగర పాలకులు పరిపాలనా సంబంధమైన విషయాలను వివిధ శాఖల క్రింద విభజించారు. శాసనాలు ఆ శాఖలను తెలిసినప్పటికి, ఎన్ని ఉన్నాయో, వివిధ శాఖల మధ్య సమన్వయం ఉండేదో, లేదో తెలిపేందుకు, సరైన ఆధారాలు దొరకటం లేదని, నేలటూరు వెంకటరమణయ్య అన్నారు. **'రాయవాచకం'**లో రెండు చోట్ల సంప్రతులు అనే 9 మంది ఉద్యోగులను తెలిపింది. నేలటూరు వెంకటరమణయ్య 'సంప్రతి', బహుశా ప్రధాన కరణం, లేదా ప్రధాన కార్యదర్శి అయివుంటాడని అన్నారు. దీన్నిబట్టి 9 శాఖలు తప్పనిసరిగా వున్నాయని ఊహించొచ్చు. అయితే, ఈ సంప్రతుల విధులు ఏమిటో, మనకు తెలియదు. మల్లంపల్లి సోమశేఖర శర్మ, సంప్రతి రాజ్య లేదా దుర్గ గణకుడై యుండొచ్చునన్నారు. కాని, ఈ అభిప్రాయాన్ని వెంకటరమణయ్య అంగీకరించలేదు. విజయనగర రాజ్యంలో అట్టవణ కందాచార, భాండార, ధర్మాసన, సుంక, మొదలగు, శాఖలుండేవని, ఒక అభిప్రాయముంది. బహుశా, సంప్రతులు భూమి శిస్తును పర్యవేక్షించు అధికారులై యుంటారు. **'రాయవాచకం'**, రాయభాండారం, చిన్న భాండారం అన్న వాటిని తెలుపుతూంది.

'రాయవాచకం' తెలిపిన 18 రేవు పట్టణాల్లో, లేదా అబ్దుల్ రజాక్ పేర్కొన్న 300 రేవు పట్టణాలు, కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉండివుంటాయని ఊహించొచ్చు. అయితే ఈ రేవు పట్టణాల పర్యవేక్షణ నెవరు చేశారో, నిర్ధారణగా చెప్పేందుకు ఆధారాలు లేవు.

'ఆముక్తమాల్యద' ప్రకారం, పటిష్ఠమైన గూఢచారి శాఖ విజయనగర రాజ్యంలో ఉంది. ఈ గ్రంథం గూఢచారి కుండాల్సిన లక్షణాలను తెలుపుతూంది. అంతేకాక, పాలకుడు తప్పనిసరిగా ప్రతి రోజు గూఢచారులను కలుసుకోవాలని తెలుపుతూంది. పోర్చుగీస్ రచనలు ఆశ్చర్యకరంగా గూఢచారి శాఖ విషయం గురించి ప్రస్తావించవు. **'రాయవాచకం'** రెండు రకాలైన గూఢచారులను తెలుపుతూంది. కృష్ణదేవరాయలు రాత్రులందు స్వయంగా తిరిగి, గూఢచారుల వార్తలు ఎంతవరకు నిజమో తెలుసుకొనేవాడు.

విజయనగర రాజ్య కాలంలో దౌత్యనీతి సంబంధాలను మెరుగుపర్చుకొనుటకు, రాయబారులను పంపే సంప్రదాయం కలదని, **రాయవాచకం, మనుచరిత్ర, ఆముక్తమాల్యదల** వలన తెలుసుకోవచ్చు. రాయబారుల సమావేశాలను **రాయవాచకం** తెలుపుతూంది. రాయబారులను స్థానపతులన్నారు. ఈ పైన పేర్కొన్న గూఢచారి, రాయబారులపై నియంత్రణ చేసే మంత్రిత్వ శాఖ వుందో, లేదో చెప్పలేం కాని, బహుశా ఈ రాయబారులు, గూఢచారులు పాలకుని ప్రత్యక్ష అధికారం క్రింద వుండేవారేమోనన్నది, నేలటూరు వెంకటరమణయ్య అభిప్రాయం.

20.2.2 : రాష్ట్ర ప్రభుత్వం

విజయనగర పాలకులు పాలనా సౌలభ్యం దృష్ట్యా, తమ సువిశాల రాజ్యాన్ని రాష్ట్రాలుగా విభ జించారు. అయితే, ఆనాడు రాష్ట్రాలను రాజ్యాలని పిల్చేవారు. సాధారణంగా, రాజ్య మందలి

BRAOU

ప్రధాన దుర్గం పేరే, రాజ్యాని కియ్యబడింది. విజయనగర శాసనాల్లో ఉదయగిరి, చంద్రగిరి, ఘనగిరి (పెనుగొండ), ముళుబాగల, రాజగంభీర, కొండవీడు, గుత్తి, కందనవోలు (కర్నూలు), రాయదుర్గ మొదలైన రాజ్యాలు పేర్కొనబడ్డాయి. అచ్యుతరాయల కాలం నాటికి, విజయనగర సామ్రాజ్యంలో, (1) హంపి హస్తినావతి, (2) పెనుగొండ, (3) గుత్తి, (4) కందనవోలు, (5) శ్రీశైలం, (6) రాయదుర్గం, (7) బారకూరు, (8) కొండవీడు, (9) ఉదయగిరి, (10) చంద్రగిరి, (11) ముంరుబాగల, (12) పడైవీడు, (13) తిరువడి, (14) శ్రీరంగపట్నం, (15) రాయచూరు, (16) నిడుగల్లు, (17) అరగ రాజ్యాలున్నట్లు, శాసనాలు తెలుపుతున్నాయి. ఇవేకాక, అచ్యుతరాయల కాలం నాటికి శాసనాలు, బురడకుంటే, కొంగు, ఆదవని, చెన్నపట్టణ రాజ్యాల్ని కూడ పేర్కొన్నాయి. ఈ రాజ్యాల విస్తీర్ణం, సరిహద్దులు, పాలనావసారాల దృష్ట్యా మారుతుండేవని, ఊహించొచ్చు. కృష్ణ దేవరాయలు రాజ్యానికి వచ్చిన మొదట్లో, గుత్తిని ప్రత్యేక రాజ్యంగా పేర్కొన్నారు; కాని, 1529 నాటికి, అది పెనుగొండ రాజ్యంలో అంతర్భాగమైనట్లు, శాసనాలు తెలుపుతున్నాయి. ఈ గుత్తి రాజ్యాన్నే, అచ్యుతరాయలు, సదాశివరాయల కాలంలో ప్రత్యేక రాజ్యంగా పేర్కొనారు. ఈ విధమైన విభజననేకాక, విజయనగర పాలకులకు కప్పం చెల్లిస్తూ, విజయనగర రాజ్య సార్వభౌమాధికారాన్ని అంగీకరించిన సామంత రాజ్యాలుండేవి. విజయనగర శాసనాలు, ఈ రాష్ట్రాలను, పైన పేర్కొన్న రాజ్యాలతోపాటుగా, మండలాలు, నాడులుగా పేర్కొంటున్నాయి. జయంగొండ చోళ మండలం, తొండై మండలం, చోళ మండలం, బనవాసి మండలం, శాసనాల్లో కనపడతాయి. అయితే, ఈ మండలాలకు పరిపాలనాపరమైన ప్రాధాన్యత ఏమీ లేదని, టి.వి. మహాలింగం అభిప్రాయం. ఎ.వి. వెంకటరత్నం కూడా, ఈ మండలాలను రాజకీయ విభాగాలుగా గుర్తించనక్కరలేదన్నారు. విజయనగర సామ్రాజ్య మందలి ముఖ్యమైన సామంత రాజ్యాలైన గెరసొప్ప, కరకల్, క్వీలన్, ఔన్‌కాసి పాలకులు, సార్వభౌముని బోక్యం లేకుండా పరిపాలన కొనసాగించారని, క్రమం తప్పకుండా కప్పం చెల్లించినంత కాలం చక్రవర్తికి, వారికి మధ్య వివిధమైన సమస్యను సృష్టించలేదని, అంతేకాక, వారు అన్ని విధాల సర్వస్వతంత్రంగా పరిపాలించారని, నేలటూరు వెంకటరమణయ్య అభిప్రాయం.

విజయనగర పాలకులు తమిళనాడు ప్రాంతంలో రాష్ట్ర పాలనలో మార్పులను ప్రవేశపెట్టక, చోళుల పద్ధతిని కొనసాగించారని, అయితే కన్నడ, తెలుగు ప్రాంతాల్లో మాత్రం, రాయ పాలకుల సృష్టి జరిగింది. నేలటూరు వెంకటరమణయ్య అభిప్రాయం ప్రకారం, సైనిక అవసరాలు మాత్రమే ఈ రాష్ట్రాల అవతరణకు కారణం. అందువల్లనే కాబోలు, విజయనగర రాజ్యం రాయరాణువకు చెందుతాయని, శాసనాలు తరచూ పేర్కొన్నాయి.

రాష్ట్ర పాలకులు పౌర ఉద్యోగులు కాదు. వారు దుర్గాధిపతులైన సైనికాధికారులు. ఈ రాజ్యాల సంఖ్య శాశ్వతం కాదు. రాష్ట్ర పాలకుణ్ణి, లేక రాజ్యాధిపతిని, దుర్గ దన్నాయక్ అన్నారు. సర్వసాధారణంగా, దుర్గ దన్నాయకులుగా రాజకుమారుల్ని, లేదా విశ్వాసపాత్రులైన బ్రాహ్మణులను మాత్రమే నియమించేవారు. విజయనగర పాలనలో కనిపించే ప్రత్యేకత ఏమిటంటే, సరిహద్దు రాజ్యాల దన్నాయకులు తప్ప మిగిలిన దన్నాయకులు రాజధానిలో వుంటూ, తమ రాష్ట్ర పాలనా విధులను 'కార్యకర్త'ల ద్వారా నిర్వహించేవారు. వెంకటరమణయ్య అభిప్రాయం ప్రకారం, ప్రతి ప్రముఖ నాయకుడు, గవర్నర్, మంత్రులు 'కార్యకర్త'లను కలిగున్నారు. ఈ కార్యకర్తలు పౌరసంబంధమైన విధులను నిర్వహించారు. కృష్ణదేవరాయలు క్రీ.శ. 1514లో, సాళువ తిమ్మరసును కొండవీడు గవర్నర్ గా నియమించాడు; కాని, సాళువ తిమ్మరసు తనకు బదులుగా నాదెండ్ల గోపన్నను కార్యకర్తగా నియమించాడు. ఇటువంటి ఉదాహరణలు శాసనాల్లో అనేకం కనిపిస్తాయి. దన్నాయకులకున్న విధుల్లో

BRAOU

ప్రధానమైనవి, నాణేలను ముద్రించుట, పన్నులను మినహాయించటం, కొత్త పన్నులను విధించటం మొదలైనవి. 'దుర్గదన్నాయక్ నివర్తన' అన్న పన్నును వీరు వసూలు చేశారు. దన్నాయకుడు వసూలు చేసిన పన్ను, ప్రజలను సంరక్షించేందు కిచ్చిన ప్రతిఫలమని, వెంకటరమణయ్య అభిప్రాయం. ఈ పన్ను అన్ని రాష్ట్రాల్లో ఒకే విధంగా వసూలు చేయబడిందో, లేదో, తెలియదు. ప్రతి రాష్ట్ర మందలి ఉన్నత రెవిన్యూ అధికారి, ఉన్నత న్యాయ పాలకుడు దన్నాయకుడే. ప్రతి దన్నాయకుడు తన రాబడిలో కొంత భాగాన్ని చక్రవర్తికి చెల్లించేవాడు. అంతేకాక, తనకు కేటాయించిన సైన్యాన్ని కూడా పోషించేవాడు. న్యూనిజ్ ప్రకారం, ఉదయగిరి దన్నాయకుడు తన కొచ్చే 8 లక్షల ఆదాయంలో, 3 లక్షలు రాయలకు చెల్లించి, 25 వేల కాలిబంటులను, 15 వేల గుఱ్ఱపు రౌతులను, 40 ఏనుగులను పోషించాడు. దన్నాయకులను ఒక ప్రాంతం (దుర్గం) నుండి మరొక దుర్గానికి బదిలీ చేసే సంప్రదాయముంది. ఈ దన్నాయకునకు కార్యస్థానం చావిడి, లేక సావిడై ఉంటుందన్న భావన కలదు. ఈ దన్నాయకునకు రాజ్య పాలనలో సహాయం చేయడానికి, ఉద్యోగులుండి వుంటారు. అయితే, ఆ ఉద్యోగుల పేర్లను నిర్ధారణగా చెప్పలేం.

ప్రతి రాజ్యం లోను ఒక రాజప్రతినిధిని నియమించినట్లు తెలుస్తూంది. రాజప్రతినిధులుగా నియమించబడ్డ, సంగమ వంశ రాకుమారులు 'ఒడియ' లేక 'వడియార్' అన్న బిరుదులను వహించారు. మొదటి కంపన ఉదయగిరి రాజ్యాన్ని పాలించగా, రెండవ హరిహరుని కుమారుడైన విరూపాక్షుడు, తుండీర, చోళ, పాండ్య రాజ్యాలను పాలించాడు. కాని, రెండవ దేవరాయల కాలం నుండి, రాకుమారులతోపాటుగా ఇతరులను కూడ రాష్ట్ర పాలకులుగా నియమించటాన్ని ఆరంభించారు. ఎ.వి. వెంకటరత్నం అభిప్రాయం ప్రకారం, ఈ విధంగా నియమించబడ్డ రాజప్రతినిధులు ఒకటి కంటే ఎక్కువ రాష్ట్రాలకు పాలకులుగా వ్యవహరించారు. క్రీ.శ. 1475లో, విఠరస ఒడియ, బారకూరు, మంగుళూరు రాజ్యాలను పరిపాలించినట్లు, శాసనాలు తెలుపుతున్నాయి.

BRAOU

20.2.3 : జిల్లా పాలనా వ్యవస్థ

విజయనగర పాలకులు పరిపాలనా సౌలభ్యం కొరకు, రాజ్యాలను, లేదా రాష్ట్రాలను, సీమలు, స్థలాలు, నాడులుగా విభజించారు. నేలటూరు వెంకటరమణయ్య ఇప్పటికి దొరికిన శాసనాలాధారంతో, రాజ్య విభాగాల పరిపాలనా విశేషాలను నిర్దుష్టంగా, నిర్ధారణగా చెప్పలేమన్నారు. పైన చెప్పినట్లుగా అంటూనే, రాజ్య ముఖ్య విభాగం సీమ యంటూనే, నాడు, స్థలాలకు అధికార్లు వేరన్నారు. సీమ పరిపాలనకు సంబంధించిన విశేషాలను, కర్నూల్ జిల్లాలో దొరికిన శాసనాలు తెలుపుతాయి. వెంకటాద్రి అనే కంచనవోలు రాజప్రతినిధి, సదాశివరాయలు పరిపాలిస్తుండగా, దొరలను, పారుపత్యగాళ్ళను, రాయసంవారిని, అవసరం వారిని, రాచకరణాలను, పరిహరించబడిన పన్నులను వసూలు చేయవద్దని ఆజ్ఞాపించాడు. ఈ పైన పేర్కొన్న దొరలు, పారుపత్యగాళ్ళు, రాయసంవారు, అవసరంవారు, రాచకరణాలు, సీమకు చెందిన వివిధ ఉద్యోగులైయుండొచ్చు. దొరలు బహుశా అమరనాయకులైయుంటారని, వెంకటరమణయ్య అభిప్రాయం. పారుపత్యగారు, లేక మణయగారు సీమ ప్రధానాధికారై వుంటారని, ఈ క్రింద ఇవ్వబడిన శాసన సమాచారం ప్రకారం చెప్పొచ్చు. క్రీ.శ. 1525లో గండికోట రాజప్రతినిధి రాయసతిమ్మ అన్నాజయ్యను తమ పారుపత్యదారునిగా నియమించాడు. దీన్ని బట్టి, పారుపత్యదారుని, రాజ్య పాలకుడు, లేక రాజప్రతినిధి నియమించాడని చెప్పకోవచ్చు. ఈ సీమ పారుపత్యదారునకు రెవిన్యూ విధులు ఎక్కువగా ఉన్నాయనిపిస్తుంది. సీమకు సంబంధించిన పన్నులను విధించుట, వసూలు చేయుట, ప్రభుత్వానికి చెల్లించుటతోపాటుగా, ఆదాయాన్ని పెంచేందుకు తగిన

చర్యలను కూడ తీసుకొనేవారు. ఇంకా, సంతలను ఏర్పాటు చేయడం, రైతులకు పట్టాలివ్వడం కూడ, ఇతని విధులే. ఇతను కూర్చొని పనిచేసే చోటును, చావిడన్నారు. ఇతనికి విధి నిర్వహణలో కరణాలనే ఉద్యోగులు సహాయపడ్డారు. మిగిలిన రాయసంవారు, అవసరంవారు, రాచకరణాలు ఏఏ విధులను నిర్వర్తించారో ఖచ్చితంగా చెప్పలేం. బహుశా, రాయసంవారు గుమస్తాలై వుంటారు. అలాగే అవసరం వారు, లేక అవర్సరీకులు, రాజ భవనంలో పనిచేసే ఉద్యోగులై యుండొచ్చు. **రాయవాచకం**, అవసరంవారు, రాయసంవారు, చక్రవర్తి దండయాత్రలో వెంటవెళ్ళేవారని తెలుపుతూంది. చక్రవర్తి వెంట దండయాత్రలో వెళ్ళిన, పైన పేర్కొన్న రాయసంవారు, అవసరంవారు, సీమ ఉద్యోగులు కాకపోయుండొచ్చునన్న భావం కలుగుతూంది. కన్నడ 'సీమ' తెలుగు శాసనాల్లో 'నాడు'గా పేర్కొనబడింది.

నాడు అనబడే భూభాగానికి చెందిన పాలనా విశేషాలను తెలిపే శాసనాధారాలు కనిపించలేదు. క్రీ.శ. 1530 నాటి ఒక శాసనం, 'నాడుతలవర' అన్న ఉద్యోగిని పేర్కొంటున్నది. దీన్ని బట్టి, ఇతర ఉద్యోగులు ఉండి వుండాలి. కాని, వారిని గురించిన విశేషాలు తెలియరావటం లేదు.

కొన్ని గ్రామాల సమూహాన్ని 'స్థల' మన్నారు. ఆరవీటి శాసనాలు స్థలానికి బదులుగా 'సమ్మతి', 'సమూతి'లను పేర్కొన్నాయి. ఇంకా శాసనాల్లో 'వనిత', లేక 'వవిత' అన్న విభాగాలు కనిపించాయి. దాచయగిరి, వెనుగొండ, హంపి రాజ్యాలు, 'వనిత'లుగా విభజింపబడ్డాయి. కన్నడ శాసనాల్లో కనిపించిన 'వెంతెమ', 'వెంతి' అనే భూభాగాలు స్థలం కన్నా పెద్దవని, రాజ్యం కన్నా చిన్నవని, వెంకట రమణయ్య భావన. ఈ స్థల మనే భూభాగంలో కూడా, చావిడి వుండివుండొచ్చు. బహుశా, శాసనాల్లో కనిపించే స్థల కరణాలు, స్థల లెక్కల పట్టికలను తయారుచేసుండొచ్చు. క్రీ.శ. 1549 నాటి హొంగనురు శాసనం చావిడి కరణాన్ని పేర్కొంది. చావిడి కరణం, స్థల కరణం ఒకటి అయుండొచ్చునేమో? క్రీ.శ. 1568 నాటి శాసనంలో, దువ్వూరు స్థలానికి సంబంధించిన రెడ్డి, కరణం, సెట్టి అనే ఉద్యోగుల పేర్లు కనిపించాయి. ఈ ఉద్యోగుల విధులు ఏమిటో నిర్ధారణగా చెప్పలేం. ఈ పైన పేర్కొన్న విధంగా, రాజ్యానికి, గ్రామానికి మధ్య, 'సీమ', 'స్థలం', 'నాడు', 'వనిత', 'వెంతె', లేక 'వెంతిమ' అన్న భూభాగాలున్నాయి. ఈ భూభాగాల విశేషాలు ఇంకా తెలియాల్సుంది.

20.2.4 : స్థానిక పాలన

గ్రామం విజయనగర పాలనా వ్యవస్థలో అతి చిన్న భూభాగం. మన దేశంలో అతి ప్రాచీన కాలం నుండి గ్రామ పరిపాలనలో కీలక పాత్రను నిర్వహించిన గ్రామ సభలు, తమ ప్రాబల్యాన్ని కోల్పోయినట్లు కనిపిస్తుంది. ఇందుక్కారణం, విజయనగర పాలనా యంత్రాంగం సైనిక అవసరాలను దృష్టిలో నుంచుకొని, నిర్మించటమే. ఎ.వి. వెంకటరత్నం తన **'లోకల్ గవర్నమెంట్ ఇన్ ది విజయనగర ఎంపైర్'** అన్న గ్రంధంలో, విజయనగర పాలనా కాలం నాటి స్థానిక పరిపాలన గురించి విపులంగా వర్ణించారు.

ఆనాటి గ్రామాల్లో ఒక్కళ్ళు, ప్రజె, హలరు, హెడినెంతు, జాతి, లేక సమయ, జనని, జగత్తనే పేర్లతో, గ్రామ సభలుండేవి. ఈ పైన పేర్కొన్న వివిధ పేర్లతో పిలువబడ్డ గ్రామ సభలు, పన్నులను వసూలుచేసి, ప్రభుత్వానికి చెల్లించేవి. అలాగే, ప్రభుత్వం కూడా ఏవైనా పన్నులను రద్దు చేసినా, కొత్త పన్నులను ప్రవేశపెట్టినా, ఏ పన్నులనైనా దేవాలయ ఖర్చులకు బదిలీ చేసినా, గ్రామ సభలకు

BRAOU

తెలిపేది. కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వానికి, గ్రామ సభలకు మధ్య, ప్రత్యక్ష సంబంధం కలదని, టి.వి. మహాలింగం, ఎ.వి. వెంకటరత్నం అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఇంకా, గ్రామ సభలు గ్రామాల్లో ధర్మకర్తలుగాను, న్యాయాధికారులుగాను, తమ విధులను నిర్వర్తించేవి.

విజయనగర సామ్రాజ్య కాలం నాటి శాసనాలను పరిశీలిస్తే, ఆనాడు ఐదు రకాలైన గ్రామాలున్నట్లు తెలుస్తూంది. అవి: 1) అమర గ్రామాలు (2) బ్రహ్మదేయ గ్రామాలు, (3) దేవాదాయ, మరపుర గ్రామాలు, (4) ఉంబళి గ్రామాలు (5) భండారవాడ గ్రామాలు. అమర గ్రామాలనగా, సైన్య నిర్వహణకు అమరనాయకులకు ప్రత్యేకించబడ్డ గ్రామాలు. ఈ గ్రామాలపై సర్వాధిపత్యం, అయా గ్రామాలు కేటాయించబడ్డ అమరనాయకుల కియ్యబడింది. కాని, వీటిపై చక్రవర్తికి అదుపు లేదని చెప్పలేం. అమరనాయకులు నిరంకుశంగా ప్రజలను పీడించగా, ఆ రైతుల కష్టాలను పోగొట్టేందుకు విజయనగర పాలకుడో, లేదా మండలాధీశుడో, జోక్యం చేసుకున్నాడని చెప్పే శాసనాధారాలున్నాయి. బ్రహ్మదేయ గ్రామాలనగా, పండితులకు తమ శాస్త్రాలను, విద్యలను బోధించుటకు, ప్రభువులచే ఇవ్వబడినవి. వీటినే, అగ్రహారాలు, లేక శ్రోత్రియాలని కూడా పిల్చేవారు. ఈ గ్రామాలను అన్ని పన్నులు లేకుండా చేసి, సర్వమాన్యంగా లేక సర్వకరపరిహారంగా ఇచ్చేవారు. ఈ గ్రామాల్లో ప్రవేశించుటకు, చక్రవర్తి మొదలుకొని, భటునివరకు, అగ్రహారీకుల అనుమతి కావాలి. ఇవి దేవాలయాలకు, మఠాలకు, రోజు ధూప, దీప నైవేద్యాలను జరుపుటకు, భగవంతునికి క్రమం తప్పకుండా సంవత్సరం పొడుగునా ఉత్సవాలను జరిపించుటకు, అన్ని పన్నులు లేకుండా, కొన్ని పన్నులను తగ్గించి ఇవ్వబడిన గ్రామాలు. మరపుర గ్రామాలనగా మఠాధిపతులకు, వారి శైవ, లేదా వైష్ణవ ధర్మాన్ని ప్రచారం చేయుటకు, సర్వ పరిహారాలతో ఇవ్వబడిన గ్రామాలు. ఒకానొకప్పుడు, ఈ రకమైన గ్రామాలపై, జోడి, లేదా శ్రోత్రియం అనే కొద్ది భూమి శిస్తును చెల్లించేవారు. భండారవాడ గ్రామాలు రాజునకు చెందినవి. ఈ గ్రామాలపై వసూలు చేయబడిన భూమి శిస్తు, రాయ భాండారానికి చేరేది. ఈ గ్రామాల్లో భూమి శిస్తును వసూలు చేయు విధిని, రాజోద్యోగులే కలిగుండేవారు. ఈ భండారవాడ గ్రామాలు దుర్గదన్నాయకుని అధీనంలో, లేక స్థలపతి అధీనంలో వుండి వుండొచ్చు. ఈ భండారవాడ గ్రామాల్లో సామాన్య కర్షకులకు గ్రామ పరిపాలనా యంత్రాంగంలో నున్న స్థానం, లేదా పాత్ర గురించి, నిర్దారణగా చెప్పలేం. ఒక అభిప్రాయం ప్రకారం, సైనిక అవసరంపై, లేదా ప్రాతిపదికపై ఏర్పడ్డ ఈ భండారవాడ గ్రామాల్లో, వ్యవహారాలన్ని అమరనాయకులు, వారి కార్యకర్తలచే నిర్ణయించబడేవి. అయితే, ఎ.వి. వెంకటరత్నం అభిప్రాయం ప్రకారం, స్థానిక పాలనలో గ్రామ సభలు తమ ప్రాబల్యాన్ని కోల్పోలేదు. పైన పేర్కొన్న బ్రహ్మదేయ గ్రామాల్లో, ఏక భోగ గ్రామాలు, గణ భోగ గ్రామాలని, రెండు రకాలున్నాయి. గణ భోగ గ్రామాల్లోని సభ్యులను విద్వాన్ మహాజనులు, లేక మహాజనులన్నారు. విద్వాన్ మహాజనులతో కూడిన విద్వాన్ మహా సభలు, ఈ గ్రామాల్లో నిర్వహించిన పాత్రను, ఎ.వి. వెంకటరత్నం వివులంగా తెలిపారు. ఈ మహాజనులు గ్రామానికి, ప్రభుత్వానికి మధ్య, సంధానకర్తలుగా వ్యవహరించారు. అగ్రహార గ్రామాల్లో మానవగ్గడే అనే సైన్యాధికారి వుండేవాడు. అయితే, ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, ఉపేంద్రపురం అగ్రహారీకులు నెల కొక అధికారిని నియమించుకొన్నారని, బి. ఏ. శాస్త్రిటోర్ తెలిపారు. 'బుద్ధివంతురులు' అనే వారిని, కొన్ని శాసనాలు తెలుపుతున్నాయి. వీరి ప్రభుత్వం అగ్రహారాలపై లేనేజర్లవంటి వారిని నియమించినట్లుగా, క్రీ.శ. 1375, క్రీ.శ. 1517, క్రీ.శ. 1532, క్రీ.శ. 1577 నాటి శాసనాలు తెలుపుతున్నాయి. అగ్రహారాల స్థాయిని బట్టి, మహాజనుల సంఖ్య మారుతుండేది.

పైన పేర్కొన్న ఐదు రకాలైన గ్రామాలతోపాటు, ఆనాడు అనేక నగరాలు, లేక పట్టణాలున్నాయి. ప్రతి నగరం లోను వ్యాపార శ్రేణులున్నాయి. శ్రేణి నాయకుణ్ణి ఉభయనానాదేశి, పట్టణ మహావడ్డీ

BRAOU

వ్యాపారి, ప్రధ్వీశెట్టి, శెట్టి పట్టణ స్వామి, నగరేశ్వర, పట్టణాధీశ్వర, మహా ప్రభు అని సిల్చేవారని శాసనాలు తెలుపుతున్నాయి. ఈ శ్రేణి నాయకులు నగరానికి, ప్రభుత్వానికి మధ్య, వారధులుగా పనిచేశారు. టి.వి. మహాలింగం అభిప్రాయం ప్రకారం, విజయనగర సామ్రాజ్య కాలంలో, రాజకీయ, సాంఘిక, ఆర్థిక కార్యక్రమాలపై శ్రేణి నాయకులు తమ ప్రభావాన్ని చూపించారు.

విజయనగర సామ్రాజ్య కాలంలో, ప్రతి గ్రామం లోను 12 మంది గ్రామాధికార్లు, లేక 'ఆయ గాండ్రు' ఉండేవారు. వారే, రెడ్డి, కరణాలు, తలారి, చాకలి, మంగలి, వడ్రంగి, కంచరి, కుమ్మరి, కమ్మరి, అగసాలి, నీరుకావలి, చర్మకారుడు. అట్టడణతంత్రం పైన పేర్కొనబడ్డ ఆయగాండ్రను, శానబోగు, గవుడు, కుమ్మరి, బడిగె, అగస, పంచాంగ, వాయిద్య, మాదిగె, అగసార్లు, తలారి, నేరుగంటి, మంచార, అని పేర్కొన్నది. వీరందరికి ఈ కాలంలో తమ వృత్తులను నిర్వహించినందుకు 'మిరాశి' భూములియ్యబడినాయి. వీటినే, భటవృత్తి మాన్యాలన్నారు. పంటల కాలంలో ఈ ఆయగాండ్రకు 'మేరలు' అనే పేరుతో, మామూళ్ళు, లేక బహుమతులనిచ్చేవారు. గ్రామ సభల్లో వీరికి బహుశా తక్కువ పాత్ర వుండేదేమో!

20.2.5 : నాయంకర వ్యవస్థ: గుణదోషాలు

విజయనగర సామ్రాజ్య పాలనా వ్యవస్థకు మూల స్తంభం, నాయంకర విధానం, లేక అమరనాయకర పద్ధతి. విజయనగర సామ్రాజ్యం సమకాలీన రాజకీయ పరిస్థితుల ప్రభావం వలన సైనిక రాజ్యంగా రూపొందిందన్న విషయాన్ని, ఇంతకుముందే చెప్పుకున్నాం. ఇట్టి సైనిక రాజ్య వ్యవస్థలో సామ్రాజ్య భద్రత కొరకు విజయనగర పాలకులు ఎంతో ఆలోచించి, ముందుచూపుతో ఈ వ్యవస్థను బలపర్చారు. విజయనగర సామ్రాజ్య కాలమందలి నాయంకర విధానం, లేక అమరనాయక విధానం, కాకతీయుల నాయంకర పద్ధతి మూలాధారంగా నిర్మించబడింది. సి.వి. రాఘవేంద్రరావ్ అభిప్రాయం ప్రకారం, ఒక విధమైన సైన్య-సేనావి బంధనం. నేలటూరి వెంకటరమణయ్య నాయంకర పదానికి ఖచ్చితమైన, నిర్దారణైన అర్థాన్నివ్వలేమన్నారు. కర్ణాటకకు చెందిన శాసనాల్లో విజయనగర సామ్రాజ్య స్థాపనకు 300 సంవత్సరాలకు ముందే, 'నాయక్' అన్న పదవి పేర్కొనబడింది. ఆంధ్ర దేశంలో కాకతీయుల కాలం నాటి నుండి, 'నాయక్' అన్న పదవి కనపడుతుంది. డెర్రెట్ అను చరిత్రకారుడు 11వ శతాబ్దపు శాసనాధారంతో, నాయక పదవిని, ఆంగ్ల భాష లోని కెప్టెన్‌తో పోల్చి, ఒక సైనిక ఉద్యోగి అన్నారు. మోనియర్ విలియమ్స్ కూడా, సైనిక నాయకుడిగా చెలామణైన వ్యక్తని అర్థం చెప్పారు. బర్టన్ స్టీన్, నాయకుడనేవాడు అవసరమైనప్పుడు విజయనగర పాలకుల తరపున సైనిక కార్యకలాపాల్లో పాల్గొనే శక్తివంతమైన యుద్ధ వీరుడన్నారు. అంతేకాక, ఈ నాయకుడు యుద్ధ వీరుడేకాక, ప్రాదేశిక ప్రముఖుడు కూడా అయిపుంటాడన్నారు.

విజయనగర శాసనాలను పరిశీలిస్తే, అమరనాయకుడు చక్రవర్తికి కొంత నిర్ణీతమైన సైన్యాన్ని పోషించుటకు, యుద్ధ సమయంలో సహాయపడేందుకు గాను, ప్రతిఫలంగా, రాజ్యంలో కొంత భూభాగాన్ని అమరంగా పొందినవాడుగా కనపడతాడు. రాయవాచకం, అమరనాయకులు అదవాని, చెయ్యేటి దుర్గం, గుత్తి, గండికోట, చంద్రగిరి, గుళ్ళంకొండ, మద్దూరు, పొనగిరి, త్రిశరపుర, కన్నత్తూరు, పెనుగొండ, నంద్యాల, శ్రీరంగపట్టణం, ఉమ్మత్తూరు, దళనాయకులకోట, వల్లంకోట, మదుర, పాళంతుంకోట, దిండిగల్, సత్యవీడు, కొచ్చికద్దు, దంగినకోట, నారాయణవన దుర్గాలకు చెందిన భూభాగాలపై అధిపతులని చెపుతూంది. నేలటూరి వెంకటరమణయ్య, ఈ పైన పేర్కొన్న కోటలు విజయనగర సామ్రాజ్యపు భూభాగం లోని వివిధ ప్రాంతాల్లో వుండుటచే, రాజ్యం లోని $\frac{3}{4}$

BRAOU

వంతు భూభాగాన్ని అమరనాయకులు పాలించారన్నారు. విదేశీ యాత్రికులైన పేస్, న్యూనిజ్‌లు, అమరనాయకుల విధులు గురించి పేర్కొన్నారు. న్యూనిజ్, విజయనగర సామ్రాజ్యంలో 200 నాయంకరాలున్నాయన్నాడు. పేస్, న్యూనిజ్‌లు, అమరనాయకులు చక్రవర్తికి యుద్ధ సమయంలో సైనికులను సరఫరా చేసేవారని, అందుకుగాను కొంత భూభాగంపై ఆధిపత్యాన్ని కలిగున్నారని చెప్పారు. అంతేకాక, వీరు ప్రతి సంవత్సరం చక్రవర్తికి ప్రభుత్వం నిర్ణయించిన సొమ్మును కప్పంగా చెల్లించేవారు. ఇంకా, వీరు ప్రతి సెప్టెంబర్ మాసంలో మొదట 9 రోజుల్లో చెల్లించాల్సిన భూమి శిస్తును చెల్లించేవారు.

ఈ అమరనాయకులకు వారికివ్వబడిన అమరాల పాలనా వ్యవహార విషయంలో, కొంత స్వతంత్ర ప్రతిపత్తి కలదు. ఈ అమరనాయకుల నియామకం ప్రభువుల ఇష్టంపై ఆధారపడి వుండేది. అమరనాయకులు విధేయతతో తమ విధులను సక్రమంగా నిర్వహించినంత కాలం, అమరనాయకులుగా వుండేవారు. ఈ అమరనాయక పదవి వారసత్వంగా వచ్చేది కాదు. కాని, కాలక్రమంగా పాలకులు అసమర్థులు కావటంతో, వంశపారంపర్యమైనాయి. అమరనాయకులను ఒక చోట నుండి మరొక చోటికి బదిలీ చేసినట్లు, శాసనాధారాలున్నాయి. అమరనాయక పదవిలో నున్న వారందరు, ఒకే స్థాయికి చెందిన వారు కాదు. ఈ అమరనాయకుల మధ్య, పదవిలో, హోదాలో, ఆదాయంలో, తేడాలున్నాయి. ఈ తేడాలే అమరనాయకులు మహామండలేశ్వర, మండలేశ్వర, మహానాయంకరాచార్య అన్న బిరుదులను ధరించేందుకు అవకాశాన్ని కల్పించుండొచ్చు.

అమరనాయక వ్యవస్థ స్వభావాన్ని గురించి ఏకాభిప్రాయం లేదు. నేలటూరి వెంకటరమణయ్య అమరనాయక వ్యవస్థకు, ఫ్యూడల్ వ్యవస్థకు మధ్య, పోలికలు, తేడాలున్నాయన్నారు. కాని, ఫ్యూడల్ వ్యవస్థలో నున్న ప్రభువుకు, సామంతునకు మధ్య నున్న స్వామి, లేక రాజు, భృత్యుడు, లేక సేవకుడన్న రాజకీయ అనుబంధం కన్పించదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. విజయనగర శాసనాల్లో, అమరనాయకులు చక్రవర్తికి విధేయత చూపినట్లు, కప్పాన్ని చెల్లించినట్లు ఆధారాలు కనిపించవని, వెంకటరమణయ్యన్నారు. బర్టన్ స్టీన్, విజయనగర సామ్రాజ్య మందలి నాయంకర విధానంలో ఐరోపీయ ఫ్యూడలిజం లక్షణాలు లేవన్నారు. ఇంకొందరి అభిప్రాయం ప్రకారం, మార్క్ బ్లాక్ తన గ్రంథం **'ఫ్యూడల్ సొసైటి'**లో పేర్కొన్న రాజకీయ లక్షణాలన్నీ విజయనగర సామ్రాజ్య మందలి అమరనాయక వ్యవస్థలో ఉన్నాయన్నారు. పైన పేర్కొన్న వాదాలను నిష్పక్షపాతంగా పరిశీలిస్తే, విజయనగర నాయంకర విధానంలో ఫ్యూడల్ సేవా నిబంధన సూత్రాలు, ఐరోపీయ ఫ్యూడలిజంలో ఉన్నంత నిర్దుష్టంగా లేవని చెప్పొచ్చు.

విజయనగర రాజ్య విస్తరణలో అమరనాయకులు ఎంతో ముఖ్యమైన పాత్రను నిర్వహించారు. తమిళ ప్రాంతంలో క్రీ.శ. 1371-1422 మధ్య కాలంలో ఆరుగురు నాయకులు కనిపించగా, క్రీ.శ. 1440-1459 మధ్య కాలంలో నాయకుల సంఖ్య 12 కు పెరిగాయి. క్రీ.శ. 1491 నుండి, క్రీ.శ. 1508 మధ్య కాలంలో, మరో 10 మంది నాయకులను తమిళ శాసనాలు పేర్కొంటున్నాయి. కృష్ణదేవరాయల కాలంలో శాసనాలు మొత్తం 27 మంది నాయకులను పేర్కొంటున్నాయి. ఈ నాయకుల సంఖ్య క్రీ.శ. 1530 నాటికి, 200 మందికి పెరిగిందని, న్యూనిజ్ రాశారు. రాయవాచకం మదుర నాయక రాజైన విశ్వనాధనాయకుని స్థానాపతి, విజయనగరం నుండి విశ్వనాధనాయకునకు పంపిన విన్నపమే. ఇది కృష్ణదేవరాయల కాలం నాటి పాలనా విశేషాలను, చరిత్రను తెలిపేది. ఈ అమరనాయకుల తరపున ఒక సైనికాధికారి విజయనగరంలో ఉండి, అమరనాయకుని సైన్యంపై అజమాయిషీ చేయగా, అమరనాయకునకు, ప్రభువునకు మధ్య, స్థానాపతి అన్న ఉద్యోగి ఉండేవాడు.

BRAOU

ఈ అమరనాయక వ్యవస్థ సమర్థత, ఉపయోగం, పాలకుని సమర్థతో ముడిపడివుంది. విజయనగర సామ్రాజ్య ఉన్నతికి, విచ్ఛిత్తికి, పతనానికి, అమరనాయకులు నిర్వహించిన పాత్ర తక్కువేం కాదు. ఈ వ్యవస్థలో మంచితోపాటుగా, చెడు కూడా ఎంతో వుంది.

20.2.6 : సైనిక వ్యవస్థ

నేలటూరి వెంకటరమణయ్య అభిప్రాయం ప్రకారం, విజయనగర సామ్రాజ్య వ్యవస్థ ఎల్లపుడూ యుద్ధానికి సన్నద్ధంగా వుండే విధంగా ఏర్పాటు చేయబడింది. విజయనగర పాలకులకు, సమకాలీన బహమని పాలకులతో ఎప్పుడు యుద్ధం వస్తుందో తెలియకపోవటంచేత, తమ పాలనాయంత్రాంగాన్ని సైనికావసరాలకు అనుగుణంగా రూపుదిద్దారు. రాజ్యాదాయంలో ఎక్కువ భాగం సామ్రాజ్య రక్షణకు అవసరమైన బలమైన, శక్తివంతమైన సైనిక శక్తిని తయారుచేయడంలో ఖర్చు పెట్టారు. కృష్ణదేవరాయలు **అముక్తమాల్యద**లో రాజ్య ఆదాయంలో సగ భాగాన్ని సైనిక శక్తిని పెంపొందింప చేయుటకుపయోగించాలన్నాడు. విజయనగర రాజ్య స్థాపకులైన హరిహర, బుక్కరాయలు ప్రవేశపెట్టిన సైనిక విధానాన్ని, రెండవ దేవరాయలు, వీరనరసింహరాయలు, కృష్ణ దేవరాయలు తమ సంస్కరణల ద్వారా మెరుగులు దిద్ది, తమ సైనిక శక్తిని మరింత శక్తివంతం చేశారు. నికోలోకాంటి కృష్ణరాయల సైన్యంలో 90 వేల మంది వున్నారనగా, అబ్దుల్ రజాక్ లక్షకు తక్కువలేదన్నాడు. **రాయవాచకం** ప్రకారం 5,00,000 కాల్బలం, 60 వేల గుఱ్ఱపు దళం, 1200 ఏనుగులు, రాయల సైన్యంలో వున్నాయి. కృష్ణదేవరాయలు రాయచూర్‌పై 70,000 కాలిబంట్లతో, 32,000 గుఱ్ఱపు దళంతో, 551 ఏనుగుల బలంతో దండెత్తాడు.

విజయనగర సైనిక వ్యవస్థలో రెండు రకాలైన సైన్యాలున్నాయి. అవి (1) సిద్ధ సైన్యం, లేదా కైజీత సైన్యం; (2) అమర సైన్యం. ఇంతకు పూర్వమే అమర నాయక సైన్యాన్ని గురించి తెలుసుకున్నాం. సిద్ధ సైన్యం, లేదా కైజీత సైన్యంపై, కందాచార శాఖ అజమాయిషీ చేసింది. కందాచార శాఖాధిపతిని దళవాయి, లేదా సేనాపతన్నారు. విజయనగర పాలకులు పోషించిన సిద్ధ సైన్యాన్ని గురించి తెలియదు. సైనికులకు జీతాలు, ఈనామ్‌ల నిచ్చారు. దసరా ఉత్సవాల్లో ప్రతి మహార్నవమి నాడు, కృష్ణరాయలు సిద్ధ సైన్యాన్ని స్వయంగా సమీక్షించాడు. కందాచార శాఖలో, సైనిక అవసరాలను తీర్చేందుకు అనేక రకాలైన ఉద్యోగులను నియమించాడు. ఈ శాఖలో నల్గురు పారుపత్యంగార్లు, ఆర్గురు కరణాలు, ఆర్గురు ముడుపు గొల్లలతో సహా, కొన్ని వేల మంది వృత్తి పనుల వారు ఏర్పాటుచేయబడ్డారు.

సైనిక విభాగంలో ప్రధానమైనవి కాలిబంట్లు, గుఱ్ఱపు, ఏనుగు విభాగాలు. విల్లంబులు, కత్తి, ఈటె, పీఠి ముఖ్య ఆయుధాలు. కాలిబంట్లు కవచం, శిరస్త్రాణాన్ని వాడారని, ఫెరిష్టా రాశాడు. అయితే, పోర్చుగీస్ యాత్రికులైన పేస్, బార్బోసాలు, చర్మంతో కవచం, శిరస్త్రాణాన్నుపయోగించారని, రాశారు. కాలిబంట్లు సైన్యంలో తుపాకి దళమన్నట్లు చెప్పొచ్చు. ఎందుకనగా, కుమార ధూర్జటి తుపాకి గుండ్లను పేర్కొన్నాడు. కాని, విజయనగర పాలకులు తుపాకి దళంపై శ్రద్ధ చూపించినట్లు కనిపించదు. పోర్చుగీస్‌వారు గోవా ఆక్రమణలో కృష్ణరాయల నౌకా దళ సహాయాన్ని పుచ్చుకొన్నారని, ఫాదర్ హీరాస్ రాశాడు. తిమ్మోజనే హోనావర్ రాష్ట్రాధిపతి నౌకా దళాధిపతిగా కృష్ణరాయల కాలంలో వుండేవాడని తెలుస్తూంది. విజయనగర పాలకులు అన్ని కులాల వారిని, మతాల వారిని, చెంచులను, కోయలను, బోయలను, సైన్యంలో చేర్చుకొన్నారు.

BRAOU

విజయనగర పాలకులు బలమైన, శక్తివంతమైన సైనిక శక్తిని పెంపొందింపచేయటంతోపాటు, రాజ్యమంధలి కీలక స్థానాల్లో దుర్గాలను నిర్మించారు. **రాయవాచకం,** గిరి, స్థల, జల, వన దుర్గాలను పేర్కొంటూంది. కాని, సమకాలీన రచనలు 8 రకాల దుర్గాలను పేర్కొంటున్నాయి. కృష్ణరాయలు తన **ఆముక్తమాల్యద**లో, సరిహద్దు ప్రాంతాల్లో దుర్గాలను ఎక్కువగా నిర్మించాలని రాశాడు. విజయనగర రాజ్య సరిహద్దుల్లో అనేకమైన దుర్గాలున్నాయని, వాటి చుట్టూ అడవులను పెంచేవారనీ, పేస్ రాశాడు. ఈ దుర్గ రక్షణకు పాషాణ యంత్రాలు, దంచోళులుండేవి. దంచోళనగా, రాళ్ళు రువ్వే యంత్రం. దుర్గాధిపతులుగా బ్రాహ్మణులను నియమించాలని, కృష్ణరాయలు సూచించాడు. ఈ కాలంలో ప్రతి బ్రాహ్మణ స్త్రీ తన కుమారుడు దుర్గాధిపతి కావాలని కోరుకొనేదని, నేలటూరు వెంకట రమణయ్య రాశారు. సాంకేతికంగా ఉన్నతమైన రాయ సైన్యం, కీలక స్థానాల్లో నియమించబడిన దుర్గాధిపతులు, విజయనగర సైనిక వ్యవస్థ ముఖ్య భాగాలు.

చక్రవర్తిచే నియమించబడిన పాళెగాండ్రనే చిన్న సైనిక నాయకులు కూడా, విజయనగర సామ్రాజ్యంలో కనిపిస్తారు. కంభంపాటి సత్యనారాయణ కూడా, సేనానివేశం అనే అర్థమున్న తమిళ పదం, పాళయం, లేక పాళెం నుండి 'పాళెగార్' అన్న పదం వచ్చిందన్నారు. ఈ పాళెగాండ్రు చక్రవర్తికి పన్నులను వసూలు చేసిపెట్టటంతోపాటు, సైనిక సేవ కూడా చేస్తూ వచ్చారు. కె. రాజయ్యన్ అభిప్రాయం ప్రకారం, దక్షిణాదిన పాళెగార్ల వ్యవస్థ ఏర్పడేందుకు, ఆనాటి పరిస్థితులు అనుకూలించాయన్నారు. ఈ పాళెగార్లు, తిరుగుబాట్లను అణచివేయుటకు, బందిపోట్లను అంతం చేయుటకు, శాంతిభద్రతలను రక్షించేందుకు ఏర్పాటు చేయబడినట్లు కనిపిస్తూంది. కాని, ఈ పాళెగార్లు అధికారాన్ని దుర్వినియోగపర్చినట్లు శాసనాధారాలున్నాయి.

20.2.7 : న్యాయ వ్యవస్థ

విజయనగర సామ్రాజ్య మందలి న్యాయ వ్యవస్థను తెలుసుకోవడానికి విద్యారణ్యుడు రచించిన **పరాశరమాధవీయ** మందలి వ్యవహార కాండ ఎంతగానో తోడ్పతుందని, నేలటూరు వెంకటరమణయ్య రాశారు. ఈ గ్రంధమందలి విశేషాలకు శాసనాల్లో ఇవ్వబడిన సమాచారం, స్థానిక చరిత్రల్లోని విశేషాలను జతపర్చుకొన్నచో, ఆకాల మందలి న్యాయ వ్యవస్థను అర్థం చేసుకోగలుగుతాం.

చక్రవర్తే ఉన్నత న్యాయాధికారి. రాజ్యమందలి వ్యక్తుల మధ్య వచ్చిన తగాదాలను చక్రవర్తే స్వయంగా విచారించి, తీర్పు నివ్వాలి. కాని, సువిశాల సామ్రాజ్య మందలి వివిధ ప్రాంతాల్లో తలెత్తే తగాదాలను పరిష్కరించటం చక్రవర్తికి స్వయంగా సాధ్యం కాకపోవుటచే, వివిధ ప్రాంతాల్లోని న్యాయస్థానాలను చక్రవర్తి ఏర్పాటు చేశాడు. ఆనాడు న్యాయస్థానాలను 'సభ'ని పిల్చేవారు. ఈ సభలను, 'ముఖ్య','అముఖ్య' అని రెండు తరగతులుగా విభజించారు. వీటిని మరల 'ప్రతిష్ఠిత', 'అప్రతిష్ఠిత' అని రెండుగా విభజించారు. ప్రతిష్ఠితనేది స్థిర న్యాయస్థానం కాగా, అప్రతిష్ఠితనేది న్యాయమూర్తి ఎక్కడుంటే అక్కడ ఏర్పాటు చేయబడింది. వీటిని ఒక రకమైన సంచార న్యాయస్థానాలనొచ్చినేమో. ఈ అప్రతిష్ఠిత, ప్రతిష్ఠిత న్యాయస్థానాలను 'శాస్త్రిత', 'ముద్రిత'ని విభజించారు. చక్రవర్తే న్యాయాధికారైతే, అట్టి న్యాయస్థానాన్ని 'శాస్త్రిత'న్నారు. అలా కాక, చక్రవర్తి నియమించిన న్యాయమూర్తి ఆధ్వర్యంలో నున్న న్యాయస్థానాన్ని 'ముద్రిత'న్నారు.

రాజధానిలో ఒక న్యాయస్థానముంది. ఈ న్యాయస్థానానికి సివిల్, క్రిమినల్ తగాదాలను విచారించే అధికారముంది. ఈ న్యాయస్థానంలో చక్రవర్తితోపాటుగా, సహాయం చేయుటకు ఒక

BRAOU

ప్రాడ్వివాకునితోపాటు, ఇద్దరు, లేక ఇద్దరు కన్నా ఎక్కువ మంది సభ్యులుండేవారు. వీరు కాక, లేఖక అనే ఉద్యోగి ఉండేవాడు. ఇంకా, గణక అనే ఉద్యోగి కూడా ఉండేవాడు. చక్రవర్తి తనకు బదులుగా ఒక ప్రతినిధిని న్యాయమూర్తిగా నియమించొచ్చు. ఆనాడు న్యాయస్థానాన్ని ధర్మాసనమన్నారు. రాయవాచకం, వీరనరసింహుని కాలం లోని ధర్మాసనం ధర్మయ్యను పేర్కొంది. ఈతడు బహుశా రాజధాని లోని ధర్మాసన మందలి ప్రధాన న్యాయమూర్తేమోనని, వెంకటరమణయ్యన్నారు. ఆనాడు నేరాలకు శిక్షలు కఠినంగా ఉండేవి. రాజధానిలో చక్రవర్తి కాని, అతని ప్రతినిధికాని, న్యాయమూర్తిగా ఉన్నట్లే, రాష్ట్రాల్లో రాష్ట్రపాలకులే న్యాయమూర్తులుగా వ్యవహరించారు. దేవాలయ ధర్మకర్తలు కూడా, చిన్న చిన్న తగాదాలను పరిష్కరించారు. అయితే, వెంకటరమణయ్య అభిప్రాయం ప్రకారం, దేవాలయ ఉద్యోగస్తుల నేరాలను, బహుశా అదే దేవాలయ ధర్మకర్తలు పరిష్కరించుండొచ్చు. తగాదా స్వభావాన్ని బట్టి, ధర్మాసనం లోని న్యాయమూర్తుల సంఖ్య మారుతుండేది. కుల తగాదాలను కుల పెద్దలే పరిష్కరించారు. గ్రామాల్లో సరిహద్దు తగాదాలను ఒక న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం పరిష్కరించేది. అగ్రహారాల్లో తగాదాలను మహాజనులే పరిష్కరించినట్లు కనిపిస్తుంది. శ్రేణులు కూడా సభ్యుల మధ్య తలెత్తిన తగాదాలను పరిష్కరించాయి. వాది, ప్రతివాదులు తమ వివాదానికి సంబంధించిన వ్యవహార పత్రాన్ని సమర్పించేవారు. ఆనాడు వాది, ప్రతివాదులు న్యాయస్థానం తీర్పుకు కట్టుబడి వుంటామని ప్రతిజ్ఞా పత్రాన్ని సమర్పించేవారు. అనంతరం విచారణ నారంభించి, సాక్ష్యులను విచారించి, తీర్పు చెప్పేవారు. గ్రామ స్థాయి, రాష్ట్ర స్థాయి తీర్పులపై చక్రవర్తికి స్వయంగా అప్పీలు చేసుకొనొచ్చు. తీర్పు వ్రాసిన పత్రాన్ని జయపత్రమన్నారు. ఈనాటి వలె ఆనాడు అంచెలంచెలుగా న్యాయస్థానాలు లేనప్పటికి, ఆనాడు లిటిగేషన్ తక్కువ కనిపిస్తుంది. ఎందుకనగా, కృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో రాజ శిక్షా భయంతో, భార్య భర్తకు, భృతుడు యజమానికి, దిగువ కులాలు ఉన్నత కులాలవారికీ అణిగిమణిగి వుంటారని వ్రాశాడు. ఆనాడు శిక్షలు ఎంత కఠినంగా ఉండేవో, న్యూనిజ్, అబ్దుల్ రజాక్‌లు పేర్కొన్నారు.

20.3 : సామాజిక వ్యవస్థ

విజయనగర సామ్రాజ్యమందలి సామాజిక వ్యవస్థ గురించి ఆనాటి వాఙ్మయం, విదేశీ యాత్రికులైన పేస్, న్యూనిజ్, బార్బోసాల సమాచారం, ఉపకరిస్తాయి. ఆనాటి జనాభా లెక్కలు లేకపోవడంచేత, జనాభాలో ఎంత శాతం ఎవరున్నారో చెప్పడం కష్టం. అయితే, జనాభాలో అధిక శాతం హిందువులే. కాని, వర్తకవ్యాపార కేంద్రాల్లో మహమ్మదీయులు, క్రైస్తవులు, అధికంగా ఉన్నారు. విజయనగర పాలకులు మత సహన విధానాన్ని అవలంబించడం చేత, అన్ని మతాల వారు స్వేచ్ఛగా జీవించారని భావించొచ్చు. హిందువులు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలుగా విభజింపబడ్డారు. ఆనాడు సంప్రదాయంగా చెప్పుకొనే నాలుగు కులాలే కాక, శూద్ర వర్ణంలో అనేక ఉప కులాలున్నాయి. పంచమ కులం వారు గ్రామాలకు దూరంగా నివసించారు.

విదేశీ యాత్రికులైన బార్బోసా, పేస్, న్యూనిజ్‌లు, ఆరు తరగతులకు చెందిన బ్రాహ్మణులున్నారన్నారు. వారే పురోహితులు, అగ్రహారికులు, మఠాధిపతులు, ప్రభుత్వ ఉద్యోగులు, వర్తకులు, భోక్తలు. ఆనాటి బ్రాహ్మణులు తమ శక్తిసామర్థ్యాలను బట్టి, తమకు నచ్చిన ఉద్యోగాలు, వృత్తులను చేపట్టారు. అయితే, కొందరు బ్రాహ్మణులు మంత్రులుగా, దండనాయకులుగా, దుర్గ దన్నాయకులుగా, రాజకీయంగా పలుకుబడిని సంపాదించారు. అదే విధంగా, ఆనాడు జ్యోతిష్య శాస్త్రవేత్తలు, సాహిత్య వేత్తలు, ధర్మశాస్త్రవేత్తలు, వైద్యులు సమాజంలో ఉన్నత స్థానాన్ని పొందినారన్నది కూడా

BRAOU

నిజమేకాని, పరమ నీచులైన బ్రాహ్మణ ఉద్యోగులను, పురోహితులను ప్రజలు అసహ్యించుకొన్నారు. అలాగే, కృష్ణదేవరాయలు **ఆముక్తమాల్యద**లో బ్రాహ్మణులు డబ్బుకు కక్కుర్తి పడతారని విమర్శించడం చూస్తే, పుట్టుకను బట్టి కాక, గుణాన్ని బట్టి ఆనాడు గౌరవాన్ని చూపించేవారని చెప్పొచ్చు. బ్రాహ్మణ వర్ణం, లేక వర్గం, మొత్తం సమాజంలో ఉన్నత స్థానంలో ఆనాడుందని, ఖచ్చితంగా చెప్పలేం.

మధ్య యుగంలో దక్షిణ భారతదేశంలో క్షత్రియులన్న కులం, సామాజిక చట్రంలో లేదన్న అభిప్రాయం ఒకటుంది. ఆనాడు వ్యక్తి ధైర్యసాహసాలు, వీరత్వాన్ని బట్టి సైనిక ఉద్యోగాలివ్వడం జరిగింది కాని, కులం, పుట్టుక గురించి కాదని మనం గుర్తుంచుకొన్నట్లైతే, అగ్ని కుల క్షత్రియుల గురించి విజయనగర శాసనాల్లో కనిపించకపోవటానికి కారణం అర్థమౌతుంది. వర్తకం కూడా ఒక వర్ణానికి, ఒక వర్గానికి, ఒక కులానికి గుత్తకాదు. కోమట్లతోపాటు, అన్ని కులాల వారు వర్తకవ్యాపారం చేశారు. ఈ విధంగా వర్తకవ్యాపారం చేసి సంపన్నులైనవారు శ్రేణులుగా ఏర్పడి, సమాజం లోను, రాజ్యం లోను, బలమైన శక్తిగా రూపొందారని, వీరికి పన్ను వసూలు అధికారం, న్యాయ విచారణాధికారాలియ్యబడ్డాయి. విజయనగర కాలమందలి శూద్ర కులమంటే, ఇది లేక వీరని చెప్పలేం. అయితే, శూద్రుల ప్రధాన వృత్తి వ్యవసాయం. రెడ్లు, వక్కలుగార్లు, వెళ్ళాలులు ముఖ్యంగా వ్యవసాయదార్లు. రాజ్యంలో ప్రధానమైన ఉత్పత్తిదార్లు వీరే. ఆనాడు రాజ్యానికి వెన్నెముక ఈ రైతాంగ వర్గమే. అయితే, వీరందరూ ఏక ఖండంగా లేరు. మళ్ళీ వీరిలో అనేక శాఖలు, లేక తెగలున్నాయి. ఎవరి కట్టుబాట్లు, నిబంధనలు, ఆచారాలు, సంప్రదాయాలు వారివే. వీరు తమ ఆచారాలను, సంప్రదాయాలను, అతి కఠినంగా అమలుపర్చారు. ఈ వర్గంలో కొందరైన కమ్మ, వెలమ కులాలవారు వ్యవసాయంతోపాటు, సైనిక వృత్తిని చేపట్టారు. వీరిలో ఎక్కువ మంది అమరనాయకులుగా నియమించబడి, క్రమక్రమంగా చిన్న చిన్న ప్రాంతాలకు అధిపతులైనారు. కృష్ణరాయని అనంతరం, కమ్మవారైన రావెళ్ళ, పెమ్మసాని, మొదలైన కుటుంబాల వారు, సేనాపతులుగా, సామంతులుగా తమ ప్రాబల్యాన్ని పెంచుకొన్నారు. శూద్ర కులాల్లో రెడ్డి, కమ్మ, వెలమ ప్రధాన శాఖలు కాగా, సామాజికంగా, ఆర్థికంగా, తక్కువ స్థాయికి చెందిన కురుబులు, గొల్లలు, దొమ్మరులు మొదలైనవారున్నారు. ఈ ప్రతి ఉప కులానికి కుల పెద్దలున్నారు; కుల సభలున్నాయి. నేలటూరు వెంకటరమణయ్య చండాలురన్న బదవ కులముందన్నారు. ఈ చండాలురు మాల, మాదిగలను రెండు తెగలుగా విభజింపబడ్డారు. అయితే, ఈ విభజన ఎప్పుడు ఆరంభమైందో, చెప్పడం కష్టం. మాలలు నేత పని లోను, వ్యవసాయ కూలీలుగా జీవించారని, వెంకటరమణయ్య రాశారు. మాదిగలు చెప్పులు కుట్టి, తాళ్ళు వేసి, మోట గూనలు తయారుచేసి జీవించారు. ఆనాటి సామాజిక చట్రంలో, వీరికి తగిన స్థానం లేదు. ఆనాడు వీరే కాక, విప్రవినోదులు, వీరముష్టులనే వారు కూడా కన్పిస్తారు.

20.3.1 : కుడి, ఎడమ విభాగాలు

దక్షిణ భారతదేశం లోని శూద్ర కులం వారు మధ్య యుగంలో కుడి, ఎడమ హస్త తెగలువారుగా విభజింపబడ్డారు. ఈ విభజన మొదటిసారిగా చోళుల కాలంలో కనిపిస్తుంది. వ్యవసాయం వృత్తిగా కలవారు కుడి తెగవారు గాను, పంచాణంవారు ఎడమ తెగవారుగాను, విభజింపబడ్డారు. ఈ విభజన విజయనగర కాలంలో కూడా కొనసాగింది. తమిళంలో వడంగై, ఇడంగై, కన్నడంలో బలగే, ఇడగేలు, తెలుగులో కుడి, ఎడమ, తెగలను సూచించే పదాలు. ఈ విభజన సమాజంలో వారికున్న హోదా, అంతస్తును తెలుపుతుంది. సంప్రదాయ కర్మకాండల్లో భగవంతునకు, ఋషులకు, బ్రాహ్మణులకు కుడి ప్రక్కన ఉన్నవారికి ఉన్నత స్థానమియ్యబడిందన్న భావన, ఈ విభజనకు మూలమై వుండొచ్చు.

BRAOU

వ్యవసాయ అవకాశాలు కాలక్రమాన పెరగడంతో, వ్యవసాయం పై ఆధాపడిన కులాలు తమ సాంఘిక, ఆర్థిక అంతస్తును పెంచుకొని 'కుడి' హోదాను ప్రకటించుకోగా, పంచాణంవారు ఎడమ తెగగా తమను ప్రకటించుకొని వుండొచ్చును. ఈ రెండు తెగల మధ్య ఘర్షణలు జరిగినట్లు ఆధారాలు ఎక్కువ లేవు. ఈ విభజన విషయంలో బ్రాహ్మణులు తటస్థంగా వుండగా, జైనులు ఎడమ తెగ వారితో సంబంధాలను పెట్టుకొన్నారు. వడంగైతో పోల్చగా, ఇడంగై తెగవారు సాంఘికంగా తక్కువ స్థాయికి చెందినారు. ఈ పైన పేర్కొన్న విషయాలను బట్టి, కుడి, ఎడమ తెగలు శూద్ర కులంలో సాంఘిక అంతస్థును గురించి తలెత్తిన విభేదాలుగా భావించొచ్చు.

20.3.2 : స్త్రీల స్థానం

భారతీయ సామాజిక వ్యవస్థలో స్త్రీల కున్న స్థానం గురించి ఆలోచించినచో, ఒక ప్రక్కన స్త్రీని పవిత్రమూర్తి గాను, తల్లి గాను, మరో ప్రక్క భోగ వస్తువుగా చూచే వైరుధ్యం కనపడుతుంది. ఈ యుగంలో స్త్రీ, పురుషునికి భోగ వస్తువుగా గుర్తింపబడింది. ఎనిమిది భోగాల్లో, స్త్రీకి, ఎనిమిదవ స్థాన మివ్వబడింది. స్త్రీ, పురుషునకు భోగ వస్తువుగానేకాక, పురుషునకు సేవకురాలన్న భావం ప్రచారంలో ఉంది. పతి భక్తే స్త్రీకి పాతివ్రత్యాన్ని కల్గ చేయునని నమ్మబడింది; ప్రచారం చేయబడింది. ఈ భావం ఉన్నత వర్గాల స్త్రీలలో బాగా కనుపిస్తుంది. ఉన్నత వర్ణం, ఉన్నత వర్గం లోని స్త్రీలు, చదవడం, పాడటం, నృత్యం చేయడం నేర్చుకొన్నారు. కృష్ణరాయలు, అచ్యుతరాయలు, రామరాయలు తమ అంతఃపుర స్త్రీలకు సంగీతాన్ని నేర్పేందుకు గొప్ప విద్వాంసులను ఏర్పాటు చేశారు. ఉన్నత కులాలకు చెందిన స్త్రీలు, భర్తతోపాటుగా, సతిసహగమనం చేసినట్లు కనిపిస్తోంది. ఉన్నత కులాల్లో వరకట్న మనే దురాచారం అమల్లోవుంది. బహుభార్యాత్వం సర్వసాధారణం.

ఆనాడు వేశ్యలకు సమాజంలో గౌరవం ఉండేది. వీరిలో సంఘపరమైన వేశ్యలని, దేవాలయ వేశ్యలని, రెండు తరగతులు. అచ్యుతరాయలు తిరుపతి లోని దేవాలయానికి అనేక మంది నృత్యం చేసే సానులను విజయనగరం నుండి పంపినట్లు, శాసనాధారాలున్నాయి. అటువంటి ఆమే ముద్దు కుప్పాయి. కృష్ణదేవరాయలు ముద్దుకుప్పాయి తాత రంగరాజును 'విద్వత్ సభా రంజకం' అనే బిరుదుతో సత్కరించాడని శాసనముంది. శ్రీనాథుని **భీమేశ్వర పురాణం** కూడా, భగవంతుని అంగరంగ భాగాలకు సానులను దానం చేసే సంప్రదాయముందన్నాడు. వేశ్యలకు, లేదా సానులకు, సంఘాలున్నాయి. అలాంటివే సాని మున్నూరుగురు, సాని ఆరునూరుగ అనే సానుల సంఘాలు. వేశ్యలపై పన్నులు విధించబడ్డాయి. కొన్ని సమయాల్లో తాత్కాలికంగా ఈ పన్నులు తీసివేయబడ్డాయి. ఈ కాలపు ప్రభుత్వం వేశ్యా వృత్తిని తొలగించేందుకు ఎట్టి ప్రయత్నం చేయలేదు.

ఈ కాలంలో సామాన్య స్త్రీలు రాజుల, సామంత ప్రభువుల, ధనికుల ఇళ్ళలో దాసీలుగా పనిచే శారని తెలుస్తూంది. కృష్ణదేవరాయల అంతఃపుర స్త్రీల సంఖ్య 1200 కాగా, అచ్యుత దేవరాయల అంతఃపురం లోని దాసీల సంఖ్య 4000. వీరిలో అనేక మంది అనేక వృత్తుల్లో నేర్పరులు.

ఆనాడు కుల స్త్రీలకు, వేశ్యలకు పోలిక లేదు. వేశ్యలు ఆర్థికంగా స్వతంత్రులు మాత్రమే కాక, సమాజంలో గౌరవ స్థానాన్ని కలిగున్నారు. ఈ కాలపు స్త్రీలలో సాహిత్య స్రష్టలున్నారు. క్రీ.శ. 1370 లో గంగాదేవి **'మధురా విజయం'** అనే సంస్కృత గ్రంథాన్ని రచించింది. అచ్యుతరాయల భార్య తిరుమలాంబ **'వరదాంబికా పరిణయం'** అను ప్రబంధాన్ని వ్రాసింది. రామభద్రాంబ **'రఘునాథాభ్యుదయాన్ని'** వ్రాసింది. తాళ్లపాక తిమ్మక్క, **'సుభద్రాకళ్యాణా'**న్ని, మొల్ల **'రామాయణా'**న్ని, మోహనాంగి

BRAOU

'మరిచికా పరిణయాన్ని', తుకాలాదేవి 'తుక్కపంచకాన్ని', కృష్ణాజమ్మ **ఉషాపరిణయాన్ని**', రంగాజమ్మ 'మన్నారుదాస విలాసాన్ని', బాలపాపంబ 'అక్కమహాదేవి' యక్షగానాన్ని రచించారు. ఆనాడు వితంతువుల దుస్థితి దుర్భరంగా ఉండేది. కనుకనే, సతీసహగమనం ఆచారం అమల్లో ఉందేమో.

ఆనాడు విజయనగర సామ్రాజ్యాన్ని దర్శించిన ప్రతి విదేశీయ యాత్రికుడు, విజయనగర సామ్రాజ్య కాలంలో 500 పెద్ద పట్టణాలు, కొన్ని వేల గ్రామాలున్నాయన్నారు. **హంసవింశతి** అనే గ్రంథం, ఆనాటి 175 పట్టణాలను తెలుపుతుంది. విజయనగర పాలకులు అవలంబించిన ఉదార విధానం వల్ల, వర్తకవ్యాపార మధివృద్ధి చెందింది. తత్ఫలితంగా, పట్టణాలు, నగరాలు అభివృద్ధిచెందాయి. దానితోపాటు, సంపద కూడా పెరిగింది. విజయనగర సామ్రాజ్యమందలి జీవనాధారాన్ని పరిశీలిస్తే, సంపన్న వర్గాలు వైభవోపేతమైన, విలాసవంతమైన జీవితాన్ని గడిపారని చెప్పొచ్చు. ఈ కాలం లోనే లాభ దృష్టితో కూడిన హీన వ్యాపార సంస్కృతి పెరిగిందనిపిస్తుంది. కనుకనే, శివాలయ అర్చకులైన తంబళ్ళవారు, విష్ణాలయ పూజారులైన నంబివారు, దైవ ధనాన్ని దొంగిలించేవారని, వ్యాపార వర్గం ధనార్జనే ప్రధానంగా పెట్టుకొన్నారని, పంచాణంవారు దొంగ సొత్తును కొనుక్కునేవారని, అందువలన వారంటే ప్రజలకు గౌరవాభిమానాలు లేవని తెలుస్తుంది. వేశ్యలకు, రాజ వేశ్యలకు, ఆనాడు ప్రత్యేక స్థానమివ్వటం, ఆ విషయాలను విదేశీ యాత్రికులు గుర్తించటం, వేశ్యాలంపటత్వం, జూదం, మధుపానం, మోసం పెరగటం, అనాటి హీన సంస్కృతిని తెలుపుతుంది. ఆనాడు బానిస వ్యవస్థ ఉన్నట్లు, బార్బోసా, న్యూనిజ్ వ్రాసిన వ్రాతలు ఎంతవరకు నిజమో చెప్పలేం; కాని శాసనాలు బానిస వ్యాపారాన్ని గురించి పేర్కొన్నాయి. అప్పు చెల్లించలేకపోయినవాడు బానిసగా మారినట్లు ఆధారాలున్నాయి. ఈ కాలం భోగ ప్రధానమైందని, నేలటూరు వెంకటరమణయ్య, ఖండవల్లి లక్ష్మీరంజనంలు అభిప్రాయపడ్డారు. అయితే, పాలక వర్గ, ధనిక వర్గాలకు తప్ప, సామాన్యులకు భోగ కాలం కాదు. సామాన్యులు పన్నుల భారంతో, పూటైన తిండి, వసతి లేక, దారిద్ర్యాన్ననుభవించారు.

20.4 : ఆర్థిక పరిస్థితులు - వ్యవసాయం, ఉత్పత్తులు, మార్కెట్లు

మొదటి నుండి భారతదేశంలో ముఖ్య వృత్తి వ్యవసాయం. అందువల్ల, ప్రజల్లో అధిక సంఖ్యాకులు వ్యవసాయంపై ఆధారపడేవారు. ప్రభుత్వానికక్కూడా ముఖ్య ఆదాయం, వ్యవసాయంపై వసూలు చేయు బడిన భూమి శిస్తే. మన దేశం లోని వ్యవసాయం వర్షపాతంపై ఆధారపడుటచే, వ్యవసాయాభివృద్ధికి అవసరమైన నీటిపారుదల ఏర్పాట్ల మీద ఎంతో శ్రద్ధను చూపించారు. అంతేకాక, మధ్య యుగం నాటి పౌరాణిక మతం తటాక ప్రతిష్ఠను సప్త సంతానాల్లో చేర్చి, తటాకాలు త్రవ్వినా, బాగుచేసినా, కాలువలు, బావులను త్రవ్వించినా, బాగుచేసినా, పుణ్య కలుగుతుందని ఉత్తేజపరచటంతో, పాలకులు, ప్రభుసర్గంతోపాటు సామాన్య ప్రజానీకం కూడా పోటీలు పడి, నీటిపారుదల సౌకర్యాలను పెంచేందుకు కృషి చేశారు.

విజయనగర పాలకుడైన ఒకటవ బుక్కరాయల పరిపాలనా కాలం లోనే, నీటిపారుదల ఏర్పాట్లకు నాంది పల్కడమైంది. అతని మంత్రి, చిక్కప్ప ఒడియార్ క్రీ.శ. 1365 లో, పాండువాగుకు అడ్డు కట్టుడు కట్టి, బుక్కసాగరం, అనంత సాగరమను రెండు గ్రామాలను నిర్మించాడు. క్రీ.శ. 1369 లో భాస్కరుడను రాజప్రతినిధి పోరుమామిళ్ళ వద్ద అనంతసాగరమనే చెరువును నిర్మించాడు. ముద్ద అనే కృష్ణదేవరాయని దండనాయకుడు 10 చిన్న ఆనకట్టలను కట్టించాడు. ఆకాలం నాటి వారి ఇంజనీరింగ్ నేర్పును హౌండర్సన్ అనే ఆంగ్ల ఇంజనీర్ ఎంతో మెచ్చుకొన్నాడు. ఈ ఆనకట్టల

BRAOU

వల్ల, 20వ శతాబ్ది వరకు నీటిపారుదల జరిగింది. అచ్యుతరాయలు జామోడెల్లా అనబడే పోర్చుగీస్ నిపుణుడి సహాయంతో, దండనాయక చెరువును పటిష్టపర్చాడు. దీని వలన ఆదాయం పెరిగేదని, న్యూనిజ్ వ్రాశాడు. ఈ విధంగా, ఆనాడు పాలక ప్రభువర్గం, సామాన్యులు అందరు ముందుకు వచ్చి, సమిష్టిగా కృషి చేయటం వల్ల, నీటిపారుదల సౌకర్యాలు పెరిగాయి. ఫలితంగా, దేశమంతటా పైరు పంటలు, జొన్న, మామిడి, నిమ్మ, కొబ్బరి, చెరకు తోటలు విస్తారంగా పెరిగి, రైతులు ఎన్నో ప్రయోజనాలు పొందారు. వరి, జొన్న, రాగులు, మినుములు, పెసలు, నువ్వులు, ఆముదాలను ఎంతగానో పండించారు. ఆనాడు పండిన వరి ధాన్యం లోని రకాలు - తీగమల్లెలు, ఖర్జూరాలు, సంపెంగలు, కుసుమలు - మొదలైనవి.

పైన పేర్కొన్న నీటిపారుదల సౌకర్యాలను ప్రభుత్వం స్వయంగా చేపట్టలేదు. వాటి నిర్వహణ బాధ్యతను ఒకరికో, లేదా కొద్ది మందికో గుత్తకిచ్చారు. ఈ విధంగా విధులను నిర్వహించిన వారికి కొంత భూమి ప్రతిఫలంగా ఇవ్వబడింది. ఈ నిర్మాణాల విస్తీర్ణం బట్టి, గుత్తదార్లకు ప్రతిఫలముండేది. వంశపారంపర్యంగా వచ్చే ఈ హక్కును 'దశబంధినాం', లేదా 'కట్టుకొడగ' న్నారు. ఈ దశబంధ ఈనాం పద్ధతి రాయలసీమలో అమల్లో వున్నట్లు చెప్పొచ్చు. అయితే, నెల్లూర్ జిల్లాలో రైతులు తమ ఆదాయంలో కొంత భాగాన్ని నీటి నిర్వహణ చేసేవారికి కేటాయించినట్లు తెలుస్తున్నది. దేవదాన, బ్రహ్మదేయ గ్రామాల వారు తమ నీటి నిర్వహణను, మరమ్మతులను తామే చూచుకొనేవారు. నీటిపారుదల సౌకర్యాన్ని ఎంచటంతోపాటు, కొత్తగా అదనంగా భూమిని సాగులోకి తీసుకొని వచ్చుటకు అన్ని ప్రయత్నాలు చేయబడ్డాయి. హరిహరరాయలు అడవులను నరికి, కొత్తగా భూమిని సాగు చేసినవారికి రాయితీలను కల్పించాడు. శాసనాలు ఇటువంటి నిదర్శనాలను ఎన్నో చూపిస్తాయి. ఫలితంగా, వ్యవసాయం అభివృద్ధి చెంది, దేశం సౌభాగ్యవంతమైంది. రాయల కోశాగారంలో సంపద విశేషంగా పెరిగింది.

20.4.1 : పరిశ్రమలు - దేశీయ, విదేశీయ వ్యాపారం

వ్యవసాయోత్పత్తులు పెరగడం చేత, ఆనాడు వ్యవసాయ సంబంధమైన బెల్లం, నూనె, నేత, అద్దకం పరిశ్రమలు పెరిగాయి. ఆనాడు నేత నేయడం, సాలె, పద్మసాలె, జాంద్ర, కురుబలు కులాలవారి చేతుల్లో వుందని చెప్పొచ్చు. గొల్లలు, కురబలు, కంబళ్ళు నేస్తుండొచ్చు. తాడిపత్రి, ఆదోని, గుత్తి, వినుకొండ, నూలు పరిశ్రమకు ప్రధాన కేంద్రాలు. అద్దకం పరిశ్రమ, వస్త్ర పరిశ్రమతోపాటు అభివృద్ధి చెందింది. ఇంగిలికం, మంజిష్ట, కరక్కాయలతో చేసిన రంగులతో, వస్త్రాలకు రంగులు వేశారు. ఈ విధంగా తయారైన వస్త్రాలను విదేశాలకు ఎగుమతి చేశారు.

వజ్రాలు, బంగారం, ఇనుం బాగా దొరికాయి. పంచాణం వారు తమ తమ వృత్తుల్లో ప్రావీణ్యాన్ని చూపిస్తూ, బంగారు, వెండి నగలను తయారు చేశారు. ఇనుం, రాగి, కంచు లోహాలతో, వ్యవసాయపు పనిముట్లు, ఇంట్లో వాడే వస్తువులను తయారు చేశారు. సైనికులకు అవసరమైన ఆయుధాలు, కవచాలు, శిరస్త్రాణాలు స్థానికంగా తయారుచేయబడ్డాయి.

బార్బోసా వాణిజ్యం బాగా సాగిందని వ్రాశాడు. బార్బోసా రత్నాలు, ముత్యాలు, ఆభరణాలు, గుఱ్ఱాలు, దీనుగులు, పట్టుబట్టలు, నూలు బట్టలు, సుగంధ ద్రవ్యాలు, ఔషధాలు, ఇనుం, వెండిలతో వ్యాపారం జరిగిందన్నాడు. ఆకాలంలో వస్త్రాలు, బియ్యం, ఇనుం, చక్కెర సుంధ ద్రవ్యాలు ఎగుమతయ్యేవి. పులికాట్ దేవు నుండి సులక్కా, సుమిత్రా, పెగూ దేశాలకు రంగు అంచులున్న

BRAOU

వస్త్రాలను ఎగుమతి చేసేవారు. భట్కల్, బొరకూర్, మంగుళూరు నుండి మాల్దీవ్‌లకు, ఏడెన్‌కు ఎగుమతయ్యేవి. గుఱ్ఱాలు, ఏనుగులు, ముత్యాలు, రాగి, ముత్తెపు చిప్పలు, పాదరసం, కుంకుమ, చీనాపట్టు, మఖ్మల్ దిగుమతియ్యేవి. సింహళం నుండి ఏనుగులు, మక్కా నుండి ముఖ్మల్ దిగుమతయ్యేవి.

సీజర్ ఫ్రెడరిక్, బార్బోసా, పేస్ అనే విదేశీ యాత్రికులు, విజయనగర కాలం నాటి విదేశీయ వాణిజ్యం గురించి వ్రాశారు. వెంకటరమణయ్య విజయనగర కాలంలో అంతర్గత, విదేశీయ వ్యాపారం కొనసాగించబడిందన్నారు. అతవణ తంత్రం, ఆముక్తమాల్యదలు ఈ కాలంలో ఏఏ వస్తువులు దిగుమతి చేయబడ్డాయో వివరంగా తెలుపుతాయి.

విజయనగర సామ్రాజ్యంలో అంతర్గత వ్యాపారం బాగా సాగిందని శాసనాధారాలున్నాయి. అయితే, శాసనాలకన్నా అతవణతంత్రం అంతర్గత వ్యాపారం ఏవిధంగా సాగిందో విపులంగా తెలియపర్చింది. వర్తకవాణిజ్యాభివృద్ధికి రహదారుల ప్రాధాన్యతను గుర్తించి, విజయనగర పాలకులు రహదారుల నిర్మాణంలో ఎంతో శ్రద్ధను చూపించారు. ఆనాటి రహదారుల్లో తిరుపతి బాట, కాశీరామేశ్వరం బాట, విజయనగరం నుండి కంచి బాట, అహోబిలం, పోరుమామిళ్ళ, బడేకోట, కంభాల్ని కలిపేబాట; మచిలీపట్నం - కవిలకొండలబాట, కమిలకొండ-కంపిలి బాటలు ప్రధానమైనవి. ఆనాటి ప్రయాణ సాధనాలు కావిళ్ళు, ఎద్దులు, గుఱ్ఱాలు, గాడిదలు, ఎడ్ల బండ్లు, పల్లకీలు. ఆనాడు బహశా వెనుగొండ, ఆదోని, ఉదయగిరి, కొండవీడు, వినుకొండ, పొదిలి, దేవరకొండ, కంభం, మార్కాపురం, పోరు మామిళ్ళ, మాచర్ల, మంగళగిరి, కొండపల్లితోపాటుగా, అనేక వర్తక కేంద్రాలు కనపడుతున్నాయి. విజయనగర చక్రవర్తులతో పాటు, సామంతులు, ప్రభువులు, రాష్ట్ర పాలకులు, వర్తకవాణిజ్యాలను అభివృద్ధిపర్చారు. గ్రామాల్లో వారం వారం సంతలు జరిగాయి. ఈ కాలంలో మధ్య యుగం లోని స్వయంసంపూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ క్షీణించిందని, వస్తూత్పత్తిని ఎక్కువ చేసి మార్కెట్లకు పంపబడుతూ వుండేదని భావించొచ్చు. ఒక విధంగా విజయనగర కాలంలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు నాంది పల్కడమైందని, బర్టన్ స్టీన్ అభిప్రాయం. ఆనాడు వర్తకులు, వృత్తి పనులవారు సంఘటితమై, శ్రేణులుగా రూపొందారు. వర్తక శ్రేణులు ఆనాటి రాజకీయ వ్యవస్థలో కీలక పాత్ర వహించాయి. వర్తక శ్రేణులు వర్తకవ్యాపారాల్లో లాభాలను సంపాదించినప్పటికి, తమ సాంఘిక బాధ్యతను గుర్తించారని, శాసనాల వల్ల తెలుసుకోవచ్చు.

పైన పేర్కొన్న వర్తక వ్యాపారాభివృద్ధి వల్ల, కొత్తగా పట్టణాలు, నగరాలు ఏర్పడ్డాయి. అంకొలా, మిర్జన్, హొనవార్, భట్కల్, బైందూర్, బాదకూర్, బరనూర్, మాంగళూర్, కుంబ్లి, భరంగి, గెరసొప్పలు, పశ్చిమ సముద్ర తీరం లోని ముఖ్య పట్టణాలని, టి.వి. మహలింగం తెలిపారు. ఇంకా, విజయనగర సామ్రాజ్యం లోని మధ్య ప్రాంతపు ముఖ్య పట్టణాలు, శ్రీరంగపట్టణం, ద్వారసముద్రం, ఇక్కేరి, బంకాపుర, రాయచూర్, అదవాని, విజయనగర్, వెనుగొండలు. ఇవికాక, విజయనగర సామ్రాజ్యపు తూర్పు, దక్షిణ భాగాల్లో కొండవీడు, శ్రీశైలం, ఉదయగిరి, కాళహస్తి, తిరుపతి, చంద్రగిరి, పులికాట్, మైలపూర్, కాంచీపురం, తిరువణ్ణామలై, చిదంబరం, రామేశ్వరం, కుంభకోణం, నాగపట్టణం, తంజావూర్, శ్రీరంగం, మదురై, శ్రీవిల్లిపుత్తూర్, అనంతశయనం మొదలగునవి. వీటిలో కొన్ని మతపరమైన యాత్రా స్థలాలు. ఇంతకు పూర్వమే మనం దుర్గాల నిర్మాణం పట్టణాల అభివృద్ధికి సహాయపడిందని చెప్పుకొన్నాం.

BRAOU

20.4.2 : రేవు పట్టణాలు

విజయనగర సామ్రాజ్య కాలంలో విదేశీ వర్తకం, వ్యాపారం బాగా సాగుటచే, రేవు పట్టణాలు ఎక్కువగా ఉండి ఉండాలని భావించొచ్చు. ఆనాడు రెండవ దేవరాయల కాలంలో 300 రేవు పట్టణాలున్నాయన్నారు. ఆనాటి ముఖ్య రేవు పట్టణాలు - హోనావర్, భట్కల్, బకనార్, బ్రక్కర్, మంగుళూర్, కంబలా, క్విలన్, కాయల్, నాగపట్టణం, మైలాపూర్, పులికాట్‌లు. ఆనాటి నౌకా వర్తకవ్యాపారం పోర్చుగీస్, అరబ్, భారతీయుల చేతిలో వుండేది. అరబ్బులు, పోర్చుగీస్‌వారు పశ్చిమ దేశాలతో వర్తకం చేయగా, భారతీయులు చైనా, ఇగూ దేశాలతో వర్తకం చేశారు.

20.4.3 : విజయనగర రాజ్య ఆదాయం : పన్నులు

విజయనగర పాలకులు తమ ఆదాయాన్ని భూమి శిస్తు ద్వారాను, శుల్క ఆదాయం ద్వారాను సంపాదించారు. భూమి శిస్తును ధన, ధాన్య రూపంలో రైతులు చెల్లించారు. కనుక, ఈ ఆదాయాన్ని ధాన్యాదాయం, బంగారు ఆదాయమని విభజించొచ్చు. భూమిని విజయనగర కాలంలో వ్యవసాయానికి అనువైనదని, కాదని రెండు విభాగాలుగా విభజించారు. ఈ యుగానికి సంబంధించిన తమిళ దేశ శాసనాల్లో, ధాన్య ఆదాయాన్ని నేల్‌ముబల్ అని, సువర్ణ ఆదాయాన్ని పాణిముదల్ అని తెలిపినాయి. రెండో దేవరాయలు శ్రీరంగం తామ్ర శాసనాల ద్వారా రాజ్యాదాయాన్ని ధన, ధాన్య రూపంలో వసూలు చేశారని, తెలుస్తూంది.

ప్రభుత్వాదాయానికి సంబంధించిన పన్నులను 10 రకాలుగా విభజించొచ్చు. అవి: (1) వ్యవసాయపు; (2) పచ్చిక భూములు; అడవులు; (3) పరిశ్రమలు; (4) వర్తకం; (5) దండు, రక్షణ; (6) వృత్తి; (7) సాంఘిక; (8) ఆస్తి; (9) మహారాజ ప్రయోజనాలు; (10) మాన్య గ్రామాల మీద పన్నులు. ప్రభుత్వానికి వ్యవసాయ ఆదాయమే ఎక్కువ. ఆనాడు పంట భూములను నీలారంబ, కాడారంబని రెండు రకాలుగా విభజించారు. నీలారంబ భూములపై పన్నులు ఎక్కువ కాగా, కాడారంబ భూములపై పన్ను తక్కువగా ఉండేది. పచ్చిక బయళ్ళపై వేసిన పన్నును పుల్లరన్నారు.ఈ పన్నును పశువులున్నవారు మాత్రమే చెల్లించేవారు. కాపులు కొట్టుకుని అమ్మేవారు కూడ 'కొండగుత్త'న్న పన్నును చెల్లించారు. మగ్గ స్థావరాలు, గానుగ సిద్ధాయం, చక్రగానికే మొదలైన పదాల వల్ల, చేతి వృత్తుల మీద పన్నులున్నట్లు తెలుస్తూంది. కృష్ణదేవరాయ కాలంలో నేత నేయువారు ప్రతి మగ్గానికి 3 పణాల పన్నును చెల్లించారు. 'కుంచారతెరెగె' అనే పన్నును కుమ్మరులు, 'గానురిగె' అనే పన్నును 'గానుగ సిద్ధాయ' మన్నారు. వర్తకుల వద్ద నుండి 'మూలవీన' మనే పన్నును వసూలు చేశారు. ఇతర ప్రాంతాల నుండి దిగుమతయ్యే వస్తువులపై స్థల దాయం, లేక స్థల సుంకాన్ని వసూలు చేశారు. పేట సుంకమునేది పేట లోని అంగళ్ళ వద్ద నుండి వసూలు చేశారు. దుర్గ వివర్తన, దుర్గదణ్ణాయ వివర్తననేవి, దుర్గ రక్షణకు, గ్రామస్థుల వద్ద నుండి వసూలు చేసిన పన్నులు. వివిధ వృత్తుల వారి పైన పన్నులను విధించారు. మంగలి, చాకలి, కుమ్మరి, సాలె, బెస్త, ఉప్పర, పంచాణం మొదలైన వారందరూ పన్నులను చెల్లించేవారు. జాతి సిద్ధాయం ఈ కోవకు చెందినదే. అయితే, ఈ పన్ను ఎంతో, ఎంత చెల్లించేవారో తెలియదు. సాంఘిక సంబంధమైన పన్నుల్లో పేర్కొన దగింది, పెండ్లి సుంక మొకటి. ఆస్తి మీద, ఇంటి మీద పన్నులను వసూలు చేశారు. ఈ విధంగా అన్ని వర్గాల వారి నుండి, పన్నులు, సుంకాలను విజయనగర పాలకులు వసూలు చేశారు. విజయనగర పాలకుల కాలంలో పన్నుల భారం ప్రజలపై ఎక్కువగా ఉండేదని, ఒప్పుకోక తప్పదు. విజయనగర రాజ్యాదాయం ఎంతో ఖచ్చితంగా చెప్పలేం. కాని, ఆదాయంలో సగ భాగాన్ని సైనిక వ్యవస్థపై

BRAOU

ఖర్చు పెట్టేవారని చెప్పొచ్చు. న్యూనిజ్ వ్రాతల వల్ల కృష్ణదేవరాయలు తన ఆదాయంలో సగ భాగానికి పైగా, ఏనుగులు, గుఱ్ఱాలను కొనేందుకు ఖర్చు పెట్టాడు. సైనిక ఖర్చులతోపాటుగా, తన ఆదాయాన్ని అంతఃపురంపై, దేవాలయ నిర్మాణానికి, కళాసాహిత్య పోషణకు, తటాకాదులకు ఖర్చు పెట్టాడు. బంగారు, వెండి, రాగి నాణేలు విజయనగర కాలంలో ప్రచారంలో వున్నాయి. ఆనాటి బంగారు నాణేన్ని 'కరాహ', 'దొడ్డ వరాహ', 'ఘట్టి' అనే ప్రత్యేక గద్యాణాలు; 'పణం', 'చిన్న' అనే చిన్న బంగారు నాణేలుండెడివి. బహుళ ప్రచారంలో ఉన్న నాణెం 'పణం'. దీనిలో $\frac{1}{8}$ వంతైన 'తార' అనే వెండి నాణెం వాడుకలో వుంది. జితలు, కాసులనే విలువ తెలియని రాగి నాణేలు ప్రచారంలో వున్నాయి. నాణేల ముద్రణాధికారం కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ, నగరాధిపతుల చేతిలో వుంది.

20.5 : ఐరోపీయులతో సంబంధ బాంధవ్యాలు

అనాదిగా భారతీయులకు, పాశ్చాత్యులకు మధ్య సంబంధబాంధవ్యాలున్నాయి. భారతీయ సంస్కృతిపై పాశ్చాత్య ప్రభావం, పాశ్చాత్య సంస్కృతిపై భారతీయ ప్రభావముంది. వర్తకవాణిజ్య సంబంధాలున్నాయి. ప్రాచీన, మధ్య యుగాల్లో మన దేశానికి వచ్చిన విదేశీయులు రాజ్యాధికారాన్ని సంపాదించుటకు దండెత్తిరాగా, 15వ శతాబ్దిలో సముద్ర మార్గాన మన దేశానికి ఐరోపీయులు వర్తక వ్యాపార నిమిత్తం వచ్చారు. అట్టి వారిలో మొదటి వారు పోర్చుగీస్‌వారు- తర్వాత వరునగా డచ్, బ్రిటీష్, ఫ్రెంచి వారు మన దేశంలో అడుగుపెట్టారు.

విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన తుళువ వంశస్థుడైన నరసనాయకుడు, సాళువ నరసింహుని అనంతరం అతని కుమారుడు ఇమ్మడి నరసింహునికి రక్షక కర్తగా వ్యవహరిస్తున్న కాలంలో, పోర్చుగీస్ నావికుడు వాస్కోడిగామా 1498లో కాలికట్ చేరుకున్నాడు. సంపన్న దేశమైన భారతదేశంలో మధ్య వర్తులు లేకుండా, స్వతంత్రంగా వర్తకం చేయాలన్న లక్ష్యంతో వచ్చిన ఐరోపీయుల్లో మొదటివారు పోర్చుగీస్ వారు. పోర్చుగీస్ వారి వర్తకవ్యాపార కాంక్ష, ఆనాటి రాజకీయ పరిస్థితులు, విజయనగర, పోర్చుగీస్ వారి మధ్య సంబంధబాంధవ్యాలకు దారితీశాయి.

కృష్ణదేవరాయలు రాజ్యాధికారాన్ని చేపట్టే నాటికి, విజయనగర రాజకీయ ప్రాబల్యం అతి హీన స్థితిలో ఉంది. కృష్ణదేవరాయలు అంతర్గతంగాను, బాహ్యాంతరంగాను, శత్రువుల దాడిని ఎదుర్కొనాల్సొచ్చింది. బహమని సుల్తాన్ మహమ్మద్‌షా విజయనగర పాలకులపై జిహాద్‌ను ప్రకటించాడు. ఇటువంటి పరిస్థితుల్లో పోర్చుగీస్ వారు తమకు ప్రభువులైన భట్కల్, హోనావర్ ప్రభువుల అధికారాన్ని ధిక్కరించి, కొచ్చిన్, కన్ననూర్‌లలో కోటలను కట్టుకొని, కళ్ళికోట జామోరిన్ అధికారాన్ని లెక్కచేయుటకు నిరాకరించారు. అప్పటికే వర్తక, వాణిజ్య గుత్తాధిపత్యాన్ని సంపాదించిన పోర్చుగీస్‌వారు గోవాను ఆక్రమించి తమ ముఖ్య కేంద్రంగా చేసుకొనుటకు, తమ శత్రువులను ఓడించుటకు పూనుకొని, సహాయం చేయమని అర్థిస్తూ, ఫాదర్ లూయి ఫ్రయర్‌ను రాయల ఆస్థానానికి రాయబారిగా పంపారు. లూయి ఫ్రయర్ రాయబార పర్వం క్రీ.శ. 1510 తర్వాత కృష్ణదేవరాయలను కలుసుకొన్నది. ఇతడు భట్కల్, మంగుళూర్‌ల మధ్య, వర్తక స్థావరాన్ని నిర్మించుకొనుటకు అనుమతి కావాలని, జామోరిన్‌కు వ్యతిరేకంగా సహాయం చేయమని, అందుకు ప్రతిఫలంగా తాము దిగుమతి చేసుకొనే ఉత్తమాశ్వాలను విజయనగర పాలకులకే అమ్ముతామని, ఇంకెవరికి అమ్మమని, హామీనిచ్చాడు. అయితే, కృష్ణరాయలు తన రాజకీయ అవసరం దృష్ట్యా, తన శత్రువుకు, శత్రువులైన పోర్చుగీస్‌ల స్నేహాన్ని వాంఛించాడు. అయినప్పటికి, లూయి ఫ్రయర్ రాయబారానికి వెంటనే అనుకూలమైన సమాధానం

BRAOU

చెప్పక, కాల వ్యవధిని, తీసుకున్నాడు. తన పరిస్థితిని నుస్థిరం చేసుకున్న తర్వాత, పోర్చుగీస్ వారితో ఒప్పందాన్ని కుదుర్చుకొన్నాడు. పోర్చుగీస్‌వారు గోవా మీద దాడిచేసి, ఆక్రమించుకొన్నారు. పోర్చుగీస్‌వారు గోవాలో అడుగుపెట్టిన తర్వాత, కృష్ణదేవరాయలు వారిని అభినందిస్తూ, ఉత్తరం పంపాడు. అంతేకాక, బిజాపూర్ సుల్తాన్ తోడి యుద్ధంలో తన సాయముంటుదన్నాడు. కాని, నిజంగా సాయం చేయలేదు. పోర్చుగీస్‌వారు గోవాను పోగొట్టుకొని, మరల సంపాదించారు. అప్పుడు కృష్ణదేవరాయలు గోవాకు తన రాయబారిని పంపటమేకాక, భట్కల్ అనే చోట కోటను నిర్మించేందుకు అనుమతినిచ్చాడు. ఈ విధంగా, ఆనాటి విజయనగర, బిజాపూర్ శత్రుత్వం పరోక్షంగా పోర్చుగీస్‌లకు లాభాన్ని కల్గించింది. గోవా విదేశీయుల చేతిలోకి వెళ్ళటమే కాక, పోర్చుగీస్ వారు బలమైన శక్తిగా రూపొందుటకు సహాయపడింది. అప్పటి నుండి పోర్చుగీస్‌వారు, విజయనగర, బహమనీ పాలకుల సంఘర్షణల్లో తమకు లాభసాటిగా వుండే విధంగా పాల్గొన్నారు. న్యూనిజ్ వ్రాత ప్రకారం, పోర్చుగీస్ యుద్ధ నిపుణులు ఇరు పక్షాలకు సహాయపడ్డారు, రాయచూర్ యుద్ధంలో. అంతటితో ఆగక, క్రిస్తానోఫిగరిడో నాయకత్వంలో పోర్చుగీస్ వారు చేసిన సాయం వల్లనే, రాయచూర్ యుద్ధంలో కృష్ణదేవరాయలు విజయాన్ని పొందాడన్నాడు. అప్పటి నుండి బహుశా, విజయనగర - పోర్చుగీస్ సంబంధాలు మరింత బలపడినట్లు కనిపిస్తుంది. పోర్చుగీస్‌ల ప్రాబల్యం కృష్ణదేవరాయలపై ఎక్కువగా నుండి, తిమ్మరుసును బందీగా చేయుటకు, కళ్ళు పీకించేందుకు వారి సలహాయే కారణమన్న సంప్రదాయం కలదు. సదాశివరాయల కాలం వచ్చేసరికి, క్రీ.శ. 1547 లో పోర్చుగీస్ పాలకునకు, అతనికి మధ్య, ఒక ఒడంబడిక జరిగింది. ఈ ఒడంబడిక ప్రకారం, పోర్చుగీస్ వారు విజయనగర పాలకులకే గుఱ్ఱాలను అమ్ముతారు. అందుకు ప్రతిఫలంగా, విజయనగర రాజ్యపు ఎగుమతి, దిగుమతులపై పోర్చుగీస్ వారికి అజమాయిషీ ఇవ్వబడింది. విజయనగరం రేవుల లోనికి ఇతర విదేశీయుల ఓడలకు ప్రవేశం నిషేధించబడింది. అంతేకాక, విజయనగర-బిజాపూర్ యుద్ధాల్లో పొందే భూములిన్ పంచుకోవడానిక్కూడా అంగీకారానికొచ్చారు. ఈ అంగీకారం ప్రకారం, పడమటి కనుమలకు ఆవలగానున్న సముద్ర తీర ప్రాంతాలపై, పోర్చుగీస్ వారికి ఆధిపత్యమియ్యబడింది. ఈయన పరిపాలనా కాలం లోనే పోర్చుగీస్‌లు, శీరంగం, కంచి దేవాలయాలను కొల్లగొట్టేందుకు ప్రయత్నం చేయగా, రామరాయలు వాటిని భగ్నం చేశాడు. విజయనగర పాలకులు, అహ్మద్‌నగర్, బిజాపూర్ పాలకుల యుద్ధాల్లో మునిగి తేలుతున్నప్పుడు, పోర్చుగీస్‌వారు ఎన్నో దుష్ట చర్యలకు పూనుకొన్నారు. అటువంటి వానిలో మచ్చుకు కొన్ని: క్రీ.శ. 1559 లో పోర్చుగీస్ గవర్నర్ మలబార్ కోస్తా తీరంలో మారణ హోమాన్ని సాగించాడు; మంగుళూర్‌పై దాడి చేసి, అతి కిరాతకంగా మారణహోమాన్ని జరిపాడు; క్రీ.శ. 1560 లో మన దేశంలో స్పానిష్ ఇంక్విజిషన్‌ను ప్రవేశపెట్టాడు; క్రీ.శ. 1565లో పోర్చుగీస్ గవర్నర్ స్వదేశీయ ఓడలను ముంచివేశాడు. ఈ దుష్కృత్యాలు జరుగుతున్నప్పుడు, స్వదేశీయ పాలకులైన విజయనగర, బిజాపూర్ పాలకులు ఉపేక్షించారు.

క్రీ.శ. 1586 -1614 మధ్య కాలంలో పాలించిన వెంకటపతిరాయలు, పోర్చుగీస్ వారితో స్నేహ పునరుద్ధరణకు ప్రయత్నం చేశాడు. ఆ ప్రయత్న ఫలితంగా, నామమాత్రపు అద్దెచ్చి, మద్రాస్ లోని శాంథోమ్ ప్రాంతాన్ని తమ ముఖ్యమైన రేవుగా చేసుకొన్నారు. అక్కడున్న జెసూట్ ఫాదర్లకు వారి ఖర్చుల నిమిత్తం, చర్చిని నిర్మించుకొనేందుకు, రెండు గ్రామాలను దానం చేశాడు. అంతటితో వారు తృప్తి పడలేరేమోనని, వారికి రాజ లాంఛనాలను బహుమతిగా ఇచ్చాడు.

క్రీ.శ. 1600 అనంతరం, పోర్చుగీస్ వారు ఇతర ఐరోపీయ వర్తకుల పోటీని ఎదుర్కోవాల్సొచ్చింది. వెంకటపతి రాయల అనుమతితో, పులికాట్ వద్ద డచ్‌వారు వాణిజ్య కేంద్రాన్నేర్పర్చుకొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం, డచ్‌వారు ఎగుమతులపై 2% పన్ను చెల్లించేందుకు ఒప్పుకొన్నారు. పులికాట్

BRAOU

లోనికి పోర్చుగీస్ వారిని రానివ్వకూడదని కూడా, ఒప్పందం చేసుకున్నారు. క్రీ.శ. 1611 నాటికి, వెంకటపతిరాయలే మచిలీపట్నంలో ఆంగ్లేయులకు వర్తకం చేసుకొనేందుకు అనుమతి నిచ్చాడు. పైన పేర్కొన్న విధంగా, వెంకటపతి రాయలు చనిపోయే నాటికి, తూర్పు కోస్తా ప్రాంతంలో పోర్చుగీస్, డచ్, ఆంగ్లేయ వర్తక సంఘాలు స్థావరాల నేర్పర్చుకొన్నాయి. శ్రీకాళహస్తికి చెందిన వెలుగోటి వంశస్థుడైన దామెర్ల వెంకటాద్రి, చంద్రగిరి రాజ్య గవర్నర్. ఈతడు బ్రిటీష్ తూర్పు ఇండియా కంపెనీకి చెందిన ఫ్రాన్సిస్‌డేతో సంబంధబాంధవ్యాలను పెట్టుకొని, చెన్నపట్నంలో స్థావరాన్నేర్పర్చుకొనుటకు 1638 లో అనుమతినిచ్చాడు. చెన్నపట్టణం, లేక మద్రాస్‌లో కోటను కట్టుకొనుటకు, నాణేలను ముద్రించుటకు, రేవు పట్టణ ఆదాయంలో సగాన్ని తీసుకొనుటకు, అనుమతివ్వబడింది. 1640లో సెయింట్ జార్జ్ కోట నిర్మాణాన్నారంభించి, ఆ ప్రాంతానికి దామెర్ల వెంకటాద్రి తండ్రి పేరున, చెన్నపట్టణమని పేరిడినాఢు. ఆనాటి నుండి చెన్నపట్టణం తూర్పు తీరం లోని ఆంగ్ల స్థావరాలకు కేంద్రమైంది.

విజయనగర పాలకులు బలమైన నౌకా దళ శక్తిని పెంపొందించుకొని, విదేశీయుల నిజమైన అంతర్యాన్ని అర్థం చేసుకోక పోవటం, వారి లోపంగా భావించొచ్చు. విజయనగర పాలకులు తాత్కాలిక లాభాలను దృష్టిలో నుంచుకొని, ఐరోపీయులతో వ్యవహరించారు కాని, రాజనీతిజ్ఞులనలె, దూరదృష్టితో నిర్ణయాలను తీసుకొనలేదేమోనని, అనంతర పరిణామాలను విశ్లేషిస్తే అనిపిస్తుంది.

20.6 : సంగ్రహంగా

విజయనగర ప్రభువులు సంప్రదాయక రాచరికాన్నే పాటిస్తూ, ఆనాటి రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా, నాయంకర వ్యవస్థతో కూడిన సైనిక సమ్మేళనా రాజ్యాన్ని రూపొందించారు. విజయనగరాన్ని సైనిక తత్వంతో కూడిన సైనిక రాజ్యంగా చేసి, ఆదాయంలో అధిక భాగాన్ని సైనిక పోషణకు ఖర్చు చేశారు. సైనిక వ్యవస్థను సమర్థవంతంగా నడిపేందుకు, ప్రజలపై అనేక పన్నులను విధించారు. విజయనగర కాలంలో ప్రజలపై పన్నుల భారం అధికంగా వుండేదని అంగీకరించక తప్పదు. అయితే, అంతర్గత శాంతిభద్రతలను కాపాడటం లోను, ప్రజలకు కావలసిన రక్షణను కల్పించటం లోనూ, క్రమబద్ధమైన న్యాయస్థానాలను రూపొందించడం లోనూ, ఎక్కువ శ్రద్ధ చూపించలేదు. విజయనగర పాలకులు మహమ్మదీయ రాజకీయ ప్రాబల్యాన్ని తగ్గించే లక్ష్యంతో, పోర్చుగీస్ వారితో స్నేహసంబంధాలను కలిగుండటం వల్లను, పోర్చుగీస్‌వారిని ఎదిరించేందుకు అవసరమైన నౌకా దళాన్ని రూపొందించటంలో ఆసక్తిని కనపర్చక పోవటం చేతను, భారతదేశంలో ఐరోపీయ జాతివారైన పోర్చుగీస్‌వారు బలమైన శక్తిగా ఎదుగుటకు, పరోక్షంగా సహాయపడ్డారు. విజయనగర పరిపాలనా వ్యవస్థ లక్ష్యమైన మహమ్మదీయ రాజ్య వ్యాప్తిని ఆపటంలో, కొంత వరకు విజయాన్ని సాధించారు. మొత్తం మీద, విజయనగర పాలనా వ్యవస్థ, సామాజిక, ఆర్థిక వ్యవస్థలు, ప్రభువుల స్వప్రయోజనాలను కాపాడే లక్ష్యంతో రూపొందించబడ్డా, సామాన్య ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించలేదని చెప్పొచ్చు.

20.7 : పరీక్షా నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. విజయనగర పాలనా వ్యవస్థ స్వరూప, స్వభావాలను విశ్లేషించండి.

BRAOU

2. "విజయనగర రాజ్యం అనేక సైనిక నాయకులతో కూడిన సమ్మేళన రాజ్యం" (కె.ఎ. నీలకంఠ శాస్త్రి) చర్చించండి.

3. విజయనగర పాలకుల కాలం నాటి సామాజిక వ్యవస్థ ప్రధాన లక్షణాలను పరిశీలించండి.

4. విజయనగర సామ్రాజ్యంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితులను సమీక్షించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. విజయనగర ప్రభుత్వ వ్యవస్థలో మంత్రి మండలి పాత్ర, స్థానం గురించి వివరించండి.

2. విజయనగర రాజ్య పాలనలో రాష్ట్ర పాలకుల అధికారాలు, విధులను తెల్పండి.

3. విజయనగర రాజ్యంలో గ్రామ పాలన ఎలా నిర్వహించబడేది?

4. నాయంకర విధానం, దాని గుణదోషాలను వివరించండి.

5. విజయనగర సామ్రాజ్య న్యాయ వ్యవస్థ ఎలాగుండేది?

6. విజయనగర సమాజంలో స్త్రీల స్థానాన్ని పరిగణించండి

7. నీటిపారుదల సౌకర్యాలభివృద్ధికై విజయనగర చక్రవర్తులెలా కృషి చేశారు?

8. విజయనగర సామ్రాజ్యంలో సంభవించిన వాణిజ్య ప్రగతిని సమీక్షించండి.

9. విజయనగర చక్రవర్తులు ఐరోపీయులతో నెరపిన సంబంధబాంధవ్యాలను విమర్శనాత్మకంగా విశ్లేషించండి.

BRAOU

20.8 : ఉపయుక్త గ్రంథాలు

Appadorai, A. : **Ecnomic conditions in Southern India (1000 A.D. to 1500 A.D.)**, 2 Vols, Madras.

Champaka Lakshmi, R. : 'Peasant, State & Society' - Review article **IESHR Vol. 18, Nos. 304, 1981**

Do : Review on Noburu Karashima's 'South Indian History & Society' in **Studies In History, New Series, Vol. II, No. 2 July Dec, 1986**

Do : "Urbanisation in South India-the role of ideology& polity" **Presidential address, Ancient India Section, IHC, Srinagar 1986**

Filliozat Vasundhara (E) : **VIjayanagara Empire.**

Irfan, Habib & Tapan Roy Choudari (Eds) : **The Cambridge Economic History of India, Vol. I. C 1200-1750**, Delhi, 1984

Karashima, Noburu : **South Indian History & Society,** Delhi, 1984.

Keshava Naik, H.P. : "Some aspects of Feudalised segments in the Vijayanagar Polity" **PIHC, 1982**

Krishna Swamy, A. : **The Tamil country under Vijayanagar,** Annamalainagar, 1964.

Mahalingam, T.V. : **South Indian Polity,** Madras, 1955

Do : **Administration & Social life under Vijayanagar, 2 Parts,** Madras, 1969& 1975

Mathew, K.S. : "Portuguese trade with India & the theory of Royal Monopoly in the 16th century" **PIHC, 1979,** pp. 389.

Neelakanta Sastri, K.A. : **A History of South India,** O.U.P

Ramachandraiyya, O. : **Studies on Krishna Devaraya,** Waltair, 1953

Salatore, B.A. : **Social & Political Life in the Vijayanagar Empire, Vol. I.,** Madras, 1934

Satyanarayana, K. : **A Study of the History & Culture of the Andhras, 2 Vols,** New Delhi, 1975.

Do : 'Land as Private Property during Vijayanagar times', **PADHC I,** pp. 27-33

Do : "Taxation under the Rayas of Vijayanagara" **PIHC, 1980,** p. 265

Sastri B.S. : "Some Aspects of the First conquest of Goa by the Portuguese", **PIHC, 1978,** pp. 388

Stein Burton : **Peasant State and Society in Medieval South India,** Delhi, 1980

Do : Vijayanagara- Cambridge History of India Series

Venkata Ramanayya, N. : **Studies in the Third dynasty of Vijayanagara,** Madras, 1935

Venkataratnam, A.V. : **Local Govt in Vijayanagara Empire,** Mysore, 1975

బి.యస్.ఎల్. హనుమంతరావ్ : ఆంధ్రుల చరిత్ర

నారాయణాచార్యులు, పుట్టపర్తి : విజయనగర సామాజిక చరిత్ర

ప్రతాపరెడ్డి, సురవరం : ఆంధ్రుల సాంఘిక చరిత్ర

BRAOU

లక్ష్మీరంజనం, ఖండవల్లి & బాలేందుశేఖరం, ఖండవల్లి : ఆంధ్రుల చరిత్ర, 1, 2 సంపుటాలు

వెంకటరమణయ్య, నేలటూరి : విజయనగర చరిత్ర, 2 సంపుటాలు

కామేశ్వరరావ్, కె. యస్. : విజయనగర సామ్రాజ్యం, తెలుగు అకాడమి, హైదరాబాద్, 1975

కె. చెంగల్‌రాయ చెట్టి : ఆంధ్రప్రదేశ్ సాంఘిక, ఆర్థిక చరిత్ర (1300-1600), తిరుపతి, 1991.

రచయిత : డా. కె. యస్. కామేశ్వరరావ్

BRAOU

భాగం-21 : విజయనగర యుగం: మతం, సాహిత్యం, కళలు

విషయక్రమం

21.0 : లక్ష్యాలు

21.1 : పరిచయం

21.2 : మతాభివృద్ధి

21.2.1 : శైవ మతం

21.2.2 : వైష్ణవ మతం

21.2.3 : ఇతర మతాలు

21.2.4 : ఉత్సవాలు : దసరా ఉత్సవం

21.3 : సాహిత్యాభివృద్ధి

21.3.1 : సంస్కృత, దేశ భాషలు

21.3.2 : అష్ట దిగ్గజాలు

21.4 : కళాభివృద్ధి

21.4.1 : విజయనగర నాస్తు నిర్మాణాలు : దేవాలయాలు

21.4.2 : లౌకిక నిర్మాణాలు

21.4.3 : శిల్పం, ప్రతిమలు

21.4.4 : చిత్రలేఖనం

21.4.5 : సంగీత, నృత్య కళలు

21.5 : సంగ్రహంగా

21.6 : పరీక్ష నమూనా ప్రశ్నలు

21.7 : ఉపయుక్త గ్రంథాలు

BRAOU

21.0 : లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడం ద్వారా విజయనగర సామ్రాజ్య కాల మందలి మత విధానం, శైవ, వైష్ణవ మతాలు, ఇతర మతాల పాత్ర, ఉత్సవాలు, పండుగలు, ప్రధానంగా దసరా ఉత్సవం గురించి తెలుసుకోగల్గాలి. ఇంకా, విజయనగర కాలంలో సృష్టించబడ్డ సంస్కృత, దేశ భాషలందలి వివిధ సాహిత్య ప్రక్రియల గురించి, అష్ట దిగ్గజాల గురించి అవగాహనను పొందగల్గాలి. వీటితోపాటు,

విజయనగర వాస్తు నిర్మాణ శైలి, దేవాలయాలు, లౌకిక నిర్మాణాలు, శిల్పం, ప్రతిమలు, చిత్రలేఖనం, సంగీత, నృత్య కళల అభివృద్ధి గురించి కూడా, తెలుసుకోగల్గాలి.

21.1 : పరిచయం

మధ్య యుగంలో హైందవ సంస్కృతిని, ధర్మాన్ని సంరక్షించేందుకు, సమకాలీన మహమ్మదీయ దాడుల నుండి కాపాడుటకు, విద్యారణ్యుని ఆశీర్వచనంతో, విరూపాక్షుని కార్యకర్తలుగా విజయనగర పాలకులు వ్యవహరించారని నమ్మకంగా చెప్పబడింది. అట్టి విజయనగర పాలకులు ఛాందస, సనాతన దృక్పథంతో హైందవ మతానికి ప్రాధాన్యమిస్తూ పరిపాలించారా, లేక మతాన్ని రాజకీయాల నుండి దూరంగా వుంచి, మత సామరస్యం, మత సమన్వయం కొరకు కృషి చేశారా, అన్న ప్రశ్నలకు సమాధానాలను చెప్పకోబోతున్నాం. అంతేకాక, ఆనాటి శైవ, వైష్ణవాల, ఇతర మతాల గురించి, ఉత్సవాల్లో ప్రధానంగా దసరా ఉత్సవం గురించి, సాహిత్యాభివృద్ధి, ప్రధానంగా సంస్కృత, దేశ భాషల్లో సృష్టించబడిన సాహిత్యం గురించి, విజయనగర కాలమందలి, ప్రధానంగా కృష్ణదేవరాయల భువన విజయంలో తమ కవితా కౌశల్యంతో లబ్ధప్రతిష్ఠులైన అష్ట దిగ్గజాల గురించి తెలుసుకుంటాం. విజయనగర వాస్తు నిర్మాణ శైలి, శిల్పం, ప్రతిమలు, చిత్రలేఖనం, సంగీతం, నృత్య కళాభివృద్ధి గురించి కూడా అధ్యయనం చేయడమౌతుంది.

21.2 : మతాభివృద్ధి

విజయనగర సామ్రాజ్య పాలకులు తాత్కాలిక స్వప్రయోజనాలను కాపాడుకునేందుకు, మతతత్వ దృక్పథాన్ని ప్రదర్శించలేదు. అంతేకాక, ఆనాటి విజయనగర సమాజం మతతత్వంచే కలుషితమై, అనుక్షణం అనుమానంతో ఒకరినొకరు హింసించుకొనేదిగా కనుపించదు. విజయనగర పాలకులు హిందువులైనా, వైయక్తికంగా వైష్ణవ మతాభిమానులైనా, తమ మతాభిమానాన్ని మత తత్వంగా మార్చక, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో నుంచుకొని, మత సామరస్యంతో, మత విశ్వాసాలను పరిపాలనతో జోడించక పాలించారు.

నేలటూరి వెంకటరమణయ్య, 16వ శతాబ్దం నాటి విజయనగర పాలకుల మతం వైష్ణవమైన ప్పటికి, దానిని రాజ్య మతంగా ప్రకటించక, మత విషయాల్లో తాటస్థ్యం వహింపక, అన్ని మతాల, శాఖల వారికి ఒకే రకమైన ఆదరణను చూపించారన్నారు.

విజయనగర పాలకుల మత విధానానికి మొదటి బుక్కరాయలు నాంది పల్కాడు. విజయనగర రాజ్యస్థాపకులైన హరిహర, బుక్కరాయలు అద్వైత వేదాంతైన విద్యారణ్య మాధవాచార్యుని ప్రభావానికి లోనైనారు. విద్యారణ్యుని అద్వైతం, బ్రహ్మను, లేదా, భగవంతుని చేరుటకు, అన్ని మతాలు అనేక త్రోవలనేది విజయనగర పాలకుల మనస్సుల్లో గాఢమైన ముద్రవేయుటం వలన, వారు శైవ, వైష్ణవ మతాలను ప్రోత్సహించి, దేవాలయాలను నిర్మించి, ఆదరణను చూపించుటయేకాక, జైనులను కూడా అభిమానించారు. మతపరమైన చిలికలు, సంఘర్షణలు జరుగకుండా, స్థిరమైన కఠిన నిర్ణయాలను తీసుకొని, సమాజంలో మతపరమైన శాంతిని నెలకొల్పారు. మొదటి బుక్కరాయల కాలంలో వైష్ణవ, జైనుల మధ్య, ఆనెగొంది, హోసపట్టణ, పెనుగొండ నాడులలో సంఘర్షణలు తలెత్తగా, జైనులు మొదట బుక్కరాయలకు విన్నవించుకోగా, ఇరుపక్షాల ప్రతినిధులను రప్పించి, వైష్ణవ, జైనులకు తమ ప్రభుత్వ విధానాన్ని శాసన రూపంలో ప్రకటించి, అతి ముఖ్యమైన చోట్ల ఆశాసన ప్రతిని

BRAOU

ప్రతిష్ఠించాడు. ఆ శాసన ప్రతిలో జైన ధర్మం, వైష్ణవ ధర్మం రెండూ వేరువేరుకావని స్పష్టం చేశాడు. ఈ దృక్పథమే విజయనగర పాలకులను ప్రభావితం చేసింది. నేలటూరి వెంకటరమణయ్య మాటల్లో, సమకాలీన మహమ్మదీయ పాలకులు హిందువులను అవమానపర్చినా, విజయనగర పాలకులు మహమ్మదీయులను తక్కువగా చూచి, అవమానించలేదు. అంతేకాక, మహమ్మదీయ మత సంస్థలను కూడా ఆదరించారు. ఈ దృక్పథం రెండో దేవరాయుల కాలం నుండి కనుపిస్తూంది. రెండవ దేవరాయలు తన సైనిక వ్యవస్థలో మహమ్మదీయులను చేర్చుకొని, జాగీరులిచ్చి, వారి ప్రార్థన కొరకై మసీదును నిర్మించి, తన సింహాసనం ప్రక్కనే మరొక ఉన్నతాసనాన్ని ఏర్పాటుచేసి, మహమ్మదీయుల పవిత్ర గ్రంథమైన 'కొరాన్' న్నుంచి గౌరవించటం, విజయనగర సామ్రాజ్య కాలం లోని సర్వమత సమానత్వానికి చక్కని నిదర్శనం. రెండవ దేవరాయలు మహమ్మదీయులు విలు విద్యలో నేర్పరులు కాబట్టి, వారి అవసరం విజయనగర సైన్యానికి ఎంతో వుంది కాబట్టి, రాజకీయ దూరదృష్టితో మహమ్మదీయులను గౌరవంగా చూచాడని, ఒక వాదముంది. అయితే, ఈ విధమైన మత సామరస్యం సైనిక ప్రయోజనాలకు మాత్రమే పరిమితం కాకుండా, విజయనగర ప్రభువుల్లో మత ద్వేషం లేదనటానికి శాసనాలు, విదేశీయ రచనలే ప్రధాన సాక్ష్యం. కృష్ణదేవరాయల రాయచూర్ ముట్టడిలో, కృష్ణదేవరాయలు బహమని పాలకుల్ని పునఃప్రతిష్ఠించి, 'యవన రాజ్య స్థాపనాచార్య' అన్న కీర్తిని పొందటంలో, అళియ రామరాయలు రాక్షసి తంగడి యుద్ధంలో కాని, మతం ప్రధాన పాత్ర నిర్వహించలేదని నిస్సందేహంగా చెప్పొచ్చు.

విజయనగర సామ్రాజ్యంలో శైవ, వైష్ణవ, జైన, వీరశైవ, మతాలతోపాటు, జైన, మహమ్మదీయ మతాలు కూడా ప్రచారంలో వున్నాయి. బౌద్ధ మతం ఆనాడు ప్రచారంలో లేదు. శైవ, వైష్ణవ, జైనాలు మాత్రమే, ఈ కాలాన చెప్పుకోదగిన ప్రధాన మతాలు.

21.2.1 : శైవ మతం

ఆనాడు శైవ మతం, స్మార్త శైవ మతం, వీర శైవమని రెండు ప్రధాన శాఖలుగా విభజింపబడింది. ఆనాడు జనాభాలో అధిక సంఖ్యాకులు స్మార్త శైవులు. విజయనగర యుగాన శైవ మతం లోని వివిధ శాఖలు ప్రచారంలో వున్నాయి. విజయనగర సామ్రాజ్యం విరూపాక్షునిదే నన్న భావం, బలంగా నాటుకుపోయి, హరిహర రాయలు విరూపాక్షుని ప్రతినిధి మాత్రమేనన్న భావన, బలంగా ఉండేదని చెప్పొచ్చు. విజయనగర రాజ్య మొదటి వంశస్థులైన సంగమ పాలకులకు, శృంగేరి పీఠానికి మధ్యనున్న సంబంధం వల్ల, సంగమ పాలకులందరూ శైవ మతస్థులే. శైవ మతం లోని పాశుపత, కాలాముఖ, వీరశైవ, శాక్తేయ, ఆరాధ్య శాఖలు బహుశా ఈ కాలంలో బహుళ ప్రచారంలో నుండి వుండొచ్చు. శృంగేరి, విరూపాక్షం, పుష్పగిరి మఠాలు, అద్వైత సిద్ధాంతానికి కేంద్రాలు కాగా, శ్రీశైల భిక్షావృత్తి మఠం మొదట్లో పాశుపతాన్ని అవలంబించి, తర్వాత లింగాయత శైవ కేంద్రమైంది. శ్రీకాళహస్తి, త్రిపురాంతకాలు పాశుపత సంప్రదాయాన్ని ప్రచారం చేశాయి. టి.వి. మహాలింగం, హరిహర, బుక్కరాయలు శైవ మతం లోని పాశుపత శాఖకు చెందిన వారని చెప్పారు. విజయనగర సామ్రాజ్య మొదటి పాలకులు నరసింహస్వామిని ప్రధాన దైవంగా చేసుకున్నారని చెప్పొచ్చు. ఇందుకు ఆధారంగా హంపి, అహోబిలం, కదిరి లోని నరసింహస్వామి ఆలయాలు, ఆనాటి విజయనగర శాసనాలను పేర్కొనొచ్చు.

21.2.2 : వైష్ణవ మతం

విజయనగర సామ్రాజ్యంలో రామానుజ సంప్రదాయానికి చెందిన శ్రీవైష్ణవం బహుళ ప్రచారంలో నుండేది. కనుకనే, బహుశా సాళువ, తుళువ వంశాల వారు వైష్ణవ మతాన్ని ఆదరించుండొచ్చు.

BRAOU

సాళువ నరసింహారాయలు గొప్ప వైష్ణవ భక్తుడు. హంపి లోని కృష్ణస్వామి, విఠలస్వామి, చక్రతీర్థ, కోదండ రామస్వామి దేవాలయాలు వైష్ణవ సంప్రదాయానికి ప్రతీకలని చెప్పొచ్చు. సాళువ నరసింహ రాయలు తిరుపతి లోని శ్రీవెంకటేశ్వర స్వామి భక్తుడు. కనుకనే, 15,16 వ శతాబ్దాల నాటి వైష్ణవానికి, తిరుపతి ప్రధాన కేంద్రమైంది. ఈనాడు తిరుపతిలో వెంకటేశ్వర స్వామికి జరుగుతున్న ఉత్సవాలకు నియమనిబంధనాలు ఆనాడు ఏర్పర్చినవే. అలాగే, వైష్ణవ దేవాలయాల్లో జరుగు పూజా సంప్రదాయాలు, వైష్ణవ ఆచార్యుల ఆజ్ఞల ప్రకారంగా జరుగుటకు చర్యలు తీసుకోబడ్డవి. నేలటూరి వెంకటరమణయ్య అభిప్రాయం ప్రకారం, అనాటి వైష్ణవులు, రామానుజుని శిష్యులైన శ్రీవైష్ణవులుగాను, మధ్వాచార్యుని అనుయాయులు మధ్వులుగాను, చీలిపోయారు. రామానుజుని శిష్యులు ఇంతకు ముందే చెప్పుకొన్న 'వడగలై', 'తెంగలై'శాఖలుగా చీలిపోయారు. వరదాచార్య వడగలై శాఖకు నాయకత్వం వహించగా, మళయాళ మహాముని తెంగలై శాఖకు నాయకత్వం వహించాడు. ద్వైత మత సిద్ధాంత ప్రవక్త మధ్వాచార్యుని శిష్యులైన అక్షోభ తీర్థులు, శ్రీపాద రాయలు, వ్యాసరాయలు, వరుసగా విద్యారణ్య, సాళువ నరసింహ, కృష్ణదేవరాయల సమకాలీనులై, ద్వైత సిద్ధాంత వ్యాప్తికి తోడ్పడ్డారు. వ్యాస రాయలు కన్నడ భాషలో రచించిన **కీర్తనల** ద్వారా విష్ణు భక్తిని ప్రచారం చేశాడు. దాస కూటమిని ఏర్పాటుచేసి, భక్తుల సంఖ్యను పెంచారు. ప్రముఖ వాగ్గేయకారులైన పురందరదాసు, కనకదాసులు, వ్యాసరాయల శిష్యుల్లో ప్రముఖులు. ఈయన హంపిలో యంత్రోద్ధవ హనుమంతుని ప్రతిష్ఠించాడు. అంతేగాక, అనేక ప్రాంతాల్లో ఏడు వందల ముప్పై రెండు హనుమంతుని ప్రతిష్ఠలు చేశారు. చెప్పుకోదగ్గ మరొక మధ్వ గురువు విజేయేంద్ర తీర్థ. ఈ పైన పేర్కొన్న శ్రీవైష్ణవ, మధ్వ తెగల్లో, శ్రీవైష్ణవ శాఖ ఉదారమైందిగా చెప్పొచ్చు.

తెలుగు వాఙ్మయ సంప్రదాయం ప్రకారం, శ్రీకృష్ణదేవరాయల గురువు శ్రీవైష్ణవుడైన తాతాచార్యులవారు. అయితే, ఈతాతాచార్యుల వారు ఎవరో చెప్పడం కష్టం. అహోబిలం మఠానికి చెందిన 'జియ్యర్లు' అను స్వాములు శ్రీవైష్ణవ మత ప్రచారంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. అహో బిలం మఠ స్థాపకుడైన వానశైలోపజియ్యర్, కృష్ణదేవరాయల ఆస్థాన కవైన అల్లసాని పెద్దన గురువు. 'ఆముక్తమాల్యద' ప్రకారం, ఈయన ఆంధ్ర దేశంలో శ్రీవైష్ణవాన్ని సుస్థిరంగా నెలకొల్పుటకు ఎంతగానో కృషి చేశాడు. ఆనాడు అనేక శ్రీవైష్ణవ కుటుంబాలు, ముఖ్యంగా కందాళై, పరవస్తు, తిరుమల, నల్లాన్ చక్రవర్తులవారు, ఆంధ్ర దేశంలో నలు మూలలా శ్రీవైష్ణవ వ్యాప్తికి పూనుకొన్నారు.

కృష్ణదేవరాయల కాలం నాటి ఒక విశేషాన్ని, నేలటూరి వెంకటరమణయ్య పేర్కొన్నారు. అదేమంటే, ఒకానొక రోజున నక్షత్ర కూటమి వల్ల, కృష్ణదేవరాయల ప్రాణానికి హాని కలిగే పరిస్థితి ఏర్పడగా, ఆ రోజున వ్యాసతీర్థుల వారు సింహాసనం మీద కూర్చొని పరిపాలించి, 'రాయ' బిరుదం పొందారని, కృష్ణదేవరాయలు వైష్ణవ భక్తులు కనుకనే, కృష్ణ విగ్రహాన్ని తెచ్చి, హంపీలో గొప్ప దేవాలయాన్ని నిర్మించాడు. శ్రీవెంకటేశ్వర స్వామికి భక్తుడైనప్పటికి, కృష్ణదేవరాయలు దండయాత్రలు చేసిన ప్రాంతాల్లోని ప్రముఖ దేవతలకు మొక్కుబడి చెల్లించాడు. ఎటువంటి తేడా చూపించక, ప్రతి దేవాలయానికి విరాళ మిచ్చారు. దేవాలయ, తటాక నిర్మాణాలకు ఉదారంగా ధనమిచ్చారు. వైష్ణవ సంప్రదాయమే విఠల స్వామి ఆరాధనకు దారితీసుండొచ్చునని, టి.వి. మహాలింగం అభిప్రాయం. ఈ విఠోబా భక్తి మహారాష్ట్రలో మొదలైంది. విఠోబాను తొలిసారిగా 13వ శతాబ్దం నాటి 'నామదేవ గాథ'లో పేర్కొనడమైంది. విజయనగర కాలానికి చెందిన **'పాండురంగమహాత్మ్యం'** అన్న కావ్యం పాండురంగ విఠలుని ఘనతను ప్రస్తుతించింది. ఆనాడు 'పండరీ పురం' ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.

BRAOU

పండరీ పురానికి తీర్థయాత్రలు చేయువారిని 'వరకారీ' అన్నారు. వరకారి భక్తులు విఠోబాను, శివ, పాండురంగ, హరిహరని కూడా పిల్చుకున్నారు. ఆనాడు బహుళ ప్రచారంలో నున్న భక్తి ఉద్యమ ఫలితంగా, మహారాష్ట్ర లోని విఠోబా భక్తి విజయనగర రాజ్యానికి వ్యాప్తి చెందింది. ఆనాడు విఠలుణ్ణి విత్తేయనాయక, విత్తయక్కన్, వీతన్, విఠలదేవ, విఠల, విఠలేశ్వర, విఠలరాజని పిలిచారని, శాసనాలు తెలుపుతున్నాయి. ఈ కాలంలో ఇది ఒక ప్రదేశం పేరుగా, ఒక వ్యక్తి పేరుగా ప్రచారం లోకి వచ్చింది. అనేక శాసనాలు, విఠలుని రాతి విగ్రహాలు, విఠోబా భక్తి ఆనాడు బహుళ ప్రచారంలో ఉన్నాయని, డా. కె. సరోజినిదేవి అభిప్రాయపడ్డారు. ఈ కాలం నాటి ప్రముఖ వాగ్గేయకారులు పురందర దాసు, విఠోబా భక్తుడు. తాళ్ళపాక వంశానికి చెందిన వాగ్గేయకారులు కూడా విఠల భక్తులు. అన్నమాచార్యుడు విఠలుణ్ణి, లేదా విఠోబాను ఎన్నో సంకీర్తనల్లో పొగిడాడు. అచ్యుత, సదాశివరాయల పరిపాలనా కాలం కూడా, శ్రీవైష్ణవ మతానికి ప్రోత్సాహమిచ్చిన కాలం. ప్రభువులతో పాటు, మంత్రులు, సామంతులు కూడా, శ్రీవైష్ణవ మతానికి ఒకరితో నొకరు పోటీ పడి, ప్రోత్సహించారని, నేలటూరు వెంకటరమణయ్య రాశారు. ఫలితంగా, శ్రీవైష్ణవ మతం విజయనగర సామ్రాజ్య కాలం లోని సాళువ, తుళువ, ఆరవీటి వంశాల కాలంలో, ఒక బలమైన శక్తిగా రూపొందింది. అయితే, విజయనగర సామ్రాజ్య కాలమందలి ప్రత్యేకత, లేక విశిష్టత ఏమనగా, శ్రీ వైష్ణవంతోపాటు, శైవం కూడా ప్రజాదరణ, పాలకుల ప్రోత్సాహానికి లోనైంది. ఇందుక్కారణం. ఇంతకు పూర్వం చెప్పకొన్న విధంగా, ఆనాడు పాలకులు సంకుచిత మనస్తత్వంతో, హ్రస్వ దృష్టితో వ్యవహరించకపోవటం, దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా సర్వమత సమానత్వాన్ని చూపించటం, ఆకాలంలో భారతదేశ మంతటా ప్రచారంలో నున్న భక్తి భావోద్యమ ప్రభావం కూడాని, గమనించాలి.

ఆనాడు శ్రీవైష్ణవ, శైవ మతాలకు చెందిన మఠాలు, దేవాలయాలు కూడా, మానవ-జీవితాన్ని ప్రభావితం చేయటంలో ఎంతో ప్రముఖ పాత్రను నిర్వహించాయి. ఆనాటి మఠాలను స్థూలంగా శైవ, వైష్ణవ, జైన, అన్న మూడు వర్గాలుగా విభజించొచ్చు.

శైవ మఠాలు రెండు రకాలు బ్రాహ్మణ, బ్రాహ్మణేతర. బ్రాహ్మణ తెగకు చెందిన మఠాల్లో ప్రధానంగా పేర్కొనదగింది, శృంగేరి మఠం. శృంగేరి మఠానికి, విజయనగర రాజ్యానికి, మొదట్లో అతి సన్నిహిత సంబంధం కనిపిస్తుంది. ఈ మఠం శాఖలు పుష్పగిరి, విరూపాక్షం, కుంభకోణాల్లో ఉన్నాయి. ఈ మఠాలకు చెందినవారు వైదిక పద్ధతులను, వాజ్మయాన్ననుసరించారు. వీరు అద్వైతులు. అయితే, తమిళనాడు లోని శైవ మఠాలకు చెందినవారు, పాశుపత శైవ శాఖను అనలంబించారు. ఈ శాఖకు చెందిన ప్రముఖ కేంద్రం, దేవికాపురం. ఇక్కడ 16వ శతాబ్దంలో భిక్షక వృత్తి మఠం, మల్లికార్జునీయన మఠం, గోళకీయ మఠాలు, బాగా అభివృద్ధిచెందినాయి. రామనాథ్ జిల్లాలో సిరాన్‌మలై అను చోట, కల్లార్ మండపమను భిక్షక వృత్తి మఠముంది.

బ్రాహ్మణేతర శైవ మఠాలు లింగాయత, లింగాయతేతర మఠాలుగా విభజింపబడ్డాయి. లింగాయతులకు చెందిన శైవ మఠాల్లో ప్రధానమైనవి, శ్రీశైలం, సంగమేశ్వరం, ఉమ్మత్తూరు లోనివి. ఈ మఠాలు బసవేశ్వరుని బోధనలను దేశ భాషల్లో ప్రచారం చేశాయి. లింగాయతేతర మఠాలు తమిళనాడులో ఎంతో ప్రభావాన్ని చూపించాయి. కాని, వాటిని గురించిన విశేషాలు శాసనాల ద్వారా ఎక్కువగా తెలియటం లేదు. అతి ప్రాచీన శైవ మఠ కేంద్రాలైన తిరువాదుతురై, ధర్మపురం, తిరుప్పానందల్‌లు, బహుశా ఈ కాలంలో కూడా ప్రముఖ పాత్రను నిర్వహించుండొచ్చు. బహుశా, వీరు శైవ ఆగమాలను, శైవ పురాణాలను, నాయనార్ల బోధనలను ప్రచారం చేసుండొచ్చు. వీరి బోధనలు పాశుపత సిద్ధాంతానికి దగ్గర్లో వుండొచ్చునని, నేలటూరి వెంకటరమణయ్య అభిప్రాయం.

BRAOU

వైష్ణవ మతానికి చెందిన మఠాలు, శ్రీవెష్ణవ, మధ్వ శాఖలుగా చీలిపోయినాయి. ఇంతకు ముందే చెప్పుకొన్నట్లుగా, శ్రీవైష్ణవ మఠాలు వడగలై, తెంగలై శాఖలుగా చీలిపోయాయి. అహోబిలం, తిరుపతి, శ్రీరంగం, వడగలై శాఖకు చెందిన ప్రముఖ మఠాలు కాగా, మేల్‌కోటై, వనమలైలు, తెంగలైకు చెందిన మఠాలుగా ప్రసిద్ధికెక్కాయి. మధ్వులకు చెందిన ప్రముఖ మఠాలు, ఉడిపి, ముల్బాగల్, విజయనగరంలో ఉన్నాయి.

జైనులకు చెందిన మఠాలు, శ్రావణ బెల్గొలా, కంజీవరంలో, కనిపిస్తాయి. అయితే, కంజీవరం లోని జైన మతం క్షీణ దశలో ఉంది.

శైవ, వైష్ణవ, జైన, మఠాల్లో, మఠాధిపతి సర్వాధికారి. అన్ని మఠాలు విద్యా కేంద్రాలుగా వ్యవహరించాయి. మఠాల్లో మతపరమైన, లౌకిక విద్యా బోధన చేయబడింది. ఆనాడు ఈ మఠాలు, ఈనాటి విద్యాలయాల వలె పనిచేసేవి. విజయనగర పాలకులు అన్ని మఠాల వారికి ఆదరణ చూపించారు.

21.2.3 : ఇతర మతాలు

ఆనాడు జైన మతానికూడా తగినంత ఆదరణ చూపించబడింది. విజయనగర సామ్రాజ్య ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో, జైన మత ప్రాబల్యమున్నట్లు తెలుస్తోంది. రెండవ దేవరాయల మంత్రైన ఇరుగప్ప దండనాయకుడు, జైనుడు. రెండవ దేవరాయలు పార్శ్వనాధునకు హంపి లోని ప్లాన్‌ను పారి బజార్లో, దేవాలయాన్ని నిర్మించాడు. సాళువ నరసింహరాయలు దెబ్బతిన్న జైన దేవాలయాలను బాగుపర్చాడని తెలుస్తోంది. కృష్ణదేవరాయలు పడమీడు, చంద్రగిరి రాజ్యాల్లో, జైన దేవాలయాలకు శిస్తు రాయితీ నివ్వడమేకాక, జినకంచి లోని త్రైలోక్యనాధ దేవాలయానికి భూదానం చేశాడు. విజయనగర పాలకుల కాలంలో బౌద్ధ మతం ప్రచారంలో నున్నట్లు ప్రత్యక్ష సాక్ష్యం లేదు. కాని, కాంచీపురం, నాగపట్టణాల్లో బౌద్ధ మతం ప్రచారంలో వుందని, టి.వి. మహాలింగమన్నారు. అదే విధంగా, కాంచీపురం లోని ఏకామ్రనాధ దేవాలయం లోని బౌద్ధ శిల్పాలు విజయనగర కాలానికి చెందినవేనని, టి.వి. మహాలింగమభిప్రాయం. క్రీ.శ. 1356 కు చెందిన, జపనీయ గ్రంధం **'నాగకృతాగమ'** కంచిని బౌద్ధ కేంద్రంగా గుర్తించింది.

ఆనాడు క్రైస్తవ మతస్తులున్నారు. ఫాదర్ హీరాస్ రచన ద్వారా, క్రీ.శ. 1533 ప్రాంతంలో కొందరు పల్లెవారు క్రైస్తవ మతం లోకి మారినట్లు తెలుస్తోంది. జెసూట్లు మదురైను కేంద్రంగా చేసుకొని, మత మార్పిడిని కొనసాగించారు. రాబర్ట్ డి. నొబిలి అను క్రైస్తవ మత ప్రచారకుడు, క్రీ.శ. 1605లో దేశ భాషలను నేర్చుకొని, బ్రాహ్మణ సన్యాసి వలె జీవితం గడిపి, క్రైస్తవ మత ప్రచారం చేశాడు. కాని, ఈతని కృషి వలన మత మార్పిడి ఎక్కువగా జరిగినట్లు కనిపించదు. రెండవ వెంకటపతిరాయలు జెసూట్లను ఆదరించి, నెల్లూరు, చంద్రగిరిలో చర్చీల నిర్మాణానికి అనుమతి నిచ్చాడు. క్రీ.శ. 1607 నాటికి, పోర్చుగల్ పాలకుడైన మూడవ ఫిలిప్, రెండవ వెంకటపతి రాయలను క్రైస్తవ మత ఆదరణకుగాను ప్రస్తుతిస్తూ, ఉత్తరం రాశాడు.

విజయనగర సామ్రాజ్య కాలంలో ఇస్లాం మతస్తులు కూడా ఉన్నారు. అయితే, వీరు అధిక సంఖ్యలో వుండ లేదు. రెండవ దేవరాయలు మహమ్మదీయులను తన సైన్యం లోకి తీసుకొని, జాగీర్లనిచ్చి, ప్రార్థనా సౌకర్యాలను కలుగజేసి, రాజ్యాధికారులుగా కూడా నియమించాడు. ఈతడు సాదత్‌ముల్క్, అనే ముస్లిం సర్దార్‌నకు పాణ్యంను జాగీర్‌గా ఇవ్వగా, ఆకుటుంబ మాజాగీర్‌ను వంద

BRAOU

స్థాలకు పైగా అనుభవించింది. ఈ చర్య వలన హిందూ, మహమ్మదీయుల మధ్య, పరిచయా ర్పడి, కాలక్రమేణా బలపడ్డాయని చెప్పొచ్చు. సమకాలీనులైన విజయనగర- బహమనీ రాజ్యాధినేతలు రాజ్యాధికారం కొరకు యుద్ధాలు చేసినా, మతపరమైన ఘర్షణలు సామాన్య ప్రజానీకంలో కనుపించవు. ఆనాడు హిందూ, మహమ్మదీయ మతాలు ఒక దానిపై మరొకటి ప్రభావాన్ని చూపించుకొన్నాయి. భక్తి ఉద్యమం లోను, సూఫి తత్వం లోను, ప్రభావం కనపడుతుంది. పెనుగొండ నుండి లభించిన ఒక శాసనం ద్వారా రెండవ వెంకటపతిరాయలు బాబాసాహెబుడనే మహమ్మదీయ యోగి దర్గాకు, కొన్ని గ్రామాలను దానమిచ్చినట్లు తెలుస్తూంది. ఇక్కడ మనం గుర్తించుకోవలసిన విషయమేమిటంటే, ఈ దర్గా ఒక హిందూ దేవాలయంలో ఉండటం. ఈ నాటికి ప్రచారంలో ఉన్న బాబయ్య చెరువు, ఈ బాబానాధుని పేరు వలన వచ్చిందే. మరొక విశేషమేమిటంటే, సిద్ధవటం సీమ ప్రజలు పీర్‌జాదా సాహెబ్ అనే మహమ్మదీయ యోగి పేరు మీద నూరు బీమూల భూమిని దానం చేయటం.

ఆనాడు విజయనగర పాలకులు సర్వమత సహనాన్ని ప్రదర్శించినప్పటికి, శైవ, వైష్ణవ, జైన మతాచార్యులు తగాదాలకు దిగినట్లు, ఆధారాలున్నాయి. శ్రీకృష్ణదేవరాయలే తన **ఆముక్తమాల్యద**లో ఏవిధంగా శైవులు ఇతరులకు అపకారం చేసింది, ఇతర దేవాలయాలను పడగొట్టి, శైవ మఠాలను నిర్మించారో, తెలియజేశాడు. **కాళహస్తీశ్వర శతకం** నిండా, విష్ణు దూషణ ఎక్కువగా ఉంది. తాళ్ళపాక తిరువెంగళనాధుడు పరమ యోగి; విలాసంలో శివ దూషణ చేశాడు. జైనాలయాలను శివాలయాలుగా మార్చి వేశారు. శైవ, వైష్ణవులు పరస్పరం ఛండాలురని, పాషాండులని విమర్శించుకొన్నారు. ఒకరి నొకరు హింసించుకొనుటకు ఏమాత్రం జంక లేదు.

విజయనగర యుగంలో చక్రవర్తి మొదలు కొని, సామాన్యుని వరకు పోటీపడి, తమ శక్తిని బట్టి, దేవాలయ నిర్మాణానికి, పోషణకు, నిత్య నైవేద్య ధూప దీపాలకు, నిత్య భోగాలకు, కళ్యాణాలకు, భూరి దానాలిచ్చారు. దేవాలయ నిర్మాణం ఎక్కువగా సాగింది. పాత దేవాలయాలపై కొత్త గోపురాలను నిర్మించారు. తిరుపతి, కాళహస్తి, అహోబిలం, శ్రీశైలం ఆనాటి ప్రముఖ దేవాలయాలు. దేవాలయ నిర్వహణకు, రక్షణకు ఉద్యోగులున్నారు. ప్రతి దేవాలయానికొక కోశాగారముండేది. దానిని 'శ్రీభండార' మన్నారు. ఆనాడు తీర్థయాత్రలు చేయుట, బహు దేవతల నారాధించుట, ఎక్కువగా దర్శనమిస్తాయి. ఆనాడు దేవాలయాలు పూజా కేంద్రాలేకాక, అనేక మందికి వృత్తి, భోజన సదుపాయాలను కలుగజేశాయి. చిదంబరం, విరూపాక్షం, కాళహస్తి, తిరుపతి, కంచి, శ్రీశైలం, శ్రీరంగం, అహోబిలం, సంగమేశ్వరం ఇత్యాదివి ముఖ్య తీర్థయాత్రా స్థలాలు. ఈ కాలంలో గ్రామ దేవతారాధనుంది. ఆనాటి గ్రామ దేవతలు పుట్టలమ్మ, ఎక్కలమ్మ, పోతురాజు, ధర్మరాజు, కంచెమయ్య మొదలగువారు.

21.2.4 : ఉత్సవాలు : దసరా ఉత్సవం

విజయనగర యుగంలో ప్రభువులు, ప్రజలు, అందరూ ఆనందంగా, సంతోషంతో జరుపుకొన్న ఉత్సవాల గురించి, విదేశీ యాత్రికులు, బాహ్యయం ఎంతో వివులంగా వేర్కొన్నాయి.

విజయనగర యుగంలో హోలి పండుగను వసంతోత్సవమన్నారు. నికోలో కాంటి అను యాత్రికుడు, వసంతోత్సవాన్ని వివరించాడు. ఆ వసంతోత్సవ సమయంలో, వీధుల్లో ఎరుపు రంగు నీరుంచేవారు. ఆ రోజుల్లో వసంతోత్సవ కాలమందు వీధుల్లో వెళ్ళే వారి పైన వసంతం చల్లేవారు. చక్రవర్తైనా, లేదా రాజైనా కూడా, తప్పక ఆ ఉత్సవాల్లో పెడుతూంటే, వసంతం చల్లేవారు. నంది తిమ్మన

BRAOU

పారిజాతాపహరణ మందు, కృష్ణదేవరాయలు ప్రతి సంవత్సరం వసంతోత్సవం జరిపేవాడని పొగిడాడు. ఆనాడు వారు జరుపుకొన్న మరో పండుగ, దీపావళి. ఆకాలానికి చెందిన **'ఆకాశభైరవ కల్పం'** అనే సంస్కృత గ్రంథంలో, దీపావళి వర్ణన ఎక్కువగా ఉందని, పి.కె. గోడే వ్రాశారు. ఆనాడు వారు జరుపుకొన్న ఉత్సవం లాంటి పండుగ 'ఏరువాక పున్నమి' యని, సురవరం ప్రతాపరెడ్డి అన్నారు. మంచన రచించిన **'కేయూర బాహు చరిత్ర'**లో రథోత్సవం గురించి, జాతర గురించి, వర్ణించాడు. 14వ శతాబ్దం వాడైన మహాకదిరిపతి, రథోత్సవ కాలంలో పల్లె జనుల ఉత్సాహాన్ని వర్ణించాడు. **శుకసప్తతి** రాయల సీమలో సంక్రాంతిని, పనుల పొంగలిగా అన్నారని తెలుపుతూంది. క్రీ.శ. 1602 నాటి ఒక జెసూట్ ఫాదర్ ఈ విధంగా అన్నారని కంభంపాటి సత్యనారాయణనన్నారు. ఆ ఫాదర్ మాటల్లో "మనకు రోమ్ ఎల్లాగో, ఈ సంస్కారహీనులకు, పేర్‌మాల్ (పెరుమాళ్ళు) దేవాలయం అల్లాగ. తూర్పు నుండి ప్రజలు గుంపులు గుంపులుగా వస్తారు. దేవాలయాన్ని దర్శించుకొని, బహుమతుల నిస్తారు". వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో దేవుని రథాన్ని పాలకుడు, 10 వేల మంది పట్టి లాగేవారని తెలుస్తోంది. తిరుపతి వెంకటేశ్వర స్వామికి సంవత్సరంలో 156 రోజులు ఉత్సవాలను జరిపేవారని తెలుస్తూంది.

విజయనగర యుగమందు ఉత్సవాల్లో ప్రత్యేకమైంది, విశిష్టమైంది, దసరా పండుగ. ఈ దసరా పండుగను ప్రజలు, మఠాలు, దేవాలయాలు కాక, రాజ్యం నిర్వహించింది. ఈ పండుగను విజయనగర పాలకులు మహా వైభవోపేతంగా 9 రోజులు నిర్వహించారు. దీనిని క్రమం తప్పక ప్రతి సంవత్సరం జరిపించారు. కనుకనే, హంపీలో 'మహార్నవమి దిబ్బ' అన్న పేరుతో ఒక ప్రత్యేక స్థలముంది. ఈ ఉత్సవంలో అందరూ పాల్గొన్నారు. కాబట్టి, ఇది మతపరమైన ఉత్సవం కాదేమోననిపిస్తుంది. ఎందుకనగా, ఈ ఉత్సవంలో మతంతోపాటుగా, సాంఘిక, రాజకీయ ప్రాధాన్యముండొచ్చు. ఈ దసరా ఉత్సవం గురించి విపులంగా వర్ణించిన విదేశీయ యాత్రికులలో ముఖ్యుడు, పేస్. ఈ పండుగ తొమ్మిది రోజులు ఉత్సవాలు విజయనగర కోట ప్రాంతాల్లో జరిగాయి. కోట ముందర నిర్మించబడిన రెండు రాతి శాశ్వత కట్టడాలపై, ఈ ఉత్సవం జరుపబడింది. ఈ ఉత్సవం జరుపబడిన స్థలాన్ని, 'ది హౌస్ ఆఫ్ విక్టరీ' యని, పేస్ అనగా, 'త్రోన్‌ప్లాట్‌ఫారం'అని లాంగ్‌హర్స్ట్ అనగా, కొందరు 'కింగ్స్ ఆడియన్స్ హాల్' అన్నారు. ఆ ప్రాంతాన్ని ఇప్పటివారు 'మహార్నవమి దిబ్బం' టున్నారు. ఇవన్నీ కృష్ణదేవరాయలచే 1513 లో గజపతులపై విజయానంతరం నిర్మించబడుండొచ్చునని, బర్టన్ స్టీన్ అభిప్రాయం. ఎ. హెచ్. లాంగ్‌హర్స్ట్ రచించిన **'హంపి శిథిలాలు, వర్ణచిత్రాలు'** ప్రకారం, చక్రవర్తి ఈ కట్టడాల్లో కూర్చొని, దసరా ఉత్సవ మందలి ఊరేగింపులను చూచేవాడు; ఆయుధ విద్యల్లో పోటీలను, ఆటల్లో పోటీలను చూచేవాడు. వజ్ర వైడూర్యాలతో నిండిన సింహాసనంపై కూర్చుండి, చక్రవర్తి సామంత ప్రభువులు చెల్లించిన కప్పాలు, ఇచ్చిన బహుమతులను పుచ్చుకొనేవాడు. ఒకానొకప్పుడు అర్ధ సింహాసనాన్ని భగవంతుని మూర్తికిచ్చి, తాను మిగిలిన దాంట్లో కూర్చునేవాడు. ఆ భగవంతుని మూర్తి ఏమిటో చెప్పలేం. ఆ భగవతా మూర్తిని ప్రజల దర్శనార్థం ఉంచినప్పుడు, లోపల ప్రత్యేకంగా నిర్మించిన భవంతిలో ఉంచేవారు. ఆ భగవతా మూర్తిని పూజించుటకు ప్రభువు బ్రాహ్మణులతో కలసి కాని, ఒంటరిగా కాని, వెళ్ళేవాడు. ఆ కట్టడాల గోడలపై చెక్కబడిన శిల్ప వర్ణనలను పేస్, న్యూనిజ్‌లు పేర్కొన్నారు. ఈ దసరా ఉత్సవ సందర్భంగా కోట ప్రాంతంలో, ఉత్సవాలు జరిగే చోట, ఆడంబరమైన 9 పెవిలియన్లు నిర్మించబడ్డాయని, న్యూనిజ్ వ్రాశారు. ఈ పెవిలియన్లను సామంత ప్రభువులు, లేక అమరనాయక ప్రభువులు నిర్మించినట్లు తెలుస్తోంది. గర్భ గుడి లోని భగవంతుని దర్శనార్థం ఒక భక్తుడు ఏ విధంగా నైతే, అనేక ద్వారాలను దాటి వెళ్ళాలో, అదే విధంగా ఈ ఉత్సవాలు జరిగే స్థలానికి, అనేక ద్వారాలను దాటి వెళ్ళాల్సుంది. ఈ దసరా

BRAOU

ఉత్సవాన్ని, ప్రాచీన కాలం నాటి చక్రవర్తులు జరిపిన అశ్వమేధ యాగంతో, బర్టన్ స్టీన్ పోల్చారు. ఈ ఉత్సవానికి సాంఘిక, రాజకీయ ప్రయోజనముందని తప్పక ఊహించొచ్చు. ఈ ఉత్సవం విజయనగర పాలకుల రాజకీయ విజ్ఞతకు, కార్యశూరతకు, మత సామరస్యానికి, పరిపాలనా దక్షతకు ఉదాహరణగా నిల్చే అంశం. ఇంకా, విజయనగర చక్రవర్తులు తమ సామంత ప్రభువుల, దండనాయక, అమరనాయక, అమాత్యుల సైనిక శక్తిని సమీక్షించేందుకు, విధేయతను పరిరక్షించేందుకు, సమర్థులైన యువక నాయకులను ఎన్నుకొనుటకు తోడ్పడుండొచ్చు. అంతేకాక, పరోక్షంగా పాలకుల సామర్థ్యాన్ని ప్రజలకు తెలియపర్చేందుకుక్కూడా, ఈ ఉత్సవం జరుపబడిందని చెప్పటంలో అతిశయోక్తి లేదు. ఈ ఉత్సవ మీవిధంగా జరుపుట వల్ల ఉపయోగముండుట చేతనే, తర్వాతి కాలంలో ఇది ఒక ఆదర్శంగా, మీదుమిక్కిలి ఒక ఆచరణయోగ్యమైన సంప్రదాయంగా, మిగిలి పోయింది. ఈ ఉత్సవాన్ని బట్టి, విజయనగర యుగమందలి సార్వభౌమాధికారం 'రిచ్యువలిస్టిక్' అన్న హోకార్ట్ అభిప్రాయాన్ని బలపర్చాడు, బర్టన్ స్టీన్. ఈ ప్రతిపాదనపై వాదోపవాదాలున్నాయి.

. ఆనాడు విజయనగర పాలకులు మత మౌఢ్యాన్ని ప్రదర్శించలేదని చెప్పటమే కాక, వారు ఉద్దేశ పూర్వకంగా హైందవ మత పునరుద్ధరణకు పూనుకోలేదని, వారు సంపన్నులు కావటం చేత హైందవ వ్యవస్థలను పోషించారన్న రొమిల్లా థాపర్ అభిప్రాయం ఆమోదింపదగిందని చెప్పొచ్చు.

21.3 : సాహిత్యాభివృద్ధి

విజయనగర పాలకులు రాజ్య విస్తరణకు కృషి చేస్తూనే, ఆర్థికాభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటూనే, సాహిత్య, కళాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. విజయనగర సామ్రాజ్య కాలంలో సంస్కృత, దేశ భాషల్లో ఎంతో విలువైన సాహిత్యం రచించబడింది. విజయనగర పాలకుల్లో కొందరు స్వయంగా కవులై, సాహిత్య రచన చేశారు. మాదనగారి మల్లయ రచించిన **'రాజశేఖర చరిత్ర'**, కందుకూరి రుద్రకవి రచించిన **'నిరంకుశోపాఖ్యానం'**, అల్లసాని పెద్దన రచించిన **'మనుచరిత్ర'** వలన, ఆనాటి విద్యా విధానం గురించి తెలుసుకోగలుగుతాం. విజయనగర సామ్రాజ్య చక్రవర్తులు ప్రజల విద్యాభివృద్ధికి పరోక్షంగా తోడ్పడ్డారని చెప్పొచ్చునని, నేలటూరు వెంకటరమణయ్య గారి అభిప్రాయం. పాలకులు దానాలిచ్చి, పండితులను పోషించారు. ఆనాడు విద్య అందరికీ అందుబాటులో లేదు. విద్య కొన్ని వర్గాల వారికి మాత్రమే పరిమితం. కనుక, ఆనాడు జనాభాలో అధిక సంఖ్యాకులు నిరక్షరాస్యులని ఊహించటంలో తప్పు లేదు. ఆనాడు విజనయగరం, కాంచీపురం, మదురలు, ప్రధాన విద్యా కేంద్రాలు. ఆనాటి శైవ, వైష్ణవ మఠాలు, అగ్రహారాలు కూడా, విద్యా కేంద్రాలని చెప్పకోవచ్చు. ఈ మఠాల్లో, అగ్రహారాల్లో సాధారణంగా మతపరమైన బోధన జరిగుండొచ్చు. ఈ మఠాల్లో, అగ్రహారాల్లోని పండితుల ఇండ్ల వద్ద మాత్రమే పుస్తక భాండాగారాలుండేవి. ఆనాటి పండితులు, తాటాకులను, రాగి రేకులను రాయుటకు ఉపయోగించారు. తాళ్ళపాక అన్నమాచార్యుడు దాదాపు 30 వేల కీర్తనలను రాగి రేకులపై రాయించి, 'సరస్వతి భాండాగారం'లో భద్రపర్చాడు.

22.3.1 : సంస్కృతం, దేశ భాషలు

విజయనగర రాజ్యాన్ని స్థాపించిన సంగమ వంశ పాలకుల్లో ప్రధానంగా మొదటి బుక్కరాయల ప్రోత్సాహంతో, సాయణ నాయకత్వంలో కొంత మంది సంస్కృత పండితులు నాలుగు వేదాలపై, బ్రాహ్మణాలపై, అరణ్యకాలపై వ్యాఖ్యానాలను రచించారు. 15వ శతాబ్ది శ్రీరంగానికి చెందిన దేవరాజుని **'నిఘంటు వ్యాఖ్య'**, వైదిక పాండిత్యానికి ఒక మచ్చుతునకగా చెప్పొచ్చు.

BRAOU

శ్రీకృష్ణదేవరాయలకు, రామరాయలకు సమకాలీనుడు, కాంచీపుర నివాసైన గోవిందరాజు **'భూషణ'**ను సంస్కృతంలో రచించాడు. కృష్ణదేవరాయల పోషణలో క్రీ.శ. 1517లో హేమకూటమునందు, ఈశ్వర దీక్షితుడు రామాయణంపై లఘు, బృహత్ వివరణను సంస్కృతంలో రచించాడు. రెండవ హరిహరుని కాలంలో మహాభారతంపై, గోకర్ణానికి చెందిన ఆనందపూర్ణ విద్యాసాగరుడు **'వ్యాఖ్య రత్నావళి'**ని సంస్కృతంలో రచించాడు. సర్వజ్ఞనారాయణుడు రచించిన వ్యాఖ్యానం పూర్తిగా దొరకక, కొన్ని భాగాలు మాత్రమే దొరుకుతున్నాయి. ఇంకా, వేదాంత మాధవ దేశికుడు రచించిన **'యాదవాభ్యుదయం'**, **'హంస సందేశం'**, విద్యారణ్యులు రచించిన **'అనుభూతి ప్రకాశిక'**; **'అపరోక్ష భూతిదీపిక'**, సాయణ రచించిన **'సుభాషిత సుధానిధి'**, **'ప్రాయశ్చిత్త సుధానిధి'**, చొండ మాధవుడు రచించిన **'తాత్పర్య దీపిక'**; **'శైవామ్నయసారం'**; వ్యాసరాజ తీర్థులు రచించిన **'యుక్తిమల్లిక'** మొదలైనవి, మతపరమైన కొన్ని సంస్కృత రచనలు. సంస్కృత కావ్యాల్లో కుమార కంపరాయల భార్య గంగాదేవి రాసిన **'మధురా విజయం'**, కృష్ణదేవరాయల భార్య తుక్కాంబ రచించిన **'తుక్క పంచ శతకమ్'**, రాజకుటుంబాల్లోని స్త్రీల సంస్కృత పాండిత్యానికి ఉదాహరణలు. ఈ కాలంలో అలంకార, నాట్య, సంగీత శాస్త్రాలపై, అనేక గ్రంథాలు రాయబడ్డాయి. అలంకార శాస్త్రానికి సంబంధించి సాయణుని **'ధాతువృత్తి'**; భోగనాథుని **'ఉదాహరణ హేల'**; గోవ తిప్పని కావ్యాలంకార సూత్రాలపై వ్యాఖ్య, ముఖ్యంగా చెప్పకోదగ్గవి. నాట్య, సంగీత శాస్త్రాలకు సంబంధించినంతవరకు, **'మహానాటకసుధానిధి**; దేశభట్ట **'సంగీత ముక్తావళి'**, గోపతిప్పని **'తాళదీపిక'**, ల్లొల్ల లక్ష్మీధరుని **'సంగీత సూర్యోదయం'**, రఘునాథరాయల **'సంగీత సుధ'**లు గుర్తుంచుకోదగినవి. రఘునాథరాయలు 'బయంతసేన', రామానందం అనే నూతన రాగాలను, రఘునాథవిలాసమనే కొత్త నాట్య పద్ధతిని రూపొందించాడు. కృష్ణదేవరాయల **'జాంబవతి కళ్యాణం'**, తిరుమలాంబ విరచితమైన **'వరదాంబికా పరిణయం'**, అప్పయ్య దీక్షితుని **'యాదవాభ్యుదయ వ్యాఖ్య'**, **'చిత్రమీమాంస'**, **'లక్షణావలి'**, **'కువలయానంద'**, **'వృత్తివార్తిక'**, నీలకంఠ దీక్షితుని **'నీలకంఠ విజయ చంపూ'**; **'గంగావతరణ'**, **'శివలీలార్ణవ'**; గోవింద దీక్షితుని **'సాహిత్య సుధ'**; రత్నఖేట శ్రీనివాస దీక్షితుని 18 నాటకాలు, 6 కావ్యాలు, పూర్తిగా దొరకలేదు. శ్రీనివాస దీక్షితుని కుమారుడైన రాజ చూడామణి దీక్షితుడు, **'కమలిని కలహంస'**, **'కువంద రాఘవ'** (నాటకం); **'రుక్మిణీ కళ్యాణం'** (కావ్యం); **'శంకరాభ్యుదయం'** (జీవిత చరిత్ర)ను రచించాడు. ఈ పైన చెప్పబడినవి, కొన్ని మాత్రమే. సంస్కృత భాషలో విజయనగర యుగమందు అన్ని విషయాలపై అనేక గ్రంథాలు వ్రాయబడ్డాయి. సంస్కృత భాషలో ఇంత విశేష కృషి జరుగుటకు కారణం, బహుశా, విజయనగర పాలకులు చేపట్టిన హైందవ ధర్మ పునరుద్ధరణ కార్యక్రమమేమోనని భావించొచ్చు.

విజయనగర యుగంలో సంస్కృతం మాత్రమే కాక, దక్షిణ భారతదేశం లోని ప్రాంతీయ భాషలైన తెలుగు కన్నడం, తమిళం కూడా రాజాదరణకు నోచుకున్నాయి. ముందుగా తెలుగు భాషా పోషణకు విజయనగర పాలకులు చేసిన కృషిని తెలుసుకుందాం.

విజయనగర రాజ్య స్థాపకులైన హరిహర, బుక్కరాయలు తెలుగువారు కావటం చేత, వారి కాలం నుండి తెలుగుకు రాజాదరణ లభించటంలో ఆశ్చర్యం లేదు. సంగమ వంశస్థుడైన రెండవ దేవరాయల కాలంలో కవిసార్వభౌమ శ్రీనాథుడు విజయనగరాన్ని సందర్శించి, గౌడ డిండిమ భట్టును సాహిత్య పరీక్షలో ఓడించి, కనకాభిషేకాన్ని చేయించుకొన్నాడు. విజయనగర పాలకుడు శ్రీనాథుణ్ణి 'దీనార లంకాలతో తీర్థ మాడించాడని' తెలిసిందే. వినుకొండ వల్లభరాముడు మోపూర కాలభైరవుడి ఉత్సవం సందర్భంగా ప్రదర్శించేందుకు, **'క్రీడాభిరామం'** అన్న వీధి నాటకాన్ని, ఈ కాలం లోనే

BRAOU

రచించాడు. సాళువ నరసింహ రాయల కాలంలో **'రామాభ్యుదయం'** అనే కావ్యం వ్రాయబడింది. **'రామాభ్యుదయం'** రచయిత నరసింహారాయలేనని, టి.వి. మహాలింగం అభిప్రాయాన్ని వెలిబుచ్చగా, కాదని కొందరంటున్నారు. ఈ కాలానికి చెందిన మరొక ప్రసిద్ధ గ్రంథం, పిల్లలమఱ్ఱి పినవీరభద్రుని **'జైమిని భారతం'**. విజయనగర యుగంలో తుళువ వంశస్థుల పాలనా కాలం, తెలుగు భాషాభివృద్ధికి స్వర్ణ యుగం. విజయనగర పాలకుల్లో అగ్రగణ్యుడిగా, ఆంధ్ర భోజుడిగా కీర్తిచెందిన శ్రీకృష్ణదేవ రాయలు, దేశ భాషలందు తెలుగు లెస్సయని కీర్తించటమే కాక, తెలుగులో స్వయంగా కవి. ఈ యుగానికి చెందిన 16వ శతాబ్ది తెలుగు సాహిత్యంలో, నూతన ధోరణి ఆరంభమైంది. ఈ శతాబ్ది నుండి తెలుగులో స్వతంత్ర రచనలు ఆరంభమైనాయి. ఈ స్వతంత్ర రచన ప్రబంధ మనే ప్రక్రియ అవతరణకు దోహదం చేసింది. ఈ ప్రక్రియలో శృంగారానికి ప్రాధాన్యత ఇవ్వబడింది. బహుశా, ఈ యుగం లోని అగ్ర వర్ణాలు, వైభవోపేతమైన, ఆడంబరమైన, విశృంఖల శృంగారానికి అలవాటు పడటంచే, చదువుకొన్న వర్ణాల వారి కొరకు రచించబడిన ప్రబంధాల్లో, శృంగారానికి అగ్రస్థానమిచ్చి వుండొచ్చు. ఎందుకనగా, ఏ యుగంలోనైనా, సాహిత్యం నాటి సమాజానికి ప్రతిబింబమే కదా. ప్రతి ప్రబంధం లోను, చక్రవర్తి, రాజధాని, కొండలు, నదులు, సూర్యోదయం, అస్తమయం, చంద్రోదయం, రుతువులు, సరోవరం, ఉద్యానవనం, అందమైన, ఆకర్షణీయమైన యువతి, ఆ యువతి విరహం, రాయబారం, విరహం, మద్యపానం, సంభోగం, సంతానోత్పత్తి, తీర్థయాత్రను 18 అంశాలు తప్పకుండా చోటు చేసుకున్నాయి. ఈ ప్రబంధాలతోపాటుగా, జావళీలు, కీర్తనలు కూడా రచించబడ్డాయి. ఈ యుగం లోని సుప్రసిద్ధ కవులైన అష్టదిగ్గజాల గురించి, తర్వాత చెప్పుకుందాం కనుక, ఆనాటి మిగిలిన కవుల గురించి చెప్పుకుందాం. **పంచతంత్ర** రచయిత నారాయణకవి రాజనీతిని గురించి, కథల రూపంలో తెలియపర్చాడు. కూచిరాజు ఎఱ్ఱన **'కాక్కోకం'** అన్న రతి శాస్త్ర గ్రంధాన్ని రచించాడు. సంకుశాల నరసయ్య **'కవివర్ణ రసాయనం'**ను రచించాడు. ఈ కాలంలో ద్వ్యర్థి కావ్యాలు, త్ర్యర్థి కావ్యాలను రచించడం, ఆశు కవిత్వం సర్వసాధారణమైంది. అవధానాలను చేయడం బహుశ ప్రచారం లోకి వచ్చింది. వెలిగండ్ల నారాయణ కవి భాగవతం లోని 11వ స్కందంలో, లఘువుల నుపయోగించి, సీస పద్యాల్లో వ్రాశాడు. నందిమల్లయ్య, ఘంట సింగనలు **వరాహపురాణాన్ని** తెలుగులో వ్రాయటమే కాక, చిత్ర, బంధ, గర్భ కవితలను వ్రాశారు. ఈ విధమైన కవిత్వంలో మాటల గారడి తప్ప, కవితా సౌరభం లేదన్న విమర్శుంది. ఈ యుగం లోని ప్రముఖ కవయిత్రులు మొల్ల, తాళ్ళపాక తిమ్మక్క. మొల్ల **'రామాయణం'** ను, తిమ్మక్క **'సుభద్రా కల్యాణం'** ను రచించారు. అయితే, 17వ శతాబ్దం వచ్చేటప్పటికి, విజయనగర రాజ్యం క్షీణించుట చేత, సాహిత్యంలో కూడా క్షీణ యుగం ఆరంభమైంది. ఈ కాలం నాటి మరొక సాహిత్య ప్రక్రియైన జావళీల్లో, ప్రేమ నిరీక్షణ ఎంతో బాగా వ్రాయబడిందని చెంచయ్య, భుజంగరావులు అభిప్రాయపడ్డారు. ప్రబంధాలతో సమానంగా శతకాలు వచ్చాయి. ఇవి మత, నీతి ప్రబోధానికి పూనుకున్నాయి. శతక కవుల్లో వైష్ణవులు, శైవులున్నారు.

కన్నడ సాహిత్యం: విజయనగర సామ్రాజ్య కాలమందు శైవ, వైష్ణవ మతాల ప్రాబల్యం పెరిగి, జైన మత ప్రాబల్యం తగ్గినప్పటికి, జైన పండితులు కన్నడ భాషలో తీర్థంకరుల జీవిత చరిత్రలను రచించారు. రెండవ హరిహర, మొదటి దేవరాయ మంత్రులచే ఆదరించబడిన మదుర 15 వ తీర్థంకరునిపై **'ధర్మనాథ పురాణాన్ని'**, శ్రావణ బెల్గోలా లోని గోమతేశ్వరునిపై ఒక పద్య కావ్యాన్ని రచించారు. వృత్తవిలాసపండితుడు **'ధర్మపరీక్ష'**, **'శాస్త్రసార'**లను రచించాడు. 1424 నాటి పెను గొండకు చెందిన భాస్కరుడు, 1485 నాటి తెరికనంబికి చెందిన బొమ్మరును, 1500 నాటి తుళువ దేశానికి చెందిన బొమ్మరసులు **'జీవనంధరరాజ జీవిత చరిత్ర'**ను రచించారు. 1500 నాటి శృంగేరికి చెందిన బాహుబలి నాగ-కుమార కథను రచించారు. విజయనగర సామ్రాజ్యంలో తుళువ ప్రాంతంలో

BRAOU

జైన మతం ఇంకా ప్రాచుర్యంలో వుందని, నీలకంఠశాస్త్రి పేర్కొన్నారు. తుళు ప్రాంతంలో గెర్సెప్పకు చెందిన అభినవ వాది విద్యానంద. ఈతడు 1533లో **'కావ్యసారం'**ను క్రోడీకరించాడు. 1530 నాటి 'సాళ్వ', షట్పదిలో భారతాన్ని 16 పర్వాల్లో రచించాడు. ముదదిదిరేకి చెందిన రత్నాకర వార్ణి **'త్రిలోకసార', 'అపరాజితశతక', 'భారతేశ్వర చరిత్ర'**లను రచించాడు. 1539 లో నేమన్న **'జ్ఞాన భాస్కర చరిత్ర'** ను రచించాడు. 1400 నాటి వాడని చెప్పబడుతున్న అమతవర్మ **'రత్నకరండక'** గ్రంధకర్త. ఇవన్నియు జైన మత వ్యాప్తి నిమిత్తం రాయబడ్డాయి.

కన్నడ సాహిత్య పరివుష్టికి కృషిచేసిన వారు వీరశైవ పండితులు, కవులు. రెండవ దేవరాయ ఆస్థానానికి చెందిన చామరస **'ప్రభులింగ లీలే'** అను గ్రంథాన్ని రచించాడు. ఈ గ్రంథాన్ని తెలుగు, తమిళ భాషల్లోకి అనువదించమని రెండవ దేవరాయలు ఆదేశించినట్లు తెలుస్తోంది. చామరస వైష్ణవ పండితులతో చర్చలను కూడా జరిపాడట. 1584 నాటికి చెందిన విరూపాక్ష పండిత **'చెన్నబసవపురాణా'**ని రచించాడు. అనేక గ్రంథాల్లో పండితారాధ్య, రేవణ సిద్దలు గొప్ప నాయకులుగా చిత్రించబడ్డారు.

రెండవ దేవరాయల కాలంలో ఇద్దరు వీరశైవ మంత్రులు లక్కన, జక్కనాద్యలు వరుసగా, **శివతత్వచింతామణి, 'మూరొందు స్థల'**ను రచించారు. 101 మంది జంగాలు శైవ సిద్ధాంతంపై వచనాలను రచించారు. ఈ కాలంలో లింగాయతులకు, వైష్ణవులకు మధ్య, ఘర్షణలు జరిగాయి. 1465 - 85 మధ్య కాలంలో పరిపాలించిన రెండవ విరూపాక్షుని కాలం నాటి ప్రముఖ శైవ గురువు, తొంతాడ సిద్దేశ్వర, లేక సిద్ద లింగయతి. ఇతడు 700 వచనాలతో కూడిన **'షట్‌స్థల జ్ఞానామృత'**మును రచించాడు. 1560 నాటి విరక్త తొంతాడ రాయ తన గురువు జీవిత చరిత్రను, **'సిద్దేశ్వర పురాణ'** మన్న పేరుతో రచించాడు. నిజగుణ శివయోగి **శివయోగ ప్రదీపకనే** సంస్కృత గ్రంథంపై వ్యాఖ్యను, **వివేక చింతామణి**ని రచించాడు. కృష్ణదేవరాయల కాలం వాడైన గుబ్బకి చెందిన మల్లనార్య కన్నడం లోను, సంస్కృతం లోను రచనలను చేశాడు. ఈయన కన్నడంలో 1513లో **'భావచింతారత్నం'**ను, 1530లో **'వీరశైవామృతం'**ను రచించాడు. కృష్ణదేవరాయల కాలానికి చెందినవారే విరూపరాజ, అతని కుమారుడైన వీరభద్రరాజ. వీరభద్రరాజ శైవ సూత్రాలపై ఐదు శతకాలను రాశాడు.

1173-1230 మధ్య కాలంలో, కన్నడ భాషలో వైష్ణవ మతాన్ని గురించిన గ్రంథ రచన చేసిన మొదటివాడు, రుద్రభట్ట. ఈయన విష్ణుపురాణ మాధారంగా, **'జగన్నాధ విజయ'** మనే చంపూ కావ్యాన్ని రచించాడు. 1281 లో నరహరి తీర్థ, విష్ణుమూర్తిని పొగుడుతూ, గ్రంథాన్ని రచించాడు. అయితే, కృష్ణదేవరాయల కాలం నుండి వైష్ణవ మతోద్యమ ప్రభావం కన్నడ సాహిత్యం పై చూపించుట ఆరంభమైంది. నారాయణప్ప మహాభారతానికి చెందిన 10 పర్వాలను కన్నడం లోకి అనువదించాడు. ఈతడు రెండవ దేవరాయల సమకాలీనుడు. ఇతనికి కుమార వ్యాసన్న బిరుదుంది. మిగిలిన పర్వాలను 1510లో తిమ్మన్న అనువదించి, దానిని **కృష్ణరాయభారత** మని పేరుపెట్టాడు. కుమార వాల్మీకి యన్న బిరుదుకల నరహరి, **'రామాయణాన్ని'** కన్నడంలో రచించాడు. 17వ శతాబ్దంలో లక్ష్మీస **'జైమిని భారతం'**ను రచించాడు. చాట విఠలనాధ **'భాగవతం'**ను అనువదించాడు. ఈయన కృష్ణదేవరాయ, అచ్యుతరాయల సమకాలీనుడు. కన్నడ సాహిత్యంలో వైష్ణవ మతానికి చెందిన దాస సాహిత్యానికి ప్రత్యేక స్థానముంది. వాగ్గేయకారులు పురందర దాస, కనకదాసులు ఈ కోవకు చెందినవారు. 17వ శతాబ్దంలో కూడా కన్నడ సాహిత్యం బాగా అభివృద్ధి చెందింది. కనకదాసు రచించిన **'మోహనతరంగణ', 'నలచరిత్ర,' 'హరిభక్తసారం', 'రామధ్యానచరితె'**, కన్నడ సాహిత్యానికి మరింత మెరుగుపట్టాయి.

BRAOU

తమిళం: కె. ఏ. నీలకంఠశాస్త్రి అభిప్రాయం ప్రకారం, 1200 నుండి 1650 వరకున్న కాలంలో, తమిళ వాఙ్మయంలో నాలుగవ, లేదా చివరి గొప్ప దశ ఆరంభమైంది. ఈ కాలంలో తత్వసంబంధమైన మౌలిక రచనలు, వ్యాఖ్యానాలు, పురాణాలు, ప్రబంధాలు రచించబడ్డాయి. ఈ యుగంలో సృజనాత్మకత కన్నా వాఙ్మయంలో అనుకరణ ఎక్కువైంది. ఈ కాలానికి చెందిన రచయితల్లో ఎక్కువ మంది శైవ, వైష్ణవ, జైన మతాలకు చెందినవారు.

అద్వైత తత్వాన్ని గురించిన **'శివప్రకాశపెరిందరత్తు'**, **'కురిందురత్తు'** అన్న గ్రంథాలను, వరుసగా, స్వరూపానంద దేశికర్, అతని శిష్యుడు తత్తువారియార్‌లు 14, 15వ శతాబ్దాల్లో రచించారు. ఈ రెండు గ్రంథాలు శైవ వాఙ్మయానికి చెందిన ప్రముఖ గ్రంథాలు. తత్తువారియార్ గొప్ప భక్త శిఖామణి. ఈతడు **'పాడుతురై'**, **'నానావినోదిన్'**, **'కలంబాకం'**, **'మోహవడ్రైప్రరణి'**, **'అన్నవదైప్ప-రణి'**లను రచించాడు. 15వ శతాబ్దానికి చెందిన అరుణగిరినాథుడు, పాటలతోకూడిన **'తిరుప్పరల్'**ను రచించాడు. 1489 నాటి మదురకు చెందిన శివప్రకాశర్, అరుణనంది విరచిత, **'ఇరుపాల్-ఇరుపా-దుకు'**, ఉమాపతి రచించిన **'శివప్రకాశం'**కు విలువైన వ్యాఖ్యానాలను రచించాడు. కృష్ణదేవరాయల ఆస్థానాన్ని అలంకరించిన హరిదాసను వైష్ణవ కవి, **'ఇరుసమయ-నిళకూ'**ను రచించాడు. 1553 లో చిదంబరం శైవ మఠానికి చెందిన మరైనాన సంబందార్, **'శివదారుమెత్తరం'**, **'శైవసమయనేరి'**లను రచించాడు. ఇంకా, 1564కు చెందిన శివాగ్రయోగి, లేక శివక్కొలందు దేశికార్, కనువైనాన ప్రకాశర్, మసిలమణై సంబందార్, నిరంబ అళిగయ దేశికార్, తురుసై అంబాళవన దేశికా, తురైయూర్ శివప్రకాశ స్వామిలు, పేర్కొనదగిన ఆనాటి శైవ మత రచయితలు.

తమిళ ప్రాంతంలో వైష్ణవ మత సంబంధమైన సాహిత్యం సంస్కృతం లోనే ఎక్కువగా వ్రాయబడింది. వేదాంత దేశికుడు సంస్కృతం లోను, తమిళం లోను కూడ రచనలను చేశాడు. వేదాంత దేశికుడు తమిళంలో **'ముమ్మణిక కోవై'**, **'నవరత్నమాలై'**, **'అర్థపంచకం'**, **'అదైకలపత్తు'** లను వ్రాయగా, అతని కుమారుడు నాయనార్ ఆచారియార్ కూడా వైష్ణవ మత ప్రచారం కొరకు, తమిళంలో రచనలను చేశారు. ఈ యుగంలో తమిళంలో పురాణ వాఙ్మయం ఎక్కువగా వచ్చింది. అట్టివానిలో చెప్పకోదగ్గవి ఉమాపతి శివాచార్యుని **'కోయిర్ పురాణం'**, నల్లూర్ వీరకవి రాయర్ రచించిన **'అరిచందిర పురాణం'** కచ్చియప్ప శివాచార్యుని **'కంద పురాణం,'** నానక్ కత్తూర్‌ని **'వృద్ధాచలపురాణం'**, కళందై కుమారన్, **'తిరువాంజీయ పురాణం'**, అఘోరమునివర్‌ని **'కుంభకోణం'**, **'వేదారణ్యం'**, **'తిరుక్కానప్పార్ పురాణాలు'** ముఖ్యమైనవి. భాగవతాన్ని తమిళం లోనికి శైవచ్చు దువార్, వరదరాజ అయ్యంగార్‌లు అనువదించారు. లిల్లి పుత్తురార్ భారతంను తమిళంలో రచిం చాడు. ఈతని సోదరు లిద్దరు ఇరతై సామార్ (జంట కవులు) **'విక్రమ-నాదర్-ఉల'**లనే రెండు కలంబకాలను రచించారు. 15వ శతాబ్దపు మధ్య భాగంలో కాలమేఘం తిరువైనైక్క శివుని మీద ఒక ఊలను రచించారు. శైవ ఎలప్ప నావలార్ అరుణైనంది, **అరుణాచల పురాణం, తిరువిరంజై పురాణం,** తమిళంలో సౌందర్యలహరిపై వ్యాఖ్యానాన్ని రచించాడు. ఈ కాలం లోనే అనేక వ్యాఖ్యానాలు రచించబడ్డాయి.

పైన పేర్కొన్న విధంగా, ఆనాటి తెలుగు, కన్నడ, తమిళ భాషల్లోని వాఙ్మయాన్ని రెండు విధాలుగా విభజించొచ్చు. అవి మతపరమైన శైవ, వైష్ణవ వాఙ్మయం, లౌకిక వాఙ్మయం. కన్నడ భాషలో సృజనాత్మక సాహిత్యం తక్కువగా కనిపించగా, తెలుగులో వీరశైవ, వీర వైష్ణవ మత ప్రభావం వల్ల, సృజనాత్మక సాహిత్యం విస్తారంగా రాయబడింది.

B R A O U

21.3.2 : అష్ట దిగ్గజాలు

విజయనగర సామ్రాజ్యాన్ని తుళువ వంశస్థుడైన ఆంధ్రభోజుడన్న బిరుదంతో కీర్తి గడించిన శ్రీకృష్ణదేవరాయలు 'భువన విజయం'లో కవితా గోష్ఠులను నిర్వహిస్తూ, వివిధ భాషలకు చెందిన కవి శ్రేష్ఠులను ఆదరించి, పోషించాడు. అట్టి కృష్ణదేవరాయల కాలంలో అష్ట దిగ్గజాలు అన్న పేరుగల కవులుండేవారు. 1528 నాటి తిప్పలూర్ శాసనం ప్రకారంగా, తిప్పలూర్‌ను కృష్ణదేవరాయలు ఒక అగ్రహారంగా అష్టదిగ్గజ కవులకు దానం చేశాడు. నేలటూరు వెంకటరమణయ్య, కృష్ణదేవరాయలు రాజ్యానికి రావడంతో, దక్షిణ భారత సాహిత్య చరిత్రలో ఒక నూతన శకం ఆరంభమైందన్నారు. స్వయంగా పండితుడు, కవి, సంగీత విద్వాంసుడైన కృష్ణదేవరాయలు, దండయాత్రలకు వెళ్ళకుండా, రాజధానిలోనున్న రోజుల్లో కవి, పండిత గోష్ఠులను ఏర్పాటుచేసి, వారికి దానాలిచ్చి, ఆదరించి, పోషించాడని, ప్రత్యేకంగా తెలుగు భాషపై ఎక్కువ మమకారాన్ని చూపించాడన్నారు. రాజ్యానికి వచ్చిన మొదట్లోనే, తెలుగు కవులతో కూడిన ఒక అకాడమిని అష్టదిగ్గజాల పేరుతో ఏర్పాటు చేశాడన్నారు. ఈ అష్టదిగ్గజాలతో కూడిన సభకు రాయలే అధ్యక్షత వహించారన్నారు. ఈ అష్టదిగ్గజాలుగా పెద్దన, తిమ్మన, ధూర్జటి (పెద్ద), ముల్లన, రామరాజభూషణ, రామకృష్ణ, పింగళి సూరన, రుద్రులను, నేలటూరి వెంకటరమణయ్య పేర్కొన్నారు. ఈ భువన విజయం లోని కవులు తెలుగువారేనని చెప్పటానికి సందేహం లేదని, కొందరు పండితుల అభిప్రాయం. అయితే, ఈ అష్టదిగ్గజాలలో తెలుగు కవులే కాక, ఇతర భాషాకవులున్నారని, విజ్ఞుల అభిప్రాయం. గురజాడ శ్రీరామమూర్తి పురుషార్థ ప్రదాయిని అను పత్రిక యందు ప్రకటించబడ్డ కొండవీటి కవుల వృత్తాంత మాధారంగా, ఈ క్రింది వారిని అష్టదిగ్గజాలుగా పేర్కొన్నారు.

కవి పేరు	గ్రంథాల పేర్లు
1. అల్లసాని పెద్దన	మనుచరిత్రం
	రామస్తవరాజం
	అద్వైతం
2. భట్టుమూర్తి	నరసభూపాలీయం
3. నంది తిమ్మన	పారిజాతాపహరణం
4. పింగళి సూరన	రాఘవ పాండవీయం
5. తెనాలి పాండురంగడు	పాండురంగమహాత్మ్యమ్
6. రామభద్ర కవి	
7. శంకర కవి	
8. ధూర్జటి	

పైన పేర్కొన్న అష్టదిగ్గజాల లోని శంకర కవి, కృష్ణదేవరాయల ఆస్థానం లోని వాడు కాదని, గురజాడ శ్రీరామమూర్తి అభిప్రాయపడ్డారు. కందుకూరి వీరేశలింగం శంకర కవి గోల్కొండ రాజ్యం లోని వాడని, 17వ శతాబ్దానికి చెంది యుంటాడన్నారు. చాగంటి శేషయ్య శంకర కవి 1511 -1543 మధ్య కాలంలో పాలించిన కులికుతుబ్ షా కాలం వాడై యుండొచ్చునన్నారు. శంకర కవి తండ్రైన దేచయామాత్యుడు, తెనాలి రామలింగని ఉద్భటారాధ్య చరిత్ర కృతిపతి దేచనామాత్యుడు, ఒకరే కావచ్చు. కొర్లపాటి శ్రీరామమూర్తి శంకర కవి అష్టదిగ్గజ కవుల్లో ఒకడనుట, స్పష్టమైన

BRAOU

సిద్ధాంతం కాదన్నారు. కొర్లపాటి శ్రీరామమూర్తి అభిప్రాయం ప్రకారం నంది తిమ్మన, అల్లసాని పెద్దన, మాదయగారి మల్లన, ధూర్జటి నలుగురును, అష్టదిగ్గజ కవుల్లోని వారే అగుట నిరాఘాట మంటూ, అష్టదిగ్గజ కవులనబడిన అయ్యలరాజు రామభద్రుడు, తెనాలి రామ(లింగ)కృష్ణుడు, పింగళి సూరన, భట్టుమూర్తి, కందుకూరి రుద్రకవి, 16వ శతాబ్దపు రెండవ, మూడవ పాదాలకు చెందిన మహా కవులు. కనుక, అష్టదిగ్గజాలు కాలేరన్నారు. కొర్లపాటి శ్రీరామమూర్తి అభిప్రాయం ప్రకారం, భట్టుమూర్తి తండ్రైన వెంకట రాయభూషణుడుకున్న బిరుదు, కృష్ణరాయ భూషణుడిని బట్టి అతడే నంది తిమ్మన్న, అల్లసాని పెద్దన, మాదయ గారి మల్లన, ధూర్జటిలతోపాటుగా, 5వ తెలుగు అష్టదిగ్గజ కవన్నారు. చాగంటి శేషయ్య అష్టదిగ్గజ కవులు ఆంధ్ర కవులు కావలసిన ఆవశ్యకం లేదన్నారు. అంతేగాక, అతని ఆస్థానంలో సంస్కృత, కర్ణాటక కవులున్నారని, వారిని కూడా రాయలు సమాన గౌరవంతో చూచాడని అన్నారు. ఈ అభిప్రాయాన్నే పింగళి లక్ష్మీకాంతం కూడా అంగీకరించారు.

శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక మహోత్సవాన్ని గురించిన విశేషాలను, విశ్వనాథ సత్యనారాయణ 'రాయవాచక మందు వర్ణించాడు. ఆ గ్రంథం ప్రకారం, నగర విద్వాంసుల్లో నొకరైన అష్టభాషా కవితా కృష్ణావధానులు, కృష్ణదేవరాయలకు మంగళ స్నానం చేయించారన్నారు. ఆంధ్రం కూడా అష్ట భాషల్లో ఒకటని సంకేత పద కోశం చెపుతున్నది. కాబట్టి, కృష్ణావధానులు తప్పని సరిగా అష్టదిగ్గజ కవుల్లో 6వ వాడని కొర్లపాటి వారి ప్రతిపాదన. అదే విధంగా కర్ణాట కవికుల సార్వభౌముడు, కృష్ణరాయ భారత కృతికర్తైన తిమ్మణ్ణ, 7వ అష్టదిగ్గజ కవి యనియు, అదే విధంగా **కన్నడ భాగవత** రచయిత చాటు విఠలనాథుడు 8వ దిగ్గజ కవియన్నారు. కొర్లపాటి శ్రీరామమూర్తి ప్రతిపాదన ప్రకారం, అష్టదిగ్గజ కవులు: 1) నంది తిమ్మన, (2) అల్లసాని పెద్దన, (3) మాదయగారి మల్లన, (4) ధూర్జటి, (5) కృష్ణరాయభూషణుడు, (6) కృష్ణావధాన్లు, 7. తిమ్మణ్ణ (8) చాటు విఠల నాథుడు. ఈ అష్టదిగ్గజ కవుల్లో, 5 గురు తెలుగువారు, ఇద్దరు కన్నడిగులు, ఒకరు సంస్కృత కవి. ఈ అష్టదిగ్గజ కవుల ప్రసక్తి 1527 నాటి తిప్పలూరు, నందిదుర్గ శాసనాల్లో కలదు. ఇది ఇలా ఉండగా నంది తిమ్మన **పారిజాతాపహరణ** మందు కృష్ణదేవరాయల్ని, "భువన విజయమను పేరు గల సభ యందు నవరత్నాల కాంతులకు బాల సూర్యుడైన వాడా" యని సంబోధించుటచే, శ్రీకృష్ణ దేవరాయల ఆస్థానమందు నవరత్న కవులు కలరన్న భావం తలెత్తింది. పారిజాతాపహరణానికి టీక వ్రాసిన దూపి రామమూర్తి శాస్త్రి "కృష్ణరాయని కొలువున నష్ట దిగ్గజ కవులుండిరనుట వదంతి కాని, నవరత్న శబ్ద సారస్యాన్ననుసరించి నవరత్నాలుండిరేమో యన్న అనుమానం కలుగుతుందన్నారు. దీనిపై కొర్లపాటి శ్రీరామమూర్తి నవరత్న కవులున్నారనుటకు అవకాశం కలదన్నారు. అందుకుగాను, కొర్లపాటి శ్రీరామమూర్తి, పెద్దన శ్రీకృష్ణదేవరాయల్ని **మనుచరిత్ర**లో ఒకటవ వర్ణంలో, 2వ అశ్వాసంలో 'విద్యాశ్రీలన భోజ' యని సంబోధించుట చూపెట్టారు. అది ఏవిధంగా ననగా, భోజుని ఆస్థానంలో నవరత్న కవులున్నారని ప్రతీతి కలదు. వసుంధరా పిళియోజిత్ కూడా కృష్ణదేవరాయల ఆస్థానంలో నవరత్నాలనబడే కవులున్నారని, కాని కొందరు 8 మంది మాత్రమే ఉన్నారన్నారని పేర్కొంటుంది. ఈ 9వ కవి సుప్రసిద్ధ వైష్ణవ కవైన హరిదాసై వుంటాడని, ఇంతకు ముందే మనం చెప్పుకున్నట్లుగా, 'హరుసమయ విళక్కమ్' అను గ్రంథాన్ని వైష్ణవం మీద మమకారంతో రచించాడు. ఈతడు తమిళ కవి. నవ రత్న కవులు కృష్ణదేవరాయల ఆస్థానంలో 1515-1520 మధ్యలో నున్నారని, అష్టదిగ్గజాలున్న కాలం 1520-24 అని, గార్లపాటి శ్రీరామమూర్తి ప్రతిపాదన. నవరత్న కవుల్లో, అష్టదిగ్గజాలుగా తగ్గిపోవుటకు, బహుశా, కృష్ణదేవరాయల రాజకీయ విధానం కారణమై వుండి, తమిళ కవి హరిదాసు కృష్ణరాయల ఆస్థానం నుండి తొలగిపోయెనేమో.

BRAOU

నంది తిమ్మన **పారిజాతాపహరణం** ను రచించి కృష్ణదేవరాయలకు అంకితమిచ్చాడు. ఆంధ్ర కవితా పితామహ బిరుదాంకితుడు అల్లసాని పెద్దన తన మనుచరిత్రను కృష్ణదేవరాయలకు అంకితమిచ్చాడు. మాదయగారి మల్లన **'రాజశేఖర చరిత్ర'**ను రచించి, నాదెండ్ల అప్పయ మంత్రికి అంకితం చేశాడు. ఈ అప్పయ మంత్రి సాళువ తిమ్మరుసుకు మేనల్లుడు. అష్ట దిగ్గజ కవులతో సమానమైన పాండిత్యం, ప్రతిభ, ప్రజ్ఞ కలవాడు కృష్ణదేవరాయలు. కనుకనే, తెలుగు, సంస్కృత భాషల్లో సమానంగా గ్రంథ రచన చేశాడు. కృష్ణదేవరాయల **'అముక్తమాల్యద'** ఒక మహత్తరమైన ప్రబంధం. కృష్ణదేవరాయలు సంస్కృతంలో **'మదాలస చరిత్ర', 'సత్యవధూపరిణయం', 'సకల కథాసార సంగ్రహ', 'జ్ఞాన చింతామణి', 'రసమంజరి'** అన్నవి రచించినట్లు చెప్పబడుతున్నది. కాని, ఇంతవరకు ఇవేవి మనకు లభ్యం కాలేదు. కృష్ణరాయలు వ్రాసినట్లు చెప్పబడుతున్న **'జాంబవతి కళ్యాణం'** అన్న నాటకం దొరికింది కాని, సాహిత్యపరంగా అదేది గొప్పది కాదన్నది నేలటూరు వెంకటరమణయ్య అభిప్రాయం.

కృష్ణదేవరాయలు భువన విజయంలో నిర్వహించిన కవితా గోష్ఠులలో నవరత్న కవులు, మరియు అష్టదిగ్గజాలు పాల్గొన్నారని, ఇంతకు ముందే చదువుకున్నాం. ఆ నవరత్న కవుల్లో, లేదా అష్ట దిగ్గజాల్లో, సంస్కృత, కన్నడ, తమిళ, తెలుగు కవులకు స్థానమిచ్చుట, ఇతని దూర దృష్టికి నిదర్శనంగా చెప్పొచ్చు. అన్ని భాషలు వారికి స్థానం కల్పించటంలో, రాజ్యం లోని ప్రజల మధ్య, భాషాపరమైన ఐక్యతను పెంపొందింప చేయటమే లక్ష్యంగా కన్పించదు. సర్వమత సమానత్వం వలె, తన రాజ్యం లోని వివిధ భాషలను, పండితుల భాషైన సంస్కృతాన్ని ప్రోత్సహించి, తన చతురతను చాటి చెప్పాడు.

21.4 : కళాభివృద్ధి

దాక్షిణాత్య కళా రంగంలో విజయనగర సామ్రాజ్యానికి ఒక విశిష్ట స్థానముంది. పెర్సి బ్రౌన్ అను కళా చరిత్రకారుడు, విజయనగర కాలపు వాస్తువు ద్రావిడ సంప్రదాయ పరిపక్వత చెందిన స్థితి నాటిదని, శ్లాఘించాడు. విజయనగర వాస్తు, శిల్ప సంప్రదాయానికి పూర్వమున్న హోయసల, పాండ్య శైలులను మెరుగుపర్చి, తమ ప్రత్యేకతను చాటుతూ, విజయనగర పాలకులు వాస్తు నిర్మాణ, శిల్ప, చిత్ర శైలులను రూపొందించారు. విజయనగర సామ్రాజ్యపు కట్టడాలను మతపరమైన, లౌకికమైనవిగా విభజించొచ్చు. ఆ కట్టడాలు, దేవాలయాలు, దుర్గాలు, మహళ్ళను ఈనాటికి విజయనగరపు వాస్తు నిర్మాణం, శిల్పం, చిత్రలేఖనం సజీవంగా మనలను ఆనందపరుస్తున్నాయి.

21.4.1 : విజయనగర వాస్తు నిర్మాణాలు : దేవాలయాలు

విజయనగర యుగంలో విస్తృతమైన స్వరూపం, వ్యవస్థ కన్పిస్తాయి. పాత దేవాలయాలకు కొత్తగా స్తంభ, మంటపాలను నిర్మించి, ఇతర నిర్మాణాలను చేర్చి, పెద్దవిగా జేశారు. విజయనగరపు ప్రత్యేకత, కళ్యాణ మండప నిర్మాణం. దేవాలయానికి తూర్పు ద్వారం గుండా ప్రవేశించగా, ఎడం వైపునున్న విశాల ప్రాంగణంలో కళ్యాణ మండపం నిర్మించబడుతుండేది. ఈ కళ్యాణ మండపం వివిధ అలంకరణలతో శోభిస్తుండేది. దీనికి చుట్టూరా శిలా స్తంభాలు నిలబెట్టబడేవి. మధ్యలో ఎత్తైన వేదిక ఉండేది. ఆ వేదిక వైనే, సంవత్సరాని కొకసారి జరిగే ఉత్సవాల్లో దేవుణ్ణి, అమ్మవారిని పెట్టి పూజించేవారు. విజయనగర కాలం నాటి మరో వాస్తు విశేషం, వరుసలు వరుసలుగా పెట్టి, నిర్మించబడ్డ పెయ్యి స్తంభాల మంటపాలు. విజయనగర నిర్మాణ శైలి ప్రత్యేకత, లేక గొప్ప తనం

BRAOU

శిలాస్తంభ నిర్మాణం పైనను, వాటిని అమర్చిన విధానం పైనను, ఆధారపడుంది. సాధారణంగా, ఈ శిలా స్తంబాలు సమచతురస్రాకారపు అదిష్ఠానను కలిగి, దానిపై ఒక చతుర్భుజాకారపు పట్టికను, దానిపై తిరిగి చతుర్భుజాకారపు పట్టికను, ఆ పిదప ఊర్ధ్వ పద్మాలంకరణను, దానిపై స్తంభశీర్షాన్ని కలిగున్నాయి. ఈ మండపం లోని స్తంభాలపై జంతు అలంకారాలు, పుష్పాలంకారాలు, నర్తకి, నర్తక, మార్దంగ, వైణికాది శిల్పాలంకరణలను చూడవచ్చు.

ఆనాటి దేవాలయాలు దీర్ఘచతురస్రంగా కాని, సమచతురస్రంగా కాని, నిర్మింపబడి, ఐదు కక్ష్యలను కలిగున్నాయి. ఈ కక్ష్యల్లో బహిర్ ద్వారం, రంగ మండపం, అర్ధ మండపం, అంతరాళ మండపం, గర్భ గృహం అనేవి ఉన్నాయి. ఆనాటి దేవాలయాలు సాధారణంగా ఎంతో విశాలంగా ఉండేవి. ఇటుకలచే నిర్మించబడిన గర్భ గృహంపై విమానంను నిర్మించేవారు. బయట ద్వారం ఉపరితలంపై గోపురాలు నిర్మించబడ్డాయి. విజయనగర కాలం నాటి గోపురాలు ఎంతో ఎత్తైనవి. ఈ గోపురాలను రాయగోపురాలన్నారు. బాహ్య ద్వారం ఎంతో విశాలంగా వుండి, విశాలమైన ఆర్చిని కలిగున్నాయి. దానికి రెండు ప్రక్కల, పైన, క్రింద చిత్రాలు, శిల్పాలు ఉంచబడ్డాయి. దేవాలయం లోపల ముందుగా ధ్వజస్తంభం, ఆస్తంభం ముందు పద్మపత్ర అలంకరణతో బలి పీఠం ఉంటుంది. ధ్వజస్తంభం గుండ్రగా కాని, 8 భుజాలుగాని కలిసి ఉంటుంది. 8 భుజాలుగల ధ్వజస్తంభాన్ని, పెనుగొండ, లేపాక్షి మొదలైన చోట్ల చూడొచ్చు. మహామండపాన్నే రంగ మండపం లేదా ముఖ మండపమని పిల్చేవారు. ప్రతి మండపం లోను శిలాస్తంభాలున్నాయి. అవన్నీ కూడ ఇంతకు ముందు చెప్పుకున్నట్లుగా వివిధ అలంకరణలతో నిండి వున్నాయి. సర్వసాధారణంగా, రంగ మండపు పై కప్పు చిత్రాలతో నిండి ఉంటుంది. అర్ధ మంటపంలో, అంతరాళ మంటపంలో అంతరాళ మంటపంలో చిన్న చిన్న దేవతలు, దేవుళ్ళను, గోడలపై, స్తంభాల్లో, స్తంభాలపై చూస్తాం. గర్భగృహం ఏమాత్రమైన అలంకరణలు లేకుండా, బోసిగా ఉంటుంది. గర్భ గృహం పై భాగాన పరిణతి చెందిన తల విమానముంది. ఈ తల విమానంలో క్రింద నుండి పైకి అధిష్ఠానం, పట్టిక, తలం, శిల్పం, తలం, శిల్పం, పట్టిక ఉంటాయి. పైన కలశముంటుంది.

ఈ దేవాలయాల్లో ఉప మండపాలున్నాయి. ఈ ఉప మండపాలు తక్కువగా కాని, లేదా ఎక్కువగా కాని, ఉండొచ్చు. ఆగమ గ్రంథాలు వీటి నిర్మాణం గురించిన నియమాలను చెప్పలేదు. ఈ ఉప మండపాల్లో అష్ట దిక్పాలకులకు, నవ గ్రహాలకు, స్థానికుల ఇష్టదేవతలకు స్థానం కల్పించబడుతుండేది. బయట ప్రాకారానికి లోపలి వైపున అన్ని మూలల్లోను, మండపాలను నిర్మించారు. వాటిని వార మండపాలంటారు. లేపాక్షి లోని పాపవినాశేశ్వర స్వామి దేవాలయంలో, ఏడు వారాల పేరిట సువిశాలమైన మండపాలున్నాయి.

హంపి, పెనుగొండ, లేపాక్షి, తాడిపత్రి, కదిరి, కాంచీపురం, మదుర, తంజావూర్ మొదలైన ప్రాంతాల్లోగల దేవాలయాలన్నీ, విజయనగర శైలికి సంబంధించిన వాస్తు ప్రభావానికి లోనైనవే. ఆంధ్ర దేశం లోని అనంతపూర్ జిల్లా లోని గోరంట్ల; కడప జిల్లా లోని పుష్పగిరి, వొంటిమిట్ట, గండికోట, రాయచోటి; చిత్తూర్ జిల్లా లోని సోమపాలెం, నారాయణ వనం, నాగలాపురం, చంద్రగిరి మంగాపురం; కర్నూల్ జిల్లా లోని మార్కాపురం, అహోబిలం, శ్రీశైలాల్లో, పూర్తిగా విజయనగర శైలికి చెందిన దేవాలయాలున్నాయి. విజయనగర పాలకులు దక్షిణ భారతదేశం లోని ప్రాచీన, మధ్య యుగపు దేవాలయాలకు అదనంగా, మండపాలు, ప్రాకారాలు, గోపురాలను చేర్చారు. ఉదాహరణకు, కృష్ణదేవరాయలు చిదంబరం లోని దేవాలయానికి ఉత్తరం వైపు గోపురాన్ని; కాంచీపురం లోని


BRAOU

ఏకామ్రనాథ దేవాలయానికి బయట ప్రాంగణం లోని దక్షిణ గోపురాన్ని; కాళహస్తి దేవాలయానికి ఒక గోపురాన్ని నిర్మించాడు. తిరువణ్ణామలై, శ్రీరంగం, రామేశ్వరం, మదురై, శ్రీవిల్లిపుత్తూర్‌ల్లో, ఎత్తైన గోపురాలను నిర్మించారు. విజయనగర పాలకులు ఆంధ్ర దేశంలో తిరుమల, తిరుపతి, తిరుచానూర్, కాళహస్తి, అహోబిలం, శ్రీశైలం, తాడిపత్రి లోని విజయనగర కాలం నాటి దేవాలయ ప్రశస్తిని వి. ఏ. స్మిత్ గొప్పగా వర్ణించాడు. విజయనగర సామ్రాజ్య రాజధానైన హంపి లోని పంపాపతిస్వామి, చక్రతీర్థ కోదండస్వామి, హజార రామస్వామి, విఠల స్వామి, కృష్ణ దేవాలయాలు, ఆనాటి వాస్తు నిర్మాణానికి చక్కని ఉదాహరణలు. ఆ కాలం నాటి దేవాలయ ప్రాకారాలు, కోట గోడల వలే ఎత్తుగా ఉన్నాయి. ఉదాహరణకు, హంపి లోని హజార రామస్వామి దేవాలయపు ప్రాకారపు గోడలు 24 అడుగుల ఎత్తున నిర్మించబడ్డాయి. అదే విధంగా, హజార రామ దేవాలయపు విమానం ఎత్తు 50 అడుగులకు తక్కువగా ఉంది. వెల్లూర్ లోని దేవాలయం లోని కళ్యాణమండపం బహు సుందరమైందిగా కళా చరిత్రకారులచే గుర్తింపబడింది. విజయనగర వాస్తు నిర్మాణ శైలిని మదుర నాయక పాలకులు ప్రోత్సహించి, పోషించారు. శ్రీరంగం లోని రంగనాథ దేవాలయానికి, ఏడు ప్రాకారాలున్నాయి. వీటిలో బాహ్య ప్రాకారం చతురస్రాకారంగా 2880 అడుగులు, 2,475 అడుగుల పొడవు, వెడల్పుంది. శ్రీరంగం లోని బాహ్య ప్రాకారం లోని ప్రధాన ద్వారపు గోపురం అసంపూర్ణంగా ఉంది. అది పూర్తైతే, 300 అడుగుల ఎత్తున ఉండేది. ఈ దేవాలయం లోనే, 500 అడుగుల, 160 అడుగుల పొడవు, వెడల్పున్న వెయ్యి స్తంభాల కట్టడముంది. విజయనగర పాలకులే కాక, సామంతులు, ప్రభువులు కూడా కళా పోషణ చేశారు. వెమ్మసాని వంశం వారు తాడిపత్రిలో నిర్మించిన దేవాలయాలు, విజయనగర వాస్తు శైలికి అతి చక్కని ఉదాహరణలు. అదే విధంగా, వెనుగొండ విరూపణ్ణ అనే ఉద్యోగి, లేపాక్షిలో అందమైన శివాలయాన్ని నిర్మించాడు.

BRAOU

21.4.2 : లౌకిక నిర్మాణాలు

విజయనగర పాలకుల వాస్తు నిర్మాణ శైలికి దేవాలయాలే కాక, వారు నిర్మించిన దుర్గాలు, భవంతులు చక్కని నిదర్శనాలు. భవన విజయాన్ని 8 ఏనుగులు మోస్తునట్లుగా నిర్మించారు. అదే విధంగా, హంపి నగరంలో రాజప్రాసాదం దగ్గరగా నున్న 'కింగ్స్ ఆడియన్స్ హాల్', 'త్రోన్ ప్లాట్‌ఫారం' లేక 'హౌస్ ఆఫ్ విక్టరి', ఆనాటి లౌకిక భవంతులకు చక్కటి ఉదాహరణలు. ఈ భవనాల వాస్తు నిర్మాణ శైలిని నిశిత దృష్టితో పరిశీలిస్తే, విదేశీయ యాత్రికుల పొగడ్త అతిశయోక్తి కాదని స్పష్టమౌతుంది. ఈ భవనాలు ఎన్నో అంతస్తులతో, చక్కని శిల్పాలంకరణలతో, రాతితో నిర్మించబడ్డాయి. త్రోన్ ప్లాట్‌ఫారం మూడు అంచెలుగా చతురస్రాకారంలో నిర్మించబడింది. ఈ మూడు అంచెల ప్రక్కన, అందమైన శిల్పాలు చెక్కబడి వున్నాయి. విజయనగర వాస్తు నిర్మాణ శైలి ప్రాశస్త్యాన్ని తెలిపే ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. దీన్ని గురించి ప్రత్యేకంగా ఒక గ్రంథాన్నే రాయొచ్చు. విజయనగర వాస్తు శైలి గురించి ప్రముఖ చరిత్రకారుడు ఎ.యల్. బాషామ్ ఈ విధంగా అన్నారు: "For brilliancy of decorative imagination, the Vijayanagar style of architecture was never surpassed in Hindu India." ఇదే విధమైన అభిప్రాయాన్ని ప్రముఖ కళా చరిత్రకారులైన పెర్సి బ్రౌన్, ఫెర్గూసన్‌లు కూడా వెలిబుచ్చారు. ఫెర్గూసన్ అభిప్రాయంలో, శ్రీరంగం లోని శేషగిరి మండపంలో ఒక దానితో నొకటి దెబ్బలాడుకుంటున్న 9 అడుగుల ఎత్తు, ఎగురుతున్న గుఱ్ఱాల ప్రతిమలు, రాతిలో చెక్కినట్లుగాక, ఉక్కుతో తయారుచేయబడ్డవన్న భావాన్ని కలుగచేస్తాయన్నారు.



విఠలస్వామి ఆలయం, హంపి

BRAOU

21.4.3 : శిల్పం, ప్రతిమలు

నేలటూరి వెంకటరమణయ్య విజయనగర శిల్ప సంపద ఎంతో వుందని అంటూనే, దానిని గురించి ఇంత వరకు ఎక్కువ మంది పట్టించుకోలేదన్నారు. విజయనగర యుగం నాటి వాస్తు నిర్మాణాలు, ఆనాటి శిల్ప శైలి మనకు ఎంతో అనందాన్ని, గర్వాన్ని కలుగచేస్తాయి. విజయనగర శిల్పం అలంకారిక ప్రయోజనాన్ని దృష్టిలో నుంచుకొని రూపొందించబడింది. ఈ శిల్పాల్లోని అలంకరణలను నాలుగు విధాలుగా చెప్పొచ్చు. అవి: (1) పుష్ప, లత అలంకరణలు, (2) జంతు అలంకరణలు; (3) ఇతిహాస సంబంధమైన శిల్పాలు;(4) లౌకిక శిల్పాలు. ఆనాటి పుష్పలతాలంకరణల్లో ప్రధానంగా చోటు చేసుకొన్నది, పద్మం. విభిన్నమైన పద్మాలు చెక్కబడినాయి. అట్టి వానిలో షోడశ పద్మం కూడా వుంది. ఈ పద్మాలు, పద్మ పత్రాలు, స్తంభాల పైన, స్తంభ శీర్షాల పైన, కుడ్యాల పైన, అధిష్టానాల పైన, ఎక్కువగా చెక్కబడినాయి. ఈ పద్మాల్లో ఊర్ధ్వ, అధోపద్మాలున్నాయి. బలి పీఠం స్తంభ శీర్షాల్లో ఊర్ధ్వ పద్మాలు, అధిష్టానాల్లో అధఃపద్మాలు చెక్కబడ్డాయి. ఇవి ఎంతో సహజంగా ఉంటమేకాక, రేఖా చిత్రాలుగా చెక్కబడినాయి. ఇవికాక, త్రిభుజాలు, వృత్తాలు మొదలైనవి కనిపిస్తాయి. విజయనగర శిల్పాల్లో కనిపించే జంతువుల్లో ప్రధానమైనవి, ఏనుగు, గుఱ్ఱం, కోతి, సింహాలు. స్తంభాల అధిష్టానాలు వివిధ జంతు శీర్షాలను కలిగిఉండటం, ఈనాటి ప్రత్యేకత. మూంగాళ్ళపై నిల్చిన సింహాలు, ఏనుగులు, గుఱ్ఱాలుండటం, మనం గుర్తించుకోవాలి. ఇంకా తాబేలు, కోడి, నెమలి, వివిధ రకాలైన పక్షులు కూడా, శిల్పాల్లో చోటుచేసుకున్నాయి. ఇవన్నీ మహా మండపాల లోను, కుడ్యాల పైన కనిపిస్తాయి. ఈ జంతు అలంకరణలో సృజనాత్మకత ఎక్కువగా కనిపించదు; ఇవన్నీ హోయసాల కాలం నాటి జంతువుల, పక్షుల నకళ్ల వలె కనిపిస్తాయి. ఇతిహాసిక శిల్పాల్లో పురాణ, రామాయణ, భారత, భాగవత కథలు చోటుచేసుకున్నాయి. ఉదాహరణకు, కన్నప్ప కథ, చిరుతొండ నంబి కథ, సీతాకళ్యాణం మొదలైన ఘట్టాలు చిత్రీకరించబడినాయి. ఈ శిల్పాల్లో ద్విగుణాత్మకత (Two-Dimensional), త్రిగుణాత్మకత (Three-Dimensional) కన్పిస్తుంది. ఈ శిల్పాల్లోని పురుషులు ఆజానుబాహువులుగా, స్త్రీలు, సర్వాలంకరణ భూషితులు. ఈ రకమైన శిల్పాల్లో, తాండవ కృష్ణుడు ఎన్నో చోట్ల కన్పిస్తాడు. బహుశా, ఆనాటి వైష్ణవ మత ప్రాబల్యానికి ప్రతీకేమో. లౌకిక శిల్పాల్లో పేర్కొనదగినవి, మార్దంగికుల, వైణికుల, నట్టువరాండ్ర, యువతీయువకుల, గుఱ్ఱపు రౌతుల, యోధుల శిల్పాలు. ఈ శిల్పాల్లో సమకాలీనత బాగా ప్రతిబింబించబడింది. ఈ శిల్పాల వల్ల ఆనాటి క్రీడల గురించి తెలుసుకోగలం. అదే విధంగా, స్త్రీ, పురుషుల అంకరణల గురించి, ఆయుధాలు, కత్తులు, కాళ్ళు, బల్లేలు, శూలాల గురించి తెలుసుకోవచ్చు. అయితే, ఆశ్చర్యమైన విషయమేమిటంటే, ఈ శిల్పాల్లో శిరస్త్రాణం, కవచం కలిగిన యోధులు కనిపించకపోవటం. రోజు వాడుకొనే రోలు, రోకలితో పాటుగా, ఆనాటి కిరీటం కన్పిస్తుంది. నేలటూరి వెంకటరమణయ్య అభిప్రాయం ప్రకారం, హజారరామ దేవాలయం, త్రోన్ ప్లాట్ ఫారమ్, తాడిపత్రి, హంపి లోని దేవాలయాల్లోని శిల్ప సంపద అమూల్యమైంది; ఆనాటి శిల్పుల పనితనానికి, నేర్పరితనానికి మచ్చుతునక - ఫెర్గూసన్ తన **'The Indian And Eastern Architecture'** అన్న గ్రంధంలో ఆనాటి శిల్పాల గురించి ఈ విధంగా అన్నారు: 'Cut with exquisite sharpness and precision, in a fine close grained horned blade stone and produce an effect richer, and on the whole perhaps in better taste than anything else in this style", విజయనగర శిల్ప ప్రాశస్త్యానికి ముఖ్య నిదర్శనం, అనంతపురం జిల్లా లోని లేపాక్షి దేవాలయం. ఇక్కడున్న నంది విగ్రహం మన దేశం లోని అతి పెద్ద విగ్రహమంటారు. దేవాలయ మంటప 66 స్తంభాల మీద, అతి సుందరమైన శిల్పాలు చెక్కబడినాయి. మధ్య స్థంభం మీద గాయనీ గాయకుల నిలువెత్తు విగ్రహాలున్నాయి. ఆరాధ్య మండపం కప్ప లోపల శివుని వివిధ రూపాలను అతి అందంగా

BRAOU

చిత్రించారని, లాంగ్‌హార్స్ట్ పొగిడాడు. ఇక్కడ ఏకోణం నుండి చూచినా, తన వేపే చూస్తున్నట్లు కనుపించే ఒక అసాధారణ చిత్రముందని ఫ్రాన్సిస్ వేర్కొన్నారు. ఆనాటి దేవాలయాల్లోనే కాదు, మసీదు నిర్మాణంలో కూడా, గొప్ప వాస్తు శిల్ప సంపద కనుపిస్తూంది.

21.4.4 : చిత్రలేఖనం

విజయనగర యుగంలో వాస్తు నిర్మాణం, శిల్పంతోపాటుగా, చిత్రలేఖనం కూడా ప్రోత్సహింపబడింది. ఆదరించబడింది. ఆనాడు దేవాలయాల్లో, రాజుల, ప్రభువుల భవంతుల్లోని, ధనవంతులైన వారి ఇండ్ల గోడల మీద, ఇతిహాసిక చిత్రాలను చిత్రింప చేయుట పరిపాటిగా నుండేదని, విజయనగర కాలపు చిత్రలేఖన ప్రావీణ్యతకు నిదర్శనాలు. పాడైపోయిన స్థితిలో దేవాలయ కప్పల పైన, గోడల మీద కనుపిస్తాయని, నేలటూరు వెంకటరమణయ్య వ్రాశారు. త్రిపురాంతకం, సోమపాలెం, లేపాక్షి, హంపీల్లోని దేవాలయాల్లో, జైన రామాయణ, మహాభారత గాధలు చిత్రాలుగా చిత్రించబడ్డాయి. ఈ కాలం నాటి చిత్రలేఖన ప్రావీణ్యతకు, నేర్పరితనానికి ప్రధాన నిదర్శనంగా, లేపాక్షి దేవాలయ సదుపాయాన్ని తీసుకోవచ్చు. హంపీ లోని విరూపాక్ష దేవాలయపు మహామండప కుడ్యంపై మన ఇతిహాసాల్లోని గాధలు చిత్రించబడ్డాయి. కూర్చున్న త్రిమూర్తులు, వారి భార్యలు, విరూపాక్షునకు, పంపాంబకు వివాహం, త్రిపురుషసంహార, మదన విజయ చిత్రాలు ఆసక్తికరంగా ఉండగా, దశావతారాలు, రాముడు ధనస్సును విరచి సీతను వివాహమాడటం, ద్రౌపదీ స్వయంవరం, ఇత్యాది చిత్రాలు, చిత్రకారుని నేర్పును సూచిస్తాయి. విద్యారణ్య మునిని రాజోచిత సత్కారంతో, మేనాలో తీసుకువెళ్ళటం కూడా చిత్రించబడింది. ఆనెగొంది లోని ఉచయప్ప మఠం కుడ్యంపై చిత్రాలు, ఈయుగానికి చెందినవే. కంచి వరదరాజస్వామి దేవాలయం లోను, కంచి పట్టణానికి వెలుపల నున్న తిరుప్పరుత్తికునరం లోని జైన దేవాలయం లోని చిత్రాలు, చెప్పకోతగ్గవి. ఆనాడు ఫ్రెస్కోస్, (frscoes) శైలిలో చిత్రాలు రచించబడినట్లు టి. వి. మహాలింగం అభిప్రాయపడ్డారు. ఫ్రెస్కోస్ అంటే రంగులను సున్నపు నీటితో కలిపి, పొడిగా ఉన్న గోడ మీద కాని, కప్ప మీద కాని, చిత్రించడం, ఈనాటి చిత్రలేఖనం ప్రధానంగా మతపరమైంది. ఆనాటి చిత్రకారులు సహజసిద్ధమైన రసాలను, జిగురులను, నీటితో కాని, సున్నపు నీటితో కాని కలపటం ద్వారా, రంగులను తయారుచేశారు. ఆనాటి చిత్రకారులు ఎక్కువగా ఎఱుపు తెలుపు, ఆకుపచ్చ రంగులను, వివిధ ఛాయల్లో వాడారు. దక్కన్ లోని చిత్రకళను గురించి, విజయనగర యుగం నాటి చిత్రకళకు ముఖ్య ఆధారం, స్టెల్లా క్రెమ్రిష్ రచించిన **'A survey of painting in the Deccan'.**

21.4.5 : సంగీత, నృత్య కళలు

సంగీతం కూడా రాజాదరణ, ప్రజాదరణ పొందింది. విజయనగర యుగంలో రాఘవేంద్ర పూర్వీకుడైన కృష్ణ వద్ద, కృష్ణదేవరాయలు వీణ నేర్చుకొన్నాడన్న ఆధారముంది. **'సంగీత సూర్యోదయ'** గ్రంథకర్తైన లొల్ల ఆక్ష్మీనారాయణ, కృష్ణదేవరాయుల నాటి సంగీత విద్వాంసుల్లో మేటి. అచ్యుతరాయలు తన కుమార్తెకు, 'రామయామాత్య'నే సంగీత విద్వాంసుని వద్ద సంగీతాన్ని నేర్పించుటయేకాక, అతనిని కొండవీడులో ఉద్యోగిగా నియమించాడు. ఈ రామయామాత్యుడే **'స్వరమేళకళానిధి'**ని రచించాడు. అనేక రకాలైన సంగీత వాయిద్యాల గురించి సాహిత్యం వేర్కొంటూంది. అయితే, ఆనాడు బహుళ ప్రచారంలో ఉన్న సంగీత వాయిద్యం, వీణ.

విజయనగరం లోని నృత్య శాలను పోర్చుగీస్ వాడైన పేస్, ఎంతగానో పొగిడాడు. స్తంభాల మీద, గోడల మీద, నృత్య పద్ధతులను చిత్రించారని, అవి నృత్యం నేర్చుకునేవారికి సహాయపడుండా

BRAOU

చ్చునని చెప్పొచ్చు. అంతేకాదు, నృత్యాన్ని ఆదరించేందుకే ఆ భవనాన్ని కృష్ణదేవరాయలు నిర్మించి ఉంటాడని ఊహించొచ్చు. పల్లవి, అనుపల్లవి, చరణాలతో, కృతికి ఆకారమిచ్చిన అన్నమాచార్యుడు ఈ కాలం వాడే. ఈ కాలపు శాసనాల్లో సంగీతం, నాట్యం, చిత్రలేఖనం మొదలైన కళలకు సంబంధించిన విషయాలు కనుపించవు. విగ్రహ శిల్పాలకు సంబంధించిన విషయాలు కనపడుతాయి. ఆనాడు యక్షగానాలనే సంగీత రూపకాలు, బహుళ ప్రచారంలో వున్నాయి. కంకంటి పాపరాజు, కృష్ణదేవరాయలు తమ గ్రంథాల్లో ఆనాటి సంగీత విశేషాలను రచించారు.

విజయనగర యుగంలో డా. వేమూరు కామేశ్వర రావ్ అభిప్రాయం ప్రకారం, విష్ణువు ఇతర అవతారాలకు ప్రాముఖ్యం పెరిగి, ఒక్కొక్క అవతారానికి స్వయంప్రధాన దేవాలయాలను నిర్మించే పద్ధతి అమల్లోకి వచ్చింది. విఠోబ, లేక విఠల, మారుతి, లేదా హనుమాన్, గణపతి ఇత్యాది దేవతల ప్రాముఖ్యం, ఈ కాలంలో పెరిగింది. ప్రత్యేక దేవి ఆలయాన్ని విజయనగర యుగంలో తప్పనిసరిగా నిర్మించారు. కృష్ణదేవరాయలు 1513 లో గజపతులపై విజయానంతరం, బాలకృష్ణుని శిలా విగ్రహాన్ని కళింగ నుండి తీసుకువచ్చి, కొత్తగా కృష్ణ ఆలయాన్ని నిర్మించాడు. హజారరామ దేవాలయం లోని నాలుగు నల్ల రాతి స్తంభాలపై లక్ష్మీనారాయణ, ధన్వంతరి, కాళీయ మర్దన, కృష్ణ, బ్రహ్మ, వినాయక, వరాహమూర్తి, శిల్పాలున్నాయి. పెనుగొండలో, శివ, రామాలయాలుండగా, పుష్పగిరి లోని చెన్న కేశవ, సంతాన మల్లీశ్వరి, ఉమామహేశ్వర ఆలయాలున్నాయి. పుష్పగిరి లోని ఆలయ కుడ్యంపై వేణుగోపాల, వరాహ, నరసింహ, శిల్పాలున్నాయి. తాడిపత్రిలో రాఘులింగేశ్వర, వెంకటరమణ ఆలయాలు నిర్మించబడ్డాయి. వెంకటరమణ ఆలయాన్ని పెమ్మసాని నాయకులు నిర్మించారు. లేపాక్షిలో వీరభద్రునకు, పాపనాశేశ్వరునకు, రఘునాథునకు ఆలయాలు నిర్మించబడ్డాయి. ఒక స్తంభంపై భిక్షాటనమూర్తి చెక్కబడింది. జటప్రోలులో మదన గోపాలస్వామి ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత, మదనగోపాల విగ్రహముంది. ఏక శిలలో 6, 7 మీటర్ల ఎత్తున, యోగలక్ష్మీనరసింహ విగ్రహం హంపీలో ఉంది. దీనినే ఉగ్రనరసింహ విగ్రహమని కూడా అంటారు. ఈ విగ్రహాన్ని కృష్ణదేవరాయల కాలంలో తయారుచేశారు. ఈ విగ్రహం రాక్షసతంగడి యుద్ధానంతరం దోపిడిదార్ల ఆగ్రహానికి గురైంది. ఈ విగ్రహం 600 ముక్కలు దగ్గర్లో దొరికాయి. తొలి విజయనగర పాలకులు విరూపాక్ష, లేక శివ భక్తులు. కాని, సాళువ, తుళువ కాలంలో, వైష్ణవ మతాభిమానులైనారు. ఈ యుగంలో వైష్ణవ, శైవ సంబంధమైన ప్రతిమలు దేవాలయాల్లో పూజించబడ్డాయి. ఈ ప్రతిమలన్నీ హైందవ ప్రతిమా లక్షణంతో రూపొందించబడ్డాయి.

21.5 : సంగ్రహంగా

విజయనగర యుగంలో ఒక్క హైందవ మతానికే ప్రాధాన్యమివ్వలుంగాక, సర్వ మతాలకు తగినంత ఆదరణ చూపించారని, జైన దేవాలయాలు, మసీదులు, మహమ్మదీయ లౌకిక వాస్తునిర్మాణాలు, ఋజువు చేస్తున్నాయి. విజయనగర చక్రవర్తుల కాలంలో, పాలకులు తమ స్వమతాభిమానం ఏమైన వ్వటికి, ఆచరణయోగ్యమైన, ప్రయోజనాత్మకమైన సాంఘిక సమ్మేళానాన్ని దృష్టిలో నుంచుకొని, పరిపాలన సాగించి, తమ స్వప్రయోజనాలను కాక, సామాజిక శ్రేయస్సుకు ప్రాధాన్యమిచ్చారని, వారి మత విధానం, సాహిత్య కళాపోషణలు ఋజువు చేస్తున్నాయి. అది ఏ విధంగానంటే, హంపీ లోని కొన్ని రాజప్రాసాదాల నిర్మాణంలో, ఇరాని వాస్తు ప్రభావం కనుపిస్తుంది. కొన్ని భవనాల్లో హిందూ, ముస్లిం వాస్తు సంప్రదాయాల సమ్మేళనం కనపడుతుంది. 50 అడుగుల పొడవు, 60 అడుగుల లోతున్న రాణి స్నాన మందిరం, కమానులతో, ముస్లిం సంప్రదాయంతో నిర్మించబడింది. అదే విధంగా,

BRAOU

రెండంతస్తుల భవనమైన దివాన్ ఖానా, మహమ్మదీయ వాస్తు శాస్త్రం ప్రకారం నిర్మించబడింది. అలాగే, హజార రామాలయపు గోడల మీద, జైన తీర్థంకరుల విగ్రహాలు, వారి సమన్వయ దృష్టికి సంకేతాలు. సాహిత్య పోషణ విషయంలో కూడా, అన్ని భాషల వారిని ఆదరించారు; అన్ని మత శాఖలకు సమాన గౌరవాన్ని చూపించారు. విజయనగర పాలకులు విదేశీయ వాస్తు నిర్మాణ శైలిని కూడా ఆదరించారు.

21.6 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయుండి.

1. విజయనగర సామ్రాజ్య పాలకుల మత విధానాన్ని విశ్లేషించండి.
2. విజయనగర పాలకులు శైవ, వైష్ణవ మతాల ఎడల చూపిన ఆదరణను పరిశీలించండి.
3. విజయనగర పాలకుల సాహిత్య పోషణను, నాటి సాహిత్యాభివృద్ధిని, సోదాహరణంగా సమీక్షించండి.
4. అష్ట దిగ్గజాలు ఎవరు? వారి రచనలను తెల్పండి.
5. విజయనగర వాస్తు నిర్మాణ శైలిని, దాని అభివృద్ధిని, సోదాహరణంగా సమీక్షించండి.
6. విజయనగర కాలం నాటి శిల్ప, చిత్రలేఖనం, సంగీతం, దైవ ప్రతిమా లక్షణాల ప్రగతిని పేర్కొనండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయుండి.

1. విజయనగర పాలనలో శైవ, వైష్ణవేతర మతాలు పొందిన ఆదరణ ఎట్టిది?
2. విజయనగర యుగంలో శైవ మఠాలు నిర్వహించిన పాత్రను తెల్పండి.
3. విజయనగర యుగంలో వైష్ణవ మఠాలు నిర్వహించిన పాత్రను విశదీకరించండి.
4. దసరా ఉత్సవం గురించి విశ్లేషణాత్మకంగా రాయుండి.
5. సంగమ, తుళువ వంశస్థుల కాలం నాటి సంస్కృత భాషాభివృద్ధిని పరిగణించండి.
6. విజయనగర పాలకులు కన్నడ సాహిత్యాభివృద్ధికి చేసిన సేవ ఎట్టిది?
7. విజయనగర పాలకులు తమిళ సాహిత్యాభివృద్ధికి చేసిన సేవను తెల్పండి.
8. ప్రబంధమంటే ఏమిటి? ప్రబంధ రచనా ప్రగతిని పేర్కొనండి.
9. హంపీలోని వాస్తు నిర్మాణాల విశిష్టతను తెలియజేయుండి.
10. విజయనగర శిల్ప ప్రధాన లక్షణాలను సోదాహరణంగా వివరించండి.
11. విజయనగర చిత్రలేఖనాల ప్రధానాంశాలను విశదీకరించండి.

BRAOU

21.7 : ఉపయుక్త గ్రంథాలు

Bhandarkar, R.G. : **Vaishnavism, Saivism & Minor Religious Systems.**

Bhasham A.L. : **The Wonder that was India**

Burton, Stein : **Peasant, State & Society in Medieval South India.**

Do : **Vijayanagara,** Cambridge History of India series.

Brown Percy, & Ferguson J. : **Indian Architecture History of Indian and Eastern Architecture. 2 vols.** 1910, London.

Farquhar, J.N. : **An outline of the Religious Literature of India,** 1920, London.

Kameswara Rao, V. : **The Lepakshi Temple,** Tirupati, 1982.

Kramerish Stella : **A Survey of Painting in the Deccon**

Narasimha charya, R. : **History of Kannada Litarature,** Mysore, 1940.

Nilakanta Sastri, K.A. : **A History of South India,** Madras, 1963.

Sarojani, K. : 'The cult of Vitthobha in Vijayanagara' **JAHRS-XXXVII, part IV, Dr. NVR commemoration Volume, 1986-87**

Satyanarayana K. : **A Study of the History & Culture of the Andhras,** Delhi, 1975

Sewell, Robert : **A Forgotten Empire.**

Venkata Ramanayya, N. : **Studies in the third dynasty of Vijayanagara,** Madras, 1930

Vasundhara Fillizioh : **The Vijayanagara Empire.**

ఆరుద్ర : సమగ్ర ఆంధ్ర సాహిత్యం, సంపుటాలు

మల్లంపల్లి సోమశేఖరశర్మ (సం) : తెలుగు సంస్కృతి, చరిత్ర

గురజాడ శ్రీరామమూర్తి : కవి జీవితములు

హనుమంతరావ్, బి.యస్.యల్ : ఆంధ్రుల చరిత్ర

వెంకటరమణయ్య, నేలటూరి : విజయనగర చరిత్ర

వి. కామేశ్వరరావ్ : భారతీయ వాస్తు శిల్పం,తెలుగు అకాడమి.

కామేశ్వరరావ్, కె.యస్. : విజయనగర సామ్రాజ్యం

వెంగల్‌రాయ చెట్టి, కె. : ఆంధ్రప్రదేశ్ సాంఘిక, ఆర్థిక చరిత్ర

కొర్లపాటి శీరామమూర్తి : 'శ్రీకృష్ణదేవరాయలు నవరత్న కవులు - అష్టదిగ్గజ కవులు భారతి, 1988 డిసెంబర్ - 1989 జనవరి సంచికలు

రచయిత : డా. కె. యస్. కామేశ్వరరావు

BRAOU

భాగం-22 : విదేశీయుల రచనలు

విషయక్రమం

22.0 : లక్ష్యాలు

22.1 : పరిచయం

22.2 : విదేశీ యాత్రికుల రచనలు : తెలిపిన విశేషాలు

22.3 : నికోలోకాంటి, అబ్దుల్ రజాక్, పేస్, న్యూనిజ్‌ల విజయనగర నగర వర్ణన

22.4 : సంగ్రహంగా

22.5 : పరీక్ష నమూనా ప్రశ్నలు

22.6 : ఉపయుక్త గ్రంథాలు

22.0 : లక్ష్యాలు

విజయనగర సామ్రాజ్యం దాదాపు 300 సంవత్సరాలు 14వ, 15వ, 16వ, 17వ శతాబ్దాల్లో దక్షిణ భారతదేశ చరిత్ర లోనే కాక, యావద్భారత చరిత్ర లోను కీలక పాత్ర నిర్వహించింది. ఆ 300 సంవత్సరాల కాలంలో విజయనగర సామ్రాజ్యాన్ని అనేక మంది విదేశీ యాత్రికులు, రాయబారులు, వ్యాపారస్థులు సందర్శించి, ఆ కాలమందలి రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులను గురించి, తమ తమ గ్రంథాల్లో వివరించారు. అట్టి విదేశీ వ్రాతల్లో ముఖ్యమైనవి, నికోలో కాంటి, అబ్దుల్ రజాక్, పేస్, న్యూనిజ్ లవి. ఆ రచనలను ఆధారంగా చేసుకొని, ఆనాటి విజయనగర వర్ణన, రాజకీయ సాంస్కృతిక పరిస్థితులను తెలుసుకోవటమే, ఈ భాగాధ్యయన లక్ష్యం.

B.RAO.U

22.1 : పరిచయం

క్రీ.శ. 14వ శతాబ్ది మూడో పాదం నుండి, క్రీ.శ. 17వ శతాబ్ది పూర్వార్ధం వరకు విలసిల్లిన విజయనగర సామ్రాజ్యాన్ని అనేక మంది విదేశీ రాయబారులు, మత ప్రచారకులు, వ్యాపారస్థులు, యాత్రికులు సందర్శించారు. మొరాకో దేశస్థుడైన ఇబ్నుబతూతా దక్షిణ భారతదేశాన్ని సందర్శించి, తను చూచిన విశేషాలను **'రెహ్లా'**లో వివరించాడు. పారశీక చక్రవర్తి షారూక్ రాయబారిగా, రెండవ దేవరాయలు విజయనగరాన్ని పరిపాలిస్తున్నప్పుడు, పారశీక రాయబారైన అబ్దుల్ రజాక్ వచ్చాడు. ఈతడు విజయనగరంలో కొన్ని నెలలుండి, తన గ్రంధమైన **'మతి-ఉన్-స్-అదిన్'**లో విజయనగర కాలం నాటి వైభవాన్ని, ప్రజల స్థితిగతులను, ఆస్థాన మర్యాదలను, పండుగలను, ఇతర వివరాలను ఎంతో విపులంగా వివరించాడు. విజయనగర రాజ్యాన్ని సందర్శించిన మొట్టమొదటి ఐరోపా నివాసైన, ఇటలీ దేశస్థుడైన నికోలో కాంటి, అబ్దుల్ రజాక్ కన్నా ముందే వచ్చి, క్రీ.శ. 1420-21 ప్రాంతాల్లో విజయనగర సామ్రాజ్యంలో పర్యటించి, విజయనగర ఆస్థాన విశేషాలు, వేడుకలు మొదలైన వాటిని ఒక మతాధికారికి వివరించాడు. కాంటి అనంతరం, 1470 ప్రాంతాల్లో బహమనీ రాజ్యానికి రష్యా

వ్యాపారి నికిటిన్ వచ్చి, బీదర్‌లో చాలా కాలం నివసించాడు. నికిటిన్ కూడా తన గ్రంధంలో అక్కడక్కడ విజయనగర పరిణామాలను పేర్కొన్నాడు.

భారతదేశానికి వచ్చిన పోర్చుగీస్ మత ప్రచారకులు, వర్తకులు, ఉద్యోగుల్లో విజయనగరాన్ని గురించి వివరంగా వ్రాసిన వారిలో ముఖ్యులు, 1502-8 మధ్యలో వచ్చిన వార్థెమా, 1510-1522 నాటి పేస్, 1535-37 మధ్యలో వచ్చిన న్యూనిజ్‌లు. ఈ రచనలు ముఖ్యంగా కృష్ణదేవరాయల కాలం నాటి చరిత్ర నిర్మాణానికి ఎంతగానో తోడ్పడతాయి. న్యూనిజ్ తాను విన్న దాన్ని బట్టి, చూచిన దాన్ని బట్టి, విజయనగర రాజ్య స్థాపన నుండి అచ్యుతరాయల కాలం వరకున్న చరిత్రను రాయడంతో, అతని రచనే విజయనగర చరిత్రల్లో మొదటిదైంది. రాబర్ట్ సీవెల్ తాను రచించిన **'విస్మృత విజయనగర సామ్రాజ్యం'** (A Forgotten Empire) అన్న ఆంగ్ల గ్రంధంలో, 'క్రానికల్ ఆఫ్ ఫెర్నావో న్యూనిజ్' అనే పేరున ఆంగ్లంలో పుట 291 నుండి పుట 395 వరకు ముద్రించాడు. రాబర్ట్ సీవెల్ అభిప్రాయం ప్రకారం, ఈ రచన 1535-37 మధ్య రాయబడి వుండాలి. ఈ పైన పేర్కొన్న రాబర్ట్ సీవెల్ **'విస్మృత విజయనగర సామ్రాజ్యం'**లో 'నెరేటివ్ ఆఫ్ డామింగో పేస్' అన్న పేరుతో, పుట 236 నుండి, పుట 290 వరకు ఆంగ్లంలో ముద్రించబడింది. రాబర్ట్ సీవెల్ అభిప్రాయం ప్రకారం, ఇది క్రీ.శ. 1520-22 మధ్య రాయబడింది.

ఇంకా క్రీ.శ. 1616లో కొచ్చిన్ నుండి బరడాస్, తన లేఖలో క్రీ.శ. 1614 నుండి విజయనగర రాజ వంశంలో సింహాసనం కోసం జరిగిన వారసత్వ యుద్ధాన్ని చక్కగా విశ్లేషించి, విపులంగా వర్ణించాడు. దీనిని రాబర్ట్ సీవెల్ తన **'విస్మృత విజయనగర సామ్రాజ్యం'**లో 16వ అధ్యాయం క్రింద 'ది స్టోరి ఆఫ్ బరడాస్' అన్న పేరుతో, ఆంగ్లంలో పుట 222 నుండి పుట 234 వరకు రచించాడు. ఈ బరడాస్ లేఖను లిస్బన్ లోని నేషనల్ ఆర్కైవ్స్‌లో సెనార్ లోప్స్ బయటకు తీసి పంపగా, రాబర్ట్ సీవెల్ ఆంగ్లం లోకి అనువదించాడు. విజయనగర సామ్రాజ్య చరిత్రలో ముఖ్య ఘట్టమైన 1565 నాటి బన్నిహట్టి యుద్ధానంతరం, విజయనగరాన్ని సందర్శించిన సీజర్ ఫ్రెడరిక్ విజయనగర పతనం నాటి పరిస్థితులను వివరించాడు. కడపటి విజయనగర చరిత్ర నిర్మాణానికి 17వ శతాబ్ది నాటి పోర్చుగీస్ జెసూట్ పాదరీలైన రూచినో మొదలగు వారి లేఖలు, ఎంతగానో సహాయపడతాయి. విజయనగర సామ్రాజ్య కాలం నాటి రాజకీయ, సాంస్కృతిక చరిత్ర నిర్మాణానికి, నికోలో కాంటి, అబ్దుల్, రజాక్, పేస్, న్యూనిజ్‌ల రచనల గురించి మాత్రమే చెప్పుకోబోతున్నాం.

22.2 : విదేశీ యాత్రికుల రచనలు: తెలిపిన విశేషాలు

విజయనగర సామ్రాజ్యాన్ని వివిధ కాలాల్లో సందర్శించిన నికోలో కాంటి, అబ్దుల్ రజాక్, పేస్, న్యూనిజ్‌ల రచనలు, వారు విజయనగరాన్ని సందర్శించిన కాలం నాటి రాజకీయ ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులను తెలుసుకోడానికి ఉపయోగపడతాయన్నది నిర్వివాదాంశం. కాని, ఈ విదేశీయుల రచనల్లో పేర్కొన్న రాజకీయ, సాంస్కృతిక విషయాలను యధాతధంగా విశ్వసించి, చారిత్రక వాస్తవాలని అంగీకరించలేం. ఈ విదేశీ యాత్రికులు, మతాధికారులు, వ్యాపారస్థులు, రాయబారులు పేర్కొన్న విషయాలను, సమకాలీన శాసనాలు, సాహిత్యం తోను, మహమ్మదీయ రచనల తోను, పోల్చి చూచి, నిగ్గుతేల్చాల్సుంది. ఈ విదేశీయులు భారతీయ సంస్కృతి, పరిపాలనా విధానాలకు కొత్త వారగుట చేతను, వారు తమకు అర్థమైన రీతిలో, తాము విన్నవి, చూచినవి, పేర్కొన్నారన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. కనుక, కడు జాగ్రత్తతో, విదేశీయులు పేర్కొన్న రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక విశేషాలను, చారిత్రక వాస్తవాలుగా గుర్తించాలి.

BRAOU

పైన పేర్కొన్న విదేశీయుల్లో మొదటిగా, బరోపా నివాసైన, ఇటలీ దేశస్థుడైన నికోలో కాంటి 1420 -21లో విజయనగరాన్ని సందర్శించాడని, ఇంతకు ముందే చెప్పుకొన్నాం. ఈతడు విజయనగరాన్ని సంగమ వంశస్థుడైన మొదటి దేవరాయల పరిపాలనా కాలం చివర్లో సందర్శించాడు. మొదటి దేవరాయలు 1406-1422 మధ్య కాలంలో విజయనగర రాజ్యాన్ని పాలించాడు. ఈతడు విజయనగరాన్ని 'బిస్‌నెగలియా' అన్నాడు. మొదటి దేవరాయల కాలంలో విజయనగరంలో మాత్రమే 90 వేల మంది ఆయుధాలను ధరించగలిగిన వారున్నారని అన్నాడు. దీన్ని బట్టి, విజయనగర రాజ్యంలో 90 వేల మంది సైనికులున్నారని అనుకోవచ్చు. అంతేకాక, విజయనగర రాజ్యం లోని పురుషులు తమకు నచ్చిన ఎంత మందినైనా వివాహం చేసుకోవచ్చునని, భర్త మరణించినప్పుడు భార్యలందరూ సహగమనం చేస్తారన్నాడు. అంతేకాక, భారతదేశం లోని అందరు పాలకుల కన్నా, విజయనగర పాలకుడు బలవంతుడన్నాడు. విజయనగర పాలకునికి 12000 మంది భార్యలున్నారని, 4000 మంది పాలకుడు ఎక్కడకు వెడితే అక్కడకు నడిచి వెడతారని, వారందరు వంట గదిలో పనిచేస్తారన్నాడు. అంతమంది గుఱ్ఱాలపై స్వారి చేస్తూ వెడతారని అన్నాడు. మళ్ళీ ఆయనే, వీరిలో రెండు, లేక మూడు వేల మందిని తాను మరణించినప్పుడు తనతోపాటు మరణిస్తామని అంగీకరించినవారిని భార్యలుగా ఎన్నుకొన్నారన్నాడు. ఈ విషయాలను పరిశీలిస్తే, నికోలో కాంటి రచనలో వైవిధ్యం కనుపిస్తుంది. మనకు తెలిసినంతవరకు, బహు భార్యత్వం సర్వసాధారణం కాదు; అది పాలకులకు, సమాజం లోని కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితం. అలాగే, ఒక ప్రక్కన విజయనగర పాలకునకు 12000 మంది భార్యలున్నారంటూనే, అదే సందర్భంలో రెండు, లేక మూడు వేల మందిని తనతోపాటు సహగమనం చేసేందుకు సిద్ధపడితే వారిని భార్యలుగా స్వీకరిస్తానన్నాడు. ఈ రెండు, లేక మూడు వేల మంది పైదానికి ఎందుకు అంగీకరించారో తెలియదు కాని, అనాడు సతీసహగమన ఆచారం అమల్లో ఉండేదని తెలుస్తోంది.

సంగమ వంశస్థుడైన రెండవ దేవరాయలు, 1422-1446 మధ్య విజయనగర రాజ్యాన్ని పరిపాలిస్తున్నప్పుడు, పర్షియా రాయబారైన అబ్దుల్ రజాక్ 1442-43 లో విజయనగరాన్ని సందర్శించాడు. 1443 లో రెండవ దేవరాయలపై హత్యా ప్రయత్నం జరిగిందన్న విషయాన్ని పేర్కొన్నాడు. రెండవ దేవరాయల సోదరుడొకడు విందును ఏర్పాటుచేసి, అందులో రెండవ దేవరాయలను చంపుటకు కుట్ర పన్నాడు. అయితే, ఆ కుట్ర విషయం తెలియకుండానే, అనుకోని కారణాల చేత రెండవ దేవరాయలు విందుకు వెళ్ళక పోవటం చేత, ఆ కుట్ర విఫలమైంది. అయితే, కుట్ర బయట పడిన తర్వాత, ఆ కుట్రకు కారకులైన వారిని, మద్దతునిచ్చిన వారిని, అందరిని క్రూరంగా చంపివేశారు. ఈ విషయంలో అబ్దుల్ రజాక్ వేర్కొన్నది వాస్తవమే. అయితే, అబ్దుల్ రజాక్ విజయనగరంలో మూడు వందల రేవు పట్టణాలున్నాయన్నాడు. ఇది నమ్మదగిన చారిత్రక వాస్తవం కాదు. కాని, ఎక్కువగానే రేవు పట్టణాలున్నాయన్న విషయాన్ని అంగీకరించొచ్చు. ఈతడు కూడా విజయనగర పాలకుడు సర్వాధికారని అంటూ, అనాడు బ్రాహ్మణులకు సమాజంలో గౌరవం, ఉన్నత స్థానం ఇవ్వబడినాయని అన్నాడు. విజయనగర రక్షణకు తీసుకొన్న చర్యలు అద్భుతంగా ఉండేవని, విజయనగరంలో భవంతులు, నివాస గృహాలు ఎంతో వైభవోపేతంగా ఉండేవన్నాడు. అబ్దుల్ రజాక్ ఆనాటి మహార్నవమి ఉత్సవాల గురించి ఎంతగానో పొగిడాడు. అబ్దుల్ రజాక్ రాజ భవనానికి కుడి వైపున దివాన్ ఖానా ఉందన్నాడు. దానికి ఎదురుగుండా సమతలంగా ఉన్న చోట ఒక భవనం కలదని, దానిలో కూర్చుని వ్రాయసగాండ్రు లేఖలను వ్రాశారన్నాడు.

BRAOU

న్యూనిజ్ సాళువ నరసింహ విజయనగర రాజ్య ఆక్రమణ గురించి, ఈ విధంగా తెలిపాడు: "అతని సామంతులలో నరసింగడొకడు. ఈతడు ఏదో విధంగా రాజునకు బంధువు. రాజు ప్రవర్తనను గమనించి, ధనం కొల్లగొట్టుట చూచి, సామ్రాజ్య క్షేమానికి అతడు పనికిరాడని తలచి, రాజ్యాన్ని హస్తగతం చేసుకొన్నాడు" న్యూనిజ్ చెప్పిన విషయాలు నిజమేనని అంగీకరించొచ్చు. న్యూనిజ్, రెండవ విరూపాక్ష రాయలు బలహీనుడైన పాలకుడని, పరిపాలనకు అనర్హుడన్నాడు. ఆ రెండవ విరూపాక్ష రాయలే, బహుశా, న్యూనిజ్ పేర్కొన్న విజయనగర పాలకుడై వుంటాడు. ఎందుకనగా, సాళువ నరసింహుడు రెండవ విరూపాక్షుని కాలం లోనే గజపతులను ఓడించి, ఉదయగిరిని తిరిగి సంపాదించాడు. న్యూనిజ్ విజయనగర రాజ్యాన్ని 'నరసింగ రాజ్య' మన్నాడు. సంగమ వంశానికి చెందిన ప్రముఖ పాలకుడైన రెండవ దేవరాయల అనంతర కాలంలో, విజయనగర రాజ్యంలో తలెత్తిన రాజకీయ దుష్పరిణామాలను, సాళువ రాజ్య ఆక్రమణ వరకు జరిగిన విశేషాలను, న్యూనిజ్ వ్రాతల వల్ల తెలుసుకోవచ్చు. విజయనగర కాలానికి చెందిన మిగిలిన చారిత్రక ఆధారాల్లోని విశేషాలకు, న్యూనిజ్ వ్రాతలు సరిపోతాయి. అదే విధంగా, కృష్ణదేవరాయల చివరి కాలంలో జరిగిన రాజకీయ పరిణామాలను, న్యూనిజ్ వ్రాతల వల్ల తెలుసుకోవచ్చు. న్యూనిజ్, కృష్ణదేవరాయల కుమారుని పేరు వ్రాయలేదు. తురుష్కులపై విజయానంతర పరిణామాలను న్యూనిజ్ ఈ క్రింది విధంగా తెల్పాడు: "వృద్ధాప్యాన తాను విశ్రాంతి తీసుకోవాలని రాయల ఆశ; తన అనంతరం కుమారుడు సింహాసనం ఎక్కి పరిపాలించాలని, మరొక కాంక్ష. రెండు కోర్కెలను తీర్చుకొనుటకు, తాను బ్రతికుండగానే తన కుమారుని రాజుగా చేయుటకు సంకల్పించుకొన్నాడు. అప్పటికి ఆకుమారుని వయస్సు 6 సంవత్సరాలు మాత్రమే. కృష్ణదేవరాయల అనంతరం పరిస్థితులు ఎట్లుండునోయని అనుమానించి, పట్టాభిషేకం చేసి, అన్ని అధికారాలను కట్టబెట్టాడు. ఈ పట్టాభిషేక మహోత్సం కొన్ని నెలలు సాగింది. ఈ వేడుకల్లో చిన్న రాజునకు జబ్బు చేసి, చనిపోయాడు". మరొక చోట న్యూనిజ్, కృష్ణరాయని కుమారుని వయస్సు 18 నెలలు మాత్రమేనన్నాడు. దీన్ని బట్టి, న్యూనిజ్ వ్రాతల్లో వైరుధ్యం, కృష్ణదేవరాయల కొడుకు వయస్సు గురించి కన్పడుతూంది. న్యూనిజ్ ఇదంతయూ 1524లో జరిగిందన్నాడు. కృష్ణదేవరాయల కుమారుడు అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించడం వాస్తవం. ఆ బాలునికి తిమ్మరుసు విష ప్రయోగం చేసి, చంపించాడన్న అనుమానంతో, తిమ్మరుసును, అతని కుటుంబ సభ్యులను రాయలు బంధించాడు. తిమ్మరుసు కుమారుడైన తిమ్మ దండనాయకుడు బందిఖానా నుండి తప్పించుకొని, రాయలపై తిరుగుబాటు చేయగా, రాయలు కోపగించుకొని, బందిఖానాలోనున్న తిమ్మరుసు కళ్ళు పీకించాడని కూడా, న్యూనిజ్ వ్రాశాడు. కాని, ఈ విషయాలను నిరూపించగల ఇతర ఆధారాలు లేవు. ఒక అభిప్రాయం ప్రకారం, ఇదంతా పోర్చుగీస్ సలహాదారుల ప్రభావం వల్ల జరిగింది. కృష్ణదేవరాయల అనంతరం 1529-1542 మధ్య పాలించిన అచ్యుతరాయలు క్రూరుడని, దుష్టుడని, విషయలోలుడని, యుద్ధమంటే భయపడేవాడని, అతని పాలన ప్రజలకు గాని, ఉద్యోగులకు గాని, సంతృప్తికరంగా లేదని, న్యూనిజ్ రాశాడు. బహుశా, ఇందుక్కారణం, 1535 లో ఇబ్రహీం ఆదిల్ షా అనే బిజాపూర్ సుల్తాన్, ఈయనపై దండెత్తగా రాజీ చేసుకున్నాడు, యుద్ధం చేయలేదు. న్యూనిజ్ అభిప్రాయాలపై వాదోపవాదాలున్నాయి.

ఈ పైన పేర్కొన్న రాజకీయ విశేషాలకు సంబంధించినవే, విజయనగర పాలకుల న్యాయ విధానంపై విదేశీయుల రాతలు. అబ్దుల్ రజాక్ ఈ క్రింది విధంగా రాశాడు: రాజ భవనానికి కుడి వైపున దివాన్ ఖానా ఉంది. ఇదే యంత్రాంగ భవనం. ఇది చాలా పెద్దది. దీని నడుమ అనేక స్తంభాలు గల విశాలమైన చావిడి ఉంది. దన్నాయకుడందు కూర్చొని యుండును. దన్నాయకుని ఆసనం కొంచెం ఎత్తైన చోటుండును. దానికి క్రింది వైపున వేత్రధారులు వరుసగా నిల్చుందురు.

BRAOU

న్యాయాన్ని కోరువాడా వేత్ర ధారులను సమీపించి, నిల్చుని, న్యాయాధిపతికి కొంచెం 'యుడుగురు' నిచ్చు వాడుక కలదు. అటుపై దన్నాయకునకు సాష్టాంగ పడి, తన వ్యవహారాలను విన్నవించు కుంటారు. న్యాయాధిపతి దానిని సమగ్రంగా విని, తీర్పునిస్తాడు. ఆ తీర్పును ఎవరు కాదనరు. నిత్య వ్యవహారం ముగిసిన తర్వాత, దన్నాయకుడు చక్రవర్తిని కలుసుకొని, ఆనాటి తీర్పులను తెల్పుతాడు. దీని వలన, విజయనగర కాలంలో ధర్మాసనాలున్నాయని, న్యాయాధిపతులను ప్రత్యేకంగా నియమించారని చెప్పొచ్చు. ఇందుకు భిన్నంగా, న్యాయాన్ని తీర్పు నివ్వడంలో అధికారమంతా బ్రాహ్మణులదేనని, న్యూనిజ్ స్పష్టంగా చెప్పాడు. న్యూనిజ్ రాత ప్రకారం "ఎవరికైనను న్యాయం కావలసినప్పుడు, వాడు భూమిపై సాష్టాంగ పడును. రాజునకు స్వయంగా ఎవడైనను తన వ్యవహారాలను విన్నవించుకోవచ్చు. నృపాలుడు దానిని విని, తీర్పు నిచ్చును. ఆ తీర్పు నములు పర్చుటకు వాని వెంట తన సేవకుణ్ణి పంపును. ఎవడైనా, ఒకడు దారిలో దోచబడితే, ఆ ప్రాంత పాళెగానిదే బాధ్యత. ప్రతి దినం తలారి జంగమయ్య నాటి రాజధానిలో జరిగిన దొంగతనాల గురించి రాజునకు తెలుపును. కాని, ఇక్కడ అరుదుగా తప్ప దొంగతనాలు జరుగవు". ఈపై వానిని పోల్చి చూచినచో, రజాక్ ప్రకారం, న్యాయాధికారులు తీర్పు చెప్పగా, న్యూనిజ్ ప్రకారం చక్రవర్తి స్వయంగా తీర్పు చెప్పను. "ఈ రాజ్యంలో ఎక్కడ చూచినా దేవాలయాలే. విప్రులదే పలుకుబడి. పురోహితులు తీర్పరులు. ఇట్టి దేశాన న్యాయ పరిపాలన చక్కగా జరుగుటకు వీలులేదు. అందుచే, ప్రజలు నానాయాతనలు పడుచున్నా" రన్నాడు, న్యూనిజ్. ఇందుకు భిన్నంగా, "ఏదైనా వ్యవహారం వచ్చినప్పుడు, దానిని సమూలంగా ఆలోచించి, పరిష్కరించుటకు రాజులెంతయో శ్రమ తీసుకొనుచున్నా" రన్నాడు అబ్దుల్ రజాక్. ఇట్టి రాజులు దక్షిణ దేశాన లేరని, రజాక్ కితాబిచ్చాడు.

విదేశీయులు విజయనగర సైన్య సంపత్తిని చూచి, ఎంతో ఆశ్చర్యపడ్డారు. విజయనగర సైన్యం గురించి వికోలోకాంటి రాసింది, ఇంతకు ముందే చెప్పుకొన్నాం. అబ్దుల్ రజాక్ ప్రకారం, అక్కడ వేయి కంటే ఎక్కువ ఏనుగులున్నాయి. పదునొకండు లక్షల పదాతి దళముంది. వర్తెమా ప్రకారం 'రాజు చాలా బలవంతుడు. ఎప్పుడు అతని వద్ద 40 వేల గుఱ్ఱపు రౌతులుండెదరు. 400 ఏనుగులున్నాయి. ఒంటెలు కూడా ఉన్నా'యన్నాడు. 1514లో బార్బోసా ప్రకారం, విజయనగరంలో 900 ఏనుగులున్నాయి. 20 వేల గుఱ్ఱపు రౌతులున్నారు. ఒక లక్ష కాలిబంట్లున్నారు. న్యూనిజ్ రాతల ప్రకారం, కృష్ణరాయుల సైన్యంలో 7 లక్షల, 3 వేల కాలిబంట్లు, 32, 600 గుఱ్ఱపు రౌతులు, 55 మాతంగాలు, అనేక మంది వర్తకులు వెంటవచ్చేవారన్నాడు. 1514 నాటి బార్బోసా ప్రకారం, విజయనగర సైన్యంలో అనేక దేశాలకు చెందిన యోధులున్నారు. అతని రాత ప్రకారం, వారందరూ తమ జాతి, మత ధర్మాలకేమాత్రం బాధకేక, బ్రతుకుతున్నారు. పేస్, దసరా ఉత్సవంలో జరిగిన సైన్య విన్యాసాన్ని ఈ క్రింది విధంగా వర్ణించాడు: "ఆ సైన్యంలో తురుష్కులు కూడా ఉన్నారన్న విషయాన్ని మర్చిపోరాదు. అట్టి తురుష్కుల్లో కొందరు చిన్న ఈటెలను కలిగియున్నారు. మరికొందరు టర్కీ దేశపు ధనుస్సులను కలిగియున్నారు. కొందరు మందుగుండు సామాను చూచుకొనుచున్నారు. వీరందరూ నిగనిగలాడే కవచాలను ధరించారు. రాయలు రాయచూర్‌పై దండెత్తినప్పుడు, ముందు భాగానికి నిలిపి యుద్ధం చేశారు; వారు తురుష్కులే"నన్నాడు. పేస్, న్యూనిజ్‌లు విజయనగరం వారి పదాతి దళం గురించి రాయగా, రజాక్ ఏనుగు సైన్యం గురించి రాశాడు. విదేశీయుల రాతల పల్ల, విజయనగర సైన్య నిర్మాణం గురించి వివరంగా తెలుసుకోవచ్చు. విజయనగర సైనికులకు 4 నెలల కొకసారి జీతాలిచ్చేవారని, రజాక్ రాశాడు. అయితే, సంవత్సరానికొక సారిచ్చే వారని, పేస్ అన్నాడు. జీతాలిచ్చునప్పుడు సైనికుల వివరాలన్నీ రాసుకొని, జీతాలిచ్చేవారని, బార్బోసా అన్నాడు.

BRAOU

దండయాత్రల్లో విజయనగర రాజుల సైనిక శిబిరాలను గూర్చి, ఎన్నో విషయాలను న్యూనిజ్ తెల్పాడు. రాయచూర్ పైకి కృష్ణరాయలు దండెత్తినపుడు, అతడు ఏర్పాటు చేసిన స్కంధావారం గురించి, న్యూనిజ్ ఎంతగానో వర్ణించాడు. రాయల గుడారం చుట్టూ బ్రహ్మాండమైన ముండ్ల కంచె వుంది. లోనికి వెళ్ళుటకు ఒకే దారి. ఈ కంచె లోపల ఒక బ్రాహ్మణుడుంటాడు. అతడే రాజ పురోహితుడు. ఆ కంచెకు బయట, రాయల అంగరక్షకులు ప్రతి పగలు, రాత్రి నియమిత స్థానాల్లో నుండి రాజును రక్షిస్తూ ఉండేవారు. సైనికుల కవసరమైన అన్ని వస్తువులను అమ్మే అంగళ్ళు ఉండేవన్నాడు. ఇంకా శిబిరం వద్దనున్న రజకులకు, లెఖ్కలేదు. 20 వేల గణికలున్నారు. 50,000 మంది గూఢచారులున్నారు. కృష్ణదేవరాయలు గజపతుల ఎడల చూపిన ఉదారాన్ని క్రింది విధంగా పేర్కొన్నాడు, న్యూనిజ్: "గజపతి సమీపిస్తున్న వార్త రాయల చెవుల బడగా, వెంటనే కొండవీటి ముట్టడి నాపి, గజపతి కెదురుగా వెళ్ళాడు. నదికి ఇవతలి వైపున రాయల సైన్యం, అవతలి ప్రక్కన గజపతి సైన్యం. నదిని దాటేందుకు గజపతి పడుతున్న అవస్థను చూచి, ఈ క్రింది విధంగా కబురు పంపాడు: మీకు యుద్ధం చేయవలెనన్న కోరిక ఉన్నచో, నేను నదీ తీరం నుండి నాస్కంధావారాన్ని పది మైళ్ళ వెనుకకు తీసుకుపోదును; మీరు నిరాటంకంగా నదిని దాటవచ్చునన్నాడు. అయినా, యుద్ధం జరిగింది. ఆయుద్ధంలో గజపతి ఓడిపోయాడు. గజపతి భార్య బందీగా చిక్కింది. కాని, సకల రాజమర్యాదలతో ఆమె తిరిగి అప్పగించబడింది. ఈ విధంగా విజయనగర పాలకుల ఔదార్యాన్ని, సైనికుల ధైర్యసాహసాలను, వ్యూహ రచనా విధానాన్ని, విదేశీ యాత్రికులు వర్ణించారు.

దసరా పండుగను విజయనగర పాలకులు అతి ఉత్సాహంతో నవ రాత్రులు జరిపేవారని, ఇంతకు ముందే చెప్పకున్నాం. ఆ ఉత్సవ సందర్భంలో, విజయనగర పాలకులు తమ సైన్యాన్ని సమీక్షించే వారని, ఇంతకు ముందే చెప్పకున్నాం. ఆ సైన్య పర్యావలోకనం గురించి, కృష్ణదేవరాయల కాలం నాటి విదేశీయ సందర్శకుడు పేస్, ఈ క్రింది విధంగా వివరించాడు: "ఈ పండుగలు గడచిన తర్వాత రాజు తన సైన్యాన్ని ఒకసారి చూచును. రాజధానికి కొన్ని మైళ్ళ దూరాన చక్రవర్తి తన గుడారాన్ని నిర్మించుటకు ఆజ్ఞాపించును. ఈ గుడారమంతయూ, మక్కా నుండి దిగుమతైన సిల్క్ బట్టలతో తయారు చేయుదురు. అందులో దసరా ఉత్సవానికి కారణభూతమైన దేవి మూర్తి విగ్రహ ముంచుదురు. ఈ గుడారాల నుండి తమ తమ అధికార సంపత్తి ప్రకారంగా, సైనికాధికారులు తమ సైన్యాన్ని కొన్ని చోట్ల వర్తులాకారంగా, మరికొన్ని చోట్ల చతురస్రాకారంగా నుంచోపెట్టుదురు. కాలిబంట్లు గుఱ్ఱపు దళానికి ముందుండును. ఏనుగులు ఆ వెనుక నిల్చును. రాజ వీధిలో కూడా సైనికులు నిల్చియుందురు.

రాజు తన భవనం నుండి బంగారు నగలతో, పట్టు బట్టలతో అలంకరించబడిన గుఱ్ఱంపై బయల్దేరును. ఆ పాలకుని వెంట బంగారం, వజ్ర వైడూర్యాలతో కూడిన రెండు తెల్లని ఛత్రములొచ్చును. వాటిని ఉత్సవ సమయం లోనే వాడుదురు. రాజుతోపాటు బంధువర్గం బయల్దేరి వచ్చును. ఆ వైభవాన్ని వర్ణించుటకు సాధ్యం కాదు. ఒక వేళ వర్ణించినా, విన్నవారు నమ్ముట కష్టం.

సైనికుల చేతి లోని ఆయుధాలు తళతళ మెరయును. ఆ సైనికుల వైభవానికి నేను దిగ్భ్రాంతుడనై, మూర్ఛబడిపోయితిని. ఆ రాజ్యాన సంపత్తి యంతటిది. రాజునకు ఒక ప్రక్కన సర్వాభరణాలతో అలంకరించిన పల్లకి నడచును. ఆ పల్లకిలో అదే దేవతా మూర్తి విగ్రహముండును. ఆ సమయాన పాలకుడు తనకు రెండు ప్రక్కల నున్న సైన్యాన్ని సర్వావలోకనం చేయును. పాలకుడు వెళ్ళి పోయిన అనంతరం, సైన్యం కదలును. నాకు అది ఒక దివ్య స్వప్నం వలే కనుపించింది."

B.RAO.U

న్యూనిజ్ అచ్యుతరాయల కాలం నాటి నవరాత్రి ఉత్సవం నాటి సంఘటనను ఈ విధంగా వర్ణించాడు: "తొమ్మిది దినాల పండుగలు గడచినవి. రాజు గుఱ్ఱం పై నెక్కి, సైన్యాన్ని సమీక్షింప సాగాడు. పాలకుడు సైన్యాన్ని సమీక్షిస్తూ, కొన్ని మైళ్ళ వెళ్ళి, ఆపై గుఱ్ఱం దిగి, ధనుస్సును బట్టి, 3 బాణాలను వదిలాడు. వానిలో ఒకటి ఆదిల్‌షా నుద్దేశించి; రెండవది గోల్కొండ కుతుబ్‌షా నుద్దేశించి; మూడవది పోర్చుగీస్ వారి పైకి నెక్కుపెట్ట బడినాయి. ఈ మూడింటిని చక్రవర్తి మూడు దిక్కుల్లో వదిలాడు. ఏ బాణం ఎక్కువ దూరానికి పోతుందో, అట్టి రాజుపై అతడా సంవత్సరం దండెత్తుతాడు. ఆనాడు రాజు, రాజ బంధువులు, ఉపవాసముందురు" పేస్ వర్ణనకు, న్యూనిజ్ వివరణకు, తేడా గమనించగలం. ఈ విధంగా కొంత వాస్తవం, కొంత అతిశయోక్తి వీరి వర్ణనల్లో కనుపిస్తాయి.

కృష్ణరాయల రూపం, ప్రాతఃదిన చర్య గురించి, ఈ క్రింది విధంగా పేస్ తెలిపాడు: 'రాయలు అంత పొడుగరి, అంత పొట్టిగా నుండక, సామాన్యమైన ఎత్తుగలవాడై, చక్కని ముఖ వర్చస్సుతో, సుందరమైన ఆకారాన్ని, దృఢమైన శరీరాన్ని కలిగియున్నాడు. ముఖంపై స్ఫోటకం మచ్చలు కలవు. కాని, అవి ముఖానికి ఎట్టి వికారాన్ని కలిగించలేదు. అతని ముఖం చూచిన ఎవరికైనను పూజింపవలెనన్న భావం కలుగును. కృష్ణదేవరాయలు ప్రొద్దున్నే లేచి, సోలెడు నువ్వుల నూనె త్రాగి, శరీరమంతా పట్టించుకొని, చిన్న మొలబట్ట కట్టుకొని, వ్యాయామం చేయును; గదా యుద్ధం, కత్తి సాము, మల్లునితో కుస్తీ పట్టి, గుఱ్ఱపు స్వారి చేసి, తనకు నచ్చిన బ్రాహ్మణుని సాయంతో స్నానం చేసి, రాజ ప్రాసాదం లోపల మున్న దేవాలయంలో పూజ చేసి, అక్కడి నుండి సభా భవనానికి వెళ్ళి, రాజ వ్యవహారాల గురించి, తనకు విశ్వాసపాత్రులైన రాజకీయ వేత్తలతో ముచ్చటించెడివాడు". బహుశా, ఈ వర్ణన అందరి పాలకులకు వర్తించొచ్చు.

నికోలో కాంటి విజయనగర సామ్రాజ్యంలో కాలుప నీటి సహాయంతో చెరకు, వరిని, పండించేవారని, జన సాంద్రత హెచ్చని పేర్కొన్నాడు. విజయనగరానికి ఉత్తరం వైపున కాలుమోపలేని కొండలోయల్లో రత్నాలు పడి దొర్లుతుంటాయని విన్నానన్నాడు. ఆ లోయలోకి మాంసపు ముద్దలను విసిరి, వానిని తినడం కోసం వైకి తెచ్చుకున్న గద్దల్ని, రాబందుల్ని తరిమేసి, ఆ మాంసపు ముద్దలకు అంటుకొన్న రత్నాలను ఏరుకుతెచ్చుకొనేవారని, రాశాడు. అనాడు బానిసలున్నారన్నాడు. ఋణం చేసినవాడు, అప్పు తీర్చలేకపోతే, అప్పు ఇచ్చినవాడి ఆస్తేనని కూడా రాశాడు.

అబ్దుల్ రజాక్ విజయనగర సామ్రాజ్య భూభాగం అతి సారవంతమైందని, అధిక ఉత్పత్తుల ఫలితంగా, వర్తకవాణిజ్యాలు బాగా జరిగాయని, దేశం సంపన్నమైందని, చక్రవర్తి కోశాగారం లోని గదుల్లో బంగారపు ముద్దలు గదుల నిండుగా ఉన్నాయన్నాడు. విజయనగర పాలకుని రత్నాలతో నిండివున్న సింహాసనం, బంగారంతో తయారు చేయబడిందని, ఆపనితనం ప్రపంచంలో మరెక్కడా చూడలేమన్నాడు. ఆనాటి రాజమందిరం గోడలకు, కప్పుకు అరచేతి మందమున్న బంగారపు రేకు తాపడం చేసి, రత్నాలను పొదిగారన్నాడు. రెండవ దేవరాయల కాలం నాటి ఐశ్వర్యం, వైభోగాన్ని చూచి, అబ్దుల్ రజాక్ అమిత ఆశ్చర్యపడ్డాడు.

1505 - 1509 మధ్య కాలంలో విజయనగరాన్ని ఇటలీకి చెందిన వార్థెమా సందర్శించాడు. ఈతడు కూడ రాజు గారి గుఱ్ఱాలకు దిగ వేసిన నగల విలువ, తన దేశం లోని నగరాల విలువ కన్నా చాలా ఎక్కువన్నాడు. అయితే, సామాన్య ప్రజానీకం చిన్న అంగోస్త్రాన్ని చుట్టుకొని, ఇంచుమించు దిగంబరంగా ఉంటారన్నాడు. అదే కాలంలో 1504-1514 మధ్య కాలంలో విజయ

BRAOU

నగరంలో నున్న పోర్చుగీస్ యాత్రికుడు బార్బోసా, విజయనగరం అధిక ధనవంతమూ, జనసాంద్రత ఎక్కువగా ఉన్నదన్నాడు. ఈతడు కూడ పాలకవర్గం, ఉద్యోగులు, సర్దార్లు అందమైన పెద్ద పెద్ద భవంతుల్లో నివసించారని, సామాన్య ప్రజానీకం ఇళ్ళు ఆకులతో నేసినవన్నాడు. విజయనగర వీధుల్లో అన్ని మతాలకు, అన్ని ప్రాంతాలకు చెందిన మనుషులు తిరుగుతుంటారన్నాడు. నగరంలో వర్తకం బ్రహ్మాండంగా సాగుతుందన్నాడు.

పేస్, ఆనాటి మార్కెట్లు సరకులతో నిండి వున్నాయని, సరకులను, ఎడ్ల బండ్లలో తెచ్చేవారని, ఆ ఎడ్ల బండ్లు ఎక్కువగా నుండుట చేత, మార్కెట్లలో మనుషులు తిరగడమే కష్టమన్నాడు. అంతేకాక, అక్కడ దొరకని వస్తువు లేదన్నాడు. ఇతడు కూడా దేశం సారవంతమైందని, వ్యవసాయం బాగా జరుగుతుండేదని, పశు సంపద సమృద్ధిగా నుండేదని, నగరం బయట పనస, మామిడి, నిమ్మ, నారింజ తోటలు నిండివున్నాయన్నారు. అంతేకాక, విజయనగర పాలకులు ఎన్నో సంవత్సరాల నుండి సంపదను దాస్తూవచ్చారన్నాడు. విజయనగర పాలకులకు ఒక సంప్రదాయముందన్నారు. ఆ సంప్రదాయం ఏమిటంటే, ఎవరైనా పాలకుడు మరణిస్తే, అతని కోశాగారానికి సీలు వేసేవారని, కొత్త రాజు మళ్ళీ మూతనంగా సంపదను ప్రోగుచేసేవారన్నాడు. కృష్ణదేవరాయలు కూడా ఆ విధంగానే సంపదను ప్రోగుచేశాడన్నాడు. ఆ విధంగా చేయడం వల్ల, విజయనగర సామ్రాజ్య సంపదకు కొదువ లేదు. రాక్షసతంగడి, లేదా బన్నిహట్టి యుద్ధానంతరం తిరుమల రాయలు 550 ఏనుగుల మీద బంగారం, నగలు, రత్నాలు పెనుగొండకు తరలించారన్న సంప్రదాయముంది. కాబట్టి, పేస్ వర్ణన సరైనదేనని చెప్పొచ్చు.

అత్యుతరాయల కాలంలో విజయనగరాన్ని సందర్శించిన న్యూనిజ్ కూడా, విజయనగరం, భాగ్య వంతమైన, భోగలాలసమైందని వర్ణించాడు. ఈతని వర్ణన ప్రకారం, విజయనగర పాలకులకు కొన్ని క్రూరమైన అలవాట్లున్నాయన్నాడు. అట్టే వాటిలో భాగంగానే, వినోదానికి ఎవరినైనా ఏనుగు కాళ్ళ క్రింద పడవేసి, తొక్కించేయడం, చంపి వేయడం చేసేవారని, పెద్ద పెద్ద బండలను భుజానికి ఎత్తించి, రోడ్డు మీద గంటలు గంటలు నిలబెట్టి, ఆనందించేవారన్నాడు. ఆనాటి అమరనాయక విధానం ఫలితంగా, బలవంతులైన భూస్వాముల ఆగడాలకు సామాన్య ప్రజానీకం విపరీతమైన కష్టాలకు గురైనారన్నాడు. ప్రభుత్వోద్యోగుల్లో లంచగొండితనం విస్తారంగా ఉందన్నాడు. తమకు లాభం ఉంటే తప్ప, ఏపని చేసేవారు కాదన్నాడు. రాక్షసతంగడి, లేదా బన్నిహట్టి యుద్ధానంతరం విజయనగరాన్ని సందర్శించిన పెనిస్ యాత్రికుడు సీజర్ ఫ్రెడరిక్, 1584-1585 మధ్య కాలంలో వచ్చిన ఇటాలియన్ యాత్రికుడు ఫిలిప్ స్పాసెట్టి కూడా, విజయనగర సంపదను, వైభవాన్ని ఎంతగానో పొగిడారు.

పైన పేర్కొన్న విదేశీ యాత్రికులు విజయనగర పాలకులు తమను ఎంతో గౌరవ, మర్యాదలతో చూచారన్నారు. ఇంతకు ముందే విజయనగర కాలంలో స్త్రీని భోగ వస్తువుగా చూచారని చదువుకున్నాం. బహుశా, అందువల్లనేమో, రెండవ దేవరాయలకు భార్యలు, ఉంపుడు కత్తెలు కలసి, 700 మందని అబ్దుల్ రజాక్ చెప్పగా, పేస్ కృష్ణదేవరాయలకు 12 మంది భార్యలు, అందులో ముగ్గురు పట్టపు రాణులు, అంతఃపురంలో 12000 మంది స్త్రీలున్నారన్నాడు. న్యూనిజ్ అచ్యుతరాయలకు 500 మంది భార్యలు, అంత మంది ఉంపుడుకత్తెలున్నారన్నాడు.

బార్బోసా అభిప్రాయం ప్రకారం, కృష్ణదేవరాయల రాజ్యంలో ప్రతొక్కరు తమ తమ మత సంప్రదాయాలను పాటిస్తూ, జీవించొచ్చు. ఎవ్వరూ ఎవరిని ప్రశ్నించరు. ఇబ్బంది కలిగించరు. విజయనగర పాలకులు చూపించిన మత సహనానికి, బార్బోసా మాటలు ఒక నిదర్శనం. విజయనగర సామ్రాజ్యంలో

BRAOU

వర్ణాశ్రమ ధర్మం ప్రకారంగా, కుల వృత్తులు నిర్వహించబడలేదు. ఆనాటి బ్రాహ్మణులు పురోహితులుగా, ఉద్యోగులుగా, వర్తకులుగా, వంశపారంపర్య భూస్వాములుగా వృత్తులమ చేపట్టినట్లు, పేస్ రాశాడు. న్యూనిజ్ కూడా బ్రాహ్మణులను నాల్గు తరగతులుగా విభజిస్తూనే, వారిని రాజ పురోహితులు, వర్తకులు, కన్నడిగులు, భూస్వాములుగా విభజించాడు. న్యూనిజ్ బ్రాహ్మణులు వ్యాపారాలను చేసుకొనేవారని, నిజాయితీతో, నిశితమైన తెలివితేటలతో, ప్రతిభ కలవారని, లెక్కలను తయారుచేయటంలో నిపుణులని, వీరు నిర్వహించే బాధ్యతల వలననే, రాజ్యం నడుస్తుందన్నాడు. ఇందుకు భిన్నంగా బార్బోసా, బ్రాహ్మణులు వట్టి తిండిపోతులని, తినడం తప్ప మరే పని లేదన్నాడు. ఇంకా ఇలా అన్నాడు; వారికి ఎంతో స్వేచ్ఛ, సౌకర్యాలున్నాయి. ఏ నేరం చేసినా వారిని చంపరు. పాలకుల, సామంతుల, ఉద్యోగుల దానధర్మాలమీద బ్రతుకుతున్నారు. బ్రాహ్మణుల్లో రాజ పురోహితులకు ప్రజల్లో ఎట్టి గౌరవం లేదని, వారంత నీచులు లేరన్నాడు, న్యూనిజ్. కృష్ణదేవరాయలు కూడా ఆముక్తమాల్యదలో బ్రాహ్మణులు డబ్బు కోసం ఎంత నీచమైన పనైనా చేస్తారని అసహ్యించుకుంటూ రాశాడు. వైశ్యుల ప్రధాన వృత్తి, వర్తకమని, ఖరీదుల్ని ఇష్టం వచ్చినప్పడల్లా పెచ్చిస్తూ, తగ్గిస్తూంటారని, వడ్డీ వ్యాపారం చేస్తారని, లాభం లేకుండా అన్నగారు తమ్ముడికుకూడా అప్పివ్వడని, బార్బోసా రాశాడు. అంతేకాక, వైశ్యులు తమ వ్యవహారాలమ తామే చక్క పెట్టుకొనేవారని, తమలో తాము సర్దుబాటు చేసుకొనేవారని, వారి తీర్పులకు పాలకుడు కూడా తృప్తి పడేవాడన్నాడు, బార్బోసా. లంచాలివ్వటం, పుచ్చుకోవటం సర్వసాధారణమని, న్యూనిజ్ వ్రాశాడు.

దసరా ఉత్సవాలు జరిగే భవన సముదాయాన్ని విదేశీయులు ఎంతగానో మెచ్చుకున్నారు. ఆ భవనం చుట్టూ రాజు, రాణి నాట్య పోటీలను చూస్తుండటం, కోతుల గంతులు, నేట, అలంకారం చేసుకుంటున్న, నృత్యం చేస్తున్న స్త్రీలు, విదేశీ రాయబారులను రాజు ఆహ్వానించడం వంటివి, అత్యంత వాస్తవంగా చెక్కబడ్డాయని, పేస్ రాశాడు. హజారా రామ దేవాలయంలో అడుగు వరసలో బారులు తీసి నడుస్తున్న ఏనుగులు, గుఱ్ఱాలు, కాలిబంట్లు, ఒంటెలను చెక్కగా, పై వరసలో నృత్యం చేస్కున్న భంగిమలో స్త్రీల విగ్రహాలను చెక్కారు. విజయనగరం లోని నృత్యశాలలను, పేస్ ఎంతో వివరంగా వర్ణించాడు. స్తంభాల మీద, గోడల మీద, నాట్య విన్యాసాలు, నాట్య భంగిమలు మలచబడ్డాయని, నృత్యం నేర్చుకొనేవారికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని, ఆ చిత్రాలు ఎంతో అర్థమయ్యేటట్లున్నాయని, పేస్ వివరించాడు. కృష్ణరాయలకు ఎన్నో రకాల సంగీత వాయిద్యాలతో పరిచయముందని, పేర్కొన్నాడు. పైన పేర్కొన్న విధంగా, విదేశీయులు విజయనగర సామ్రాజ్య మందలి రాజకీయ, సాంస్కృతిక విశేషాలను వివరించారు. ఈ విదేశీయుల రాతల్లో కొంత వాస్తవికత, కొంత అతిశయోక్తి ఉన్నాయి.

22.3 : నికోలో కాంటి, అబ్దుల్ రజాక్, పేస్, న్యూనిజ్‌ల విజయనగర నగర వర్ణన

విజయనగరానికి వివిధ రకాలైన పేర్లున్నాయి. విద్యానగరమని, విద్యయని, ఆనెగొంది, కుంజరకోన, హోసపట్టణం, విరూపాక్ష పట్నం, హస్తినావతి, పంపి యని పిలువబడింది. శాసనాల్లో ఈ నగరాన్ని విద్యానగరమన్నారు. విదేశీయ రాయబార్లు ఈ పేరును అనేక విధాలుగా పేర్కొన్నారు. బిస్నగ, బిజ్నగర్, బీజినుగ్గార్, బీచ్‌నగర్, బిజ్‌నెగెలియా అనునవి వారు పెట్టిన పేర్లు. బార్బోసా దీనినే నరసింగరాజ్యమన్నాడు.

BRAOU

విజయనగరాన్ని సందర్శించిన మొట్టమొదటి ఐరోపీయ దేశానికి చెందిన ఇటలీ నివాసైన నికోలో కాంటి. ఈతణ్ణి 1420 లో ఒకటవ దేవరాయలు గౌరవించాడు. నికోలో కాంటి విజయనగరం చుట్టుకొలత 60 మైళ్ళుందన్నాడు.

1442లో రెండవ దేవరాయలు రాజ్యం చేస్తున్నప్పుడు అబ్దుల్ రజాక్ విజయనగరాన్ని సందర్శించాడు. "క్రీ.శ. 1441 వ చైత్ర మాసం చివరలో విజయనగర పట్టణం చేరాను. నా రాక తెలిసిన చక్రవర్తి, స్వాగత మిప్పించుటకు తగిన పనివారలను ఎదురు సన్నాహంతో పంపెను. వారిచే గౌరవించబడి, చక్కని భవనంలో విడిది చేసితిని".

"విజయనగరాన్ని పాలించు ప్రభువు అసాధారణమైన బలవంతుడు. ఆతని సామ్రాజ్యం సింహళ ద్వీప ప్రాంతం నుండి, కలబరిగె రాజ్యం వరకు వ్యాపించింది. ఏవైపు నుండి చూచినా, వేయి ఆమడల దూరం కలదు. తూర్పు, పశ్చిమ దిక్కుల్లో సముద్రమే ఎల్లలు. దేశమంతటా వ్యవసాయం బాగుగా సాగుతున్నది. భూమి సారవంతమైంది. ఈ రాజ్యమందు దేశ దేశాంతర నగరాలతో వ్యాపారం చేయు సముద్ర రేవు పట్టణాలు 300 కలవట. ఈ రాజు సైన్యంలో ఏనుగులు చాలా ఎక్కువ. ఈ రాజు సైన్యమందు 11 లక్షల కాల్బలం కలదు"

"విజయనగరాన్ని మించిన భాగ్యవంతమైన, వైభవోపేతమైన, సౌందర్యవంతమైన మహా నగరం, ప్రపంచంలో ఇంకొకటి లేదు. ఈ నగరానికి ఏడు ప్రాకారాలున్నవి. 7వ ప్రాకారానికి వెలుపల 500 గజాల వెడల్పు గల ప్రదేశం కలదు. అచ్చట మనిషి ఎత్తున్న మొనలు దేరిన, కరకుగా నున్న బండరాళ్ళు దట్టంగా పాతిపెట్టబడినవి. అందుచేత, కాలిబంట్లుగాని, గుఱ్ఱపు రౌతుకాని, సులభంగా ఆ రాళ్ళ మధ్య నుండి దూరిపోలేడు. నగరం చుట్టు గల 7 ప్రాకారాల్లో బయటిది వలయాకారంగా నుండి, ఎత్తైన కొండ మీదున్నది. ఆ ప్రాకారం రాతి తోను, సున్నం తోను కట్టబడి, బలిష్టమైన ద్వారాన్ని కలిగియున్నది. ఆ ద్వారం వద్ద కాపలా కలదు. 7 వ ప్రాకారం లోపల రాయల మందిరాలు, భవంతులు, సభా మంటపాలు, కొల్వుకూటాలు, కచ్చేరిలు కలవు. వెలుపలి ప్రాకారానికి, మొదటి, రెండవ ప్రాకారాల నడుమ ప్రదేశంలో, వ్యవసాయ భూములు కలవు. అక్కడక్కడ మంచి భవంతులు, ఇండ్లు, బావులు, ఆరామాలు కలవు. మూడవ ప్రాకారం నుండి 7వ ప్రాకారం వరకు, రాజ వీధికి రెండు ప్రక్కల దట్టంగా ఇళ్ళు, మార్కెట్లు, నడుమ నడుమ వీధులు, తోటలున్నాయి. 7వ ప్రాకారంలో ఉత్తరంగా రాయలు నివసించే నగరు కలదు. ఈ నగరి వాకిట నుండియే నాలుగు వీధుల నుండి నాలుగు మొగలకు వెళ్ళును. ప్రతి రాజ వీధి మొగలోను, నగరి వాటికి సమీపాన ధనురాకారంతో నున్న తోరణాలతో కూడిన ఎత్తైన గోపురం, దాని చుట్టునూ స్తంభాలతో అలంకరింపబడిన వసారా కలదు. చినికన్న అందమైన గోపురం నగర వాకిట కలదు. ఈ తోరణ గోపురం క్రింద నుండి నాలుగు ముఖాలు పోవు రాజ వీధులు–మిక్కిలి వెడల్పుగా నుండి, రమ్యంగా నున్నవి. రహదారికి రెండు ప్రక్కల అంగళ్ళు, పూలు అమ్మేవారున్నప్పటికి, ఏనుగుల, పాదచారులు, గుఱ్ఱాలు, బండ్లు, పల్లకీలు మొదలగునవి గుంపులు గుంపులుగా పోవుటకు వీలుగా, విశాలమైన రాచ వీధులున్నాయి. ఇవి ఎంతో పొడుగ్గా వున్నాయి. ఈ నగర గులాబీలన్న ఇష్టం. పువ్వులంటే ప్రాణం. ఒక్కొక్క వీధిలో ఒక్కొక్క సరకు నమ్మేవారు. ఈ నగరంలో రత్నాలు రాసులుగా పోసి, నడి బజారులో అమ్ముచుండిరి"

"ఈ నగరంలో రాతి కాలువల గుండా మంచి నీరు ఎడతెరపి లేకుండా వచ్చును. రాయల భవంతికి కుడి వైపున యంత్రాంగం చేయు సభా మంటపం కలదు. దీనికి ఎదురుగా దివాన్ ఖానా,

BRAOU

లేక దఫ్తర్ ఖానా కలదు. ఇక్కడ విజయనగర రాజ్యానికి చెందిన అన్ని పత్రాలు వ్రాయసకాండ్రచే రాయబడి, దాచబడినవి."

'నగరానికి ఎడమ వైపున దండనాయకుని భవంతి కలదు. దానికి వెనుక ప్రక్కన టంకసాల కలదు. ఈదేశపు జన సంఖ్య ఇంతని ఉజ్జాయింపుగానైన చెప్పలేం. రాయల కోశాగారంలో బంగారపు ముద్దలున్నాయి. ఈ నగరం లోని అన్ని తరగతుల వారు ఆభరణాలను నారి స్థాయిని బట్టి ధరించారు. వేశ్యావాటిక కలదు. నగర పాలకుడు సాలుకు 12000 పణాలను సుంకం క్రింద వేశ్యల వద్ద నుండి వసూలు చేసెను. ఈ వేశ్యావాటిక టంకసాల వెనుక వీధిలో కలదు" పైన పేర్కొన్నదంతయూ, అబ్దుల్ రజాక్ విజయనగరం గురించి ఇచ్చిన వివరణ.

1520 లో కృష్ణదేవరాయలు పాలించుచున్నప్పుడు పేస్ అను పోర్చుగీస్ దేశస్థుడు, విజయనగర నగరాన్ని ఈ క్రింది విధంగా వర్ణించాడు: "విజయనగరం రాజధాని. ఇక్కడే రాజు నివాసం. నగరానికి 6 మైళ్ళకీవల అడ్డంగా కొండల వరస ఉంది. దానిలో నుండి మార్గాలున్నాయి. వానిని ద్వారమంటారు. నగరం లోనికి ఆ ద్వారాల గుండా వెళ్ళాలి. 72 మైళ్ళ కొండల వరుస ఈ నగరాన్ని చుట్టియుంది. ఈ కొండలన్ని మూసివేయబడి ఉన్నాయి. ఈ పట్టణంలో ప్రతి పదార్థం కావలసినంత దొరుకుతుంది. పెరుగు, నూనె, లెక్కలేనంతగా ప్రతి రోజు అమ్ముతారు. మినుములు, గోధుమలు మొదలైనవి బాగా సమృద్ధిగా ఉన్నాయి. ఇట్టి పట్టణం మరొక దాన్ని చూచుటకు, చాలా దూరం ప్రయాణించవలెను" పేస్ విజయనగరానికి సంబంధించిన అటవీ సంపద గురించి నిర్దుష్టంగా ఏం చెప్పలేదు. కాని, నికిటిన్ ఈ క్రింది విధంగా వర్ణించాడు: "ఈ బ్రహ్మాండ పట్టణం చుట్టూను మూడు కోటలున్నవి. ఆ నగరం నడుమ ఒక నది ప్రవహించును. దాని ఒడ్డున భయంకరమైన అడవి వున్నది. మరొక వైపున లోయ వుంది. ఈ పట్టణం చూచుటకు ముచ్చటైనది, నివసించుటకు అనుకూలమైంది"

వర్ధమా విజయనగరం పర్వతాల ప్రక్కన ఉన్నదని, దాని చుట్టు కొలత ఏడు మైళ్ళన్నాడు. ఇచ్చట స్వచ్ఛమైన చల్లటి గాలి వీచేదన్నాడు. ఈ పట్టణం రెండవ స్వర్గం వలె ఉందన్నాడు. సీజర్ ఫ్రెడరిక్, రజాక్‌లు, ఈ మహా నగరం వలయాకారంలో ఉందన్నారు.

బార్బోసా మాటల్లో, విజయనగరం జనబాహుళ్యంతో నిండి వుంది. ఒక వైపున బ్రహ్మాండమైన ప్రాకారముంది. వేరొక వైపున నది ఉంది. మూడవ ప్రక్కన ఎత్తైన కొండ వుంది. ఈ పట్టణం సమతల ప్రదేశంలో వుంది. నరసింహుడు ఎప్పుడు ఇచ్చట నుండును. నరసింహుని సౌధాలు ఎత్తైనవి, విశాలమైనవి. అవి ఎన్నో కలవు. కొలువు కూటాలకు లెక్కలేదు. సరస్సులు చేపలతో నిండి యుండెను. ఉద్యానవనాలకు లెక్క లేదు. ఇక్కడ కంటికి ఇంపైన పూవులున్నాయి. సురభిళమైన పాదలున్నాయి. "విజయనగరం విస్తీర్ణం గురించి నేను వ్రాయను. ఎందుకనగా, అది ఒక ప్రదేశం నుండి చూడగా కనుపించదు. కాని, కొండపై నెక్కి చూడగా, అది రోమన్‌పురి (రోమ్) వలె నున్న"దన్నాడు, పేస్. కృష్ణదేవరాయలు హంపీకి (విజయనగరం) దగ్గరలో నాగలాపురాన్ని నిర్మించాడని, పేస్, న్యూనిజ్ రాతల వల్ల తెలుస్తూంది. న్యూనిజ్ వ్రాత వల్ల కృష్ణదేవరాయలు తనకు అత్యంత ప్రియమైన ఒక స్త్రీ గౌరవార్థం, ఈ నగరాన్ని నిర్మించినట్లు, దానికి నాగలాపురమని పేరుపెట్టాడని తెలుస్తోంది. ఈ నగరం చుట్టూ ఒక అందమైన ప్రాకారాన్ని నిర్మించాడు. ఒక పాడుగాటి, విశాలమైన రహదారి ఈ నగరంలో ఉంది. ఈ వీధిలో అనేక భవంతులు నిర్మించబడినాయి. ఈ నగర జనాభాను పెంచుటకు, అందంగా తీర్చిదిద్దుటకు, తన సామంతులను, ఉద్యోగులను, ఇక్కడ ఇళ్ళను నిర్మించమని

BRAOU

రాజు కోరాడు. వారందరూ గృహాలను కట్టారు. ఈ నగరంలో ఒక ముఖ్య బజారుంది. అది ఎంతో అందమైంది. ఈ బజారులో జరిగే వర్తకవ్యాపారం వల్ల ప్రభుత్వానికి 42 వేల 'పరదేవుల' (పగోడాల) సుంకమొస్తుంది. పేస్ రాతల వల్ల, ఉత్తరాన నగర ప్రాకారానికి బయట సుందరమైన మూడు దేవాలయాలు కలవట. అందులో ఒకటి విఠల స్వామి, లేక విఠోబా ఆలయం. రెండవది విరూపాక్షాలయం. మూడవ దేవాలయం హజారా రామాలయం. పర్వదినాల్లో రాయలు నాగలాపురం నుండి విజయనగరానికి వస్తూంటాడు.

1565 లో జరిగిన బన్నిహట్టి యుద్ధానంతరం విజయనగరాన్ని సందర్శించిన సీజర్ ఫ్రెడరిక్ ఈ విధంగా విజయనగరం గురించి రాశాడు: "విజయనగరం 1565లో పాడైంది. కాని, పట్టణం పూర్తిగా పాడు కాలేదు. ఇళ్ళు నిశ్శబ్దంగా ఏకాకుల వలె నిల్చి ఉన్నాయి. అక్కడ జన సంచారం అసలు లేనే లేదు. పులులు మొదలైన అడవి జంతువులే అచ్చట తిరుగుతున్నాయి. నల్వురు సుల్తాన్‌లు రాజధానిలో ప్రవేశించి, వారు ఖజానాను దోచుకొని, పడగొట్టారు. గుళ్ళను నేలమట్టం చేశారు. అపార ధన సంపదను, రత్నాలను దోచుకున్నారు. ఆరు నెలలపాటు రాజధానిని ధ్వంసం చేసి, తిరిగి వెళ్ళారు" 1567 ప్రాంతంలో తిరుమల రాయలు పట్టణానికి తిరిగొచ్చి, కొద్ది కాలం పరిపాలించాడు. సీజర్ ఫ్రెడరిక్ తిరుమల రాయలు పట్టణాన్నాక్రమించి, జన సమూహాన్ని నివసించునట్లు చేశాడన్నాడు.

విజయనగర రాజ్య రాజధాని హంపి, లేక విజయనగరం 26 చ.కి. మీటర్ల ప్రాంతంలో విస్తరించింది. పురావస్తు శాస్త్రజ్ఞులు ఈ చోట క్రీ.శ. 2వ శతాబ్ది నుండి మానవ నివాస ఆధారాలున్నట్లు కనుగొన్నారు. ఇది మొదటి హరిహరుని కాలంలో విజయనగరానికి రాజధాని కాగా, మొదటి దేవరాయల కాలంలో కొత్త ప్రాకారాలు, బురుజులు నిర్మించబడ్డాయి. ఇతడు దీనిని మరింత బలోపేతం చేశాడు. ఈతడు తుంగభద్రా నదిపై ఆనకట్టను నిర్మించాడు. ఈ విషయాలను న్యూనిజ్, సమకాలీన శాసనాలు ధృవపరుస్తున్నాయి. మొదటి దేవరాయల కాలంలో విజయనగరం నీటి కొరతను ఎదుర్కొంది. ఆ కొరతను తీర్చేందుకు తుంగభద్రపై ఆనకట్టను కట్టించి, ఆ నీటిని తురుత్తు కాలువ ద్వారా 17 మైళ్ళ దురంలో నున్న హంపి లోయలోకి వచ్చునట్లు చేశారు. ఇప్పటికి తురుత్తు కాలువ నీటి పారుదల వ్యవసాయాభివృద్ధికి దోహదం చేస్తున్నది. నాగలాపురంలో నీరు లేక, నేటి హోస్పేట్‌కు 10 కి.మీ. దూరంలో ఒక పెద్ద తటాకం నిర్మించబడిందని పేస్, న్యూనిజ్‌లు పేర్కొన్నారు. కృష్ణదేవరాయల కాలంలో మరల భవన నిర్మాణం, విజయనగర విస్తరణ చురుకుగా సాగింది. విరూపాక్ష దేవాలయం లోని పాత గోపురాన్ని బాగుచేయించి, కొత్త గోపురాన్ని నిర్మించాడు. 1513లో ఉదయగిరి నుండి తెచ్చిన బాలకృష్ణ విగ్రహాన్ని పెట్టి, ఒక దేవాలయాన్ని నిర్మించాడు. ఈ నగరానికి వెలుపల, మనం పైన చెప్పకొన్న పేస్, న్యూనిజ్‌లు ఉదహరించిన పెద్ద తటాకాన్ని పోర్చుగీస్ ఇంజనీర్ల సహాయంతో నిర్మించాడు. నాగలాపురంలో ఏక శిల నుండి యోగ నరసింహస్వామి విగ్రహాన్ని తయారుచేయించాడు.

విజయనగరం అనేక జోన్లుగా విభజింపబడినట్లు తెలుస్తోంది. విరూపాక్ష దేవాలయ ప్రాంతం ఒక జోన్ గాను, రాజప్రాసాద ప్రాంతం ఒక జోన్ గాను, మిగిలిన ప్రాంతం మూడవ జోన్‌గాను విభజించినట్లు చెప్పొచ్చు. ఈ విషయాలను విదేశీయుల రచనలు ధృవపరుస్తున్నాయి. విజయనగర రాజధాని వర్ణన విషయంలో విదేశీయుల రచనల్లో కొంత అతిశయోక్తి ఉన్నప్పటికి, పురావస్తు శాస్త్రజ్ఞుల త్రవ్వకాల వల్ల లభించిన భౌతిక అవశేషాలు, వారి వర్ణనలను చాలా వరకు ధృవపరుస్తున్నాయన్న, బర్టన్ స్టీన్ అభిప్రాయం నమ్మదగిందే. బన్నిహట్టి యుద్ధానంతరం విజయనగర రాజధానిని మరల ఎందుకు పునరుద్ధరింప లేదో, ఆలోచించాల్సిన విషయం.

B.RAO.U

22.4 : సంగ్రహంగా

తుంగభద్రకు, కృష్ణకు దక్షిణంగా ఉన్న ప్రాంత మంతటిని మూడు వందల సంవత్సరాల పాటు తమ శక్తివంతమైన రాజకీయ వ్యవస్థచే పరిపాలించిన విజయనగర సామ్రాజ్యం సుసంపన్నమై, సుస్థిర మైంది. ఈ విశాల సామ్రాజ్య పుట్టుక, పెరుగుదల, ఆనాటి ప్రజల, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులు, విజయనగర పాలకుల పరిపాలన గురించి తెలుసుకొనుటకున్న మౌలిక ఆధారాల్లో విదేశీయుల రచనలు ముఖ్యమైనవి. ఈ అధ్యాయ లక్ష్యంలో చెప్పకొన్నట్లుగా, విజయనగరాన్ని సందర్శించిన నికోలో కాంటి, అబ్దుల్ రజాక్, పేస్, న్యూనిజ్‌లు ఏమని తమ రచనల్లో వర్ణించారో తెలుసుకున్నాం.

22.5 : సంగ్రహంగా

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. విజయనగర చరిత్ర అధ్యయనానికి, విదేశీ యాత్రికుల రచనలు ఎంతవరకు ఉపయోగమో, విశ్లేషణాత్మకంగా, సోదాహరణంగా చర్చించండి.
2. విదేశీ యాత్రికుల రచనల్లోని రాజకీయ, పరిపాలనా విధాన విశేషాలను పేర్కొనండి.
3. విదేశీ యాత్రికుల రచనలాధారంగా విజయ నగర ప్రజల ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులను పరిశీలించండి.
4. విజయనగర రాజధాని గురించి విదేశీ యాత్రికుల వర్ణనలను విశ్లేషించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. విజయనగర చరిత్ర - సంస్కృతిపై నికోలో కాంటి తెలిపిన విశేషాలను సమీక్షించండి.
2. విజయనగర చరిత్రపై అబ్దుల్ రజాక్ తెలిపిన విశేషాలెట్టివి?
3. దసరా ఉత్సవంపై విదేశీ యాత్రికుల రచనల్లో పేర్కొనబడ్డ విశేషాలను వివరించండి.
4. పేస్ తన రచనల్లో పేర్కొన్న విజయనగర వర్ణనను తెలియజేయండి.
5. న్యూనిజ్ తన రచనలో పేర్కొన్న విజయనగర రాజకీయ విశేషాలను విశ్లేషించండి.

22.6 : ఉపయుక్త గ్రంథాలు

Filliziot Vasundhara : The Vijayanagara Empire

Nilakanta Sastri, K.A. : Foreign Notices in South India

Do : A History of South India

Menon, Parvathi : 'Rise & Fall of Vijayanagara' Frontline Dec 22, 1987

BRAOU

Stein, Burton	:	Vijayanagara, The New Cambridge History of India
Do	:	Peasant, State & Society in Medieval South India
Satyanarayana, K.	:	A Study of the History & culture of the Andhras
ఆరుద్ర	:	సమగ్ర ఆంధ్ర సాహిత్యం - సంపుటాలు
హనుమంతరావ్, బి.యస్,యల్	:	ఆంధ్రుల చరిత్ర
మల్లంపల్లి సోమశేఖరశర్మ (సం)	:	తెలుగు సంస్కృతి - చరిత్ర
కామేశ్వరరావ్ కె. యన్	:	విజయనగర సామ్రాజ్యం

రచయిత : డా. కె. యన్. కామేశ్వరరావు

BRAOU

భాగం-23 : ఆంధ్రదేశంపై బహమనీల, కుతుబ్ షాహీల ఆధిపత్యం, సాంస్కృతిక పరిస్థితులు

విషయక్రమం

23.0 : లక్ష్యాలు

23.1 : పరిచయం

23.2 : ఆంధ్ర దేశంపై బహమనీల ఆధిపత్యం

23.3 : బహమనీల నాటి సామాజిక, ఆర్థిక వ్యవస్థ: బహమనీల సేవలు

23.4 : ఆంధ్ర దేశంపై కుతుబ్ షాహీల ఆధిపత్యం

24.5 : కుతుబ్ షాహీల నాటి సామాజిక, ఆర్థిక వ్యవస్థ : కుతుబ్ షాహీల సేవలు

24.6 : సంగ్రహంగా

23.7 : పరీక్ష నమూనా ప్రశ్నలు

23.8 : ఉపయుక్త గ్రంథాలు

BRAOU

23.0 : లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం ద్వారా, మీరు, ఈ క్రింది విషయాలను తెలుసుకోగలగాలి. మొదటగా, క్రీ.శ. 1347 లో గుల్బర్గా రాజధానిగా దక్కన్‌లో పరిపాలన ప్రారంభించిన బహమనీల గురించి విషయాలను గ్రహించగల్గాలి. బహమనీలు 1347 నుండి 1528 వరకు పరిపాలించి, క్షీణించి, పతనమైనారు. వీరికి సమకాలీనులే, విజయనగర, వెలమ, రెడ్డి రాజ వంశాలవారు. బహమనీలకు, విజయనగర, రెడ్డి రాజులకు మధ్య యుద్ధాలు జరిగాయి; కాని, వెలమ పాలకులు, బహమనీల మధ్య, మైత్రి ఉండేది. బహమనీలు రాజ్యం క్షీణించి, బీదర్, అహ్మద్‌నగర్, బీరార్, బిజాపూర్, గోల్కొండ రాజ్యాలుగా చీలిపోయింది. ఆ చీలిపోయిన గోల్కొండ రాజ్య పాలకులే, కుతుబ్ షాహీలు. కుతుబ్ షాహీలు 1512 నుండి 1687 వరకు పాలించారు. 1347 నుండి 1687 మధ్య కాలంలో ఆంధ్రదేశంపై ఆధిపత్యం వహించిన బహమని, కుతుబ్ షాహీల పాలనా కాలంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, వ్యవస్థలను గ్రహించగల్గాలి.

23.1 : పరిచయం

14వ శతాబ్దంలో మహమ్మద్ బిన్ తుగ్లక్ దక్షిణ దేశంపై దండెత్తగా తలెత్తిన పరిస్థితుల వల్ల ఏర్పడినవే, విజయనగర, బహమనీ, కొండవీటి రెడ్డి, రాచకొండ, దేవరకొండ వెలమ రాజ్యాలు. ఈ నాలుగు రాజ్యాల్లో దాదాపుగా 300 సంవత్సరాలపాటు విలసిల్లింది విజయనగర రాజ్యం కాగా, బహమనీ రాజ్యం దాదాపుగా 150 సంవత్సరాలు వర్ధిల్లగా, రెడ్డి, వెలమ రాజ్యాలు దాదాపు 100

సంవత్సరాలు పాలించాయి. ఆంధ్ర దేశ ఆధిపత్యం కొరకు ఈ నాలుగు సమకాలీన రాజ్యాలు తమలో తాము దెబ్బలాడుకున్నాయి. ఈ దెబ్బలాటలు 14, 15వ శతాబ్దాల్లో జరగ్గా, రెడ్డి, వెలమ రాజ్యాలు క్షీణించగా, బహమనీ రాజ్యం బీదర్, అహ్మద్‌నగర్, బీరార్, బిజాపూర్, గోల్కొండ రాజ్యాలుగా చీలిపోయింది. ఈ రాజ్యాల్లో గోల్కొండ రాజ్యాన్ని కుతుబ్‌షాహీలు 16, 17 శతాబ్దాల్లో పరిపాలించారు.

బహమనీ వంశానికి చెందిన అల్లాఉద్దీన్ బహ్మన్‌షా (1347-1358), మొదటి మహమ్మద్ (1358-1375), అల్లాఉద్దీన్ ముజాహిద్ (1375-1378), మొదటి దావూద్ (1378 ఏప్రియల్, మే), రెండో మహమ్మద్ (1378-1397), తాజుద్దీన్ ఫిరోజ్ (1397-1422), షిహాబుద్దిన్ అహ్మద్, లేదా మొదటి అహ్మద్‌షా (1422-1436), రెండవ అల్లాఉద్దీన్ అహ్మద్, లేదా రెండవ అల్లాఉద్దీన్ (1436-1458), అల్లాఉద్దిన్ హుమాయూన్ (1458ర-1461), మూడో నిజాముద్దీన్ అహ్మద్ (1461-63), మూడో షంషుద్దిన్ మహమ్మద్, లేదా మూడో మహమ్మద్ (1463-1482), షిహాబుద్దిన్ మహమ్మద్ (1482-1518) లు వరుసగా పరిపాలించారు.

బహమనీ రాజ్య క్షీణత అనంతరం ఏర్పడింది, కుతుబ్‌షాహి వంశం. గోల్కొండ రాజధానిగా, కులికుతుబ్‌షాహి వంశంవారు 1518 నుండి 1687 వరకు పాలించారు. ఈ వంశంలో సుల్తాన్ కులీ కుతుబ్‌ముల్క్ (1518-1543), జంషీద్ (1543-1550), సుభాన్ (1550), ఇబ్రహీం కుతుబ్‌షా (1550-1580), మహమ్మద్ కులికుతుబ్‌షా (1580-1611), మహమ్మద్ కుతుబ్‌షా (1611-1626), అబ్దుల్లా కుతుబ్‌షా (1626-1672), అబుల్‌హసన్ కుతుబ్‌షా (1672-1687)లు వరునగా పరిపాలించారు. ఈ పైన పేర్కొన్న బహమనీ, కుతుబ్‌షాహీలు ఆంధ్ర దేశంపై ఆధిపత్యాన్ని సంపాదించి, ఒక మిశ్రమ సంస్కృతిని ఆంధ్ర దేశంలో వ్యాప్తికి తెచ్చాయి. దానిని 'దక్కని' శైలంటారు. ఈ 'దక్కని' శైలిని ఆహార, నృత్య, సంగీత, చిత్రలేఖన, వాస్తు నిర్మాణంలో మనం చూడగలం. పారశీక అరబ్బీ భాషలతోపాటుగా, ఉర్దూ భాషను అభివృద్ధిపర్చారు. సూఫీ తెగ బయల్దేరి, కాలక్రమేణా బలపడింది.

BRAOU

23.2 : ఆంధ్రదేశంపై బహమనీల ఆధిపత్యం

క్రీ.శ. 14వ శతాబ్దపు మూడవ దశకంలో (1325-26) ఢిల్లీ సుల్తానైన మహమ్మద్ బీన్ తుగ్లక్ దక్షిణ భారతదేశం లోని పలు రాజ్యాలను జయించి, భారతదేశం లోని అధిక భాగాన్ని మహమ్మదీయుల పలుకుబడి క్రిందకు తెచ్చాడు. కాని, కొద్ది కాలం లోనే తన దుష్పరిపాలన వల్ల, తాను జయించిన రాజ్య భాగాలను కోల్పోయాడు. అట్టి కారణంగా తలెత్తిందే, బహమనీ రాజ్యం. మహారాష్ట్ర లోని మహమ్మదీయులందరూ ఏకమై, మహమ్మద్ బీన్‌తుగ్లక్ కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, హసన్‌గంగును రాజుగా ఎన్నుకొన్నారు. ఈతడు ప్రాచీన పారశీక ప్రభువైన బహ్మన్‌శాహ వంశస్థుడనని చెప్పకొనుటచే, అతని సంతతి వారిని బహమనీలన్నారు. బహమనీ వంశ స్థాపకుడైన అల్లాఉద్దీన్ హసన్‌గంగూ, క్రీ.శ. 1347లో బహమనీ వంశాన్ని స్థాపించాడు. ఈతడు క్రీ.శ. 1347 నుండి క్రీ.శ. 1358 వరకు 11 సంవత్సరాలు పరిపాలించాడు. ముసునూరి కాపయ నాయకుడు హసన్ గంగూకు, మహమ్మద్‌బీన్ తుగ్లక్‌పై తిరుగుబాటు సమయాన సహాయం చేశాడు. బహమనీ రాజ్యం, ముసునూరి కాపయ నాయకుని ఓరుగల్లు రాజ్యానికి పడమటి దిక్కున ఉంది. హసన్‌గంగూ రాజ్యానికి వచ్చిన కొద్ది కాలం లోనే, కాపయ నాయకుని పై దండెత్తాడు. కాపయ నాయకుడు కొలన్

ప్రాంతాన్ని హసన్‌గంగూకు ఇచ్చి, సంధి చేసుకున్నాడు. కాపయ కప్పం చెల్లించడంలో విఫలుడైనాడని, మహమ్మదీయ చరిత్రకారుల వాదన. కాని, కాపయ నాయకుడు అటువంటి ఒప్పందాన్ని చేసుకున్నట్లు కనిపించదు. మహమ్మద్ బీన్ తుగ్లక్ మరణానంతరం, క్రీ.శ. 1355లో, మరల ఓరుగల్లుపై దండెత్తాడు. దేశాన్ని ధ్వంసం చేసి, ఒక సంవత్సరముండి, భువనగిరి దుర్గాన్ని, పరిసర ప్రాంతాలను ఆక్రమించాడు. ఈతడు విజయనగర పాలకునితో యుద్ధం చేసి, కొంకణ ప్రాంతాన్ని ఆక్రమించాడు.

హసన్ గంగూ అనంతరం మొదటి మహమ్మద్ షా క్రీ.శ. 1358-1375 మధ్య కాలంలో పరిపాలించాడు. ఈతడు బహమనీ వంశస్థుల్లో సుప్రసిద్ధుడు. మునునూరి కాపయనాయకుడు కొలాస్ కోటను తిరిగి ఆక్రమించాలని ప్రయత్నించగా, మొదటి మహమ్మద్‌షా, వరంగల్, విజయనగర సేనలను ఓడించాడు. ఫలితంగా, కాపయ నాయకుడు ఎంతో నష్టపరిహారాన్ని చెల్లించి, ఇంకా గోల్కొండను ఇచ్చి, సంధి కుదుర్చుకున్నాడు. విజయనగర పాలకునకు, ఇతనికి మధ్య యుద్ధం జరిగింది. ఇప్పటినుండే విజయనగర, బహమనీ పాలకుల మధ్య, అతి క్రూరత్వంతో కూడిన మారణకాండ ఆరంభమైంది.

మహమ్మద్ షా అనంతరం అల్లాఉద్దీన్ ముజాహిద్ మూడేండ్ల పాటు, క్రీ.శ. 1375- 1378 మధ్య పాలించాడు. విజయనగర పాలకులతో యుద్ధం చేశాడు. అయితే, బహమనీ రాజ్యంలో రాజ్యాధికారం కొరకు దావూద్, రెండో మహమ్మద్ దెబ్బలాడుకున్నారు, హత్యలు చేసుకున్నారు. రెండవ మహమ్మద్ క్రీ.శ. 1379 నుండి 1397 వరకు, దాదాపు 20 సంవత్సరాలు పరిపాలించాడు. ఈతని కాలం లోనే, విజయనగర పాలకులు కృష్ణా-తుంగభద్రా అంతర్వేదిని ఆక్రమించారు.

తాజుద్దీన్ ఫిరోజ్‌షా క్రీ.శ. 1397 నుండి 1422 వరకు పాలించాడు. ఈతని కాలంలో బహమనీ, విజయనగర రాజ్యాల మధ్య, 1398, 1406, 1417 ల్లో మూడు యుద్ధాలు జరిగినట్లు తెలుస్తోంది. తాజుద్దీన్ ఫిరోజ్‌షా రాజ్యానికి వచ్చిన కొద్ది కాలానికే, రెండవ హరిహర రాయలు అంతర్వేదిని ఆక్రమించగా, పెదకోమటి వేమారెడ్డి సహాయంతో, రెండవ హరిహర రాయలను ఓడించాడు. అనంతరం పెదకోమటి వేమారెడ్డికి సహాయంగా వెళ్ళి, కాటయ వేమారెడ్డిని ఎదిరించాడు. కాటయ వేముడు ఈ యుద్ధంలో మరణించాడు. వెలమ పాలకుడు విజయనగరంతో చేరి, బహమనీ, రెడ్డి రాజులను ఎదిరించగా, వెలమ పాలకుడిని శిక్షించి, పానగల్లు దుర్గాన్ని సాధించేందుకు 1420 లో ఫిరోజ్‌షా చేసిన ప్రయత్నం విఫలమైనట్లు కనిపిస్తోంది. ఈ విధంగా, పైన పేర్కొన్న మూడు యుద్ధాల్లో ఎవరికీ నిజమైన విజయం లభించలేదు. కొద్ది కాలంలో ఇతడు మరణించగా, షిహాబుద్దీన్ అహ్మద్, లేదా మొదటి అహ్మద్ షా క్రీ.శ. 1422 నుండి, 1436 వరకు పాలించాడు.

మొదటి అహ్మద్‌షా 1424-1425లో వరంగల్‌పై దండెత్తి, అక్కడి రేచర్ల వెలమ పాలకుడ్ని చంపి, తెలంగాణాలో అనేక దుర్గాలను సాధించాడు. మరల 1432 అనంతరం అహ్మద్‌షా తెలంగాణా పై దండెత్తి, వెలమ పాలకులను ఓడించి, రాయగిరి, భువనగిరి మొదలైన దుర్గాలను పట్టుకొని, తెలంగాణాలో ఎక్కువ భాగాన్ని బహమనీ రాజ్యంలో అంతర్భాగం చేశాడు. అంతేగాక, తెలంగాణా ప్రాంతానికి సంజర్‌ఖాన్‌ను సర్‌లష్కర్‌గా నియమించాడు. మొదటి అహ్మద్‌షా 1436 లో మరణించగా, కుమారుడైన రెండవ అల్లాఉద్దీన్ అహ్మద్ 1436 నుండి 1458 వరకు పరిపాలించాడు.

రెండవ అల్లాఉద్దీన్ అహ్మద్ కాలంలో, తెలంగాణాలో సామంతులు బాలకొండ దుర్గాధిపతితో కలసి, తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటుదార్లకు సుల్తాన్ తమ్ముడు మహమ్మద్ ఖాన్ సహాయపడ్డాడు. సబ్బి రాష్ట్రం, భువనగిరి వీరి అధీనం క్రిందకు వచ్చాయి. ఈ విషయాన్ని

BRAOU

తిరుగుబాటుదార్లను అణచివేయుటకు కృషి చేశాడు. ఆ ప్రయత్నంలో విజయాన్ని పొంది, తిరిగి తెలంగాణాలో బహమనీల ఆధిపత్యాన్ని నెలకొల్పాడు. ఇతని అనంతరం రాజ్యానికొచ్చిన అల్లాఉద్దీన్ హుమాయూన్ 3 సంవత్సరాల పాటు, క్రీ.శ. 1458 నుండి 1461 వరకు పాలించాడు. ఈయన తెలంగాణా తరఫ్‌దార్‌గా మాలిక్ షాను నియమించి, తన బంధువు, బాలకొండ జాగీర్దార్ కుమారుడైన సికిందర్‌ను తెలంగాణా సైన్యాధిపతిగా నియమించాడు. కాని, ఇది నచ్చని సికందర్, తండ్రైన జలాల్ ఖాన్‌తో కలసి, తిరుగుబాటు చేయగా, ఆ తిరుగుబాటుకు వెలమ పాలకుడైన లింగమనీడు సహాయపడ్డాడు. అందుచే సుల్తాన్ అల్లాఉద్దీన్ తెలంగాణాపై దండెత్తొచ్చాడు. లింగమనీడు కళింగ పాలకుడైన కపిలేశ్వర గజపతి సహాయాన్ని కోరాడు. ఈ విధంగా వెలమ, గజపతి పాలకుల సైన్యాలు, సుల్తాన్ సైన్యాన్ని పారద్రోలాయి. కపిలేశ్వర గజపతి కుమారుడు హంవీరుడు, 1460 లో వరంగల్ దుర్గాన్ని సంపాదించడంలో, తెలంగాణా బహమనీ రాజ్యం నుండి విడిపోయింది.

ఈ విధంగా తెలంగాణాలో తమ స్థావాన్ని కోల్పోయిన బహమనీలు, మళ్ళీ 1472 లో మూడవ మహమ్మద్ కాలంలో అడుగుపెట్టారు. దీనికి కొన్ని పరిణామాలు సహాయపడ్డాయి. అందుక్కారణం గజపతి కపిలేశ్వరుని మరణానంతరం, అతని కుమారులైన హంవీరుడు, పురుషోత్తముడు రాజ్యం కోసం తగాదాపడ్డారు. ఆ తగాదాలో హంవీరుడు బహమనీ సుల్తాన్ సహాయాన్ని కోరి, అందుకుగాను గజపతుల పాలనలో నున్న తీరాంధ్రాన్ని, తెలంగాణాను బహమనీల కిచ్చడానికి ఒప్పుకొన్నాడు. ఈ అవకాశాన్ని వదులుకోవడం ఇష్టపడని, మూడవ మహమ్మద్ అంగీకరించాడు. సుల్తాన్ మూడవ మహమ్మద్ మాలిక్ నిజాం ఉల్‌ముల్క్ భైరి అనే దక్కన సర్దార్‌ను కొంత సైన్యంతో పంపాడు. ఈ ఒప్పందం వల్ల లాభం పొందిన హంవీరుడు తన మాట ప్రకారం తెలంగాణా, తీరాంధ్రాలను సుల్తాన్‌కు ఇచ్చాడు. పలితంగా సర్ లష్కర్ ఇతిరంగ్ అనే బిరుదుతో, మాలిక్ నిజామ్ ఉల్‌ముల్క్ బహమను, ఈ కొత్త రాష్ట్రానికి సైన్యాధిపతిగా, రాజమండ్రి దుర్గ పాలకుడిగా నియమించాడు.

ఇతడే భవిష్యత్తులో నిజాంషాహి రాజ్యస్థాపకుడయ్యాడు. కొండపల్లి దుర్గాధిపతి దుండగాలు పెరిగిపోవడంతో, ప్రజలు తిరుగుబాటు చేయగా, కొండపల్లి గజపతుల వశమైంది. అన్నదమ్ముల మధ్య సయోధ్య కుదరటంలో, గజపతులకు, సుల్తాన్ సైన్యాలకు మధ్య యుద్ధం జరిగింది. ఇదే సమయంలో, విజయనగర పాలకుని తరపున సాళువ నరసింహరాయలు సైన్యంతో వచ్చి, తీరాంధ్రాన్ని జయించి, సైన్యంతో రాజమహేంద్రవరం చేరాడు. కాబట్టి, రాజమండ్రి సుల్తాన్‌కు 1478 - 1480 మధ్య, నెలపిడైంది. సుల్తాన్ మహమ్మద్ నెల్లూర్‌ను పట్టుకొని, విజయనగర సైన్యాలను తరుముతూ, కాంచీపురం వైపు వెళ్ళాడు. ఈ కాంచీపురం దండయాత్ర ఫలితం గురించి కూడా, అభిప్రాయ భేదముంది. మూడో మహమ్మద్‌షా, కొత్తగా జయించిన ఆంధ్ర దేశం లోని ప్రాంతాలను, తూర్పు, పడమటి తెలంగాణాలుగా విభజించి, వాటికి వరుసగా రాజమహేంద్రవరం, వరంగల్లులను రాజధానులుగా చేశాడు. నిజామ్‌ఉల్‌ముల్క్ బహమును, తూర్పు తెలంగాణాకు, ఆజమ్‌ఖాన్‌ను పడమటి తెలంగాణాకు, పాలకులుగా నియమించాడు. ఇతడు చనిపోయిన తర్వాత, బహమనీ పాలకుల్లో చివరి వాడైన షిహాబుద్దీన్ మహమ్మద్, క్రీ.శ. 1482 నుండి 1518 వరకు పాలించాడు. ఈతని కాలం లోనే, 1512లో గోల్కొండ పాలకుడైన కులికుతుబ్‌షా స్వతంత్రంగా వ్యవహరించి, కుతుబ్‌షాహి వంశాన్ని స్థాపించాడు. ఈతని అనంతర పాలకులైన నాలుగవ అహ్మద్‌షా, అల్లాఉద్దీన్‌షా, వలిముల్లా, కలిముల్లాలు, అసమర్థులగుటచే, బహమనీ రాజ్యం తన ప్రాబల్యాన్ని కోల్పోయి, చరిత్ర కాలగర్భంలో కలసిపోయింది. బహమనీ రాజ్యం అంతరించినా, వారు చేసిన సేవ మరువ లేనిది.

BRAOU

23.3 : బహమనీల నాటి సామాజిక, ఆర్థిక వ్యవస్థ : బహమనీల సేవలు

బహమనీలు షరియత్, లేక ముస్లిం న్యాయశాస్త్రాధారంగా పరిపాలన సాగించారు. కాని, తమ పరిపాలనలో అవసరాన్ని బట్టి మార్పులను చేశారు. బహమనీలది వంశపారంపర్య నిరపేక్ష రాచరిక మైనా, సలహా నిచ్చేందుకు, పరిపాలనలో సాయంచేసేందుకు మంత్రి మండలి ఉంది. బహమనీలు తమ రాజ్యాన్ని 4 తరఫ్‌లుగా విభజించారు. అందులో, ఇందూర్-కొలాస్ (తెలంగాణా) ఒక తరఫ్. బహమనీ పాలకుల్లో కొందరు తెలివిగలవారు, ఉదార స్వభావులున్నారు కాని, ఎక్కువ మంది స్వార్థపరులైన స్వేచ్ఛాప్రియులు. అందువలన, బహమనీ రాజ్యం నాశనమైంది. బహమనీలు జాగీర్దారీ పద్ధతిని కొనసాగించారు. సైన్యాన్ని సరఫరా చేయుటకు ఇచ్చే గ్రామాలను, ఇక్తాలన్నారు. కాని, ఇక్తాదార్లకు వంశపారంపర్య హక్కు లేదు. బహమనీలు కూడా విజయనగర పాలకుల వలె, యుద్ధానికి సర్వసిద్ధంగా ఉండటమే కాక, ఒక శక్తివంతమైన సైన్యాన్ని కలిగుండేవారు. గవాన్ ప్రధాన మంత్రిగా నున్నప్పుడు 4 తరఫ్‌లను, 8 తరఫ్‌లుగా చేశాడు. ఆవిధంగానే తెలంగాణాన్ని రాజమండ్రి, వరంగల్ రాష్ట్రాలుగా చేశాడు.

బహమనీ రాజ్యాన్ని సందర్శించిన రష్యన్ యాత్రికుడు నికిటిన్, గ్రామాల్లో ప్రజలు దయనీయ స్థితిలో ఉన్నారని, ప్రభువులు అపారమైన సంపదతో, భోగవిలాసాలలో మునిగి ఉన్నారని రాశాడు. ఆ రోజుల్లో కరువుకాటకాలు వచ్చినప్పుడు అందరికి సమానంగా సహాయక చర్యలను అందివ్వక, హిందువులపై శీత కన్ను వేశారు. రాబర్ట్ సీవెల్ రచన ప్రకారం, 1396-97 నుండి 12 సంవత్సరాలు కరువు పరిస్థితులున్నాయని, దానిని దుర్గాదేవి కరువన్నారని రాశాడు. బహమనీ సుల్తాన్‌లు 1366లో ఆదోనిపై దండెత్తినప్పుడు, మొదటిసారిగా తుపాకీలను వాడారు. అందువల్ల, విజయనగర పాలకులు ఓడిపోయారు. బహమనీలు మైదాన ముఖాముఖి యుద్ధాలకు ప్రాధాన్యమిచ్చారు.

బహమనీల కాలంలో భూమి మీద రైతులకు హక్కుంది. కాని, మోయలేని పన్నుల భారం వల్ల, రైతులు నష్టపోయారు. వీరి పరిపాలనా కాలమంతా యుద్ధాలతో గడపటం చేత, నీటిపారుదల సౌకర్యాల గురించి శ్రద్ధ తీసుకోలేదు; పాత వాటిని బాగుచేయలేదు. దానికి తోడు, కరువు వల్ల రైతులు మరింత నష్టపోయారు. ఆనాడు వరంగల్ తివాచీలకు ప్రసిద్ధి. భువనగిరి, నిర్మల్, ఇత్తడి, కంచు వస్తువులకు, కత్తులు, కటార్లకు ప్రసిద్ధి. కోస్తా ఆంధ్ర బట్టల నేతకు ప్రసిద్ధి. బహమనీల కాలంలో వస్త్రాలు, బిద్రి నగిషీ పాత్రలు, తివాచీలు, రత్నాలు, సుగంధ ద్రవ్యాలు ఎగుమతయ్యేవి. తూర్పు కోస్తా లోని మచిలీపట్నం, మోటుపల్లి రేవుల ద్వారా ఎగుమతి, దిగుమతులు జరుగుతుండేవి. వీరు విదేశీ వాణిజ్యాన్ని బాగా ప్రోత్సహించారు. నికిటిన్ రచనల వల్ల, విదేశాలతో జరిగే ఎగుమతుల మీద సుంకాలు లేవని తెలుస్తూంది. నికిటిన్ ఆనాటి పట్టణ జీవితం చాలా అవినీతిగా ఉండేదన్నాడు. దేశీయ, విదేశీయ వాణిజ్యం పెరగటంచేత, వ్యవసాయ ఉత్పత్తులు తక్కువగా ఉండటం చేత, వీరి కాలంలో నాణేల వాడకం బాగా పెరిగింది. వీరి కాలం నాటి వెండి, రాగి నాణేలు ఢిల్లీ సుల్తాన్‌ల కాలం నాటి నమూనాలో వున్నాయి. ఈ నాణేలన్నీ ఒక ఆకారం, ఒకే సైజులో ఉండేవి. దాన్ని బట్టి, నాణేల ముద్రణాధికారం ప్రభుత్వానికే ఉందనుకోవచ్చు. విజయనగర, బహమనీల మధ్య వచ్చిన యుద్ధాలకు, వీరి ద్రవ్య చలామణీ విధానం కూడా ఒక కారణమని, కంభంపాటి సత్యనారాయణ అభిప్రాయపడ్డారు.

BRAOU

బహమనీ కాలం నాటి సామాజిక వ్యవస్థలో భూస్వామ్య వర్గం, వర్తకులు, వృత్తి నిపుణులు, రైతులు, బానిసలు, అనే ఐదు వర్గాలున్నాయి. నికిటిన్ రచనల వల్ల గుఱ్ఱాలు, సిల్క్‌లు, ఇతర వస్తువుల వలెనే, నల్లవారిని కూడా అమ్మేవారన్నాడు. నికిటిన్ రచనల వల్ల ఆనాడు ప్రజల్లో అధిక సంఖ్యాకులు హిందువులని, వారు భోజనం వద్ద అంటు దోషం, దృష్టి దోషాన్ని పాటించేవారన్నారు. బహమనీలు బలవంతంగా మతం మార్పిడి విధానాన్ని ప్రోత్సహించలేదు. ఆనాడు వర్ణాశ్రమ ధర్మాల పటుత్వం తగ్గింది. సూఫీల బోధనలు ఈ క్రింది విధంగా ఉన్నాయి: మానవునికి స్వేచ్ఛను, సమానత్వాన్నిచ్చి, ఆత్మ జ్ఞానం పొందగల అవకాశాల నివ్వడమే ఇస్లాం ధ్యేయమన్నారు. ఈ ఆదర్శాన్ని వెనక్కు నెట్టిన, సింహాసనాలకు మేము మోకరిల్లబోమన్నారు. కె. యం. అష్రాఫ్ అభిప్రాయం ప్రకారం, నగరాల్లో ఉండే నిరాశ్రయులు, గ్రామాల్లో అధికార దోపిడికి గురౌతున్న ప్రజలు, ఈ ప్రబోధాలకు ఆకర్షితులయ్యారు. షేక్ జియాఉద్దీన్ దావూద్, హజ్రత్ సయ్యద్ మహమ్మద్ జెసూదరాజ్‌లు, ఆనాటి ప్రసిద్ధ సూఫీ యోగులు. వీరి బోధనలు హిందువులను, మహమ్మదీయులను ఎంతగానో ఆకర్షించాయి. గుల్బర్గాలో మహమ్మద్ జెసూ దరాజ్ దర్గా, చెన్న విశ్వేశ్వర ఆలయం ప్రక్క ప్రక్కనే వున్నాయి. అహ్మద్‌షాను వలి, లేక యోగి అన్నారు.

దక్షిణ భారతదేశానికి మహమ్మదీయుల రాకతో, దక్షిణ దేశ సమాజంలో కొన్ని మార్పులొ చ్చాయి. వాటి ఫలితంగా, పాలితులు, పాలకుల మధ్య సంబంధబాంధవ్యాలు ఏర్పడి, ఒకరి నుండి మరొకరు నేర్చుకొని, ఒక మిశ్రమ సంస్కృతికి కారణభూతులయ్యారు. ఆ మిశ్రమ సంస్కృతి వాస్తు నిర్మాణంలో, శిల్పం, చిత్ర లేఖనంలో కనపడుతుంది. ఆనాటి వాస్తు నిర్మాణం లోని డోమ్‌లు, గుంబజ్‌లు, ఆర్చీలు, మన దేశానికి టర్కీ, అరేబియా, పర్షియా దేశాల నుండి దిగుమతయ్యాయి.

మసీదులో నాలుగు ప్రక్కలా ఆర్చీలు, పైన కప్పులేని చతురస్రాకారాలున్నాయి. ఎత్తైన స్తంభం మీద నుండి ప్రార్థనలకు ఆహ్వానిస్తారు. వాటినే 'మినారెట్లు'న్నారు. మసీదు లోని ద్వారాల్లో ఆర్చీలున్నాయి; వాటిని లతలతో, అక్షరాలతో అలంకరించారు. ఒకటవ మహమ్మద్‌షా నిర్మింపచేసిన గుల్బర్గా లోని జామా మసీద్‌లో, ప్రార్థనా స్థలానికి పైన డోమ్‌ను నిర్మించాడు. మురే మసీద్‌కు ఈ డోమ్ లేదు. ఇది హిందూ వాస్తు సంప్రదాయ పద్ధతి. ఇక్కడున్న సమాధులపై తుగ్లక్ వాస్తు పద్ధతి, పర్షియన్ హిందూ పద్ధతి కన్పిస్తాయి. ఫిరోజ్‌షా సమాధి హిందూ, మహమ్మదీయ వాస్తు శిల్పరీతులతో ఉంది. ఈ మిశ్రమ సంస్కృతి అన్ని రంగాల్లో కనుపిస్తూంది. బహమనీ సుల్తాన్‌లు దిగువ స్థాయిలో ఉద్యోగులుగా, హిందువులను తీసుకున్నారు. అట్టి వారి కొరకు శిక్షణాలయాల నేర్పాటు చేశారు. ఆసుపత్రుల్లో, ఉత్సవాల్లో అందరికి ప్రవేశాన్ని కల్పించారు. బహమనీల పరిపాలనా కాలంలో హిందూ, మహమ్మదీయ మతాలవారు సన్నిహితమయ్యేందుకు, ఒకరి నొకరు అవగాహన చేసుకొనేందుకు, తగిన వాతావరణం నెలకొన్నదని చెప్పటలో అతిశయోక్తి లేదు.

23.4 : కుతుబ్‌షాహీల ఆంధ్ర దేశంపై ఆధిపత్యం

మల్లంపల్లి సోమశేఖర శర్మ అభిప్రాయపడినట్లు, క్రీ.శ. 1323 లోనే తెలుగు గడ్డ మీద కాలుమో పిన ముస్లింలు, రాజ్యాలను స్థాపించారు. అయితే, 16వ శతాబ్దంలో కుతుబ్‌షాహీ ప్రభుత్వం ఆంధ్ర దేశంలో తలెత్తేందుకు చెప్పకోదగిన కారణం, 1530 తర్వాత శ్రీకృష్ణదేవరాయల మరణానంతరం విజయనగర సామ్రాజ్యం క్షీణ ముఖం పట్టడం, రెడ్డి రాజ్యం అస్తమించటం, వెలమ రాజ్యం సామంత రాజ్యం కావటం, తెలుగు వారు సామ్రాజ్య నిర్మాణ స్థాయి నుండి పెద్ద జమిందార్ల స్థాయికి

BRAOU

దిగజారటం, మొదలగునవి. ఆంధ్ర దేశం అనేక విధాలుగా విచ్ఛిన్నమైంది. ఇట్టి పరిస్థితుల్లో మళ్ళీ తెలుగు భాషను మాట్లాడే జాతిని ఏకం చేసిన ఘనతను సంపాదించినవారు, కుతుబ్ షాహీలు.

ఆంధ్ర మాటల్లో "నేడు ఆంధ్రుల రాజధాని హైదరాబాద్ నగరం. దీనిని నిర్మించి మహా నగరంగా రూపొందించినవారు కుతుబ్ షాహి వంశీయులు" ఇట్టి కుతుబ్ షాహి వంశస్థులు పర్షియా లోని ఒక రాజ వంశంలో జన్మించి, మధ్య ఆసియాలోని తబ్రీజ్, హిందం నగరాలను పాలించారు. కాని, శత్రువుల చేత ఓడిపోయి, రాజ్యాన్ని కోల్పోయి, జీవనోపాధి కొరకు 15వ శతాబ్ది చివరి పాదంలో, మన దేశానికి వచ్చి, బహమనీ సుల్తాన్‌ల కొలువులో చేరాడు. ఈ వంశ నిర్మాతైన కులికుతుబ్ షా 1487 లో బహమని సుల్తాన్ షిహాబుద్దీన్ మహమ్మద్ కొలువులో చేరి, తెలంగాణాలో తలెత్తిన అల్లర్లను అణచి, సుల్తాన్ ప్రాణాల్ని కాపాడి, సుల్తాన్ అనుగ్రహాన్ని సంపాదించాడు. సుల్తాన్‌చే కుతుబ్ ఉల్ ముల్క్ అన్న బిరుదును పొందాడు. అంతేగాక, 1492 అనంతరం తెలంగాణా తరఫ్‌దారైనాడు. ఇంకా, గోల్కొండ దుర్గానికి అధిపతిగా నియమించబడ్డాడు. తెలంగాణా తరఫ్‌దార్‌గా స్వతంత్రంగా వ్యవహరించినా, సుల్తాన్ బ్రతికున్నంత కాలం విధేయతతో పాలించి, సుల్తాన్ షిహాబుద్దీన్ మహమ్మద్ 1518 లో చనిపోయిన తర్వాత, స్వతంత్రాన్ని ప్రకటించుకొన్నాడు. కులికుతుబ్ షా క్రీ.శ. 1518 వరకు గోల్కొండ పాలకుడిగా పాలించాడు. గోల్కొండకు మహ్మదానగరమని పేరు పెట్టాడు. తన అధికారాన్ని తీరాంధ్రం లోకి విస్తరింపచేయుటకు సమకాలీన కళింగ పాలకుడైన ప్రతాపరుద్ర గజపతి తోను, సమరాంగణ సార్వభౌముడైన కృష్ణదేవరాయల తోను, యుద్ధాలను చేశాడు; కాని, ఫలితం దక్కలేదు. అంతటితో ఊరుకోక, సరైన అవకాశం కొరకు వేచియుండి, కృష్ణదేవరాయలు చనిపోయిన తర్వాత ఏర్పడిన అనిశ్చిత పరిస్థితిని ఆధారంగా తీసుకున్నాడు. అంతేగాక, ప్రతాపరుద్ర గజపతి విజయనగరంపై దండయాత్రల నారంభించగా, తన అధీనంలో లేని తెలంగాణా లోని కోటలను, తీరాంధ్రాన్ని సంపాదించడానికి, 1531-1532 లో నాలుగు దండయాత్రలు చేశాడు. రాచకొండ, దేవరకొండ, పానుగల్లు, ఖనాపూర్ దుర్గాలను, మొదటి దండయాత్ర లోను, ఎల్లందుల, మలంగూర్ దుర్గాలను రెండవ దండయాత్ర లోను, మూడవ దండయాత్రలో ప్రతాపరుద్ర గజపతి సామంతుడైన, వరంగల్ పాలకుడైన షితాబ్ ఖాన్ అనబడే సీతాపతిని, కొండవల్లిని పరిపాలిస్తున్న ప్రతాపరుద్ర గజపతి కుమారుడిని ఓడించి, వరంగల్, ఖమ్మంమెట్‌లను ఆక్రమించాడు. విజయనగర పాలకుడైన అచ్యుతరాయల అధీనంలో నున్న కొండపీడు, కొండపల్లి, బెల్లంకొండ దుర్గాలను, గజపతుల అధీనంలో నున్న ఏలూరు, రాజమండ్రిలను, 4వ దండయాత్రలో జయించాడు. గజపతులు, అచ్యుతరాయలు, కులికుతుబ్ షాతో సంధి చేసుకున్నారు. గజపతులు, కులికుతుబ్ షా గోదావరిని రెండు రాజ్యాలకు సరిహద్దుగా ఒప్పుకొన్నారు. సంధిచేసుకొన్న అచ్యుత రాయలు, బిజాపూర్ సుల్తాన్‌తో కలసి దండెత్తిరాగా, కులికుతుబ్ షా వీరిద్దరిని ఓడించి, కోవిలకొండ, కోహీర్ దుర్గాలను ఆక్రమించాడు. నల్గొండ పాలకుడైన హలిచంద్ తిరుగుబాటు చేయగా, అతడిని ఓడించాడు. అంతేగాక, మెదక్ దుర్గాన్ని, బిజాపూర్ సుల్తానైన ఆలీబరీద్ వద్ద నుండి పొందాడు. కులికుతుబ్ షా 1543 లో కుమారుడైన జంషీద్‌చే హత్య చేయబడే సమయానికి, గోల్కొండ రాజ్యంలో నేటి తెలంగాణా, కృష్ణా, గోదావరి నదుల మధ్య నున్న తీర ప్రాంతం చేరున్నాయి. ఈ కులికుతుబ్ షా 90 సంవత్సరాల వరకు జీవించాడు. ఈయన సాహసవంతుడైన యోధుడు, యుద్ధ వ్యూహ నిపుణుడు. దాదాపు ఆరు దశకాలపాటు తెలంగాణాను సైన్యాధికారిగా, రాష్ట్ర పాలకుడిగా, స్వతంత్రుడైన సుల్తాన్‌గా ఎంతగానో ప్రభావితం చేశాడు.

BRAOU

కులీకుతుబ్‌షా అనంతరం, అధికార కాంక్ష తీవ్రంగా వున్న జంషీద్, అన్నను గుడ్డివానిగా చేసి, తమ్ముడిని బంధించుటకు ప్రయత్నంచేసి, అధికారాన్ని చేజిక్కించుకొని, 1543 నుండి 1550 వరకు పాలించాడు. జంషీద్ మెదక్, కొలాస్ దుర్గాలను జయించాడు. అంతేగాక, తన దౌత్య నీతి కుశలత వల్ల బిజాపూర్, అహ్మద్‌నగర్ సుల్తాన్‌ల రాజ్య విస్తరణను అరికట్టి, తెలంగాణాను బలమైన రాజ్యంగా రూపొందించాడు. జంషీద్ చనిపోయిన తర్వాత, కుతుబ్‌షాహి రాజ్యంలో అనిశ్చిత పరిస్థితులు తలెత్తాయి. సింహాసనం కొరకు రెండు వర్గాలు ఏర్పడ్డాయి. ఒక వర్గం జంషీద్ కుమారుడు సుభాన్‌ను పాలకుడిగా చేయగా, మరొక వర్గం కులికుతుబ్‌షా కుమారుడైన ఇబ్రహీంను పాలకునిగా ఆమోదించారు. ఈ మధ్యలో కొలాస్ దుర్గాధిపతి జగదేవరావ్, కులీ మరొక కుమారుడైన దౌలత్‌ను పాలకునిగా చేయుటకు ప్రయత్నం చేశాడు. చివరకు ఈ ప్రయత్నాల్లో ఇబ్రహీం వర్గం విజయాన్ని సాధించగా, ఇబ్రహీం కుతుబ్‌షా 1550 లో గోల్కొండ పాలకుడైనాడు.

ఇబ్రహీం కుతుబ్‌షా, కులికుతుబ్‌షా కుమారుడు. అన్న అయిన జంషీద్ బందీగా చేయబోగా, తప్పించుకొని పారిపోయి, విజయనగరంలో అళియరామరాయల అనుగ్రహంతో తలదాచుకొని, అనుకూల వాతావరణంలో గోల్కొండ పాలకుడైనాడు. ఈతడు తండ్రి, అన్న అడుగుజాడల్లో నడచినా, రాజ్య విస్తరణ కన్నా, రాజ్య సుస్థిరతకు ప్రాధాన్యమిచ్చాడు. ఈతడు యాదగిరిని గోల్కొండ రాజ్యంలో చేర్చాడు. ఈతని పరిపాలనా కాలంలో విజయనగర పాలకులు, ఈతని రాజ్యంలో కుట్రలు, చీలికలను ప్రోత్సహించగా, దౌత్య నీతితో, విజయనగర పాలకులతో సంధి చేసుకున్నాడు. దీని వలన ఇబ్రహీం కుతుబ్‌షా పాన్‌గల్, ఘనాపూర్ దుర్గాలను కోల్పోయినా, మిగిలిన భాగం అతని అధీనం లోనే వుంది. ఈ సంధి అనంతరం రామరాజు కుత్సిత బుద్ధితో ప్రవర్తించినా, ముందు చూపుతో, రాజనీతితో, రామరాయల ప్రయత్నాలను ఫలించకుండా చేయగలిగాడు. షితాబ్‌ఖాన్, విద్యాధరుడు ఏలూర్, రాజమండ్రిలను వశం చేసుకోగా, వారిని బారపల్లి వద్ద గోల్కొండ సైన్యాలు బంధించాయి. దాంతో, విజయనగర, బిజాపూర్ సైన్యాలు వెనక్కి వెళ్ళిపోయాయి.

ఇబ్రహీం కుతుబ్‌షా, బిజాపూర్, అహమ్మద్ నగర్, బీదర్ పాలకులతో చేరి, నల్గురు సుల్తాన్‌ల కూటమిలో సభ్యుడై, విజయనగరం మీద కృష్ణ, బన్నిహట్టి, లేక రాక్షసతంగడి అనే చోట, 1565 లో యుద్ధం చేశాడు. ఆ యుద్ధంలో విజయనగరం ఓడిపోయింది. కాని, వారి మధ్య కుదిరిన సయోధ్య మరల చెడిపోయి, బిజాపూర్, అహమ్మద్‌నగర్, బీదర్‌ల మధ్య యుద్ధ వాతావరణం తలెత్తినప్పుడు, ఇబ్రహీం కుతుబ్‌షా దక్కన్ సుల్తాన్‌ల మధ్య సమతౌల్యాన్ని సాధించేందుకు కృషి చేసి, యుద్ధాన్ని ఆపగలిగాడు కాని, 1569 నాటికి ఈ కూటమి ఛిన్నాభిన్నమైంది. ఇబ్రహీం కుతుబ్‌షా రాక్షసతంగడి యుద్ధానంతరం దండయాత్ర చేసి, తన రాజ్యాన్ని ఈశాన్య దిక్కున పొట్నూర్ వరకు విస్తరింప చేశాడు. అంతేగాక, 1579 సంవత్సరం మొదట్లో, ఇబ్రహీం, శ్రీరంగరాయల తమ్ముడైన వెంకటపతి రాయలను ఓడించి, ఉదయగిరిని ఆక్రమించాడు. ఆ తర్వాత ఇబ్రహీం సైన్యాలు అదే సంవత్సరంలో మార్చి, ఏప్రియల్ నెలల్లో, వినుకొండ, కొచ్చర్లకోట, కంబం, కొండవీడులను జయించాయి. ఈ విధంగా పరిపాలించిన 30 సంవత్సరాల కాలంలో, ఒక వైపున రాజ్య సుస్థిరతకు కృషి చేస్తూనే, అందుకు అడ్డు వచ్చిన వారితో యుద్ధాలను చేస్తూ, 1580 మే నెలలో ఇబ్రహీం కుతుబ్‌షా చనిపోయాడు. కుతుబ్‌షా స్వతంత్ర రాజ్య వంశ స్థాపకుడు కులికుతుబ్‌షా కాగా, వాస్తవ నిర్మాత ఇబ్రహీం కుతుబ్‌షా. ఈతని కాలంలో కుతుబ్‌షాహీల అధికారం ఆంధ్ర దేశ మంతటా విస్తరించింది. ఈతని కాలం నుండే గోల్కొండ సుల్తాన్‌లు 'షా' బిరుదాన్ని ధరించడ మారంభించారు. రాజ్యంలో శాంతిభద్రతలను నెలకొల్పడానికి శ్రద్ధ వహించాడు. కుతుబ్‌షాహీ పాలకుల్లో మొదటగా నాణేలను

BRAOU

చేసినవాడు ఇతడే. ఈతనికి ఆరుగురు కుమారులు. వారిలో ఒకడైన మహమ్మద్ కులి కుతుబ్ షాను సుల్తాన్‌గా ఎంచుకొన్నారు.

మహమ్మద్ కులి కుతుబ్ షా 32 సంవత్సరాలపాటు క్రీ.శ. 1580 నుండి 1612 వరకు పాలించాడు. బిజాపూర్ సుల్తాన్‌తో తండ్రి ఆరంభించిన వైరాన్ని కొనసాగించాడు. కాని, ఫలితం దక్కలేదు. మొగలాయీలకు వ్యతిరేకంగా అహమ్మద్‌నగర్ చేస్తున్న ప్రయత్నాలను సమర్థించాడు, మహమ్మద్ కులి. అంతేగాక, ధన సహాయాన్ని కూడా చేశాడు. మహమ్మద్ కులి సైన్యాలు విజయనగర పాలకునితో యుద్ధం చేశాయి. ఆ సందర్భంగానే, గోల్కొండ సైన్యం కృష్ణను దాటి, మొసలిమడుగు చేరుకొని, గుత్తి, కర్నూల్, గండికోట దుర్గాలను జయించి, వెంకటపతిరాయల రాజధానైన వెను గొండను ముట్టడించింది. ఈ ప్రయత్నంలో వెంకటపతిరాయలు తెలివితేటలతో సమయాన్ని కోరి, తన సైన్యాన్ని సమీకరించి, దెబ్బతీయడంతో, వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతూ, తనకు అనుకూలురను మొసలిమడుగు లోను, నంద్యాల లోను, గండికోట లోను నియమించాడు. కాని, గండికోటను విజయనగర పాలకులు చేజిక్కించుకొన్నారు. ఈతని ఆస్థానానికి లక్బర్ ఒక రాయబార వర్గాన్ని పంపగా, వారిని సత్కరించి పంపాడు మహమ్మద్ కులి. ఈతని కాలం లోనే, బ్రిటీష్ ఇండియా వర్తక సంఘం వారు మచిలీ పట్నంలో ఒక వర్తక స్థావరాన్నేర్పుకొన్నారు. మహమ్మద్ కులి 1612 లో చనిపోయాడు. మహమ్మద్ కులిని చిరస్థాయిగా మరచిపోకుండా చేసేది, హైదరాబాద్ నగర నిర్మాణం. ఈ నగర నిర్మాణం 1591లో ఆరంభమైంది. 1592 లో పూర్తైంది. ఇంకా, అనేక మసీదులు, ఉద్యానవనాలు, చెరువులను నిర్మింపచేశాడు.

మహమ్మద్ కులి కుతుబ్ షా అనంతరం, సోదరుని కొడుకు, అల్లుడైన మహమ్మద్, సుల్తాన్ మహమ్మద్ కుతుబ్ షా అనే పేరుతో, క్రీ.శ. 1612 నుండి 1626 వరకు, 14 సంవత్సరాలు పరిపాలించాడు. ఈతని పరిపాలనా కాలంలో బస్తర్ పాలకుడైన ప్రతాప్‌షా తిరుగుబాటు చేయగా, అణచివేసి, ప్రతాప్‌షాను సామంతునిగా చేసుకున్నాడు. ఈతని వద్దకు మొగల్ రాకుమారుడు ఖుర్రం, అహమ్మద్‌నగర్ పాలకునకు ఎట్టి సాయం చేయవద్దని కోరుతూ, రాయబారాన్ని పంపాడు. ఆ రాయబార వర్గాన్ని ఉచిత రీతిని సత్కరించాడు. మొగలాయీలతో స్నేహాన్ని పెంచుకొన్నాడు. అహమ్మద్ నగరం మొగలాయీలకు లొంగిపోగా, కుతుబ్‌షాహీలు 12 లక్షల నష్టపరిహారాన్ని మొగల్‌లకు చెల్లించేందుకు అంగీకరించారు. అంతేగాక, ఖుర్రం రాకుమారుడు తిరుగుబాటు చేయగా, అతనికి తన రాజ్యం గుండా ప్రయాణం చేయడానికి అనుమతి నిచ్చాడు. ఈతని కాలం నాటికి, తూర్పు కోస్తా తీరంలో డచ్చివారు, ఆంగ్లేయులు, వర్తక స్థావరాలను స్థాపించుకొన్నారు. డచ్చివారు మచిలీపట్నం, నిజాం పట్నం, పులికాట్‌ల లోను, ఆంగ్లేయులు మచిలీపట్నం, పులికాట్, నాగపట్నం లోను, వర్తక కేంద్రాలను నిర్మించుకొన్నారు.

సుల్తాన్ మహమ్మద్ పెద్ద కుమారుడు అబ్దుల్లా కుతుబ్ షా, క్రీ.శ. 1626 నుండి 1672 వరకు, అర్ధ శతాబ్దం పాటు పరిపాలించాడు. మొగలాయి చక్రవర్తి ఔరంగజేబ్ గోల్కొండ రాజ్యంపై 1656 లో దాడి చేశాడు. ఈతని సమకాలీనుడైన మొగలాయి చక్రవర్తి షాజహాన్. సుల్తాన్ కోరికపై, మీర్‌జుమ్లా కర్ణాటకపై దండెత్తి, విజయాన్ని సంపాదించి, సంపదను దోచుకొని, ప్రోగు చేసి, ఆ డబ్బుతో ప్రభువులను, సైనికాధికారులను తమ పక్షం వైపుకు తిప్పుకొన్నాడు. సుల్తాన్ అధికారాన్ని మీర్‌జుమ్లా ధిక్కరించుటచే, గోల్కొండ సుల్తాన్ మీర్‌జుమ్లాను శిక్షించగా, మీర్‌జుమ్లా ఔరంగజేబ్ సహాయాన్ని అర్థించాడు. ఇట్టి పరిస్థితుల్లోనే ఔరంగజేబ్ అబ్దుల్లా కుతుబ్ షాపై దండెత్తి వచ్చాడు. అబ్దుల్లా కుతుబ్ షా తన కుమార్తెను ఔరంగజేబ్ కుమారునకు ఇచ్చి వివాహం చేసి, నష్టపరిహా

BRAOU

రాన్ని చెల్లించేందుకు ఒప్పుకొని, సంధిచేసుకున్నాడు. అబ్దుల్లా కుతుబ్ షాకు మగ పిల్లలు లేరు. అందుచేత, అతని మూడవ అల్లుడు, అబుల్ హసన్ కుతుబ్ షా, క్రీ.శ. 1672 నుండి 1687 వరకు, 15 సంవత్సరాలు పాలించాడు. ఈయనే తానీషాగా చరిత్రలో ప్రసిద్ధికెక్కాడు. ఈతని పరిపాలనా కాలమంతా, మొగలాయీలు, మహారాష్ట్రులు, అదిల్ షాహీలు, కుతుబ్ షాహీల మధ్య, యుద్ధాలు సాగాయి. శివాజీ మొగలాయీలతో చేసిన యుద్ధంలో, తానీషా సహాయపడ్డాడు. చివరకు, 1687 లో ఒక సారి, 1688 లో ఒక సారి, మొగల్‌లు దండెత్తొచ్చి, గోల్కొండను అతి కష్టం మీద జయించగలిగారు. అబుల్ హసన్ తానీషాను ఔరంగజేబ్ బందిగా చేసి, దౌలతాబాద్ కోటలో బంధించాడు. బందీగా 12 సంవత్సరాలుండి, క్రీ.శ. 1700లో మరణించాడు. ఈ విధంగా, కుతుబ్ షాహీ వంశం, గోల్కొండ రాజ్యం, చరిత్ర కాలగర్భంలో కలసిపోయాయి.

23.5 : కుతుబ్ షాహీల నాటి సామాజిక, ఆర్థిక వ్యవస్థ: కుతుబ్ షాహీల సేవలు

పైన చెప్పుకున్నట్లు, కుతుబ్ షాహీ వంశం 16వ శతాబ్దం మొదటి నుండి 17వ శతాబ్దం చివర వరకు, దాదాపు రెండు వందల సంవత్సరాలు ఆంధ్ర దేశాన్ని పరిపాలించింది. కుతుబ్ షాహీల చరిత్ర మహావైభవమైందే కాక, సాంస్కృతికంగా ఎంతో సుసంపన్నమైంది. కుతుబ్ షాహీలు వారు సాధించిన యుద్ధ విజయాల కంటే, వారు ఆంధ్ర దేశానికి చేసిన సేవ వల్లనే చిరస్థాయైన కీర్తిని గడించారు. అట్టి కుతుబ్ షాహీల సేవ గురించి, ఈ క్రింది పుటల్లో మరింత వివరంగా చెప్పుకుందాం.

మధ్య యుగం లోని అన్ని రాజ్యాల వలె, గోల్కొండ రాజధానిగా పరిపాలించిన కుతుబ్ షాహీ రాజ్యంలో, సుల్తాన్ సర్వాధికారి. కుతుబ్ షాహీ పాలకులు తాము భగవంతుని ప్రతినిధులమని భావించారు. సుల్తాన్ సర్వాధికారై ఒక్కడే పరిపాలన చేయలేడు కాబట్టి, సలహా మండలి ఉండేది. ఆ సలహా మండలిని మజ్లిస్-ఇ-కింగాష్ అంటారు. అందులో మంత్రులకు, అమీర్‌లకు సభ్యత్వముంది. మంత్రుల్లో ముఖ్యుడిని, లేదా ప్రధాన మంత్రిని, పీర్ జుమ్లా అంటారు. ఇంకా, అనేక శాఖలకు సంబంధించిన మంత్రులున్నారు. అబుల్ హసన్ పరిపాలనా కాలంలో మజ్లిస్-ఇ- కింగాష్, మజ్లిస్-ఇ-దివాన్ దారిగా పనిచేసింది.

బహమనీల వలెనే, వీరు కూడా రాజ్యాన్ని తరఫ్‌లుగా విభజించారు. అబుల్ హసన్ కాలంలో, ఆరు తరఫ్‌లున్నాయి. ఈ తరఫ్‌లను సర్కార్లు గాను, సర్కార్లను పరగణాలు గాను, విభజించారు. సర్కార్లు, పరగణాల్లో ఉద్యోగులున్నారు. కుతుబ్ షాహీల కాలంలో మచిలీపట్నం ఒక ప్రధానమైన రేవు పట్టణం. రేవు పట్టణ ప్రధాన అధికారిని, షావందర్ అన్నారు. ఈతని ముఖ్య విధి, రెవిన్యూ వసూలు చేయుట. రేవు పట్టణాలను వేలం వేసే ఆచారముండేది. ఆనాడు సర్కార్లను సీమలన్నారు. బెల్లంకొండ, వినుకొండ, విశాఖపట్నం, కొండపల్లి, మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రి వంటి సీమలు 22 ఉన్నాయి. కుతుబ్ షాహీల కాలంలో చిన్న చిన్న రేవు ఉద్యోగులను దేశ్‌పాండే, థాణేదార్, దేశ్‌ముఖ్ అని పిల్చారని, వారి ఫర్మానాల వల్ల, సనద్‌ల వల్ల తెలుసుకోవచ్చు.

కుతుబ్ షాహీలు ఉద్యోగ నియామకాల్లో, మతపరమైన తేడాను చూపించ లేదు. విజయనగర పాలకులతో ఘర్షణ జరిగినా, కులికుతుబ్ షా కొలువులో రామరాజు ఉండగా, రామరాజు కొలువులో కులికుతుబ్ షా కుమారుడు ఫిరోజ్ ఆశ్రయం పొందాడు. జగదేవరావు జంషీద్ పాలనలో ఉన్నత స్థానాన్ని పొందాడు. మురహరిరావ్ ఇబ్రహీం కుతుబ్ షా కాలంలో ప్రఖ్యాతి నొందాడు. షేర్వాణి

BRAOU

ప్రకారం, అబుల్ హసన్ కాలంలో బ్రాహ్మణులు ఎంతో ప్రాబల్యాన్ని కలిగి ఉండేవారు. అబుల్ హసన్ కొలువులో మాదన్న ప్రధాన మంత్రిగా నియమించబడగా, అక్కన్న రక్షణ మంత్రిగా వ్యవహరించాడు. అక్కన్న, మాదన్నలను తొలగించమని మొగలాయి చక్రవర్తి ఔరంగజేబ్ పత్తిడి చేసినా, అబుల్ హసన్ ఒప్పుకోలేదు. తన రాజ్యం నాశనం కాబోతున్నా, తాను నమ్మిన దాన్ని అబుల్ హసన్ వదలి పెట్టలేదు.

అన్ని మధ్య యుగ రాజ్యాల వలె, కుతుబ్‌షాహీలు కూడా సైన్య ఏర్పాటుకు జాగీర్దారీ విధానాన్ని సమర్థించారు. ఆనాటి కుతుబ్‌షాహీ సైన్యంలో కాలిబంట్లు , గుఱ్ఱపు రౌతులు, శతఘ్ని దళం ముఖ్యమైన భాగాలు. వీరికి సిద్ధ సైన్యముంది. గోల్కొండ కోట చుట్టుకొలత 5 మైళ్ళు. గోల్కొండ కోట గోడలు ఎత్తుగా, చాలా మందంగా నిర్మించబడ్డాయి. ఈ కోట గోడల మీద ఫిరంగులు అమర్చబడేవి. కుతుబ్‌షాహీ రాజ్యంలో 66 కోటలున్నాయి. కొండపల్లి, కొండవీడు, బహు దుర్భేద్యమైన కోటలు కాగా, రాజమండ్రి, ఏలూరు, కోయిలకుంట్ల, ఘనాపురం, పానగల్ మొదలగు చోట్ల వున్న కోటలు చిన్నవి. మొదట్లో సైనికుల్లో దేశ వాసులే ఎక్కువ. కాని, అబుల్ హసన్ తానీషా కాలం నాటికి, ఐరోపీయులు కూడా సైన్యంలో ఉన్నారు. కుతుబ్‌షాహీలు కూడా మిగిలిన పాలకుల వలె, జాగీర్దారీ వ్యవస్థలో హోదాను బట్టి, అంతరువులను ఏర్పాటు చేశారు. కొంత వరకు మొగలాయిల మన్సబ్‌దారీ విధానాన్ని పోలి వుంది. ఈ జాగీర్దార్లు అందరూ సంవత్సరానికి ఒక సారి ప్రభువులను దర్శించుకొనేవారు. అంతేకాక, సుల్తాన్ భవనాన్ని పహరా కాచేవారు. గ్రామ పరిపాలనా వ్యవస్థలో పెద్ద మార్పులను ప్రవేశపెట్ట లేదు. ప్రతి గ్రామం లోను, బలోతిదార్లనబడే 12 మంది ఆయగార్లున్నారు. వారు: పటేల్, కుల్‌కర్ణి, చౌద్రి, ఫోతేదార్, దేశ్‌పాండ్య, నహని (మంగలి), పారిత్ (చాకలి), సుతార్ (వడ్రంగి), కుంబార్ (కుమ్మరి), జోషి (జ్యోతిష్కుడు). గ్రామాల్లో కాపలా గాయటానికి తలార్లుండగా, కొన్ని చోట్ల దేశకావలి పద్ధతి అమల్లో ఉంది.

కుతుబ్‌షాహీలు హిందువుల సంప్రదాయక ధర్మ విషయాల్లో జోక్యం చేసుకోలేదు. అట్టి తగ వులను కుల సభకు అప్ప చెప్పేవారు. బహుమనీల న్యాయ విధానాన్ని పాటించారు. కురాన్, రాజ ధర్మానాలు, స్థానిక ఆచారాలతో కూడిన మూడు విధాలైన న్యాయ చట్టాలు అమల్లో ఉన్నాయి. సుల్తాన్ తీర్పుకు అప్పీల్ లేదు. సుల్తాన్‌కు స్వయంగా తమ కష్టాలను విన్నవించుకోటానికి, సామాన్య ప్రజానీకానికి అవకాశముండేది.

విదేశీ యాత్రికులు, కుతుబ్‌షాహీల రాజ్యం సుసంపన్నమైందని చెప్పారు. ఫ్రెంచి యాత్రికుడు టావెర్నియర్, ఆనాడు ప్రతిదీ సమృద్ధిగా దొరికేదన్నాడు. 17వ శతాబ్ది నాటి బోరె అను బ్రిటీష్ చర్మకుడు, ఏవో కొన్ని తప్ప, అవసరమైన ఖనిజాలున్నాయన్నాడు. ఒక అజ్ఞాత లేఖకుడు కోస్తా తీరంలో సహజ సంపదలు అధికంగా ఉన్నాయన్నాడు. ఆనాడు పరిటాల, మాత్తెపల్లె, గోలపల్లె లోను, కర్నూల్ జిల్లా లోని బనగానిపల్లె, మునిమడుగు, రామల్లకోట, తిమ్మాపురంలో, వజ్రాలు దొరికాయి. థెవెనాట్ అను ఫ్రెంచి వైద్యుడు, సుల్తాన్ కిరీటంలో అమూల్యమైన వజ్రాలున్నాయని, ఒక రత్నాల గులాబి ఉందని రాశాడు. విదేశీ యాత్రికులు పేర్కొన్న సంపద, అతి తక్కువ మందికి మాత్రమే ఉపయోగపడింది. సామాన్యుల జీవితాలు ఎంతో దుర్భరంగా ఉన్నాయి. దీన్నే, వెనిస్ యాత్రికుడు ఈ క్రింది విధంగా పేర్కొన్నాడు: "ఏ విధంగా సైతేనేం, రైతుకు ఏమి మిగలదు. ఎక్కడికి పారిపోదామన్నా, అక్కడా అదే పరిస్థితి. ఇల్లు, వాకిలి ఉండదు, కొత్త చోటు. అల్లాగని దెబ్బలకు కొదువ లేదు" అన్నాడు. సామాన్య రైతులతోపాటు, వృత్తి పనులవారు, చిన్న వర్తకులు కూడా, ప్రభుత్వోద్యోగుల చేతిలో క్రూర హింసకు గురయ్యారని, బెర్నియర్ రాశాడు.

BRAOU

కుతుబ్‌షాహీలకు ప్రభుత్వ ఆదాయం ప్రధానంగా భూమి పన్ను ద్వారా వచ్చేది. భూమి పన్ను గాక, ధాన్యం, ఉప్పు, పశువుల రవాణా మీద పన్నులను వసూలు చేశారు. రైతులు, ప్రజలపై ఆర్థిక దోపిడి ఉన్నా, కుతుబ్‌షాహీలు వ్యవసాయాభివృద్ధికి, వర్తక వ్యాపారాభివృద్ధికి కృషి చేశారు. కొత్త చెరువులను త్రవ్వించారు. పాత వాటిని బాగు చేయించారు. కాలువలు, నదులను త్రవ్వించారు.

ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో జరిగిన మరమ్మత్తుల గురించి తెలుపుతూ, 1561 నాటి ఒక శాసన ముంది. ఆ శాసనం ప్రకారం ఆ చెరువు క్రింద సాగయ్యే పంటను 1 : $1\frac{1}{2}$: 1 : 1 క్రింద, రాజు, రైతు, సిపాయి, బ్రాహ్మణులు పంచుకొన్నారు. మహమ్మద్ కుతుబ్‌షా తల్లి కానమ్ ఆగా, హైద్రాబాద్‌లో మసాబ్ ట్యాంక్‌ను త్రవ్వించింది. కుతుబ్‌షాహీలు పాత ఊళ్ళను, కొత్త ఊళ్ళను ప్రోత్సహించారు. ఉదాహరణకు, అబుల్ హసన్ కుతుబ్‌షా కాలంలో హస్నాబాద్ అనే గ్రామం, కొత్తగా ముర్తాజానగర్ (గుంటూర్) లో రూపొందింపబడింది. ఈ గ్రామస్థుల వద్ద నుండి 5 సంవత్సరాలపాటు, వర్తకుల వద్ద నుండి జకాత్ పన్నును వసూలు చేయవద్దన్నాడు. మిగిలిన మధ్య యుగపు రాజ్యాల లాగే, వీరు కూడా భూమిపై వ్యక్తి స్వామ్యాన్ని గుర్తించారు. ఆనాటి శాసనాలు దీన్ని బుజువుపరుస్తున్నాయి. కుతుబ్‌షాహీలు హిందూ వ్యవస్థ లోని పెచ్చుతగ్గులను అలాగే కొనసాగించారు. కుతుబ్‌షాహీల కాలంలో మనం గుమనించాల్సిందేమనగా, స్వయంసంపూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ శిధిలమై, మార్కెట్ ఆర్థిక వ్యవస్థకు అవసరమైన ప్రాథమిక నేపథ్యం తయారైంది.

కుతుబ్‌షాహీ వంశ స్థాపకుడైన కులీకుతుబ్‌షా రాజ్య మతం షియా మతమని ప్రకటించాడు. కాని, మత తత్వంతో పరిపాలన సాగించ లేదు. కుతుబ్‌షాహీలు తాము పరిపాలిస్తున్న ప్రాంతాన్ని, ప్రజల్లో అధిక సంఖ్యాకుల మనోగతాన్ని అర్థం చేసుకొని హిందువులతో సఖ్యతను వాంఛించారుకాని, ఘర్షణ కాదు. సుల్తాన్‌లు మసీదులను కట్టించారు; దానితోపాటుగా దేవాలయాలకు దానాలిచ్చారు. అబుల్‌హసన్ తానీషా భద్రాచలం దేవాలయానికి శంకరగిరి, పాల్వంచ గ్రామాలను దానం చేశాడు. అలాగే, కృష్ణా తీరంలో నున్న మల్లేశ్వర ఆలయానికి భోగాపురం, చెరుకూరు, వీరన్నపట్నాలను దానంగా ఇచ్చాడు. ఒక వాల్మీకి కులం వానికి కందుకూరు సీమలో దేవాలయాలను మరమ్మత్తు చేసిందానికి, చుండి గ్రామంలో ఒక అమరాన్నిచ్చినట్లు, శాసనాధారముంది. వీరు అగ్రహారాలను కూడా దానం చేశారు. ఉప్పునూతల అగ్రహారాన్ని ముగ్గురు బ్రాహ్మణులకు, మహమ్మద్‌కులి గౌరవార్థం, లాల్‌ఖాన్ దానమిచ్చాడు.

కుతుబ్‌షాహీల వాస్తు నిర్మాణంలో కూడా, హిందూ వాస్తు నిర్మాణ ప్రభావముంది. అబ్దుల్లా హసన్ దర్బార్ లోని ముసాఖాన్ కట్టించిన మసీదులో, పూర్ణ కుంభాకృతి చోటు చేసుకుంది. అలాగే, ఏనుగుల ముఖాలను జాజులుగా ఉపయోగించారు. నేలటూరి వెంకటరమణయ్య మాటల్లో, సుల్తాన్ కులికుతుబ్‌షా మత సహనాన్ని కనబర్చడమేకాక, రాజకీయ హక్కుల విషయంలో పక్షపాతం చూపలేదు. కుతుబ్‌షాహీలు పరదేశీయులమని, పర మతం వారని భావించలేదు. కుతుబ్‌షాహీలు వినుకొండ, కంబం, శ్రీకాకుళం, హైద్రాబాద్, మొదలైనచోట్ల మసీదులను కట్టించారు. వాటి నిర్వహణకయ్యే ఖర్చును భరించారు. ప్రభువులు, జాగీర్దార్లే కాక, సామాన్య ప్రజానీకంలో కూడా, మత తత్వం కన్నా మత సహనమే ఎక్కువగా ఉంది. అనాటి సూఫీ మతం ప్రజల ఆలోచనలపై, నడవడికపై, గణనీయమైన ప్రభావాన్ని చూపించింది. కొన్ని మూఢాచారాలు బలంగా నాటుకు పోయాయి. అట్టి వాటిలో సతీసహగమనం ఒకటి. ఈ కాలంలో సహగమనం కొంతవరకు ఐచ్ఛికంగాను, కొంతవరకు బలవంతంగాను జరిగేదని, కంభంపాటి సత్యనారాయణ అభిప్రాయపడ్డారు.

BRAOU

వర్ణాశ్రమ ధర్మంలో చెప్పుకోదగ్గ మార్పులొచ్చాయి. బోరే అను బ్రిటీష్ వ్యక్తి, దేశ ప్రజలపై బ్రాహ్మణుల పలుకుబడి కలదన్నాడు. వైశ్యులు వర్తకం చేయటమే కాక, లెక్కలను బాగా కట్టగలరని, అస్పృశ్యులు ఊరికి దూరంగా ఉంటారని, హిందూ స్త్రీలు స్వేచ్ఛగా తిరుగుతారని, ముస్లిం స్త్రీలు ఇతరుల కంటబడరని, ఫ్రయర్, టావెర్నియర్‌లు రాశారు. ఆనాటి సమాజంలో వితంతువుల పరిస్థితి దారుణంగా ఉండేదని, మేక్‌వోల్డ్ అను బ్రిటీష్ వ్యాపారి రాశాడు. టావెర్నియర్ అనే ఫ్రెంచి యాత్రికుని మాటల్లో, వేశ్యలను, దేవదాసీలను, పాలకులు ఆదరించారు. ఈ వేశ్యలు ధనవంతులని, మేక్‌వోల్డ్ రాశాడు.

కుతుబ్‌షాహీలు రాజ భాషగా పర్షియన్‌ను ప్రోత్సహించారు. పర్షియన్ ఆనాటి వారి సాహిత్య భాష. కులీకుతుబ్‌షా పర్షియన్ భాషలో గొప్ప పండితుడు, కవి, అనేక గ్రంథాలను రచించాడు. అతని ఆస్థానం లోని పీష్వా మీర్ మహమ్మద్ మోమెన్, వైద్యం గురించి, నీతి, తూకాలు-మానాల మీద, పర్షియన్ భాషలో గ్రంథాలను రచించాడు. చరిత్ర రచయిత ఫెర్వాణి ప్రకారం, గోల్కొండ పాలకులు విద్యను ప్రోత్సహించుటచే, అనేక మంది పర్షియన్ కవులు హైదరాబాద్ చేరుకున్నారు. ఈ కాలంలో పర్షియన్‌తో బాటుగా, ఉర్దూ భాష బాగా అభివృద్ధి చెందింది. మహమ్మద్ కులి ప్రముఖ ఉర్దూ కవి. గజల్ ఈయనకు ప్రత్యేకంగా ప్రేమపాత్రమైంది. మహమ్మద్ కులీకుతుబ్‌షా మహమ్మదీయ, హిందూ పండుగలను, ఉత్సవాలను ప్రోత్సహించాడు. అంతేకాక, వాటిని గురించి కవిత్వం చెప్పాడు. ఈతని ఆస్థానంలో వజిహి, అహ్మద్ అనే ఇద్దరు ప్రసిద్ధ ఉర్దూ కవులున్నారు. **లైలామజ్నూ** కావ్య రచయిత వజిహి, ఈ ఆస్థానానికి చెందిన వాడే. అబ్దుల్లా కాలంలో ఉర్దూ సాహిత్యం అత్యున్నత శిఖరాలను అధిరోహించింది. సుల్తాన్ స్వయంగా కవి, పండితుడు. అబ్దుల్లా కాలం నాటి గొప్ప కవి, మాలి కుష్-షియారాగవాని. ఇతను దక్కని ఉర్దూలో గొప్ప కావ్యమైన **" సైఫల్ ముల్క్ వాబదియుల్ జమాల్'** ను, 1565 లో రచించాడు. ఉర్దూ వ్యాప్తికి సూఫీ మతం ఎంతగానో తోడ్పడింది. సూఫీలకు తోడు, వర్తకుల వల్ల కూడా, ఉర్దూ బాగా ప్రచారం లోకి వచ్చింది. ఉర్దూ, పర్షియన్ భాషల్లోకి ఉపనిషత్తులు, రామాయణం అనువాదం చేయబడ్డాయి. ఆశ్చర్యకరంగా, ఉర్దూ, పర్షియన్ భాషల్లో 24 రకాల రామాయణాలు రచించబడ్డాయి.

కుతుబ్‌షాహీలు ఉర్దూ, పర్షియన్‌తోపాటు, తెలుగు భాషాభివృద్ధికి కృషి చేశారు. ఇబ్రహీం కుతుబ్‌షా కవి; పండితులను పోషించి, తెలుగు కృతులను అంకితం పుచ్చుకొన్నాడు. అద్దంకి గంగాధర కవి **'తపతిసంవరణోపాఖ్యానం'**ను రాసి, ఇతనికి అంకిత మిచ్చాడు. తెలుగు కవుల పద్యాల్లో ఇబ్రహీం ఇభరాముడయ్యాడు. ఆరుద్రన్నట్లు పాలకుడు మహమ్మదీయుడైనా, అతడిని 'హైందవ దేవతలు రక్షింతురు గాక' అని కవులు దీవించారు. ఇతని ఆస్థానంలో మీర్ జుమ్లా పదవి కలిగిన అమీర్‌ఖాన్ కూడా, తెలుగు కావ్యాన్ని అంకితం పుచ్చుకున్నాడు. గోల్కొండ పోషణలో, అద్దంకి గంగాధరుడు, **'యయాతి చరిత్ర'**ను రచించిన పొన్నెకంటి తెలగన్న; **'వైజయంతీవిలాసం'**ను రాసిన సారంగు తమ్మయ్య; **'సుగ్రీవ విజయం', 'నిరంకుశోపాఖ్యానం'**లను రాసిన కందుకూరి రుద్రకవి; **'నిరోష్ఠ్య రామాయణం'** పేరుతో దశరథ రాజనందన చరిత్రను రచించిన మరింగంటి సింగరాచార్యుడు; **'రాజనీతి రత్నాకరం'** అనే వైష్ణవ ప్రబంధంగా పంచతంత్రంను రూపొందించిన కృష్ణయామాత్యుడు, ఇత్యాది కవులున్నారు. ఇబ్రహీంకులి అనంతరం రాజ్యానికి వచ్చిన మహమ్మద్ కులి కూడా, సాహిత్య పోషకుడు. మహమ్మద్‌కులి ఆస్థానంలో **'శివధర్మోత్తరం', 'పద్మపురాణం'**లను రచించిన రాజమల్లా రెడ్డి కవి ఉన్నాడు. ఆరుద్ర రాసినట్లు, మహమ్మద్ కులి తెలుగులో స్వచ్ఛమైన కవిత్వాన్ని చెప్పగలవాడటు. అయితే, అతని తెలుగు రచనలు మనకు దొరక లేదు. అతడు పారశీక, ఉర్దూ భాషల్లో చెప్పిన కావ్యాలు దొరుకుతున్నాయి. తమ

BRAOU

రచనలను 'దివాన్' అనే సంకలనంగా స్వీకరించిన ఉర్దూ కవుల్లో, మహమ్మద్‌కులి మొట్ట మొదటి వాడు. ఇతని గుప్త నామం 'మాని'. ఇతని 'దివాన్'లు 1800 పుటల గ్రంథం. ఇతని కవిత్వంలో ఎక్కువగా తెలుగు పదాలున్నాయని, ఆదిరాజు వీరభద్రరావు రాశారు. అయితే, ఈ కాలంలో రాయబడ్డ తెలుగు గ్రంథాల్లో ఎక్కువ ఉర్దూ పదాలు చోటు చేసుకున్నాయని, ఆరుద్ర అభిప్రాయం. ఈ కాలంలో అచ్చ తెనుగు కావ్యాలు రచించబడ్డాయని, బూదరాజు రాధాకృష్ణ అన్నారు. అచ్చ తెనుగు పర్యాయ పదాలు, తేట తెనుగు, జాను తెలుగు, నాటు తెలుగు. ఈ పైన పేర్కొన్న ఉర్దూ, పారశీక, తెలుగు భాషా పోషణలో, భాషాభిమానం కన్నా, రాజకీయ ప్రయోజనమే ప్రధానంగా కనిపిస్తుందన్న వాదనను, బూదరాజు రాధాకృష్ణ ప్రతిపాదించారు. క్షేత్రయ్య, కంచర్ల గోపన్న అను భక్త రామదాసు, ఈ కాలం వారే. క్షేత్రయ్య 4500 వరకు పదకీర్తనలను రచించాడు. అందులో 1500 పదాలను గోల్కొండ నవాబు అబ్దుల్లా కుతుబ్‌షాకు అంకిత మిచ్చాడు. కంచెర్ల గోపన్న రాసిన **'దాశరధి శతకం'** ఈ కాలం నాటిదే. ఈయన కీర్తనలు, ఈనాటికీ గ్రామ గ్రామాల్లో, భజనల్లో పాడుతుంటారు.

యాజ్దాని అభిప్రాయం ప్రకారం, గోల్కొండలో సుల్తాన్ కులి నిర్మించిన భవనాల్లో, హిందూ, మహమ్మదీయ రీతులను సమన్వయపర్చలేకపోవడంచేత, కళాత్మకత తక్కువైంది. గోల్కొండ లోని బాలాహిసార్ ద్వారం మీద, హిందూ పురాణ కధల చిత్రాలు, సంకేతాలను చెక్కారు. హైదరాబాద్ లోని చార్‌మీనార్, కుతుబ్‌షాహీల నిర్మాణాల్లో అద్భుతమైంది. భారతదేశం లోని అత్యద్భుత నిర్మాణాల్లో ఇదొకటంటే అతిశయోక్తి కాదు. అబ్దుల్లా పరిపాలనా కాలంలో, కుతుబ్‌షాహీల వాస్తు నిర్మాణం పర్షియన్ పద్ధతి లోను, అలంకారాలు, పువ్వులు, తీగెలు హైందవ సంపుదాయం లోను కన్పిస్తాయి. అబుల్ హసన్ కాలంలో ఈ సంస్కృతి సమ్మేళనం శిఖరాగ్రాన్ని చేరుకుంది. మచిలీపట్నం కలంకారి అద్దకాలు, ఆనాటి వర్ణ చిత్ర నైపుణ్యానికి చక్కని ఉదాహరణలు. నృత్య నాటికలను, లేదా యక్ష గానాలను ప్రదర్శించే కూచిపూడి భాగవతులకు, కూచిపూడి గ్రామాన్ని అబుల్ హసన్ తానీషా మిరాసీగా ఇచ్చాడు.

పైన పేర్కొన్న విధంగా, కుతుబ్‌షాహీలు పుట్టుకతో విదేశీయులైనా, ఇక్కడ స్థిరపడి పోయి, అన్ని రంగాల్లోను సమ్మేళనానికి కృషి చేసి, తెలుగు సంస్కృతీ వికాసానికి కృషి చేసి, తెలుగు జాతి ఐక్యతకు కృషి చేసి, చిరస్థాయైన యశస్సును ఆర్జించారు.

23.6 : సంగ్రహంగా

ఈ భాగంలో మనం బహమనీలు, కుతుబ్‌షాహీలు ఆంధ్ర దేశంపై ఆధిపత్యాన్ని సంపాదించి, వారి పరిపాలనా కాలంలో ప్రవేశపెట్టిన విధానాల ద్వారా ఆంధ్ర దేశానికి చేసిన సేవ గురించి తెలుసుకున్నాం. ఈ రెండు వంశాల పాలనా ఫలితంగా, మిశ్రమ సంస్కృతి తలెత్తింది. స్వయంసం పూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తన పటుత్వాన్ని కోల్పోవటం మారంభమైంది. విదేశీయ వర్తకులు ఆంధ్ర దేశంలో వర్తకవ్యాపార స్థావరాలను నెలకొల్పడం ఆరంభమైంది.

23.7 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. బహమనీ పాలకులు ఆంధ్ర దేశంపై ఆధిపత్యాన్ని నెరపిన తీరును పరిశీలించండి.

BRAOU

2. కుతుబ్‌షాహీ పాలకులు ఆంధ్రదేశంపై ఆధిపత్యాన్ని కొనసాగించిన విధానాన్ని విశ్లేషించండి.

3. కుతుబ్‌షాహీల కాలం నాటి సామాజిక, ఆర్థిక వ్యవస్థను, వారొనరించిన సేవలను సమీక్షించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. బహమనీ పాలకుల నాటి సామాజిక, ఆర్థిక వ్యవస్థ, వారొనరించిన సేవలను విశదీకరించండి.
2. మూడవ మహమ్మద్‌షా కాలం నాటి విశేషాలను పేర్కొనండి.
3. కులికుతుబ్‌షా విజయాలను సమీక్షించండి.
4. ఇబ్రహీం కుతుబ్‌షా సారస్వత సేవను తెల్పండి.
5. మహమ్మద్ కులి ఘనతను వివరించండి.

23.8 : ఉపయుక్త గ్రంథాలు

Satyanarayana, K. : A Study of the History & Culture of the Andhras, Vol.II

Sherwani, H.K. : The Bahamani Kingdom, Hyderabad, 1953

Do : History of the Qutubshahi dynasty, New Delhi, 1974

Sinha, S.K : The History of the Medieval Deccan, Vol. I. (Ed), H.K. Sherwani, Hyderabad, 1934.

ఆరుద్ర : నవాబుల యుగం - సమగ్ర ఆంధ్ర సాహిత్యం

సురవరం ప్రతాపరెడ్డి : కుతుబ్‌షాహీల ఆంధ్ర భాషా పోషణ

నిడదవోలు సుందరేశ్వరరావు : గోల్కొండ కుతుబ్‌షాహీలు, ఆంధ్ర దేశపు సంస్థానాధీశులు, కుతుబ్‌షాహి సుల్తాన్‌లు

ఆదిరాజు వీరభద్రరావు : కుతుబ్‌షాహి సుల్తాన్‌లు

బూదరాజు రాధాకృష్ణ : అచ్చ తెలుగు కావ్యాల అవతరణ - చారిత్రక భూమిక

మల్లంపల్లి సోమశేఖరశర్మ (సం) : ఆంధ్రుల చరిత్ర, సంస్కృతి.

Do : ఆంధ్రదేశ చరిత్ర సంగ్రహం, హైదరాబాద్, 1967.

రచయిత: డా. కె. యస్. కామేశ్వరరావ్

BRAOU

భాగం-24 : 16వ శతాబ్దం : ఆంధ్రదేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు

విషయక్రమం

24.0 : లక్ష్యాలు

24.1 : పరిచయం

24.2 : రాజకీయ పరిస్థితులు

- 24.2.1 : రాజకీయ అనైకమత్యం
- 24.2.2 : రాజకీయ ఆధిపత్యం కొరకు తరచూ అంతర్ ప్రాంతీయ యుద్ధాలు

24.3 : ఆర్థిక పరిస్థితులు

- 24.3.1 : వ్యవసాయం
- 24.3.2 : పరిశ్రమలు
- 24.3.3 : వర్తకవ్యాపారులు - శ్రేణులు

24.4 : సాంఘిక పరిస్థితులు

- 24.4.1 : వర్ణ వ్యవస్థ - వృత్తులు
- 24.4.2 : హిందూ-ముస్లింల మైత్రి
- 24.4.3 : స్త్రీ సామాజిక హోదా
- 24.4.4 : ఆచారాలు, సంప్రదాయాలు

24.5 : సంగ్రహంగా

24.6 : పరీక్ష నమూనా ప్రశ్నలు

24.7 : ఉపయుక్త గ్రంథాలు

BRAOU

24.0 : లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం ద్వారా, క్రీ.శ. 1500 నుండి 1600 నాటి వంద సంవత్సరాల కాల పరిణామంలో ఆంధ్ర దేశపు రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాల్లో వచ్చిన మార్పులను తెలుసుకోగ ల్గాలి. రాజకీయ అనైక్యత, వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యాభివృద్ధి, వర్ణ వ్యవస్థ, స్త్రీల హోదా, హిందూ-ముస్లిం మైత్రి, ఇత్యాది ప్రధానాంశాలను స్పష్టంగా గ్రహించగల్గాలి.

24.1 : పరిచయం

తరతరాల ఆంధ్రుల చరిత్రను, సంస్కృతిని స్థూలంగా కాక, సూక్ష్మంగా, నిష్పక్షపాతంగా అధ్యయనం చేస్తే కనుపించే లక్షణం, ఆంధ్ర దేశాన్ని రాజకీయంగా ఏకం చేసిన వంశాలు శాతవాహనులు, కాకతీయులు మాత్రమే. శాతవాహన అనంతర కాలం నుండి కాకతీయులు రాజ్యాధికారం చేపట్టేవరకు, ఆంధ్ర దేశంలో అనేక రాజ వంశాలు సమకాలీనంగాను, లేదా ఒకరి తర్వాత ఒకరు పరిపాలించారు. ఈ కాలంలో సమకాలీన రాజ్యాల మధ్య ఆధిక్యత కొరకు రాజకీయ పెనుగులాట, లేదా ఆంధ్ర దేశపు సరిహద్దున నున్న రాజ్యాల దండయాత్రలు అతి తరచుగా జరుగుతూవచ్చాయి. కాకతీయుల అనంతరం మహమ్మదీయుల దండయాత్రల ఫలితంగా, ఆంధ్ర దేశం లోని వివిధ పాలకులు తమ మధ్య నున్న విభేదాలను తాత్కాలికంగా విస్మరించి, విముక్తి ఉద్యమాన్ని నిర్వహించి, మహమ్మదీయుల బారి నుండి ఆంధ్ర దేశాన్ని కాపాడగలిగారు కాని, ఈ ఐకమత్యం అతి కొద్ది కాలం మాత్రమే తెలుగు వారందరిని ఏకం చేయగల్గింది.

24.2 : రాజకీయ పరిస్థితులు

బహమనీలు తెలంగాణా లోనూ, రాచకొండ, దేవరకొండ కేంద్రాలుగా పాలించిన వెలమలు; కొండవీడు, రామజమహేంద్రవరం రాజధానులుగా పాలించిన రెడ్డి రాజులు కోస్తా ప్రాంతం లోను; విజయనగర పాలకులు ముఖ్యంగా రాయలసీమలో రాజ్యం చేస్తుండడం వలన, ఆంధ్ర దేశం రాజకీయ ఐకమత్యానికి దూరమైంది. 14వ శతాబ్దంలో అటు ఇటుగా తలెత్తిన విజయనగర, బహమనీ, వెలమ, రెడ్డి రాజులు తమలో తాము కలహించుకున్నారు; తాత్కాలికంగా కలిశారు; వివాహ సంబంధాల నేర్పర్చుకొన్నారు; మళ్ళీ దెబ్బలాడుకున్నారు. ఫలితంగా, 16వ శతాబ్ది ప్రారంభం నాటికి, రెడ్డి, వెలమ రాజ్యాలు అంతరించాయి; విజయనగరంలో సంగమ వంశం అంతరించి, సాళువ, తుళువ పాలన ఆరంభమైంది. బహమనీలు, విజయనగర పాలకులతో దెబ్బలాడి, అహ్మద్‌నగర్, బీరార్, బిజాపూర్, బీదర్, గోల్కొండ రాజ్యాలుగా చీలిపోయి, తమలో తాము కలహించుకుంటూ, ఆంధ్ర దేశం లోని తెలంగాణాపై గోల్కొండ పాలకులైన కుతుబ్‌షాహీలు ఆధిపత్యాన్ని నంపాదించగా, తీరాంధ్రంపై ఆధిపత్యం కొరకు సూర్యవంశ గజపతులు, విజయనగర పాలకులు యుద్ధాలను చేశారు. ఆ యుద్ధాల్లో కుతుబ్‌షాహీలు పాల్గొన్నారు. 1565 లో జరిగిన రాక్షసతంగడి, లేక తళ్ళికోట, లేక బన్నిహట్టి యుద్ధంలో విజయనగరం సల్తురు సుల్తాన్‌ల చేతిలో ఓడిపోవటంతో, దాని ప్రభావం ఆంధ్ర దేశంపై పడింది. విజయనగర పాలకులు నామమాత్రంగా పెనుగొండ, చంద్రగిరుల నుండి పరిపాలించగా, ఈ శతాబ్దం లోనే ఘనులైన మొగలాయి పాలకుల్లో సుప్రసిద్ధులైన అక్బర్ చక్రవర్తి దక్షిణాపథంపై కన్నువేయటం జరిగింది. ఈ పరిణామాల ఫలితంగా, ఆంధ్ర దేశంలో తలెత్తిన ఆర్థిక, సాంఘిక రంగాల్లో మౌలికమైన మార్పులు రాలేదు. ఎప్పుడూ కూడా రాజకీయ రంగంలో మార్పులు వచ్చినంత వేగంగా, సాంఘిక, ఆర్థిక రంగాల్లో మార్పులు ఉండవు; మార్పులున్నా అవి సమాజం లోని కొన్ని పార్శ్వాలను ప్రభావితం చేస్తాయి కాని, అన్ని పార్శ్వాలను కాదు. ఈ మార్పులు పాక్షికంగా కొన్ని వర్గాలను ప్రభావితం చేస్తాయి కాని, మౌలికంగా సమాజం లోని వర్గాలను కాదని గుర్తుంచుకోవాలి.

BRAOU

24.2.1 : రాజకీయ అనైకమత్యం

16వ శతాబ్ది నాటి ఆంధ్ర దేశపు రాజకీయ పరిస్థితులు అర్థం కావలెనంటే, 14, 15 వ శతాబ్దాల నాటి రాజకీయ పరిస్థితులను తెలుసుకోవాలి. రాజకీయ ఆధిపత్యం కొరకు విభిన్న రాజ వంశాల మధ్య ఆరంభమైన రాజకీయ పెనుగులాట, ఈ 16వ శతాబ్ది లోను కొనసాగించబడింది.

మనం ఈ నాడు ఆంధ్రప్రదేశ్ అని పిలుచుకుంటున్న ప్రాంతంపై రాజకీయ అధికారాన్ని నెరపిన మొదటి తెలుగు వంశం, కాకతీయులది. కాకతీయులు ఆంధ్ర దేశాన్ని పాలిస్తున్న కాలంలో, గంగులు కళింగాంధ్రను పాలిస్తూ, అప్పుడప్పుడు గోదావరి నదీ పరీవాహక ప్రాంతంపై దండెత్తుతుండేవారు. కాకతీయ రాజ్య పతనానికి కారకుడైన మహమ్మద్ బీన్ తుగ్లక్ తీరాంధ్రం ద్వారా కళింగంపై దండెత్తాడు. కాకతీయ సామ్రాజ్య పతనానంతరం, ఆంధ్ర దేశాన్ని మహమ్మదీయ పాలన నుండి విముక్తం చేయడానికి, ముసునూరి ప్రోలయ నాయకుడు, బెండపూడి అన్నయ మంత్రి, కొలని రుద్రదేపుడు, రేచర్ల సింగమనీడు, అద్దంకి వేమారెడ్డి, వెలనాటి గణపతి నాయకుడు, పిఠాపురం ప్రోలయ నాయకుడు, ఉండి వేంగి భూపతి మొదలైన 75 నాయక వంశాలకు చెందిన 300 మంది తెలుగు నాయకులు ఒక కూటమిగా ఏర్పడి, ముసునూరి ప్రోలయ నాయకత్వంలో తిరుగుబాటు చేశారు. ఈ విమోచనోద్యమంలో కాకతీయుల కాలం నాటి 75 మంది నాయకులు పాల్గొన్నారన్న విషయాన్ని, రెడ్డి రాణి ఆనితల్లి వేయించిన 1423 నాటి కలువచేరు శాసనం తెలుపుతూంది. ఫలితంగా, మధ్య ఆంధ్ర దేశం, లేదా తీరాంధ్ర దేశం 1326 నాటికి ముస్లిం పాలన నుండి విముక్తి పొందిందన్న విషయం, ప్రోలయ వేమారెడ్డిని మ్లేచ్ఛాబ్ధి కుంభోద్భవుడని 1325 నాటి శాసనం చెప్పుట చేతను, 1326 తర్వాత మహమ్మద్ బీన్ తుగ్లక్ నాణేలు కనుపించక పోవుట చేతను, నిర్ధారణ చేయొచ్చు. ముసునూరి ప్రోలయ నాయకుడు 1330 ప్రాంతంలో మరణించడంతో, ఈ విమోచనో ద్యమాన్ని నడిపించిన కాపయ నాయకుడు 1337 నాటికి, 'ఆంధ్రదేశాధీశ్వర', 'ఆంధ్రసురత్రాణ' అన్న బిరుదులతో, ఓరుగల్లు నుండి పాలించాడు. ఈ కాపయ నాయకుడు పూర్వం కాకతీయులు పాలించిన రాజ్యంలో చాలా భాగం, అంటే పడమటి కొలన్, బీదర్ మొదలు, తూర్పున బంగాళాఖాతం వరకున్న ప్రాంతాన్ని పాలించాడు. ఇదే కాలంలో ప్రోలయ వేమారెడ్డి గుండ్లకమ్మ, కృష్ణా మధ్య ప్రదేశాన్ని జయించాడని, శాసనాధారాలున్నాయి. ఈ వైన సేర్కొన్న విమోచనోద్యమాన్ని కృష్ణా నదికి దక్షిణంగా ఉన్న ఇప్పటి రాయలసీమ లోని కర్నూల్ జిల్లాలో, రాయచూర్ జిల్లాలో ఆరవీటి సోమరాజు, అతని సవతి తల్లి కుమారుడు నోటికంటి రాఘవుడు నడిపించి, విజయాన్ని పొంది, కంపిలిపై దండెత్తారు. కంపిలి రాజ్యం బళ్ళారి, రాయచూర్, ధార్వాడ్‌లతో కలసిన ఒక చిన్న రాజ్యం.

క్రీ.శ. 1336 లో హరిహర, బుక్కరాయలు విజయనగర రాజ్యాన్ని స్థాపించారు. 1347 లో అల్లాఉద్దీన్ హసన్ గంగూ గుల్బర్గా రాజధానిగా, బహమనీ రాజ్యాన్ని, కాపయనాయకుని ఓరుగల్లు రాజ్యానికి పొరుగువానే, పడమటి దిక్కున రాజ్యాన్ని స్థాపించారు. ఆశ్చర్యకరమైన విషయ మేమి టంటే, దూరాలోచన, రాజకీయ దూరదృష్టి లోపించిన కాపయ నాయకుడు ఈ రాజ్య స్థాపనకు సైనిక సహాయం చేయటం. కాపయ నాయకునకు, బహమనీలకు మధ్య జరిగిన యుద్ధాల ఫలితంగా, 1364-65 ల్లో వారు ఒక సంధిని చేసుకున్నారు. ఆ సంధి ప్రకారమే గోల్కొండను కాపయనాయకుడు బహమనీలలో ఒకడైన మొదటి మహమ్మద్ షాకు ఇచ్చివేశాడు. కాపయనాయకునకు, బహమనీలకు మధ్య యుద్ధం జరుగుతున్నప్పుడే, రేచర్ల సింగమను నాయకుడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొని రాచకొండ సీమ రాజ్యాన్ని స్థాపించగా, అతని సంతతి ఒక పంద సంవత్సరాలు 1350 నుండి 1475

BRAOU

వరకు తెలంగాణాన్ని పరిపాలించారు. కాపయనాయకుణ్ణి 1368 లో వరంగల్ దగ్గర నున్న భీమవరం యుద్ధంలో రేచర్ల వెలమలు చంపివేశారు. కాపయనాయకుని మరణం ముందు ప్రోలయ వేమారెడ్డి స్వాతంత్ర్యం ప్రకటించుకొని, వాని సంతతి గుండ్లకమ్మ, కృష్ణానది మధ్యస్థమైన తీరాంధ్రాన్ని నూరేండ్ల పాటు పరిపాలించారు. ఈ విధంగా తీరాంధ్రంలో రెడ్డి రాజులు, తెలంగాణాలో రేచర్ల వెలమ రాజులు పరిపాలించారు. ఈ పైన పేర్కొన్న విధంగా, దగ్గిర దగ్గిరగా ఒకే కాలంలో కాక పోయినా, స్థాపించబడ్డ విజయనగర, బహమనీ, రెడ్డి, వెలమరాజ్యాలు 14, 15 శతాబ్దాల్లో రాజ్య కాంక్షతో యుద్ధాలు చేసుకున్నాయి. ఆ యుద్ధాల ఫలితం ఆంధ్ర దేశంపై పడింది.

కాపయ నాయకుడు చనిపోయిన తర్వాత, రేచర్ల పద్మనాయకులు ఓరుగల్లు పాలకులై, బహమనీలకు స్నేహపూర్వకమైన సామంతులుగా తెలంగాణాన్ని 1369 నుండి 1473 వరకు పరిపాలించారు. ఈ రేచర్ల వారు రాచకొండ ముఖ్య పట్టణంగా, భువనగిరి, రాచకొండ, దేవరకొండ దుర్గాలను పాలించారు. పానుగల్లు కోట కూడా, వీరి స్వాధీనం లోనే వుంది. కాని, తూర్పున ఉన్న కొండపల్లి దుర్గం, కృష్ణకు దక్షిణంగా నున్న శ్రీశైలం, పడమటి దిక్కున ఉన్న వనపర్తి ప్రాంతాలను జయించాలన్న కాంక్ష వల్ల, వీరు కొండవీటి రెడ్డి రాజుల తోను, విజయనగర పాలకుల తోను, యుద్ధాలకు దిగాల్సొచ్చింది. ఈ సమయానికి వరంగల్లు, ఖమ్మం, ఉభయ గోదావరి, కృష్ణా ప్రాంతాలను, కాపయనాయకుని సంతతివారు; గుంటూరు, ప్రకాశం జిల్లాలను, రెడ్డి రాజులు, కర్నూల్, బళ్ళారి జిల్లాలు, విజయనగరం చేతిలో ఉన్నాయి. కాపయనాయకుడు బహమనీలతో స్నేహం చేయడంతో, రేచర్ల వారు బహమనీలతో స్నేహం చేశారు. ఈ విధంగా ముసునూరి, రేచర్ల వారు ఎత్తుకు పైఎత్తులు వేసి, బహమనీలతో స్నేహం చేయగా, వీరిద్దరి ఆశలను ఎగద్రోసి, బహమన్ షా వీరి మధ్య అంతర్ యుద్ధాన్ని రేకెత్తించాడు. ఈ రాజకీయ, దౌత్య ఆటలో లాభం పొందినవారు బహమనీలు. రేచర్ల వారు బహమనీలకు సామంతులయ్యారు. అందుచే, కుమార సింగ భూపాలుడు విజయనగరం వారితో ఘర్షణకు దిగి, బహమనీల చేత మెచ్చుకోబడి, కళ్యాణి దుర్గాన్ని సంపాదించి తీరాంధ్రంలో సింహాచలం వరకు దండయాత్రలను చేశాడు. ఈ దండయాత్ర లోనే పిఠాపురం కొప్పలవారు రేచర్లవారికి లొంగిపోయారు. కుమార సింగ భూపాలుడు శ్రీశైలంతో కూడిన రాయలసీమ ప్రాంతం కొరకు విజయనగర, రెడ్డి రాజులతో ఘర్షణకు దిగాడు. ఈ లోపల బహమనీలు బలాన్ని పెంచుకొన్నారు. తత్ఫలితంగా, రెండవ అనవోతా నాయకుని, మూడవ సింగభూపాలుని కాలం లోను, బహమనీ సుల్తాన్‌లతో విభేదాలొచ్చాయి. ఫలితంగా, బహమనీలు 1475లో ఓరుగల్లు, రాచకొండ, భువనగిరిలను స్వాధీనం చేసుకున్నారు. ఈ లోపల రెడ్డి రాజుల చేతిలో ఓడిపోయిన నిశ్శంకభానుదేవగజపతి సైన్యాధిపతి కపిలేశ్వర గజపతి కళింగంలో అధికారానికి వచ్చి, దక్షిణ దిశగా విస్తరించే ప్రయత్నంలో రెడ్డి రాజులతో పోరాడాడు. రేచర్ల వెలమ పాలకులు తమ శత్రువులైన రెడ్డి రాజులకు, శత్రువైన గజపతుల సహాయాన్ని కోరారు. కపిలేశ్వర గజపతి కుమారుడు హంవీరుడు, బహమనీలతో పోరాడుతున్న వెలమలకు సహాయం చేశాడు. అంతేగాక, అంతవరకు దెబ్బలాడుతున్న విజయనగర పాలకుడైన రెండవ దేవరాయలుతో కలిశాడు. కాని, ఫలితం లేక పోయింది. బహమనీలు రేచర్ల వారిని నాశనం చేశారు.

ప్రోలయ వేమారెడ్డి కాలం నుండి, విజయనగరం వారికి, వీరికి మధ్య, ఘర్షణ ఆరంభమైంది. అనపోతారెడ్డి కాలంలో వీరు స్వతంత్రులుగా పాలన నారంభించారు. విజయనగరం వారికి, వీరికి మధ్య, ఘర్షణలు ఆరంభమగుటకు కారణాలు, తూర్పు సముద్ర తీరాలకు తమ రాజ్యాన్ని విస్తరింపచేయాలన్న కాంక్ష. అనవేమారెడ్డి 'మహనీయాంధ్రదేశ పట్టాభిషేక సంవృత మహాభాగ్య' అన్న బిరుదును కలిగియున్నాడు. కుమారగిరి రెడ్డి కాలంలో అంతర్యుద్ధం జరిగింది. ఇది అదనుగా

BRAOU

తీసుకొని, విజయనగర పాలకులు త్రిపురాంతకం వరకు దండెత్తొచ్చారు. అయితే, బహమనీ, రాచకొండ వెలమల వొత్తిడికి తట్టుకోవడానికి, రెడ్డి రాజులతో సఖ్యం అవసరమని, రెండవ హరిహర రాయలు కూటయ వేమునకు తనకుమార్తెనిచ్చి వివాహం చేశాడు. దీనితో, విజయనగర, రెడ్డి రాజుల మధ్య సంధి కుదిరింది. కాని, ఇదెక్కువ కాలం నిలవలేదు. రెడ్డి రాజ్యం చిలిపోవటం తర్వాత, విజయనగర, గజపతి, రేచర్ల వెలమలు, రెడ్డి రాజ్యంపై దండెత్తి, బలహీనంగా ఉన్న దానిని నాశనం చేశారు. ఈ విధంగా, విజయనగర, బహమనీ, రెడ్డి, వెలమ రాజ్యాల మధ్య తగాదా సమసిపోయి, 16వ శతాబ్దం నాటికి బహమనీ, విజయనగర, కళింగ గజపతుల మధ్య త్రిముఖ పోటీ ఆరంభమైంది.

24.2.2 : రాజకీయ ఆధిపత్యం కొరకు తరచూ అంతర్ ప్రాంతీయ యుద్ధాలు

విజయనగరానికి చెందిన సంగమ వంశం రెండవ విరూపాక్ష రాయలతో, 1485 లో అంతం చెందింది. అనంతరం సాళువ వంశం వారు క్రీ.శ. 1505 వరకు పాలించారు. 1506 లో తుళువ నరసనాయకుని పాలన ఆరంభమైంది. 1506 నుండి 1570 వరకు తుళువ వంశస్థులైన వీర నరసింహరాయలు, కృష్ణదేవరాయలు, అచ్యుతరాయలు, మొదటి వెంకటపతిరాయలు, సదాశివరాయలు వరుసగా పరిపాలించారు. 1570 అనంతరం అరవీటి వంశం వారైన తిరుమల దేవరాయలు, మొదటి శ్రీరంగ రాయలు, రెండవ వెంకటపతిరాయలు, 1604 వరకు పరిపాలించారు. విజయనగర పరిపాలకుల్లో సమరాంగణ సార్వభౌముడుగా కీర్తి పొందిన శ్రీకృష్ణదేవరాయలు, గజపతుల అధీనంలో వున్న ఉదయగిరి, కొండవీడు దుర్గాలను సాధించేందుకు, జైత్రయాత్రను ఆరంభించాడు. కృష్ణరాయని కళింగ జైత్రయాత్ర, లేదా పూర్వ దిగ్విజయయాత్ర, 1513 నుండి 1518 వరకు, ఐదు సంవత్సరాలు జరిగింది. ఈ జైత్రయాత్రలో ఐదు ఘట్టాలున్నాయని **అముక్తమాల్యద**లో కృష్ణదేవరాయలు వేర్కొన్నాడు. అవి: (1) ఉదయగిరి ముట్టడి; (2) కొండవీడు పతనం; (3) కొండపల్లి ముట్టడి; (4) సింహాద్రి, పొట్నూరుల్లో జయస్తంభ ప్రతిష్ఠ; (5) కటకం ఆక్రమణ. ఈ విజయాల ఫలితంగా, తీరాంధ్రమంతా కృష్ణదేవరాయల రాజ్యాంతర్భాగమైంది. అచ్యుతరాయల కాలంలో గజపతులు, గోల్కొండ కుతుబ్‌షాహీల సాయంతో, విజయనగరంపై దండెత్తిరాగా, కొండవీడు ప్రాంతంలో విజయనగర సేనలు విజయాన్ని పొందాయి.

1492లో తెలంగాణా తరఫ్‌దార్‌గా నియమించబడిన కులికుతుబ్‌షా, 1512 లో స్వతంత్రాన్ని ప్రకటించుకొని, గోల్కొండ కేంద్రంగా, కుతుబ్‌షాహీ వంశ పాలన నారంభించాడు. గోల్కొండ పాలకుడైన ఇబ్రహీం కుతుబ్‌షా, మిగిలిన అహ్మద్‌నగర్, బిజాపూర్, బీదర్ సుల్తాన్‌లతో కలసి, 1565 లో రాక్షసతంగడి, లేక బన్నిహట్టి యుద్ధంలో, విజయనగర సేనలను ఓడించి, విజయనగరాన్ని కొల్లగొట్టారు.

1565 అనంతరం, విజయనగర సామ్రాజ్య సామంతులు, అమరనాయకులు, పాళెగాళ్ళు ఎక్కడి కక్కడ స్వతంత్రులయ్యేందుకు పూనుకొన్నారు. తిరుమల రాయలు పెనుగొండ నుండి పాలించాడు. రాయలసీమలో అస్తవ్యస్త పరిస్థితులు ఏర్పడ్డాయి. కారణం, బహమనీలు రాయలసీమను జయించేందుకు పూనుకోవడం. మొదటి శ్రీరంగరాయల పరిపాలనా కాలంలో, కొందరు పాళెయగార్లు బిజాపూర్ సుల్తాన్‌ను విజయనగరంపై దండెత్తమని ప్రోత్సహించగా, 1576 లో అదిల్‌షా దండెత్తిరాగా, శ్రీరంగరాయలు పెనుగొండను సవరం చెన్నప్ప నాయకుడికి వదిలిపెట్టి, చంద్రగిరి పారిపోయాడు. 3 నెలలు ముట్టడించినా, పెనుగొండ ఆక్రమణ సాధ్యం కాలేదు. బిజాపూర్ సుల్తాన్‌కు, గోల్కొండ పాలకుడైన ఇబ్రహీం కుతుబ్‌షాకు పడకపోవటం చేత, శ్రీరంగరాయలు ఇబ్రహీం కుతుబ్‌షా సాయాన్ని కోరాడు.

BRAOU

మొత్తం మీద, బిజాపూర్ సుల్తాన్ ఆ ప్రయత్నం ఫలించలేదు. 1579 అనంతరం, కుతుబ్‌షాహీలు దండెత్తి వచ్చి, కర్నూల్ ప్రాంతాన్ని ఆక్రమించారు. అందుకు సమాధానంగా, శ్రీరంగరాయలు తన సైన్యంతో దండెత్తి వచ్చాడు; విజయనగరాన్ని స్వాధించాడు. కర్నూల్ పోవడంతో, ఇబ్రహీం కుతుబ్‌షా కొండవీడు ఆక్రమణకై ప్రయత్నం చేశాడు. కృష్ణా నదిని దాటి, బెల్లంకొండ, నాగార్జునకొండ, మాచర్ల, కొచ్చెర్ల కోట, ఉదయగిరి కోటలను జయించగా, అతి కష్టం మీద లంచమిచ్చి, 1580 నాటికి కొండవీడును జయించారు. రెండవ వెంకటపతి రాయల కాలంలో, కుతుబ్‌షాహీలకు, విజయనగర పాలకులకు మధ్య, దాడులు జరిగాయి. కుతుబ్‌షాహీలు గండికోట, కర్నూల్, గుత్తిని సాధించారు. కాని, పెనుగొండను పట్టుకోబోగా వెంకటపతిరాయలు కుతుబ్‌షాహీలను ఓడించాడు. మహమ్మద్ కులికుతుబ్‌షా కృష్ణా నదిని, విజయనగర, కుతుబ్‌షాహీలకు సరిహద్దుగా గుర్తించాడు.

విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన ఆరవీటి వంశంలో గొప్పవాడైన రెండవ వెంకటపతి రాయలు, కుతుబ్‌షాహీల మీద విజయాన్ని పొందిన అనంతరం, తన అధికారాన్ని కాదన్న అమరనాయకులను, పాళెగాళ్ళకు బుద్ధి చెప్పేందుకు పూనుకొన్నాడు. ఆ విధంగా బుద్ధి చెప్పబడ్డ వారిలో ఒకడు, నంద్యాల పాలకుడైన కృష్ణమరాజు. ఇంకా మరికొందరు తిరుగుబాటు చేయగా, అణచివేశాడు. ఆదే విధంగా, నెల్లూర్ అమరనాయకుడు లింగానాయకుడు పొగరుమోత్తనం చూపించగా, రెండవ వెంకటపతిరాయలు బుద్ధి చెప్పాడు. రెండవ వెంకటపతిరాయలు 1614 వరకు పరిపాలించాడు.

1500 నుండి 1600 మధ్య కాలంలో పైన పేర్కొన్న రాజకీయ పరిణామాలు జరిగాయి. ఈ రాజకీయ పరిణామాల్లో కనిపించేదేమిటంటే, రాజ్యాధికార కాంక్ష, తత్ఫలితంగా ఆంధ్ర దేశం కోల్పోయింది రాజకీయ సుస్థిరతను; రాజకీయ సుస్థిరత లోపించడంతో, రాజకీయ అశాంతి చోటు చేసుకొని, శాంతిభద్రతలు లేకుండా పోయాయి. అందుచేత, రాజకీయ అనిశ్చిత చోటు చేసుకుంది. ఎక్కడికక్కడ బలవంతులై అమరనాయకులు, సామంత ప్రభువులు విజృంభించి, తమకు దక్కింది అనుభవించసాగారు. రాజకీయంగా గందరగోళ పరిస్థితులను ఆంధ్ర దేశం ఎదుర్కొవాల్సొచ్చింది.

BRAOU

విజయనగర, బహమనీ, కుతుబ్‌షాహీ, గజపతి పాలకులందరూ వంశపారంపర్య రాచరికాన్నే అనుసరించారు. పాలకుడొక్కడే పాలింపలేడు కనుక, మంత్రుల సహాయాన్ని తీసుకొన్నారు. రాజ్యాలను తరఫ్‌లుగా, లేక సీమ, లేక నాడులుగా విభజించారు. మొదట్లో బీదర్, గుల్బర్గా తరఫ్‌లు తెలంగాణాలో చేరి యుండేవి. అదే విధంగా, బహమనీ రాజ్య కాలంలో తెలంగాణా లోని వరంగల్లు, తూర్పున రాజమహేంద్రవరం, సర్‌లష్కర్‌లనబడు సుబాలుగా పిలువబడేవి. విజయనగర పాలకులు తమ రాజ్యంను గుత్తి సీమ, గండికోట సీమలుగాను, పాకనాడు, వెలమనాడు, ములికినాడులుగాను, విభజించారు. వీటికన్నా చిన్న విభాగం స్థలం. మహమ్మదీయులు పరిగణాలని పిలిచారు. న్యాయంకర వ్యవస్థ అమల్లో ఉంది. మహమ్మదీయ సుల్తాన్లు జాగీర్దారి వ్యవస్థకు ప్రోత్సాహమిచ్చారు. ఆనాడు దుర్గాలు కీలక పాత్రను నిర్వహించేవి. దుర్గాధిపతిని దుర్గదణ్డాయక అన్నారు. ఆనాటి రాజ్యాలన్నీ, సైనిక రాజ్యాలే. ఆనాటి ముఖ్య దుర్గ స్థానాలు పెనుగొండ, గుత్తి, కందనవోలు, చంద్రగిరి, రాయదుర్గం, గండికోటలు. ఉదయగిరి, కొండవీడు దుర్గాలు, రెడ్డి, విజయనగర, గజపతి రాజ్యాల మధ్య, చేతులు మారుతూ వచ్చాయి. గ్రామాల్లో కూడా ప్రభుత్వ ప్రాబల్యం పెరిగింది. పన్నుల వసూలు చేయుటకు ఉద్యోగులు నియమించబడ్డారు. గ్రామ సభల ప్రాబల్యం తగ్గిపోయింది. గ్రామాల్లో ఆయగాండ్రు 12 మంది ఉండేవారు.

24.3 : ఆర్థిక పరిస్థితులు

మధ్య యుగ ప్రాంతీయ, లేక భౌగోళిక రాజ్యాలు నిరంతరం యుద్ధానికి సర్వసిద్ధంగా ఉంటూ ఉన్నప్పటికి, వారిలో వారు ఏదో ఒక కారణం చేత, ఘర్షణల్లో, దాడులతో, యుద్ధాలతో మునిగి తేలుతున్నప్పటికి, ఆర్థిక పరిస్థితి దిగజారిపోయి, హీన స్థితికి చేరలేదు. మధ్య యుగంలో ప్రధానంగా 15, 16 వ శతాబ్దాల్లో, ఈ ప్రాంతాల్లో పర్యటించిన విదేశీ యాత్రికులు, ఆనాటి సాహిత్యం, శాసనాలు, ఆనాటి సుసంపన్న ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ఆనాడు ముఖ్య వృత్తి వ్యవసాయమైనప్పటికి, గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణాల్లో, నగరాల్లో, చేతివృత్తులు బాగా అభివృద్ధి చెంది, అంతర్గత, విదేశీయ వాణిజ్యం బాగా జరుగుతుండేదని ఆధారాలున్నాయి.

24.3.1 : వ్యవసాయం

ఆనాటి పాలకులకు ప్రధానంగా ఆదాయం భూమి శిస్తు ద్వారా లభించేది. ఇది కాక, వివిధ శుల్కాల ద్వారా ఆదాయాన్ని సంపాదించేవారు. భూమి శిస్తును ధన, ధాన్య రూపంలో వసూలు చేశారు. ప్రతి రాజ్యం తన అధీనం లోని భూమి నంతటిని వ్యవసాయానికి ఉపయోగపడే భూములు, అడవులు, కొండలు, బీడులు అని, వివిధ తరగతులుగా విభజించేవారు. ఈ అడవులు, కొండలు, బీడులు రాజ్యానికి చెందినట్లుగా భావించి, వాటిని ఉపయోగించుకొనేవారి వద్ద నుండి వివిధ రకాలైన పన్నులను వసూలు చేశారు. ఆనాడు పల్లపు భూముల వ్యవసాయాన్ని, సిరాంబరమని, మెట్ట సాగును కాడారంబమని అన్నారు. భూసారాన్ని బట్టి, పండిన పంటలో కొంత భాగాన్ని పన్నుగా వసూలు చేశారు. అయితే, రాజుకు ఎంత పన్ను చెల్లించాలనేది ఖచ్చితంగా, నిర్ధారణంగా లేకపోవడం చేత, పన్ను వసూలు చేసే అధికారాన్ని కల్గిన పారుపత్యదారులు, రాణాగాండ్రు, పన్ను గుత్తదార్లు, అమరనాయకులు తమ ఇష్టమొచ్చినట్లు పన్నులను వసూలు చేసేవారు. ఆ రోజుల్లో రైతులపై పన్నుల భారం అధికంగా ఉన్నప్పటికి, ఎక్కువ అసంతృప్తి కనిపించదు. పన్నులు వ్యవసాయ భూములపై వసూలు చేసినా, అన్ని ప్రభుత్వాలు నీటిపారుదల సదుపాయాల గురించి శ్రద్ధ వహించలేదు. ఉదాహరణకు, బహమనీలు నీటిపారుదలకు కొత్త సౌకర్యాలను కలిగించటం మాని, పాత వాటిని మరమ్మత్తు చేయుటకు ప్రయత్నించలేదు. ఫలితంగా, వారి కాలంలో పంటలు పండకపోవటం, కరువులు తలెత్తటం జరిగింది. కరువు వచ్చిన, ఇక్తాదార్లు కఠినంగా ప్రవర్తించి, పన్నులను వసూలు చేసేవారు. విజయనగర పాలకుడైన కృష్ణదేవరాయలు పోర్చుగీస్ ఇంజనీర్ల సాయంతో, ఆనకట్టలను నిర్మించి, నీటి సదుపాయాన్ని పెంచాడు. కృష్ణదేవరాయల దండనాయకుడు ముద్ద, 10 ఆనకట్టలను నిర్మించాడు. ఆనాటి నీటిపారుదల సౌకర్యాల గురించి, మేజర్ హెండర్సన్ ఎంతగానో శ్లాఘించాడు. పాలకులు, దండనాయకులు, సామంతులు, పెద్ద పెద్ద భూస్వాములు నీటిపారుదల సౌకర్యాల విషయంలో శ్రద్ధను చూపించారు. కుతుబ్‌షాహీల కాలంలో కూడా, రైతుల పరిస్థితి దయనీయంగానే ఉంది.

24.3.2 : పరిశ్రమలు

ఈ కాలంలో అనేక రకాల పరిశ్రమలు-వ్యవసాయ సంబంధమైన, చేతివనులకు సంబంధించిన-అభివృద్ధి చెందినట్లు కనుపిస్తుంది. వ్యవసాయం అభివృద్ధి చెందుటచేత, వ్యవసాయ సంబంధమైన పరిశ్రమలు, అనేక రకాల ఖనిజాలు దొరుకుటచే, ఖనిజ పరిశ్రమ, గృహావసరాలకు అవసరమైన వస్తువుల ఉత్పత్తి, విలాసవంతమైన జీవనానికి అవసరమైన వస్తువుల ఉత్పత్తి సాగించబడింది. ఆనాడు

BRAOU

పరిశ్రమలు కనుపించవు. కుటీర పరిశ్రమల నుండి శుల్కాలను ధన రూపంలో వసూలు చేశారు. అన్ని వృత్తుల వారి వద్ద నుండి పన్నులను వసూలు చేశారు. అన్ని వృత్తులవారు జాతిసిద్ధాయమను వృత్తి పన్నును చెల్లించారు. విజయనగర పాలకులు సమయ సుంకమను కొత్త సుంకాన్ని వసూలు చేశారు. స్థిర, చరాస్థులపై పన్నులను విధించారు. మొత్తం మీద ఆనాటి ప్రభుత్వాలు పరిశ్రమలను ప్రోత్సహిస్తూ, ఆ పరిశ్రమల్లో పాల్గొనే వివిధ వృత్తుల వారి వద్ద నుండి పన్నులను వసూలు చేశారు. అయితే, ఆనాటి ప్రభుత్వాలు ప్రజల వద్ద నుండి ఎక్కువగా పన్నులను వసూలు చేశారని చెప్పొచ్చు.

24.3.3 : వర్తకవ్యాపారులు-శ్రేణులు

పైన పేర్కొన్న భూమి శిస్తు, వివిధ సుంకాలే కాక, ఆనాటి ప్రభుత్వాలకు వర్తక వ్యాపారాలవల్ల కూడా ఆదాయమొచ్చేది. విజయనగర పాలకుల కాలంలో, ఆంధ్ర దేశంలో వాణిజ్యం బాగా అభివృద్ధి చెందింది. తూర్పు, పశ్చిమ దేశాల వర్తకులు ఆంధ్ర దేశంలో పెద్ద ఎత్తున సముద్ర వ్యాపారాన్ని చేశారు. విదేశీయ వాణిజ్యం ప్రధానంగా అరేబియా, పోర్చుగీస్ దేశాలతో జరిగింది. గుఱ్ఱాలను అమ్మే వ్యాపారం బహు లాభసాటిగా ఉండేది. ప్రతి రాజ్యం గుఱ్ఱాలను కొనుగోలు చేసింది. ఏనుగులను కూడా సింహళం నుండి దిగుమతి చేసుకొన్నారు. మోటుపల్లి, మచిలీపట్నంలు ఆనాటి రేవు పట్టణాలు. ఇవి కాక, కృష్ణపట్టణం, కళింగపట్నం, కోరింగ మొదలైన రేవు పట్టణాలుండేవి. ఆనాడు టోకు వ్యాపారం వర్తక సంఘాలు, లేక శ్రేణుల ద్వారా జరుగుతుండేది. శ్రీశైలం, త్రిపురాంతకం, తంగెడ, మాడికి, కొచ్చెర్లకోట, చిలకలూరిపేట, నెల్లూర్, మొట్టపాడ, జడ్చర్ల, పానుగల్లు, పేరూరు, అలంపురం, ముఖ్యమైన వర్తక కేంద్రాలు. ఇక్కడ ప్రభుత్వం వారే, పేటలు అనే పేరున, సంతలను నిర్వహించారు. టోకు వ్యాపారులు చెల్లించు శుల్కాన్ని, హెర్జుంక మన్నారు. సంతల్లో జరిగే వర్తకంపై పన్నులను వసూలు చేయడానికి, గుత్తదార్లున్నారు. ఇంకా, నూర్గ సుంకం, అమ్మబడి, కొనుగోలు సుంకాలున్నాయి. ఇవి కాక, మత సంబంధమైన మఠాలవారిచే, గణాచారి, వీరముష్టి, జీయర్ పన్నులను శైవ, వైష్ణవ మఠాలు వసూలు చేశాయి. ఇవి కాక, దొమ్మరి వాండ్రకు, విప్రవినోదులకు, వార్షిక చందాలు, లేక పన్నులను వసూలు చేసినట్లు, భావించబడుతున్నది. వరంగల్లు తివాచీలకు, భువనగిరి, నిర్మల్‌లు కత్తులను చేయడానికి, ఇత్తడి, కంచు వస్తువులకు ప్రసిద్ధి. కోస్తా ఆంధ్ర తీరం బట్టల నేతకు ప్రసిద్ధి చెందింది. నికోలో కాంటి అల్లాఉద్దిన్ బహమనీ ఇటలీలో కన్నా పెద్ద ఓడలను నిర్మించాడన్నాడు. మస్లిన్‌లు, క్యాలికోలు, ధాన్యం, గోధుమ, సజ్జ, అల్లం మొదలగునవి ఎగుమతయ్యేవి. బహమనీలు విదేశీ వాణిజ్యాన్ని అభివృద్ధిపర్చేందుకు, ఎగుమతి, దిగుమతి సుంకాలను వసూలు చేయలేదని, రష్యన్ యాత్రికుడు నికిటిన్ పేర్కొన్నాడు. ఈ వర్తకం, వ్యాపారం బాగా సాగిందని చెప్పేందుకు ఆధారాలు, ఆనాటి నాణేలు. ఇవి బంగారు, వెండి, రాగి లోహాల్లో ముద్రించబడ్డాయి. విజయనగర రాజుల నాణేల్లో వరాహం పెద్దది. దీన్ని ప్రతాప, ఫణం అని విభజించారు. అర్ధ వరాహాలను ప్రతాపని, $\frac{1}{10}$ వరాహాను ఫణమన్నారు. వీసం అతి చిన్న నాణెం. బహమనీలు, 'టంకం' అనే బంగారు నాణేన్ని ముద్రించారు. ఇంకా, 'గాని', 'బిస్వా'లనే చిన్న నాణేలు ప్రచారంలో ఉండేవి. నాణేలను ప్రభుత్వమే ముద్రించింది. సరైన తూకాలు, కొలతల ఎడల, ఆనాటి ప్రభుత్వాలు శ్రద్ధ తీసుకునేవి.

పైన పేర్కొన్న విధంగా, ఆనాటి అన్ని రాజ్యాలు వ్యవసాయ, వర్తక, వ్యాపారాభివృద్ధికి, చర్యలను తీసుకున్నాయి. ఫలితంగా, ఉత్పత్తి పెరిగింది. ఉత్పత్తులు పెరగడంలో మార్కెట్లు అవసరమయ్యాయి. ఈ వ్యవసాయ, వర్తక, వ్యాపారాభివృద్ధి ఫలితంగా, సంపద పెరిగింది. అయితే, సంపద ఫలాలు అన్ని వర్గాల వారికి సమానంగా అందుబాటులో లేవు. సంపద నుభవించే హక్కు, కొన్ని వర్గాలకు

BRAOU

మాత్రమే పరిమితమైంది. ఆ వర్గాలు ఎంతో విలాసవంతమైన, వైభవోపేతమైన జీవితాన్ని గడిపారు. ప్రభువుల, పాలకుల విలాసమయ జీవితానికి, ఆనాటి భవనాలు, సాహిత్యం, విదేశ యాత్రికుల రచనలు, ఎన్నో ఉదాహరణల నిచ్చాయి. సంపన్న వర్గాల్లో భోగలాలసత పెచ్చుగా కనిపిస్తూంది. కాని, సామాన్య ప్రజానీకం పన్నుల భారంతో, కడుపు నిండా తినీతినక శ్రమించి, ఉత్పత్తులను పెంచగా, ఆ ఉత్పత్తులపై లాభాలను, వర్తక, వ్యాపార శ్రేణులు పొందాయని చెప్పొచ్చు. ఆనాటి ఆర్థిక పుష్టి, ఆర్థిక సంపన్నత ఎంతటి వికృత రూపాన్ని ధరించిందో, ధూర్జటి రచనల వల్ల తెలుసుకోవచ్చు. ధూర్జటి తన కృతిని పాలకునకు అంకితం చేయకుండా, తన శతకంలో 'రాజుల్‌మత్తులు, వారి సేవ నరకప్రాయం' బన్నాడు. దీనిక్కారణం ఆనాడు కొంత వరకు భూస్వామ్య రాచరిక వ్యవస్థ అమలులో ఉండటమే. ధూర్జటి ఆనాటి సమాజంలో నున్న ఆర్థిక అసమానతలను కూడా తన రచనల్లో నిరసించాడు. ఈ కాలంలో సంపద అంచెలవారీ ఉద్యోగ, భూస్వామ్య వర్గం సొత్తయింది.

24.4 : సాంఘిక పరిస్థితులు

మధ్య యుగం నాటి సమాజం ఒక సంధి యుగంలో ఉంది: మహమ్మదీయుల దండయాత్రల, వలసల ఫలితంగా, హిందూ, మహమ్మదీయ సంస్కృతుల, ప్రజల మధ్య ఘర్షణ, అవగాహన ఏర్పడ్డాయి. ఫలితంగా, ఆనాటి సామాజిక వాతావరణంలో మార్పు కనిపించింది. భారతీయ సమాజ పరిణామాన్ని సూక్ష్మ దృష్టితో విశ్లేషిస్తే, మన సమాజంలో మార్పుతోపాటు, పాత దృక్పథం కొనసాగించబడటం కనుపిస్తుంది. కనుకనే ఎందరు వచ్చి కలిసినా, మన మౌలిక సమాజ దృక్పథంలో ఎట్టి మార్పు లేదు. పైపైన, కొన్ని పార్శ్వాల్లో కొద్ది పాటి మార్పులు కనపడతాయి.

1500 - 1600 నాటి సమాజ స్వరూప, స్వభావాలకు కృష్ణదేవరాయుల **ఆముక్తమాల్యద** ఒక చక్కని ఉదాహరణ. **ఆముక్తమాల్యద**లో సేవకులు యజమానికి, భార్య భర్తకు, దిగువ కులాలు ఎగువ కులాలకు, రాజ శిక్ష భయంతో అణిగి ఉండాలనే అభిప్రాయాన్ని కృష్ణదేవరాయలు తెలిపారు. ఈ అభిప్రాయాన్ని బట్టి, ఆనాటి సమాజంలో అంతరాలున్నాయని, సమానత్వ దృక్పథం లోపించిందని చెప్పొచ్చు. విజయనగర పాలకులైనా, గజపతులైనా, కుతుబ్‌షాహీలైనా తమ రాజ్యాధికారం సుస్థిరంగా ఉండాలంటే, సామాజిక సంబంధాలను ప్రోత్సహించుంటారు. **ఆముక్తమాల్యద** ఆప్తులకు, బ్రాహ్మణులకు రాజ్యంలో కీలక పదవులివ్వాలని, ముఖ్యంగా దుర్గ దణ్ణాయక పదవుల వంటివని, పేర్కొంది. ఆనాడు చాతుర్వర్ణ వ్యవస్థ అమల్లో ఉందని, ఖచ్చితంగా, నిర్ధారణగా చెప్పలేం. బహుశా, ఒక సైద్ధాంతిక ధ్యేయంగా మాత్రమే ఉండేదేమోనని భావించొచ్చు.

24.4.1 : వర్ణ వ్యవస్థ - వృత్తులు

ద్విజులు, లేక బ్రాహ్మణులు చేపట్టిన వృత్తుల్లో ముఖ్యమైనవి, రాజోద్యోగం, ఉపాధ్యాయ వృత్తి, పౌరోహిత్యం, అర్చకత్వం, యాచకత్వం. ఆనాటి సమాజంలో బ్రాహ్మణాధిక్యతకు కారణం, వారి విశ్వసనీయమైన ప్రవర్తనని **'ఆముక్తమాల్యద'**, అబ్దుల్ రజాక్ రచనలు తెలుపుతున్నాయి. బార్బోసా ఈ బ్రాహ్మణులు శాకాహారులని, ఒకే భార్య కలవారని, నమ్మకమైనవారని, గణిత శాస్త్రంలో ప్రజ్ఞ కలవారని, శరీర కష్టానికి ఓర్చుకోలేరని అంటూనే, వీరు భోజనప్రియులన్నాడు. న్యూనిజ్, వీరి యాచన ధోరణిని నిరసించాడు. విజయనగర రాజ భవనంలో కొన్ని వేల మంది బ్రాహ్మణులుండేవారని, వారికి పాలకుడు దానాలిస్తుంటాడని, వీరు ధనవంతులైనా భటులచే బలవంతంగా నెట్టబడితే తప్ప, వెళ్ళేవారు కాదన్నాడు న్యూనిజ్. ఈ బ్రాహ్మణులు రాజాస్థానాల్లో కీలక పాత్రల్లోనూ,

BRAOU

దుర్గదణ్డాయకులుగాను, కీలక పాత్రల్లో నియమించబడ్డారు. ఆనాడు బ్రాహ్మణులు ఇతర కులాల వృత్తుల ననలంబించారు. **బౌద్ధాయన** ధర్మ సూత్రం బాహ్మణులు క్షత్రియ వృత్తిని చేపట్టవచ్చునంది. కనుకనే, వీరు దుర్గదణ్డాయకులుగా, సేనా నాయకులుగా పేరుపొందారు. భట్టలక్ష్మీధరుని **'కృత్యక-ల్పతరు'** బ్రాహ్మణులు వైశ్య వృత్తిని అనుసరించవచ్చున్నది. కాని, బ్రాహ్మణులు ఉప్ప, మాంసం, వండిన పదార్థాలు, విషం, ఆయుధాలు, తోళ్ళు, విద్యా వ్యాపారం చేయకూడదని నిషేధించారు. బ్రాహ్మణుల్లో ప్రాంతీయ భేదాలున్నాయి. ఈ భేదాలు 'నాడు' లను బట్టి అలవర్చుకొన్న ప్రత్యేక లక్షణాలను బట్టి ఏర్పడ్డాయి. ఆనాటి బ్రాహ్మణులందరూ సంపన్నులు, బలవంతులు, రాజ భోగాల ననుభవించలేదు. ఎవరో కొందరు మాత్రమే రాజులకు దగ్గరైనారు. ఎక్కువ మంది సామాన్యులుగానే ఉండేనారు. గౌరన రచించిన **'హరిశ్చంద్రోపాఖ్యానం'** సాధారణ బ్రాహ్మణుల గురించి తెలియజేస్తుంది.

ఈ కాలంలో క్షత్రియ కులం కన్పించదు, విన్పించదు. వర్తకం, వ్యాపారం వైశ్యులకు పరిమితం కాలేదు. ఆనాడు బ్రాహ్మణులు, లింగాయతులు, బలిజలు, మహమ్మదీయులు కూడా వర్తక వ్యాపారాన్ని నిర్వహించారు. వర్తకులు బలమైన శ్రేణుల క్రింద ఏర్పడి, పన్నులను వసూలు చేయు అధికారం, న్యాయ విచారణాధికారాన్ని కూడా పొందారు. శూద్రుల్లో అనేక ఉప కులాలున్నాయి. వ్యవసాయం కుల వృత్తిగా కలవారిని, కాపులన్నారు. ఆనాడు వ్యవసాయం ముఖ్య వృత్తి కనుక, ఈ కాపులకు గ్రామాల్లో ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. బహుశా, వీరి పెద్దయే, గ్రామణిగా, నాయకుడిగా, రట్టడిగా ఉండి ఉండొచ్చు. ఒకప్పుడు వీరిని సత్ శూద్రులన్నారు. శూద్రుల్లో కూడ 'నాడు' విభేదాలను బట్టి, కమ్మ, వెలమ, రెడ్డి కులాలు ఏర్పడి ఉండొచ్చు. కాబట్టి, కాపు పదం కులపరంగా కాక, వ్యవసాయ వృత్తి పరంగా వాడుకలో ఉండేది. బహుశా, వివాహ సంబంధాల్లో నిషేధాలుండుటవల్ల, పలనల పల్ల, ఏకీకరణ ప్రక్రియ నిల్చిలేక పోవడంచేత, కులాలు గట్టిపడ్డాయి. విజయనగర కాలం నాటి మతాధిపతులు, పీఠాధిపతులు, ఈ కుల నిబంధనను, కుల శాఖలను స్థిరీకరించారు. విజయనగర యుగం నాటికి 'బలిజ' నాయకుల ప్రాబల్యం పెరిగింది. వీరి చేతిలో వ్యవసాయం, వ్యాపారం ఉండేవి. వర్తక శ్రేణుల నాయకులుగా, దళ నాయకులుగా, దుర్గాధిపతులుగా, ప్రాబల్యాన్ని కలిగి ఉండేవారు. నురవరం ప్రతాపరెడ్డి, బలిజులే వణిజులన్నాడు. ఒక అభిప్రాయం ప్రకారం, చాళుక్య-చోళ యుగాల్లో వ్యవసాయమే ముఖ్య వృత్తిగా కల కమ్మనాడు, వెలనాడు, పంట కాపులే, కమ్మ, వెలమ కులాలుగా మారాయి. ఉద్యోగ నామమైన రట్టక, రట్టోడి, రట్టడి, రడ్డిగా మార్పులు చెంది, క్రమేణా రెడ్డిగా స్థిరపడ్డారు. ఈ రెడ్డి, వెలమ నాయకులు పాలకులై, ప్రసిద్ధి పొందారు. వీరుకాక, ఇడంగై, వడంగైగా పిలవబడ్డ కుడి, ఎడమ తెగలవారున్నారు. ఈ రెండు తెగల్లోను, ఒక్కొక్క దానిలో 98 ఉప శాఖలున్నాయి. ఈ 98 ఉప శాఖల్లో 18 ప్రముఖమైనవి. విజయనగర కాలంలో, ఈ రెండు తెగల వారు తరచూ ఘర్షణ పడ్డారు.

ఆనాడు అస్పృశ్యత పాటించబడినట్లు, స్మృతులు తెలుపుతున్నాయి. 'పరాశరమాధవం'లో చండాలురను తాకినా, వారితో నివసించినా, వారితో కలిసి భోజనం చేసినా, మాట్లాడినా, నీరు తెచ్చుకున్నా, పాటించాల్సిన ప్రాయశ్చిత్తాలు రాయబడ్డాయి.

24.4.2 : హిందూ-ముస్లింల మైత్రి

పైన చెప్పిన వివిధ కులాలకు తోడుగా, ఆనాడు ముస్లిమ్‌లన్న జాతి వారు కలరు. వీరిలో మళ్ళీ విదేశీయ ముస్లింలు, స్వదేశీయ ముస్లింలన్న శాఖలున్నాయి. ముస్లింల్లో మళ్ళీ ఉమరా, ఉలేమా, సూఫీలు, బానిసలున్నారు. ఉమరా అనగా సమాజంలో ఒక ఉన్నత స్థానాన్ని, ఉన్నత స్థితిని,

BRAOU

పలుకుబడిని, పరిపాలనా చట్టంలో కలిగినవారు. ఉలేమాలనగా, ఇస్లాం మత సంబంధమైన విషయాల్లో పాండిత్యం కలవారు. సూఫీలనగా పూర్తిగా మతానికి, మతపరమైన ప్రచారానికి అంకితమైనవారు. వీరు నగరాలకు దూరంగా ఉంటూ, నిరాడంబరంగా, పేదరికంతో, తృప్తితో జీవిస్తూ, సమానత్వాన్ని బోధించినవారు. అతి పేద వర్గానికి చెందిన వారే బానిసలు. మధ్య యుగంలో హిందూ, ముస్లింల మధ్య వివాదానికి దారితీసిన పరిస్థితులున్నాయి.

ఆ వివాదాలను తగ్గించేందుకు ప్రయత్నాలు జరిగాయి. హిందూ-ముస్లింల మధ్య నున్న సాంస్కృతిక దూరాన్ని తగ్గించేందుకు తలెత్తిందే, 15, 16 శతాబ్దాల నాటి భక్తి ఉద్యమం. కలసిమెలసి జీవించడం వల్ల, ఒక మిశ్రమ సంస్కృతి తలెత్తింది. ఆ మిశ్రమ సంస్కృతి సంగీత, సాహిత్య, వాస్తు శిల్పాల్లో కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. హిందూ-ముస్లిం సమ్మేళనంతో కూడిన మిశ్రమ సంస్కృతి, దుస్తులు, ఆభరణాలు, గృహ పనతి, అలంకరణ, సభ్యతల్లోను, పండుగలు, వినోదాలు, విశ్వాసాల్లో కన్పిస్తాయి.

24.4.3 : స్త్రీ సామాజిక హోదా

ఆనాటి స్త్రీల పరిస్థితిని విచారిస్తే, మూడు వర్గాల స్త్రీలు కనపడతారు. ఆ మూడు వర్గాలు ఏవనగా, సామాన్య స్త్రీలు, ఉన్నత వర్గానికి చెందిన స్త్రీలు, భోగ స్త్రీలు. సాధారణ స్త్రీలు ఇంటికే పరిమితమయ్యారు. **'పరాశరమాధవం', 'మదన పారిజాతం'** విధవా వివాహాలను వ్యతిరేకించాయి. కాని, ఇస్లాం విధవా వివాహాలను ఆమోదించింది. ఇస్లాం విడాకులను ఆమోదించగా, హైందవం అంగీకరించలేదు. రాజ కుటుంబాలకు చెందిన స్త్రీలలో పండితులు, పరిపాలనాదక్షులున్నారు. అంతఃపుర స్త్రీలు ఘోషా, లేక పరదా పాటించారు కాని, సామాన్య స్త్రీలు పరదా పద్ధతిని పాటించలేదు. భోగ స్త్రీలను వేశ్యలు, దేవదాసీలు, బానిసలని, మూడు రకాలుగా విభజించొచ్చు. ఈ కాలంలో భోగ వస్తువుల్లో స్త్రీ కూడా చేర్చబడింది. ఆనాటి సమాజంలో స్త్రీల పరిస్థితి హీనంగా ఉంది. వర్ణా, బాల్య వివాహాలు, సహగమన ప్రాముఖ్యం, వేశ్యాలోలత, వితంతువుల దయనీయ స్థితి, సామాజిక నిబంధనలు, ఆనాటి స్త్రీ పరిస్థితి ఎంత తక్కువగా ఉందో, తెలియజేస్తున్నాయి.

నాటి సమాజంలో భిన్నత్వంలో ఏకత్వం ముఖ్య లక్షణం. హిందువులు, ముస్లింలు, హిందువుల్లోని వివిధ మతాల, శాఖల, కులాలవారు తమ ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంటూ, తక్కువ స్పర్ధతో, ఎక్కువ సామాజిక అవగాహనతో, పరస్పరం ఒకరి నొకరు గౌరవించుకుంటూ, సామరస్యంతో కలిసి మెలసి జీవించారు. అప్పుడప్పుడు మతాల, కులాల, శాఖల మధ్య సంఘర్షణలు జరిగినా, సామాజిక అశాంతికి, సామాజిక అస్థిరతకు దారితీయలేదు. ధనిక, పేద వర్గాల మధ్య అంతరం, సామాజిక సుస్థిరతకు భంగం వాటిల్ల చేయలేదు. ఆనాటి పాలకులు ఎంతో నేర్పుతో, సమాజం లోని వివిధ వర్గాలను కలిపుంచగలిగారు.

24.4.4 : ఆచారాలు, సంప్రదాయాలు

మధ్య యుగం లోని ఆచారాలు, సంప్రదాయాల్లో విశేషమైన మార్పులు లేవు. బాల్య వివాహాలు, సతీసహగమనం, విధవలకు వివాహాలు చేయకపోవడం వంటి నమ్మకాలున్నాయి. శకునాల మీద, జ్యోతిష్యం మీద, నమ్మకాలున్నాయి. హిందూ, ముహమ్మదీయులు ఒకరి ఆచారాలను మరొకరు పాటించారు. పాశ్చాత్య ప్రభావం ఆచారాల, సంప్రదాయాలపై ఎక్కువ కనిపించదు.

BRAOU

24.5 : సంగ్రహంగా

మధ్య యుగ భారతదేశం లోను, దక్షిణ భారతదేశం లోను, 16వ శతాబ్దానికి ఎంతో ప్రాముఖ్యముంది. ఈ 16వ శతాబ్దం లోనే సమరాంగణ సార్వభౌముడిగా, ఆంధ్ర భోజుడిగా వాసికెక్కిన తుళువ వంశస్థుడైన కృష్ణదేవరాయలు పాలించాడు. ఈ యుగం లోనే ఆంధ్ర దేశంలో కుతుబ్ షాహీల పాలన ఆరంభమైంది. ఈ యుగం లోనే మొగలాయి చక్రవర్తి అక్బర్, దక్షిణ భారతదేశ రాజ్యాలపై కన్ను వేసింది. ఈ యుగం లోనే బహమనీ సామ్రాజ్యం నుండి విడిపోయిన అహ్మద్‌నగర్, బిజాపూర్, బీదర్, గోల్కొండ పాలకులు 1565లో విజయనగర సామ్రాజ్యాన్ని రాక్షసతంగడి, లేదా బన్నిహట్టి యుద్ధంలో కోలుకోకుండా నాశనం చేసింది. ఈ పై పరిణామాలను పరిశీలిస్తే, ఈ 16వ శతాబ్దంలో మొదటి మూడు దశకాల్లో రాజకీయ సుస్థిరత చోటు చేసుకున్నప్పటికీ, మిగిలిన కాలంలో రాజకీయ అనైకమత్యం చోటు చేసుకొని, విజయనగరం-గజపతి-కుతుబ్ షాహీల మధ్య, ఎడతెగని యుద్ధాలు జరిగి, పరస్పరం బలహీనమై, క్షీణించి, విదేశీయ వర్తకవ్యాపారస్థులకు సుగమమైన మార్గాన్ని వేసిన కాలమిది. రాజకీయ ఐకమత్యం లోపించినా, ఆర్థిక సుసంపన్నత కలిగిన కాలమిది. సామాజికంగా సుస్థిరత కలిగిన కాలమిది. అయినప్పటికి, ఆంధ్ర దేశ సమాజం తాబేలు లాగా ముడుచుకుపోయి, దేశం పరాధీనం కావడానికి నాంది జరిగిన కాలమిది. అంతేకాక, స్వయంసంపూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమై, ఐరోపీయ పారిశ్రామిక విస్తరణ ఫలితంగా, వెట్టుబడిదారీ వ్యవస్థ ఆరంభానికి నాంది పల్కిన కాలమిది.

BRAOU

24.6 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. 16వ శతాబ్ది నాటి ఆంధ్రదేశ రాజకీయ పరిస్థితులను సమీక్షించండి.
2. 16వ శతాబ్ది నాటి ఆంధ్రదేశ ఆర్థిక పరిస్థితులను వివరించండి.
3. 16వ శతాబ్ది నాటి ఆంధ్రదేశ సాంఘిక పరిస్థితులను విశ్లేషించండి.
4. "16వ శతాబ్దంలో ఆంధ్ర దేశం పరాధీనం కావటానికి నాంది పల్కబడింది" చర్చించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. 16వ శతాబ్ది ఆంధ్రలో నెలకొన్న రాజకీయ అనైక్యతా స్వభావమెట్టిది?
2. 16వ శతాబ్ది ఆంధ్రలో వ్యవసాయం, పరిశ్రమల స్థితిని పరిశీలించండి.
3. 16వ శతాబ్ది ఆంధ్రలో వర్ణవ్యవస్థ, వృత్తుల సంబంధ మెలాగుంది?
4. 16వ శతాబ్ది ఆంధ్ర దేశంలో స్త్రీ సామాజిక హోదాను పరిగణించండి.

24.7 : ఉపయుక్త గ్రంథాలు

Nilakanta Sastri, KA.	:	A History of South India
Satyanarayana, K	:	A Study of History & culture of the Andhras, Vol. II.
Sherwani, H.K.	:	Qutub Shahis of Golkonda
Stein, Burton	:	Vijayanagara- the New Cambridge History of India series
Subrahmanyam, R.	:	The Suryavamsa Gajapatis of Orissa
మల్లంపల్లి సోమశేఖర శర్మ	:	తెలుగు సంస్కృతి, మూడు సంపుటాలు
బి.యస్. యల్. హనుమంతరావ్	:	ఆంధ్రుల చరిత్ర
ఆరుద్ర	:	సమగ్ర ఆంధ్ర సాహిత్యం, - రాయల యుగం, నవాబుల యుగం, గజపతుల యుగం
కె.కె. రంగనాధాచార్యులు	:	తెలుగు సాహిత్యం - మరోచూపు, ఆంధ్ర సారస్వత పరిషత్, హైద్రాబాద్
శ్రీమతి పి. రామలక్ష్మి	:	భారత సామాజిక, ఆర్థిక చరిత్ర, తెలుగు అకాడమి, హైద్రాబాద్
కె. యస్. కామేశ్వరరావ్	:	విజయనగర సామ్రాజ్యం, తెలుగు అకాడమి, హైద్రాబాద్.

BRAOU

రచయిత : కె.యస్. కామేశ్వరరావు

BRAOU

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

ద్వితీయ సంవత్సరం

పాఠ్యప్రణాళిక

గ్రూప్ 'ఎ' : కోర్స్-4 : ఆంధ్రుల చరిత్ర (క్రీ.శ. 1565 వరకు)

ఖండం - I : ఆంధ్రులు : తొలి చరిత్ర

భాగం - 1 : ఆంధ్రులు : పరిచయాంశాలు

భాగం - 2 : చరిత్ర పూర్వ, పురా చారిత్రక యుగాలు

ఖండం - II : శాతవాహన యుగం

భాగం - 3 : శాతవాహన యుగం : రాజకీయ చరిత్ర

భాగం - 4 : పరిపాలన, ఆర్థిక వ్యవస్థ

భాగం - 5 : సామాజిక, మత, సాంస్కృతిక పరిస్థితులు

ఖండం - III : శాతవాహనానంతర యుగం (క్రీ.శ. 624 వరకు)

భాగం - 6 : శాతవాహనానంతర యుగం: రాజకీయ పరిణామాలు (క్రీ.శ.624 వరకు)

భాగం - 7 : శాతవాహనానంతర యుగం (క్రీ.శ. 624 వరకు):
పరిపాలనా విధానం, సామాజిక, ఆర్థిక, మత, సాంస్కృతిక పరిస్థితులు

ఖండం - IV : ప్రాదేశిక గుర్తింపు: ఆంధ్రలో రాజకీయ
కేంద్రాల ఆవిర్భావం (క్రీ.శ. 624-1200)

భాగం - 8 : వేంగి చాళుక్యుల రాజకీయ చరిత్ర : పరిపాలన

భాగం - 9 : ఆంధ్ర దేశ రాజకీయ చరిత్రపై పూర్వ చాళుక్య,
రాష్ట్రకూటుల, పశ్చిమ చాళుక్యుల పాలనా ప్రభావం

భాగం - 10 : ఆంధ్ర దేశంలో చాళుక్య-చోళుల పాలన :
చిన్న రాజ వంశాల ఉద్భవం

BRAOU

భాగం - 11 : చాళుక్య యుగం (క్రీ.శ. 624-1200):
సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు

ఖండం - V : కాకతీయులు

భాగం - 12 : కాకతీయుల పుట్టుపూర్వోత్తరాలు, పాలనాంశాలు

భాగం - 13 : కాకతీయు రాజ్య వ్యవస్థ, సామాజిక, ఆర్థిక పరిస్థితులు

భాగం - 14 : కాకతీయుల సాంస్కృతిక సేవ: నాటి మతం, సాహిత్యం, కళలు

భాగం - 15 : రెడ్డి, నాయక రాజ్యాలు : రాజకీయ, సాంస్కృతిక కార్యకలాపాలు

ఖండం - VI : విజయనగర యుగం

భాగం - 16 : విజయనగర రాజ్యావిర్భావం : సంగమ వంశం

భాగం - 17 : సాళువ, తుళువ వంశాలు : కృష్ణదేవరాయలు

భాగం - 18 : రామరాయల రాజ్య సంరక్షకత్వం: తళ్లికోట యుద్ధం

భాగం - 19 : ఆరవీటి వంశం

భాగం - 20 : పరిపాలన, సమాజం, ఆర్థిక వ్యవస్థ

భాగం - 21 : విజయనగర యుగం : మతం, సాహిత్యం, కళలు

భాగం - 22 : విదేశీయుల రచనలు

భాగం - 23 : ఆంధ్ర దేశంపై బహమనీల, కుతుబ్‌షాహీల ఆధిపత్యం :
సాంస్కృతిక పరిస్థితులు

భాగం - 24 : 16వ శతాబ్దం : ఆంధ్ర దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు

BRAOU

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

ద్వితీయ సంవత్సరం

మాదిరి పరీక్షా పత్రం

గ్రూప్ 'ఎ' : కోర్స్-4 : ఆంధ్రుల చరిత్ర (క్రీ.శ. 1565 వరకు)

సమయం : 3 గంటలు మార్కులు 100

భాగం - ఎ

4 x 15= 60

I. క్రింది ప్రశ్నల్లో ఏ వాల్గింటికైనా వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. పురా చారిత్రక యుగమంటే ఏమిటి? దాని భాగాల లక్షణాలను పరిశీలించండి.
2. శాతవాహన యుగంలో ప్రజల ఆర్థిక స్థితిగతులను విశ్లేషించండి.
3. దక్షిణ దేశ రాజకీయాల్లో వేంగీ చాళుక్యులు నిర్వహించిన పాత్రను సమీక్షించండి.
4. చాళుక్య యుగం (క్రీ.శ. 624-1200) నాటి సామాజిక పరిస్థితులను పరిశీలించండి.
5. కాకతీయుల నాటి పాలనా విధానాన్ని వివరించండి.
6. విజయనగర చరిత్రలో కృష్ణదేవరాయల కాలానికి గల విశిష్టతా ప్రాధాన్యత లెట్టివి?
7. విజయనగర యుగం నాటి సాంస్కృతిక పరిస్థితులను సమీక్షించండి.
8. ఆంధ్ర దేశంపై కుతుబ్‌షాహీల ఆధిపత్యం, వారి సామాజిక, ఆర్థిక సేవలను వివరించండి.

భాగం - బి

5 x 8 = 40

II. క్రింది ప్రశ్నల్లో ఏ ఐదింటికైనా లఘు వ్యాఖ్యలను రాయండి.

9. 'ఆంధ్ర', 'తెలుగు' పదాల ఉత్పత్తిని సమీక్షించండి.
10. నాసిక్ ప్రశస్తి శాసన చారిత్రక ప్రాధాన్యతను విశ్లేషించండి.
11. అమరావతి మహా చైత్యం శాతవాహనుల కాలంలో ఎలా మెరుగులు దిద్దుకుంది?
12. ఆభీర వసుషేణుడు ఇక్ష్వాకుల నాటి రాజకీయ చరిత్రలో నిర్వహించిన పాత్ర ఎట్టిది?

BRAOU

BRAOU

డా. బి. ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

ద్వితీయ సంవత్సరం

గ్రూప్ 'ఎ' : కోర్స్-4 : ఆంధ్రుల చరిత్ర (క్రీ.శ. 1565 వరకు)

అభ్యాసం - 3

గమనికలు :

- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయండి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లైతే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరు వైపుల మూల్యాంకన కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

భాగం - ఎ

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. భాషా సారస్వతాలు, వాస్తు, శిల్పకళాభివృద్ధికి కాకతీయులొనరించిన సేవ ఎట్టిది?

2. 16వ శతాబ్ది నాటి ఆంధ్రదేశ రాజకీయ పరిస్థితులను సమీక్షించండి.

భాగం - బి

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

1. కాపయ నాయకుని కార్యకలాపాలను విశ్లేషించండి.

2. విజయనగర చరిత్ర-సంస్కృతిపై నికోలోకాంటి తెలిపిన విశేషాలను పేర్కొనండి.

BRAOU

BRAOU

BRAOU